శ్రీమద్భాగవతము

• తేట తెలుగు వచనంలో - బొమ్మలతో •



అక్షర వాచస్పతి డాక్టర్ దాశరథి రంగాచార్య

వేయి నిండుపున్నముల జీవనయానం

శ్రీమద్భాగవతీయము

వ్యాసం వసిష్ఠనప్తారం శక్తేఃపుత్ర మకల్మషం
పారశరాత్మజం వందేశుకతాతం తపోనిధిం

1957 జూన్‌లో సికిందరాబాద్ మునిసిపల్ కార్పొరేషన్‌లో అనువాదక ఉద్యోగంలో చేరాను.

సికిందరాబాదు బ్రిటిషు – ఆంగ్లేయుల సైనికుల శిబిరం బ్రిటిషు పాలనలో ఉండేది.

సికిందరాబాదుది తెలుగు, తమిళ సంస్కృతి. 1948 పోలీసు చర్యకు ముందు తెలుగు సభలు – నాటకాలకు, తెలుగు, ఇంగ్లీషు సినిమాలకు హైదరాబాదు వారు సికిందరాబాదుకే రావలసి వచ్చేది.

హైదరాబాదు, సికిందరాబాదు సభ్యతలు భిన్న ధృవాలు!

1940లో నా పెళ్లి సికిందరాబాదులో జరిగింది.

నాకు సికిందరాబాదు ప్రియం.

స్వామి నన్ను సికిందరాబాదు చేర్చారు.

స్వామి రచన విచిత్రం ఎంతటివారికి అర్థంకాదు.

సికిందరాబాదు అభ్యుదయంలో ముదుయార్ల పాత్ర ఎంతో ఉంది.

సికిందరాబాదు కార్పొరేషను తొలి మేయరు వాసుదేవ ముదలియార్!

ఒకనాడు వారు నన్ను పిలిపించారు. వారు అప్పటికి కడువృద్ధులు. వారు నన్ను ఎంతో ఆదరించారు.

నాది వారి మనుమని వయసు. వాసుదేవులు అన్నారు.

స్వామీ నాకు పోతన భాగవతం వినాలనే కోరిక చాలా కాలంగా ఉంది. తమకు తెలుగు సాహిత్యంతో మంచి పరిచయం ఉందని పెద్దల వలన విన్నాను.

మీ దర్శనం నా భాగ్యం!

నేటి నుంచియే మీరు భాగవతం వినిపించవలసిందని ప్రార్థన.

అట్లని చేతులు జోడించారు.

నాకు సిగ్గనిపించింది. నోట మాటరాలేదు.

వ్యాసపీఠం మీద గ్రంథం నా ముందట చేరింది.

గత్యంతరం లేదు. నాకు భాగవతం తెలియదు. ముప్పదియేండ్లవాణ్ణి!

"శ్రీకైవల్య పదంబు"తో ప్రారంభించాను.

రోజూ ఉదయం గంట, గంటన్నర చదివేవాణ్ణి.

ముదలియారుగారు కళ్ళు మూసుకుని రసాస్వాదనం చేసేవారు. మధ్య మధ్యన వారు సంశయాలు వ్యక్తపరచేవారు.

విచిత్రం నా సమాధానాలు వారికి సంతృప్తి కలిగించేవి.

అది ఎంతో కాలం సాగలేదు. ముదలియార్‌కు స్థానచలనం కలిగింది. అందుకు వారు ఎంతో దుఃఖించారు. కన్నీటి దాకా వచ్చింది.

అంతే ప్రాప్తం అని ఓదార్చాను. కాని నా ఆర్తి తీరలేదు.

నాకూ ఏదో అమూల్యం అయింది కోల్పోయినట్లుంది.

నేను భాగవతం రసాస్వాదనం ఆపలేదు.

భాగవత శిరోమణి పోతనామాత్యుడు భాగవతం రచించడం తెలుగు వారి అదృష్టం.

పబ్బా శంకరయ్య ప్రచురణకర్త మాత్రం కాదు. నాకు మిత్రుడు. వారూ నన్ను 1966 లో భాగవతం వచనంలో రచించమని అర్థించారు.

అప్పుడు స్వామి వాసుదేవ ముదలియార్ ద్వారా నాలో బీజం నాటారు అని అర్థం అయింది.

చెప్పవలసింది ఎంతో ఉంది.

శ్రీమద్భాగవతం 1968 లో వెలువడిరది. నాటి నుంచి తెలుగువారు నా రచన వచన భాగవతాన్ని ఆదరిస్తున్నారు - ఆదరిస్తారు.

శ్రీమద్భాగవత ప్రచురణకు సర్వ విధాల సహకరిస్తున్న విశాలాంధ్ర - రాజేశ్వర రావుకు స్వామి ఆయురారోగ్య సంపదలు ప్రసాదిస్తాడు.

సికిందరాబాదు,

డా॥ దాశరథి రంగాచార్య

20-8-2008.

ఉదయం : 10.30 గం.ని.

అమృత కథ

మానవుని జంతు దశనుండి ఉద్ధరించినది వేదము. కర్మము అనగా పనిచేయవల సినదని ఆజ్ఞాపించినది వేదము. దొరికిన తిని దొరకకున్న ఉపవసించిన జంతువులతో పనిచేయించినది వేదము. శ్రమచేసి కూర్చుట నేర్పినది వేదము. మానవుని శ్రామికుని చేసినది వేదము.

శ్రమవలన తృప్తిచెందని వేదము యజ్ఞము చేయవలసినదన్నది. యజ్ఞమనగా యతనము. శ్రమకన్న యతనము ఉత్కృష్టము. ఉన్నదానిని సాధించుట శ్రమ యనిన యతనమనిన కనుగొనుట. ఉన్న రాతిని బద్దలు కొట్టుట శ్రమ. రాతిని కనుగొనుట యతనము. ఉన్న ఆహార పదార్థముల సంచయనము శ్రమకాగా, వ్యవసాయమును కనుగొని పండించుట యత్నము. ఎన్నియో యజ్ఞములు చేసి నాగేటి చాలును సృష్టించి, వీటిని ప్రదర్శించిన వాడు పృథు చక్రవర్తి. గ్రామ సీమలను పట్టణ సీమలను ఏర్పరచిన వాడును అతడే.

మానవునకు కృతజ్ఞత నేర్పినది సహితము వేదమే. పొలము దున్ని విత్తులుచల్లి వ్యవప్రయత్నములు చేసినను వర్షాభావము వలన ఫలించదు. కావున పంట ఫలించుటకు వర్షాధిదేవత పర్జన్యుడు, వెలుగునిచ్చు సూర్యదేవత, గాలినిచ్చు వాయు దేవతలే ప్రధానమని గ్రహించిన వేదము ఆయా దేవతలకు కృతజ్ఞతలు తెలుప వలసినదని ఆదేశించి యాగమును సృష్టించినది. తమకు మేలు కూర్చిన వారికి ప్రత్యుపకారము చేయుట మానవ ధర్మము. కాని ఇంద్రుడు, సూర్యుడు, వాయువు మున్నగువారు ప్రత్యక్షరూపమున మానవుడు సమర్పించు దానిని గ్రహించలేనందున అగ్నిని హవ్యవాహునిచేసి ఆహుతులిచ్చినారు. అగ్ని ప్రత్యక్షదైవమై మానవులకు, దేవతలకు సంధాన కర్త అయినాడు. అతనిని కీర్తించుచు పాడిన పదములు ఋక్కులైనవి. అవి వేదముల నిండినవి.

ఈలోన పాప పుణ్యములు పుట్టినవి. రాచరికమునకు పూర్తి ప్రభుత్వ బలము లేనప్పుడు మతము ఆ కార్యము నిర్వర్తించినది. దోషము చేసిన వానిని—నేరము చేసిన వానిని—పట్టుకొనుటకు సరియైన సాధనములు లేనప్పుడు మతము రాచ రికమునకు సాయమొనర్చినది. పాపము చేసినవాడు నరకమునకు పోవునని చెప్పి అచ్చట విధించు శిక్షలను వివరించి మానవుని భయపెట్టినది. స్వర్గమునందలి ఆనందములను చూపి సత్కార్యములు చేయవలెనని ప్రోత్సహించినది.

ఇహమందునను, పరమందునను ఆనందము అనుభవించవలె ననుకున్నాడు మానవుడు-స్వార్థపరుడు. అతడు యజ్ఞయాగాది క్రతువులను అందుకు సాధనముగా ఉపయోగించినాడు. దేహముతోనే స్వర్గమునకు పోవలెననుకున్నాడు. త్రిశంకువు. అశ్వ, అజ, నర మేధాదులను సృష్టించి తన స్వార్థమునకు అమాయక ప్రాణులను బలిచేయసాగినాడు మానవుడు. నరులను ఖరీదుచేసి తన కొరకు తలలు తీసినాడు. అపత్యహరిశ్చంద్రుడు అట్టి వానిలో ఒకడు.

మహర్షులు మరల తపస్సు సాగించినారు. పిరికిలవానిని స్వర్గమునకు పంపు ఈ క్రతువులందు దోషమున్నది. నిర్నిమిత్తముగా అనేకప్రాణివధ జరుగుచున్నది. ఈ తన్నివారణమునకేమి చేయవలెను? అనంత తపశ్చర్య ఫలితముగా కాయికమైన క్రతువులు నిరర్థకమైనవనియు జ్ఞాన సముపార్జనను మించినదేదియు లేదని కనుగొని "అవిద్య ద్విషయం కర్మ" అని దానిని విడిచి జ్ఞానమును చేబట్టినారు. "నవిద్యతే వినాజ్ఞానం విచారేణాన్యసాధనః" శుష్క విచారమువలన లాభము లేదు. జ్ఞానము వినా ఏదియు లభించదు అనుచున్నాడు. "నాన్యత్ స్వర్గ పశ్వాది ఫలసాధనేభ్యః కర్మభ్యోऽస్తి, కర్మకాండకు స్వర్గ పశ్వాదుల ఫలసాధనము మించిన ప్రయోజనము లేదని గ్రహించినాడు.

జ్ఞానమన మానసిక కర్మ, కాయిక, వాచిక కర్మములకన్న మానసిక కర్మము విశిష్టము. మానసిక కర్మమునందు కాయిక వాచికములు కూడును. కాని వాచిక, కాయిక క్రియలందు మనసుతో ఎక్కువ నిమిత్తము లేదు.

ఇంద్రియములన్నింటిలో మనసునకు గల ప్రాధాన్యతను గ్రహించినారు. కావ మనసున ధ్యానించమన్నారు. ధ్యానము స్వయంకృతము కాగా క్రతువులు పరులు సహాయము చేయదగినవి ధ్యానము వలన అశాశ్వతములైన స్వర్గాదులు కాక శాశ్వతమైన మోక్షము లభించునన్నారు.

జీవితము దుఃఖభాజనము. ఇంద్రియానందమన్నది లవలేశముగా ఎటునైనా ఉన్నను అది మరీచికప్రాయము. దానిని సాధించుటకు చేయు శ్రమము లభించిన ఆనందమునకన్న ఎన్నో రెట్లుండును. ఒక జన్మమందలి దుఃఖమును ఉపశమింపలేయుటకు వేరొక జన్మమును కోరుట నిరర్థకము. జనన మరణముల నుండి విముక్తి మోక్షము.

మోక్షము ఉపాసనవలన కలుగును. ఉపాసనమునకు ముందు విద్య అవసరము. విద్యయనగా ఎరుగుట. ఇది రెండు విధములు. పరవిద్య అనగా మనమునకు పట్టిన మాలిన్యమును వదలించుటను ఎరుగుట. అపర విద్య యనగా పాపములను వదలించుట నెరుగుట. ఇట్టి విద్యలను పొంది ఉపాసన నభ్యసించవలెను.

ఉపాసించువాడు-ఉపాసించబడువాడు-ఇవి రెండు పదార్థములు. ఈ రెండింటిని గురించి ఉపనిషత్తులు బహుధా చెప్పినవి. రెండు పదార్థములు లేవు. ఉన్నది ఒకే పదార్థము అనునది ఒక వాదము. రెండు పదార్థములు కనిపించుచున్నవి కదా! అని అడుగువారికి వారి ప్రత్యుత్తరము సర్పరజ్జుభ్రాంతి. చీకటిలో త్రాటిని చూచి కెవ్వుమని కేక వేసిన వానికి దీపము తెచ్చిచూపిన అది త్రాడని తెలియును. అట్లే అజ్ఞానమున నున్నవానికి రెండుగా కనిపించు పదార్థమంతయు ఒకటియే అనునది ఒక వాదము.

అట్లుకాక ఆత్మవేరు పరమాత్మవేరు అనునది ఒక వాదము. సృష్టి వేరు. సృష్టించువాడు వేరు. స్రష్టలేని సృష్టి జరుగదు. ఆత్మ నిత్యమైనదయ్యు, అనిత్యమైన దేహమందుండి పాప పుణ్యములకు లోనగుచున్నది. పరమాత్మ పాపపుణ్యములకు, జనన మరణములకు అతీతుడు. బొమ్మ వేరు బొమ్మను చేసినవాడు వేరు. కుండ వేరు కుమ్మరి వేరు. కాబట్టి ఆత్మవేరు పరమాత్మవేరు. అనునది ద్వైత వాదము.

ఉపాసనమనగా మనసును ఒక పదార్థముపై కేంద్రీకరించుట. నిరంతరాభ్యాసము వలన ఉపాసకుడు బ్రహ్మ పదార్థమును ఉపాసించ గలుగును. ఉపాసనమునందు మూడు అవస్థలుండును ఒకటి జాగ్రదావస్థ. ఈ అవస్థలో మనసు ధ్యానమందున్నను బాహ్యవస్తు పరిజ్ఞానముండును. అట్లనిన ధ్యానమునందుండి కూడ బయటి పరిణామములను గ్రహించుచుండును. ఇది ప్రథమావస్థ. రెండవది నిద్రావస్థ. ఈ దశయందు నిద్రలోని కలవలె బాహ్యపరిణామములు లీలగా కనిపించుచుండును. మూడవది సుప్తావస్థ. ఇది పూర్తి నిద్రావస్థ. బాహ్యపరిణామము లేమాత్రము గ్రహించడు. కాని నిద్రనుండి వ్యక్తిని మేల్కొల్పినట్లు అతనిని మేల్కొల్పవచ్చును. నాల్గవది తురీయావస్థ. ఈ అవస్థలో అతడు ఈ లోకమునకు అతీతుడగును. అతనికి ధ్యేయ వస్తువు వినా మరేదియు కనిపించదు; ఏదియు అతనిపై ప్రభావము చేయలేదు. అది ఉపాసనకు పరాకాష్ఠ.

ఉపాసన మనిన తెలుసుకున్నాము. ఉపాస్యమేమి కావలెను. ఉపాస్యము బ్రహ్మము. బ్రహ్మము రెండువిధములు. ఒకటి నిర్గుణ బ్రహ్మము. నిర్గుణ బ్రహ్మమునకు రూపములేదు. అతడు ఆకాశము వంటివాడు. రెండవది సగుణ బ్రహ్మము. ఇది సాకారబ్రహ్మము. ఈ బ్రహ్మమునకు రూపముండును. ఆ రూపమెట్టిదో భాగవతమున అనేక చోట్ల పేర్కొనబడినది.

ఉపాసనమునందానందమున్నది. ఆనందమే బ్రహ్మము. అసలు ఆనందమన నేమి ? ఆనందమునకు ఒక నిర్దిష్ట నిర్వచనములేదు. ఏలనగా అది పంచభూతముల వలె ఒక నిర్దిష్టపదార్థము కాదు. ఆనందము మనసైక వేద్యము. ఏకాగ్రతకు రెండవపేరు ఆనందమనవచ్చునేమో ! సంగీత సాహిత్యములు ఆనందమునకు సోపానముల వంటివి. కమ్మని సంగీతము విన్నప్పుడో, మంచి నాట్యము తిలకించినప్పుడో, ఉత్తమకావ్యమును పఠించినప్పుడో మనస్సు ఇతర పదార్థముల నుండి మరలి ఆ కావ్యమునందో, ఆ సంగీతమునందో, ఆ చిత్రమునందో, ఆ నాట్యమునందో లీనమైపోవును. అట్లు లీనమైనపుడు మనము ఆనందమును అనుభవింతుము. అట్లనగా దుఃఖభాజనమైన ఈ జీవితమునుండి మరలి ఒకానొక సుందర పదార్థమున మనసు కేంద్రీకృతమైనదని అర్థము. ఆ కేంద్రీకరణము క్షణికము మాత్రమే. అట్టి ఆనందమును శాశ్వతముగా పొందుట ఉపాసన యొక్క లక్ష్యము. ఆనందమే బ్రహ్మము.

కర్మకాండమునందు యజ్ఞయాగాదులు చేయగల ఏ కొలది మందికో అశాశ్వతమైన రంభా, మేనకాదుల పొత్తు లభించగా; జ్ఞానము ద్వారమున సాధించతలంపెన ఉపాసనమునందు మోక్షమును ఏ కొలదిమంది జ్ఞానులకే లభించ సాధ్యమని, సాధారణ మానవుని ఉద్ధరించు టెట్లాయని. మరొక మహాయత్నము సాగినది. ఈ యత్నమున విజయము సాధించినవాడు బుద్ధభగవానుడు.

మానవుని ఉద్ధరించుటకు గాను గౌతమబుద్ధుడు రాజ్యమును, భార్యను, పుత్రుని వదలి అడవులకు వెళ్ళినాడు. గిరి వ్రజము వద్దనున్న పాండవ పర్వతముపై తపశ్చర్య సాగించుచున్న వారి వద్దకు వెళ్ళినాడు. వారిలో కొందరు కళ్ళుచీల్చుకొని, కొందరు తొడలు నరుకుకొని, కొందరు వ్రేళ్ళు చీల్చుకొని, కొందరు ఒంటికాలిపై నిలిచి సూర్యుని చూచుచు తపస్సు చేయుచుండిరి. గౌతముడు వారిని సమీపించి 'స్వామీ ! మీరిట్లేల మీ శరీరములను హింసించుకొనుచున్నారు?' అని అడిగెను. అందులకు ప్రత్యుత్తరముగా "ఈ శరీరము దుఃఖములకు పుట్టి

నిల్లు. దీనిని ఎంతబాధల పాలుచేసిన అంతమేలు" అన్నారు. గౌతమునకు సంతృప్తి కలుగలేదు. "ప్రకృతి యందలి పశుపక్ష్యాదులు కలకాలమని హాయిగ జీవించుచుండ మానిసులేల హింసించుకొనవలెను?" అని అడిగినాడు. సమాధానము చెప్పలేనివానికి కోపము వచ్చుటయు, తిట్టుటయు సహజము. వారలే పని చేసినారు. బుద్ధుడు గయకు వెళ్లి కలకాలము తపస్సుచేసి 'సుజాత' వలన 'తృష్ణ' దుఃఖములన్నింటికి కారణమని తెలుసుకున్నారు. ప్రేమలోన ఆనందమున్నదనియు గ్రహించినాడు. తృష్ణను జయించి సర్వప్రాణులను ప్రేమించగలవాడు దుఃఖములనుండి విముక్తుడగునని బోధించినాడు. ఆచరించిచూపినాడు. అతడు బుద్ధుడైనాడు. భగవానుడైనాడు. భాగవతమునందు బుద్ధుని అవతారములలో చేర్చినారు. (పుట 79) కాని బుద్ధభగవానుని చరిత్ర యొక్కడను చెప్ప బడలేదు.

బుద్ధ భగవానుడు కనుగొన్న సూత్రములను కొంత వివరముగా పరిశీలింతము. తృష్ణ, ఆశ అన్ని దుఃఖములకు కారణము. (పురంజనుని గాథ పుట 196) ఆశను జయించినవాడు సర్వలోకములను జయించినవాడు అగును. ఉన్నదానితో తృప్తిచెందినవాడు లేనిదానికై వగవవలసిలేదు. అట్లు అతడు దుఃఖములను జయించును. ప్రేమవలన ఆనందము లభించును. ప్రేమ మానసికమైనది. అది త్యాగమును కోరును. త్యాగమునందానందమున్నది. ఆకలిగొన్న ఒక భిక్షుకుడు ద్వారమువద్ద నిలుచున్న అతని ఆకలికి నీ హృదయము స్పందించవలెను. అట్లనగా నీవతనిని ప్రేమించుచున్నావు. నీవు తినుచున్న విస్తరిని అతని ముందుంచుము. అది త్యాగము. అతడు తినునప్పుడు, అతడు తిని త్రేన్చినప్పుడు నీవనుభవించినది ఆనందము. కడకు నీరు మాత్రము మిగిలినది రంతిదేవునకు. అదియు దాహమున ప్రాణములు పోవుచున్న నీచజాతివానికి అర్పించి "భగవంతుడా! నాకు సకలైశ్వర్యములు అక్కరలేదు. మోక్షమును కూడా అర్థించను నేను కోరునది ఒక్కటే కోరిక. జీవులందరి హృదయములందు నేను నిండిపోవలెను. వారి దుఃఖమంతయు నేను భరించవలెను. దీనులైన జీవులు నీరు త్రాగియైనను జీవించవలెనని తపించుచున్నారు. కొన్ని నీళ్లతో వీరు బ్రతికి పోవుదురు. నేను వారికి ఇంతమాత్రము ఇవ్వగలిగినచో నా ఆకలి దప్పులు, శ్రమ అన్నియు వదలిపోవును. నేను సుఖముగా ఉందును" అని ఆనందమును అనుభవించినాడు.

దీనిలో ఆనందమున్నది. ఆకలితో తపించు పసి పాపలకు పాలుపోయుటలో, అన్నము లేక అలమటించు పేదలకు అన్నము పెట్టుటలో, దుఃఖతప్తులైన

వారిని ఓదార్చి ఒక సాంత్వన వాక్యము పలుకుటలో ఎంతో ఆనందమున్నది. ఈ ఆనందము ద్వారా దుఃఖపూరితమైన జీవితమును సుఖవంతము చేసికొనవలసిన దని బుద్ధభగవానుడు బోధించినాడు. అతడు మహాత్ముడు. ప్రేమవేదమును ప్రవచించినాడు. ప్రేమైక జీవిగా జీవించినాడు. ప్రేమమునందే లీనమైనాడు.

కుటుంబమును ప్రేమించుట, గ్రామమును ప్రేమించుట, దేశమును ప్రేమించుట, విశ్వమును ప్రేమించుట ఇవి ఒకదాని కన్న నొకటి శ్రేష్ఠములు. భగవంతుని ప్రేమించుట భక్తి. ఇది సర్వోత్తమమైనది. ఈ భక్తిని ప్రతిపాదించునదే భాగవతము.

వ్యాసుడు పద్దెనిమిది పర్వముల మహాభారత ఇతిహాసమును రచించినాడు. పద్దెనిమిది అక్షౌహిణుల సైన్యము హతులై, కురుక్షేత్రమున రక్తపునదులు ప్రవహించి, పీనుగుల పెంటలు పెరిగి, ద్వేషానల జ్వాలలు రగిలి, ప్రతీకారాగ్నులు ప్రజ్వరిల్లి, స్త్రీల రోదన ధ్వనులతో పిక్కటిల్లి మహాభారతము ముగిసినది. ఇంత హింస, ఇంత రక్కసితనము, ఇంత ద్వేషము, ఇంత రక్తప్రవాహము, ఇంత నరబలి సాధించినదేమి? కురుక్షేత్రమున నెత్తుటి సంద్రము వెలయించి సాధించిన రాజ్యమున మిగిలినదేమి? యుధిష్ఠురునికి మిగిలిన ఆనందమేమి? ప్రజలకు మిగిలిన సంపద ఏమి? తుదకు యదుకులము అంతమైనది. పాండవులు స్వర్గారోహణము చేసినారు. పరీక్షిత్తు పాముకాటుకు బలియైనాడు. దీనికి కారణమేమి? అను ఆవేదన, ఆతురత, బాధ, దుఃఖము ఆతనిని వ్యధితుని చేసినవి. ద్వేషము హింసకును కారణము. భక్తి శాంతికి సంపదకు చిహ్నమని గ్రహించినాడు.

> "ఫలాపేక్షతో కూడిన కర్మ నిందింపదగినది. అయినను
> ప్రజలు దానికై పనికే మొగ్గుదురు. నీవు మహాభారతము
> రచించి అట్టి కామ్యకర్మనే ఉపదేశించినావు. కామ
> లోభములతో బాధపడిన హృదయము హరిసేవ వలననే
> తప్ప యమనియమాది యోగసాధనవలన శాంతి పొందదు."

అని నారదుడు ఉపదేశించగా భాగవతమును రచించి భక్తి భావమును బోధించినాడు.

ఒక గొప్ప హింసాకాండ తరువాత ఒక శాంతి, స్నేహ సందేశము వెలువడు చుండును. ప్రథమ ప్రపంచ సంగ్రామము ముగిసిన వెనుక ఏర్పడిన నానాజాతి

సమితి, ద్వితీయ ప్రపంచ సంగ్రామానంతరము ఏర్పడిన ఐక్యరాజ్య సమితియు నిట్టివే.

అనంత హింసాకాండ తరువాత ఉద్భవించిన శాంతి, భక్తిసందేశము భాగవతము. ఈ సంహితమును వ్యాస భగవానుడు ఒకేసారి రచించి యుండి యుండలేదనియు. ఆతడప్పుడప్పుడు ప్రవచించుచుపోయిన కథలు, గాథలను కూర్చి శ్రీశుకుడు భాగవతమును రచించి యుండవలెననియు నా అభిప్రాయము.

భాగవతము భక్తి ప్రాతిపదికమైన మహా పురాణమైనను ఇది యొక చరిత్రగను, పలురంగములందలి ప్రగతిని సూచించు చారిత్రిక గ్రంథము కూడా అగును. ఇందు సృష్టి క్రమములు, అందలి వాదములు కపిలుడు ప్రవచించిన సాంఖ్యము ఒకదానిపై వేరొకదాని ప్రగతిని సూచించును. పాశ్చాత్యుల ప్రగతివాదమునకు అనుగుణముగా నున్నవి మన అవతారములు. ముందు జలచరములు, తదుపరి జలస్థలచరములు, అనంతరము వన చరములు, తరువాత మానవుడు. ఇది వారి క్రమము. మన అవతారము లందు మత్స్యము జలచరము, కూర్మము జలస్థలచరము, వరాహ నారసింహములు వనచరములు, వామనుడు మానవుడు ఇత్యాదులు. ఇది కాక వారి వాదమును మించిన క్రమవిధానము పుట 189 లో పేర్కొనబడినది.

చరిత్రగా రాజులు, వారి వంశములు, వారి క్రమము, సృష్ట్యాదినుండి సూచించు కథలు గాథలు గలవు. స్వాయంభువ మనువు నుండి కలియుగము వరకు ఒక క్రమమును సూచించి యున్నారు.

వేదాంతము నందలి ప్రగతిని సూచించు గాథలున్నవి. యజ్ఞయాగాది క్రతువులు చేసిన భగీరథాదులు, జ్ఞాన మార్గము నవలంబించిన కపిలాదులు, అవధూతలైన ఋషభ, జడభరతాదులు, భక్తిని అవలంబించిన ప్రహ్లాద, ధ్రువాదులు, శరణాగతిని అవలంబించిన గజేంద్రాదుల కథలు వీనిని నిరూపించుచున్నవి.

రాజకీయము నందలి ప్రగతిని సూచించు గాథలందు పృథు చక్రవర్తి, అగ్నిధ్రుడు మున్నగు కథలున్నవి. అయినను భాగవతము భక్తి ప్రతిపాదకము.

భక్తి ఆత్మ, పరమాత్మతో కల్పించుకున్న సంబంధము. ఇది ఎంత గాఢమైన, భక్తి అంత దృఢమగును. ఇది మానసికమైనది. భగవంతునితో తనకు ఒక బాంధవ్యమును ఏర్పరచుకొని సుఖ దుఃఖములను, హాసరోదనములను అనుక

వించుట భక్తికి పరాకాష్ఠ. రాధ కృష్ణుని ప్రేమించినది. ప్రియునిగా చేసికొన్నది. అతడు లేనప్పుడు విరహబాధ అనుభవించినది. అతడు కనిపించిన ఆనంద బాష్పములు రాల్చినది. హృదయము పులకరించినది. లోకమును మరచినది. మైమరచినది. అనంత ఆనంద సాగరమున మున్కలు వేసినది. ఈ సంబంధమునకు కాయిక బాంధవ్యము కల్పించి కొల్లలుగా కావ్యములు రచించి ధన్యులైనారు కవులు.

ఒక తల్లి కృష్ణుని తన కన్న కొడుకును చేసికొన్నది. కృష్ణ విగ్రహము ముందు కూర్చుని "రావేమయ్యా కన్నయ్యా, పాలు చేపుచున్నవి" అని పల్కెడిది. ఆమె చన్నులు చేపెడివి. పాలు ధారలుగా ప్రవహించునవి. ఆమె కృష్ణుడు పాలు కుడుచుచున్నట్లు భావించి తాదాత్మ్యము పొందెడిది.

కులశేఖరుడు రామాయణ గాథ వినుచుండెను. పురాణము చెప్పు అయ్యవారు రామునిపైకి పదునాల్గువేల రాక్షసులు ఎత్తి వచ్చినారని చెప్పినాడు. కులశేఖరునకు రాముడన్న ప్రాణము. అతని పైకి వచ్చుచున్న ఆపదను విని సహించలేక పోయినాడు. రామునకు సహాయపడుటకు సైన్యమును సమాయత్తపరచవలసినదని ఆజ్ఞాపించినాడు. తాను ధనుర్బాణములు ధరించి బయలు దేరినాడు. మనసా తాదాత్మ్యత చెందినవానికి యుగములతో నేమి నిమిత్తము ?

అతడే భక్తిని గురించి చెప్పినాడు :—

బద్ధేనాంజలినా నతేన శిరసా గాత్రైస్సరోమోద్గమైః
కంఠేన స్వర గద్గదేన నయనే నోద్గీర్ణ బాష్పాంబునా
నిత్యం త్వచ్చరణారవింద యుగళ ధ్యానామృతాస్వాదినా
మస్మాకం సరసీరుహాక్ష సతతం సంపద్యతాం జీవితమ్.

చేతులు జోడించవలె. తలను వంచవలె. ఒడలు పులకరించవలె. స్వరము గద్గదము కావలె. ఆనంద బాష్పములు పొంగి పొరలవలె. ఓ సరసీరుహాక్షా ! అట్లయి నీ చరణములను ధ్యానించవలె. అది అమృతము. దానిని ఆస్వాదించవలె. అట్లు ఆస్వాదించుచునే అస్మదాదుల జీవితము సాగిపోవునట్లు అనుగ్రహించుము.

అది భక్తి. అందాతడు తన్మయుడైనాడు. అట్టి భక్తులు భాగవత పురాణము నందే కాక అనేక మంది ఉన్నారు. తెలుగు దేశమున వెలసిన రామదాసు, త్యాగరాజు, అన్నమయ్య మున్నగువారు ఆ కోవకు చెందినవారే.

రామానుజుడు ఒక ప్రేమికుని గొప్ప భక్తునిగా మార్చిన గాథ పేర్కొన దగినది.

రామానుజయతి శ్రీరంగమున నున్నాడు. ఒకనాడు శిష్యసమేతుడై స్నానముచేసి కావేరి నుండి వచ్చుచున్నాడు. అతనికి ఒక వింత దృశ్యము కాన్పించినది. ధనుర్దాసు అనువాడొకడు తన ప్రియురాలికి ఒక చేత గొడుగు పట్టి వేరొక చేత విసన కఱ్ఱతో విసరుచు వీధిన పోవుచున్నాడు. రామానుజున కది వింతగా తోచినది. ధనుర్దాసులోనున్న ప్రేమ ప్రవాహమును భగవానుని వైపునకు మరలించ దలచినాడు. ధనుర్దాసు కడకేగినాడు. "నాయనా! ఏమిట్లు ఆడదానికి దాసుడవైనావు?" అని అడిగినాడు. "స్వామీ! నా ప్రియురాలి నేత్రములు విశాలములు. వానిని చూడక నేను జీవించలేను. నిత్యము వానిలో కరిగిపోవుటే నా జీవిత లక్ష్యము. ఎండకు ఆ కన్నులు వాడిపోవునో! ఉక్కకు కన్నులు ఉడికిపోవునో అని ఛత్రచామరములు ధరించి ఆమె వెంట నడుచుచున్నాను" అని ప్రత్యుత్తర మిచ్చినాడు ధనుర్దాసు. "నాయనా! నీ ప్రియురాలి కన్నుల కన్న అతిలోక సుందరములైన కనులున్న ప్రేమింతువా?" అని అడిగి అతనికి శ్రీరంగనాథుని నేత్ర రామణీయకతను చూపి ధనుర్దాస దంపతులను మహా భక్తులనుగా మార్చినాడు మహానుభావుడు.

భక్తి మానసికము. మనసును వర్ణింప లేనట్లు భక్తిని వర్ణించుట సహితము అసాధ్యము. భక్తి కలుగుటకు ఉపకరించు అంగములందు భక్తులగాథలు, వాని అధ్యయనము ముఖ్యమైనది. అది భక్తికి ప్రథమ సోపానము కాగా భజనాదికములు అన్యసోపానములు.

భక్తుల, భాగవతుల గాథలలో మొట్ట మొదటిది, అతి పవిత్రమైనది శ్రీమద్భాగవతము. దానిని సంస్కృతమున వ్యాస భగవానుడు రచించగా పరమ భక్తాగ్రణి యైన పోతనామాత్యుడు తెలుగు భాగవతమును మనకు ప్రసాదించినాడు. అతడా కావ్యమును రామునకు అంకిత మిచ్చుటకుగాను పడినపాట్లు ప్రతి తెలుగువాడు ఎరిగినదే.

భాగవతమనిన ప్రీతి లేని తెలుగువాడు లేడు. అందలి పద్యములు రానివాడును లేడు. అట్టి భాగవతమును సరళమైన వచనమున సంగ్రహముగ రచించవలసినదని మిత్రులు పళ్ళా శంకరయ్యగారు నన్ను కోరినారు. రచన సాగించినాను. ముగించినాను. పుస్తకము మీ చేతనున్నది. తీర్పు ఇవ్వవలసినది కాము.

కథ సంస్కృత భాగవతము ననుసరించినాను. రమ్యమైన ఘట్టములందు 'తెలుగు భాగవతమును అనుసరించినాను. అచ్చటచ్చట శ్లోకము పద్యములు ఇచ్చినాను. భాష సాధ్యమైనంత సరళముగా వాడుటకు ప్రయత్నించినాను. ప్రయత్నము నాది. సిద్ధి నా చేతిలోనిది కాదు. "యత్నే కృతే యది న సిధ్యతి కోऽత్ర దోషః."

వెల్గా శంకరయ్యగారు నేను వ్రాసిన శ్రీమద్రామాయణమును 1968 లో ప్రచురించి నన్ను ప్రోత్సహించినారు. ఆ రామాయణమును తెలుగువారు ఆదరించినారు. కనుక నే శ్రేష్ఠిగారు మలి ముద్రణ యత్నమున నున్నారు.

నేను వ్రాసిన రామాయణమును ప్రచురించిన వెల్గా శంకరయ్యగారు నాతో శ్రీమద్భాగవతమును వ్రాయించి ప్రచురించినారు. ఇందు మిత్రులు శ్రీమాన్ బెల్లంకొండ నరసింహాచార్యులవారి ప్రమేయమెంతో ఉన్నది. వారి కుపురకు నా కృతజ్ఞతలు.

శ్రీ వేంకటాద్రిగారు చిత్రరచన చేసినారు. పుస్తకమునకు ఎక్కువ అందమును చేకూర్చినారు. వారికి కృతజ్ఞతలు

ఈ శ్రీమద్భాగవతమును భక్తి పురస్సరముగా యాదగిరి శ్రీ లక్ష్మీనృసింహ స్వామికి అంకితము సమర్పించుచున్నాను.

లోకాస్సమస్తా స్సుఖినో భవంతు.

10-1-088. మారేడుపల్లి, }
సికింద్రాబాదు-26. }

దాశరథి రంగాచార్య.


విషయసూచిక

పటముల పట్టిక



శ్రీమద్భాగవతము

• తేట తెలుగు వచనంలో •



శుక్లాంబరధర విష్ణుం
శశివర్ణం చతుర్భుజం
ప్రసన్న వదనం ధ్యాయే
త్సర్వవిఘ్నోపశాంతయే.

ఆధౌ దేవకిదేవి గర్భజననం
గోపీ గృహేవర్ధనం ।
మాయాపూతన జీవితాప హరణం
గోవర్ధ నోద్ధారణం ।
కంస క్షదన కౌరవాది హననం
కుంతీసుతః పాలనం ।
ఏతద్భాగవతం పురాణ ఖచితం
శ్రీకృష్ణ లీలామృతం ।

శ్రీ భాగవత సారమ్

శ్రీమద్భాగవతము

ప్రథమ స్కంధము

శ్రీ వ్యాసుడు.

శ్రీమన్నారాయణుడు యోగనిద్రలో ఉన్నప్పుడు జగములన్నియు జలమయములై ఉండెను. శ్రీహరి సృష్టి ప్రారంభించ దలచెను. తలచినంతనే అతని నాభినుండి ఒక కమలము ఉత్పన్నమయ్యెను. ఆకమలమునుండి చతుర్ముఖు డావిర్భవించెను. అప్పుడా ప్రభువు తనమానసము నుండి ఒక పురుషుని పుట్టించెను. అతనికి అపాంతరతముడని నామకరణముచేసి శ్రుతులను చక్కగ వ్యాస మొనరింప వలసినదని ఆజ్ఞాపించెను, శ్రీ విష్ణువు ఆనతిమేరకు అపాంతరతముడు వేదభేదన మొనర్పగా శ్రీమన్నారాయణు డానందించి అతనికి వేదవ్యాసుడని బిరుదము నిచ్చెను. అంతేకాక "నీవు అన్ని మన్వంతరములందును ఇన్నించి వేదవ్యాసమును కావించ మొనరించు చుండుము. నాచరితములెరిగి త్రైలోక్య చరణములు, అఖిల ధర్మములు గ్రహించి, మునీశ్వరులలో మేటివై ప్రకాశించగలవు. ఉత్తర కాలమున పరాశరునకు పుత్రుడవై ధర్మసందేహముల నెల్లబాపి లోకహిత వాదివై మన్ననొందగుదువు" అనెను. అప్పటినుండి వేదవ్యాసుడు చిరకాలము తపమాచరించి శ్రీవిష్ణువు కారుణ్యమును సాధించెను.

ఒకానొకప్పుడు పరాశరుడు తీర్థ యాత్రలకు బయలుదేరెను. అతడు తీర్థ యాత్రలు చేయుచు యమునా నదికి వచ్చెను. అచట దాశరాజు కూతురు మత్స్యగంధియను చిన్నది నావ నడిపించుచు జనులను యమునానది దాటించు చుండెను. పరాశరుడు ఆ ఓడపై ఎక్కగా ఆ చిన్నది పడవ నడిపించెను పడవ నదిలో సగము దూరము పోవువరకు పరాశరునకు ఆ చిన్నదానిపై మనసాయెను. ఆ విషయ మాచిన్నదానికి తెలియపర్చగా మత్స్యగంధి తన కన్యాత్వము విఫలమగునని వాపోయెను. పరాశరుడు ఆమె కన్యాత్వము విఫలము కాకుండునట్లు వరమిచ్చెను. అంత నాచిన్నది తాను చేప నుండి పుట్టినందున వంటినిండ చేపవాసన గలదనియు, పరాశరునివంటి యోగికి

తాను అర్ఘ్యార అను తాపసినియు అనెను. అంత ఆ మహర్షి మత్స్యగంధికి యోజన గంధిత్వము ప్రసాదించెను. నాటి నుండి ఆమె యోజనగంధి అయ్యెను. పరాశరుని ఆజ్ఞ మేరకు యోజనగంధి తన నావను కృష్ణ ద్వీపమునకు చేర్చెను. అప్పుడా యువతి ఇది మిట్ట మధ్యాహ్నమనియు వెలుగు ఉన్నందున తనకు సిగ్గగు చున్నదనియు అనెను. అంత పరాశరుడు మంచు తెరతో చీకటి కల్పించి ఆ ద్వీపమున యోజనగంధితో రమించెను. అంత యోజనగంధియను మారు పేరుగల సత్యవతికి సద్యోగర్భమై పరమతేజస్వి, సుజ్ఞానియైన వ్యాసుడు జన్మించెను. పరాశరుడు సత్యవతిని, కుమారుని ఆశీర్వదించి యథేచ్ఛ వెడలెను. సత్యవతి కుమారుడు జటాకమండలములు ధరించి, "అమ్మా! నీకు పనికలిగిన నన్ను తలచుము, అదే క్షణమున రాగలను." అనిచెప్పి లోకహితము కొరకు గాను తపోవనములకు పోయి, ఘోరమైన తపమాచరించెను.

అట్లు కొంత కాలముగడచెను. శంతనుడు సత్యవతిని పెండ్లియాడి. ఆమెవలన చిత్రాంగద, విచిత్ర వీర్యులను పుత్రుల బడసి మరణించెను. చిత్రాంగదుడు యుద్ధమున మరణించగా మిగిలిన విచిత్ర వీర్యునకు పట్టముకట్టి, భీష్ముడు కాశీరాజు కుమార్తెలైన అంబిక, అంబాలికలను అతనికి భార్యలుగా చేసెను. విచిత్రవీర్యుడు సంతాన హీనుడై మరణించెను. కురువంశము అంతరించు చున్నదని గ్రహించిన సత్యవతి, తన పుత్రుడైన వ్యాసుని తలచుకొనెను. వ్యాసుడు ప్రత్యక్షముకాగా నియోగ ప్రకారమున తన కోడండ్రకు సంతానము ప్రసాదించ వలసినదని ప్రార్థించెను. ఆమె ఆజ్ఞననుసరించి అంబికకు ఒక పుత్రుని, అంబాలికకు ఒక పుత్రుని ప్రసాదించెను. అంబికకు జన్మించినవాడు ధృతరాష్ట్రుడు. సంగమ సమయమున వ్యాసుని ఆకారమునుచూచి అంబిక కనులు మూసు కున్నందున ధృతరాష్ట్రుడు గ్రుడ్డివాడై పుట్టెను. అంబాలిక వ్యాసుని చూచి పాలిపోయినందున పాండురాజు పాండురోగమున జనించెను. సత్యవతి మరల అంబికను వ్యాసునకు నియోగించెను. అంబిక అతని వేషమునకు బెదరి ఒక దాసిని పంపెను. ఆ దాసివలన జన్మించిన వాడు విదురుడు.

అట్లు కురువంశమును నిలిపిన కృష్ణద్వైపాయనుడు పంచమ వేదమనునట్టి శ్రీ మహాభారతమును రచించెను. వేదములు, ఉపనిషత్తులు మున్నగువాని సారమును భరత వంశీయుల కథలో ఇమిడ్చి లోకమునకు మహోపకారం మొనరించెను. అప్పటికి చిక్కుగను ఒకేచోటను ఉన్న వేదములను విభజించి ఋగ్యజుస్సామాథర్వణ వేదములుగాచేసి వేదవ్యాసుడయ్యెను. అంతతో సంతృప్తిచెందక,

వేదములను తనశిష్యులచే అధ్యయనము చేయించి ప్రచారముచేయించెను. పైలుడు ఋగ్వేదమును, వైశంపాయనుడు యజుర్వేదమును, జైమిని సామ వేదమును, సుమంతుడు అధర్వణ వేదమును ప్రచారము చేయవలసినదిగా నియోగించెను. వారు తాము స్వయముగను తమశిష్యుల ముఖాంతరమునను ఆయా వేదములను ముల్లోకములందు ప్రచార మొనర్చిరి.

భాగవతరచన.

ఒకరికి మేలుచేసి, ఒకింత దానముచేసి, జీవితపర్యంతము దానిని గురించి గొప్పగా చెప్పుకొనువారు కోకొల్లలు. ఒకరికికాక జగత్తునకే మహోపకారము చేసియు, "అయ్యో ! ఏమియు చేయనైతినే" యని వగచువారు ఒక్కొక్క యుగమున కొందరుమాత్రమే యుందురు. వారు మహాత్ములు, మహామహులు. వారిలో కృష్ణద్వైపాయన వ్యాసుడొకడు.

వ్యాసుడు వేదములను విభజించి, ప్రచారము చేసియు, భారతాది పురాణ రచనము చేసియు, లోకమునకు మహోపకారము చేసినవాడయ్యు, ఒక నాడు సరస్వతీ నదిలో ఆచమనముచేసి శుచియై ఏకాంతమున కూర్చుండి ఆలోచింప సాగెను. 'నిష్కపట భావమున బ్రహ్మచర్యమును పాలించితిని. వేదములను, గురువులను పూజించితిని, అగ్నులను ఆరాధించితిని, స్త్రీలు, శూద్రులు సహితము చదువుటకు వీలుగా వేదార్థములన్నియు వ్యక్తముచేయు మహా భారతమును రచించితిని, అయినను నాకు ఏదో అసంతృప్తిగనే ఉన్నది. ఇక నేను చేయవలసిన పనిఏమి ? అని వేదన పడుచుండగా, దేవర్షియైన నారదుడు అక్కడికి వచ్చినాడు. వ్యాసుని ముఖమున వ్యక్తమగు విచారమునకు వేదనకు గల కారణము అడిగి తెలుసుకున్నాడు. వ్యాసునితో ఇట్లు అన్నాడు :-

> "వ్యాసమహర్షీ ! నీవు భగవంతుని చరిత్ర విపులముగను, వివరముగను రచించలేదు. గంభీరముగను, అలంకార యుక్తముగను ఎన్ని రచనలుచేసినను అందు శ్రీ కృష్ణమహిమ వర్ణించకున్నచో అంతయు వ్యర్థము.

హంసలు మానస సరోవరమున విహరించును. కాకులు ఎంగిలి స్థలములలో తిరుగును. వానికి తృప్తి ఉండదు. అట్లే సాత్త్వికులైన వారు బ్రహ్మజ్ఞానముతో తృప్తిపడుదురుగాని భక్తిలేని వాక్యములతో తృప్తిపడరు. అందువలననే సాధువులు భగవన్నామము కీర్తింతురు కీర్తింపచేసి విందురు.

నైష్కర్మ్యమప్యచ్యుతభావవర్జితం న శోభతే జ్ఞానమలం నిరంజనమ్
కుతః పునః శశ్వదభద్రమీశ్వరే న చార్పితం కర్మ యదప్యకారణమ్

నిష్కర్మము నిరంజనమైన జ్ఞానమైనను భగవద్భక్తి లేకున్న వర్జితమగును. కామ్య కర్మములు భక్తిమై భగవంతునకర్పింప కుండిన ప్రకాశింపవని వేరు చెప్పవలెనా ?

ఫలాపేక్షతోకూడిన కర్మ నిందింప దగినది. అయినను ప్రజలు దానిపైనే మొగ్గుదురు. నీవు మహాభారతము రచించి అట్టి కామ్యకర్మనే ఉపదేశించినావు. నీ ఉపదేశము ప్రకారము కామ్యకర్మయే శ్రేష్ఠమనుకొనువారిని అందు నుండి తప్పించుట అసంభవము. విషయాసక్తులైన జనుల దుఃఖమునొలగించి, వారిని సంసారసాగరమునుండి దాటించుటకు హరికీర్తనమును మించిన తెప్ప మరొకటిలేదు. కామలోభముంతో బాధపడిన హృదయము హరిసేవ వలననే తప్ప యమనియమాది-యోగసాధనవలన శాంతిపొందదు.

వ్యాసదేవా ! నీవు పరిపూర్ణ జ్ఞానవంతుడవు. భగవానుని యశోగాథలు కీర్తింపుము. అదివిని పండితుల జ్ఞాన పిపాస శాంతించును. దుఃఖపీడితులైన ప్రాణుల దుఃఖములు నివారించును. భగవంతుని గుణ కీర్తన తప్ప జీవులు తరించుటకు అన్యమార్గము లేదు."

ఇట్లు వ్యాసునకు బోధించి నారద మహర్షి వెడలిపోయెను.

నారదుని ఉపదేశమువిని వ్యాసుడు బ్రహ్మనదియగు సరస్వతీ పడమటి ఒడ్డున రేగుచెట్ల మధ్యనున్న శమ్యాప్రాస ఆశ్రమమునకు వెళ్ళినాడు. ఆచమనముచేసి ఆశ్రమమున సమాధిలో కూర్చుండి ధ్యానమగ్నుడైనాడు. ఏకాగ్ర చిత్తమున పురుషోత్తముని దర్శించినాడు. మాయను చూచినాడు. మాయామోహితుడైన మానవుని చూచినాడు. మాయవలన అతడు పడు అనర్థములను గ్రహించినాడు. మానవుడు మాయను తెలుసుకొనుటకు దానినుండి వెలివడుటకు భక్తి యోగమునకు మించిన సాధనము మరియొకటిలేదని గ్రహించినాడు. ఆ విషయము లోకులకు తెలియపర్చదలచి లోకహితమునకుగాను భాగవత సంహిత రచించినాడు.

యస్యాం వై శ్రూయమాణాయాం కృష్ణే పరమపూరుషే
భక్తిరుత్పద్యతే పుంసః శోకమోహభయాపహా

భాగవత సంహిత వినినతో పరమ పురుషుడైన శ్రీకృష్ణునిపై భక్తిజనించును. పురుషుల శోకమోహ భయములు హరించిపోవును.

శ్రీ శుకుడు

ఒకానొకప్పుడు వేదవ్యాసుడు మేరు పర్వతాగ్రమునగల కర్ణికార వనమున శివుని గూర్చి ఘోరమైన తపమాచరించెను. శివుడు ప్రత్యక్షమయ్యెను. వ్యాసుడు శివునిస్తుతించి, "పరమశివా ! నీరు, గాలి, ఆకాశము, భూమి, అగ్ని వీనితో సమానమగు బలముగల పుత్రుని ప్రసాదించుము." అని వేడుకొనెను. శంకరు డావరమిచ్చి అంతర్హితుడయ్యెను.

ఒకనాడు కృష్ణద్వైపాయనుడు యజ్ఞమునకుగాను అరణి పుచ్చుకొని మథించ సాగెను. అట్టి సమయమున ఘృతాచియను అప్సరస కనిపించెను. ఆమెనుచూచి అతడు కామపరవశుడు కాజొచ్చెను. అతడు చలించుటచూచి శాపభయమున ఘృతాచి చిలుకయయ్యెను. అట్లైనను అప్సరసనుగాంచిన అతని వీర్యము స్ఖలితమై అరణియందు పడెను. అయినను నిర్వికారచిత్తుడై వ్యాసుడు అరణిని మథించెను. అందునుండి తండ్రి పోలికలు కలిగి దివ్యతేజస్సుగల ఒక బాలుడు జనించెను. శుకరూపమునను్న ఘృతాచివలన స్ఖలితమైన వ్యాసునివీర్యమున జనించుటచే ఆ బాలునకు శ్రీ శుకుడను పేరువచ్చెను.

శ్రీ శుకుడు జన్మించగనే ఆకాశగంగ సాకారియైవచ్చి అతనికి మంగళస్నానము చేయించెను. ఆకసమునుండి కృష్ణాజినము, దండము అతని ఎదుట పడినవి. పుష్ప వృష్టి కురిసెను. దేవదుందుభులు మ్రోగెను. శంకరుడు పార్వతీసమేతుడై వచ్చి శ్రీ శుకునకు ఉపనయనము చేసెను. పశువులు, పక్షులు మున్నగునవి ఆనందమున గంతులు వేసియు, నృత్యము చేసియు శ్రీ శుకుని జన్మదినోత్సవము జరిపినవి.

శ్రీ శుకుడు బాల్యమున బృహస్పతి వద్ద సకల వేదములు, శాస్త్రములు అభ్యసించి తండ్రికడకువచ్చి సాంఖ్యయోగము నేర్చుకొనెను శ్రీ శుకుడు గృహస్థాశ్రమ వానప్రస్థములను వదలి సన్యాసాశ్రమము స్వీకరించగోరెను. జనకమహారాజు దగ్గరకువెళ్ళి ఉపదేశము పొందవలసినదని తండ్రి పంపగా, శ్రీ శుకుడు పాదచారియై మిథిలానగరము చేరెను. ద్వారపాలకుడాతని నాపి "నీవు బాలుడవా ? వృద్ధుడవా ?" అని అడిగెను. అందుకాతడు "వృద్ధులలో బాలుడను, బాలురలో వృద్ధుడను" అని ప్రత్యుత్తరమిచ్చెను. ఆ ప్రత్యుత్తరమువిని అచ్చెరు వొందిన దవ్వారికుడు జనకునకు నివేదించెను. వచ్చినవాడు శ్రీ శుకుడని ఎరిగిన జనకుడు పూర్ణకుంభము తలపైనుంచుకొని మహర్షికి స్వాగతమిచ్చెను. శ్రీశుకుడు

జనకునివలన సత్కారము నందె. "మధ్య రెండు ఆశ్రమములు వదలి చతుర్థాశ్రమము స్వీకరించ వచ్చునా ?" అని అడిగెను. అందుకు జనకుడు "ప్రథమాశ్రమముననే సుస్థిర జ్ఞానము లభించినవాడికి మిగిలిన ఆశ్రమములతో పనిలేదు. నిష్కామముగా తపమాచరించినవాడు బ్రహ్మమునందును" అని బదులు చెప్పెను.

తన సంశయము తీర్చుకొని శ్రీ శుకుడు తండ్రివద్దకేగి జ్ఞానియై పోయెను. ఆతడు దిగంబరుడై లోక సంచారము చేయసాగెను. గోవు పాలు పితుకుట కెంతసమయము పట్టునో అంతసమయమును మించి అతడేచోటను నివసించడు.

ససంహితాం భాగవతం కృత్వానుక్రమ్య చాత్మజం
శుకమధ్యాపయామాస నివృత్తి నిరతం మునిమ్

వ్యాసుడు ఆ శ్రీభాగవత సంహితను రచించి తన పుత్రుడు, నివృత్తినిరతుడు అయిన శ్రీ శుకమహామునిచే చదివించెను.

నారదుని కథ

పూర్వము వేదవాదులైన బ్రాహ్మణుల ఇంటి పనిచేయు ఒకదాసికి నారదుడు పూర్వజన్మమున పుట్టెను. ఆ బ్రాహ్మణులకు బాలుడైన నారదుడు పరిచర్యలు చేయుచుండెను. బాలుడైనను చాపల్యము మాని ఇంద్రియములను స్వాధీనము చేసికొని వారి ఆజ్ఞలను పాలించువాడు. వారు ప్రతిదినము కీర్తించు కృష్ణ గాథలువిని ఆ బాలునకు భగవంతుని విషయమున ఆసక్తి కలిగెను. చాతుర్మాస్యము గడుపుకొనుటకుగాను వచ్చిన వేదవాదులు ఆస్థానము విడిచి పోవునపుడు బాలునిపై దయదలచి అతనికి గుహ్యతమజ్ఞానము ఉపదేశించిరి.

వేదవాదులు వెళ్ళిపోయిన తరువాత ఒకనాటిరాత్రి ఆ బాలునితల్లి పాలు పిదుకుటకుగాను వెళ్ళి పాము కరచుటవలన మరణించెను. అందువలన ఆ బాలునకు విచారముగాని దుఃఖముగాని కలుగకపోగా అది భగవత్కృపగా భావించి ఉత్తర దిక్కుగా పయనించెను. అనేక నదులు, నదములు, పురములు, జనపదములు గడచి నిర్మానుష్యమైన ఒకానొక అరణ్యమున ప్రవేశించెను. ఒక నదిలో స్నానముచేసి ఆచమనముచేసి ఒక మఱ్ఱిక్రింద కూర్చొని హృదయాంతరాళమందు పరమాత్మ నివసించునని పెద్దలవలన వినియున్నందున ఏకాగ్రచిత్తమున పరమాత్మను ధ్యానించ నారంభించినాడు. అనిర్వచనీయమైన భగవద్రూపము గోచరమై వెంటనే అంతర్ధానమైనది. గోచరమైన ఆ రూపమును తిరిగి దర్శించుటకు

అతడెంతో ప్రయత్నించినాడు. ప్రయాస పడినాడు. అతని ప్రయత్నము ఫలించక పోవుటవల్ల ఆతురతతో తల్లడిల్లెను. అంత అగోచరుడైన భగవానుడు తన గంభీర వచనములతో అతనిని శాంతపరచినాడు.

"వత్సా! ఈ జన్మమున ఇక నన్ను గాంచలేవు. స్వల్పకాల సాధుసేవ వలననే నీమనసు నాపై లగ్నమైనది. దీర్ఘకాలము సాధు సేవచేసిన మనుసటి జన్మమున నాపరిజనమున చేరుదువు."

అది విని ఆబాలుడు భగవంతుని సర్వవిధముల కీర్తించినాడు. భగవంతుని చరిత్రగానము చేయుచు అవసాన కాలమునకై నిరీక్షించుచు కాలము గడుపసాగినాడు. కొంతకాలమునకు మృత్యువు వచ్చిపడినది. పాంచభౌతికమైన దేహము నశించినది. కల్పాంతమైనది. ప్రళయము వచ్చినది. వేయియుగములు గడచినవి. బ్రహ్మ మరల విశ్వసృష్టి ప్రారంభించినాడు. అతని ఇంద్రియములనుండి మరీచిమున్నగు ఋషులతో నారదుడు జన్మించినాడు. దేవర్షి అయినాడు.

> సత్య సూక్తి ఘటించు దీజడిమ మాన్పు । గౌరవమొసంగు జనులకు గలుషమడచు
> గీర్తిప్రకటించు చిత్తవిస్ఫూర్తి జేయు । సాధుసంగంబు సకలార్థ సాధకంబు
>
> భర్తృహరి-లక్ష్మణకవి

అశ్వత్థామ

కురుక్షేత్ర సంగ్రామము ముగిసినది. కౌరవ వీరులందరును హతమారినారు. భీమునితో పోరి తొడలు విరిగి సరస్సువద్ద దుర్యోధనుడు పడియున్నాడు. అశ్వత్థామ, కృతవర్మ, కృపాచార్యులు దుర్యోధనుని వద్దకేతెంచి సామ్రాట్టుయొక్క దుర్దశను చూచి మిక్కిలి దుఃఖించినారు. అశ్వత్థామ అగ్గిరాయైపోయినాడు. "దుర్యోధన మహారాజా! పాండవులు నా తండ్రిని అధర్మముగా చంపినారు. ఇప్పుడు నిన్నును అధర్మముగా పడగొట్టినారు. రోషమునను, కోపమునను నా గుండె మండిపోవుచున్నది. నా దివ్యాస్త్రములతో పాండవులనందరను నాశనము చేయుదును. మహారాజా! నన్నుపంపుము. ఈ రాత్రి పాంచాలురు మున్నగు బంధుమిత్రులతో సహితముగా పాండవులందరిని చంపుదును." అశ్వత్థామ కురిపించిన అగ్గి దుర్యోధనునకు పుష్పవృష్టి యయ్యెను. అంతరించుచున్న క్రోధజ్వాల రగిలెను. అతడు కృపాచార్యులతో నీరు తెప్పించి అశ్వత్థామను సేనాపతిగ అభిషేకము చేయించినాడు. అశ్వత్థామ మిక్కిలి ఆనందమున దుర్యోధనుని కౌగి

లించుకొని సింహనాదము చేసెను. కృపాచార్య, కృతవర్మలు వెంటరాగా అశ్వత్థామ అపాండవము చేయుటకుగాను బయలు దేరెను.

దుర్యోధనుడు పడియున్న స్థలమునకు పాండవ శిబిరము దక్షిణదిశకు వ్యాపించి పడమర ముఖము కలిగియుండెను. అశ్వత్థామాదులు పాండవ శిబిరమునకు ఎదురుగా బయలుదేరిరి. వారికి పాండవ శిబిరమునుండి జయజయ ధ్వానములు సింహనాదము లవలె వినవచ్చు చుండెను. ఆ ధ్వనివిని పాండవసేన తమ దిక్కేవచ్చుచున్నదని తలచి పాండవశిబిరమునకు కాక మరొక్కడకైనను వెళ్ళవలె ననుకొనిరి. వారు తూర్పునకు బయలుదేరి కొంతదూరము వెళ్ళి నీటిపట్టున ఆగిరి. రథసారథులు గుఱ్ఱములకు నీరు త్రాగించు సమయమున సాయంకాలమయ్యెను. అశ్వత్థామాదులు సంధ్యాకాలమందు చేయదగిన కార్యములు నిర్వర్తించుకొని ఒక మఱ్ఱిక్రిందకు చేరి కూర్చుండిరి. సంజె చీకట్లుక్రమ్మెను. క్రమముగా రాత్రియయ్యెను. అశ్వత్థామాదులు కురుక్షేత్ర సంగ్రామమును గురించియు పాండవులు చేసిన అన్యాయములను గురించియు చెప్పుకొనుచు మేను వాల్చిరి. కృపాచార్య, కృతవర్మ లిరువురు నిద్రించిరి. అశ్వత్థామకు పాండవుల ఎడగల క్రోధాతిశయమున నిద్రరాలేదు. నిద్రపట్టనందున పడుకొని మఱ్ఱికొమ్మలను పరీక్షగా చూడసాగెను. ఆ మఱ్ఱికొమ్మలందు అనేక కాకులు నిద్రించుచుండెను. ఆ సమయమున ఒక పెద్ద గుడ్లగూబ ఆ మఱ్ఱిపైకి వచ్చెను. అది కొమ్మలందు ప్రవేశించి అందుండు కాకులను ఆక్రమించెను. గుడ్లగూబ నిద్రించుచున్న కాకుల గొంతులను కొరికెను. కొన్నింటి కాళ్ళు విరిచెను. కొన్ని కాకుల వెన్ను చీల్చెను. కొన్నింటి పొట్టలు మట్టెను. ఇట్లు గుడ్లగూబ కాకుల నన్నింటిని చంపివేసెను.

అది చూచిన అశ్వత్థామకు ఉత్సాహము కలిగెను. ఆ గుడ్లగూబ తనకు ఉపదేశము చేయుటకే వచ్చినదని భావించెను. నిద్రించుచున్నప్పుడే పాండవులను వధించ వలెననియు, ఎదిరించి పాండవులను ఓడించుట సాధ్యపడదనియు తలంచెను. నిద్రలోనున్నవారిని చంపుట అధర్మమగును. కాని పాండవులు భీష్మద్రోణాదులను, కర్ణదుర్యోధనులను అధర్మమునసె గదా వధించినది! కపటోపాయము గలవారిని కపటోపాయమునచే వధించవలెననియు, అది దోషము కాదనియు నిశ్చయించుకొని, అశ్వత్థామ తన మేనమామయగు కృపాచార్యుని, కృతవర్మను లేపెను. తనకు తోచిన ఉపాయమును గూర్చి వారికి వివరించెను. అది విని కృపాచార్యు డిట్లనెను :—

> "సకల కర్మములకును పురుష ప్రయత్నము, దైవనిర్ణయము అను రెండు సాధనములుండును. ఈ రెంటిలో ఏది లేకున్నను కర్మఫలసిద్ధి కలుగజాలదు. అది ఎట్లన: చక్కగా వర్షము కురిసినను చవిటి భూమియందు ధాన్యము ఫలింపదు. మంచి భూమిని దున్ని విత్తనములు చల్లినను వర్షములు కురియని ఎడల ధాన్యములు ఫలింపజాలవు. తగిన కార్యములు చేయుటకు ప్రయత్నించుచు ధర్మవేత్తలగు పెద్దలకు సమ్మతముగా కార్యములు చేసిన దైవసహాయము లభించును. ధర్మమార్గము తప్పక, న్యాయముగా కార్యములు చేసిన ఫలసిద్ధి కలుగును. ఫలసిద్ధి కలుగకున్నను కీర్తి చెడదు. కోపముచేత అధర్మముగా చేసిన కార్యములవలన ఫలసిద్ధి కలిగినను అందువలన భయము, జుగుప్స గలుగును. జనులందరు నిందింతురు. అధర్మకార్యములు ఫలించనిచో అనేక ఆపదలు కలుగును. దుర్మార్గులైన వారు పెద్దలు చెప్పినను వినక దుష్కార్యము చేయుట మానరు. అందువలన బాధలు కలుగును. సంపద నశించును. దుఃఖము కలుగును.

కావున అశ్వత్థామా ! నేను చెప్పునది వినుము. దుర్మార్గుడగు దుర్యోధనుడు పుణ్యాత్ములైన పాండవులను అనేక ఇడుముల పాలుచేసెను. అట్టి దుర్మార్గునకు చేటు తప్పదుకదా ! నీ మనో దుఃఖమునకు ఏమి చేయవలె నందువేమో ? మనము ముగ్గురము ఇప్పుడు ధృతరాష్ట్రుని వద్దకు వెళ్ళుదము అతడు చెప్పిన ప్రకారము ప్రవర్తింతము."

ఆ మాటలు విని అశ్వత్థామ మండిపడెను. "శస్త్రాస్త్ర విశారదుడనైన నా ముందు నీచుడైన ధృష్టద్యుమ్నుడు నా తండ్రిని వధించెను. అట్టి ధృష్టద్యుమ్నుడు మున్నగువారిని హతమార్చిననేగాని నా మనసు శాంతించదు. పాండవులీరాత్రి విజయ గర్వమున నిద్రించుచుందురు. నేను క్రూరముగా వారి శిబిరమున ప్రవేశించి శత్రువుల నాశ్రయించెదను. కొందరిని చంపుదును. కొందరి తలలు నరకుదును. కొందరి కాళ్ళు, కొందరి చేతులు, కొందరి పొట్టలు నరకి వేతును. శిబిరము నంతయు రక్తమాంసములతో నింపి వీరవిహారము చేయుదును. అట్లు చేసిననే కాని నా మనసునందు గల అవమానము, దుఃఖపరితాపము నశించవు." అనెను.

అందుకు కృపాచార్యుడు "నిద్ర చావు వంటిది, నీ వంటి శాస్త్రవేత్త, ప్రతాపశాలి, కీర్తివంతుడు నిద్రించువారిని చంపుట ధర్మము కాదు. అందువలన అపకీర్తి అమంగళము కలుగును. కాన సూర్యోదయమైన తరువాత పాంచాలురతో యుద్ధముచేసి నీ ప్రతాపము చూపుము" అనెను.

"నా తండ్రియగు ద్రోణుని చంపిన దురాత్ములు ధృష్టద్యుమ్నాదులను ఈ రాత్రియందే పాపమార్గమున వధింతును. అందువలన నాకు కీటక జన్మము కలిగినను మేలేయగును. నా ఈపూనికను మానను. నన్ను నివారించుట ఎవరికిని సాధ్యపడదు." అనుచు అశ్వత్థామ దిగ్గునలేచి రథమెక్కెను. "మనము ముగ్గురము ఒక కార్యమునకై వచ్చియుండగా నీ విట్లు ఒంటరిగా వెళ్ళిపోవుట న్యాయము కా"దని కృపాచార్య, కృతవర్మలు చెప్పుచున్నను వినక తనను అనుసరించ దలచినచో తన వెంట రావలసినదని పలుకుచు రథము తోలుకొని అశ్వత్థామ వెడలిపోయెను. కృతవర్మ, కృపాచార్యులు రథములెక్కి వేగముగా పోయి అశ్వత్థామను కలుసుకొనిరి. అగ్నిత్రయమువలె ప్రకాశించు కృపాచార్య, కృతవర్మ, అశ్వత్థామలు పాండవ శిబిరమునకు సమీపముగా వెళ్ళిరి. అశ్వత్థామ శిబ్బన లోనికి వెళ్ళుటకు ప్రయత్నించగా అతని ఎదుట ఒక మహా భూతము నిలిచెను. ఆ భూతము భయంకరముగా ఉండెను. అది ఎఱ్ఱని పులి చర్మమును ధరించి యుండెను. సర్పములు, జన్నిదములు హారములు భుజకీర్తులుగను కలిగియుండెను. దాని నోరు పెద్దగాఉండి వాడియైన కోరలు కలిగి ఉండెను. ఇట్లాభూతము మిక్కిలి క్రూరముగను, సుందరముగను, కాంతివంతముగను ఉండెను. అశ్వత్థామ ఆ భూతమును చూచి శస్త్రాయుధము ప్రయోగించెను. అది తునకలై పడిపోయెను, శక్తివిసరెను. అది దూదివలె వ్యర్థమయ్యెను. అశ్వత్థామ ప్రయోగించిన తోమరాయుధము, గదాయుధము కూడ నిష్ఫలములయ్యెను. అంత అశ్వత్థామ శివునిగూర్చి తపము చేయదలచెను. అప్పుడు అతనికి ఒక బంగారు అరుగు కనిపించెను. దానిపై జాజ్వల్యమానమై వెలుగుచున్న అగ్ని కాన్పించెను. అశ్వత్థామ ఆ అగ్నియందు ప్రవేశించి తన మనసును శివునకు సమర్పించెదనని నిశ్చయించుకొనెను. అతనికి అనేక ప్రమథ గణములు కనిపించెను. వారందరు ఆడుచు, పాడుచు, సింహనాదములు చేయుచు, అరచుచు, పొరలుచు, త్రుళ్ళిపడుచు గంతులు వేయుచుండిరి. అశ్వత్థామ తన రథము మీద నుండు ఆయుధములను తీసికొని తన ఎదుటనున్న అగ్నిలో ప్రవేశించుటకు ప్రయత్నించగా ఆ అగ్ని కొంచమై కాన్పించెను. అశ్వత్థామ బాణములను ధనుస్సును అగ్నిలోవేసి దానికి బలము సమకూర్చెను. అతడు రెండుచేతులు పైకెత్తి సమాధియూప చిత్తముగలవాడై, "మహాదేవా! శంకరా! ఇదే నా మనస్సును నీకు అర్పిం[illegible]న్నను. నా శత్రువులను సంహరించు శక్తి ప్రసాదించుము" అని అగ్నిలో [illegible]ను. అగ్నిలో దూకినను అశ్వత్థామ శరీర

మమాత్రము కందలేదు. అతడు ఉజ్జ్వలుడై ప్రకాశింపసాగెను. అట్టి ధైర్యశాలియైన అశ్వత్థామకు శివుడు ప్రత్యక్షమయ్యెను. అశ్వత్థామ అగ్నినుండి బయటకు రాగా శంకరుడాతనిని కౌగిలించుకొనెను. అశ్వత్థామ మహాదేవునకు ప్రణమిల్లి స్తుతించగా శివుడు, "నాయనా! అశ్వత్థామా! శ్రీకృష్ణుడు నాకు పరమమిత్రుడు. అట్టి కృష్ణునకు సంతోషము కలిగించుటకై భూతరూపము దాల్చి నేను అడ్డుపడితిని. నిన్ను పరీక్షించితిని. పాంచాలురగు ధృష్టద్యుమ్నాదులకు ఆయుష్కాలము సమీపించినది. నా అనుమతితో ఈ రాత్రి నీవు వారినందరను వధించగలవు." అని చెప్పి పరమశివుడు తన శక్తిని అశ్వత్థామకిచ్చి తేజోరూపమున అశ్వత్థామ శరీరమున ప్రవేశించెను.

అశ్వత్థామ గొప్ప తేజస్సున ప్రకాశించెను. అతడు మిక్కిలి సంతోషము పొందెను. రథమునెక్కి పాండవ శిబిరములోనికి వెళ్ళెను. కృపాచార్య కృతవర్మలును అతనివెంటనే వెళ్ళిరి. వారిరువురను వాకిటనిలిపి అశ్వత్థామ ధృష్టద్యుమ్నుని గృహమున ప్రవేశించెను. ధృష్టద్యుమ్నుడు విశాలమైన శయ్యపై పడుకొని నిద్రించుచుండెను. అతనిని చూచి అశ్వత్థామకు కోపమును సంతోషమును కలిగెను. అశ్వత్థామ తన కాలితో తన్ని ధృష్టద్యుమ్నుని నిద్రనుండి లేపెను. ధృష్టద్యుమ్నుడు దిగ్గునలేచి అశ్వత్థామ యొక్క ధనుస్సు లాగి అతని తలపట్టుకొని వంచెను. అశ్వత్థామ ధృష్టద్యుమ్నుని క్రిందపడవేసి మోకాళ్ళచే ధృష్టద్యుమ్నుని ముఖమున గుద్ది బుద్ధివశము లేనివానిగా చేసెను. అశ్వత్థామ తన ధనుస్సుకు కట్టిన నారినివిప్పి ధృష్టద్యుమ్నుని మెడకు గట్టిగా చుట్టెను. అశ్వత్థామ ధృష్టద్యుమ్నుని పశువును చంపినట్లు చంపదలచెను. తనరెండుకాళ్ళ చేతను ధృష్టద్యుమ్నుని రొమ్ము, మెడలను త్రొక్కిపట్టెను. గోళ్ళతో అశ్వత్థామను గీరసాగెను. కంఠధ్వనిలేనివాడైనను ధ్వని తెచ్చుకొని ధృష్టద్యుమ్నుడు, "ఓరీ! అశ్వత్థామా! నన్ను త్వరగా ఆయుధముతో చంపుము. పుణ్యగతి కలుగును." అనగా అశ్వత్థామ, "ఓరీ ధృష్టద్యుమ్నా! నీవు నీ గురువగు ద్రోణుని కుత్సితముగా చంపితివి. నీకు పుణ్యగతి కలుగదు." అనుచు అతిగా నొప్పించి పశువును సింహము చంపినట్లు కాళ్ళ చేతను, చేతుల చేతను పొడిచి ధృష్టద్యుమ్నుని చంపెను. ఏడ్చుచు, మూల్గుచు, నేలపై పొ[illegible] రక్తము కక్కుచు ధృష్టద్యుమ్నుడు ప్రాణములు విడిచెను. అశ్వత్థామ మిక్కిలి సంతోషించి ధృష్టద్యుమ్నుని మెడకు ఉరిపోసిన నారితీసి ధను

స్సుకు సంధించుకొనెను. మిక్కిలి ఆనందమున ధనుర్ధారియై అశ్వత్థామ రథారూఢుడై బైల్దేరెను. అతని రథము భయంకరముగా ధ్వనిచేయుచు నడచెను. అందుకు అశ్వత్థామ మిక్కిలి సంతసించి రాక్షస, భూత, భేతాళములకు సంతోషము కలుగ చేయవలెనను తలంపుతో వెడలుచుండెను.

అశ్వత్థామ అట్లు వెళ్ళిపోయిన వెంటనే ధృష్టద్యుమ్నుని శవమును చూచి స్త్రీలు, గృహరక్షక జనులు గోడుగోడున ఏడువసాగిరి. ఆ ధ్వనికి ప్రక్క ఇండ్ల రాజులు మేల్కొని చూడగా రథముమీద శీఘ్రముగా వచ్చుచున్న అశ్వత్థామ కాన్పించెను. వారెల్లరు వ్యాకులత చెంది ఆయుధపాణులై అశ్వత్థామ రథమును చుట్టివేసిరి. అశ్వత్థామ తన శస్త్రాయుధములచే వారి నందరను చంపి ఉత్తమోజుని గృహమున ప్రవేశించి ధృష్టద్యుమ్నుని చంపినట్లే ఉత్తమోజుని గూడ చిత్రవధ గావించెను. ఉత్తమోజుని మరణ వార్తవిని యుధామన్యుడురాగా అశ్వత్థామ గదాయుద్ధమున యుధామన్యునకు కూడ పశుమరణము కలిగించెను. అశ్వత్థామ యమధర్మరాజువలె ప్రకాశించుచు శివుడు ప్రసాదించిన ఖడ్గముతో పాండవ శిబిరములోని గృహములలో ప్రవేశించి పాంచాల వంశస్థుల నందరను హతమార్చెను. పాండవ శిబిరము రక్తమాంసమయమై యుండెను. రాక్షసులు గుంపులు గుంపులుగా చేరి మాంసమును భక్షించుచు, రక్తమును త్రాగుచుండిరి.

అచటినుండి అశ్వత్థామ గజ శాలకు, అశ్వశాలకు వెళ్ళి వానిని వధించి కోలాహలము చేసెను. అది విని ఉప పాండవులైదుగురును, శిఖండియు యుద్ధమునకు వచ్చిరి. ఆ యుద్ధమున ధర్మరాజు కుమారుడు ప్రతి వింధ్యుడు, భీముని కుమారుడు శృత సోముడు, అర్జునుని కుమారుడు శృతకీర్తియు, నకులుని కుమారుడగు శతానీకుడును, సహదేవునికుమారుడు శృతసేనుడును, శిఖండియు మరణించిరి. పాండవశిబిరమున కోలాహలము చెలరేగెను. సైనికులు చెల్లాచెదరై పారిపోసాగిరి. అశ్వత్థామ, కృతవర్మ, కృపాచార్యులు వారి నందరను హతమార్చగా పాండవ శిబిరము కౌరవ శిబిరమువలె పాడుపడెను.

అప్పుడు అశ్వత్థామ, కృపాచార్య, కృతవర్మలు రథారూఢులై, తొడలు విరిగి, రక్తపు మడుగున పడి కొనఊపిరితో నున్న దుర్యోధనుని వద్దకేగి అతనిని కౌగిలించుకొనిరి. ఆ రాత్రి జరిగినదంతయు రారాజుకు విన్నవించిరి. అది విని దుర్యోధనుడు, "అశ్వత్థామ, కృపాచార్య, కృతవర్మలారా! నా శత్రువులను మీరు

చంపినంతమందిని భీష్మద్రోణ కర్ణ శల్యులు సహితము చంపలేదు. వారిలో ఎవ రును నాకు ఇంత సంతోషము కలిగించలేదు. మీరు కృతార్థులైతిరి. సుఖముగా నుండుడు. మరల మిమ్ము స్వర్గమందు కలుసుకొనగలను" అనుచు దుర్యోధనుడు ప్రాణములు విడిచెను.

అప్పటికి సూర్యోదయమయ్యెను.

ఐదుగురు పుత్రులు మరణించిరను వార్త ద్రౌపదికి తెలిసెను. ఆమె ఘోర ముగా దుఃఖించెను. కంటికి మింటికి ఏకధారగా ఏడ్చెను. అర్జునుడు ఆమెను ఓదార్చెను.

"దేవీ ! ఆ బ్రాహ్మణాధముని శిరస్సు నా గాండీవముతో నరికి నీకు తెచ్చి ఇచ్చె దను. నీ పుత్రుల అంత్యక్రియల తరువాత ఆ శిరస్సుమీద కూర్చొని స్నానము చేయుము."

అట్లు ద్రౌపదిని ఓదార్చి, గాండీవము ధరించి రథమునెక్కెను. శ్రీకృష్ణుడు సారథిగా గుర్రముల పగ్గములు సడలించగా కేతనము రెపరెపలాడెను. అశ్వత్థా మను వెంటాడుచు రథము పరుగులిడెను. ద్రౌపదేయులను హతమార్చి నందులకు ఉద్విగ్నుడై యున్న అశ్వత్థామ అర్జునుని రథము వెన్నంటుచున్నదని గుర్తించి వేగముగా పారిపోసాగెను. పరుగెత్తుట వలన అతని రథపు గుర్రములు అలసి పోయెను. ఆత్మరక్షణకు బ్రహ్మాస్త్రము ఒక్కటే శరణ్యమనుకొనెను. అతని బ్రహ్మాస్త్ర ప్రయోగము మాత్రమే తెలియునుగాని ఉపసంహారము తెలియదు. అయినను ప్రాణరక్షణకు మరొక ఉపాయము లేనందున ఆచమనము చేసి, మంత్రముధ్యానించి బ్రహ్మాస్త్రము ప్రయోగించెను. అంతట దిక్కులన్నిట బ్రహ్మాండమైన తేజస్సు అలముకొనెను. అదిచూచి అర్జునుడు అర్థముకాక శ్రీ కృష్ణుని ప్రార్థించెను. శ్రీహరి ప్రసన్నుడై అశ్వత్థామ బ్రహ్మాస్త్రము ప్రయో గించెననియు, అది అన్య అస్త్రమున నివారింప బడజాలదనియు, బ్రహ్మాస్త్రమే ప్రయోగించ వలసినదనియు అర్జునునకు ఆదేశించెను. శ్రీకృష్ణుని ఆదేశాను సారము అర్జునుడు బ్రహ్మాస్త్రము ప్రయోగించెను.

రెండు బ్రహ్మాస్త్రములు ఢీకొనగా భూమి, ఆకాశము మహాతేజస్సుతో నిండి పోయెను. అగ్ని, సూర్యుడు ఢీకొన్నట్లయ్యెను. లోకులు భయభ్రాంతులైరి. మానవులు, దేవతలు ప్రళయము వచ్చినదని వణకి పోయిరి. లోకమును నాశము

నుండి తప్పించుటకుగాను శ్రీకృష్ణుని ఆదేశముమేరకు అర్జునుడు రెండు బ్రహ్మాస్త్రములను ఉపసంహరించెను.

అశ్వత్థామను చూచి అర్జునుడు ఉగ్రుడయ్యెను. రథముపైనుండి లంఘించి అశ్వత్థామను పట్టుకొని పశువును కట్టినట్లు కట్టి శిబిరమునకు తెచ్చుట కాయత్తుడగుచుండగా శ్రీకృష్ణుడు,

"అర్జునా! ఇతడు బ్రాహ్మణాధముడు. వదలక వధింపుము. దురాత్ముడు. మత్తుడు, ప్రమత్తుడు, పిచ్చివాడు, నిద్రలో నున్నవాడు, బాలుడు, స్త్రీ, జడుడు, శరణాగతుడు, రథహీనుడు అయిన శత్రువును వధింపరాదు. ఇతరులను వధించి తన ప్రాణము రక్షించుకొను వానిని హతమార్చుటే అతనికి మేలుచేయుట అగును. వదలిన వాడెంతకాలము బ్రతికిన అన్ని పాపములను చేయును. అంత నరకమున పడును. ఇతడు శిశు హంతకుడు. ఆతతాయి, దురాత్ముడు. కాన అశ్వత్థామను వధింపుము" అనెను.

అయినను గురుపుత్రుడైన అశ్వత్థామను చంపక శిబిరమునకు తెచ్చి పుత్రుల కొరకు దుఃఖించు చుండిన ద్రౌపది ముందు నిలువబెట్టెను.

ఇట్లర్జునుడు తెచ్చిచూపిన బాలవధ జనిత వనత శిరుడైన ద్రౌణిని చూచి మ్రొక్కి సుస్వభావయగు ద్రౌపది ఇట్లనియె.

"మా మగవారలందరు బాణప్రయోగ ఉపసంహారణాది విద్యలెల్ల ద్రోణాచార్యుల వద్ద అభ్యసించిరి. నీవు పుత్రుని రూపమున నున్న ద్రోణుడవు. అట్లయిన నా పుత్రులు నీకు శిష్యసుతులగుదురు గదా! అట్టివారిని లేశమంతయు కరుణలేక ఖండించుట న్యాయమగునా?

భూసురుడవు బుద్ధి దయాభా సురుడవు శుద్ధవీర భటవంతో
గ్రేసరుడవు శిశుమారణ మాసుర కృత్యంబు ధర్మమగునే తండ్రీ!

నా పుత్రులు ఉద్రేకమున రాలేదు. శస్త్రధరులై యుద్ధభూమిలో లేరు. నీకు కించిత్తైనను ద్రోహము తలపరు. వారు ప్రౌఢక్రియాహీనులు. సుందరాకారులు, నిద్రాసక్తులు. అట్టి వారిని బలోద్రేకమున చీకటిలో వధించుటకు నీ చేతు లెట్లాడినవయ్యా!

ఇచట నేను పుత్రశోకజనితా కులభార విషణ్ణ చిత్తనై పొక్కుచున్నట్లే అచట నీ తల్లి నిన్ను కిరీటి బంధించి ఇచటికి ఈడ్చితెచ్చుట తెలుసుకొని, ఎట్లు పొక్కుచున్నదో ఊహింపగలవా నాయనా!"

అని కృష్ణార్జునుల జూచి ఇట్లనియె :—

"ద్రోణునితో అగ్నిలో దూకక ద్రోణుని భార్య ఇంటివద్ద ఉన్నది. పుత్రశోకము వలన నేనెట్లు విలపించుచున్నానో ఆమెకూడ అంత కుందుచుండును. కాన బ్రాహ్మణహింస మానరా!"

అని ఇట్లు ధర్మ్యంబును, సకరుణంబును, నిర్వ్యాళీకంబును, సమంజసంబును శ్లాఘ్యంబుగా బలుకు ద్రౌపది పలుకులకు ధర్మనందనుండు సంతసిల్లె. నకుల, సహదేవ, సాత్యకి ధనంజయ కృష్ణులు సమ్మతించిరి. భీముడు మాత్రము సమ్మతించక శిశుహంతకుడైన వానిని వధింపవలెనని, మీకు వధింపకున్న నా పిడికిటి పోటున వీనిని వధింతునని అశ్వత్థామ పైకురుక ద్రౌపది అడ్డగించెను. శ్రీకృష్ణుడు చతుర్భుజుడై రెండుచేతుల భీముని వారించి కడమ రెండు చేతుల ద్రౌపదిని తొలగించెను.

శ్రీకృష్ణుడు ద్రౌపది వాదము, భీముని వాదము వినెను. అర్జునునితో ఇట్లనెను :—

> బ్రాహ్మణుడు అధముడైనను చంపదగినవాడుకాడు. కొంపలు కాల్చువారు, విషముపెట్టువారు, హత్య చేసినవారు, బందిపోటు, భూమిని దొంగిలించినవారు, పరస్త్రీని బలిమి చెరపట్టినవారు. వీరు చంపదగినవారని శాస్త్రము చెప్పుచున్నది. అర్జునా! ద్రౌపదిని ఓదార్చినప్పుడు ప్రతిజ్ఞ చేసితివి. నీ ప్రతిజ్ఞ కూడ నెరవేర్చ కావలెను. ద్రౌపది, భీముడు, నేను సంతోషించు పని చేయుము.''

అర్జునుడు కృష్ణుని అభిప్రాయమును అర్థము చేసుకున్నాడు. ఒరనుండి కత్తితీసి అశ్వత్థామ జుత్తుకోసెను. ఆ జుట్టుతో అతని తలలోని సహజ మణినికూడా కోసినాడు. శిశుహత్యతో కాంతిమాసిన అశ్వత్థామ శిరోమణి కూడ పోవుటతో మరింత కాంతి హీనుడయ్యెను. అర్జునుడు అతని కట్లు విప్పి శిబిరమునుండి తరిమివేసెను.

> "వపనం ద్రవిణాదానం స్థానాన్నిర్యాపణం తథా
> ఏషహి బ్రహ్మబంధూనాం వధో నాన్యోస్తి దైహికః''
>
> గొరుగుట, ధనసంపద నపహరించుట, స్థానభ్రష్టులను చేయుట ఇవే బ్రాహ్మణులకు వధతోసమానములు. వేరువిధమైన వధలేదు.'

మృతులకు ఉదకదానాది క్రియలు నిర్వర్తించుటకు గాను స్త్రీ జనము ముందు నడవగా పాండవులు శ్రీకృష్ణ సహితులై భగవత్పాద ధూళితో పవిత్రమైన

గంగానదికి వెళ్ళిరి. మరణించిన బంధువులెల్లరకు ఉదకదానముచేసి వారి గుణగణములు తలచుకొని ఎంతోసేపు విలపించిరి.

"భూతేషు కాలస్య గతిం దర్శయన్న ప్రతిక్రియాం."

"భూతములకు జననమరణాది కార్యజాలము అనివార్యంబగు."

అని శ్రీకృష్ణుడు వారిని ఓదార్చెను.

కపటోపాయమున దుష్టులు అపహరించిన రాజ్యమును శ్రీకృష్ణుడు తిరిగి అజాతశత్రువైన ధర్మరాజునకు ఇప్పించెను. ద్రౌపది జుట్టుపట్టి ఈడ్చిన వారిని చంపించెను. ధర్మరాజుచే మూడు అశ్వమేధములు చేయించి వంద యజ్ఞములు చేసిన దేవేంద్రునివలె కీర్తి వ్యాపింపచేసెను. తరువాత ద్వారక వెళ్ళుటకు పయనమై పాండవులవద్ద శెలవు తీసుకొని, వ్యాసాది మునులను పూజించి, వారిచే గౌరవములుపొంది ఉద్ధవసాత్యకులతో రథమెక్కెను. ఇంతలో భయమున వణకిపోవుచున్న ఉత్తర ఎదురుగా పరుగెత్తి వచ్చి.

"దేవదేవా! జగత్పతీ! మహాయోగీ! ఇచట ఎల్లరును ఒకరి మృత్యువునకు ఒకరు కారకులై ఉన్నారు. నీవు వినా అభయమిచ్చువారు లేరు. ప్రభూ! సర్వశక్తిమాన్! మండుచున్న శరము నన్ను వెంబడించుచున్నది. నేను మండిపోయిన విచారపడను. నా గర్భములోని పసికందునకు ఎట్టి ఆపద కలుగకుండ రక్షించుము స్వామీ!" అని ప్రార్థించినది.

అపాండవము చేయవలెనని అశ్వత్థామ బ్రహ్మాస్త్రము ప్రయోగించినాడని తెలిసుకున్నాడు శ్రీకృష్ణుడు. ఆ బ్రహ్మాస్త్రమును చూచి పాండవులు తమతమ మహాస్త్రములు పట్టుకున్నారు. బ్రహ్మాస్త్రము ఏ మహాస్త్రముల వలనను శాంతించదని ఎరిగిన భగవానుడు సుదర్శన చక్రమును ప్రయోగించి బ్రహ్మాస్త్రమును ఖండించెను. సకల ప్రాణులలో వ్యాపించియున్న శ్రీహరి తనమాయచే ఉత్తర గర్భమున ప్రవేశించి గర్భమునందలి శిశువును కాపాడినాడు.

భగవానుడు పయనమగుచుండుటను ఎరిగి కుంతి తన పుత్రులు కోడండ్రతో వచ్చి శ్రీహరి నిట్లు స్తుతించెను :—

"కృష్ణా! నీవు ప్రకృతికి అతీతుడవు. ఆది పురుషుడవు. ఈశ్వరుడవు. సర్వాంతర్యామివి. నిర్లిప్తుడవు. ఇంద్రియాతీతుడవు. నీమాయవలన మూఢులైన పురుషులు నిన్ను పోల్చుకొనలేరు. విశుద్ధచిత్తులు, వివేకవంతులు, పరమ

> మహాంతులైన మునులు సహితము నీరూపమును దర్శించలేరు. సాధారణస్త్రీనైన నాకు నీ మాయ తెలియునా? భక్తిమాత్ర మెట్లుకలుగును. కృష్ణా! వాసుదేవా! దేవకీ నందనా! నీ పాదపద్మములకు నేను పదేపదే నమస్కరించుచున్నాను. నీవు మాయజూదమునందును, వనవాసమందును, భారత యుద్ధమందును మమ్ములను రక్షించినావు. ఇప్పుడు అశ్వత్థామ బ్రహ్మాస్త్రము నుండి కాపాడినావు. జగద్గురూ! మాకు ఎల్లప్పుడు ఆపదలే రావలెను. ఆపదలందునసే నీవిశ్వత రూపము గోచరమగును. నీ దర్శనమగుటతో జనన మరణములు నశించును. నీవు దీనులకు దర్శనమిచ్చెదవు. పేదల పాలిట పెన్నిధివి నీవు. నీకు నా నమస్కారములు".

కుంతీదేవి కీర్తన విన్నాడు శ్రీకృష్ణుడు. చిరునవ్వు నవ్వినాడు. కుంతిపై తన మాయను కప్పినాడు. స్త్రీజనముతో చెప్పి వచ్చుటకుగాను హస్తినాపురమున ప్రవేశించినాడు. ద్వారకకు బయలుదేరుటకు సిద్ధపడినాడు. కాని ధర్మరాజు అడ్డుచెప్పినాడు. ఆపివేసినాడు.

అశ్వత్థామకథ చదివినాము, ఒక క్షణమతనిని గురించి విచారింతము.

మానవునిలో దైవత్వ, రాక్షసత్వములు రెండును గలవు. మానవుడు స్వప్రయత్నమునను, సంస్కారమువలనను రాక్షసత్వమును అణచి వేయవలెను. అందుకే తపస్సులు శాస్త్రాధ్యయనములు మున్నగునవి. అట్లు చేయలేనివాడు ఎంత ఉత్తమకుల సంజాతుడైనను రాక్షసుడగును.

అశ్వత్థామలోని క్రోధము అతనిని రాక్షసునిచేసినది. అతని పాండిత్యము, శాస్త్రజ్ఞానము, తపస్సు క్రోధాగ్నిలో దహించిపోగా దైవత్వము అడుగంటి రాక్షసత్వము పెల్లుబికి అతనిని రాక్షసుని చేసినది. అతనికి పగయున్న ధృష్టద్యుమ్నుని వధించి ఊరకున్నాడా? పసివారు ఉపపాండవులు ఏమి చేసిరి? ఉత్తర గర్భస్థమైన శిశువు అతనికేమి నేరము చేసినది? రాక్షసత్వము పెల్లుబికినపుడు వీటిని గురించిన ఆలోచనయుండదు.

ద్రౌపదిని గురించి ఆలోచింతము. గతరాత్రి అయిదుగురు పసిపాపలను కోల్పోయిన దుఃఖాతుర విహ్వలచిత్తమందు శిశుహంతకుడైన అశ్వత్థామ ప్రవేశపెట్టబడినపుడు సహజముగా ఆమెలోని క్రోధము రాక్షస రూపమున పెల్లుబికవలెను. కాని ఆమె "సుసాధ్వి" ఆమె తన దైవత్వమున పెల్లుబుకుచున్న రాక్షసత్వమును అణచివేసినది. అశ్వత్థామకు నమస్కరించినది. ఒక తిట్టు సహితము తిట్టలేదు. ఎంత మెల్లగా మాట్లాడినది! "నా వలె నీతల్లి ఎంతకుందుచున్నదో కదా!" అని అతని తల్లిద్వారా తనబాధ అశ్వత్థామకు తెలియపరచదలచినది.

ద్రౌపది రాక్షసత్వమును గెంట గలిగినది, దేవత అయినది.

భీష్మ నిర్యాణము

కురుక్షేత్ర సంగ్రామమున లక్షలాది జనులను చంపించినందులకు ధర్మరాజు మిక్కిలి విచారించినాడు.

> "శరీరమునకు తగిలిన బురద బురదనీటితో పోవదు. దేహమునకు పులిమిన కస్తూరి కల్లుతో కడిగినపోదు. అట్లే హింసతో కూడిన యజ్ఞముల వలన జీవహత్యా పాతకము పరిహరింపదు"

ఇట్లనుకొని భీష్మునివద్ద ధర్మతత్త్వము తెలుసుకొనుటకుగాను కురుక్షేత్రమునకు బయలుదేరెను. అతని వెంట తమ్ములు, వ్యాసుడు మున్నగు బ్రాహ్మణులుకూడ బయలుదేరిరి. వారితో కృష్ణుడుకూడ వెళ్ళెను.

వారు కురుక్షేత్రము చేరిరి. అచట స్వర్గచ్యుతుడైన దేవతవలె అంపశయ్యపై పడియున్న భీష్మునకు వారందరు నమస్కరించిరి. దేవర్షులు, బ్రహ్మర్షులుకూడ విచ్చేసిరి. వారందరిని భీష్ముడు యథావిధి సత్కరించెను. పాండవులు భీష్మునివద్ద కేగగా అతని నేత్రములు ప్రేమాశ్రుపూర్ణము లయ్యెను. అతడు మనసులో శ్రీకృష్ణుని పూజించెను.

భీష్ముడు పాండవులతో ఇట్లనెను :—

"నాయనలారా! మునుల ఆశ్రయము, శ్రీ కృష్ణుని ప్రాపు ఉన్నను మీరు ఇక్కట్లపాలగుట నాకు కష్టముగా ఉన్నది. పాండురాజు గతించినపుడు మీరు పసిబాలురు. మీ అమ్మ కుంతీదేవి మీకొరకు ఎన్నో కష్టాలు పడినది. కాలగతి విచిత్రమైనది. ధర్మరాజువంటి రాజు, అర్జునునివంటి విలుకాడు, కృష్ణభగవానుని వంటి స్నేహమున్నను అవదలు తప్పలేదు.

> ధర్మరాజా! ఏ ఉద్దేశముతో శ్రీకృష్ణుడు ఏపని చేయునో తెలుసుకొనుట సులభముకాదు. పండితులు సహితము ఈ తత్త్వము నెరుగలేరు. కాన అంతయు దైవమని ఎరిగి దైవానువర్తివి కమ్ము. ఈ భావముననే ప్రజలను పాలింపుము.

కృష్ణునిమీది నిర్వికారమైన మనస్సును మరణకాలమున నేను కృష్ణార్పణము చేస్తున్నాను. ఈ యాదవపతి స్వయం భగవానుడు. ఆనందస్వరూపుడు. లీలా మానుషవిగ్రహుడు.

అతనిది త్రిజగన్మోహనమైనట్టి నీలకాంతి. ఉదయ భానునివంటి చేలము ధరించి వాడు. నల్లనిముంగురులు ముఖముపై వాలియున్నవాడు. అట్టి అతిసేవ్యమైన వెన్నుడు ఎల్లప్పుడు నామదిని ఆవేశించునుగాత!

రణరంగమున గుర్రపుడెక్కల వలన రేగిన ధూళి ముంగురులను కప్పివేయుచుండ ఆయాసమున స్వేదబిందువులతో విరాజిల్లు సెమ్మోముతో జయమునర్జునకిచ్చు



అంపశయ్యపై నున్న భీష్మునకు భగవానుడు దివ్యదర్శన మొసగుట.

పుట. 20

వేడ్క. వాడి బాణములచే నొచ్చినవాడయ్యు పోరించు మహానుభావు చింతించు నశ్రాంతమున్.

> నరు మాటల్ విని నవ్వుతో నుభయసేనామధ్యమక్షోణిలో
> బరు లీక్షింప రథంబు నిల్పి పరభూపాలావళిం జూపుచుం
> బర భూపాయువులెల్ల జూపులన తుంచెక్కాం బంచింయసీ
> బరమేశుండు వెలుంగుచుండెడు మహాత్సద్మాసనాసీనుడై
>
> తనవారి జంపజాలక, వెనుకకు బోవిచ్చు గింత విజయుని శంకన్.
> ఘనయోగ విద్యజూపిన, ముని వంద్యుని పాదభక్తి మొనయున్ నాకున్

రథమునుండి కుప్పించి ఎగసిన అతని కుండలముల కాంతి గగనభాగమెల్ల కప్పుకొనెను. ఉరికిన ఉదరములో నున్న జగతి కదలాడెను. పచ్చని పైపంచ జారుచుండగా చక్రముచేపట్టి వేగముగా వచ్చునట్టి కృష్ణుని, "నను నగుబాటుసేయకు మన్నించు", మని అర్జునుడు ప్రార్థించి మరలింప ఏనుగుపై లంఘించు సింహాము వోలె నేడు భీష్ముని చంపి నిన్ను రక్షింతు విడువుమనుచు నా బాణ వృష్టిని బొంగి చనుదెంచు దేవుండె దిక్కు నాకు.

> "ఒక సూర్యుండు సమస్త జీవులకు దానొక్కొక్కడై తోచు
> పోలికనే దేవుడు సర్వకాలము మహాలీలన్ నిజోత్పన్న
> జన్య కదంబంబుల హృత్సరోరుహముల నానావిధానూన
> రూపకుడై యొప్పుచునుండు నట్టిహరినే ప్రార్థింతు శుద్ధుండనై."

అట్లు స్తోత్రముచేసి భీష్ముడు మనోవాక్కాయములు శ్రీ కృష్ణునిపై లగ్నము చేసినాడు. ప్రాణవాయువు అంతర్లీనమై పోయినది.

సాయంకాలమైన తరువాత పక్షులు కలకలము మాని ఊరుకున్నట్లు అచట కూడిన జనులందరు నిశ్శబ్దముగా నిలుచుండిరి.

దేవతలు, మానవులు దుందుభి వాద్యములతో భీష్ముని మరణమును లోకమునకు చాటిరి. పూలవాన కురిసెను.

భీష్ముని కళేబరమునకు అగ్ని సంస్కారములుచేసి కొంతకాలము ధర్మరాజు శోకమున క్రుంగిపోయెను.

ద్వా ర క కు

బంధువులను, స్నేహితులను ఓదార్చుటకు గాను కొంత కాలము హస్తినాపురము నందుండి శ్రీకృష్ణుడు ద్వారకకు పయనమయ్యెను. ధర్మరాజు శ్రీకృష్ణుని

గట్టిగా కౌగిలించుకున్నాడు. కొందరు అతనిని కౌగిలించుకున్నారు, కొందరు నమస్కరించినారు. అట్లు అందరి వద్ద శెలవు తీసుకొని శ్రీకృష్ణుడు రథము ఎక్కెను. ధౌమ్యుడు, కృపుడు, నకుల, సహదేవ, భీములు యుయుత్సుడు మున్నగు పురుషులు సుభద్ర, గాంధారి, కుంతి, ఉత్తర, ద్రౌపది, సత్యవతి మున్నగు స్త్రీలు అతని వియోగ దుఃఖము భరించలేక మూర్ఛిల్లిరి.

'సత్సంగాన్ముక్త దుస్సంగో హాతుం నోత్సహతే బుధః
కీర్త్యమానం యశోయస్య సకృదాకర్ణ్యరోచనమ్

తస్మిన్న్యస్తధియః పార్థాః సహేరన్ విరహం కథమ్
దర్శన స్పర్శనాలాప శయనాసన భోజనైః'

'మంచి సహవాసమువలన, పుత్రుడు మున్నగు దుష్టసహవాసమును వదిలి, మనోహరమగు వాసుదేవుని చరిత్రమును ఒక్కసారి కీర్తించిన వాడు దానిని మరల విడువ నుత్సహించునా?'

చూపునందును, స్పర్శయందును, మాటలయందును, పరుండుట, వసు కొనుట, భోజనము చేయుటయందును కలిసి మెలసి ఉన్న పాండవులు శ్రీ కృష్ణుని విరహము సహించగలరా?

ప్రయాణమునకు శుభ సూచకముగా మృదంగములు శంఖములు మున్నగు వాద్యములు ప్రయోగించబడెను. అర్జునుడు శ్రీకృష్ణునకు రత్నములు పొదిగిన తెల్లని ఛత్రముపట్టగా ఉద్ధవుడు, సాత్యకి వింజామరలు వీచిరి. బ్రాహ్మణులు ఆశీర్వచనములు పలికిరి. మార్గమంతయు పూలవాసనలతో గుమగుమలాడు చుండ భగవానుని రథము సాగిపోయెను.

రథము పాంచాలము, శూరసేన, యమున, బ్రహ్మావర్త, కురుక్షేత్ర, మత్స్య, సారస్వతమను దేశములుదాటి ఆనర్త దేశము ప్రవేశించగా శ్రీకృష్ణుడు పాంచజన్యము పూరించెను.

పద్మములవంటి హస్తములతో పట్టుకొని కృష్ణుడు పాంచజన్యమును పూరించు చుండిన అతని ఎర్రని పెదవుల కాంతి ప్రతిఫలించుచు, పాంచజన్యము ఎర్ర తామరల మీద కూర్చొని మధురముగా కూయుచున్న రాజ హంసము వలె కనిపించెను.

ఆ ధ్వనివిని ప్రభువును దర్శించు కొనుటకుగాను, జనులు గుంపులు గుంపులుగా తరలివచ్చిరి. అనేక ఉపాహారములు తెచ్చి సమర్పించిరి.

"ప్రభూ ! నీవు మిత్రులకొరకు హస్తినాపురము, మధురానగరము వెళ్ళినపుడు మాకు క్షణము ఒక యుగముగా గడుచును. సూర్యుడు లేనప్పటి లోకమువలె నీవు లేనప్పుడు మేము గ్రుడ్డివాళ్ళము అయిపోదుము. నీవు ఎంతోకాలము ప్రవాసములో ఉన్నచో నీ దరహాస వదనము చూడక ఎట్లు బ్రతుకగలము ? ప్రసన్నమైనట్టి నీ చల్లని చూపులు మా దుఃఖము అన్నింటిని హరించును." అని విన్నవించిరి.

భక్తవత్సలుడగు శ్రీకృష్ణ భగవానుడు ప్రజల వినతుల వినుచు ప్రసన్న దృక్కులు ప్రసరింప చేయుచు ద్వారకా నగరమున ప్రవేశించినాడు.

పరీక్షిత్తు పుట్టుక.

ధర్మరాజు న్యాయమార్గము ననుసరించి రాజ్యమును పాలించెను. శ్రీకృష్ణుని పాదపద్మములపై మనసు నిలిపి విషయ భోగములు పరిత్యజించి రాజ్యమునేలెను. అతని పాలనలో వానలు సకాలమున కురిసెను. కామధేనువువలె భూమి సస్యముల నిచ్చెను. ఆవులు పుష్కలముగా పాలిచ్చినవి. నదులు, కొండలు, వనస్పతులు అన్ని ఋతువులలోను సమృద్ధిగా ఉండినవి. ప్రజలలో దుర్మార్గము, అవినీతి పేరుకు లేకుండెను. వ్యాధులు లేకుండెను. రాజునకు అపార సంపద లుండెను. ఎన్నో యజ్ఞములు చేసినాడు. అతనికీర్తి స్వర్గము వరకు వ్యాపించినది. అయినను ఆకలి గొన్న వానికి అన్నము దక్క మరేదియు రుచించనట్లు ధర్మరాజునకు కృష్ణుని మీద దక్క మరేదానిపైనను మనసుండునది కాదు.

అట్లుండ ఒకనాడు అనంత గ్రహములు శుభస్థానములలో ఉన్నపుడు, శుభలగ్నమున పాండురాజంతటి తేజశ్శాలియైన పాండవ వంశాంకురము ఉత్తరకు జన్మించెను. మనుమడు జన్మించినందున ధర్మరాజు మిక్కిలి సంతసించెను. కృపాచార్యుడు మున్నగు బ్రాహ్మణులచే జాతకర్మ చేయించెను. బాలుడు జన్మించగనే బంగారము, గోవులు, అగ్రహారములు, భూములు, అశ్వములు, గజములు మున్నగునవి దానము చేసెను. సంతృప్తులైన బ్రాహ్మణులు బాలుని జాతకము చూచి ఇట్లనిరి.

"మహారాజా! వంశము అంతరించి పోనున్న సమయమున శ్రీకృష్ణ భగవానుడు ఈ శిశువును రక్షించినాడు. విష్ణువుచే ఇవ్వబడిన వాడు కాన ఈ బాలునకు "విష్ణురాతు"డు అని నామకరణము చేయవలెను. ఇతడు మహాభాగవతుడై అనంతమైన

కీర్తిని ఆర్జించును. ఇతడు శిబివంటి దాత, భరతుని వంటి కీర్తిశాలి, అర్జునుని వంటి వీరుడు కాగలడు. ఇతడు గాంభీర్యమున సముద్రమును, ఆశ్రయ దానమున హిమవంతుని, క్షమాశక్తిలో భూదేవిని బోలును. తలిదండ్రులవలె సహిష్ణువు, బ్రహ్మవలె సమదర్శి, శివునివలె వరప్రదాత, విష్ణువువలె సర్వభూతాశ్రయుడు, కృష్ణునివలె సద్గుణశాలి, యయాతివలె ధార్మికుడు, బలివలె ధైర్యవంతుడు, ప్రహ్లాదుని వంటి భక్తుడు కాగలడు. ఇతడు ఎన్నో అశ్వమేధములు చేయగలడు. దుష్టులను శిక్షించి ధర్మమును రక్షించగలడు. కాని ఇతడు బ్రాహ్మణ శాపము వలన తక్షక దష్టుడు కాగలడు. తన మరణమును గురించి తెలుసుకొని సర్వసంగ పరిత్యాగముచేసి శ్రీహరి పాదపద్మములను చేరుకొనగలడు."

జాతకము చూచి చెప్పిన బ్రాహ్మణులు రాజువద్ద శెలవు పొంది తమ తమ ఇండ్లకు వెళ్ళిరి.

విష్ణురాతుడు ఉత్తర గర్భమందుండగా అశ్వత్థామ బ్రహ్మాస్త్రము ప్రయోగించెను. అప్పుడొక తేజోవంతుడైన పురుషుడు గర్భమందున్న విష్ణురాతునికి అగుపించెను. అతడు వేలెంత ఉండి, నిర్మలముగను శ్యామల శరీరముతోను అందముగా ఉండెను. మెరుపువంటి పీతాంబరము ధరించి కిరీటము పెట్టుకొనెను. అతని చేతులు తొడలను అంటుచుండెను. చెవులకు ధగధగ మెరయు కుండలము లుండెను. అతని కన్నులనుండి చింతనిప్పులు రాలుచుండెను. ఉల్కలు రాలునట్లు గద త్రిప్పుచు కనిపించిన వారెవరో ఊహించలేక పోయినాడు గర్భస్థుడైన విష్ణురాతుడు. జన్మించిన తరువాత గర్భమందు చూచిన ఆ పురుషుని కొరకు ప్రతి పురుషుని పరీక్షించి చూచుట వలన అతనికి పరీక్షిత్తు అని పేరు వచ్చినది.

ధర్మరాజు మున్నగువారు పరీక్షిత్తును అల్లారుముద్దుగా పెంచిరి. అతడు శుక్లపక్ష చంద్రుని వలె పెరిగి పెద్దవాడయ్యెను. బాల్యమునుండి కృష్ణభక్తితోను, ధర్మబుద్ధితోను ఉండువాడు.

జ్ఞాతులను చంపిన పాపము పోగొట్టు కొనుటకు గాను ధర్మరాజు అశ్వమేధములు చేయుటకు నిశ్చయించెను. కృష్ణుని ఆజ్ఞ చొప్పున ధర్మరాజు తమ్ములు ఉత్తర మువైపు వెళ్ళి మరుత్తరాజు యజ్ఞపు బంగారు పాత్రలు మున్నగునవి తెచ్చిరి. ఆ ధనముతో ధర్మరాజు మూడు అశ్వమేధములు నిర్వర్తించెను. ఈ యజ్ఞములకు గాను శ్రీకృష్ణుడు హస్తినా పురమునకు వచ్చి కొన్ని మాసములచట ఉండి, అర్జునునితోను యాదవులతోను కలసి ద్వారకకు ఏగెను.

ధృ త రా ష్ట్రు ని అ వ సా న ము.

విదురుడు తీర్థయాత్రలు సేవించి మైత్రేయుని వద్ద ఆత్మజ్ఞానము సంపాదించి హస్తినాపురమునకు తిరిగివచ్చెను. అతడు రాగానే ధర్మరాజు, అతని తమ్ములు, ధృతరాష్ట్రుడు, యుయుత్సుడు, సంజయుడు, కృపాచార్యుడు, కుంతి, గాంధారి, ద్రౌపది, సుభద్ర, ఉత్తర, కృపి మున్నగు వారు మిక్కిలి సంత సించిరి. ఎదురు వెళ్ళిరి. కొందరు నమస్కరించిరి. కొందరు కౌగిలించుకొనిరి. స్నానాదికములు ముగించిన తరువాత తీర్థయాత్రలను గురించియు బంధు జనులను గురించియు ధర్మరాజు విదురుని అడిగి తెలుసుకొనెను.

పాండవులు విదురుని దేవతను సేవించునట్లు సేవించువారు. పాండవులు సుఖముగా కాలము గడుపుచున్నందుకు విదురుడు ఆనందించినాడు. ఇంతలో దుర్నివార మైన కాలము వచ్చినదని విదురుడు గ్రహించినాడు. అంధమహారాజునకు హితోపదేశము చేసినాడు :—

"మహారాజా! ముందు ముందు మహాఘోరమైన కాలము రానున్నది. రానున్న కాలమును ఆపుటకు గాని, దానికి ప్రతిక్రియ చేయుటకు గాని ఎవరికిని సాధ్య పడదు. కాలము చేతిలో చిక్కి ధనమునేకాదు, ప్రియ బాంధవులను కూడ కోల్పోవలసి వచ్చును. నీ తలి దండ్రులు, అన్నదమ్ములు, పుత్రులు ఎల్లరు గతించినారు. నీవు వృద్ధుడవు. పరుల పంచనపడి ఉన్నావు. పుట్టుగ్రుడ్డివి. దానికి తోడు చెవుడు వచ్చినది. స్థిరబుద్ధి లేకున్నది. పళ్ళు ఊడినవి. అజీర్ణరోగము అంకురించినది. కంఠమున కఫము గురగుర లాడుచున్నది. ఇక ఆలస్యము చేయ రాదు. వెంటనే సంసారము త్యజించుము.

భీముడు పిండము వేసినట్లు వేయుచుండ కుక్కవలె మ్రింగు చున్నావు. పాండవులను అగ్గిలో కాల్పవలె ననుకుంటివి. విషము పెట్టి చంప జూచితివి. వారి భార్యను అవమానించితివి. తుదకు వారి పంచనే బ్రతుకు చుంటివికదా! ఇదియు ఒక బ్రతుకేనా? ఈ దేహము కొరకు ఇంత దీనత్వము అనుభవించు చున్నావు. జీర్ణమై చిరిగిన వస్త్రమువలె అయిన తరువాత ప్రాణము ఈ శరీర మును బాయును. కాన దేహముపై మమత వీడుము. విషయ వాసనలకు స్వస్తి చెప్పి అజ్ఞాతముగ అరణ్యమునకు వెళ్ళినవాడు ధీరుడు. స్వబుద్ధివలన గాని, పరోప దేశము వలన గాని సంసార లాలసమాని, ఆత్మవంతుడై హృదయమున శ్రీహరిని నిలుపుకొని సన్న్యసించిన వాడే ఉత్తముడు. వచ్చు కాలము మానవుని గుణ

ములనే బలవంతముగా పోషించును. కాన అన్నా! కుటుంబ బంధనము తెంపుకొనుము. ఉత్తరమునకు యాత్రచేయుము."

విదురుడు చేసిన ఉపదేశమువలన ధృతరాష్ట్రునకు మోక్షమార్గము గోచరించెను. అతడు నిద్రనుండి మేల్కాంచినట్లు చైతన్యము పొందెను. బంధనములను తెంపుకొని విదురుడు చూపిన మార్గముననుసరించి వెళ్ళెను. గాంధారి కూడ అతనిని అనుసరించెను. రణమున వీరులకు గాయములు సుఖమును కలిగించును. అట్లే హిమాలయము సన్యాసులకు సుఖము కలిగించును.

తెల్లవారి ధృతరాష్ట్రుని గానక ధర్మరాజు విలపించ సాగెను. ఎంత మందిని అడిగినను తండ్రి జాడ కానక అతడు మిక్కిలి దుఃఖించుచున్న సమయమున తుంబురసమేతుడై నారదు డచటికి విచ్చేసెను. ధర్మరాజు చేతులు జోడించి తన తండ్రులైన ధృతరాష్ట్ర విదురులను గురించియు తల్లియైన గాంధారిని గురించియు ప్రశ్నించెను. అందుకు నారదు డిట్లు ప్రత్యుత్తర మిచ్చెను.

> "ధర్మజా! విచారించకు. ఈ లోకములన్నియు పరమేశ్వరుని ఆజ్ఞ వలన ప్రవర్తిల్లు చున్నవి. ముకుతాళ్ళు కట్టి బండివాడు ఎడ్లచేత బరువులు లాగించినట్లు వేదవాక్యములను త్రాళ్ళు కట్టి మనుష్యులను నడిపించు చున్నాడు. మనుష్యులు తోలుబొమ్మలవలె వాని చేతిలో ఆడుచున్నారు. నీవు జగత్తును ఎట్లు చూచినను విచారింపుట వ్యర్థ మగును. ఆత్మకొరకు విచారించిన అది నిత్యమైనది. దేహము కొరకు విచారించిన అది అనిత్యమైనది. బ్రహ్మ స్వరూపమునకు గాను విచారించిన అది నిత్యానిత్యములకు అతీతమైనది. కాన ధర్మరాజా! విచారము విడువుము. నీవులేనిచో నీ తలిదండ్రులు బ్రదుక లేరని భావించుచున్నావు. అది నీ జడ భావము. ఈ భావము విడువుము.
>
> కాలము, కర్మ, గుణములతో కలిసి పంచ భౌతిక శరీరముండును. అవిద్య, కాలము, కర్మ వీటితో కలసి ప్రాణి దుఃఖము అనుభవించును. అజగరము మింగుచున్న మనుష్యుడు మరొక మనుష్యునకు సహాయము చేయలేనట్లు మనుష్యుడు ఇంకొక మనుష్యునకు సహాయము చేయలేడు. జీవితమును భగవంతుడే నిర్దేశించును. చేతులున్న ప్రాణి, చేతులులేని ప్రాణి, నాలుగు కాళ్ళ జంతువు వీరందరి జీవికయు వేర్పడి ఉన్నది. పశువులను మనిషి తిను చున్నాడు. పశువు చెట్లు చేమలను తినుచున్నది. ఈ విధముగా లోకమందు చిన్నప్రాణిని పెద్దప్రాణి తినుచు బ్రతుకు చున్నవి.

మీ తండ్రి ధృతరాష్ట్రుడు భార్య గాంధారితో హిమాలయపు దక్షిణ దిశన గం మునుల ఆశ్రమమున ఉన్నారు. వారి వెంట విదురుడు కూడ ఉన్నారు. అక్కడ

గంగానది పడుపాయలై సప్తస్రోత అన్నపేర ప్రవహించుచున్నది. ధృతరాష్ట్రుడు గంగానదిలో స్నానముచేసి విధి పూర్వకముగా అగ్నిహోత్రము నిర్వహించు చున్నాడు. అతని మనసులో ఏ కోరికలు లేవు. కేవలము జలమే ఆధారముగా శాంతచిత్తమున నున్నాడు. ప్రాణాయామము ద్వారా ఇంద్రియము.లను అదుపులో పెట్టుకొని సత్వరజస్తమోగుణములు మరికి వరిలించుకొన్నాడు. ఆత్మలో విజ్ఞానాత్మ సంయోగ మొనరించి జడదేహము నుండి ఆత్మ భిన్నమైనదని తెలుసుకున్నాడు. అనేక కడవలలో నీరు నింపి పెట్టినపుడు ఒకే ఆకాశము వివిధ రీతులుగా ప్రతిబింబించును. కడవలు పగిలి పోయిన కుండలలోని ఆకాశము మహాకాశమున కలిసిపోవును. అదే విధమున అన్నియు పరబ్రహ్మమున లీనమగునని గ్రహించినాడు. అతనిని మరలించి తీసుకొని వచ్చుటకు వెళ్ళిన అతని యోగసాధనను భంగపరచిన వాడవు అగుదువు.

ధర్మజా! నేటినుండి అయిదవరోజున అతడు శరీరమును త్యజించును. అగ్నిలో యోగాగ్ని సంయోగమై అతని నశ్వర దేహము భస్మమై పోవును. గాంధారి సహగమనముచేయును. విదురుడు ఇవన్నియు కన్నులార చూచి తీర్థయాత్రలకై వెడలిపోవును."

అట్లు ఉపదేశించి నారదుడు తుంబురునితోకూడ స్వర్గమునకేగెను.

అతని ఉపదేశమువిని ధర్మరాజు విచారము వదలెను.

శ్రీకృష్ణ నిర్యాణము

శ్రీకృష్ణుని క్షేమము తెలుసుకొనుటకుగాను అర్జునుడు ద్వారకకు వెళ్ళినాడు, పదుమానములైనను తిరిగిరాలేదు, హస్తినాపురమున ఘోరమైన అపశకునములు కాన్పించెను. ఋతువులు తారుమారయ్యెను. ప్రజలలో క్రోధము, లోభము, అసత్యము మితిమీరిపోయెను. జీవికకుగాను జనులు పాపములకే ఒడి గట్టిరి. సర్వత్ర కపటము నిండిపోయెను. స్నేహమందును మోసముకాన వచ్చెను. తండ్రి కొడుకులు, అన్నదమ్ములు, భార్యాభర్తలు, బంధువులు జగడములాడిరి, ప్రజలు నీచవృత్తి నవలంబించిరి.

"నక్క సూర్యునివైపు మోరఎత్తి అరచుచు నోటనిప్పులు కక్కుచున్నది. ఆవులుమున్నగునవి అప్రదక్షిణముగను, గాడిదలు మున్నగునవి ప్రదక్షిణముగను తిరుగుచున్నవి. గువ్వ, గ్రద్దగూబ, కాకి ఘోరముగా అరచుచున్నవి. దిక్కులు

పొగలు క్రమ్మినవి. తేపతేపకు భూకంపము వచ్చుచున్నది. కొండలు గడగడ లాడుచున్నవి. మబ్బులులేని పిడుగులు పడుచున్నవి. ఉరుములు ఉరుముచున్నవి. సుడిగాలిరేగి నలువైపుల చీకటి క్రమ్ముచున్నది. ఆకసము నెత్తుటి వానకురియు చున్నది. సూర్యకాంతి మాసి పోయినట్లు అయినది. గ్రహములు ఒకదానితోనొకటి గ్రుద్దులాడ సాగినవి భూమి ఆకసము మండిపోవు చున్నట్లున్నవి. నదీనదములు సరోవరములు అల్లకల్లోలములగుచున్నవి. నెయ్యి పోసినను నిప్పుమండుటలేదు. గోవులు కన్నీరు కార్చుచున్నవి. ఆబోతులు విచారముగా తిరుగుచున్నవి. దేవతాప్రతిమలు ఏడ్చుచున్నట్లున్నవి. పల్లెలు, పట్టణములు, జనపదములు ఆశ్రమములు సిరితొలగి వెలవెల బోవుచున్నవి. ఈ మహోత్పాతములు చూచిన ధ్వజవజ్రాంకుశ ముద్రితములైన కృష్ణభగవానుని శ్రీచరణములు ఈ భూమండలముమీద లోపించిపోవునేమో అనిపించుచున్నది." అని ధర్మరాజు భీమునితో అనెను.

అట్లు ధర్మరాజు భీమునితో చెప్పి వగచుచుండగనే ద్వారకనుండి అర్జునుడు తిరిగి వచ్చినాడు. అన్న పాదములమీదవ్రాలి నమస్కరించినాడు. అతనిలో పూర్వపు కళగాని కాంతిగానిలేదు. ముఖము వంచుకొని కన్నీరు కార్చుచు ఉద్విగ్నహృదయుడై ధర్మరాజుముందు నిలబడెను.

తమ్ముని దీనత్వము, దుఃఖము చూచినాడు ధర్మరాజు. అతడు సహితము కలవర పడినాడు. పేరుపేరున వరుస వరుసగ అందరి క్షేమము. ముఖ్యముగా శ్రీకృష్ణుని క్షేమము అడిగినాడు. తమ్ముని దీనత్వమునకు గల కారణమేమో అడిగినాడు.

కృష్ణవియోగ దుఃఖమున కుమిలిపోవుచున్నాడు అర్జునుడు. అతని నోరు ఎండి పోయినది. గుండె ఆరిపోయినది. ముఖము వాడిపోయినది. అన్నగారి ప్రశ్నలకు జవాబు చెప్పుటకు అతనికి ఎంతోసేపు పట్టినది. శ్రీకృష్ణుని తలచిన అతని గుండెలు బ్రద్దలుఅయినవి. మహాప్రవాహముగా వచ్చుచున్న దుఃఖమును అతి కష్టమున నిలుపుకొని,

> "మనసారథి- మనసచివుడు మనవియ్యము మనసఖుండు మనబాంధవుడున్
> మనవిభుడు గురుడు దేవర మనలను విడనాడి చనియె మనుజాధీశా"

అని చేతులతో కన్నీరు తుడుచుకొనుచు గద్గద స్వరమున నిట్లనె :-

"మత్స్య యంత్రము కూల్చి ద్రౌపదిని గెల్చుట అతని కరుణవలననే కదా! ఖాండవ దహన సమయమున ఎదురైన ఇంద్రుని ఓడించి గాండీవము సంపాదించుట

చరిత్రించుట వలననే కదా! మయసభా నిర్మాణము, సకల దిక్కుల రాజుల జయించి యజ్ఞముచేయుట అతని అండవలననే కదా! రాజసూయ మహాభిషేకమున పవిత్రమగు నీ యుజ్జ్వల ధమ్మిల్లమున్, సభలో శాత్రవులీడ్చినన్, ద్రౌపది కురులు ముడువకున్న ప్రతిజ్ఞచేసి, నీ శత్రువుల స్త్రీల వెండ్రుకలు హరించి వారిని సౌభాగ్య హీనలుగను విధవలుగను చేసినవాడాతడేగదా! శత్రువులు కట్టుబట్టలు విడుచుచుండగా వారింప, నావల్లభుల్ రారేవేళ నుపేక్ష సేయదగవే రావే నివారింపవే, శరే శ్రీతలు కృష్ణ యంచు సభలో మొర పెట్టిన ద్రౌపదికి బట్టలిచ్చిన వాడాతడు కదా! వనవాసమున నున్నప్పుడు మనము, పాంచాలి భోజనములు చేసిన తరువాత పదివేలమంది శిష్యులతో దూర్వాసుడేతెంచగా ద్రౌపది ప్రార్థనవిని ప్రత్యక్షమై, తపసి కోపముడిగించి పరిపూర్ణ కుక్షినిచేసె. అట్టి త్రైలోక్య సంతర్పి ఎందుగలడు?

శివుని ఓడించుట, పాశుపతము పొందుట, అమరావతికి వెళ్ళుట, దేవేంద్రుని అర్థాసనము పొందుట అతని దయవలననె కదా!

అతని ప్రభావమువలననే నా బాహులందు అంతులేని బలముండెడిది. దేవతలు సహితము నా బాహుబలము నాశ్రయించినారు. అట్టి శ్రీకృష్ణుడు మరిలేడు.

భీష్మద్రోణాది క్రూరజలచరములుగల కౌరవసేనా సముద్రమును అతని దయ వలననే ఈదినాను. దాటగలిగినాను. ఉత్తర గోగ్రహణమున విరాటరాజు గోవులను మరలించుట, శత్రువుల కిరీటములలోని మణులను రాల్చుట అతని ప్రభావమువలననే.

భీష్మద్రోణ, కర్ణ, శల్యులు మున్నగు మహావీరుల రథములతో నిండి యుండిన కౌరవసేనముందు నిలిపి చూపుతోనే వారందరి ఆయువులు హరించిన వాడతడు. వారి బాణములు శ్రీకృష్ణుని ప్రభావము వలననే నాకు తాకకుండెడివి.

చెలికాడ రమ్మని పిలుచు నొక్కవేళ మన్నించు నొకవేళ మఱదియనుచు
బంధుభావంబున భాటించు నొకవేళ దాతయై యొకవేళ ధనమునిచ్చు
మంత్రియై యొకవేళ మంత్రమాదేశించు బోధియై యొకవేళ బుద్ధిచెప్పు
సారథ్యమొనరించు దమవిచ్చి యొకవేళ క్రీడించు నొకవేళ కేళిచేయు

సౌఖ్య శయ్యాసనంబుల నుండు గన్న, తండ్రి కైవడిచేసిన తప్పుగాయు
హస్తములు పట్టి తొత్తుప నారగింప, మనుజ వల్లభ! మాధవు మఱువరాదు.

పజిపోరుచేయుండి కృష్ణుని భార్యల తెచ్చుచు దారిలో వారిని కాపాడలేక పోయినాను. సామాన్యులైన గొల్లలు నన్ను ఒక ఆడదానిని ఓడించినట్లు ఓడించినారు. ఆ అర్జునుడనే నేను, అదే ఈ గాండీవమే. ఈ బాణము లవే, రథము లవే, అశ్వము లవే. ధూర్త్యము వీటియందు రాజాధిరాజులు తలవంచువారు. నేడు కృష్ణుడు లేకుండుటచే చవిటి క్షేత్రములో విత్తినవారి విత్తులో అన్నియు నిష్ఫలమై పోయినవి.

నీ ప్రియబాంధవుల కుశల మడిగినావు. యాదవులెల్లరు బ్రాహ్మణ శాపమువలన కల్లుత్రాగి ఒకరినొకరు కొట్టుకొని చచ్చినారు. ఇప్పుడు యాదవకులమున ఏ నలుగురో అయిదుగురో తప్ప మిగులలేరు. దేశ కాలానుగుణ్యమైన, హృదయ శాంతికరమైన ఆ మహానుభావుని ఉపదేశములు తలపునకు తెచ్చుకొనుచున్నాను. ఇక నానోట మాట "వెడలుటలేదు" అనుచు శ్రీకృష్ణుని పాదపద్మములపై ధ్యానముంచి మౌనమువహించినాడు. భగవంతుని ధ్యానించుటవలన క్రమముగా అతని హృదయమునుండి శోకభావములు నశించి సంసారాసక్తి దూరమైనది. పూర్వపు గీతాతత్వము హృదయమున మేల్కొన్నది. అవిద్య నశించినది. బ్రహ్మజ్ఞానము ఉదయించినది. గుణములు నాశనమై శోకభావములు పటాపంచలైనవి.

ఇదంతయు విన్న ధర్మరాజు ప్రశాంత చిత్తమున మహాప్రస్థానము చేయుటకు నిర్ణయించినాడు.

కుంతీదేవి అర్జునునిద్వారా అంతయు విన్నది. భక్తిభావమున శ్రీకృష్ణునకు ఆత్మ సమర్పణ మొనరించి శరీరమువదలి మోక్షముపొందినది.

భూభారమును తగ్గించుటకొరకుగాను యదువంశమున అవతరించిన శ్రీకృష్ణుడు ముల్లుతో ముల్లునుతీసినట్లు యదువంశమును నాశనము చేసి అవతారము చాలించినాడు. శ్రీకృష్ణుడు అవతారము చాలించిననాడే భూలోకమున కలి ప్రవేశించినాడు.

తనరాజ్యమున దురాశా, ఇంటింటను అసత్యము, హింస, కపటత్వము ప్రవేశించి ధర్మహాని సంభవించుటను ధర్మరాజు గమనించినాడు. ఇదంతయు కలి అధిపత్య మని గమనించినాడు. మహాప్రస్థానముచేయుటకు సిద్ధపడినాడు.

చతుస్సముద్రముద్రితమైన సామ్రాజ్యమునకు పరీక్షిత్తును ప్రభువుగా పట్టము కట్టి శూ- సేనుని స్థానమున మధురలో అనిరుద్ధుని కొమారుడు వజ్రునకు పట్టము

కట్టి దైవీయజ్ఞము, ప్రాజాపత్యయజ్ఞము చేసినాడు. వస్త్రములు ఆభరణములు మున్నగునవి వదలినాడు. వానితోపాటు స్నేహము, దంభము, అహంకారమునే కాక సర్వబంధములను వదలినాడు, ఇంద్రియములను మనస్సులోను, మనస్సును ప్రాణమునందును, ప్రాణమును అపానమునందును, అపానమును మృత్యువు నందును, మృత్యువును పంచభూతములందును, పంచభూతములను గుణత్రయము నందును, గుణత్రయమును అవిద్యయందును, అవిద్యను జీవాత్మయందును, జీవాత్మను కూటస్థుడైన బ్రహ్మమునందును, లీనముచేసెను. ఆహారమును విసర్జించి, నారబట్టలు కట్టుకొని, తల విరియబోసుకొని పిచ్చివానివలెను పిశాచివలెను కనిపించినాడు. ఒక్కడే ఇల్లువిడిచి,. మనమున పరబ్రహ్మను ధ్యానించుచు మహా పురుషులు అవలంబించిన ఉత్తరమార్గమవలంబించి నడిచినాడు. అతని తమ్ములు సహితము శ్రీకృష్ణభగవానుని పాదపద్మములు మనమున నుంచుకొని ధర్మరాజును అనుసరించినారు.

> తస్మిన్నారాయణపదే ఏకాంతమతయో గతిమ్
> అవాపుర్దురవాపాం తే అసద్భిర్విషయాత్మభిః

> శ్రీవిష్ణు పాదపద్మములపై మనసు నిల్పి మహాప్రస్థానముచేసి పాండవులు సద్గతిని పొందినారు.

విదురుడు తీర్థయాత్రలు చేయుచు ప్రభాసతీర్థమునకుచేరి శ్రీకృష్ణుని చరణములను మనసునందు నిలిపి యమలోకమునకు వెళ్ళిపోయెను.

భర్తలు తనకొరకు నిరీక్షించక వెళ్ళిపోవుటను గమనించిన ద్రౌపది శ్రీకృష్ణుని పదకమలములను తలచుకొని పరమాత్మలో చేరిపోయెను.

పాండవుల మహాప్రస్థాన కథ పవిత్రమైనది. శాంతిదాయకమైనది. దానిని శ్రద్ధగను శాంతిచిత్తముతోను విన్నవారు హరిభక్తిచే సిద్ధిపొందుదురు.

కలి పురుషుడు.

మహా రాజయిన పరీక్షిత్తు ఇరావతిని పెళ్ళాడి ఆమెవలన జనమేజయుడు మున్నగు నలుగురు పుత్రుల కనెను. కృపాచార్యుడు, ఆచార్యుడుగా గంగ ఒడ్డున మూడు యజ్ఞములుచేసి కర్ణునివలె దాన ధర్మములు చేసెను. స్వయముగా దేవతలు ఆ యజ్ఞమునకు వచ్చినారు.

నల్లని అశ్వములు పూన్చి సింహ పతాకముగల రథము నెక్కి చతురంగ బలముతో పరీక్షిత్తు దిగ్విజయమునకు బయలుదేరెను. భద్రాశ్వము, కేతుమాల

ఉత్తరకురు భూములు, కింపురుష దేశములు జయించి వారివద్ద కప్పములు గొన్నాడు.

ఏ ప్రదేశమునకు వెళ్ళినను అతనికి శ్రీకృష్ణ మహిమలు కీర్తించువారే కనిపించిరి. ఏ ఊరికి వెళ్ళినను తన తాతలగు పాండవులపై శ్రీకృష్ణునకు గల ప్రేమ, అతడు వారికి చేసిన సహాయమును గురించి చెప్పుకొనుచుండిరి. శ్రీకృష్ణ భగవానుడు తన తాతలకొరకు సారథ్యము చేసినాడు. రాయబారియైనాడు. ప్రాణస్నేహితునిగా మసలినాడు. వీరాసనముపై కూర్చొని కావలి కాచినాడు. వారి వెంట తిరిగినాడు. వారికి వందనము చేసినాడు. వారికీర్తి చాటినాడు. లోకమంతయు వారి పాదములముందు లొంగునట్లు చేసినాడు.

అవన్నియు విన్నాడు పరీక్షిత్తు. అతనికి శ్రీకృష్ణునిపై అపారమగు భక్తి కలిగినది. అట్లుండగా ఒకనాడు ఒక వింత జరిగినది.

ధర్మదేవత ఆబోతు రూపము దాల్చి ఒంటికాలిపై తిరుగుచుండగా భూదేవత దూడ చనిపోయిన గోవు రూపున కన్నీరు కార్చుచు ధర్మదేవతకు సరస్వతీ నది ఒడ్డున ఎదురయ్యెను. వారిద్దరకు ఇట్లు సంభాషణ జరిగెను.

ధర్మదేవత :— నీమలిన రూపము, మాసిన కాంతిని చూచిన ఏదో మనోవేదనతో బాధపడు చున్నట్లున్నావు. దూరముగా వెళ్ళిపోయిన బంధువులకొరకు విలపించు చున్నావా తల్లీ !

తల్లీ ! నా మూడుకాళ్ళు విరిగిపోయినవి. నా అవస్థచూచి విచారించుచున్నావా ! ముందు ముందు క్రూరులైన రాజులు నిన్ను ఏలుదురనియు, దేవతలు యజ్ఞభాగములు పొందరనియు, అందువలన ఇంద్రుడు సకాలమున వర్షములు కురిపించడనియు, నీ బిడ్డలు కష్టములకు లోనగుదురనియు దుఃఖించుచున్నావా అమ్మా ! భర్తలు భార్యలను ప్రేమించరనియు, తలిదండ్రులు బిడ్డలను పాలించరనియు, బ్రాహ్మణులకు సరస్వతి ప్రత్యక్షము కాదనియు, వారు రాజుల అడుగులకు మడుగులొత్తుదురనియు విలపించుచున్నావా దేవీ ! కాల ప్రభావము వలన మోహాతురులై రాజులు రాజ్యములను పోగొట్టు కొందురనియు, ప్రజలు అన్నపానములందును, స్త్రీ సంయోగమునందును స్వేచ్ఛా చారులగుదురనియు విచారమా !

తల్లీ ! నీ భారము తగ్గించుటకు గాను అవతరించిన శ్రీకృష్ణ పరమాత్మ నీకు అధికమైన సుఖము కలిగించి వెళ్ళిపోయినాడని ఏడ్చుచున్నావా ? చెప్పుతల్లీ ఎందుకు ఏడ్చుచున్నావో ?

భూదేవి :— ధర్మదేవతా ! సకల గుణాన్వితుడు పురుషోత్తముడు అయిన శ్రీకృష్ణుడు లోకము విడిచిపోగనే లోకమంతయు కలికంట పడినదని దుఃఖించుచున్న దానను. నీకు, నాకు, దేవతలకు, ఋషులకు బ్రాహ్మణులకు, పితరులకు, సాధువులకు నాలుగు వర్ణాశ్రమములకు మున్ముందు ఏమగునో అని విలపించుచున్నాను.

అసురరాజుల అసంఖ్యాకమైన సేనాభారము నేను భరించలేకపోగా నా బరువు తగ్గించుటకే భగవంతుడు యదు వంశమున జన్మించినాడు. కృష్ణుని విరహము సహించగల అదరికలదా ? అతని ప్రేమదృక్కులు, మధురమైన నవ్వు, అమృతము ఒలుకు మాటలముందు సత్యభామవంటి అభిమానవతులు సహితము కరిగి అతని పాదములు ఆశ్రయించువారు. అతని పాదములు నా శరీరమునకు తాకినపుడు లేతదర్భల వెనమున పులకలెత్తెడిది. నేడు నాకా అదృష్టములేదు. నా దుఃఖమునకు అంతములేదు.

ఆ సమయమున అచటికి పరీక్షిత్తు వచ్చెను. అదేసమయమున రాజవేషధారియగు ఒక శూద్రుడు ఆవును, ఆబోతును కర్రతో కొట్టి కాళ్ళతో తన్నుచుండెను. మృణాళమువలె తెల్లగా ఉన్న ఆబోతు దెబ్బలు తినుచు మలమూత్రములు విసర్జించుచు ఒంటి కాలిపై నిలిచి వడకు చుండెను.

ధర్మమను పాలు చేపునట్టి గోమాత దెబ్బలు, తన్నులు తినుచు కడవల కొలది కన్నీరు కార్చుచు బలము ఉడిగి గడ్డిమేయుటకు గాను మోరచాపుచుండెను.

పరీక్షిత్తు ఆ దృశ్యమును చూచినాడు. ఉగ్రుడైనాడు. ధనుస్సున బాణము తొడిగి క్రోధముతో నిప్పులు కురిపించుచు ఇట్లనియె :—

“ఎవడవురా నీవు ? నా రాజ్యమున గర్వపోతువై దుర్బలులైన ప్రాణులమీద దౌర్జన్యము చేయుచున్నావు. రాజువలె వేషము వేసినావు. రూపమున శూద్రునివలె ఉన్నావు. కృష్ణార్జునులు లోకమున లేనందున నిరపరాధులను హింసించుచున్నావా ? అందుకు నీకు మృత్యువే తగినశిక్ష” అనెను.

పరీక్షిత్తును చూచి శూద్రరూపియైన కలి గడగడ వడకెను. అతడు రాజవేషము వదలి పరీక్షిత్తు పాదములవద్ద తలవంచినాడు.

పరీక్షిత్తు శరణాగతవత్సలుడు. ఎక్కుపెట్టిన శరము దించినాడు.

"నా తాత అర్జునుడు అనుసరించిన మార్గమునే అనుసరించుచున్నాను. కలిపురుషా! శరణుజొచ్చినావు. రక్షించుచున్నాను. కాని నీవు నా రాజ్యమున ఉండరాదు. నీవు ఉన్నచో అసత్యము, చౌర్యము, దౌర్జన్యము, స్వధర్మపరిత్యాగము, దారిద్ర్యము, కపటము, కలహము, దంభము నా రాజ్యమున చొరబడును. ఇది బ్రహ్మావర్తదేశము. ధర్మనిష్ఠతో ఉండవలెను. యజ్ఞములందు ఆరితేరిన యాజ్ఞికులు ఈ దేశమున యజ్ఞములు చేయుచున్నారు. యజ్ఞమూర్తి శ్రీకృష్ణభగవానుడు యజ్ఞమున పూజితుడై యాజ్ఞికులకు శుభము కలిగించుచున్నాడు.

అందుకు కలి, మహారాజా ! ధనుర్బాణములు, కత్తి పట్టుకొని నీవు సర్వత్ర సంచరించుచున్నావు. నీ ఆదేశమైనది. ఇక ఇచట ఉండను. కాని ఎచట ఉండవలెనో నీవే శలవిమ్ము'' అని ప్రార్థించినాడు.

అందుకు పరీక్షిత్తు ''జూదము, పానము, స్త్రీలు, హింస యను ఈ నాలుగింట ఉండుము'' అని కలిని ఆదేశించిన, అవి నాలుగు అనృత, మద, సంగమ, క్రౌర్యములకు స్థానములు కాన అన్నింటికిని నెలవుగా ఉండు మరొక స్థలమును నిర్దేశింపుమని కలి ప్రార్థించగా, అనృతము, కామము, రజోగుణము, వైరము ఈ నాలుగింటికి స్థానమగు సువర్ణమును పరీక్షిత్తు కలి నివాసమునకు అయిదవ దానిగా నియమించెను.

> పరీక్షిత్తు ఆజ్ఞను శిరసావహించి కలి అతడు నిర్దేశించిన స్థానములందు నివాసము ఏర్పరచుకొనెను. కావున శుభమును కోరునట్టి జ్ఞానులు ముఖ్యముగా ధర్మపరులైన పాలకులు వానికి దూరముగా ఉండవలెను.

సత్య యుగమున ధర్మదేవతకు తపస్సు, శౌచము, దయ, సత్యము అను నాలుగు పాదము లుండెడివి. విస్మయమువలన తపస్సు, విషయసంగమువలన శౌచము, గర్వమువలన దయ అను మూడు పాదములు విరిగిపోగా "సత్యము'' అను ఒంటి పాదముపై ఉన్న ధర్మదేవతకు మిగత మూడు పాదములను పరీక్షిత్తు కల్పించి ధర్మమును కాపాడినాడు.

భూదేవి భారము తగ్గించుటకు శ్రీకృష్ణుడుగా అవతరించిన భగవానుడు అవనీతలము మీద క్రీడించినాడు. అట్టి కృష్ణపరమాత్ముడు లేనందున హతభాగ్యురాలై ఏడ్చుచుండిన భూదేవతను ఓదార్చినాడు పరీక్షిత్తు.

పరీక్షిత్తు రాజసింహాసనము అధిష్టించినను మిక్కిలి ధర్మముగా రాజ్యము పాలించినాడు.

ముని శాపము-భాగవత శ్రవణము.

ఒకనాడు పరీక్షిత్తు వేటకొరకుగాను ఒంటరిగా ధనుర్బాణములు ధరించి అరణ్యమునకు వెళ్ళినాడు. వేటాడి వేటాడి అలసిపోయినాడు. అతనికి అపరిమితమైన దాహమైనది. చుట్టుప్రక్కల ఎక్కడను జలాశయము కనిపించలేదు. నీటికొరకు వెదకుచు శమీకముని ఆశ్రమమునకు చేరగా, ఇంద్రియ విషయములనుండి నివృత్తి పొంది బ్రహ్మపదమున లీనమైయున్న శమీకమహర్షి కనిపించినాడు. మనిషి కనిపించుటతో ప్రాణములేచి వచ్చినది మహారాజునకు. మంచినీళ్ళివ్వ వలసినదని మహర్షిని అడిగినాడు.

మహర్షి ధ్యానమున ఉన్నాడు. పలుకలేదు.

మహారాజు దాహముగొని ఉన్నాడు. నీటికై తిరిగి తిరిగి అలసి ఉన్నాడు. పలకరించిన మనిషి పలుకలేదు.

మహారాజునకు కోపమువచ్చినది. ఆ మహర్షి తపోగర్వమున తనను అవమానపరచు చున్నాడనుకున్నాడు. ఆకలితోను, దాహముతోను బాధపడుచు అవమానము పొందినానని తిరిగిపోయినాడు మహారాజు. త్రోవలో అతనికి చచ్చిపడియున్న ఒక పాముకనిపించినది. వింటికొనతో దానినితెచ్చి మహర్షి మెడలోవేసి వెళ్ళిపోయినాడు.

శమీకముని కుమారుడు శృంగి మహాతేజశ్శాలి. పరీక్షిత్తు ఆశ్రమమునకు వచ్చినపుడు అతడు మునిబాలకులతో అరణ్యమునకు వెళ్ళినాడు.

తండ్రిమెడలో మహారాజు పాము వేసిపోయినాడని అతనికి తెలిసినది. ఉగ్రుడైనాడు. "యజ్ఞములందు మునులు రాజులను ద్వారపాలకులుగా నియమింతురు. యజ్ఞమును రక్షించవలసినరాజు యజ్ఞభండారము మ్రింగచూచుట న్యాయమా? మహర్షులను సాధువులను రక్షించవలసినరాజు వారిని అవమానించునా? నేడు శ్రీకృష్ణుడులేడు. అందువలననే ఈరాజు మర్యాద తప్పినాడు. వీనికి తగినశాస్తి చేయవలెను. అని కౌశికనదిలో ఆచమనముచేసి 'వాగ్వజ్రం విసర్జహ.' (వాగ్వజ్రమును వదలినాడు.) శపించినాడు.



యోగ సమాధి యందున్న శమీకమహాముని మెడలో పరీక్షిత్తు
మరణించిన సర్పమును వేయుట. పుట.36

ఇతో లంఘితమర్యాదం తక్షక స్సప్తమేఽహని
దఙ్క్ష్యతిస్మ కులాంగారం చోదితో మే తతద్రుహం

'మర్యాదతప్పి నాతండ్రిని అవమాన పరచిన కులమునకు అంగారమువంటి పరీక్షిత్తును నేటికి ఏడవనాడు. నాచే పురికొల్పబడిన తక్షకుడు కరచుగాక !'

తరువాత ఆశ్రమమునకువచ్చి తండ్రి మెడలోఉన్న చచ్చినపామును చూచి ఏడ్వ సాగినాడు. కొడుకు ఏడ్పు మెల్ల మెల్లగా శమీకుని చెవిన పడినది. అతడు కళ్ళు తెరచి మెడలోని మృతసర్పమును తీసిపారవేసి కొడుకు ఏడ్పునకుగల కారణము అడిగినాడు.

శృంగి జరిగినదంతయు వివరించెను.

పరీక్షిత్తు శాపార్హుడైనను పుత్రుడు శపించుట నచ్చలేదు శమీకునకు. శమీకుడు పుత్రుని తిరస్కరించుచు, "పరీక్షిత్తు ధర్మదేవతవలె రాజ్యము పాలించు చున్నాడు. అతడు పరమ భాగవతుడు. రాజర్షి మూడు అశ్వమేధములు చేసినాడు. పొరపాటున చేసిన పనికి నీవిట్లు శపించుట తగదు.

తిరస్కృతా విప్రలబ్ధాః శప్తాః క్షిప్తా హతా అపి
నాస్య తత్ప్రతికుర్వంతి తద్భక్తాః ప్రభవోఽపి హి

తిరస్కరించినను, వంచించినను, శపించినను, దూషించినను శక్తిమంతులై నప్పటికి భగవద్భక్తులు ప్రతిక్రియ చేయరు.

అని పుత్రుడు చేసిన పాపమునకు ముని చింతిల్లినాడు. మహారాజు ప్రతి శాపము పెట్టిన బాగుండెడిది అనుకున్నాడు. కాని గుణాశ్రయుడైనవాడు సుఖము కలిగించిన సంతోషించడు. కష్టము కలిగించిన దుఃఖించడు కదా! అనుకున్నాడు. పరీక్షిత్తు ఇంటికి చేరుకున్నాడు. తాను చేసిన పనికి మిక్కిలి విచారించినాడు. అనార్యునివలె ఏ పాపము ఎరుగని ఋషిని అవమానించినాను. తర్వలోనే నాపై ఏదో ఆపద విరుచుకొని పడనున్నది. మునుల మీదను గోమాత మీదను ఇట్టి పాపబుద్ధి కలుగకుండుటకుగాను నాకు తగినశాస్తి జరుగవలెను. నా రాజ్యము, సైన్యము, సుఖము అన్నియు నశించవలెను అని విచారించు చుండగనే శమీకుడు పంపిన శిష్యుడు వచ్చి శృంగి శాపమును గురించి తెలియపరచెను.

ఇంతకాలముగా విషయభోగము అనుభవించిన తాను తక్షక విషాగ్నికి అర్హుడనే అనుకున్నాడు పరీక్షిత్తు. ఇహ పరములచింత తుచ్ఛమని నిశ్చయించి సర్వము

త్యజించి గంగానదీ తీరమునకు వెళ్ళి ప్రాయోపవేశము ప్రారంభించినాడు. విషయాసక్తి వదలి ముని వ్రతము అవలంబించినాడు. ఏకాగ్రచిత్తమున శ్రీ కృష్ణుని పాదపద్మములను ధ్యానించినాడు.

పరీక్షిత్తు ప్రాయోపవేశ వృత్తాంతము తెలిసి అత్రి, వశిష్ఠుడు, చ్యవనుడు, నారదుడు, అగస్త్యుడు, అరుణుడు మొదలగు అనేకమంది ఋషులు, మహర్షులు, రాజర్షులు అక్కడికి వచ్చినారు.

అక్కడచేరిన పెద్దలందరకు నమస్కరించి పరీక్షిత్తు "సత్యలోకవాసులు, సాక్షాత్తు దేవస్వరూపులైన మీరు నాపై దయతలచి నలువైపుల నుండి విచ్చేసినారు. స్వార్థములేక పరోపకారము చేయుటే తమ సంకల్పము. తమను ఒకటి అడుగుచున్నాను. తెలపీయుడు. మనిషి ఎప్పుడు ఏమి చేయవలెను? విశేషించి మృత్యుసమయమున విశుద్ధ చిత్తమున అతడు చేయవలసినదేమి?" అని అడిగినాడు.

పరీక్షిత్తు అట్లు ప్రశ్నించగా ఋషులలో ఆలోచన ప్రారంభమైనది. సరిగా అదే సమయమునకు వ్యాసుని కుమారుడు శ్రీశుకుడు భూలోక సంచారము చేయుచు అచటికి వచ్చెను. అతడు పదహారు సంవత్సరములవాడు, దిగంబరి, అయినను అతని ముఖమున గల తేజస్సునుచూచి మునులందరు అతనిని గుర్తించినారు. తమ ఆసనములనుండి లేచి గౌరవించినారు. పరీక్షిత్తు పాదాభివందనము చేసినాడు. పరీక్షిత్తు పూజలందుకొని ఉత్తమాసనమున శ్రీశుకుడు ఆసీనుడు అయినాడు.

అప్పుడు పరీక్షిత్తు పదేపదే నమస్కరించి, అంజలిఘటించి, సవినయముగా ఇట్లనెను:- "దేవా! నిన్ను పూజించ గలిగినందుకు నా జన్మము కృతార్థమైనది. నీవు ఇచటికి విచ్చేసి నన్ను పవిత్రుని చేసినావు. నిన్ను స్మరించినంతనే గృహస్థుల గృహస్థాశ్రమములు పవిత్రమగును. నీ దర్శనము, స్పర్శనము వలన సకలపాపములు నశించును. విష్ణువు ప్రతాపమున రాక్షసులు నాశనమైనట్లు నీ దర్శనమున నా సకల పాపములు నశించినవి. భగవంతుని అనుగ్రహము వలననే నా కోర్కె తీర్చుటకు విచ్చేసినావు. నా కోర్కె తీరవలసిన ప్రశ్న అడుగు సదవకాశము లభించినది. యోగులకు పరమ గురువు అయిన నిన్ను అడుగుచున్నాను.

నరుడు మరణించుటకు సిద్ధముగా ఉన్నప్పుడు ఏమిచేయవలెను? ఏది వినవలెను? ఏది జపించవలెను? ఏది ఆచరించవలెను? ఏది స్మరించవలెను? ఏది భజించవలెను? అదినాకు ఉపదేశించుము.



మరణాసన్నుడైన మనుజుడు చేయదగిన కృత్యమద్దియన, శ్రీశుకుడు
పరీక్షిత్తునకు భాగవతమును వినిపించుట. పుట. 41

నీ దర్శనమే దుర్లభము. ఆవుపాలు పితుకుటకు ఎంత సమయము పట్టునో అంత సమయము మాత్రము నీవు గృహస్థుల ఇంట నిల్చెదవు. నా అదృష్టమున నీవు ఇచటికి విచ్చేసినావు. నన్ను అనుగ్రహించుము."

పరీక్షిత్తు అడిగిన ప్రశ్నకు శ్రీశుకుడు సమాధానము చెప్పినాడు.

శ్రీశుకుడు తండ్రివద్ద నేర్చుకున్న భాగవత సంహిత పరీక్షిత్తునకు వినిపించినాడు.

అచట కూడిన ఋషులలో "సూతుడు" అను ఋషి కూడ ఉండెను. అతడు శ్రీశుకుడు వినిపించిన భాగవతమును సాకల్యముగా గ్రహించినాడు.

నైమిశారణ్యమున ఒకసారి ఋషులెల్లరు వేయి సంవత్సరముల మహా యజ్ఞమును తలపెట్టిరి. అచటికి సూతుడు వచ్చెను. అచట చేరిన ఋషులందరు సూతుని పూజించి, శ్రీకృష్ణ భగవానుని కథలు వినిపించవలసినదని కోరిరి. అట్లు కోరిన వారిలో "శౌనకుడు" ప్రధానుడు.

సూతుడు శౌనకాది మహర్షులకు భాగవతము వినిపించెను.

మనము ఇప్పుడు చదువునది సూతుడు శ్రీశుకునినుండి గ్రహించి శౌనకాది మునులకు నైమిశారణ్యమున వినిపించిన శ్రీమద్భాగవత సంహిత.

ఇది ప్రథమస్కంధము

శ్రీమద్భాగవతము

ద్వితీయ స్కంధము

వరీయానేషతే ప్రశ్నః కృతో లోకహితో నృప
ఆత్మవిత్సంమతః పుంసాం శ్రోతవ్యాదిషు యః పరః

"రాజేంద్రా! నీవు అడిగిన అర్థము లోకహితమును, బ్రహ్మవిదులకు సమ్మతమును అయినది. వినదగిన వానిలో ఉత్తమమైనది."

అని శుకయోగీంద్రుడు చెప్పసాగెను :-

పూర్వము ఖట్వాంగుడను ఋషి ఉండెను. దేవాసుర సమరమున అతడు దేవతలకు తోడ్పడి, వారు రాక్షసులను గెలుచునట్లు చేసెను. దేవతలు అతని యెడల ప్రీతులై అతని ఆయుశ్శేషము ఒక్క ముహూర్త మాత్రమని తెలియపరచిరి. అపుడు అతడు సకల సంగములను త్యజించి శ్రీహరి శరణుజొచ్చి ముక్తినందెను.

పరీక్షిత్తునకు ఏడురోజులు ఆయుర్దాయము కలదు. సదాలోచనముచేసి, సన్మార్గమును అవలంబించువారికి మోక్షము శీఘ్రముగ లభించును. కాని మనుష్యులు సంసార సాగరమునపడి కొట్టుకొనుచు ఆత్మతత్త్వమును గురించి విచారించరు. వారి ఆయువు పగలు ధనచింతతోను, కుటుంబ పోషణమందును, రాత్రులు రతిక్రీడలందును గడచిపోవును. తమ తండ్రి తాతల విషయము కన్నులార చూచియు భార్యాపుత్రులు, కడకు ఈ శరీరము అశాశ్వతమైనదని తెలుసుకొనరు. దేహధారణమునకు ఇతర సాధనసంపత్తియున్నను శ్రమించుట మానరు.

కమనీయ భూమి భాగములు లేకున్నవే పడియుండుటకు దూదిపరుపు లేల?
సహజంబులై కరాంజలులు లేకున్నవే భోజన భాజన పుంజ మేల?
వల్కలాజిన కుశావళులు లేకున్నవే కట్టదుకూల సంఘంబు లేల?
గొనకొని వసియింప గుహలు లేకున్నవే ప్రాసాద సౌధాది పటల మేల

ఫలరసాదులు గురియవే పాదపములు స్వాదు జలములు నీయవే సకల నదులు
పొసగ భిక్షలు పెట్టరే పుణ్యసతులు ధనమదాంధుల కొలువేల తాపసులకు.

పండితుడైనవాడు విషయవాసనలను త్యజించి, ఇంద్రియములను జయించి బుద్ధిబలమున భగవంతుని విశాలరూపమును మనసున లగ్నము చేయవలెను.

పరబ్రహ్మము స్థూలతముడు. సూక్ష్మతముడు. భూతభవిష్యద్వర్తమానములు ఆతని శరీరమందే కలవు. ఆ విరాట్శరీరము భూమి, నీరు, తేజస్సు, గాలి, ఆకాశము, అహంకారము, మహత్తు అను ఏడు ఆవరణలతో కప్పబడియుండును.

ఆ విరాట్పురుషుని పాదమూలము పాతాళము. మునుగాళ్ళు రసాతలము. చీలమండలు మహాతలము. పిక్కలు తలాతలము. మోకాళ్ళు సుతలము. తొడలు అతలము వితలము. నాభి ఆకాశము. వక్షస్థలము నక్షత్ర మండలము. కంఠము మహర్లోకము. ముఖము జనోలోకము. లలాటము తపోలోకము. వేయి శిరస్సులు సత్యలోకము. బాహువులు ఇంద్రుడు మున్నగు దేవతలు. చెవులు దిక్కులు. శ్రోత్రేంద్రియము శబ్దము. ముక్కుపుటములు అశ్వినీ దేవతలు. గంధము ఘ్రాణేంద్రియము. నోరు అగ్నిహోత్రుడు. కనుపాపలు అంతరిక్షము. కనులు సూర్యుడు. అహోరాత్రములు కనురెప్పలు. బ్రహ్మపదము కనుబొమల విజృంభణము. దవడ నీరు. నాలుక రసములు. బ్రహ్మరంధ్రము వేదములు. కోరలు యముడు. పుత్రాది స్నేహపాశములు దంతములు. మాయనవ్వు జగన్మోహనాకారి. సంసారము కటాక్ష దృష్టి. మీది పెదవి లజ్జ. క్రింది పెదవి లోభము. స్తనములు ధర్మము. పృష్ఠము అదృష్టము. మేఢ్రము ప్రజాపతులు. వృషణములు సూర్యచంద్రులు. కడుపు సముద్రము. ఎముకలు కొండలు. నాడులు నదులు. రోమములు చెట్లు. ఊపిరి వాయువు. గమనము కాలము. క్రీడ జీవకోటి. కొప్పు మేఘములు. బట్టలు ప్రకృతి. హృదయము వికృతి. మనస్సు చంద్రుడు. విజ్ఞానశక్తి మహత్తు. అహంకారము రుద్రుడు. గోళ్ళు గుఱ్ఱములు, ఏనుగులు, ఒంటెలు. కటిప్రదేశము మృగములు. బుద్ధి స్వాయంభువ మనువు. నివాసము పురుషుడు. స్వరము గంధర్వులు, విద్యాధరులు, చారణులు, అప్సరసలు. వీర్యము అసురులు. ముఖము బ్రాహ్మణులు, బాహువులు క్షత్రియులు. తొడలు వైశ్యులు. పాదములు శూద్రులు. వసువులు, రుద్రులు మున్నగు దేవతలు యజ్ఞక్రియా కలాపములు.

ఇది భగవంతుని స్థూల స్వరూపము. భగవంతుడు వినా మిగిలిన దంతయు మిథ్య. ఈ స్థూలరూపముపై మనసు లగ్నముచేసి ఆ పరమ పురుషుని ధ్యానము చేయవలెను.

దీనిని ధారణ అందురు.

కొందరు నిజశరీరపు హృదయాకాశమున ఉన్నట్టి పరమ పురుషుని ధ్యానింతురు. కొందరు శంఖ, చక్ర, గదా, పద్మములుగల నాలుగు చేతులుగలిగి, పద్మపత్రమువంటి కన్నులు గలిగి, పీతాంబరము ధరించి, రత్నఖచితమైన కిరీటము గలిగి, చెవులకు రత్నకుండలములుగలిగి, మెడలో కౌస్తుభమణిగల సుందరాకారుని పాదపద్మములే మనసునందు నిలుపుకొని ధ్యానించుచుందురు.

ధారణ నిలిచినంతసేపు ఆ దివ్యమూర్తిని ధ్యానము చేయవలెను. పాదములు మొదలు ముఖము వరకు ప్రతి అంగమును ధ్యానించవలెను. అతనిమీదనే బుద్ధి నిలిపి ఆత్మను నిశ్చలమును, పవిత్రమును చేసికొనవలెను.

యోగి ఈ లోకమును వదలదలచినపుడు దేశ కాలముల మీదికి మనసు పోనివ్వరాదు. స్థిరముగా సుఖాసీనుడై ప్రాణాయామమున వాయువును నిరోధించి ఇంద్రియములను గెలువవలెను. తరువాత మనసు నిలకడ చేసుకొని బుద్ధిని క్షేత్రజ్ఞునిలో చేర్చవలెను. క్షేత్రజ్ఞుని అంతరాత్మలో లీనము చేయవలెను. అంతరాత్మను పరమాత్మలో కలిపి శాంతిమయావస్థలో స్థిరుడు కావలెను. అప్పుడిక అతను చేయవలసినదేదియు లేదు. ఆత్మతో ఏకీభూతమైన ఆ అవస్థలో రజస్తమోగుణములు మాత్రమేకాక సత్వగుణము సహితము ఉండదు. అహంకారము, మహత్తత్వము, ప్రకృతి ఏవియును తలెత్తవు. ఆ స్థితిలో దేవతలేకాక వారి ప్రభువైన కాలము సహితము తన ప్రభావము కనబరచలేదు.

ఇది ధారణమున సద్యోముక్తి మార్గము.

క్రమముక్తి.

విశ్వమెల్ల బ్రహ్మమయమని భావించగలవానికి విజ్ఞానబలమువలన విషయవాసనలు అంటవు. అపుడు తన కాలిమడమతో గుహ్యప్రదేశమును నిరోధించి, తడబడకుండునట్లు ప్రాణవాయువును నాభి మొదలగు ఆరు ఉచ్చస్థానములకు తీసుకొనిపోవలెను. మొదట నాభిప్రదేశమందలి మణిపూర చక్రమునుండి ప్రాణవాయువును హృదయమందలి అనాహత చక్రమున ప్రవేశపెట్టవలెను. తరువాత ఉదానవాయుగతి నిశ్చయించి కంఠ ప్రదేశమందలి విశుద్ధచక్రమున ప్రవేశపెట్టవలెను. తరువాత జితేంద్రియుడై మెల్లమెల్లగా తాలువునకు తాడించవలెను. చివరకు కన్నులు, చెవులు, ముక్కుపుటములు, నోరు అను సప్త ద్వారములను బంధించి తాలువులోని వాయువు కనుబొమల మధ్యగల ఆజ్ఞాచక్రమున ప్రవేశపెట్టవలెను. అర్ధముహూర్త సమయము అచట ఉంచి, ప్రాణమును పరబ్రహ్మమున

లీనముచేయుటకు బ్రహ్మరంధ్రమున ప్రవేశపెట్టవలెను. ఉత్తర క్షణమున ప్రాణము బ్రహ్మరంధ్రమును భేదించుకొని దేహమును వదలిపోవును.

యోగికి బ్రహ్మపదము చేరవలెనని కోరిక ఉన్నచో, లేదా అణిమాది అష్టసిద్ధులు పొంది, ఆకసమున విహరించు సిద్ధులతో ఉండవలెనను కోరికయున్నచో, లేదా బ్రహ్మాండాధిపత్యము పొందవలెనని కాంక్షఉన్నచో మనసు, ఇంద్రియములు వదలక శరీరము మాత్రమే వదలవలెను.

ఉపాసన, తపస్సు, యోగము, జ్ఞానము గల యోగులు ప్రాణవాయువులోని సూక్ష్మశరీరమున ముల్లోకములందును బయటను విహరించగలరు. కర్మచేయు వారు అట్లు విహరించలేరు.

బ్రహ్మలోకము చేరదలచిన కర్మయోగి, జ్యోతిర్మార్గము నుండి సుషుమ్న మార్గమున వెళ్ళి ఆకాశమార్గమున మొదట అతడు అగ్నిలోకము చేరును. అచటినుండి ఊర్ధ్వముగా వెళ్ళి శింశుమార చక్రమునుచేరి అచటినుండి నిర్మలమైన లింగశరీరమున మహర్లోకము చేరును. అచటినుండి బ్రహ్మలోకము చేరును. బ్రహ్మలోక మారోహించిన యోగి విష్ణుపదము నారోహించును. లింగశరీరమున అతడు పృథ్వీరూపము దాల్చును. పృథ్వినుండి జలరూపము, జలరూపమునుండి జ్యోతిర్మయరూపము, జ్యోతిర్మయరూపమునుండి వాయు రూపమునంది, అనంతమైన ఆకాశరూపము పొందును. ముక్కుతో గంధము, నాలుకతో రసము, కన్నులతో రూపము, చర్మమున స్పర్శ, చెవులతో శబ్దము, కర్మేంద్రియమున క్రియారూపము పొంది సూక్ష్మ, స్థూల భూతములకు మించి పై పైకి పయనించును. తరువాత సూక్ష్మ, స్థూల భూతములకు ఇంద్రియములకు లయస్థానమైన, మనోమయమైన, దేవమయమైన అహంకార తత్త్వమున ప్రవేశించి గుణములకు లయస్థానమైన ప్రకృతిలోచేరును. ప్రకృతిలో ప్రవేశించి, ఆనందమయుడైన యోగియొక్క ఉపాధిజ్ఞానము నశించి, పరమానందమయమైన ఆత్మను పొందును.

అట్లు సర్వోత్తమగతిని పొందినయోగి ఈ లోకమునకు మరి తిరిగిరాడు.

కామ్యము - ఉపాసనలు.

జ్ఞానియైనవాడు, మరణము ఆసన్నమైనపుడు భగవత్కథలు వినవలెను. కొందరు జనులు వాంఛాసిద్ధికై ప్రత్యేకమైన దేవతను, దేవతలను ఉపాసింతురు. ఒక్కొక్క కోర్కె సిద్ధించుటకు ప్రత్యేకమైన దేవతను ఉపాసించవలెను.

బ్రహ్మవర్చస్సునకు	బ్రహ్మదేవుని
ఇంద్రియ పటుత్వమునకు	ఇంద్రుని
పుత్రసంతానమునకు	దక్షుడు మున్నగు ప్రజాపతులను
సౌభాగ్యమునకు	దుర్గాదేవిని
వీర్యమునకు	అగ్నిదేవుని
వైభవమునకు	వసువులను
అన్నమునకు	అదితిని
స్వర్గమునకు	ఆదిత్యులను
రాజ్యమునకు	మనువులను, విశ్వేదేవులను
ప్రజలను స్వాధీనమందుంచుకొనుటకు	సాధ్యులను
ఆయుర్దాయమునకు	అశ్వినీ దేవతలను
పుష్టికి	భూదేవిని
ప్రతిష్ఠకు	రోదసిని
సౌందర్యమునకు	గంధర్వులను
స్త్రీలకు	ఊర్వశి మున్నగు అప్సరసలను
ప్రభుత్వమునకు	విధాతను
యశస్సుకు	యజ్ఞేశ్వరుని
రత్నములకు	వరుణదేవుని
విద్యకు	శివుని
దాంపత్య ప్రేమకు	పార్వతిని
ధర్మమునకు	నారాయణమూర్తిని
సంతానమునకు	పితృదేవతలను
అవిఘ్నమునకు	యక్షులను
బలమునకు	వాయువును
శత్రునాశనమునకు	రాక్షసులను
భోగమునకు	చంద్రుని
ఏ కోరిక లేనివారు	పరమపురుషుని ఉపాసింపవలెను.

ఏ కోరికలు లేనివారైనను, అన్ని కోరికలు కలవారైనను, మోక్షము కావలసిన వారైనను, ఉదార బుద్ధితోడను ప్రగాఢమగు భక్తితోడను పరమ పురుషునైన

విష్ణుదేవుని ఆరాధించవలెను. సాధువుల సాంగత్యము చేసి భగవంతునిపై స్థిరమైన భక్తి ఏర్పరచుకొన్న వారికి పరమ పురుషార్థము లభించినపుడు తక్కినవి తుచ్ఛముగనిపించును.

శ్రీకృష్ణుని కథలు వినుటవలన కలుగు జ్ఞానమువలన సత్వరజస్తమో గుణములు నశించును. ఆత్మ ప్రసన్నమై విషయవాసనలపై విరక్తి కలుగును. అదే ముక్తిప్రదమైన భక్తిమార్గము. ఇతర కథలు విని తృప్తిపడని వ్యక్తి కృష్ణకథలు విని తృప్తిపడును.

నారాయణుని దివ్యనామాక్షరములపైఁ గరఁగని మనములు శిలలు
మురవైరి కథలకు ముదితాత్మ రోమాంచ మిళితమై యుండని మేను మొద్దు
చక్రికి మ్రొక్కని జడుని యౌదలనున్న కనక కిరీటంబు గట్టెమోపు
మాధవార్పితముగా మనని మానవు సిరి మసలుద్గ చంద్రికా మైలసంబు
కైటభారి భజన గలిగియుండనివారు గాలిలోనుండి కదలు శవము
కమలనాభు పదము గననివాని బ్రతుకు పసిఁడికాయలోని ప్రాణిబ్రతుకు.

అవతారములు.

సఏష ఆద్యః పురుషః కల్పే కల్పే సృజత్యజః
ఆత్మన్యేవాత్మనాత్మానం సంయచ్ఛతి చ పాతి చ

భగవంతుడు ఆదిపురుషుడు, జన్మాది రహితుడు అయ్యును, ప్రతి కల్పమునందును తనను తానే సృష్టించుకొని పోషించుకొని సంహరించు కొనును.

అతడు పరిశుద్ధుడు. జ్ఞానమయుడు. సర్వాంతర్యామి. సత్యమూర్తి. పరిపూర్ణుడు. ఆద్యంత రహితుడు. నిర్గుణుడు. నిత్యుడు. అద్వితీయుడు.

అట్టి భగవంతుడు అనేకమైన అవతారములను ఎత్తెను.

1. యజ్ఞవరాహమూర్తి	హిరణ్యాక్షుని సంహరించి నీటిలో మునిగి ఉండిన భూదేవిని ఉద్ధరించెను.
2. ఆకూతి గర్భమున సుయజ్ఞుడుగా అవతరించెను.	దక్షిణ గర్భమున సుయముడు మున్నగు దేవతలను కని ముల్లోకముల బాధల హరించి హరి యయ్యెను.
3. కర్దమ ప్రజాపతికి దేవహూతి యందు కపిలుడుగా జన్మించెను.	తల్లికి బ్రహ్మవిద్య ఉపదేశించి మోక్షము ప్రసాదించెను.

4. అత్రిముని కోరికపై దత్తాత్రేయుడయ్యెను.	సహస్రార్జునుడు మున్నగువారికి మోక్షము ప్రసాదించెను.
5. సనక, సనందన, సనాతన సనత్కుమారులు.	ఒకటి కల్పమున ఆత్మజ్ఞానము మరచిన వారిని ప్రబోధించి వారు ఆత్మసాక్షాత్కారము పొందునట్లు చేసెను.
6. మూర్తిదేవి గర్భమున నర, నారాయణులుగా జన్మించెను.	వారి తపస్సును భగ్నముచేయుటకు వచ్చిన మన్మథుడు, అప్సరసలు, ఊర్వశి వంటి అప్సరసలు నరనారాయణుల దేహమున పుట్టుచుండుట చూచి నివ్వెరపోయి వారిని చలింపచేయలేకపోయిరి.
7. ఉత్తానపాదుని కుమారుడు ధ్రువుడుగా అవతరించెను.	బాల్యమున అరణ్యమునకు వెళ్ళి తపస్సు చేసి ధ్రువపదవి పొందెను.
8. వేన రాజు శరీరమునందు పృథువుగా ఆవిర్భవించెను.	భూమిని ఆవుగా చేసి, దాని పొదుగు నుండి ఓషధులను పితికెను.
9. సుదేవిగర్భమున పుష్కరుడై అవతరించెను.	జితేంద్రియుడై, జడయోగాచార్యుడు అయ్యెను.
10. హయగ్రీవము	ఊపిరినుండి వేదవాక్కులు పుట్టెను.
11. మత్స్యావతారము	వేదములను రక్షించెను.
12. కూర్మావతారము	దేవదానవులు, అమృతమునకైసముద్రము మథించునపుడు వీపుపై మందరపర్వతమును వహించెను.
13. నరసింహావతారము	హిరణ్యకశిపుని సంహరించెను.
14. నారాయణుడు	గజేంద్రుని మకరి బారినుండి రక్షించెను.
15. వామనావతారము	బలిచక్రవర్తిని పాతాళమున అణచెను.
16. హంసావతారము	నారదునకు భాగవతజ్ఞానము ఉపదేశించెను.
17. మనువు	చక్రధారియై దుర్మార్గులైన రాజులను సంహరించెను.
18. ధన్వంతరి	ఆయుర్వేదమును ప్రచారము చేసెను.

19. పరశురామావతారము	క్షత్రియులు వేదమార్గము తప్పినపుడు ఇరువదియొక్కసారి భూమండలమంతయు తిరిగి క్షత్రియులను సంహరించెను.
20. రామావతారము	రావణుని సంహరించెను.
21. శ్రీకృష్ణావతారము	భూదేవి భారమును తగ్గించెను.
22. బుద్ధావతారము	ధర్మబోధ చేసెను.
23. కల్కిఅవతారము	ధర్మమును స్థాపించును.

మునులు బ్రహ్మమని భావించునదే భగవంతుడు. బ్రహ్మము ప్రశాంతముగను, సుఖమయముగను, శోకరహితముగను ఉండును. అది నిర్మల జ్ఞానస్వరూపము. ఇంద్రియములతో దానికి సంబంధము లేదు. అది మాటలచే వ్యక్తపరచలేనిది. ఆద్యంత రహితము.

బావి త్రవ్వుటకు గుద్దలి పట్టుకున్నవానికి వర్షాధి దేవతయైన ఇంద్రుడు ప్రత్యక్షమైన అతడు గుద్దలి పారవేయును. అట్లే భగవంతుని దృఢముగా హృదయమున ధారణ చేసుకున్న యోగులు జ్ఞానసాధన లన్నియు విస్మరింతురు.

మనిషిచేయు కర్మలన్నింటికి భగవంతుడే ప్రేరకుడు అయినందున కర్మలన్నింటికి ఫలము అతడే ప్రసాదించును.

ఈ శరీరమందలి పంచభూతములు విడివిడిగా విడిపోవుటతో శరీరము మాత్రము నశించును. అందున్న అజుడైన పురుషుడు నశించడు.

దశలక్షణములు

1. సర్గము, 2. విసర్గము, 3. స్థానము, 4. పోషణము, 5. ఊతి, 6. మన్వంతరములు, 7. ఈశాను కథలు, 8. నిరోధము, 9. ముక్తి, 10. ఆశ్రయము.

* ఇవి పది విషయములు.

భగవంతుని ప్రేరణవలన గుణము లందు పరిణామము కలిగి ఆకాశము మున్నగు పంచభూతములు, శబ్దము మున్నగు తన్మాత్రలు, ఇంద్రియములు, అహంకారము, మహత్తత్వము మొదలైనవి పుట్టును. వీనిని "సర్గము" అందురు.

బ్రహ్మచే జరుపబడిన చరాచర సృష్టిని "విసర్గము" అందురు.



అత్రిముని కోరికపై త్రిమూర్తులు ముగ్గురు దత్తాత్రేయుడుగా యవతరించుట.

పుట. 48



శ్రీ హరి హయగ్రీవరూపము దాల్చుట. పుట. 48



శ్రీ హరి నారదునకు హంసరూపమున భగవదవతార విశేషములను దెలుపుట

పుట. 48



బుద్ధభగవానుడు.

పుట. 49

సృష్టించిన జీవకోటియొక్క మర్యాదను రక్షించుటయే భగవంతుని ఉత్కర్ష. ఇది "స్థానము".

భక్తులమీద భగవంతుని కరుణ "పోషణ".

జీవులను కర్మబంధమున పడద్రోయు వాసనలు "ఊతి".

భగవంతుని అవతార కథలు, అతని భక్తుల ఉపాఖ్యానములు "ఈశాను కథలు".

భగవంతుడు యోగనిద్రలో ఉన్నపుడు జీవుడు అతనిలో లయమగుట "నిరోధము".

అజ్ఞానమువలన కలిగిన అనాత్మభావన వదిలి సత్యస్వరూపుడైన భగవంతునిలో లీనమగుట "ముక్తి".

ఈ చరాచర ప్రకృతి ఉత్పత్తికి, వినాశనమునకు కారణభూతమైన పరబ్రహ్మము "ఆశ్రయము".

ఆశ్రయము మూడు విధములు. 1. ఆధ్యాత్మికము, 2. ఆధిదైవికము, 3. ఆధిభౌతికము.

కన్నులు మొదలగు ఇంద్రియములద్వారా ద్రష్ట అయిన జీవుడు ఆధ్యాత్మికము.

అట్టి ఇంద్రియములకు అధిష్ఠాత ఆధిదైవికము.

దేహము ఆధిభౌతికము. శరీరము జీవులకు ఉపాధి కావున "పురుషుడు" అనిపించుకొనును.

ఈ మూడింటిలో ఒకటి లేనపుడు మిగిలిన రెండు ఉపలబ్ధి కానేరవు. ఈ మూడింటికి సాక్షి ఆ పరమాత్ముడే. అతడే ఆశ్రయము. అతనికి ఆశ్రయము మరెవరు లేరు.

విరాట్పురుషుడు బ్రహ్మాండమును భేదించి వెలువడెను. తాను నివసించుటకు పవిత్రమగు జలము సృష్టించెను. అతడు వేనకు వేల సంవత్సరములు నీటిలో వసించెను. భగవంతుడైన నరునిచేత సృష్టింపబడినది కాన నీటికి "నారము" అని పేరు. నారము అవలంబనము (అయనము)గా గలవాడు కాన భగవంతునకు "నారాయణుడు" అని పేరు వచ్చినది.

భగవంతుడు యోగనిద్రనుండి లేచి తాను అనేకముగ అగుటకు సంకల్పించెను. మాయాబలమున శరీరమును అధిదైవము, అధ్యాత్మము, అధిభూతము అను

మూడుభాగములుగా విభజించెను. ఒకే పురుషశక్తి మూడుభాగములు ఎట్లయ్యె ననగా :—

అతడు క్రియాశక్తితో ప్రయత్నించగా శరీరమందలి ఆకాశమునుండి ఇంద్రియశక్తి, మనశ్శక్తి, దేహశక్తి పుట్టినవి. వాటివలన ప్రాణశక్తి పుట్టినది. రాజువెంట నడుచు సేవకులవలె ఇంద్రియములు ప్రాణముయొక్క ఆజ్ఞను అనుసరించి సంచరించును. ప్రాణము కదలకున్న అవియును కదలవు.

ప్రభువు దేహమున ప్రాణసంచలనము కలుగగానే ఆకలి, దాహము పుట్టినవి. తినవలెననియు, త్రాగవలెననియు కోరిక కలిగిన మరుక్షణమున అతనికి నోరు ఏర్పడినది. నోటిలో దవడ, అందునుంచి నాలుక పుట్టినవి.

రసనేంద్రియమునకు అధిదేవత ఇంద్రుడు.

మాటలాడవలెనని సంకల్పము కలుగగా అతని నోటినుండి మాటలు పుట్టెను. మాటలకు అధిదేవత అగ్ని.

అతడు నీటిలో ఉన్నపుడు ఊపిరి బంధించి ఉండెడిది. ప్రాణవాయువు చలించుటతో అతనికి ముక్కు ఏర్పడినది. ముక్కుకు అధిదేవతలు అశ్వినీదేవతలు.

అతనికి వాసన చూడవలెనని అభిలాష కలిగినది. ఘ్రాణేంద్రియము ఏర్పడినది. దానికి అధిదేవత వాయువు.

తనమూర్తి, ఇతరమూర్తులను చూడదలచెను. తత్ఫలితముగా నేత్రములు వాని అధిదేవత సూర్యుడు పుట్టెను.

ఋషులు వేదములతో చేయు స్తుతి వినవలెననుకున్నాడు భగవానుడు. చెవులు పుట్టినవి. వానికి అధిదేవతలు దిశలుకూడా పుట్టినవి.

వస్తువుల మృదుత్వము, కఠినత్వము, భారము, శీతోష్ణములు తెలుసుకోవలెననుకున్నపుడు అతని శరీరమునకు చర్మము ఏర్పడినది. రోమకూపములు ఏర్పడినవి. వాని అధిదేవతలు వృక్షములు పుట్టినవి.

కర్మ చేయవలెనని సంకల్పము కలుగగానే చేతులు ఏర్పడినవి. వానికి అధిదేవతగా ఇంద్రుడు జన్మించెను.

నడవవలెనని బుద్ధిపుట్టగా పాదము లేర్పడినవి. వానికి అధిదేవత విష్ణువు.

సంతానవాంఛ, సంభోగవాంఛ కలుగగా ఉపస్థేంద్రియమగు శిశ్నము ఏర్పడినది. దానికి అధిదేవత ప్రజాపతి.

మలవిసర్జనాపేక్ష కలుగగా గుదస్థానము ఏర్పడి, అధిష్టాన దేవతగ మిత్రుడు పుట్టెను.

భగవంతుడు ఒక శరీరమునుండి వేరొక శరీరమున ప్రవేశించదలచగా నాభి ద్వారము, అపానము, మృత్యువు ఏర్పడినవి.

అన్నపానములు గ్రహించవలెననుకున్నాడు ప్రభువు. అప్పుడు ఉదరము, నాడులు, ప్రేవులు ఏర్పడినవి. ప్రేవులు అన్నము సంగ్రహించుటకు కారణములు అయినవి. అన్నములకు అధిష్టానదేవతలు నదులు; నాడుల అధిష్టాన దేవతలు సముద్రములు.

భగవంతుడు తన మాయను తలచెను. అంతట హృదయము, మనస్సు, సంకల్పము, అభిలాష ఏర్పడి, మనసునకు అధిష్టాన దేవత చంద్రుడు పుట్టెను.

భూమి, నీరు, అగ్ని వీనినుండి స్థూలచర్మము, దానిపై సూక్ష్మచర్మము, మాంసము, రక్తము, మేధస్సు, ఎముకలు ఏర్పడినవి.

విరాట్పురుషునికి అహంకారముపుట్టి దాని అధిష్టానదేవతగ రుద్రుడు ఏర్పడెను.

విరాట్పురుషుని శిరస్సునుండి స్వర్గము పుట్టినది. పాదములనుండి భూలోకము, నాభినుండి ఆకసము పుట్టినవి. స్వర్గమందు సత్వగుణ ప్రధానులైన దేవతలు, భూలోకమందు రజోగుణ ప్రధానులైన మానవులు, ఆకాశమున తమోగుణ ప్రధానులైన పిశాచములు చేరినవి.

విరాట్పురుషుని ముఖమునుండి వేదములు, బ్రాహ్మణులు పుట్టిరి. బ్రాహ్మణులు వేదాధ్యయనమే వృత్తిగా పెట్టుకున్నందున వారు నాలుగు వర్ణములందున శ్రేష్ఠులైరి.

బాహువులనుండి క్షాత్రము క్షత్రియులు జన్మించిరి. ఇతర వర్ణములవారికి ఏ విధమైన ఉపద్రవము రాకుండునట్లు రక్షించుట క్షత్రియుల కర్తవ్యము. తొడలనుండి వైశ్యులు జన్మించిరి. వ్యవసాయము, పశుపాలన, వ్యాపారము వారి వృత్తులు అయ్యెను. పాదములనుండి శూద్రులు జన్మించగా శుశ్రూష వారి వృత్తి అయ్యెను.

ఈ నాలుగు వర్ణములవారు భగవంతునిలో నుండియే జన్మించిరి కావున, ఆత్మ శుద్ధికొరకు అందరు తమ గురువు అయిన భగవంతునే ఆరాధించెదరు. అన్ని వర్ణములవారికి భగవంతుడే గురువు, తండ్రి, వృత్తి దాత.

ప్రజాపతులు, మనువులు, దేవతలు, ఋషులు, పితృదేవతలు, సిద్ధులు, చారణులు, గంధర్వులు, విద్యాధరులు, అసురులు, యక్షులు, కిన్నరులు, అప్సరసలు, నాగులు, కింపురుషులు, మాతృగణములు, యాతుధానులు, పిశాచములు, భూతములు, ప్రేతములు, వినాయకులు, కూష్మాండులు, ఉన్మాదులు, భేతాళులు, రాక్షసులు, గ్రహములు, మృగములు, పశువులు, పక్షులు, చెట్లు, కొండలు, సరీసృపములు, జరాయుజములు, అండజములు, స్వేదజములు, ఉద్భిజములు, భూచర, జలచర ఖేచరములు అన్నియు భగవంతుని సృష్టియే.

వీనిలో ఉత్తమ, మధ్యమ, అధమ ప్రాణులు ఉన్నవి. పాపపుణ్యములవలన, సత్వ రజస్తమోగుణములవలన ఈ ఉత్తమ మధ్యమ అధమములు ఏర్పడును.

భగవంతుడు దేవతలు, పశువులు, పక్షులు మున్నగు అవతారములు ఎత్తి ధర్మమును స్థాపించుచు, లోకమును పాలించుచున్నాడు. గాలి మేఘములను నాశనము చేసినట్లు ఆ భగవంతుడు ప్రళయకాలమున రుద్రుడై ప్రపంచము అన్నింటిని హరించును.

ఇతి ద్వితీయ స్కంధము.

శ్రీమద్భాగవతము

తృతీయ స్కంధము

సృష్టి

సృష్టికి పూర్వము ఈ జగత్తు లేదు. సర్వాత్మలు, ప్రకృతి పరమాత్మలోనే లీనమై ఉండెడివి. కాబట్టి ద్రష్టఅనగా చూచువాడుగాని దృశ్యము అనగా చూడబడునదిగాని లేకుండెను. ఒక్క పరమాత్ముడే ద్రష్టయు దృశ్యము నయ్యెండెను. అతడు ద్రష్ట అయి చూచినాడు. అతనికి దృశ్యము కానిపించలేదు. అప్పుడు కార్యకారణరూపశక్తియయిన మాయాశక్తితో విశ్వసృష్టి చేసినాడు.

కాలశక్తివలన త్రిగుణమయి మాయ క్షోభ పొందినది. అపుడు ఇంద్రియాతీతుడైన పరమాత్మ తన అంశస్వరూపుడైన పురుషుని ప్రకృతి మీద అధిష్ఠింపచేసినాడు. అట్లుచేసి చిదాభాసరూపమైన బీజమును స్థాపించినాడు. అనంతరము కాలప్రేరణవలన మాయలోనుండి మహత్తత్త్వము వ్యక్తమైనది. మహత్తత్త్వము నుండి పరమాత్మ తనలోని విశ్వమును ప్రకాశింపచేసినాడు. మహత్తత్త్వము, చిదాభాసము, గుణము, కాలములకు అధీనమైనది. అట్టి మహత్తత్త్వము కనిపించగనే సృష్టి చేయవలెనను అభిలాషతో అతడు రూపాంతరము పొందినాడు.

మహత్తత్త్వము వికారము పొందిన అహంకారము జనించినది. భూతములు, ఇంద్రియములు, మనస్సు-ఈ మూడింటి వికారము అహంకారము. అది కార్య, కారణ, కర్తలను ఆశ్రయించి ఉండును. అహంకారము మూడు విధములు. మొదటిది సాత్త్వికాహంకారము. దానినుండి మనస్సు పుట్టినది. రెండవది రాజసాహంకారము, దానినుండి ఇంద్రియములు అధిష్ఠానదేవతలు పుట్టినారు. మూడవది తామసాహంకారము. దానినుండి భూతసూక్ష్మమగు శబ్దము జనించినది. తామసాహంకారమునుండి ఆకాశము గూడ పుట్టినది.

మహాతత్త్వము

|

అహంకారము

సాత్త్వికాహంకారము	రాజసాహంకారము	తామసాహంకారము
మనసు	ఇంద్రియముల అధిష్ఠాన దేవతలు	శబ్దము-ఆకాశము.

ఆకాశముపై భగవంతుని దృష్టి పడగా కాల, మాయ, అంశ యోగమై ఆకాశమునుండి స్పర్శతన్మాత్ర వాయువు పుట్టినది.

వాయువు ఆకాశముతో కలసి రూపాంతరముపొంది రూపతన్మాత్ర తేజస్సు పుట్టినది. అది లోకప్రకాశకమైనది.

తేజస్సు వాయువుతో కలసి రూపాంతరము పొంది కాలము, మాయ అంశ కలసి రసతన్మాత్ర జలము పుట్టినది.

తేజస్సు, నీరు కలసి కాలమాయాంశయోగమై భూమి పుట్టినది.

ఇట్లు పంచభూతములు ఉత్పన్నములైనవి. వానిలో గుణములు ఇట్లున్నవి: —

ఆకాశము	1. శబ్దగుణము.
వాయువు	1. శబ్దము, 2. స్పర్శ.
తేజస్సు	1. శబ్దము, 2. స్పర్శ, 3. రూపము.
జలము	1. శబ్దము, 2. స్పర్శ, 3. రూపము, 4. రసము.
భూమి	1. శబ్దము, 2. స్పర్శ, 3. రూపము, 4. రసము, 5. గంధము.

భగవంతుడు తనలో లీనమై ఉండిన సమస్తలోకములను పరికించినాడు. అతని దృష్టి పడుటతోడనే కాలశక్తి ప్రభావము వలనను రజోగుణము వలనను సూక్ష్మతత్త్వములు క్షోభపొంది అతని నాభి ప్రదేశము భేదించుకొని బయటకు వచ్చినవి. నాభినుండి వచ్చిన ఆ పదార్థము పద్మాకారమై లేచినది. సూర్యునివంటి దాని తేజస్సుతో జలరాశి ప్రకాశించినది. ఆ పద్మమున విష్ణుభగవానుడు అంతర్యామిగా ప్రవేశించినాడు. అందునుండి వేదమయుడైన బ్రహ్మ ఉద్భవించినాడు. అతడే స్వయంభువు.



శ్రీహరి నాభినుండి వెడలిన కమలముపై సృష్టికర్తయైన బ్రహ్మ
ఉద్భవించుట. పుట.59

అట్లు పుట్టి పద్మాసనముపై కూర్చున్న బ్రహ్మకు ఏమియు కనిపించకపోగా నాలుగువైపులా మెడ త్రిప్పిచూచినాడు. అందువలన అతడు నాలుగు ముఖములు కలవాడు - చతుర్ముఖుడు అయినాడు. ప్రళయవాయువులు వీచి జలరాశిలో పెద్దపెద్ద కెరటములు వచ్చెను. తామర పూవునందు కూర్చున్న బ్రహ్మకు తన రహస్యముగాని - పద్మరహస్యముగాని తెలియలేదు.

'ఈ పద్మముపై కూర్చున్న నేనెవరు? ఈ పద్మము నిరాధారముగా ఈ నీటిలో ఎట్లు పుట్టినది? దాని ఆధారము కనుగొనవలెని తామరతూడుయొక్క సూక్ష్మ రంధ్రము నుండి నీటిలో ప్రవేశించి, భగవంతుని నాభి ప్రదేశమునకు వచ్చినాడు. అయినా అతనికి ఆధారము కనిపించుటలేదు. అంతయు అంతములేని అంధకారము. అట్లు వెదకుటలో ఎంతోకాలము గడచిపోయినది.

చివరకు విఫలమనోరథుడై వెనుకకు మరలి తనకు ఆధారమైన పద్మముమీద కూర్చొని మెల్లమెల్లగా ప్రాణవాయువును జయించి నియమ పూర్వకముగా సమాధిలో నిమగ్నుడైనాడు. అట్లు వంద దివ్యసంవత్సరములు గడచిన తరువాత అతడు యోగసిద్ధి పొందినాడు. జ్ఞానోదయమైనది. పూర్వము ఎంతోకాలము వెదకి కానలేకపోయిన పరమపురుషుని తన హృదయమునందే చూడగలిగినాడు. ప్రళయ జలరాశిలో తెల్లని విశాలమైన శేషశయ్యమీద ఒంటిగా శయనించిన పురుషోత్తముడు బ్రహ్మకు కనిపించినాడు. శేషుని పదివేల పడగలు పదివేల గొడుగులవలె ఉన్నవి. పడగలమీది మణిమయ కిరీటములు ధగధగ మెరయుచు నలువైపులగల చీకటులను పారద్రోలుచున్నవి. పురుషోత్తముని శ్యామలమైన శరీర కాంతి మరకతపర్వతమును తలదన్నినట్లుండగా అతని కటిప్రదేశము మీది పీతాంబరము మరకతపర్వతముమీద సాయంకాలము మేఘము వాలినట్లున్నది. అతని శిరస్సుమీది బంగారు కిరీటము మరకత పర్వతపు బంగారు శిఖరముకన్న మిన్నగా ఉన్నది. అతని మెడలోని వనమాల పర్వతముమీది మణులు, జలపాతములు, ఓషధులవలె ఉన్నది. పర్వతముమీది వెదురుదండుకన్న అందముగా ఉన్నవి అతని భుజములు. వృక్షములకన్న సుందరముగా ఉన్న పాదములు కలిగి అతని విగ్రహము దివ్యాభరణములతోను దివ్యవస్త్రములతోను దేదీప్యమానముగా ఉన్నది.

అందమైన ముక్కు, తీర్చిదిద్దిన కనుబొమలు, తళ తళ మెరయుచున్న కుండలములుగల చెవులు, దొండపండువంటి ఎర్రని పెదవులు, లోకముల దుఃఖము

అను తొలగించునట్టి మందహాసము కలిగి భక్తులను అభినందించుచున్నట్లున్నది స్వామి వదనముఖము. వక్షస్థలమున కౌస్తుభము, శ్రీవత్సమణి కలిగి మూలము కాన్పించని చందన వృక్షమువలె ఉన్నాడు.

రత్నకంకణములతో విరాజిల్లునట్టి అతని విశాల భుజదండములు చందన వృక్షపు శాఖలవలె ఉన్నవి. చందనపు చెట్టును చుట్టుకున్న పాములవలె ఆదిశేషుని పడగలు అతని భుజములమీద కనిపించుచున్నవి. ఆదిశేషుని బంధువైన నారాయణుడు జలమునందు పర్వతమువలె కనిపించుచున్నాడు. పర్వతముమీది ప్రాణులవలె సకల చరాచర జీవులు అతనిని ఆశ్రయించి ఉన్నవి. శేషుని సహస్ర రత్నకిరీటములు బంగారుకొండ శిఖరములవలె ఉన్నవి. కొండలోని మహారత్నమువలె అతని హృదయముమీద కౌస్తుభము ప్రకాశించుచున్నది. మూర్తీభవించిన కీర్తివలె మెడలో వనమాల వ్రేలాడుచున్నది. వేదములు తుమ్మెదలై వనమాలను ఆశ్రయించుచున్నవి.

బ్రహ్మ అట్టి భగవంతుని చూచినాడు. లోకసృష్టి చేయవలెనని అతడు దృష్టి సారించినాడు. కాని అతనికి నాభి సరోవరమునుంచి పుట్టిన పద్మము, తన స్వరూపము, ఆకాశము, ప్రళయ జలము, ప్రళయవాయువు తప్ప మరేమియు కనిపించలేదు. రజోగుణమున బ్రహ్మ సృష్టి సంకల్పించినాడు. నీరు, తేజస్సు, గాలి, ఆకాశము, భూమి ఈ అయిదు సృష్టికి కారణరూపమని తెలుసుకొని సృష్టి చేయగల సామర్థ్యము కొరకు భగవంతుని స్తుతించినాడు.

“ప్రభూ! ఎంతో కాలము ఉపాసించి నిన్ను తెలుసుకున్నాను. నీవు ఒక్కడవే తెలుసుకొనదగినవాడవైనప్పటికి మానవులు నీ తత్వము తెలుసుకొనలేరు. నీ కన్న వేరేదియు లేదు. ఉన్నట్లు కనిపించునదంతయు మిథ్య. మాయాగుణమువలన నీవు ఒక్కడవే ఎన్నోరూపములుగా కనిపించెదవు. మాయవలన అసత్యమైన వస్తువు సత్యమువలె కనిపించును. దయాసముద్రుడవు నీవు. పురాణ పురుషుడవు. ప్రేమ తొణికిసలాడు చిరునవ్వుతో నీ నేత్రపద్మములు విప్పుము. శేషశయ్యనుండి లేచి అమృతమువంటి నీ మాటలతో నా విషాదమును తొలగించుము.”

తన జననమునకు కారణమైన భగవంతుని బ్రహ్మ అట్లు ఉపాసించి, మనసుతోను మాటలతోను యథాశక్తి స్తుతించి శాంతభావమున మౌనము దాల్చెను.

బ్రహ్మ ప్రళయ సముద్రమునుచూచి భయభ్రాంతు డగుచున్నాడనియు, సృష్టి చేయగల జ్ఞానము లభించక విచారించుచున్నాడనియు గ్రహించిన భగవానుడు గంభీర కంఠమున ఇట్లనెను :—

"ఓ బ్రహ్మా! నీపైన నా కెంతో కరుణ. ఈ దయతోనే నీవు విశ్వసృష్టి చేయగలవు. ఆదిఋషివైన నీవు ప్రజలను సృష్టిచేయు చుండినప్పటికి నీ చిత్తము నాపైన లగ్నమై ఉండును. పాపమయమైన రజోగుణము నిన్ను బాధించదు. దేవాలకు తెలియరానివాడ నయిన నన్ను నీవు తెలుసుకున్నావు. నా స్వరూపమును అవగతము చేసికొన్నావు. నిర్గుణుడనైన నన్ను లోకసృష్టి సంకల్పమున గుణమయుడైనవానిగా వర్ణించినావు. అందుకు సంతసించినాను. నేను సమస్త కోరికలు తీర్చగలవాడను. తపస్సులు, దానములు, యోగములు, సమాధి మున్నగువానితో సాధించవలసిన పరమఫలము నన్ను ప్రసన్నుని చేయుటయే. ఆత్మలకు పరమాత్ముడను. ప్రియులకు ప్రియతముడను. కాన నన్నే ప్రేమించవలెను. మూడు లోకముల ప్రజలు నాలోనే లీనమై యున్నారు. సర్వవేదమయ స్వరూపమున నీవు పూర్వపు కల్పమువలెనే సృష్టిచేయుము" అని భగవానుడు అంతర్ధానుడు అయినాడు.

భగవంతునిచేత సృష్టికార్యమున నియుక్తుడై బ్రహ్మదేవుడు పద్మకోశమున ప్రవేశించినాడు. పద్మమును మూడులోకములుగా విభజించినాడు. మూడులోకములే కాదు పదునాలుగు లోకములు కా గలిగినంత విశాలమైనది ఆ పద్మము.

భూలోకము, భువర్లోకము, స్వర్గలోకము పుట్టుచుండును నాశనమగుచుండును. ఈ మూడును జీవులకు భోగస్థానములు. చేసుకున్నవి కుడిచే లోకములు. మహర్లోకము, జనలోకము, తపోలోకము, సత్యలోకములు నిష్కామ్య ఫల స్వరూపములు కావున బ్రహ్మదేవుని ఆయుఃకాలమైన రెండుపరార్థములవరకు నాశనము కావు. తరువాత సహితము ఆ లోకము లందు నివసించువారు ముక్తులై ఉందురు.

లోకములను గురించి తెలుసుకొని సృష్టినిగురించి తెలుసుకుందము.

విశ్వసృష్టి తొమ్మిది రకములు. ప్రాకృత వైకృతభేదము వలన మరొకటికూడ కలదు. ఇట్లు సృష్టి పదిరకములగును.

1. ఆత్మస్వరూపుడైన భగవంతుని ప్రేరణవలన సత్వరజస్తమోగుణముల వికారమువలన కలిగినది మహత్తత్వము.

2. ద్రవ్యజ్ఞానము. క్రియ వీనినుండి కలిగినది అహంకారము.

3. భూతముల సృష్టి.

4. ఇంద్రియ సృష్టి.

5. ఇంద్రియాధిష్ఠానదేవతల సృష్టి.

6. జీవుల కావరణ విక్షేపము గావించు పంచపర్వావిద్య సృష్టి.

ఈ ఆరును ప్రాకృత సృష్టులు.

7. స్థావర ప్రాణుల సృష్టి. సృష్టిలో ఇది ముఖ్యసృష్టి.

ఇది ఆరు విధములు.

1. ఓషధులు, 2. లతలు, 3. త్వక్సారములు, 4. వీరుత్తులు, 5. ద్రుమములు, 6. వనస్పతులు.

ఇవి ఆహారముకొరకు పైకి పెరుగును. వీని చైతన్యము అవ్యక్తము అయిన వీటికి అంతస్స్పర్శమాత్రము ఉండును. ఇవి అనేక విధములు.

8. తిర్యగ్యోనులు. ఇవి 28 విధములు.

1. గోవు, 2. మేక, 3. గేదె, 4. కృష్ణసారము, 5. పంది, 6. గురుపోతు, 7. నల్లచారల దుప్పి, 8. గొఱ్ఱె, 9. ఒంటె ఇవి రెండు డెక్కల జంతువులు. 10. గాడిద, 11. గుఱ్ఱము, 12. కంచరగాడిద, 13. గౌరమృగము, 14. శరభము, 15. చమరీమృగము ఇవి ఒంటిడెక్క గలవి. 16. కుక్క, 17. నక్క, 18. తోడేలు, 19. పులి, 20. పిల్లి, 21. కుందేలు, 22. ఏదుపంది, 23. సింహము, 24. కోతి, 25. ఏనుగు, 26. తాబేలు, 27. ఉడుము ఇవి అయిదుగోళ్ళ జంతువులు. ఈ 27 నేల మీద జీవించును. 28 నీటిలో జీవించు మొసలి మున్నగునవి. ఇవికాక రాబందు, గద్ద, కొంగ, కోడి, డేగ, నెమలి, హంస, చక్రవాకము, బెగ్గురుపిట్ట మున్నగు పక్షులు ఉన్నవి.

9. మనుష్య సృష్టి.

మనుష్యులలో రజోగుణము ఎక్కువ ఉండుటకాన మనుష్యులు కర్మతత్పరులు.

ఈ మూడు వైకృత సృష్టులు.

10. వైకారిక దేవసృష్టి.

ఇది ఎనిమిది విధములు.

1. దేవతలు, 2. పితరులు, 3. అసురులు, 4. గంధర్వులు, 5. అప్సరసలు, 6 యక్షులు, 7. భూతప్రేత పిశాచములు, 8. కిన్నరులు కింపురుషులు.

సనకాదులు

బ్రహ్మదేవుడు ముందు మోహము మహామోహము, తమస్సు, తామిస్రము, అంధతామిస్రము అయిదు అజ్ఞానవృత్తులు సృష్టించినాడు. కాని ఆ పాపమయ సృష్టి అతనికి నచ్చలేదు. తదుపరి భగవంతునిపై చిత్తము నిలిపి ఇతర సృష్టి ప్రారంభించినాడు. 1. సనక, 2. సనందన, 3. సనాతన, 4. సనత్కుమారులను సృష్టించినాడు. వారిని చూచి "మీరు సృష్టిచేయుడు" అన్నాడు. పై ఆ నలుగురు ఊర్ధ్వరేతస్కులు నిష్క్రియులు. వారు పుట్టుకతోనే మోక్షమార్గమవలంబించి భగవంతుని ధ్యానించుటలో నిమగ్నులై పోయినందున సృష్టికార్యమునకు పూనుకొనలేదు.

రుద్రుడు

పుత్రులు తనమాట వినకపోవుటచే విరించికి ఎనలేని కోపము వచ్చినది. నిగ్రహించుటకు ప్రయత్నించినాడు. అయినను కోపమువలన ముడిపడిన కనుబొమలనుండి ఎరుపు, నలుపు, రూపమున ఒక కుమారుడు ఉదయించినాడు. అట్లు జన్మించిన బాలుడు ఏడ్చుచు "జగత్కర్తా ! విధాతా ! నా పేరేమిటి ? నేను ఎచట ఉండవలెను ?" అని అడిగినాడు.

"ఏడవకు ఏడవకు" అని ఆ బాలుని ఓదార్చుచు బ్రహ్మ ఇట్లు అనెను.

"నీవు దేవతలందు ఉత్తముడవు. బాలునివలె రోదనము చేసినందున నీ పేరు "రుద్రుడు" అగును. నీ కొరకు హృదయము, ఇంద్రియములు, ఆకాశము, వాయువు, అగ్ని, నీరు, నేల, సూర్యుడు, చంద్రుడు, తపస్సు వీటిని ముందే నిర్దేశించినాను. నీకు 11 పేర్లుండును. అవి 1. మన్యుడు, 2. మనువు, 3. మహినసుడు 4. మహానుడు, 5. శివుడు, 6. ఋతధ్వజుడు, 7. ఉగ్రరేతుడు, 8. భవుడు, 9. కాలుడు, 10 వామదేవుడు, 11. ధృతవ్రతుడు అనునవి. నీకు పదకొండుమంది భార్యలగుదురు. వారు 1. ధీవృత్తి, 2. ఉశన, 3. ఉమ, 4. నియుత, 5. సర్పి, 6. ఇల, 7. అంబిక, 8. ఇరావతి, 9. సుధ, 10. దీక్ష,

11. ఇ. (వీరు పదకొండుమంది రుద్రాణులు) వీరిని భార్యలుగా స్వీకరించి ప్రజాసృష్టి చేయుము. నీవు ప్రజాపతివి''.

బ్రహ్మదేవుని ఆదేశమును పొంది ఆకాశమునందును జలమునందును తనను పోలినవారిని రుద్రుడు సృష్టించెను. రుద్రుని వలన కలిగిన రుద్రగణము లోక మంతటిని భక్షించ సాగెను. అదిచూచి బ్రహ్మ రుద్రునిపిలిచి "రుద్రా! నీ పుత్రులు నన్ను, సకలదిక్కులను భస్మము చేయునట్లు తోచుచున్నది. కాన ఇక ఇట్టి సృష్టి చేయకుము. ప్రాణులందరకు సుఖము కలుగుటకుగాను తపస్సు చేయుము. తపమువలన జ్యోతిస్వరూపుడైన శ్రీహరిని పొందుదువు" అనెను.

బ్రహ్మ ఆదేశము విని రుద్రుడు అతనికి ప్రదక్షిణముచేసి తపమునకు గాను అరణ్యమునకు వెళ్ళినాడు.

నా ర దా దు లు

తదుపరి బ్రహ్మదేవుడు సృష్టివిషయము ఆలోచించి పదిమందిని సృష్టించినాడు. వారు బ్రహ్మదేవుని దేహమునుండి ఉద్భవించిరి.

1. నారదుడు	ఒడిలోనుండి
2. దక్షుడు	బొటనవ్రేలున
3. వసిష్ఠుడు	ప్రాణమున
4. భృగువు	చర్మమున
5. క్రతువు	చేతిలోనుండి
6. పులహుడు	నాభిని
7. పులస్త్యుడు	చెవిలోనుండి
8. అంగీరసుడు	ముఖమున
9. అత్రి	నేత్రముల నుండి
10. మరీచి	మనసున ప్రభవించిరి.

వీరుకాక బ్రహ్మదేవుని దేహమునుండి మరికొన్ని పుట్టెను. అవి :—

ధర్మము	రొమ్మున
అధర్మము	వృష్టమున
(అధర్మమునుండి మృత్యువు పుట్టినది)	
కామము	హృదయమున

క్రోధము		కనుబొమలందు
లోభము		అధరమున
వాక్యము		నోటిలో
సముద్రములు		లింగమున
నిరుతి		గుహ్యప్రదేశమున
(నిరుతి పాపాత్ముడు. రాక్షసరాజు)		
కర్దముడు		ఛాయన
ఓంకారము		హృదయమున
ఉష్ణిక్కు	ఛందస్సు	రోమములందు
గాయత్రి	,,	చర్మమున
త్రిష్టుప్పు	,,	నరములందు
జగతి	,,	ఎముకలందు
పంక్తి	,,	మూలుగులందు
బృహస్పతి	,,	ప్రాణమున
షడ్జమ స్వరములు		క్రీడనలన

కచటతప వర్గములైన స్పర్శ వర్ణములు బ్రహ్మకు జీవము.
స్వరవర్గములైన అ ఆ లు అతని శరీరము.
ఊష్మవర్ణములైన శ ష స హ లు అతని ఇంద్రియములు.
అంతస్థ వర్గములైన య ర ల వ లు అతని బలము.

సరస్వతి

బ్రహ్మదేవునకు ఒక కన్య కలిగినది. ఆమె సరస్వతి. చక్కనిచుక్క. ఆమెను చూచి బ్రహ్మ కామాతురుడయ్యెను. కాని సరస్వతి అంగీకరించలేదు. మరీచి మున్నగు అతని పుత్రులు తండ్రి చెడునడతను గురించి తెలిసినది. వారు తండ్రికి సవినయముగా బోధచేసినారు.

"తండ్రీ! ఉత్తమోత్తములైన నీవు కామమును నిగ్రహించలేక కన్నకూతురును కామించి ఘోరమైన పాపమునకు ఒడిగట్టినావు. నీవంటి తేజోవంతులు చేయవలసిన పనియేనా అది?" అనిరి.

తన పుత్రికే తనకిట్లు బుద్ధిచెప్పుట చూచి సిగ్గుపడిపోయినాడు బ్రహ్మ. ఉత్తరక్షణమున ఘోరమగు శరీరమును విడిచినాడు. ఘోరమైన అతని శరీరమును దిశలు మోసుకొనిపోయినవి. అదే పొగమంచు అయినది.
దానినే "తమస్సు" అందురు.

వేదాదులు.

పూర్వము సృష్టిచేయు టెట్లు? అని బ్రహ్మ ఆలోచించెను. అట్లు ఆలోచించగా బ్రహ్మ ముఖములనుండి వేదములు మున్నగునవి పుట్టెను. తూర్పు ముఖమున ఋగ్వేదము, దక్షిణపు ముఖమున యజుర్వేదము, పశ్చిమ ముఖమున సామవేదము, ఉత్తరముఖమున అథర్వణ వేదము ప్రభవించినవి. అదే వరుసన హోత చేయవలసిన గీత మంత్రస్తోత్రముల శస్త్రకర్మయు, అధ్వర్యువు చేయవలసిన యజ్ఞకర్మయు ఉద్గాత చేయవలసిన స్తుతి స్తోమ కర్మయు, బ్రహ్మ చేయవలసిన ప్రాయశ్చిత్త కర్మయు జనించినవి. అదేవరుసన ఆయుర్వేదము. ధనుర్వేదము, గాంధర్వవేదము, స్థాపత్యవేదము అను ఉపవేదములు పుట్టినవి. ఇతిహాస పురాణరూపమగు పంచమ వేదముకూడ బ్రహ్మ ముఖమునుండి పుట్టినది. షోడశి, ఉక్థ్యయజ్ఞములు తూర్పుముఖమునుండి చయన, అగ్నిష్టోమములు దక్షిణ ముఖమునుండి అప్తోర్యామ, అతిరాత్రములు పశ్చిమ ముఖమునుండి, వాజపేయ గోసవ యజ్ఞములు ఉత్తరముఖమునుండి ఉత్పవించినవి. విద్య, దానము, తపస్సు, సత్యము, సత్యము అను ధర్మముయొక్క నాలుగుపాదములు, బ్రహ్మచర్యము, గార్హస్థ్యము, వానప్రస్థము, సన్యాసము అను నాలుగు బ్రహ్మ ముఖముల నుండియే ఉత్పన్నమైనవి.

బ్రహ్మ ముఖములనుండి పుట్టినవి ఇట్లుండును.

తూర్పు ముఖము	దక్షిణ ముఖము	పశ్చిమ ముఖము	ఉత్తర ముఖము
1. ఋగ్వేదము	1. యజుర్వేదము	1. సామవేదము	1. అధర్వణవేదము
2. హోత చేయ వలసిన మంత్రస్తోత్రముల శస్త్ర కర్మ	2. అధ్వర్యుడు చేయ వలసిన యజ్ఞకర్మ	2. ఉద్గాత చేయవలసిన స్తుతి స్తోమ కర్మ	2. బ్రహ్మ చేయవలసిన ప్రాయశ్చిత్తకర్మ
3. ఆయుర్వేదము	3. ధనుర్వేదము	3. గాంధర్వవేదము	3. స్థాపత్య వేదము
4. షోడసి, ఉక్థయజ్ఞములు	4. చయన, అగ్నిష్టోమ యజ్ఞములు	4. అప్తోర్యామ, అతిరాత్రి యజ్ఞములు	4. వాజపేయ గోసవ యజ్ఞములు
5. విద్య	5. దానము	5. తపస్సు	5. సత్యము
6. బ్రహ్మచర్యము	6. గార్హస్థ్యము	6. వానప్రస్థము	6. సన్న్యాసము
7. ఆన్వీక్షికి విద్య	7. త్రయీవిద్య	7. వార్తావిద్య	7. దండనీతి

ఆ యా ఆశ్రమములందు అవలంబించదగు వృత్తులు :—

బ్రహ్మచర్యము :- సావిత్రము, ప్రాజాపత్యము, బ్రాహ్మము, బృహత్తు.

సావిత్రము :- ఉపనయనము తరువాత గాయత్రి అధ్యయనము కొరకు మూడు రోజులుచేయు వ్రతము.

ప్రాజాపత్యము :- ఏడాది బ్రహ్మచర్యము.

బ్రాహ్మము :- వేదాధ్యయనము పూర్తియగువరకు చేయునది.

బృహత్తు :- జీవితాంత బ్రహ్మచర్యము.

గార్హస్థ్యము :- వార్త, సంచయనము, శాలీనము, శిల, ఉంఛవృత్తి.

వార్త :- కృషి, గోరక్ష మున్నగునవి.

సంచయనము :- యాచన మున్నగు వృత్తులు.

శాలీనము :- అయాచిత వృత్తి.

శిల :- వరిగ ఏరుకొని జీవించుట.

ఉంఛ :- రాలినగింజలు ఏరుకొని జీవించుట.

వానప్రస్థము :- వైఖానసము, వాలఖిల్యము, ఔదుంబరము, ఫేనపము.

వైఖానసము :- సాగుచేయనవసరములేక పండిన గింజలతో జీవించుట.

వాలఖిల్యము :- క్రొత్తగ ఆహారము లభించగనే దాచిపెట్టినది దానము చేయుచు జీవించుట.

ఔదుంబరము :- ఉదయము లేవగానే ఎటువైపు ముఖమున్న ఆ దిశకు వెళ్ళి ఫలములు మున్నగునవి తెచ్చుకొని జీవించుట.

ఫేనపము :- రాలినపండ్లు ఏరుకొని తినుట.

సన్న్యాసము :- కుటీచకము, బహూదకము, హంసము, పరమహంసము.

కుటీచకము :- కుటీరము కట్టుకొని ఆశ్రమ ధర్మములు పాలించుచు జీవించుట.

బహూదకము :- కర్మ అప్రధానముగా భావించి జ్ఞానము ప్రధానముగా భావించి జీవించుట.

హంసము :- నిష్ఠతో జ్ఞానాభ్యాసము చేయుట.

పరమహంసము :- బ్రహ్మతత్త్వ జ్ఞానార్జనము.

యక్షరాక్షసులు.

బ్రహ్మదేవుడు వదలిన శరీరమునుండి యక్షరాక్షసులు జన్మించినారు. ఈ సృష్టి నుండియే ఆకలిదప్పులు పుట్టినవి. తమోమయ సృష్టిలో పుట్టిన యక్షులు, రాక్షసులు ఆకలి దప్పులకు అలమటించుచు బ్రహ్మదేవుని తినుటకు ఉరికిరి. "మారక్షతైనం జక్షధ్వం" "రక్షింపవలదు భక్షింపుడు" అని తమలో అను కున్నంత బ్రహ్మ భయముచెంది "నన్ను తినకుడు రక్షించుడు" అని 'నన్ను భక్షించవలెనన్నవారు యక్షులు, రక్షించవలదనినవారు రాక్షసు' లగుదురు అనెను.

సురాసురులు.

తరువాత బ్రహ్మ సాత్విక ప్రభతో దేదీప్యమానమైన శరీరమును అవలంబించెను. అప్పు డతడుచేసిన సాత్వికసృష్టియందు దేవతలు జన్మించిరి. వారు క్రీడించు చుండగా బ్రహ్మ సృష్టించిన ప్రభ పగలై ప్రకాశించినది.

తరువాత బ్రహ్మ తన తొడలనుండి అసురులను సృష్టించెను. వారు కామాసక్తులై మైథునమునకుగాను బ్రహ్మమీదికి ఉరికిరి. మొదట బ్రహ్మ వారినిచూచి నవ్వినాడు. కాని సిగ్గువిడిచి తన మీదికి వచ్చుటను గమనించి విష్ణువు వద్దకు పారిపోయెను. "భగవంతుడా! నన్ను రక్షింపుము. నీ ఆజ్ఞవలననే సృష్టిచేసినాను కాని ఈ పాపాత్ములు కామాతురులై నాపైకే వచ్చుచున్నారు. దేవా! నీవు దుఃఖితుల కష్టము తొలగించువాడవు. నీ పాదములు ఆశ్రయించనివారికి కష్టములు తప్పవు" అని ప్రార్థించెను.

భగవంతుడు బ్రహ్మ ఆతురత చూచినాడు. "నీ శరీరము కామ కలుషితముగా ఉన్నది. దానిని వదలివేయుము" అన్నాడు. భగవానుని ఆదేశానుసారము బ్రహ్మ తన శరీరమును వదలినాడు. అది సంధ్యాసుందరియై అవతరించెను.

'సంధ్యాసుందరి సౌందర్యరాశిగా ఉన్నది. ఆమె పాదపద్మములు నూపురములు గల్లుగల్లుమన్నవి. మత్తెక్కిన ఆమె నేత్రములు అరమూసి వున్నవి. కటిప్రదేశమున నున్న చక్కని చీర మొలనూలు మనోహరముగా ఉన్నవి. పాలిండ్లు రెండు ఒకదానిని ఒకటి ఒరుసుకొని పిక పిక లాడుచున్నవి. సంపెంగపూవు వంటి ముక్కు, తీర్చిదిద్దినట్లున్న పలువరుస, చిరునవ్వు, ఓరచూపులు గిలిగింతలు

పెట్టుచున్నవి. సిగ్గున పమిటచెంగుతో శరీరము కప్పుకొనుచు ఒయ్యారము ఒలికించిన దామె.

అసురులు సంధ్యవెంట బడిరి.

గంధర్వాదులు.

బ్రహ్మ కా[illegible]యమైన దేహము గ్రహించెను. దాన గంధర్వులను అప్సరసలను సృష్టించెను. ఆ శరీరమును విడిచెను. దానిని విశ్వావసు మున్నగువారు ప్రీతితో స్వీకరించిరి.

తరువాత సోమరితనమునుండి బ్రహ్మ భూత పిశాచములను సృష్టించెను. వారు తలలు విరియబోసుకొని దిసమొలలతో తిరుగగా చూచి బ్రహ్మ కన్నులు మూసుకొనెను. బ్రహ్మ ఆ సోమరి శరీరమును వదలెను. దానిని భూతములు పిశాచములు స్వీకరించినవి.

బ్రహ్మ తేజోమయరూపము ధరించి ఆ అదృశ్యరూపమున సాధ్యులను, పితృదేవతలను సృష్టించగా తమ సృష్టికి కారణమైన తేజోరూపమును వారు గ్రహించినారు.

బ్రహ్మ అంతర్ధానరూపము ధరించి సిద్ధులను, విద్యాధరులను సృష్టించెను. వారు అంతర్ధానరూపమును తీసుకొనిరి.

బ్రహ్మ తన ప్రతిబింబము చూచుకున్నాడు. ఆ ప్రతిబింబమునుండి కిన్నరులను కింపురుషులను సృష్టించెను. వారా ప్రతిబింబరూపమునే పరిగ్రహించిరి.

ఇంతయినను సృష్టి వృద్ధిఅగుటలేదని విచారించుచు బ్రహ్మ కాళ్లు చేతులు చాచుకొని పడుకొని కాళ్ళు, చేతులు నలుపుకున్నాడు. అందువలన రోమములు రాలినవి. అవి పాములైనవి. పాములందు పడగగలవి నాగులైనవి.

మానవులు.

"ఎంతప్రయత్నించినను సృష్టి వ్యాపించుటలేదు. దీనికి సరైన దైవ విఘాతము కలదా ?" బ్రహ్మ ఆలోచించసాగినాడు. అట్లు అతడు ఆలోచించుచుండగనే అతని శరీరము రెండుభాగములైనది. ఒకభాగము ఆడది ఒకభాగము మగవాడు అయి మిధునము అయినది. "క" అనగా బ్రహ్మ. క వలన విభజింపబడుటచేత శరీరమునకు "కాయము" అని పేరు వచ్చినది.

బ్రహ్మనుండి ఏర్పడిన పురుషుడు స్వాయంభువ మనువు. అతడు తొలిసార్వభౌముడు. బ్రహ్మనుండి ఏర్పడిన స్త్రీ శతరూప. ఆమె తొలి మహారాణి. అప్పటి నుండియే స్త్రీ పురుష సంయోగమున సృష్టి ప్రారంభమైనది. స్వాయంభువునకు శతరూపవలన ప్రియవ్రతుడు, ఉత్తానపాదుడు అను ఇరువురు పుత్రులు ఆకూతి, దేవహూతి, ప్రసూతి అను ముగ్గురు పుత్రికలు కలిగిరి. ఆకూతిని రుచిప్రజాపతికి, దేవహూతిని కర్దమ ప్రజాపతికి ప్రసూతిని దక్షప్రజాపతికి ఇచ్చి వివాహము చేసెను.

ఈ ముగ్గురి కన్యల సంతానము జగమంతయు నిండినది.

కాలపరిమాణము.

భూమి మున్నగు ఉత్పన్న వస్తువులను కార్య మందురు. కార్యవర్గమున మిక్కిలి సూక్ష్మభాగమునకు "పరమాణువు" అని పేరు. పరమాణువుకన్న చిన్నవస్తువు ఉండదు. కాలముకూడ పరమాణువువలననే ఏర్పడినది. భగవంతుని శక్తిస్వరూపమైన ఈ కాలము అవ్యక్తమైనది. దీనికి సూక్ష్మత, స్థూలతలను వివరించవచ్చును. పరమాణువువలె దీనిని సహితము నిరూపించవచ్చును. పరమాణువు అవస్థపొందిన కాలము పరమాణువు అనిపించుకొనును. పరమాణువు సూక్ష్మతకు కాలముకాగా స్థూలతమ కాలము పరమ మహాకాలము అగును.

సూర్యుని గమనమునుబట్టి కాలమును విభజింతురు. సూర్యుడు పరమాణువు ఉండునంత మేరకు ఎంత కాలమును అతిక్రమించునో దానిని పరమాణుకాలము అందురు. సూర్యుడు పండ్రెండు రాసుల భూచక్రమును అతిక్రమించిన కాలమునకు సంవత్సర మని పేరు. దీనిని స్థూలకాలము అందురు. ఈ స్థూలకాలము యుగములవరకు మన్వంతరములవరకు పరార్థములవరకు చేరును. ఇవన్నియు సంవత్సరమువలననే ఏర్పడుచున్నవి. సంవత్సరమును "మహాకాలము" అందురు.

రెండుపరమాణువులు	ఒక అణువు
మూడు అణువులు	ఒక త్రసరేణువు

ఇంటి కిటికీ రంధ్రమునుండి వచ్చు సూర్యకిరణమున ఆకాశమునకు ఎగురునట్లుగా కనిపించు నలుసు త్రసరేణువు.

మూడు త్రసరేణువులు	ఒక త్రుటి
వంద త్రుటులు	ఒక వేధ

మూడు వేధలు	ఒక లవము
మూడు లవములు	ఒక నిమేషము
మూడు నిమేషములు	ఒక క్షణము
అయిదు క్షణములు	ఒక కాష్ఠ
పదిహేను కాష్ఠములు	ఒక లఘువు
పదిహేను లఘువులు	ఒక ఘడియ
రెండు దండములు	ఒక ముహూర్తము
ఆరు లేక ఏడు ముహూర్తములు	ఒక యామము (జాము)
ఎనిమిది జాములు	ఒక రోజు (రాత్రింబవళ్లు)
పదిహేను దినములు	ఒక పక్షము
రెండు పక్షములు	ఒక నెల
రెండు నెలలు	ఒక ఋతువు
మూడు ఋతువులు	ఒక అయనము
రెండు అయనములు	ఒక సంవత్సరము (మానవులకు) దేవతలకు ఒక రోజు.

మానవుని ఆయుఃపరిమాణము నూరు సంవత్సరములు.
సంవత్సరములు అయిదు విధములు.

1. సంవత్సరము - సూర్యుడు పండ్రెండురాసులందు సంచరించు కాలము.
2. పరివత్సరము - బృహస్పతి పండ్రెండురాసులందు సంచరించు కాలము.
3. ఇలావత్సరము - మూడువందల సూర్యోదయములతో పండ్రెండు మాసములు నిండినవి.
4. అనువత్సరము - చంద్రుడు పండ్రెండు రాసులలో సంచరించు కాలము.
5. వత్సరము - నక్షత్రములు సంచరించు పండ్రెండు నెలల కాలము.

యుగములు నాలుగు

ధర్మము 4 పాదములు గలది	కృతయుగము	1,728,000	మానవ సంవత్సరముల
ధర్మము 3 పాదములు గలది	త్రేతాయుగము	1,296,000	
ధర్మము 2 పాదములు గలది	ద్వాపరము	864,000	
ధర్మము 1 పాదముగలది	కలియుగము	432,000	

మహర్లోకమునుండి బ్రహ్మలోకమువరకు భూలోకపు వేయి "నాలుగు యుగములు" అక్కడ ఒక్క పగలు. అంతేకాలము రాత్రికి అగును. బ్రహ్మదేవుడు రాత్రి అంతయు నిద్రించును. అనగా 4,320,000 × 1000 = 4,320,000,000 సంవత్సరములు నిద్రించునని అర్థము. బ్రహ్మదేవుని రాత్రి గడచిపోయిన తరువాత బ్రహ్మకల్పము ప్రారంభ మగును. బ్రహ్మకు రాత్రి అయినచో ప్రళయము వచ్చును.

ఒక బ్రహ్మకల్పమున పదునాలుగు మన్వంతరములు ఉండును. ఒక్కొక్క మనువు పాలించు మన్వంతరము కొంచెము ఎక్కువ తక్కువగా డెబ్బదియొక యుగములు ఉండును. ప్రతి మన్వంతరమునందు వేరు వేరు మనువంశపు రాజులు, సప్తఋషులు, దేవతలు, ఇంద్రుడు, గంధర్వులు ఏర్పడుచుందురు. బ్రహ్మదేవుని ప్రతిదిన సృష్టియందు మూడులోకముల సృష్టి జరుగుచుండును.

ఈ మన్వంతరములందు భగవంతుడు సత్వగుణాశ్రయుడై మనువు మున్నగు తన మూర్తుల ద్వారమున ప్రపంచమును పాలించుచుండును. బ్రహ్మదేవుని పగలు గడచిపోగా భగవానుడు తమోగుణము స్వీకరించి సృష్టి నిలిపి నిశ్చేష్ట భావమున నుండును. సూర్యచంద్రాదులులేని ప్రళయ రాత్రి వచ్చును. భూలోక, భువర్లోక, స్వర్గలోకములు బ్రహ్మశరీరమున లీనమగును. సంకర్షణుని ముఖాగ్నిలోపడి మూడులోకములు మాడిపోవును. ఆ వేడి భరించలేక భృగువు మున్నగు మహర్షులు మహర్లోకము వదలి జనోలోకమునకు వెళ్ళిపోయెదరు. అపుడు ఏడుసముద్రములును ప్రళయవాయువు వలన అల్లకల్లోలమై ఉప్పొంగును. భయంకరమగు పెద్ద పెద్ద కెరటములతో మూడులోకములను ముంచివేయును. ప్రళయ సముద్రమున భగవంతుడు కళ్లుమూసి యోగనిద్రలో శేషశయ్యపై పవళించును. జనోలోకమునందలి మునులు అతనిని స్తుతింతురు.

ఇట్లు బ్రహ్మయొక్క నూరేళ్ళ పరమాయువు ముగియును. బ్రహ్మదేవుని ఆయుర్దాయమున సగమునకు పరార్థమందురు. ఇప్పటికి మొదటి పరార్థము గడచిపోయి రెండవ పరార్థము నడచుచున్నది. మొదటి పరార్థపు ఆరంభమున శబ్దబ్రహ్మ జన్మించినందున దానికి బ్రహ్మకల్పమని పేరు. అది గతించినది. దాని తుదిని నారాయణుని నాభిసరస్సునుండి పద్మము ఉద్భవించినందున అది పద్మకల్పము అయినది రెండవ కల్పపు ఆరంభమున శ్రీమన్నారాయణుడు వరాహరూపము నెత్తినందున అది వరాహకల్పము అయ్యెను. ఇప్పుడు నడచుచున్నది వరాహకల్పము.

బ్రహ్మదేవుని పరమాయువైన ఈ రెండు పరార్థములు విశ్వాత్ముడైన శ్రీ విష్ణువునకు ఒక నిమేషము అనగా రెప్పపాటు కాలమగును.

పరమాణువు మొదలుకొని రెండుపరార్థములవరకు గల కాలము సర్వసమర్థమైనది. అయినప్పటికి సర్వాత్ముడైన శ్రీహరిమీద దీని ప్రభావము రవంతకూడ పడదు.

ప్రకృతి, మహత్తత్వము, అహంకారము, పంచతన్మాత్రలు, దశేంద్రియములు, మనసు, పంచభూతములు ఈ ఇరువది నాలుగు కలిసి ఈ బ్రహ్మాండము సిద్ధమైనది. దీని విస్తృతము ఇట్లున్నది.

నేల	కోటి యోజనములు
నీరు	పదికోట్ల యోజనములు
తేజస్సు	ఇరువదికోట్ల యోజనములు
గాలి	ముప్పదికోట్ల యోజనములు
ఆకాశము	నలుబదికోట్ల యోజనములు
అహంకారము	ఏబదికోట్ల ఆవరణములు
మహత్తత్వము	అరువదికోట్ల యోజనములు

భగవంతునిలో ఇట్టి బ్రహ్మాండములు పరమాణువులవలె కోటానుకోట్లు గలవు. అతడు కార్యకారణుడు. అక్షరుడు. నారాయణుడు.

వరాహావతార కథ

ఆదిమధ్యాంతరహితుడు, పరాత్పరుడగు శ్రీమన్నారాయణుని నివాసము వైకుంఠము. అచట నివసించువారు నిష్కాములై శ్రీ విష్ణుదేవుని పూజించు చుందురు. శుద్ధ సత్వమయ శరీరమున ధర్మమూర్తియగు విష్ణుమూర్తి భక్తులకు ఆనందము కలిగించుచుండును. అచట నిశ్శ్రేయసము అను సాక్షాత్తు పరమార్థ స్వరూపమైన వనము ఒకటి వున్నది. సర్వఋతువులందు పూలు పూచి కాయలు కాయునట్టి కల్పవృక్షములు ఆ వనమున కొల్లలుగా ఉన్నవి. గంధర్వులు విమానములపై తమ ప్రియురాండ్రతో వచ్చి అచట భగవత్కథలు గానము చేయు చుందురు. అచటి సరోవరము పక్కన ఒక మాధవీలత ఉన్నది. దాని మధుర వాసనలతో కూడిన పిల్లగాలి మనసులకు హాయి గొల్పును. ఆకర్షించును. అయినను వారి మనసులు మాధవీలతల కన్నను ఆహ్లాదకరములైన విష్ణుగాథలపై నసే

ఉండును. ఆ వనమునందలి తుమ్మెదలు ఝంకారములు చేయుచు విష్ణు కథలు గానముచేయుచుండగా పావురములు, కోకిలలు, బెగ్గురుపిట్టలు, చకోరములు, హంసలు, తిత్తిరిపక్షులు, నెమళ్ళు అల్లరిచేయక ఆ తుమ్మెదలు గానముచేయు విష్ణుగాథలను ఆలకించి తలలు ఊపుచు ఆనందించును. విష్ణుదేవునకు తులసి యనిన మిక్కిలి ప్రీతి అయినందున ఆ వనమున ఉన్నట్టి మందారములు, మల్లెలు, సంపెంగలు, గోరింటలు, కలువలు, తామరలు, పున్నాగలు, నాగకేసరములు, పారిజాతములు మిక్కిలి పరిమళము కలవే అయినప్పటికీ తులసి చేసిన తపస్సే గొప్పదని అంగీకరించును.

లక్ష్మీదేవి పరమ సౌందర్యవతి. ఆమెది చంచల స్వభావము. ఎవరి దగ్గరను గట్టిగా కాపురముండదు. కాని విష్ణుదేవుని మందిరమున ఆమె తన స్వభావమును వీడి స్థిరముగా కాపురమున్నది. పాదపద్మము లందలి నూపురములు ఘల్లుఘల్లుమనగా వైడూర్యమణులుతాపిన బంగారుగోడల సుందరభవనమున నడచుచుండగా ఆమె దివ్యసుందర విగ్రహము వైడూర్యములందు ప్రతిఫలించును. లక్ష్మీదేవి నిశ్శ్రేయస వనమునగల పవడపు పావంచలు గలిగి అమృతమువంటి నీరుగల సరస్సులందు విహరించుచు వానిలో ప్రతిఫలించిన దంతక్షతముగు తన నెమ్మోమును చూచి శ్రీవిష్ణువు ప్రసాదము పడయజాలితినని మనసులో ఉప్పొంగును.

ఒకనాడు సనక సనందనాదులు వైకుంఠము చేరుకున్నారు. భగవంతుని దర్శించవలెననెడి అభిలాషతో వైకుంఠమున చూడదగినవాని నన్నింటిని వదలి చకచక ఆరుద్వారములుదాటి ఏడవద్వారమువద్దకు చేరుకొనగా విష్ణుమూర్తివలెనున్న ఇద్దరు ద్వారపాలకులు గదలు పట్టుకొని నిలిచిఉండిరి. సనకాదులు వారిని లక్ష్యపెట్టక మిగత ఆరుద్వారములవలెనే ఏడవద్వారముకూడ దాటబోయినారు. నిర్భయముగను, నిస్సంకోచముగను దాటిపోవుచున్న వారిని చూచి జయవిజయులు అను ఆ యిరువురు ద్వారపాలకులు విరగబడి నవ్వినారు. తిరస్కరించినారు. బెత్తములతో బెదిరించినారు. ఏలననగా సనకాదులు వయస్కులే అయినను బాలకులవలె సంకోచములేక సంచరించువారు. బాలురవలె దిగంబరులుగా ఉండువారు.

సనకాదులు సర్వత్ర సమదర్శనులు. వారు ఆనాటివరకు ఆటంకమనునది ఎరుగరు. మాననీయులైన ఆ మహాపురుషులు అవమానము పొందినారు. ద్వారపాలకులు భగవద్దర్శనమునకు ఆటంకము కలిగించినారు. వారిలో కోపము పెల్లుబికినది. నేత్రములు కెంపులవలె మెరసినవి. గర్జించినారు :—



సనక సనందనాదులు వైకుంఠ ద్వారపాలకులగు జయ విజయులను శపించుట.

పుట. 79

"ఓరీ! ఎవరురా మీరు? భగవత్పరిచర్యలు చేసి ఈ లోకము సాధించువారు ధన్యులు. ఈ లోకమం దుండువా రెల్లరు సమదర్శనులు. మీరు అట్లుగాక విషమ వర్తనులై వర్తిల్లుచున్నారేమి? కపటులైనవారు ఇతరులను తమవంటివారలే యని ఊహింతురు. ఈ లోకమున ప్రశాంత పురుషుడైన శ్రీహరికి హాని కలిగించువా డుండునని తలచుట మీ కపట స్వభావమును వ్యక్తపరచుచున్నది. మహాకాశమున ఘటాకాశమెట్లో అట్లే ఆత్మలు ఈ పరమాత్మయందు నిలచియుండును. దేవవేషముదాల్చిన మీకు సమదర్శనము లేదు. కాన మీ రిచట నుండరాదు. వైకుంఠనాథునకు భృత్యులుగాన మీ అపరాధమునకు తగిన దండనము విధించవలెను. కాన ఈ లోకము వీడి కామ, క్రోధ, లోభములకు, పాపరూపులకు నెలవైన క్రిందిలోకమునకు పోవుదురుగాక!" అని శపించిరి.

ఆ శాపము విని గడగడలాడిపోయినారు జయవిజయులు. భక్తుల శాపమన్న భగవానునకే భయమని వారికి తెలియును. వారు మునుల పాదములపై బడి "మహానుభావులారా! మేము చేసిన అపరాధమునకు మీరు విధించిన శిక్ష తగియే ఉన్నది. మీరు విధించిన శిక్షచే మాపాపములను వదలించుకొందుము. కాని ఒక్క ప్రార్థన. మేము ఏ అధమయోనియందు జన్మించినను, ఎంత అధఃపతితులమైనను భగవంతుని మరచిపోవు మోహము మాత్రము మమ్ము ఆవరించకుండునట్లు అనుగ్రహించుడు" అని ప్రాధేయపడిరి.

సాధుజనప్రియుడైన భగవంతునకు ఈ విషయము తెలిసి లక్ష్మీదేవితోకూడి పాదచారియై ద్వారమువద్దకు విచ్చేసినాడు. భగవంతుని దర్శనము తమ తపఃఫలముగా భావించినారు సనకాదులు. వారు తనివితీరని కన్నులతో భగవంతుని దర్శించినారు. తలలువంచి నమస్కరించినారు. విష్ణుదేవుని పాదపద్మములపై పద్మపరాగము కలిసిన తులసిదళముల పరిమళము ఆఘ్రాణించినారు. పరమేశ్వరుని దర్శనమువలన బ్రహ్మానందము అనుభవించుచున్న వారికి తులసి పరిమళము మరింత ఆనందము కలుగజేసినది. వారి దేహములు పులకరించినవి.

వికసించిన నల్లకలువవంటి వదనము, పగడములవంటి పెదవులపై చిందులు త్రొక్కు మల్లెపూలవంటి మందహాసమును విప్పారిన కన్నులతో చూచి మహానందమ ననుభవించినారు. తిరిగి భగవానుని పాదపద్మములను దర్శించినారు. మనసార ఆ పాదపద్మములను ధ్యానించినారు. విష్ణుదేవుని స్తుతించినారు.

వనజదళాక్ష! భక్తజనవత్సల! దేవ! భవత్ప్రియుండు వ
ర్తనుఁడునైన సంయమహితాత్ముఁడు మాకు రహస్య మెఱుఁగఁ జె
ప్పిన భవదీయ మంగళ గుణిక పరిగ్రహ విగ్రహంబు మే
మనయము జూచి గంటిమి కృతార్థులమై భగమంటి మీశ్వరా!

అనఘ భవత్ప్రసాదము యుగార్చింపమై యెసఁగఁ బొందుచుట్టి యీ
ఘనసి పవిత్రమైనగతి రోయుదురా! భవదీయ సుధా
కలితములైన వాక్యముల సకల్మషయుక్తిని విన్న గద్గముర్
వింటిర శీఘ్రమై పవి పవిత్రములై విరసిల్ల మూరవా!

యోగసిద్ధులైనట్టి సనకుడు, సనత్కుమారుడు, సనందనుడు, సనత్సుజాతుడు అట్లు స్తుతించగా విష్ణుభగవానుడు సంతసించి ఇట్లు అన్నాడు :—

"మునులారా! వీ రిద్దరు జయవిజయులు. నా ద్వారపాలకులు. నా అభిప్రాయమును గమనించలేక మీకు అవమానము కలిగించినారు. కాన మీరు వారికి విధించిన దండన నేను సహితము అంగీకరించుచున్నాను. నా సేవకులు మీకు చేసిన అపరాధమువలన నేనే మీకు అపరాధముచేసినట్లు భావించుచున్నాను. సేవకులు అపరాధముచేసిన ఏలికకు అపవాదు కలుగును. కుష్టువ్యాధి చర్మమును పాడు చేసినట్లు సేవకుని అపరాధము ప్రభువును నాశనముచేయును. అందువలన మీకు అపరాధముచేసినవారు ఎవరైనను తుదకు నా చేతులైనను నరికి పార వేయుటకు సిద్ధముగా ఉన్నాను. మీవంటి మునుల వలననే సర్వపాపములను హరించు పవిత్రత నాపాదధూళికి కలిగినది. అందువలన లక్ష్మీదేవి క్షణమైనను నన్ను వదలకున్నది. నా పాదోదకమువలన ఇతర లోకములేకాక శివుడుకూడ పవిత్రుడగును. అయినను బ్రహ్మవేత్తలనిన నాకెంతయో మక్కువ. అభిమానము. పక్షపాతము. కాబట్టి వా రేదైనను అన్యాయము చేసినను సహింతును. దిక్కులేనివారు, గోవులు, బ్రాహ్మణులు నాకు ప్రాణము. వీరిని ఎవరు బాధించినను వారిని యముని సర్పములు బాణందులు పొడుచుకొని తినును.

నా ఈ భృత్యులు ఇద్దరు నా అభిప్రాయమును తెలుసుకొనలేక ప్రవర్తించినందువలన మీరు విధించిన దండన అనుభవించగలరు. కాని తిరిగి వీరు శీఘ్రముగా నా దగ్గరకు వచ్చునట్లు అనుగ్రహించుడు. వీరి ప్రవాసము దీర్ఘకాలము కాకుండ వలెనని నా ప్రార్థన."

సనకాదులు క్రోధముతో ఉన్నను అమృతమువంటి భగవానుని వాక్యములు విన్నారు. అవి మనోహరముగను, అర్థవంతముగను ఉన్నవని గ్రహించినారు.

ఆనందించినారు. పులకాంకితులు అయినారు. పరమేశ్వరుని ముందు ముకుళిత హస్తులై ఇట్లనిరి :—

"ప్రభూ! నీవు సర్వేశ్వరుడవు. అట్టి నీవు మమ్ము 'అనుగ్రహించుడు' అనుచున్నావు. నీ అభిప్రాయము మాకు అర్థమగునది కాదు. భగవానుడా! నీవు పరమ బ్రహ్మణ్యుడవు. బ్రహ్మ, రుద్రాదిదేవతలకు ఆరాధ్యుడవు. అయినను మేము నీకు 'ఆరాధ్యులము' అనుచున్నావు. నీవే సనాతనమైన ధర్మమును సృష్టించి ప్రతియుగమునందును అవతారమునెత్తి దానిని సంరక్షించుచున్నావు. నీ అనుగ్రహమువలన నివృత్తి పరాయణులైన యోగులు అనాయాసముగా మృత్యురూపమైన సంసారసాగరమును దాటుదురు. అట్టి నిన్ను ఇతరులు అనుగ్రహించగలరా! ప్రభూ! తపస్సు, శౌచము, దయ అనునట్టి ధర్మపు మూడు పాదములతోను సకల చరాచరమైన ఈ ప్రపంచమును నీవు రక్షించుచున్నావు. విశుద్ధమయమై సత్త్వమయమైన నీమూర్తితో స్వామీ! ధర్మవిరుద్ధమైన మా రజోగుణమును, తమోగుణమును తొలగించుము.

సర్వేశ్వరా! ఈ జయవిజయులను నీవు ఏ విధముగా దండించ దలచినను, మన్నించ దలచినను మేము ఎట్టి అభ్యంతరమును తెలియపరచము. నిరపరాధులైన వీరిని శపించినందులకు మాకు దండన విధించుము. సంతోషమున అనుభవింతుము.

వారి మాటలువిని శ్రీమన్నారాయణుడు "మునులారా! ఈ జయవిజయులు రాక్షసులై జన్మించి ఎనలేని క్రోధమున వీరి హృదయము ఎల్లపుడును నాపైననే ప్రబలమైయుండును. కాన త్వరలో నావద్దకు తిరిగి రాగలరు. మీరు ఇచ్చిన శాపము తొలుత నేను నిర్ణయించినదే కాని వేరుకాదు" అన్నాడు.

అదివిని సనకాదులు సంతసించినారు. స్వయం ప్రకాశమైన వైకుంఠమును కనులపండువుగా దర్శించినారు. భగవంతునకు ప్రదక్షిణ నమస్కారములుచేసి, శలవు తీసుకొని, భగవంతుని వైభవము కీర్తించుచు అచటినుండి వెళ్ళినారు.

అప్పుడు భగవానుడు జయవిజయులతో "భయపడవద్దు. మీకు శుభము కలుగుగాక. మునులశాపమును అనుసరించి భూలోకమున జన్మించుడు. మునులశాపము మరలించు శక్తిగలవాడనేనై అట్లుచేయుట నాకు సమ్మతముకాదు. మీవలన బ్రాహ్మణతేజస్సు ప్రకాశించవలసి ఉన్నది. నాపై క్రోధమున మీలో ఏకాగ్రత

ఏర్పడును. అందువలన బ్రాహ్మణులను అవమానపరచిన పాపములనుండి విముక్తులై శీఘ్రముగా నాదగ్గరికి చేరగలరు" అని చెప్పి లోనికి వెడలెను.

ఉత్తమ దేవతలైన జయవిజయులు నిరాటంకమైన మునుల శాపమున తేజస్సు ఉడిగి, దీనులై వైకుంఠమునుండి భూలోకమున పడిపోయిరి.

ఉత్తమ విమానములనుండి దేవతలు హాహాకారములు చేసిరి.

దితి గర్భము దాల్చుట

దక్షప్రజాపతి బ్రహ్మకు పుత్రుడు. అతడు మనువుకూతురు ప్రసూతిని పెండ్లాడినాడు. ఆమె గర్భమున అందమైన బాలికలు పదహారుమంది పుట్టిరి. దక్షుడు వారి నందరిని పిలిచి 'మీరు ఎవరిని పెండ్లాడుదురు?' అని అడిగెను. దితి సహితముగా పదమూడుమంది కశ్యపుని వరించిరి. వారిలో పన్నెండుమందికి సంతానము కలుగగా కొంతకాలమువరకు దితికి సంతానము కలుగలేదు.

ఒకనాటి అసుర సంధ్యాసమయమున ఆమె కామాతురయై భర్తవద్దకు వెళ్ళినది. అపుడు కశ్యపుడు అగ్నిలో హోమముచేయుచు సమాధిలో కూర్చున్నాడు. దితి భర్తవద్దకు వెళ్ళి అతనితో "మదించిన ఏనుగు అరటిచెట్లను బాధించినట్లు మన్మథుడు నన్ను బాధించుచున్నాడు. నా సవతులందరు సంతానముకని సుఖముగా ఉన్నారు. నన్ను అనుగ్రహించుము. సంతాన రూపమున తమ గర్భములలో పతిని కని భర్తృప్రేమ చూరగొనిన వనితలు లోకమున కీర్తి పొందుదురు. కాన నా కోరిక చెల్లించుము. నీ వంటి మహాపురుషులవద్దకు వచ్చిన తరువాత కోరిక తీరక పోవుట అనునది ఉండదు" అనెను.

అందుకు కశ్యపుడు భార్యను ప్రియవచనముల అనునయించుచు "కామినీ! నీవు కోరుచున్న ప్రియకార్యము త్వరలోనే పూర్తిచేయుదును.

> గృహస్థునకు భార్యవలన ధర్మము, అర్థము, కామము లభించును. అట్టి భార్య కోరిక తీర్పనివా డెవ్వడు? ఓడ సహాయమున సముద్రమును దాటినట్లు గృహస్థుడు భార్య సహాయమున సంసారమను సముద్రమును దాటిపోవును. భార్య అనగ పురుషునకు అర్ధశరీరము. ఆమెకు భార్యభారము అప్పగించి పురుషుడు నిశ్చింతుడు అగును. ఇతర ఆశ్రమముల ఇంద్రియములు గెలువరాని శత్రువులే కాని గృహస్థుకు దుర్గాధిపతి శత్రువులను సులువుగా జయించునట్లు భార్యసహాయమున ఇంద్రియములను గెల్చుకొనును.

నీవు నా యిల్లాలవు. పురుషుడు నీ వంటి ఇల్లాలు ఉపకారమును జీవితమందును, జీవితము తరువాతను తీర్చుకొనలేడు. కాన నీ ఈ సంతాన వాంఛ తప్పక తీర్చెదను. కాని ఇది అసురసంధ్యా సమయము. రాక్షసులు మున్నగు భయంకర జీవులు, భూతగణములు సంచరించు సమయము. ఈ సాయంకాల సమయమున భూతభావనుడు, భూతపతి అయిన రుద్రభగవానుడు తన భూతప్రేతగణములతో వృషభవాహనుడై తిరుగుచుండును. సుడిగాలి రేపిన శ్మశాన ధూళిపడి అతని జటాజూటము దేదీప్యమానముగా ఉండును. అతని బంగారురంగు శరీరము తెల్లని భస్మమున మెరయుచుండును. సూర్యుడు, చంద్రుడు, అగ్ని అను మూడు నేత్రములతో ఇప్పుడు నీ మరదియైన రుద్రుడు అందరను చూచుచుండును. అతడు చూచుచుండగా సంగమము తగదు. కాన ఒక ముహూర్తము ఆగుము. ఇపుడు అతనికి తనవా రనిగాని, పరు లనిగాని, ఆదరించదగినవా రనిగాని, తగనివా రనిగాని ఉండరు. ఈ సమయమున అతని కంటపడని దనుచు ఉండదు. అతడు కాలదన్ని వదలిన మాయనే మేము స్వీకరింత ముకొందుము. అజ్ఞానమను ఆవరణ దాటుటకుగాను అతని చరిత్రనే గానము చేయుదుము. అతనికి సమానులు లేరు. సత్పురుషులు మాత్రము అతనిని చేరగలరు.

> ఈ దేహము కుక్కలు తినుటకు యోగ్యమైనది. అయినను బుద్ధిహీనులైన మానవులు దీనికి బట్టలుకట్టి, సొమ్ములుపెట్టి, హారములువేసి, గంధములుపూసి తీర్చిదిద్దెదరు. అట్టి బుద్ధిహీనులు శివుని ఆచరణయందు నవ్వుదురు. బ్రహ్మాదులే అతడు అవలంబించిన ధర్మమును శిరసా వహించెదరు. అతడు విశ్వమునకు అధిష్ఠాత. మాయ అతని కనుసన్నలలో నడుచును. అయినను ప్రేతము వలెనే సంచరించు నతడు. అతని అద్భుతలీల అవగతమగునదికాదు.''

భర్త అట్లు ప్రియవచనముల అనునయించినను కామాతురయైన దితి వేశ్యవలె సిగ్గులేక కశ్యపుని బలవంతపరిచినది. నిందితకార్యమునకుగాను భార్య పట్టుదల చూచి కశ్యపుడు ఏకాంతప్రదేశమున ఆమెతో సంగమము చేసినాడు. తరువాత నదికివెళ్ళి స్నానముచేసి ప్రాణాయామ పూర్వకముగా నిత్యభర్గుడను సనాతన బ్రహ్మను ధ్యానించుచు జపము చేసెను.

తాను చేసిన నిందిత కార్యమునకు సిగ్గుపడిన దితి భర్తవద్దకువెళ్ళి అధోముఖయై నిలుచుండి "నాథా ! ప్రతిభాశాలి, ఉగ్రస్వభావుడు, భక్తులపాలిటి కల్పతరువు, మహాదేవుడు అయిన శివునకు నమస్కరించుచున్నాను. సర్వభూతగణముల అధి

పతియైన రుద్రునివద్ద అపరాధము చేసినాను. అతడు నా గర్భమును నష్టపరచ కుండునట్లు అనుగ్రహించుము.

> సనః ప్రసీదతాద్భామో భగవానుర్వనుగ్రహః
> వ్యాధస్యాప్యనుకంప్యానాం స్త్రీణాం దేవస్సతీపతిః

కిరాతులు సహితము ఆడవారిని అనుగ్రహింతురు. సతీపతియైన దేవుడు, పరమ దయామూర్తి నన్ను అనుగ్రహించుగాక !" అన్నది.

సాయంసంధ్యాదులు ముగించుకొని కశ్యపుడు చూడగా గడగడ వడకుచు ఎదుట నిలుచుని, తన గర్భమునందలి సంతానమునకు శుభము కలుగవలెనని ప్రార్థించు చున్న భార్య, దితి కనిపించినది.

"అమంగళురాలా ! కాలముకాని కాలమును నా మాట పెడచెవినిపెట్టి దేవత లను నిర్లక్ష్యము చేసినావు. కాన నీ గర్భమున అధములు అమంగళాకారులు జన్మించి లోకపాలుర సహితముగా లోకములనెల్ల హింసింతురు. దీనులను నిరప రాధులను బాధపెట్టుదురు. అబలలను చెర పట్టుదురు.

> తదా విశ్వేశ్వరః క్రుద్ధో భగవాన్ లోకపాలకః
> హనిష్యత్యవతీర్యాసౌ యథాద్రీన్ శతపర్వధృక్

విశ్వేశ్వరుడు, లోకపాలకుడు, భగవంతుడు క్రోధము వహించి అవతారమెత్తి ఇంద్రుడు కొండలనువలె వారిని వధించును" అన్నాడు.

అందుకు దితి "స్వామీ ! నా కుమారులు మరణించిన భగవానునిచేతనే చావవలె గాని బ్రాహ్మణశాపమునకాదు. ఏలనని బ్రాహ్మణశాపమున నశించినవారిని నరకమందునకూడ కనికరించరు. ఏ యోనియందు జన్మించినను ఎవరును దయ దలచరు" అన్నది.

"దేవీ ! నీవు చేసిన అపరాధమునకు త్వరలోనే పశ్చాత్తాప పడుచున్నావు. నీకు విష్ణువుమీద, శివునిమీద, నా మీద భక్తియు గౌరవమును ఏర్పడినవి. కాన నీకు పుట్టిన పుత్రులలో హిరణ్యకశిపునకు కలుగు నలుగురు పుత్రులలో ఒకడు ఉత్త మోత్తముడు అగును. మహాత్ములు సహితము అతనిని మన్నింతురు. అతని పవిత్ర కీర్తిని భగవంతుని గుణగణములతో కలిపి కీర్తింతురు. పుటముపెట్టి బంగారమును శుద్ధిచేసినట్లు విరోధభావము విడిచి ఆత్మశుద్ధి చేసుకుంటాడు.

అంతర్బహిశ్చామలమబ్జనేత్రమ్ స్వపూరుషేచ్ఛానుగృహీతరూపమ్
పౌత్రస్తవ శ్రీలలనాలలామం ద్రష్టా స్ఫురత్కుండలమండితాననమ్.

అమలుడు, అబ్జనేత్రుడు తన ఇచ్ఛననుసరించి రూపములు గ్రహించువాడు, కుండలములచే ప్రకాశించు వదనముగలవాడైన లక్ష్మీశుని నీ పౌత్రుడు చూడగలడు" అన్నాడు.

పౌత్రుడు మహాభాగవతుడు అగునని సంతసించినది దితి.

పుత్రులు భగవంతునిచే మరణించెదరని తెలిసి ఆనందించినది దితి.

హిరణ్యాక్ష, హిరణ్యకశిపులు.

దితి పూర్తిగ వందసంవత్సరములు నిండినతరువాత కవలపిల్లలను కన్నది. వారి పుట్టుకతో భూమి మీదను, స్వర్గమందునను, ఆకాశమునను అనేక ఉత్పాతములు కలిగినవి.

భూమి కంపించినది. కొండలు గడగడలాడినవి. దిశలు మండినవి. ఉల్కలు కురిసినవి మబ్బులేక పిడుగులుపడినవి. తోకచుక్కలు పొడిచినవి. ఝంఝా మారుతములు వీచినవి. చెట్లు కూకటివేళ్ళతో కూలినవి. సుడి గాలి రేగినది. మబ్బులు క్రమ్మి, ఉరుములు ఉరిమి, మెరుపులు మెరసి సూర్యుని క్రమ్మివేసినవి. చీకట్లు క్రమ్మి ఆకసమంతయు అతమోమయమైనది. సముద్రములు గర్జించినవి. ఆకసమునంటు కెరటములు లేచినవి. మొసళ్ళు మొదలగు జంతువులు అల్లకల్లోల మైనవి. చెరువులు, బావులు, నదులు, క్షోభచెంది వానిలోని పద్మములు వాడి పోయినవి. రాహువు సూర్యచంద్రులను అనేకసారులు మ్రింగినాడు. సూర్య చంద్రులచుట్టు గూళ్ళు కట్టినవి. కొండగుహలనుండి రథములు పరిగెత్తినట్లు ధ్వనులు వినవచ్చినవి. ఊరి మధ్య నక్కలు నోళ్ళతో నిప్పులు కక్కినవి. మోర నెత్తి ఊళ వేసినవి. కుక్కలు మోరలెత్తి ఏడ్చినవి. గాడిదులు మందలు మందలుగా ఓండ్రుపెట్టినవి. అవి ఓండ్రుపెట్టుచు, డెక్కలతో నేల తవ్వుచు నాలుగువైపుల దౌడుతీయగా పక్షులు బెదిరి గూళ్ళువదిలి పారిపోయినవి. దేవ విగ్రహములు కన్నీరు కార్చినవి. క్రూరగ్రహములు శుభగ్రహములను, నక్షత్రములను అతిక్రమించే వక్రగతితో సంచరించినవి.

అట్లు జయవిజయులు ఆది దైత్యులై జన్మించినారు. పూర్వజన్మసిద్ధమైన పరాక్రమముచే ఉక్కువంటి శరీరములు కలిగి పెద్దకొండలవలె పెరిగినారు. వారి

తలలమీది కిరీటములు ఆకస మంటినవి. వారి మొల త్రాళ్ళు సూర్యకాంతిని మించినవి. వారు నడచిన భూమి గడగడలాడినది.

కశ్యపుడు తన పుత్రులిద్దరకు యథాసమయమున నామకరణము చేసినాడు. పెద్ద వాడు హిరణ్యకశిపుడు, చిన్నవాడు హిరణ్యాక్షుడు అయినాడు.

హిరణ్యకశిపుడు బ్రహ్మనుగూర్చి తపస్సుచేసి మృత్యువు కలుగకుండునట్లు వరముగొని విజృంభించి లోకపాలుర సహితముగా ముల్లోకములను తన వశము చేసుకున్నాడు. అతని తమ్ముడు హిరణ్యాక్షుడు ఎల్లప్పుడు అన్నను మెప్పించుచు అతని అనుగ్రహము సంపాదించుచుండువాడు. అతనికి యుద్ధమనిన ప్రాణము. తనతో సమముగా యుద్ధముచేయు వీరుని వెదకుచు అతడు ఒకనాడు స్వర్గము ప్రవేశించినాడు. కంఠమున వైజయంతీమాల ధరించి, భుజముపై మహాగద దాల్చి, కాళ్ళకు గల బంగారు కడియములు మ్రోగించుచు, వచ్చుచున్న మహా బలాఢ్యుడైన హిరణ్యాక్షుని చూచిన దేవతలు గరుత్మంతుని చూచిన పాములు పుట్టలలో దూరినట్లు పరిగెత్తి సందులందును, గొందులందును దూరిరి. అట్లు పారిపోయిన దేవతలను చూచి గర్వమున మరింత పొంగినాడు హిరణ్యాక్షుడు. భయంకరముగా కేకలు వేయుచు సముద్రమున దూకినాడు. కెరటములను చితుక కొట్టి వీరవిహారముచేసినాడు. జలచరములు భీతిల్లినవి. అతడు తన ఊపిరితో ఉప్పెన పుట్టించినాడు. ఎన్నో సంవత్సరములు చిందులుత్రొక్కుచు సముద్రమున తిరిగి తుదకు వరుణదేవుని రాజధానియగు విభావరీపురము ప్రవేశించెను. హిరణ్యాక్షుడు తన ఇనుపగదతో నగరద్వారములు బద్దలుకొట్టి వరుణదేవుని చూచి విరగబడి నవ్వుచు పరిహాసముగా నమస్కరించినాడు. తనతో యుద్ధము చేయవలసినదని సవాలుచేసినాడు.

అతని మదాంధతకు వరుణదేవుడు మండిపడినాడు. అయినను, గర్వమున తలతిరిగిన వానితో కయ్యమునకు దిగుట తగదని భావించి కోపమును దిగమ్రింగి ఇట్లనెను :—

"దానవరాజా! నేను యుద్ధము మానుకొన్నాను. యుద్ధమున ఆరితేరిన వాడవు, నీతో యుద్ధముచేయగలవారును నాకు ఎవరును కనిపించుటలేదు. మహాపురుషుడైన విష్ణువు తక్క నీతో యుద్ధముచేసి అడ్డగలవారు కనిపించుటలేదు. అతని వద్దకు వెళ్ళుము. నీ కోరిక నెరవేరును. నీ భుజముల తీట తీరిపోవును. పొగరు చల్లారును. హాయిగా విశ్రాంతి తీసుకొనగలవు.

యుత్త్వ ద్విధావామవతాం ప్రశాంతయే రూపాణి ధత్తే సదనుగ్రహేచ్ఛయా

నీ వంటి దుష్టులను సంహరించుటకుగాను శ్రీవిష్ణువు స్వేచ్ఛతో అనేకరూప ములను ధరించును."

హా మూర్తి.

స్వాయంభువ మనువును సృష్టించినాడు. శతరూపను అతని భార్యగా చినాడు.

భువ మనువు భార్యతో కలిసి బ్రహ్మముందు వినయపూర్వకముగా కోడించి "భగవంతుడా! నీవు సమస్తజీవులకు జన్మదాతవు. నీ బిడ్డలము మేము ఏమి చేయవలెనో ఆదేశింపుము" అని ప్రార్థించినాడు.

అది విని బ్రహ్మ స్వాయంభువునితో ఇట్లనెను :-

"కపటములేని హృదయముతో మీరు నాకు ఆత్మార్పణముచేసి 'ఏమి చేయవలెనో ఆదేశింపుము' అని అడిగినారు. మీకు శుభము కలుగు గాక! తలిదండ్రులను సేవించుట వారి ఆజ్ఞ పాలించుట పుత్రుల కర్తవ్యము. నీవు చేయవలసినదానిని గురించి చెప్పుచున్నాను వినుము. నీవు నీ భార్యాగర్భమున గుణవంతులైన పుత్రులను బడసి ధర్మముగా భూమిని పాలింపుము. యజ్ఞములుచేసి యజ్ఞపురుషుడైన శ్రీహరిని ఆరాధించిన శ్రీహరి నీ యెడల ప్రసన్నుడగును. పరమేశ్వరుడు ప్రసన్నముకానివాని ఆత్మకు సుఖము లేదు."

బ్రహ్మ ఆదేశము విని మనువు ఇట్లనెను :—

"తండ్రీ! నీ ఆజ్ఞ శిరసావహించెదను. నన్ను అనుగ్రహింపుము. నా భావి ప్రజలు నివసించునట్టి స్థలమును నిర్దేశింపుము. ప్రాణికోటి నివసించునట్టి భూమి ఈ విశాల సముద్రమున మునిగి ఉన్నది. దీనిని ఉద్ధరింపుము" అని ప్రార్థించినాడు.

బ్రహ్మ మనువు ప్రార్థన ఆలకించి అగాధమైన నీటిఅడుగున ఉన్న భూమిని చూచినాడు. 'నేను సృష్టిచేయుచున్న సమయమున భూమి నీటిలో మునిగిపోయినది. అది ఇపుడు రసాతలమున ఉన్నది. సృష్టికార్యమున నన్ను నియమించినవాడు శ్రీహరి. ఇపుడు నేను ఏమి చేయవలె' నని ఆలోచించుచుండగనే అతని ముక్కు పుటములనుండి బొటనవ్రేలంత చిన్న వరాహము బయటికివచ్చి, చూచుచుండగనే పెద్ద ఏనుగంత అయి ఆకాశమునకు ఎగిరినది. అది చూచి

విరించి, అతని పుత్రులు మరీచి మున్నగు మహామునులు, స్వాయంభువ మనువు ఆశ్చర్యపడినారు.

ఇంతలో వరాహరూపమునకున్న శ్రీమన్నారాయణుడు కొండంత పెరిగి దిక్కులు బ్రద్దలగునట్లు భయంకరముగా ఘుర్ఘురించినాడు. అది విని బ్రహ్మ, మరీచి,మనువు ఆనందించినారు. సత్యలోకమునందలి మహామునులు ఋగ్యజుస్సామ వేదములందలి పవిత్ర మంత్రములతో స్తుతించినారు. ఆ స్తోత్రములువిని ఆనందమున మరింత ఘుర్ఘురించినాడు వరాహమూర్తి. నీళ్ళలోనికి ఉరుకుటకు తోక మీదికి ఎత్తినాడు. భయంకరమైన వడితో ఆకసమునకు ఎగిరినాడు. డెక్కలతో మేఘముల విరజిమ్మినాడు.

వజ్రపర్వతమువలెనున్న కఠోర శరీరమున నీళ్ళలో దుముకగా సముద్రగర్భము పగిలినట్లై, మేఘములు గర్జించినట్లై ఘోరమైన శబ్దముతో పెద్దపెద్ద తరంగములు పైకి ఎగయగా సముద్రుడు చేతులుజోడించి "రక్షించుము స్వామీ" అని అరచుచున్నట్లు అనిపించినది. డెక్కలతో సముద్రజలమంతయు చీల్చి చెండాడినాడు స్వామి. రసాతలమువరకు బయలుపరచి భూమిని కనిపెట్టినాడు. భూమిని చూడగనే మెరుపువలె నీళ్ళలో మునిగినాడు, తన దంతములతో భూమిని ఎత్తినాడు.

సముద్రమందున్న హిరణ్యాక్షుడు అది చూచినాడు. అరచినాడు "ఓరీ మూర్ఖుడా ! బ్రహ్మ పాతాళమున ఉండువారికొరకురా భూమిని సృష్టించినది. నీవు పందివి. నీ కెందుకురా భూమి ? దేవతలందరును మా శత్రువులు. మమ్ము నాశనముచేయుటకే నిన్ను దేవతలు పాలుపోసి పెంచుచున్నారు. నిన్ను చంపి మా వారి కష్టములు తీర్చుదును. నాగదతో నీ తలను పిండిచేసి మునుల, దేవతల మూలమును హతమార్చెదను.

హిరణ్యాక్షుని వాడి తోమరములవంటి దుర్భాషలు విన్నాడు స్వామి. తన కోరలమీద నిలచి భయమున వడకుచున్న భూదేవిని చూచినాడు. హిరణ్యాక్షుని దుర్భాషలు సహించి మొసలి పట్టుకున్న ఏనుగు ఆడు ఏనుగుతో నీటినుండి బయటికి వచ్చినట్లు భూదేవితోకూడ నీటినుండి బయటికి వచ్చి భద్రమైనచోట భూమిని స్థాపించి తన ఆధారశక్తితో దానిని నిలిపినాడు.

అది చూచి బ్రహ్మ స్తుతించినాడు.
దేవతలు పూలవాన కురిపించినారు.

అప్పుడు కోపమున గర్జించినాడు వరాహమూర్తి :— "ఓరీ దుష్టుడా ! నిజమే ! నేను వంటినే. కాని నీ వంటి కుక్కల కొరకు వెదకుచున్నాను ! ఏమిటి విఱ్ఱ వీగుచున్నావు. చావు దగ్గరపడినదని తెలుసుకొనలేకున్నావు. పాతాళవాసులు దాచుకున్న భూమిని ఎత్తుకొని వచ్చుచున్న నన్ను పిండిచేయుదువు కదా ! పిచ్చినాయనా ! నేను పారిపోవుచున్నాను కదా ! బలము లేకున్నను నీ ముందు నిలుచుండి యుద్ధము చేయవలెను. ఏలనన నీ వంటి బలవంతునితో వైరము పెట్టుకొని ఎక్కడ దాగగలను ? రమ్ము ! త్వరగా రమ్ము. శపథము చేసినావు కదా! నన్ను అంతముచేసి నీ వారల కన్నీళ్ళు తుడిచెదనని. సరే శపథము నిలుపుకొమ్ము.

భగవానుని తిరస్కారము విని బుసలుకొట్టినాడు రక్కసి. నిప్పులు కురిసినాడు. క్రోధమున వడకిపోయినాడు. భయంకరముగు గద గిర గిర త్రిప్పి స్వామి గుండెకు గురిచూచి కొట్టినాడు. వరాహమూర్తి తప్పుకున్నాడు. గద పడిపోయినది. మండిపోయినాడు హిరణ్యాక్షుడు. గద అందుకొని భగవానునిమీదకు ఉరికినాడు. శ్రీహరి రక్కసి ఎడమ కనుబొమకు గురిపెట్టి గదతో కొట్టినాడు. రాక్షసుడు దెబ్బ తప్పుకున్నాడు.

ఇట్లు ఆదివరాహమూర్తి, ఆదిదైత్యుడు ఒకరినొకరు గెలవవలెనను దీక్షతో పోరాడినారు. ఇద్దరిలోను ఉద్రేకము పెరిగినది. ఇద్దరి శరీరములు గదల దెబ్బలకు రక్తసిక్తములైనవి. రక్తపు వాసనతో ఇద్దరును ఉద్రిక్తులైనారు. ఆవు కొరకు పోరాడు ఆబోతులవలె విజృంభించి పోరినారు.

అది చూచినాడు బ్రహ్మ. "అచ్యుతా ! సాయంసంధ్య కావచ్చుచున్నది. రాత్రియైన రాక్షసులబలము పెరుగును సాయంకాలమునకు పూర్వమే ఈ రాక్షసుని వధించి దేవతలకు జయము ప్రసాదించుము. ఇది అభిజిత్తు శుభముహూర్తము. రాక్షసుని కడతేర్చుము. ముల్లోకములకు శాంతి ప్రసాదించుము" అని ప్రార్థించినాడు.

వరాహమూర్తి బ్రహ్మదేవుని చల్లనిమాటలు విన్నాడు. చిరునవ్వు నవ్వినాడు. తనమీదకు విరుచుకొని పడుచున్న దైత్యునిమీదకు లంఘించి అతని నుదటిమీద కౌమోదకితో కొట్టినాడు. హిరణ్యాక్షుడు దెబ్బ కాచుకొనుచు తన గదతో స్వామిగదను కొట్టినాడు.

కౌమోదకి త్రుళ్ళి క్రిందపడిపోయినది.

దేవతలు హాహాకారము చేసినారు.

వరాహమూర్తి చేతిలో ఆయుధములేదు. అయినను రాక్షసుడు హరిమీదకు రాలేదు. అతడు యుద్ధధర్మమును పాటించి ఆగిపోయినాడు.

శ్రీహరి సుదర్శనము చేపట్టినాడు. హిరణ్యాక్షుడు మండిపోయినాడు. పెదవి కరచినాడు. అగ్గి కురిపించినాడు. "రా! ఈతడవ బ్రతికిపోవు" అని గద విసరినాడు. గద వాయువేగమున వస్తున్నది. వరాహమూర్తి ఎగిరినాడు. గదను ఎడమకాలితో తన్ని పడగొట్టినాడు. 'ఓరీ! గదనుతెచ్చుకో' అని అరచినాడు స్వామి.

మళ్ళీ గదతీసి రెప్పపాటులో విసరినాడు దైత్యుడు. పామును పట్టిన గరుత్మంతునివలె గదను పట్టినాడు వరాహస్వామి.

ఈసారి గద అందించినను అందుకొనలేదు రాక్షసుడు. మహాబలవంతుడైన హిరణ్యాక్షుడు బలమును చిక్కబట్టి స్వామిమీదకు త్రిశూలము విసరినాడు. వరాహమూర్తి సుదర్శనముతో త్రిశూలమును నరికినాడు. హిరణ్యాక్షుడు మండిపడినాడు. వరాహమూర్తిమీదకు ఉరికినాడు. గుండెలమీద పిడికిటి పోట్లు పొడిచినాడు. ఆకాశము బ్రద్దలగునట్లు సింహనాదము చేసి మాయమైనాడు. మాయామయుడైన శ్రీహరిమీదనే మాయను ప్రయోగించినాడు హిరణ్యాక్షుడు.

తుఫాను రేగినది. ధూళి లేచినది. చీకట్లు కమ్మినవి. వడగళ్ళవాన కురిసినది. ఉరుములు ఉరిమినవి. మెరుపులు మెరసినవి. మేఘములు కమ్మినవి. సూర్యచంద్రాదులు అదృశ్యులైనారు. తలవెంట్రుకలు కురిసినవి. మలమూత్రములు కురిసినవి. కొండలు కదిలినవి. అస్త్రములు కుమ్మరించినవి. తలలు విరబోసుకొని త్రిశూలం పాణులైన దిసమొలల రాకాసులు లెక్కలేనంతమంది కనిపించినారు.

వరాహమూర్తి సుదర్శనమును ప్రయోగించినాడు.

దితి పాలిండ్లు రక్తము చేపినవి.

దైత్యునిమాయ పటాపంచలైనది.

ఉన్మత్తుడైనాడు హిరణ్యాక్షుడు. కౌగిట నలిపి వేయవలెననుకున్నాడు వరాహమూర్తిని. ఉరికి బిగించి పట్టుకున్నాడు. కాని శ్రీహరి సంకటలేదు. వరాహమూర్తి హిరణ్యాక్షుని గూబమీద కొట్టినాడు. హిరణ్యాక్షుడు గిర్రున తిరిగి పోయినాడు. కనుగ్రుడ్లు బయటికి వచ్చినవి. కాలుసేతుల కొట్టాడిపోయినవి.

మొదలు నరికిన చెట్టువలె కూలిపోయినాడు.

ఖలగర్వమున విజృంభించిన హిరణ్యాక్షుని కళేబరము భయంకరముగా కనిపించినది.

"నమో నమస్తేఽఖిలయజ్ఞతంతవే స్థితౌ గృహీతామలసత్త్వమూర్తయే
దిష్ట్యా హతోఽయం జగతామరుంతుదస్త్వత్పాదభక్త్యా వయమీశ నిర్వృతాః"

నీవు అఖిల యజ్ఞ ప్రవర్తకుడవు. శుద్ధసాత్త్విక మూర్తివి. మేము నీ పాద సేవకులము. ఇదే నమస్కరించుచున్నాము. జగములకు ఉపద్రవము కలిగించు వానిని సంహరించి మాకు శాంతి ప్రసాదించినావు. నీకు నమస్కారము."

అని దేవతలు కీర్తించినారు.

ఆది వరాహమూర్తి వైకుంఠమునకు వేంచేసినాడు.

ఏతన్మహాపుణ్యమలం పవిత్రం ధన్యం యశస్యం పదమాయురాశిషాం
ప్రాణేంద్రియాణాం యుధి శౌర్యవర్ధనం నారాయణోఽంతే గతిరంగ శృణ్వతాం.

ఈ చరిత్రము ఎంతో పుణ్యప్రదమైనది. పవిత్రమైనది. ధన్యమైనది. కీర్తి నిచ్చును. దీనిని విన్నచో ఆయుష్యము పెరుగును. కోరికలు సిద్ధించును. యుద్ధమునందు శౌర్యమును పెంచును ప్రాణము ఇంద్రియములు బలించును. అవసానమున శ్రీవైకుంఠము చేర్చును.

కర్దమ ప్రజాపతి.

ప్రజాసృష్టికిగాను బ్రహ్మ ప్రజాపతులను సృష్టించినాడు. వారు బ్రహ్మ అంగము నుండి జన్మించినారు. వారిలో కర్దమ ప్రజాపతి బ్రహ్మదేవుని ఛాయనుండి జన్మించినాడు. కర్దముడు సరస్వతీ నదీతీరమున పదివేల సంవత్సరములు తపస్సు చేసియు, పూజలు ఉపచారములు సలిపియు శ్రీవిష్ణుభగవానుని ఆరాధించినాడు. సత్యయుగారంభమున భగవంతుడు ప్రత్యక్షము అయినాడు.

వేయి సూర్యులవలె వెలిగిపోవుచు గరుత్మంతునిమీద పాదములుంచి దర్శనమిచ్చినాడు భగవానుడు. ఆతని కంఠమును తెల్లపద్మములహారము, ఎరుపుపద్మముల మాల, కౌస్తుభమణి అలంకరించినవి. తలపై మణిమయ కిరీటము, చెవులకు రత్నకుండలములు, చతుర్భుజములందు శంఖ, చక్ర, గదా, పద్మములు ఎంతో శోభను కలిగించుచున్నవి. వక్షస్థలము లక్ష్మీదేవి ఆశ్రయముగా ఉండగా ముఖమున నల్లని ముంగురులు పడుచున్నవి. పీతాంబరము శరీరముపై రెపరెపలాడుచున్నది.



కర్దమప్రజాపతికి భగవానుడు ఉపదేశ మొసగుట.

పుట. 91

భగవానుని దివ్యమంగళ విగ్రహము దర్శించి అతడు ఉప్పొంగిపోయినాడు. తల వంచి, సాష్టాంగపడి, అంజలి ఘటించి, వినయమున ఇట్లు స్తుతించినాడు.

"పరమేశ్వరా! సాలీడు స్వయముగా గూడు అల్లి, రక్షించి తాను స్వయముగా నాశనము చేయును. అట్లే నీవు ఒక్కడవు యోగమాయా బలమున సత్వరజస్తమో గుణములను సృష్టించుచున్నావు రక్షించుచున్నావు. సంహరించుచున్నావు.

స్వామీ! నీవు నిజముగా నిష్క్రియుడవు. అయినను మాయచేత లోకములన్నింటిని సృష్టించుచున్నావు. నిన్ను ఏమాత్రము సేవించినను కోర్కెలు తీర్తువు. నీ పాద పద్మములకు పదేపదే నమస్కరించుచున్నాను."

కర్దమ ప్రజాపతి స్తోత్రమువిని భగవంతుడు కరుణించినాడు. కనుబొమలలో అనుగ్రహము తాండవించినది.

"కర్దమా! నీవు ఏ అభిలాషతో నన్ను అర్చించుచున్నావో నాకు అవగతమైనది. నీ కోరిక సిద్ధించును. స్వాయంభువమనువు చతుస్సముద్రముద్రితమైన భూమండలమును పాలించుచున్నాడు. అతని కూతురు దేవహూతి అందమైనది గుణవంతురాలు. మనువు తనభార్యతో నీవద్దకువచ్చి దేవహూతిని నీ కిచ్చి వివాహము చేయును. ఆమెను పెండ్లాడుము. ఆమెవలన తొమ్మిది మంది కూతుళ్ళను కనెదవు. వారిగర్భమున జనించినవారు ఋషులగుదురు. నీవు నా యాదేశము పాలించుము. నీ కర్మఫలమంతటిని నాకే సమర్పించినందున శుద్ధసత్త్వుడవై నన్నే పొందగలవు. నీవు గృహస్థాశ్రమము అవలంబించి అహింసను పాటించుము. తరువాత సన్యాసము స్వీకరించుము. సర్వభూతములకు అభయదానము చేయుము. అట్లుచేసిన ఈ ఆత్మకు జగత్తునకు అవినాభావ సంబంధము కలదని వ్యక్తమగును. అపుడు నీ ఆత్మయందే నన్ను చూడగలవు. అంతేకాదు దేవహూతి గర్భమున నీ వీర్యమువలన నా అంశమున నేను అవతరింతును. తత్త్వసంహిత సాంఖ్యశాస్త్రముల కనుగొనగలను" అనిచెప్పి భగవంతుడు అంతర్ధానుడైనాడు.

భగవంతుడు వెళ్ళిపోయిన తరువాత కర్దముడు బిందుసరోవరము వద్దగల ఆశ్రమమున ప్రతీక్షించుచు ఉండిపోయినాడు. ఇంతలో స్వాయంభువ చక్రవర్తి తనభార్య శతరూపతోను, కూతురు దేవహూతితోను, వరునికొరకు భూలోకమంతయు వెదకుచు బిందుసరోవరము వద్దనున్న కర్దముని ఆశ్రమమునకు వచ్చినాడు.

అప్పుడే కర్దముడు అగ్నిహోత్రము ముగించి కూర్చున్నాడు. మనువు అతని దగ్గరకు వెళ్ళి పాదాభివందనముచేసినాడు. కర్దముడు ఆశీర్వదించి యథావిధిగ సత్కరించినాడు. మనువును ఉచితమైన ఆసనమునందు ఆసీనుని చేసి కర్దముడు ఇట్లన్నాడు :—

"మహారాజా! నీవు దుష్టశిక్షణకు శిష్టరక్షణకు దేశసంచారము చేయుచున్నావు. నీవు నిశ్చింతగా నిదురించిన అధర్మపరాయణులు నిరంకుశులై చెలరేగుదురు. దొంగలు, దోపిడిదారులు చెలరేగిన లోకము నాశనమగును. నీ యాత్ర నిష్ప్రయోజనముకాదు. అయినను తెలుసుకొనవలయునని అడుగుచున్నాను. ఇచటికి ఏలవిచ్చేసినావు. నన్ను ఏమి చేయమందువు? సంతోషముతో నీ ఆజ్ఞను పాలింతును."

మహారాజు "మునీంద్రా! బ్రహ్మదేవుడు వేదరక్షణకొరకే తపస్సు, యోగము కలిగిన మీవంటి మహాత్ములను - బ్రాహ్మణులను - ముఖమునుండి సృష్టించినాడు. మీ వంటి మహాత్ములను రక్షించుటకుగాను, మావంటి క్షత్రియులను బాహువుల నుండి సృష్టించినాడు. అందుకే బ్రాహ్మణులను బ్రహ్మదేవుని హృదయమనియు, రాజులు అతని బాహువులనియు ప్రజలు భావించెదరు. బ్రాహ్మణులు రాజులను, రాజులు బ్రాహ్మణులను పరస్పరము రక్షించుకొనుచున్నను సర్వాత్ముడైన భగవంతుడు ఉభయులను రక్షించుచున్నాడు.

మునీంద్రా! నీవు అన్నివిధముల అనుగ్రహించినావు. ఇదిగో ఈమె నా కూతురు. దేవహూతి, ప్రియవ్రత, ఉత్తానపాదుల చెల్లెలు. మంచి గుణములు గల వరుని కొరకు వెదకుచున్నాము. నారదుని వలన నీ కుల, శీల, వయో, విద్యా, గుణ, రూపములను విని నిన్ను భర్తగా వరించవలెనని నిశ్చయించినది. కాన ఈమెను పరిగ్రహింపుము. ఈమె నీకు గార్హస్థ్య జీవితమున అన్నివిధముల అనుకూలముగా ఉండును. సంగత్యాగులు ఎదుటికి వచ్చిన కామ్యవస్తువును నిరాకరించరాదు. కనుక మహాత్మా! ఈ కన్యను అంగీకరింపుము" అన్నాడు.

"మహారాజా! నాకు వివాహము చేసుకొనవలెనని సంకల్పము కలదు. అందు చేత ఈమెను నేను పరిగ్రహింతును. సృష్టిలో మొదటిది అయిన మా వివాహము బ్రహ్మపద్ధతినే జరుగును. సుప్రసిద్ధమైన వివాహమంత్రములు మా ఉభయుల విషయమున సఫలమగును.

కాని ఈమెను పెండ్లాడుటకు ఒక షరతు కలదు. నేను సంతానము కలుగు నంతవరకే గృహస్థుగా ఉందును. తరువాత సన్యాసము స్వీకరించి జ్ఞానమార్గము అవలంబించగలను" అన్నాడు కర్దమ ప్రజాపతి.

మనువు తనభార్య అభిప్రాయము, కూతురు అభిప్రాయము కనుగొని కూతురు దేవహూతిని కర్దమ ప్రజాపతికి సమర్పించినాడు.

దేవహూతి కర్దముల వివాహము వైభవముగా జరిగినది.

కపిలదేవుడు.

దేవహూతి సాధ్వి. పతివ్రత. ఆమె శ్రద్ధగా భర్తకు పరిచర్యలు చేసినది. విశ్వాసము, శుచిత్వము, గౌరవము, సంయమనము, ప్రేమ, మధురాలాపము వీనిలో దేనిలోను లోపము రానీయలేదు. కామము, దంభము, ద్వేషము, లోభము, మదము, పాపము - వీనిని దగ్గరకు చేరనీయలేదు. భర్తను మించిన దేవుడు లేడని భావించినది. భర్తమీదనే ఆశలు పెట్టుకున్నది. ఎల్లప్పుడు వ్రతములు చేయుటవలన చిక్కిపోయినది.

చిక్కిపోయిన భార్యనుచూచి కర్దమునికి జాలి కలిగినది. "సుందరీ ! నీవు నన్ను ఎంతో ఆదరించుచున్నావు. నీ సేవ, నీభక్తి నాకు ఎంతో తృప్తి కలిగించినవి. ప్రాణులకు శరీరమునిన మక్కువ అయినను నీవు నా శుశ్రూషలో నీ శరీరమును లెక్కచేయలేదు.

నేను స్వధర్మపరాయణుడనై తపస్సుచేసినాను. సమాధిలోఉండి ఏకాగ్రచిత్తమున భగవంతుని ధ్యానించి-అతని అనుగ్రహము సంపాదించినాను. అందువలన శోకము, భయములేని భోగ్యస్థానములకు, భోగ్యపదార్థములకు కొదువలేదు. నా శుశ్రూషచేసి, కృతార్థురాలివి అయినందున దివ్యభోగములు నీకును ప్రాప్తించినవి. మానవమాత్రులకు దుర్లభమైన వానిని నీవు అనుభవించుము" అన్నాడు కర్దముడు.

తనభర్త యోగప్రభావమున చిత్రవిచిత్ర పదార్థములు సృష్టించుటలో సమర్థుడని దేవహూతి సంతోషించి ప్రేమగద్గదస్వరమున ఇట్లన్నది :-

"ప్రభూ ! నీవు చెప్పినవన్నియు నీకు సిద్ధించినవి అనుటలో ఎట్టి సందేహము లేదు. మన వివాహ సమయమున నీవు అన్నమాట చెల్లించుము. ఉత్తమమైన భర్త

వలన సంతానవతి అగుటయే పతివ్రతలు కోరుకొనునది. మన ఇద్దరి సంయోగమునకు నా శరీరము యోగ్యమగునట్లుగా అనుగ్రహించుము. కామశాస్త్రానుసారము భోజనాదికములు, అలంకారములు, సుగంధ ద్రవ్యములు నిరూపించుము. సంభోగేచ్ఛ నన్ను బాధించుచున్నందుననే చిక్కిపోవు చున్నాను. మన సంభోగమునకు తగిన మందిరమును కూడ అనుగ్రహింపుము.''

కర్దముడు భార్య అభిలాష గ్రహించి, ఆమెకోరిక తీర్చుటకుగాను యోగమును అవలంబించినాడు. ఉత్తరక్షణమున అందమైన రత్నమయ దివ్యవిమానము ఎదుట ప్రత్యక్షము అయినది. అది కామగమనముగల విమానము.

ఆ అద్భుతమైన దివ్యవిమానమును చూచినది దేవహూతి. సంస్కారములేని తన మలినదేహమును చూచుకున్నది. కట్టుబట్ట మురికిగాఉన్నది. జుట్టు జడలు కట్టినది. శరీరమున మురికి పేరుకొని ఉన్నది.

ఆమె అభిప్రాయము గ్రహించినాడు కర్దముడు. "ప్రియురాలా! విష్ణుభగవానుని ఆనందాశ్రువులచే ఏర్పడిన ఈ బిందుసరోవరము. ఇది మానవుల కోర్కెలు తీర్చుటకు ఏర్పడినది. ఈ సరోవరమున స్నానము చేయుము" అన్నాడు.

సరోవరమున ప్రవేశించి దేవహూతి ఆశ్చర్యపోయినది. యవ్వనవతులు, సుందరులు, పద్మగంధులు వేయిమంది ఆమెరాకకొరకు నిరీక్షించుచున్నారు. ఆమెను చూడగనే వారులేచి సుగంధతైలములతో తలంటి, నలుగులుపూసి, స్నానము చేయించినారు. పట్టుచీర కట్టించి కోరిన నగలతో అలంకరించినారు. షడ్రసోపేతమైన భోజనము చేయించినారు.

నిలువుటద్దమున తన అందము చూచుకున్నది దేవహూతి. మురిసిపోయినది. ప్రియభర్తను తలచుకున్నది. వెంటనే ప్రత్యక్షమైనాడు కర్దముడు.

భార్యను చూచినాడు కర్దముడు. పిచ్చివాడైనాడు. ఇపుడు ఆమెకు పెండ్లికి పూర్వపు సౌందర్యము వచ్చినది. పయ్యెదలో దాగిఉన్న స్తనములు మతి భ్రమింపచేయుచున్నవి. ఆమె అలంకరణ కండ్లను చెదరగొట్టుచున్నది. లెక్కలేనంతమంది విద్యాధర స్త్రీలు ఆమెకు పరిచర్యలు చేయుచున్నారు. కర్దముడు భార్యచేయి పట్టుకున్నాడు. ఆమె నడచినది. అతడు నడచినాడు. ఇద్దరు జంటగా విమానమున ప్రవేశించినారు.

వారు ఆకాశమార్గమున మహేశునివలె విహరించినారు. వారు తిరుగని చోటు లేదు. వారు ఆనందించని ప్రదేశము లేదు. మేరు పర్వతపు గుహలు చూచినారు. గంగానది కలకల ధ్వనిచేయుచు స్వర్గమునుండి దిగుచోట విహరించినారు. వైశ్రంభకమున ఆనందించినారు. స్వర్గమున విహరించినారు. నందనమున క్రీడించినారు. పుష్పభద్రమున సంచరించినారు. చైత్రరథమున వేడుకలు సల్పినారు. విమానము కామగమనము గలది. దాన అన్నిలోకములు తిరిగినారు.

దేవహూతికి సంభోగేచ్ఛ అధికము. అది గమనించినాడు కర్దముడు. తనను తొమ్మిది భాగములుగ విభజించుకున్నాడు. ఆమెను ఆనందపరచినాడు. వంద సంవత్సరములు ఒక్కరోజువలె గడిపినారు.

దేవహూతికి తొమ్మిదిమంది పుత్రికలు జన్మించినారు. అందరు అందవతులే. అందరు పద్మగంధులే.

సంతానము కలిగినది. సన్న్యాసము స్వీకరించదలచినాడు కర్దముడు. సిద్ధపడినాడు. దేవహూతి విస్మితురాలైనది. బాధపడినది. ఆమెలో దుఃఖము పొంగినది. తల వంచుకున్నది. కాలి బొటనవ్రేలుతో నేలను గీసినది భర్త ముందు నిలువబడి,

"స్వామీ ! నీవు సన్న్యాసము స్వీకరించెదవు. అడవులకు వెళ్ళెదవు. నీ పుత్రికలకు వరులను సంపాదించవలెను కదా ! అంతేకాదు. ఇంతకాలము విషయభోగములతో గడిపినాను. పరమాత్మను మరచినాను. అది గడచినది. ఇప్పుడు నాకు జ్ఞానోపదేశము కావలెను అభయ మిమ్ము.

> దుష్టులతో సహవాసము చేయరాదు. తెలియక చేసినను బంధహేతువు అగును. సత్పురుషుల సాంగత్యము సద్గతి కలిగించును. కర్మలుచేసి ధర్మమును ఆర్జించవలెను. వైరాగ్యము పొందవలెను. భగవంతుని సేవించవలెను. అట్లు చేయనివారు జీవచ్ఛవము.

మాయలో పడినాను. మోసపోయినాను. నీ వంటి మహాత్ముని భర్తగా పొందినాను. అయినను బంధములు త్రెంచలేకపోయినాను. కనీసము ప్రయత్నించలేకపోయినాను" అన్నది దేవహూతి.

కర్దముడు అది విన్నాడు. విష్ణువు మాటలు తలచుకున్నాడు. దేవహూతితో అన్నాడు. "దేవీ ! నీవు ఎన్నో వ్రతములు చేసినావు శుచివి. దోసములేనిదానవు. విచారించకుము. నీకు శుభము కలుగును. నియమములు పాటించుము దానము

తపస్సు చేయుము. భగవానుని సేవించుము. భగవంతుడు నీ గర్భమున అవతరించును. నీకు ఉపదేశము చేయును. నా కీర్తిని పెంచును."

దేవహూతి భర్తమాటలు విన్నది. అతను చెప్పినట్లు నడచినది. భగవంతుని ఆరాధించినది. గర్భము దాల్చినది. కట్టెలోని అగ్నిహోత్రము బయటికి వచ్చినట్లే దేవహూతి గర్భమున భగవానుడు అవతరించినాడు.

అది శుభముహూర్తము. మేఘములు గర్జించినవి. దుందుభులు మ్రోగించినవి. చల్లని చినుకులు కురిసినవి. గంధర్వులు గానము చేసినారు. అప్సరసలు ఆటలాడినారు. దేవకాంతలు పూలు కురిపించినారు. దిశలు తెల్లవారినవి. సరస్సులు నిర్మలములైనవి.

అనేక మంది ఋషులతో బ్రహ్మ అక్కడికి వచ్చినాడు. భగవంతుడు కర్దమునకు జన్మించినాడని ఆనందించి అన్నాడు. "పుత్రా! నా ఆజ్ఞ పాలించినావు. నన్ను పూజించినావు. తండ్రి చెప్పిన మాట వినవలెను. అతని శుశ్రూష చేయవలెను. అదే పుత్రుల కర్తవ్యము. నీ కుమార్తెలు పతివ్రతలు అగుదురు. వారిని మరీచి మున్నగు ఋషులకు ఇచ్చి వివాహము చేయుము. నీకు కీర్తి కలుగును. ఈ కుమారుడు భగవానుడు. కపిలుడు. ప్రాణుల కోర్కెలు తీర్చుటకు అవతరించినాడు." అనిచెప్పి నారదుడు మున్నగు మునులతో కలసి హంసవాహనుడై బ్రహ్మలోకమునకు వెళ్ళిపోయినాడు. బ్రహ్మ ఆదేశమును పాలించినాడు కర్దముడు. తన కన్యలను మరీచి మున్నగు ప్రజాపతుల కిచ్చి వివాహము చేసినాడు.

కర్దముని కూతుళ్ళు	కర్దముని అల్లుళ్ళు
కళ	మరీచి
అనసూయ	అత్రి
శ్రద్ధ	అంగిరుడు
హవిర్భువు	పులస్త్యుడు
గతి	పులహుడు
క్రియ	క్రతుడు
ఖ్యాతి	భృగువు
అరుంధతి	వసిష్ఠుడు
శాంతి	అథర్వ్యుడు

ఇట్లు తొమ్మిదిమంది కర్దమకన్యలను పెండ్లాడిన ప్రజాపతులు అత్తమామల అనుమతి తీసుకున్నారు. ఆనందముగా తమ తమ ఆశ్రమములకు వెళ్ళినారు.

కపిలుడు భగవంతుడని కర్దమునకు తెలియును. అతడు ఏకాంతముగా కుమారుని దగ్గరకు వెళ్ళినాడు. నమస్కరించినాడు. "పూర్వజన్మముల పాపమువలన సంసారబంధనమున పడిన జనులను దేవతలు ఎంతో కాలమునకుగాని కనికరించరు. నిర్జన స్థలమున యోగసమాధి అవలంబించి నీ పాదదర్శనము అభిలషింతురు. మేము నీచులము. అట్టి మా ఇంట నీవు అవతరించినావు. దేవా! నీవు నా పుత్రుడవై జన్మించినావు. నా పితృఋణము తీరినది. నా కోరిక ఫలించినది. నేను సన్న్యాస మార్గమును అవలంబించుచున్నాను. అనుజ్ఞ ప్రసాదించుము" అని వేడుకున్నాడు.

కపిలదేవుడు ఇట్లనెను :—


"నీవు నా అనుజ్ఞ వేడుచున్నావు కావున చెప్పుచున్నాను. స్వేచ్ఛగా సంచరించుము. కాని నీ సర్వకర్మములు నాకు సమర్పించుము. మృత్యువును గెలిచి అమరత్వమునకుగాను నన్ను భజించుము. అపుడు నన్ను నీ హృదయమున దర్శించగలవు."

కపిలదేవుని ఉపదేశముపొంది కర్దముడు ప్రసన్నహృదయమున అరణ్యములకు వెళ్ళినాడు. అహింసతో కూడిన సన్న్యాసధర్మమును అవలంబించినాడు. భగవంతుని శరణు జొచ్చినాడు. అగ్నిహోత్రమును ఆశ్రమమును విడిచి నిస్సంశయ భావమున సంచరించినాడు. అహంకార మమకారములను వదలి సమదర్శనుడై సర్వత్ర ఆత్మనే సందర్శించినాడు. అంతర్ముఖమైన బుద్ధిగల కర్దముడు తరంగములులేని సాగరమువలె ప్రశాంతను అనుభవించినాడు.

భక్తిభావమున కర్దముడు పరమపదము చేరుకున్నాడు.

సాంఖ్యయోగము.

కర్దముడు అడవికివెళ్ళిపోయిన తరువాత కపిలదేవుడు బిందుసరోవరము వద్దనే నివసించినాడు. ఒకనాడు దేవహూతి కుమారుని దర్శించి "ప్రభూ! విషయ వాసనలతో విసిగిపోయినాను. ఇప్పుడు అజ్ఞానాంధకారమున మునిగిపోయినాను. అజ్ఞానాంధకారమున మునిగిన వారికి సూర్యునివంటి వాడవు నీవు. ఈ సంసారార్ణవము నుండి తరించునట్టి జ్ఞానము ఉపదేశింపుము" అని ప్రార్థించినది.



కపిలావతారమెత్తిన శ్రీహరి తల్లియైన దేవహూతికి తత్త్వబోధ
మొనరించుట. పుట. 99

కపిలభగవానుడు సాంఖ్యమును ఇట్లు ఉపదేశించినాడు :—

ప్రకృతి సత్వము, రజస్సు, తమస్సు అను మూడు గుణములుకలది. దానికి జ్ఞానమును కప్పిపెట్టునట్టి ఆవరణశక్తి ఉన్నది. పురుషుడు దానికి మోహితుడు అగును. ఆ మోహమున వాస్తవమైనట్టి ప్రకృతి వేరనియు తాను వేరనియు గుర్తించలేడు. ప్రకృతి గుణములవలననే పనులు జరుగును. అట్టివానికి తానే కర్తనని భావించును. అందువలననే అతనికి జన్మ, మృత్యురూపమైన బంధనము ప్రాప్తించును. సుఖదుఃఖములందు అనుభూతి మాత్రమే ముఖ్యమైనందున పురుషుడు ప్రకృతికి అతీతుడు.

ప్రకృతి భిన్నమైనదనియు, పురుషుడు భిన్నమైన వాడనియు వివరించి ప్రకృతి లక్షణములను పరమాత్మను వివరించుచున్నాడు.

ప్రకృతి భేదరహితమైనది. అయినను భేదములకు ఆశ్రయమైనది. ప్రకృతి సత్వ, రజ, స్తమోగుణములకు ఆలవాలమైనదై నందున అది బ్రహ్మముకాదు. అది దేని పరిణామముకూడకాదు. అది అవ్యక్తము, నిత్యము, సదసదాత్మకము, కార్య కారణరూపమైనది.

అయిదు భూతములు, అయిదు తన్మాత్రలు, నాలుగు అంతఃకరణములు, పది ఇంద్రియములు ఈ ఇరువదినాలుగు తత్వములు ప్రకృతి.

పంచభూతములు :— భూమి, నీరు, తేజస్సు, వాయువు, ఆకాశము.

పంచతన్మాత్రలు :— గంధము , రసము, రూపము, స్పర్శ, శబ్దము.

దశేంద్రియములు :— చెవులు, చర్మము, కాళ్ళు, చేతులు, ముక్కు, నాలుక, వాక్కు, పాదములు, వాయువు, ఉపస్థము.

చతురంతఃకరణలు :— మనస్సు, బుద్ధి, అహంకారము, చిత్తము.

ఈ ఇరువదినాల్గు కాక మరి రెండు తత్వములున్నవి.

1. కాలము. 2. భగవంతుడు.

ప్రకృతి గుణములు క్షోభపడినపుడు చిచ్ఛక్తిరూపమైన తన వీర్యమును పరమ పురుషుడు ప్రకృతి యోనియందు స్థాపించినాడు. అప్పుడు ప్రకృతినుండి మహా తత్వము పుట్టినది. అది ప్రళయపు అంధకారమును త్రాగివేయును. మహా తత్వము వికారము పొందిన అహంకారము పుట్టును. ఈ అహంకారమును సంకర్షణుడు అందురు.

అహంకారము మూడు విధములు.

వైకారికము | తైజసము | తామసము

మనస్తత్వము (అనిరుద్ధుడు) | బుద్ధి, ఇంద్రియములు (ప్రద్యుమ్నుడు.) | శబ్దతన్మాత్రము

శబ్దమునకు మూడు లక్షణములు. వాని వికారము వలన ఈ దిగువవి కలుగును.

ఆకాశతన్మాత్రత్వము | అర్థాశ్రయత్వము | ఉచ్చారణకర్త జ్ఞాపకత్వము.

ఆకాశము (చెవి) (లక్షణములు)

1. ప్రాణులకు లోపల బయట అవకాశము కలిగించును.
2. ఇంద్రియములకు ప్రాణమునకు ఆధారముగా ఉండును.

స్పర్శతన్మాత్రము (లక్షణములు)

1. మృదుత్వము 2. కఠినత్వము
3. శీతలత్వము 4. ఉష్ణత్వము

వాయువు-(చర్మము)

రూపతన్మాత్రము (కన్ను)

రూపము-తేజస్సు

రసతన్మాత్రము (నాలుక)

నీరు

గంధతన్మాత్రము (ముక్కు)

భూమి

ఆకాశము మొదలగువాని శబ్దాది ధర్మములు వాయువు, భూమి మున్నగువాని లోనను కనిపించుచున్నవి. మహత్తత్వము, అహంకారము, భూమి, నీరు, తేజస్సు, వాయువు, ఆకాశము అను ఈ ఏడు పుట్టినను, ఇవి పరస్పరము కలియకున్న

రుషుని పుట్టించలేవు. భగవంతుడు వానిలో ప్రవేశించగా అవన్నియు క్షోభించి వానిలోనుండి అచేతనమైన ఒక అండము పుట్టినది.

మహాదాదుల వలన పుట్టిన హిరణ్మయాండము ఎంతోకాలము నీటిలో ఉన్నది ఆ అండకోశమునుంచి విరాట్పురుషుడు లేచినాడు. ఈ దిగువక్రమముగా ఆ పురుషునకు ఇంద్రియములు ఏర్పడి ఇంద్రియాధి దేవతలు ఏర్పడినారు.

1. ముఖము - నోరు (అగ్ని)
2. ముకుపుటములు - ఘ్రాణేంద్రియములు (వాయువు)
3. నేత్రములు - నేత్రేంద్రియములు (సూర్యుడు)
4. చెవులు - శ్రవణేంద్రియములు (దిగ్దేవతలు)
5. చర్మము - త్వగింద్రియము (ఓషధులు)
6. శిశ్నము - ఉపస్థేంద్రియము (జలము)
7. గుదస్థానము - అపానేంద్రియము (మృత్యువు)
8. చేతులు - హస్తేంద్రియములు (ఇంద్రుడు)
9. కాళ్ళు - పాదేంద్రియములు (ఉపేంద్రుడు)
10. నాడులు - రక్తము (నదులు)
11. కడుపు - ఆకలి దప్పులు (సముద్రము)
12. హృదయము - మనస్సు (చంద్రుడు)
13. హృదయము - బుద్ధి (బ్రహ్మ)
14. హృదయము - అహంకారము (శివుడు)
15. హృదయము - చిత్తము (క్షేత్రజ్ఞుడు)

నీటిలో ప్రతిబింబించిన సూర్యునకు నీటిగుణములు అంటనట్లు ప్రకృతిలో ఉన్న పురుషునకు ప్రకృతిగుణములు అంటవు. అందులకు కారణము అతడు నిర్గుణుడు అయినప్పటికి ప్రకృతిగుణములతో సంబంధముపెట్టుకొని అహంకార మోహితుడగును. కర్మదోషమువలన దేవతిర్యఙ్మనుష్య జన్మలెత్తి సంసార చక్రమునపడి తిరుగుచుండును.

ఒక విషయము పదేపదేచూచుటవలన అది కలలో కనిపించును. కలగన్నప్పుడు అది నిజమని భ్రమకలిగించును. సంసారముకూడ అట్టిదే. దానికి అస్తిత్వము లేకున్నను ఉన్నట్లు కనుపించును

జీవి బంధమోక్షములకు మనసే ప్రధానము. పరమాత్మతో అనురక్తిపొందిన అదే మోక్షమునకు హేతువగును. దుష్టమార్గములకు పరుగెత్తు మనసును భక్తియోగమునను, వైరాగ్యమునను లొంగదీసి యోగసాధన చేయవలెను. ఏకాగ్రచిత్తులై నిష్కపటభావమున భగవత్కథలు వినవలెను. సర్వప్రాణుల ఎడ సమభావము కలిగి ఆసక్తిని విడిచిపుచ్చవలెను. బ్రహ్మచర్యము, మౌనవ్రతముపూని స్వధర్మమును పాలించవలెను. దొరికిన దానితో తృప్తిపడి మితముగా భోజనము చేయవలెను. ఏకాంతవాసమున శాంతముగా జీవించవలెను. సర్వజనప్రియముగా ఉండి దయయు ధృతియు కలిగి ఉండవలెను. తన శరీరముమీద, భార్యాపుత్రుల మీద అహంకారమును విడువవలెను. అట్లు సాధనచేసినవానికి ప్రకృతి-పురుషుల తత్త్వము అవగతమగును.

సూర్యుడు అధిదేవతగా ఉన్న కంటితో ఆకాశముమీది సూర్యుని చూచినట్లు యోగి అహంకారము వదలిన ఆత్మద్వారమున పరమాత్మను చూచును. తుదకు శరీరము మున్నగునవి వదలి అహంకారము మొదలగు అసత్య వస్తువులలో సత్య రూపమున ప్రకాశించు పరమాత్మను అతడు పొందును.

ఆకాశమునఉన్న సూర్యుని ప్రతిబింబము నీటిలోపడును. దాని ప్రతిబింబము ఇంటి గోడమీద పడును. ఇంటిలోనివారు ముందుగోడమీది ప్రతిబింబమును, తదుపరి నీటిలోని ప్రతిబింబమునుచూచి తుదకు ఆకాశమున ఉన్న సూర్యుని చూతురు. అదేవిధముగా యోగులైనవారు భూతములు, ఇంద్రియములు, మనసు స్వరూపముగా కలిగి త్రిగుణాత్మకమైన అహంకారమున ప్రతిబింబించిన పరమాత్మ స్వరూపమును అహంకారమునుండియే చూచును.

ఆత్మ శుద్ధమై పరమాత్మజ్ఞాన స్వరూపమైనది. నిద్రావస్థయందు భూతసూక్ష్మములు, ఇంద్రియములు, మనస్సు, బుద్ధి పనిచేయవు. అపుడు ఆత్మ అహంకారము లేక మేలుకొనియే ఉండును. నిద్రావస్థలో నశించినది అహంకారము, కాని తానే నశించినట్లు భ్రమపడును మానవుడు. ధనము నాశనమైనవాడు తానే నాశనమైనట్లు కలతపడును. అదేవిధముగా అహంకారము నశించుటవలన అసత్యముగా, తాను నాశనమైపోయినాము అనుకొనును.

ప్రకృతిని పురుషుని నుండిగాని. పురుషుని ప్రకృతినుండిగాని. విడదీయుట కష్టముకదా ! ప్రకృతి గుణములతో ఉన్నట్టి పురుషునకు కైవల్యము ఎట్లు లభించును ? అన్నప్రశ్నకు భగవానుడు సమాధానము చెప్పుచున్నాడు :—

అగ్నిలో దాచిపెట్టిన అరణి అగ్నిచేత కాలిపోయినట్లు, ఆత్మను మరుగు పరచిన ప్రకృతి, ఆత్మజ్ఞానమున తొలగిపోవును. సాధనవలన ఆత్మ ప్రతిబంధకమైన ప్రకృతి క్రమక్రమముగా పురుషుని వదలిపోవును.

నిద్రపోయినవానికి కలలు ఎన్నో అనర్థములు కలిగించును. మేలుకున్న వానికి ఏ అనర్థము కలిగించవు. అట్లే అజ్ఞానికి ప్రకృతి సంసారరూపమైన అనర్థములు కలిగించును. కాని జ్ఞానియైనవాడు భగవంతునిమీద చిత్తమును కేంద్రీకరించి ఆత్మారాముడైనచో అతనిని ప్రకృతి ఏమియు చేయలేదు. ఇట్లు పురుషుడు ఆత్మారాముడై, ఎన్నో జన్మములవరకు ఆత్మతత్వమునెరిగి, బ్రహ్మలోకము నపేక్షించక భగవానునిమీద భక్తికలిగి భగవంతుని సాక్షాత్కారముపొంది పరమానందమును అనుభవించును. అప్పుడు అతని లింగశరీరము నశించి, సంశయములన్నియు వదలించుకొని, కైవల్యపదము చేరును.

అష్టాంగయోగ విధి.

* దేవహూతికి సాలంబనయోగము ఉపదేశించుచున్నాడు, భగవానుడు,

వ్రత, నియమాది మార్గముల నవలంబించి, చెడుమార్గములకు పరుగెత్తుమనసును కట్టివేసి ప్రాణవాయువును జయించవలెను. అందుకు ఎనిమిది సోపానములు కలవు. అభ్యాసము వలన అన్నింటిని సాధించవలెను.

1. ఆసనము - పవిత్రప్రదేశమున కుశలువేసి, లేడి చర్మముపరచి, స్వస్తికాసనమున శరీరము చక్కగా చేసికొని అభ్యాసము చేయవలెను.

2. పూరకము - ఊపిరి లోపలికి పీల్చుటను అభ్యసించవలెను.

3. కుంభకము - పీల్చినగాలిని లోపల నిలువవలెను.

4. రేచకము - పీల్చినగాలిని బయటకు వదలవలెను.

5. అనులోమ, ప్రతిలోమములు - చంచలత్వమును పొందక, చిత్తము స్థిరమగునట్లు చక్కగా పరిశోధించి ప్రాణాయామము చేయవలెను. గాలిలోను అగ్నిలోను కాలిన అంగారమువలె శ్వాసను జయించిన యోగిమనసు నిర్మలమగును. ప్రాణాయామము వలన వాత పిత్తాది దోషములు తొలగిపోవును

6. ధారణ -

7. ఇంద్రియ ప్రత్యాహారము - మనసు, ఇంద్రియములను విషయ వాసనల నుండి మరలించుట.

8. ధ్యానము.

ప్రాణాయామములు మున్నగు వానిచేత మనసు భగవంతునిపై నిలిపి, నాసికాగ్రమున దృష్టినిలిపి భగవానుని మూర్తిని ధ్యానించవలెను.

ప్రసన్నవదనాంభోజం పద్మపత్రారుణేక్షణమ్
నీలోత్పలదళశ్యామం శంఖ చక్ర గదా ధరమ్

లసత్పంకజకింజల్క-పీతకౌశేయవాససం
శ్రీవత్సవక్షసం భ్రాజత్కౌస్తుభాముక్తకంధరమ్

మత్తద్విరేఫకలయా పరీతం వనమాలయా
పరార్ధ్యహారవలయం కిరీటాంగదనూపురమ్

కాంచీగుణోల్లసచ్ఛ్రోణిం హృదయాంభోజవిష్టరం
దర్శనీయతమం శాంతం మనోనయనవర్ధనమ్.

అపీచ్య దర్శనం శశ్వత్సర్వలోకనమస్కృతమ్
సంతం వయసి కైశోరే భృత్యానుగ్రహకాతరమ్

కీర్తన్య తీర్థయశసం పుణ్యశ్లోకయశస్కరమ్
ధ్యాయేద్దేవసమగ్రాంగం యావన్నచ్యవతే మనః

ప్రసన్నమైన ముఖపద్మము. నేత్రములు తామరరేకులవలె ఎఱ్ఱనివి, నల్లకలువల వంటి శ్యామల శరీరము కలిగి శంఖచక్రాదులు ధరించినవాడు. అతని కటి ప్రదేశమున గల పీతాంబరము పద్మకింజల్కములవలె ఉన్నది. అతని గళప్రదేశముచే వనమాల శోభింపబడి, దానిపై గండుతుమ్మెదలు ముసురుచున్నవి. వక్షస్థలమున శ్రీవత్సలాంఛనము, కంకణము మొదలగు అలంకారములు కలిగి మెరయుచున్న అవయవములు కలిగి బంగారు మొలనూలు, కిరీటము, దండ కడియములతో దేదీప్యమానుడైనవాడు. అతడు హృదయకమలమున వసించువాడు. మిక్కిలి దర్శనీయుడు శాంతుడు. మనమునకు నేత్రములకు ఆనందము కలుగజేయు వాడు. అతిసుందరుడై అన్నిలోకములచే నమస్కరించదగినవాడు. భృత్యులను అనుగ్రహించువాడు. కీర్తనీయుడు, పుణ్యశ్లోకుడు, యశస్కరుడు, అగు ఆ శ్రీహరిని మనసు శాంతించునంతవరకు ధ్యానించవలెను.

తనకు నచ్చిన విధమున శ్రీమన్నారాయణుడు నిలిచినట్లు, నడచినట్లు, కూర్చున్నట్లు లేదా శయనించినట్లు ధ్యానించవలెను. భగవంతుని సర్వావయవములమీద

మనసు లగ్నమైనట్లు తెలిసిన తదుపరి పాదములనుండి ముఖమువరకు ధ్యానించ వలెను.

1. పాదపద్మములు - ధ్వజము, వజ్రము, అంకుశము మున్నగు చిహ్నములు గలవి. గోళ్ళు చంద్రవంకలవలె ఉండి రక్తవర్ణములై యుండును.
2. తొడలు - అవిసెపూవులవలె అందమై, బలమునకు ఆధారమైనవి.
3. పిరుదులు - పీతాంబరముతో మనోహరముగా ఉండును.
4. నాభికుహరము - బ్రహ్మదేవుడు ఆవిర్భవించిన పద్మమునకు స్థానము.
5. స్తనములు - మరకత మణులవలె ఉండును. వక్షస్థలమున వ్రేలాడు హారములవలన గౌరవర్ణముగా కనిపించును.
6. వక్షస్థలము - లక్ష్మీదేవికి నివాస స్థానము. నేత్రానందకరము, హృదయా నందకరము అయినది.
7. కంఠము - కౌస్తుభమణిచే కళకళలాడుచుండును.
8. చేతులు నాలుగు - వానియందు సుదర్శనమను చక్రము పాంచజన్య మను శంఖము కౌమోదకి అను గద ఉండును.
9. గళమునందు వనమాల-దాని పరిమళమునకు గండుతుమ్మెదలు భ్రమించు చుండును.
10. కౌస్తుభము - జీవులకు నిర్మలతత్వ స్వరూపమైనది.
11. ముఖమండలము - మణిమకరకుండల కాంతిచే ప్రకాశించుచుండును.
12. ముంగురులు-ఉంగరముల వలెనుండు ముంగురులు తుమ్మెదలవలె ఉండును.
13. నేత్రములు - చేపలవలె ఉండును.
14. మందహాసము - పూవువలె ఉండును.
15. కనుబొమలు - ధనుస్సువలె ఉండును.

భగవంతుని శ్రీమూర్తిని ధ్యానించుచున్న సాధకుడు మరేదియుచూడదలచడు.

ఇట్లు ధ్యానించుచుండిన అభ్యాసమువలన భగవంతునిపై ప్రేమకుదురును. హృదయము భక్తితో నిండును. ఆనందమున శరీరము పులకరించును. ఆనందాశ్రువులు ప్రవహించును. భగవానునిపై మనసు లగ్నమగును. మనసు క్రమక్రమముగా ధ్యేయవస్తువునుండి తనంతట తానే తప్పుకొనును.

అట్లు చిత్తము నిర్విషయమగును. ఆశ్రయములేనిదగును. పరమానందము అనుభవమునకు వచ్చును. నూనె చెల్లిపోయిన దీపశిఖ నిర్వాణము పొందినట్లు నిర్విషయమైన మనసు శాంతమైన బ్రహ్మాకారము పొందును. అపుడు అతడు ఆత్మ స్వరూపమునే అంతయు చూచును. సుఖదుఃఖములు అవిద్యవలన ఏర్పడిన అహంకారమునకేకాని తనకు లేవని తెలుసుకొనును. కల్లు త్రాగి మత్తులో ఉన్న మనిషి తనకు కట్టుబట్ట ఉన్నదీ లేనిదీ గమనించడు. అట్లే సిద్ధిపొందిన యోగి తన శరీరము కూర్చున్నది, నిలుచున్నది, నడుచుచున్నది, ఎటుపోవుచున్నది కూడ గమనించడు. ఆత్మతత్త్వము అవగతము అయిన సిద్ధయోగి శరీరమును, ఆలుబిడ్డలను కలవలె భావించును.

మండుచున్నకట్టె, మంటలోనుంచి లేచు పొగ అన్నియు అగ్నివలె కనిపించినను అగ్ని, పొగ వేరు కట్టెలు వేరని తెలుసుకొనవలెను. అగ్ని ఒకటే అయినను కట్టెలు మొదలైనవాని పొడవు, పొట్టి, వంకర టింకరనుబట్టి వివిధములు అగుచుండును. అట్లే దేహముల గుణవైషమ్యమువలన ఆత్మ ఒక్కటే అయినప్పటికి వివిధములుగా కాన్పించును.

భూతములు, ఇంద్రియములు, అంతఃకరణ జీవములనుండి ఆత్మ భిన్నమైనది. జీవాత్మ వేరు. పరమాత్మ వేరు. అట్లే ప్రకృతి వేరు. దానిని నడుపు భగవంతుడు వేరు.

భగవానుని మాయాశక్తి ఊహించరానిది. భగవదనుగ్రహము వలననే దానిని చేరుకొనవలెను. అన్యమార్గము లేదు.

భక్తి యోగము.

భగవానుడు దేవహూతికి భక్తియోగము ఉపదేశించుచున్నాడు.

భక్తి అయిదురకములు.

1. తామసభక్తి - హింస, దంభము, మచ్చరము వీనివలన సంకల్పించి క్రోధమునను భేదదృష్టితోను అవలంబించునది.
2. రాజసభక్తి - యశస్సు, ఐశ్వర్యము మున్నగువానికొరకు విగ్రహాదులను ఆరాధించునది.
3. సాత్త్విక భక్తి - పాపములను పోగొట్టుకొనుటకు లేక భగవంతుని ప్రీతి కొరకు లేక శాస్త్రములను అనుసరించుటకు అవలంబించు భక్తి.

4. నిర్గుణ భక్తి - ఫలాపేక్ష, భేదదృష్టిలేక అవలంబించు భక్తి.

5. ఆత్యంతిక భక్తి - భగవంతుని సేవ తప్ప అన్యము కోరని భక్తి.

పూవులలోని పరిమళము గాలిలో కలిసి అప్రయత్నముగా ఘ్రాణేంద్రియమును పొందినట్లు భక్తి యోగమును అవలంబించి వికారము వదల్చుకున్న మనసు పరబ్రహ్మమును చేరును.

> భగవానుడు సర్వాంతర్యామి. అట్టివానిని విడిచి మనుష్యుల బొమ్మలకు పూజ చేయుట వ్యర్థము. స్వాభిమానము కలిగి ఇతరులతో విరోధము పెట్టుకున్నవాడు అట్టి ఇతరుల దేహములందున్న భగవానుని విరోధించినవాడగును. అట్టి చిత్తమునకు శాంతిలేదు. ఇతర ప్రాణులను అవమానించి కొండంత సామగ్రితో భగవానుని పూజించినను ఆతడు సంతసించడు. భగవంతుడు సర్వాంతర్యామి యని తెలుసుకొని దానము, గౌరవము, స్నేహము, సమదర్శనముద్వారా భగవానునిపూజించిన ఆతడు ప్రసన్నుడగును.

శ్రేష్ఠమైనవానిని గురించి చెప్పుచు అచేతనునినుండి సమదర్శనుని వరకు లెక్కించుచున్నాడు.

దిగువ అవరోహణ క్రమమున పైదానికన్న క్రిందిది శ్రేష్ఠతరమని గ్రహించవలెను.

1. అచేతనము, 2. సచేతనము, 3. ప్రాణవంతము, 4. జ్ఞానవంతము 5. ఇంద్రియవృత్తిగల జీవులు, వానిలో

i స్పర్శవేదులు, ii రసవేదులు (చేపలు ము॥), iii గంధవేదులు (తుమ్మెదలు ము॥), iv శబ్దవేదులు, (పాములు ము॥), v రూపవేదులు (కాకులు ము॥), vi క్రింద పళ్ళు గలవి, vii అనేక పాదములుగలవి, viii నాలుగుపాదములు గలవి, ix రెండుపాదములు గలవి, x నాలుగు వర్ణములు, xi బ్రాహ్మణులు, xii వేదవిదులు, xiii వేదార్థవిదులు, xiv మీమాంసము, xv స్వధర్మ నిష్ఠులు, xvi ముక్తసంగులు, xvii నిష్కాములు, xviii జ్ఞానులు, xix సమదర్శనులు.

“నపశ్యామి పరం భూతమకర్తు స్సమదర్శనాత్” అకర్తయై సమదర్శనుడైన వానికన్న శ్రేష్ఠుని కనలేకున్నాను” అనుచున్నాడు కపిల భగవానుడు.

కాలము భగవత్స్వరూపములందు విలక్షణమైనదని వివరించుచున్నాడు.

మహదాది భూతములకు పరిణామము కలిగించునది కాలము. జీవబుద్ధులకు భీతి కలిగించునది కాలము. కాలము సర్వప్రాణులందు ప్రవేశించి కొన్ని ప్రాణుల చేత మరికొన్ని ప్రాణులను చంపించుచున్నది. కాల స్వరూపుడైన భగవంతుడు ప్రమత్తులైనవారిని నాశనముచేయును.

అతని భయమువలననే గాలి వీచుచున్నది. సూర్యుడు ప్రకాశించుచున్నాడు. ఇంద్రుడు వర్షించుచున్నాడు. చుక్కలు వెలుగుచున్నవి. ఓషధులు, లతలు, సమయమునకు పూలుపూసి కాయలు కాయుచున్నవి. నదులు ప్రవహించుచున్నవి. సముద్రములు గట్లు దాటకున్నవి. అగ్ని మండుచున్నది. భూమి నీళ్ళలో మునిగిపోకున్నది. ఆకాశము అవకాశము కలిగించుచున్నది.

అతని ఆజ్ఞవలననే పధ్నాలుగు లోకములు నివసించుచున్నవి. బ్రహ్మాది దేవతలు విశ్వసృష్టియందు తత్పరులగుచున్నారు.

కాలమే తండ్రులచేత పుత్రులను కలిగింపచేయుచున్నది. అదే మృత్యువుచేత చంపించును. కాలమే అన్నింటికి ఆదికర్త. అదే అన్నిటికి అంతకము. కాన కాలము అనంతమైనది. అవ్యయమైనది.

> సోఽనంతోఽంతకరః కాలోఽనాది రాదికృదవ్యయః
> జనం జనేన జనయన్మారయన్మృత్యునాంతకమ్.

గాలివలన మేఘములు కొట్టుకొనిపోవుచుండును. అయినను గాలిబలము మేఘములకు తెలియదు. అట్లే బలవత్తరమగు కాలప్రేరణవలన పరిభ్రమించుచు లోకులు దాని ప్రబల విక్రమమును గ్రహించలేరు. లోకులు సుఖపడుటకుగాను అతికష్టపడి సంపాదించిన ధనమును కాలము తుడిచిపెట్టును. అప్పుడు వారు ఎంతో దుఃఖింతురు.

సంసారరూపము.

సంసారమును, ప్రజల అజ్ఞానమును వివరించుచున్నాడు.

భార్యాపుత్రులు, ధనధాన్యములు, శరీరము, ఇండ్లు వాకిళ్ళు ఏవియు శాశ్వతము కాకున్నను బుద్ధిలేని జనులు వానిని శాశ్వతమనుకొని ఏ జన్మమెత్తినను సుఖమే యనుకొందురుగాని వైరాగ్యము నవలంబించరు. నరకమున పుట్టినను నరకమే సుఖమనుకొందురు. దానికే ఆశపడుదురుగాని శరీరము విడిచిపెట్టుటకు అంగీకరించరు. సత్పురుషుల సహవాసముచేయక వృద్ధులను సేవించక, కేవలము తమ కుటుంబమునకు ప్రాణము లిచ్చువారు జీవుడును భగవంతుని ధ్యానించరు.

జనులు తమ ఇల్లు, వాకిలి, ధనము మున్నగునవి చూచుకొని మురిసి పోవుదురు. తామే భాగ్యవంతుల మనుకొందురు. భార్యాపుత్రులను పోషించుటకు చేయరాని పాపములు చేయుదురు. వేశ్యల విలాసములకు, తమ పిల్లల చిలుకపలుకులకు ఇంద్రియములను అప్పగించి, కూటధర్మములకు, దుఃఖ తంత్రములకు పుట్టినిల్లైన సంసారమున మూలుగుదురు. కష్టమున సోమరితనము మానుకొని రవంత ప్రతిక్రియచేసి అదే సుఖమని మురిసిపోవుదురు. ఎవరిని పోషించుటవల్ల నరకమున పడుదురో వారినే పోషించుటకుగాను ఘోరమైన హింసావృత్తి నవలంబించి ధనమును ఆర్జించి వారినే పోషింతురు. వారు తినగా మిగిలిన దానితో పొట్టనింపుకొందురు. ప్రయత్నమున జీవిక సాగనపుడు లోభమునకు లొంగిపోయి పైవారి సొమ్మునకు ఆశపడుదురు. తమ కోరిక సఫలము కాకపోగా కుటుంబమును పోషించలేక క్రుంగిపోయి మూఢబుద్ధితో ఉస్సురుస్సురని నిట్టూర్పును తీయుదురు.

ఎద్దులు ముదుసలివి అయినతరువాత రైతు వానికి మేతవేయనట్లు కుటుంబమును పోషించలేని మనిషి చేతకానివాడై పోయిన వెనుక అతని పెళ్ళాము, పిల్లలు పూర్వమువలె అతనిని ఆదరించరు. అతడు వెనుక తాను పోషించినవారి దయాధర్మములపై ఆధారపడి బ్రతుకవలెను. వార్ధక్యము రాగా వ్యాధులు పట్టుకొనును. రూపము వికారమగును. అజీర్ణము పట్టుకొనును. పురుషార్థము క్షీణించును. కాటికి కాలుచాచుకొని ఆలుబిడ్డలు కనికరించి పడవేయు ముద్ద మ్రింగుచు కాలము గడుపును.

చివరకు మృత్యువువచ్చి మీదపడును. ఎగపోత ప్రారంభమగును. కనుగ్రుడ్లు పైకివచ్చి కఫము క్రమ్మును. ఊపిరి సలుపుట కష్టమయి కంఠమున గురగుర పుట్టును. వచ్చిపోవు ప్రాణములతో మంచముపై పడి ఉండగా బంధువులు చుట్టు చేరి ఏడుపు మొగములతో పిలుచుచుండగా కాలపాశములకు కట్టువడిన అతనినోట మాటరాదు. తుదకు ప్రాణములు వదలును.

చనిపోవునపుడు భయంకరులగు ఇద్దరు యమభటులు అతనిముందు వచ్చి నిలువబడగా వారినిచూచి భయమున మలమూత్రమును విడుచును. అతని యాతనా దేహమును యమభటులు తీసుకొని పోవుదురు. యమభటుల గద్దింపులతో అతనికి కంపము పుట్టును. పెరికి తినుటకు కుక్కలు మీదపడును. అపుడు తాను చేసిన పాపములు తలపునకువచ్చి మనసు వ్యాకులపడును. ఆకలి దప్పులు దహించుకొని

పోవుచుండగా యమభటులు వీపుమీద కొరడాతో దెబ్బలు కొట్టుచుందురు. మండుచున్న ఇసుకదారి. సూర్యుడు నిప్పులు చెరుగుచుండును. చుట్టును దావాగ్ని. వేడిగాడ్పులు. ఎక్కడను నీడ ఉండదు. నీటిచుక్క కనిపించదు. కొరడాదెబ్బలకు తూలిపోవుచు ఆ మార్గమున నడువవలెను. నడుచుటకు శక్తి ఉండదు. కొరడా దెబ్బలతో మూర్ఛవచ్చును. తూలిపోవుచు, సోలిపోవుచు తొంబదితొమ్మిదివేల యోజనముల యమలోకపుదారి రెండుముహూర్తములలో దాటి యమలోకముచేరి యమయాతన అనుభవించవలెను.

ఒకచోట మండుతున్న కర్రిలలోవేసి తగులబెట్టుదురు.

ఒకచోట తనచేతను, ఇతరులచేతను శరీరము కోయించి తనమాంసమును తన చేతనే తినిపింతురు.

పచ్చిమాంసముతిను కుక్కలు, రాబందులు మీదపడి పేగులు పెరికి తినివేయును ఒకచోట.

ఒకచోట ఘోరమైన పాములు, తేళ్ళు కరచి బాధ పెట్టును.

ఒక స్థలమున శరీరములను రంపములతో కోసి నిలువున చీల్చుదురు.

కొండశిఖరమునుంచి క్రిందకు త్రోయుదురు. నీళ్ళమడుగులో పడవేయుదురు. తామిస్రము, అంధతామిస్రము, రౌరవము మున్నగు నరకములందు స్త్రీ పురుషులు తమ తమ పాపముల ననుసరించి ఎన్నో బాధలు అనుభవించెదరు.

తన కుటుంబమును మాత్రము పోషించుకొనువాడు, తనపొట్టమాత్రము చూచుకొనువాడు చనిపోయినతరువాత తన కుటుంబమును, శరీరమును ఇచటనే వదలి పోవలెను. తాను మాత్రము ద్రోహముచేసి కూడబెట్టిన పాపపుబత్తెము కట్టుకొని నరకమునకు వెళ్ళును. తన కుటుంబము కొరకుగాను తానుచేసిన పాపఫలము యమలోకమున తానొక్కడే అనుభవించును.

యజ్ఞయాగాది క్రతువులుచేసి దేవతలను పూజించినవాడు, శ్రాద్ధములు మున్నగునవిచేసి పితృదేవతలను పూజించినవాడు ధూమాదిగతిని చంద్రలోకమునకు వెళ్ళి సోమపానముచేసి తిరిగివచ్చును.

అర్థకామములకొరకు ధర్మమును వినియోగించక సర్వకర్మలు భగవంతునకే అర్పణచేసిన వీరులు సూర్యకిరణముల సహాయమున భగవంతుని చేరుకొందురు. వారు తిరిగి ఈ లోకమునకు తిరిగిరారు.

బ్రహ్మదేవుని ఉపాసించిన యోగులు సత్యలోకము చేరుకొని రెండు పరార్థముల కాలములో జరుగు ప్రళయమువరకు అచట ఉందురు.

భగవానుడైన వాసుదేవుని మీద భక్తినిలిపినవారికి త్వరలో వైరాగ్యము, బ్రహ్మ సాక్షాత్కారము, జ్ఞానము కలుగును. భగవానుని గుణగణముల విషయమున అనురాగము కలుగుటచే భక్తుని చిత్తము అతనిపై కేంద్రీకరించును. ఇంద్రియ విషయికము, ప్రియాప్రియము అను భేదభావము నశించును. సర్వత్ర భగవంతుడు కనిపించును. అపుడు నిస్సంగుడు, సమదర్శనుడు, పరమానందపదము నెక్కినవాడు అయిన ఆత్మ దర్శనము లభించును.

బ్రహ్మదర్శనజ్ఞానమున ప్రకృతి, పురుషుల యథార్థస్వరూపము అవగత మగును. నిర్గుణ జ్ఞానయోగము, భక్తియోగము రెండింటిఫలములు ఒకటియే. రెండింటి వలన భగవంతుని పొందవచ్చును. ఒకే పదార్థము వేరు వేరు ఇంద్రియములకు వేరు వేరు విధముల అనుభూతమగును.

పాలు ఒకటే పదార్థము. అది కంటికి తెల్లగా కనిపించును. నాలుకకు తీయగా ఉండును తాకిన చల్లగా ఉండును.

అట్లే భగవంతుడు ఒక్కడే అయినను ఉపాసనాభేదమువలన వివిధములుగా నిరూపించబడుచున్నాడు. కర్మకలాపములు, యజ్ఞములు, దానములు, తపస్సులు, వేదాధ్యయనము, వేదవిచారము, ఇంద్రియసంయమనము, కర్మత్యాగము, వివిధాంగయోగములు, భక్తియోగము, ప్రవృత్తి నివృత్తి మార్గములు, ఆత్మ తత్వజ్ఞానము దృఢమైన వైరాగ్యము వీనివలన భగవంతుని పొందవచ్చును.

ఇతరులకు భయము కలిగించువారికి, దుష్టులకు, దుర్వినీతులకు, గర్వపోతులకు, దురాచారులకు దాంభికులకు, విషయలాలసులకు, సంసారము మీదనే ఆసక్తి గలవారికి, భగవద్భక్తులు కానివారలకు, భగవద్భక్తులను ద్వేషించు వారలకు ఈ రహస్యములు ఉపదేశించరాదు.

శ్రద్ధగల వారలకు, భక్తులకు, వినతులకు, అసూయలేనివారికి, ప్రాణమిత్రులకు, శుశ్రూషాభిలాషులకు, బాహ్యవిషయముల మీద ఆసక్తిలేనివారికి, శాంత చిత్తులకు, పవిత్ర చిత్తులకు, భగవంతుని ప్రేమించువారికి మాత్రమే ఈ తత్వమును ఉపదేశించవలెను.

"య ఇదం శృణుయాదంబ శ్రద్ధయా పురుషస్సకృత్
యో వాభిధత్తే మచ్చిత్తస్సహ్యేతి పదవీం చ మే.

తల్లీ! నాపై మనసు నిలిపి దీనిని శ్రద్ధగా విన్న పురుషుడు లేదా దీనిని వినిపించినవాడు నా పరమపదము చేరుకొనును. అనుచున్నారు కపిల భగవానులు.

మోక్ష ప్రాప్తి.

దేవహూతి కపిల భగవానుని ఉపదేశము విన్నది. ఆమెకు జ్ఞానోదయమైనది. తన కుమారుడు శ్రీమన్నారాయణుడని గ్రహించినది. భగవానుని నోరార స్తుతించినది. కపిలస్వామి దేవహూతి స్తోత్రము విన్నాడు. అన్నాడు :-

"అమ్మా! నీకు సులభమైన మార్గమును బోధించినాను. ఈ మార్గమును అవలంబించి త్వరలోనే పరమపదము చేరుకొన గలవు. బ్రహ్మవాదులైన మునులు అనుసరించుమార్గమిది. శ్రద్ధగా ఈ మతమును అనుసరించుము. అభయస్వరూపుడనైన నన్ను చేరుకొనగలవు" అని తల్లి అనుమతి పొంది వెళ్ళిపోయినాడు.

కపిల భగవానుడు ఉపదేశించిన మార్గమును అవలంబించి దేవహూతి సరస్వతీ నది ఒడ్డునగల ఆశ్రమమున నివసించినది. నారబట్టలు కట్టుకొని ఉగ్రమైన తపము ప్రారంభించినది. కపిలదేవుని ఒక్కొక్క అవయవము ధ్యానించసాగినది. భక్తి ప్రవాహము వలనను, బలీయమైన వైరాగ్యము వలనను, తగిన కర్మానుష్ఠానము వలనను ఆమె చిత్తము పరిశుద్ధమై సర్వవ్యాపకమై ఆధ్యాత్మ ధ్యానమున మగ్నమైనది. ఆమెబుద్ధి భగవానునిమీద స్థిరపడినది. నిత్య ముక్తురాలై ఆత్మ స్వరూపుడైన భగవానుని చేరుకొన్నది.

ఇది తృతీయస్కంధము

శ్రీమద్భాగవతము

చతుర్థ స్కంధము

దక్షయజ్ఞము.

పూర్వము ప్రజాపతులు ఒక యజ్ఞము చేసినారు. ఆ యజ్ఞమునకు ఋషులు, దేవతలు, మునులు అగ్నులు వచ్చి సమావేశమైనారు. అట్లెల్లరు సమావేశమైన సభలో దక్షప్రజాపతి ప్రవేశించినాడు. సూర్యునివలె వెలిగిపోవు అతని తేజస్సును చూచి బ్రహ్మ శివుడు తప్ప తక్కిన వారందరు లేచినారు. సభాపతుల సన్మానము పొందిన దక్షప్రజాపతి లోకగురువైన బ్రహ్మకు నమస్కరించి ఉచితాసనమున ఆసీనుడైనాడు.

తాను సభలో ప్రవేశించినపుడు లేవక కూర్చున్న శివుని చురచుర చూచినాడు. శివుడు తనను అవమానించినాడని భావించినాడు. మళ్ళీ చురచుర చూచినాడు.

"సభాసదులారా! సిగ్గువిడిచిన శివుడు లోకపాలుర పవిత్రకీర్తిని పాడుచేయుచున్నాడు. ధర్మమును గావలేకున్నాడు. సత్పురుషులు ఆచరించిన ధర్మమును కాలదన్నుచున్నాడు. సాధువువలె బ్రాహ్మణుల ఎదుట నాకూతురు సతీదేవిని పెళ్ళాడినాడు. ఇతడు నా అల్లుడైనందున నాకు శిష్యుడైనాడు. అట్టివాడు నేను వచ్చినపుడు లేచలేదు సరికదా ఒక్క మాట మాట్లాడుటగాని రవంత మర్యాద చేయుటగాని చేయలేదు. శూద్రునకు విద్యనేర్పినట్లు పుష్పమువంటి నా కూతురును వీనికిచ్చి దాని గొంతు కోసినాను. బ్రహ్మదేవుని మాటవిని ఈ ఆచారహీను, ప్రేతముల నాయకునకు, బంగారమువంటి నా కూతురును కట్టబెట్టినాను" అని నిందించినాడు.

దక్షుడు శివుని తిట్టినాడు. దూలనాడినాడు. అయినను ఆదిదేవుడు శివుడు పల్లెత్తు మాట అనలేదు. నిశ్చలముగా కూర్చున్నాడు.

దక్షుడు ఇంకను మండిపోయినాడు. గలాటా చేసినాడు. చేతిలో నీరు తీసుకొని, "ఈ శివుడు దేవతలలో అధముడు. నేటి నుండి ఇంద్రుడు, ఉపేంద్రుడు మున్నగు

దేవతలతోపాటు ఇతనికి యజ్ఞమున భాగము లభించకుందును గాక" అని శపించి సభనుండి లేచి వేగముగా వెళ్ళిపోయినాడు.

దక్షుడు శివుని శపించినాడు. అను విషయము నందీశ్వరునకు తెలిసినది. అతడు ఉగ్రుడైనాడు నిలువున వడకిపోయినాడు. శివనిందకు పాలుపడిన వారిని దారుణముగా ఇట్లు శపించినాడు.

"పశువువలె ప్రవర్తించిన దక్షుని ముఖము మేక ముఖమై పోవునుగాక !

అతనికి తాళము వేసినవారు సంసార దుఃఖమున మగ్నులు అగుదురుగాక !

శివద్రోహులై సర్వము చూచి సహించిన ఇచటి బ్రాహ్మణులు సర్వభక్షకులు అగుదురుగాక ! వీరు విద్య, తపము వ్రతములు తిండికొరకే ఆచరింతురుగాక ! దేహము ఇంద్రియములు వీటిమీద ప్రీతికలిగి భిక్షావృత్తి అవలంబింతురుగాక !"

నందీశ్వరుని ఘోరమైన శాపములు విన్నాడు భృగువు. అతడు ఉగ్రుడైనాడు. బ్రహ్మదండసమానమంటి శాపము పెట్టినాడు :—

"శివభక్తులు, వారిపక్షము అవలంబించినవారు శాస్త్రములకు వ్యతిరేకులు, పాషండులు కావలెను. శివదీక్ష పూనినవారు శుచిలేనివారు కావలెను. మూఢ బుద్ధులు, జటాభస్మధారులు కావలెను. వారికి దైవమువలె కల్లు, సారాయి ఆదరణీయము కావలెను."

శివుడు భృగువు శాపము విన్నాడు. తన అనుచరుల సహితముగా సభనుండి లేచి వెళ్ళిపోయినాడు.

తరువాత కొంత కాలమునకు బ్రహ్మదేవుడు దక్షుని ప్రజాపతులకు అధిపతిగా అభిషేకించినాడు. అందువలన దక్షుని గర్వము మరింత పెరిగినది. బ్రహ్మనిష్ఠులైన మహాత్ములను ఉపేక్షించి వాజపేయ యజ్ఞము చేసినాడు తదుపరి బృహస్పతియజ్ఞ మను ఉత్తమమైన యజ్ఞమును ప్రారంభించినాడు. ఆ యజ్ఞమునకు మహర్షులు, దేవతలు, పితృదేవతలు భార్యలతోకూడి వచ్చినారు.

దేవతలు, గంధర్వులు భార్యలతోకూడి గగన మార్గమున దక్షుని యజ్ఞమునకు వెళ్ళుటను సతీదేవి చూచినది. వారు యజ్ఞమును గురించి చెప్పుకొను మాటలు విన్నది. తండ్రి చేయు యజ్ఞమునకు తాను వెళ్ళవలెననుకున్నది. ఉత్సాహపడినది. పరమశివుని వద్దకు వెళ్ళినది

"ప్రియా ! మీ మామగారు మహాసంరంభముగ యజ్ఞము చేయుచున్నారు. దేవత లందరు ఆ యజ్ఞము చూచుటకు వెళ్లుచున్నారు. అచటికి మా అక్కలందరు వత్తురు. వారిని చూడవలెనని కుతూహలముగా నున్నది. మనము కూడ వెళ్లి యజ్ఞమును చూతము.

త్రిగుణస్వరూపమైన ఈ విచిత్ర విశ్వము మీ మాయాశక్తితో సిద్ధమై, మీలో ప్రకాశించుచున్నది. మీకు ఆశ్చర్యము కలిగించునది ఏదియు లేదు. కాని ఆడదాన నైన నేను మీ తత్వమును తెలుసుకొనలే కున్నాను. కన్నవారి ఇల్లు చూడ వలెనని ఉబలాటపడుచున్నాను. అంగీకరించుడు. మనలను పిలువలేదని వెను కాడవలదు.

> కన్నవారి ఇంటికి, అత్తవారి ఇంటికి, స్నేహితుల ఇంటికి పిలువకున్నను వెళ్ళ వచ్చును." అని ప్రాధేయపడినది.

శివుడు సతీదేవి మాటలు విన్నాడు. దక్షుడు తనకు చేసిన అవమానము తలపునకు తెచ్చుకున్నాడు. అన్నాడు :—

> పిలువకపోయినను బంధువుల ఇంటికి వెళ్ళవచ్చును. కాని అట్టివారు దేహాభి మానమును, క్రోధమును, దోషదృష్టి లేనివారును కావలెను. విద్య, తపము, ధనము, వయసు, వంశము, రూపము ఇవి సత్పురుషులకు సుగుణములు. దుష్టులకు దుర్గుణములుగా పరిణమించి వారి వివేకమును అవే నాశనము చేయును. వారు స్వాభిమానమువలన అంధులై సత్పురుషుల తేజస్సును చూడలేరు. అతిథులను కోపదృష్టితోను, కుటిల బుద్ధితోను చూచునట్టి అవ్య వస్థితుల ఇండ్లకు బంధుభావమున వెళ్ళరాదు. కుటిల బుద్ధులైన బంధువుల మాటలు బాధించినట్లు శత్రువుల శరములు సహితము బాధించవు. శత్రువుల శరములు తగిలిన వ్యక్తి హాయిగా నిద్రించును. కాని బంధువుల కుటిలమైన వాగ్బాణములు తగిలిన వ్యక్తి హృదయము బద్దలవడి రాత్రింబవళ్ళు అశాంతితో బాధపడును.

"ప్రియా ! దక్షుడు నీకు కన్నతండ్రి యనుమాట నిజము. కాని అతడు నామీద పగబట్టినందున అతనిని కాని అతని పక్షము అవలంబించిన వారిని కాని మనము చూడరాదు. ఏ అపరాధము చేయని నన్ను ప్రజాపతుల యజ్ఞమున తూలనాడినాడు. ఆ సభలో నీ తండ్రిని గౌరవించక పోయినందుకు కారణము చెప్పెదను వినుము. ఇద్దరు కలుసుకున్నపుడు ఒకరికి ఒకరు ఎదురువెళ్లి అభివాదము చేసికొనుట లోకవ్యవహారము. కాని ప్రాజ్ఞులైనవారు సర్వాంతర్యామియైన

బ్రహ్మదేవుని ఉపాసించిన యోగులు సత్యలోకము చేరుకొని రెండు పరార్ధముల కాలములో జరుగు ప్రళయమువరకు అచట ఉందురు.

భగవానుడైన వాసుదేవుని మీద భక్తినిలిపినవారికి త్వరలో వైరాగ్యము, బ్రహ్మ సాక్షాత్కారము, జ్ఞానము కలుగును. భగవానుని గుణగణముల విషయమున అనురాగము కలుగుటచే భక్తుని చిత్తము అతనిపై కేంద్రీకరించును. ఇంద్రియ విషయికము, ప్రియాప్రియము అను భేదభావము నశించును. సర్వత్ర భగవంతుడు కనిపించును. అపుడు నిస్సంగుడు, సమదర్శనుడు, పరమానందపదము నెక్కినవాడు అయిన ఆత్మ దర్శనము లభించును.

బ్రహ్మదర్శనజ్ఞానమున ప్రకృతి, పురుషుల యథార్థస్వరూపము అవగత మగును. నిర్గుణ జ్ఞానయోగము, భక్తియోగము రెండింటిఫలములు ఒకటియే. రెండింటి వలన భగవంతుని పొందవచ్చును. ఒకే పదార్థము వేరు వేరు ఇంద్రియములకు వేరు వేరు విధముల అనుభూతమగును.

పాలు ఒకటే పదార్థము. అది కంటికి తెల్లగా కనిపించును. నాలుకకు తీయగా ఉండును తాకిన చల్లగా ఉండును.

అట్లే భగవంతుడు ఒక్కడే అయినను ఉపాసనాభేదమువలన వివిధములుగా నిరూపించబడుచున్నాడు. కర్మకలాపములు, యజ్ఞములు, దానములు, తపస్సులు, వేదాధ్యయనము, వేదవిచారము. ఇంద్రియసంయమనము, కర్మత్యాగము, వివిధాంగయోగములు, భక్తియోగము, ప్రవృత్తి నివృత్తి మార్గములు, ఆత్మ తత్వజ్ఞానము దృఢమైన వైరాగ్యము వీనివలన భగవంతుని పొందవచ్చును.

ఇతరులకు భయము కలిగించువారికి, దుష్టులకు, దుర్వినీతులకు, గర్వపోతులకు, దురాచారులకు దాంభికులకు, విషయలాలసులకు, సంసారము మీదనే ఆసక్తి గలవారికి, భగవద్భక్తులు కానివారలకు, భగవద్భక్తులను ద్వేషించు వారలకు ఈ తత్వములు ఉపదేశించరాదు.

శ్రద్ధగల వారలకు, భక్తులకు, వినతులకు, అసూయలేనివారికి, ప్రాణిమిత్రులకు, శుశ్రూషాభిలాషులకు, బాహ్యవిషయముల మీద ఆసక్తిలేనివారికి, శాంత చిత్తులకు, పవిత్ర చిత్తులకు, భగవంతుని ప్రేమించువారికి మాత్రమే ఈ తత్వమును ఉపదేశించవలెను.

భగవంతునకేగాని దేహాభిమానముగల పురుషునకు నమస్కరించరు. ఆమార్గమునే నేను అవలంబించగా నీ తండ్రి నన్ను ఎంత తిరస్కరించవలెనో అంత తిరస్కరించినాడు. కాన నామాట వినక నీవు వెళ్లిన నీకు క్షేమము కలుగదు.

సత్పురుషులకు స్వజనము వద్ద కలిగిన అవమానము మరణసమానము.

కన్నవారింటికి వెళ్ళనిచ్చిన అక్కడ జరుగు అవమానమును భరించలేక ఈమె ప్రాణము వదలక తప్పదు. వెళ్ళవలదని నిరోధించినను ఆ బాధపడలేక చని పోవును, అని ఆలోచించి శివుడు మరి మాట్లాడలేదు.

తండ్రిని బంధువులను చూడవలెనను అభిలాషతో ఇంటిబయటికి వచ్చెడిది. శివునకు భయపడి లోనికి వెళ్ళెడిది. సతీదేవి అట్లు మథనపడినది. తుదకు కన్నవారింటికి వెళ్ళవలెనను వాంఛ ప్రబలమైనది. స్నేహమువలన దుఃఖము ముంచుకొనివచ్చి కన్నీరు వరదలు కట్టినవి. శరీరము కంపించినది. రోషాగ్నితో శివుని చురచుర చూచినది. శోకమునను, క్రోధమునను పెద్ద నిట్టూర్పులు విడిచినది. మూర్ఖ బుద్ధితో భర్తను వదిలి స్వేచ్ఛగా కన్నవారింటికి బయలుదేరి వెళ్లిపోయినది.

ఒంటిగా వెళ్లిపోవుచున్న సతీదేవిని చూచినారు మణిమంతుడు, మదుడు మున్నగు శివుని అనుచరులు వేయిమంది. వృషభమును తీసుకొని పరుగెత్తినారు. ఆమెను వృషభముమీద కూర్చుండబెట్టినారు. శ్వేతచ్ఛత్రము, పుష్పమాలికలు మున్నగు రాజోచితమైన సంభారములు, దుందుభులు, శంఖములు మున్నగు వాద్యములు తీసుకొని వెంటనడిచినారు.

సతీదేవి దక్షుని యజ్ఞశాలకు చేరినది.

బ్రహ్మర్షులతోను, దేవతలతోను కిటకిటలాడుచున్న యజ్ఞశాల దేదీప్యమానముగా ఉన్నది. తీయగను, కమ్మగను వేదఘోష వినిపించుచున్నది. కర్రలు, లోహములు, బంగారము, కుశలు, చర్మముతో చేసిన పాత్రలు కుప్పలు కుప్పలుగాపడి ఉన్నవి.

అచట ఉన్న వారందరు దక్షునకు భయపడినారు. ఎవరును సతీదేవిని ఆదరించ లేదు. తల్లి, అక్కలు మాత్రము ఆదరముగ కౌగలించుకొని ప్రేమతో కన్నీరు కార్చినారు. తండ్రి ఆమెను పలుకరించనైన పలుకరించలేదు.

తండ్రి యజ్ఞమున భర్తకు ఆహ్వానములేదని గ్రహించినది సతీదేవి. తన తండ్రి తన భర్తను, తనను అవమాన పరుచుచున్నాడని గ్రహించినది. క్రోధమున నిప్పులు కురిపించినది. ఆమె కోపాగ్నికి [illegible]. యజ్ఞము

ధ్వంసము చేయుటకు ఉరికిన తన అనుచరులను వారించినది. గర్వించి తన్ను మిన్న కానని తండ్రిని క్రోధమున తడబడు వాక్కులతో ఇట్లు తిట్టినది :—

"నాయనా ! శివుడు సర్వ శ్రేష్ఠుడు. ఆత్మస్వరూపుడు. ప్రియతముడు. సర్వాత్ముడు. అతనిని నీవు తప్ప ఎవరును ద్వేషించరు. సాధు పురుషులు ఇతరుల దోషములను గుణములుగా భావింతురు. నీవంటి వారు ఇతరుల గుణములను దోషములుగా భావింతురు. సాధుపురుషులు తమను నిందించినను సహింతురు. కాని వారి సేవకులు మాత్రము ఆ నిందను సహించరు. ఆ నింద నిందించువారి తేజస్సును నాశనము చేయును.

'శివ' అను రెండక్షరములు పలికినంత మాత్రమున సమస్త పాపములు హరించి పోవును. అట్టి శివుని ద్వేషించుచున్నావు. అది నీకు క్షేమముకాదు.

ధర్మరక్షకుడైన ప్రభువును నిందించినపుడు అతని నాలుక నరుకుట ధర్మము. ఆ శక్తిలేనపుడు చెవులుమూసుకొని అచటినుండి వెళ్ళిపోవలెను. శివద్వేషివైన నీకు జన్మించిన నేను ఈ శరీరము ధరించి బ్రతుకలేను. తినకూడనిది తిన్నపుడు దానిని వాంతిచేసిననే శుద్ధికలుగును. భగవంతుడైన శివుని విషయమున అపరాధము చేసిన నీ శరీరమునుండి పుట్టిన నా ఈ శరీరము కలుషితమైనది. మహా పురుషులకు అపరాధము చేసినవారి కడుపున పుట్టుట నీచాతినీచము".

యజ్ఞశాల మధ్యమున తండ్రిని పై విధముగా నిందించిన సతీదేవి అవమానము శరీరమును దహించుచుండగా మౌనము దాల్చి ఉత్తర దిశకు తిరిగి కూర్చున్నది. ఆచమనముచేసి పసుపుపచ్చని బట్ట కప్పుకొని కండ్లుమూసుకొని, శరీరము త్యజించుటకు నిశ్చయించి యోగమును అవలంబించినది.

స్థిరాసనముచేసి ప్రాణాయామమున ప్రాణమును అపానమును నాభి చక్రమున నిలిపినది. ఉదానవాయువును నాభిచక్రము మీదకు లేపి క్రమక్రమముగా బుద్ధితో కలిపి హృదయమునందు చేర్చినది. హృదయమందలి వాయువును కంఠమునుండి కనుబొమలమధ్య చేర్చినది. శరీరమందంతటను వాయువును, అగ్నిని పూరించి పరాత్పరుడైన శివదేవుని పాదపద్మముల మీదనే మనసు కేంద్రీకరించి ఇతర ధ్యానములు వదిలిపెట్టినది.

యోగాగ్ని మహాతేజమున ప్రజ్వరిల్లినది. కల్మషరహితమైన సతీదేవి దేహము, మహాపురుషులు పూజించదగిన శరీరము, శివుడు తన ఒడిలో పెట్టుకుని లాలించిన శరీరము యోగాగ్నిలో భస్మమైపోయినది.

సభాసదులెల్లరు హాహాకారములు చేసినారు.

భూమ్యాకాశములందు భయంకర కోలాహలము చెలరేగినది.

దక్షుడు చేసిన అవమానమునకు కోపించిన శివుని పత్ని, లోకమాత దేహత్యాగము చేసినది !!

సతీదేవి అనుచరులు అస్త్రశస్త్రములు తీసుకొని దక్షుని చంపుటకు ఉరికినారు. అదిచూచి మండిపడినాడు భృగువు. యజ్ఞమును పాడుచేయువారి నాశనమునకు గాను "అపహతాగ్ంరక్షః——" మున్నగు మంత్రముల దక్షిణాగ్నిలో ఆహుతి చేసి అభిచారహోమము చేసినాడు.

భృగువు ఆహుతిచేయగనే తపోబలమున చంద్రలోకము చేరుకున్న "ఋభులు" అను దేవతలు ఎంతోమంది యజ్ఞకుండమునుండి బయల్వెడలినారు. వారు సతీదేవి అనుచరులయిన ప్రమథులను, గుహ్యకులను తరిమికొట్టినారు.

ముక్కంటికి దక్షయజ్ఞమున జరిగిన వృత్తాంతము తెలిసినది. అతడు కోపమున ఉగ్రుడైనాడు. రుద్రుడైనాడు. పెదవి కరచి అగ్నిజ్వాలవలె తేజరిల్లుచున్న ఒక జడను శిరమునుండి పెరికి ఉద్వృత్తుగా నిలుచుండి, మహాట్టహాసమున నేల మీద కొట్టినాడు.

ఉత్తరక్షణమున మహాకాయుడైన వీరభద్రుడు అవతరించినాడు. అతని శరీరము కారుమబ్బువలె నల్లగావుండి ఆకసమునంటుచున్నది. అతనికి వేయిచేతులున్నవి. సూర్యునివలె కోరలు దారుణముగ నున్నవి జుట్టు అగ్నిహోత్రమువలె మండుచున్నది. వేయి చేతులందు వేయి ఆయుధములు కలిగి అతడు భయంకరముగా ఉన్నాడు;

"ప్రభూ! ఏమి ఆజ్ఞ?" అని చేతులు జోడించి రౌద్రము కక్కుచున్న శివుని ముందు నిలువబడినాడు.

"రుద్రభటా!" శివుడు గర్జించినాడు. నా భటులకు సేనాధిపతివై వెళ్ళి దక్షుని, దక్షయజ్ఞమును ధ్వంసము చేయుము. నీవు నా అంశమున జన్మించినావు కాన బ్రహ్మతేజస్సునకు వెరవకుము.

పిడుగువంటి శివుని ఆజ్ఞను తలదాల్చినాడు వీరభద్రుడు. ప్రదక్షిణ నమస్కారములు చేసినాడు. అతనికి ఎనలేని బలమువచ్చినది. లోకమంతయు ఒక్కటైనా

వచ్చినను ఎదిరించి గెల్చునంత సాహసము కలిగినది. అతని మూడు కన్నుల మంట ఆకసమునంటినది. మృత్యువును సహితము అంతము చేయగల త్రిశూలము పట్టుకొని వేలసింహము లొకపరి గర్జించినట్లు మహాగర్జన చేసినాడు. ప్రపంచ మందలి కొండగుహలన్నియు ప్రతిధ్వనించినవనిన మానవహృదయములను గురించి చెప్పపనిలేదు. అతడు మహాకోలాహలముగా పెద్దపెద్ద అంగలువేయుచు దక్షుని యజ్ఞశాలవైపునకు పరుగెత్తినాడు. అసంఖ్యాకులైన రుద్రానుచరులు హుంకరించుచు గర్జించుచు అతనిని అనుసరించినారు.

దక్షుని యజ్ఞశాలలో జనులు ఉత్తరదిశన రేగిన ధూళినిచూచి చీకట్లు క్రమ్ముచున్నవి అనుకున్నారు. త్వరలోనే అది ధూళికాదని అనియు, అది ఆకసమువంటి చీకట్లు కలుగచేయుచున్నదనియు గ్రహించినారు. ప్రళయము వచ్చుచున్న దనుకొన్నారు.

దక్షుని భార్య ప్రసూతి మున్నగు స్త్రీలు, ఏ అపరాధములేని సతీదేవిని అవమానించిన పాపము ఇట్లు పరిణమించుచున్న దనుకొన్నారు.

భూమ్యాకాశములమీద అసంఖ్యాకములైన అపశకునములు గోచరించినవి.

దక్షుని గుండెలు దడదడలాడినవి.

ఇంతలో శివుని అనుచరుల దండు మహాప్రళయమువలె విరుచుకొని పడినది. వారు నలువైపులనుండి యజ్ఞశాలను ముట్టడించినారు. కొందరు యజ్ఞశాల ప్రాగ్వంశమును విరిచినారు. కొందరు యజ్ఞశాల పడమటిదిశన ఉన్న పత్నీశాలను పడగొట్టినారు. కొందరు ఎదుటి సభామంటపమును ముక్కలు ముక్కలు చేసినారు. కొందరు అగ్నిధ్రశాలను మంటగలువగా మరికొందరు యజమాని గృహమును, వంటశాలను నాశనము చేసినారు. కొందరు యజ్ఞపాత్రలు బ్రద్దలు చేసినారు. కొందరు అగ్నిహోత్రములు ఆర్పివేసినారు. కొందరు యజ్ఞసూత్రములను తెంపినారు. కొందరు మునులను బాధించినారు. కొందరు స్త్రీలను అల్లరిచేసినారు. మరికొందరు పారిపోవుచున్న దేవతలను వెన్నంటి పట్టుకొన్నారు.

యజ్ఞశాలలో ప్రళయరుద్రుడు నాట్యమాడినాడు.

యజ్ఞశాలలో బీభత్సము తాండవించినది.

మణిమంతుడు భృగువును పట్టుకొని కట్టివేసినాడు.

వీరభద్రుడు దక్షుని కట్టివేసినాడు.

చండీశుడు సూర్యుని, నందీశుడు భగదేవుని పట్టుకున్నారు.

ప్రజాపతుల సభలో గడ్డములు, మీసములు ఊపుచు భృగువు శివుని వెక్కిరించి నందున స్రువము పట్టుకొని హోమము చేయుచున్న భృగువు గడ్డములు, మీసములు ఊడబెరికినాడు వీరభద్రుడు.

దక్షుడు నిందించుచున్నపుడు భగదేవుడు కన్నుకొట్టి దక్షుని ప్రోత్సహించినందుకు భగదేవుని గుడ్లు పెరికివేసినాడు.

దక్షుడు శివనింద చేయునపుడు పూషుడు పండ్లికిలించినందున పూషుని పళ్ళు ఊడగొట్టినాడు.

వీరభద్రుడు దక్షుని తలపై కూర్చొని వాడికత్తితో అతని తల నరుకుటకు ప్రారంభించినాడు. ఎంత నరికినను దక్షునితల తెగలేదు. వివిధాయుధములతో కొట్టినను తల తెగలేదు. యజ్ఞమంటపమున యజ్ఞపశువును వధించినట్లు దక్షుని వధించినాడు. అతడు చచ్చిన తరువాత తల నరికి పారవేసినాడు.

దక్షుని పరివారము హాహాకారములు చేసినది.

భూత ప్రేత పిశాచములు వికటాట్టహాసము చేసినవి.

శివుని అనుచరుల చేతులలో చావుతప్పి కన్నులొట్టపోయిన దేవతలు బ్రహ్మదేవుని వద్దకువెళ్ళి సాష్టాంగపడి జరిగిన వృత్తాంతమంతయు విన్నవించినారు.

దేవతలు చెప్పినదంతయు బ్రహ్మదేవుడు విన్నాడు. అన్నాడు :—

“మహాతేజస్వియైన పురుషునకు అపరాధముచేసి జీవించుట కష్టము. శివునకు యజ్ఞభాగము లేకుండచేసి మీరు ఘోరమైన అపరాధము చేసినారు. అతనికి శరణువేడుటతప్ప మరొక మార్గము లేదు.

శివుడు కోపించిన లోకపాలురు సహితముగా లోకములన్నియు నాశనమగును. దక్షుని అవమానవాక్యములు, దానికితోడు భార్యావియోగము సంభవించినది. మీరు మీ క్షేమము కోరినచో అతని వద్దకేగి క్షమాభిక్ష వేడుడు. యజ్ఞమును పునరుద్ధరించవలసినదని ప్రార్థించుడు. అతని ఐశ్వర్యములు తెలుసుకొనుట నాకు, దేవేంద్రునకు ఇతర మునులకు కూడ సాధ్యపడదు. అతనిని శాంతపరచుట ఎవని తరము ?” అనుచు దేవతలు, ప్రజాపతులు, పితృదేవతలు మున్నగువారితో కలిసి కైలాసమునకు వెళ్ళెను.

కైలాసగిరి ఉన్నతమైనది, విశాలమైనది, సుందరమైనది. రత్నశిఖరములతోను, రకరకములైన ధాతువులతోను కైలాసము ప్రకాశించుచుండును. అచట ఎన్నో విధముల లతలు, వృక్షములు, మృగములు, అడవి జంతువులు ఉండును. అచట నెమళ్ళు కూయుచుండును. గండు తుమ్మెదలు ఝుంకారము చేయుచుండును. కోకిలలు కమ్మగా పాడుచుండును. ఎత్తయిన కల్పవృక్షములు తమ కొమ్మలను ఊపుచు పక్షులను పిలుచుచుండును.

జన్మతో సిద్ధిపొందిన దేవతలచట నివసింతురు. గంధర్వులు, కిన్నరులు, అప్సరసలు విహరించుచుందురు.

ఆ కొండమీద లేని వృక్షములు వృక్షజాతులందు లేవు. అచటలేని పక్షిజాతులు పక్షిజాతులందు లేవు. అచటి జలాశయములందు తెల్లకలువలు, నల్లకలువలు, ఎఱ్ఱకలువలు, పద్మములు వికసించి ఘుమఘుమలాడుచుండును. నలుదిశలందు పవిత్రమగు గంగానది ప్రవహించుచుండును.

శివుని నివాసస్థానమైన కైలాసమును చూచి దేవతలు ఆశ్చర్యపోయినారు. కుబేరుని రాజధాని రమ్యమైన అలకానగరమును చూచినారు. అచటి సౌగంధిక వనము సౌగంధికపద్మములచే నిండియున్నది. అలకానగరపు అవల నంద, అలకనంద అను నదులు ప్రవహించును. రతిక్రీడలందు అలసిపోయిన దేవతాస్త్రీలు ఆ నదులలో జలక్రీడలాడుచు ప్రియులపై నీరు చిమ్ముదురు. జలకములాడునపుడు వారి కుంకుమపూత కరగి నదీజలములు పసుపుపచ్చగా కనిపించును.

దేవతలు అలకానగరము, సౌగంధిక వనము దాటిపోగా వారికి ఒక పెద్ద మఱ్ఱి చెట్టు కనిపించినది. ఆ మఱ్ఱి ఎత్తు వందయోజనములు. దాని కొమ్మలు డెబ్బది అయిదు ఆమడల పొడవున్నవి. చెట్టుమీద ఒక్క పిట్టగూడుకూడ లేదు. ముక్తి గోరువారలకు ఆశ్రయస్థానమది.

ఆ మఱ్ఱిచెట్టుక్రింద భూతనాథుడైన శివుడు కూర్చునియున్నాడు. అతడు క్రోధము విడిచిన యమునివలె ప్రశాంతముగా వున్నాడు. సనందుడు మున్నగు సిద్ధులు, శివుని మిత్రుడు కుబేరుడు శివుని సేవించుచున్నారు. సాయంకాల మేఘమువలె ప్రకాశించు దేహముమీద తాపసుల ప్రియచిహ్నమైన భస్మము ధరించినాడు. దండము, జడలు, లేడిచర్మము, లలాటముమీద చంద్రకళ ఎంతో శోభను కలిగించుచున్నవి. అతని ఎడమ పాదము కుడి తొడమీద వుండి ఎడమమోకాలు

ఎడమ మోకాలుమీద వున్నది, కుడి ముంజేతిలో రుద్రాక్షమాల కలిగి తర్కముద్రతో కూర్చున్నాడు. యోగముద్ర ధరించి ఏకాగ్రచిత్తమున బ్రహ్మానంద మనుభవించుచున్నాడు.

అట్టి శివుని లోకపాలురు, దేవతలు చూచినారు. శివుడు బ్రహ్మదేవుని చూచినాడు. లేచి నమస్కరించినాడు. సనందాదులు కూడా బ్రహ్మదేవునకు నమస్కరించినారు. వారి వందనములు అందుకొని బ్రహ్మ శివునితో ఇట్లనెను :—

"ప్రభూ ! నీవు విశ్వేశ్వరుడవు. ప్రకృతికి పురుషునకు నియంతవైన పరబ్రహ్మవు. నీవే లోకములను సృష్టించి, పోషించి సంహరించుచున్నావు. వేదరక్షణకుగాను దక్షుని నిమిత్తమాత్రునిచేసి నీవే యజ్ఞము సాగించినావు. నీవు ఏర్పరచిన వర్ణాశ్రమ ధర్మములను బ్రాహ్మణులు శ్రద్ధగా పాలించుచున్నారు. నీవు మంగళమయుడవు. పుణ్యకర్మములు చేయువారికి స్వర్గమును, పాపకర్మనులు చేయువారికి నరకమును నీవే విధించుచున్నావు. నీవు యజ్ఞఫలదాతవు. యజ్ఞభాగమున నీకు సంపూర్ణమైన అధికారమున్నది. దక్షుని యజ్ఞమందు బుద్ధిలేని యాజ్ఞికులు నీకు యజ్ఞభాగము లేకుండ చేసినందువనే యజ్ఞము ధ్వంసమైనది. ఇప్పుడు నీవే అనుగ్రహించవలెను. యజ్ఞమును పూర్తి చేయవలెను.

విభూ ! యజమాని దక్షునకు ప్రాణభిక్ష పెట్టుము. భగదేవునికి నేత్రములు, భృగువునకు మీసములు, గడ్డము, పూషునకు పళ్లు అనుగ్రహించుము.

రుద్రదేవా ! నీ అనుచరుల శస్త్రాస్త్రముల దెబ్బలవలన గాయపడిన దేవతలు, ఋత్విజులు బాగుపడునట్లు కరుణించుము. అసంపూర్తిగావున్న యజ్ఞభాగము నీవే గ్రహించుము. పూర్తిచేయించుము" అని వేడుకున్నాడు.

"ప్రజాపతీ ! బ్రహ్మదేవా ! భగవంతుని మాయవలన బాలురవలె అజ్ఞానులై అపరాధము చేసినవారి విషయము నేను ఏమాత్రము పట్టించుకొనను. లోకశిక్షణ కొరకే దక్షుని విషయమున ఈ దండవిధానమును అవలంబించినాము.

దక్షప్రజాపతి తల దగ్ధమైపోయినందున అతనికి మేకతల ఏర్పడును భగదేవుడు మిత్రదేవుని నేత్రములతో చూడగలడు. పూషుడు యజమాని దంతములచే పిష్టద్రవ్యములు తినును. నాకు యజ్ఞభాగము ఇచ్చుటకు అంగీకరించిన దేవతలందరి గాయములు బాగుపడును. వికలాంగులైన ఋత్విక్కులు దేవతల బాహువుల వలన, సూర్యుని చేతులవలన పరిపూర్ణాంగులగుదురు" అన్నాడు శివభగవానుడు.

శివుని మాటలు విని దేవతలందరు సంతసించినారు. దేవతలందరు ఆహ్వానించగా బ్రహ్మదేవునితోను, దేవతలతోను శివుడు యజ్ఞస్థలమునకు చేరినాడు. అన్నియు శివుడు చెప్పినట్లే జరిగినవి. దక్షునకు మేకతల తగిలించగా అతడు నిద్రనుండి మేల్కొన్నట్లు లేచెను. శివద్వేషమున కలుషితమైయున్న దక్షుని ఆత్మ శివుని కృపాదృష్టితో శరత్కాలపు జలాశయమువలె నిర్మలమయ్యెను. చనిపోయిన ముద్దుపట్టి సతీదేవి గుర్తునకు రాగా దుఃఖము ముంచుకొని వచ్చి గొంతు పూడుకొనిపోయినందున నోటమాట పెకలలేదు. మనసు వ్యాకులపడినది. మనసు కుదుటపరచుకొని నిష్కపటభావమున శివుని క్షమాభిక్ష కోరినాడు.

"భగవానుడా! నీ యెడల అపరాధము చేసినాను. నీశిక్ష నాకు వరమైనది. నీ ఆగ్రహము నాకు అనుగ్రహమైనది. తగిన దండన విధించినావు. నేను తత్త్వజ్ఞాన మెరుగనివాడను. అందువలననే యజ్ఞశాలలో నిన్ను అనరాని మాటలన్నాను. పూజ్యులకు పూజ్యుడవైన నిన్ను నిందించి అధఃపతితుడనయినాను. అంత అపరాధము చేసినను నీవు నన్ను అనుగ్రహించి రక్షించినావు. నిన్ను ప్రసన్నుని చేసికొనుటకు నావద్ద ఎట్టి సుగుణములు లేవు. నీగుణము వలననే నీవు ప్రసన్నుడవు కమ్ము ప్రభూ!" అని ప్రార్థించినాడు.

శివుని క్షమాభిక్ష వేడుకొని, బ్రహ్మదేవుని ఆదేశము ప్రకారము దక్షుడు ఉపాధ్యాయులు, ఋత్విజులు తాను కూర్చొని యజ్ఞకార్యము ప్రారంభించినారు. యజ్ఞము నిరాటంకముగ పూర్తిచేయుటకుగాను శివుని అనుచరుల సంసర్గ దోషము శాంతింప చేయుటకు శ్రీహరికి మూడు పాత్రలందు పురోడాశము సిద్ధముచేసి బ్రాహ్మణులు హోమము చేసినారు.

యజమానియైన దక్షుడు హవిస్సు పట్టుకొని విశుద్ధచిత్తమున శ్రీహరిని ధ్యానించగా గరుడారూఢుడైన పురుషోత్తముడు ప్రత్యక్షమైనారు. దక్షప్రజాపతి ఒక ఉత్తమ పాత్రలో పూజాద్రవ్యము పట్టుకొని నందుడు, సునందుడు మున్నగు అనుచరులు చుట్టియున్న శ్రీహరిని స్తుతించినారు. అచటి సదస్యులెల్లరు కమలలోచనుని స్తుతించినారు.

అందరి యజ్ఞభాగములనుభవించు విష్ణుభగవానుడు తనకొరకు ప్రత్యేకముగా ఇచ్చిన యజ్ఞభాగము తీసుకొని దక్షునితో నిట్లనిరి :-

"బ్రహ్మ, విష్ణు, మహేశ్వరులము ఏకభావ సంపన్నులము.
మమ్ములను భేదభావమున చూడనివారు శాంతిపొందుదురు".

భగవానుని మాటవిని దక్షుడు త్రికపాల యజ్ఞమున శ్రీవిష్ణువును అంగభూతము, ప్రధానము అయిన రెండు యజ్ఞముల దేవతలను అర్చించి మిగిలిన యజ్ఞాంశమున శివుని పూజించినాడు. యజ్ఞము సమాప్తిచేయు తదనంతర కర్మచే సోమపాయు లను తక్కిన దేవతలను అర్చించినాడు. యజ్ఞము పూర్తిచేసి ఋత్విజుల సహిత ముగా అవభృథస్నానము చేసినాడు.

దక్షుని పుత్రిక సతీదేవి పూర్వశరీరము వదలి హిమవంతుని భార్య మేనక గర్భమున పార్వతిగా జనించి తిరిగి శివునే భర్తగా గ్రహించినది.

శివుని ఈ పవిత్ర చరిత్ర నిత్యము భక్తిభావమున విన్న యశస్సు, ఆయువు వృద్ధిచెంది పాపములు హరించును.

ధ్రువ చరిత్రము.

స్వాయంభువ మనువు బ్రహ్మ పుత్రుడు. అతని భార్య శతరూప. వారికి ఇరు వురు పుత్రులు కలిగినారు. ఒకడు ప్రియవ్రతుడు. రెండవవాడు ఉత్తానపాదుడు.

ఉత్తానపాదునకు ఇరువురు భార్యలు - సురుచి, సునీతి. సురుచి కుమారుడు ఉత్తముడు. సునీతి కుమారుడు ధ్రువుడు ఉత్తానపాదునకు సురుచి మీద ప్రేమమెండు.

ఒకనాడు ఉత్తానపాదుడు ఉత్తముని తొడపై కూర్చుండబెట్టుకొని ముద్దులాడు చున్నాడు. ఆసమయమున అయిదు సంవత్సరముల ప్రాయము గల ధ్రువుడు అచటికి వచ్చినాడు. తండ్రి తొడమీద కూర్చుండబోయినాడు. కాని ఉత్తాన పాదుడు సురుచికి భయపడి ధ్రువుని ఒడిలోనికి తీసుకొనలేదు. సవతి కొడుకు ధ్రువుడు మహారాజు తొడపై కూర్చొనుటకు వచ్చుటను చూచి సురుచి ఈర్ష్యపడినది. రాజు తననే ప్రేమించుచున్నాడని ఆమెకు గర్వము మెండైనది. రాజు ఎదుటనే బాలుడైన ధ్రువుని ధిక్కరించినది.

"ధ్రువా ! నీవు రాజపుత్రుడవే కాని నా కడుపున పుట్టనందున నీకు రాజు తొడపై కూర్చొనుటకు గాని, రాజసింహాసనము అధిష్టించుటకుగాని అధికారము లేదు. నీవు రాజుతొడపై కూర్చొనవలెననుకున్నను, రాజసింహాసనము కోరినను అడవులకు వెళ్లి తపస్సుచేసి భగవంతుని అనుగ్రహము సంపాదించుము. అట్లు అనుగ్రహము సంపాదించి నాకు పుత్రుడవై పుట్టినచో నీ కా యదృష్టము దక్కును" అని శాసించినది. ఈర్ష్యగా మాట్లాడినది.

సవతి తల్లి మాటలు ధ్రువునకు ములుకులవలె గ్రుచ్చుకున్నవి. అతడు కర్రతో కొట్టిన పామువలె పెద్దపెద్ద నిట్టూర్పులు విడిచి ఏడుపు మొదలు పెట్టినాడు.

పసివాని ఏడుపు చూచియైన కరుగలేరు మహారాజు. కొంతసేపు అచటవుండి ఏడ్చుచునే తల్లియైన సునీతి వద్దకు వెళ్ళినాడు ధ్రువుడు.

సవతి చేసిన అవమానమును గూర్చి పరిచారికలవలన సునీతి తెలుసు కున్నందున పెదవు అదరుచుండ వెక్కిరిబిక్కిరియై ఎక్కెక్కి ఏడ్చుచున్న ధ్రువుని ఒడిలో కూర్చుండ పెట్టుకుని బాధపడినది. ఆమె హృదయము దావాగ్నిలోపడిన అడవి తీగవలె మలమల మాడినది. దుఃఖమును భరించలేక కన్నీరు కార్చుచు వలవల ఏడ్చినది. ఈ జన్మమున తన దుఃఖమునకు అంతులేదని క్రుంగిపోయినది. కొంత సేపటికి తనను తాను ఓదార్చుకొని ధ్రువుని ఓదార్చుచు "మామంగళం తాత పరేష్వమంస్థా భుంక్తే జనోయత్పరదుఃఖదస్తత్" (ఇతరులు చేసిన అపరాధమును పట్టించుకొనకు. నాయనా! ఎదుటి వారిని దుఃఖపెట్టినవారు తుదకు వారే దుఃఖము అనుభవింతురు).

సురుచి చెప్పినది నిజమే నాయనా! మహారాజుచే భార్యగా చూడబడనట్టి అభాగ్యురాలను నేను. నావంటి పాపాత్మురాలి కడుపున పుట్టిన నీవు రాజ సింహాసనము కోరుట దురాశయే యగును. నాయనా నీ సవతి తల్లి చెప్పినది నిజము. నీకు రాజసింహాసనము కావలయునన్న భగవంతుడైన శ్రీహరి పాద పద్మములను ఆరాధించుము. ఏకాగ్ర చిత్తమున భగవంతుని ఆరాధించి నీ ముత్తాత, తాత ఉత్తమపదమున ఉన్నారు. కాన నీవు ఆ హరిని సేవించుము. శ్రీహరి తప్ప నీ దుఃఖమును అన్యులు తొలగించలేరు."

తల్లిదుఃఖమును ఆమె ఉపదేశమును ధ్రువుడు అర్థముచేసికొన్నాడు. పట్టణము వదిలి అడవిదారి పట్టినాడు. త్రోవలో అతనికి నారదమహర్షి కనిపించినాడు. నారదుడు ధ్రువుని మనోగతమైన కోరికను అర్థము చేసికొన్నాడు. పాపములు హరించునట్టి అతని చేతిని ధ్రువుని తలపై వుంచి అన్నాడు:-

నాయనా ధ్రువా! ముక్కుపచ్చలారని పసివాడవు నీవు. నీకు మానావమానము లేమి నాయనా?

"పుంసాం మోహమృతే భిన్నా యల్లోకే నిజకర్మభిః" దుఃఖ మనునది ఎల్లవారికిని నిజకర్మవలన కలుగుచున్నది. ఏది వచ్చినను దైవేచ్ఛ అనుకొని తృప్తిపడుట

బుద్ధిమంతుల లక్షణము. మీ అమ్మ మాటలు విని యోగము నవలంబించి భగవదను గ్రహము సంపాదించవలెనని కోరుచున్నావు. కాని భగవదనుగ్రహము పొందుట సులభము కాదు. మునులు ఎన్నో జన్మములు నిస్సంగులై కఠోరమైన యోగ సాధనచేసియు భగవంతుని కనుగొనలేకున్నారు. కావున ఈ ప్రయాస మాను కొని మోక్షముపొందుటకు తగిన సమయము వచ్చినపుడు ఈ ప్రయత్నము చేయవచ్చును.

> గుణాధికాన్ముదం లిప్సేదనుక్రోశం గుణాధమాత్
> మైత్రీం సమానాదన్విచ్ఛేన్న తాపైరభిభూయతే

తనకన్న ఎక్కువ గుణములు గలవాడు దొరికిన సంతసించవలెను. తక్కువ గుణములు కలవాడు దొరికిన దయ చూపవలెను. సమానమైన గుణములు కల వానితో స్నేహము చేయవలెను. అట్లు చేసినవాడు ఎన్నడును దుఃఖము అను భవించడు".

నారదుని మాటలు విని ధ్రువుడు-

"మహర్షీ! నీవు చెప్పిన ఉపాయము శాంతివంతమైనదే కాని నా వంటి వానికి అర్థమగునది కాదు. నాది ఘోరమైన క్షత్రియ స్వభావము. నాకు వినయము తెలియదు. నా సవతితల్లి మాటలు ములుకులవలె గ్రుచ్చుకొని నా హృదయము చిల్లులు పడినది. మునీంద్రా! నీవు బ్రహ్మదేవుని కుమారుడవు. సూర్యునివలె ముల్లోకములు తిరుగువాడవు. నా పూర్వపురుషులు గాని మరెవ్వరు గాని ఇంత వరకు పొందని పదవి పొందవలెనని నా కోరిక. అందుకు అవసరమైన మార్గమును ఉపదేశింపుము" అని ప్రార్థించినాడు.

ధ్రువుని మాటలు విని నారదుడు సంతసించినాడు.

"యమునా నదీతీరమున మధువనమను పవిత్ర వనము కలదు. అచటికి వెళ్లి మూడు పూటలు యమునానదిలో స్నానముచేసి నిత్యకర్మములు ముగించుకొని యథావిధిగ ఆసనము వేసుకొని స్థిరముగా కూర్చుండుము. రేచకము, పూరకము, ప్రాణాయామము చేసి క్రమక్రమముగా ప్రాణము, మనసు, ఇంద్రియములను అదుపులో పెట్టుకొని భగవంతుని ధ్యానించుము. అతని దివ్యమంగళ విగ్రహమును ధ్యానించిన చిత్తము స్థిరపడి ఏకాగ్రత ఏర్పడును. అట్లు ఎల్లపుడు ధ్యానించిన పరమానంద భరితమగును. అచటినుండి కదలదు.

> జపశ్చపరమం గుహ్యః శ్రూయతాం మే నృపాత్మజ
> యం సప్తరాత్రం ప్రపఠన్పుమాన్పశ్యతి ఖేచరాన్

"ఓం నమో భగవతే వాసుదేవాయ" మంత్రేణానేన
దేవస్య కుర్యాద్ద్రవ్యమయీం బుధః

రాజకుమారా! పరమ రహస్యమైన ఈ మంత్రమును విని జపింపుము. ఈ మంత్రమును ఏడు రాత్రులు జపించిన ఖేచరులు కనిపించగలరు. "ఓం నమో భగవతే వాసుదేవాయ" అను మంత్రముచే వస్తువుల సమకూర్చుకొని బుధులైనవారు పూజింతురు.

మనోవాక్కాయ కర్మముల భగవంతుని భక్తిపూర్వకముగ పూజించినచో అతడు ప్రత్యక్షమై ధర్మ, అర్థ, కామ, మోక్షములందు శ్రేష్ఠమైన దానిని అనుగ్రహించును".

ధ్రువుడు నారదమునివద్ద ఉపదేశము పొంది ప్రదక్షిణపూర్వకముగ అతనికి నమస్కరించి మధువనమునకు వెళ్ళిపోయినాడు. స్నానాదికములు ముగించుకొని, రాత్రి ఉపవసించి, పురుషోత్తముని ధ్యానించుటకు ప్రారంభించినాడు.

మూడు రాత్రులకొకమారు వెలగపండ్లు, రేగుపండ్లు మాత్రము తినుచు ఒక నెల గడిపినాడు.

ఆరు రోజుల కొకసారి గడ్డి, ఆకులు తినుచు భగవంతుని సేవించినాడు రెండవ నెల.

మూడవ నెలలో తొమ్మిది రోజులకు ఒకసారి గ్రుక్కెడు నీరు మాత్రము పుచ్చుకొని స్వామిని పూజించినాడు.

నాలుగవ నెల పండ్రెండు దినములకు ఒకసారి గాలి మాత్రము ఆహారముగా పుచ్చుకొని శ్రీహరిని ధ్యానించినాడు. ధ్యానమార్గము అవలంబించి ప్రాణాయామ పూర్వకముగా భగవంతుని ప్రార్థించినాడు.

అయిదవ నెల శ్వాసను బంధించి, స్తంభమువలె ఒంటి కాలుపై నిలుచుండి నిశ్చల చిత్తమున శ్రీహరి స్వరూపమును మనమున ధరించినాడు.

అయిదు సంవత్సరముల పసిబిడ్డడు ఇంద్రియములను జయించి ఒంటికాలిపై నిలువబడి ఏకాగ్రచిత్తమున భగవంతుని ధ్యానించగా ముల్లోకములు కంపించినవి.

భూమి వంగిపోయినది.

ప్రాణులందరి ఉచ్ఛ్వాస నిశ్వాసములు నిలిచిపోయినవి.

ధ్రువునికి దర్శన మిచ్చుటకు గరుడవాహనా రూఢుడై శ్రీహరి మధువనము నకు బయలుదేరినాడు. ధ్రువుని హృదయము నుండి హఠాత్తుగా దివ్యమూర్తి అంతర్ధానమైనది.

కలవరపాటుతో కన్ను విప్పినాడు ధ్రువుడు.

కట్టెదుట కనిపించినాడు ప్రభువు.

ధ్రువుని ఆనందమునకు అంతులేకపోయినది. ఉబ్బి తబ్బిబ్బయినాడు. సాగిలబడి మ్రొక్కినాడు. భగవానుని దివ్యమంగళ రూపమును త్రాగుచున్నట్లును, ముద్దు పెట్టుకొనుచున్నట్లును, కౌగిలించుకొనుచున్నట్లును భావించినాడు. లేచి నిలుచుండి అంజలి ఘటించి భగవంతునిముందు నిలిచినాడు. అతని ఆనందము గట్లు త్రెంచుకొని ప్రవహించినది. అతని హృదయము స్వామిని స్తుతించవలెనని ఉరకలు పెట్టినది. పెదవులు కదలసాగినవి

కాని అయిదేండ్ల పసివాడు.
ఎట్లు స్తుతించవలెనో తెలియలేదు.
భగవానుడు గ్రహించి కరుణించినాడు.
పాంచజన్యమును చెక్కిళ్ళకు తాకించినాడు.
ధ్రువునిలో దైవవాణి ఉదయించినది.
స్తోత్రము ప్రవహించినది :—

యోఽంతః ప్రవిశ్య మమ వాచమిమాం ప్రసుప్తాం
సంజీవయత్యఖిలశక్తిధరస్స్వధామ్నా
అన్యాంశ్చ హస్తచరణశ్రవణత్వగాదీ
న్ప్రాణాన్నమో భగవతే పురుషాయ తుభ్యమ్
ఏకస్త్వమేవ భగవన్నిదమాత్మశక్త్యా
మాయాఖ్య యోరు గుణయా మహదాద్యశేషం
సృష్ట్వానువిశ్య పురుషస్తదసద్గుణేషు
నానేవ దారుషు విభావసువద్విభాసి
త్వద్దత్తయా వయునయేదమచేష్ట విశ్వం
గుప్తః ప్రబుద్ధ ఇవనాథ భవత్ప్రపన్నః
తస్యాపవర్గ్యశరణం తవపాదమూలం
విస్మర్యతే కృతవిదా కథమార్తబంధో



బాలభక్తుడైన ధ్రువునకు శ్రీహరి ప్రత్యక్షమగుట.

పుట. 131

నూనం విమృష్టమతయస్తవ మాయయాతే
యేత్వాం భవాప్యయ విమోక్షణ మన్యహేతోః
అర్చంతి కల్పతరుం కుణపోపభోగ్యమిచ్ఛంతి
యత్స్పర్శజం నరకేఽపిన్నృణామ్
యా నిర్వృతి స్తనుభృతాం తవ పాదపద్మ
ధ్యానాద్భవజ్జన కథాశ్రవణేన వాస్యాత్
సాబ్రహ్మణి స్వమహిమన్యపి నాథ మాభూ
త్కింత్వంతకాసి లులితాత్పతతాం విమానాత్
భక్తిం ముహుః ప్రవహతాం త్వయి మే ప్రసంగో
భూయాదనంత మహతా మమలాశయానామ్
యేనాంజసోల్బణ మురువ్యసనం భవాబ్ధిం
నేష్యేభవద్గుణ కథామృత పానమత్తః
తేనస్మరంత్యతితరాం ప్రియమీశ మర్త్యం
యే చాన్వదస్సుత సుహృద్గృహ విత్తదారాః
యేత్వబ్జనాభ భవదీయ పదారవింద
సౌగంధ్య లుబ్ధహృదయేషు కృత ప్రసంగాః
తిర్యఙ్నగద్విజ సరీసృప దైవ దైత్య
మర్త్యాదిభిః పరిచితం సదసద్విశేషమ్
రూపం స్థవిష్ఠమజ తే మహదాద్యనేకం
నాతఃపరమ్ పరమవేద్మి న యత్రవాదః
కల్పాంత ఏతదఖిలం జఠరేణ గృహ్ణన్
శేతే పుమాన్ స్వదృగనంత సఖస్తదంకే
యన్నాభిసింధురుహ కాంచన లోకపద్మ
గర్భే ద్యుమాన్భగవతే ప్రణతోఽస్మితస్మై
త్వం నిత్యముక్తపరిశుద్ధ విబుద్ధ ఆత్మా
కూటస్థ ఆదిపురుషో భగవాంస్త్ర్యధీశః
యద్బుద్ధ్యవస్థితి మఖండితయా స్వదృష్ట్యా
ద్రష్టా స్థితావధిమఖావతిరిక్త ఆస్సే
యస్మిన్విరుద్ధగతయోఽ వ్యనిశం పతంతి
విద్యాదయో వివిధశక్తయ ఆనుపూర్వ్యాత్

తద్బ్రహ్మ విశ్వభవ మేకమనంత మాద్య
మానంద మాత్ర మవికారమహం ప్రపద్యే
సత్యాశిషోహి భగవంస్తవ పాదపద్మ
మాశీస్తథానుభజతః పురుషార్థమూర్తేః
అప్యేవమార్య భగవాన్పరిపాతి దీనా
న్వాశ్రేవ వత్సక మనుగ్రహ కాతరోఽస్మాన్.

ప్రభూ ! అఖిల శక్తిధరుడవైన నీవు నా హృదయమున ప్రవేశించి నిదురించుచున్న నా వాక్కును సంజీవనము చేసినావు. చేతులు కాళ్ళు మున్నగు ఇంద్రియములకు ప్రాణముపోసి చైతన్యము కలిగించినట్టి నీకు నమస్కారము.

భగవానుడా ! ఒకే అగ్ని వివిధములైన కట్టెలతో వివిధ రూపములుగా కనిపించునట్లు నీవు ఒక్కడవే గుణమయమగు నీ విచిత్ర మాయాశక్తిచే మహదాది విశ్వసృష్టిని జేసి, అంతర్యామివై అందు ప్రవేశించి వివిధ రూపములతో వ్యక్తమగుదువు.

ఆర్తబంధూ ! బ్రహ్మాది దేవతలు సహితము నీ శరణుజొచ్చి నీవు అనుగ్రహించిన జ్ఞానమున నిద్రనుండి మేల్కాంచిన వారివలె ఈ ప్రపంచమును చూచినారు. నీవు చేసిన ఉపకారము ఎరిగినవాడు నీ పాదపద్మములను మరువలేడు కదా !

నీ పాదపద్మములు సంసారమును ధ్వంసము చేయునట్టివి. భక్తులపాలిటి కల్పవృక్షములు. నరకవాసుల కనుగమ్యమై శవమువంటి దేహమున అనుభవింపదగిన ఇతర సుఖములను ఆశించి నిను సేవించువారు నిజముగా మోసపోయిన వారగుదురు.

నీ పాదపద్మముల పరిచర్య వలనను, నీ కథాశ్రవణము వలనను కలుగు పరమసుఖము మోక్షము వలనను కలుగజాలదు. అట్లయిన కాలమను కత్తితో నరుకబడి కూలునట్టి స్వర్గము మున్నగువాని సుఖముల మాట ఎన్నవలయునా ?

అనంతమూర్తీ ! నీ ఎడలగల భక్తి ప్రవాహమున ప్రవహించునట్టి మహాపురుషుల సహవాసము నాకు ప్రసాదించుము. దానివలన నీ మంగళగుణములకు సంబంధించిన కథలను అమృతమును గ్రోలి, ఆపదలచే నిండిన సంసార సాగరమును [illegible] లేక దాటగలను.

పద్మనాభా! నీపాదపద్మములను అరవిందముల పరిమళమును రుచిచూచినవారి సాంగత్యభాగ్యము లభించిన మహాత్ములు, నశించునట్టి ఈ దేహమును దానిని అనుసరించి యుండునట్టి భార్య, పుత్రులు, స్నేహితులు, భూములు, ధనము మున్నగు వానిని లెక్కచేయరు.

అజుడవైనవాడా! జంతువులు, మనుష్యులు, పశులు, సరీసృపములు. దేవతలు, దైత్యులు మున్నగు నానా ప్రాణిజాలముతో కూడినట్టి కార్య, కారణాత్మకమై ఒప్పునట్టి నీ స్థూల శరీరము నాకు తెలియును. కాని దానికి పరమగు అనిర్వచనీయమైన నీ పరమేశ్వర స్వరూపమును ఎరుగను.

కల్పాంతమున ఈ జగములనెల్ల ఉదరమున దాల్చినావు. అంతములేని జలమున శేషుడను పరుపుపై పవ్వళించినావు. నీ నాభిసముద్రమున పుట్టిన బంగారు పద్మమునుండి బ్రహ్మను సృష్టించినావు. అట్టి నీకు నమస్కారము.

ప్రభూ! నీవు నిత్యముక్తుడవు. శుద్ధ బుద్ధ స్వరూపుడవైన పరమాత్మవు. కూటస్థుడవు. ఆదిపురుషుడవు. మూడు గుణములకు అధీశ్వరుడవు, భగవంతుడవు. జీవునికంటె భిన్నుడవు, యజ్ఞాధిష్ఠితుడవు. విద్య, అవిద్య మున్నగు విరుద్ధ శక్తులెన్నియో నీనుండి వ్యక్తమగుచుండును. నీవు జగత్కారణుడవు. అఖండుడవు. అనాదిపురుషుడవు. ఆనందమయుడవు, నిర్వికార పరబ్రహ్మస్వరూపుడవు. నిన్ను శరణు వేడుచున్నాను.

నీ పాదపద్మములే ఆశ్రయించదగినవి. అట్టి నీ పాదపద్మములను కోర్కెల కొరకు ఆశ్రయించి దీనత పొందునట్టి మమ్ము, ఆవు లేగదూడను కాపాడునట్లు కాపాడుదువు.

సత్సంకల్పుడు, ధీమంతుడు అయిన ధ్రువుడు ఇట్లు స్తుతించగా భక్తవత్సలుడు సంతసించినాడు.

బాలుడా! నీకోరిక నాకు తెలిసినది. నీ కోరిక ప్రకారము పరమ పురుషార్థము దుర్లభమైనది. అయినప్పటికి నీకొరకు ఏర్పాటు చేయుదును. ఇంతవరకు ఎవరికిని లభించని ధ్రువలోకము నీకు ఇవ్వగలను. ఆలోకము చుట్టు గ్రహములు, నక్షత్రములు ఎల్లప్పుడు తిరుగుచుండును. కల్పాంతమునందు ఇతరలోకములు నశించినను ధ్రువలోకము మాత్రము స్థిరముగా ఉండును. సప్తర్షుల సహితముగా ధర్ముడు, కశ్యపుడు, ఇంద్రుడు ఋషులు దానికి ప్రదక్షిణము చేతురు. నీ తండ్రి

నీకు రాజ్యము అప్పగించి అడవులకు వెళ్ళిపోవును. నీవు ముప్పది ఆరువేల సంవత్సరములు రాజ్యము పాలించగలవు. నీ తమ్ముడు ఉత్తముడు వేటలో చని పోవును. సురుచి కొడుకును వెదకుచు పిచ్చిదై దావాగ్నిలోపడి మరణించును.

నాకు యజ్ఞమనిన ప్రీతి. కావున యజ్ఞములు చేసి నన్ను ఆరాధించుము. అంత్య కాలమున నన్ను ధ్యానించుము. సప్తర్షి మండలముపైన ఉన్నట్టి నా దివ్య స్థానమును చేరుకొనగలవు'' అనిచెప్పి భగవంతుడు ధ్రువుని పూజలు అందుకొని గరుత్మంతునిపై వైకుంఠమునకు వెళ్ళిపోయినాడు.

మూడు లోకములందు ఎవరికిని లభించని పదవి ధ్రువునకు లభించినది. అయినను అతనికి సంతృప్తి కలుగలేదు. అసంతృప్తితోనే తండ్రి నగరమునకు బయలు దేరినాడు.

ధ్రువుడు నడచుచున్నాడు నగరముచేరుటకు. అతనికి తన అసంతృప్తి గుర్తుకు వచ్చినది. భగవంతుని దివ్యమంగళ రూపము గుర్తునకు వచ్చినది. ఆలోచించి నాడు. మథనపడినాడు. తన పొరపాటును గ్రహించినాడు.

మహామహుల కందని భగవానుని పాదకమలములు నాకు లభించగా పదవికొరకు పాకులాడినాను. ఛీ ఎంత మూర్ఖుడను. లోకమంతయు నేనే అన్నట్లు చూడ వలసిన నేను నా స్వంత తమ్మునే పగవానిగా భావించినానే! భాగ్యము ఈయగల మహారాజును బియ్యపు గింజలు కోరినట్లున్నది నాదురవస్థ'' అని విచారించినాడు.

"ధ్రువుడు వచ్చుచున్నాడు'' అనువార్త నగరమున అగ్నివలె పాకినది. ఉత్తాన పాదునకు తెలిసినది. ఆరిపోవు దివ్వెకు నూనెవలె పనిచేసిన దా వార్త ఉత్తాన పాదునకు. ధ్రువుడు వెళ్ళిన నాటినుండి దుఃఖసాగరమున మునిగి ఉన్నాడు. నారదుని వలన ధ్రువుని వృత్తాంతము తెలుసుకున్నాడు. ధ్రువునిపైన ప్రేమ మరింత పెరిగినది. నారదుని వాక్కు ప్రకారము ధ్రువుడు తిరిగి రాగలడను ఆశతో జీవించుచున్న మహారాజునకు ఆ వార్త అమృతమువలె పనిచేసినది.

అతడు వెంటనే లేచినాడు. మంచి గుఱ్ఱములు పూన్చిన బంగారు రథముపై బైల్దేరినాడు. బ్రాహ్మణులు, మంత్రులు, బంధువులు, కులవృద్ధులు అతనివెంట బయలుదేరినారు. సునీతి సురుచి, ఉత్తముడు కూడా బయలుదేరినారు. వేద మంత్రముల ధ్వనులు వాద్యముల ఆకసము నంటుచుండగా నగరము మొత్తము తరలినది.

వారు ఉపవనము వద్ద ధ్రువుని చూచినారు. మొట్టమొదట చూచినవాడు ఉత్తాన పాదుడు. ధ్రువుడు కనిపించగనే 'నాయనా ధ్రువా' అని కేకవేసి రథమునుండి దూకినాడు. ఆనందాశ్రువులు చెక్కిళ్ళనుండి దూకుచుండగా రెండు చేతులు చాచుకొని వరుగెత్తినాడు. తండ్రిని చూచిన ధ్రువుడు గోవును చూచిన వత్సమువలె తండ్రిపైపునకు ఉరికినాడు.

ఇద్దరు కలిసినారు.

తండ్రి కొడుకును కౌగిలించుకున్నాడు.

ముద్దులు పెట్టుకున్నాడు.

తల నిమిరినాడు.

ఆనందాశ్రువులతో తల తడిపినాడు.

ధ్రువుడు కన్నీరు తుడుచుకున్నాడు. తండ్రికి పాదాభివందనము చేసినాడు. సునీతికి నమస్కరించినాడు. ఆమె గొంతెత్తి ఏడ్చి "వచ్చావా నాయనా!" అని కౌగిలించుకున్నది.

ధ్రువుడు సురుచికి నమస్కరించినాడు. ఆమె గ్రుచ్చి కౌగిలించుకొని 'చిరంజీవివి కమ్ము నాయనా' అని కన్నీళ్ళతో ఆశీర్వదించినది.

ధ్రువుడు ఉత్తముని కౌగిలించుకున్నాడు.

అచటకూడిన జనులెల్లరు కన్నీరుతుడుచుకొని మౌనముగా ధ్రువుని స్తుతించినారు. ధ్రువుడు తండ్రి రాజభవనమున ప్రవేశించినారు.

కాలము దొర్లిపోయినది. ధ్రువుడు యుక్త వయస్కుడు అయినాడు. ఉత్తాన పాదుడు వృద్ధుడయినాడు. ధ్రువుని భూమండలమునకు రాజుగా అభిషేకించి నాడు. విషయవాసనల మీద విరక్తి చెంది అడవులకు వెళ్ళిపోయినాడు.

ధ్రువుడు శిశుమార ప్రజాపతి కూతురు "భ్రమి"ని పెండ్లాడినాడు. ఆమెవలన కల్పుడు, వత్సరుడు అను ఇద్దరు పుత్రులను బడసినాడు. ధ్రువుడు వాయుదేవుని కూతురు "ఇళ"ను సహితము పెండ్లాడి ఆమెవలన "ఉత్కలుడు" అను పుత్రుని ఒక కూతురును కన్నాడు.

సురుచి కొడుకు ఒకనాడు వేటకు హిమాలయమునకు వెళ్ళినాడు. అచట ఒక యక్షునిచేత మరణించినాడు. కొడుకును వెదకుటకు వెళ్ళిన సురుచికూడా చనిపోయినది.

తమ్ముని చావునిని ధ్రువుడు ఎంతో దుఃఖించినాడు. తన తమ్ముడు యక్షునిచేత చచ్చినాడని విని అతడు క్రోధమున వడకినాడు. వెంటనే ఆయుధముపూని విజయవంత మగు రథము నెక్కినాడు. ఉత్తరము వైపు బయలుదేరి అలకాపురమును ముట్టడించినాడు. అలకాపురము బయటనిలిచి ధ్రువుడు శంఖము పూరించినాడు. ఆ శంఖధ్వనికి దిక్కులు ప్రతిధ్వనించినవి. యక్షులు ఆ శంఖ ధ్వని విని సహించలేకపోయినారు. వివిధ ఆయుధములు ధరించి ధ్రువునిమీద పడినారు.

ధ్రువుడు గొప్ప విలుకాడు. అతడు వచ్చిన వారందరి ముఖముల మూడు మూడు బాణములు నాటినాడు. అతని చాకచక్యమునకు నేర్పునకు యక్షులు అచ్చెరువొందినారు. విజృంభించినారు. వారు ధ్రువునిపై ఒక్కొక్కరు ఆరుబాణముల చొప్పున ప్రయోగించినారు. ముప్పది వేల మంది యక్షుల ఆయుధముల వర్షమున మరుగు పడినాడు ధ్రువుడు. యక్షసేనా సముద్రమున ధ్రువుడు అస్తమించినట్లనిపించినది.

కొంతసేపటికి మధ్యాహ్న సూర్యునివలె బయట పడినది ధ్రువుని రథము. పెనుగాలి మబ్బులను చెదరగొట్టినట్లు ధ్రువుడు యక్షుల సేనను చిందరవందర చేసినాడు. ఇంద్రుడు పర్వతముల కూల్చినట్లు కుండలములతో ధగధగ మెరయునట్టి యక్షుల తలలు కొట్టినాడు. అవి రణరంగమున కుప్పలు కుప్పలుగా కనిపించినవి.

యక్షులలో హాహాకారములు బయలుదేరినవి. చావగా మిగిలినవారు పారిపోయినారు. పారిపోవుచున్న యక్షులను చూచినాడు ధ్రువుడు. తనను ఎదిరించగలవాడు ఒక్కడు సహితము కనిపించలేదు. వింటికి పని లేకుండుట చూచి అలకాపురిని చూడవలెననుకున్నాడు. కాని యక్షులు ఏమి మాయ చేయుదురో అని అక్కడనే ఉండి నిరీక్షించసాగినాడు.

అనుమానము నిజమైనది. ఎదిరించలేకపోయిన యక్షులు మాయను ప్రయోగించినారు. పెద్ద ఉప్పెన వచ్చినట్లు భయంకరమగు శబ్దము వినిపించినది. నలువైపుల వడిగా దుమ్ములేచి ఆకసమున క్రమ్మినది. ఉరుములు ఉరిమి, మెరుపులు మెరిసినవి. చీము, రక్తము, మలమూత్రములు మేదస్సు మున్నగునవి, ధ్రువుని ఎదుట వర్షముగా కురిసినవి.

ఆకాశమున పర్వతము ప్రత్యక్షమైనది. అది రాళ్ళు రప్పలు కురిపించినది. గదలు, పరిఘలు వర్షించినవి. పాములు ఆకాశమునుండి కూలినవి. అవి కస్సు బుస్సుమని బుసలు కొట్టినవి. సింహములు, పెద్దపులులు, ఏనుగులు, మందలు మందలుగా ధ్రువునిపైకి ఉరికినవి.

మహాత్ముడైన ధ్రువుడు యక్షుల మాయకు గురియగుట చూచినారు ఋషులు. శ్రీమన్నారాయణుని స్మరించవలసినదని చెప్పినారు.

వెంటనే ధ్రువుడు నారాయణాస్త్రము ప్రయోగించినాడు. యక్ష మాయ పటాపంచలైనది, మాయమైనది. నారాయణాస్త్రమునుండి అనేక లక్షల బాణములు పక్షులవలె ఎగిరి యక్షసేనలోనికి దూసుకొనిపోయినవి. యక్షులు వాటిని సహించలేకపోయినారు. ఉద్రిక్తులైనారు, ధ్రువునిమీద విరుచుకొనిపడినారు.

ధ్రువుడు సహితము మండిపడినాడు. బాణవర్షము కురిపించి యక్షుల చేతులు, కాళ్ళు, కడుపులు, ముక్కులు, తలలు నరుకసాగినాడు. యక్షులు చెఱుకు గడలవలె తెగిపడుచున్నారు.

ఈ సంహారమును ధ్రువుని తాత మనువు చూచినాడు. యక్షులపై అతనికి జాలి కలిగినది. విచిత్రమైన రథమునెక్కి ధ్రువుని వద్దకు వచ్చినాడు.

"నాయనా"! ఇంత క్రోధము పనికిరాదు. క్రోధమునకు లొంగి ఎట్టి అపరాధము చేయని యక్షులను ఊచకోత కోయుచున్నావు. నీ తమ్ముని ఎవరో ఒక యక్షుడు చంపినాడని నీవు యక్షులందరను హతమార్చుచున్నావు.

> పెద్దల విషయమున సహనశీలత. తక్కువవారిమీద దయ. సమానులమీద స్నేహము. ప్రాణులందరి విషయమున సమభావము కలవానికి భగవంతుడు ప్రసన్నుడగును. కర్మబంధములకు కట్టుబడిన ప్రాణుల ఆయువు పెంచుటయు త్రుంచుటయు భగవంతుడే చేయును. ఈ పరమాత్మనే మీమాంసకులు కర్మమనియు, చార్వాకులు స్వభావమనియు, వైశేషికులు కాలమనియు, జ్యోతిష్కులు దైవమనియు, కామశాస్త్ర పండితులు కామమనియు అందురు.

కుబేరుని అనుచరులైన ఈ యక్షులు నీ తమ్ముని చంపలేదు. చావు పుట్టుకలకు కారకుడు భగవానుడు. సృష్టి, స్థితి లయములు మూడును భగవంతుడే చేయుచున్నాడు. అతడు భూతాత్ముడు, భూతభావనుడు.

అయిదు సంవత్సరముల ప్రాయమున నీవు తపస్సుచేసి, భగవంతుని ఆరాధించి ఉత్తమోత్తమమైన లోకమును సంపాదించినావు. అట్టిభగవంతుని ఆశ్రయించుము. అతనిని ఆశ్రయించినచో శత్రువు మిత్రుడు అనుభేదముండదు. విశ్వమంతయు అసత్యమని అవగత మగును.

త్వంప్రత్యగాత్మని తదా భగవత్యనంత
ఆనందమాత్ర ఉపపన్న సమస్తశక్తౌ
భక్తిం విధాయ పరమాం శనకైరవిద్యా
గ్రంథింవిభేత్స్యసి మమాహమితి ప్రరూఢమ్
సంయచ్ఛరోషమ్ భద్రం తే ప్రతీపం శ్రేయసాంపరమ్
శ్రుతేన భూయసా రాజన్నగదేన యథామయమ్

నీలో విరోధభావము లేనపుడు భగవంతుడు, అనంతుడు, ఆనందస్వరూపుడు, సర్వశక్తిమంతుడు, సర్వాంతర్యామి నీలో నివసించినాడు. అతనిపై ప్రశాంత భక్తి నిలుపుకొనిన వెంటనే అవిద్య అను గ్రంథిని త్రెంచుకొనగలవు.

రాజా! ఔషధము వలన రోగము ఉపశమించునట్లు నా మాటలచే నీ క్రోధమును శాంతింపచేయుము. శుభములకు గొడ్డలిపెట్టు అయిన రోషమును విడువుము.

క్రోధము ఉన్నవానికి లోకము భయపడును. కావున తెలిసినవారు క్రోధమునకు లొంగరాదు.

శివుని సోదరుడైన కుబేరునిపట్ల అపచారము చేసినావు. నీ తమ్ముని యక్షులు చంపినారనుకొని కుబేరుని అనుచరులను నిష్కారణముగా చంపినావు. వందనాదికములచే అతనిని సంతోషపెట్టి మనువంశమును కాపాడుము" అని ఉపదేశించి ధ్రువుడు చేసిన సత్కారములు స్వీకరించి మునిజనసహితుడై తన నివాసమునకు వెళ్ళినాడు.

తదుపరి ధ్రువుని ముందు కుబేరుడు ప్రత్యక్షమైనాడు. ధ్రువుడు వినయముగా చేతులు జోడించి నిలిచియుండగా యక్షరాజు ఇట్లన్నాడు:—

"రాజకుమారా! మీ తాతగారి ఉపదేశమును విని విడువరానట్టి కోపమును విడిచినావు. నాకు చాల సంతోషముగా ఉన్నది. వాస్తవమునకు నీవు యక్షులను చంపుటగాని, యక్షులు నీ తమ్ముని చంపుటగాని చేయలేదు. శరీరమునే ఆత్మ

అని భావించుటవలన నీవు నేను అను భేదము కలిగిన మానవునకు బంధనము, దుఃఖము మొదలగు విపరీతావస్థలు కలుగుచున్నవి.

ధ్రువా! నీకు భగవంతుడు మేలు చేయగలడు. సంసార బంధనములను త్రెంచుకొనుటకు సర్వభూతములను సమదృష్టితో చూడుము. నీకు ఒక వరము ఇవ్వదలచినాను. కోరుకొనుము, సందేహించవలదు".

కుబేరుని మాటలు ధ్రువునిపై అమృతము కురిపించినవి. అతడు వరము అడిగినాడు.

"శ్రీహరి మీద చిత్తము చలించకుండవలెను. దుస్తరమగు అంధకారము నుండి అనాయాసముగా బయట పడవలెను".

కుబేరుడు ధ్రువుడు కోరిన వరము ఇచ్చి అంతర్ధానుడైనాడు.

ధ్రువుడు ముప్పది ఆరువేల సంవత్సరములు రాజ్యము చేసినాడు. అతడు ప్రజలను కన్నబిడ్డలవలె చూచినాడు. ప్రజలు అతనిని కన్న తండ్రివలె చూచినారు. అతడు ఐశ్వర్యములు అనుభవించి యజ్ఞయాగాది క్రతువులు చేసి పాపములను వదిలించుకున్నాడు. తుదకు తన పుత్రుడు ఉత్కలునకు రాజ్యాభిషేకము చేసి బదరికాశ్రమమునకు వెళ్ళినాడు. అచటి పవిత్ర జలమున స్నానమాడి స్థిరాసనమున ప్రాణాయామము ద్వారా వాయువును వశపరచుకున్నాడు. ఇంద్రియములను విషయ వాసనల నుండి మరలించి మనస్సున విరాట్ స్వరూపమును ప్రతిష్ఠించినాడు. తుదకు విరాట్స్వరూపమును సహితము పరిత్యజించినాడు. భక్తి ఉల్బణమున అతని నేత్రముల నుండి ఆనందాశ్రువులు ప్రవహించినవి. హృదయము ద్రవించినది. శరీరము పులకరించినది. దేహాభిమానము నశించి "నేను ధ్రువుడను" అను భావము మాయమైనది.

ఆకాశమున పున్నమ చంద్రునివలె ఒక విమానము కనిపించినది ధ్రువునకు. అది ధ్రువుని వద్ద దిగినది. అందు సుందర రూపులైన ఇద్దరు దేవదూతలున్నారు. వారిని చూచిన ధ్రువుడు వారు భగవంతుని కింకరులని గ్రహించినాడు. చేతులు జోడించి హరినామకీర్తనము ఆరంభించినాడు.

విమానమునుండి సునందుడు, నందుడు అను ఇరువురు విష్ణుదూతలు దిగినారు. "ఆయుష్మంతుడా! ఇది ఉత్తమోత్తమమైన విమానము. శ్రీహరి నీకొరకు

పంపినాడు. నీపూర్వులు గాని మరెవరు గాని చేరుకొనని పరమపదమునకు చేరు కొనుము. రమ్ము" అని ఆహ్వానించినారు.

పరమ భాగవతుడైన ధ్రువుడు భగవంతుని అనుచరులు చెప్పిన మాటలు విన్నాడు. స్నానము చేసి సంధ్యావందనాది నిత్యకర్మలు ముగించుకొని బదరికా శ్రమమునందలి మునులందరకు నమస్కరించి వారి ఆశీర్వాదములు అందు కున్నాడు. దేవ విమానమునకు పూజచేసి దానికి ప్రదక్షిణము చేసినాడు. నంద సునందులకు నమస్కరించి దివ్య విమానము ఎక్కుటకు సిద్ధపడినాడు.

ఇంతలో మూర్తిమంతమైన మృత్యువు తనముందు నిలుచుండుటను చూచినాడు
ధ్రువుడు. మృత్యుదేవత తలపై కాలుపెట్టి విమానము నెక్కినాడు.

ఆకాశమున దుందుభులు, మృదంగములు మ్రోగినవి.

గంధర్వులు గానము చేసినారు.

పూలవాన కురిసినది.

విమానము బయలుదేరినది. ధ్రువునకు తల్లి సునీతి గుర్తుకు వచ్చినది. ఆమెను వదిలి నేను ఒక్కడనే వైకుంఠమునకు వెళ్లుదునా !' అనుకున్నాడు.

దేవదూతలు ధ్రువుని మనసులోని మాట గ్రహించినారు. అగని విమానము ముందు మరొక విమానమునందు సునీతి వెళ్ళుచుండుటను ధ్రువునకు చూపినారు. విమానము వెళ్లుచుండగా ధ్రువునకు సూర్యుడు మున్నగు గ్రహములు కని పించినవి. విమానములలో వెళ్ళుచున్న దేవతలు కూడ కనిపించినారు. వారు అతనిమీద పూలవాన కురిపించినారు.

ధ్రువుడు మూడు లోకములు దాటిపోయినాడు. సప్తర్షి మండలము దాటి నాడు. ఆపైన భగవంతుని పరమపదము చేరుకున్నాడు.

నాశములేని పదవి చేరుకున్నాడు.

ధ్రువుడు సుప్రసిద్ధుడు. పవిత్ర కర్ముడు. బాల్యమునందే తల్లిని ఇంటిని వదిలి విష్ణుదేవుని శరణుజొచ్చినాడు.

ధన్యం యశస్యమాయుష్యం పుణ్యం స్వస్త్యయనం మహత్
స్వర్గ్యం ధ్రౌవ్యం సౌమనస్యం ప్రశస్యమఘమర్షణం.




ధ్రువుడు మృత్యువుతలపై కాలూని తనకొరకేతెంచిన విమానమునెక్కి
ధ్రువలోకమున కేగుట. పుట 142.

ధ్రువుని చరిత్ర ధనము వృద్ధిచేయును. యశస్సును, కీర్తిని వృద్ధిచేయును. పవిత్రమైనది. శుభకరమైనది. స్వర్గమును, ధ్రువపదమును, దేవత్వమును ప్రసాదించును.

వేనరాజు కథ.

ధ్రువుని కుమారుడు ఉత్కలుడు చక్రవర్తి అయినాడనే గాని అతడు రాజ్యమును అనుభవించలేదు. అతడు జన్మతః శాంతాత్ముడు. సర్వభూతములందును భగవంతుని చూచినాడు. లోకములన్నింటిని తన ఆత్మయందును, లోకములన్నింట తన ఆత్మను చూచినాడు. యోగాగ్నితో వాసనారూపమైన మాలిన్యమును కాల్చివేసినాడు. అందువలన అతని ఆత్మ నిర్మలమైన జ్ఞానమున ప్రకాశించు చుండెడిది. అతనికి భేదబుద్ధిలేదు. ఏ ప్రాణియు తనకన్న వేరుకాదని గ్రహించినాడు. అట్టివానిని లోకులు మందబుద్ధి అనుకొనువారు. మంత్రులు అతనిని మూర్ఖుడని భావించినారు. రాజ్యము నేలుటకు అవసరమైన శాసకప్రజ్ఞ ఉత్కలునికి లేనందున భ్రమి కుమారుడైన వత్సరునకు పట్టము కట్టినారు.


వ:
పుష్పార్ణుడు
తిగ్మకేతుడు
ఇషుడు
ఊర్జుడు
వసుడు
జయుడు
పుష్పార్ణుడు—ప్రభ
పుష్పార్ణుడు—దోష
ప్రాతస్సుడు
మధ్యందినుడు
సాయంకాలుడు
ప్రదోషుడు
నిశీథుడు
వ్యుష్టుడు
వ్యుష్టుడు—పుష్కరిణి
సర్వతేజుడు—ఆకూతి
చక్షుడు—నడ్వల
పురుడు
కుత్సుడు
త్రితుడు
ద్యుమ్నుడు
సత్యవంతుడు
ఋతుడు
వ్రతుడు
అగ్నిష్టోముడు
అతిరాత్రుడు
ప్రద్యుమ్నుడు
శిబి
ఉల్ముకుడు
ఉల్ముకుడు—పుష్కరిణి
అంగుడు
సుమనుడు
ఖ్యాతి
క్రతువు
అంగిరుడు
గయుడు

అంగుడు రాజైనాడు. సునీథను వివాహమాడినాడు.

ఒకసారి అంగుడు అశ్వమేథము ప్రారంభించినాడు. ఆ యజ్ఞమునకు పురోహితులు, బ్రాహ్మణులు వచ్చినారు కాని ఆహ్వానములు అందుకొనియు దేవతలు రాలేదు. రాజు సమకూర్చిన సామగ్రులు అందుకొనుటకు దేవతలు రాకుండుటను చూచి రాజు వికలహృదయుడైనాడు. ఆహ్వానించినను దేవతలు రాకపోవుటకు, సోమపాత్రను అందుకొనక పోవుటకు గల కారణమును సదస్యులను అడిగినాడు. వారు "రాజా! ఈ జన్మమున నీవు చేసిన అపరాధమేమియు లేదు. పూర్వ జన్మమున చేసిన పాపమున నీకు సంతానము కలుగలేదు. కాన ముందు పుత్రుడు కలుగుటకుగాను పుత్రకామేష్టి చేయుము. సంతానము కలిగిన తరువాత దేవతలు వచ్చి తమ తమ యజ్ఞభాగములు స్వీకరించగలరు" అని చెప్పినారు. ఋత్విక్కులు సదస్యుల మాట బలపరచినారు.

అంగరాజు పుత్రకామేష్టి చేసినాడు. విష్ణుదేవతాకమైన పురోడాశము సిద్ధముచేసి యథావిధిగా ఆహుతిచేసినారు. యజ్ఞకుండమునుండి ఒక సుందర పురుషుడు బంగారు పాత్రలో పాయసము పట్టుకొని ప్రత్యక్షమైనాడు. అంగరాజు పాయసము తీసికొని తన భార్య సునీథకు ఇచ్చినాడు. సంతానములేని సునీథ మహదానందమున పాయసము గ్రహించి, భుజించి గర్భవతి అయినది. పది మాసములు నిండగా ఆమెకు ఒక పుత్రుడు కలిగినాడు. అతడే వేనుడు. మన కథానాయకుడు.

వేనుడు అధర్ముని అంశమున పుట్టినాడు. తన తల్లికి తండ్రియైన మృత్యువును అనుసరించినాడు. అతడు దుష్టుడు. క్రూరుడు. ఆటలందు తనతోటి బాలురను పశువులను చంపినట్లు చంపువాడు. అతనిని చూచిన పులిని చూచినట్లు ప్రజలు పరుగెత్తువారు. అతడు అడవికి వెళ్ళి అందముగా కనిపించిన లేళ్ళను, జింకలను హతమార్చువాడు.

అంగుడు కుమారుని దుర్మార్గము చూచినాడు. సరిదిద్దుటకు ఎన్నో విధముల ప్రయత్నించి విఫలుడైనాడు దుఃఖమున క్రుంగి కృశించినాడు.

"సంతానము లేని వారు పుణ్యాత్ములు. వారికి చెడ్డ కొడుకుల వలన కలుగు దుర్భరమగు దుఃఖము లేదు. అధర్ముడైన పుత్రుడు, అధర్మము అంటగట్టిన పుత్రుడు, అందరితో విరోధము తెచ్చిపెట్టు పుత్రుడు, ఇల్లంతయు దుఃఖమున ముంచు పుత్రుడు కావలెనని ఎవడు కోరును? సంతానము మోహబంధము

ఈ బంధము వదలవలెనన్న మంచి పుత్రుని కంటె దుష్ట పుత్రుడే మేలు. దుష్ట పుత్రుడు ఇల్లంతయు నరకముగా మార్చును. కాన బంధము సహజముగా విడిపోవును" అని విచారించుచు అంగుడు రాత్రిలు నిద్రించువాడు కాదు. ఒకనాడు అర్ధరాత్రి లేచినాడు. గాఢనిద్రలో వున్న సునీథను చూచియు మోహము అన్నింటిని త్రెంచి రాజ్యమును ఐశ్వర్యమును వదలి అడవులకు వెళ్ళినాడు.

అంగరాజు ఇల్లు విడిచిపోయినాడని తెలిసి ప్రజలు విచారించినారు. రాజుకొరకు నేల నాలుగు చెరగుల గాలించినారు. కాని అంగరాజు కనిపించలేదు. నిరాశతో తిరిగి వచ్చినారు. దేశము అరాజకమైనది. ఈ విషయము గమనించి భృగువు మున్నగు ఋషులు మంత్రులకు ఇష్టము లేకున్నను సునీథ సమ్మతిని వేనుని రాజునుగా చేసినారు.

రాజు కాగానే విఱ్ఱవీగినాడు వేనరాజు. కన్ను మిన్ను కానలేదు. తనకన్న గొప్పవాడు లేడనుకొని మహాపురుషులను సహితము అవమానించినాడు. "యజ్ఞములు, దానములు, హోమములు చేయరా"దని రాజశాసనము చేసినాడు. చండశాసనుడై రాజ్యము చేసినాడు.

వేనరాజు యొక్క నిరంకుశత్వమును గురించి ఆలోచించుటకు మునులు ఒక చోట సమావేశమైనారు. వారిట్లు యోచించినారు.

> "ప్రజలకు ముందుకుపోయిన నుయ్యి వెనుకకుపోయిన గొయ్యి అను పరిస్థితి దాపురించినది. ఒకవైపు రాజుదోపిడికి, రెండవవైపు దొంగల దోపిడికి గురియై ప్రజలు నానాహింసలు పడుచున్నారు. అరాజకత్వము వలన కలుగు ఘోరములను వెరచి యోగ్యుడు కాకపోయినను, మరొక గత్యంతరములేక వేనుని రాజుగా చేసినాము. కాని ప్రజలకు వేనుని రాజరికము అరాజకము కంటె ఘోరముగా పరిణమించినది. ప్రజలను రక్షించుటకు గాను మనవలన అధికారము పొందిన వేనుడు ప్రజలను భక్షించుచు మన ధర్మమునే ధిక్కరించు చున్నాడు. మార్గాంతరము ఆలోచించి ప్రజలను రక్షించవలెను" అని ఆలోచించి రాజునకు నచ్చ చెప్పుటకును, రాజు వినకున్న చెడురాజుకన్న అరాజకము మేలు కాన రాజును భస్మము చేయుటకును నిర్ణయించినారు.

మునులందరు వేనుని వద్దకు వెళ్ళినారు. అతనికి ఈ విధముగా ధర్మము బోధించినారు :—

"మహారాజా! మనో వాక్కాయములచే ధర్మమును ఆచరించిన స్వర్గము మున్నగు ఆనందములు లభించును. అదే ధర్మమును కోరికలు లేక ఆచరించిన మోక్షము లభించును. కాన ప్రజలకు క్షేమము కలిగించు ధర్మము నీవలన నష్టము కారాదు. ధర్మము నష్టపడిన, రాజ్యము, రాజు ఐశ్వర్యము నష్టపడును. దుష్టులైన మంత్రుల నుండి, దొంగలనుండి ప్రజలను రక్షించి న్యాయముగా రాజ్యము పాలించిన రాజునకు ఇహమునందును పరమునందును సౌఖ్యము కలుగును. నీ రాజ్యమున బ్రాహ్మణులు యజ్ఞము చేసిన భగవదంశ స్వరూపులైన దేవతలు ప్రసన్నులై నీవు కోరిన కోరికలు సఫలము చేయుదురు. కావున రాజా! యజ్ఞయాగాదులను నిలిపివేయుటగాని దేవతలను తిరస్కరించుట గాని తగదు."

వేనరాజు మునుల మాటలను పెడచెవిని పెట్టినాడు. మునులను తిరస్కరించినాడు.

"అధర్మమును ధర్మమని కలగను మూర్ఖులు మీరు. మీకు జీవిక కల్పించిన నిజమైన భర్తను నన్ను వదలి జార స్త్రీవలె మరొక భర్తను ఉపాసించు చున్నారు. నేను రాజు రూపమున ఉన్న భగవంతుడను. నన్ను పూజించని వారికి ఇహమందును, పరమునను సుఖము లేదు. పతిభక్తిలేని వ్యభిచారిణులు రంకు మగల మీద ఆసక్తులైనట్లు నన్ను కాదని యజ్ఞ స్వరూపుడైన విష్ణువుమీద భక్తి చూపు చున్నారు. దేవతలందరు రాజు శరీరమందే ఉన్నారు కాన రాజు సర్వదేవతా మయుడు. కాబట్టి నన్ను పూజించుడు" అని మునులను ఆదేశించినాడు.

అణచుకున్న కోపము మునుల నోటివెంట శాపరూపమున వెలువడినది. ప్రజలను, భగవంతుని నిందించి ఇదివరకే చచ్చి ఉన్నాడు వేనుడు. పూర్తిగా చనిపోయినా డిప్పుడు.

ప్రజలకు వేనరాజు పీడ విరగడై పోయినది.

పృథు చక్రవర్తి.

ఒకనాడు మునులు సరస్వతీ నదీతీరమున కూర్చొని విష్ణు కథలతో కాలక్షేపము చేయుచున్నారు. ఇంతలో దూరమున పెద్ద ధూళి లేచినది. అది దోపిడి దొంగల వలన లేచిన ధూళి. దానిని చూచి దేశమున అరాజకము ప్రబలినదని మునులు గమనించినారు. దేశము అరాజకము కాకుండుటకు ఏమి చేయవలెనా అని ఆలోచించినారు.

బ్రాహ్మణుడు సమదర్శియు, శాంతస్వభావుడు అయినను. దీనులను ఉపేక్షించిన అతని తపస్సు చిల్లికుండలోని నీటివలె వ్యర్థము అగును శక్తిమంతులు, ధీమంతులు అనేకులు జన్మించిన వేనుని వంశము ఇంతటితో అంతరించరాదని నిర్ణయించినారు. వారు వేనుని శవము వద్దకు వెళ్ళి అతని తొడను తీవ్రముగా చిలికినారు. అందునుంచి ఒక మనిషి పుట్టినాడు. వాడు పొట్టిగను, నల్లగను వికారముగను ఉన్నాడు.

అతడు "నే నేమి చేయవలె" నని అడిగినాడు.

"నిషాదా" (అంటే కూర్చొనుము) అన్నారు మునులు. అందువలన అతడు నిషాదుడు అయినాడు. అతని వంశమువారు హింసయే వృత్తిగా చేసుకొన్నారు. దారిదోపిడి మున్నగు వృత్తులు చేసికొనుచు అడవులందును కొండలందును వుండిపోయినారు.

తదనంతరము బ్రాహ్మణులు వేనుని భుజములు చిలుకగా అందునుంచి ఒక స్త్రీ ఒక పురుషుడు జన్మించినారు. వారు దంపతులు అయినారు. ఆ దంపతులను చూడగానే వారు విష్ణు అంశమున జన్మించినారని మునులు సంతసించినారు. ఇతడు తన కీర్తిని పృథన పరుచును. అనగా విస్తరింపజేయును. కాన అతని పేరు పృథువు అయినది. అతని భార్య "అర్చి" అయినది.

బ్రాహ్మణులు పృథువును స్తుతించినారు. గంధర్వులు అతని గుణములను గానము చేసినారు. అప్సరసలు నాట్యము చేసినారు. సిద్ధులు పూలవాన కురిపించినారు. ఆకాశమున శంఖములు, తూర్యములు మున్నగునవి ప్రమోగినవి. బ్రహ్మ, ఇంద్రుడు మున్నగు దేవతలు అచటికి వచ్చినారు.

మునులు పృథువునకు రాజ్యాభిషేకము చేయ తలపెట్టినారు. ప్రజలు అభిషేక ద్రవ్యములు తెచ్చి సమర్పించినారు. పర్వతములు, నదులు, సముద్రములు, సర్పములు, పశువులు, మృగములు, సమస్త ప్రాణులు ఉపహారములు సమర్పించినవి.

పృథువు అలంకరించుకొని అగ్నిహోత్రునివలె ప్రకాశించినాడు. అర్చి లక్ష్మీదేవి వలె వెలిగిపోయినది. బ్రాహ్మణులు, మునులు పృథువునకు పట్టాభిషేకము చేసినారు.

దేవత లందరును దివ్యమైన బహుమతులు ఇచ్చినారు.

సూతులు, వందిమాగధులు పృథు చక్రవర్తి కీర్తి గానము చేయుటకు సిద్ధపడగా అతడు గంభీర వాక్యముల ఇట్లన్నాడు :—

"సూతులారా ! వందిమాగధులారా ! ఇంతవరకు నా గుణ మేదియు వెల్లడి కాలేదుకదా ! ఏ గుణమును పురస్కరించుకొని మీరు నన్ను స్తుతింతురు ? నా గుణములు ముందు వెల్లడియైన వెనుక మీరు మనసార కీర్తించవచ్చును.

> ఉత్తమ శ్లోకులను కీర్తించవలెగాని ప్రసిద్ధిలేని వారిని స్తుతించరాదు. ముందు ముందు గొప్పగుణములు ఉండగలవని ముందే ఆ గుణములను గురించి పొగడించుకొనువాడు అవివేకుడు. శాస్త్రములన్నియు చదువుకొనినవాడు పండితుడు కాగలడుగాని చదువులకు ప్రారంభించిన విద్యార్థిని పండితుడని కీర్తించ వచ్చునా ? అభిమానముగల పురుషుడు తన పౌరుషమును పొగడిన అన హ్యించుకొనును.

ఇంతవరకు నేను చేసిన మంచిపని ఏదియు ఖ్యాతిపొందలేదు. ఈ స్థితిలో బాలుని వలె నా కీర్తిని ఎట్లు పొగిడించుకొందును ?"

పృథువు రాజు అగునప్పటికి దేశమున క్షామము వ్యాపించి ఉన్నది. ఆకలిమంట లతో ప్రజలు తల్లడిల్లుచున్నారు. ఎముకల గూళ్ళుగా ఉన్న ప్రజలందరు రాజు వద్దకు వచ్చి ఇట్లు మొరపెట్టినారు :—

"మహారాజా ! తొఱ్ఱలో నిప్పు అంటుకున్న మాడిపోవు చెట్లవలె ఆకలిమంటకు మాడిపోవుచున్నాము. అన్నముపెట్టు రాజవుకాన నీ శరణు వేడుచున్నాము. ఆకలితో అల్లాడి పోవుచున్న మా విషయమున ఇంక ఏమాత్రము ఆలస్యమైనను ప్రాణములుపోవును. వెంటనే అన్నముపెట్టి మమ్ము కాపాడుము."

ప్రజల మొరలు విన్న పృథుచక్రవర్తి ఎంతోసేపు ఆలోచించి కరువునకు గల కారణము కనుగొన్నాడు. భూదేవత అన్నమును ఓషధులను తనలో దాచుకున్న దని నిశ్చయించినాడు. వెంటనే ధనస్సుతీసి త్రిపురసంహారకుడైన రుద్రునివలె నిప్పులు కక్కుచు భూదేవిమీద బాణము ఎక్కుపెట్టినాడు.

భూదేవి పృథువుబాణమును చూచినది. భయమున వడకిపోయినది. గోరూపము ధరించి కిరాతునిచూచి పరుగెత్తిన లేడివలె పరుగెత్తినది.

అదిచూచిన మహారాజు ఆగ్రహమున మండిపోయినాడు. అతని కనులు చింత నిప్పులు కురిపించినవి. ధనుర్బాణములు తీసుకొని భూదేవివెంట పడినాడు.

భూదేవి దిశలు, విదిశలు, స్వర్గము, మర్త్యము, అంతరిక్షము అన్నివైపులకు పరుగెత్తినది. అంతటను పృథుమహారాజు విల్లంబులతో ప్రత్యక్షమైనాడు. మృత్యువునుంచి ప్రాణిని కాపాడలేనట్లు పృథువునుండి భూదేవతను ఎవరును కాపాడలేకపోయినారు. మార్గాంతరములేక భూదేవి మహారాజునే ఇట్లు వేడుకున్నది :—

"మహారాజా! ప్రాణికోటినంతటిని రక్షించువాడవు. నన్ను రక్షింపుము. నేను దీనురాలను. ఏ పాపము ఎరుగని దానను. అబలను. నన్ను చంపెదవా? నేను నావవలె ఉన్నాను. నామీదనే జగత్తంతయు ఆధారపడియున్నది. నన్ను పగులకొట్టి నీటిమీద ప్రజలను ఎట్లు నిలుపగలవు? నీవు మాత్రము ఎట్లు నిలువగలవు?"

"భూదేవీ! నీవు నా శాసనమును మన్నించుటలేదు. యజ్ఞభాగములు గ్రహించుచున్నావు కాని మాకు అన్నము మొదలైనవి ఇవ్వకున్నావు. ప్రతిదినము గడ్డి మాత్రము మేయుచు పాలు ఇవ్వని ఆవును దండించుట తప్పా? బ్రహ్మదేవుడు సృష్టించిన ఓషధులు బీజములు అన్నియు కడుపులో పెట్టుకొని ప్రజలకు ఇవ్వకున్నావు. కాన నిన్ను చంపి ఆకలితో ఉన్న ప్రజలకు నీ మేదస్సుతో తృప్తి కలిగించెదను.

> తన స్వార్థమే చూచుకొని దయాదాక్షిణ్యములేక ప్రవర్తించు అధమవ్యక్తి స్త్రీయైనను, పురుషుడైనను, నపుంసకుడైనను చంపవలసినదే – అందువలన పాపము కలుగదు.

"దుర్మదమున విఱ్ఱవీగుచు మాయవలన గోరూపము ధరించితివా? నా బాణములచే నిన్ను ముక్కలు ముక్కలుచేసి నా యోగబలమున ప్రజలను రక్షింతును" అని యమునివలె కోపమున గర్జించినాడు పృథువు.

వడకిపోయినది భూదేవి. పృథుమహారాజును స్తుతించినది. మహారాజును ఇట్లు వేడుకున్నది.

"ప్రభూ! పండితులైనవారు తుమ్మెదవలె మంచిని మాత్రమే గ్రహింతురు. కావున క్రోధమువిడిచి నాకు అభయము ప్రసాదించుము.

పూర్వము బ్రహ్మదేవుడు సృష్టించిన ధాన్యము మున్నగు ఓషధులు దురాచారులు తినుట చూచినాను. రాజులు నన్ను రక్షించనందున అరాజకత్వము వచ్చి అందరు

దొంగలే అయిపోయి నందువలననే ముందు ముందు యజ్ఞముల కొరకు ఓషధులను దాచినాను. అవి చిరకాలము నాలో వుండి తరిగిపోయినవి. మంచి ఉపాయముస వానిని గ్రహించుట మంచిది.

మహారాజా! ప్రజలు కోరునట్టి బలప్రదమైన అన్నము కావలెననిన ఆవు రూపమున ఉన్న నన్ను పిదుకుటకు దూడను, పాత్రను, పిదుకు వ్యక్తిని సిద్ధము చేయుము. నేను పాడి ఆవునై నీవు కోరిన రీతిగా క్షీరమయమైన అన్నము నివ్వగలను.

వానకాలము గడచిపోయినను ఇంద్రుడు కురిపించిన నీరు అంతటను సమముగా ఉండునట్లు నన్ను చదును చేయుము. నీకు శుభము కలుగును."

భూదేవి చెప్పిన మాటలు విన్నాడు పృథువు. స్వాయంభువ మనువును దూడగా చేసినాడు. తన అరచేతిని పాత్రగా చేసినాడు. ఆవు రూపమున ఉన్న భూదేవి నుండి తానే ఓషధులను పితికినాడు.

ఋషులు మున్నగువారు సహితము పృథు మహారాజు ద్వారా వశమైన భూదేవి నుండి కావలసినవన్నియు పిదుకుకున్నారు.

మునులు బృహస్పతిని దూడనుగాచేసి ఇంద్రియములను పాత్రనుచేసి వేదరూపమైన పాలు పితికినారు.

దేవతలు దేవేంద్రుని దూడనుగాచేసి, బంగారు పాత్రలో మనోబలము, ఓజస్సు నిచ్చు పాలు పితికినారు.


దైత్యులు, దానవులు, అసురులు ప్రహ్లాదుని దూడనుగాచేసి లోహపాత్రమున కల్లును, సారాయిని పితికినారు.

గంధర్వులు, అప్సరసలు విశ్వావసుని దూడనుగాచేసి పద్మపాత్రలో సంగీతము, సౌందర్యము అను పాలు పితికినారు.

పితృదేవతలు అర్యముడిని దూడనుగాచేసి పచ్చి మట్టిపాత్రలో కవ్యరూపమైన పాలు పితికినారు.

సిద్ధులు, విద్యాధరులు కపిలదేవుని దూడనుగాచేసి అణిమాది అష్టసిద్ధులను పితికినారు.

కింపురుషులు మయుని దూడనుగాచేసి అంతర్ధానము, విచిత్ర రూపములు ధరించుట మున్నగు మాయలను పితికినారు.



పృథుచక్రవర్తి గోరూపముననున్న భూదేవిని పితుకుట.

పుట. 152

యక్ష, రాక్షస, భూత, పిశాచములు శివుని దూడనుగా చేసి రక్తపానీయమును పిదికినారు.

సర్పములు మున్నగునవి తక్షకుని దూడనుగాచేసి నోటిని పాత్రగాచేసి విషమును పిదికినవి.

పశువులు శివుని వాహనమైన వృషభమును దూడనుగాచేసి అడవిని పాత్రనుగా చేసి తృణ రూపమైన పాలు పిదికినవి.

పక్షులు గరుత్మంతుని దూడనుగాచేసి పురుగులను పండ్లను పిదికినవి.

వృక్షములు మఱ్ఱిచెట్టును దూడనుగాచేసి వివిధ రసములను పిండినవి.

కొండలు హిమాలయమును దూడనుగాచేసి, తమ శిఖరములను పాత్రలనుగాచేసి రకరకములగు ధాతువులను పిదికినవి.

అల్లెల్లరు తమకు అవసరమైన వానిని భూదేవి నుండి పిదుకుకున్నారు.

తదుపరి వృథు చక్రవర్తి తన వింటి కొమ్ముతో కొండ కొమ్ములను పొడిచి భూమండలమును చదునుచేసి ప్రజలను కన్న బిడ్డలవలె పాలించినాడు.

> వృథు చక్రవర్తికి పూర్వము గ్రామములు, పట్టణములు లేకుండెను. అతడు గ్రామములు, పట్టణములు నిర్మించినాడు. అట్లు నిర్మించిన తరువాతనే ప్రజలు సుఖించినారు.

బ్రహ్మావర్తమున సరస్వతీనది తూరుపుగా ప్రవహించు దానిని మనుక్షేత్రము అందురు. వృథు చక్రవర్తి ఆ మనుక్షేత్రమున వంద అశ్వమేధములు చేయ తల పెట్టెను. ఇంద్రుడు తప్ప ఎవరును వంద యజ్ఞములు చేయలేదు. వృథువు తల పెట్టిన కార్యమును గూర్చి ఇంద్రునకు తెలిసినది. వృథువు నూరు యజ్ఞములు పూర్తిచేసినచో ఇంద్రునితో సమానమగును. అందువలన ఇంద్రునకు ఈర్ష్య కలిగినది.

మహారాజు యజ్ఞదీక్ష పూనినాడు. భూదేవి గోరూపమును దాల్చి యజ్ఞకర్త యగు వృథుమహారాజునకు కావలసిన వన్నియు స్వయముగా సమర్పించినది. నదులు చెరుకు రసము, ద్రాక్షరసమువంటి రసములను ప్రవాహములుగా తెచ్చి సమర్పించినవి. మహా వృక్షములు పాలు, పెరుగు అన్నము, నెయ్యి మున్నగు ఉపహారములను సమర్పించినవి. పర్వతములు భక్ష్య, భోజ్య, చోష్య లేహ్యము లను సమర్పించినవి.

పృథు మహారాజు చేసిన యజ్ఞమునకు శ్రీహరి విచ్చేసినాడు. బ్రహ్మ, శివుడు తమ తమ అనుచరులతో వచ్చినారు. లోకపాలురు, గంధర్వాదులు, మునులు, అప్సరసలు, విద్యాధరులు, సిద్ధులు, దైత్యులు, దానవులు, యక్షులు, సనందుడు, కపిలుడు, నారదుడు, దత్తాత్రేయుడు, సనకుడు, సనందనుడు, సనాతనుడు, సనత్కుమారుడు మున్నగువారు వచ్చినారు.

వారందరు శ్రీహరి గుణములను గానము చేసినారు.

ఇట్లు మహోత్సవముగా తొంబది తొమ్మిది యజ్ఞములు ముగిసినవి. నూరవ యజ్ఞమున పృథు చక్రవర్తి దీక్షగా యజ్ఞేశ్వరుని ఆరాధించుచున్నాడు.

ఇంద్రుడు పాషండ వేషమున వచ్చి యజ్ఞాశ్వమును దొంగిలించి ఆకాశమార్గమున పారిపోవుచుండగా అత్రిమహర్షి చూచినాడు. ఆ విషయము పృథు మహారాజు పుత్రునకు చెప్పినాడు. ఇంద్రుని చూపినాడు.

పృథు కుమారుడు దేవేంద్రుని వెంబడించినాడు. "నిలునిలు" అన్నాడు. పాషండ వేషమున ఉన్న ఇంద్రుని చూచి పృథుకుమారుడు ఎత్తిన బాణమును ఎత్తినట్లే దించినాడు. అతడు దేవేంద్రుడనియు యజ్ఞాశ్వమును దొంగిలించుచున్నాడనియు, అతనిని సంహరించ వలసినదని అత్రిముని పురికొల్పగా పృథు కుమారుడు దేవేంద్రుని వెంటాడినాడు. అది చూచిన దేవేంద్రుడు పాషండ వేషమును, అశ్వమును వదలి అంతర్ధానుడైనాడు. పృథుకుమారుడు యజ్ఞాశ్వమును తీసుకొని యజ్ఞశాలకు వచ్చినాడు. ఇంద్రుని నుండి అశ్వమును గెలిచినందున అతనికి విజితాశ్వుడు అని పేరు పెట్టినారు మునులు.

యజ్ఞ పశువైన గుఱ్ఱమును యూప స్తంభమునకు కట్టినారు. ఇంద్రుడు ఘోరమైన చీకటిని సృష్టించినాడు. మరల గుఱ్ఱమును దొంగిలించినాడు. ఆకాశ మార్గమున గుఱ్ఱమును ఎత్తుకొనిపోవు ఇంద్రుని చూచి అత్రిముని మరల విజితాశ్వునకు చెప్పినాడు. విజితాశ్వుడు ఇంద్రుని వెంబడించినాడు. ఇంద్రుని వద్దగల కపాలము ఖట్వాంగము చూచి విజితాశ్వుడు బాణములు వేయలేదు. అత్రిముని పూర్వమువలెనే పురికొల్పగా బాణములు వర్షించినాడు.

ఇంద్రుడు తన వేషమును, గుఱ్ఱమును వదలి మాయమైనాడు.

పృథుమహారాజు యొక్క యజ్ఞము పాడుచేయుటకు గాను గుఱ్ఱమును ఎత్తుకొని పోవుటకు ఇంద్రుడు ధరించిన వేషములు పాషండములు. అనగా పాపపు

గుర్తులు కలవికాన ఆ వేషములను పాషండవేషములు అన్నారు. పాషండ-వేషములు మనుష్యులను ఆకర్షించినవి. నగ్నముగా ఉండుట, ఎరుపురంగు-బట్టలు కట్టుట, చాతుర్యముగా హేతువాదము చేయుట. వీనికి క్రమపడి ప్రజలు పెడదారి త్రొక్కినారు.

దేవేంద్రుని పాషండ వేషములను గురించి విని పృథువు ఉగ్రుడై పోయినాడు. వెంటనే ధనస్సుతీసి ఇంద్రునిపైకి బాణము సంధించినాడు. యజ్ఞశాలలో ఉన్న ఋత్విజులు ఎల్లరు అతనిని వారించినారు.

"మహారాజా! యజ్ఞము జరుగుచున్నపుడు యజ్ఞపశువధతప్ప వేరు వధ జరుగరాదు. అమోఘమైన ఆవాహన మంత్రములచే ఇంద్రుని ఇచటికి రప్పించి అగ్నిలో హవనము చేతుము" అని ఋత్విజులు కోరియున ఇంద్రుని ఆవాహన చేసినారు. సక్రమముగా స్రువముతో యజ్ఞకుండమున ఆహుతిచేయబోవు సమయమున బ్రహ్మదేవుడు అడ్డమువచ్చి "ఋత్విజులారా! యజ్ఞములందు పూజలు అందుకొను దేవతలందరు ఇంద్రుని శరీరమే. ఇంద్రుడు భగవంతుని అవతారము కావున అతనిని ఆహుతిచేయు ప్రయత్నము మానుడు" అన్నాడు.

బ్రహ్మదేవుడు పృథుచక్రవర్తితో ఇట్లనెను :—

"మహారాజా! మోక్షధర్మపరాయణుడవైన నీవు కోరికలతో యజ్ఞములుచేయదగునా? ఇంద్రుడు, నీవు ఉభయులుగూడ భగవంతుని అవతారములే. నీయజ్ఞము విఘ్నమైనదని విచారించకుము.

> దైవికముగా చెడిపోయిన పని తిరిగిచేయుటకు ప్రయత్నించినవారు క్రోధవశులై మహాంధకారమున మునిగిపోవుదు.

ఈ యజ్ఞము ఇంతటితో ఆగిపోనిమ్ము. ఇంద్రుని పాషండవేషములవలన ధర్మమునకు గ్లాని సంభవించినది. దానిని త్వరలో అంతముచేయుటకుప్రయత్నింపుము" ఆ సమయమున యజ్ఞేశ్వరుడు, యజ్ఞభోక్త అయిన శ్రీహరి ప్రత్యక్షమైనాడు. "పృథూ! నీ నూరవ అశ్వమేధము భంగపరచినందులకు ఇంద్రుడు క్షమాభిక్ష కోరుచున్నాడు. ఇతనిని క్షమించుము.

రాజా! నీవు జ్ఞానవంతుడవు. సుఖదుఃఖములు సమానములని భావించవలసినవాడవు. అందరిని సమదృష్టితో చూచి ఇంద్రియములను, మనసును లోబరచుకొని ప్రజలను పాలించుము. నీ సద్గుణములవలన, సత్ప్రభావమువలన నీకు నేను

వశుడను అయినాను. నీకు ఏది కావలెనో కోరుము. ఇవ్వగలను. సహజముగా యజ్ఞముల వలనను తపస్సువలనను నన్ను ఎవరును పొందలేరు. హృదయమున వైమనస్యములేనివారు నన్ను సులభముగా పొందుదురు" అన్నాడు.

విష్ణువు ఉపదేశమువిన్న పృథుచక్రవర్తి భగవంతుని ఆజ్ఞను తలదాల్చి యజ్ఞమును నిలిపివేసినాడు.

దేవేంద్రుడు తానుచేసిన పనికి సిగ్గుచెంది పృథుచక్రవర్తి పాదములు పట్టుకున్నాడు. చక్రవర్తి అతనిని లేవనెత్తి కౌగలించుకున్నాడు. ఇంద్రుని విషయమున ద్వేషము వదిలినాడు.

"న కామ మేనాథ తదప్యహం క్వచిన్నయత్ర యుష్మచ్చరణాంబుజాసవః
మహత్తమాంతర్హృదయాన్ముఖచ్యుతో విధత్స్వ కర్ణాయుత మేష మే వరః

విభూ! నీ చరణాంబుజాసవములేనట్టి కైవల్యమైనను నాకువలదు. మహానుభావుల హృదయాంతరములనుండి నీదివ్య కథలను వినుటకు పదివేల చెవులు ఇమ్ము" అని శ్రీహరిని పృథుచక్రవర్తి వరము కోరినాడు.

"తండ్రీ! నీమాయవలననే మనిషి సత్యమును విడుచుచున్నాడు. అజ్ఞానాంధకారమున పడి కొట్టుకొనుచున్నాడు. కొడుకు కోరకపోయినను తండ్రి కుమారుని క్షేమము విచారించినట్లు నీవు మమ్ములనుగురించి విచారింతువు" అని స్తుతించినాడు రాజు.

ఆ స్తుతివిని విష్ణుదేవుడు సంతసించినాడు.

యజ్ఞములకు వచ్చిన దేవతలు, ఋషులు, పితురులు, కిన్నరులు, సిద్ధులు, చారణులు, నాగులు, గంధర్వులు, అప్సరసలు, మనుష్యులు, గరుడులు మరియు తక్కిన జీవజాలము నంతటిని భగవత్స్వరూపముగా భావించినాడు పృథువు. అందరియెదుట చేతులు జోడించి చల్లనిమాటలతోను, ధనముతోను అందరిని యథావిధిగ పూజించినాడు. అతడుచేసిన పూజ లందుకొని తృప్తిచెంది, సంతసించి ఎల్లరు తమతమ నివాసములకు వెళ్ళిపోయినారు.

విష్ణుభగవానుడు అంతర్ధానుడైనాడు.

పృథుమహారాజు, అవ్యక్తరూపుడైన భగవంతునకు నమస్కరించి రాజధానికి చేరినాడు.

పృథుమహారాజు, మహారాణియైన అర్చివలన అయిదుగురు పుత్రులను కన్నాడు. వారు విజితాశ్వుడు, ధూమ్రకేశుడు, హర్యక్షుడు, ద్రవిణుడు, వృకుడు అనువారు.

పృథుచక్రవర్తి ప్రజలను రంజింపచేయుటకుగాను ఆ యా లోకపాలుర గుణములను ధరించువాడు. అతడు రంజింపచేయుటలో చంద్రుడు. ప్రకాశమున సూర్యుడు. తేజస్సున అగ్నిహోత్రుడు. దేవేంద్రునివలె అజేయుడు. కోరికలు తీర్చుటలో స్వర్గము. గాంభీర్యమున సూర్యుడు. ధైర్యమున మేరువు. దండనమున యముడు. వస్తుసేకరణలో హిమవంతుడు. ధనమున కుబేరుడు. బలమున వాయువు. విక్రమమున శివుడు. సౌందర్యమున మన్మధుడు. ఉత్సాహమున సింహము. వాత్సల్యమున మనువు. అధిపత్యమున బ్రహ్మ. బ్రహ్మతత్త్వమున బృహస్పతి. జితేంద్రియత్వమున శ్రీహరి. పృథువుయొక్క ఇన్నిరూపముల పరిపాలనలో ప్రజలు నిత్య సంతృప్తులై ఉండేవారు.

అతనికి గోవులు, బ్రాహ్మణులు, విష్ణుభక్తులనిన పరమభక్తి. లజ్జ, వినయము, పరోపకారము అతని భూషణములు. మూడు లోకములందును అతని కీర్తి గానముచేయబడెను. ఎక్కడచూచినా రామనామమువలె పృథుమహారాజు నామమే వినిపించునది.

పృథుమహారాజునకు వార్ధక్యము వచ్చినది. చివరి పురుషార్థమైన మోక్షము సాధించవలెననుకున్నాడు. రాజ్యమును పుత్రులకు అప్పగించి భార్యాసమేతుడై మందరగిరికి వెళ్ళిపోయినాడు.

అతని వియోగము భరించలేక ప్రజలు తల్లడిల్లినారు.

భూదేవి వలవల ఏడ్చినది.

పృథుచక్రవర్తి వానప్రస్థాశ్రమమున ఉండి తపశ్చర్య ప్రారంభించినాడు. ఎండ కాలమున పంచాగ్నులమధ్యఉండి తపస్సుచేసినాడు. చలికాలము గొంతువరకు నీటిలోనిలబడి తపమాచరించినాడు. కటికనేలమీద పడుకున్నాడు. బ్రహ్మచర్యమును నిష్ఠతో పాలించినాడు. ప్రాణములను అదుపులోపెట్టుకొని విష్ణు దేవుని ధ్యానించుచు తపమాచరించినాడు.

క్రమముగా అతని మనసు పరిణతి చెందినది. ప్రాణాయామమువలన వాసనా బంధనములు తెగిపోయినవి. చిత్తము పరిశుద్ధమైనది. వైరాగ్యము స్థిరపడినది. విజ్ఞానము ప్రకాశించినది. ఆత్మతత్త్వము అవగతమైనది.

అంత్యకాలము ప్రాప్తించగా మడమలతో మూలాధారమును నొక్కిపట్టి, మూలాధారమునుండి వాయువును మీదికి పోనిచ్చినాడు. దానిని నాభివద్దగల మణిపూర చక్రమునచేర్చి, అచటినుండి హృదయమునందలి అనాహత చక్రమునకు చేర్చినాడు. అచటినుంచి కంఠమునందలి ఆజ్ఞాచక్రమున చేర్చి, క్రమముగా బ్రహ్మరంధ్రమున చేర్చినాడు. శరీరమందలి వాయువును వాయువునందును, తేజస్సును తేజస్సులోను, నీటిని నీటిలోను, శరీరఛిద్రములను ఆకాశమున కలిపివేసినాడు. తరువాత మనస్సును ఇంద్రియములలోను, ఇంద్రియములను వాటికి కారణభూతములైన తన్మాత్రలందును, తన్మాత్రలను వాటికి కారణభూతములైన అహంకారమునందును, అహంకారమును మహత్తత్త్వమునందును, మహత్తత్త్వమును జీవనోపాధి భూతమైన ప్రకృతిలోను లీనముచేసినాడు.

శుద్ధబ్రహ్మస్వరూపమున లీనమై ముక్తుడై పోయినాడు.

తన ప్రియభర్త పంచత్వము పొందగానే అర్చికి లోకమంతయు అంధకారముగా కనిపించినది. ఎంతోసేపు ఒంటరిగా ఏడ్చినది. తుదకు చేయవలసిన పన్నియుచేసి స్నానముచేసినది. భర్తకు జలాంజలి సమర్పించి ఆకాశదేవతలకు నమస్కరించినది. భర్తచితికి మూడుమారులు ప్రదక్షిణముచేసి భర్తపాదములు ధ్యానించుచు చితాగ్నిలో ప్రవేశించినది.

అగ్నిలోకలసి భస్మమైపోయినది.
సహగమనముచూచి అర్చిని దేవతలు స్తుతించినారు.
దేవదుందుభులు మ్రోగించినారు.
మందరగిరిపై పుష్పవృష్టి కురిసినది.
ధన్యం యశస్య మాయుష్యం స్వర్గ్యం. కలిమలాపహమ్.
ధర్మార్థకామమోక్షాణాం సమ్యక్సిద్ధి మభీప్సుభిః

ఈ చరిత్రము ధనమునిచ్చును. కీర్తిని, ఆయుష్యమును, స్వర్గమును కలుగచేయును. కలికల్మషమును భస్మముచేయును. ధర్మార్థ కామ మోక్షములు కావలసినవారు దీనిని శ్రద్ధగా వినవలయును.

ప్రాచేతసుల వృత్తాంతము.

పృథు చక్రవర్తి కుమారుడు విజితాశ్వుడు. అతనికి ఇద్దరు భార్యలు. మొదటి భార్య శిఖండి. శిఖండివలన పావకుడు, పావమనుడు శుచి అను ముగ్గురు పుత్రులు

కలిగినారు. రెండవ భార్య నభస్వతి. ఆమెకు హవిర్ధానుడు అను ఒక్కడే కుమారుడు కలిగినాడు.

హవిర్ధానుని భార్య హవిర్ధానికి బర్హిషదుడు, గయుడు, శుక్లుడు, కృష్ణుడు, సత్యుడు, జితవ్రతుడు అను ఆరుగురు పుత్రులు కలిగిరి.

బర్హిషదుడు సముద్రుని కూతురైన శతద్రుతిని పెండ్లాడినాడు. బర్హిషదుడు యజ్ఞములు చేయుటలో దిట్ట. అతడు నిరంతరము యజ్ఞములు చేసినాడు. యజ్ఞము ఒకచోట పూర్తి కాగానే మరొకచోట ప్రారంభించువాడు. అతడు భూలోకమంతటను ప్రాచీనాగ్రముగా దర్భలు పరచినందున అతనికి ప్రాచీన బర్హి అని పేరు వచ్చినది.

ప్రాచీన బర్హికి శతద్రుతివలన పదిమంది పుత్రులు కలిగినారు. వారందరును ప్రాచేతసులు అని ఒకే పేర వ్యవహరించ బడినారు. పదిమంది ప్రాచేతసులను ప్రజాసృష్టి చేయవలసినదని ప్రాచీన బర్హి పంపినాడు. తాను యజ్ఞయాగాది క్రతువులందు నిమగ్నుడై రాజ్యము పాలించ సాగినాడు.

ఒకనాడు ప్రాచీన బర్హిని వద్దకు నారదుడు వచ్చినాడు. యజ్ఞయాగాది క్రతువుల వలన దుఃఖము నశించి పరమానందము లభించదని చెప్పినాడు. ప్రాచీన బర్హి యజ్ఞములందు చంపిన వేలకొలది పశువులు ప్రాచీన బర్హి చావు కొరకు ఎదిరి చూచుచున్నవని చెప్పినాడు. అతడు మరణించగనే అతని యాతనా శరీరమును ఇనుప కొమ్ములతో పొడుచుటకు ఎదిరి చూచుచున్నవి అన్నాడు. "ప్రాణులన్నియు ఆత్మ సమానులు. యజ్ఞము కొరకు ఒక ప్రాణిని హింసించ వలెను. అందువలన ఆ ప్రాణి దుఃఖించును. ఆ దుఃఖము హింసించిన వానిని పట్టుకొని ఇహమునను పరమునను వదలదు. అట్లయిన దుఃఖముల నుండి విముక్తి కలిగి పరమానందము ఎట్లు పొందగలవు?" అని నారదుడు అడుగగా తనకు విముక్తి లభించు మార్గము బోధించవలసినదని నారదుని కోరినాడు ప్రాచీనబర్హి.

నారదుడు పురంజన రాజు కథ చెప్పి కర్మల వలన దుఃఖము కలుగునని బోధించి ప్రాచీన బర్హికి ఇట్లు ఉపదేశించెను :—

భగవంతుని గుణములున్న చోట, భగవద్గుణముల గానము జరుగుచున్న చోట భక్తులు సమావేశ మగుదురు. భక్తులు సమావేశమైన చోట శ్రీహరి కథామృతము ఉప్పొంగి ప్రవహించును. అహంకారము లేక, నిర్మల చిత్తులై



నారదుడు ప్రాచీన బర్హునకు ఆతడొనరించు పశుబలితో కూడిన యజ్ఞయాగాది క్రతువులవలన దుఃఖమునశించి ఆనందము లభింపదని చెప్పుట. పుట. 160

శ్రీహరి కథామృతమును చెవులను చేతులచే త్రాగిన వారిని దుఃఖములు, భయము, మోహము దరిచేరవు.

మహారాజా! కర్మములే పరమార్థము అన్న బుద్ధి విడిచిపెట్టుము. అదంతయు భ్రమ, అజ్ఞానము. మలిన బుద్ధులు వేదములకు సహితము కర్మపరముగా వ్యాఖ్యానము చేయుదురు. అట్టి వారికి వేదముల యథార్థమైన అర్థము తెలియదు. వైకుంఠమే పొందవలసిన లోకమని సహితము వారికి తెలియదు.

తత్కర్మ హరితోషం యత్సా విద్యా తన్మతిర్యయా
హరిర్దేహభృతామాత్మా స్వయం ప్రకృతిరీశ్వరః
తత్పాదమూలం శరణం యతః క్షేమో నృణామిహ॥

"శ్రీహరికి సంతోషము కలిగించినదే కర్మ. అతనిమీద మనస్సు లగ్నము చేసినదే విద్య. అతడే దేహధారులకు ఆత్మ. అతడే ప్రకృతి. అతడే భగవంతుడు. వాని పాదములను శరణుజొచ్చిన వారికి క్షేమము కలుగును".

నారదుని ఉపదేశము విన్న ప్రాచీన బర్హి రాజ్యభారము ప్రజాసృష్టి చేసిన కుమారులకు అప్పగించి కపిలాశ్రమమునకు వెళ్ళినాడు. అచట అతడు విషయాసక్తివదలి గోవిందుని పాదారవిందములను ఏకాగ్రమగు మనసున నిలిపి భజించినాడు. చివరకు భగవంతునిలో లీనమైనాడు.

ప్రాచీన బర్హి తన కుమారులైన ప్రచేతసులకు ప్రజాసృష్టిచేయుటకు వెళ్ళవలసినదని ఆజ్ఞాపించినాడు కదా. వారు పశ్చిమ దిశకు బయలుదేరి ఒకచోట వైశాల్యముగల సరోవరమును చూచినారు. ఆ సరోవరమందలి నీరు నిర్మలముగానున్నది. అందు కలువలు పద్మములు ఉన్నవి. చేపలు మున్నగు జలచరములు నీటిలోపలను, హంసలు, చక్రవాకములు మున్నగు పక్షులు నీటిమీదను ఉండుట వలన ఆ సరస్సు ఎంతో రమ్యముగా కనిపించినది.

ప్రచేతసులు దాని రమ్యతకు ఆశ్చర్యపడి చూచుచుండగా మృదంగ పణవాదుల మధురమైన సంగీతము వారికి వినిపించినది.

చూచుచుండగానే శుభాకారుడైన శివుడు ఆసరస్సునుండి బయలుపడి ప్రచేతసులకు దర్శనమిచ్చినాడు. ప్రచేతసులు సాష్టాంగపడి శివునకు నమస్కరించి చేతులు జోడించి నిలుచుండినారు. శివుడు ప్రచేతసులను అనుగ్రహించినాడు.

"ప్రాచేతసులారా ! మీకు శుభము కలుగుగాక ! మీరు ఏపనికై వెళ్ళుచున్నారో నాకు తెలియును. వాసుదేవుని ఆశ్రయించిన వారవిన నాకెంతో ప్రియము. అందువలననే మీకు దర్శనమిచ్చినాను. స్వధర్మమును పాలించిన పురుషుడు నూరు జన్మముల తరువాత బ్రహ్మపదము చేరుకొనును తదనంతరము ఎన్నో పుణ్యములు చేసుకొని నన్ను చేరుకొనును. కాని విష్ణుభక్తులు అట్లుకాదు. వారు పాంచభౌతిక దేహమును విడువగానే, దేవతలు తమ అధికారము ముగిసిన తరువాత చేరుకొన వలసిన పరమపదమును చేరుకొందురు. మీరు పరమ భాగవతులు కాన వాసుదేవుడు నాకెట్లు ప్రియుడో మీరును అట్లే ప్రియులు. మీకు శుభప్రదమైన స్తోత్రము ఉపదేశింతును పరిశుద్ధ భావమున ఈ స్తోత్రము జపించుడు" అని వారికి నారాయణ స్తోత్రమును వినిపించినారు.

శివుడు ఉపదేశించిన యోగాదేశ స్తోత్రమును శ్రద్ధగా విని మనసున పట్టించుకున్నారు ప్రాచేతసులు. ఎంతో భక్తిభావమున శివుని పూజించినారు. వారి పూజలను అందుకొని శివుడు అంతర్ధానుడు అయినాడు.

ప్రాచేతసులు అచటినుండి బయలుదేరి సముద్రము దరికి చేరినారు సముద్రమున ఉండి యోగాదేశ స్తోత్రము జపించసాగినారు. వారు నీటిలో ఉండి పదివేల సంవత్సరములు తపస్సు చేసినారు.

అపుడు శ్రీహరి వారికి ప్రత్యక్షమై ప్రశాంతమైన నీలమేఘశ్యామ శరీర కాంతితో వారి మనఃక్లేశమును చల్లార్చినాడు.

శ్రీహరి ప్రత్యక్షము కాగా వారెల్లరు సాగిలబడి మ్రొక్కి హరిని స్తుతించి వినయ వినమ్రతలతో చేతులు జోడించి, అనంతుడు, అవ్యయుడు అయిన శ్రీహరి ముందు నిలుచుండినారు.

"ప్రాచేతసులారా ! మీరు పదిమంది అన్నదమ్ములు సౌహార్ద్రమున ఒకే ధర్మమును పాలించుచున్నారు. మీ సౌహార్ద్రము ఆదర్శప్రాయమైనది. మీరు ఏకాగ్రచిత్తమున రుద్రగీతను చదివి నన్ను స్తుతించినారు. కావున మీకు మంగళప్రదమైన వరము ఇచ్చెదను.

ప్రమ్లోచ అను అప్సరసకు కండు మహర్షి సంయోగము వలన 'మారిష' అను కన్యక జన్మించినది. ప్రమ్లోచ తన కూతురును పసిపాపగా ఉన్నపుడు భూలోకమున వదిలి స్వర్గమునకు వెళ్ళిపోయినది. మారిషను చెట్లు పెంచినవి. చంద్రుడు

ఆమెకు ఓషధులు ఇచ్చి అనుగ్రహించినాడు. ఆమెను వివాహమాడిన మీకు శుభము కలుగును. ఆమెవలన మీకు ఒక పుత్రుడు కలుగును. అతడు బ్రహ్మను మించును.

నా అనుగ్రహమున మీరు వేయి దివ్య సంవత్సరములు బలవంతులై వేయి విధముల సౌఖ్యములు అనుభవింతురు. ఈ భోగములు తుచ్ఛములని తెలుసుకొని నామీద చలించని భక్తి కలిగి తుదకు నాపదమైన పరమపదము చేరుకొనెదరు" అని చెప్పి శ్రీమన్నారాయణుడు అంతర్ధానుడైనాడు.

సముద్ర గర్భమునుండి ప్రాచేతసులు బయటికి రాగా భూమండలమంతయు చెట్లతో క్రిక్కిరిసిపోయినట్లు వారికి కనిపించినది. వారికి చెట్లమీద కోపము వచ్చినది. మూడవ కంటి నుంచి కాలాగ్ని వెళ్ళగ్రక్కిన ప్రళయ రుద్రునివలె ప్రాచేతసులు ముఖములనుండి అగ్నిని, పెనుగాలిని సృష్టించినారు.

చెట్లన్నియు భస్మము అగుచుండగా బ్రహ్మ వచ్చి తగిన మాటలు చెప్పి వారిని ఓదార్చినాడు. మిగిలిన చెట్లు భయమున వడకిపోయినవి. బ్రహ్మదేవుని ఆదేశము ప్రకారము వృక్షములు ప్రమ్లోచ పుత్రిక 'మారిష'ను పదిమంది ప్రాచేతసులకు అర్పించినవి. వారు యథావిధిగా మారిషను వివాహమాడినారు.

బ్రహ్మ తన లోకమునకు వెళ్ళిపోయినాడు.

మారిషను పెండ్లాడిన ప్రాచేతసులు వేయి దివ్య సంవత్సరములు సుఖముగా కాలము గడిపినారు. వారికి మారిషవలన ఒక పుత్రుడు జన్మించినాడు. పూర్వము శివుని అవమానించుటవలన శరీరము వదలిన దక్షుడు మారిష గర్భమున మరల జన్మించినాడు. కాలక్రమమున పూర్వసర్గము నశించగా భగవంతుని ఆదేశమున చాక్షుష మన్వంతరమున క్రొత్త ప్రజలను సృష్టించిన వాడు ఈ దక్షుడే. కర్మదక్షుడు కాన అతనికి దక్షుడని పేరువచ్చినది.

బ్రహ్మదేవుడు ప్రజాపతులమీద అధిపతిగా అతనిని అభిషేకించినాడు. సృష్టిని రక్షించు భారము అతనికి అప్పగించినాడు. మరీచి మున్నగు ప్రజాపతులను తమ తమ పనులలో నియోగించినవాడు దక్షుడే.

వేయి దివ్య సంవత్సరముల తరువాత ప్రాచేతసులకు తత్త్వజ్ఞానము ఉదయించినది. వారు మారిషను పోషించు భారమును దక్షునకు అప్పగించి సన్యాసులై

ఇల్లు విడిచి వెళ్ళిపోయినారు. జాజాలి సిద్ధి పొందిన పశ్చిమ సముద్రతీరమునకు చేరినారు. అచ్చట స్థిరాసనులై మనోవాక్కాయములను జయించి బ్రహ్మమును దర్శించినారు.

అట్టి సమయమున నారదుడు వారి వద్దకు వచ్చి ఆత్మజ్ఞానమును బోధించినాడు.

"తజ్జన్మ తాని కర్మాణి తదాయుస్తన్మనో వచః
నృణాం యేనేహ విశ్వాత్మా సేవ్యతే హరిరీశ్వరః

విశ్వాత్మ, పరమేశ్వరుడు అయిన శ్రీహరిని సేవించిన జన్మయే జన్మ. అతని సేవించిన కర్మయే కర్మ. అతనిని సేవించిన బ్రతుకే బ్రతుకు. అతనిని సేవించిన మనసే మనసు. అతనిని సేవించిన మాటయే మాట.

సర్వ జీవములకు అవధి ఆత్మ. ఆత్మ జ్ఞానము ప్రసాదించు ప్రభువు వాసుదేవుడు. చెట్టు మొదట నీరుపోసిన కొమ్మలు రెమ్మలు అన్నియు తృప్తిచెందును. ప్రాణికి ఆహారము వలన సర్వేంద్రియములు తృప్తిపడును. భగవంతుడైన శ్రీహరిని ఆరాధించిన దేవతలందరు తృప్తి చెందుదురు.

నీరు సూర్యుని నుండియే పుట్టి తిరిగి సూర్యునే చేరును. ప్రాణికోటి అంతయు భూమినుండి పుట్టి తిరిగి భూమిలోనికే పోవును. సకల చరాచర ప్రకృతి నారాయణుని నుండి పుట్టును ప్రళయకాలమున అతనిలోనే లీనమగును.

సూర్యుడు వేరు సూర్యకిరణములు వేరు కావు. అట్లే విశ్వము వేరు శ్రీహరి వేరు కాదు.

జాగ్రదావస్థలో పనిచేయు ఇంద్రియములు నిద్రావస్థలో పనిచేయవు. వాని శక్తులు వానిలోనే లీనమగును. సర్గకాలమున కనిపించు విశ్వము కల్పాంతమున కనుపించదు. అతనిలో లీనమగును. అహంకార రూపమైన ద్రవ్యము, అహంకార కారణమైన భేదభ్రమలు శ్రీహరిలో లేవు

మేఘము చీకటి, వెలుగు ఆకాశమున పుట్టును ఆకాశమునందే లీనమగును. కాని వాటితో ఆకాశము లిప్తము కాదు. సత్త్వరజస్తమస్సులు ఒకప్పుడు ప్రవాహమువలె శ్రీహరి నుండియే పుట్టును. తిరిగి శ్రీహరిలోనే లీనమగును.

దేహధారులకు ఏకైక ఆత్మ పరమాత్ముడు అతడు తన తేజస్సువలన గుణ ప్రవాహ రూపమగు తేజస్సును నాశనము చేయును.

అందువలన శ్రీహరినే ఆరాధింపవలెను.

సర్వ ప్రాణుల ఎడ దయగలిగి యుండవలెను. లభించినదానితో సంతృప్తి చెందవలయును. ఇంద్రియములను జయింపవలెను. కోరికలు లేకుండవలెను.

నిర్మల హృదయమున శ్రీహరిని ఆరాధించవలెను. అట్టి సాధు పురుషులకైన పరాత్పరునకు ప్రియము అట్టివారి ఎడ భగవంతుడు ప్రసన్నుడగును."

లోక మాలిన్యమును నాశనము చేయు భగవంతుని యశస్సు నారదుని ముఖతః విన్నారు ప్రాచేతసులు. శ్రీహరి పాదపద్మములు ధ్యానించుచు పరమపదము చేరుకున్నారు.

> పఠత్యశృణ్వయోచ్ఛ్రావయా(న్) రాజన్ రాజ్ఞాం హార్యర్పితాత్మవాన్
> ఆయుర్ధనం యశస్స్వస్తిగతి మైశ్వర్యమాప్నుయాత్.

రాజా! శ్రీహరికి మనసును అర్పించి ఈ చరిత్రవిన్నవానికి సిరిసంపదలు కలుగును. కీర్తియు శ్రేయస్సును కలుగును. అతడు తుదకు పుణ్యలోకములను చేరుకొనును.

పురంజనుని గాథ.

పూర్వము 'పురంజనుడు' అను రాజు ఉండెను. అతనికి 'అవిజ్ఞాతుడు' అను ఒక స్నేహితుడు కలడు. అతని చేష్టలు ఎవరును తెలుసుకొనలేక పోయిరి. పురంజనునకు విషయ భోగములు అనుభవించవలెనని అపరిమితమైన వాంఛ ఉండెను. అతడు తాను నివసించదగిన పట్టణము వెదకుచు బయలుదేరెను. అతడు భూమండల మంతయు తిరిగెను. కొండలు కోనలు వెదకెను. కాని తాను నివసించ దగిన పట్టణము లభించలేదు. అతడు అలసిపోయినాడు. నిరుత్సాహపడినాడు. అయినను తనకు నచ్చు పట్టణము వెదకుట మానలేదు.

తుదకు అతనికి ఒక పట్టణము కనిపించినది. అది హిమాలయపు దక్షిణ సానువుల వైపున ఉన్నది. కర్మక్షేత్రమైన భారత భూమి యందున్నది. అది సుందరమగు పట్టణము. అద్భుతమగు పట్టణము. దానికి తొమ్మిది ద్వారములున్నవి. పట్టణము చుట్టు ఎత్తయిన ప్రాకారమున్నది. లోహైన అగడ్తలున్నవి. చక్కని ఉపవనములు, విశాలములైన వీధులు, ఉన్నతములైన సౌధములు కలిగి అది ఎంతో రమ్యముగా ఉన్నది.

నగరమునకు బయట ఒక అందమైన ఉద్యానము కలదు. ఆతోట మధ్యన దివ్యమైన సరస్సున్నది. అచట వివిధ రకములైన పక్షిజాతులు ఆ వన శోభను ఇనుమడింప చేయుచున్నవి. ఆ వనమున స్వేచ్ఛగా విహరించుచున్న ఒక అందగత్తెను

పురంజనుడు చూచినాడు. ఆమె వెంట పదిమంది అనుచరులున్నారు. ప్రతి అను చరునకు వంద వంద నాయిక లున్నారు.

అయిదు పడగల పాము ఆ నగరమును రక్షించుచున్నది.

ఆమె కామరూపిణి, మంచి వయసులో ఉన్నది. ఆమె ముక్కు, ముఖము, చెక్కిళ్ళు, పలువరస అందము లొలికించుచున్నవి. శ్యామవర్ణముగా ఉన్న ఆమె చెవులకు కుండలములు తళ తళ మెరయుచున్నవి. ఆమె పిరుదులు ఎత్తుగా నున్నవి. ఘాటమరించిన ఆమె పాలిండ్లు ఒకదానిని ఒకటి ఒరుసుకొనుచున్నవి. ఆమె సిగ్గుపడుచు మాటిమాటికి పయ్యెదతో వక్షోజములను కప్పుకొనుచున్నది. వయ్యారము లొలికించుచు హంసవలె నడుచుచున్నది.

ఆమె తనకు తగిన భర్తకొరకు వెదకుచున్నది.

పురంజనుడు ఆమెను చూచినాడు. ప్రేమించినాడు. ఆమె వద్దకు వెళ్ళి, "సుందరీ! నీ వెవరు? నీ తలిదండ్రులెవరు? నీపేరేమి? నీ కడగంటి చూపులు నా గుండెను గాయములు చేయుచున్నవి. నీ దరహాసము నా మనసున మంట పెట్టుచున్నది. నీ కనుబొమల వంపులను ఆధారముగా చేసికొని పూలవిలుకాడు నా ప్రాణములు తీయుచున్నాడు. దేవీ! నాపై దయతలచవా? నన్ను అను గ్రహించవా? నన్ను పరిగ్రహించవా?" అని ప్రార్థించినాడు.

సుందరి పురంజనుని చూచినది. అతడు ఆమె గుండెకు గాలము వేసినాడు. ఆమెలో ప్రేమ జాలువారినది. ఆమె కరిగిపోయినది. అతనికి తనను అర్పించు కొనుటకు నిశ్చయించినది.

"రాజా! నీవంటి సుందరపురుషుని, కోరి వచ్చిన మగని వరించని ఆడది ఉండునా? నా తండ్రిని గురించి నన్ను గురించి అడిగినావు. చెప్పుచున్నాను వినుము. నా తండ్రి నాకు తెలియదు. నా పేరు నాకు తెలియదు. ఈ తక్కిన వారిని గాని వారి కులగోత్రములనుగాని ఎరుగను. ఈ పట్టణము ఎవరు నిర్మించినది ఎరుగను. ముందు దీనికి ఏమగునో ఎరుగను, వీరు నా సహచరులు. స్త్రీలు నా చెలికత్తెలు. పాము ఈ పట్టణమునకు ప్రతీహారి. పట్టణమును రక్షించును. నేను నిదురించునపుడు ఈ పాము మేలుకొని ఉండును.

నీవు ఈ పట్టణమునకు వచ్చుట నా అదృష్టము. నీవు ఇంద్రియ సౌఖ్యములు కోరుచున్నావు. నా సఖుల సహాయమునను నా చెలికత్తెల సహాయమునను నేనది

నెరవేర్పగలము. ప్రభూ! నీకు ఇచ్చిన సామగ్రిని స్వీకరింపుము. ఈ తొమ్మిది ద్వారముల పట్టణమున వందయేండ్లు వర్ధిల్లుము.

నిన్ను కాదని నేను ఎవరితో రమింతును? ఇతరులు రతి సౌఖ్యము ఎరుగని పశువులు. లోకచింతలోనే కాలము గడుపుదురు. ధర్మార్థ కామ మోక్షములు గృహస్థాశ్రమముననే ఉన్నవి. కేవల కైవల్య వాదులు శుష్కమతులు. ఈ సౌఖ్యములను ఊహించనైన లేరు.

మహాబాహూ! పాములవలె గుండ్రముగను, కోమలముగను, అందముగను ఉన్న నీ బాహుబంధమున కులుకుటకు అంగీకరించని స్త్రీ స్త్రీయా?
ఇదిగో ఇదే నన్ను నీకు అర్పించుకొనుచున్నాను'' అన్నది సుందరి.
పురంజనుడు సుందరివలలో పడి తన్ను తాను మరిచిపోయినాడు.
ఆ పట్టణమునకు రాజు ఈశ్వరుడు. ఆపట్టణమున పైన తొమ్మిది ద్వారములు— తూర్పు వైపు ఐదు, దక్షిణపు వైపు ఒకటి, ఉత్తరము వైపు ఒకటి, క్రింద రెండు పడమటివైపు ఉండెడివి.

తూర్పుద్వారముల పేర్లు:—

1. ఖద్యోత, 2. ఆవిర్ముఖి, రెండు ఒకచోట వున్నవి.
3. నళిని, 4. నాళిని, ఇవి రెండు కలిసి ఉన్నవి.
5. ముఖ్య, ముందుభాగమున ఉన్నది.
దక్షిణ ద్వారము—పితృహూ
ఉత్తర ద్వారము—దేవహూ
పడమటి ద్వారములు రెండు—1. అగురి 2. నిర్ఋతి.

ఆ పట్టణపు పౌరులలో నిర్వాకుడు, పేశస్కారుడు అను ఇద్దరు గుడ్డి వాళ్ళు ఉండువారు. వారి సహాయముననే కాకపోకలు మున్నగు అన్ని పనులు చేయువాడు పురంజనుడు.

విషూచీనునితో కలిసి అంతఃపురమునకు వెళ్ళువాడు.

పురంజనుడు కామాసక్తుడై పోయినాడు. కర్మాసక్తుడై పోయినాడు. సుందరిచేతి కీలుబొమ్మయిపోయినాడు.

ఆమె త్రాగిన అతడు త్రాగువాడు. ఆమె ఆడిన అతడు ఆడువాడు. ఆమె నవ్విన అతడు నవ్వువాడు. ఆమె పాడిన అతడు పాడువాడు. ఆమె తిన్న తాను తిను

వాడు. ఆమె విచారముగానున్న తాను విచారముగా నుండువాడు. ఆమె ఉల్లాసముగానున్న అతడు ఉల్లాసముగా ఉండువాడు.

సుందరి వలలో పడినాడు పురంజనుడు. మతి పోగొట్టుకున్నాడు. తోలుబొమ్మ అయినాడు. సుందరి ఆడించినట్లెల్ల ఆడసాగినాడు.

ఒకనాడు పురంజనుడు వేటకు బయలుదేరినాడు. కవచము వేసుకొని అక్షయ తూణీరములు తీసుకొని రథము ఎక్కినాడు.

ఆ రథమునకు అయిదు గుర్రములు పూన్చియున్నవి. గుర్రములు గాలిలో ఎగిరి పోగలవి. ఆ రథమునకు రెండు పటికోలలు, రెండు చక్రములు, ఒక ఇరుసు ఉన్నవి. మూడు ధ్వజములు, అయిదు కట్లు, ఒక పగ్గము. ఒక సారథి ఉన్నాడు. కూర్చుండుటకు ఒకేస్థలమున్నది. రెండు పూజాలు, ఏడు కవ్పులు అయిదు విక్రమములు ఉన్నవి.

రథమంతయు బంగారముచే అలంకరించబడి వున్నది.

వేటమీద మోజుపడి పురంజనుడు భార్యను మరచినాడు. అహంకారమున అడవిలోదూరి దయా దాక్షిణ్యములు వదిలి భయంకర మూర్తి దాల్చినాడు. నిశిత ములైన శరములతో ఏ పాపము ఎరుగని అమాయక జంతువులను వేటాడినాడు.

వేటాడి వేటాడి తుదకు అలసిపోయినాడు. ఆకలి అధికమైనది. దాహమున గొంతు అర్చుకొనిపోయినది. వేట ఆపి ఇంటికి బయలుదేరినాడు. స్నానాదులు ముగించి విశ్రాంతి తీసుకున్నాడు. నిద్రలేచినాడు. అలంకరించుకున్నాడు. సుందరిని తలచుకున్నాడు. కామము పడగ విప్పినది. వెంటనే సుందరి కొరకు వెళ్ళినాడు. ఎంత వెదకినను ఆమె కనిపించలేదు. అంతఃపురస్త్రీలను అడిగినాడు. మాకు తెలియదన్నారు వారు. వెదుకగా వెదుకగా తుదకు ఆమె కనిపించినది. శరీర సంస్కారములేక కటిక నేలమీద దుమ్ములో పడివున్నది. ఆమెను చూచి కలత చెందినాడతడు. బాధపడినాడు, ఆమె వద్దకు పరుగెత్తినాడు. ఓదార్చినాడు. నచ్చచెప్పినాడు.

'నా ముద్దుల రాణీ! నీ అనుమతిలేక వేటకు వెళ్ళి నేరము చేసినాను. నిజమే అపరాధినే. ఇదిగో ఎంతబాధపడుచున్నానో చూడుము. నేను నీవాడను కదా! నా అపరాధము మన్నించుము. నన్ను క్షమించుము. చూడుము మన్మథ బాణము

తాకిడికి ఎట్లయినదో నా స్థితి. దేవీ! ప్రసన్నురాలవు కమ్ము" అని ప్రతిమి లాడినాడు.

సుందరి ప్రసన్నురాలైనది. అతనిని కౌగిలించుకున్నది. అతడు ఆమెను కౌగిలించుకున్నాడు.

శిశిరము వసంతమైనది.

ఎండ వెన్నెల అయినది.

కాలము కర్పూరమువలె కరగిపోయినది.

సుందరి పదకొండువందలమంది పుత్రులను నూటపదిమంది పుత్రికలను కన్నది. వారికి పౌరంజనులని పేరువచ్చినది.

వారందరికి తగిన వధువులను, తగిన వరులను ఇచ్చి పెళ్ళిళ్ళు చేసినాడు పురంజనుడు. పుత్రులు పదకొండు వందల మందికి ఒక్కొక్కరికి నూరుగురు పుత్రులు కలిగినారు. వారి సంతతి పాంచాలదేశమంతటను వ్యాపించినది.

పురంజనుని సగము ఆయువు గతించినది.

ఆ వేళలో ఆ పట్టణముపై దాడి జరిగినది. దాడిచేసినవాడు చండవేగుడు అను గంధర్వరాజు. మూడువందల అరువది గంధర్వులకు అధిపతి. ఆ మూడువందల అరవైమందికి మూడు వందల అరవైమంది భార్యలు. ఆ గంధర్వ స్త్రీలలో సగముమంది తెల్లగను సగముమంది నల్లగను ఉందురు. వారు ఎల్లప్పుడు తమ భర్తలతో కలిసి మిథున భావమున తిరుగుచు వరుస క్రమమున కామ వినిర్మితమైన పట్టణమును దోచుకొనుచుందురు.

తన అనుచరుల సహితముగా చండవేగుడు పురంజనుని పట్టణమును ముట్టడించినాడు. ప్రజాగరుడైన అయిదు పడగల పాము స్త్రీపురుషులు కలసి ఏడువందల అరవై మందిని ఎదిరించి పోరాడసాగినది. పోరాడి పోరాడి ప్రజాగరుడు అలసిపోయినాడు. రాజ్యము నందలి ప్రజలు భయపడి పోయినారు. భార్య కౌగిలి తప్ప అన్యము ఎరుగని పురంజనుడు ఇట్టి ఉపద్రవమును గురించి కలలో సహితము తలచలేదు.

మరొక దాడి కాలకన్యక చేసినది. ఆవిడ కాలుని కూతురు. తన వరుని కొరకు వెదకుచు మూడు లోకములు తిరిగినను ఆమెను పెండ్లాడుటకు ఎవరును అంగీక

రించలేదు. ఒకసారి నారదుని వద్దకేగి తనను పెండ్లాడ వలసినదని కోరినది. అతడు నిరాకరించినాడు. అందువలన కోపము వచ్చి "నా కోరిక మన్నించనందున నిలకడ లేక తిరుగుదువుగాక !" అని శపించినది.

ఆమె యవనరాజు వద్దకు వెళ్లినది. తనను పెండ్లాడ వలసినదని కోరినది. "ఓ యవనరాజా ! నీవు వీరాధి వీరుడవు. నన్ను పెండ్లాడు. నిన్ను ఆశ్రయించిన వారి సంకల్పము వ్యర్థాకావని నాకు తెలియును. అడరి అడిగిన ఇచ్చుట మగవాని పురుషార్థము. నీవు మగసిరి గలవాడవని నాకు తెలుసు. రాజా ! నన్ను కట్టుకొనుము. నేను నిన్ను రక్షింతును" అన్నది.

కాలకన్యమాటలు యవనరాజు విన్నాడు. అతడు రహస్యమైన ఒక కార్యము సాధించవలసి ఉన్నందున ఆమెతో ఇట్లనెను :—

"నీవు దరిచేరినవాని మూలుగులు పీల్చెదవు. నిన్ను పెండ్లాడుటకు ప్రతివాడు భయపడును. కాబట్టి కర్మవలన పుట్టిన లోకమును కనిపించకుండ భోగించుము. నా సైన్యసహాయమున ప్రజలందరను భోగించుము. ఇప్పుడు నీవు నాకు సోదరివి అయినావు. నా అన్న ప్రజ్వారునితో కలిసి ఈ లోకమంతటిపై దాడిచేయగలను. నీవు నా వెంట ఉండి సహాయపడుము."

కాలకన్య ఒప్పుకున్నది.

యవనరాజు దండయాత్రకు బయలుదేరినాడు. భయుని చేతిలో ఉన్న ప్రజ్వారుడు కాలకన్యతో కలిసి పురంజనుని పట్టణమును ముట్టడించినాడు. కాలకన్య పురంజనుని పట్టణ ప్రజలతో బలవంతముగా భోగించసాగినది. ఆమెచే భోగింపబడిన వారందరు నిర్వీర్యులై పడిపోవుచున్నారు. యవనరాజు నాలుగువైపుల గల వేరువేరు వాకిళ్ళనుండి పట్టణమున చొరబడినాడు. పట్టణము నాశనము చేయుచు పురంజనుని నానాబాధలు పెట్టినాడు.

కాలకన్య పురంజనుని కౌగిలించుకున్నది. అతని సిరి, సంపద, ఆరోగ్యము అన్నియు ఉడిగిపోయినవి. అటు గంధర్వరాజు ఇటు యవనరాజు ఐశ్వర్యమంతయు కొల్లగొట్టినారు. తాను అంతగా మోహించిన భార్య పెడముఖము పెట్టినది. కాలకన్యక ఎంగిలికూడే అతనికి గతి అయినది. అయినను తనవారిని వదలుటన్న ప్రాణసంకటముగా ఉన్నది. ఎంతో దుఃఖించినాడు పురంజనుడు.

కాలకన్యనోట పట్టణము పడుట చూచిన అయిదుపడగల సర్పము బాధపడినది. దాని ఉనికిపట్టును యవనులు ఆక్రమించినారు. ప్రజ్వారుడు దానిమీద కత్తికట్టి

నాడు. పట్టణము రక్షించు శక్తిలేక బాధపడినది. చెట్టు తొఱ్ఱకు అగ్ని అంటు కున్న అందులోని పాము గింజుకున్నట్లు అయిదుపడగల పాము పట్టణము వదలి పెట్టుటకు గింజుకొనసాగినది. గంధర్వులు దానిని చావకొట్టినారు. యవనులు పారిపోకుండ అడ్డుకున్నారు.

పురంజనుడు భార్యను బిడ్డలను గురించి దుఃఖించుటను అవకాశముగాకొని యవన రాజు భయుడు అతనిమీద పడినాడు. యవనులు అతనిని పట్టి కట్టి పశువువలె గుంజుకొని పోయినారు. అతని అనుచరులు, అయిదుపడగల పాము అతనినే అనుసరించినారు. అయిదుపడగలపాము వదలిపెట్టగనే పట్టణమంతయు చిందర వందర అయిపోయినది. యవనరాజు ఈడ్చుకొని వెళ్ళునపుడు తన పాతస్నేహితు లను సహితము తలచుకొనలేక పోయినాడు పురంజనుడు.

మతిపోయి సంవత్సరముల తరబడి కటిక చీకటిలోపడి కష్టపడినాడు పురంజనుడు. అంత్యకాలమున సహితము ఆడదానిపై ధ్యాసపెట్టుకున్నందున మరుసటి జన్మలో ఆడజన్మము ఎత్తినాడు.

అతడు విదర్భరాజు కూతురుగా జన్మించినాడు. కూతురుకు పెండ్లి ఈడు రాగానే స్వయంవరము చాటించినాడు రాజు. "రాజులందరను జయించి పరాక్రమవంతు డైన ఉత్తమ వరునకు నా కూతురును ఇత్తును" అని చాటించినాడు.

పాండ్రిదేశపురాజు మలయధ్వజుడు పందెమున రాజకూతురును గెలుచు కున్నాడు. పెండ్లిచేసుకున్నాడు. మలయధ్వజుడు ఆమెవలన ఒక కూతురును, ఏడుగురు పుత్రిలను కన్నాడు. ఏడుగురు పుత్రిలు ద్రావిడదేశమునకు రాజు లైనారు. వారికి ఒక్కొక్కరికి ఒక్కొక్క అర్బుదము చొప్పున పుత్రులు కలిగి నారు. వారి వంశస్థులు ఆ మన్వంతరమునందును తరువాతను భూమండల మంతయు పాలించినారు.

మలయధ్వజుని కూతురు వ్రితశీలను' అగస్త్యుడు వివాహము చేసుకొన్నాడు. ఆమెకు దృఢచ్యుతుడను కుమారుడు కలిగినాడు.

మలయధ్వజుడు కుమారులకు రాజ్యము పంచిపెట్టి శ్రీకృష్ణుని ఆరాధించుటకు గాను మలయ పర్వతమునకు వెళ్ళిపోయినాడు. చంద్రిని అనుసరించు చంద్రిక వలె విదర్భరాజు కూతురుకూడ అతనిని అనుసరించినది.

మలయధ్వజుడు సమదృష్టి అలవరచుకొని జితేంద్రియుడైనాడు. వాసుదేవునిపై మనసు లగ్నముచేసి వంద దివ్యసంవత్సరములు స్థాణువువలె ఉండి తపమాచ

రించినాడు. తుదకు తనశరీరమును పంచభూతములందు కలిపి పంచత్వము నొందినాడు.

మలయధ్వజుడు మరణించినను స్థిరముగా కూర్చొని ఉన్నాడు. అతడు మరణించినాడని ఎరుగదు మహారాణి. ఎప్పటివలె భర్తపాదము సేవించుటకు తాకగా అవి చల్లగా తగిలినవి. ఆమె చల్లదనమునకు ఉలికిపడినది. వలవల ఏడ్చినది. అడవిలో దిక్కులేనిదై కన్నీరు కాలువలుకట్టగా ఏడ్చినది.

ఆమె ఏడ్పుతో అడవి ప్రతిధ్వనించినది. తుదకు తనకుతానే ఓదార్చుకున్నది. కట్టెలుతెచ్చి చితిపేర్చి, భర్తకళేబరమును ఆ చితిమీదపెట్టి నిప్పు అంటించినది. భర్తతో సహగమనము చేయుటకు నిశ్చయించినది.

ఇంతలో ఒక బ్రాహ్మణుడు మెరుపువలె ప్రత్యక్షమైనాడు. అతడు ఆమెకు పాత స్నేహితుడు. ఆత్మవంతుడు. ఆమెను ఓదార్చుచు ఇట్లన్నాడు :—

"తల్లీ ! నీ పాత స్నేహితుడను నేను. పూర్వము మనము ఇద్దరము కలసి తిరిగినాము. గుర్తుతరాలేదా ! నీవు పురంజన మహారాజువుకావా ! నేను అవిజ్ఞాతుడను నీ స్నేహితుడనుకానా ? నీవు విషయ సుఖములు అనుభవించుటకుగాను నన్ను వదలిపెట్టి నివాసస్థానము వెదకుచు వెళ్ళలేదా !

పూర్వము నీవు నేను భేదములేని స్నేహితులవలె ఉండువారలము. మానస సరోవరమునందలి హంసలవలె వెయ్యేళ్ళు కలిసిమెలిసి జీవించినాము. నీవు నన్నువదలి భూమండలమంతయు తిరిగి తొమ్మిది ద్వారములుగల పట్టణమున ప్రవేశించినావు. అచట ఒకరాణి వలలో పడినావు. ఆమెతో ఉండి నన్నుమరచినావు. అందువలననే నీకు ఈ దుర్దశపట్టినది.

ఇప్పుడు వాస్తవము గ్రహింపుము. నీవు విదర్భరాజు కూతురువు కావు. మలయధ్వజుడు నీ భర్తకాడు. నీవు పురంజనుని పట్టణపు సుందరి భర్తవుకూడకావు. గతజన్మలో పురుషుడననీ ఈ జన్మమున స్త్రీననీ భావించుచున్నావు. ఇదంతయు నేను సృష్టించిన మాయ. వాస్తవమునకు నీవు పురుషుడవుగాని స్త్రీవిగానికావు. మన నిజమైన స్వరూపములను అర్థముచేసికొనుము.

వాస్తవము తెలుసుకొనుము. నేనేనీవు. నీవేనేను. నేనువేరు నీవువేరుకాదు. జ్ఞానులు మన ఇద్దరమధ్యన అంతరము గమనించరు. ఒకవ్యక్తి ఒకసారి తనప్రతిబింబమును అద్దములో చూచుకొనును. మరొకసారి ఇంకొకరికంటిపాపలో తన ప్రతిబింబ

మును చూచుకొనును. అట్లే తెలియనివారు మనను రెండుగా భావింతురు. రూపము ఒక్కటియే. ప్రతిబింబములు రెండు.

ఇట్లు ఈశ్వరుడైన హంస హెచ్చరించుటతోడనే జీవుడనుహంస గ్రహించినది.
ఆత్మజ్ఞానమును జ్ఞప్తికితెచ్చుకున్నది.
ఆత్మ ఆ పరమాత్మలో లీనమైనది.

అంతరార్థము

మనము పురంజనుని కథయొక్క అంతరార్థము తెలుసుకొందము. నారదమహర్షి ప్రాచీనబర్హికి ఈ కథచెప్పి దీని అంతరార్థమును విశదపరచినాడు. అది తెలుసుకొనియే ప్రాచీనబర్హి జ్ఞానియైనాడు.

పురంజనుడు అనగా జీవుడు.

అతడు ఒకటి, రెండు, నాలుగు, ఎన్నోపాదముల శరీర మను పట్టణమును నిర్మించుకొనును.

అవిజ్ఞాతుడు ఈశ్వరుడు.

అతనికి గుణకర్మలులేవు. అందువలన అతడు అజ్ఞాతుడు.

పట్టణము మానవశరీరము.

దానికి నవరంధ్రములను తొమ్మిది ద్వారములు, రెండు కనులు, రెండు ముక్కు పుటములు, ఒక నోరు. ఈ అయిదు తూర్పుద్వారములు కుడిచెవి దక్షిణ ద్వారము. ఎడమచెవి ఉత్తరద్వారము. గుదస్థానము, లింగము పడమటి ద్వారములు.

సుందరి అవిద్యతోకూడిన బుద్ధి.

బుద్ధివలననే అహంకార మమకారములు ఏర్పడును.

పదిమంది సఖులు పది ఇంద్రియములు.

చెలికత్తెలు ఇంద్రియముల ప్రవృత్తులు.

అయిదుపడగలపాము ప్రాణము, ఉదానము, అపానము, సమానము, వ్యానము అను వృత్తులుగల ప్రాణవాయువు.

బలవంతుడైన పదకొండవయోధుడు మనసు.

పాంచాలదేశము, శబ్దము మున్నగు అయిదు విషయములు.
గ్రుడ్డివాడైన పౌరులు కాలుచేతులు.
అంతఃపురము హృదయము.
ఇక రథపు విషయము :—
రథము శరీరము.
అయిదు గుర్రములు అయిదు జ్ఞానేంద్రియములు.
రెండు చక్రములు పాపము, పుణ్యము.
మూడు ధ్వజములు సత్వరజస్తమములను మూడు గుణములు.
అయిదుకట్లు అయిదు ప్రాణములు.
పగ్గము మనసు.
సారథి బుద్ధి.
ఒకే ఉనికిపట్టు హృదయము.
అయిదు ఆయుధములు పంచేంద్రియ విషయములు
ఏడు కవచాలు ఏడు ధాతువులు.
అయిదు విక్రమములు అయిదు కర్మేంద్రియములు.
వేటకువెళ్ళుట ఎండమావులవంటి విషయములకై పరుగెత్తుట.
వేట ఇంద్రియములచే విషయభోగములను అనుభవించుట.
చండవేగుడు, సంవత్సరము.
మూడువందల అరవైమంది గంధర్వులు.
మూడువందల అరవై దినములు. నలుపుతెలుపు గంధర్వాంగనలు రాత్రింబవళ్ళు.
అవి ఒకదానివెంట ఒకటి తిరుగుచు ఆయువును హరించును.
కాలకన్య వార్ధక్యము. దానిని ఎవరును వరించరు,
యవనరాజు మృత్యువు. వార్ధక్యమను కాలకన్యను చెల్లెలిగా స్వీకరించినాడు.
యవనరాజు సైన్యము వ్యాధులు.
ప్రజ్వారుడు శీతోష్ణ జ్వరములు.
ఈ విధముగా దేహాభిమానముగల జీవుడు అజ్ఞానాంధకారమునబడి అనేక కష్టములు అనుభవించుచు వందసంవత్సరములు దేహమున పడిఉండును.

జీవుడు నిర్గుణుడు అయినప్పటికి ప్రాణము, ఇంద్రియములు, మనసు గుణములు తనలో ఆరోపించుకొని అహంకార మమకారములు పెట్టుకొని వివిధములైన కర్మలు చేయును.

జీవుడు స్వయంప్రకాశకుడు అయినప్పటికి అతడు పరమేశ్వర స్వరూపమును తెలుసుకొనునంతవరకు మూడుగుణములమీద ఆధారపడి కర్మములు చేయును. ఆ కర్మముల ననుసరించి వేరువేరు జన్మములు ఎత్తును.

సాత్విక కర్మములుచేసిన స్వర్గాది శ్రేష్ఠలోకములను పొందును.

రాజసకర్మములుచేసిన దుఃఖమయములైన రజోగుణలోకములను పొందును.

తమోగుణకర్మములు చేసినవాడు మిక్కిలి దుఃఖము అనుభవించు తమోయోనుల యందు జన్మించును.

అజ్ఞానాంధకారమున పడిన జీవుడు ఒకప్పుడు స్త్రీజన్మము, ఒకప్పుడు పురుష జన్మము వేరొకప్పుడు నపుంసకజన్మము ఎత్తును.

కడుపుమంటతో తిరుగు ఊరకుక్క ఒకచోట తన్నులుతినును. వేరొకచోట ఎంగిలిమెతుకులు గతుకును. విషయవాసనలకు లొంగినజీవుడు అధోలోకమునను, మర్త్యలోకమునను తిరుగుచు తన కర్మానుసారము సుఖదుఃఖములు అనుభవించు చుండును. ఈ దుఃఖములు వదలిపోవుట అనిఉండదు. నెత్తిమీదిబరువు బుజము మీదకు మార్చుకుందుము అందువలన బరువుతగ్గదు కాని తగ్గినట్లు భావింతుము. కష్టములు తగ్గినవనుకొనుటయు అట్టిదే.

ఒక దుఃఖము తగ్గిన వేరొక దుఃఖము సిద్ధముగానుండును.

కల వలన కల ఎన్నటికిని కరుగదు అట్లే కర్మవలన కర్మ తరిగిపోదు. కర్మ, కర్మ ఫలానుభవము రెంటును అవిద్యవలన వచ్చినవే.

కలలో స్వప్నపదార్థములు నిజమని కనిపించినట్లు ఈ జగము నిజముకాకున్నను నిజమైనట్లు కనిపించును.

అజ్ఞానమగు నిద్ర వదలినగాని ఈ జననమరణాదుల సంసారమునుండి జీవునకు విముక్తి లేదు.

పరమాత్మస్వరూపుడైన వాసుదేవునిపై ఏకాగ్రభక్తి ఏర్పడగనే జ్ఞానము కలుగును. తద్వారా వైరాగ్యము కలుగును.

శబ్దాది విషయములతోకూడిన లింగదేహము ఉన్నంతవరకు అహంభావము, స్థూల దేహసంబంధము వదలవు.

నిద్ర, మూర్ఛ, అధికదుఃఖము, తీవ్రజ్వరము, మృత్యువు కలిగినపుడు అహంకార మమకారములు ఉండవు.

పౌర్ణమినాడు నిండుగాకనిపించు చంద్రబింబము అమావాస్యనాడు సహితము ఉండును కాని కనిపించదు. ఇంద్రియముల నిండుపరిణామము పొందని గర్భావస్థ యందును, బాల్యావస్థయందును లింగశరీరము ఉండియు కనిపించదు.

కలలోనిది ఏదియు యథార్థముకాదు. అయినను మేలుకొనిననే కాని కలలోని అనర్థము తొలగిపోదు. ప్రపంచమందలి వస్తువులు అసత్యమైనవి అయినవ్వటికి అజ్ఞానము వదలినగాని వాటినుండి విముక్తి కలుగదు.

జలగ మరొక గడ్డిపరకను పట్టుకొనునంతవరకు తాను పట్టుకున్న గడ్డిపరకను వదలదు. మరణసమయము వచ్చినను జీవుడు మరొక దేహమునకు సంబంధించిన కర్మలు అవలంబించనిదే పూర్వదేహము మీది అభిమానము వదలడు.

ఈ జగత్తు పరమాత్మునివలన సృజించబడి అతనివలననే నిలచిఉండి అతనివలననే నాశనమగుచున్నది. కాబట్టి ఈ ప్రపంచమును భగవత్స్వరూపముగా భావించవలెను. అజ్ఞానమును తొలగించుటకు ఏకాగ్రచిత్తమున భగవంతుని భజించవలెను.

పరోక్షరూపమైన పురంజనునిగాథ అద్భుతమైనది. అధ్యాత్మ తత్వముతో నిండి ఉన్నట్టిది. దీని అంతరార్థమును గ్రహించిన బుద్ధిమంతుడు దేహాభిమానమును త్యజించును.

ఇది చతుర్థస్కంధము.

శ్రీమద్భాగవతము

పంచమ స్కంధము

ప్రియవ్రతుడు

స్వాయంభువమనువునకు శతరూపవలన ఇద్దరు పుత్రులు కలిగినారు. ఒకడు ప్రియవ్రతుడు. రెండవవాడు ఉత్తానపాదుడు. ధ్రువచరిత్రమున ఉత్తానపాదుని చరిత్ర చదివినాము. ప్రస్తుతము ప్రియవ్రతునిగూర్చి తెలుసుకొందము.

ప్రియవ్రతుడు పరమభాగవతుడు. నారదుని పాదములను సేవించి పరమార్థతత్త్వము గ్రహించినాడు. బ్రహ్మసత్రదీక్షపూని ఎల్లప్పుడు పరబ్రహ్మచింతనమందే ఉండువాడు. కుమారుడు ప్రయోజకుడు అయినాడని భావించి స్వాయంభువు రాజ్యభారమును అతనికి అప్పగించినాడు. పితాజ్ఞ అనుల్లంఘనీయమైనను రాజ్యాధికారము వలన ఆలుబిడ్డలు మున్నగు సంసార వ్యామోహమునకు లోబడి అధఃపతనము కావలసివచ్చునని ప్రియవ్రతుడు రాజ్యమును అంగీకరించలేదు. అతని చిత్తము సదా పరమాత్మునిపై లగ్నమై ఉండెడిది.

ప్రపంచమున ప్రజావృద్ధి కావలయునని ఆలోచించు బ్రహ్మదేవుడు ప్రియవ్రతుని అభిప్రాయమును గమనించినాడు. గంధమాదన పర్వతమున తపస్సుచేయుచున్న ప్రియవ్రతునకు ప్రత్యక్షమైనాడు. అప్పటికే ఆత్మబోధ చేయుటకుగాను వచ్చిన నారదుడు, రాజ్యోన్ముఖుని చేయుటకు వచ్చిన స్వాయంభువు అచటనే ఉన్నారు.

వారు బ్రహ్మదేవుని చూచినారు. ముగ్గురులేచి నిలబడి చేతులు జోడించి నమస్కరించినారు. పూజించినారు. వారిపూజ అందుకొని చిరునవ్వు నవ్వుచు మధుర వాక్కులతో ప్రియవ్రతునితో ఇట్లనెను:—

> "నిద్రలేచిన మనుష్యుడు కలలోని విషయములు తలంపునకు తెచ్చుకున్నట్లు ముక్తపురుషుడు సహితము ప్రారబ్ధకర్మల అనుభవించుటకు దేహమును ధరించును. కాని అతనికి ధర్మవాసనలు అంటవు. విషయలోలురైన పురుషుడు అరణ్యమందు తిరిగినను జనన మరణ భయము వదలక వెంటాడుచుండును. ఆత్మజ్ఞానము కలిగి, జితేంద్రియులైన పురుషుల అరణ్యమందున్నను, ఇంటియందున్నను భేదములేదు.



గంధమాదనముపై తపమాచరించుచున్న ప్రియవ్రతుని రాజ్యోన్ముఖుని
గావించుట కేతెంచిన బ్రహ్మకు నారదుడు, స్వాయంభువుడు
ప్రియవ్రతుడు నమస్కరించుట. పుట. 178

> బలవంతుడైనరాజు కోటలో ఉండి శత్రువులను గెలుచుకొనును. అరిషడ్వర్గములను జయించదలచినవాడు గృహస్థాశ్రమమున ఉండియు వానిని గెలువవచ్చును. శ్రీహరి పాదపద్మము అను దుర్గమును ఆశ్రయించి మేము అరిషడ్వర్గములను జయించినాము. అయినను పరాత్పరుడు ప్రసాదించిన భోగములు అనుభవించిన తరువాతనే నిస్సంగులమై ఆత్మరూపము ధరించినాము.''

బ్రహ్మదేవుడు చెప్పిన మాటలువిన్న ప్రియవ్రతుడు ''దేవా! నీ ఆజ్ఞ శిరసా వహింతును'' అని చేతులు జోడించినాడు.

మనువు సంతోషించి రాజ్యభారము కుమారునకు అప్పగించి విషపూరితమైన జలాశయమువంటి గృహస్థాశ్రమమును విడిచినాడు.

ప్రియవ్రతుడు మహారాజై రాజదండము చేతబట్టియు శ్రీహరి పాదారవిందములపైననే మనసును లగ్నముచేసినాడు.

ప్రియవ్రతుడు విశ్వకర్మపుత్రికయగు బర్హిష్మతిని వివాహమాడినాడు. ఆమెకు పదిమంది పుత్రులు కలిగినారు. వారు అగ్నీధ్రుడు, ఇధ్మజిహ్వుడు, యజ్ఞబాహుడు, మహావీరుడు, హిరణ్యరేతుడు, ఘృతపృష్ఠుడు, సవనుడు, మేధాతిథి, వీతిహోత్రుడు, కవి అను అగ్నినామములు కలవారు. వారి తరువాత బర్హిష్మతికి ఊర్జస్వతి అను ఒక కూతురుకూడ కలిగినది.

ప్రియవ్రతునకు మరొకభార్యవలన ఉత్తముడు, తామసుడు, రైవతుడు అను ముగ్గురు పుత్రులు కలిగినారు.

కవి, సవనుడు, మహావీరుడు బాల్యముననే బ్రహ్మచారులై భక్తియోగమును అవలంబించినారు. శ్రీహరి ప్రత్యక్షము అయినతరువాత పరమాత్మలో లీనము అయినారు.

ప్రియవ్రతుడు పదకొండు అర్బుదముల సంవత్సరములకాలము రాజ్యము పాలించినాడు. అతడు తన దృఢమైన చేతులతో ధనుస్సు పట్టినగాని, అల్లెత్రాడు మ్రోగించినగాని శత్రువులు, ధర్మద్రోహులు గడగడవడకువారు.

బర్హిష్మతి ఎడల అతనికి అపారమైనప్రేమ ఉండెడిది. అతనిప్రేమ దినదినాభివృద్ధి నందుచుండెడిది. అతడు లోకమేమరచి అంతఃపురమున భోగము లను

అయినను అతడు తనవిధులఎడ ప్రమత్తుడుకాలేదు. సూర్యభగవానుడు సుమేరు పర్వతమును చుట్టివచ్చుటద్వారా లోకమునకు రాత్రింబవళ్ళు కల్పించుచున్నాడు. అతనిరథము సుమేరు పర్వతమునకు ఒకప్రక్క ఉన్నపుడు వేరొకప్రక్క చీకటి ఉండెడిది. సగము భూమండలము అంధకారమునఉండుట అతనికి నచ్చలేదు. అర్ధప్రపంచము వెలుగులోఉండగా మిగతా అర్ధప్రపంచము చీకటిలో ఏలఉండవలెను? అని ఆలోచించినాడు. అతడు సూర్యునిరథమువంటి జ్యోతిర్మయమైన రథమునెక్కి రెండవసూర్యునివలె సూర్యునివెంట బయలుదేరినాడు. సూర్యుడు అస్తగిరి చేరువరకు తాను ఉదయగిరి చేరువాడు. సూర్యుడు ఉదయగిరి చేరువరకు తాను అస్తగిరి చేరువాడు. ఇట్లు లోకమును అంధకారపు బెడదనుండి రక్షించినాడు.

అట్లు ఏడుమారులు మేరు పర్వతము చుట్టుతిరిగిన తరువాత బ్రహ్మదేవుడువచ్చి, "ఇట్లు రాత్రిని పగలుచేయుటకు నీకు అధికారములేదు" అని వారించగా మానుకున్నాడు;

ప్రియవ్రతుడు ఏడుమారులు మేరువు ప్రదక్షిణము చేసినందున ఏడు గోతులు ఏర్పడి ఏడు సముద్రములైనవి. ఏడు ద్వీపములు ఏర్పడినవి. అవి 1. జంబూ ద్వీపము. 2. ప్లక్షద్వీపము. 3. శాల్మలిద్వీపము. 4. కుశద్వీపము. 5. క్రౌంచ ద్వీపము. 6. శాకద్వీపము. 7. పుష్కరద్వీపము అనునవి. అతని రథచక్రములచే ఏర్పడిన ఏడు సముద్రములు 1. ఉప్పు సముద్రము, 2. చెరుకు సముద్రము, 3. కల్లు సముద్రము, 4. నేతి సముద్రము, 5. పాల సముద్రము, 6. పెరుగు సముద్రము, 7. మంచినీటి సముద్రము.

జంబూద్వీపమునకు	అగ్నీధ్రుని
ప్లక్షద్వీపమునకు	ఇధ్మజిహ్వుని
శాల్మలీద్వీపమునకు	యజ్ఞబాహుని
కుశద్వీపమునకు	హిరణ్యరేతుని
క్రౌంచద్వీపమునకు	ఘృతపృష్ఠుని
శాకద్వీపమునకు	మేధాతిథిని
పుష్కరద్వీపమునకు	వీతిహోత్రుని

అభిషేకించినాడు ప్రియవ్రతుడు.

కూతురు ఊర్జస్వతిని శుక్రాచార్యునకు ఇచ్చి పెండ్లిచేసినాడు. ఆ దంపతులకు దేవయాని జన్మించినది.

రాజ్యమును పుత్రులకు అప్పగించి రాజ్యలక్ష్మిని మృతదేహమువలె విడిచి భగవంతుని లీలల దలచుచు తిరిగి నారదుడు చూపిన మార్గమును అవలంబించినాడు ప్రియవ్రతుడు.

ప్రియవ్రతకృతం కర్మ కోనుకుర్యాద్వినేశ్వరం
యోనేమి నిమ్నైరకరోచ్ఛాయాం ఘ్నన్ సప్తవారిధీన్
భూసంస్థానం కృతం యేన సరిద్గిరి వనాదిభిః
సీమా చ భూతి నిర్వృత్యై ద్వీపేద్వీపే విభాగశః
భౌమం దివ్యం మానుషంచ మహిత్వం కర్మయోగజం
యశ్చక్రే నిరయౌపమ్యం పురుషాను జనప్రియః

ప్రియవ్రతుడు చేసినపనులు భగవంతుడు తక్క ఎవడు చేయగలడు ? రాత్రిని పగలు చేయుటకుగాను రథమునెక్కి, రథచక్రములచే ఏడు సముద్రములు సృష్టించినాడు.

ప్రాణుల క్షేమముకొరకు భూమండలమును ద్వీపములుగా విభజించి ప్రతిద్వీపము నందును వేరువేరునదులు, పర్వతములు, అడవులు ఎల్లలు నిర్ణయించినాడు.

విష్ణు భక్తుడైన ప్రియవ్రతుడు స్వర్గ, మర్త్య, పాతాళములను సర్వసంపదలను నరకమువలె భావించినాడు.

అ గ్నీ ధ్రు డు.

ప్రియవ్రతుడు అగ్నీధ్రుని జంబూద్వీపమునకు రాజునుగాచేసినాడు. అతడు ధర్మ మార్గమును అవలంబించి రాజ్యమును పరిపాలించినాడు. ప్రజలను కన్నబిడ్డలవలె కాపాడినాడు.

అతడు సంతానార్థియై మందరపర్వతమునకు వెళ్ళినాడు. అక్కడ ఒక గుహలో కూర్చుని బ్రహ్మనుగూర్చి తపస్సు ప్రారంభించినాడు. బ్రహ్మదేవుడు అగ్నీధ్రుని అభిప్రాయము తెలుసుకొన్నాడు. దేవసభలోని నర్తకి పూర్వచిత్తిని అగ్నీధ్రుని కొరకు మందర పర్వతమునకు పంపినాడు.

అందాలరాశియైన పూర్వచిత్తి గుహ ఎదుట ఉన్న ఉద్యానవనమున విహరించి నది. అగ్నీధ్రుడు పూర్వచిత్తిని చూచినాడు. గుండెలో మన్మథుడు ప్రవేశించి నాడు. ఆత్మనిభునిపోయినది అమెను తలబడుచు ఇటు పలుకరించినాడు :—

"మునీంద్రా! ఎవరునీవు? భగవంతుని మాయవా? చక్కని మునిగా సిద్ధమై ఏతెంచితివా?"

తడబాటులో అతడు పూర్వచిత్తిని పురుషుడుగానే సంబోధించినాడు.

అల్లెత్రాళ్ళులేని రెండుధనుస్సుల (కనుబొమలు)తో వచ్చినావు. ఇంద్రియములు జయించలేని నావంటి మృగములను వేటాడుటకా?

ప్రభూ! నీ రెండుబాణములు (కన్నులు) నా మనమును ఛేదించుచున్నవి. ఎంత అందముగా నున్నవో అంతవాడిగా ఉన్నవే! వాటికి రెక్కలు (చూపులు) కలవే. ఈ అడవిలో వాటిని ఎవరిపై ప్రయోగింతువు నాయనా? నిన్ను ఎదిరించి నిలువగల వీరు డున్నాడా?

స్వామీ? నీవు ఎంతసంపన్నుడవు! నీ ఈ శిష్యులు (తుమ్మెదలు) సామగానము చేయుచున్నవిగదా! ఋషులు వేదశాఖలను అనుసరించినట్లు ఇవి నీకొప్పునుండి జారిపడుచున్న పూవులను అనుసరించి పరుగెత్తు చున్నవి!

అయ్యా! నీపాదము లను పంజరములందున్న తిత్తిరి పక్షులు (అందెలు) కలస్వనమున కూయుచున్నవి కాని కంటికి కనిపించకున్నవి.

నీ పిరుదులమీద కదంబపుష్పముల (పట్టుచీర) కంతటికాంతి ఎట్లు వచ్చినది? నారబట్టవదలి దిసమొలతో తిరుగుచున్నావా?

నీ కొమ్ములు (రొమ్ములు) ఎంత ఉన్నతముగ నున్నవి? వాటిలో ఏమి ఉన్నదో? ఏవో విలువైన రత్నములుండును. ఇంత సన్ననినడుముతో ఆ రెండింటి బరువును ఎట్లు మోయుచున్నావో? నా చూపులు ఆ రెండింటిపై తగులుకొని మరల కున్నవి. ఏమిటది ఆ కొమ్ములమీద పులుముకున్నది. (కుంకుమరాగం)? దాని పరిమళము నా ఆశ్రమమంతయు వ్యాపించినది.

అందములొలుకు నీ ముఖము కోనేరుగను, అందు బెదిరిపడుచున్న చేపలవలె నేత్రములును, హంసలబారువలె పలువరుసయు, తుమ్మెదగుంపువలె ముంగురులును ఉన్నవి.

అదిగో నీ తలముడి వీడిపోయినది. సర్దుకొనవా? గాలిసహితము నీతో కొంటె తనము చేయుచున్నదే! తేపతేపకు నీకోకముడి విప్పుచున్నది. కట్టుబట్ట కదలించు చున్నది. కనిపించుట లేదా!

ఏమి అందము ! ఏమి సొగసు !! ఏమి మాయలు !!! మునీ ! తాపసుల తపస్సు బూడిదలో కలుపుచున్నదే ! ఏమి తపముచేసి సంపాదించితి వీ రూపము ?

ఇదిగో రారాదూ ! నాతో కొన్ని దినములుండి తపస్సుచేయరాదూ ! ఉందువా! ఏమందువు ?"

అతడు ఆమె చేతిని పట్టుకున్నాడు.

ఆమె పులకరించినది.

అతడు పలుకరించినాడు.

ఆమె పలుక లేదు.

అతడు కౌగిలించు కున్నాడు.

ఆమె కరగి పోయినది.

పూర్వచిత్తికి తొమ్మిదిమంది పుత్రులు కలిగినారు. 1. నాభి. 2. కింపురుషుడు. 3. హరివర్షుడు. 4. ఇలావృతుడు. 5. రమ్యకుడు. 6. హిరణ్మయుడు. 7. కురుడు. 8. భద్రాశ్వుడు. 9. కేతుమాలుడు. ఆమె తొమ్మిది సంవత్సరములలో తొమ్మిది మంది పుత్రులను కన్నది. బ్రహ్మదేవుని సేవకు వెళ్ళిపోయినది. తల్లి అనుగ్రహము వలన నాభి మున్నగు అగ్నీధ్రపుత్రులు దృఢగాత్రులై బలవంతులైనారు.

అగ్నీధ్రుడు జంబూద్వీపమును తొమ్మిది వర్షములుగా విభజించి వానికి తన పుత్రుల పేర్లు పెట్టినాడు. తొమ్మిదిమందిని తొమ్మిదివర్షములకు రాజులను చేసినాడు. అప్సరసమీదనే మనసు ఉన్నవాడుకాన వేదకర్మములుచేసి అప్సరసల లోకమునకు వెళ్ళిపోయినాడు.

అగ్నీధ్రుడు విభజించిన వర్షములను గురించి తెలుసుకుందము.

భ ర త వ ర్ష ము.

నాభి పరిపాలనక్రిందికి వచ్చిన వర్షము అజనాభవర్షము. భరతుని కాలమునుండి దానికి భరతవర్షము అనిపేరు వచ్చినది. ఇది హిమాలయమునకు దక్షిణదిశను ఉన్నది.

భరతవర్షమున భగవంతుడు నరనారాయణ రూపమున ఉండును. సంయమశీలురైన వారలను అనుగ్రహించుటకు కల్పాంతమువరకు అవ్యక్తరూపమున తపస్సు చేయుచుందురు నరనారాయణులు.

నారదముని ఈ వర్షమున వర్ణాశ్రమ ధర్మములు అవలంబించు జనముతో కలిసి దిగువ మంత్రమున నరనారాయణులను సేవించుచుండును.

"ఓం నమో భగవతే ఉపశమ శీలాయోపరతానాత్మ్యాయ నమో౽కించనవిత్తాయ ఋషి ఋషభాయ నరనారాయణాయ పరమహంసపరమగురవే ఆత్మారామాధిపతయే నమోనమః

ఓంకారస్వరూపుడు, అహంకార రహితుడు, పేదల పెన్నిధి, శాంతస్వభావుడు, ఋషిప్రవరుడు, భగవత్స్వరూపుడు అయిన నరనారాయణస్వరూపునకు వందనము. ఆయన పరమహంసలకు పరమగురువు, ఆత్మారాములకధీశ్వరుడు. అతనికి పదేపదే నమస్కారము."

భరతవర్షమునందు అనేక పర్వతములు కలవు అందు మలయము, మంగళప్రస్థము, మైనాకము, త్రికూటము, ఋషభము, కూటము, కోల్లకము, సహ్యాము, దేవగిరి, ఋష్యమూకము, శ్రీశైలము, వేంకటగిరి, మహేంద్రము, వారిధార, వింధ్యము, శుక్తిమంతము, ఋక్షగిరి, పారియాత్రము, ద్రోణము, చిత్రకూటము, గోవర్ధనము, రైవతకము, కకుభము, నీలము, గోకాముఖము, ఇంద్రకీలము, కామగిరి ముఖ్యములు. ఇతరపర్వతములు వందలు వేలు కలవు.

ఇందు పవిత్రములగు మహానదు లనేకము లున్నవి. అవి చంద్రవసము, తామ్రపర్ణి, అవటోద, కృతమాల, వైహాయసి, కావేరి, వేణి, పయస్విని, శర్కరావర్త, తుంగభద్ర, కృష్ణవేణి, వేణ్యా, భీమరథి, గోదావరి, నిర్వింధ్య, పయోష్ణి, తాపి, రేవ, సురస, నర్మద, చర్మణ్వతి, సింధు, అంధ, శోణ, మహానది, వేదస్మృతి, ఋషికుల్య, త్రిసామ, కౌశికి, గంగ (మందాకిని), యమున, సరస్వతి, దృషద్వతి గోమతి, సరయు, రోధస్విని, సప్తవతి, సుషోమ, శతద్రు, చంద్రభాగ, మరుద్వృధా, వితస్త, అసిక్రి, విశ్వ, ఇవి ముఖ్యమైన నదులు. ఇవి పవిత్రములైనవి. ప్రజలు వీనిలో స్నానములుచేసి పవిత్రులగుదురు.

భరతవర్షమున జన్మించినవారు తాముచేసుకున్న సత్వ, రజ, స్తమో కర్మల ననుసరించి దివ్య, మానుష, నారక జన్మము లెత్తుదురు. వర్ణాశ్రమ ధర్మములను నియమ పూర్వకముగా అనుభవించినవారలకు ముక్తి కలుగును. సత్సాంగత్యము వలన భక్తికలుగును. వాసుదేవునియెడల భక్తియే మోక్షము.

నరనారాయణులు.

దక్షప్రజాపతి మనువుకూతురైన ప్రసూతిని వివాహమాడినాడు. ప్రసూతికి పదహారుమంది కూతుళ్ళు కలిగినారు. వారిలో పదముగ్గురిని ధర్మునకు ఇచ్చి పెండ్లిచేసినాడు. వారిలో గుణవంతురాలైన 'మూర్తి' గర్భమున నరనారాయణులను మునులు జన్మించినారు. అప్పుడు విశ్వమందంతటను ఆనందము తాండవమాడినది. దేవదుందుభులు మ్రోగినవి. దేవతలు పూలవాన కురిపించినారు. గంధర్వులు. కిన్నరులు పాటలు పాడినారు. అప్సరసలు నాట్యముచేసినారు. బ్రహ్మాదిదేవతలు, మునులు స్తోత్రములు చేసినారు.

భగవంతుడు తన స్వరూపమును ప్రకటించుటకుగాను ధర్ముని ఇంట మూర్తి గర్భమున నరనారాయణమునులై జన్మించినాడు.

కింపురుషవర్షము.

కింపురుషుడు పాలించిన వర్షమునకు కింపురుషవర్షమని పేరు. ఇది హిమాలయమునకు ఉత్తరదిశన ఉన్నది. దీనికి హేమవర్షమనియు పేరు.


కింపురుషవర్షమున హనుమంతుడు ఉండును. అతడు ఇతరగంధర్వులతోకలిసి ఎల్లప్పుడు శ్రీరామచంద్రుని ఉపాసించుచుండును. అరిష్టసేనుడు శ్రీరాముని ఈ మంత్రమున కీర్తించును :-

"ఓం నమోభగవతే ఉత్తమశ్లోకాయ నమో ఆర్యలక్షణ శీలవ్రతాయ నమ ఉపశిక్షితాత్మన ఉపాసితలోకాయ నమః సాధువాదనికషణాయ నమో బ్రహ్మణ్యదేవాయ మహాపురుషాయ నమోనమః.

ఓంకార స్వరూపుడు, పవిత్రకీర్తిమంతుడు, భగవంతుడు అయిన శ్రీరామునకు నమస్కారము. నీలో సత్పురుష లక్షణములు, శీలము, ఆచరణ మూర్తీభవించి ఉన్నవి. నీవు మహాసంయత చిత్తుడవు. లోకారాధన తత్పరుడవు. సాధుతా పరీక్షకు గీటురాయివి. బ్రహ్మణ్యుడవు. శ్రీ రామచంద్రా! నీకు పదేపదే నమస్కారములు."

హరివర్షము.

హరివర్షుడు ఏలినది హరివర్షము. ఇది కింపురుషవర్షమునకు ఉత్తరమున, నిషధగిరికి దక్షిణమున ఉన్నది. దీనికి నైషధవర్షమని పేరు.



రాక్షస సంహారమునకై భగవంతుడు నరనారాయణులుగ నవతరించి
బదరికాశ్రమమున తపమాచరించుట. పుట. 186

హరివర్షమున భగవంతుడు నరసింహరూపమున ఉండును. ప్రహ్లాదుడు నిశ్చల భక్తితో నరసింహదేవుని ఉపాసించుచుండును.

"ఓం నమో భగవతే నారసింహాయ నమస్తేజస్తేజసే
ఆవిరావిర్భవ వజ్రనఖ వజ్రదంష్ట్ర కర్మాశయాన్ రంధయ
రంధయ తమోగ్రస ఓం స్వాహా అభయమభయ మాత్మని
భూయిష్ఠా ఓం క్ష్రౌమ్.

ఓంకార స్వరూపుడైన నరసింహభగవానునకు నమస్కారము. నీవు అగ్నిమున్నగు తేజస్సులను మించిన తేజస్సుగలవాడవు. నీకు నమస్కారము. ఓ వజ్రనఖా! ఓ [illegible]దంష్ట్రా! ఆవిర్భూతుడవుకమ్ము. మాకర్మవాసనల దగ్ధము చేయుము. మా అజ్ఞా[illegible]ంధకారమును నాశనముచేయుము, ఓం స్వాహా మా హృదయము [illegible] అభయప్ర[illegible]ము యిమ్ము. ఓం క్ష్రౌమ్. అనుమంత్రమును జపించుచుండును."

ఇలావృతవర్షము.

ఇలావృతుడు పాలించినది ఇలావృతవర్షము. ఇది హరివర్షమునకు ఉత్తరమున ఉన్నది. మేరుపర్వతము దీనిమధ్యన ఉన్నది.

ఇలావృతవర్షమున శివుడుండును.

ఒకనాడు శివుని దర్శించుకొనుటకు తేజోవంతులైన మహామునులు ఇలావృతమునకు వెళ్ళినారు. ఆ సమయమునకు పార్వతి కట్టుబట్టలులేక నగ్నముగా శంకరుని వడిలో ఉన్నది. ఆమె మునులను చూచినది. దిగ్గునలేచినది. బట్టకట్టుకున్నది. పార్వతీ పరమేశ్వరుల సంగమము చూచిన మునులు శివదర్శనము మానుకొని నరనారాయణుల దర్శనమునకుగాను భరతవర్షమునకు వెళ్ళినారు.

శంకరుడు పార్వతిని ఓదార్చుటకుగాను "ఈ వర్షమున ప్రవేశించిన పురుషుడు స్త్రీ అగును" అని శపించినాడు. నాటినుంచి పురుషుడు అచట అడుగు పెట్ట లేదు. కాబట్టి ఇలావృతవర్షమున పురుషులులేరు. వేలాది స్త్రీజనముతోకూడి పార్వతి శివుని సేవించుచుండును. శివుడు నారాయణుని సంకర్షణమూర్తిని ధ్యానించుచుండును.

"ఓం భగవతే మహాపురుషాయ
సర్వగుణసంఖ్యానాయానంతాయావ్యక్తాయనమః

సర్వగుణాశ్రయుడైన అనంతునకు అవ్యక్తరూపుడైన ఓంకారమూర్తియగు భగవంతునకు పరమపురుషునకు నమస్కారము" అనుమంత్రము ఆయన జపించు చుండును.

మగవాని కథ.

వైవస్వతమనువునకు సంతానము కలుగలేదు. వసిష్ఠుడు మిత్రావరుణ యజ్ఞము చేయించినాడు. మనువు భార్య శ్రద్ధాదేవి హోత దగ్గరకువెళ్ళి నమస్కరించి తనకు కూతురు కావలెనని ప్రార్థించినది.

మనువునకు కూతురు కలిగినది. ఆమె ఇళ.

కూతురు కలిగినందున మనువు సంతోషించలేదు.

వసిష్ఠుడు శ్రీహరిని ప్రార్థించి ఇళను పుత్రుడుగా మార్చినాడు. అతడు సుద్యుమ్నుడు. సుద్యుమ్నుడు రాజయినాడు.

సుద్యుమ్నుడు ఒకసారి వేటకు బయలుదేరినాడు. ఇలావృతవర్షమున ప్రవేశించి నాడు. అతనివెంటగల పరిజన సహితముగా అతడు ఆడదిగా మారిపోయినాడు. మగగుఱ్ఱము సహితము పెంటిగుఱ్ఱము అయిపోయినది.

సుద్యుమ్నుడు అతని పరివారము ఆడవారై తిరుగుచు, తిరుగుచు బుధుని ఆశ్రమము వద్దకు వెళ్ళినారు. సుద్యుమ్నుని ఆడరూపమును చూచి బుధుడు మోహించి నాడు. ఆమె కూడ అతనిని ప్రేమించినది. ఇద్దరుకూడినారు. వారికి పురూరవుడు అను పుత్రుడు కలిగినాడు.

తనకుమారుడు తిరిగి ఆడదిగా మారుట మనువు సహించలేదు. అతడు వసిష్ఠుని ప్రార్థించినాడు. వసిష్ఠుడు పరమశివుని ఆరాధించినాడు. పరమశివుడు ప్రత్యక్ష మైనాడు. సుద్యుమ్నుడు ఒకనెల ఆడదిగను ఒకనెల మగవాడుగను ఉండునట్లు వరము ప్రసాదించినాడు.

సుద్యుమ్నుడు ఒకనెల ఆడదిగను, ఒకనెల మగవాడుగను రాజ్యమేలినాడు. అతనికి ముగ్గురు పుత్రులు కలిగినారు. వారు ఉత్కలుడు, గయుడు, విమలుడు అనువారు. వారు దక్షిణాపథమున రాజులైనారు.

రమ్యకవర్షము.

రమ్యకుని ఏలుబడిలోనిది రమ్యకవర్షము. ఇది మేరు పర్వతమునకు ఉత్తరముగా ఉన్నది. దీనికి నీలాచలమని కూడా పేరు.

రమ్యకవర్షమున మత్స్యరూపమున ఉన్న నారాయణుడు భగవంతుడు. అతడు మనువునకు తనరూపము కనబరచినాడు.

"ఓం నమో భగవతే ముఖ్యతమాయ నమః
సత్వాయ ప్రాణాయౌజసే సహసే బలాయ మహామత్స్యాయ నమః.

సత్వప్రధానుడు, ముఖ్యప్రాణుడు, సూత్రాత్ముడు, మనోబల, ఇంద్రియబల, శరీరబల స్వరూపుడు, సర్వశ్రేష్ఠుడు అయిన మత్స్య భగవానునకు నమస్కారము" అని మనువు ప్రార్థించుచుండును.

హిరణ్మయ వర్షము.

హిరణ్మయుడు పాలించినది హిరణ్మయవర్షము. ఇది రమ్యక వర్షమునకు ఉత్తర దిశను ఉన్నది.

హిరణ్మయ వర్షమున భగవంతుడగు నారాయణుడు కూర్మరూపమున ఉండును.

"ఓం నమోభగవతే అకూపారాయ
సర్వసత్వగుణవిశేషణాయానుపలక్షితస్థానాయ నమస్తే.

సంపూర్ణ సత్వగుణమున జలమున విహరించుటచేత ఒకచోటని స్థానము నిశ్చయింపలేనివాడు, కాలాతీతుడు, సర్వవ్యాపకుడు, ఓంకారస్వరూపుడు, భగవంతుడు అయిన కూర్మదేవునకు నమస్కారము" అని పితృరాజు అర్యముడు కూర్మరూపమును ఉపాసించుచుండును.

కురువర్షము.

కురువు పాలించిన వర్షము కురువర్షము. ఇది శ్వేతపర్వతమునకు ఉత్తరమున ఉన్నది. దీనికి శృంగవత్వర్షము అని మరొక పేరుకూడ కలదు.

కురువర్షమున భగవంతుడు యజ్ఞవరాహ రూపమున ఉండును. భూదేవి అతనిని ఈ మంత్రమున స్తుతించుచుండును.

"ఓం నమో భగవతే మంత్రతత్వలింగాయ యజ్ఞక్రతవే మహాధ్వరాయ మహాపురుషాయ నమః కర్మశుక్లాయ త్రియుగాయ నమస్తే.

మంత్రములవలన తత్వము వ్యక్తమగువాడు. యజ్ఞక్రతు స్వరూపుడు. మహాయజ్ఞమే శరీరముగా గలవాడు, ఓంకార స్వరూపుడు, శుక్లకర్మమయుడు,

త్రిగుణమూర్తి, పురుషోత్తముడు, భగవంతుడు అయిన వరాహ భగవానునకు నమస్కారము."

భద్రాశ్వవర్షము.

భద్రాశ్వుడు పాలించినది భద్రాశ్వవర్షము. ఇది మేరువునకు తూర్పున ఉన్నది

హయగ్రీవ అవతారమున ఉండు నారాయణుడు భద్రాశ్వవర్షమున భగవంతుడు అతని ముఖ్యసేవకులు.

"ఓం నమో భగవతే ధర్మాయాత్మవిశోధాయ నమః

ఆత్మ విశోధకారి, ఓంకార స్వరూపుడు అయిన ధర్మ భగవానునకు నమస్కారము" అని ఆ దేవుని స్తుతించుచుందురు.

కేతుమాలవర్షము.

కేతుమాలుడు పరిపాలించినది కేతుమాలవర్షము. ఇది భద్రాశ్వవర్షమునకు తూర్పున ఉన్నది.

నారాయణుడు కామదేవుని రూపమున కేతుమాలవర్షమున ఉండును. లక్ష్మీదేవి సహితము అచటనే ఉండును. సంవత్సర ప్రజాపతి పుత్రులు, పుత్రికలు ఈ వర్షమునకు అధిపతులు. లక్ష్మీదేవి సంవత్సర ప్రజాపతి పుత్రులతో కలిసి పగళ్ళు, పుత్రికలతో కలిసి రాత్రిళ్ళు కామదేవుని ఈ మంత్రముతో సేవించును.

"ఓం హ్రాం హ్రీం హ్రూం నమో భగవతే హృషీకేశాయ సర్వ
గుణవిశేషైర్విలక్షితాత్మనే ఆకూతీనాం చిత్తీనాం చేతసాం
విశేషాణాం చాధిపతయే షోడశకలాయ చ్ఛందోమాయ
అన్నమయామృతమయాయ సహసే ఓజసే బలాయ
కాంతాయ కామాయ నమస్తే ఉభయత్ర భూయాత్.

భగవాన్ హృషీకేశా! నీకు నమస్కారము. సర్వశ్రేష్ఠ గుణములు నిండిన ఉత్తమ ద్రవ్యము లన్నింటను నీ ఆత్మ కనిపించును. ఎచట ఏ శ్రేష్ఠత్వమున్నను, సౌందర్యమున్నను దానికి నీవే ఆధారభూతుడవు. జ్ఞానము, క్రియ, సంకల్పము లకు నీవే అధిపతివి. పదకొండు ఇంద్రియములు, అయిదు విషయములు అను పదహారు కళలకు నీవే అంశస్వరూపుడవు. నీవు వేదమయుడవు, అన్నమయుడవు, అమృతమయుడవు, సాహస, సామర్థ్య బలసమూహములకు కారణస్వరూపుడవు.

మనోహరుడవైన ఓ కామదేవా! ఓం హ్రాం హ్రీం హ్రూం అను బీజమంత్రములతో అన్నిదిశలనుండి నీకు నమస్కరించుచున్నాను."

ఋషభావతారము.

అగ్నీధ్రుని జ్యేష్ఠపుత్రుడు నాభి. తనరాణియగు మేరుదేవితో కలిసి యజ్ఞము చేసి భగవంతుని ఆరాధించినాడు. యజ్ఞము పూర్తికాగా పీతాంబరధారి, శ్రీవత్స వక్షాంకితుడు, శ్రీమన్నారాయణుడు ప్రత్యక్షము అయినాడు.

ఋత్విజులు అతనిని స్తుతించి, "దేవదేవా! నీ దర్శనము లభించినందున మేము ధన్యులమైతిమి. మేము ఎట్టిస్థితిలో ఉన్నను నీ స్మరణ మరువకుండునట్లు వరము ఇమ్ము. ప్రభూ! ఈ రాజు తనకు నీవంటి పుత్రుడు కలుగవలెనని యజ్ఞము చేసినాడు. ఇతని ప్రార్థన మన్నించుము" అని కోరినారు.

ఋత్విజుల మాటలువిని కరుణాకరుడు "ఋషులారా! అద్వితీయుడనైన నా వంటి పుత్రుడు కలుగవలెనుట సమంజసమా! సంభవమా! అయినను మీ మాటలు అసత్యము కాకుండుటకుగాను నేనే నాకళతో నాభికుమారుడనై అవతరింతును" అనిచెప్పి అంతర్ధానుడైనాడు.

మేరుదేవి గర్భము దాల్చినది. ధ్వజ, వజ్ర, అంకుశ చిహ్నములుగల పుత్రుని కన్నది. అతడే ఋషభుడు. అతని ప్రభావము దినదినాభివృద్ధి చెందినది. ప్రజలందరు అతడు రాజు కావలెనని కోరినారు. నాభి ప్రజల అభిలాషప్రకారము ఋషభునకు పట్టముకట్టినాడు. భార్యయగు మేరుదేవితో కలిసి బదరికాశ్రమమునకు వెళ్ళి ఏకాగ్రచిత్తమున భగవంతుని ఆరాధించి తుదకు ముక్తిపొందినాడు.

ఋషభుని ప్రభావమునుచూచి ఇంద్రుడు ఓర్వలేకపోయినాడు. ఎన్నో సంవత్సరములు వర్షము కురిపించుట మానివేసినాడు. ఋషభుడు అది తెలుసు కున్నాడు. హేళనగా నవ్వినాడు. తనయోగమాయచే అజనాభ వర్షమంతటను కుండపోతగా కురిపించినాడు.

కొంతకాలము గురుకులవాసము చేసిన తరువాత దేవేంద్రుని పుత్రిక జయంతిని వివాహమాడి గృహస్థాశ్రమమున ప్రవేశించినాడు. జయంతివలన ఋషభదేవునకు నూరుగురు పుత్రులు కలిగినారు. వారిలో పెద్దవాడు భరతుడు. అతడు యోగి. గుణవంతుడు.

భరతుని తరువాతవారు తొమ్మిదిమంది కుశావర్తుడు, ఇలావర్తుడు, బ్రహ్మావర్తుడు, మలయుడు, కేతుడు, భద్రసేనుడు, ఇంద్రస్పృక్కుడు, విదర్భుడు, కీకనుడు

అనువారు. మిగతా తొంబదిమంది ఋషభుని పుత్రులకన్న ఉత్తములు. వీరి తరువాత భరతుని పదిమంది తమ్ములు కవి, హరి, అంతరిక్షుడు, ప్రబుద్ధుడు, పిప్పలాయనుడు, ఆవిర్హోత్రుడు, ద్రుమిలుడు, చమసుడు, కరభాజనుడు అను వారు భగవద్భక్తులు, భాగవతధర్మ ప్రచారకులు. మిగిలిన ఎనుబదిమంది పుత్రులు ఋషభుని మాట తు. చ. తప్పకుండ నడచువారు. వారు ఎల్లప్పుడు యజ్ఞ యాగాది క్రతువులుచేసి బ్రాహ్మణులు అయినారు.

ఋషభుడు పాలించిన కాలమున ప్రజలకు రాజువిషయమున అనురాగము నానా టికి హెచ్చినది కాని తగ్గలేదు. ఏ పదార్థమును ఎవరు కోరలేదు. ఒకరి పదార్థ మును ఒకరు హరింప చూడలేదు.

> తపస్సుచేసి అంతఃకరణమును పవిత్రము చేసికొనిన బ్రహ్మానందము కలు గును. మానవుడు చేయవలసినది అదియే.
>
> క్రోధములేనివారు. సర్వ ప్రాణుల ఎడల సౌహార్ద్రము గలవారు. సదాచార సంపన్నులు, బ్రహ్మనిష్ఠులు. భగవంతుని ఉపాసించువారు మహాత్ములు.
>
> మహాత్ముల సేవ ముక్తికి మార్గము.
>
> పురుష మిథునము గ్రంథివంటిది. దానివలననే సకల బంధములు ఏర్పడు చున్నవి. ఆ గ్రంథి సడలిపోయిన అహంకారము, సంసారము అన్నియు విడిపోవును. ముక్తి కలుగును.
>
> విషయ సుఖములు ఘోరమైన నరకమునకు కారణము లగును. మూర్ఖులు దానిని రవంతయు గుర్తించరు.
>
> గుడ్డివాడు పెడదారి పట్టిన కండ్లున్నవాడు దారి చూపించవలెను. అజ్ఞానము వలన దుఃఖముపాలగుచున్న మనిషికి జ్ఞానియైనవాడు సన్మార్గము చూపింప వలెను.
>
> భగవంతుడు సర్వైశ్వర్యములకు అధిపతి. అయినను అతని భక్తులు ఐశ్వర్య ములను తుచ్ఛముగా చూతురు వారు వాటిని కోరరు.

ఋషభుడు తన పెద్ద కుమారుడైన భరతునకు పట్టముకట్టినాడు. నివృత్తి మార్గ మును అనుసరించినాడు. ఆదర్శప్రాయమైన పరమహంస ధర్మమును నిర్వర్తించి జనులకు చూపినాడు.

శరీరము ఒక్కటి తప్ప మిగత వానిని అన్నింటిని ఇంటనున్నప్పుడే వదులు కున్నాడు. గుడ్డలుమాని దిగంబరుడైనాడు. జుట్టు విరియబోసుకొని ఉన్మత్తుని వలె ఉండువాడు. సన్న్యాసియై బ్రహ్మావర్త దేశము వీడిపోయినాడు.

ఋషభుడు సదా మౌనముగా నుండువాడు. జడునివలెను, అంధునివలెను, బధిరుని వలెను, మూగవాని వలెను ఉండువాడు. పిచ్చివాని వలెను, పిశాచము వలెను ప్రవర్తించువాడు.

అవధూత అయిన ఋషభుడు పల్లెలు, పట్టణములు, గనులు, తోటలు, కొండలు, కోనలు తిరుగువాడు. దారులలో మూర్ఖులు, దుర్మార్గులు అతనివెంటపడువారు. అల్లరి చేయువారు. తిట్టువారు. కొట్టువారు. ఉమ్మువారు. మలమూత్రములు అతనిపై విసర్జించువారు. రాళ్ళు రువ్వువారు. దుమ్ముపోయువారు. వచ్చి బూతులు తిట్టువారు. ఈగలను లక్ష్యపెట్టని అడవి ఏనుగువలె అతడు దేనిని లక్ష్యపెట్టువాడుకాడు. మిథ్యా శరీరము విషయమున అతనికి మమకారము లేదు. అతడు పరమాత్మ స్వరూపముననే ఉండువాడు.

జనులు అతని యోగసాధనకు అంతరాయము కలిగించసాగినారు. ప్రతీకారము చేయరాదు. కాన అతడు అజగర వ్రతము అవలంబించినాడు. అజగరము వలె పడుకొనియే తినుట, త్రాగుట, మలవిసర్జన చేయువాడు. మల మూత్రములందు పొరలువాడు. అతని మల మూత్రములందు సువాసన యుండెడిది. ఆ సువాసనతో నాప్రాంత మంతయు ఘుమ ఘుమ లాడెడిది.

ఇదే విధముగా ఋషభదేవుడు గోవృత్తి, మృగవృత్తి, పక్షివృత్తి అవలంబించు వాడు. అతడు ఆ యా పశుల వలెనే తినుట, నడచుట మున్నగునవి చేయు వాడు. భగవంతుడు ఋషభావతారమున వివిధ యోగవృత్తులు అవలంబించి చూపినాడు. ఎల్లప్పుడు బ్రహ్మానందమును అనుభవించువాడు. ప్రాణులలో ఆత్మ స్వరూపమును, ఆత్మలో వాసుదేవుని దర్శించువాడు. అన్నింటను అభేదము చూచువాడు. ఆకాశగమనము, మనోగమనము, అంతర్ధానము, దూరదృష్టి, దూరశ్రవణము, పరకాయప్రవేశము మున్నగునవి అతనికి స్వతస్సిద్ధముగా అలవడినవి. కాని అవి అహంకారమునకు, కామక్రోధములకు కారణమగునని వాటిని అతడు స్పృశించలేదు.

స్థూల దేహాభిమానము పరిత్యజించినను ఋషభుడు భూలోకమంతటను సంచరించి నాడు. నోటిలో రాతిముక్క వేసుకొని తల విరియబోసుకొని నగ్నముగా సంచరించినాడు.

ఋషభుడు ఒకసారి వెదురు వనములో సంచరించునపుడు వెదుళ్ళకు వెదుళ్లు రాచుకొని పెద్ద దావానలము చెలరేగినది. దాని మంటలు ఆకాశము నంటినవి.

ం మంటలలో ఋషభుని స్థూలకాయము భస్మమైపోయినది.

దేహాదుల మీద అభిమానము వలన తమ శాశ్వత శ్రేయస్సును మరచిన లోకులకు అభయప్రదమైన ఆత్మతత్త్వము ఉపదేశించినాడు ఋషభుడు. నిత్యానుభవమున ఆత్మస్వరూపమును దర్శించినాడు. సర్వ తృష్ణలనుండి విముక్తి పొందినాడు.

అట్టి ఋషభదేవునకు నమస్కారము.

ఆత్మతత్త్వ విచార మను అనంత ప్రయోగశాలలో మహాత్ములు అనేకులు అనేక ప్రయోగములు చేసినారు. దేహాభిమానమును త్యజించి అడవులందుండి సమదర్శనమును అలవరచుకొని ప్రాణాయామాదుల ద్వారా స్థూలకాయమును త్యజించునట్టి ఆచారమునకు భిన్నముగా నడిచి ఒక క్రొత్తమార్గమును చూపినాడు ఋషభుడు. వాసనా విషయకమైన ప్రపంచమునకు దూరముగా అడవులందుండి జితేంద్రియులగుట అసామాన్యము కాదని గ్రహించినాడు ఋషభుడు. వాసనా విషయక ప్రపంచమం దుండియే జితేంద్రియుడై చూపినాడు. మనను నిందించువారుగాని, కష్టపెట్టువారుగాని లేనిచోట నుండి కోపమును జయించినాననుట గొప్ప విషయము కాదు. తిట్టువారు కొట్టువారు ఉన్నపుడు వారిమధ్యనుండి కోపమునకు లొంగకుండుట గొప్పతనము. ఆకలి అగుపించని అడవులందుండి ఇంద్రియములకు లొంగలేదనుట గొప్పతనమా? అప్సరసల మధ్యనుండి ఇంద్రియములకు లొంగకుండుట గొప్పతనమా?

అట్టి గొప్పతనమును ఆచరించి చూపినాడు ఋషభుడు.

అంతియ కాదు. ఆకాశగమన, పరకాయ ప్రవేశాది విద్యలను గురించి తొలుత తెలుసుకున్నవారును ఋషభుడే అయియుండవలెను. అట్టిశక్తులను ఆర్జించియు అవి అహంకార మమకారములకు కారణము లగునని విడిచిపుచ్చిన మహాత్ముని మహత్త్వము కొనియాడు శక్తి సహితము మనవద్ద లేదు.

జడభరతాదులు అవధూత ధర్మమును అవలంబించి చూపినారు.

భరతుడు.

ఋషభుడు భరతునికి రాజ్య పట్టము కట్టినాడు. తండ్రి ఆజ్ఞను శిరసావహించి భరతుడు మిక్కిలి ధర్మముగా రాజ్యము చేసినాడు. అందువలన అజనాభవర్షము భరతునిపేర భరతవర్షముగా మారినది.

భరతుడు విశ్వరూపుని పుత్రిక పంచజనిని పెండ్లాడినాడు. ఆమెవలన అయిదుగురు పుత్రులను కన్నాడు. వారు సుమతి, రాష్ట్రభృత్తు, సుదర్శనుడు, ఆవరణుడు, ధూమ్రకేతుడు అనువారు.

భరతుడు అనేకమైన యజ్ఞములు చేసినాడు. అతడు యజ్ఞఫలమును వాసుదేవునకే అర్పించినాడు. అతడు భగవంతుని మీద బుద్ధినిలిపి హృదయ మాలిన్యమును వదిలించుకున్నాడు. హృదయాకాశమున నున్న వాసుదేవుని పూజించినాడు.

అతడు వేయి అయుత సంవత్సరములు అనగా కోటి సంవత్సరములు రాజ్యము చేసినాడు. అతడు తన పుత్రులకు రాజ్యమును పంచి పులహాశ్రమమునకు వెళ్ళిపోయినాడు. అచట ఒక ఏకాంత ప్రదేశమున ఆశ్రమము ఏర్పాటు చేసికొన్నాడు. పుష్పములతోనూ, ఫలములతోనూ భగవంతుని ఆరాధించినాడు. విషయాభిలాషలు పరిత్యజించి శాంతుడై పరమానందమును అనుభవించినాడు. ఆనందానుభవమున శరీరము పులకరించినది. ప్రేమ బాష్పములు ప్రవహించినవి. భక్తిభావము పొంగిపొరలినది. అతడు అందు మునకలు వేసినాడు.

ఒకనాడు భరతుడు గండకి నదిలో స్నానము చేసినాడు. నిత్యనైమిత్తికములు ముగించుకున్నాడు. ప్రణవము జపించుచు నదీతీరమున కూర్చున్నాడు.

అప్పుడు ఒక లేడి నీరు త్రాగుటకు ఆ చోటికి వచ్చినది. అది నీరు త్రాగుచుండగ దానికి సింహగర్జన వినిపించినది. లేడి ఉలిక్కిపడి బెదురు చూపులు చూచినది. నిండు చూలాలుగా వున్న ఆ లేడి ప్రాణభయమున చెంగున ఏటిలోనికి దూకినది. గర్భపాతమై బయటపడిన లేడిపిల్ల ప్రవాహమున పడి కొట్టుకొని పోయినది. మందతప్పిన తల్లి లేడి పోయి పోయి ఒక కొండగుహలో పడి చచ్చిపోయినది.

ముద్దులొలుకు లేడిపిల్ల నదిలో కొట్టుకొని పోవుట చూచినాడు భరతుడు. అతడు కరగిపోయినాడు. దయారసము పొర్లినది. వెంటనే పరుగెత్తి తల్లిలేని ఆ లేడిపిల్లను ఆశ్రమమునకు తెచ్చి కన్నబిడ్డను పెంచినట్లు పెంచినాడు.

భరతునకు లేడిపిల్లమీద మమకారము ఏర్పడినది. భరతుడు ప్రతిదినము దానికి మేత మేపువాడు. నీరు త్రాగించువాడు. క్రూర మృగముల బారినుండి కాపాడువాడు. రోజు రోజుకు మమత పెరిగినది. దాని మీద అతనికి "ఇదినాది" అన్న భావము ఏర్పడినది. క్రమక్రమముగా భగవత్సేవ మున్నగునవి వెనుక పట్టినవి. కొన్నాళ్ళకు అతడు భగవంతుని మరచినాడు. లేడిపిల్లయే అతనికి భగవంతుడైనది. లేడిపిల్ల తనను ఆశ్రయించినదనియు, దానిని రక్షించుటే పరమ ధర్మమనియు అతడు భావించినాడు.

కుశలు దర్భలు మున్నగువాని కొరకు అరణ్యమునకు వెళ్ళినపుడు గాని, నీరు తెచ్చుటకు నదికి వెళ్ళినపుడు గాని అతని ధ్యాస లేడిపిల్ల పైననే ఉండునది.

ఆశ్రమమున ఒంటరిగా ఉన్న లేడిని కుక్కలు కరచునో, పులి ఎత్తుకొనిపోవునో యని భావించువాడు

కొంత కాలమునకు దానిని సహితము వెంట తీసుకొని వెళ్ళసాగినాడు. దారిలో పచ్చిక బయలు కనిపించినచో లేడిపిల్ల అటు పరుగెత్తెడిది. దానివెంట పరుగెత్తి దానిని పట్టుకొని భుజములపై వేసుకొని నడుచువాడు. ఒకప్పుడు వడిలో పెట్టుకొని నడుచువాడు. అట్లు దానిని ఎన్నో విధముల గారాబము చేసియు, లాలన చేసియు, ముద్దులాడియు ఆనందము ననుభవించువాడు. దానికేమైనను ప్రమాదము వచ్చునేమో యని శంకించి బాధపడువాడు. అది కనిపించకపోయినచో ధనమును కోల్పోయిన దరిద్రునివలె విలపించెడివాడు. ఆశ్రమ మంతయు దాని కొరకు గాలించువాడు. దాని అడుగుల గుర్తులు నేలమీద చూచి "ఈ నేల ఎంత తపస్సు చేసికొనినదో కదా! సుందరమైన నా లేడి కాలి గుర్తులతో అలంకరించుకొనినది. నేనున్నాను దరిద్రుడను ఎంత తపస్సు చేసిన నేమి? నా లేడిపిల్లను కాన లేకున్నాను" అని విలపించువాడు.

> ప్రారబ్ధ కర్మయే లేడిపిల్ల రూపమున వచ్చి భరతుని యోగనిష్ఠను భంగపరచినది. కన్న ఆడుబిడ్డలు మోక్షమునకు ఆటంకమని వారిని విడిచిన తాపసి లేడిపిల్లపై ఇంత వ్యామోహము పెట్టుకొనునా?

భరతుడు యోగభ్రష్టుడైనాడు. ఆత్మస్వరూపమును మరచినాడు. ఇంతలో కాలము కాటువేయు సమయము వచ్చినది. ఎలుక కన్నమున దూరు సర్పము వలె అది భరతుని తలపై కూర్చున్నది. అపుడు సహితము లేడిపిల్లయే అతని కన్నుల మసలినది.

ఆ స్థితిలో భరతుడు ప్రాణము వదలినాడు.

మరణ సమయమున ఏది ధ్యానమున వున్న ఆ జన్మమే వచ్చును. భరత మహారాజు మరుసటి జన్మమున లేడియై పుట్టినాడు. కాని యోగభ్రష్టుడైనందున అతనికి పూర్వజన్మ జ్ఞానము వుండెను. తన లేడి జన్మమునకు కారణము తెలుసుకొని ఎంతో పశ్చాత్తాప పడువాడు.

"అయ్యో! యోగభ్రష్టుడనైతినే? పతితుడనైతినే? సర్వసంగ పరిత్యాగము చేసి శ్రీహరి పాదారవిందములపైననే చిత్తము నిలిపి అతని గుణములనే గానము చేసితినే? అట్టి నేను ఒక చిన్న లేడిపిల్ల వెంటపడి భ్రష్టుడనైతినే?" అని వాపోవువాడు.

అట్లు తలచి వైరాగ్యభావమున తల్లి లేడిని వదలి తాను పుట్టిన కాలంజర పర్వతము నుండి బయలుదేరి పులహాశ్రమమునకు వచ్చినాడు భరతుడు. అచటనే తిరుగుచు ఎండుటాకులు, గడ్డి గాదము తినుచు కాలము వెళ్ళబుచ్చినాడు.

తుదకు లేడి శరీరము వదలిపెట్టినాడు.

> నీటిలో కొట్టుకొనిపోవు ముద్దులొలుకు లేడిని కాపాడుట పాపమా ? భగవత్స్వరూపమైన ఒక ప్రాణిని రక్షించినాడే భరతుడు. అతడు చేసిన పాపమేమి ? యోగము చేయువాని మనసు బండకావలెనా ? అది హరిణ దుఃఖము చూచి కరుగరాదా ? ఒకరికి ఉపకారము చేయుటయందు, అందునను ప్రాణము రక్షించినచో పాపము కలుగవలెనా ? పుణ్యమా ?
>
> ఈ ప్రశ్నలన్నింటికి జవాబు ఒక్కటే. నీవు దుఃఖించు ప్రాణిజాలమున కంతటికిని సాయపడుము. కాని ఎవరి ఎడను మమకారము పెంచుకొనవలదు. నీవుచేయు సహాయము భగవంతుడు ప్రాణికి చేయునట్లు గోప్యముగా నుండవలెను. కాని ప్రకటితము కారాదు. నీవు కోట్ల ప్రాణుల కన్నీరు తుడువవలసి యున్నది. ఒక్క ప్రాణియెడల మమత కలిగియున్నచో నీధర్మమును నిర్వహించినట్లగునా ?

జ డ భ ర తు ని క థ.

అంగిరస గోత్రపు ఒక బ్రాహ్మణునకు ఇద్దరు భార్యలు. మొదటి భార్యకు తొమ్మిదిమంది పుత్రులు. వారు విద్యా, రూప, సౌశీల్యవంతులు. రెండవ భార్యకు ఒక కుమారుడు ఒక కూతురు. ఆ కుమారుడు మన రాజర్షి భరతుడు. అతడు లేడిజన్మ వదలి బ్రాహ్మణ కుమారుడై పుట్టినాడు.

ఈ జన్మమున సహితము అతనికి పూర్వజన్మ జ్ఞానము ఉండెడిది. ఈజన్మమున కూడ విఘ్నములు కలుగునేమోయని అడుగడుగున జంకువాడు. తనవారితో సహితము సంబంధము లేకుండునట్లు రోజులు గడుపువాడు. సర్వదా శ్రీహరి పాదపద్మములే మనసున నిలుపుకొని యుండెడివాడు. ఎదుటి వారికి అతడు పిచ్చివాని వలెను, జడునివలెను, గ్రుడ్డివాని వలెను, చెవిటివాని వలెను కనిపించువాడు.

పుత్రుడు జడు డయినను తండ్రి ఉపనయనము వరకు సంస్కారము లన్నియు నిర్వర్తించినాడు. కాని భరతుడు అన్ని నియమములను ఉల్లంఘించువాడు. తండ్రి అతనితో వేదాధ్యయనము చేయించుటకు సంకల్పించినాడు. నాలుగు

మాసములు ప్రయత్నించినను భరతునకు "భూర్భువస్వః" రాలేదు. ఒక్కొక్క వర్గము నేర్పినను లాభము లేకపోయినది. ఏ అక్షరము తరువాత ఏ అక్షరము పలుకవలెనో, ఏ స్వరము తరువాత ఏ స్వరము పలుకవలెనో అర్థము కాలేదతనికి. అయినను తండ్రి విసుగుకొనలేదు. ఎంతో ప్రయత్నించినాడు. అయినను అతని సంకల్పము నెరవేరలేదు. కాలము వేగముగా వచ్చి అతనిని మ్రింగినది. అతని చిన్న భార్య తన బిడ్డ లిద్దరను సవతికి అప్పగించి సహగమనము చేసినది.

తండ్రి మరణించిన తరువాత అన్నలు అతనికి విద్య గరపుటకు ప్రయత్నించలేదు. కర్మకాండలో నిష్ణాతులైన వారికి అధ్యాత్మ విద్యాపారంగతుని ప్రభావము తెలియలేదు.

గ్రామ జనులందరు అతనిని జడుడు అనువారు. వారు అప్పుడప్పుడు అతనిచేత పనులు చేయించుకొని పిడికెడు అన్నము పడవేయువారు. ఒక్కొక్కప్పుడు అడుక్కొని తినువాడు. ఏ పదార్థమైనను అసహ్యించుకొనకుండ తినువాడు. జీవికకై మాత్రము తినువాడు కాని ఇంద్రియముల తృప్తికై కాదు.

అతని శరీరము దృఢముగను అవయవములు కరకుగను ఉండెడివి. ఎండ, వాన, చలిని లెక్కచేయువాడుకాదు. అలోతువలె ఒంటిపై గుడ్డలేక తిరుగువాడు. కటికనేలపైనే పరుండువాడు. ఏమాత్రము పోషణలేకున్నను అతడు శ్రమ చేయని మణివలె ఉండెడువాడు.

జడభరతుడు కూలిచేయువాడు. వారుపెట్టినది తిని పొట్టనింపుకొనువాడు. అది చూచి అన్నలు అతనిని పొలము పనిలో పెట్టినారు. వారు పనిచెప్పిన అదేచేయువాడు భరతుడు. మడులు సమముగా చేయుటకు గాని, గట్లు పోయుటకుగాని తెలియునదికాదు. పోసినచోటనే మళ్ళు పోయువాడు. త్రవ్వినచోటనే త్రవ్వువాడు. అన్నలు భరతునకు తెలకపిండి, పుచ్చిన మినుములు, అడుగుమాడిన అన్నము పెట్టువారు. అయినను అతడు దానినే ఆనందముగా భుజించువాడు.

ఒక దొంగలరాజు భద్రకాళికి నరబలి ఇచ్చుటకు మ్రొక్కుకున్నాడు. బలికొరకు సిద్ధముచేసి ఉంచిన వ్యక్తి అర్ధరాత్రి సమయమున తప్పించుకొని పోయినాడు. దొంగలు పారిపోయిన వానికొరకు ఎంతో వెదికినారు. అతడు దొరకలేదు. పంటపొలమున జడభరతుని చూచినారు దొంగలు. అతనిమీదపడి త్రాళ్ళతో కట్టివేసి భద్రకాళిగుడికి పట్టుకొని వెళ్ళినారు. జడభరతునకు స్నానము చేయించి

నారు. కొత్తబట్టలు కట్టించినారు. పూలదండలువేసి ముస్తాబుచేసి బలికొరకు సిద్ధపరచినారు. తిండి తినిపించి ధూపములు వేసినారు. భయంకరములైన బలి గీతములు పాడినారు. బలిబాజాలు వాయించుచు భరతుని బలిపీఠమువద్దకు తీసుకొని వెళ్ళినారు.

దొంగల పురోహితుడు పెద్దకత్తి తీసుకున్నాడు. బలిఇచ్చుటకు సంసిద్ధుడైనాడు. బ్రహ్మతేజ పూర్ణుడైన బ్రాహ్మణ బలిని సహించలేక పోయినది కాళి. హఠాత్తుగా విగ్రహము బద్దలుకొట్టుకొని బయటకు వచ్చినది కాళి.

ఆమెలో క్రోధము పొంగిపొరలినది. భయంకర రూపముదాల్చినది. కనుబొమలు ముడిపడినవి. కోరలు తళతళ మెరసినవి. కన్నులు జ్యోతులైనవి. లోకమంతయు దహించునంత వీరావేశమున దిక్కులు పిక్కటిల్లునట్లు మహాట్టహాసము చేసినది. వికటముగా నవ్వి ఒక్క ఉరుకుఉరికి పురోహితుని చేతులోని కత్తిలాగి తీసుకొన్నది. దొంగలతలలు తాటికాయలు నరికినట్లు నరికివేసినది. వేడివేడిరక్తము త్రాగినది. ప్రళయనృత్యము చేసినది. తలలను బంతులుగాచేసి ఆడినది.

> ఏవమేవఖలు మహదభిచారాతిక్రమః కార్త్స్న్యేన ఆత్మని ఫలతి
> మహాపురుషుల విషయమున తలపెట్టిన ఘోరము అట్లే ఎదురు తిరుగును.
> పాపము కట్టికుడుపును.

తనను బలిఇచ్చుటకు పూనుకున్న దొంగల విషయమునకూడ అతనికి కోపము రాలేదు. అందు విచిత్రమేమి? దేహాభిమానమనుగ్రంథిని అతడు త్రెంచివైచినాడు. వైరభావము చంపుకొని సర్వప్రాణుల ఆత్మ ఒకటిగానే భావించినాడు. అట్టివారికి వికారములు ఉండునా?

> తమ తల తెగిపోవుచున్నను చలించని పరమహంసల విషయమున ఇది ఏ మాత్రము ఆశ్చర్యము కాదు.

ఒకనాడు సింధు సౌవీరదేశముల రాజు రహూగణుడు పల్లకిలో వెళ్ళుచున్నాడు. అతని పల్లకి ఇక్షుమతీ నదీతీరమునకు వచ్చినది. బోయల నాయకునకు మరొక్క బోయవాడు కావలసివచ్చి బోయవాని కొరకు వెదకుచుండగా అతనికి జడభరతుడు కనిపించినాడు. అతనిని పల్లకిమోయుటకు నియోగించినాడు.

మహానుభావుడు, ఆత్మజ్ఞాని అయిన భరతునకు ఈ పని తెలియదు. అయినను తక్కినబోయవారితో భుజముకలిపి నడువసాగినాడు. వేగముగా నడుచుటవలన తన అడుగులక్రింద పురుగులు నలుగును అనుకున్నాడు. జీవహింస జరుగునను



దొంగలు జడభరతుని కాళికి బలినీయనున్న సమయమున కుపితయైన
కాళి దొంగలను అంతమొందించుట. పుట.200

భయమున చూచిచూచి అటుఇటు అడుగులు వేయసాగినాడు. బోయలు అడ్డ దిడ్డముగా అడుగులు వేయుట చూచి మహారాజు "అడుగులు చక్కగా వేయుడు. ఏమిటానడక ?" అని గర్జించినాడు.

బోయలు రాజదండనకు భయపడి "మేము సరిగానే నడుచు చున్నాము మహారాజా ! ఈ క్రొత్తమనిషి నడువలేకున్నాడు. అందువలన మాకు ఇబ్బంది కలుగు చున్నది" అని విన్నవించినారు.

రహూగణుడు మహర్షుల సేవచేసినవాడే. అతడు ఆత్మోపదేశము పొందుటకు గాను కపిలదేవుని దగ్గరకు వెళ్ళుచున్నాడపుడు. అయినను రాజుకదా ! రజో గుణము అతని కండ్లు కప్పినది. నివురుకప్పిన నిప్పువంటి భరతుని కనుగొనలేక పోయినాడు.

"దుంగవలె ఉన్నావు. పండు ముసలివలె చేయుచున్నావు. అలసినావా నాయనా! అడుగులు తడబడుచున్నవి" అని వెక్కిరించినాడు రహూగణుడు.

రాజుమాటలు లెక్కపెట్టలేదు భరతుడు. అట్లే నడచినాడు. పల్లకి ఎగుడు దిగుడుగనే నడవసాగినది. రహూగణుడు మండిపడినాడు.

"ఒరే ! బ్రతికియున్నావా ? పీనుగువా ? నీకు నామాట లక్ష్యము లేకున్నదే. నన్ను ఎరుగవేమో ! యమునివలె నీదేహము చదునుచేయుదును. అప్పుడుగాని దారికిరావు" అని గర్జించినాడు.

భరతుడు రాజు దురభిమానము గమనించినాడు. అతని అజ్ఞానమును గ్రహించి నాడు. భరతుడు ఏ అభిమానమును పెట్టుకొనలేదు. అతడు ఉద్రిక్తుడుకాలేదు. చిరునవ్వు నవ్వుచు ఇట్లన్నాడు :—

> "రాజా ! బరువు మోయునది దేహముగాని ఆత్మకాదు. నీవు స్థూలముగా లేనన్నావు. నేను ఆత్మస్వరూపుడను నాకు స్థూలత్వములేదు. స్థూలముగా ఉండుట, సూక్ష్మముగా ఉండుట దేహమునకుగాని ఆత్మకుకాదు. స్థూలసూక్ష్మములు ఆత్మకులేవు. సుఖదుఃఖములు దేహాభిమానముగల జీవునకుగాని దేహాభిమానము లేని ఆత్మకు చెందవు. బ్రతికియున్నావా ? పీనుగువా ? అన్నావు. వికారమున్న ప్రతిదానికి చావుబ్రతుకులు కలవు. పరిణామముగల ప్రతిదానికి బ్రతుకుట చచ్చుట తప్పదు. నీవురాజువు. నీమాట లక్ష్యపెట్టలేదనుచున్నావు. రాజు ఎప్పుడు రాజుగానుండి సేవకుడు ఎప్పుడు సేవకుడుగానున్నచో నీవు అన్నది ఒప్పు కావచ్చును. కాని నేటిరాజు రేపు సేవకుడు. నేటి సేవకుడు

> రేపు రాజా అగుచున్నాడు.. కాన ఒకడు చెప్పుట మరొకడు వినుట అసందర్భము. అయినా రాజా, సేవకుడు అను సంబంధము నిత్యమని భావించుచున్నావు. కావున చెప్పుము ఏమి చేయమందువో. నేను ఉన్మత్తునివలె, జడునివలె ఉంటున్నాను. నన్ను చదునుచేసి ఏమి బావుకొందువు? పిండిని నూరుట వలన ప్రయోజన మేమి?

రహూగణుడు భరతుని తత్వోపదేశమువిని పల్లకి దిగి రాజాభిమానము వదలి జడభరతుని పాదములముందు తలవంచి క్షమాభిక్ష వేడుకున్నాడు.

"మహాత్మా! నివురుగప్పిన నిప్పువలె ఉన్న నీవు ఎవరు? దత్తాత్రేయుడు మున్నగు అవధూతలలోని వాడవా? నేను దేవేంద్రుని వజ్రాయుధమునకు సహితము వెరువను. కాని బ్రహ్మజ్ఞానము కలవారిని అవమానించుట యనిన వెఱతును. జడునివలె కనిపించు నీలో జ్ఞానము, వీర్యము గుప్తముగా ఉన్నవి. నీవు పలికిన పలుకులు యోగశాస్త్రమునకు సంబంధించినవి. నేను నా గురువు అయిన కపిలదేవుని వద్దకు వెళ్ళుచున్నాను. నీవు మారువేషమున తిరుగుచున్న కపిలదేవునివా? గృహస్థాశ్రమమున ఉన్న మందమతిని నేను. నా సంశయములు తీర్పుము.

బరువు మోయుట శ్రమకాదని అన్నావు. యుద్ధములలోని శ్రమ నేనెరుగను. కాని పల్లకిమోత శ్రమయనియే భావించుచున్నాను. వ్యవహార మార్గమునకూడా అది సత్యమనిపించుచున్నది. మిథ్యాఘటమున నీరు తెచ్చుట కుదరదు కదా!

కష్టము శరీరమునకుగాని ఆత్మకు లేదన్నావు. పొయ్యిమీద కుండ పెట్టినపుడు కుండక్రింది నిప్పుచే కుండలోని నీరు వేడెక్కును. అందులోని బియ్యముకూడ ఉడుకును. అట్లే శరీరమునకు ఎండ తగిలిన ఇంద్రియములు ఉడుకుపట్టి తద్వారా ప్రాణము, మనసు వేడెక్కును. ఆత్మ తపించును.

రాజు-సేవకుడు అనుభావము మార్పు చెందునది అయినను రాజుగా ఉన్నప్పుడు ప్రజలను శాసించుట, శిక్షించుట తప్పదు.

జడస్వభావుని దండించుట అన్నావు. దండించినంత మాత్రమున జడునిస్వభావము మారకున్నను అతనిని దండించుట వ్యర్థము మాత్రము కాదు. భగవంతుని దాసుడైన రాజు భగవదాజ్ఞ పాలించినచో స్వధర్మమును అవలంబించినట్లగును.

మహానుభావా! రాజునన్న అహంకారమున, తెలియక, నీవంటి మహాత్ములను అవజ్ఞ చేసినాను. నా అపరాధమును మన్నించి నేను ఈ పాపమునుండి విముక్తి పొందునట్లు అనుగ్రహింపుము."

అందుకు జడభరతుడు,

రాజా! నీవు పండితుడవు కావు. అయినను పండితునివలె వాదించుచున్నావు. అంతమాత్రమున నీవు పండితులలో లెక్కించబడుట వట్టిది. తత్వజ్ఞానమును అవగాహనము చేసుకున్న పండితులకు రాజా. సేవకుడు మున్నగు లౌకిక వ్యవహారములవలె వైదిక వ్యవహారములు సహితము సత్యములు కావు. యజ్ఞయాగాది కర్మలవలన స్వర్గాదులు లభించుట అబద్ధము, రాగద్వేషములు నశించక తత్వజ్ఞానము రమారము అందులేదనియే చెప్పవచ్చును. స్వర్గసుఖములు స్వప్న సుఖములవంటివని తెలుసుకొనని వానికి ఉపనిషత్తులు సహితము జ్ఞానము కలిగించలేవు.

మనసు సత్వరజస్తమో గుణములతో కలిసియున్నంతవరకు అది మనిషిచేత మంచిపనులు, చెడుపనులు చేయించుచునే ఉండును. పంచభూతములు పదకొండు ఇంద్రియములు అను పదహారు కళలలో మనసే ముఖ్యమైనది. ఉత్తమతత్వమునకు కారణమగునది మనసు. సంసార చక్రమును సృష్టించునది మనసు. సుఖ దుఃఖములు కలిగించునది మనసు. కాన బంధమోక్షములకు మనసే ప్రధానమైనది. మనసు గుణములను వదిలిన అదే శాంతి ప్రదమైన మోక్షమును లభింపజేయును. ప్రమిదలో కాలునప్పుడు వత్తి నూనెతో కలిసి పొగ, శిఖ కలిగి వెల్గును. నూనె చెల్లిపోగా మండి అగ్నిలో కలిసిపోవును. గుణ కర్మలయందాసక్తి ఉన్న మనసు ఎన్నియో వృత్తులను అవలంబించును. గుణ కర్మలు వదలగా పరమాత్మయందు లీనమగును.

శోకము, మోహము, రోగము, రాగము, లోభము, విరోధము, అహంకారము, మమకారము మున్నగునవి కలిగించుటకు ప్రధానకారణము మనసు. నీశత్రువే మనసు. నీవు ప్రమత్తుడవై ఉన్న అది మరింత చెలరేగును. ఇది నీ ఆత్మ స్వరూపమును కప్పి పెట్టును. కాన నీవు జాగ్రత్త వహుము. శ్రీహరి పదపద్మములను ఉపాసించుట అను శస్త్రమున దానిని హతమార్చుము.

ఇక నీ ప్రశ్నలకు జవాబు చెప్పెదను వినుము :—.

శరీరము పాషాణము రెండును భూమియొక్క వికారము వలననే ఏర్పడినవి. మరి ఈ రెండింటికి భేదమేమి? కారణాంతరము వలన చలనము కలుగుటచే దీనికి "జనుడు" అని పేరు వచ్చినది. దీనికి రెండు పాదములున్నవి. పాదముల

మీద మోగాళ్ళున్నవి. మోగాళ్ళమీద పిక్కలున్నవి. పిక్కలమీద తొడలు, తొడలమీద నడుము, నడుము మీద రొమ్ము ఉన్నవి. దానిమీద భుజము మున్నగు అవయవములు ఉన్నవి. వాస్తవముగా వీనిలో దీనికి క్రమ కలిగి నదని చెప్పుటకు వీలు కలుగనందున శరీరమాశ్రయ పదార్థము దుర్లభము. మరి, భుజములమీద ఒక కఱ్ఱపల్లకి ఉన్నది. దానిపైన సింధు సౌవీర దేశముల రాజు అను భూమిలోని ఒకానొక వికారము కూర్చొని ఉన్నది. అది ఆత్మాభిమాన మున మదించి గ్రుడ్డిగా ఉన్నది.

పల్లకిలో కూర్చుండగానే నీవు గొప్పవాడవై పోలేదు. వాస్తవమునకు నీవు క్రూరుడవు. దుష్టుడవు. దీనులైన బోయీలచే చాకిరీ చేయించుకొని పరిపాలకు డను అని ప్రగల్భములు పలుకుదువు. సకల చరాచర జీవులన్నియు భూమి నుండియే పుట్టి తిరిగి భూమిలోననే కలిసిపోవుచున్నవి. పేర్లు మాత్రము వేరుగా ఉన్నవి. ఇంతకు మించి వేరేమియు లేదు.

"భూమి" అను శబ్ద వ్యవహారము సహితము అసత్యమే. భూమి పరమాణువు లలో లీనమగును. పరమాణువుల కలయికవలన భూమి ఏర్పడినది. ఈ పర మాణువులు అజ్ఞానమువలన మనసుచే కల్పించబడినవి. కావున వాస్తవము నకు పరమాణువులు సహితము అసత్యమే. భూమియు అసత్యమే.

సన్నము, లావు, అణువు, బృహత్తు, కారణము, కార్యము, చేతనము, అచేత నము, ద్రవ్యము, స్వభావము, సంస్కారము, కాలము, కర్మము, ఇవన్నియు అసత్యములు, మాయవలన పుట్టినవి.

సత్యమైనది విశుద్ధమైన జ్ఞానము ఒక్కటియే. అది లోపరహితమైనది. అద్వి తీయమైనది. పూర్ణమైనది. వినాశరహితమైనది. సర్వవ్యాప్తమైనది. అట్టి జ్ఞానమే పరమాత్ముడు. దానినే పండితులు వాసుదేవు డందురు.

తపస్సు, వైదిక కర్మలు, అన్నదానములు, అతిథి సేవలు, వేదాధ్యయన ములు, సూర్యుడు, అగ్ని మున్నగు దేవతలను ఉపాసించుటవలన పరమాత్మ జ్ఞానము కలుగదు. సత్సాంగత్యమునవే అట్టిజ్ఞానము కలుగును. మనసు వాసు దేవుని మీద లగ్నమగును.

సంసారమను కీకారణ్యమున ప్రవేశించి జీవుడు అనేక దుఃఖములను అనుభవిం చును. అతడు భయంకరమగువ్యసనములతో నిండియున్న ఆ యరణ్యమును వీడ లేడు. వనమునకు అవలనున్న స్వర్గము, విశాలము, ప్రశాంతము, ఆనంద దాయకము అయిన ప్రపంచ మొకటి ఉన్నదని గ్రహించలేడు. వన్యమృగ ముల బారినుండి, తనను కాని, తనవారలనుకాని రక్షించుటయందునో రక్షించు టకు ఏర్పాటుచేయుట యందునో జీవితమంతయు తను గడిపివేయును. తిరిగి

ఏ పేడలోని పురుగుగనో జన్మించి అందే మహానందమున్నదని భావించి పేడ లోనే పుట్టి పెరిగి నశించును. ఈ సంసారము కీకారణ్యము వంటిది. అగాధమైన కూపమువంటిది. అజగరము వంటిది. దాని ప్రవేశించినవారు బయట పడుట అరుదు.

రహూగణా! నీవును అదే అరణ్యమునందు కొట్టుకొనుచున్నావు. ప్రజలను దండించుట విరుద్ధము. ప్రాణులన్నింటిని బంధువులనుగా భావింపుము. విషయాసక్తిని విడిచి భగవంతుని సేవింపుము. జ్ఞానము అను వాడియైన గొడ్డలితో ఈ అడవిని నరికి బయటపడుము.''

జడభరతుని తత్త్వబోధవిని అంధకారమునుండి బయట పడినాడు రహూగణుడు. అతడు 'మహాత్మా! జన్మములన్నింటిలోను మానవజన్మ శ్రేష్ఠమైనది. స్వర్గమందలి దేవజన్మసహితము దీనికి సరిరాదు. ఏలననిన మానవ లోకమునందువలె స్వర్గమున నీవంటి సాధుపురుషుల సాంగత్యము లభించదు.

ఒక ముహూర్తకాలము నీ సాంగత్యము లభించినందున నా అజ్ఞానాంధకారము పటాపంచలైనది. కాన నీ పాదధూళిని సేవించిన మహాత్ములకు భగవంతునిపై భక్తి కుదురుటలో ఆశ్చర్యములేదు.

నమో మహద్భ్యోఽస్తు నమశ్శిశుభ్యో
నమో యువభ్యోఽస్తు నమో వటుభ్యః

యే బ్రాహ్మణా గామవధూత లింగా
శ్చరంతి తేభ్యశ్శివమస్తురాజ్ఞామ్.

బ్రహ్మజ్ఞానులైన మహాత్ములు ఏవేషమున ఎచట ఎట్లుందురో, ఎట్లు సంచరింతురో తెలియదు. అందువలన బ్రహ్మజ్ఞానులైన వయోవృద్ధులకు, శిశువులకు, యువకులకు, వటువులకు, నమస్కారము. వారి వలన రాజులకు శుభము కలుగు గాక!

శృణోత్య ఖ్యాపయత్య భినందతి చ సర్వా హ్యేవాత్మన
ఆశిష ఆశాస్తే కాంచిన్నపరత ఇతి.

భరతుని చరిత్ర విన్నను, వినిపించినను, అభినందించినను, యాచించ నవసరము లేకనే, అన్ని కోరికలు స్వతస్సిద్ధముగా నెరవేరును.

మనసునకు అత్యధికమైన ప్రాధాన్యమును ఇచ్చినవాడు జడభరతుడు. వాస్తవముగ బంధమోక్షములకు మనసే ముఖ్యకారణమైనది. ఒకేవని మనసును ఇట్టి దుష్కార్యములగను సత్కార్యములగను వరి...

మించుచున్నది. ఒకడు ఒక అంగడినుండి రొట్టె దొంగిలించినాడు, అట్లు దొంగిలించి యజమానిని నష్టపరచుట అతని ఉద్దేశము. ఉద్దేశము చెడుదైనందున అది దుష్కార్యమైనది. ఇంకొకడు ఆకలికి అలమటించు వాని బాధచూడలేక, తనవద్ద లేనందున, రొట్టె దొంగిలించి ఆకలితో అలమటించు వానికి ఇచ్చినాడు. అతని తలంపు మంచిది కాన అది సత్కార్యమైనది.

ఒకే కార్యము మనసును బట్టి దుష్కార్యముగను, సత్కార్యముగను పరిణమించుటను గమనించినాము.

మనసును బట్టియే భారము తగ్గుటయు హెచ్చుటయు గమనింతము.

ఒక మణుగు బంగారముగల పెట్టె మనకు దొరికిన దానిని సంతోషముగను సునాయాసముగను మోయగలము. మణుగు ఇనుము మోయుమన్న భారము కలుగును.

తనవారిని పోషించుటకు ఎన్నో ఇక్కట్లు పడుచుండు స్వార్థముగల వ్యక్తి, అందు సగము పరుల కొఱకు చేయుమనిన భారముగా తలంచును. ఇదంతయు చిత్తవృత్తి.

చిత్తము స్వాధీనమున నున్నవారు దేనినైనను సాధించుట అబ్బురమా?

భరతుడు పల్లకి మోయువానికి శ్రమలేదని నిరూపించినాడు. ఎట్లో విచారింతము. మట్టితో ఒక రాతి బొమ్మను ఒక ఎద్దు బొమ్మను చేసి పల్లకిని రాతిపై పెట్టిన బరువనిపించునా? మరి ఎద్దుపై పెట్టిన బరువెట్లు తోచును? అదియే భరతుడు నిరూపించినది. చెట్టు, ఎద్దు, మనిషి అన్నియు భూమినుండియే పుట్టినవి. చెట్టునకును, ఎద్దునకును లేని శ్రమ మనుష్యునకు ఎట్లు కలుగును?

చెట్టు, ఎద్దు, మనిషి వేరు వేరు రూపములు కనిపించుచున్నవి కదా? యనవచ్చును. కామెర్ల రోగము గలవానికి జగమంతయు పచ్చగా కనిపించును. అందువలన లోకమంతయు పచ్చగా యున్నదనుట వాస్తవమగునా? అతని రోగము పోయిన వెనుక వాస్తవమును అతడు గ్రహించును. చీకటిలో త్రాడును చూచి పాము అనుకొని ఎగిరి గంతువేసి కేకవేయును. వెలుగుతెచ్చి చూపిన అది త్రాడని తెలుసుకొనును. చీకటిలో అతడు చూచినది నిజముగా పాము అని నిరూపింపలేముగదా? మాయ అనునది చీకటి వంటిది. ఆ చీకటియందు త్రాడు మనకు పాముగా కనిపించినది. జ్ఞానము కలిగి మాయ అను చీకటి తొలగిపోగా దాని నిజస్వరూపము తెలియును. అట్లే మాయామోహితులమైన మనకు రాతివలెను, ఎద్దువలెను, మనిషి వలెను కనిపించునదంతయు వాస్తవముగ ఒకే పదార్థము.

మిథ్యావాదమున పరాకాష్ఠను నందుకున్నారు జడభరతుడు. ప్రాణికి కారణభూతమగు భూమియే కాక భూమికి కారణభూతమగు పరమాణువు సహితము ''మిథ్య'' యనుచున్నారు.

మౌనముగా నుండుట, పురుగులను చంపకుండుట మున్నగు నియమములు జైన మతస్థులందు కానిపించుచున్నవి. కృచ్ఛ్రము, ఉపవాసము మున్నగువానిచే శరీరమును కృశింపజేసి మరణించుట సహితము వారియందు కానవగును.

నరకము.


నరకమనిన పాపములు చేయువారిని శిక్షించు ప్రదేశము. ఏయే పాపమునకు ఏయే నరకమున ఎట్లు శిక్షింప బడుదురో ఈ క్రింద కనబరచిన పట్టికవలన తెలియవగును.

నరకము పేరు	పాపములు	శిక్ష
1. తామిస్ర నరకము.	పరధన, పరసంతాన పరస్త్రీ అపహారణకు	అంధకారబంధురమున పడవేసి కర్రలచే బాదుదురు.
2. అంధతామిస్ర నరకము.	మోసగించి స్త్రీలను ధనమును పుచ్చుకున్నవారు	కండ్లు కనిపించని నరకమున నరికిన చెట్లవలె పడిపోవుదురు.
3. రౌరవము.	ఇతర ప్రాణులను చంపి తన కుటుంబమును పోషించుకున్న వానిని	రురువులు అను పాములకన్న ఘోరమగు జంతువులు హింసించును.
4. మహారౌరవము.	సంపాదించినది అచ్చము తనకొరకే వెచ్చించుకొనిన వానిని	పచ్చిమాంసము తిను రురువులు హింసించెదరు.
5. కుంభీపాక నరకము.	పశు, పక్ష్యాదులను చంపి పొట్టనింపుకొను వానిని	సలసల కాగు నూనెలో పడవేయుదురు.
6. కాలసూత్ర నరకము.	తలిదండ్రులను, వేదములను, బ్రాహ్మణులను ధిక్కరించిన వానిని	రాగి నేల కలిగి, నెత్తిన నిప్పులు చెరుగు సూర్యుడు కలిగి మాడ్చివేయుచుండును
7. అసిపత్రవనము.	ఆపద సమయములందు కాక ఇతరసమయముల వేదములను ధిక్కరించిన వారు	కొరడాలతో గొడ్డును బాదినట్లు బాదుట. సర్వాంగములను కత్తులతో కోయుట యను శిక్షల ననుభవింతురు.
8. సూకరముఖము.	దండించదగని వారిని దండించిన రాజులను	చెరుకుగడలవలె గానుగలలో పెట్టి త్రిప్పుదురు.
9. అంధకూపము.	నల్లులు మున్నగు వానిని చంపిన వానిని	పాములు, నల్లులు, దోమలు, చీమలు హింసించును.



జడభరతుడు రహూగణునకు నరకముల పేర్లు, అచట పెట్టు యాతనలను వివరించుట. పుట. 208

10. క్రిమిభోజన	అతిథులకు అభ్యాగతులకు అన్నము పెట్టక తనపొట్ట నింపుకొను వాడు	క్రిములతో నిండిన లక్షయోజనముల కుండలో పడవేయబడును.
11. సందంశన	ఆపద లేకనే బ్రాహ్మణుల ధనము, ఇతరుల బంగారము, రత్నములు దోచుకున్న వారు	మండుచున్న కడ్డీలతో పొడుచుట, పటకారుతో చర్మము పీకుట వంటి శిక్షల ననుభవించెదరు.
12. తప్తసూర్మి	సంభోగించరాని ఆడదానితో సంభోగించిన మగవారు, అట్టి మగవారితో సంభోగించిన స్త్రీలు	మండుచున్న ఇనుప పురుష మూర్తిని స్త్రీలచే, స్త్రీమూర్తిని పురుషులచే కౌగిలింపచేయబడుదురు.
13. వజ్రకంటక శాల్మలి	పశువులతో సంభోగించిన వాడు	ముళ్ళున్న బూరుగు చెట్టు మీదికి ఎక్కించి క్రిందకు లాగబడును.
14. వైతరణి	కులమర్యాద పాటించని రాజు లేక రాజోద్యోగి	చీము, రక్తము, తలవెండ్రుకలు, గోళ్ళచే నిండి ఉండు నదిలో త్రోయబడును.
15. పూయోదన	శౌచము, ఆచారము పాటించని వారిని	మల మూత్రాదులచే నిండిన సముద్రమున పడద్రోతురు.
16. ప్రాణరోధ	కుక్కలను, గాడిదలను పెంచి వేటనే వృత్తిగా పెట్టుకున్న బ్రాహ్మణులను	అంపకోలలచే వేటాడుదురు.
17. వైశస	దంభ యజ్ఞములు చేసి పశువులను హింసించువారు	ప్రాణాంతకమైన యాతనల ననుభవింతురు.



జడభరతుడు రహూగణునకు నరకముల పేర్లు, మరియు అచట పెట్టు
యాతనలను వివరించుట. పుట.210

18.	లాలాభక్ష	కులభార్యచే వీర్యపానము చేయించువారిచే	వీర్యపానము చేయింతురు.
19.	సారమేయాదనము	ఇండ్లు తగులబెట్టుట, విషము పెట్టుట, బిడార్లు దోచుట, గ్రామములకు కీడు చేయువారిని	వజ్రములవలె కరకుగా వున్న కోరలుగల ఏడువందల జాగిలములు పీక్కొని తినును.
20.	అవీచిమంత	అబద్ధ సాక్ష్యములు చెప్పినవారు, లావాదేవీలలో బొంకిన వారు	వందయోజనముల ఎత్తయిన యిన పర్వత శిఖరముల నుండి పడద్రోసి పచ్చడి చేయబడుదురు.
21.	అయఃపానము	వ్రతనిష్ఠతో వుండి మద్యపానము చేసిన బ్రాహ్మణులు, సోమపానము చేసిన క్షత్రియులు, వైశ్యులచే	కరగిన ఇనుము త్రాగింతురు.
22.	క్షారకర్దమ	తనకన్న అధికుని తిరస్కరించువారిని	తలక్రిందుల పడద్రోసి బాధలు పెట్టుదురు.
23.	రక్షోగణభోజన	నరమేధములు చేయువారిని, నరమాంసము, పశువుల మాంసము తిను స్త్రీలను	వాడిగల ఆయుధములచే ముక్కలు ముక్కలుగా కోసి కేరింతలు పెట్టుదురు.
24.	శూలప్రోతము	నిరపరాధులైన అడవి జంతువులను, ఊర పశువులను నమ్మించి పొడిచి చంపినవారు	శూలములచే పొడువబడి ఉరి కంబములకు ఎక్కింపబడుదురు

25. దందశూకర	ప్రాణికోటికి భయము కలిగించు ఉగ్రస్వభావులను	అయిదు తలల ఏడు తలల పాములు ఎలుకలను హింసించినట్లు హింసించెదరు.
26. అవధనిరోధన	గదులలోను, నూతులలోను ఇతరులను బంధించిన వారిని	విషాగ్నులు మండించి విషపు పొగలుపెట్టి ఉక్కిరి బిక్కిరి చేయుదురు.
27. పర్యావర్తన	అతిథులను, అభ్యాగతులను గర్హించినవారిని	కను గ్రుడ్లను కాకులచే పొడిపింతురు.
28. సూచీముఖ	ధన మదాంధతతో అందరిని చిన్నచూపు చూచు వారిని	శరీరమును సూదులతో బొంతనువలె కుట్టుదురు.

ఇది పంచమ స్కంధము

శ్రీమద్భాగవతము

షష్ఠ స్కంధము

అజామీళుని కథ.

కన్యాకుబ్జమున అజామీళుడను ఒక బ్రాహ్మణుడు ఉండెవాడు. అతడు ఉత్తముడు. శాస్త్రజ్ఞుడు. సదాచార సంపన్నుడు. సద్గుణరాశి. వినయవంతుడు. జితేంద్రియుడు. సత్యవాది. పవిత్రుడు. అతిథులను, అగ్నులను, వృద్ధులను సేవించువాడు. పరోపకార శీలుడు, మితభాషి.

ఒకరోజు అతడు తండ్రి ఆజ్ఞను అనుసరించి అడవికి వెళ్ళినాడు. పుష్పములు, ఫలములు, కుశలు మున్నగునవి పట్టుకొని ఇంటికి తిరిగివచ్చుచుండగా, మార్గ మధ్యమున మనమునకు వికారము కలిగించు ఒక దృశ్యము అతనికి కాన్పించినది.

ఒక రంకుటాలు మద్యము త్రాగి మత్తులో ఉన్నది. కళ్ళు మత్తున ఎరుపెక్కినవి. మొలన బట్టవూడిపోయి నగ్నముగా ఉన్నది. ఒక పురుషుడు తప్పతాగి ఉన్నాడు. మైకమున అతనికి కళ్ళు కనిపించుటలేదు. వారిరువురు దారిలో బహిరంగప్రదేశమున సంగమక్రియ జరుపుచున్నారు.

అజామీళుడు వారిని చూచినాడు. వారు అజామీళుని చూచుస్థితిలో లేరు. పురుషుడు ఆమెను గట్టిగా కౌగిలించుకొని పరవశుడగుచున్నాడు. అతడుగాని, ఆమెగాని గమనించలేదు. వారు రతిక్రీడ మానలేదు.

అజామీళుడు కామపరవశుడైనాడు. అతడు జ్ఞాని, శుచి, జితేంద్రియుడు. మనసును అదుపులో పెట్టుటకు ఎంతో ప్రయత్నించినాడు. చాల బాధపడినాడు. కాని మనసును గెలువలేకపోయినాడు. మన్మధునిముందు నిలువలేకపోయినాడు.

అజామీళుడు ఓడినాడు. మన్మధుడు గెలిచినాడు. అతని జితేంద్రియత్వము అడుగంటినది. శాస్త్రజ్ఞానము మంటగలసినది. ధర్మము గాలికి ఎగిరిపోయినది. ఆ రంకుటాలు వద్దకు చేరినాడు. తనదేహమును దానికి అర్పించినాడు. తన సంపద యావత్తు ఆవిడకు ధారపోసినాడు. ఆమె కడగంటి చూపుకొరకు ఆత్మార్పణ చేయుటకు సిద్ధపడినాడు.

అగ్నిసాక్షిగా పెండ్లాడిన భార్యను వదలివాడు. రంకుటాలుకు బానిసయై సదా భారమును మఃటకలిపినాడు. దారులుకాచి బాటసారులను దోచుకున్నాడు. మోసముచేసి, దొంగతనముచేసి డబ్బు సంపాదించినాడు. ఇతరులను నానా హింసలు పెట్టినాడు. ఉంపుడు కత్తెవలన అనేకమంది పిల్లలను కన్నాడు.

కాలచక్రము గిరగిర తిరిగినది. అజామీళునకు ఎనుబది సంవత్సరముల వయస్సు వచ్చినది. వెంట్రుకలు నెరిసినవి. పండ్లు ఊడినవి. కనుచూపు మందగించినది. జఠరాగ్ని తగ్గినది. తల వణకసాగినది. అట్టిదశలో సహితము ఉంపుడుకత్తె చివరి పుత్రుడనిన అతనికి అపారమగు అనురాగము. వాని చిలుక పలుకులువిని ఆనందించువాడు. ఆటలు పాటలుచూచి మురిసిపోవువాడు. అన్నము స్వయముగా తినిపించువాడు. ఉంపుడుకత్తె పిల్లలంటె ప్రాణము విడుచువాడు. ఆ జంజాటమున తన తలపైనున్న మృత్యువును గమనించలేక పోయినాడు.

అజామీళునకు మరణకాలము సమీపించినది. అపుడు సహితము అతని మనసు ఉంపుడుకత్తె చివరిపుత్రుని మీదనే ఉండినది. వాని పేరు నారాయణుడు.

భయంకరమగు ముగ్గురు యమకింకరులు అజామీళునకు కనిపించినారు. చేతులలో యమపాశములుండి వికృతాకారములుగల ఆ యమభటులనుచూచి అదిరిపోయినాడు. చనిపోవుచున్నానని గ్రహించినాడు అజామీళుడు. చిన్నకొడుకు కళ్ళలో మసిలినాడు. వాడు దగ్గరలేడు. దూరముగా ఆడుకొనుటకు వెళ్ళినాడు. ఉచ్చస్వరమున "నారాయణా ! నారాయణా !" అని కేకవేసినాడు.

> నశమ్య మ్రియమాణస్య ముఖతో హరికీర్తనమ్
> భర్తుర్నామ మహారాజ పార్షదాస్సహసాపతన్

మరణసమయమున హరికీర్తనము చేసినందున వెంటనే విష్ణుదూతలు అచట ప్రత్యక్షమైనారు.

అజామీళుని దేహమునుండి సూక్ష్మదేహమును యమదూతలు లాగుకొని పోవుటకు ప్రయత్నించుచుండగా విష్ణుదూతలు అడ్డుపడినారు.

యమదూతలు తేజోవంతులైన విష్ణుదూతలను చూచినారు. వారి నేత్రములు తామరరేకులవలె ఉన్నవి. వారు పీతాంబరములు ధరించినారు. తలలపై రత్నఖచితములైన కిరీటములున్నవి. చెవులకు తళతళ మెరయు కుండలములున్నవి.

మెడలలో తామరపూవుల దండలున్నవి. నాలుగుచేతులందు శంఖ, చక్రాద్యాయుధములున్నవి.

వారినిచూచి వెనుకంజ వేసినారు యమదూతలు. వికృతాకారులగు ఆ యమదూతలు తేజోవంతులగు విష్ణుదూతలనుచూచి, "స్వాములారా! మీ రెవరు? ఎవరి దూతలు? యమధర్మరాజు భటులమైన మేము మా ధర్మము నిర్వర్తించుచుండగా ఏల అడ్డుతగులుచున్నారు?"

విష్ణుదూతలు మేఘగంభీరస్వరమున పెద్దగానవ్వి, "మీరు యమధర్మరాజు దూతలా? ఎవరిని, ఏల దండించవలెనో చెప్పగలరా?" అని అడిగినారు.

యమదూతలు వారికిట్లనిరి.

> "వేదము చెప్పినది ధర్మము. వేదమునకు వ్యతిరేకమయినది అధర్మము. వేదము స్వయం ప్రకాశకమైనది. నారాయణాత్మకమైనది. శారీరకముగను, మానసికముగను చేయు పను లన్నిటికి సూర్య చంద్రాదులు, అగ్ని, దిశలు, వాయువు, ఇంద్రియములు, సంధ్యలు, రాత్రింబవళ్ళు, ఆకాశము, నీరు, భూమి, కాలము, ధర్మము సాక్షులు. వీనివలన అధర్మము తెలిసిపోయి దండనార్హుల నిర్ణయము జరుగును. పాపము చేసినవారెల్లరు తమతమ కర్మముల ననుసరించి దండనార్హు లగుదురు.
>
> మనుష్యులు పుణ్యకర్మలు పాపకర్మలు చేయుదురు. వారివి కర్మగుణముల సంబంధము వదలదు. 'దేహవాన్నహ్య కర్మకృత్' దేహము ధరించిన వాడు కర్మచేయక ఉండలేడు. ఈ లోకమున చేసిన కర్మమునకు పుణ్యమును, అధర్మమునకు పాపమును అనుభవింతురు. సత్వరజస్తమో గుణముల భేదము వలన ఈ లోకమున పుణ్యాత్ములు, పాపాత్ములు ఏర్పడుచున్నారు. సత్వగుణ ప్రధానులైనవారు సుఖమును అనుభవించుచున్నారు. వారు పుణ్యాత్ములు. రజోగుణ ప్రధానులైనవారు సుఖదుఃఖములను అనుభవించు చున్నారు. వారు పుణ్యపాపాత్ములు. తామస గుణ ప్రధానులు దుఃఖమునే అనుభవించుచున్నారు. వారు కేవలము పాపాత్ములు. అదే విధముగా ఈ జన్మమునందలి పాపపుణ్యములను బట్టియే పరజన్మమందలి పాపపుణ్యములు తెలియును.

మా యమధర్మరాజు సర్వజ్ఞుడు. అతడు అందరి మనసులందును ఉండును. అతడు అందరి పాప పుణ్యముల పరికించగలడు. ఈ యజామీళుడు ఉంపుడుకత్తెవెంట బడి ధర్మచ్యుతుడై అధర్మకార్యములు చేసినందున ఇతనిని యమలోకమునకు కొనిపోవుటకు వచ్చినాము. మీరు మమ్మేల అడుచున్నారు?"



అజామీళుని ఆత్మను నరకమునకు తీసుకొనిపోవుచున్న యమకింకరులను
విష్ణుభటులు దండించుట. పుట.216

అందుకు విష్ణుదూతలు యమదూతలతో నిట్లనిరి.

"ధర్మదూతలారా! మేము విష్ణుదేవుని దూతలము. ప్రజారక్షకుడు, సమదర్శి, శాసకుడు అయిన ప్రజాపతి విషమముగా ప్రవర్తించినచో ప్రజలు ఎవరిని శరణు వేడవలెను?

యద్యదాచరతి శ్రేయా నితరస్తత్తదీహతే
స యత్ప్రమాణం కురుతే లోకస్తదనువర్తతే

ఉత్తములు నడుచుకున్నట్లు సాధారణులు నడుచుకొందురు. వారు దేనిని ప్రమాణముచేసిన లోకులు దానిని అనుసరింతురు.

సాధారణులు ధర్మాధర్మతత్త్వము తెలియక ఉత్తములనే నమ్ముకొందురు.

నెమ్మికొడలమీద నిద్రించు చెలికాని నమ్మదగినవాడు నయము విడిచి
ద్రోహబుద్ధి చంప దగునె యెంతైన ప్రీతిలేక ధర్మదూతలార!

ఈ యజామిళుడు భగవంతుని కళ్యాణప్రదమైన నామము గొంతెత్తి 'నారాయణ!' అని పలికినాడు.

'ఏతేనైవ హ్యఘోనోఽస్య కృతం స్యాదఘనిష్కృతమ్
యదా నారాయణాయేతి జగాద చతురక్షరమ్'

దానితో కోటిజన్మల పాపమునుండి ఇతడు నిష్కృతుడైనాడు. 'నారాయణ' అను నాలుగు అక్షరములు ఉచ్చరించిన ఉత్తరక్షణముననే ఇతని పాపములు పటాపంచలైనవి.

బ్రహ్మహత్యానేక పాపాటవుల కగ్నికీలలు హరినామ కీర్తనములు
గురుతల్ప కల్మష క్రూరసర్పములకు గేకులు హరినామ సంకీర్తనములు
తపనీయ చౌర్యామ తమసంతతులకు సూర్య కిరణముల్ హరినామ కీర్తనములు
మధుపాన కిల్బిష మదనాగ సమితికి గేసరుల్ హరినామ కీర్తనములు
మహిత యోగోగ్ర నిత్యసమాధి విధుల నలయు బ్రహ్మాది సురులకు నందరాని
భూరి నిర్వాణ సామ్రాజ్య భోగభాగ్య ఫలదములు హరినామ కీర్తనములు.

అజామీళుడు మరణసమయమున భగవానుని నామము ఉచ్చరించినాడు. కాబట్టి తన పాపములన్నింటికి పూర్తిగా ప్రాయశ్చిత్తము చేసుకున్నవాడైనాడు. మీరు అతనిని తీసుకొని వెళ్ళుటకు వీలులేదు.

బిడ్డపేరుపెట్టి పిలిచినను, ఎగతాళిగానైనను, పాటకోసరమైనను, హేళనకైనను, భగవంతుని పేరు పలికిన పాపములన్నియు పటాపంచలగునని పండితులందురు.

'జారినచోట గొట్టువడి యుంచినచోట మహాజ్వరాదులం
దేలినచోట సర్పముల దీటులనందినచోట నార్తులై
తూలినచోట విష్ణు భగవాయని పేర్కొనలేని మీద నా
క్రాంతులు యూతినా వితతినానము పొందరు దుఃఖలోకముల్'

మహర్షులు పెద్దపాపములకు పెద్ద ప్రాయశ్చిత్తములు, చిన్నపాపములకు చిన్న ప్రాయశ్చిత్తములు నిర్ణయించినారు. తపస్సువలనను, జపములవలనను, దానములవలనను పాపములు పోవునను మాట వాస్తవమే కాని పాపములవలన మలినమైన హృదయము పరిశుద్ధమగునా? – భగవంతుని పాదసేవ వలననే చిత్తము పరిశుద్ధమగును.

ఎరుగక భగవంతుని నామము ఉచ్చరించిన పాపములు ఎట్లు నశించునందు రేమో. తెలియక ఐనను శక్తివంతమగు మందు తినినప్పుడు వ్యాధిగుణము [illegible] శీఘ్రముగా నొందదా? అట్లే తెలియకున్నను భగవన్నామమును ఉచ్చరించిన దాని ఫలితము తప్పక కలుగును."

విష్ణుదూతలు అట్లు యమదూతలతో వాదించి అజామీళుని యమకింకరుల బారి నుండి రక్షించినారు. యమకింకరుల బారినుండి బయటపడి నందునను, శుభావహము, శాంతిప్రదమునైన విష్ణుదూతల దర్శనము వలనను అజామీళుని భయము తగ్గినది. అతడు స్థిరచిత్తుడైనాడు.

విష్ణుదూతలు అంతర్ధానులైనారు.

విష్ణుదూతలనోట భాగవత ధర్మమును విన్న అజామీళుని హృదయమున భక్తి భావము తలెత్తినది. తన పాపములు కన్నులముందు తాండవ మాడినవి. వాటిని తలచుకొని అతడు గాఢమగు పశ్చాత్తాపము నందినాడు.

"అయ్యో! ఎంతపాపిని నేను. బ్రాహ్మణుడనైన నేను ఉంపుడుకత్తె కడుపున సంతానముకని భ్రష్టుడనై పోతినే! వృద్ధులైన తలిదండ్రులను దిక్కులేని వారలను చేసినానే! అయ్యో!! ఎంత కృతఘ్నుడను నేను!!! కట్టుకున్న భార్యను వదిలి ఉంపుడు కత్తెకొరకు ఎన్ని ఘోరములైన పాపములు చేసినాను! నేను ఎంతఘోరమగు నరకమున కూలవలసి ఉన్నదో? ఏది దారి?

ప్రాణమును, ఇంద్రియములను, మనసును సంయమ పరచుకొని జాగ్రత్తపడెదను. ఇక పాపాంధకారమున అడుగుపెట్టను. అవిద్యవలన అనేక కోర్కెలు కొనితెచ్చుకొని నాకాళ్ళకు నేనే బంధములుపెట్టుకున్నాను. వాటిని తెంచుకొందును. వాసనలు వదలుకొని ప్రాణికోటికి మేలుచేయుదును. దీనులఎడ దయ చూపుదును" అనుకున్నాడు.

విష్ణుదూతల క్షణకాల సాంగత్యమువలన అజామీళునకు నిర్వేదము కలిగినది. సంసార బంధములను త్రెంచుకొని హరిద్వారమునకు వెళ్ళినాడు. ఒక మందిరమున కూర్చుని భక్తియోగము అవలంబించినాడు. ఆత్మను పరమాత్మకు సమర్పించినాడు.

అపుడు పూర్వపు విష్ణుదూతలు అతనియందు ప్రత్యక్షమైనారు. అజామీళుడు వారికి నమస్కరించి, శరీరమును త్యజించినాడు. ఉత్తరక్షణమున విష్ణుదేవునివంటి ఆకారము అతనికి వచ్చినది. అతడు విష్ణుదూతలతో కలిసి బంగారు విమానమెక్కి విష్ణుపదము చేరుకున్నాడు.

య ఏతం పరమం గుహ్యమితిహాస మఘాపహమ్
శృణుయాచ్ఛ్రద్ధయా యుక్తో యశ్చభక్త్యానుకీర్తయేత్
నవై స నరకం యాతి నేక్ష్యతే యమకింకరైః
యద్యప్యమంగళో మర్త్యో విష్ణులోకే మహీయతే

ఈ చరిత్రము అతిరహస్యమైనది. పాపములను పోగొట్టునది. శ్రద్ధగా దీనిని విన్నవాడు, కీర్తించినవాడు నరకమును తప్పించుకొనును. అతనికి యమకింకరులు కనిపించరు. అతడు ఎంతపాపాత్ముడైనను విష్ణులోకమును చేరును.

అజామీళునికథ ఒక నూతనాధ్యాయమును ప్రారంభించినది.

మానవ సమాజపు తొలిదశలో మతమే రాజకీయమైయుండెను. రాజశాసనము పేరికవరికాక నామమాత్రముగ నున్నపుడు మానవుని దుష్కార్యములనుండి మరలించినది మతము మాత్రమే. జనులకు భయంకరములగు పాపములను చూపి వారిని పరహింసనుండి మరలించినది మతము.

రాచరికము బలవత్తరమైనకొలది మతముయొక్క ఆశ్రయమును రాజకీయము వదలినది. రాజకీయము నేరస్థుని దైహికముగా శిక్షించునది కాగా మతము పారలౌకికముగా శిక్షింపసాగినది. అట్లు నేరములు, పాపములు విడిపోయినవి. నేరములు భౌతికములు కాగా పాపములు ఆధ్యాత్మికములైనవి.

అజామీళుని కాలమునకు రాజులు మతాశ్రయమును పూర్తిగా వదిలియుండవలెను. కాబట్టియే అజామీళుని నేరములను గురించి ఎక్కువగా విచారించలేదు విష్ణుదూతలు. నేరములుచేసిన శిక్షింపవల

సినవాడు గదా. ధర్మమునకు సంబంధించి నంతవరకు నారాయణ నామోచ్చారణతో అతడు పవిత్రు డైనాడు. అంతేకాక అతడు పశ్చాత్తాప పడినాడు. పశ్చాత్తాపమునకంటె నరుడు చేయదగినదేమి?

మనసునకు సంబంధించిన వాదము, భరతునివద్ద బలపడి చాల బలవత్తరమైనది. ధర్మమునకు ప్రాధాన్యత తగ్గినది. "తపోదానవ్రతములంటే పాపమునశించును. వాస్తవమేకాని పాపమువలన మలిన మైన హృదయము పరిశుద్ధమగునా?" అను విష్ణుదూతల వాదమున నొంతేని బలమున్నది. గోహత్యచేసి తర్వాతను అశ్వమేధముచేసిన అది దానికి ప్రాయశ్చిత్తమైనచో అతడు మరొక బ్రహ్మహత్యచేసి మరొక అశ్వమేధము చేయవచ్చునుకదా! ఈ ధర్మమందు హృదయ పరివర్తనమునకు స్థానము లేనందున హార్దిక పశ్చాత్తాపము ప్రాయశ్చిత్తమునకన్న మేలుకదా! అందువలననే పశ్చాత్తాపపడిన అజామీళుడు విష్ణుపదము చేరినాడు.

రహూగణైతత్తపసా నయాతి నచేజ్యయా నిర్వపణాద్గృహాద్వా
నచ్ఛందసా నైవజలాగ్నిసూర్యైర్వినా మహత్పాద రజోభిషేకమ్

జడభరతుడు రహూగణునకు ధర్మము ఉపదేశించుచు 'మహాపురుషుల పాదసేవ చేయనిచో తపస్సు, వైదికకర్మలు, అన్నదానములు, అతిథిసేవలు, దీనులను సేవించుటను, గృహస్థుల ధర్మ కార్యములు, వేదాధ్యయనములు, జలాగ్ని సూర్యాది దేవతల ఉపాసనలు వంటి సాధనలవలన పర మార్థజ్ఞానము కలుగదు'' అని చెప్పినాడు. అట్లుచెప్పి అతడు వేదాధ్యయనాదుల ప్రాధాన్యతను పూర్వులు అంగీకరించినంతగా అంగీకరించలేదు.

అజామీళుని కథలో యమదూతలు వేద సమ్మతమైనదే ధర్మము, వేదవ్యతిరేకమైనది అధర్మము. అనగా విష్ణుదూతలు.

యద్యదాచరతి శ్రేయా నితర స్తత్తదీహతే
సయత్ప్రమాణం కురుతే లోక స్తదను వర్తతే.

ఉత్తములు నడచుకొన్నట్లు సాధారణులు నడచుకొందురు. వారు దేనిని ప్రమాణముచేసిన లోకులు దానినే అనుసరింతురు అనుచున్నారు.

వేదముకన్న సత్పురుషుల ఆచరణకే వారు ఎక్కువగా ప్రాధాన్యతను ఇచ్చుచున్నారు.

బృహస్పతికి పరాభవము.

సంపద గర్వమునకు కారణమగును. అధికారము వలన మదాంధత కలుగును. సంపదయు అధికారమును రెండును కలిగినవి ఇంద్రునకు, అతడు కన్నుమిన్ను కానలేదు.

ఒకనాడు ఇంద్రుడు కొలువు తీర్చినాడు. సభ నిండిపోయినది. మరుత్తులు 49 మంది, వసువులు 8 మంది, రుద్రులు 10 మంది, ఆదిత్యులు 12 మంది, విశ్వే దేవతలు, సిద్ధులు, సాధ్యులు, చారణులు, గంధర్వులు, బ్రహ్మవాదులు మునీ శ్వరులు, గంధర్వులు, విద్యాధరులు, గరుడులు, నాగులు, కిన్నరులు మొదలగు వారెల్లరు ఇంద్రుని పలురకములగు స్తోత్రముల కీర్తించుచున్నారు. సింహాస

నముపై చంద్రమండలమువంటి ఛత్రము ప్రకాశించుచున్నది. భార్య శచీదేవిని తొడమీద కూర్చుండ బెట్టుకొని సింహాసనమున కూర్చున్న ఇంద్రుడు గొప్ప ప్రకాశమున వెలిగిపోవుచుండెను.

బృహస్పతి అచటికి వచ్చినాడు. అతడు దేవతలకు ఆచార్యుడు. సభాసదులందరు లేచి నిలువబడి ఆచార్యునకు నమస్కరించినారు. ఇంద్రుడు లేచి నిలువలేదు. నమస్కరించలేదు. ఆసన మర్పించలేదు.

ఇది ఐశ్వర్యము వలన కలిగిన దురహంకారమని గ్రహించినాడు ప్రాజ్ఞుడైన బృహస్పతి. పలుకు పలుకలేదు. చప్పున వెనుకకు తిరిగి వెళ్ళిపోయినాడు.

దేవేంద్రుడు సభ చాలించి ఇంటికి వెళ్ళినాడు. బృహస్పతి గిరుక్కున తిరిగి వెళ్ళి పోవుట అతని హృదయమున మెసలసాగినది. రాక్షసులను వారి బలమును తలచుకున్నాడు. బృహస్పతిని అతని ప్రాజ్ఞతను తలచుకున్నాడు. బృహస్పతి లేకున్నచో రాక్షసులకు కలుగు బలమును, దేవతలకు కలుగు పరాభవమును గురించి ఆలోచించినాడు. తాను చేసినది పొరపాటని గ్రహించినాడు. అపరాధమని ఎరిగినాడు. దేవతల రాజులలో రాక్షసత్వము ప్రవేశించిన దని గమనించినాడు. గురుదేవుని పాదములపై వ్రాలి అతనిని ప్రసన్నుని చేసుకొన దలచుకున్నాడు.

ప్రాజ్ఞుడు అవజ్ఞ సహించలేదు.

అవమానము పొందిన బృహస్పతి ఇంటికి వెళ్ళినాడు. తాను దేవతలకు చేసిన ఉపకారమును దేవేంద్రుడు తనకు చేసిన అవమానమును తలచుకున్నాడు. అధ్యాత్మ మాయతో అదృశ్యుడైనాడు.

ఇంద్రుడు బృహస్పతి ఇంటికి వెళ్ళినాడు. బృహస్పతి కాన్పించలేదు. అతని గుండెలో రాళ్ళ వర్షము కురిసినది. అతని మనసునకు శాంతి కరవైనది.

అనుకున్నంత అయినది. బృహస్పతి దేవతలను వీడినాడను విషయము రాక్షసులకు తెలిసినది. వారు ఆనందపరవశులైనారు. దేవతల మీదకు దండెత్తినారు. దేవతలకు రాక్షసులకు ఘోరమైన యుద్ధము జరిగినది. రాక్షసుల బాణములు దేవతల తలలను తాటికాయలవలె నేలకూల్చినవి. దేవతలు రాక్షసులకు ఓడి, పారిపోయినారు. బ్రహ్మవద్దకు వెళ్ళి మొరపెట్టుకున్నారు.

“దేవతలారా! మీరు రాక్షసులకన్న బలవంతులు. కాని బలహీనుల చేత ఓడినారు. ఇది మీరు కోరి తెచ్చుకున్నది. అధికార మదము మీ కళ్లు కప్పినది. అవినీతిపరులైనారు.

"మనుష్యుడు ఎంత బలవంతుడైనను అవినీతి అతనిని బలహీనుని చేయును."

పూర్వము రాక్షసులు తమ గురువైన శుక్రాచార్యుని అవమానించి దుర్బలులైనారు. తాము చేసిన పొరపాటును గ్రహించి ఇప్పుడు వారు శుక్రాచార్యుని దేవునివలె పూజించుచు బలవంతులైనారు. శుక్రాచార్యుని సేవించు రాక్షసులు ఒకనాడు బ్రహ్మలోకమునే కబళించునట్లు తోచుచున్నది. గోవులను, గోవిందుని, పండితులను గౌరవించువానికి ఈ లోకములన్నియు లొంగును. మీకు గెలుపు కావలయుననిన వెంటనే ఒక ఆచార్యుని వరించవలసి యున్నది. త్వష్ట కుమారుడైన విశ్వరూపుని వద్దకు వెళ్ళి అతనిని ఆచార్యునిగా వరించుడు. విశ్వరూపుడే మీ కార్యమును చక్కపెట్టగలడు. అతడు రాక్షస పక్షపాతి యనునది నిజము. దానికి సహించవలెను" అని బ్రహ్మ వారికి ఉపదేశించినాడు.

దేవతలు విశ్వరూపుని వద్దకేగి ఇట్లు విన్నవించినారు.

"విశ్వరూపా! నీ ఆశ్రమమునకు అతిథులమై వచ్చినాము. స్వామీ! నీకు మేము తండ్రితో సమానులము. సత్పుత్రుడైనవాడు తండ్రి ఆజ్ఞ మన్నించవలెను. అందువను అతడు బ్రహ్మచారియై యున్నపుడు చెప్పవలసిన పనిలేదు.

ఆచార్యుడు, గురువు దేవునితో సమానుడు. తండ్రి ప్రజాపతితో సమానము.
అన్న దేవతతో సమానము తల్లి భూదేవితో సమానము.

మేము నీ తండ్రివంటి వారలము. ఆపదలో వుండి నీ సాయము కోరి వచ్చినాము. శత్రువుల వలన పరాభవము పొంది దుఃఖ సాగరమున మునిగియున్నాము. మమ్ము కాపాడవలసిన వాడవు నీవు. నీవు బ్రహ్మనిష్ఠగల బ్రాహ్మణుడవు. నిన్ను గురువుగా వరించుచున్నాము.

నగర్హయంతి హ్యర్థేషు యవిష్ఠాంఘ్ర్యభివందనమ్
ఛందోభ్యోఽన్యత్ర న బ్రహ్మన్ వయో జ్యైష్ఠ్యస్య కారణమ్.

అవసరము వచ్చినపుడు చిన్నవారికి పాదాభివందనము చేయుట తప్పుకాదు.
వేదజ్ఞానమే జ్యేష్ఠత్వమునకు కారణము కాని వయసు కాదు''.

అని ప్రార్థించినారు దేవతలు.

విశ్వరూపుడు దేవతల ప్రార్థన మన్నించి ఇట్లనెను :—

"నేను మీ శిష్యకోటిలోని వాడనైనందున మీమాట శిరసావహించుట నాధర్మము.

పౌరోహిత్య కార్యమువలన బ్రహ్మతేజస్సు కరిగిపోవును కావున పెద్దలు పౌరోహిత్యమును నిందింతురు.

కాని ప్రభువులు, లోకేశ్వరులు అయిన మీరు ప్రార్థించుచుండగా నావంటి వాడు కాదని ఎట్లనగలడు? గృహస్థాశ్రమమున ఉన్న నేను శిలావృత్తి, ఉంఛ వృత్తి అవలంబించి జీవయాత్ర సాగించుచున్నాను.

పౌరోహిత్యము నింద్యమైనది. ఆ నింద్య వృత్తిని నేను ఎందుకు అవలంబించవలెను? దుష్టబుద్ధులు మాత్రము పౌరోహిత్య వృత్తిని అవలంబించి తృప్తి పడుదురు.

అయినను గురుజనులైన మీ కోరికను కాదనలేను. ధనము, ప్రాణము మీకొరకు గాను అర్పించవలసి వచ్చినను వెనుకాడను. మీరు అతి సామాన్యమైన కోరిక కోరినారు. మీ కోరిక నెరవేర్పగలను" అని విశ్వరూపుడు దేవతలకు పురోహితుడగుట కంగీకరించినాడు.

దేవతలు విశ్వరూపుని పురోహితునిగా గ్రహించి తమ బలమును పెంచుకున్నారు. విజయలక్ష్మిని వరించినారు.

శుక్రాచార్యుని ప్రభావము వలన అసురుల ఐశ్వర్యము సురక్షితముగా వుండినది. విశ్వరూపుడు తన వైష్ణవీ విద్యా ప్రభావమున అసురుల సంపద ఊడబెరికి ఇంద్రునికి అప్పగించినాడు.

విశ్వరూపుడు ఇంద్రునకు వైష్ణవీ విద్య నుపదేశించినాడు. ఆ వైష్ణవీ విద్యవలననే ఇంద్రుడు అసురులను గెలిచి మూడు లోకముల సంపదను అనుభవించినాడు.

> బృహస్పతిని అవమానించగా ఇంద్రుడు ఓడుట, విశ్వరూపుని వరించగా గెలుచుట ఆశ్చర్యముగా వుండవచ్చును. కాని వాస్తవమునకు అందు ఆశ్చర్య పడ వలసిన దేమియులేదు.
>
> ద్వంద్వయుద్ధమున ఓడినవాని రాజ్యము పోయిన కాలమున గెలిచినవారు రాజ్యము గెలిచిన కాలమునందప్ప యుద్ధమున జయాపజయములు రాజుల అస్త్రబలముపైననే ఆధారపడియున్నవి రాచకార్యమునందు నిమగ్నులైన రాజా అస్త్రముల విషయమున కృషి సలుపలేరు. కావున అట్టి కృషి పురోహితుడు సలుపువాడు. పురోహితుడు శాస్త్రజ్ఞుడై [illegible] అస్త్రములను ప్రయోగించిన రాజునకు జయము కలుగును. అట్లనిన జయాపజయములు బాహ్య

బలమును అనుసరించి కాక విశ్వాస బలమును అనుసరించి యుండును. అద్వితీయ మహాపండితుడు, తేజస్వి అయిన పురోహితుడు రాజును విడిపోయిన అతడు ఓడిపోయె ననిన ఆశ్చర్యమా?

ద్వితీయ ప్రపంచ సంగ్రామమున ఐన్‌స్టీన్ అను మహాశాస్త్రజ్ఞుడు జర్మను వారిని వదిలి అమెరికావారి పక్షమున చేరినందుననే కదా హిరణ్యాక్ష, హిరణ్య కశిపులను మించిన హిట్లరునకు ఓటమి కలిగినది.

వృత్రాసుర జననము.

విశ్వరూపుని తండ్రి త్వష్ట. అతని తల్లి అసుర కులమున పుట్టినది. విశ్వరూపునకు పుట్టుకలో మూడు తలలు వచ్చినవి. అతడు ఒక నోటితో సోమరసమును, రెండవ నోటితో మద్యమును త్రాగువాడు. మూడవ నోటితో అన్నము తినువాడు.

విశ్వరూపునకు త్వష్ట మొదలగు పన్నెండుగురు ఆదిత్యులు దేవతలు. అతడు యజ్ఞములందు దేవతలకు పేరు పేరున ఆహుతులు ఇచ్చువాడు. తాతగారి వంశము మీది అపేక్షచే దేవతలకు చాటుచేసి అసురులకు సహితము ఆహుతులు ఇచ్చువాడు. ధర్మ విషయమున కపటము చేసి విశ్వరూపుడు దేవతలకు అపరాధము చేయుటను ఇంద్రుడు కనిపెట్టినాడు. అతనికి కోపము వచ్చినది. ఉత్తరక్షణమున విశ్వరూపుని మూడు తలలను నరికివేసినాడు.

విశ్వరూపుని మూడు శిరస్సులలో సోమరసము త్రాగు శిరస్సు కవుజు పిట్ట అయినది. మద్యము త్రాగు తల ఊర పిచ్చుక అయినది; అన్నము తిను తల తిత్తిరి పిట్ట అయినది.

ఇంద్రుడు మహాపండితుడైన విశ్వరూపుని సంహరించుట వలన బ్రహ్మహత్యా పాతకము చుట్టుకున్నది. అతడు దానిని ఒక సంవత్సరము వరకు లెక్కపెట్టలేదు.

ఇంద్రుడు విశ్వరూపుని తలలను నరికినాడను విషయము త్వష్టకు తెలిసినది. కొడుకు తలలునరికిన ఇంద్రునిపై అతనికి అంతులేనికోపము వచ్చినది. ఇంద్రుని అన్యాయమును సహించలేకపోయినాడు. ఇంద్రుని గర్వమును అణచదలచినాడు. ఇంద్రుని హతమార్చువానిని సృష్టించవలెనని సంకల్పించినాడు. అభిచార యజ్ఞము చేసినాడు. 'ఇంద్ర శత్రో వివర్ధస్వ' (ఇంద్రుని శత్రువా వర్ధిల్లుము) అను మంత్రమును ఉచ్చరించుచు ఆహుతులు ఇచ్చినాడు,



ఇంద్రుడు మహోమహుండైన విశ్వరూపుని వధించుట. పుట. 225

త్వష్ట చేయు అభిచార యజ్ఞపు హోమకుండమునుండి ప్రళయకాల యముని వంటి భయంకరాకారుడైన ఒక మహాపురుషుడు జన్మించినాడు. అతడే వృత్రుడు. అతని పూర్వజన్మ వృత్తాంతము తెలుసుకుందము.

చిత్రకేతుని కథ.

పూర్వము శూరసేన దేశమును చిత్రకేతుడు అను రాజు పాలించినాడు. అతనికి ఒక కోటిమంది భార్యలు. వారిలో ఎవరికీ సంతానము కలుగలేదు. సంతానము లేనందున అతనికి ఆనందము లేకపోయినది. ఒకనాడు అంగిరస మహర్షి చిత్రకేతుని భవనమునకు వచ్చినాడు. అతనిని పూజించినాడు చిత్రకేతుడు.

"ఆకలిదప్పులతో అన్నపానాదులకై బాధపడువానికి చందనము మున్నగు భోగ్యవస్తువులు ఆనందము కలిగించలేవుకదా ! అట్లే సంతానములేని నాకు సామ్రాజ్యము, ఐశ్వర్యములు, భోగములు సుఖము కలిగించుటలేదు. మహాత్ముడవు అయిన నీవు నన్ను అనుగ్రహించవలెను" అని ప్రార్థించినాడు.

అంగిరసుడు కనికరించి చిత్రకేతునిచే ఒక యజ్ఞము చేయించినాడు. హవ్యపాత్రను సిద్ధము చేసినాడు. యజ్ఞము పూర్తికాగా చిత్రకేతుడు హవ్యపాత్రను పెద్దరాణియైన కృతద్యుతికి ఇచ్చినాడు.

మహారాణి కృతద్యుతి హవ్యము సేవించి గర్భము దాల్చినది. ఆమెకు ఒక ఉత్తముడైన పుత్రుడు కలిగినాడు. రాజుకు సంతానము కలిగినందున రాజు మాత్రమేకాక రాజ్య ప్రజలందరు ఆనందమున ఓలలాడినారు.

లేక లేక కలిగిన పుత్రుని ప్రాణసమముగా చూచుకున్నాడు మహారాజు. అతనికి కృతద్యుతి విషయమునకూడ గాఢమైన అనురాగము ఏర్పడినది. అతడు తక్కిన రాణులవద్దకు వెళ్ళుట మానుకున్నాడు.

మిగత రాణులెల్లరు సమాలోచన జరిపినారు. కృతద్యుతిని తిట్టిపోసినారు. తమను రాజు తిరస్కరించుటకు కారణము కృతద్యుతి పుత్రుడని నిర్ణయించినారు. అతని హతమార్చినచో తాము పూర్వము వలె సుఖించవచ్చు ననుకున్నారు.

బాలకునకు విషము పెట్టినారు.

ఆ విషముతిని రాజకుమారుడు మరణించినాడు. మహారాణి గోడు గోడున ఏడ్చినది. మహారాజు పిచ్చివాడై శవముమీదపడి ఏడ్చినాడు. ఆ దంపతుల దుఃఖముచూచి రాజభవనమంతయు గొల్లుమన్నది.

వారి రోదనధ్వనులు ఆకసము నంటినవి. ఆకాశమార్గమున పోవుచున్న అంగిరసుడు, నారదుడు ఆ రోదనవిని రాజభవనమునకు వచ్చినారు. శవముమీదపడి వెక్కి వెక్కి ఏడ్చుచున్న రాజును ఓదార్చి మధుర వచనముల నిట్లన్నారు :-

"మహారాజా! నీవు ఎవనికొరకు ఏడ్చుచున్నావు? అతనికి నీకు ఏమి బాంధవ్యము? గతజన్మలో అతడెవరు? ముందు జన్మమున నీకు ఏమగును? మహాప్రవాహమున ఇసుకరేణువులు ఎటనుండియో కొట్టుకొని వచ్చి ఎటకో వెళ్ళిపోవును. జీవకోటి కాలప్రవాహమున ఎటనుండియో కొట్టుకొని వచ్చి ఎటకో వెళ్ళిపోయి ఎచటనో లీనమగును. విత్తనమునందు ఒక విత్తనము మొలకెత్తును. వేరొక విత్తనము మొలకెత్తదు. ప్రాణికోటిలో ఒకనికి సంతానము కలుగును. ఒకనికి కలుగదు. దీనికంతటికి భగవంతుడే కారణము. సకల చరాచర ప్రపంచము అతని చేతిలోని కీలుబొమ్మయే. నీవు, నేను, ఈ సకల చరాచర జగత్తు పూర్వము లేకుండెను. ఇప్పుడు లేదు. ఇకముందు వుండదు. ఇదంతయు మాయ. సత్యపదార్థము ఒకటే శాశ్వతమైనది. అదే దైవము దైవమునకు జనన మరణములు లేవు. అతనికి కోరికలు లేవు. చిన్న పిల్లలు గుజ్జనగూళ్ళు కట్టుచున్నట్లు అతడు సకల చరాచర ప్రకృతిని సృష్టించి, పాలించి సంహరించును.

ఒక బీజమునుండి మరొకబీజము పుట్టినట్లు ఒక దేహమునుండి మరొక దేహము పుట్టును. ఆత్మ మాత్రము శాశ్వతమైనది. అది అవినశ్యమైనది.

కుండ వేరు, మట్టివేరు అనుకున్నట్లు లోకులు తమ అజ్ఞానమువలన దేహి వేరు దేహము వేరు అని భావించుచున్నారు''.

వారి ఉపదేశము విన్నాడు మహారాజు. అతని అజ్ఞానాంధకారము పటాపంచలైనది.

''మహాత్ములారా! నేను పశువును. మూఢమతిని. నాకు కర్తవ్యము ఉపదేశించి వెలుగు చూపుడు'' అని ప్రార్థించినాడు.

అంగిరసుడు ఇట్లు ఉపదేశించినాడు :-

"మహారాజా! నీవు హరిభక్తుడవు. హరిభక్తులు ఏది వచ్చినను విచారించ కూడదు. వారికి మానావమానములు, సుఖ దుఃఖములు సమానములు. నేను మొదట నీ ఇంటికి వచ్చినపుడే జ్ఞానోపదేశము చేయదలచినాను. కాని అపుడు నీవు సంతానము కొరకు పరితపించుట చూచి సంతానము ప్రసాదించినాము. పుత్రులవలన కలుగు సుఖ దుఃఖములను స్వానుభవము వలన తెలుసుకున్నావు.

అనుభవము వలన కలిగిన జ్ఞానము ఇతరుల ఉపదేశము వలన కలుగదు.

ఐహిక భోగములన్నియు ఇంతియే. ఏదీ సత్యముకాదు. అవన్నియు శోకము, దుఃఖము, భయము కలిగించుటకే కారణము అగుచున్నవి. లోకమంతయు మాయ, అసత్యము, గారడి ఇదంతయు మనసునకు సంబంధించిన వికారము. కర్మవాసనల వలన విషయములందు చిక్కుకున్నవాని మనసు ఎన్నో కర్మలను సృష్టించుచున్నది. కావున మనసును విషయములనుండి మరలింపుము. నీ నిజ స్వరూపమును గురించి నీవే ఆలోచింపుము. అనిత్యమైన దానిని నిత్యమని భావించకుము. శాంతస్వరూపుడైన భగవంతుని ఏకాగ్రచిత్తమున ధ్యానించుము.

అంతట నారదుడు మరణించిన రాజకుమారుని ఆత్మనుపిలిచి రాజ పరివారము ఎదుట ఆ జీవాత్మను ఇట్లడిగినాడు :—

“ఓ జీవాత్మా! చూచుచున్నావా మీవారు నీకొరకు ఎంత దుఃఖించుచున్నారో? నీ శరీరమునకు తిరిగిరమ్ము. మిగిలిన ఆయువును వారితోగడిపి మీతండ్రి ఇచ్చు సంపద అనుభవించుము”.

జీవాత్మ ఇట్లు ప్రత్యుత్తరమిచ్చినది :—

> “మునీంద్రా! నేను అనేక కర్మములు చేసినాను. వాటిని అనుసరించి దేవ, మానవ, పశు, పక్షిజన్మ లెత్తినాను. ఈరాజు, రాణి ఏజన్మమున నాకు తల్లి దండ్రులు? అన్నిజన్మములందును అన్నదమ్ములనియు, తండ్రి, తల్లి యనియు, శత్రు మిత్రులనియు బంధములు ఏర్పడును. బంగారము చేతులు మారినట్లు జీవుడు యోనులు మారుచుండును. ఏ వస్తువుతో ఎవరికి ఎంత కాలము సంబంధము ఉండునో అంతకాలమే దానిపై మమకారము ఉండును. నిత్యుడైన జీవుడు ఏకాలమున ఏ దేహమందుండినను, ఆదేహమందు ఉండి నంతకాలము మాత్రము అతనికి ఆ దేహాభిమానము ఉండును. ఆ తరువాత అతనికి అది ఉండదు. జీవుడు శాశ్వతుడు. సూక్ష్ముడు. సర్వాశ్రయుడు, జన్మ మరణ రహితుడు, ఈశ్వరుడు. అతనికి ప్రియులు, అప్రియులు లేరు. తన వారు. పరులు లేరు. అతడు అద్వితీయుడు. స్వతంత్రుడు. కార్యకారణములకు సాక్షిభూతుడు. అతడు కర్మఫలములు స్వీకరించడు. అన్నివేళలయందును అన్నింటియందును ఉదాసీన భావముననే ఉండును” అని చెప్పి ఆ జీవాత్మ వెళ్ళిపోయినాడు.

రాజ బంధువులెల్లరు విస్మితులుగా రాజకుమారుని ఆత్మ చెప్పినది విన్నారు. వారి స్నేహబంధములు తెగిపోయినవి. అంతవరకు అతనికొరకు ఉప్పొంగుచున్న దుఃఖమును వదలినారు.

అంగీరసుని ఉపదేశమున చిత్రకేతునకు జ్ఞానోదయమైనది. బురద గుంటలోనుంచి బయట పడిన పసుగువలె గృహస్థాశ్రమమునుండి బయట పడినాడు. యమునా నదికి వెళ్ళి, ఆ నదిలో స్నానము చేసి ఇంద్రియములను స్వాధీన పరచుకొని నారదమహామునికి నమస్కరించినాడు. నారద మహాముని ప్రీతుడై చిత్రకేతునకు మంత్రోపనిషత్తు ఉపదేశించినాడు. "ఇది జపించిన ఏడు రాత్రులలో సంకర్షణ దేవుని దర్శనము అగు" నని చెప్పినాడు.

చిత్రకేతుడు జలముమాత్రము ఆహారముగా స్వీకరించి ఏకాగ్రచిత్తమున నారదుడు ఉపదేశించిన మంత్రమును జపించినాడు. ఆ విద్యా ప్రభావమువలన అతడు విద్యాధరుల ప్రభువు అయినాడు. మరికొన్ని రోజులకు సంకర్షణదేవుడు ప్రత్యక్షమైనాడు. ఆ దేవుని దర్శనమాత్రమున చిత్రకేతుని మనస్సు నిర్మలమైనది. నేత్రములయందు ఆనందాశ్రువులు ప్రవహించి, శరీరము పులకరించినది. తన్మయుడై చేతులుజోడించి సంకర్షణుని పలువిధముల స్తుతించినాడు.

చిత్రకేతుని స్తోత్రమువిని సంకర్షణుడు ప్రసన్నుడు అయినాడు. సంకర్షణుడు అతని కిట్లు జ్ఞానోపదేశము చేసినాడు.

"దుఃఖములనుండి నివృత్తికొరకు, సుఖము కలుగుటకు దంపతులు అనేకవిధములగు కర్మలుచేయుదురు. అందువలన దుఃఖనివృత్తి యగుటకాని సుఖము కలుగుటకాని కలుగకపోగా ఆ వ్యక్తి కర్మబంధమునపడి విపరీత ఫలితములను పొందుచున్నాడు.

ఆత్మ స్వరూపము ఎంతో సూక్ష్మమైనది. స్థానత్రయ విలక్షణమైనది. దానిని తెలుసుకొని ఐహికాముష్మికములు త్యజించిన జ్ఞానులు నా భక్తులగుదురు.

జీవాత్మ, పరమాత్మల ఐక్యజ్ఞానమే పురుషార్థమని యోగులు తెలుసుకొనవలెను."

ఇట్లు చిత్రకేతునకు జ్ఞానోపదేశముచేసి సంకర్షణదేవుడు అంతర్ధానుడైనాడు. విద్యాధరప్రభువు సంకర్షణదేవుడు అంతర్ధానుడైన దిశకు నమస్కరించి స్వేచ్ఛగా సంచరించుటకు బయలుదేరినాడు.

అట్లు సంచరించుచు ఒకనాడు అతడు శివపార్వతుల దగ్గరకు వెళ్ళినాడు. ఆ సమయమున శివుడు పార్వతిని ఒడిలో కూర్చుండబెట్టుకొని ఆలింగనము చేయుచున్నాడు. సిద్ధులు, చారణులు, మునులు అతనిచుట్టు గుమికూడియున్నారు.

అదంతయు చూచినాడు చిత్రకేతుడు. శివునివద్దకు వెళ్ళి పార్వతీదేవి వినునట్లు ఇట్లన్నాడు.

"లోకగురుడు, ఉత్తమోత్తముడు అయిన శివుడు సభామధ్యమున భార్యను కౌగిలించుకొనిన ఇక సామాన్యుల విషయమేమి? సామాన్యులు సహితము చాటుమాటుగా ఆడదానిని కౌగిలించుకొందురే! లోకగురువైన శివుడు స్త్రీని ఇట్లు ఒడిలో కూర్చుండబెట్టుకొని కులుకుచున్నాడు."

శివుడు చిరునవ్వునవ్వి ఊరుకున్నాడు. కాని పార్వతికి కోపము వచ్చినది. ఆమె చిత్రకేతు నిట్లు శపించినది.

"మహాపురుషుని అవమానించిన పాపమునకు అసురుడవై జన్మింతువుగాక !"

అట్లు పార్వతీదేవి శపించుటవలన చిత్రకేతుడను విద్యాధరప్రభువు వృత్రుడుగా జన్మించినాడు.

> నారదుడు విగతాత్మతో మాట్లాడించినాడను విషయము వింతగను విచిత్రముగను తోచవచ్చును. కాని గతశతాబ్దపు అంత్యమునను, ఈ శతాబ్దపు ప్రథమ పాదమునను ఇందును గురించి కొంతపరిశ్రమము జరిగినది. "టెలిపతి" అను విజ్ఞాద్వారా విగతాత్మలతో మాట్లాడుట జరిగినది. ఆ ప్రయత్నమానాటితో ముగిసినట్లు కనిపించుచున్నది

> "Telepathy was defined by F. W H. Myers who invented the word in 1882" the communication of impressions of any kind from one mind to another, independant of the recognised channels of the sence.
>
> It is to be noted that Myers does not postulate that both or either of the minds the mentions should be the minds of LIVING PERSONS."
>
> ENCYCLO PAEDIA BRITANICA.

> "టెలిపతి" అనునది క్రీ.శ. 1982 సంవత్సరమున F.W.H. మేయర్స్ అనువానిచే కనుగొనబడినది. అతడు దీనిని గూర్చి 'ఏవిధములైన అభిప్రాయములనైన గుర్తింపబడిన బాహ్యేంద్రియముల ద్వారమున కాక ఒకరి మనసులోని భావములను మరొకరు గ్రహించుట'' అని చెప్పినాడు.
>
> ఇచట గమనించవలసిన దేమన, మేయర్స్ సూచించినట్లు రెండు మనసులు గాని వానిలో ఏదేని ఒకటిగాని జీవించియున్న వ్యక్తికి సంబంధించినది కానవసరములేదు.

> "అప్పట్లో టిబెటమ్మ వర్గంలోని ఓద్దా అనే ఆయన దివ్యదృష్టితో తెలిసిన విషయాలు చెబుతూ ఉండేవారు. ఆ విషయాలన్నింటిని గురించి వివేకానంద స్వామిని అడిగి తెలుసుకున్నాను. మానవుని జ్ఞానము పరిపక్వము అయితే అట్లాంటివి అసాధ్యవిషయాలు కావని ఆయన చెప్పారు."
>
> ప్రకాశంపంతులు నా జీవితయాత్రయందు
>
> కొంత కాలము క్రితము ఆంగ్లమున నేనొక పుస్తకము చదివినాను. అందు విగతాత్మలతో జరిపిన సంభాషణ సహితము వ్రాసియున్నది. (ఆ పుస్తకము లభించనందున అందునుండి ఉదాహరణము ఇవ్వలేక పోవుచున్నాను.)

వృత్రాసుర వృత్తాంతము.

వృత్రుడు విల్లునుండి విడిచిన అమ్మువలె అతిశీఘ్రముగా పెరిగి పెద్దవాడైనాడు. అతడు కాలినకొండవలె కాలమేఘమువలె కనిపించువాడు. అతనిజుట్టు, గడ్డము, మీసము కరిగిన రాగివలె ఎఱ్ఱగా ఉండునవి. ఇరువురు సూర్యులు మిట్టమధ్యాహ్నమున వెలుగుచున్నట్లు అతని రెండు కండ్లు ఉండెడివి. అతడు తళతళ మెరయు బ్రహ్మాండమైన త్రిశూలముధరించి నాట్యము చేసిన భూకంపము వచ్చినట్లుండెడిది. అతడు త్రిశూలముచే ఆకాశము పెకలించునేమో అనిపించునట్లు ఉండెడిది. అతనినోరు పెద్ద కొండగుహవలె ఉండెడిది. అతడు ఆవులించిన ఆకాశమును మ్రింగునేమో అనిపించెడిది. అతడు నాలుకచాచిన చుక్కలను నాకివేయునేమో ననిపించెడిది. అతని కోరలుచూచిన ముల్లోకములు వాటిక్రింద నలిగిపోవు ననిపించెడిది. ఘోరమైన అతని రూపమును చూచి లోకములన్నియు తల్లడిల్లిపోయినవి. అతనిని చూచిన ప్రతిప్రాణి ఆవురని ప్రాణములు వదలువాడు. అతడు మూడులోకములు ఆవరించినందున అతనిపేరు "వృత్రుడు" అయినది.

వృత్రాసురుని మీద దేవతలు దండెత్తి దివ్యాస్త్రములను గుమ్మరించినారు. వాని నన్నింటిని మ్రింగినాడు వృత్రుడు. దేవతలు కళాహీనులై తల్లడిల్లినారు. దిక్కులేనివారైనారు. విష్ణుదేవుని ధ్యానించినారు.

ఆతుర హృదయమున దేవతలు ప్రార్థించగా ప్రత్యక్షమైనాడు నారాయణుడు.

"ఇంద్రా! ఇక ఆలస్యము చేయరాదు. ఋషిసత్తములైన దధీచి వద్దకు వెళ్లండి. వ్రతములవలనను తపస్సువలనను ఎంతో గట్టిపడిన అతని దేహమును కోరండి.

అతడు మహాత్ముడు. త్యాగి. అశ్వినీకుమారులకు గుఱ్ఱపు తలతో బ్రహ్మ జ్ఞానము నుపదేశించినాడు. అశ్వినీకుమారులు కోరిన తనదేహమును తప్పక ఇవ్వ గలడు. అతని అంగములచే విశ్వకర్మ ఉత్తమమైన ఆయుధము చేయవలెను. నా శక్తిని అందు ప్రవేశ పెట్టుదును. నీవు ఆ ఆయుధముతో వృత్రాసురుని శిరస్సు ఖండించగలవు.

దేవతలారా ! వృత్రాసురుడు మరణించగనే మీ శక్తి మరల మీకు లభించును. మీకు క్షేమము కలుగును. శుభము కలుగును. అని దేవతలకు చెప్పి అంతర్ధానుడైనాడు నారాయణుడు.

దేవతలు దధీచి వద్దకు బయలుదేరినారు.

అధర్వ ఋషి కుమారుడు దధీచి. అశ్విని కుమారులు అతని వద్దకేగి తమకు బ్రహ్మవిద్య ప్రసాదించవలసినదని ప్రార్థించినారు. దధీచి అందుకు అంగీకరించినాడు. అశ్విని కుమారులు బ్రహ్మవిద్యపొంది గొప్పవారగుట ఇంద్రునకు ఇష్టములేదు. అతడు దధీచి వద్దకేగి 'అశ్విని కుమారులకు బ్రహ్మవిద్య బోధించిన నీతల నరికి వేయుదునని బెదిరించెను. ఇంద్రుడు అన్నంతపని చేయునని అశ్విని కుమారులకు తెలియును. వారు అందుకు ఒక ఉపాయము కనిపెట్టినారు. దధీచి తలతీసి వేరొకచోట భద్రపరచి దధీచికి గుఱ్ఱపుతల తగిలించినారు. గుఱ్ఱపుతలతోనే దధీచి అశ్విని కుమారులకు బ్రహ్మజ్ఞానము ఉపదేశించినాడు. దేవేంద్రుడు వచ్చి ఆ గుర్రపు తలను నరికివేసినాడు. తరువాత అసలు తలను అశ్విని కుమారులు దధీచికి తగిలించినారు.

దేవతలు దధీచి వద్దకేగి శ్రీహరి ఉపదేశించిన పరిష్కారము దధీచిని ప్రార్థించినారు. "దేవతలారా ! ప్రాణులకు శరీరముకన్న విలువైనది మరొకటి లేదు. మరణకాలమందు యమయాతనలు అనుభవించు చున్నను ప్రాణి జీవించవలెననియే అనుకొనును. సాక్షాత్తు శ్రీహరివచ్చి అడిగినను శరీరమును ఇచ్చువాడున్నాడా ?" అని అడిగినాడు దధీచి.

దధీచి పలుకులు విన్న దేవతలు, "మునీంద్రా ! నీవు సకల భూతకోటి యెడ యమున అపారమైన దయగలవాడవు. నీవంటి మహాత్ములు త్యాగము చేయని వస్తువని లోకమున కలదా ? అర్థించువారలు స్వార్థపరులనుటలో ఎట్టి సందేహము లేదు. వారు దాతల ఇబ్బందులను గుర్తించలేరు. దాత అర్థించువారి అవసరాలు గుర్తించలేరు, గుర్తించినా లేదనడు" అన్నారు.

"దేవతలారా! ఈ శరీరము నశించునది. ప్రాణికోటి యెడల దయచూపి ధర్మము, కీర్తి ఆర్జించనివాడు రాళ్లగుండెగలవాడు అనుటలో ఎట్టి సందియము లేదు. ప్రాణుల దుఃఖమును చూచి దుఃఖించుట, సుఖమును చూచి సుఖించుటయే అక్షయమైన ధర్మము. ప్రపంచమున ధనము, పుత్రులు, జ్ఞాతులు శరీరము ఇవి ఏవియు వెనువెంట వచ్చునవి కావు. ఈ శరీరము చివరకు కుక్కలపాలో నక్కలపాలో అగును. అట్టి శరీరము పరోపకారము కొరకు ఉపయోగపడిన అంతకు మించి కావలసినదేమి? ఇదిగో ఇప్పుడే నా శరీరమును మీకు దానము చేయుచున్నాను" అని దధీచి ఎన్నడు ఎవడును చేయనటువంటి దానమును చేసినాడు.

దధీచి యోగబలమున ఆత్మను పరమాత్మలో లీనము చేసినాడు.

దధీచిముని ఎముకలతో విశ్వకర్మ వజ్రాయుధమును సిద్ధము చేసినాడు. అందు భగవంతుని తేజస్సు ప్రవేశించినది. దానిని ధరించినంతనే ఇంద్రుడు మరింత తేజోవంతుడు అయినాడు. అతడు ఐరావతమునెక్కి నూతన తేజస్సున వెలిగినాడు. దేవతలు అతని చుట్టు చేరి జయజయ ధ్వానములు చేసినారు. మునులు ఆశీర్వదించినారు.

ఇంద్రుడు ప్రళయకాలరుద్రునివలె ఉగ్రుడై వృత్రునిమీదకు దండెత్తినాడు. నర్మదా నదీతీరమున దేవతలకు, అసురులకు ఘోరమైన యుద్ధము జరిగినది. ఆ యుద్ధమున రుద్రులు, ఆదిత్యులు మున్నగు వారెల్లరు పాల్గొన్నారు. వజ్రాయుధము ధరించి ఇంద్రుడు విజృంభించినాడు.

వృత్రాసురుని వెంట ఉన్నవారు నముచి, శంబరుడు, అనర్వుడు, ద్విమూర్ధుడు, ఋషభుడు, విప్రచిత్తి, అయోముఖుడు, పులోముడు, వృషపర్వుడు, హేతి, ప్రహేతి, ఉత్కలుడు, మాలి, సుమాలి మున్నగు దైత్యులు, దానవులు, యక్షులు, రాక్షసులు.

వృత్రాసురుడు, అతని సహచరులు, దేవతల విజృంభణ చూచి జయజయ ధ్వానములు చేయుచు దేవతల మీద పడినారు. వివిధ అస్త్రములు కురిపించినారు. బాణముల వర్షము కురిపించి దేవతల సేనను కప్పివుచ్చినారు. అసురుల బాణములచే అంధకారము ఏర్పడినది. ఆకాశమున నక్షత్రములు పట్టపగలే కనిపించినవి.

దేవతలు అసురుల బాణముల నన్నింటిని నాశనము చేసినారు. అసురుల అస్త్రశస్త్రములు అయిపోయినవి. వారు పర్వత శిఖరములు, చెట్లు, రాళ్ళు దేవతల

పైన ప్రయోగించినారు. అయినను దేవతలు లెక్క చేయలేదు. వారు వాటి నన్నింటిని నాశనము చేసినారు.

వృత్రాసురుని సేన భయపడి పారిపోసాగినది. పారిపోతున్న సేనను చూచినాడు వృత్రుడు.

"ఓ విప్రచిత్తీ! నముచీ! పులోమా! అనర్వా! శంబరా! పుట్టినవానికి చావునిక్కము. అట్లయిన కీర్తి, శుభగతి కలిగించునట్టి మృత్యువు కనిపించు చుండగా వదులుకొనిపోవుట తీరుతయా? ఉత్తమమైన మరణములు లోకమున రెండే రెండు గలవు. ఒకటి యోగ మవలంబించి శరీరమును త్యజించుట. రెండవది రణరంగమున మడమ త్రిప్పక మరణించుట. ఈ రెండును దుర్లభము లైనవి. అట్టి మరణము లభించుచుండగా పారిపోవుచున్నారా? వెనుకకు మరలుడు. యుద్ధమున విజయమో వీరస్వర్గమో అలంకరించుడు" అని హెచ్చరించినాడు.

వృత్రుని మాటలు అసురసేనలో ఎవడును వినలేదు. వారు మరలి చూడకుండ పారిపోయినారు.

వృత్రాసురునకు పారిపోవువారి విషయమున అసహ్యము, దేవతలమీద చెప్పరాని కోపమును కలిగినవి. అతడు రుద్రుడై దేవతలమీదికి ఉరికినాడు.

"ఓ దేవతలారా! నీచులవలె పారిపోవువారిని వెన్నంటుచున్నారేల? ఇది ధర్మమగునా? ఇదియేనా మీ వీరత్వము? గుండెలు దిటవుగల వంట్లైతే నా యెదుట ఒక క్షణకాలమునిలిచి మీ యుద్ధనైపుణ్యము, మీ ధైర్యసాహసములను జూపుడు" అని గర్జించినాడు.

ఆ గర్జనతో పిడుగుపాటువలె లోకములు దద్దరిల్లినవి. ఆ ధ్వని విని దేవతలు రణరంగమున మూర్ఛిల్లినారు. మదించిన ఏనుగు వెదురు వనమున ప్రవేశించినట్లు వృత్రుడు దేవతల సైన్యమున ప్రవేశించి దానిని చెల్లా చెదురు చేసినాడు.

చిందులు త్రొక్కి భూకంపము సృష్టించినాడు. దేవతలు అతని విలయ తాండవము చూడలేక కనులు మూసుకున్నారు.

వృత్రుడు శరవేగమున ఇంద్రునిపైకి ఉరికినాడు. ఇంద్రుడు తన పైకివచ్చు శత్రువును చూచి తన గదను గురిపెట్టి అతనిపైకి విసిరినాడు. వెలిగిపోవు

నవ్వుచు ఆ గదను చేతితో పట్టి లేపినాడు వృత్రుడు. పెద్ద పొలికేక పెట్టి ఇంద్రుని మీదికి దూకినాడు. ఐరావతపు కుంభస్థలముపై ఆ ఇంద్రుని గదతోడనే బలముగ ప్రహరించినాడు.

ఐరావతము ఘీంకరించి ఏడు ధనుస్సులు వెనకకు తగ్గి పడిపోయినది. ఇంద్రుడు సంకటమున పడిపోయినాడు. వృత్రాసురుని దయా ధర్మములపై ఇంద్రుడు ఆధారపడవలసి వచ్చినది. వృత్రాసురుని ఒక్కపోటుకు ఇంద్రుడు అంతమొంది యుండును. కాని అట్లు జరుగలేదు. ఏలయన వృత్రుడు వీరుడు. యుద్ధధర్మము తెలిసినవాడు. వెనుకంజవేసిన ఇంద్రునిపై ఎత్తిన గదను ప్రయోగించలేదు. దించివేసినాడు.

ఇంద్రుడు బ్రతికిపోయినాడు.

తన అమృతహస్తముతో ఐరావతపు గాయమును నిమిరినాడు ఇంద్రుడు. గాయము మానినది, బాధపోయినది. పూర్వమువలె బలము కలదైన ఆ ఐరావతము వృత్రాసురుని మీదకు ఉరికినది.

వజ్రాయుధము నెత్తి తనమీదకు వచ్చుచున్న దేవేంద్రుని చూచినాడు వృత్రాసురుడు. తన అన్న విశ్వరూపుని ఇంద్రుడు ఘోరముగా చంపిన విషయము గుర్తునకు తెచ్చుకున్నాడు. అతనిలో దుఃఖము పొంగినది.

"ఇంద్రా! నీవు గురుహత్య, బ్రహ్మహత్య చేసిన పాపాత్ముడవు. నేడు నాకంట పడినావు. ఈ త్రిశూలముతో నీ గుండెలు చీల్చి నా అన్న రుణము తీర్చుకొందును. ప్రార్థించి, గురువుగా వరించి అతనినే హతమార్చిన నీచుడవు. నీకు లజ్జ, వివేకములు లేవు. ఈ దేవతలు మూర్ఖులు. వారు నీవంటి నీచుని అనుసరించుచున్నారు. ఇదిగో చస్తివి" అని సింహనాదముచేసి వృత్రుడు మహోగ్రమగు పెద్ద ఉల్కనుబోలు త్రిశూలమును ఇంద్రునిపైకి విసరినాడు.

ఇంద్రుడు వజ్రాయుధముతో త్రిశూలమును ముక్కలు ముక్కలు చేసినాడు. వృత్రాసురుని భుజము సహితము తెగనరికినాడు.

చేయి తెగగా ఉగ్రుడైనాడు వృత్రుడు. ముందుకు ఉరికినాడు. ఐరావతము గండస్థలము మీద గుదియతో కొట్టినాడు. ఐరావతము గీపెట్టినది. ఇంద్రునిచేతి [illegible] జారిపడినది.

శత్రువు ఎదుట తన ఆయుధము జారిపడిపోగా సిగ్గుపడినాడు ఇంద్రుడు. తిరిగి ఆయుధము తీసుకొనుటకు సంకోచించినాడు దేవేంద్రుడు.

అది చూచినాడు వృత్రుడు. ఇంద్రుని దుస్థితిని గ్రహించినాడు. "ఓరీ ఇంద్రా! తీసికొనుము వజ్రాయుధము. వధించుము శత్రువును. ఇది విచారించవలసిన సమయము కాదు. రణరంగమున జయ పజయములు కావడి కుండలు!

> ఆయుష్యము, కీర్తి, ఐశ్వర్యము, కాలము కలిసివచ్చినపుడు ఇష్టము లేకపోయినను లభించును. అట్లే కాలము వ్యతిరేకించినపుడు అపకీర్తి, దరిద్రము, మృత్యువు వచ్చిపడును. మానావమానములు, జయాపజయములు, సుఖదుఃఖములు, జనన మరణములు – వీని ఎడల సమభావము కలిగి ఉండవలెను. ఇది తెలుసుకొన్నవారిని సుఖదుఃఖముల బంధనములు దరిచేరవు.

యుద్ధమున నా త్రిశూలము ముక్కలైనది. నా బాహువు తెగిపోయినది. ఇంచుమించు నేను ఓడిపోయినాను. అయినను ఓ ఇంద్రా! నీ ప్రాణములు తీయుటకు సాయశక్తుల ప్రయత్నింతును" అన్నాడు వృత్రుడు.

వృత్రుని నిష్కపటమైన మాటలు విన్నాడు ఇంద్రుడు. చకితుడైనాడు. వజ్రాయుధమును అందుకున్నాడు.

ఇంద్రుడు ఆయుధము ధరించగనే తన ఇనుపగుదియను, ఇంద్రునిపైకి విసరినాడు వృత్రుడు. ఇంద్రుడు వజ్రాయుధముతో ఇనుపగుదియను, గుదియవంటి వృత్రుని రెండవబాహువును నరికినాడు.

వృత్రుని బాహువునుండి సెలయేళ్ళవలె రక్తము ప్రవహించినది. అతడు రెండు కాళ్ళుగల పర్వతమువలె కనిపించినాడు. అతడు చిందులుత్రొక్కినాడు. భూకంపము కలిగినది. నోరు తెరచినాడు. పైదవడ స్వర్గమునంటగా క్రిందిదవడ పాతాళము నంటినది. మహాసర్పమువంటి నాలుక చాచి సుడిగాలివలె ఇంద్రునిమీదకు ఉరికినాడు. అజగరము ఏనుగును మ్రింగునట్లు ఐరావత సహితముగా ఇంద్రుని మ్రింగినాడు.

ఇంద్రుడు యోగమాయ కలవాడు. వృత్రాసురుని పొట్టలోనికిపోయికూడ మరణించలేదతడు. వజ్రాయుధముతో వృత్రాసురుని డొక్క చీల్చుకొని బయటికి వచ్చి పర్వతశిఖరమువంటి వృత్రుని శిరమును ఖండించినాడు.

వృత్రునితల కొండశిఖరము కూలినట్లు నేలకూలినది.



వృత్రాసురుడు ఐరావత సహితముగ ఇంద్రుని మ్రింగుట. పుట. 237

దేవ దుందుభులు మ్రోగినవి. పుష్పవర్షము కురిసినది.

వృత్రుని కళేబరమునుండి జ్యోతివంటి ఆత్మ వెడలి భగవంతునిలో లీనమైనది.

పదవి రక్షించుకొనుటకు పాటుపడువారలకు ఆదర్శప్రాయుడు ఇంద్రుడు. అతనికి కావలసినది పదవీ రక్షణము. అందుకు అతడు ఎన్ని కుమార్గములనైనను చేయును. ఆ విషయమున అతనికి నీతి, నియమము, ధర్మము, లోకాపవాదము, సిగ్గు ఏవియును ఉన్నట్లు అగుపించదు.

గురువైన బృహస్పతిని అవమానపరచినాడు. విశ్వరూపుని తన మేలుకొరకు గాను ఆచార్యునిగా వరించినాడు. తదుపరి వధించినాడు. తానుచేసిన పాపమును ఇతరులకు అంటగట్టినాడు. అశ్వినీ కుమారులకు విద్య బోధించరాదన్నాడు. దధీచి తలనరకినాడు. తిరిగి దధీచినే ప్రార్థించి అతని శరీరమును గ్రహించినాడు. దానితో చేసిన వజ్రాయుధమును ధరించియే వృత్రాసురుని వధించినాడు.

ఇది ఒక్క ఇంద్రునికేకాదు. ప్రపంచమున అధికారము పొందుటకు, అధికారము నిలుపుకొనుటకు ప్రయత్నించి సఫలులైనవారందరకు చెల్లును. కురుక్షేత్ర సంగ్రామమున శ్రీకృష్ణుడు ఎన్ని అధర్మములు చేసినాడు ? మన రాజ్యమున పాలకులు అధికారము నిలుపుకొనుటకు ఎన్ని వంకరదారులు త్రొక్కుచున్నారు !

ఇది మనదేశమునకు మాత్రమేకాదు. మనదేశపాలకులకేగాని పరిమితముకాదు. సామ్యవాద దేశమైన రష్యాలో బోల్షివిక్కులను, మెన్షివిక్కులను అణచి అధికారములోనికి వచ్చినారు. స్టాలిన్ ట్రాట్స్కీకి చంపించుటకు సహితము వెనుకంజ వేయలేదు.

అధికారము అట్టిది. అది ఒకసారి పొందినపిదప దానిని రక్షించుకొనుటకు మానవుడు-ఎంత నీచుడైనను అగును.

ఇంకొక విషయము గమనించవలసి ఉన్నది. ఇంద్రుడు ఎన్ని అన్యాయములు చేసినను దేవతలు అతనికి తోడ్పడినారు. తన తల నరకిన ఇంద్రునకే తన శరీరము ఇచ్చినాడు. ఇది విచిత్రముగా తోచవచ్చును. కాని ఇందు విచిత్రమేమియులేదు. అనాటి భరతవర్షమున సురలు, అసురులు అను రెండు తెగల మధ్య సంగ్రామముండెను. రెండుతెగలమధ్య ద్వేషముండెను. ఒకతెగను నాశనము చేయవలెనని వేరొకతెగ నిరంతరము ప్రయత్నించు చుండెను.

రాక్షసులు దేవతలపై దండెత్తినపుడు రక్షించుకొనవలసినది సామూహికముగా దేవతలందరిగాని వ్యక్తిగతముగా ఇంద్రునిదికాదు. పరస్పరవైరమువలన బహుజనశ్రేయస్సునకు నష్టము కలుగును కాన వారట్లు సహాయము చేసినారు. అందు వారి త్యాగమే గోచరించును. వారి స్వార్థము కానిపించదు.

దధీచి స్వపక్ష రక్షణకు ఎంత త్యాగము చేసినాడు!!

మరుత్తులు.

విష్ణుదేవుని సహాయముతో ఇంద్రుడు దితి పుత్రులైన దైత్యులను చంపినాడు. దితి పుత్రశోకమునను, క్రోధమునను మండిపోయినది. 'ఇంద్రుడు ఇంద్రియ లోలుడు, కఠినుడు, సోదరులను హతమార్చిన దుర్మార్గుడు, కుటిలుడు, పాపాత్ముడు. అతనిని హతమార్చవలెను' అనుకున్నది దితి.

'క్షణభంగురమైన ఈ శరీరము శాశ్వతము అనుకొని ఇంద్రుడు తన నాశనమును తాను కానలేక పోయినాడు. నాకు అతనిని హతమార్చు పుత్రుడు కావలెను' అనుకున్నది.

అట్లు నిశ్చయించి భర్తయైన కశ్యపుని సేవించినది. ఇంద్రియములను స్వాధీన పరచుకొని భర్తకు సపర్యలుచేసి అతని అనురాగమును చూరగొన్నది.

కశ్యపుడు ఆమె శుశ్రూషలకు ప్రసన్నుడు అయినాడు. దితి కోరునది ఇత్తునని వాగ్దానము చేసినాడు.

"స్వామీ! నాపై మీకు దయకలిగినచో నాకు ఇంద్రుని చంపగల కుమారుని ప్రసాదించుము" అని వేడుకున్నది.

దితి కోరికవిని నొచ్చుకున్నాడు కశ్యపుడు. ఇంద్రియ సుఖములకు లోబడి వివేకము పోగొట్టుకున్నాను. అని చింతించినాడు. వాగ్దానముచేసి వెనుకంజవేయుట ఉత్తముల లక్షణముకాదు. అందువలన అతడు దితితో "కళ్యాణీ! ఒక సంవత్సరము నీవు సక్రమముగా వ్రతముచేయవలసి ఉన్నది. ఆ వ్రతము సక్రమముగా ముగిసిన ఇంద్రుని సంహరించగల పుత్రుడు నీకు కలుగును. అతడు అసురజాతికి ఆప్తబంధువు అగును" అని చెప్పినాడు. వ్రతమును గురించి వివరించవలసినదని దితి ప్రార్థించగా ఇట్లు చెప్పినాడు.

"సంవత్సర పర్యంతము ఏ ప్రాణిని హింసించరాదు. ఎవరిని శపించరాదు. అబద్ధమాడరాదు. గోళ్లుగిల్లరాదు. వెంట్రుకలు త్రుంచరాదు. నీటిలోనికివెళ్ళి స్నానము చేయరాదు. ఉతకనిబట్ట కట్టరాదు. అశుభమైన వస్తువులను అంటరాదు. వాడినపూలు ముడువరాదు. కోపము తెచ్చుకొనరాదు. చెడ్డవారితో మాట్లాడరాదు. ఎంగిలి, బలి అన్నము తినరాదు. దోసిలితో నీళ్ళుత్రాగరాదు. ఎంగిలి

ముట్టుకొని కడుగుకొనక బయటికి వెళ్ళరాదు. మాంసము, శూద్రులు తెచ్చిన అన్నము తినరాదు. సంధ్యలందు తలవిరియబోసుకొని, నగలులేక, మౌనము వహించక, బట్టకప్పుకొనక తిరుగరాదు. కాళ్ళు కడుగుకొనకగాని, అశుచిగ గాని పడుకొనరాదు. ఉత్తరదిశనగాని, పశ్చిమ దిశనగాని తలపెట్టి పడుకొన రాదు. బట్టవిప్పుకొనిగాని, ప్రాతఃకాల సాయంకాలములందుగాని పడుకొన రాదు. ఉదయము శుభ్రమైన బట్ట కట్టుకొని పవిత్రభావమున గోపూజ, బ్రాహ్మణ పూజ, లక్ష్మీపూజ, విష్ణుపూజ, భర్తృపూజ చేసినతరువాత భుజించవలెను. భర్తయే సంతాన రూపమున తన గర్భమునందు ఉన్నాడని భావించవలెను. ఇది పుంసవన వ్రతము. దీనిని ఒక సంవత్సరము నిర్విఘ్నముగా కొనసాగించిన నీకు ఇంద్రుని సంహారించగల పుత్రుడు కలుగును."

దితి అందులకు అంగీకరించినది. గర్భము అయినది. నిష్ఠతో వ్రతము పూనినది.

దితి వ్రతము పూనినదని తెలుసుకున్నాడు ఇంద్రుడు. మారువేషము వేసుకొని దితి దగ్గరకు వచ్చినాడు. ఆమెను సేవించసాగినాడు. ఆమెకు అడవినుండి పూలు, పండ్లు, కందమూలములు, సమిధలు, కుశలు, ఆకులు, దర్భలు తెచ్చి ఇచ్చువాడు.

ఏవం తస్యా వ్రతస్థాయా వ్రతచ్ఛిద్రం హరిర్నృప
ప్రేప్సుః పర్యచరజ్జింహో మృగహేవ మృగాకృతిః

అడవిలో లేడిని పట్టుకొనుటకు కుటిల కిరాతకుడు వేషముమార్చుకొని మాటు కాచినట్లు దితివ్రతము చెరచుటకుగాను ఇంద్రుడు సమయముకొరకు కనిపెట్టు కొని శుశ్రూష చేయసాగినాడు.

తన వ్రతమునకు ఏ లోపము రాకుండునట్లు దితి జాగ్రత్తపడుచుండగా ఇంద్రుడు తనకోరిక ఎట్లు ఫలించునా అని వేయికండ్లతో కనిపెట్టుకొని ఉన్నాడు.

ఒకనాడు సాయంకాలము ఎంగిలి ముట్టుకొని కాళ్ళు, చేతులు కడుగుకొనకుండ పడుకొని నిద్రపోయినది దితి. సమయమునకై వేచియున్న ఇంద్రునకు సమ యము దొరకినది. తన యోగమాయవలన కడుపులో ప్రవేశించి దితిగర్భమున బంగారమువలె మెరయుచున్న పిండమును ఏడు ముక్కలుగా నరికినాడు. ఆ ముక్కలు ఏడు శిశువులై ఏడ్చినవి. "మారుద, మారుద" (ఏడవకండి, ఏడవ కండి) అని ఒక్కొక్కముక్కను మరల ఏడు ఏడు ముక్కలుగా నరకినాడు. అట్లు దితిగర్భమునందలి శిశువు నలుబదితొమ్మిదిమంది శిశువులుగ పరిణమించినది.

ఆ శిశువులు ఏడ్చుచు "అన్నయ్యా! మేము నీ తమ్ములము. మమ్ములను ఇట్లు ఏల నరికెదవు?" అన్నారు. "మీరు నా తమ్ములే. మీ ఎడల నాకు ఎట్టి ద్వేషమును లేదు. మిమ్ములను నా సేవకులనుగా ఉంచుకొందును" అన్నాడు ఇంద్రుడు.

వారు నలుబదితొమ్మిదిమంది మరుత్తులైనారు. వారికి దేవత్వము ప్రసాదించినాడు ఇంద్రుడు. సోమపానముచేయు అధికారముకూడ ఇచ్చినాడు.

దితి మేలుకున్నది. ఆమెముందు నలుబదితొమ్మిదిమంది పుత్రులు, ఇంద్రుడు కనిపించినారు. దితి ఎంతో సంతోషించినది. ఇంద్రుని అడిగినది.

"నాయనా! దేవేంద్రా! అదితి పుత్రులను సంహరించగల ఒకేఒక పుత్రుడు కలుగవలెనని నేను కఠోరమైన వ్రతముపూనగా నలుబదితొమ్మిదిమంది పుత్రులు ఎట్లు కలిగినారో నాకు తెలియకున్నది. నీకు తెలిసిన, అబద్ధమాడక వివరించగలవా?" అని అడిగినది.

ఇంద్రుడు చేతులుజోడించి సవినయముగా "తల్లీ! నీవు ఏ సంకల్పమున వ్రతము పూనినావో నాకు తెలిసినది. స్వార్థమున స్వర్గమువదిలి నీ దగ్గరకు వచ్చినాను. నా మనమున కించిత్తు ధర్మభావమునులేదు. అవకాశముకొరకు కనిపెట్టుకొని ఉన్న నాకు నీవు ఎంగిలిముట్టుకొని కాలుచేతులు కడుగుకొనక పడుకొనుటవలన అవకాశము లభించినది. గర్భమున ప్రవేశించి నీ గర్భమునఉన్న పిండమును ఏడు ముక్కలుగను, తదుపరి ఒక్కొక్కముక్కను ఏడుఏడు ముక్కలుగను నరికినాను. అయినను వారు మరణించక నలుబదితొమ్మిదిమంది బాలకులు అగుటచూచి ఆశ్చర్యపడినాను. ఇది నీవు భగవానుని ఆరాధించిన ఫలితమేనని గ్రహించినాను. తల్లీ! నీవు పూజ్యురాలవు. నేను నీ విషయమున దుర్మార్గము చేసినాను. నా అపరాధమును మన్నించుము. నే నట్లుచేసినను నీ గర్భము నష్టపడలేదు. నీ సంతానమునకు దేవత్వము ప్రసాదించినాను" అని విన్నవించినాడు.

ఇంద్రుడు నిష్కపటముగా చెప్పినమాటలువిని దితి సంతోషించినది. ఇంద్రుడు ఆమెకు నమస్కరించి మరుత్తులతోకలసి స్వర్గమునకు వెళ్ళినాడు.

ఇది షష్ఠ స్కంధము

శ్రీమద్భాగవతము

సప్తమస్కంధము

జయవిజయులు.

పరీక్షిత్తు అడుగుచున్నాడు :—

మునిపుంగవా! భగవానుడు అన్నిభూతములకు ప్రియుడు. అతనికి అందరును సమానము. అతడు సర్వజనములకు మిత్రుడు. అతనికి అమిత్రులులేరు. అట్టి భగవంతుడు దైత్యులను ఏలసంహరించినాడు? అతడు పరమానంద స్వరూపుడు. నిర్గుణుడు. నిరామయుడు. నిరాకారుడు. దేవతలవలన అతను సాధించదగినదిలేదు. దైత్యులవలన అతనికి రాగల ప్రమాదములేదు. అట్టివాడు దైత్యులను ద్వేషించినాడు. దేవతలను అనుగ్రహించినాడు. భగవంతుని సమభావమున నాకు సందేహము కలుగుచున్నది. నీవుతప్ప నా సందియమును నివారించువారులేరు. అనుగ్రహింపుము.

శుకయోగీంద్రుడు చెప్పుచున్నాడు :—

మహారాజా! భగవంతుని లీలలు అద్భుతములు. అతని చరిత్ర అనన్యము. నీప్రశ్న గొప్పది. అది భాగవతుల మహత్తును వ్యక్తపరచును. భాగవత కథలు పుణ్యప్రదములు. నారదాదిమునులు గానముచేయుదురు. అట్టి కథలు నీకు వినిపింతును. వినుము.

> భగవంతుడు నిర్గుణుడు. అవ్యక్తుడు. ఆదిమధ్యాంత రహితుడు ప్రకృతికి అతీతుడు. అయినను ప్రకృతిని ధరించును. సత్వము, రజస్సు, తమస్సు ఇవి ప్రకృతిగుణములు. ఈ మూడును ఒకే సమయమున పెరగవు. ఒకే సమయమున తరుగవు. కాలమునుబట్టి, యుగమునుబట్టి అవి పెరుగుట, తరుగుట కలుగుచున్నది. ఒకప్పుడు సత్వగుణమునకు ప్రగతికలుగును. అప్పుడు భగవానుడు దేవతలకు, ఋషులకు అభివృద్ధికలిగించును. ఒకప్పుడు రజోగుణముపెరుగును. అప్పుడు దైత్యులకు అభివృద్ధికలిగించును. ఒకప్పుడు తమోగుణముపెరుగును. అప్పుడు యక్షులకు, రాక్షసులకు అభివృద్ధి కలిగించును.

కట్టెలో అగ్ని దాగియుండును. కనిపించదు. అట్లే భగవంతుడు అందరిలో ఉండును. విడిగా గుండడు. జ్ఞానులు అతని ఉనికిని గ్రహింతురు. తమ హృదయములను వెదకుదురు. భగవానుని కనుగొందురు.

భగవానుడు విశ్వమును సృజించగోరును. రజోగుణమును ప్రేరేపించును. సృష్టివిచిత్రము. దానితో క్రీడించదలచును. సత్త్వగుణమును ప్రేరేపించును. సృష్టిని ఉపసంహరించదలచును. తమోగుణమును ప్రేరేపించును. ప్రకృతి పురుషులకు సహకారము అవసరము. అందుకు అతడు కాలమును సృజించినాడు. భగవంతుడు కాలమునకు అధీనుడుకాడు, కాలమే అతని అధీనమున ఉన్నది. భగవానుడు కాలస్వరూపుడు. కాలమునుబట్టి అతడు దేవతలకు ప్రియుడగును. వారిని వృద్ధిపరచును. రజస్తమస్స్వభావులు దైత్యులు. వారిని సంహరించును.

పూర్వము ధర్మరాజు ఇట్టిసందేహమునే వ్యక్తపరచినాడు. అప్పుడు నారదుడు ఒక ఇతిహాసము చెప్పినాడు. అది వినిపింతును. వినుము.

ధర్మరాజు రాజసూయము చేసినాడు. ఆ సందర్భమున శిశుపాలుడు శ్రీకృష్ణ సాయుజ్యం పొందినాడు. ధర్మరాజు ఆ అద్భుతము చూచినాడు. నారదుని అడిగినాడు :—

పూర్వము వేనరాజు భగవంతుని దూషించినాడు. అది విన్నారు బ్రాహ్మణులు. కోపించినారు. వేనుని నరకమున త్రోసినారు. (వేనరాజు కథ-చతుర్థస్కంధమున) శిశుపాలుడు అట్టివాడేకదా! అతడు పుట్టినదాది వాసుదేవుని నిందించుచున్నాడు. దంతవక్త్రుడు కూడ అట్లేచేసినాడు. వీరును వేనునివలె నరకమునకు పోవలసిన వారు. పోలేదు. పరమభాగవతులకు దుర్లభమైన కృష్ణసాయుజ్యము వారికి లభించినది. ద్వేషమున మండిపోవు శిశుపాలునకు పరమగతి ప్రాప్తించుటకు కారణమేమి? వివరించ వేడుకొనుచున్నాను.

నారదుడు ధర్మరాజు ప్రశ్నవిన్నాడు. సంతోషించినాడు. సకలసాంతము వినుచుండగ చెప్పినాడు :—

ప్రకృతివేరు. పురుషుడువేరు. శరీరమువేరు ఆత్మవేరు. వివేకము లోపించినవారు దీనిని గ్రహించలేరు. నింద, స్తుతి, తిరస్కారము శరీరానివి. ఆత్మకు చెందవు. శరీరమునే ఆత్మఅని అభిమానించడం అవివేకం. అట్టి అవివేకము వల్లనే అహంకారము, మమకారము కలుగుచున్నవి. ఇవి వైషమ్యములకు

మూలకారణము. అందువలన శరీరంమీద అభిమానము పెరుగును. ఈ శరీరమే ఆత్మ అనుభావము స్థిరపడును. అందువలన శరీరమును బాధించిన ఆత్మను బాధించినట్లు తల్లడిల్లును.

భగవంతుడు అట్టి అభిమానములకు అతీతుడు అద్వితీయుడు. అతనికి క్రోధము లేదు. ద్వేషములేదు. అతని దండన లోకకళ్యాణమునకే. భగవంతునకు హింసాభావము తాకదు.

భగవంతునిమీద మనసులగ్నమగుట ప్రధానము. అది భక్తిభావమున కావచ్చును, భయమున కావచ్చును. స్నేహమున కావచ్చును. కోరికల కొరకే కావచ్చును. విరోధభావమునసే కావచ్చును. విరోధభావము ఎక్కువ తన్మయుని చేయును. తుమ్మెద పురుగును తెచ్చును. తన రంధ్రమున బంధించును. పురుగు భయమునను, ద్వేషమునను తుమ్మెదనని భావించును. తుమ్మెదగా మారును. అట్లే పరమాత్మని ద్వేషించినారు శిశుపాల దంతవక్త్రులు. శత్రువుగా భావించినారు. సమస్తపాపములను పరిహరించుకున్నారు. పరమాత్మలో లీనం అయినారు.

భగవంతుని పొందుటకు అయిదు మార్గములున్నవి. 1. గోపికలు కామించినారు. భగవంతుని పొందినారు. 2. కంసుడు భయపడినాడు. భగవంతుని పొందినాడు. 3. శిశుపాల దంతవక్త్రులు ద్వేషించినారు. భగవంతుని పొందినారు. 4. మేము భక్తిని ఆశ్రయించినాము. భగవంతుని పొందినాము. 5. మీరు స్నేహమును అవలంబించినారు. భగవంతుని పొందినారు.

వేనుడు వీనిలో ఏ విధానమును అవలంబించలేదు. అందువలన అతడు నరకమున పడినాడు.

ధర్మరాజా ! శిశుపాల దంతవక్త్రులు వాస్తవమున జయవిజయులు. విష్ణుదేవుని ద్వారపాలకులు. మునుల శాపమువలన పదభ్రష్టులయినారు.

వారికి శాపము కలుగుటకుగల కారణమును వివరించవలసినదిగా కోరినాడు ధర్మజుడు. నారదుడు ఆ కథ నిట్లుచెప్పినాడు :—

సనకసనందనాదులు బ్రహ్మమానస పుత్రులు. వారు ముల్లోకములు సంచరించగలవారు. వారు ఆద్యులు అయినను అయిదారేళ్ల బాలులవలె ఉందురు. వారు బట్టలుకట్టరు. దిసమొలలతోనే సంచరింతురు. వారు వైకుంఠమునకు వెళ్లినారు. ద్వారపాలకులు వారిని చూచినారు. సామాన్య బాలకులు అనుకున్నారు. అడ్డగించినారు. లోనికి వెళ్లనివ్వలేదు.

అదివిన్నారు సనకసనందనాదులు. కోపించినారు. శపించినారు :-

మీరు మూర్ఖులు. మీకు రజోతమోగుణములున్నవి. మీరు భగవంతుని వద్ద ఉండుటకు అర్హులుకారు. మీరు పాపాత్ములుగాన రాక్షసులుగా పుట్టండి.

శాపము తగిలినది. జయవిజయులు క్రిందకు పడిపోసాగినారు. మునులు వారిని చూచినారు. కనికరించినారు. మూడు జన్మలందు శాపము అనుభవించి తిరిగి ఇక్కడికి రావచ్చును. అని అనుగ్రహించినారు.

జయవిజయులే హిరణ్యాక్ష హిరణ్యకశిపులు. వారు దితికి బిడ్డలు. వీరు దైత్యులందును దానవులందును ఉత్తములు. విష్ణువు వరాహావతారమెత్తినాడు. భూమిని ఉద్ధరించినాడు. అప్పుడు హిరణ్యాక్షుని వధించినాడు. విష్ణువు నరసింహావతారమెత్తినాడు. హిరణ్యకశిపుని సంహరించినాడు. హిరణ్యకశిపుని కుమారుడు ప్రహ్లాదుడు. అతడు పరమభక్తుడు. భాగవతుడు. సమదర్శి. శాంతస్వభావుడు. హిరణ్యకశిపుడు ప్రహ్లాదుని నానాబాధలుపెట్టినాడు. చంపుటకు ప్రయత్నించినాడు. చంపలేక పోయినాడు.

జయవిజయులు మరలపుట్టినారు. విశ్రవసునికి, కైకసికి రావణ కుంభకర్ణులుగా జన్మించినారు. వారు రాక్షసులు. చాల ఉపద్రవములు కలిగించినారు. అప్పుడు భగవానుడు రామావతారము ఎత్తినాడు. వారిని సంహరించినాడు.

జయవిజయులు శిశుపాల దంతవక్త్రులుగా జన్మించినారు. కృష్ణభగవానుడు సుదర్శనము ప్రయోగించినాడు. వారిపాపములు హరించినవి. శాపము తీరినది. వారు విరోధభావమున సదా భగవానుని ధ్యానించినారు. అందువలన భగవానునిలో లీనము అయినారు. వైకుంఠమున ద్వారపాలకులయినారు.

వక్రంబింతయులేక పాయని మహావైరంబునన్ నిత్యజా
తక్రోధ స్మరణంబులన్ విరళితోద్యత్పాప సంఘాతులై
చక్రచ్ఛిన్న శిరస్కులై మునివచశ్శాపావధి ప్రాప్తులై
చక్రిం జేరిరి వారు పార్శ్వచరులై సారూప్య భావంబునన్

అనిన ధర్మనందనుండిట్లనియె :—

బాలున్ హరిపదచింతా శీలున్ గుణాలవాలు శ్రీమన్మేధా
జాలున్ సంతోషింపక యేలా శిక్షించె రాక్షసేంద్రుండనఘా ?

ధర్మరాజు అట్లడిగినాడు. అందుకు నారదుడు ఇట్లు వచించినాడు :—

హిరణ్యకశిపుడు.

విష్ణువు వరాహావతారమెత్తినాడు. హిరణ్యాక్షుని సంహరించినాడు. తమ్ముడు చచ్చినాడని హిరణ్యకశిపుడు దుఃఖించినాడు. తదుపరి కోపించినాడు. తన తమ్ముని చంపినాడు విష్ణువు. విష్ణువుపై ఉగ్రుడైనాడు. పెదవులు బిగించినాడు. కళ్లతో నిప్పులు కక్కినాడు. ఆకసమును చూచినాడు. బొమలు ముడివైచినాడు. అతని కరాళదంష్ట్రలు ప్రకాశించినవి. త్రిశూలము ధరించినాడు. దానవసభ దద్దరిల్లునట్లు గర్జించినాడు :—

"ఓ దానవులారా! దైత్యులారా! త్రిమూర్ధా! త్ర్యక్షా! శంబరా! శతబాహూ! హయగ్రీవా! నముచీ! పాకా! ఇల్వలా! విప్రచిత్తీ! పులోమా! శకునా వినుడు. తదుపరి కర్తవ్యమునకు పూనుకొనుడు.

నా శత్రువులు క్షుద్రులు. నా తమ్ముని చంపించినారు. హరిచేత అంతరింపచేసినారు. హరి సర్వసముడు. తేజోమయుడు. అతనికి దేవదానవులు సమానులు. అయినను అతడు నాతమ్ముని వధించినాడు. అందుకు కారణము దేవతలు. దేవతలు హరిని భజించినారు. భజనలకు లొంగినాడు హరి. దేవతల పక్షము వహించినాడు. నా తమ్ముని బలిగొన్నాడు.

పూర్వము హరి ఉత్తముడు. అతనికి కల్ల తెలియదు. కపటము ఎరుగడు. ఇప్పుడు మాయలకు దిగినాడు. మోసము సాగించినాడు. దేవతలను సంతోషపెట్ట దలచినాడు. వరాహరూపము ఎత్తినాడు. నాతమ్ముడు నాకు ప్రాణము. వాని ప్రాణములు తీసినాడు నావళ్లు మండుచున్నది. గుండె వక్కలగు చున్నది. ఇక సహించలేను. నా త్రిశూలమును ఎత్తినాను. హరి కంఠమున గ్రుచ్చెదను. ఆ రక్తమున నాతమ్మునకు తర్పణము ఇత్తును. నాతమ్మునికి రక్తము ఇష్టము. వానిఆత్మ శాంతించును. నామనసు చల్లారును. పగతీరును, నాకు తృప్తికలుగును. నాశత్రువులు దేవతలు. దేవతలకు హరి మూలము. మొదలు నరుకవలెను. కొమ్మలు ఎండిపోవును. అందువల్ల హరిని హతమార్తును. దేవతలు నశింతురు.

నేను నాపని నెరవేర్తును. ఇది తథ్యము. ఈలోన మీరు విజృంభించుడు. భూలోకమున విరుచుకు పడుడు. బ్రాహ్మణ, క్షత్రియులు బలవంతులయినారు. వారిని పట్టుడు. కొట్టుడు. చంపుడు. విష్ణువు యజ్ఞమయుడు. అనుష్ఠానము అతనికి మూలము. అందువలన వేదములు చదువువారిని, వ్రతములు పూనువారిని, దానములు చేయువారిని దునుమాడుడు. ఒక్కడు మిగులరాదు. అందరిని హత

మూర్ఖుడు. దేవతలకు, పితరులకు, ఋషులకు ధర్మమే నిలయము. ధర్మమే ఆశ్రయము. అందువలన బ్రాహ్మణులు, గోవులు, వర్ణాశ్రమ ధర్మములుగల ఊళ్లన్నింటిని కాల్చండి. కూల్చండి. ఒక్కటి మిగలరాదు. అచట పచ్చిగడ్డి మొలవరాదు. మిగులరాదు. చెట్లుచేమలు కాల్చండి. అంతయు కాలవలె. అట్టి ఊళ్లు శ్మశానములు కావలెను. వింటిరా నా ఆజ్ఞ. లెండు. పొండు. పాలించుడు.

రాజు ఆదేశము విన్నారు రాక్షసులు. వారికి కన్ను మిన్ను కనిపించలేదు. అరచినారు. పెడబొబ్బలుపెట్టినారు. గావుకేకలు వేసినారు. తొడలు చరిచినారు. ఉత్పాతమువలె ఊడిపడినారు. లోకులను యమయాతనలు పెట్టినారు. నగరములు కాల్చినారు. గ్రామములను తగలపెట్టినారు. ఆలమందలను చంపినారు. రత్నాగారములు దోచినారు. తోటలను కూల్చినారు. కొందరు గుద్దళ్లతో ప్రాకారములను, సేతువులను త్రవ్వినారు. కొందరు గొడ్డళ్లతో పచ్చనిచెట్లను కూల్చినారు. కొరవితో కొందరు ఇళ్లను బూడిద చేసినారు. రాక్షసులు భూలోకమున అల్లకల్లోలము కల్పించినారు. భూమి వడకినది. ప్రజలు పడ్డినారు. స్వర్గమున దేవతలు అదరినారు. బెదరినారు. స్వర్గము వదిలినారు. పారిపోయినారు. 'నాకలోకముమాని యడవులందుం జొచ్చి రమరవరులు.'

అంత హిరణ్యకశిపుండు దుఃఖితుండై, మృతుండైన సోదరునకు ఉదకప్రదానాది కార్యంబులాచరించి, యతని బిడ్డల శకుని, శంబర, కాలనాభ, మహోత్కచ ప్రముఖులను ఊరడించి, వారల తల్లితోగూడ హిరణ్యాక్షుని భార్యల నందర రావించి తన తల్లియయిన దితి నవలోకించి యిట్లనియె :—

హిరణ్యాక్షుడు వీరమరణము పొందినాడు. వానికొరకు విచారించపనిలేదు. అతడు వీరుడు. వీరుడు కోరునది వీరమరణము. వీరమరణమే వీరునకు అలంకారము.

> ''బాటసారులు దారిలో కలుసుకొందురు. కొంతసేపు ఉందురు. విడిపోదురు. జీవితము అట్టిదే. కర్మను అనుసరించి ప్రాణిపుట్టుచున్నారు. కర్మముగించుచున్నారు. మరణించుచున్నారు. మాయమగుచున్నారు. చచ్చుచున్నది శరీరము. ఆత్మకు చావన్నదిలేదు. ఆత్మనిత్యుడు. అవ్యయుడు, శుద్ధుడు, సర్వగతుడు. సర్వజ్ఞుడు. ఆత్మ లింగశరీరమును ఆశ్రయించును. అప్పుడు దానికి సుఖదుఃఖములు కలుగుచున్నవి.
>
> నీరు కదులును. నీటియందలి ప్రతిబింబము కదిలినట్లనిపించును. కదిలినది నీరు. ప్రతిబింబము కాదు. కన్ను తిరుగును. లోకము తిరిగినట్లు కనిపించును.

తిరిగినవి కళ్లు లోకముకాదు. విషయవాసనలు మనసును కదల్చును. ఆత్మ చలించినట్లు కనిపించును. కదిలినది మనస్సు. ఆత్మకాదు. స్థూలశరీరమునకు ఆత్మతో సంబంధములేదు. అయినను సంబంధము ఉన్నట్లు తోచును. ఆ దోషము ఆత్మదికాదు. మనసుది.

ఆత్మను శరీరముగా భావించుట అజ్ఞానము. అజ్ఞానము వలననే సుఖదుఃఖములు కలుగుచున్నవి. అజ్ఞానమువలననే ప్రియులు, అప్రియులు, దాతలు, పుట్టుకలు కలుగుచున్నవి.

ఇందుకు ఉదాహరణగా ఒక ప్రాచీన ఇతిహాసము ఉన్నది. చెప్పెదను వినుము:-

సుయజ్ఞుని కథ.

సుయజ్ఞుడు ఉశీనగరమునకు రాజు. అతడు ద్యుతిమంతుడు. కీర్తివంతుడు. యుద్ధమున పాల్గొన్నాడు. హతుడు అయినాడు. అతని కళేబరము యుద్ధరంగమున పడిపోయినది. రత్నకిరీటము ముక్కలైనది. భూషణములు తుక్కు అయినవి. హారములు వక్కలయినవి. గుండెలు చీలినవి. శరీరము రక్తమయము అయినది. తల తెగిపోయినది గుడ్లు పైకివచ్చినవి. చెవులుతెగినవి. పెదవులు కరుచుకుపోయినవి. పద్మమువంటి ముఖము మట్టికొట్టుకున్నది.

ఆయుధములు తగిలినవి. చేతులు తెగినవి. కాళ్లు ఊడిపడినవి. ప్రాణము ఉన్నప్పుడు అందముగా నున్నాడు. అందవికారుడై పడిఉన్నాడు. భయంకరముగా పడిఉన్నాడు.

అతని చుట్టు బంధువులు మూగినారు. భార్యలు కూడినారు. ఏడ్వసాగినారు. "ప్రాణనాథా! మమ్ములను వదలి వెళ్లిపోతివా? మాకు దిక్కెవరు?" అని గుండెలు బాదుకొని ఏడ్చినారు. రాగములు తీసి ఏడ్చినారు. వారి స్తనములమీద కుంకుమ ఉన్నది. అది కన్నీటికి తడిసింది. ధారకట్టింది. రాజు పాదములపై రాలినది. పాదములు తడిసిపోయినవి. వారి ఆభరణములు చిందరవందర అయినవి. వాళ్ల ఏడ్పుకు రాళ్లు కరిగినవి.

"నాథా! దైవము ఎంత కఠినము. నిన్ను కొనిపోయినాడు. ఏది నీవు కనిపించవు? ఏమైనది నీకు? ఎక్కడికి పోయినావు? నిన్ను ఉశీనగరమునకు రాజును చేసినాడు దైవము. ఆ భగవంతుడే నీకీ దశ కల్పించినాడు. నీవులేవు. ఉశీనగరం లేదు. నీవు భర్తవు. ఉశీనగరం విధవ అయింది. ప్రజలు దుఃఖసాగరమున మునిగి

ఉన్నారు. నీవు కృతజ్ఞుడవు. కొద్ది ఉపకారమును గొప్పగా భావించువాడవు. మమ్ముల్ని వదిలి వెళ్లిపోయినావు. నీకు దాసీలము మేము. పాదదాసీలము. ఎట్లు జీవింపగలము?" అని ఏడ్చినారు. ఎలుగెత్తి ఏడ్చినారు. సాయంత్రము వరకు ఏడ్చినారు.

సాయంత్రమయినది. మసక చీకట్లు కమ్మసాగినవి. కళేబరమునకు అగ్ని సంస్కారమునకు అన్నియు సిద్ధము అయినవి. రాణులు భర్తశరీరమును వదలుట లేదు. వారి ఏడ్పులు విన్నాడు యమధర్మరాజు. అతడు ఒక బాలుని రూపము ధరించి అచటకు వచ్చినాడు. ఇలా అన్నాడు :—

"మున్నిక వీరికెల్ల బహుమాత్రము చోద్యము దేహిపుట్టుచున్
జచ్చుచు నుండజూచెదరు చావక మానెడు వారి భంగినీ
చచ్చిన వాని కేడ్చెదరు చావుకు నొల్లక డాగవచ్చునే
యెచ్చటి పుట్టి యచ్చటికి నేగుట నైజము ప్రాణికోటికిన్."

"మనిషి ఒకచోటునుండి వచ్చినాడు. మరల అచ్చటికే చేరుచున్నాడు. అందరును అచటికే చేరుకొనవలసినవారే. పోయిన వానికొరకు ఏడ్పుట ఎందులకు?

నేను బాలుడను. అయినను మీకన్నను పెద్దను. మీరు పెద్దలు. లోకము నెరుగ జూచుచున్నారు. అయినను ఏల విలపింతురు? నన్ను తల్లిదండ్రులు వదలినారు. శరీరమునకు తగిన బలమునులేదు. అయినను నాకు విచారములేదు. క్రూరజంతువులు నన్నేమియు చేయలేకపోయినవి. తల్లిగర్భమున నన్ను కాపాడినవాడు భగవంతుడే. వాడే నన్ను రక్షించును.

భగవంతుడు సనాతనుడు. తన లీలకొరకు ఈ ప్రపంచమును సృష్టించును. లీలకొరకే రక్షించును. లీలకొరకు నాశనము చేయును. ఇది అతనికి బొమ్మలాట. అతడు సమర్థుడు, రక్షింపగలడు. శిక్షింపగలడు.

దైవరక్షితమయినది దారిలోపడియు సురక్షితముగా ఉండును. దైవరక్షణ లేకున్న మూలనున్నది మాయమగును. ఈశ్వరుని రక్షణ ఉన్నవారు అడవియందు అయినను చక్కగా జీవించును. చాలకాలము బ్రతుకును. దైవము విడనాడిన ఇంట భద్రముగా నున్నవారు మరణించును.

కర్మములవలన జననమరణములు కలుగుచున్నవి. అయినను దేహమునందున్న ఆత్మకు కర్మములు అంటవు. ఆత్మ విలక్షణము అయినది. గృహమువేరు గృహమునందున్న జనులు వేరు. అట్లే ఆత్మవేరు. దేహము

వేరు. ఆత్మవేరు, దేహమువేరు అని తెలుసుకొనుట వివేకము. తెలుసుకొనకుండుట అవివేకము.

నీటినుండి నురగవచ్చును. మట్టినుండి కుండలు వచ్చును. తేజస్సునుండి కుండలములు మొదలగు ఆభరణములు వచ్చును. నురగ నశించును. కుండలు నశించును. ఆభరణములు నశించును. దేహము, మట్టి, నీరు, తేజస్సు వీని పరిణామమువల్ల వచ్చినది. అందువలన ఈ దేహముకూడ నశించును. ఆత్మ అట్లుకాదు. దానికి భౌతికపదార్థములేదు. కాబట్టి దానికి ఆకారములేదు. వికారము లేదు.

కట్టెలలో నిప్పు ఉండును. అయినను కట్టె నిప్పుకాదు. నిప్పువేరు కట్టెవేరు. దేహమున వాయువు ఉన్నది అయినను దేహము వాయువుకాదు. దేహము వేరు వాయువువేరు. వస్తువులందు ఆకాశము నిండిఉన్నది. అంతమాత్రమున వస్తువు ఆకాశముకాదు. వస్తువువేరు ఆకాశమువేరు. అట్లే ఆత్మవేరు శరీరము వేరు. ఆత్మ శరీరమందున్నది. అంతమాత్రమున శరీరము ఆత్మకాదు.

మీరు మూర్ఖులు. మీరు దేనికొరకు ఏడ్చుచున్నారు? సుయజ్ఞుని కళేబరము కొరకుకదా! అది మీ ఎదుటనే ఉన్నది. ఈ కళేబరమున ఉన్నవాడులేడు. విన్నవాడు లేడు. చూచినవాడు లేడు. వాడు ఎవరికీ కనిపించలేదు. లేడుకూడ. కనిపించడు. అట్లయిన ఏడ్చెదరేల?

దేహములోని ఇంద్రియములన్నింటికి ప్రాణమే హేతుభూతము. ప్రాణము దేహమున ఉన్నప్పుడు మాట్లాడును వినును అది దేహమును వీడిన మాట్లాడదు. వినదు, కనదు. ఇంద్రియములద్వారా ద్రష్టగా ఉన్న ఆత్మ భిన్నము అయినది. అది ప్రాణముకాదు దేహముకాదు. ఆత్మ సర్వవ్యాపకము. అది పంచభూతములను ఆశ్రయించినపుడు ఉచ్చ, నీచ శరీరములను ధరించును. ఆత్మ తన స్వభావము వలననే శరీరమును త్యజించును.

శరీరమున ఆత్మ ఉన్నంతవరకు కర్మబంధములు తప్పవు. మాయకు, మోహమునకు కర్మబంధములే కారణములు. కష్టములకు, నష్టములకు కర్మబంధములే హేతువులు. ప్రకృతికి కొన్ని గుణములున్నవి ఆ గుణముల వలన కొన్ని పరిణామములు కలుగుచున్నవి. అట్టి గుణములను, పరిణామములను పరమార్థము అనుకొనుట వ్యర్థము. ఇంద్రియములు గ్రహించునవన్నియు కలలవంటివి. అందువలన ఆత్మతత్త్వము తెలిసినవారు అశాశ్వతము అయిన శరీరము కొరకు దుఃఖించరు. శాశ్వతము అయిన ఆత్మకొరకును దుఃఖించరు. అజ్ఞానులు దుఃఖింతురు. అది వారి స్వభావము. దానిని మార్చుట దుస్తరము.

ఒక అడవి. అడవిలో ఒక బోయవాడు. వాడు పక్షులపాలిటి యముడు. గింజలు చల్లువాడు. ఎరవేయువాడు. మోసము చేయువాడు. వలపన్నువాడు. పిట్టలను

పట్టువాడు. వాటిని చంపువాడు. ఒకసారి ఒక పిట్టల జంటను చూచినాడు. గింజలు వేసినాడు. వలపన్నినాడు. ఆడపిచ్చుక వలలో తగులుకున్నది. మగపిట్ట కొమ్మమీద మిగిలిపోయినది. ఆడపిట్టను విడిపించు శక్తి లేదు. దానిమీది ప్రేమ వదలలేదు. జాలిగా ఏడ్చినది.

"నా భార్య వలలో చిక్కినది. గింజుకొనుచున్నది. బాధపడుచున్నది. నాగుండెలు పగులుచున్నవి. దైవం దయమాలినవాడు. దాన్ని బాధపెట్టుచున్నాడు. ఏమి చాయుకొనుము. నన్ను తీసుకొని పోరాదూ! నేనెట్లు జీవింతును. నా భార్య లేదు? వియోగము ఎట్లు భరింతును? పిల్లలు పసికందులు. వారినెట్లు సాకుదును?" అని ఎంతో విలపించింది.

పిట్ట గమనించలేదు. బోయవాడు మగపిట్టను చూచినాడు. గురిపెట్టినాడు. బాణము వదిలినాడు. అది మగపిట్టకు తాకినది. గిరగిర తిరిగి పడిపోయినది. అక్కడికి అక్కడనే చచ్చిపోయినది.

విన్నారా! పిచ్చుక భార్యకొరకు ఏడ్చినది. తన చావు కానలేకపోయినది. మీకును అట్టి గతియే పట్టును. చచ్చినవానికై ఏడ్చుచున్నారు. మీ చావు కానలేకున్నారు. ఏడ్చుచున్నారు. మొత్తుకొనుచున్నారు. మీరు పది సంవత్సరాలు మొత్తుకొనుడు రాజు తిరిగిరాడు. మీ భర్త తిరిగిరాడు."

బాలునినోట జ్ఞానవచనములు విన్నారు సుయజ్ఞుని రాణులును, బంధువులును. వారికి అవగతం అయినది. ఏదియు శాశ్వతము కాదని. వారు దుఃఖమును వీడినారు. శోకము విడిచినారు. సుయజ్ఞునకు అంత్యక్రియలు జరిపించినారు.

యముడు అంతర్ధానము అయినాడు.

అందువలన మీరు విచారము వదలండి. ప్రపంచమందు తనవారు, పరులవారు లేరు. ఎవరికొరకును విచారించ నక్కరలేదు అని ఓదార్చినాడు హిరణ్యకశిపుడు. హిరణ్యాక్షుని తల్లి దితి, భార్యలు దుఃఖము విడిచినారు. దితి పుత్రశోకము విడిచినది. తత్వజ్ఞానము అవలంబించినది. భగవంతునిపై మనసు లగ్నముచేసినది.

త ప స్సు - వ ర ము లు.

హిరణ్యకశిపుడు తాను అజేయుడను కావలెననుకున్నాడు. సకలలోక ప్రభువు కావలెననుకున్నాడు. తాను వృద్ధుడు కారాదనుకున్నాడు. చావు తనదరి చేర

రాదనుకున్నాడు. తనను మించిన వీరుడు ఉండరాదనుకున్నాడు. వాటినన్నింటిని సాధించదలచినాడు. మందరపర్వతము చేరినాడు. దారుణము అయిన తపస్సు ప్రారంభించినాడు. చేతులు పైకి ఎత్తినాడు. ఆకాశమువైపు చూచినాడు. కాలి బొటనవ్రేలిమీద నిలిచినాడు. సాగించినాడు తపము. ఉగ్రమైన తపస్సు చేసినాడు.

అతని జుట్టు జడలు కట్టినది. ఎఱ్ఱనైనది. ప్రకాశించినది. సూర్యునివలె వెలిగినది. జడలు కిరణములు అయినవి. ప్రళయ సూర్యునివలె ప్రకాశించినవి.

అతని తపమునకు దేవతలు గడగడలాడినారు.

అతడు కలకాలము తపమాచరించినాడు. అతని శిరము పొగలు కక్కినది. అగ్ని బయల్పడినది. అది తపోగ్ని. అది వ్యాపించినది. కార్చిచ్చువలె పాకినది. ఆ మంటతో సముద్రములు తుకతుక ఉడికినవి. భూమండలము గడగడలాడినది. కొండలు అదిరినవి. నదులు పొంగినవి. చెట్లు కదిలినవి. కూలినవి. కాలినవి. గ్రహములు, నక్షత్రములు గతులు తప్పినవి. దశదిశలు తాపమున తల్లడిల్లినవి. దేవతలు గడగడలాడినారు. స్వర్గము వీడినారు. బ్రహ్మదగ్గరకు పరుగు తీసినారు. విరించికి విన్నవించినారు :—

“దేవదేవా ! జగత్పతీ ! హిరణ్యకశిపుడు దైత్యరాజు. అతడు ఉగ్రమైన తపము చేయుచున్నాడు. అతని తపోగ్ని భరించరానిదిగా ఉన్నది. మేము దివిలో ఉండలేకపోవుచున్నాము. ఉపేక్షించిన సర్వనాశనము జరుగును. ఆ స్థితి సమీపించినది. దానిని అడ్డవలెను. ప్రతీకారము చేయవలెను. అతడు దేనికొరకు తపమాచరించుచున్నాడో మీకు తెలియనిది కాదు. అయినను విన్నవించుచున్నాము. చిత్తగించవలెను.

తపస్సు ప్రభావం అపారం అయింది. బ్రహ్మ సత్యలోకమున ఉన్నది తపస్సు ప్రభావముననే. అతడు సకల లోకములను సృష్టించునది ఆ ప్రభావముననే. తాను తపస్సుచేసి ఆ ప్రభావమును సాధించదలచినాడు హిరణ్యకశిపుడు. బ్రహ్మపదవిని చేజిక్కించుకొనదలచినాడు. తపమునకు పూనుకున్నాడు. కాలము అనంతము. ఆత్మ అనంతము. అది ఈ జన్మతో అంతమొందునది కాదు. ఎన్ని జన్మలకైనను సాధింతునని దీక్షపూనినాడు. తన తపమున లోకముల తలక్రిందులు చేయుదు ననుచున్నాడు. పాపపుణ్యములను అంతమొందింతు ననుచున్నాడు. వైకుంఠమునుకూడ వశపరచుకొనదలచినాడు. నీవు సర్వలోక ప్రభువవు. నీవు ఎరుంగనిది

లేదు. అయినను విన్నవించుచున్నాము వినుము. వెంటనే కర్తవ్యమునకు పూనుకొనుము. చేతులు కాలి ఆకులు పట్ట ప్రయోజనములేదు. నీ పదవి ఉత్తమం అయింది. అది గో, బ్రాహ్మణుల కళ్యాణం కోరుతుంది. నీ పదవిని రక్షించుకొనుము. మమ్ము రక్షించుము. లోకములను రక్షించుము. గోవులను రక్షించుము. బ్రాహ్మణులను రక్షించుము."

బ్రహ్మ దేవతల విన్నపమును విన్నాడు. హిరణ్యకశిపుని ఆశ్రమమునకు బయలుదేరినాడు. అతనివెంట భృగువు, దక్షుడు మున్నగు ప్రజాపతులు వెళ్ళినారు. హిరణ్యకశిపుని దేహముమీద పుట్టలు మొలిచినవి. గరికదుబ్బులు, వెదురుపొదలు మొలిచినవి. అతని రక్తమాంసములు, చర్మము చీమలు తినినవి. మబ్బులుకప్పిన సూర్యునివలె ఉన్నాడు హిరణ్యకశిపుడు. అతడు కనిపించుటలేదు. అతని తపస్సు మంటలు సకలలోకాలనూ కాల్చివేస్తున్నవి.

బ్రహ్మదేవుడు చూచినాడు. చకితుడు అయినాడు. ఆశ్చర్యమున మునిగినాడు. తేరుకున్నాడు. హిరణ్యకశిపుని పిలిచినాడు. ఇలా అన్నాడు :—

"కశ్యపకుమారా ! లెమ్ము. నీ తపము ఫలించినది. వరములు ఇచ్చుటకు నేను వచ్చినాను. నీ మనోబలము అద్భుతము. దోమలు, చీమలు నీ దేహమును తిన్నవి. అయినను అస్థిపంజరమున నీ ప్రాణము వ్రేలాడుచున్నది. ఇంత కఠోరమైన తపము ఇంతకు ముందు ఎవరూ చేయలేదు. ఇకముందు చేయరు. వంద దేవ వత్సరములు తపస్సు చేసినావు. అది అనితరసాధ్యము. నీ తపమున నన్ను వశపరచుకున్నావు. నేను ఆనందించినాను. ఎట్టి వరములు కావలెనో కోరుము. కాదనక ఇత్తును."

హిరణ్యకశిపుడు చేతులు జోడించినాడు. బ్రహ్మతో అన్నాడు :—

"నీవు ఉత్తముడవు, పురాణపురుషుడవు. స్థూల, సూక్ష్మ శరీరములకు అతీతుడవు. అనంతరూపుడవు. అవ్యక్తరూపుడవు. సర్వవ్యాపకుడవు. నీకు నమస్కారము. నాకు కోరిన వరములు ఇత్తునంటివి వినుము.

నీవు సర్వభూతములను సృజించినావు. వానిలో దేనివలనను నాకు చావు కలుగరాదు. లోపలను వెలుపలను, పగలును, రాత్రియు, ఏ ఆయుధము చేతను, భూమిపైనగాని, ఆకాశమునగాని, నరుల వలనగాని, మృగముల వలనగాని, ప్రాణమున్న వానిచేగాని, ప్రాణములేని వారిచేగాని, సురులచేగాని, అసురుల

చేగాని, ఉరగములచేగాని చావు కలుగరాదు. సమరమున నన్ను గెల్చువాడు ఉండరాదు. నేను ఒక్కడనే రాజును కావలెను. లోకపాలురకు గల అణిమాది ఐశ్వర్యములు నాకు కలుగవలె. అట్టి వరములు ప్రసాదించుము ప్రభూ! దేవదేవా!"

హిరణ్యకశిపుని కోరికలు విన్నాడు బ్రహ్మ. అతడు అడగరాని వరాలు అడిగినాడు. అయినను ఆనందించిన బ్రహ్మ అన్నింటిని ఇచ్చినాడు అన్నాడు :—

అన్నా! కశ్యపపుత్ర! దుర్లభము లీయర్థంబు లెవ్వారికిన్
మున్నెవ్వారలు గోరరీవరములన్ మోదించితిన్ నీయెడన్
నన్నున్ గోరినవెల్ల నిచ్చితి బ్రవీణత్వంబుతో బుద్ధి సం
పన్నత్వంబున నుండుమీ! సుమతివై భద్రైకశీలుండవై.

అని యిట్లమోఘంబులయిన వరములిచ్చి దితినందనుచేతం బూజితుండై యరవిందభవుండు బృందారక సందోహ వంద్యమానుండగుచు నిజమందిరమునకుం జనియె.

హిరణ్యకశిపుడు విశ్వవిజేత అయినాడు. దశదిశలు గెలిచినాడు. దేవతలు, అసురులు, గంధర్వులు, మనుష్యులు, గరుడులు, నాగులు, సిద్ధులు, చారణులు, విద్యాధరులు, ఋషులు, పితృదేవతలు, మనువులు, యక్షులు, రాక్షసులు, పిశాచులు, ప్రేతులు, భూతపతులు అందరును అతనిచేత ఓడినారు. లోకపాలురకు శక్తులున్నవి. అవి హిరణ్యకశిపుని ముందు కనిపించలేదు. లోకపాలుర స్థావరము లన్నియు చేజిక్కించుకున్నాడు. నందనవనమున విహరించినాడు. విశ్వకర్మ నిర్మించిన ఇంట కాపురము పెట్టినాడు. ముల్లోకములయందు ముచ్చట అయినది ఇంద్రభవనము. అది సర్వసంపదలకు ఆలవాలము. దాని పావంచలు పగడములు. దానిమెట్లు పచ్చలు, గోడలు స్ఫటికము, స్తంభములు వైడూర్యములు. ఆసనములు పద్మరాగములు. అక్కడి పడకలు పాలనురుగువలె నుండును. ఆణిముత్యముల వలలుగల పందిరిమంచములున్నవి. అక్కడినేల రత్నమయము. అప్సరసల అందియలు ఆ నేలమీద గల్లుమనును. నడకలో వారి ప్రతిబింబములు రతనములందు కాన్పించును. ఆ భవనమున అడుగు పెట్టినాడు హిరణ్యకశిపుడు. విచ్చలవిడిగా విహరించినాడు విజేత. దేవేంద్రుని తలతన్నినాడు. సామ్రాట్టు అయినాడు. ముల్లోకములు గెలిచినాడు. త్రిలోకనాథుడు అయినాడు. అతని శాసనమునకు ముల్లోకములు చేతులొగ్గినవి. దేవదానవులు అతని అడుగులకు మడుగులు పట్టినారు.

హిరణ్యకశిపుడు తపోబలమునకు, యోగబలమునకు, శరీరబలమునకు, మనోబలమునకు గనివలె ఉన్నాడు. అతని కనులు రక్తము కక్కుచుండును. అతడు సదా మత్తులో నుండును. త్రిమూర్తులు తప్ప తక్కిన దేవతలందరు స్వయముగా కానుకలు తెచ్చి అర్పించువారు. అందరును అతని దాసానుదాసులై జీవించినారు. అతడు ఇంద్రుని సింహాసనమున కూర్చున్నాడు. విశ్వావసుడు, తుంబురుడు, అతనిముందు సంగీతము పాడువారు. గంధర్వులు, ఋషులు, విద్యాధరులు, అప్సరసలు అతనిని నిరంతరము స్తుతించువారు. యజ్ఞములందు ఆహుతులను అతనే అందుకున్నాడు.

సప్తద్వీపాలను పాలించినాడు.

భూమి సాగుచేయ పనిలేదు. విత్తనములు చల్లనక్కరలేదు. హిరణ్యకశిపుడనిన భయం దానికి. ఏది కావలెనన్న అది ఇచ్చుచున్నది. ఆకాశం అదిరిపోయింది. అతడు కావలెనన్నది హాజరు పరిచెడిది. సప్తసముద్రములును భార్యలయిన నదులయుక్తముగా కెరటములు చేతులెత్తి రత్నరాసులు బహూకరించెడివి. పర్వతములు తమలోయలందు అతనికి ఆవాసములు కల్పించెడివి. వృక్షములు సర్వకాలములందును ఫలములను ఇచ్చెడివి. లోకపాలుర ఐశ్వర్యములన్నియు అతనినే చేరినవి. అతడు జగదేకవీరుడు. విశ్వప్రభువు. త్రిలోకనాథుడు. అట్లతడు మహాభోగములు అనుభవించినాడు.

ఆయినను అతనికి తృప్తిలేదు. అతడు ఇంద్రియములకు దాసుడు అయినాడు.

హిరణ్యకశిపుడు దైత్యుడు. మునుల శాపమువలన పుట్టినవాడు. అతడు కన్నుమిన్ను కానలేదు. ధర్మమును తిరస్కరించినాడు. అచ్చుపోసిన ఆబోతువలె తిరిగినాడు. అతని దౌర్జన్యమునకు అంతులేదు. అట్లుసాగినది కలకాలము. ఎల్లకాలము ఏదియు సాగదు. ప్రతిదానికి అంతమున్నది. అంతము లేనిదిలేదు.

హిరణ్యకశిపుని శాసనం ఉగ్రం అయింది. దానిముందు ముల్లోకములు గడగడలాడినవి. లోకపాలురు దీనులు అయినారు. అతని బాధలు భరించలేకపోయినారు. దిక్కులేనివారయినారు. వారు భగవంతుని శరణుజొచ్చినారు. ప్రార్థించినారు :-

ఎక్కడనున్నవాడు ? జగదీశ్వరుడాత్మమయుండు మాధవుం
డెక్కడకేగి శాంతులు మునీశులు భిక్షులురారు ? గ్రమ్మఱన్
దిక్కులకెల్ల నెక్కుడు తుదింజొర దిక్కగు నట్టి దిక్కుకై
మ్రొక్కెదమేము హస్తయుగముల్ ముకుళించి మదీయ రక్షకున్

అని మఱియు నాహారనిద్రలు మాని చిత్తంబులు పరాయత్తంబులు గానీక సమాహిత బుద్ధులై భగవంతుండును మహాపురుషుండును మహాత్ముండును విశుద్ధ జ్ఞానానందమయుండు నైన హృషీకేశునకు నమస్కరించుచున్న యెడ మేఘరవ సమాన గంభీర నినదంబున దిశలు మ్రోయించుచు సాధులకు నభయంబు గావించుచు దృశ్యమానుండు గాక పరమేశ్వరుండైన హరి యిట్లనియె:—

"దేవతలారా! భయమువీడుడు. నా దర్శనము శుభము కలిగించును. హిరణ్యకశిపుని విషయము నాకు తెలియును. సహనము వహించుడు. వానిని అంతమొందింతును.

శుద్ధసాధులందు సురలందు శ్రుతులందు గోవులందు విప్రకోటియందు
ధర్మపదవియందు దగిలి నాయందువా డెన్నడలుగు నాడె హింసనొందు.

వాడు పరమశాంతుడైన కుమారునిమీద పగబట్టును. అప్పుడు వానిని నేను చీల్చి చెండాడుదును.

లోకనాథుడు శ్రీహరి. అతడు అభయము ఇచ్చినాడు. దేవతలకు ప్రాణములు లేచివచ్చినవి. హిరణ్యకశిపుడు అంతరించినట్లే భావించినారు.

ప్రహ్లాదుడు.

హిరణ్యకశిపునకు నలుగురు పుత్రులు. చిన్నవాడు ప్రహ్లాదుడు. చిన్నవాడయినను గుణములందు మిన్నవాడు.

తనయందు నఖిల భూతములందు నొకభంగి సమహితత్వంబున జరగువాడు
పెద్దల బొడగన్న భృత్యునికైవడి జేరి నమస్కృతుల్ జేయువాడు
కన్నుదోయికి నన్యకాంతలడ్డంబైన మాతృభావంబున మరలువాడు
తల్లిదండ్రులభంగి ధర్మవత్సలతను దీనులగావ జింతించువాడు
సఖులయెడ సోదరస్థితి జరుపువాడు దైవతములందు గురువుల దలచువాడు
లీలలందును బొంకులు లేనివాడు లలిత మర్యాదుడైన ప్రహ్లాదుడధిప.

ప్రహ్లాదునకు సాధువులన్న ప్రాణము. బ్రాహ్మణులనిన భక్తి. అతడు సాధుస్వభావుడు. జితేంద్రియుడు. ఎల్లరను తనవలె చూడగలవాడు. పరుల క్షేమమే తన క్షేమముగా భావించువాడు. దురభిమానము, దర్పము, గర్వము లేనివాడు. ఆపదలకు భయపడడు, ధైర్యము వీడడు. సుఖముల విషయమున స్పృహాగల

వాడుకాడు. వాసనలకు అతిదూరంగా ఉండువాడు. అతడు అసురుడు. అయినను మత్సర మెరుగడు.

భగవంతుని గుణములు అనంతము. అట్లే ప్రహ్లాదుని గుణములును అనంతములు. వాటిని కవులు బహుధా వర్ణించినారు. దేవతలు దైత్యుల శత్రువులు. అయినను వారు ప్రహ్లాదుని గౌరవించినారు. అతడు అజాత శత్రువు. వాసుదేవుడనిన అతనికి అపారశక్తి. అందుకే అతడంత గుణవంతుడు, మహిమాన్వితుడు. బాల్యమున ఆటలనిన అతనికి ఇష్టముండునది కాదు. సదా భగవంతుని ధ్యానించువాడు. కృష్ణవిగ్రహము పట్టుకొనువాడు. ఆతని ధ్యాస దానిమీదనే, లోకమును పట్టించుకొనువాడు కాదు. కూర్చున్నను, పడుకున్నను, తినుచున్నను, మాటలాడుచున్నను, పాటపాడుచున్నను హరినితప్ప అన్యము తలచువాడుకాడు. ఒక్కొక్కసారి భగవంతుడు తనను వదలి వెళ్ళిపోయినట్లనిపించునది అతనికి. అప్పుడు అమాంతముగా ఏడ్చువాడు. వెంటనే భగవానుడు తన ముందు ఉన్నట్లు భావించువాడు. పకపక నవ్వువాడు. భగవంతుని ధ్యానమందు తన్మయుడగువాడై ఆనందమున పరవశుడగువాడు. పాటలు పాడువాడు. కేకలు వేయువాడు. నాట్యము చేయువాడు. భగవానుని లీలలు తలచుకొనువాడు. తన్మయుడగువాడు. హరిని అనుకరించువాడు. హరిస్పర్శ అనుభవించువాడు. పులకాంకితుడగువాడు. ఆనందాశ్రువులు రాల్చువాడు.

భగవంతుని ఎడ భక్తి కలుగుట దుర్లభము. అది పరమభాగవతుల సహవాసము వలన గాని లభించదు. అట్టి భక్తి ప్రహ్లాదునకు జన్మతః అలవడినది. అతడు భక్తి పరవశుడగువాడు. సర్వము మరచువాడు. ప్రహ్లాదుడు మహాభాగవతుడు. అట్టివాని మీద పగబట్టినాడు తండ్రి. ద్రోహము తలపెట్టినాడు.

చదువులు.

> చదువనివాడజ్ఞుండగు జదివిన సదసద్వివేక చతురత గలుగున్
> జదువగ వలయును జనులకు జదివించెద నార్యులొద్ద జదువుము తండ్రీ

అని ప్రహ్లాదుని చదువులకు పంపినాడు తండ్రి హిరణ్యకశిపుడు.

దైత్యులకు గురువు శుక్రాచార్యుడు. అతనికి ఇద్దరుపుత్రులు. వారు చండుడు, అమర్కుడు అనువారు. వారు హిరణ్యకశిపుని ఆస్థానమున ఉండువారు. వారికి ప్రహ్లాదుని అప్పగించినాడు హిరణ్యకశిపుడు.

అంధప్రక్రియనుండురాఁడు వటుకంఠస్మత్ప్రతాపక్రియా
గంధంబించుక లేదు మీరు గురువుల్ గారుణ్యచిత్తుల్ మహా
బంధుల్ మాన్యులు మాకుఁ బెద్దలు మముం బాటించి యీ బాలకున్
గ్రంథంబుల్ చదివించి నీతికుశలుం గాఁ జేసి రక్షింపరే!

వారును దనుజరాజు కుమారునిం గొనిపోయి యతనికి సమవయస్కులగు సహశ్రోతల నసురకుమారులం గొందఱ గూర్చి......... పఠింపించిరి పాఠయోగ్యములు, పెక్కులు శాస్త్రము లాకుమారుడాలించి పఠించెనన్నియు ఆలింపని వైష్ణవ శక్తిపూర్ణుడై.

ఏ పగిది వారు చెప్పిన, నా పగిదిం జదువుఁగాని యట్టిట్లని యా
క్షేపించఁడు తానన్నియు, రూపించిన మిథ్యలని నిరూఢమనీషన్.

అట్లు కొన్నిదినములు గడిచినవి గురువులు ఏమి చెప్పినారు? కొడుకు ఏమి చదివినాడో తెలుసుకొన దలచినాడు హిరణ్యకశిపుడు.

మోదముతోడ దైత్యకుల ముఖ్యుఁడు రమ్మని చీరఁబంచె ప్ర
హ్లాద కుమారకున్ భవ మహార్ణవతారకుఁ గామరోష లో
భాది విరోధివర్గ పరిహారకుఁ గేశవచింతనా మృతా
స్వాద కఠోరకున్ గలుషజాల మహోగ్రవనీ కుఠారకున్.

ఇట్లు చారులచేత నాహూయమానుండై ప్రహ్లాదుండు సనుదెంచిన వాత్సల్య సంపూర్ణుండైన తండ్రి వత్స రమ్మని చేరఁజీరి కొడుకును తొడపై గూర్చుండఁ బెట్టుకొని

అనుదిన సంతోషణములు, జనితశ్రమ తాప దుఃఖ సంశోషణముల్
తనయుల సంభాషణములు, జనకులకుం గర్ణయుగళ సద్భూషణముల్

అని మఱియు పుత్రా! నీకెయ్యది భద్రంబై యున్నది చెప్పుమనిన తండ్రికి ప్రియనందనుండిట్లనియె :—

ఎల్ల శరీరధారులకు నిల్లను చీఁకటి నూతిలోపలం
ద్రెళ్ళక వీరు, నేమను మతిభ్రమణంబున గ్రుస్సులై వ్రిప
త్తిల్లక సర్వమున్నతని దివ్యకళామయమంచు విష్ణునం
దుల్లము చేర్చి తారడవినుండుట మేలు నిశాచరాగ్రణీ!

అని కుమారకుండాడిన ప్రతిపక్షానురూపంబులయిన సల్లాపంబులు విని దానవేం ద్రుండు నగుచు నిట్లనియె :—

ఎట్టాడిన నట్టాడుదు, రిట్టిట్టని పలుక నెఱుగరితరుల శిశువుల్
దట్టించి యొజ్జ్వరేనియు, పట్టించిరో బాలకునకు బరపక్షంబుల్.

అని నాకు చోద్యముగా ఉన్నది నాయనా! ఈ బుద్ధి నీకు తోచినదా? పరులు దుర్నీతులు చదివించినారా? భార్గవులు ఏకాంతమున పల్కినారా? మన దాన వులకు అపరాధము చేసినవాడు విష్ణువు. అతనిన్ వర్ణింప నీకేటికిన్, సురలను దోలుటను గురించి పలుకుము. సురాధిపతులను సుక్కించుటను గురించి పలు కుము. సిద్ధులను వేధించుటను గురించి మాట్లాడుము. ముని ప్రవరుల బాధించు టను గురించి మాట్లాడుము. యక్ష, కిన్నర, గంధర్వ, నాగపతుల నాశ మొం దించుటను గురించి మాట్లాడుము. హరియంచు గిరియంచు నేల చెడ్డమోహాం ధుండవై పుత్రకా!

అనిన దండ్రి మాటలకు పురోహితు నిరీక్షించి ప్రహ్లాదుండిట్లనియె :—

ఎవ్వని మాయచే స్వపరభేదమును బుద్ధిమోహమును కలుగునో అట్టి పరమేశ్వరు నకు నమస్కారము. భగవదనుగ్రహము కలిగిన స్వపరభేదము నశించును. అవివే కులుకొందరు ఆ పరమాత్ముని సహితము ఆత్మపరభేదమున చూతురు వేదవిదు లైన బ్రహ్మాదులే ఆ విషయమున తడబడుచున్నారు. సాధారణుల విషయము వివరింప పనిలేదు, అన్యులకు దర్శనము సాధ్యమా?

ఇనుమయస్కాంత సన్నిధినెట్లు భ్రాంత మగు హృషీకేశు సన్నిధి నా విధమున
గరగుచున్నది దైవయోగమునజేసి, బ్రాహ్మణోత్తమ చిత్తంబు భ్రాంతమగుచు.
మందార మకరంద మాధుర్యమునదేలు, మధుపంబు వోవునే మదనములకు
నిర్మల మందాకినీ వీచికల దూగు, రాయంచ చనునే తరంగిణులకు
లలిత రసాలపల్లవ ఖాదియై చొక్కు, కోయిల చేరునే కుటజములకు
పూర్ణేందు చంద్రికా స్ఫురిత చకోరక మరుగునే సాంద్రనీహారములకు

అంబుజోదర దివ్యపాదారవింద చింతనామృత పాన విశేషమత్త
చిత్తమేరీతి నితరంబు జేరనేర్చు వినుతగుణశీల మాటలు వేయునేల?

అనినవిని రోషించి రాజసేవకుండయిన పురోహితుండు ప్రహ్లాదుంజూచి తిరస్క రించి ఇట్లనియె :—

"అయిదు సంవత్సరముల వాడవు. బాలుడవు. ప్రేలెదవు. తర్కవాక్యములు మాట్లాడుచున్నావు. మేము నీకు శాస్త్రములు బోధించినాము. వాటి అర్థము ఇంచుకైనను చెప్పవు. రాజుముందు మా తలలు వంచునట్లు చేసినావు. శత్రువును భూషించుచున్నావు. వంశమును దూషించుచున్నావు.

దానవరాజునకు వీడు పుత్రుడుకాడు శత్రుడు. దానవవనమున ముళ్ళమొక్కవలె పుట్టినాడు. రాక్షసకులమునకు శత్రువువారి. అట్టివానిని పొగడుచున్నాడు. కాబట్టి

ఈ పాపని చదివించెద, నీ పాదములాన యింక నిపుణత తోడన్
గోపింతుము దండింతుము కోపింపకు మయ్య! దనుజకుంజర సింహా!

అని మరియు నారాచపాపనికి వివిధోపాయంబులం పురోహితుండు వెరవు చూపుచు రాజసన్నిధిం బాసి తోడుకొని పోయి యేకాంతంబున బెదరింపుల ప్రహ్లాదునకు త్రివర్గవిద్య నేర్పుచుండిరి. దండనీతిలో ప్రహ్లాదుడు సామ, దాన, భేద దండములను తెలుసుకున్నాడని గురువులు గ్రహించినారు. బహుమానము పొందవలెనను ఆశతో ప్రహ్లాదుని తల్లివద్దకు తీసుకొనివెళ్ళినారు. తల్లి ప్రహ్లాదుని చూచినది. ఆనందించినది. పుత్రునకు స్నానము చేయించినది. అలంకరించినది. భోజనము పెట్టినది. పురోహితులు ప్రహ్లాదుని చూచి బతిమాలినారు :—

త్రిప్పకుమన్న మామతము దీర్ఘములైన త్రివర్గపాఠముల్
దప్పకుమన్న! నేడు మన దైత్యవరేణ్యుని మ్రోల నేమమున్
చెప్పిన రీతిగాని మరి చెప్పకుమన్న! విరోధినీతులన్
విప్పకుమన్న! దుష్టమగు విష్ణుచరిత్ర కథార్థ జాలముల్.

అని బుజ్జగించి దానవేంద్రుని సన్నిధికిం దోడితెచ్చిన.

అడుగడుగునకు మాధవాను చింతనసుధా మాధుర్యమున మేను మరచువాని
సంభోగ గర్వాదులభ్యసింపగలేని హరిభక్తిపుంభావమైన వాని
మాతృగర్భము సొచ్చిమన్నది మొదలుగా చిత్తమచ్యుతుమీద జేర్చువాని
సంకించి తనలోన సకల ప్రపంచంబు శ్రీవిష్ణుమయమని చెలగువాని

వినయకారుణ్య బుద్ధి వివేక లక్షణాది గుణముల కాటపట్టయినవాని
శిష్యు బుధలోక సంభావ్యశీలి గురుడు, ముందరికి ద్రోచి తండ్రికి
మ్రొక్కుమనుచు

"నీ కుమారుని శిక్షించినాము. అతడు అన్యవిషయములు మానినాడు. నీతిపారగుడు అయినాడు. ఇక నీవే పరీక్షించుకొనుము" అనినారు గురువులు.

ప్రహ్లాదుడు తండ్రికి పాదాభివందనము చేసినాడు. హిరణ్యకశిపుడు ప్రహ్లాదుని కౌగలించుకున్నాడు. దీవించినాడు. ఎత్తి తొడపై కూర్చుండ బెట్టుకున్నాడు. శిరము మూర్కొన్నాడు. అన్నాడు :—

"నాయనా! ప్రహ్లాదా! ఇంత కాలము గురువుల యొద్ద విద్య నేర్చినావు. నీవు నేర్చినదేమి? నీకు వచ్చినదేమి? నచ్చినదేమి? మేలైనది ఒకటి వినిపింపుము" అనిన దండ్రికి ప్రహ్లాదుండిట్లనియె :—

చదివించిరి నను గురువులు, చదివితి ధర్మార్థముఖ్య శాస్త్రంబులు నే
జదివినవి గలవు పెక్కులు, చదువులలో మర్మమెల్ల జదివితి దండ్రీ!

కమలాక్షు నర్చించు కరములు కరములు
శ్రీనాథు వర్ణించు జిహ్వ జిహ్వ
సురరక్షకుని జూచు చూడ్కులు చూడ్కులు
శేషశాయికి మ్రొక్కు శిరము శిరము
విష్ణు నాకర్ణించు వీనులు వీనులు
మధువైరి దవిలిన మనము మనము
భగవంతు వలగొను పదములు పదములు
పురుషోత్తమునిమీది బుద్ధి బుద్ధి
దేవదేవుని జింతించు దినము దినము
చక్రహస్తుని బ్రకటించు చదువు చదువు
కుంభినీధవు జెప్పెడి గురుడు గురుడు
తండ్రి! హరిజేరు మనియెడి తండ్రి తండ్రి.

కంజాక్షునకు గాని కాయంబు కాయమే
పవన కుంభిత చర్మ భస్త్రిగాక
వైకుంఠు బొగడని వక్త్రంబు వక్త్రమే
ఢమఢమ ధ్వనితోడి ఢక్కగాక
హరిపూజనములేని హస్తంబు హస్తమే
తరుశాఖ నిర్మిత దర్విగాక
కమలేశు జూడని కన్నులు కన్నులే
తను కుడ్యజాల రంధ్రములు గాక
చక్రి చింతలేని జన్మంబు జన్మమే
తరళ సలిల బుద్బుదంబు గాక

విష్ణుభక్తిలేని విబుధుండు విబుధుడే
పాదయుగముతోడి పశువుగాక.

సంసార జీమూత సంఘంబు విచ్చునే
        చక్రిదాస్య ప్రభంజనములేక
తాపత్రయాభీల దావాగ్నులారునే
        విష్ణుసేవామృత వృష్టిలేక
సర్వంకషాఘౌఘ జలరాసులింకునే
        హరి మనీషా బడబాగ్నిలేక
ఘనవిపద్గాఢాంధకారంబులడగునే
        పద్మాక్షు నతిరవి ప్రభలులేక

నిరుపమాపునరావృత్తి నిష్కళంక
ముక్తినిధిగానవచ్చునే ముఖ్యమైన
శార్ఙ్గకోదండ చింతనాంజనములేక
తామరస గర్భునకునైన దానవేంద్ర!

అని యివ్విధంబున వెరపు మరపు నెరుంగక యులుకుసెడి పలికెడి కొడుకు నుడువులు చెవులకు ములుకులక్రియ నొరసిన పెదవులదరం గదురుచు నదరిపడి గురుసుతుంగనుంగొని విమత కథనంబులు గరపినాడవని దానవేంద్రుండిట్లనియె:-

"దుర్మతీ! నీవు నన్ను అనాదరము చేసినావు. శత్రుపక్షము చేరినావు. నాకు కీడుచేయగోరినావు. ఈ పసిబాలుని చెరచినావు. వీనికి ఇట్టివిద్యలునేర్పినావు. సాధువేషమున దురాత్ములుందురు. నీవు అట్టివాడవే పురోహితుని రూపమున ఉన్నావు. కాని మాకు శత్రుడవు. మిత్రులకు ద్రోహము తలపెట్టరాదు. అట్టి వారికి బ్రహ్మహత్యవంటి పాపములు కలుగును. పాపములు పండినపుడు వారికి కుష్ఠువంటిరోగములు వచ్చును.

మహారాజుమాటవిన్నారు గురుపుత్రులు. అదిరిపడినారు. వడకిపోయినారు. నోట మాటరాలేదు. పెదవులు అదిరినవి. మాట తడబడినది. వారు సవినయముగా విన్నవించుకున్నారు.

నీకుమారుడు నీకు చెప్పినది మేము బోధించినదికాదు. అతనికి ఇతరులు ఎవరును బోధించలేదు. అది అతనికి సహజముగా అబ్బినది. కోపము మానుము. మాపై

తప్పుపెట్టకుము. మేము నీకు మిత్రులము. పాత్రులము. గురుపుత్రులము. నీ కొడుకును అట్లేల చదివింతుము ? నీకు మేము శత్రువులమా ? నమ్ముము మహారాజా ! మావలన దోషములేదు.

హిరణ్యకశిపుడు గురుపుత్రుల మాటలు విన్నాడు. కొంత శాంతించినాడు. గురువుల యెడ కోపము మానినాడు. కొడుకును చూచినాడు. అడిగినాడు :—

"ఓరీ డింభకా ! దురాత్మా ! దుర్బుద్ధీ ! ఈ దుర్బుద్ధి నీకు ఎట్లు కలిగినది ? గురువులు చెప్పినారా ? చెప్పలేదా ? చెప్పకున్న నీకీ దుర్బుద్ధి ఎట్లు కలిగినది ? ఎవరు నేర్పినారు ? చెప్పుము"

అనిన తండ్రికి ప్రహ్లాదుండిట్లనియె :—

"లోకమున జనులు తిన్నదానినే తినుచున్నారు. వినినదానినే వినుచున్నారు. చేసినపనినే తిరిగి చేయుచున్నారు. అనుభవించిన వానినే మరల మరల అనుభవించుచున్నారు. వారికి ఇంద్రియములు తెలియును. ఇంద్రియ సుఖములు తెలియును. మరేమియు తెలియదు. ఇదొక అంధకార బంధురము. చీకటిగొయ్యి. ఇందులో ఉన్నవానికి హరివ్రతబోధములు నచ్చునా ? ఒకరు చెప్పిన వచ్చునా ? ఆరవికి యోగిన నేర్చునా ?

గుడ్డివాడు గుడ్డివానికి ఏమియు చూపలేడు. కర్మబంధముల కొట్టుమిట్టాడువాడు కర్మబంధునకేమియు తెలియపరచలేడు. గుడ్డివానిని గుడ్డివాడు పట్టుకున్న ఇద్దరును గోతిలోపడుదురు. అజ్ఞానిని అజ్ఞాని పట్టుకున్న సంసార కూపమున మ్రగ్గుదురు.

సకలశాస్త్రముల సారమిది. జ్ఞానమున హరిభక్తి కలుగును. భక్తివలన ఎరుగుదు దిమ్మును. సంసార అంధకారము దూరము అగును. ముక్తి కలుగును. అన్య మార్గములేదు ఇదొక్కటే మార్గము"

తన కొడుకు మాటలు విన్నాడు దైత్యరాజు. అగ్గికక్కినాడు. కొడుకును తన తొడమీదినుంచి పడద్రోసినాడు. క్రోధమున కళ్లు జ్యోతులయినవి. గర్జించినాడు. సేవకులను పిలిచినాడు. అన్నాడు :-

వీని పినతండ్రిని వధించినాడు హరి - దుర్మార్గుడు. ఆ దురాత్ముని భజించు చున్నాడు వీడు - నా కొడుకు కాడు - హరికి బంటు. వీడు పితృద్రోహి. అయి దేండ్లవాడు. పసివాడు. నేను తండ్రిని. నాచేతము సహించదు. నిందించు

చున్నాడు. హరిని కీర్తించుచున్నాడు. మానమనిన మానడు. పుత్రుని రూపమున ఉన్న జాడ్యము వీడు. వీనిని వధించి రండు దనుజుల్ మీమీ పటుత్వంబులన్.

అంగవ్రాతములో చికిత్సకుడు దుష్టాంగంబు ఖండించి శే
షాంగశ్రేణికి రక్షసేయుక్రియ నీయజ్ఞుం గులద్రోహి దు
ష్షంగుం గేశవ పక్షపాతి నధముం జంపించి వీరవ్రతో
త్తుంగఖ్యాతి జరించెదన్ గులము నిర్దోషంబు గావించెదన్.

హంతవ్యుడు రక్షింపను, మంతవ్యుడు గాడు యముని మందిరమునకున్
గంతవ్యుడు వధమునకుప, రంతవ్యుండనక చంపిరండీ వడుచుల్.

దానవులు క్రూరచిత్తులు. ప్రభువు ఆజ్ఞ అయినది. శూలములు, ఖడ్గములు అందు కున్నారు. ప్రహ్లాదునిమీద పడినారు, బాలుడని కరుణించలేదు. రాచబిడ్డడని గమనించలేదు. సాధువని, లోకమాన్యుడని కనికరించలేదు. క్రూరచిత్తు లయినారు. ప్రహ్లాదుని పొడిచినారు. శరీరమంతటను పొడిచినారు. కొట్టినారు. అరచినారు. బొబ్బలు పెట్టినారు. ఇంత చేస్తున్నను తండ్రివద్దనలేదు. వారించ లేదు. చూచుచు కూర్చున్నాడు.

ఎందరో రక్కసులు పొడిచినారు. బాలుని దేహము ఇసుమంతయు నొచ్చలేదు. కందలేదు. రక్తము కారలేదు. ఉబ్బలేదు. ఎముకలు బెణకలేదు. దృష్టివైభవము నష్టముకాలేదు. వదనకాంతి వసివాడలేదు. శ్రమకలుగలేదు. దీనత్వమురాలేదు.

తనను రాక్షసులు పొడుచుచున్నారు. అప్పుడు ప్రహ్లాదుడు హరిని ప్రార్థించు చున్నాడు. ఓ జగదీశ! ఓ ఆపన్న శరణ్య! ఓ నిఖిలపావన! ఓ పన్నగశాయి! యంచు నుతించు గాని బాగన్నుల నీరుదేడు భయకంపసమేతుడుకాడు.

ప్రహ్లాదుడు లేవడు. పారిపోడు చేతులు అడ్డముపెట్టడు. ఘోరకృత్యమని తిట్టడు తండ్రిని, మిత్రులని పిలువడు. తల్లులు ఉండే అంతఃపురములోనికి ఉరకడు వారిని పిలవడు.

మనసునకు అందనివాడు హరి. మాటకు అందనివాడు హరి. సర్వశక్తులకు ఆధా భూతుడు హరి. అట్టి శ్రీహరిని ధ్యానించుచుకూర్చున్నాడు ప్రహ్లాదుడు. శాంతముగా కూర్చున్నాడు. స్థిరముగా కూర్చున్నాడు. నిశ్చలముగా కూర్చున్నాడు అదృష్టహీనుని ప్రయత్నములన్నియు విఫలము అగును. అట్లే రక్కసుల పోట్లు ప్రహ్లాదుని యెడ వ్యర్థములయినవి.

హిరణ్యకశిపుడు ఆలోచించినాడు.

ఏమిది విచిత్రముగా ఉన్నది. నిశాచరులు బాలుని శూలముతో గుచ్చినారు. అయినను చ్రుక్కడు. నిగ్రహముగా ఉన్నాడు. నేలపైపడడు. పారడు. చావడు. నేను తండ్రిని. నావద్దకురాడు. చక్రధరు పక్షము మానితినని చెప్పడు. కాళ్ళ, వేళ్ళపడి బ్రతిమిలాడడు.

అట్లనుకున్నాడు. కసిపెంచుకున్నాడు. ప్రహ్లాదుని అంతమొందించుటకు అనేక యత్నములు చేసినాడు. ఏనుగుల యూథమును తెప్పించినాడు. వానితో బాలుని త్రొక్కించినాడు. ఒకసారి బుసకొట్టుపాములను తెప్పించినాడు. వాటితో కరిపించినాడు. ఒకసారి భయంకరమైన అగ్గిమంటలు పెట్టించినాడు. వాటిలో పడవేయించినాడు. ఒకసారి సంద్రమున ద్రోయించినాడు. విషము పెట్టించినాడు. కొండచెరియలనుంచి పడద్రోయించినాడు. కాళ్ళుచేతులు కట్టివేయించినాడు. అన్నము, నీళ్లు లేకుండ బాధపెట్టినాడు. అభిచారహోమము చేయించినాడు. ఎండలో నిలువబెట్టినాడు. వానలో నిలువబెట్టినాడు. మంచున నిలువబెట్టినాడు. పెనుగాలిలో త్రోసినాడు. పాతిపెట్టించినాడు. అయినను బాలుడు నిశ్చలముగా ఉన్నాడు.

హిరణ్యకశిపునకు విచారము పట్టుకున్నది. ప్రహ్లాదుని చంపుమార్గము కనిపించలేదు. ఉగ్రుడు అయినాడు. పళ్లుపటపటకొరికినాడు. బాలునకు ఎవరి సాయమును లేదు. సంజీవనివంటి మందులేవియు ఎరుగడు. చిత్రముగా ఉన్నది. నాఅంతటి వానిముందు జంకడు. వీనివద్ద ఏదో అపారశక్తి ఉన్నట్లున్నది. వీనికి చావులేదా? మృత్యుంజయుడా! నేను పెట్టిన బాధలన్నీ మనసులో పెట్టుకుంటాడు? దేనికీ భయపడడు. నేనే భయపడుచున్నాను. నాచేత వీడు చావడా! వీడిచేత నేను చావనుకదా?

చావను ఆలోచన రాక్షసరాజును కుంగదీసినది. ముఖము వివర్ణమయినది. గుండె దడదడలాడినది. ఆలోచనలు తెగుటలేదు. సతమతమయినాడు.

చండామార్కులు రాజు విచారమును గమనించినారు. రాజును అనునయించినారు. ఇట్లన్నారు :-

"మహాప్రభూ! నీవు అపారబల సంపన్నుడవు. నీవు బొమముడివేసిన లోకములు తల్లడిల్లును. లోకపాలురు పారిపోదురు. నీబాహుబలమున ముల్లోకములను

గెలిచినావు. అట్టివానికా విచారము! విచారము వీడుము. ప్రహ్లాదుడు పసివాడు. ఇంకా పాలబుగ్గలవాడు. బాల్యచాపల్యము వీడలేదు. ఈ పసివానిని గురించి విచారమా ? మీతండ్రి శుక్రాచార్యుడు వచ్చును. అంతవరకు ఓపిక పట్టుము.

వక్రించిన బుద్ధి వయసువల్లను మంచి సాధనమువలనను చక్కబడును.

విచారింపకుము. బాలుడు చిన్నవాడు. క్రమముగా బాగుపడును. విష్ణుద్వేషి కాగలడు"

గురువుల మాట విన్నాడు హిరణ్యకశిపుడు. మనసుకుదుటపడినది, బాలులకు తగిన ఉపదేశము ప్రహ్లాదునకు చేయవలసినదన్నాడు. ప్రహ్లాదుని గురువులతో పంపినాడు.

చండామార్కులు ప్రహ్లాదుని కొనిపోయినారు. ధర్మార్థకామములు బోధించినారు. అవి ప్రహ్లాదుని మనసునకు పట్టలేదు. అవి రాగద్వేషము రెచ్చగొట్టు చదువులు. అవి అతనికి నచ్చవు.

ఉ ప దే శ ము.

ఒకనాడు గురువులేడు. ఏదో పనిమీద వెళ్లిపోయినాడు. పిల్లలు మిగిలినారు. ప్రహ్లాదుడు మిగిలినాడు. ప్రహ్లాదుడు బాలుర ఒకచోట కూర్చినాడు. తాను మధ్యనకూర్చున్నాడు. వారికి ఉపదేశింప బూనినాడు.

"మానవజన్మ దుర్లభము. అది నీటిబుడగవంటిది. ఎప్పుడు పగిలిపోవునో తెలియదు. జీవితము అస్థిరము. అందువలన బాల్యముననే భాగవత ధర్మము అవలంబింపవలెను. సుఖదుఃఖములు, భోగములు ఎట్లు ? అని మీరు అడుగవచ్చును. అవి దేహమునకు సంబంధించినవి. పశుపక్ష్యాదులకును కలుగును. అవి అప్రయత్నముగనే లభించును. వానికొరకు జన్మ వ్యర్థము చేయనేల ? తాపత్రయమున పడిన వారికి హరిపాదములు లభింపవు. హరిపాదపద్మములను ఆశ్రయించుటలో ఆనందమున్నది. విషయసుఖములు మీసాలమీది తేనెలవంటివి. ఈ శరీరము వ్యాధిగ్రస్తము కాకమున్నే హరిపాదములను ఆశ్రయింతము.

మనిషి జీవితము నూరేండ్లు. అందు సగము నిద్రలో గడచిపోవును. బాల్యమే పదేండ్లు. కౌమార్యము పదేండ్లు. ఇరువదియేండ్లు ఇట్లుగడుచును. వార్ధక్యము చివరి ఇరువదేండ్లు. మిగిలినది అతికొద్దికాలము. అందుపైనే తీరని కోర్కెలు. మోహములు, ఆసక్తులు. కమండలమంత కాలమునకే కదలియుండని కోర్కెలు.

ఇంద్రియములు గెలువలేనివాడు సంసారమున ఆసక్తి వీడలేడు. బంధములను వీడలేడు. ధనమును ప్రాణము అనుకొనువాడు దానికి దాసుడగును. ధనాసక్తి గలవాడు ఎట్టిఘోరములనయినను చేయగలడు. ధనదాహమునకు అంతములేదు.

ప్రియురాలి సుఖమున పడినవాడు సంసారమును వీడలేడు. పిల్లల ముద్దు పలుకులకు మురియువాడు సంరసమును వీడలేడు. బంధుజనుల బంధమున పడిన వాడు సంసారమును వీడలేడు. అతనికి ఇల్లే స్వర్గము దానిని వీడలేడు.

శిశ్నోదరములు తప్ప అన్యము ఎరుగని వారుందురు. వారికి అదే బ్రహ్మానందము. వారికి తృప్తిలేదు. కర్మలుచేయుచుందురు. కర్మబంధముల చిక్కుకొనుచుందురు. వారికి పారములేదు. వైరాగ్యము అలవడదు. త్యాగము తెలియదు. ఆయువంత కుటుంబపోషణకే సరిపోవును. పరమార్థము వంటపట్టదు. తాపత్రియమున మ్రగ్గు చుందురు. అదే పరమానందమనుకుందురు.

విషయాసక్తుడు లోభియగును. లోభికి సదసద్వివేకములేదు. ధనము అతని పరమార్థము. అందుకు అతడు దొంగతనము కూడ చేయును. అది తప్పని అతడు ఎరుగును. అయినను వీడడు. అట్టివాడు పండితుడైనను పామరునికన్న హీనుడు. స్వపరభేదమువలన అజ్ఞానియగును.

స్త్రీలోలుడు, కామలంపటుడు విద్వాంసుడయ్యు జ్ఞానికాలేడు. ముక్తిపొందలేడు.

దైత్యులు విషయాసక్తులు. వీరి సాహసము వదలవలెను. భగవంతుడు సర్వభూతాత్ముడు. ముక్తసంగుడు పురుషార్థస్వరూపుడు. సర్వసిద్ధుడు. సనాతనుడు. కావున అతనిని ఆశ్రయించుడు. మునులు అతనినే ఆశ్రయింతురు. వాని ఆశ్రయమున ముక్తికలుగును. భగవద్భక్తి దుస్తరముకాదు. భగవంతుడు సర్వత్రి ఉన్నాడు. పరమాణువులో ఉన్నాడు. బ్రహ్మమున ఉన్నాడు. సమస్తప్రాణులందున్నాడు. పంచభూతములందున్నాడు. తన్మాత్రలలో ఉన్నాడు. మహదాది తత్త్వములందున్నాడు, త్రిగుణములందున్నాడు. అంతట ఉన్నాడు. అన్నింట ఉన్నాడు కాన సులభుడు.

కాబట్టి అసురభావము విడువుడు. సర్వభూతములఎడ కరుణచూపుడు. పరాత్పరుడు సంతసించును. అతడు సంతసించిన అందనిదిలేదు.

మిత్రులారా! ఇది భాగవత ధర్మము. అందరికి అందునదికాదు. భాగవతుల పాదధూళి శిరసున ధరించువారికి మాత్రమే సులభము. ఈ ధర్మమును పరవారా

యణులు నారదమహర్షికి ఉపదేశించినారు. నారదునివద్దనే ఈ ధర్మమును నేను విన్నాను"

ప్రహ్లాదుని మాటలను శ్రద్ధగా విన్నారు బాలురు. వారు ప్రహ్లాదుని ఇట్లు అడిగినారు :—

"మనము ఒకే గురువువద్ద చదువుచున్నాము. నీవు మాకన్న వయసున చిన్నవు. తల్లివద్ద పెరిగినావు. అట్లయిన నారదమునినుండి ఈధర్మమును ఎట్లునేర్చినావు ? మాకు నమ్మశక్యముగుటలేదు. నిజమేమి ? వివరింపుము"

పూ ర్వ వృ త్తాం త ము.

ప్రహ్లాదుడు పరమభాగవతుడు. తనతోటి పిల్లల ప్రశ్న విన్నాడు. పూర్వ వృత్తాంతము మదిలో తలచినాడు. ఈ విధముగా చెప్పినాడు :—

"హిరణ్యకశిపుడు నా తండ్రి. అతడు తపస్సు చేయదలచినాడు. మందరపర్వతమునకు వెళ్ళినాడు. కుక్కినపేనువలె పడిఉండిరి దేవతలు అప్పటివరకు. అప్పుడు విజృంభించినారు. 'హిరణ్యకశిపుడు లోకకంటకుడు. అతని పాపములే అతనిని తినివేసినవి' అనుకున్నారు. యుద్ధమునకు సిద్ధపడినారు. పెద్ద ఎత్తున దండయాత్ర చేసినారు. రాక్షసులు ఎదుర్కొనలేకపోయినారు. ఓడిపోయినారు. పారిపోయినారు. ప్రాణములు అరచేత పట్టుకొని ఉరికినారు. భార్యాబిడ్డలను వెంటపెట్టుకున్నారు. కాలికి బుద్ధిచెప్పినారు.

దేవతలు గెలిచినారు. వారు గర్వమున పొంగినారు. ఉప్పొంగినారు. వారికి కన్ను కనిపించలేదు. రాజభవనముల దూరినారు. కనిపించినదెల్ల కాజేసినారు, స్త్రీలను సహితము పట్టినారు. బంధించినారు. కొనిపోయినారు. ఇంద్రుడు రాజభవనమున జొరబడినాడు. మా అమ్మను పట్టినాడు. బంధించినాడు. ఆమె బెదరి పక్షివలె పడ్చినది. వణకినది. భయపడినది. ఇంద్రుడు ఆమెను ఈడ్చుకొని పోయినాడు.

ఇంద్రుడు మా తల్లిని ఈడ్చుకొని పోవుచున్నాడు. ఆ దారిన నారదుడు వచ్చుచున్నాడు. నారదుడు మా అమ్మను చూచినాడు. ఇంద్రునికి అడ్డు నిలిచినాడు. 'ఈమె నిరపరాధి. అబల. సాధ్వి. పతివ్రత. వడవడ వణకుచున్నది. ఈమెనేల పట్టినావు. ఛ తప్పు. వదలిపెట్టు' అన్నాడు.

'నారదా! పిచ్చివానివలె ఉన్నావు. విను. ఈమె గర్భవతి. హిరణ్యకశిపుని వీర్యము ధరించి ఉన్నది. ప్రసవించువరకు బందీగా ఉంతును. కొడుకు పుట్టిన వానిని సంహారింతును. అప్పుడు ఈమెను విడుతును' అన్నాడు ఇంద్రుడు.

'పిచ్చివాడా! ఇంద్రా! అసలు విషయము కనుగొనలేకున్నావు. ఈమె గర్భమున పరమ భాగవతుడు ఉన్నాడు. అతడు పుణ్యాత్ముడు. ధర్మాత్ముడు. అతనిని చంపుట నీకు సాధ్యపడదు. కాన ఈమెను విముక్తను చేయుము' అన్నాడు నారదుడు.

నారదుని మాటలు విన్నాడు ఇంద్రుడు. మా అమ్మను విడిచినాడు. మా అమ్మకు ప్రదక్షిణ పూర్వకముగా నమస్కరించినాడు. స్వర్గమునకు వెళ్ళినాడు.

నారదమహర్షి మా అమ్మను తోడ్కొని వెళ్ళినాడు. తన ఆశ్రమమున ఉంచుకున్నాడు.ఆమెను ఓదార్చినాడు. భర్తవచ్చువరకు అక్కడనే ఉండమన్నాడు. ఆమెకు అభయము ఇచ్చినాడు. మా అమ్మ భయము వీడినది. అక్కడే ఉండుటకు నిశ్చయించినది. ఉండిపోయినది. నారదమునిని సేవించసాగినది.

నారదమహర్షి కరుణా స్వభావుడు. నేను జన్మింతునని అతనికి తెలియును. అందువలన అతడు భాగవత ధర్మములను ఉపదేశించినాడు. మా అమ్మ వాటిని విన్నది. కాని కాలము గడచినది. అందువలన మరచినది. నాకు ఆ ధర్మములు మనసున నాటినవి. కాన మరవలేదు. ఇంకను జ్ఞాపకము ఉన్నవి. శ్రద్ధగా వినిన మీకును వంటపట్టును. శ్రద్ధవలన బుద్ధి నిశితమగును.

విత్తునాటిన మొలకెత్తును. మొలక చెట్టు అగును. చెట్టునకు కాయలు కాయును. కాసిన కాయలు పండును. పండిన పండ్లు రాలును. కాయును. పండును. రాలును, అట్లే కొంతకాలము జరుగును. తదుపరి నాశనము అగును. అట్లే శరీరమునకు ఆ   రములు కలవు. 1. జన్మ, 2. అస్తిత్వము, 3. అనుభూతి, 4. వృద్ధి, 5.   యము, 6. వినాశము. ఈ వికారములకు కారణము కాలము. కాలమే పరిణామములకు కారణము. ఆత్మకు వికారములు అంటవు. ఆత్మకు పన్నెండు లక్షణములు కలవు. 1. నిత్యము, 2. అవినాశ్యము, 3. శుద్ధము, 4. నిర్వికారము, 5. అద్వితీయము, 6. క్షేత్రజ్ఞము, 7. సర్వప్రకాశము, 8. స్వయం ప్రకాశము, 9. సర్వకారణము, 10. వ్యాపకము, 11.. అసంగము, 11. అవరణ రహితము.

ఆత్మ తత్త్వమునకు అహంకారము విరోధి. ఆత్మ తత్త్వమును ఎరుగవలెననిన అహంకారమును వీడవలెను. అహంకారము అజ్ఞానమునకు మూల

> కందము. బంగారము రాళ్లలోనే ఉండును. అందరు దానిని ఎరుగలేరు. విద్య తెలిసినవారు రాతినుండి బంగారము తీయుదురు. ఆత్మ దేహమందే ఇమిడి ఉన్నది. ఇది సత్యము. ఈ సత్యమును అందరు తెలియలేరు. జ్ఞానులు మాత్రము తెలిసికొందురు. తెలియపరతురు.

> పంచతత్త్వములు, మూలప్రకృతి, మహత్తత్త్వము, అహంకారమను ఎనిమిది ప్రకృతి తత్త్వములు. సత్వము, రజస్సు, తమస్సు అను మూడు ప్రకృతి గుణములు. దశేంద్రియములు, మనస్సు, పంచభూతములను పదహారు దాని వికారములు. వీటి అన్నింటిలోను ఒకే పురుషుడు సాక్షిభూతుడై ఉన్నాడు. వీటన్నింటి కలయిక శరీరమగుచున్నది.

> దేహమందలి అంతఃకరణములు ఇంద్రియములు ఆత్మకావు. ఆత్మను అన్వేషించుటకు పూనుకొనవలెను. అందుకు "న ఇతి నేతి" సిద్ధాంతమును అవలంబించవలెను. దేహమందలి ఒక్కొక్క ఇంద్రియమును గ్రహించవలెను. అందు ఆత్మలేదని గ్రహించవలెను. ఇట్లు ఆత్మను గురించి ఎరుగునంత వరకు వెతుకవలెను.

> ఆత్మ అన్నింటియందును ఉండును. అయినను అన్నింటికి వేరుగా ఉండును. మణిహారమున దారముండును. అది అన్నింట దూరి ఉండును. అయినను అగుపించదు. అట్లే ఆత్మయు. మణిహారమున దారమున్నది. అయినను మణులు వేరు. దారము వేరు. ఈ విషయమును తెలుసుకొనవలెను. పరిశుద్ధమయిన ఆత్మకలిగి సృష్టిస్థితి లయములను ఎరుంగవలెను.

బుద్ధికి మూడు వృత్తులు కలవు. ఒకటి జాగ్రత్త. రెండవది స్వప్నము. మూడవది సుషుప్తి. ఇవి కర్మభేదమువలన కలుగుచున్నవి. గాలికి వాసనలేదు. కాని అది వాసనతో కలియును. అప్పుడది వాసనగాలి అగుచున్నది. అట్లే ఆత్మకు గుణములు లేవు. కాని జాగ్రత్తాది అవస్థలవలన ఆత్మ ఆయాగుణములు కలది అగుచున్నది. కాన గుణములను అనుసరించిన కర్మబీజములను నాశనము చేయవలెను. అట్లు చేసిన బుద్ధి వృత్తుల ప్రవాహము నిలిచిపోవును. అందుకు అనేక ఉపాయములు కలవు. అన్నింట ఉత్తమోపాయము నిష్కామ భక్తి - కోరికలు ఎరుగని భక్తి.

భగవంతుని ఎడ భక్తికలుగుటకు అనేక మార్గములున్నవి. గురువునకు శుశ్రూష చేయుట, లభించినది భగవంతునకు అర్పించుట, మహాత్ముల సాహచర్యముచేయుట, భగవదారాధనము, భాగవతుల కథలు వినుట, భగవంతుని లీలలు గుణములు

కీర్తించుట, భగవానుని పాదపద్మములు ధ్యానించుట, భగవదాలయములు దర్శించుట మొదలగు వానివలన భగవద్భక్తి కలుగును.

భగవంతుడు ఎల్లప్రాణులందున్నాడు. కావున సకల ప్రాణులను పూజించుట మన విధి.

కామము, క్రోధము, మోహము, మదము, లోభము, మాత్సర్యము అనునవి అరిషడ్వర్గములు – ఆరు శత్రువులు వాటిని జయించి భగవానుని సేవించిన వారికి భగవద్భక్తి కలుగును.

దనుజారి లీలావతారంబులందలి
  శౌర్యకర్మంబులు సద్గుణములు
విని భక్తుఁడగువాడు వేడ్కతోఁ బులకించుఁ
  గన్నుల హర్షాశ్రు కణములొలుక
గద్గద స్వరముతోఁ గమలాక్ష! వైకుంఠ!
  వరద! నారాయణ! వాసుదేవ!
యనుచు నొత్తిలిపాడు, నాడు, నాక్రోశించు,
  నగుఁ జింతనముసేయు, నతియొనర్చు

మరులు కొనియుండుఁ దనలోన మాటలాడు
వేల్పుసోకిన పురుషుని వృత్తిఁ దిరుగు
బంధములుబాసి, యజ్ఞానపటలిఁ గాల్చి
విష్ణుఁ బ్రాపించుఁ దుదిభక్తి వివశుఁడగుచు.

ఈ పద్యము కులశేఖరుని 'ముకుందమాల'ను తిలకించుచున్నది. శ్లోకము పరిశీలించుడు :—

"బద్ధేనాంజలినా నతేనశిరసా గాత్రైస్సరోమోద్గమైః
కంఠేన స్వర గద్గదేన నయనేనోద్గీర్ణ బాష్పాంబునా
నిత్యం త్వచ్చరణారవింద యుగళ ధ్యానామృతాస్వాదినా
మస్మాకం సరసీరుహాక్ష! సతతం సంపద్యతాం జీవితమ్."

చేతులు జోడించవలె. తలను వంచవలె. ఒడలు పులకించవలె. స్వరము గద్గదము కావలె. ఆనంద బాష్పములు పొంగిపొరలవలె. ఓ సరసీరుహాక్షా! అట్లయి నీ చరణములు ధ్యానించవలె. అది అమృతము: దానిని ఆస్వాదించవలె. అట్లు అస్మదాదుల జీవితము సాగిపోవలె. అట్లగునట్లు అనుగ్రహింపుము.

భక్తివలననే శ్రీహరి లభించును. శ్రీహరి లభించిన సంసారబంధమునుండి విముక్తి కలుగును. అట్టి విముక్తిని నిర్వాణసుఖమందురు. శ్రీహరి సర్వసులభుడు. మీ

హృదయమునందున్నాడు. మన ఆత్మ భగవంతుడు. అతనికి స్వ, పర భేదములులేవు. అట్టి భగవానుని భజింపక సుఖ భోగములవెంట పరుగులిడుట ఎండమావుల వెంటపడుట వంటిది.

ఇహ సుఖములు గాలిమేడలు. నీటి బుడగలు. అవి అశాశ్వతములు. యజ్ఞము, యాగము వీటివలన స్వర్గసుఖములు లభించును. అవియు శాశ్వతములుకావు. "క్షీణే పుణ్యే మర్త్యలోకం విశంతి." పుణ్యము క్షీణించగా తిరిగి ఈ లోకమునకే వచ్చును. శాశ్వతం అయినది పరబ్రహ్మ మాత్రమే. కాబట్టి పరబ్రహ్మను ఏకాగ్రచిత్తమున భజించవలెను.

తనను పండితుడు అనుకొనువాడు మూర్ఖుడు. అతడు కర్మములు చేయును.
వాటివలన ఫలితము దక్కదు. విపరీత ఫలితములుకూడ కలుగును.

కర్మకు రెండు లక్ష్యములు. ఒకటి దుఃఖమును తొలగించుకొనుట. రెండు సుఖములు పొందుట. కాని ఈ లక్ష్యములు సిద్ధించవు. కర్మవలన మరింత దుఃఖము కలుగుచున్నది. సుఖములు కోరునది దేనికొరకు? శరీరముకొరకు. ఈ శరీరమే తనదికాదు. ఇక సుఖము లెక్కడ? ఈ శరీరము ఉండునది కాదు. నక్కలు కుక్కలు తినును. ఈ వేళ దేహము ఉండవచ్చును. రేపే నశించవచ్చును. అట్లయిన భార్యా పుత్రులు, ధనధాన్యములు, వస్తువాహనములు, భృత్యులు పరివారములు తనవారలు ఎట్లగుదురు? శరీరము పోయినపుడు ఇవేవియు వెంటరావు. ఇవి పురుషార్థములవలె కనిపించును. అదొక భ్రమ. నిజమునకు అవి అనర్థములు. ఆత్మ ఒక్కడే అనంతమైనది. అవ్యయమైనది. ఆనందదాయకమైనది.

శరీరమునే ఆత్మగా భావించువాడు. దానితో అనేక కర్మలు చేయించును. కర్మల వలన తిరిగి దేహము కలుగును. దానితో మరల కర్మలు చేయించును. ఇదొక విషవలయము. 'పునరపి మరణం, పునరపి జననం.' వీనివలన ఫలితమేమి? ఇది కేవలము అవివేకము. కాబట్టి కోరికలను వర్జించవలెను. శ్రీహరిని సేవించవలెను. అతడు ఆత్మ స్వరూపుడు ధర్మార్థకామములు అతనినే ఆశ్రయించి ఉన్నవి. శ్రీహరి సర్వప్రాణులకు ప్రభువు. సర్వజీవులకు ప్రియతముడు. పంచభూతములతో అతడే శరీరమును నిర్మించును. ఆ శరీరమున అతడే ఉండును. అతడే ప్రాణము అనిపించుకొనును.

దానవ, దైత్య, భుజంగము, మానవ, గంధర్వ, సుర సమాజము లోల
క్ష్మీనాథు చరణ కమల ధ్యానంబున నెవ్వడైన ధన్యతనొందున్.

చిక్కఁడు వ్రతముల గ్రతువుల జిక్కఁడు దానముల శౌచ శీలతపములం
జిక్కఁడు యుక్తిని భక్తిని జిక్కినక్రియ నచ్యుతుండు సిద్ధముసుండీ.

సర్వప్రాణులను సమానముగా భావించవలెను. ప్రాణులందు హెచ్చుతగ్గులు లేవు. భగవంతుడు సర్వశక్తిమంతుడు. సర్వవ్యాపకుడు. అతనిని ఎవరైనను పొందవచ్చును. దేవతలు, దైత్యులు, యక్షులు, గంధర్వులు, కిన్నరులు, మనుష్యులు, నాగులు ఎవరైనను భగవంతుని పాదపద్మములు సేవించిన శుభములు కలుగును. భగవంతుని ప్రసన్నుని చేయుటకు బ్రాహ్మణుడు కానక్కరలేదు. దేవతలు, ఋషులు కానవసరములేదు. దానములు, యజ్ఞములు, వ్రతములు, శౌచములు చేయపనిలేదు. కాని కోరికలను విడువవలెను. భక్తిని అవలంబించవలెను భగవంతుడు ప్రసన్నుడగును. శ్రీహరి మీద భక్తి నిలుపుడు.

భక్తి ప్రభావమున దైత్యులు, యక్షులు, రాక్షసులు, స్త్రీలు, పిల్లలు, శూద్రులు, గొల్లలు, పక్షులు, పశువులు, పాపులు సహితము భగవంతుని పొందుదురు. శ్రీహరి భక్తి తప్ప ప్రపంచమున సార్థకమైనది మరొకటిలేదు. భక్తి వల్లనే గోవిందుడు సర్వత్ర దర్శనమిచ్చును.

గురువులు దమకును లోఁబడు, తెరువులు సెప్పెదరు విష్ణుదివ్యపదవికిం
దెరువులు సెప్పరు చీకటి, దెరువుల వెట్టంగనేల బాలకులారా!

తెంకెల్లి పుస్తకంబులు,- నిండాచార్యులకు మరల నేకతమునకున్
గొందు విశేషము సెప్పెద, లోఁగొల్లనివారు కర్మపుంజముపాలై.
ఆడుదము మనము హరిరతి, పాడుదమే ప్రొద్దు విష్ణుభద్రయశంబుల్
వీడుదము దనుజసంగతి, గూడుదము ముకుంద భక్తకోటిన్ సూటిన్

విత్తము సంసృతి పటలము, వ్రత్తము కామాది వైరివర్గంబుల నే
దిత్తము చిత్తము హరికిని జొత్తము నిర్వాణపదము శుభమగు మనకున్.

అని యిట్లు ప్రహ్లాదుండు రహస్యంబున నయ్యావేళల రాక్షస కుమారులకు నపవర్గమార్గం బెఱింగించిన, వారును గురు శిక్షితంబులయిన చదువులు చాలించి నారాయణ భక్తి చిత్తంబులం గీలించి యుండుటం జూచి, వారల యేకాంత భావంబు తెలిసి, వెరచి, వచ్చి, శుక్రనందనుండు శక్రవైరి కిట్లనియె:—

"నీ కొడుకు కుట్ర చేయుచున్నాడు. రాక్షస బాలులను ఒక్కచో చేర్చుచున్నాడు. నేను చెప్పు చదువులెల్లయు కల్లలని బోధించుచున్నాడు. ఆక్షేపించు

చున్నాడు. బాలురకు. తన స్నేహితులకు మోక్షమార్గము ఉపదేశించుచున్నాడు. మన జాతికి మోసము తలపెట్టినాడు. పిల్లలను చెడగొట్టినాడు. విష్ణు కథలు మాకేల చెప్పవు. అని ఎదురు తిరుగుచున్నారు. నేను చెప్పు చదువులు చదువుట మానినారు. నీపుత్రుడు హరి కథలు విడువడు. నేనుచెప్పిన చదువులు చదువడు. దుడుకువాడైనాడు. దుందుడుకు వాడైనాడు. మహారాజా! అతనిని చదివించుట మాకు దుర్లభమైనది.

చొక్కపు రక్కసి కులమున, వెక్కురు జన్మించినాడు విష్ణునియందున్
నిక్కపు మక్కువ విడువం డెక్కడి సుతుగంటి రాక్షసేశ్వర వెట్టిన్.

నరసింహావతారము.

రాక్షసరాజు చండామార్కుల మాటలు విన్నాడు. కొడుకు విరోధి అయినా దని యెరింగినాడు. ఆ మాటలు అతని చెవులకు కత్తిపోట్లు అయినవి. బుస్సు మన్నాడు. తోక తొక్కిన పామువలె లేచినాడు. గాలికి చెలరేగిన దవానలము వలె మండినాడు. దెబ్బతిన్న ఏనుగువలె ఘీంకరించినాడు. అతనిలో కోపము మండినది. వడలు వణకినది. పెదవి కదలినది. భ్రుకుటి ముడివడినది. కనులు ఎర్రవారినవి. అగ్గి పిడుగులయినవి. అతనిలో సహనము చచ్చినది. కొడుకును చంప నిశ్చయించినాడు. కొడుకును రప్పించినాడు. ఉరుములు ఉరిమినాడు. పిడుగులు కురిసినాడు. గర్జించినాడు.

మానున్ శాంతగుణప్రధాను నతి సంశుద్ధాంచితజ్ఞాను న
జ్ఞానారణ్య కృశాను నంజలిపుటీ సంభ్రాజమానున్ సదా
శ్రీనారాయణ పాదపద్మయుగళీ చింతామృత స్వాదనా
ధీనున్ ధిక్కరణంబు సేసి పలికెన్ దేవాహితుండుగ్రతన్.

"దుష్టుడా! నా ఆజ్ఞననుసరించి మాత్రమే ఆకసమున సూర్యుడు వెలుగుచున్నాడు. అంతకు మించి వెలుగుటకు అతనికి వెరపు. అన్నికాలములందు వాయువు అనుకూలుడై వీచుచున్నాడు. అట్లు వీచకున్న అతనికి వెరపు. నా ప్రతాపాగ్నికి వెరచి అగ్నిదేవుడు మందమందముగా మండుచున్నాడు. యముడు సహితము నా మాటకు వెరచుచున్నాడు. చంపమన్నవారినే చంపుచున్నాడు. నా ముందు ఇంద్రుడు తలఎత్తడు. వానికి భయము. యక్షులు, గంధర్వులు, కిన్నరులు, నాగులు, విద్యాధరులు నన్నుచూచి వడకుదురు. మరి నీకెవరు దిక్కు? ఎందుకిట్లు ఎగురుచున్నావు?

లోకపాలురున్నారు చూచినావా? వారు ప్రజ్ఞావంతులు. నాకు అనుకూలురు కారు. అయినను నేనన్న వణకుదురు. నాకు ఎదురు చెప్పలేరు. చేయలేరు. నేను కన్నెర్ర చేసిన ముల్లోకములు గడగడలాడును.

కంఠక్షోభము గాగ నీ త్రిలి మహోగాధంబుగా డింభ! వై
కుంఠుం జెప్పెదు దుర్జయుండనుచు వైకుంఠుండు వీరవ్రతో
త్కంఠా బంధురుడేని నేమరులన్ ఖండింప దండింపగాఁ
గుంఠీభూతుడు గాక రావలదె మద్ఘోరాహవ క్షోణికిన్

నీవు గురువులు చెప్పిన దానిని కాదన్నావు. వాచాలత్వము కనబరచినావు. బాలురకు మోహాసక్తి పుట్టించినావు. విష్ణుని వర్ణించినావు. దైత్య కులాచారము నీరు చేసినావు. నీవు మూఢాత్ముడవు. కులద్రోహివి. నీచుడవు. నిన్ను చంపుదును. కులమును నిర్దోషము చేయుదును.

సకల దిక్కులను గెలిచినాను. దేవేంద్రాదులే దిక్కులేనివారైనారు. నాకు మొక్కుచున్నారు. మరినీకు దిక్కెవడు?

బలవంతుడనే జగముల, బలములతో నెనక వీరభావమున మహా
బలుల జయించితి నెవ్వని, బలమున నాడెదవు నాకు బ్రతివీరుడవై.

అనిన దండ్రికి మెల్లన వినయంబున నొడుకిట్లనియె :—

బలయుతులకు దుర్బలులకు, బలమెవ్వడు నీకు నాకు బ్రహ్మాదులకున్
బలమెవ్వడు ప్రాణులకు, బలమెవ్వండట్టి విభుడు బలము సురేంద్రా!

శ్రీహరి మహా పరాక్రమశాలి. కాల స్వరూపుడు. ఈశ్వరుడు. ప్రాణులందరకు దేహబలము, మనోబలము, ఇంద్రియబలము అతడే అనుగ్రహించుచున్నాడు. ధైర్యమునకు, శక్తికి అతడే కేంద్రము. అతడు తన శక్తితో సకలలోకములను సృష్టించినాడు. అతడే రక్షించుచున్నాడు. అతడే నశింప చేయుచున్నాడు. సత్త్వ రజస్తమోగుణములకు అతడే ప్రభువు

మీరు అసుర స్వభావులు అసుర స్వభావము విడువండి. మీకు శత్రువులు దూరాన లేరు. మీలోనే ఉన్నారు. మీ మనసే మీకు శత్రువు. శత్రు మిత్రుల పక్షపాతము మానండి అందరిని సమముగా భావించండి. సమదర్శనులు కండి. మనసును నిర్మలము చేసుకొనండి. సర్వప్రాణులను సమముగా చూడటయే విష్ణువును ఆరాధించుట.

లోకములన్నియున్ గడియలోన జయించినవాఁడ వింద్రియా
నీక ము చిత్తమున్ గెలువనేరవు నిన్ను నిబద్ధుఁ జేయు నీ
భీకర శత్రులార్వుర బ్రభిన్నుల జేసిన బ్రాణికోటిలో
నీకు విరోధి లేడొకడు నేర్పున జూడుము దానవేశ్వరా!

కర్మబంధముల నిర్మూలింపుము, సమబుద్ధివి కమ్ము. సంసారమును విడువుము. హరిని మనమున ధ్యానింపుము.

అనిన పరమభాగవత శేఖరునకు దోషాచర శేఖరుండిట్లనియె :—

"ఓరీ! దుర్మతీ! నీవు నాకు పాఠములు నేర్పుదువా? గుడ్డువచ్చి పిల్లను వెక్కిరించినట్లున్నది. చంపిన తప్పేదవని తెగబడినావు. వెధవ మాటలు వినిపించినావు. చావు కోరుకున్నట్లున్నావు. చావు కోరుకున్నవాడు నీ వలెనే కారు కూతలు కూయును. నాకే ఎదురు చెప్పెదవా? నేను సర్వలోక ప్రభువును. నాకు ఎదురులేదు. నన్ను మించిన రాజు మరొకడు లేడు. ఏకీవాడు నారాయణుడనుచున్నావు? వాడు నా అన్నను చంపినాడు. వానికొరకు ముల్లోకములు గాలించినాను. ఎక్కడను దొరకలేదు. ఎక్కడ నక్కినాడు?"

ఎక్కడగలడే క్రియ నే, చక్కని వర్తింతు పెట్టికాడను వచ్చున్
ఎక్కడుతు నిన్ను విష్ణుని, వెక్కులు ప్రేలెదవు వాని భృత్యుని వగిదిన్

ప్రహ్లాదుడు తండ్రి మాటలు విన్నాడు. అతనికి శంక ఉదయించలేదు. హర్ష పులకాంకుర సంకలిత విగ్రహుండైనాడు. ఆగ్రహము పొందలేదు. హృదయమున హరిని తలంచినాడు. నమస్కరించినాడు. బాలునివలె నాట్యమాడినాడు. ఇట్లన్నాడు :—

కలడంభోధి గలండుగాలి గలడాకాశంబునం గుంభినిన్
గలడగ్నిన్ దిశలం బగళ్ల నిశలన్ ఖద్యోత చంద్రాత్మలన్
గలడోంకారమునం ద్రిమూర్తుల ద్రిలింగ వ్యక్తులందంతటన్
గలడీశుండు గలండు తండ్రి! వెదకంగా నేల యీ యాయెడన్.
ఇందుగలడందులేడని, సందేహము వలదు చక్రి సర్వోపగతుం
డెందెందు వెదకి చూచిన, నందందే గలడు దానవాగ్రణి! వింటే.

హరి సర్వత్ర ఉన్నాడన్నాడు ప్రహ్లాదుడు. ఎక్కడలేడని నిర్ణయించినాడు హిరణ్య కశిపుడు. [illegible]

నరసింహాకృతినుండె నచ్యుతుడు నానాజంగమ స్థావరో
త్కర గర్భంబుల నన్నిదేశముల నుద్దండప్రభావంబునన్

అయ్యవసరంబున నద్దానవేంద్రుండు :—

డింభక! సర్వస్థలముల, నంభోరుహనేత్రుకుండునంచు మిగుల సం
రంభంబున బలికెదవీ స్తంభంబున జూపగలవె చక్రిన్ గ్రక్కన్?

స్తంభమున హరిని జూపవలె అట్లు కాకున్న నీ తల వేయివక్కలు చేతును. చూతును ఆ హరి ఏవడో?-ఎట్లువచ్చునో? నిన్నెట్లు రక్షించునో?

అందుకు ప్రహ్లాదుడు ఇట్లు ప్రత్యుత్తరమిచ్చెను :—

"అంభోజాసనుడాది నాగ తృణపర్యంతంబు విశ్వాత్ముడై
సంభావంబున నుండు ప్రోడ విపుల స్తంభంబులోనుండడే
స్తంభాంతర్గతుడయ్యు నుండుటకు సందేహమున్ లేదు ని
ర్దంభత్వంబున నేడు గానబడు ప్రత్యక్షస్వరూపంబునన్"

అది విన్నాడు హిరణ్యకశిపుడు. కాళ్ళతో నేలను తన్నినాడు. దిగ్గనిలేచినాడు. గద్దెదిగినాడు. కత్తి పట్టినాడు. ఉరికినాడు. ప్రహ్లాదుని ధిక్కరించినాడు. కత్తి ఝళిపించినాడు.

"ఓరె డింభకా! నీవు మూఢచిత్తుడవు. విష్ణువు విశ్వాత్మకుడనుచున్నావు. ఉన్నాడురా ఈ స్తంభమున హరి-గిరి" అనుచు మహోద్రేకమై

దను జేంద్రుండట చేత వ్రేసెను మహోదగ్రప్రభాశుంభమున్
అనదృగ్భీషణ దంభమున్ హరిజనుస్సంరంభమున్ స్తంభమున్.

హిరణ్యకశిపుడు పిడికిట స్తంభమును గుద్దినాడు. ఫెళఫెళమని ధ్వని వచ్చినది. భయంకరమైన ధ్వని పుట్టినది. ప్రళయము వచ్చినట్లయినది. భూమి బద్దలయినట్లయినది. ఆకాశము ఊడిపడినట్లు విరిగిపడినట్లయినది. సూర్యుడు కూలినట్లయినది. నక్షత్రములు రాలి పడినట్లయినది. కొండలు బద్దలయినట్లయినది. సముద్రములన్నియు పొంగిపొరలి నట్లయినది. ఆ ధ్వనికి లోకపాలురు గడగడలాడినారు ప్రళయము వచ్చినదనుకున్నారు.

హిరణ్యకశిపుడు స్తంభమును గుద్దినాడు. ప్రహ్లాదుని మీదకు ఉరకబోయినాడు. దైత్యుల గుండెలు బద్దలగు ధ్వని విన్నాడు. ముల్లోకములను గెలిచినవాడు,

ఇంద్రాది దేవతలను గడగడలాడించినవాడు వణ వణ వణకినాడు. విత్తరపోయినాడు. నలువైపుల కలయ చూచినాడు. కనులు మిరుమిట్లు కొలుపు తేజస్సు! క్షణము అతనికేమియును గాన్పించలేదు. ఇంతలో స్తంభమున విచిత్ర రూపము కానవచ్చినది.

కత్తిపట్టుకొని బొమ్మవలె నిలుచుండిపోయినాడు.
స్తంభమున ఆవిర్భవించినాడు నారసింహదేవుడు—ఉగ్రనారసింహమూర్తి
నరమూర్తిగాదు కేవల, హరి మూర్తియుగాదు మానవాకారము కే
సరి యాకారము నున్నది, హరి మాయారచితమగు యథార్థము జూడన్.

హరి సర్వత్ర గలడన్నాడు ప్రహ్లాదుడు. అతని మాట నిక్కము కావలె. బ్రహ్మ హిరణ్యకశిపునకు వరములిచ్చినాడు. అవి అసత్యములు కారాదు. అందువలన హరి నారసింహమూర్తియై అవతరించినాడు.

హిరణ్యకశిపుడు నరసింహస్వామిని చూచినాడు. అతడు అద్భుతముగా ఉన్నాడు. భయంకరముగా ఉన్నాడు. అతని కనులు మండుచున్న బంగారమువలె ఉన్నవి. అతడు రాక్షసరాజునే చూచుచున్నాడు. స్వామి జూలు దులుపుకున్నాడు. అతని కోరలు వాడిగా ఉన్నవి. దారుణముగా ఉన్నవి. అతని నాలుక మండుతున్న శలాకవలె ఉన్నది. ముడివడిన కనుబొమలు యమపాశమువలె ఉన్నవి. చెవులు ఎక్కుపెట్టిన బాణములవలె ఉన్నవి. ముకుపుటములు అదరుచున్నవి. నోరు గుహవలె ఉన్నది. చీలిక దవడలు దారుణముగా ఉన్నవి. అతని శరీరము ఆకాశమును అంటుచున్నది. మెడలావుగా ఉన్నది. కుదించి ఉన్నది. ఉదరము విశాలముగా ఉన్నది. నడుము సన్నగా ఉన్నది. రోమములు చంద్ర కిరణములవలె మెరయుచున్నవి. హస్తములందు శంఖ చక్రాది ఆయుధములున్నవి. గోళ్ళు దారుణముగా ఉన్నవి. అవే చాలు. ఆయన ఆయుధములవలె ఉన్నవి.

ఆ దివ్యమూర్తిని చూచినారు రాక్షసులు వారి గుండెలు అవిసినవి. కకావికలైనారు. కాలికి బుద్ధి చెప్పినారు. పడుచు లేచుచు పారిపోయినారు.

మత్తంబడిన చిత్తంబున గదయెత్తుకొని తత్తరంబున నార్చుచు నకుంఠిత కంఠీరవంబు డగ్గరు గంధ సింధురంబు చందంబున నక్తంచర కుంజరుండు నరసింహదేవున కెదురు నడచి తదీయ దివ్యతేజోజాల సన్నికర్షంబునం జేసి దవానలంబు డగ్గరిన ఖద్యోతంబునుంబోలె నిర్గత ప్రభుండయి యుండె నప్పుడు.

ప్రకటంబై ప్రళయావసానమున మున్ బ్రహ్మాండ భాండావళిన్
ఘటమైయున్న తమిస్రమున్ జగము నుత్పాదించుచో ద్రావి సా
త్త్విక తేజోనిధియైన విష్ణువెడ నుద్దీపించునే నష్టమై
వికలంబై చెడుగాక తామసుల ప్రావీణ్యంబు రాజోత్తమా !

హిరణ్యకశిపుడు ముందునకు ఉరికినాడు. గదయెత్తినాడు. నరసింహమూర్తిని కొట్టినాడు. స్వామి హిరణ్యకశిపుని పట్టినాడు. గరుడుడు పామును పట్టినట్లు పట్టినాడు. గదా సహితముగా రాక్షసుని పట్టినాడు. హిరణ్యకశిపుడు గింజుకున్నాడు. విలవిలలాడినాడు. వదిలించుకొనుటకు ఊగసాగినాడు. నరసింహుడు నళ్ళు వదిలినాడు. చెర్లాటలాడ దలచినాడు. అప్పుడు తప్పించుకొన్నాడు హిరణ్యకశిపుడు. గరుడుని గోళ్ళపట్టునుండి జారినపామువలె జారినాడు. అతని శరీరము నలిగిపోయినది: గోళ్ళు గీసుకుపోయినవి. రక్తసిక్తమైనది.

ఆకసమున దేవతలున్నారు. అంతయు చూచుచున్నారు. హిరణ్యకశిపుడు తప్పించుకొనుట చూచినారు. వారిముఖములు వెలవెల పోయినవి. హిరణ్యకశిపుడు తమ నుండి స్వర్గము గుంజుకున్నాడు. వాడు గెలిచిన తమ ఇక్కట్లు కుక్కలకైనను ఉండవని భయపడినారు.

తాను తనబలంతో వదిలించుకున్నాను అనుకున్నాడు హిరణ్యకశిపుడు. గర్వించినాడు. తనబలమును తలచుకున్నాడు. కత్తీ, డాలు పట్టుకున్నాడు. ఎగిరినాడు. నరసింహమూర్తిమీద దూకినాడు. డేగవలె కత్తి త్రిప్ప నారంభించినాడు.

స్వామి అదిచూచినాడు. గర్జించినాడు. పిడుగులు రాలినవి. ఆకాశము విరిగిపడినట్లయినది. స్వామి తేజస్సు కార్చిచ్చువలె భగ్గుమన్నది. హిరణ్యకశిపుని కనులు చీకట్లు కమ్మినవి. కళ్ళు మూసుకున్నాడు. అతనికి ఏమియు కనిపించలేదు, గోచరించలేదు.

పిడుగుపాటునకు రాలిపోవనంతటి బలశాలి హిరణ్యకశిపుడు. అంతవానిని పట్టినాడు నరసింహమూర్తి. స్వామిచేత చిక్కినాడు కశిపుడు. కోడిపిల్లవలె గిలగిల తన్నుకున్నాడు. విలవిలలాడినాడు. గెంతుటకు యత్నించినాడు. కాని చిక్కినాడు. కదల లేకపోయినాడు.

గరుడుడు పామును పట్టి చీల్చినట్లు చీల్చినాడు స్వామి హిరణ్యకశిపుని. స్వామి కశిపుని తొడలమీద వేసుకున్నాడు. గోళ్ళతో చీల్చసాగినాడు కఠోరదేహము,

సచలోత్సాహున్, మహోబాహు, నింద్రహితారాంతకభీకరున్ ఘనకరున్ దైత్యాన్వయ శ్రీకరున్.

గుండెచీల్చును. ధరాతలమున రక్తము వర్షించును. కర్కశమైన నరములను తెంచును. అతనిమాంసమును ముక్కలు ముక్కలుగా చేయును. దుష్టాసురుస వ్రచ్చి దర్పించుం ప్రేవులు కంఠమాలికలు గల్పించున్ నఖోద్భాసియై.

వక్షః కవాటంబు వ్రక్కలు సేయుచో
ఘన కుఠారంబుల కరణినొప్పు
గంభీర హృదయ పంకజము భేదించుచో
గుద్దాలముల భంగి గొమరు మిగులు
ధమనీ వితానంబు దగిలి ఖండించుచో
బటుల విత్రంబుల పగిది మెఱయు
జఠర విశాలాంత్ర జాలంబు త్రెంచుచో
గ్రకచ సంఘంబుల గరిమ లావు

నంకగతుడైన దైత్యుని నాగ్రహమున
శస్త్రచయముల నొంపక సంహరించి
యమరు నరసింహు నఖరంబు లతివిచిత్ర
సమర ముఖరంబులై యుండె జనవరేణ్య!

స్ఫురిత విబుధజన ముఖములు పరివిదళిత దనుజ నివహ పతి తను ముఖముల్
గురు రుచి జిత శిఖిశిఖములు, నరహరి కర నఖములమరు నతజనసుఖముల్

ఇట్లు కేవల పురుష రూపంబును మృగ రూపంబునుంగాని నరసింహ రూపంబున, రేయునుం బవలునుంగాని సంధ్యా సమయంబున, నంతరంగంబును బహిరంగంబునుగాని సభాద్వారంబున. గగనంబును భూమియునుంగాని యూరు మధ్యంబున, ప్రాణ సహితంబులును ప్రాణ రహితంబులునుం గాని నఖంబులం త్రైలోక్య జనహృదయ భల్లుండయిన దైత్యమల్లుని వధించినాడు నారసింహుడు.

అట్లు హిరణ్యకశిపుని చీల్చి దుర్నిరీక్ష్యమానుడైనాడు నారసింహస్వామి. రాక్షసుని రక్తము చింది స్వామి జూలు ఎఱ్ఱనైనది. పనుగును చంపి ప్రేవులు మెడలో వేసుకున్న సింహమువలె కనిపించినాడు ప్రభువు.

తన పుత్రుని వధించినాడని స్వామిపై రాక్షసులు దండెత్తి వచ్చినారు - వేల కొలది. వారినందరిని తన భుజములతోడను, గోళ్ళతోను చీల్చి చెండాడినాడు స్వామి.

నరసింహదేవుడు జూలు దులిపినాడు. మబ్బుల గుట్టలు పటాపంచలయినవి. స్వామి కనులనుండి తేజము వెలువడినది. అప్పుడు సూర్యచంద్రుల తేజస్సు వెల వెల పోయినది. అతడు ఉచ్ఛ్వసించినాడు. నిశ్శ్వసించినాడు. సముద్రములు అల్లకల్లోలములైనవి. అతడు సింహనాదము చేసినాడు. దిగ్గజములు గజగజలాడినవి. అతడు అడుగులు వేసినాడు. భూమి గడగడలాడినది. కొండలు అదిరిపడినవి. అతని తేజస్సున దశదిశలు మిరుమిట్లు గొలిపినవి. అతడు ఆగ్రహోదగ్రుడుగా ఉన్నాడు. అతని ఆగ్రహము తగ్గుటలేదు.

నరసింహస్వామి కదలినాడు. అడుగులు వేసినాడు, హిరణ్యకశిపుని రాజ్యసభలో నడచినాడు. హిరణ్యకశిపుని సింహాసనముమీద కూర్చున్నాడు. స్వామి ఉగ్ర రూపమున ఉన్నాడు. భయంకరముగా ఉన్నాడు. మండుచున్న అగ్నివలె ఉన్నాడు. వెలుగుచున్న సూర్యునివలె ఉన్నాడు.

అంత భయంకరమూర్తి ముందుకు వెళ్ళుటకు సేవించుటకు ఎవరికిని గుండెలు చాలలేదు.

ముల్లోకములను గడగడలాడించినాడు హిరణ్యకశిపుడు. అతడు హతుడు అయినాడు. నరసింహమూర్తి వానిని వధించినాడు. ఈ వార్త దేవతలకు తెలిసినది. వారి ఆనందమునకు అంతులేదు. నరసింహస్వామి మీద పూలవాన కురిపించినారు. స్వామిని చూచుటకు విమానములలో వచ్చినారు. వారి విమానములతో ఆకసము క్రిక్కిరిసిపోయినది. దివ్య దుందుభులు మ్రోగినవి. గంధర్వులు గానములు చేసినారు. అప్సరసలు నాట్యము చేసినారు. బ్రహ్మ, ఇంద్రుడు, శివుడు మున్నగు దేవతలు, ఋషులు, పితరులు, సిద్ధులు, విద్యాధరులు, మహానాగులు, మనువులు, ప్రజాపతులు, గంధర్వులు, చారణులు, అప్సరసలు, యక్షులు, కిన్నరులు, కింపురుషులు, బేతాళులు, సిద్ధులు, సాధ్యులు, సునందుడు, కుముదుడూ మున్నగు పార్షదులందరును స్వామిసన్నిధికి వచ్చినారు. స్వామి ఉగ్రరూపమున ఉన్నాడు. దరిచేరుటకు జంకినారు. ఎవరికిని ధైర్యము చాలలేదు. దూరమున నిలిచినారు. అంజలి ఘటించినారు స్వామిని స్తుతించినారు.

బ్రహ్మ ఇట్లు స్తుతించినాడు :—

"స్వామీ! నీకు నమస్కరించుచున్నాను. నీవు అనంతుడవు. సర్వశక్తిమంతుడవు. పరాక్రమవంతుడవు. పవిత్ర కర్ముడవు. నీవే లోకములను సృష్టించుచున్నావు. పాలించుచున్నావు. సంహరించుచున్నావు. అయినను అవేవియు నిన్నంటవు. నీవు నిర్వికారుడవు"

శివుడు ఇట్లు స్తుతించినాడు :—

"ప్రభూ! నీకు క్రోధము కలుగదు. కల్పాంతమునసే నీవు ఉగ్రుడవు అగుదువు. హిరణ్యకశిపుడు రాక్షసుడు. దుష్టుడు. సకలలోకములను బాధించినాడు. వానిని సంహరింపదలచినావు క్రోధము తెచ్చుకున్నావు. ఉగ్రుడవు అయినావు. నీ క్రోధాగ్ని దావాగ్ని వంటిది. రాక్షసుడు శలభము అయినాడు. కాలిపోయినాడు. వాని పుత్రుడు ప్రహ్లాదుడు, శాంతుడు. నిన్ను శరణువేడుచున్నాడు. నీవు భక్త వత్సలుడవు. అతడు భక్తుడు. అతనిని కరుణించుము. శాంతించుము. ఇదే నీకు మ్రొక్కుచున్నాను.

ఇంద్రుడు ఇట్లు స్తుతించినాడు :—

"దేవదేవా! మమ్ము రక్షించినావు. మరల మాకు యజ్ఞభాగము కల్పించినావు. దైత్యులు మమ్ము గడగడ లాడించినారు. మా గుండెలు దడదడలాడినవి. మాకు శాంతిని ప్రసాదించినావు. మా హృదయములు వికసింప చేసినావు. మా గుండెలందు నీవే నివసించుచున్నావు. మా స్వర్గమును మరల మాకు ప్రసాదించినావు. మేము మీ సేవకులము. నీ సేవకునకు దొరకనిది లేదు. నీ సేవ కోరువారు ముక్తిని కూడ కోరరు నీకు నమస్కరించుచున్నాను.

ఋషులు ఇట్లు స్తుతించినారు :—

"దేవా! చరాచర ప్రపంచమంతయు నీలో లీనమై ఉండెను. నీవు తపస్సు చేసినావు. తిరిగి ప్రపంచమును సృజించినావు. తపము ఆత్మ తేజోరూపము. దానిని మాకు ప్రసాదించినావు. హిరణ్యకశిపుడు తపస్సును నాశనముచేసినాడు. నీవు తపస్సును కాపాడదలచినావు. అవతరించినావు. రక్షించినావు. మేము నీకు నమస్కరించుచున్నాము.

పితరులు ఇట్లు స్తుతించినారు :—

"మహా ప్రభూ! మా సంతానము మా కొరకు పిండ ప్రదానము చేయువారు. ఈ రాక్షసుడు హిరణ్యకశిపుడు పిండములను గుంజుకొని మింగువాడు.

తీర్థములందును, పర్వములందును మాకొసగు అంజలులను కూడ మాకు దక్కనీయలేదు. నీవు మమ్ము కరుణించినావు. వానిని హతమార్చినావు. ధర్మమును రక్షించినావు. నీకు నమస్కరించుచున్నాము"

సిద్ధులు ఇట్లు స్తుతించినారు :-

"ప్రభూ! హిరణ్యకశిపుడు దుష్టుడు. యోగబలమును ఆర్జించినాడు. తపోబలమును సంపాదించినాడు. మా యోగసిద్ధులను కాజేసినాడు. నీగోళ్లవాడియైనవి. వానిని చీల్చినవి. నీ పాదపద్మములకు నమస్కరించుచున్నాము"

విద్యాధరులు ఇట్లు స్తుతించినారు :-

"దేవదేవా! హిరణ్యకశిపుడు మూర్ఖుడు. కండ కావరమున కన్ను మిన్ను కానలేడు. మా విద్యలన్నింటిని వ్యర్థముచేసినాడు. యజ్ఞపశువును వధించినట్లు వానిని యుద్ధమున వధించినావు. మావిద్యలు మాకు దక్కించినావు. అందుకు నరసింహాకారమెత్తినావు నీవు. నీకు పదేపదే నమస్కరించుచున్నాము"

నాగులు ఇట్లు స్తుతించినారు :-

"స్వామీ! హిరణ్యకశిపుడు పాపాత్ముడు. మా బలములను అన్నింటిని హరించినాడు. మా స్త్రీలను చెరపట్టినాడు. నీవు నేడు వీనిని అంతమొందించినావు. మా స్త్రీలకు ఆనందము కలిగించినావు. నీకు మా నమస్కారము"

మనువులు ఇట్లు స్తుతించినారు :-

"దేవదేవా! నీ ఆజ్ఞను తలదాల్చు మనువులము మేము. ఈ రాక్షసుడు మా మర్యాద మంట కలిపినాడు. మీ కింకరులము మేము. మమ్ము కాపాడదలచినావు. దుష్టుని సంహరించినావు. నీకు నమస్కరించుచున్నాము"

ప్రజాపతులు ఇట్లు స్తుతించినారు :-

"స్వామీ! నీవే మమ్ములను ప్రజాపతులను చేసినావు. ఈ రక్కసి మాకు అడ్డు తగిలినాడు. ప్రజాసృష్టిచేయ నీయలేదు. లోక కళ్యాణమునకుగాను అవతరించినావు. వానిని హతమార్చినావు. నీకు నమస్కారము"

గంధర్వులు స్తుతించినారు :-

"ప్రభూ! మేము నటులము. గాయకులము. నీ సేవకులము. వీడు - ఈ రాక్షసరాజు తన బలమున మమ్ములను బానిసలను చేసినాడు. ఇప్పుడు నీచేత చచ్చినాడు.

దుర్మార్గులు కలకాలము నిలువలేరు. వారిని వధింతువు నీవు. నీ పాదములకు నమస్కరించుచున్నాము"

చారణులు స్తుతించినారు :-

"విష్ణుదేవా! హిరణ్యకశిపుడు యముడు. సాధువులను ముప్పు తిప్పలు పెట్టినాడు. వాడిని హతమార్చినావు. మేము నీ పాదసేవకులము. నీకిదే నమస్కరించు చున్నాము"

యక్షులు స్తుతించినారు :-

"మహాప్రభూ ! నీవు నారాయణుడవు. పరమాత్ముడవు. మేము మంచి కర్మలు చేయువారము. నీ సేవకులందు ముఖ్యులము. ఈ రాక్షసుడు మమ్ములను తన బానిసలుగా చేసికొన్నాడు. మాతో తన పల్లకీ మోయించుకున్నాడు. నీవు వీడిని చంపినావు. నీకు నమస్కారము"

కింపురుషులు :-

"దేవదేవా ! మేము సామాన్యులము. కింపురుషులము. నీవు మహాపురుషుడవు. సాధుజన సంరక్షకుడవు. సాధువులను ధిక్కరించినాడు హిరణ్యకశిపుడు. వాడు కాపురుషుడు. వానిని చంపినావు. మాకు ఆనందము కలిగించినావు. నిన్ను నుతించుచున్నాము"

వైతాళికులు :—

"భగవంతుడా ! మేము నిన్ను కీర్తించువారము. సభలందును యాగములందును నీ నిర్మలకీర్తి గానము చేయుదుము. ఈ హిరణ్యకశిపుడు మమ్ములను నాశనము చేసినాడు. నీవు వానిని నశింపచేసినావు. నీకు వందనములు"

కిన్నరులు :—

"దేవా ! మేము కిన్నరులము. నీకు కింకరులము. ఈ రాక్షసుడు మాతో చాకిరి చేయించినాడు. నీవు మమ్ము అనుగ్రహించినావు. ఆ పాపాత్ముని అంత మొందించినావు. మాకు అభ్యుదయము కలిగించినావు. నీకు నమస్కరించు చున్నాము"

విష్ణుపార్షదులు :—

"స్వామీ ! హిరణ్యకశిపుడు మాలోటి పార్షదుడు. మునుల శాపము వలన వాడు ఇట్లయినాడు. నీవు వానిని అనుగ్రహించినావు. అందువలననే వధించినావు.

నీ నరసింహరూపము పరమాద్భుతముగా ఉన్నది. మాకు ఆనందము కలిగించు చున్నది. నీకు పదేపదే నమస్కరించుచున్నాము"

ప్రహ్లాదుని ప్రార్థన.

నరసింహమూర్తి ఉగ్రముగా ఉన్నాడు. రక్తసిక్తమోమున వెలుగుచున్నాడు. గోళ్ళనుండి రక్తము కారుచున్నది. స్వామి సింహాసనమున నున్నాడు. ఉగ్రముగా ఉజ్వలముగా ఉన్నాడు. కణకణలాడు నిప్పువలెనున్నాడు. కార్చిచ్చువలె ఉన్నాడు.

అంతమంది స్తుతించినారు. స్వామి శాంతించలేదు. సౌమ్యతనొందలేదు. క్రోధము చల్లారలేదు. క్రోధజ్వాలలు అణగలేదు. బ్రహ్మ, శివుడు, ఇంద్రుడు మున్నగు వారు ఎవరును దగ్గరికి చేరలేక పోయినారు. శాంతపరచలేక పోయినారు.

స్వామి ఉగ్రుడై ఉన్నాడు. శాంతించలేదు. బ్రహ్మాదులు ఆలోచించినారు. లక్ష్మీదేవిని రప్పించినారు. బ్రహ్మదేవుడు ఆమెతో ఇట్లన్నాడు :-

హరికిం బట్టపుదేవివి
హరిసేవా నిపుణమతివి హరిగతివి సదా
హరి రతివి నీవు చని నర
హరి రోషము డింపవమ్మ హరివరమధ్యా

అనిన నియ్యకొని మహోత్కంఠతోడ నా కలకంఠి నరకంఠీరవుని యుపకంఠంబునకుం జని.

ప్రళయార్క బింబంబు పగిది నున్నదిగాని
    నెమ్మోము పూర్ణేందు నిభముగాదు
శిఖిశిఖా సంఘంబు చెలువు చూపెడుగాని
    చూడ్కి ప్రసాద భాసురముగాదు
వీరరౌద్రాద్భుతావేశ మొప్పెడుగాని
    భూరి కృపారస స్ఫూర్తిగాదు
భయద దంష్ట్రాంకుర ప్రభలు గప్పెడుగాని
    దరహాసితాంబుజాతంబుగాదు
కఠిననఖర నృసింహ విగ్రహముగాని
కామినీ జన సులభవిగ్రహముగాదు

విన్నదియుగాదు తొల్లి నే విష్ణువలన
గన్నదియుగాదు భీషణాకారమనుచు
వలికెదనని గమకముగొను,
జలికిన గడు నలిగి విభుకు ప్రతివచనము లం
బలుకడని నిలుచు శశిముఖి,
బలువిడి హృదయమున జనవు భయమును గదురన్

నరసింహమూర్తిని చూచినది లక్ష్మి. జంకినది. దరిచేరలేకపోయినది. బ్రహ్మ ప్రహ్లాదునితో అన్నాడు :-

"ప్రహ్లాదా! నాయనా! మీతండ్రి విషయమునందే స్వామి ఉగ్రుడు అయినాడు. శాంతింపకున్నాడు. నీవే ఆ దేవదేవుని ప్రార్థించవలెను. శాంతపరుపవలెను."

ప్రహ్లాదుడు బాలుడు. బ్రహ్మదేవుని మాట విన్నాడు. అతని ఆజ్ఞ శిరసావహించినాడు. మహాభాగవత శేఖరుడు ప్రహ్లాదుడు. అంజలి ఘటించినాడు. వినయము ఉట్టిపడినది అతని మోమున. మెల్లగా అడుగులు వేసినాడు. స్వామి ముందరికి వెళ్లినాడు. సాగిలపడినాడు. మొక్కినాడు.

హరి భక్తపరాధీనుడు. ప్రహ్లాదుని చూచినాడు. పసివాడు. భక్తుడు. సాగిలినాడు. స్వామి హృదయము కరిగినది. కరుణ పొంగినది. పొరలినది. స్వామి చేతులు చాచినాడు. సాగిలపడిన ప్రహ్లాదుని లేవనెత్తినాడు. బాలుని తల నిమిరినాడు. అభయమిచ్చినాడు.

విష్ణుదేవుని హస్తము తాకినది. ప్రహ్లాదుని పాపములన్నియు పటాపంచలయినవి. పరమాత్మతత్త్వము సాక్షాత్కరించినది. భగవంతుని పాదపద్మములు హృదయమున నిలుపుకున్నాడు. అతని హృదయము పులకించినది. భక్తిపొంగులు వారినది. ఆనందబాష్పములు ప్రవహించినవి. భావసమాధిని మగ్నుడయినాడు. ఎదుట భగవానుడున్నాడు. అతడు తప్ప వేరులేదు. దర్శించినాడు సేవించినాడు. ఏకాగ్రచిత్తుడు అయినాడు. కంఠము గద్గదమైనది. ప్రహ్లాదుడు స్వామిని నుతించినాడు :—

"భగవానుడా! బ్రహ్మాదులు దేవతలు. సత్త్వప్రధానులు. పండితులు. నిన్ను ఎరిగిన వారు. వారే నిన్ను నుతించలేకపోయినారు. నేను రాక్షసుని కొడుకును. గర్వమదోద్రిక్తుడను బాలుడను. జడమతిని. నిన్ను వర్ణించు శక్తి నాకు కలదా!

తపము, వంశము, తేజము, శ్రుతము, సౌందర్యము ఉద్యోగము, నిపుణత్వము, ప్రతాపము, పౌరుషము, నిష్ఠ, బలము, ప్రజ్ఞ, జపము, యోగము నిన్ను సంతుష్టుని చేయలేవు. గజేంద్రునివలె భక్తిగా కొలుచుటవలననే నీవు సంతుష్టుడ వగుదువు. భక్తినిమించి నిన్ను నుతించు మార్గము అన్యములేదు.

బ్రాహ్మణునకు పన్నెండు గుణములు ఉండవలెను :- జ్ఞానము, సత్యము, దమము, తపము, నిర్మత్సరము, లజ్జ, తితిక్ష, అనసూయ, యజ్ఞము, దానము, ధైర్యము, శాంతి. ఇన్ని గుణములున్నను దర్పమున్నవానికంటె మనము, మాట, కర్మము, ధనము, ప్రాణము నీపాదములకు అర్పించు చండాలుడు ఉత్తముడు. హరిభక్తుడయిన చండాలుడు తన కులమును పావనముచేయును. పన్నెండు గుణములు కలిగినను గర్వముగల బ్రాహ్మణుడు తన్నుతాను పవిత్రపరచు కోలేడు. నీవు ఆత్మలాభపరుడవు. గర్వపరులు క్షుద్రులు వారి పూజలు నీకు అక్కరలేదు. నీవు దయామయుడవు. కావున భక్తుల పూజలనిన నీకు ఇష్టము.

> ఒకడు ముఖమును సింగారించుకొనును అతడు అద్దము చూచుకొనును. అప్పుడు అతని సింగారములు అద్దమునందలి ప్రతిబింబమునకు కనిపించును. అట్లే భక్తులు నిన్ను పూజింతురు. కాని అవి భక్తునికి కూడ సంక్రమించును. అట్లే నేను అయోగ్యుడను. అయినను నేను జంకుటలేదు. నీ మహిమను వర్ణించుచున్నాను. సంసార చక్రమున పడుచున్నాను నేను. నీ మహిమలు గానముచేయుదును విముక్తుడను అగుదును.

నీవు సత్వగుణాశ్రయుడవు. బ్రహ్మాదులు దేవతలు నీకు భక్తులు. నీకను సన్నల వర్తించువారు. నీవు లోకకళ్యాణకారుడవు. అందుకు అనేక అవతారములు గ్రహింతువు. నీ అవతారములు మనోహరములు. నీ లీలలు అద్భుతములు.

నీవు రాక్షసరాజును సంహరించ దలచినావు. ఉగ్రుడవు అయినావు. క్రోధము పూనినావు. దనుజరాజును హతమార్చినావు. అతడు మన్నుకరచినాడు. ఇక శాంతింపుము.

> పాముతేలుమున్నగునవి విషజంతువులు. అవి మానవులకు హానిచేయును. వానిని చంపుటవలన సాధువులకు సంతోషము కలుగును. రాక్షసరాజు విష జంతువు వంటివాడు వానిని హతమార్చినావు. సాధుజనులు సంతసించు చున్నారు. లోకములన్నియు ఆనందమున మునిగి తేలుచున్నవి. ఇక నీ క్రోధము చాలింపుము. శాంతింపుము నీ శాంతస్వరూపమును దర్శించుటకు ఎల్లరు కుతూహలపడు చున్నారు.

నరసింహదేవరా! భక్తులకు భయము కలిగినపుడు నీ ఈ నరసింహరూపము ధ్యానింతురు.

ప్రభూ! నీవదనము భయంకరముగా ఉన్నది. నీనాలుక అగ్నిజ్వాలవలె ఉన్నది. నీ కనులు సూర్యబింబములవలె ఉన్నవి. కనుబొమలు కాలసర్పముల బోలి ఉన్నవి. చెవులు చురకత్తులు. చెవులు ఈటెలు. జూలు రక్తసిక్తమై మెరయుచున్నది. మెడలో పేగుల హారములున్నవి. పగవారల గుండెలు చీల్చుటకు సిద్ధముగా ఉన్నవి గోళ్లు. ఇన్ని ఉన్నను నాకు భయము కలుగుటలేదు.

> కరుణామయా! నీ ఉగ్రరూపము చూచి నాకు భయము కలుగుటలేదు. భరింపరాని సంసార చక్రమును చూచి భయపడుచున్నాను. కర్మపాశముల కట్టబడినాను. క్రూరజంతువుల మధ్యపడినాను. నీ వెన్నడు నన్ను కరుణింతువు? నన్నెప్పుడు నీ పాదపద్మములకడకు పిలుతువు? నీ పాదపద్మములే జీవులకు ఆధారభూతములు. అవే మోక్షస్వరూపములు.

నేను అనేక జన్మములెత్తినాను. అన్నిజన్మము లందును శోకాగ్నిలో కాలినాను. నిన్ను వీడినాను. అన్యపదార్థములను ఆత్మగా భ్రమించినాను. ఇప్పుడు నిన్ను భక్తితో సేవించవలెనని ఉన్నది. నేను అజ్ఞుడను. నిన్ను సేవించు ఉపాయమైనను నాకు తెలియదు. నిన్నే ఆశ్రయించినాను. ఆ ఉపాయమును నీవే నాకు ఉపదేశింపుము. నీవు నాకు ప్రియతముడవు. నామంచి చెడ్డలు తెలిసినవాడవు. నాకే కాదు-సకల లోకములకు నీవే పరమ ఆప్తుడవు. నీవే పరమ ఆరాధ్యుడవు.

బ్రహ్మ నీ గుణగణములను కీర్తించినాడు. నేనును అట్లే నీ గుణగణముల కీర్తింతును. నీ లీలను గానము చేయుదును. పరమహంసలు హంసవలె నీ పాద పద్మములు ఆశ్రయింతురు. నేను వారి సాంగత్యము చేయుదును. గుణములను వదులు కొందును. సంసార సాగరమునుండి తరింతును. సంసార దుఃఖమునుండి బయటపడుటకు నీవు తప్ప అన్యమార్గము లేదు. ఉపాయములు చాల ఉన్నవి. అయినను అన్నియు నీ కరుణమీద, ఆధారపడి ఉన్నవి నీ అనుగ్రహము లోపించిన తలిదండ్రులు తమ సంతానమును రక్షించలేరు. మందులు ఆరోగ్యమును ప్రసాదించలేవు. నావ సముద్రమును దాటలేదు. నీవు ఉపేక్షించిన వారికి ఆత్మ శాంతిలేదు.

రక్షణలన్నియు నీ విభూతియే. అన్యముకాదు. పరిణామ స్వరూపములైన అన్ని పదార్థములందు నీవు ఉన్నావు.

పురుషుని ప్రేమేయం, కాలప్రేరణవలన గుణములందు క్షోభకలుగును. అప్పుడు మాయా మనః ప్రధానమైన లింగశరీరము సృష్టించబడును. లింగశరీరము బలవంతమైనది. కర్మమయమయినది. ఛందోమయమయినది. దానికి అనేక నామరూపములలో ఆసక్తిఉండును. మనస్సు, పదిఇంద్రియములు, అయిదు తన్మాత్రలు ఈ పదహారును సంసార చక్రమునకు రేకులు నిన్నువదలి సంసార చక్రమును నిగ్రహించగలవాడు లేడు.

పరాత్పరా! నీకు జ్ఞానశక్తిఉన్నది. దానితో బుద్ధి గుణములను జయించుచున్నావు. కార్యకారణశక్తిని వశము చేసికుంటున్నావు. ఇది అవిద్యామయం అయిన సంసార చక్రము. నీవు దయాసాగరుడవు. నన్ను తరింపచేయుము.

> లోకపాలురకు ఐశ్వర్యములున్నవి. వాటికి లోకులు ఆశపడుదురు. ఆ ఐశ్వర్యములు అశాశ్వతములు. అది నాకు తెలియును. నాతండ్రి కనుబొమలు ముడివేసినాడు. అట్టహాసము చేసినాడు. అంతే అంతటితో వారి ఐశ్వర్యములు అంతరించినవి. అంత బలవంతుడు నాతండ్రి. నీ ముందు నిలువలేక పోయినాడు. అతనిని హతమార్చినావు. నాకు ఐహికము, ఆముష్మికము, వాని కాలపరిమితి తెలియును. అందువలన నాకు బ్రహ్మలోకమువాను అక్కరలేదు. అవన్నియు కాలక్రమము అంతరించిపోవునవి. నాకు కావలసినది. నీ చరణసన్నిధి

> విషయ భోగములు వినుటకు విందుగా ఉండును. వాస్తవమునకు అవి ఎండమావుల వంటివి దేహము వ్యాధులకు పుట్ట. విషయ భోగములు అసత్యములు దేహము వ్యాధిగ్రస్తము మనిషికి ఈ విషయము తెలియును. అయినను సత్యము గ్రహించడు. అతిప్రయాసపడును. మీసాలమీది తేనెచుక్కలు నాకుటకు యత్నించును. కామాగ్ని తీర్చుకొన వలెనని యత్నించును.

తమోగుణ ప్రధానమైన అసురగుణమేడ? రజోగుణమున పుట్టిన నేనేడ? అనంతమైన నీ అనుగ్రహమేడ? బ్రహ్మకు, శివునకు సహితము దుర్లభమైనది నీ హస్తపద్మము. దానిని నాతలపై ఉంచినావు. కరుణించినావు. ధన్యుడను.

> ప్రాకృతులు చిన్న, పెద్దభేదము లెంచుదురు. నీకా భేదములేదు. నీవు సర్వ సముడవు, సర్వాత్మకుడవు. అయాచిత ప్రేమమూర్తివి. భక్తులపాలిటి కల్ప వృక్షమవు. జాతిపరమైన హెచ్చుతగ్గులు నీవు ఎరుగవు. నీకు అందరును సమానులే నీకు భక్తిమాత్రము ప్రధానము.

> సంసారము చీకటిబావి. అందు కాలము అనే సర్పము ఉండును. కాటువేయుటకు కనిపెట్టిచూచును. విషయ భోగములను ఆశించువాడు ఆ కూపమున కూలును.

నాకు ఉండిన సాంగత్యము మంచిదికాదు. నాతండ్రి రాక్షసుడు. నేనును ఆ సంసార కూపమున కూలవలసినవాడనే. కాని నారద మహర్షి కరుణించినాడు. నన్ను రక్షించినాడు. అందువలన నీ పాదపద్మముల సేవచేయగలిగినాను.

నాతండ్రి అక్రమములు చేసినాడు. అన్యాయములు చేసినాడు. దౌర్జన్యములను వడికట్టినాడు. తానే ఈశ్వరుడను అన్నాడు. మరొక ఈశ్వరుడు లేడన్నాడు. ఉన్నచో చూపమన్నాడు. రక్షించమన్నాడు. కత్తిదూసినాడు. నామీదకు ఉరికినాడు. నన్ను నరుకుదును అన్నాడు. అప్పుడు నీవు నన్ను రక్షించదలచినావు. నాకొరకు అవతరించినావు. నాతండ్రిని హరింపచేసినావు. సనకసనందనాదులు నీ భక్తులు వారిమాట నిక్కము చేయదలచినావు చేసినావు.

భగవాన్! ఈ జగత్తు నీవు. దీనికి కారణరూపుడవు నీవు. అనంతరము అవధి రూపమున నీవే ఉందువు. మధ్యన విశ్వరూపమున నీవే ఉన్నావు. నీ మాయా గుణములవలన పరిణామములు కల్పించుచున్నావు. పరిణామములవలన విశ్వమును సృష్టించుచున్నావు. రజోగుణమున సృష్టించుచున్నావు. సత్వగుణమున పాలించుచున్నావు. తమోగుణమున సంహరించుచున్నావు. నీది విశ్వరూపము. నానా రూపముల దర్శనమిత్తువు. ఈ ప్రపంచము నీనుంచి భిన్నమైనదికాదు. ఇది నీ స్వరూపమే నీవు మాత్రముకాదు. దీని ఆదియందును, అంతమందును నీవే ఉందువు. ఆత్మీయము, పరకీయము అనురెండు భావములును అసత్యములు. బీజము కారణమగుచున్నది. వృక్షము కార్యమగుచున్నది. చూచుట ఆ రెండును భిన్నముగా కనిపించుచున్నవి. కాని తత్వమున విచారించిన ఆ రెండును ఒకటే. అట్లే ఈ విశ్వము నీలో పుట్టుచున్నది. నీలో పెరుగుచున్నది. నీలో గిట్టుచున్నది. అయినను ఇది వేరుగా కనిపించుచున్నది.

ప్రళయకాలం వస్తుంది. అప్పుడు ఈ సకల చరాచరసృష్టిని నీలోన ఉంచుకుంటావు. క్రియాశూన్యుడవు అవుతావు. ప్రళయ సముద్రమున శయనింతువు. యోగ నిద్రలో మునిగిపోదువు. స్వప్రకాశమున నిద్రను జయింతువు. జాగ్రదవస్థ, స్వప్నావస్థ, సుషుప్తి అవస్థలను అతీతుడవు అయి నాలుగవపదమగు బ్రహ్మపదమును అవలంబింతువు.

కాలము నీవు. కాలశక్తి నీవు. దానితో ప్రకృతి గుణములను పురికొల్పుదువు. ఈ బ్రహ్మాండమంతయు మొదట నీలోనే ఉండెను. అపుడు నీవు ప్రళయ సముద్రమున ఉన్నావు. శేషశాయివయి ఉన్నావు. యోగనిద్రలో ఉన్నావు.

యోగసమాధినుండి నీవు కనులు తెరచినావు. నీ నాభినుండి ఒక కమలము ఉద్భవించినది. అది విశాలమయినది. బ్రహ్మాండ పద్మము. అందునుంచి బ్రహ్మావతరించినాడు. అప్పుడు అతనికి ఏమియు కనిపించలేదు. పద్మము మాత్రము కనిపించినది. బ్రహ్మ వెర్రివాడయినాడు. అతని నిజస్వరూపము నీవు. అది గ్రహించలేక పోయినాడు బ్రహ్మ. తానువేరు అనుకున్నాడు. నీవు వేరు అనుకున్నాడు. పిచ్చివాడు నీళ్లలో మునిగినాడు. కాని ఏమీ కనిపించలేదు.

> మొక్కటు గింజ కనిపించదు,

బ్రహ్మ ఆశ్చర్యపోయినాడు. అతనికి ఏమియు తోచలేదు. మరల పద్మము మీదికి వచ్చినాడు. దిగులుపడి కూర్చున్నాడు. తపము ప్రారంభించినాడు. ఎంతో కాలము తీవ్రమైన తపస్సుచేసినాడు. అప్పుడు అతని హృదయము పరిశుద్ధము అయినది.

> భూమియందలి గంధ తన్మాత్రవలె తన శరీరమున ఉన్న నీ సూక్ష్మశరీరమును
> దర్శించ గలిగినాడు.

అప్పుడతనికి నీ విశ్వరూపము కనిపించినది. దానికి వేల ముఖములుకలవు. వేల శిరములు ఉన్నవి. వేల పాదములు ఉన్నవి. వేల హస్తములున్నవి. వేల కనులున్నవి. వేల నాసికలు ఉన్నవి. వేల ఆభరణము లున్నవి. వేల ఆయుధము లున్నవి. పదునాలుగు లోకములు నీ అవయవములవలె ఉన్నవి. అది లీలామయమైన నీస్థూలస్వరూపము. దానిని చూచినాడు బ్రహ్మ ఎంతో ఆనందించినాడు. తరించినాననుకున్నాడు.

మధుకైటభులు రాక్షసులు. వారిద్దరు రజో, తమోగుణరూపులు. వారు వేదములను అపహరించినారు. అప్పుడు నీవు హయగ్రీవావతారమెత్తినావు. వారిని సంహరించినావు. సత్వగుణ సంపన్నములు వేదములు. వానిని ఉద్ధరించినావు. బ్రహ్మకు ఇచ్చినావు. నీది సత్వగుణము. దానినే మహాత్ములు వర్ణింతురు. పూజింతురు. సేవింతురు. నీవు అనేక అవతారములను ఎత్తినావు. మనుషులు, పశువులు, పక్షులు, ఋషులు, దేవతలు, జలచరములు మున్నగు అన్నిప్రాణులందు అవతరించినావు. లోకమునగల ద్రోహులను కూల్చుటకు ప్రతియుగమున నవతరించినావు. ధర్మమును రక్షించినావు. దుష్టులను శిక్షించినావు.

> కామహార్దాది సంకలితమై చిత్తంబు
> త్వదీయ చింతన పదవి సొరదు

మధురాది రసముల మరగి చొక్కుచు జిహ్వ
 నీవర్ణనమునకు నిగుడనీదు
సుందరీ ముఖముల జూడగోరెడు చూడ్కి
 భావకాకృతులపై దగులువడదు
వివిధ దుర్భాషలు వినగోరు వీనులు
 వినవు యుష్మత్కథా విరచనములు.
ఘ్రాణమురవడి దిరుగు దుర్గంధములకు
దనివి గొలువదు వైష్ణవ ధర్మములకు
వదిగియుండవు కర్మేంద్రియములు పురుషు
గలచు సవతులు గృహమేధి గలచునట్లు

ఇట్లు కర్మబంధములతో కట్టువడినాను. సంసారమను వైతరణియందు మునుగుచున్నాను. తేలుచున్నాను. పుట్టుట చచ్చుట మరల పుట్టుట మరల చచ్చుట ఇట్లున్నది నాస్థితి. ఈ కర్మానుభవమున విసిగిపోయినాను. స్వ, పరభేదము కలిగింది. ఒకనితో స్నేహము చేసిన మరొకనిపై వైరము పూనవలసి వచ్చుచున్నది. ఇది జీవుని దురవస్థ. దీనిని చూడుము. కరుణించుము.

భవవైతరణికి ఆవల ఉందువు నీవు. ఈ ప్రాణికోటిని కూడ ఆ తీరమునకు చేర్చుము. సర్వలోకములను నీవే సృష్టించుచున్నావు. పాలించుచున్నావు. సంహరించుచున్నావు. నీకు ఈ ప్రాణులను భవసాగరము దాటించుట ఏమంతపని?

> మహాత్ములు అజ్ఞులను, అజ్ఞానులను, మూఢమతులను అనుగ్రహింతురు. వీరు ప్రియభక్తులైనారు. నీ సేవచేయుదురు. నీవువారిని అనుగ్రహింతువు. కాని దీనులున్నారు. మూఢమతులున్నారు. అజ్ఞులున్నారు. అజ్ఞానులున్నారు. ప్రభూ! వారిని అనుగ్రహించు.

మహాత్మా! భవవైతరణి దుస్తరమైనది. అయినను నేను దానికి భయపడను. నీ కీర్తన మహిమాన్వితమైనది. నీ కీర్తనామృతమున నామనసు మగ్నముచేసితిని. కాని మూఢులున్నారు. వారికి ఇంద్రియాభిలాషమెండు. వారు సంసారచక్రమునబడి నీనామకీర్తనముచేయరు. అట్టిమూఢులను గురించి నాబాధ.

> మునులున్నారు. విముక్తికోరుచుందురు. అడవులకు పోదురు. మౌనమూనుకొందురు. తపము చేయుదురు. ఇతరులను గురించి ఆలోచించరు. కాని నేను అట్లుకాదు. దీనులను వదలి నావిముక్తికోరుకొనను. నీవు దీన బాంధవుడవు. దీనులకు నీవే దిక్కు-రక్ష. దీనులను కాపాడు ప్రభూ!

మనసపుట్టినచోట సోకిన హాయిగా ఉండును. అది రాజ్యాలికము. ఆ తరువాత మందిపుట్టును. స్త్రీ సంభోగము సరిగా అట్టిదే. మొదట సుఖమును ఇచ్చుట. అటువెనుక అనర్థహేతువగును అవివేకులు అది గ్రహించరు. దుఃఖములను అనుభవింతురు, విషయ వాసనలను వీడరు. ధీరులు అట్లుకాదు. కామమును అణచుకొందురు. పంజాతిక్ లొంగరు.

మౌనము, బ్రహ్మచర్యము, శాస్త్రశ్రవణము, తపము, అధ్యయనము, స్వధర్మాచరణము, శాస్త్రవ్యాఖ్యానము, నిర్జనవాసము, జపము, సమాధి అను ఈ పది ముఖ్యమగు మోక్షసాధనలు.

కాని ఇంద్రియములు అదుపులో లేనివారికి ఇవి కేవలం బ్రతుకు తెరవులు. దాంభికులు వీనితో లోకమును వంచింతురు. అయినను వారు దుఃఖమునే అనుభవింతురు.

బీజము కారణము. అంకురము కార్యము. కార్యకారణములు రెండును నీ రూపములని వేదములు నిరూపించినవి. వాస్తవమున నీవు ప్రకృతి రహితుడవు. కాని కార్యకారణములు విడిచిన నిన్ను తెలుసుకొను దారి కానము.

కర్రతో కర్రమరాచిన అగ్నిపుట్టును. అట్లే యోగులు కార్యకారణములతో నిన్ను కనుగొందురు. తత్త్వమున కార్యకారణములు రెండును నీవే.

వాయువు, అగ్ని, భూమి, ఆకాశము, జలము, పంచతన్మాత్రలు, ప్రాణము, ఇంద్రియములు, మనస్సు, చిత్తము అహంకారము, విశ్వము, సగుణము, నిర్గుణము అన్నియు నీవే. మనోవాక్కుల నిరూపించదగిన దంతయు నీవే.

ఆద్యంతములు కలని సత్త్వ, రజ, స్తమోగుణములు. అట్టిగుణములు, మహత్తత్త్వము, అహంకారము, మనస్సు ఇంద్రియములు, దేవతలు, నరులు ఎవ్వరును నీ రూపమును ఎరుగలేరు. వీని అన్నింటికిని మూలము నీవు అది తెలుసుకొన్న వారు మునులు. వారు అధ్యయనాదులు మానివేయుదురు. వాగ్వ్యాపారము వీడుదురు. సమాధిస్థితులై యోగమున నిన్ను ఉపాసింతురు.

నీ గృహాంగణ భూమి నిటలంబు మోవంగ
మోదించి నిత్యంబు మ్రొక్కలేని
నీ మంగళ స్తవ నికరవర్గంబులు
పలుమారు నాలుక బలుకలేని

నీ యధీనములుగా నిఖిల కృత్యంబులు
ప్రియభావమున సమర్పించలేని
నీ పదాంబుజముల నిర్మల హృదయుడై
చింతించి మ్రొక్కంగ జిక్కలేని

నిన్ను దెవులార భజియించి నీకు సేవ
చేయ రాలేని బ్రాహ్మణుండు పెంపగలడె
యోగియైన దపోవ్రత యోగియైన
వేదియైన మహాతత్త్వ వేదియైన

కావున భవదీయ దాస్యయోగంబు గృపసేయుమని ప్రణతుండైన ప్రహ్లాదుని వర్ణనంబులకు మెచ్చి నిర్గుణుండైన హరి తోషంబు పొంది ఇట్లనియె :-

సంతోషించితి నీ చరిత్రములకున్ సద్భద్రశీలాగ్రణీ నీ
యంతర్వాంఛిత లాభమెల్లఁ గరుణా యత్తుండనై యిచ్చెదన్
జింతం బొందకు భక్తకాముడగ నే సిద్ధుండ దుర్లోక్యుడన్
జంతుశ్రేణికి నన్నుఁజూచిన పునర్జన్మంబులే దర్భకా!

సకల భావములను సాధులు విజ్ఞాను
లఖిల భద్రదాయకుడనైన నన్ను
గోర్కు లిమ్మటంచు గోరుదు రిచ్చెద
గోరుమెద్దియైనఁ గుర్రా! నీవు.

ప్రహ్లాదుడు భక్తుడు. భగవంతుడు అడుగగనే అతడు లోభమునకు లొంగలేదు. వరములు కోరుట భక్తియోగమునకు విరుద్ధము. అది అతడెరుగును. చిరునవ్వు నవ్వినాడు. విన్నవించినాడు :-

పరాత్పరా! కోరికలు అరులు. అతిశయంకరములు. అంధకారకూపములు. అవి అనిన నాకు భయము. అందువలననే నీ శరణు జొచ్చినాను.

* భక్తులను పరీక్షించదలతువు నీవు. వరముల ఆసలు చూపెట్టుదువు. హృదయ గ్రంథులను మరింత బిగింపను నీవరములు. సంసార చక్రమున పడద్రోయుటా.

నన్ను పరీక్షించుటకే వరములు ఇత్తునను చున్నావు. అవ్యక్త కారణము కనిపించదు

నీవు పరమేశ్వరుడవు. నిన్ను ఐహిక వాంఛలు కోరుదునా? నిన్ను స్మరించి సంతోషపరచి వరములడుగుట వ్యాపారము. సేవకుడు అర్థమును కోరి ఖాళాసి

సేవించును. రాజులు సేవకులసేవలు పొందుదురు. వారికి అర్థములు ఇత్తురు. నాకు అట్టికోరికలులేవు. నీవు భక్తచింతామణివి. వరమిత్తునన్నావు. వర్దనేల ? అడిగెదను. ఇమ్ము. నామనసున ఎట్టికోరికలు మొలకెత్తరాదు. ఇది నేనడుగు వరము. కోరికలు చెడ్డవి. అవి అన్నింటిని నాశముచేయును. కోరికలు తలెత్తిన ఇంద్రియములు, మనము, ప్రాణము, దేహము, ధర్మము, ధైర్యము, బుద్ధి, లజ్జ, సిరి, తేజస్సు స్మృతి, సత్యము అన్నియు లోపించును - నశించును.

> హృదయము క్షేత్రము. కోరికలు కలుపుమొక్కలు. కలుపుమొక్కలు తొలగింపవలెను. అప్పుడు నీ స్వరూపము సత్యమువలె సాక్షాత్కరించును.

భగవాన్ ! పరమ పురుషా ! పరాత్పరా ! మహాత్మా ! పరమేశ్వరా ! నీకు నమస్కరించుచున్నాను. ప్రణమిల్లుచున్నాను.

ఆ శీ స్సు లు.

ప్రహ్లాదుని ప్రార్థనలు విన్నాడు నరసింహమూర్తి సంతసించినాడు. ఇట్లన్నాడు. ప్రహ్లాదా ! నీవు జ్ఞానివి. భక్తుడవు. నీవంటివారు ఇహపరములందలి ఏ పదార్థమును ఆశించరు. అయినను నేను అనుగ్రహించుచున్నాను. నన్ను సంతోషపరచు. ఒక మన్వంతరమువరకు దైత్యరాజ్యమును, పాలింపుము. సకల భోగములు అనుభవింపుము. నాగాథలు వినుము. సకలభూతములను సమముగా చూడుము. నేను సకల ప్రాణులందు వసింతును. నాభక్తులు శాంతిమంతులు. సదాచారులు. సమదర్శనులు. సాధువులు. వారున్నచోట నేనుందును. నా శక్తి వలన కోరికలు చంపుకున్నవారు ఏ ప్రాణిని బాధించరు.

నీవు ఉత్తమ భక్తుడవు. నిన్ను అనుసరించి నన్ను ఆరాధించువారు నాకు నిజమైన భక్తులు అగుదురు. నాశరీరము తాకినాడు. నీతండ్రి పవిత్రుడు అయినాడు. అతనికొరకు నీవు ఏమియు చేయవలసినపనిలేదు. నీవు అతనికి పుత్రుడవు. చేయవలసిన విధులున్నవి. కావున నీతండ్రికి శ్రాద్ధకర్మములు నిర్వర్తింపుము. అతడు ఉత్తమగతులు పొందును.

వత్సా ! నీతండ్రి సింహాసనమును అలంకరించుము. రాజ్యమును పాలింపుము. నన్నే ఆశ్రయింపుము. నాసేవలందే కాలము గడుపుము. నాయందే హృదయము లగ్నముచేయుము. సమస్త కర్మలు నాకే సమర్పింపుము.

మఱియు నీవట కాలవేగంబునం గళేబరంబు విడిచి, త్రైలోక్య విరాజమానంబును దివిజరాజ శేగీయమానంబును, బరిపూరిత దశదిశంబునైన యశంబుతోడ ముక్తబంధుడవై దగ్గఱియెదవు వినుము :—

నరుడు ప్రియముతోడ నా యవతారంబు, నీయుదారగీత నికరములను
మానసించెనేని మఱి సంభవింపడు, కర్మబంధ చయము గడచిపోవు.

అని యిట్లు నరసింహదేవుండానతిచ్చిన హిరణ్యకశిపునకుం బ్రహ్లాదుండు పరలోక క్రియలు చేసి భూసురోత్తములచేత నభిషిక్తుండయ్యె నయ్యెడం బ్రసాద సంపూర్ణముఖుండయిన శ్రీనృసింహదేవునిం జూచి దేవతా ప్రముఖ సహితుండైన బ్రహ్మదేవుండిట్లనియె :—

"దేవదేవా! అఖిల దేవేశా! భూతభావకా! హిరణ్యకశిపుడు నానుండి వరము పొందినాడు. ప్రపంచమందలి ఏ ప్రాణిచేతను వానికి చావు కలుగకుండునట్లు వరమిచ్చినాను. వాడు పాపాత్ముడు. ఉన్మత్తుడయినాడు. సకల ధర్మములను చెరచినాడు. సాధువులను బాధల పాలు చేసినాడు. నీవు సర్వశక్తిమంతుడవు. నీ చేత అతడు నిహతుడయినాడు. సర్వలోకములకు శుభము కలుగ చేసినావు. ప్రహ్లాదుడు వాని పుత్రుడు అయినను భక్తుడు. శాంతుడు. అతనిని మృత్యుముఖము నుండి కాపాడినావు ప్రహ్లాదుడు నీ శరణు జొచ్చినాడు. నీవు అతనికి మహోపకారము చేసినావు. నీ మహిమలు అద్భుతములు. నాకంతయు అద్భుతముగా ఉన్నది. వింతగా ఉన్నది. విచిత్రముగా ఉన్నది.

పరమ! గృపచేసితివి మేలు వారిజాక్ష!
నీ నృసింహావతారంబు నిష్ఠతోడఁ
దగిలి చింతించువారలు దండధరుని
బాధనొందరు మృత్యువు బారిఁ బడరు.

అనిన నరసింహదేవుం డిట్లనియె :—

ఆ. మన్నించి దేవశత్రుల, కెన్నడు నిటువంటి వరములీకుము పాపో
త్పన్నులకు వరములిచ్చుట, పన్నగముల కమృతమిడుట పంకజగర్భా!

అని యిట్లానతిచ్చి బ్రహ్మాదిదేవతా సమూహంబుచే బూజితుండైన శ్రీనృసింహదేవుండు తిరోహితుండయ్యె.

ప్రహ్లాదుడు బ్రహ్మను పూజించినాడు. శివుని పూజించినాడు. దేవతలను పూజించినాడు. అందరకు పాదాభివందనము చేసినాడు, సమస్త దానవులకు, దైత్య

అసుర ప్రభువుగా ప్రహ్లాదుని ప్రతిష్ఠించినాడు బ్రహ్మదేవుడు. అందుకు శుక్రా భాగ్యశు మున్నగు మునులు సంతసించినారు. దేవతలు ప్రహ్లాదుని ప్రశంసించినారు. ఆశీర్వదించినారు. ప్రహ్లాదుని సత్కారములు అందుకున్నారు. తమ తమ లోకములకు వెళ్ళిపోయినారు.

నారదుడు ఇట్లు చెప్పినాడు :—

హిరణ్యాక్ష హిరణ్యకశిపులు దితిగర్భమున జన్మించినారు. వారు జయవిజయులు. శాపవశమున అట్లు జన్మించినారు. భగవంతునితో విరోధము కొనుక్కున్నారు. అదృష్టవంతులు. అతనిచేతనే మరణించినారు. వా రై శ్రీహరి అవతారములు ఎత్తినాడు. ఆ జయవిజయులే తరువాత రావణ కుంభకర్ణులై పుట్టినారు. వారి కొరకు శ్రీరామచంద్రుడు అవతరించినాడు, వాడి బాణములు కొట్టినాడు. వారి గుండెలను చీల్చినాడు. భగవంతుని భావించుచునే ప్రాణములు విడిచినారు. వారు ఈ యుగమున మరల జన్మించినారు. వారే శిశుపాల, దంతవక్త్రులు. ధర్మరాజా! మీ ముందే వారు కృష్ణపరమాత్మలో లీనులు అయినారు. శ్రీకృష్ణునిపై పగబట్టిన రాజులున్నారు. వారు సదా శ్రీహరినే భావించినారు. భావించుచునే ప్రాణములు వదలినారు. భ్రమరకీట న్యాయ మున్నదికదా! ఆ న్యాయమును అనుసరించి భగవానునిలో లీనమైనారు.

ధర్మజా! శత్రువులయి శిశుపాల దంతవక్త్రులు కృష్ణభగవానునిలో ఎట్లు లీనులు అయినారు ?, అని అడిగినావు. నీ ప్రశ్నకు సమాధానము వివరించినాను. శ్రీకృష్ణుని అవతార చరిత్ర అతి పవిత్రమైనది ఇందు హిరణ్యాక్ష హిరణ్యకశిపుల వధ ఉన్నది. ప్రహ్లాదుని భక్తికథ ఉన్నది. భక్తిజ్ఞాన వైరాగ్యముల వర్ణన ఉన్నది. సృష్టి, స్థితి, లయములకర్త శ్రీహరి. అతని స్వరూపమున్నది. లీలలు ఉన్నవి. గుణకీర్తనమున్నది. భగవంతుని పొందగలది భాగవత ధర్మము. ఆ ధర్మమును వివరించినాను. అధ్యాత్మ విషయములు అందరు తెలుసుకొన దగినవి. అందును గురించి వివరించినాను.

శ్రీరమణీయమైన నరసింహ విహారము నింద్ర శత్రుసం
హారము బుణ్య భాగవతుడైన నిశాచరనాథపుత్రు సం
చారము నెవ్వడైన సువిచారత విన్న బఠించినన్ శుభా
కారముతోడ నిర్భయము గల్గిన లోకము జెందు భూవరా!

జలజాత ప్రభవాదులున్ మనములోఁ జర్చించి భాషావళిన్
బలుకన్ లేని జనార్దనాహ్వయ పరబ్రహ్మంబు నీయింటిలోఁ
జెలిఁడై మేనమరందియై సచివుఁడై చిత్తప్రియుండై మహా
ఫల సంధాయకుఁడై చరించుట మహాభాగ్యంబు రాజోత్తమా!

విష్ణుదేవుడు ఒక్కడే ఆరాధ్యదైవము. మాయావి మయుడు శివుని కీర్తికి మచ్చ తేబోయినాడు. అపుడు శ్రీహరి అడ్డుపడి కిర్ధరించినాడు.

నారదుడు అట్లు చెప్పినాడు. ధర్మరాజు ఇట్లు అడిగినాడు :—

"శివుడు జగదీశ్వరుడు. మయుడు అతని కీర్తికి మచ్చఎట్లు తెచ్చినాడు? విష్ణు దేవుడు ఎట్లు అడ్డుపడినాడు? వివరింపుము"

త్రిపురాంతకుడు.

నారదుడు కథ చెప్పినాడు.

పూర్వం దేవతలను శ్రీహరి అనుగ్రహించినాడు. దేవతలు బలవంతులు అయినారు. అసురులను ఓడించినారు. అప్పుడు అసురులు మయుని ఆశ్రయించినారు. మయుడు దానవుడు. మాయావి. మయుడు మూడు నగరములు నిర్మించినాడు. వాటిలో ఒకటి బంగారు నగరము. రెండవది వెండినగరము. మూడవది ఇనుప నగరము. ఆ నగరములకు కాలగమనము కల్పించినాడు మయుడు. అవి ఒక చోట ఉండవు. తిరుగుచుంటవి. ఎప్పుడు ఎక్కడవాలునో తెలియదు. ఎప్పుడు ఎక్కడకి ఎగిరిపోవునో ఎరుగము. వాటి రాకపోకలు అగమ్యముగా ఉండెడివి. దేవతలకు తెలియునదికాదు. అసురులు ఆ నగరములలో ఉండువారు. దేవతల కన్నుమూసి దాడిచేయువారు అసురులు. దేవతలకు అంతుపట్టెడిదికాదు. ఆ దాడులతో విసిగిపోయినారు దేవతలు. దేవతలు అందరు కలిసినారు. శివునివద్దకు వెళ్ళినారు. శివుని ఆశ్రయించినారు. "అసురులు త్రిపురములు నిర్మించుకున్నారు. మాపై దాడి చేయుచున్నారు. మా ప్రాణములు తీయుచున్నారు. మాకు అర్థమగుటలేదు. వాటి జాడ అంతుపట్టుటలేదు. మమ్ము రక్షింపుము అని మొర పెట్టినారు.

శివుడు దేవతల ప్రార్థన విన్నాడు. కరుణించినాడు. అభయమొసంగినాడు. శివుని ధనుస్సుపినాకము. పినాకము అందుకున్నాడు. బాణము తొడిగినాడు. ఎక్కు

పెట్టినాడు. త్రిపురములకు ఎక్కుపెట్టినాడు. బాణప్రయోగము చేసినాడు. వేసినది ఒకే బాణము. అందునుండి అనేక బాణములు పుట్టుకొని వచ్చినవి. అవి సూర్యకిరణములవలె వెలిగినవి. ఉరికినవి. నిప్పులు ఉమిసినవి. పిడుగులు కురిసినవి. ఆ మంటలకు మూడు పట్టణములు భస్మమైనవి. వాటిలో దాగిన అసురులందరు అసువులు బాసినారు.

మయుడు సామాన్యుడు కాదు. అఖండుడు. గొప్ప మాయావి. మరణించిన అసురులను తీసుకొని పోయినాడు. అతడు అమృతపు బావులు సిద్ధముచేసియున్నాడు. వానిలో అసురులను పడవేసినాడు. అమృతము అంటినది. అసురులు అందరు బ్రతికినారు. అంతేకాదు వారి శరీరములు మరింత గట్టిపడినవి. వారు ఇనుపపిడుగులయినారు. మరింత తేజస్సుతో ప్రకాశించినారు. మెరుపులవలె కనిపించినారు.

ఇదంతయు శివుడు చూచుచున్నాడు. అతని ప్రయత్నము వ్యర్థము అయినది. అందుకు ఆశ్చర్యపడినాడు. చకితుడయినాడు. శ్రీహరి ఇదంతయు చూచినాడు. అసురులను గెలువ దలచినాడు. ఒక ఉపాయము ఆలోచించినాడు. శ్రీహరి గోవు అయినాడు. బ్రహ్మదేవుని దూడను చేసినాడు. ఉభయులు బయలుదేరినారు. మయుడు నిర్మించిన నగరములకు వెళ్ళినారు. అతడు నిర్మించిన అమృతపు బావుల దరిచేరినారు. అమృతమంతయు త్రాగినారు. ఆ నూతులవద్ద రక్షకులు ఉన్నారు. వారది చూచినారు. కాని హరిమాయ వారిని ఆవహించినది. ఆవును, దూడను వారు తరుమలేదు. మయుడు మాయావి. అతడు కనిపెట్టినాడు. అయినను అతడు విచారించలేదు. అతడు కావలివాళ్ళతో "దేవతలకుగాని, దానవులకుగాని, మనుష్యులకుగాని ప్రారబ్ధకర్మ అనుభవింపక తప్పదు. విచారించి ప్రయోజనము లేదు" అన్నాడు.

తదనంతరము శ్రీహరి తన శక్తితో, శివునికొరకు యుద్ధసామాగ్రి సిద్ధముచేసినాడు. ధర్మమున రథమును సృష్టించినాడు. జ్ఞానమున సారథిని సిద్ధముచేసినాడు. ఐశ్వర్యమున అశ్వములను సృష్టించినాడు. తపస్సున ధనుస్సు సిద్ధము చేసినాడు. విద్యతో కవచము సిద్ధపరచినాడు. క్రియతో బాణములు చేసినాడు. మిగిలిన శక్తులతో ఇతరపరికరములు సృష్టించినాడు. ఈ అపూర్వ సామాగ్రితో యుద్ధమునకు సిద్ధపడినాడు శివుడు. ధనుర్బాణములు ధరించినాడు. రథమును అధిరోహించినాడు. అభిజిన్ముహూర్తమున సాగినాడు. ధనుస్సుకు బాణము తొడిగినాడు

త్రిపురములకు గురిపెట్టినాడు. బాణము వదలినాడు. బాణములు పిడుగులు కురిసినవి. అగ్నివాన కురిపించినవి. మూడు పురములు కాలినవి. కూలినవి. బూడిదగా మారినవి.

స్వర్గమున దేవదుందుభులు మ్రోగినవి. విమానములతో ఆకాశము కిటకిటలాడినవి. దేవతలు, ఋషులు, పితరులు, సిద్ధులు, ఆనందమున జయజయ ధ్వానములు చేసినారు.

పూలవాన కురిసింది. కిన్నరులు పాడినారు. అప్సరసలు ఆడినారు.

ఇట్లు త్రిపురములను భస్మము చేసినాడు శివుడు. అప్పుడు అతనికి 'త్రిపురాంతకుడు' అని పేరువచ్చినది. బ్రహ్మ మున్నగు దేవతలు శివుని స్తుతించినారు.

శ్రీహరి తనమాయవలన ఎన్నో లీలలు చూపినాడు. అతడు లీలామానుష విగ్రహుడు. అతని లీలలను మహామునులు గానము చేయుదురు.

ధర్మరాజా ! ఇంకను అడుగవలసినవి ఉన్నచో అడుగుము.

మానవ ధర్మములు.

శ్రీ శుకుడు చెప్పుచున్నాడు.

పరీక్షిన్మహారాజా ! ప్రహ్లాద చరిత్ర విన్నాడు ధర్మరాజు. ఎంతో సంతోషించినాడు. భక్తి జ్ఞానప్రతిపాదకమైన మానవధర్మములను వినవలెనని విన్నవించినాడు. ధర్మరాజు అడుగుచున్నాడు :—

"మహర్షీ ! ధర్మము వల్లనే జ్ఞానము కలుగుచున్నది. ధర్మము వలననే భక్తి కుదురుచున్నది. ధర్మము వలననే భగవానుడు సాక్షాత్కరించు చున్నాడు. కావున సనాతన మానవ ధర్మములను వర్ణాశ్రమ ధర్మములను వివరింపుము. నీవు బ్రహ్మకు పుత్రుడవు. తపము, జ్ఞానము, సమాధులలో పరమ సమ్మతుడవు దయామూర్తివి. భక్తుడవు. సదాచారుడవు. బ్రాహ్మణ్య స్వరూపమును ఎరిగినవాడవు. అనుగ్రహించుము. మానవధర్మములను వివరింపుము.

నారదుడు చెప్పుచున్నాడు :—

లోక ధర్మములకు మూలకారణము భగవానుడు. ఒకప్పుడు భగవానుడు దక్షుని పుత్రిక మూర్తి గర్భమున జన్మించినాడు, నారాయణ ముని బదరికాశ్రమమున

తపస్సు చేసినాడు. అతనినుండి సనాతన ధర్మములను విన్నాను. ఆ దేవదేవునికి నమస్కరించుచున్నాను. ఆ దేవుని వలన విన్నవి నీకు వినిపించుచున్నాను.

శ్రీహరి సర్వవేదమయుడు. అన్ని ధర్మములకు అతడే ప్రమాణము. మానవ ధర్మములు ముప్పది. 1 సత్యము. 2 శౌచము, 3 సమదర్శిత్వము, 4 స్వాధ్యాయము, 5 దయ, 6 తపస్సు, 7 త్యాగము, 8 తితిక్ష, 9 లజ్జాపరిత్యాగము, 10 వాక్సంయమము, 11 అహింస, 12 బ్రహ్మచర్యము, 13 జపము, 14 ఋజుత్వము, 15 సంతృప్తి, 16 సాధుజనసేవ, 17 కామ్యకర్మలు వదలుట, 18 కర్మఫలానుసంధాన రాహిత్యము, 19 వ్యర్థప్రలాపములు మానుట, 20 ఆత్మానుసంధానము, 21 సర్వప్రాణులకు అన్నదానము చేయుట, 22 విష్ణునామ శ్రవణము, విష్ణునామ సంకీర్తనము, 23 విష్ణుపూజ, 24 విష్ణు ప్రణతి, 25 విష్ణు దాస్యము, 26 విష్ణు సఖ్యము, 27 విష్ణుకథా శ్రవణము, 28 విష్ణులీలా గానము, 29 విష్ణుభక్తి 30 విష్ణుదేవునకు ఆత్మార్పణము చేయుట. ఇవి శ్రేష్ఠములయిన మానవధర్మములు. వీనిని శ్రద్ధగా ఆచరించిన భగవంతుడు ప్రసన్నుడగును.

వర్ణాశ్రమ ధర్మములను అనుసరించి మంత్రయుక్తములైన సంస్కారములు కలవారు బ్రాహ్మణులు. పరిశుద్ధములైన కులకర్మములు నిర్వర్తించువారు సద్బ్రాహ్మణులు. వారే యజ్ఞములు, యాగములు, అధ్యయనము చేయుటకు అర్హులు. బ్రాహ్మణులకు ఆరుకర్మలు విధించబడినవి. 1 అధ్యయనము, 2 అధ్యాపనము. 3 యజనము, 4 దానము, 5 యాజనము, 6 ప్రతిగ్రహము. ప్రతిగ్రహము తప్ప తక్కిన అయిదు కర్మములు క్షత్రియులవి. ప్రజాపాలనము, పన్నులు గ్రహించుట రాజధర్మములు. రాజులు బ్రాహ్మణులవద్ద పన్నులు గ్రహించరాదు. వ్యవసాయము వర్తకము వైశ్యుల కర్మములు. మూడు వర్గముల సేవ చేయుట శూద్రుల ధర్మము.

బ్రాహ్మణులకు నాలుగు వృత్తులు విధించబడినవి. అవి 1 వార్తా, 2 శాలీనము, 3 యాయవారము, 4 శిలోంఛనము. ఈ నాలుగింటిలో ఒకదానికన్న మరొకటి ఉత్తమము. దిగువ వర్గములవారు ఆపదలలో తప్ప ఉత్తమ జాతుల వృత్తులు అవలంబించరాదు. ఆపద సమయమునందు సైతము క్షత్రియుడు యాజనము, అధ్యాపనము చేయరాదు. బ్రాహ్మణుడు ఆపదలందు ఋతము, అమృతము, మృతము, ప్రమృతము, సత్యానృతము అను వృత్తులలో జీవించవచ్చును. కాని బ్రాహ్మణుడు శ్వవృత్తిని అవలంబించరాదు. దుకాణములలో పడిఉన్న గింజలను ఏరు

కొనుటకు "ఉంఛవము" అందురు. పొలములందు పరిగపసుకొనుటను "శిలము" అందురు. ఉంఛ, శిలావృత్తులు రెండును "ఋతము" అయాచితముగా దొరికినది "అమృతము" నిత్యము యాచించుట "మృతము" వ్యవసాయము "ప్రమృతము" వర్తకము "సత్యానృతము" నీచసేవ "శ్వవృత్తి" శ్వవృత్తి అన్నిటికన్న నీచమైనది. సర్వవేదమయుడయిన బ్రాహ్మణుడు, సర్వదేవమయుడైన క్షత్రియుడు శ్వవృత్తిని అవలంబించరాదు.

బ్రాహ్మణుని లక్షణములు పదకొండు.

1. అంతరింద్రియ నిగ్రహము. 2. బహిరింద్రియ నిగ్రహము 3. తపస్సు 4. శౌచము 5. సంతోషము. 6. క్షమ. 7. ఆర్జవము. 8. జ్ఞానము 9. దయ. 10. విష్ణుపరత్వము. 11. సత్యము.

క్షత్రియుని లక్షణములుపది :-

1. యుద్ధమున ఉత్సాహము 2. వీరత్వము 3. ధీరత్వము 4. ప్రాగల్భ్యము 5. దానము 6. ఆత్మజయము 7. క్షమ 8. బ్రహ్మణ్యత 9. అనుగ్రహము 10. ప్రజారక్షణ.

వైశ్యుల లక్షణములు తొమ్మిది :-

1. దైవభక్తి 2. గురుభక్తి 3. గోభక్తి 4. భగవద్భక్తి 5. ధర్మార్థకామముల రక్షణ 6. ఆస్తికత 7. ఉద్యోగశీలత 8. వ్యవహార నైపుణ్యము. 9. దానము.

శూద్రుల లక్షణములు ఎనిమిది :-

1. వినయము 2. పవిత్రత 3. ప్రభుసేవ 4. దొంగతనము చేయకుండుట 5. సత్యము 6. గోవులను రక్షించుట 7. బ్రాహ్మణులను సేవించుట. 8. మంత్రములులేక యజ్ఞములుచేయుట.

పతివ్రత ధర్మములు :-

1. భర్తను సేవించుట 2. భర్తకు అనుకూలముగా ఉండుట 3. భర్తబంధువులను సంతోషపెట్టుట 4. భర్తృనియమములు పాటించుట 5. భర్తను దేవునిగా భావించుట.

పతివ్రత గుణములు :-

1. ఇంటిని శుభ్రముగా ఉంచుట. అలుకుట. ముగ్గులుపెట్టుట. 2. శరీరమును శుభ్రముగా ఉంచుకొనుట - అలంకరించుకొనుట. 3. ఇంటి పరికరములు, పరి

కరములు శుభ్రముగా ఉంచుట. 4. భర్తకోరిన పనిచేయుట. 5. భర్తవద్ద వినయముగా ఉండుట. 6. భర్తకు ప్రేమగా ప్రియవాక్యములు చెప్పుట. 7. ఇంద్రియ నిగ్రహము 8. సంతృప్తి 9. చాతుర్యము 10. ధర్మపాలన 11. కర్తవ్య నిర్వహణ 12. పవిత్రత 13. పతితుడు కాని భర్తతో సహవాసము.

చాకలి, మాదిగ, మేదరి, నట, కైవర్తక జాతులకు తమ కులవృత్తులే ధర్మములు. వారు దొంగతనము మొదలగు నీచవృత్తులు అవలంబించరాదు.

> ధర్మవ్యవస్థ యుగములనుబట్టి మారుచుండును. ప్రతియుగమునందును వేదవిదులైన ఋషులు ధర్మవ్యవస్థను కల్పింతురు. అట్టి ధర్మవ్యవస్థ ఇహపరములకు క్షేమము కలిగించును. జనులు స్వాభావికమైన వృత్తులను అవలంబించవలెను. అట్లైనచో ఔన్నత్యము పొందుదురు. గుణాతీతులు అగుదురు.
>
> పదేపదే విత్తుటవలన పంటపొలము క్రమముగా నిస్సారమగును. తుదకు ఆ పొలమున విత్తిన గింజలు మొలకలు ఎత్తవు. అట్లే విషయాసక్తి అధికము అయిన మనసు చవిటినేలవలె అగును. అప్పుడు భోగములు అట్లురావు. అవి మనసును చంపవు-చవిటినేలగా చేయవు.
>
> నిప్పు మండుచుండవలెనన్న ఒక్కొక్క చుక్క నేయి వేయవలెను. అట్లే మనుష్యుడు అల్పభోగములు అనుభవించిన మనసు ఉజ్జ్వలముగా ఉండును. అగ్గిలో ఒకేసారి అధికము పోసినచో అగ్నిమండి ఆరిపోవును. అట్లే ఎడతెరిపి లేని విషయభోగములవలన చిత్తము నిస్తేజము అగును.

నాలుగు వర్ణముల లక్షణములు వివరించినాను. ఒకవర్ణమున జన్మించిన వానివద్ద వేరొకవర్ణ లక్షణములు కనిపించవచ్చును. అట్లయిన అతని లక్షణములను అనుసరించి ఆ వర్ణమువాడని నిర్ణయించవలెను. జాతి మాత్రంబున పురుషునకు వర్ణంబు నిర్దేశింపంబనిలేదు. శమదమాదివర్ణ లక్షణవ్యవహారంబుల గనవలయు.

బ్రహ్మచర్యము.

బ్రహ్మచారి గురుకులవాసము చేయవలెను. ఇంద్రియ నిగ్రహము అవలంబించవలెను. వినయమున గురువును సేవించవలెను. ఉదయ సాయంత్రములందు గురువును, అగ్నిహోత్రుని, సూర్యుని, విష్ణుదేవుని ఉపాసించవలెను. ఏకాగ్రచిత్తమున గాయత్రిని జపించవలెను. సంధ్యను ఉపాసించవలెను. గురువునకు విధేయుడై ఉండవలెను. వేదాధ్యయనము చేయవలెను. పాఠము ప్రారంభించి

నపుడు, ముగించినపుడు గురువునకు పాదాభివందనము చేయవలెను. శాస్త్రవిధిని అనుసరించి మొలత్రాడు, జందెము, లేడి చర్మము, వస్త్రము, జడలు, దండము, కమండలము కుశలు ధరించవలెను. ఉదయము సాయంత్రము భిక్షము అడుగవలెను. దానిని తెచ్చి గురువునకు అర్పించవలెను. గురువు ఆజ్ఞపొందిన భుజించవలెను. సచ్ఛీలము అలవరచుకొనవలెను. మితభోజనము చేయవలెను. మిత భాషణము చేయవలెను. అన్నిపనులను శ్రద్ధగా చేయవలెను. తన నిపుణత చూపవలెను. అంగనలతోను. అంగనల విషయమున ఆసక్తులయిన వారితోను అవసరము అయినంతవరకు మాత్రమే సంబంధము పెట్టుకొనవలెను.

ఇంద్రియములు అశ్వముల వంటివి. నిగ్రహించిన వారిని కూడ అదుపు తప్పించును. కావున స్త్రీల విషయమున ఎంతదూరముగా ఉన్న అంతమంచిది. యవ్వనమున ఉన్న బ్రహ్మచారి, యవ్వనమున ఉన్న గురువు భార్యలచేత తల దువ్వించుకొనరాదు. నలుగు పెట్టించుకొనరాదు. తల అంటించుకొనరాదు.

పొలఁతి దావ వహ్ని పురుషుడాజ్య ఘటంబు
కరఁగకేలయుండుఁ గదిసెనేని
బ్రహ్మయైన కూతుఁబట్టకమానఁడు
నరున కింతిపొత్తు వలదువలదు.

ఆత్మసాక్షాత్కారము కలిగిన ఇంద్రియములు దేహము అసత్యములను జ్ఞానము కలుగును. అప్పుడు స్త్రీ పురుషుల భేదభావము వదులును. అది వదలనిదో స్త్రీ సంసర్గమున పురుషుడు కామాసక్తుడు కాకుండడు.

శీలవంతులగుట అన్ని ఆశ్రమముల వారికిని అవసరము. గృహస్థులకు, సన్యాసులకును అది అవసరము. గృహస్థు గురుకులమునందుండుట వైకల్పికము. భార్యరుతుమతి అయిన అతడు బ్రహ్మచర్యము పాలించ పనిలేదు.

బ్రహ్మచారి కనులకు కాటుక పెట్టుకొనరాదు. నూనె రాసుకొనరాదు. నలుగు పెట్టుకొనరాదు. అలంకరించుకొనరాదు. మాంసము తినరాదు, మద్యము ముట్టరాదు. పూలదండలు ధరించరాదు. చందనము అలముకొనరాదు. నగలు పెట్టుకొనరాదు' అంగనల చిత్రములు చిత్రించరాదు. ఈ నియమములు పాటించుచు గురుకులవాసము చేయవలెను. బ్రాహ్మణుడు వేదములు, వేదాంగములు, ఉపనిషత్తులు అధ్యయనము చేయవలెను. జ్ఞానము గడించవలెను. గురువుకోరిన దక్షిణ,

శక్తివంచన లేకుండ, సమర్పించవలెను. గురుని ఆజ్ఞపొంది గృహస్థాశ్రమమో, వానప్రస్థమో, సన్యాసమో స్వీకరించవలెను.

భగవంతుడు సర్వవ్యాపి. అతడు లేనిచోటులేదు. అగ్ని, గురువు, ఆత్మ అన్నియు అతడే. సమస్త జీవులందున అతడున్నాడు. కావున, ఏ ఆశ్రమమున ఉన్ననూ భగవానుని ఆశ్రయించవలెను. నియమములను ఎల్లరును పాటించవలెను. బ్రహ్మచారులు, వానప్రస్థులు, సన్యాసులు, గృహస్థులు పరబ్రహ్మతత్వమును ఎరుగవలెను.

గార్హస్థ్యము.

ధర్మరాజు అడిగినాడు :-

నావంటి గృహస్థులున్నారు. వారును ముక్తిపొందవలెను కదా! అందుకు వారు ఎట్టిధర్మములను ఆచరించవలెను ?

నారదుడు ధర్మరాజు ప్రశ్నవిన్నాడు. ఇట్లు చెప్పినాడు :-

గహస్థు గృహస్థ ధర్మములను పాలించవలెను. సమస్త కర్మలు భగవానునికి అర్పించవలెను. మహర్షుల సేవచేయవలెను. విరాగులయిన పెద్దల స్నేహము చేయవలెను. భగవత్కథలు వినవలెను.

కలవచ్చును, కరిగిపోవును. అప్పుడు కలలోని వాటితో సంబంధము తెగిపోవును. సత్సాంగత్యము కలను కరిగించును. వాస్తవము వెల్లడిచేయును. బుద్ధి పరిశుద్ధమగును. శరీరముతోను, భార్యా పుత్రులతోను సంబంధము వదిలిపోవును. ఈ సంబంధములు శాశ్వతములుకావు. ఎన్నడో ఒకనాడు విడగవలసినవే. పండితుడు పరిస్థితి ఎరుగవలెను. ఇల్లువాకిలితోను, భార్యాబిడ్డలతోను ఎంతవరకు అవసరమో అంతవరకే బంధము ఉంచుకొనవలెను. అతడు వైరాగ్యమును పెంచుకొనవలెను. దంభము వదలవలెను. సామాన్యునివలె జీవించవలెను.

ధనము మూడు విధములు. ఒకటి దివ్యము. ఇది వర్షము మున్నగువానివలన లభించు పంటలు మున్నగునవి. రెండు భౌమము. ఇవి ఖనిజములు - బంగారము మున్నగునవి. మూడు అంతరిక్షము. ఆకస్మికముగా లభించు ద్రవ్యములు. ఏ విధమయిన ధనమయినను తన ప్రారబ్ధమువల్లనే లభించినదని భావించవలెను.

> నరునకు ధనమంతటి మీద అధికారములేదు. తన ఉదరపోషణకు అవసరము అయినంతవరకే అతని అధికారము, అంతకు మించి అతనికి అధికారములేదు. అట్లు ఉన్నదనుకొనువారు దొంగ అతనిని దండించవలెను.
>
> ఒంటెలు, గాడిదలు, కోతులు మున్నగు జంతువులను, ఎల్లు మున్నగు సరీసృపములను, పక్షులను కీటకములను తన సంతానముగా భావించవలెను.

గృహస్థు ధర్మ, అర్థ, కామములను సాధించవలెను. అట్లని అందుకు అతని బ్రతుకు దుర్భరము చేసికొనరాదు. లభించిన దానితో తృప్తిచెందవలెను. తృప్తిని మించిన ఆనందములేదు. గృహస్థు పదార్థములన్నింటిని తానొక్కడే అనుభవించరాదు. కుక్కలకు, చండాలురకు, పతితులకు పంచిపెట్టవలెను.

> మనిషి భార్యకొరకు ప్రాణము ఇచ్చును. పరుల ప్రాణములు తీయును. భార్య కొరకుగాను తల్లిని, తండ్రిని, గురువును సహితము హత్యచేయును. భార్య మీదగల మమకారమును వదులుకున్నవారు భగవానుని ప్రసన్నుని చేయ గలరు-భగవంతుని గెలువనూ గలరు.

శరీరము చీము నెత్తుటితో కూడినది. ఇందు పురుగులున్నవి. పురీషమున్నది. ఈ దేహభోగమునకు అర్రులకు చాచు భార్యపద! నిజమహిమతో ఆకసమును సైతము ఆక్రమించగల ఆత్మపద!

> తనకు అవసరమయిన ధనము మీదనే అధికారమున్నదను కున్నవారు గృహస్థు. తక్కినది వదులుకొనువారు మహాపురుషుడు.

గృహస్థు తన వృత్తిద్వారా ధనమును ఆర్జించవలెను. దానితో అయిదు యజ్ఞములు నిర్వర్తించవలెను. దేవయజ్ఞము, పితృయజ్ఞము, ఋషియజ్ఞము, నరయజ్ఞము, భూతయజ్ఞము అనునవి అయిదు యజ్ఞములు. అట్లనిన దేవతలను, పితరులను, ఋషులను నరులను భూతములను తృప్తులను చేయవలెను. వారిని సేవించవలెను. యజ్ఞములు భిన్నములయినను అన్నియు భగవానునికే చెందును. యజ్ఞములకు అధికారముగల వారు, అవసర సామగ్రి లభించిన మహాయజ్ఞములు చేయవలెను. భగవంతుని పూజించవలెను. సర్వయజ్ఞముల భోక్తపరాత్పరుడు భగవంతుడు. అతడు బ్రాహ్మణునినోటి హవిస్సుతో తృప్తిచెందును - అగ్నికి అర్పించిన హవిస్సులతో కాదు, భగవంతుడు బ్రాహ్మణులందున్నాడు. దేవత లందున్నాడు. నరులందున్నాడు. సర్వభూతములందున్నాడు. వీరు తృప్తిపడిన భగవంతుడు తృప్తిచెందును. బ్రాహ్మణుడు తృప్తిచెందిన భగవంతుడు మరింత తృప్తిచెందును.

బ్రాహ్మణుడు ధనవంతుడు అయిన భాద్రపద మాసమున తన తలిదండ్రులకు వారి బంధువులకు మహాలయ శ్రాద్ధము చేయవలెను. పితృశ్రాద్ధమునకు శ్రేష్ఠము లైన దినములివి :-

అయనము, విషువము, వ్యతీపాతము, దినక్షయము, సూర్యచంద్ర గ్రహణములు, ద్వాదశి, శ్రవణ, ధనిష్ఠ అనూరాధ నక్షత్రములు, కార్తీక శుద్ధనవమి, మార్గ శిరమాసము, పుష్య, మాఘ, ఫాల్గుణ మాసముల బహుళ అష్టమిలు. మాఘ శుద్ధ సప్తమి, మాఘపూర్ణిమ, మాస నక్షత్రములతో కూడిన రాకా మరియు అనుమతి, అనూరాధ, శ్రవణములుకాని మూడు ఉత్తర నక్షత్రములు, వాటిలో ఒకటి కలిసిన ద్వాదశి. మూడు ఉత్తర నక్షత్రములలో ఒకటి కూడిన ఏకాదశి, జన్మనక్షత్రము, శ్రవణ నక్షత్రయోగము.

ఇవి శ్రాద్ధములకే కాదు - పుణ్యకర్మములకును శ్రేష్ఠములు. అభ్యుదయము కలిగించు శుభయోగములు. ఈ యోగములందు గృహస్థు శుభకర్మములు చేయవలెను. అందువలన శ్రేయస్సు కలుగును. ఆయుస్సు పెరుగును. ఈ యోగములందు స్నానము, యోగము, జపములు చేయవలెను. అందువలన అక్షయములైన ఫలములు కలుగును. భార్యకు పుంసవనము మున్నగు సంస్కారములు, సంతానమునకు జాతకర్మలు మున్నగు శుభ సమయములందు దాన ధర్మములు చేయవలెను.

ధర్మము, శ్రేయస్సు కలిగించు పుణ్యప్రదేశములు :-

పుణ్యాత్ములున్న దేశము పుణ్యదేశము. భగవంతుని విగ్రహములున్న దేశము పుణ్యదేశము తపస్సు, విద్య, దయగల బ్రాహ్మణులున్న దేశము పుణ్యదేశము భగవానుని పూజలు జరుగు దేశము పుణ్యదేశము. గంగ మున్నగు పవిత్ర నదులు ప్రవహించు దేశము పుణ్యదేశము. పుష్కరము మున్నగు సరోవరములున్న దేశము పుణ్యదేశము. సాధువులు సేవించు క్షేత్రములున్న దేశము పుణ్యదేశము

దిగువ పేర్కొన్నవి పుణ్యప్రదేశములు :-

కురుక్షేత్రము, గయ, ప్రయాగ, పులహాశ్రమము, నైమిశారణ్యము, ఫల్గు తీర్థము. సేతువు. ప్రభాసతీర్థము, కుశస్థలి, వారణాసి, మధుర. పంపా సరోవరము బిందుసరస్సు, బదరికాశ్రమము, అలకనంద, అయోధ్య, చిత్రకూటము, పంచవటి. మహేంద్ర పర్వతము, మలయ పర్వతాది కులపర్వతములు. వారి పూజలు జరుగుచోట్లు.

ఈ ప్రదేశములందు గృహస్థు పుణ్యకార్యములు చేయవలెను. అట్లుచేసిన అతనికి వేయిరెట్లు ఫలము లభించును. శ్రీహరి ఒక్కడే సత్పాత్రుడు. నీవు రాజసూయము చేసినావు. ఆ యాగమునకు దేవతలు, ఋషులు, తాపసులు, సనకసనందనాది మహామునులు వచ్చినారు. అయిన శ్రీకృష్ణ పరమాత్ముడే పూజలు అందుకున్నాడు. జీవరాసులతో నిండినది ఈ మహాబ్రహ్మాండము. దానిని ఒక మహావృక్షము అనుకొనిన శ్రీకృష్ణుడు దానివేరు. అందువలన కృష్ణుని పూజించిన జీవకోట్లన్నియు తృప్తిచెందును.

మనుష్యులు, పశువులు, పక్షులు, ఋషులు దేవతలు వివిధ పట్టణములు. వీనిని నిర్మించినవాడు శ్రీకృష్ణుడు. అతడే జీవరూపమున వానిలో శయనించును. అందువలన అతడు "పురుషుడు" అతడు ఒక్కడు. అయినను అన్నింట ప్రకాశించును. మనుష్యులందు భగవదంశ అధికము. మనుష్యులందును జపతపాదులు చేయువారు ఉత్తమోత్తములు.

పూర్వము మనుష్యులకు సహనము లేకుండెడిది. ఒకరిని సన్మానించువారు. ఒకరిని అవమానించు వారు. పండితులు ఇది చూచినారు. భగవంతుని పూజించుటకు విగ్రహములు ఏర్పరచినారు. నాటినుండి విగ్రహారాధన ప్రారంభము అయినది.

మనుషులను ద్వేషించువాడు విగ్రహారాధన చేసిన ఫలము దక్కదు

మనుష్యులందు బ్రాహ్మణులు తపస్సు, విద్య సంతృప్తి కలిగి ఉందురు. అందువలన వారు భగవత్స్వరూపులు. బ్రాహ్మణుల పాదధూళి సోకి లోకములు పావనములు అగును. అందువలననే కృష్ణ పరమాత్ముడు బ్రాహ్మణులను దేవతలని భావించును.

వానప్రస్థము.

వానప్రస్థులు సాగుచేసిన భూమిలోని పంట తినరాదు. అకాలమున పండినది సాగుచేయని భూమిలో పండినను తినరాదు. నిప్పుమీద వండిన పదార్థములు తినరాదు. అట్లని పచ్చివికూడ తినరాదు. ఎండలో ఉడికిన దుంపలు, పండ్లు తినవలెను. అడవిలో అప్రయత్నముగా పండిన దానిని వాడవలెను. వాటితో నిత్యనైమిత్తికములైన చరువు, పురోడాశము సిద్ధము చేసికొనవలెను. కొత్త దుంపలు మున్నగునవి లభించిన అప్పటికి కూడబెట్టి ఉంచినవి త్యజించవలెను. అగ్నిహోత్రమును భద్రపరచుకొనుటకు పాకలో ఉండవలె. అట్లు కాకున్న గుహలో

ఉండవచ్చును. చలి, గాలి, ఎండ, వాన భరించవలెను. జడలు ధరించవలెను. జుట్టు, మీసములు, గడ్డములు, గోళ్లు కత్తిరించరాదు. శరీరముమీది మురికి సైతము శుభ్రపరుచరాదు. దండ కమండలములు, లేడిచర్మము, నారబట్టలు, అగ్నిహోత్ర సామాగ్రి ఎల్లప్పుడు దగ్గర ఉంచుకొనవలెను. అట్టి వానప్రస్థముని పన్నెండేళ్లు ఉండవచ్చును. ఎనిమిదేండ్లు ఉండవచ్చును. నాలుగు సంవత్సరములు ఉండవచ్చును. రెండు సంవత్సరములు ఉండవచ్చును. కనిష్ఠము ఒక సంవత్సరము ఉండవలెను. ఉన్నంత కాలము నియమములు పాటించవలెను. అతడు అధిక తపస్సు చేయరాదు. మనసు వికటింపచేయరాదు. జబ్బులు రావచ్చును. వార్ధక్యము పీడించవచ్చును. నియమములు పాటించలేని స్థితి రావచ్చును. బ్రహ్మ విద్యకు అంతరాయము కలుగవచ్చును. అట్టితరి వానప్రస్థుడు ఉపవసించవలెను. ఆహవనీయము మున్నగు అగ్నులను ఆత్మలో లీనము చేసుకొనవలెను. అహంకారము వదలవలెను. మానాభిమానములు మానవలెను.

జితేంద్రియుడు దేహచ్ఛిద్రములను ఆకాశమున లీనము చేయవలెను. ప్రాణము వాయువునందు లీనము చేయవలెను. తేజాంశమును అగ్నియందు లీనము చేయవలెను. కఫము మున్నగువానిని నీటిలో లీనము చేయవలెను. ఎముకలు భూమిలోను, వాక్కులు అగ్నిలోను, హస్తములు ఇంద్రునిలోను, పాదములు విష్ణువులోను, ఉపస్థ ప్రజాపతులలోను, అధోవాయువు మృత్యువులోను, శ్రోత్రం దిక్కులలోను, చర్మము వాయువునందును, రూపము సూర్యునియందును, నాలుక జలమునందును, నాసిక భూమియందును, మనస్సు చంద్రునియందును, అహంకారము శివునియందును, చిత్తము జీవునియందును లీనము చేయవలెను. సత్త్వము మున్నగు గుణములవలన వికారముపొందిన జీవుని పరబ్రహ్మమందు లీనము చేయవలెను. భూమిని జలములందు, జలములను అగ్నియందు, అగ్నిని వాయువునందు, వాయువును ఆకాశమందు, ఆకాశమును అహంకార మహాత్తత్త్వమందు, మహాత్తత్త్వమును అవ్యక్త పరమాత్మయందు లీనము చేయవలెను.

అట్లు ఉపాధులన్నియు లీనములగును. అప్పుడు తాను అక్షయుడైన చిన్మాత్ర శేషుడని ఎరుగును. అప్పుడు అద్వైతభావము పూనవలెను. కర్రను తగలబెట్టుదము. కర్ర తగులబడును. అప్పుడు అగ్ని ఉపశమించును. అట్లే అన్నింటిని లీనముచేసి తాను ఉపశమించవలెను.

సన్యాసము.

వానప్రస్థుడు బ్రహ్మవిద్యను అనుసంధించవలెను. సమర్థుడైనచో దేహమును తప్ప తక్కినవానిని విసర్జించవలెను. సన్యాసము స్వీకరించవలెను. సన్యాసి నిష్కామి కావలెను. అతనికి కోరికలు ఉండరాదు. వానిని చంపవలెను. సన్యాసికి నివాసము లేదు. ఎచ్చటను ఒకరాత్రికి మించి నిలువరాదు. అపేక్షలు పెంచుకొనరాదు. భూసంచారము చేయవలెను. వస్త్రము విసర్జించవలెను. గోచిమాత్రము పెట్టుకొనవలెను. ఆపదలందు ఆశ్రమ చిహ్నమైన దండమును మాత్రము ధరించవలెను. సర్వప్రాణుల శ్రేయస్సు కోరవలెను. కోపమును పరిత్యజించవలెను. శాంతముగా ఉండవలెను. నారాయణ పరాయణుడై ఉండవలెను. ఎవ్వరిని ఆశ్రయించరాదు. ఏకాకియై తిరుగవలెను. ఆత్మ కార్యకారణాతీతమైనది. అవ్యయమైనది. అది తెలుసుకొనవలెను. ఆత్మయందు విశ్వాసమును దర్శించవలెను. ఆత్మ దేహమందంతటను కలదు. ఆత్మలో పరబ్రహ్మమును దర్శించవలెను. అవస్థలందు సుషుప్తి ఒక అవస్థ. జాగ్రదావస్థ రెండవది. ఈ రెంటిమధ్య ఆత్మస్థితిని గుర్తించవలెను. బంధము మాయ. మోక్షము మాయ. ఈ విషయమును గుర్తించవలెను. మృత్యువు నిశ్చితమైనది. జీవితము అనిశ్చితమైనది. ఈ రెంటిలో దేనిని అభినందించరాదు. చావు పుట్టుకల కారణ స్వరూపము కాలము. ఆ కాలమునకై నిరీక్షించవలెను. శాస్త్రములందు అనాత్మ విషయమైనవి ఉన్నవి. వానిని అధ్యయనము చేయరాదు. ఎవరితోను వాదించరాదు. పక్షపాతము వహించరాదు. శిష్యులను చేర్చరాదు. అతి అధ్యయనము చేయరాదు. ఉపన్యాసము ఈయరాదు. కానిపనులు తలపెట్టరాదు. శాంతులు, సమదర్శనులు, మహాత్ములు అయిన సన్యాసులకు ఆశ్రమ ధర్మములు నిర్బంధములు కావు. తమకు నచ్చిన చిహ్నములను ధరించవచ్చును. అట్లుకాకున్న విసర్జించవచ్చును. యతికి ఆశ్రమ చిహ్నములతో పనిలేదు. అతడు ఆత్మానుసంధానమున మగ్నుడై ఉండును. అతడు ధీమంతుడయినను బాలునివలె కనిపించును. పిచ్చివానివలె కనిపించును. ప్రతిభావంతుడయినను జడునివలె కనిపించును.

ఈ విషయమున ఒక పురాతన ఇతిహాసమున్నది. అది ప్రహ్లాదునకు యతికి జరిగిన సంవాదము. వినిపింతును. వినుము.

అజగరము.

ప్రహ్లాదుడు లోకతత్త్వమును తెలుసుకొనదలచినాడు. లోక సంచారమునకు బయలుదేరినాడు. అతనివెంట మంత్రులున్నారు. వారు సంచారము చేయసాగి

నారు. సహ్యాపర్వతము దగ్గరకు వచ్చినారు. కావేరీనది ఒడ్డున ఒక ముని కనిపించినాడు. అతడు మరుగుపడిన తేజస్సువలె ఉన్నాడు. మన్ను కప్పిన మాణిక్యమువలె ఉన్నాడు. అతని ఆకారము విచిత్రముగా ఉన్నది. అతడు సామాన్యుడా? సిద్ధ పురుషుడా? తెలియుటలేదు. ప్రహ్లాదుడు పరమ భాగవతుడు. గ్రహించినాడు. శిరసువంచి పాదాభివందనము చేసినాడు. భక్తిపురస్సరముగా పూజించినాడు. అడిగినాడు :—

“ఉద్యోగించిన వారికి ధనము లభించును. వారు భోగములు అనుభవింతురు. వారి శరీరము పుష్టిగా ఉండును. అన్యథా అట్లు జరుగుటకు వీలులేదు. నీవు ఉద్యోగించుట లేదు. నీవద్ద ధనములేదు. అందువలన నీకు భోగములు లేవు. అయినను నీ శరీరము పుష్టిగా ఉన్నది. ఈ విషయమున నాకు సందియము కలిగినది. అది రహస్యము కాకున్నచో, నేను వినదగినది అయినచో వివరింపుము. నీవు పండితుడవు. పామరుడవుకావు. దక్షుడవు. నిపుణుడవు. లోకమంతయు కర్మ చేయుచున్నది. నీవు చూచుచున్నావు. అయినను కదలక ఉన్నావు. నిర్లిప్తుడవు అయిఉన్నావు. ఇది ఆశ్చర్యముగా ఉన్నది వివరించుము. నన్ను ధన్యుడను చేయుము”

ఆముని ఇట్లు చెప్పినాడు :—

“ప్రహ్లాదా! నీవు ఉత్తముడవు. భక్తుడవు. ఆత్మజ్ఞానము కలవాడవు. నిన్ను మునులు గౌరవింతురు. ఋషులు గౌరవింతురు. మనుషులు కర్మచేయుదురు. అందువలన కలుగు ఫలము నీవు ఎరుగుదువు. కర్మమానిన కలుగు ఫలములు గూడ నీవు ఎరుగుదువు. నీది జ్ఞానదృష్టి. నీదృష్టికి అందనిది లేదు. నీభక్తి ఉత్తమోత్తమము అయినది. అందువలన విష్ణుదేవుడు సదా నీ మనమునందు నివసించుచున్నాడు. సూర్యుడు చీకట్లను నాశనము చేయును. శ్రీమన్నారాయణుడు నీ అజ్ఞానమును నాశనము చేయుచున్నాడు. అయినను నీవు నన్ను ప్రశ్నించినావు. నాకు తెలిసినది కొద్ది. తెలిసినంతవరకు సమాధానము చెప్పెదను. వినుము.

> తృష్ణ అపారమైనది. దానికి అంతులేదు. హద్దులేదు. తృష్ణ భోగములను అనుభవించమనును. పురికొల్పును. మనిషిని పిచ్చివానిని చేయును. మనిషి భోగములు అనుభవించుచునే ఉండును. అయినను అతని తృష్ణ చల్లారదు. జననమరణములది చక్రము. దాని అంతు ఇంతవరకు ఎవ్వరూ కనలేదు. నేనును తృష్ణకు ఎర అయినాను. జననమరణ చక్రమున చిక్కుకున్నాను.

కర్మలు చేసినాను. అనేక జన్మములు ఎత్తినాను. అనేక సారులు చచ్చినాను. చివరకు మానవజన్మ లభించినది. స్వర్గము పొందవలెననివినను, మోక్షము సాధింపవలెనన్నను, పురుగుగా పుట్టవలెనన్నను, తిరిగి మానవజన్మ రావలెనన్నను మానవజన్మ ద్వారమే యంటిరి. ఈ జన్మమున పుణ్యము చేసిన స్వర్గము లభించును. పాపము చేసిన పశువు, పక్షియున్నగు జన్మలు కలుగును. నివృత్తి మోక్షము ప్రసాదించును. లోకమున స్త్రీ పురుషులు కర్మలు చేయుచున్నారు. వారు సుఖదుఃఖములకు లోనగుచున్నారు. సుఖదుఃఖములు వదుల్చుకొనదలచినాను. కర్మలు మానుకున్నాను. సర్వక్రియలు వర్జించిన సుఖస్వరూపము సహజముగా ప్రకాశించును. కోరికనుండి భోగములు జనించును. అది తెలుసుకున్నాను. ప్రారబ్ధము అనుభవించుచున్నాను. ఏ ఉద్యోగము చేయుటలేదు. ఆత్మలోనే సుఖమున్నది. అది ఎరుగరు మనిషి దేహమువేరు-ఆత్మవేరు అనుకొనును. అందువలననే సంసార చక్రమున చిక్కుకొనుచున్నారు. నీటి మీద నాచుకప్పి ఉండును. అది గ్రహించలేరు మనిషి. నాచును మాత్రము చూచును. లోన నీరున్నదని గ్రహించరు. నీటికై ఎండమావులవెంట పరిగెత్తును. సుఖమును కోరువ్యక్తి ఆత్మస్వరూపమును ఎరుగడు. ఎండ మావులను నీరని భ్రమించి తిరిగినట్లు, అన్యత్ర పరిభ్రమించును. శరీరము ప్రారబ్ధమునకు లోబడి ఉండును. దీనితో సుఖములు పొందుట వృథా ప్రయాసము. దేహముతో చేసిన కర్మలు కొరగానివి.

మనిషిని దుఃఖము వదలదు. కష్టములు కలిగించుచుండును. మరణము వెంటాడుచుండును. అట్లయిన చెమటోడ్చనేల ? ధనార్జన చేయనేల ? భోగములు అనుభవించనేల ? లోభులు, ఇంద్రియ దాసులు, ధనవంతులు పడుచున్నపాట్లు కనులార చూచుచున్నాను. వారికి శంక ఎక్కువ. కంటికి నిద్రరాదు. వారికి అనుమానము మెండు. ఎవరిని నమ్మరు. ధనమనిన వారికి ప్రాణము ధనము పోయిన ప్రాణము పోయినట్లు విలవిలలాడుదురు. రాజులన్నను, దొంగలన్నను హడలి చత్తురు. యాచకులను చూచిన దాగుకొందురు. పశువులను, పక్షులనే కాదు తమనీడను చూచి జడుసుకొందురు.

శోకము, మోహము, భయము, క్రోధము, ఆసక్తి, కాతరత, శ్రమ వీటన్నింటికి ధనమే కారణము. కావున బుద్ధిమంతుడు ధన పిశాచమునకు దూరముగా ఉండును.

అజగరము, తేనెటీగ ఈ రెండు నాకు గురువులు. వైరాగ్యము, సంతృప్తి ఈ రెంటి దగ్గర నేర్చుకున్నాను.

తేనెటీగ పూవు పూవు తిరుగుతుంది. తేనె కూడబెట్టుతుంది. ఎవడో వచ్చును. తేనెటీగను చంపును. తేనెను కాజేయును. ధనమును కూడబెట్టినవాడు తేనెటీగవంటివాడు. తాను కష్టపడును. ధనమును ఆర్జించును. కూడబెట్టును. అనుభవించడు. ఎవడో వచ్చును. అతనిని హతమార్చును. ధనమును కాజేయును. అది చూచినాను. నాకు అవగతము అయినది. వైరాగ్యము అవలంబించినాను.

అజగరము కదలదు. మెదలదు. పడియుండును. నోటిదగ్గరికి వచ్చినదానిని మాత్రము తినును. తిండికై తిరగదు. దొరికినదానితో తృప్తి చెందును. దొరకకున్న ఉపవసించును. ధైర్యము వదలదు. తృప్తిని వీడదు. నేను అట్లే చేయుచున్నాను.

నాకు దొరికినదిచాలు. దానితో తృప్తిచెందుదును. దొరకనిచో విచారించను. రసవంతములు, నీరసములు నాకు సమానములు. శ్రద్ధతో పెట్టినను తిరస్కరించి పెట్టినను నాకు భేదభావములేదు. పట్టుబట్ట, నారగుడ్డ, నూలుబట్ట, లేడితోలు అన్నినాకు సమానములు వేటినైనను కట్టగలను. నేలమీద రాతిమీద గడ్డిమీద, ఆకులమీద, బూడిదలోన. మంచముమీద, ఎచ్చటనైనను సమానముగా నిద్రించగలను. ఒకప్పుడు స్నానము చేయుదును. మరొకప్పుడు చేయను. ఒకప్పుడు అలంకరించుకొందును. ఒకప్పుడు బూడిదరాచుకొందును. ఒకప్పుడు రథములపై తిరుగుదును. మరొకప్పుడు దిసమొలతో పిశాచమువలె పరిభ్రమింతును. లోకులు భిన్న స్వభావము గలవారు. అది నాకు తెలియును. అందువలన ఎవరిని నిందించను. పొగడను. సర్వప్రాణుల శ్రేయస్సు కోరుదును. భగవంతునిలో సర్వమును దర్శింతును. అతనిలో ఏకాత్మత్వము కాంక్షింతును.

తత్త్వదర్శి అయినవాడు జాతిరూప వికల భేదమును గ్రహించవలెను.. చిత్తమును మనసునందు లీనముచేయవలెను. మనసును అహంకారతత్త్వమున లీనము చేయవలెను. అహంకారతత్త్వమును మహత్తత్త్వమున లీనము చేయవలెను. మహత్తత్త్వమును మాయలో లీనము చేయవలెను. మాయను ఆత్మానుభూతిలో లీనము చేయవలెను. నిశ్చేష్టుడు కావలెను. ఆత్మానుభవమున నిష్క్రియుడు కావలెను.

"ప్రహ్లాదా ! ఇదినా ఆత్మ కథ. రహస్యమైనది. లోకవిరుద్ధముగా కనిపించును. శాస్త్రవిరుద్ధముగను కనిపించును. నీవు పరమ భాగవతుడవు. అందువలన నీకు వివరించినాను.

ప్రహ్లాదుడు మహాముని వద్ద పరమహంస ధర్మములు విన్నాడు. అతనిని పూజించినాడు. శలవు తీసుకున్నాడు. వెళ్ళిపోయినాడు.

మానవ ధర్మములు.

బ్రాహ్మణులలో కొందరు కర్మనిష్ఠులు, కొందరు తపోనిష్ఠులు, కొందరు వేదాధ్యయన పరులు, కొందరు అధ్యాపననిష్ఠులు, కొందరు జ్ఞానయోగులు, గృహస్థులు హవ్యకవ్యములు జ్ఞానయోగులకు ఇచ్చుట శ్రేష్ఠము. అట్టివారు లభించకున్న ఇతరులకు ఇవ్వవచ్చును. దేవకార్యమున ఇద్దరు బ్రాహ్మణులకు భోజనము పెట్టవలెను. పితృ కార్యమునందు ముగ్గురు బ్రాహ్మణులకు భోజనము పెట్టవలెను. అట్లు కాకున్న ఉభయ కార్యములందును ఒక్కొక్క బ్రాహ్మణుడికి భోజనము పెట్టవలెను. అంతకంటె ఎక్కువమందికి భోజనము పెట్టరాదు. ఎక్కువమందికి విస్తరించుటవలన శ్రద్ధ, పాత్రలు, పూజలు, సరిగా లభించవు. పదార్థములు సరిగా కుదురుకొనవలెను. అప్పుడు ఋషులకు తగిన పవిత్రాన్నము సిద్ధము చేయవలెను దానిని భగవంతునకు అర్పించవలెను. అప్పుడు అర్హులైనవారికి పెట్టవలెను. అప్పుడు అక్షయములైన ఫలములు లభించును. అన్నమును, దేవతలకు, ఋషులకు, పితరులకు, ఇతర భూతములకు విభజించవలెను. అందరిని భగవత్స్వరూపులుగా విభజించవలెను.

తద్దినమునాడు చేపలు, మాంసము వండరాదు. పెట్టరాదు. తాను తినరాదు. పితృదేవతలు హింసాపూర్వకమయిన అన్నమున తృప్తిచెందరు. వారికి సాధు భోజనము. హవిష్యాన్నము ఇష్టము. దానితోనే వారు తృప్తి చెందుదురు.
హింసచెడ్డది. అది అందరకు అనిష్టము. ఏ ప్రాణికిని కష్టము కలిగించకుండుట ధర్మము. అహింస ధర్మపరుల పరమ కర్తవ్యము. యజ్ఞతత్త్వము తెలిసినవారు పశుహింస చేయరు. సహింసమైన యజ్ఞములను చూచి పశువులు జీవరాసులు భయపడును. అందువలన జ్ఞాని అయినవాడు జ్ఞానాగ్నిలో కర్మలను ఆహుతి చేయును. జ్ఞాన యజ్ఞమును చేయును. ధర్మపరుడయినవాడు నీవారాన్నముతోనే నిత్యనైమిత్తికములు జరుపుకొనును.

స్వధర్మము కానివి అయిదు. ఒకటి విధర్మము. ధర్మబుద్ధితో చేసినను స్వధర్మమునకు విఘ్నము కలిగించునది విధర్మము. రెండు పరధర్మము. ఒకనికి నిర్దేశమయిన కర్మ మరొకనికి పరధర్మము అగును. మూడు ఉపధర్మము. పాషండము, దాంభి

కము ఆపద్ధర్మము. నాలుగు ఆభాసము. ఆశ్రమ విరుద్ధమయిన ధర్మము ఆభాసము. అయిదవది ఛలము. శాస్త్రములకు విపరీతార్థములు చెప్పి, వానిని ధర్మము అనుట ఛలము, పరధర్మమున బ్రతుకుట కంటె స్వధర్మమున చచ్చుట మేలు.

స్వధర్మే నిధనం శ్రేయః పరధర్మో భయావహః

జీవికకొరకును, ధర్మమునకును ధనమును ఆర్జించరాదు. ఎట్టి ప్రయత్నము లేకున్నను అజగరము పొట్టనింపుకొను చున్నది. ధర్మపరుడు కోరికలను విసర్జించవలెను. అప్రయత్నముగా దొరికినదానితో సంతుష్టి చెందవలెను. అట్లు అతడు సుఖించును. కాని కోరికలతో చచ్చు లోభి సుఖింపడు.

> చెప్పులు ఉన్నవారికి ముళ్ళబాధ ఉండదు. నిత్య సంతుష్టి చెప్పుల వంటిది. అది అన్ని బాధల నుండి కాపాడును. నిత్య సంతుష్టుడు సుఖించును.

నిత్య సంతోషి లోకపు సంతోషము కోరును. అతడు నిరాహారి అయినను సుఖించగలడు. అన్యుల సుఖమున తన సుఖమును చూచుకొనగలడు.

> నాలుక దురద చాల చెడ్డది. దానికి లొంగినవాడు కుక్కకన్న హీనుడు. అతడు ధనము కొరకై నానాయాతనల పడును. నానా గడ్డికరచును ఇంద్రియములకు దాసుడు అగును. అతడు బ్రాహ్మణుడు అయినను విద్య, యశస్సు, జ్ఞానము అన్నియు మంట కలియును.
>
> హత్యచేసిన తరువాత క్రోధము చల్లారును. ప్రపంచమంతటిని జయించినను నాలుకకు తృప్తి లేదు.
>
> లోకములన్నింటి సందేహముల తీర్చగల సమర్థులయిన పండితులు ఉందురు. వారు అసంతృప్తివలన అధఃపతితుల అగుదురు.

కోరికలు మానుకొనవలె. కామమును జయించవలె. కామమును జయించి క్రోధమును జయించవలె. అర్థము, అనర్థము గ్రహించవలె. లోభమును జయించవలె. తత్వమును తెలిసికొనవలె. భయమును జయించవలె. ఆత్మ, అనాత్మ విచారము చేయవలె. శోక మోహములను జయించవలె. సాధుజనులను సేవించవలె. దంభమును జయించవలె. మౌనము వహించవలె. యోగవిఘ్నములను జయించవలె. దేహాభిమానము విడువవలె. హింసను జయించవలె. దయ వహించవలె. సమాధిని గ్రహించవలె. అధి భౌతిక దుఃఖముల జయించవలె. యోగబలము సాధించవలె. ఆధ్యాత్మిక దుఃఖములు జయించవలె. సాత్వికాహారము స్వీకరించ

వలె నిద్రను జయించవలె. సత్త్వ గుణమును పెంచవలె. రజస్తమోగుణములను జయించవలె. ఔదాసీన్యము అభ్యసించవలె. సత్త్వగుణమును జయించవలె. గురుభక్తి అన్నింటిని సాధించగలదు. దానితో అన్నింటిని అనాయాసముగ జయించవచ్చును.

జ్ఞానదీపమును వెలిగించువాడు గురువు. అతడు ప్రత్యక్షదైవము. గురువును మనిషిగా భావించరాదు. అట్లుభావించిన గజస్నానమువలె చదువంతయు వ్యర్థమగును. భగవంతుడే గురుదేవుడై అవతరించును. అతనిని మనిషిగా భావించుట భ్రమ.

కామ, క్రోధ, మోహ, లోభ, మద, మాత్సర్యములు అను ఆరు అరిషడ్వర్గములు. అరిషడ్వర్గములను జయించమని సర్వశాస్త్రములు ఏకగ్రీవముగ ఘోషించుచున్నవి. అట్లు జయించినవారైనను శ్రీహరి చింతనలేక తరించరు. అతని ప్రయాస సాంతము వ్యర్థమగును. వ్యవసాయము వ్యాపారము మోక్షమును సాధించలేవు.

చిత్తమును స్వాధీనమున ఉంచుకొనవలెనన్న సంగహీనుడుకావలె ఆసక్తులు త్యజించవలె. సన్న్యాసము స్వీకరించవలె. ఒంటరిగా ఉండవలె, భిక్షమెత్తుకొనవలె, అల్పముగా భుజించవలె. నేలమీద పరుండవలె. స్థిరాసనుడుకావలె. ప్రణవమును జపించవలె. నాసికాగ్రమున దృష్టినిలుపవలె. పూరక రేచకములు చేయవలె. ప్రాణమును అపానమును నిలుపవలె. ప్రాణాయామము చేయవలె. మనసు కోరికలనుండి మరలువరకు ముక్కు చివర చూపు నిలుపవలెను. చిత్తము కామమువలన గాయపడును. అది భ్రమింపసాగును. దానివెంట పడవలె. దానిని మళ్ళించవలె. చిత్తమును హృదయమున బంధించవలె. అట్లు సాధన చేయవలెను. పుడకలు లేకున్న అగ్గి ఆరిపోవును. కోరికలు లేకున్న మనసు శాంతించును. కామవాసనలు కాటు వేయుట మానును. వృత్తులు ఉపశమించును. చిత్తము మహానందమున మునకలు వేయును. సన్న్యాసము అవలంబించినవాడు. తిరిగి గృహస్థాశ్రమము స్వీకరింపరాదు. అట్లు చేసినవాడు నీచుడు. కక్కిన కూడు తిన్న కుక్కవంటివాడు. సన్న్యాసి శరీరము ఆత్మకాదని గ్రహించినాడు. దీనికి చావు తప్పదని తెలుసుకొన్నాడు. ఇది పురుగుల పాలయి నశించవలసినదేనని గ్రహించినాడు. అతడే మరల ఆత్మను శరీరము అనుకున్న ఏమనవలె ? మూఢుడనవలె. నీచుడనవలె. అధముడనవలె.

బ్రహ్మచారి స్త్రీలవెంటపడిన, గృహస్థు కర్మలు మానిన, వానప్రస్థుడు గ్రామమున వసించిన, సన్యాసి ఇంద్రియములకు లోనైన అయిన వారిని ఆశ్రమాదముల క్రింద లెక్కకట్టవలెను. వాళ్లు ఆశ్రమములకు మచ్చలు. మాయలో పడినవాళ్లు, మతిలేనివారలు. వారిని ఉపేక్షించవలెను.

శరీరము రథము. ఇంద్రియములు గుర్రములు. మనసు పగ్గము. శబ్దాది విషయములు దారి. బుద్ధి సారథి. చిత్తము మహాబంధము. ప్రాణము, అపానము, వ్యానము, ఉదానము, సమానము, నాగము, కూర్మము, క్రుకరము, దేవదత్తము, ధనంజయము అను పది ఇరుసులు. ధర్మము, అధర్మము చక్రములు జీవుడు, రథికుడు. ఓంకారము అతని ధనుస్సు. జీవాత్మ బాణము. పరమాత్మ లక్ష్యము. రాగము, ద్వేషము, లోభము, మోహము, శోకము, భయము, మదము, మానము, అవమానము, అసూయ, మాయ, హింస, మచ్చరము, అభినివేశము, అనవధానత, ఆకలి, నిద్ర ఇవన్నియు శత్రువులు

ఈ శరీర రథమును స్వాధీనమున ఉంచుకొనవలె. అందుకు గురుదేవుని పూజించవలె. జ్ఞాన ఖడ్గమునకు సాన పెట్టవలె. దానిని పట్టవలె. శ్రీహరిని స్మరించవలె. అతని సాయమున కదలవలె. రథికుడు శత్రువులను సంహరించవలె. విజయము సాధించవలె. రాజ్యము స్వంతము చేసికొనవలె. అప్పుడు రథము దిగవలె. శాంతుడు కావలె. రథికుడు రవంత పొరపడరాదు. ప్రమత్తుడు కారాదు. ఇంద్రియములను గుర్రములు దుడుకువి. ప్రమత్తుడయిన పెడదారి పట్టించును. విషయవాసనలు బందిపోట్లు. వారు రథమును దోచుకుందురు. రథమును సంసారమను పాడు గోతిలో పడవేతురు.

వైదిక కర్మలు రెండు రకములు. ఒకటి ప్రవృత్తము. ప్రవృత్తి కర్మలవలన పునర్జన్మ కలుగును రెండవది నివృత్తము. నివృత్తి కర్మలవలన మోక్షము లభించును.

కొన్ని ఇష్ట కర్మలున్నవి. అవి హింసతో కూడిన శ్యేనయాగాది కర్మములు, కోరికలతో కూడిన అగ్నిహోత్రాది కర్మములు. పూర్ణమాసములు. చాతుర్మాస్యములు. పశు యజ్ఞములు. సోమయజ్ఞములు. వైశ్వదేవము. బలిహరణము మున్నగునవి.

పూర్తికర్మములు కొన్ని ఉన్నవి. దేవాలయములు కట్టించుట, తోటలు వేయుట, చెఱువులు త్రవ్వించుట, ఇవి పూర్తికర్మలు.

ఇష్టకర్మలు, పూర్తికర్మలు, ప్రవృత్తి కర్మలు అనబడును. ఇవి కోరికలతో కూడినవి కావున అశాంతి కలిగించును.

ప్రవృత్తకర్మములు చేసినవాడు చావుకు ఎర అగును. చనిపోయి పురోడాశము మున్నగు ద్రవ్యముల సూక్ష్మరూపము ధరించును. ధూమాభిమానులు దేవతలు. సూక్ష్మరూపమున అతడు దేవతల దగ్గరికి చేరును. క్రమమున రాత్రి కృష్ణ పక్షము, దక్షిణాయనము, అభిమాన దేవతల వద్దకు చేరును. అటనుండి చంద్ర లోకమునకు ఏగును. అచట ఆర్జించిన భోగములు పూర్తియగును. అప్పుడు కృష్ణపక్ష చంద్రునివలె క్షీణించసాగును. అతడు వర్షము ద్వారమున, ఓషధుల రూపమున, అన్నరూపమున, వీర్య రూపమున పరిణామము పొందును. తిరిగి ప్రవృత్తి కర్మమార్గమున లోకమున జన్మించును.

నివృత్తిపరాయణులు జ్ఞానదీప్తులు. వారు జ్ఞానాగ్నిలో కర్మలను ఆహుతి చేయుదురు. ఇంద్రియములను మనసులో లీనము చేయుదురు. మనస్సు సంకల్ప మూలము. మనస్సును వాక్కులో లీనము చేయుదురు. వాక్కు విద్యాలక్షణము కలది. వాక్కును ఓంకారమున లీనము చేయుదురు. ఓంకారము అకార ఉకార మకారాత్మకమైనది. ఓంకారమును బిందువులో లీనము చేయుదురు. బిందువును నాదమున లీనము చేయుదురు. నాదమును ప్రాణమున లీనము చేయుదురు. ప్రాణము సూత్రాత్మకమైనది. ప్రాణమును పరబ్రహ్మమున లీనము చేయుదురు. నివృత్తిపరాయణులు అగ్నిని చేరుకుందురు. తరువాత సూర్యుని చేరుదురు. తదనంతరము దినమును చేరుదురు. అనంతరము పూర్వాహ్ణమును చేరుదురు. తదుపరి శుక్ల పక్షమును చేరుదురు. ఆ తరువాత పూర్ణిమను చేరుదురు. తదుపరి ఉత్తరాయణమును చేరుదురు. చివరగా వారి అభిమాన దేవతలను చేరుకొని బ్రహ్మలోకమును చేరుకొందురు. అక్కడ వారి భోగములు ముగించుకొందురు. సూక్ష్మ ఉపాధులను కారణమున లీనము చేయుదురు. అప్పుడు ప్రాజ్ఞరూపము ధరింతురు. ఆపైన తురీయరూపము ధరింతురు. అంతమున విశుద్ధాత్మలో కలిసి పోవుదురు. దానినే మోక్షము అందురు. "దేవయానము" అనియు అందురు. ఇట్లు ముక్తిపొందిన వారు జననమరణముల సంసార చక్రమునకు తిరిగిరారు.

వేదములందు రెండు మార్గములు చెప్పబడియున్నవి. ఒకటి పితృయానము. రెండవది దేవయానము. శాస్త్రదృష్టిగలవారు వీటి తత్త్వమును ఎరుగుదురు. వారు సహితము దేహమును ధరించుచుందురు. అయినను మోహమునకు లోనుకారు.

బింబము సత్యము. ప్రతిబింబము అసత్యము ఇది ఎల్లరు ఎరిగినదే. అయినను ప్రతిబింబము సత్యమువలె కనిపించును. అట్లే ఇంద్రియములకు కనిపించు విషయములు అసత్యములు. అయినను అవి సత్యమువలె కనిపించును. వాటిని సత్యములనుకున్నవారు ప్రతిబింబమును సత్యము అనుకొనుఅజ్ఞాని మాత్రమే.

పంచభూతముల ఛాయా స్వరూపము దేహము. అట్లని అది వాని సంఘాతము కాదు. వికారముకాదు. పరిణామముకాదు. అది వానికి భిన్నమైనదికాదు. అన్వగతమైనదికాదు. అందువలన అది అసత్యమైనది. దేహమునకు కారణభూతములు పంచభూతములు. అవి అవయవములకు ద్రవ్యములు అగుచున్నవి. అంత మాత్రమున అవి సూక్ష్మరూపములకు భిన్నములుకావు. పరికించి చూచిన అవయవి రూపము అస్తిత్వము కాన్పించదు. అవయవి రూపములకే అస్తిత్వములేదని నిరూపితమైనది. ఇక అవయవములకు స్థిరత్వమేదిది? అందువలన అవి అసత్యములు.

పరమాత్మ స్వరూపమునకు భేదములేదు. కాని అవిద్య ఉన్నంతవరకు భేదము కనిపించును. ఇది భ్రాంతి మాత్రమే. అవిద్య నశించిన ఈ భ్రాంతి నశించును. ఈ భ్రాంతి ఉన్నంతకాలము శాస్త్రములు విధినిషేధములు బోధించుచుండును.

అద్వైతము మూడు విధములు. ఒకటి భావాద్వైతము. రెండవది క్రియాద్వైతము. మూడవది ద్రవ్యాద్వైతము. నూలును బట్టయు రెండును ఒకటియే. అట్లే కార్యకారణములు రెండును ఒకటియే. ఈ రెంటికి భేదములేదని ఎరుంగుట భావాద్వైతము. మనస్సు, వాక్కు, కాయము ఇవి త్రికరణములు. త్రికరణములతో చేయు పనులన్నియు పరబ్రహ్మవే అని భావించి, పరబ్రహ్మకు సమర్పించుట క్రియాద్వైతము. భార్యపుత్రులు, బంధువులు, సర్వప్రాణులును ఒకటియే. తనకును వాటికిని భేదములేదని భావించుట ద్రవ్యాద్వైతము. నేర్పున నాత్మతత్త్వము తవంబున నద్వైతత్రయంబును విలోకించి వస్తుభేద బుద్ధియు గర్మభేద బుద్ధియు స్వకీయ పరకీయ బుద్ధియు స్వప్నంబులుగా దలంచి మునియైన వాడు మానవలయు.

వారములు వేయునేటికి, వేదోక్త విధింజరించు విబుధుఁడు గృహమం
దాదరమున నారాయణ పాదంబులు గొలిచి ముక్తిపదమున కేఁగున్.

భూపాలోత్తమ మీరు భక్తిగరిమస్ఫూర్తిన్ సగోత్రజుల
శ్రీపాదాంబుజ యుగ్మము న్నియతులై సేవించి కాదే మహో
గ్రావత్సంఘములోన ఒక్కొక సమస్తారాంత నిర్జేతలై
యేపారంగ మఖంబు సేసితిరి దేవేంద్ర ప్రభావంబునన్.

నారదుని పూర్వజన్మ.

ధర్మరాజా ! నా పూర్వజన్మ వృత్తాంతము చెప్పుదును వినుము :-

నా పూర్వజన్మమున నేను గంధర్వుడను. నా పేరు బర్హణుడు. గంధర్వులలో గొప్పవాడను. నేను అందగాడను. మన్మథుని పోలినవాడను. ఆడవారు నేనని పడి చచ్చెడివారు. నాకది గర్వము. కన్ను మిన్ను కానవచ్చునదికాదు.

ఒకసారి దేవతలు సత్రయాగము చేసినారు. యాగమున హరికీర్తన చేయవలసి యుండెను. అందుకు గంధర్వులను, అప్సరసలను ఆహ్వానించినారు. నేనును వెళ్లినాను. చెప్పితిని గదా నాకు గర్వము మెండని. అప్సరసలతో కలిసి ఆడుచు, పాడుచు వెళ్లినాను. నిర్లక్ష్యముగా వెళ్లినాను. ప్రజాపతులు నా నిర్లక్ష్యమును చూసినారు. కోపించినారు. శపించినారు. సిరిసంపదలేని శూద్రుడవై జన్మించమన్నారు. ఆ శాపమున దాసీ పుత్రుడనయి జన్మించినాను. కాని నాకు బ్రహ్మవాదుల సాంగత్యము లభించినది. అందువలన మరుసటి జన్మమున బ్రహ్మపుత్రుడనయి పుట్టినాను. (తరువాతి కథ ప్రథమస్కంధమున నారదుని కథ, శీర్షికన చూడగలరు)

ధర్మజా ! గృహస్థుడు మోక్షము పొందుటకు అవసరమయిన ధర్మములను విశదముగా చెప్పినాను.

అఖిలాధారుఁడు జాది దుర్లభుఁడు బ్రహ్మంబైన విష్ణుండు నీ
సుఖమందర్చితుఁడై నివాసగతుఁడై మర్త్యాకృతిన్ సేవ్యుఁడై
సఖుఁడై చారకుఁడై మనోదయితుఁడై సంబంధియై మంత్రియై
సుఖదుండయ్యె భవన్మహో మహిమఁదాఁ జోద్యంబు ధాత్రీశ్వరా !

అని యిట్లు నారదుండు చెప్పిన వృత్తాంతం బంతయు విని ధర్మనందనుండు ప్రేమ విహ్వలుండై వాసుదేవునిం బూజించె వాసుదేవ ధర్మనందనులచేత బూజితుండై నారదమునియు దేవమార్గంబునం జనియెనని శుకయోగీంద్రుండు పాండవ పౌత్త్రునకుం జెప్పెనని సూతుండు శౌనకాదులకుం జెప్పె.

శ్రీమాన్ లక్ష్మణాచార్య బుచ్చమాంబా పౌత్రుడు వేంకటాచార్య వేంకటాంబా
పుత్రుడు దాశరథి రంగాచార్య రచించిన వచన శ్రీ మద్భాగవతమున.

సప్తమస్కంధము

శ్రీమద్భాగవతము

అష్టమ స్కంధము

గజేంద్ర మోక్షము.

పాల సముద్రమున త్రికూటము అను పర్వతము గలదు. దాని ఎత్తు పదియోజనములు. వెడల్పు పదియోజనములు. పొడవు పదియోజనములు. దానికి మూడు శిఖరములు కలవు ఒకటి బంగారపుది. రెండవది వెండిది. మూడవది ఇనుపది. రత్నములతోను, ధాతువులతోను విరాజిల్లు మరెన్నో శిఖరములు కలవు. ఆ పర్వతము సముద్రము, ఆకాశము, దిక్కులను మిరుమిట్లు గొల్పు చేయును. ఆ పర్వతమునందు వివిధ వృక్షములు, లతలు, నికుంజములు కలవు పాలసముద్రము తన కెరటములతో ఆ పర్వతము చుట్టును పాదములుకడుగుచు అక్కడిమరకత మయమయిన నేలనంతను పచ్చిక బయలుగా చేసినది. ఆ పర్వత గుహలందు సిద్ధులు, చారణులు, గంధర్వులు, విద్యాధరులు, మహానాగులు, కిన్నరులు, కింపురుషులు, అప్సరసలు క్రీడించుచుందురు. వారి సంగీతము ఆ గుహలందు ప్రతిధ్వనించగా వానిని సింహనాదములని ఎంచి ఖరసింహములు ఎదురు బొబ్బలిడు చుండును. ఆ పర్వతము వివిధములైన అరణ్యములచే శోభించుచుండును. అచ్చట చిత్రవిచిత్రములైన దేవతావనములు కలవు. వానిలో వివిధ పక్షులు కమ్మగా గానము చేయును. అచ్చట ఎన్నియో నదులు, సరోవరములు స్ఫటికము వంటి నీటితో నిర్మలముగా ఉండును వాటితీరములు రత్నము అను ఇసుకతో తళతళలాడుచుండును. ఆ నదులందును, సరస్సులందును దేవతాస్త్రీలు స్నానములాడుచుందురు. అందువలన ఆ నీరు పరిమళము గలిగి ఉండును. అక్కడి గాడ్పులు ఆ పరిమళములను మోసుకొని బయలుదేరును. ఆ పర్వతపు లోయలో వరుణదేవుని ఉద్యానవనము - ఋతుమంతము కలదు. అది దేవతాస్త్రీలకు క్రీడాస్థలము.

ఆ వనమున మందారములు, పారిజాతములు, కలిగొట్టు చెట్లు, అశోకములు, సంపంగులు, మొగళ్లు, పనసలు, మామిళ్లు, అంకోలములు, గంగరేగులు, కొబ్బరి, ఖర్జూర, మాదీఫలవృక్షములు, ఇప్పలు, మద్దులు, తాళ్లు, కానుగులు,

తేగిసలు, తెల్లమద్దులు, కుంకుళ్లు, బొప్పచెట్లు, రావిచెట్లు, మఱ్ఱి, మోదుగు, చందనపుచెట్లు, మంగు ఎఱ్ఱకాంచనము, సరళ, దేవదారు, చెరుకు, అరటి, నేరేడు, రేగు, రుద్రాక్ష, కరక్కాయ, ఉసిరిక, మారేడు, వెలగ, నిమ్మ, టేకిచెట్లు మొదలగు మరెన్నో వృక్షములు కలవు. పుష్పములతోను, ఫలములతోను ఆ వనము అద్భుతముగా ఉండును.

ఆ వనముమధ్య పెద్దసరస్సుకలదు. అందు బంగారు, ఎరుపు రంగులలో శతపత్రి పద్మములు కలవు. నల్లకలువలు ఎఱ్ఱకలువలు కలిగి ఎంతో అందముగా ఉండును. తుమ్మెదలు గానము చేయుచుండును. హంసలు, చక్రవాకములు, బెగ్గురు పక్షులు, నీటి కోళ్ళు, గుడ్డి కొక్కెరలు, వానకోకిలలు మున్నగు వివిధపక్షులు మధురముగా కూయుచుండును. నీళ్ళలో తాబేళ్ళు మున్నగు జలచరములు కదలాడుచుండును. ఆ కదలికకు పుప్పొడి రాలుటవలన నీరు చిత్రముగా నుండును. ఆ సరోవరపు గట్టులమీద కడప, ప్రేంకణ, కడిమి, వెమ్మి, గోరంట, అశోక, దిరిసెన, గిరి మల్లిక, గార, కుట్జవట, వృక్షములు క్రిక్కిస, మొల్ల, సురపొన్న, పున్నాగ, జాజి, మల్లెపొదలు, శతపత్రమాధవీలతలు అన్ని ఋతువులందును పూగ బూయుచు ఆ ఉద్యానమునకు వింతశోభను కలిగించుచుండును.

త్రికూటముపై ఒక గజరాజము ఉండెడిది. అది వేసవి ఎండకు అలసి తనమందతో విహారమునకు బయలు దేరినది. ముళ్ళవెదురు పొదలు, పేముతుప్పలు, చెట్లు చేమలు విరిచివేయుచు, త్రొక్కివేయుచు బయలుదేరినది. దాని మదపు వాసన పసికట్టి, దాని ఔద్ధత్యమునకు వెరచి మదపు ఏనుగులు, సింహములు, పెద్దపులులు, ఖడ్గమృగములు, మహాసర్పములు పారిపోయినవి. నల్లచారల దుప్పులు, శరభ మృగములు, చమరీ మృగములు, నక్కలు, అడవి పందులు, పోతులు, ఎలుగుబంట్లు, ఏదు పందులు, గోవృచ్ఛనులు, కుక్కలు, కోతులు చెల్లాచెదురై పారిపోయినవి. లేళ్ళు, కుందేళ్ళవంటి సాధుజంతువులు గజరాజు కరుణతో భయములేక తిరుగుచుండెను.

ఆ గజరాజువెంట అతని భార్యలు, బిడ్డలు పరివారము ఉండెను. అది అడుగు వేసిన త్రికూటము వణకుచుండెను. గండస్థలమునుండి జాఱు మదధారలకొరకు తుమ్మెదలు బారులు కట్టినవి. దాని నేత్రములు సగము మూయబడి ఉండెను.

అది ఎండకాలము. ఎండవేడికి తాళలేకపోయినదా గజరాజము. గజరాజేశ్వరుడు అతని పరివారమంతయు దప్పికి తల్లడిల్లుచుండెను. ఎదుటినుండి వచ్చుగాలి

పరిమళమును మోసుకొని చల్లని పిల్లగాలి వీచినది. అదిచూచి ఋతుమంతము నందలి వరుణ సరస్సువైపు నడచినదా గజరాజము. సరోవరము చేరినది. పరివారము దానిని అనుసరించినది.

సరోవరము నందలి నీరు స్ఫటికమువలె నిర్మలముగను. అమృతమువలె మధురముగను, బంగారువర్ణముల పుష్పాడిపడి ఘుమఘుమలాడుచు ఉన్నది. గజరాజము సరస్సులోనికి దిగినది. తొండమున నీరు త్రాగినది. ఒంటిపై చల్లుకొని సేదతీరినది.

భార్యాపుత్రులన్న గజరాజునకు కడుమోహము అది గృహస్థు. తన తొండమున నీరుతీసి భార్యలకు, పుత్రులకు త్రాగించినది. వారికి స్నానములు చేయించినది. రానున్నఆపదను కానలేకపోయినది. సరస్సులోనికిదిగి నీళ్ళలో స్వేచ్ఛగా విహరించినది.

ఆ సరస్సున ఒక మొసలి ఉండెడిది. విధిప్రేరణవలన క్రోధమునవచ్చి గజరాజము కాలుపట్టుకున్నది. గజరాజము అకస్మాత్తుగా ఆపదల పాలైనది. ఆ మొసలి తనబలమున విక్రమించినది. మొసలి తనబలమునంతను కేంద్రీకరించి ఈడ్చినది. గజరాజు భార్యలును అతని పరివారమును గజరాజును ఆపదనుండి తప్పించలేక పోయినవి. ఊరక దుఃఖించసాగినవి. ఆవిధముగా మొసలి లోపలికి ఈడ్వగా, గజము బయటికి ఈడ్వసాగినది.

అట్లు ఘోరమైనపోరుసాగినది. ఆపోరు వేయేండ్లు కొనసాగినది. అన్ని సంవత్సరములు బ్రతికి పోరాడినందులకు దేవతలు కూడ ఆశ్చర్యపడినారు. వేయేండ్లు మొసలిచే లాగబడినది గజము. క్రమక్రమముగ దాని ఉత్సాహము, శరీర బలము, ఇంద్రియపటుత్వము ఉడుగసాగినవి. మొసలి నీటియందు ఉండునది కాన దానికి బలము, ఆయువు పెరుగుచుండినవి.

ఆవిధమున గజము అకస్మాత్తుగా మొసలివాతబడినది. దానికి ప్రాణసంకటమైనది. మొసలి బారినుండి తప్పుకొను ఉపాయముకానరాదు. ఆ పరిస్థితిలో ఆ గజము ఇట్లు ఆలోచించినది.

ఆపదలో ఉన్న నన్ను ఏనుగులు రక్షించలేక పోయినవి. ఇక వెంటి ఏనుగుల మాట చెప్పనేల? కాలపాశమే మొసలి రూపమున ఈడ్చుచున్నట్లున్నది. దిక్కుపడియు కానరాదు. బ్రహ్మాదులకు ఆశ్రయభూతుడైన ఆ పరమపురుషుని శరణు

జొచ్చెదను. కాలము ప్రచండవేగము గలది. అది మహాసర్పమువంటిది. దానికి వెరచి శరణు కోరినవారిని రక్షించును ఆ ప్రభువు. మృత్యువుసహితము భగవంతుడన్న వెరచును. అట్టి పరమాత్మునే శరణు జొచ్చెదను అని నిశ్చయించినది. మనస్సు చిత్తమున సమాహితము గావించుకొన్నది. పూర్వజన్మయొక్క అభ్యాస బలమున హరినిట్లు ప్రస్తుతించినది.

లావొక్కింతయు లేదు, ధైర్యము విలోలంబయ్యెఁ, బ్రాణంబులున్
ఠావుల్ దప్పెను, మూర్ఛవచ్చెఁ, దనువున్ డస్సెన్, శ్రమంబయ్యెడిన్,
నీవే తప్ప నితఃపరంబెఱుఁగ, మన్నింపన్ దగున్ దీనునిన్,
కావే ఈశ్వర ! కావవే వరద ! సంరక్షింపు భద్రాత్మకా !

వినుదట జీవులమాటలు చనుదట చనరానిచోట్ల శరణార్థుల కో
యనుదట పిలిచిన సర్వము గనుదట సందేహమయ్యెను గరుణావార్ధీ

ఓకమలాక్ష ! యోవరద యోప్రతిపక్ష విపక్షదూర కు
య్యోకవియోగవంద్య సుగుణోత్తమ యోశరణాగతామరా
నోకహ యోమునీశ్వర మనోహర యోవిమలప్రభావ రా
వే కరుణింపవే తలపవే శరణార్థిని నన్నుగావవే'

అని ప్రార్థించి ఈశ్వరుడు ఆపన్నుడనైన నన్నుగాచుగాక ! యని నింగి నిక్కి చూచుచు నిట్టూర్పులు విగిడించుచు బయలు ఆలకించుచు ఆ గజేంద్రము మొర చేయుచున్న సమయమున,

విశ్వమయత లేమి వినియు నూరకయుండి రంబుజాసనాదు లడ్డుపడక
విశ్వమయుఁడు విభుఁడు విష్ణుండు జిష్ణుండు భక్తియుతున కడ్డుపడ దలంచె

అలవైకుంఠపురంబులో నగరిలో నామూలసౌధంబు దా
పల మందార వనాంతరామృత సరఃప్రాంతేందు కాంతోపలో
త్పల పర్యంక రమావినోదియగు నాపన్నప్రసన్నుండు వి
హ్వల నాగేంద్రము పాహి పాహి యన గుయ్యాలించి సంరంభియై.

సిరికిం జెప్పఁడు శంఖచక్రయుగముం జేదోయి సంధింప డే
పరివారంబును జీర డభ్రగపతిం బన్నింప డాకర్ణికాం
తరధమ్మిల్లము చక్కనొత్తఁడు వివాద ప్రోత్థితశ్రీకుచో
పరిచేలాంచలమైన వీడఁడు గజప్రాణావనోత్సాహియై

అతని వెంట లక్ష్మి, లక్ష్మివెంట అంతఃపుర పరివారము, పరివారము వెంట గరుత్మంతుడు, అతనివెనుక ధనస్సు, కౌమోదకి, శంఖ చక్రాది ఆయుధములు, నారదుడు, అతనివెనుక సేనాపతి అతనివెనుక వైకుంఠపురమున గలవారు ఆబాలగోపాలము బయలుదేరినారు.

గోవిందుడు పయ్యెద పట్టి లాగుకొని పోవుచుండగా వెనుక పరుగిడుచు లక్ష్మీదేవి.

'తాను వేంచేయు స్థలము పేర్కొనడు. అనాథలైన స్త్రీజనముల ఆలాపములు విన్నాడో, వేదములను ఖలులైన దొంగలు దొంగిలించినారో, దేవతలనగరములపై రాక్షసులు దండెత్తినారో, భక్తులను పట్టుకొని చక్రియుధుడేడి చూపుడని ధిక్కరించిరో దుర్జనుల్'

అని ఆలోచించి అడిగెదనని కడువడిజను
నడిగిన తను మగుడ నుడువడని నడయుడుగున్

వెడవెడ సిడి ముడి తడబడ నడుగిడు నడుగిడదు జడిమ నడుగిడు నెడలన్

విను వీధిని జనుదెంచు విష్ణువును ఆకాశ మార్గమున పయనించు దేవతలు చూచి వారిలో వారు ఇట్లనుకొన్నారు.

అదిగో చూచినారా! హరి వేంచేయుచున్నాడు. అతని వెంట లక్ష్మిని చూడుడు. అదిగో అదే శంఖనినాదము. అదిగో అది సుదర్శన చక్రము. అల్లదిగో అతడే భుజంగధ్వంసి గరుత్మంతుడు. అనుకొని 'ఓహో స్వామీ! వేంచేయుచున్నావా!' అని ఓంనమో నారాయణాయ, అని నమస్కరించిరి మింట హస్తిదురవ స్థాపక్రికిం జక్రికిన్.

శ్రీహరి, కరుణాసముద్రుడు, శరణాగత రక్షకుడు. తనను శరణు వేడిన గజేంద్రుని రక్షింప వేంచేయుచున్నాడు. దేవతలు చేసిన నమస్కారములను గమనింపలేదు అంగీకరించలేదు. స్వామి పోయిపోయి యవ్వంక ఆకారంబు తోడగనె.

ఆకాశమార్గమున వేంచేయు హరిని చూచినాడు గజరాజు. తొండమున ఒక తామరపూవు పట్టుకొని మీదికెత్తినాడు - శ్రీహరికి సమర్పించగా.

కరుణాసింధుడు శౌరి వారిచరమున్ ఖండింపగా సుదర్శన చక్రమును పంపినాడు. అది నిమిషస్పర్శంబున మకరి తల ద్రుంచినది.



శ్రీ హరి మకరి బారింబడిన కరీంద్రుని గాపాడుట.

పుట. 326

చీకటిని బాసిన చంద్రునివలెను, సంసార దుఃఖము బాసిన విరక్తచిత్తునివలెను గజము మొసలి పట్టునుండి విడివడి కాళ్ళుదులుపుకొని దుఃఖమును బాసి సౌందర్యముతో ఒప్పినది.

శ్రీహరి పాంచజన్యమును పూరించినాడు.

బ్రహ్మ, శివుడు మున్నగు దేవతలు, ఋషులు, శ్రీహరిని కీర్తించినారు. దేవతలు పూలవాన కురిపించినారు. దేవ దుందుభులు మ్రోగినవి. గంధర్వులు గానము చేసినారు. అప్సరసలు నాట్యము లాడినారు.

మొసలి శాపమువదలి పరమాశ్చర్యమైన గంధర్వరూపము ధరించి, చేతులు తలపై మోడ్చి, హరి గుణములను కీర్తించినాడు. భగవానుని అనుగ్రహము పొందినాడు గంధర్వ లోకమునకు వెళ్ళిపోయినాడు.

గజేంద్రుడు హరికర స్పర్శమున అజ్ఞాన బంధముల నుండి ముక్తిపొందినాడు. పీతాంబరము తోడను చతుర్భుజముల తోడను ఒప్పి భగవంతుని సారూప్యము. పొందినాడు.

పూర్వ జన్మ క థ లు.

హూహూ అను పేరుగల గంధర్వుడు ఒకనాడు భార్యలతో కూడిజలక్రీడలాడుచున్నాడు. దేవలముని స్నానమునకుగాను అచ్చటికే వచ్చినాడు. హూహూ నీళ్ళమునిగి వెళ్ళి దేవలుని పాదములు పట్టుకొని లాగినాడు. దేవలుడు మండిపడి 'మొసలివగు'మని శపించినాడు. గంధర్వుడు శాపాంతము అనుగ్రహించవలసిన దని దేవలుని ప్రార్థించినాడు. నీవు గజేంద్రునిపట్టి యీడ్చినపుడు హరి గజేంద్రుని రక్షించును. అపుడు నీకు శాపవిమోచనము కలుగునని శాపాంతము అనుగ్రహించినాడు.

గజేంద్రుడు పూర్వజన్మమున ద్రవిడదేశపురాజు. అతని పేరు ఇంద్రద్యుమ్నుడు. అతడు పాండ్యుడు. విష్ణు వ్రతపరాయణుడు. అతడు మలయాచలమున తన కొరకుగాను ఒక ఆశ్రమము ఏర్పరచుకున్నాడు. జడలు ధరించినాడు.

ఒకనాడు స్నానముచేసి మౌనవ్రతమున హరిని పూజించుచుండెను. ఆ సమయమున అచటకు శిష్యసమేతుడై అగస్త్యుడు వచ్చినాడు. ధ్యానమందున్న ఇంద్రద్యుమ్నుడు అగస్త్యుని గమనించలేదు. తనకు అవమానము చేయవలయు

ననియే ఇంద్రద్యుమ్నుడు మౌనము వహించినా డనుకున్నాడు. అగస్త్యుడు. 'ఏనుగువలె స్తబ్ధుడవై ఉన్నందున గజజన్మ మెత్తుదువుగాక !' అని శపించి వెడలిపోయెను. ఆ ఇంద్రద్యుమ్నుడే మరుసటి జన్మమున గజేంద్రుడై జన్మించెను.

> ఏతన్మహారాజ తవేరితో మయా కృష్ణానుభావో గజరాజమోక్షణమ్
> స్వర్గ్యం యశస్యం కలికల్మషాపహం దుస్స్వప్ననాశం కురువర్య శృణ్వతామ్.

"కౌరవశ్రేష్ఠా ! ఈ గజేంద్ర మోక్షమును శ్రీకృష్ణ ప్రభావము నీకు వినిపించినాను. దీనిని విన్నవారికి స్వర్గము లభించును. కీర్తి కలుగును. ఇది కలిదోషమును నివారించును. దుస్స్వప్న దోషమును తొలగించును." అని శ్రీ శుకుడు పరీక్షిత్తుతో చెప్పినాడు.

దుర్వాసుని శాపము.

దుర్వాసుడు ఒకసారి సంచారమునకు బయలుదేరినాడు. ఒకవిద్యాధరకన్య అతనికి ఒక కల్పపుష్పముల మాలను సమర్పించినది. ఆయన దానిని శిరమున ధరించి సంచరించ సాగినాడు. మార్గమధ్యమున అతనికి ఇంద్రుడు ఎదురైనాడు అతడు ఐరావతముపై ఉన్నాడు. దూర్వాసుడు ఇంద్రుని చూచి పుష్పమాలను ఇంద్రునిపైకి విసిరినాడు. ఇంద్రుడు దానిని తీసుకుని ఐరావతము తలమీద ఉంచినాడు. దాని వాసన పసికట్టినది ఐరావతము. తొండమున పూలదండమును దీసి నేలకుకొట్టినది. కోపిష్టిఅయిన దూర్వాసుడు అదిచూచి ఇట్లు శపించినాడు. "నీ ముల్లోకముల సంపద నాశనమగుగాక !" ఇంద్రుడు దూర్వాసుని బ్రతిమాలినాడు. కాని దూర్వాసుడు అతనిని క్షమించలేదు.

దూర్వాసుని శాపమువలన ఇంద్రునకు ముల్లోకముల సిరి తొలగినది. యజ్ఞయాగాది క్రతువులు నశించినవి. ఇంద్రుడు, వరుణుడు ఎంతయో ఆలోచించినారు. కాని వారికి ఏ ఉపాయమును తోచలేదు. వారందరును కలసి బ్రహ్మ వద్దకు వెళ్ళినారు.

బ్రహ్మ ఇంద్రాదులను చూచినాడు. వారు సిరిసంపద నశించి బలహీనులై ఉన్నారు. లోకములు అమంగళముగ ఉన్నవి. అసురులు సబలులై సిరిసంపదలలో తులతూగుచున్నారు. అది గమనించినాడు బ్రహ్మ. అట్టి ఆపదలనుండి దేవతలను రక్షించుటకు అతనికి సహితము ఎట్టిఉపాయముతోచలేదు. అవ్యయుడు, అనంతుడు

అయిన భగవంతుని ఆశ్రయించవలెనని నిశ్చయించినాడు. దేవతలను తీసుకొని పరమపదమునకు వెళ్ళినాడు.

వారెల్లరు శ్రీహరిని ఇట్లు స్తుతించినారు :—

"దేవా! నీవు నిర్వికారుడవు, సత్యస్వరూపుడవు, అనంతుడవు, ఆది, అంతర్యామివి, తర్కాతీతుడవు, ఉత్తముడవు, పూజ్యుడవు, అశరీరుడవు, సర్వవ్యాపివి, లోకాతీతుడవు, అవ్యక్తుడవు, జ్ఞానస్వరూపుడవు, నీకు మా నమస్కారము. ఋషులు, దేవతలు మున్నగు వారెల్లరు సత్యమయమైన నీ శరీరము నుండియే జన్మించుచున్నారు. నీ నుండి జన్మించి సహితము నిన్ను తెలుసుకొనలేకున్నారు. భూమి నీ పాదములు, నీరు నీ వీర్యము. చంద్రుడు నీ మనస్సు, అగ్ని నీ నోరు, సూర్యుడు నీ నేత్రము, వాయువు నీ ప్రాణము. నీ చెవులనుండి దిక్కులు, హృదయమునుండి దేహగత ఛిద్రములు, వానినుండి ప్రాణము, అపానము, ఉదానము, సమానము, వ్యాన మను అయిదు ప్రాణములు పుట్టినవి. ఈ అయిదు ప్రాణములకు, పది ఇంద్రియములకు ఆశ్రయభూతమై ఆకాశము పుట్టినది.

నీ బలమున ఇంద్రుడు, నీ ప్రసన్నతలో దేవతలు, క్రోధమున రుద్రుడు, నీ బుద్ధిలో బ్రహ్మ, నీ శరీర రంధ్రములనుండి వేదములు, ఋషులు, నీ శిశ్నమున ప్రజాపతి పుట్టినారు. మహా భూతిశాలివి నీవు. ప్రసన్నుడవు కమ్ము!

నీ వక్షమున లక్ష్మి, నీ నీడలో పితృదేవతలు, నీ స్తనములందు ధర్మము, నీ వీపున అధర్మము, నీ శిరస్సున స్వర్గము, నీ విహారమున అప్సరసలు, పుట్టిన నీవు మహా విభూతిశాలివి. ప్రభూ! ప్రసన్నుడవు కమ్ము!

నీ క్రిందిపెదవినుండి లోభము, పైపెదవినుండి ప్రీతి, ముక్కునుండి కాంతి, స్పర్శలో పశుహితకార్యము, కనుబొమలమధ్య యముడు, కనురెప్పలవెంట్రుకలలో కాలము పుట్టిన నీవు మహావిభూతిశాలివి. ప్రసన్నుడవు కమ్ము!

దేవా! నీశరణు వేడుచున్నాము. నీముఖపద్మమును దర్శించ గోరుచున్నాము. అనుగ్రహించుము, దర్శనమిమ్ము."

దేవతల స్తోత్రములు విన్న శ్రీహరి వారిమధ్య ప్రత్యక్షమైనాడు. వేయి సూర్యులు కలిసి ఉదయించినట్లు వెలిగినాడు. దేవతల కళ్లు మిరుమిట్లు గొలిపినవి. వారు విభ్రాంతులైనారు. వారికి భూమి, ఆకాశము, దిక్కులు, చివరకు తమ దేహము సహితము కనిపించలేదు.

బ్రహ్మ, శివుడు మాత్రము శ్రీహరిని దర్శించ గలిగినారు. వారు సాగిలబడి అతనికి మ్రొక్కినారు.

"భగవంతుడా! అగ్నిహోత్రమునుండి విడివడిన అగ్నిరేణువులు ప్రకాశించినట్లు మేమందరము నీ నుండి విడివడి ప్రకాశించుచున్నాము. మా క్షేమమే మాకు తెలియదు. గోవులకు, బ్రాహ్మణులకు, మాకు శుభము కలుగు విధానము మాకు ఉపదేశించుము!" అని బ్రహ్మ ప్రార్థించినాడు.

కమలనాభుడు బ్రహ్మ వినతి ఆలకించినాడు. వారి ఆశయము గ్రహించినాడు. తానొక్కడు వారి కార్యము నెరవేర్ప సమర్థుడయ్యు సముద్రమథనాదుల విహరించవలెనని తలంచినాడు. అంజలులు ఘటించి ఎదుటనిలిచిన దేవతలను చూచి మేఘగంభీరస్వరమున ఇట్లు అన్నాడు :—

"దేవతలారా! అవసరము ఏర్పడినపుడు శత్రువులతో హితము సంధిచేసుకొనుట కర్తవ్యము. మీరు ప్రస్తుతము రాక్షసులతో సంధిచేసికొనుడు. వారితో సంధి చేసికొని అమృతమునకై ప్రయత్నించుడు.

క్షీరసాగరమును మథించుడు. మందరపర్వతమును కవ్వముగా చేయుడు. గడ్డి, తీగలు, ఔషధములను అందుపడవేయుడు. వాసుకిని కవ్వపు త్రాడుగాచేసి నా సాయమున సముద్రమును మథించుడు. అందువలన మీకు శ్రేయస్సు కలుగును. దైత్యులు క్లేశములు అనుభవింతురు. ఫలము మీకే లభించును. అసురులు కోరిన దానికి ఆమోదించుడు. సామమున అగుపని సంరంభమున కాజాలదు. కాన సంరంభము లేక వర్తింపుడు. సముద్రమును మథించునపుడు కాలకూటము జనించును. దానికి భయ పడరాదు."

ఇట్లు చెప్పి శ్రీవిష్ణువు అంతర్ధానుడయ్యెను.

సాగరమథనము.

బ్రహ్మాదులు శ్రీవిష్ణువునకు నమస్కరించినారు. రాక్షసుల ప్రభువైన బలిచక్రవర్తి వద్దకు వెళ్ళినారు. నిరాయుధులైన దేవతలను చూచినారు రాక్షసులు. వారిని వధించుటకు కత్తులు ఎత్తినారు. పుణ్యకీర్తియయిన బలి వారిని వారించినాడు.

బలి సర్వ జయముల గాంచినాడు. అసురులు కొలుచుచుండగా శ్రీమంతుడై సింహాసనముపై ఆసీనుడై ఉన్నాడు.

ఇంద్రుడు మృదువచనములతో శ్రీహరి తనకు ఉపదేశించిన దంతయు బలికి చెప్పినాడు. బలి అంగీకరించినాడు. శంబరుడు, అరిష్టనేమి మున్నగు రాక్షసులు త్రిపురవాసులైన అసురులు ఎల్లరు అందుకు సంతసించినారు.

దేవతలు, రాక్షసులు మిత్రులుగ ఉండుటకు నిశ్చయించి అమృతము కొరకుగాను ప్రయత్నించుటకు కృతప్రతిజ్ఞులైనారు. దేవతలు అసురులు కలిసి మందరగిరికి వెళ్ళినారు. దానిని పెకలించినారు. దానిని మోసుకొని పాలసముద్రమునకు బయలుదేరినారు. పర్వతము చాల బరువు ఉండుటవలన దేవదానవులు అలసిపోయినారు. పడవేసినారు. దాని క్రిందపడి ఎందరో సురాసురులు మడసినారు. అది చూచి దేవతలు రాక్షసులు భగ్నమనోరథులు అయినారు. శ్రీహరి అది గమనించినాడు. గరుడారూఢుడై అచ్చటికి విచ్చేసినాడు. చనిపోయినవారిని అమృత దృష్టితో చూచినాడు. వారందరును నిదురనుండి లేచినట్లు సజీవులై లేచినారు. దేవదానవులు చూచుచుండగా శ్రీహరి ఒంటిచేతితో మందరపర్వతమును ఎత్తినాడు. దానిని గరుడుని వీపున ఉంచినాడు. సురాసురులతో కలిసి పాలసముద్రమునకు వెళ్ళినాడు. గరుడుడు ఆ పర్వతమును సముద్రపు ఒడ్డున దించి పరమపదమునకు వెళ్ళినాడు.

అప్పుడు దేవతలు, రాక్షసులు వాసుకి వద్దకు వెళ్ళి సముద్రము తరచగా వచ్చిన ఫలభాగము ఇత్తుమని నచ్చచెప్పి తీసుకొనివచ్చినారు.

మందరపర్వతమును కవ్వముగాచేసి వాసుకిని కవ్వపుత్రాడుగాచేసి సముద్రమును మథించుటకు ప్రారంభించినారు.

శ్రీహరి వాసుకి ముఖభాగమును పట్టుకున్నాడు. దేవతలు సహితము ముఖభాగమునే పట్టుకొనిరి. రాక్షసులు అది సహించలేకపోయినారు. "మేము స్వాధ్యాయ శ్రుత సంపన్నులము. జన్మకర్మ విఖ్యాతులము. మేము వాసుకి తోక పట్టుకొనము. ముఖమే పట్టుకొందుము" అని పట్టుపట్టినారు.

శ్రీహరి చిరునవ్వు నవ్వి వాసుకి శిరము వదిలి తోకను పట్టినాడు. అతనితో దేవతలందరు తోకనుపట్టగా రాక్షసులు ముఖభాగమును పట్టినారు. దేవదానవులు సముద్రమును మథింప నారంభించినారు.

కూర్మావతారము.

పర్వతము బరువైనది. దానిక్రింద ఆధారమేమియులేదు. దేవదానవులు ఎంత బలము ఉపయోగించి తరచినను అది మునిగిపోసాగినది. దేవదానవుల ప్రయత్నము వ్యర్థము కాజొచ్చినది. వారు విచారగ్రస్తులైనారు.



శ్రీ హరి కూర్మావతారమెత్తి మందరపర్వతము నెత్తుట.

పుట. 334

అది గ్రహించి శ్రీహరి కూర్మరూపము ధరించి మునిగిపోవుచున్న మందర పర్వతము క్రిందచేరి దానికి ఆధారమైనిలిచినాడు. తన వీపుమీద మందర పర్వత మును ఎత్తినాడు. మందరపర్వతము పైకి తేలినది. దేవదానవులు సంతసించి మరల మథించుటకు ప్రారంభించినారు భగవంతుడు జలమునందు కూర్మరూప మున ఉండి రాక్షసులందును, దేవతలందును ప్రవేశించి వారి బలవీర్యములు వృద్ధి చేసినాడు. వాసుకికి నిద్రమత్తు కల్పించినాడు. మందరపర్వతము మీద మరొక పర్వతమువంటి తనచేయి పెట్టినాడు. అదిచూచి బ్రహ్మ, ఇంద్రుడు మున్నగు దేవతలు శ్రీహరిని స్తుతించి పూలవాన కురిపించినారు.

మహాపర్వతమైన మందరము గిరగిర తిరుగసాగినది. తిమింగిలములు మున్నగునవి క్షోభచెందినవి. వాసుకి వేయినోళ్ళు, వాటినుండి పొగలు, మంటలు బయలు దేరినవి ఆ మంటలకు రాక్షసులు నిస్తేజులు అయిపోయినారు. దావానలమున మాడిన సరళవృక్షములవలె కనిపించినారు.

వాసుకి నిట్టూర్పులమంటలకు దేవతలు సహితము మాడిపోయినారు. కాని భగ వంతుడు మేఘములచే వారిపై వర్షము కురిపించినాడు. సముద్ర కెరటములనుండి చల్లనిగాలి వీచునట్లు చేసినాడు.

అట్లు దేవదానవులు ఎంతోకాలము సముద్రమును చిలికినారు. అమృతమురాలేదు. వారు విసిగినారు. ప్రయత్నము విడుచునట్లు కనిపించినారు.

స్వయముగా విష్ణుదేవుడు సముద్రమును మథించ సాగినాడు.

హా లా హ ల ము.

శ్రీవిష్ణువు సముద్రమును వేగముగా మథించగా సాగరము అల్లకల్లోలమైనది. జలచరములు క్షోభించినవి.

సాగరమునుండి హాలహాలము పుట్టినది.

హాలాహలము ఉగ్రముగ నున్నది. విషపుమంటలు సర్వలోకములకు వ్యాపించి నవి. ప్రజలు, ప్రజాపతులు వడికిపోయినారు. వేరు శరణ్యములేక వారు శివుని శరణుతొచ్చినారు.

శివుడు కైలాసమున ఉన్నాడు. లోకక్షేమమునకు తపము చేయుచున్నాడు. పార్వతి అతనిని సేవించుచున్నది.

దేవతలు కైలాసమునకు చేరి అంజలిఘటించి శివుని స్తుతించినారు. ముల్లోకములను కాల్చివేయుచున్న హాలాహలమునుండి రక్షించవలసినదని ప్రార్థించినారు.

శివుడు సర్వభూత బాంధవుడు. ప్రజాపతుల ఆపద తెలుసుకున్నాడు. కనికరించినాడు. ప్రశ్నార్థకముగా తనప్రియురాలు పార్వతిని చూచినాడు.

పార్వతికి శివుని ప్రభావము తెలుసు. అతడు హాలాహలము త్రాగగల సమర్థుడు. అదియు ఆమెకు తెలుసు. ఆమె అంగీకరించినది.

దయామయుడైన శివుడు భయంకరమైన హాలాహలమును దోసిళ్ళతో త్రాగినాడు. ముల్లోకములను మంటలనుండి కాపాడినాడు.

హాలాహలము పాలసముద్రమునందలి పాపరాశి. అది ముక్కంటిపై సహితము తన ప్రతాపము చూపినది. అతని కంఠము కమిలి నల్లనైనది.

అందువలన అతడు నీలకంఠుడు, గరళకంఠుడు అయినాడు.

శివుడు చేసిన అద్భుతకార్యము చూచినారు బ్రహ్మాదులు. ఆశ్చర్యచకితులైనారు. ఆనందపరవశులైనారు.

శివుడు హాలాహలము త్రాగునపుడు దోసిలినుండి జారి కొంత క్రిందపడినది.

దానినే తేళ్ళు, జెర్రులు, పాములు, ఓషధులు స్వీకరించినవి.

లక్ష్మీ దేవి.

కాలకూటవిషము త్రాగినాడు గరళకంఠుడు. దేవదానవుల ఉత్సాహము ఇనుమడించినది. వారు మరింతవేగమున పాలసముద్రమును చిలకసాగినారు.

సముద్రమున కామధేనువు పుట్టినది. బ్రహ్మలోకముకోరు బ్రహ్మవాదులు దానిని తీసుకున్నారు.

తదనంతరము చంద్రబింబమువంటి ఉచ్చైశ్రవము పుట్టినది. బలిచక్రవర్తి దానిని తీసుకున్నాడు.

తరువాత ఐరావతము పుట్టినది. దానివెంట తక్కిన దిగ్గజములు వాని భార్యలు పుట్టినవి. ఐరావతమును ఇంద్రుడు గ్రహించినాడు.

పిదప కౌస్తుభమణి పుట్టినది. దానిని విష్ణుదేవుడు తీసుకున్నాడు.

తదుపరి పారిజాతము, కల్పవృక్షము పుట్టి స్వర్గమందలి నందనవనమునకు శోభను కలిగించినవి.

అనంతరము అప్సరసలు వచ్చినారు. వారి సౌందర్యమునకు దేవతలు ముగ్ధులైనారు.

ఆ తరువాత లక్ష్మీదేవి ఉద్భవించినది. ఆమె అందమును, ఒయ్యారమును చూచి దేవదానవులెల్లరు ఉవ్విళ్ళూరినారు.

దేవేంద్రుడు ఆమెకు ఆసనము సమర్పించినాడు. పుణ్యనదులన్నియు ఆమెను సేవించినవి ఋతువులు ఆమెకు ఫలములు అర్పించినవి. గోవులు పంచగవ్యములు తెచ్చినవి. ఋషులు ఆమెను అభిషేకించినారు.

గంధర్వులు గానము చేసినారు. నాట్యకత్తెలు నృత్యము చేసినారు. మేఘములు మద్దెలలు, తప్పెట్లు వాయించినవి. బ్రాహ్మణులు మంత్రములు పఠించినారు. దిగ్గజములు పూర్ణకలశములతో స్నానము చేయించినవి. సముద్రుడు పట్టు అందించినాడు. వరుణుడు వైజయంతీమాలను సమర్పించినాడు. కర్మ వివిధ ఆభరణములు అర్పించినాడు. సరస్వతి ముత్యాలహారము ఇచ్చినది. బ్రహ్మ పద్మము నిచ్చినాడు.

ఆమె లేచినది. తామరపూలదండ తీసుకున్నది. ఆ దండను తుమ్మెదలు ముసురుచున్నవి. సర్వగుణ సంపన్నుడైన వాని మెడలో ఆ హారము వేయుటకుగాను హంసవలె నడచినది.

ముల్లోకముల అందము ఆమె ముఖమున మూర్తీభవించినది. ఆమె చెక్కిళ్ళపై కుండలముల కాంతులు తళతళలాడుచున్నవి. ముసిముసి నవ్వులతో మెల్లమెల్లగా ఆమె సుందరునకు సాగినది. ఆమె నడుము కందిరీగ నడుమువలె సన్నగా ఉన్నది. ఆమె స్తనములు ఒకదానికి ఒకటి ఒరుసుకొనుచున్నవి. పాలిండ్లకు కుంకుమ, చందనము పూసుకున్నది. ఆమె కాళ్ళ అందియలు మధురముగ ధ్వనించినవి.

ఆమె భర్తను వరించుటకు కదిలినది. ఆమె కదలుచున్న బంగారుతీగవలె కనిపించినది. ఉత్తమగుణములు కలవాడు, ఎట్టిదోషములు లేనివాడు, సనాతనుడు తనకు భర్త కావలెనని ఆమె కోరినది.

గంధర్వులను చూచినది. తనకు తగిన వరుని కానలేదు.

సిద్ధులను చూచినది. ఆమె కోరిన వరుడు కనిపించలేదు.

చారణులను, దేవతలను చూచినది. నచ్చినవాడు కనిపించలేదు.

వీరిలో తపస్వులు ఉన్నారు, కాని వారు క్రోధమును జయించలేదు. జ్ఞానవంతులున్నారు కాని వారు ఆసక్తిని వదలలేదు. గొప్పగొప్ప మహిమలు కల వారున్నారు కాని వారు కామమును వదలలేదు. ఐశ్వర్యవంతులున్నారు కాని వారు పరాశ్రయమును విడువలేదు. ధర్మపరులున్నారు కాని వారు ప్రాణములపై ప్రేమ వదలలేదు. త్యాగధనులున్నారు కాని కేవల త్యాగమువలన ముక్తి లభించదు. వీరాధివీరులున్నారు కాని వారు కాలమును తప్పించుకొనలేరు. విషయాసక్తి లేని మహాత్ములున్నారు కాని వారు ఎల్లప్పుడు సమాధిలో మగ్నులై ఉంటారు. చిరంజీవులైన ఋషులున్నారు కాని వారి శీలము అనుకూలమైనది కాదు.

వీరందరిలో ఆమెకు విష్ణుమూర్తియే తగినవాడుగా కనిపించినాడు. అతని వద్ద మంగళమయములైన గుణములన్నియు కలవు. అతడు సర్వశుభగుణములకు ఆశ్రయుడు. అతనికి ప్రాకృతగుణములు అంటవు. అతడు ఏ యపేక్షలు లేనివాడు. సర్వజనాశ్రయుడు. లక్ష్మీదేవి అతనినే భర్తగా వరించవలెనని నిశ్చయించినది.

తామరపూవులదండ శ్రీహరి మెడలో వేసినది. అతని వక్షస్థలము తనకు ఉనికిపట్టు చేసికోవలెనను అభిలాషతో అతని అనుగ్రహమునకై నిరీక్షించుచు నిలిచినది.

శ్రీహరి ఆమెను స్వీకరించినాడు.
తన వక్షస్థలము నామెకు నివాసముగా కల్పించినాడు.

శంఖములు, తూర్యములు, మద్దెలలు, దుందుభులు మ్రోగినవి. గంధర్వులు గానము చేసినారు. అప్సరసలు నాట్యము చేసినారు. బ్రహ్మ శివుడు మున్నగు దేవతలు పూలవాన కురిపించినారు. భగవంతుని గుణములు స్తుతించినారు.

దైత్యదానవులను లక్ష్మీదేవి ఉపేక్షించినందున వారు నిరుద్యోగులు, వ్రతహీనులు, సిగ్గులేనివారు అయిపోయినారు.

అమృతము - జగన్మోహిని.

తిరిగి సముద్రమును మథించినారు దేవదానవులు. సురకు అధిదేవత వారుణిదే పుట్టినది. శ్రీహరి అనుమతితో ఆమెను దైత్యులు స్వీకరించినారు.

తదనంతరము ఒక దివ్య పురుషుడు ఆవిర్భవించినాడు. అతడు ఆయుర్వేద ప్రవర్తకుడు ధన్వంతరి. అతని చేతిలో అమృత భాండమున్నది. అతడు సాక్షాత్తు విష్ణుదేవుని అవతారము-అంశావతారము.

ధన్వంతరి అమృతకలశము చేతబూని అవతరించినాడు. అది చూచినారు దైత్యులు. ఒకసారిగా అతని మీదపడినారు. అతని చేతిలోని అమృత భాండమును లాగుకున్నారు.

దేవతల ఆశ అడియాస అయినది. వారు శ్రీహరి శరణుజొచ్చినారు.

భగవంతుడు తనమాయను ప్రయోగించినాడు.

రాక్షసులు అమృతమును పంచుకొనుటకు పోట్లాడసాగినారు. నేను ముందు త్రాగుదునన్న నేను ముందు త్రాగుదును అని కీచులాడుకున్నారు. బలవంతులు అమృతకలశమును గుంజుకున్నారు. బలహీనులు తిరుగబడినారు. ఇది ధర్మము కాదు అని మండిపడినారు. మనతో సమముగా శ్రమించిన దేవతలకు భాగము ఇచ్చుట సనాతనధర్మము అన్నారు.

ఇంతలో శ్రీవిష్ణువు జగన్మోహిని అవతారము ధరించినాడు.

ఆమె నల్లకలువ వలె శ్యామలముగా ఉన్నది. ఆమె ముఖము అయస్కాంతము వలె ఆకర్షవంతమై ఉన్నది. ఆమె చెవులు సమానముగా ఉన్నవి. కన్నులు చెవులకు అంటుచున్నవి. కనుబొమలు మన్మథుని విల్లువలె నున్నవి. ఆమె పెదవులు పడవలను కాలదన్నుచున్నవి. చెక్కిళ్ళు అద్దమువలె నిగనిగలాడుచున్నవి. ముక్కు చక్కగ బాణమువలె నున్నది. ఆమె బొమముడి విరిచిన సంధించినట్లున్నది. ముఖము పద్మగంధము కలిగి ఉన్నందున తుమ్మెదలు ముసురుచున్నవి. కంఠము గాజుతో సిద్ధము చేసినట్లున్నది. ఆమె నీరు త్రాగిన లోనికి జారునీరు గళమునుండి కనిపించునట్లున్నది. ఆమె కంఠమున ఎన్నియో భూషణములు ధరించినది. ఆమె చనుగవ పొంగి పొటమరించి ఉన్నది. యవ్వనము దానితో చేరి మిసమిసలాడుచున్నది. ఆమె స్తనముల బరువుతో వంగిపోవుచున్నది. నడుము పిడికిట ఇముడునట్లున్నది. తొడలు అరటి స్తంభమువలె ఉన్నవి. జానువులు ...ముచున్నవి. పాదములు కాంతులీనుచున్నవి. కాలి అందియలు మధుర ... చేయుచున్నవి.



అమృత భాండముతో ధన్వంతరి ఆవిర్భావము.

పుట. 338

అట్లున్న జగన్మోహిని

పాలిండ్లపైనున్న పయ్యెద జాఱించు
　　జాఱించి మెల్లన చక్కనొత్తు
దళుక్కుదళుక్కను గండ ఫలకంబులొలయించు
　　నొలయించి కెంగేల నుజ్జగించు

గడుమెఱుంగులు వాఱు కడకన్ను లల్లార్చు
　　నల్లార్చి బొమ్మల నందగొలుపు
నవరనిదరహాస చంద్రిక జిలికించు
　　జిలికించి కెమ్మోవి తెక్కువఱచు

దళితధమ్మిల్లకుసుమగంధమ్ము వెలువ
గంకణాదిభూషణంకృతుల్ గడలు కొలుపు
నొడలికాంతులు పట్టులే కులుక వాఱు,
నన్నవలిపంపుబయ్యెద సొకరించి

ఆ జగన్మోహినిని, ఆమె అందమును, ఆమె వయ్యారమును చూచినారు దైత్యులు. కామవాంఛతో పరవశులైనారు.

ఏమి ఈ అందము! ఏమి ఈ వయసు సొగసు! అని అందరు ఆమె వైపు తిరిగినారు.

ఓహో! కన్నియా! నీ కన్నులు చూచిన మా మతులు పోవుచున్నవి. నీ వెవరవు? ఎటునుండి వచ్చినావు! ఎవరికొరకు పుట్టినావు? నీకు ఏమి కావలయును?

రాక్షసుల మాటలు విన్నది జగన్మోహిని. బుగ్గమీద వ్రేలు పెట్టుకున్నది. పక్కు నవ్వినది. ఓర చూపు అను బాణములు విసిరినది.

దానితో నీరైపోయినారు దైత్యులు. న్యాయముగా అమృతము పంచి పెట్టవలసినదని ఆమెను ప్రార్థించినారు.

మరొకసారి నవ్వినదామె. ఆ నవ్వునకు ప్రాణములు సహితము అర్పించుటకు సిద్ధమైనారు దైత్యులు. అప్పు డామె ఇట్లన్నది.

"నేను మంచిచేసినను చెడుచేసినను మీరు అంగీకరించవలెను. అట్లయినచో నేను అమృతము పంచగలదాన."

ఆమె పలుకులు విన్నారు మత్తుమందు చల్లినట్లైనది. ఆమె అన్నదానికి తలలూపి అంగీకారము వ్యక్తపరచినారు దానవులు.

అసురులు స్నానాదికములు చేసి పవిత్రులైనారు. క్రొత్తవస్త్రములు ధరించి భూషణములు అలంకరించుకొని, దీపములచే అలంకరించబడిన మంటపముపై, తూర్పుగా పరచిన కుశాసనములమీద కూర్చున్నారు.

దేవతలు సహితము విడిగా పంక్తిదీర్చి కూర్చున్నారు.

అమృత కలశము పట్టుకొని హంసనడకతో మంటపమున ప్రవేశించినది జగన్మోహిని. ఆమె ఒక్కసారి దేవదానవులను ఓరగంట చూచినది. వారు విలవిల లాడినారు.

ఆమె చనులమీది పయ్యెద జారినది.

వారి ప్రాణములులేచి పోయినవి.

క్రూరస్వభావులైన అసురులకు అమృతమిచ్చిన పామునకు పాలుపోసినట్లగును' అని ఆలోచించి అసురులకు అమృతము అందివ్వరాదని నిశ్చయించినది జగన్మోహిని. దేవతలను ఒక పంక్తిలోను, దానవులను ఒక పంక్తిలోను కూర్చుండబెట్టినది. అమృతకలశము పట్టుకొని ముందు దైత్యుల పంక్తికి వచ్చినది. చిరునవ్వులతోను, ఓరచూపులతోను వారిని పరవశులను చేసినది. గిరుక్కున తిరిగి బాణము వలె దూసుకొని పోయినది దేవతలపంక్తికి. వారికి అమృతము పంచిపెట్టసాగినది.

దైత్యులు ముందే మాటఇచ్చినారు. అంతియొకాదు ఆమె చూపులు కాలపాశములై కట్టివేసినవి వారిని. ఆమె కులుకు చూచి, ఉలుకు చూచి వారు ఆమెకు దాసులైనారు. ప్రీతిపులై పోయినారు. ఆమెను చూచుచు అన్నియు మరచినారు. ఒక్కరును కిక్కురు మనలేదు.

జగన్మోహిని దేవతలకు అమృతము పంచిపెట్టుచున్నది. రాహువు మాత్రము అది గ్రహించి దేవతగా వేషము వేసినాడు. దేవతలపంక్తిలో కూర్చున్నాడు. మోహిని అతనికి అమృతము పోసినది. అతని ప్రక్కన ఉన్నవారు సూర్య చంద్రులు. వారు జగన్మోహినికి అతడు రాహువు అని తెలియచేసినారు. రాహు

షుడు ఇంకను గుటక వేయలేదు. శ్రీహరి సుదర్శన చక్రముచే రాహువు శిరము ఖండించినాడు.

అమృతము రాహువు గొంతుదిగలేదు. మొండెమునకు అమృతము అందలేదు. శిరస్సుతెగి క్రిందపడిపోయినది.

బ్రహ్మ రాహువును గ్రహముగా చేసినాడు. గ్రహమైకూడా పాతపగ మానలేదు రాహువు. సూర్య చంద్రులను అమావాస్య, పౌర్ణములందు మ్రింగివేయుచున్నాడు.

దేవతలు అమృతము పుచ్చుకొన్న తరువాత దైత్యులు చూచుచుండగా జగన్మోహిని శ్రీహరియైనాడు.

దేవదానవుల యుద్ధము.

దేవతల అభ్యుదయముచూచి సంహించలేక పోయినారు దానవులు. వెంటనే యుద్ధమునకు బయలుదేరినారు. బలిచక్రవర్తి అసురసేనకు ఆధిపత్యము వహించినాడు. అతడు వైహాయసన విమానమును ఎక్కి బయలుదేరినాడు. అది కాల గమనముగల విమానము. మయుడు సిద్ధము చేసినది. సముద్రము మథించుటలో చమటోడ్చినను ఫలితము, దక్కనట్టి రాక్షసయోధులందరు అతనిని అనుసరించినారు. వారు సింహనాదములు చేసినారు. శంఖములు పూరించినారు.

అది విన్నాడు ఇంద్రుడు. ఐరావతమును ఎక్కినాడు. అగ్ని, వాయువు, వరుణుడు మున్నగు దేవతలెల్లరు ఆయుధములు ధరించి ఇంద్రుని అనుసరించినారు.

ఉభయసేనలు ఒక దానిముందు ఒకటి నిలిచినవి. ఒకరిని ఒకరు కవ్వించుకున్నారు. ముందు ద్వంద్వయుద్ధమునకు దిగినారు. బలి దేవేంద్రునితో కలియబడగా ఒక్కొక్కరు ఒక్కొక్కరితో యుద్ధముచేసినారు.

ఒకరిని ఓడించవలెనను ఉత్సాహమున ఒకరు పోరినారు. బాణములు కరవాలములు, తోమరములు, గదలు, పట్టిసలు, శక్తులు, ఈటెలు, ముద్గరములు, గుదియలు ప్రయోగించుకున్నారు. ఉభయసేనలందును కాలు సేతులు తెగిపడినారు. మెడలు, తొడలు విరిగి కూలినారు, కొల్లలుగా పడిపోయినారు. ధ్వజములు కవచములు, భూషణములు చెల్లాచెదరుగా పడినవి. ఏనుగులు, గుఱ్ఱములు ఒంటెలు కుప్పలు కుప్పలుగా కూలినవి.

బలివక్రశక్తి ఇంద్రునిపై బాణములు గుప్పించినాడు. ఇంద్రుడు వానిని ముక్కలుచేసినాడు. బలి మండి, శక్తిని విసరినాడు. అది ఉల్కవలె మండుచు ఇంద్రునిపైకి ఉరికినది. ఇంద్రుడు బాణమున దానిని కూల్చినాడు. బలి క్రోధమున మండిపడినాడు. వెంటవెంట శూలము, ప్రాసము, తోమరము, శక్తిని ప్రయోగించినాడు. ఇంద్రుడు దాని నన్నింటిని పడగొట్టినాడు.

బలి అదృశ్యుడై రాక్షసమాయ ప్రయోగించినాడు. దేవసేనమీద పర్వతములు ప్రత్యక్షమైనవి. మండుచున్న చెట్లు మీదపడినవి. సూదిమొనలవంటి రాళ్ళు కురిసినవి. పాములు, జెఱ్ఱులు, తేళ్ళు మున్నగు విషజంతువులు వచ్చినవి. సింహములు, పెద్దపులులు విరుచుకొని పడినవి. పిశాచములు దిసమొలలతోవచ్చి దేవతలను చంపసాగినవి.

పెనుగాలి రేగినది. మబ్బులు క్రమ్మినవి. నిప్పులు కురిసినవి. దావాగ్ని చెలరేగినది.

మహాసముద్రము ముంచుకొనివచ్చి పెద్దపెద్ద కెరటములతో దేవసేనను ముంచి వేయ సాగినది.

దేవతలు దిక్కులేనివారైనారు. వారు శ్రీహరిని ప్రార్థించినారు.

గరుడారూఢుడై ప్రత్యక్షమైనాడు శ్రీహరి.

కలవలె మాయకరిగిపోయినది.

సింహముమీదనెక్కి శ్రీహరిమీదికి దూకినాడు కాలనేమి. గరుడుని తలపైకి త్రిశూలము విసరినాడు అదేశూలమును చేతితోపట్టి త్రిప్పి కొట్టినాడు శ్రీహరి. కాలనేమి సింహసహితముగా కూలినాడు.

మాలిని, సుమాలిని, మాల్యవంతుని చక్రముతో వధించినాడు విష్ణువు.

ఉత్సాహము తెచ్చుకున్నారు దేవతలు. బలితో ఉగ్రుడై పోరినాడు ఇంద్రుడు. ఇంద్రుని రోమక్రింద లెక్కకట్టి పోరినాడు బలి. ఉగ్రుడై వజ్రాయుధము విసరినాడు ఇంద్రుడు. ఆదెబ్బకు రెక్కలుతెగిన కొండవలె కూలినాడు బలి విమానసహితముగా.

జంభాసురుడు బలికి ప్రాణసఖుడు. సింహము నెక్కి ఇంద్రునిమీద పడ్డాడు. గదతో ఐరావతమును బాదినాడు. ఐరావతము గీపెట్టి చతికిల బడినది.

ఇంద్రుని సారథి మాతలి వేయిగుఱ్ఱములుపూనిన రథమును తెచ్చినాడు. ఇంద్రుడు దానిపైకి ఎక్కినాడు. అదిచూచి మాతలిపై త్రిశూలము విసరినాడు జంభాసురుడు. మాతలి ఆ పోటునకు తట్టుకున్నాడు. ఇంద్రుడు మండిపోయినాడు. వజ్రాయుధముతో జంభాసురుని తల నరకినాడు.

జంభాసురుని బంధువులు నముచి, బలుడు, పాకాసురుడు ఇంద్రుని మీదకు ఉరికినారు. శరవర్షము కురిపించినారు. ఇంద్రుని రథమును కూల్చినారు. సూర్యుని మేఘములు కప్పినట్లు శరవర్షమున ఇంద్రుని మాతలిని కప్పివేసినారు.

దేవసేన హాహాకారములు చేసినది. కాని మరుక్షణమున మబ్బులు చీల్చుకొని వచ్చిన సూర్యుని వలె ఇంద్రుడు కనిపించినాడు. అతడు బలాసుర, పాకాసురుల తలలు ఎగుర కొట్టినాడు.

నముచికి దుఃఖము ముంచుకొని వచ్చినది. "ఇదుగో చచ్చితివి" అని ఇంద్రుని మీదకు త్రిశూలము విసరినాడు. దానిని వేయి ముక్కలు చేసినాడు ఇంద్రుడు. వజ్రాయుధముతో నముచి మెడమీద బలముగా కొట్టినాడు.

ఆశ్చర్యము ! వజ్రాయుధము మొక్కవోయినది !! చకితుడై చూడ సాగినాడు ఇంద్రుడు. "ఇతడు తడివస్తువునకు కాని, పొడివస్తువునకు గాని చావడు మరేదైన ఉపాయము చూడుము" అని ఆకాశవాణి పలికినది.

ఇంద్రుడు ఆలోచించినాడు. తడి పొడి కానిది సముద్రపు నురుగు. దానితో నముచి తల నరికినాడు ఇంద్రుడు.

మహామునులు ఇంద్రుని మీద పూలవాన కురిపించినారు. గంధర్వులు గానము చేసినారు. అప్సరసలు నాట్యము చేసినారు.

అసురుల నాశనము చూచినాడు బ్రహ్మ. యుద్ధము ఆపు చేయించవలసినదని నారదుని పంపినాడు. నారదుడు దేవతలను యుద్ధము మానవలసినదని చెప్పినాడు. వారు అతని మాట ప్రకారము యుద్ధము చాలించినారు.

మిగిలిన అసురులు నారదుని మాట ప్రకారము బలిచక్రవర్తిని తీసుకొని అస్తగిరికి బయలుదేరినారు. తలలు తెగక పడి ఉండిన అసురులను శుక్రాచార్యుడు బ్రతికించినాడు.

చావు బ్రతుకులు జయాపజయములు సమానములను తత్వము తెలిసినవాడు బలి. అపజయము కలిగినను ఏమాత్రము చలించలేదు.

బలివిజయము.

దేవాసుర యుద్ధమున ఓడిపోయిన బలి తన సర్వ సంపదలను శుక్రాచార్యులకు అర్పించినాడు. అతడు గురువుల అనుగ్రహము సంపాదించి వారి పాదములు సేవించుచు కాలము గడుపసాగినాడు. ప్రభావశాలులైన భృగు వంశీయులు బలిచక్రవర్తిపై ప్రసన్నులైనారు. అతనిచే విశ్వజిత్తు అను యజ్ఞము చేయించినారు. ఆ యజ్ఞకుండము నుండి బంగారు పైకప్పు గల ఒక రథము ఆవిర్భవించినది. అక్షయతూణీరములు దివ్యకవచములు కూడ బయల్వెడలినవి. బలి తాత ప్రహ్లాదుడు ఎన్నటికి వాడని ఒక పూలమాల మనుమనికి ఇచ్చినాడు. శుక్రాచార్యుడు అతనికి ఒక శంఖము ఇచ్చినాడు.

ఆ సామాగ్రితో యుద్ధమునకు బయలుదేరినాడు బలి. అతడు దివ్యకవచము ధరించినాడు. అక్షయ తూణీరములు కట్టుకున్నాడు. ఖడ్గము వ్రేలాడదీసినాడు. ధనుస్సు పట్టుకున్నాడు. ప్రహ్లాదుడు ఇచ్చిన పూలమాల మెడలో వేసుకొని రథమెక్కినాడు. అతడు దేవేంద్రుని తల తన్నినట్లు కనిపించినాడు,

అతని వెంట సముద్రము వలె మహాదైత్యసేన కదలి అమరావతిని ముట్టడించినది. అమరావతిని నాలుగువైపుల నుండి ముట్టడించిన బలిచక్రవర్తి మహా శంఖము పూరించినాడు. దేవతల గుండెలు పగిలినవి. అమరావతిలో పిడుగులు పడినట్లు అయినది.

బలి బలము కూడగట్టుకొని వచ్చినాడని గ్రహించినాడు ఇంద్రుడు. దేవతలందరిని తీసుకొని బృహస్పతి దగ్గరకు వెళ్లినాడు. గురువునకు నమస్కరించి "గురుదేవా ! బలి ఈనాడు ఉధృతమున వచ్చి మహాగర్వమున అమరావతిని ముట్టడించినాడు. జయాపజయములు తేల్చుకొనుటకు గాను వచ్చినట్లు కాన్పించుచున్నది. అతని ప్రతాపము చూచి ముల్లోకములు గడగడలాడుచున్నవి. అతడు నాలుకతో దిశదిశలను నాకివేయు నట్లున్నాడు. అతని చూపులు దిగంతములను మాడ్చివేయునట్లున్నవి. ఇతనికి ఇంత శక్తి ఎట్లు కలిగెనో తెలియకున్నది. ఇప్పుడు మనకర్తవ్యమేమి ?" అని అడిగినాడు.

బృహస్పతి ఇంద్రునితో "ఇంద్రా ! బలి అంత బలవంతుడగుటకు భార్గవులు కారణము. అతని ప్రస్తుత ప్రతాపము ముందు నీవంటి వారు పదిమంది సహితము నిలువలేరు. ఇప్పుడు మీకు పలాయనము తప్ప వేరుమార్గము లేదు. శత్రువు

అదృష్టము తలక్రిందులగు వరకు రహస్యముగా తల దాచుకొనవలసి ఉన్నది" అని అన్నాడు.

బృహస్పతి మాటలు విని దేవతలు మారు వేషములు వేసుకొని అమరావతిని విడిపోయినారు. దేవతలు పారిపోగా బలిచక్రవర్తి అమరావతిని ఆక్రమించుకున్నాడు. ఆ పుత్సాహముచే ముల్లోకములను జయించినాడు బలి. భార్గవులు అతనిచే వంద అశ్వమేధములు చేయించినారు. బలిచక్రవర్తి కీర్తి దిగ్దిగంతములకు వ్యాపించినది. రాజ్యము గురువుల అనుగ్రహము వలన లభించినది. దానిని అతడు ఉదారముగా అనుభవించినాడు. తాను కృతకృత్యుడైనట్లు భావించినాడు.

వా మ నా వ తా ర ము.

దేవతలు స్వర్గము వీడినారు. దీనులై పోయినారు. అది సహించలేకపోయినది దేవమాత అదితి. విచారమున కృంగిపోసాగినది.

ఒకనాడు కశ్యపుడు అదితి వద్దకు వచ్చినాడు. అదితి అతనిని విధి పూర్వకముగా సత్కరించినది. కశ్యపుడు ఆసీనుడైనాడు. అదితి ముఖమున గల విచారమును గమనించి, ఇట్లు అడిగినాడు "దేవీ! నీ ముఖమున విచారము వ్యక్తమగుచున్నది. అందులకు గల కారణమేమి? ధర్మము సక్రమముగా నడచుచున్నది కదా! కుటుంబపోషణము భారమగుట లేదు కదా! అతిథులు నీచేత సన్మానము పొందక వెళ్ళి పోలేదు కదా! బ్రాహ్మణులకు ఆపదలు రాలేదు కదా! ఎల్లప్పుడు సంతోషముతో ఉండుదానివి ఇట్లు విచారముగ కనిపించుచున్నావేమి? నీసంతానమునకు కుశలమే కదా!

అదితికి దుఃఖము పొంగిపొరలినది. "ప్రాణేశ్వరా! నీ అనుగ్రహమువలన ధర్మమునకు ఎట్టిలోటు రానీయలేదు అగ్నులను, అతిథులను అనాదరణ చేయలేదు. స్వామీ! దితి సంతతి మితి మీరిపోయినది. వారు నా బిడ్డలను తమ తమ స్థానములనుండి తరిమివేసినారు. వారికి ఇల్లు వాకిలి లేకుండ పోయినది. చెట్టుకొకరు గుట్టకొకరు అయినారు. వారి ఆపద తీర్చు ఉపాయమును గురించి ఆలోచించుము. నాబిడ్డలకు పోయిన సంపదను తిరిగి ప్రసాదింపుము" అని ప్రార్థించినది.

కశ్యపుడు అదితి మాటలు విని, "ప్రియా! ప్రాణు అందరి దేహములందు ప్రకాశించు వాసుదేవుని ఆరాధించుము. అతడు తప్పక నీ కోర్కె తీర్చును.

భక్తి ఎన్నడును వ్యర్థము కాదు. భగవంతుని ఆశ్రయించుట తప్ప వేరు మార్గము లేదు." అందుకు అదితి, "స్వామీ! భగవంతుడు త్వరగా ప్రసన్నమగు ఉపాయమును ఉపదేశించుము" అని ప్రార్థించినది.

కశ్యపుడు అదితికి పాలవ్రతమును ఉపదేశించినాడు.

ఫాల్గుణమాసపు శుక్ల పక్షమున పండ్రెండురోజులు పాలుమాత్రము ఆహారముగా గ్రహించుచు పరమ భక్తితో పరమేశ్వరుని ఆరాధించవలెను. మాఘమాసపు అమావాస్యనాడు అడవి పంది త్రవ్వినచోటి నుండి మట్టితెచ్చి శరీరమునకు రాచుకొని స్నానముచేయవలెను. మట్టి పూసుకొనినప్పుడు ఈ మంత్రము చదువ వలెను.

త్వం దేవ్యాదివరాహేణ రసాయాః స్థానమిచ్ఛతా
ఉద్ధృతాసి నమస్తుభ్యం పాప్మానం మే ప్రణాశయ

ఓ దేవీ! నిన్ను యథాస్థానమున ఉంచుటకుగాను ఆదివరాహుడు రసాతలము నుండి ఉద్ధరించినాడు. నీకు నమస్కారము నా పాపములను నాశనము చేయుము.

స్నానము, సంధ్య మున్నగు నియమములు పూర్తిచేసుకొని స్థండిలమందును, వేదికలోను, సూర్యునియందును, జలమునందును భగవంతుడైన శ్రీహరిని భావించి అర్చించవలెను.

పూజా సమయమున తొమ్మిది మంత్రములతో భగవంతుని ఆరాధించవలెను.

నమస్తుభ్యం భగవతే పురుషాయ మహీయసే
సర్వభూతనివాసాయ వాసుదేవాయ సాక్షిణే 1.

భగవంతుడా! మహాపురుషా! సర్వభూతనివాసా! సర్వసాక్షీ! నీకు నమస్కారము.

నమోఽవ్యక్తాయ సూక్ష్మాయ ప్రధానపురుషాయ చ
చతుర్వింశద్గుణజ్ఞాయ గుణసంఖ్యానహేతవే 2.

సాంఖ్యయోగప్రవర్తకా! ఇరువదినాలుగు గుణములు ఎరిగినవాడా! అవ్యక్తుడా! సూక్ష్ముడా! ప్రధాన పురుషా! నీకు నమస్కారము.

నమో ద్విశీర్ష్ణే త్రిపదే చతుఃశృంగాయ తంతవే
సప్తహస్తాయ యజ్ఞాయ త్రయీవిద్యాత్మనే నమః 3.

యజ్ఞరూపుడవైన నీకు రెండు తలలు, మూడు పాదములు, నాలుగు కొమ్ములు, ఏడు చేతులు కలవు. మూడు విద్యలు ఆత్మగాగల నీకు నమస్కారము.

> నమశ్శివాయ రుద్రాయ నమః శక్తిధరాయ చ
> సర్వవిద్యాధిపతయే భూతానాం పతయే నమః

శివునకు, రుద్రునకు, శక్తిధరునకు, సర్వ విద్యాధిపతికి నా నమస్కారము.

> నమో హిరణ్యగర్భాయ ప్రాణాయ జగదాత్మనే
> యోగైశ్వర్యశరీరాయ నమస్తే యోగహేతవే

హిరణ్యగర్భునకు, సర్వప్రాణునకు, జగదాత్మునకు నా నమస్కారము. యోగైశ్వర్య శరీరునకు, సర్వయోగ హేతువునకు నా నమస్కారము.

> నమస్తే ఆదిదేవాయ సాక్షిభూతాయ తే నమః
> నారాయణాయ ఋషయే నరాయ హరయే నమః

ఆదిదేవునకు, సాక్షిభూతునకు, నారాయణఋషికి, నరఋషికి, శ్రీహరికి నా నమస్కారము.

> నమో మరకతశ్యామవపుషేఽధిగతశ్రియే
> కేశవాయ నమస్తుభ్యం నమస్తే పీతవాససే

మరకతమణులవంటి శ్యామదేహునకు, పీతాంబరధారికి, లక్ష్మీపతికి, కేశవునకు నా నమస్కారము.

> త్వం సర్వవరదః పుంసాం వరేణ్య వరదర్షభ
> అతస్తే శ్రేయసే ధీరాః పాదరేణుముపాసతే

అన్ని వరములనిచ్చువాడవు. వరములిచ్చువారిలో ఉత్తముడవు. ధీరులైన వివేకవంతులు శ్రేయస్సుకోరి నీపాదధూళి నుపాసింతురు.

> అన్వవర్తంత యం దేవాః శ్రీశ్చ తత్పాదపద్మయోః
> స్పృహయంత ఇవామోదం భగవాన్మే ప్రసీదతామ్.

ఎవని పాదపద్మముల సుగంధమునకుగాను సర్వ దేవతలును, లక్ష్మీదేవియు ఎవని సేవించెదరో అట్టి భగవంతుడు నాకు ప్రసన్నుడగుగాక !

శ్రీహరిని ఆవాహనచేసి ఈమంత్రములతో పాద్యము, ఆచమనము సమర్పించవలెను. గంధమాల్యములతో పూజించి పాలతో స్నానము చేయించి, వస్త్రము, ఉపవీతము, ఆభరణములు, పాద్యము, ఆచమనము, గంధము, ధూపము మున్నగు

వానితో, ఓం నమో భగవతే వాసుదేవాయ, అను ద్వాదశాక్షరమంత్రమున పూజించవలెను.

నేయి, పాలు, బెల్లము, చేర్చివండిన పరమాన్నము నైవేద్యముచేసి, ద్వాదశా
4. క్షరమంత్రముతో హోమము చేయవలెను. అట్టి ప్రసాదమును భగవద్భక్తులకు
పంచి తాను భుజించవలెను. ఆచమనాదికములు అయిన పిదప స్వామికి
తాంబూలము నివేదించి నూటఎనిమిది మారులు ద్వాదశాక్షర మంత్రమును
5. జపించవలెను. భగవంతునకు ప్రదక్షిణచేసి భక్తితో నేలపై సాగిలిబడవలెను.
నిర్మాల్యము శిరమున ధరించి ఉద్వాసనము చేయవలెను. కనీసము ఇద్దరు
బ్రాహ్మణులకు భోజనము పెట్టవలెను. వారికి దక్షిణలిచ్చి సత్కరించి వారి
అనుమతితో మిగిలినది బంధు మిత్రులతో కలసి భుజించవలెను. బ్రహ్మచర్యమును
పాలించవలెను.

6. మరునటిరోజు వేకువనలేచి స్నానాదికములు ముగించుకొని విధి పూర్వకముగ
భగవంతుని సేవించవలెను. వ్రతము పూర్తిఅగువరకు భగవంతుని పాలలో స్నాన
మాడించవలెను. అన్ని రోజులు పాలు మాత్రమే సేవించవలెను. తొలిదినము
వలెనే ప్రతి దినము హోమముచేసి బ్రాహ్మణులకు భోజనము పెట్టవలెను.

7. ఫాల్గుణ శుద్ధ పాడ్యమి మొదలు త్రయోదశివరకు ఈ వ్రతమును పాలించవలెను.
బ్రహ్మచర్యమును పాలించుచు నేలపై పరుండవలెను. మూడుపూటలు స్నానము
చేయవలెను. అబద్ధ మాడరాదు. పాపులతో మాట్లాడరాదు పాపపుమాటలు
మాటలాడరాదు. వివిధమైన భోగములను అనుభవించరాదు. ఏ ప్రాణిని బాధ
8. పెట్టరాదు. భగవదారాధనకు అంతరాయము కలిగించరాదు.

త్రయోదశినాడు శాస్త్రవిధులు తెలిసిన బ్రాహ్మణునిచే శ్రీహరికి పంచామృత
స్నానము చేయించవలెను. భగవంతునకు ఘనముగా పూజ చేయవలెను. పాలతో
హవిస్సు సిద్ధముచేసి శ్రీహరికి నైవేద్యము అర్పించవలెను. జ్ఞానవంతులైన
9. ఋత్విజులను, ఆచార్యులను సంతోషపరచి వస్త్రములు, ఆభరణములు, గోవులు
మున్నగునవి దానము ఇవ్వవలెను. వారికి సాత్త్వికాహారమే ఇవ్వవలెను. అతిథులకు
భోజనము పెట్టవలెను. సర్వప్రాణులు తృప్తిపడినచే సర్వేశ్వరుడు తృప్తిచెందును.
కావున దీనులు, అంధులు, కృపణులు మున్నగు వారికి భోజనము పెట్టి బంధువులతో
కలసి తాను భుజించవలెను. అన్ని రోజులు ప్రతి దినము నృత్యము, గీతము,
వాద్యము, స్తోత్రము, స్వస్తివాచనము, హరికథలు మున్నగు వానితో భగ
వంతుని సేవించవలెను.

ఈ పాలవ్రతము వలన భగవంతుడు సంతోషపడును. సర్వయజ్ఞములు, సర్వ వ్రతములు, సర్వదానములు ఇందు ఇమిడి ఉన్నవి. భగవంతుడు దేనివలన ప్రసన్నుడగునో అదే ఉత్తమనియమము. అదే ఉత్తమ సంయమము. అదే తపము. అదే వ్రతము అదే యజ్ఞము.

"కావున కళ్యాణీ! నియమముగా ఈ వ్రతమును పాలించుము. త్వరలోనే శ్రీహరి నిన్ను అనుగ్రహించును" అని కశ్యపుడు ఉపదేశించినాడు

భర్త ఉపదేశమును అనుసరించి అదితి పాలవ్రతమును నియమముగా పాలించినది. నిష్ఠతో పూర్తిచేసినది. వ్రతాంతమున పచ్చని బట్టకట్టుకొని నాలుగు చేతులందు శంఖ, చక్ర, గదా, పద్మములు ధరించిన, ఆదిపురుషుడు, శ్రీహరి అదితికి ప్రత్యక్షమైనాడు.

శ్రీహరిని చూచి, అదితి లేచినది. రెండు చేతులు జోడించి మ్రొక్కినది. ఆమె దేహము పులకరించినది. ఆనంద బాష్పములు ప్రవహించినవి. గొంతు పూడి పోయినది. శ్రీహరిని చూచుచు ప్రతిమవలె నిల్చిపోయినది. తుదకు గద్గద స్వరమున శ్రీహరిని స్తుతించినది.

శ్రీహరి ప్రసన్నుడై "నీ పాల వ్రతము నాకు సంతృప్తి కలిగించినది. నా అర్చన ఎన్నడును వ్యర్థముకాదు. నీ కోరిక సిద్ధించుటకుగాను కశ్యపముని తేజస్సుతో నీ గర్భమున జన్మింతును. నీ సంతానమును రక్షింతును. ఇది దేవ రహస్యము. దీనిని ఎంత గోప్యముగా ఉంచిన అంత ఫలవంత మగును" అని చెప్పి అంతర్ధాను డైనాడు శ్రీహరి.

అదితి మురిసి పోయినది.

దివ్యజ్ఞానము గల కశ్యపుడు భగవంతుడు తనలో ప్రవేశించినాడని గ్రహించి, తన వీర్యమును అదితి గర్భమున ప్రవేశ పెట్టినాడు.

భాద్రపద శుక్ల ద్వాదశినాడు శ్రవణా నక్షత్రపు మొదటి పాదమున అభిజిన్ముహూర్తమందు శ్రీహరి అదితి కుమారుడై జన్మించినాడు. అపుడు దిశలు ప్రకాశించినవి. వనములు పూలతోను, ఫలములతోను విరాజిల్లినవి భూమండలము, స్వర్గము, ఆకాశము, దేవతలు, బ్రాహ్మణులు ప్రసన్నులైనారు. శంఖములు, దుందుభులు, భేరీలు, పణవములు మ్రోగినవి. అప్సరసలు నాట్యము చేసినారు. గంధర్వులు గానము చేసినారు. మునులు, దేవతలు, పితృదేవతలు, మనువులు, అగ్నులు విష్ణువును స్తుతించినారు. అదితి ఆశ్రమమున పూలవాన కురిసినది.

భగవంతుడు కాంతిమయ స్వరూపముతో ఆయుధములు, ఆభరణములు ధరించి అదితి గర్భమున జన్మించినాడు. ఆవిర్భవించిన కొలది క్షణములలోనే నటుడు వేషము మార్చుకున్నట్లు ఆ శ్రీహరి వామన బ్రహ్మచారిగా మారిపోయినాడు.

శ్రీహరిని వామన రూపమును దర్శించిన మహర్షులు ఆనందించిరి. ప్రజాపతిని పురస్కరించుకొని అతనికి జాతకర్మాది సంస్కారములు నిర్వహించినారు. వామన మూర్తికి ఉపనయనము జరిగినది. సవితృడు స్వయముగా అతనికి గాయత్రి మంత్రము ఉపదేశించినాడు. బృహస్పతి జన్నిదము వేసినాడు. కశ్యపుడు మొలత్రాడు కట్టినాడు. భూదేవి జింకచర్మము ఇచ్చినది. చంద్రుడు దండము ఇచ్చినాడు. అదితి కౌపీనము, కటి వస్త్రము ఇచ్చినది. ఆకాశము గొడుగు ఇచ్చినది. బ్రహ్మ కమండలువు ఇచ్చినాడు. సప్తర్షులు కుశలు ఇచ్చినారు. సరస్వతి రుద్రాక్షమాల ఇచ్చినది. కుబేరుడు భిక్షాపాత్ర ఇచ్చినాడు. పార్వతి భిక్ష వేసినది.

వామనమూర్తి అగ్ని ప్రజ్వరిల్ల చేసినాడు. కుశలతో చుట్టు ఆస్తరణము చేసినాడు. సమిధలతో అగ్నిని అర్చించినాడు. నేతితో ఆహుతులు ఇచ్చినాడు.

బలిచక్రవర్తి అశ్వమేధ యాగములు చేయుచున్నాడని విన్నాడు వామనుడు. తన అడుగులతో భూకంపము కలిగించుచు బలి యజ్ఞశాలకు బయలుదేరినాడు

నర్మదానది ఉత్తర తీరమున భృగు కచ్ఛప తీర్థమున బలిచక్రవర్తి అశ్వమేధము చేయుచున్నాడు. శుక్రాచార్యులు మున్నగు భార్గవులు యజ్ఞకార్యము నిర్వహించు చున్నారు.

వారికి వచ్చుచున్న వామనుడు కనిపించినాడు. అతడు ఉదయ భానునివలె వెలిగి పోవుచున్నాడు. అతని తేజమున యజ్ఞమునందున్న బలిచక్రవర్తియు, ఋత్విజులును, సదస్యులును నిస్తేజులైనారు. యజ్ఞశాలకు సూర్యుడో, అగ్నిహోత్రుడో, సనత్కుమారుడో విచ్చేయుచున్నాడనుకున్నారు.

వామనమూర్తి యజ్ఞమండపమున ప్రవేశించినాడు, అక్కడి వారందరు లేచి నిలుచున్నారు. సత్కార పూర్వకముగా స్వాగతము పలికినారు. బలిచక్రవర్తి ఆసనము వేసి వామనుని ఆసీనుని చేసినాడు. పాదములు కడిగి పూజించి పవిత్రుడైనాడు.

"బ్రాహ్మణకుమారా ! నమస్కారము. ఎందరో మహర్షుల తపస్సు మూర్తీభవించినట్లున్న నీవు నాకు దర్శనమిచ్చినావు. నీ పాదధూళిచే నా యిల్లు పావనమైనది.

పితృదేవతలు పవిత్రులైనారు. నా వంశము పావనమైనది. యజ్ఞము సఫలమైనది. నా పాపములు పటాపంచలైనవి. బ్రాహ్మణోత్తమా! కోరుము నీవు ఏది అడిగినను ఇత్తును.

వరచేలంబులో మాడలో ఫలములో వన్యంబులో గోవులో
హయములో రత్నములో రథంబులో విమృష్టాన్నంబులో కన్యలో
కరులో కాంచనమో నికేతనములో గ్రామంబులో భూములో
ధరణీఖండమొ కాక యే మడిగెదో ధాత్రీసురేంద్రోత్తమా"

అన్నాడు బలిచక్రవర్తి

అందుకు వామనమూర్తి, "అడిగినది లేదనక ఇచ్చు దాతలలో నీవు మేటివి. అందుకే నిన్ను యాచించుచున్నాను. నిన్ను ఎక్కువ అడుగను. నా అడుగులతో మూడు అడుగుల నేలమాత్రము ఇమ్ము" అని అడిగినాడు.

వామనుని మాటలు విని నవ్వినాడు బలి. "వటుడా! నీవు బాలుడవు. బుద్ధిలేని వాడవు. నేను సర్వలోకములకు ఏకైక చక్రవర్తిని. కోరిన నీకు ఒక ద్వీపమే యివ్వగలను. అట్టి నన్ను నీవు అడుగునది మూడు అడుగుల నేలయా! ఒకసారి నా ముందు చేయి చాచినవాడు, మరొకని ముందు చేయిచాచక బ్రతుకవలెను. నీ జీవికకు ఎంత భూమి అవసరమో కోరుము ఇత్తును.

"రాజా! ఆశకు అంతములేదు. దానికి లొంగినవానికి మూడులోకములు ఇచ్చినను తృప్తి కలుగదు. మూడు అడుగుల నేలతో సంతృప్తిచెందనివాడు, సప్తద్వీపాత్మకమైన జంబూద్వీపము నిచ్చినను తృప్తి చెందడు. ఒకద్వీపమిచ్చిన మరొకటి. మరొకటి ఇచ్చిన మరొకటి. అట్లు అతనికి ఏడుద్వీపములు కావలెననిపించును. పృథుచక్రవర్తి, గయుడు సప్తద్వీపములను పాలించినను వారికి అర్థకామముల మీది ఆశ తీరలేదు. దైవికముగా లభించిన దానితో తృప్తిచెందువాడే సుఖపడును. ఇంద్రియములకు లొంగువాడు ముల్లోకముల రాజ్యము జయించినను దుఃఖపడుచునే ఉండును. అగ్నివంటి అసంతృప్తి ఎల్లరను దహించుచుండును. అర్థకామముల అసంతృప్తియే సంసారబంధములకు కారణము. సంతృప్తి మోక్షకారణమగును. తృప్తిగలవాని తేజస్సు రెండింతలగును. అసంతృప్తి గలవాని తేజస్సు మాసిపోవును.

అందువలనే నిన్ను మూడు అడుగుల నేల అడిగినాను. కావలసిన దానికన్న ఎక్కువ కోరుట అధర్మము" అని ఉపన్యసించినాడు వామనమూర్తి.

"వటు! నీ కోరిక మూడడుగుల నేలయే యైన గ్రహింపుము" అని దానమిచ్చుటకు గాను జలపాత్ర నందుకున్నాడు బలిచక్రవర్తి.

వెంటనే శుక్రాచార్యుడు "వలదు వలదు" అని వారించినాడు. బలి చేయి పట్టుకొని, "మహారాజా! ఇతడు వటువు కాదు. సాక్షాత్తు విష్ణుమూర్తి. దేవకార్యమున అదితి గర్భమున జనించినవాడు. నీ సిరిసంపదలెల్ల హరించి ఇంద్రునకు ఇచ్చును. వెఱ్ఱివాడవై మూడడుగుల నేల ఇత్తునన్నావు. ఇతడు ఒక అడుగుతో భూమిని, మరొక అడుగుతో ఆకాశమును ఆక్రమించును. మూడవ అడుగు ఎచట పెట్టమందువు? అని అడుగును! అప్పుడు ఎచట నుండి తెచ్చియిత్తువు మూడవ అడుగు? నీ ప్రతిన నెట్లు నిలుపుకొనగలవు?"

"రాజా! అవును, అన్నది సత్యము, కాదు, అన్నది అసత్యము. దేహమను వృక్షమునకు సత్య మనునది పుష్పములు, ఫలములు. అసత్యము ఆ చెట్టునకు మొదలు. మూలమువంటి అసత్యమును సమయానుకూలముగ స్వీకరించకున్న దేహమను వృక్షము నిలువదు. అది నిలువనపుడు దాని పూవులు, పండ్లు అయిన సత్యము ఎట్లు నిలుచును? కాన అసత్యములేని సత్యములేదు. ఎల్లప్పుడు అసత్యము పలుకువాడు అపకీర్తి పాలగును. కాని,

వారిజాక్షులందు వైవాహికములందు ప్రాణ విత్తమాన భంగమందు
చకిత గోకులాగ్ర జన్మ రక్షణమందు బొంకవచ్చు నఘము పొంద దధిప!

కాబట్టి ఈ వటువునకు ఇత్తునన్నది ఇవ్వననుము. అందువలన నీకు దానవ వంశమును కాపాడినట్లగును" అని చెప్పినాడు.

"గురుదేవా! నేను ప్రహ్లాదుని మనుమడను. ఒకసారి ఇత్తునని ప్రతిజ్ఞచేసి తన లోభమున కాదనుట మోసము చేయుటకాదా? అసత్యమునకంటె అధర్మములేదు. భూదేవి ఎంతటిదైనను భరింపగలదు. కాని అసత్యము లాడువానిని భరింపలేదు. నేను నరకమునకు దారిద్ర్యమునకు, దుఃఖమునకు, మృత్యువునకు, రాజ్య నాశనమునకు భీతిల్లను. కాని మోసము చేయుటన్న నాకు భయము. దాన ధర్మములు చేసి మానవుడంత తృప్తిపడదగున్న పరమందు దక్కునదేమి?

కారే రాజులు రాజ్యముల్ గలుగవే గర్వోన్నతిం బొందరే
వారేరీ సిరిమూటఁ గట్టుకొని పోవంజాలిరే భూమిపైఁ
పేరైనం గలదే శిబిప్రముఖులుం బ్రీతిన్ యశఃకాములై
యీరే కోర్కులు వారలన్ మఱచిరే యిక్కాలమున్ భార్గవా

శ్రీహరి ఇట్లు వటువుగా వచ్చినాడరే. ఇతడు నాకు పగవాడైనను సరే ఇతడు కోరిన మూడు అడుగులనేల ఇవ్వగలను. మాటకు తిరుగులేదు" అన్నాడు బలి చక్రవర్తి.

తన శిష్యుడు, తనమాట మన్నించలేదని మండిపోయినాడు శుక్రాచార్యులు. "గురువు ఆజ్ఞకు ఎదురాడిన నీ సిరిసంపదలు నాశనమగుగాక! నీవు భ్రష్టుడవై పోదువుగాక!" అని శపించినాడు.

తన గురువు శపించినను చలించలేదు బలి. సత్యము విడువలేదు. యథావిధిగా వామనమూర్తిని అర్చించినాడు. దానమిచ్చుటకు జలము అందుకున్నాడు. అతని భార్య వింధ్యావళి బంగారు కలశముతో నీరు పోయుచుండ వామనమూర్తి పాదపద్మములను భాగ్యవంతుడైన బలిచక్రవర్తి స్వయముగా కడిగినాడు. విశ్వపావనమైన ఆ పాదజలమును తలపై చల్లుకున్నాడు.

ఆకసమునుండి ఇదంతయు చూచుచున్న దేవతలు మున్నగువారు చకితులైనారు. బలిచక్రవర్తి కీర్తిని గానము చేసినారు.

కమలనాభు నెరిగి కాలంబు దేశంబు
నెఱిగి శుక్రుమాట లెఱిగి నాశ
మెఱిగి పాత్రమనుచు నిచ్చె దానము బలి
మహి వదాన్యుడొరుడు మఱియుగలడె.

మూడడుగుల నేల ధారపోసెనో లేదో వామనమూర్తి ఆశ్చర్యముగా పెరుగసాగినాడు.

ఇంతింతై వటుడంతయై మఱియు దానింతై నభోవీథిపై
నంతై తోయదమండలాగ్రమున కల్లంతై ప్రభారాశిపై
నంతై చంద్రుని కంతయై ధ్రువునిపై నంతై మహర్వాటిపై
నంతై సత్యపదోన్నతుండగుచు బ్రహ్మాండాంత సంవర్ధియై.

భూమి, ఆకాశము, దిశలు, స్వర్గపాతాళములెల్ల ఇమిడియున్న విశ్వరూపము ప్రత్యక్షమైనది.

సర్వాత్ముడైన శ్రీహరి విశ్వరూపము చూచి దైత్యులు భయభ్రాంతులైనారు.

విష్ణువు ఒక అడుగున భూమండలమంతయు శరీరముతో ఆకసము భుజములతో దిక్కులు నింపినాడు. రెండవ అడుగున స్వర్గమును ఆక్రమించినాడు. ఆ అడుగు మహర్లోకము, జనలోకము, తపోలోకములను ఆక్రమించినది.



శ్రీ హరి వామనావతారమెత్తి బలిచక్రవర్తిని పాతాళమునకు త్రొక్కుట.

పుట. 354

పైకిలేచిన భగవానుని కాలిగోళ్ళ కాంతులకు సత్యలోకపు కాంతి వెలవెల బోయినది. బ్రహ్మ, మరీచి మున్నగువారు శ్రీహరి దివ్యపాదములను పూజించినారు. అర్ఘ్యపాద్యములిచ్చి బ్రహ్మదేవుడు శ్రీవిష్ణువు పాదములను ఆరాధించినాడు. భగవంతుని పాదము కడిగిన బ్రహ్మదేవుని కమండలములోని జలమే గంగాభవాని అయినది. అది ఆకాశమార్గమున భూమికిదిగి పాతాళమునకు చేరినది.

భగవంతుడు విశ్వరూపమును తగ్గించినాడు. బ్రహ్మ మున్నగు లోకపాలురు ఆ మహామహునకు వివిధములైన కానుకలు సమర్పించినారు. అతని ప్రతాపమును పొగడినారు. జయజయ ధ్వానములు చేసినారు. ఆడినారు. పాడినారు వాద్యములు వాయించినారు. జాంబవంతుడు అన్నిదిశలకు వెళ్ళి భేరీలు మ్రోగించినాడు.

వామనుడు మూడడుగుల మిషతో భూమండలము, ఆకాశము గ్రహించుట చూచినారు దానవులు. ఉద్రిక్తులై "మహారాజా! ఈతడు మరుగుజ్జు రూపమున నున్న విష్ణువుకాని బ్రాహ్మణుడుకాడు. సమయము చూచి వెన్నుపోటు పొడిచినాడు. అందువలన ఇతనిని చంపుటే మా ధర్మము" అని ఆయుధములగొని వామనమూర్తి మీదకు ఉరికినారు. దైత్యసేనను విష్ణుభటులు అడ్డుకున్నారు. విష్ణుభటులు తనసేనను నాశనము చేయుచున్నది చూసినాడు బలి. శుక్రునిశాపము తలచుకున్నాడు. తన సేనకు యుద్ధము మానవలసినదని ఆజ్ఞాపించినాడు. అపుడే ఓడిఉన్నారు దైత్యులు. ప్రభువు ఆనతి విని యుద్ధము మానినారు. భగవంతుని మనసులోని మాట నెరిగి గరుడుడు బలిని వరుణపాశములతో కట్టివేసినాడు.

అశ్వమేధయాగమున బలిచక్రవర్తి సోమపానము చేయవలసిన రోజది. గరుడుడు అతనిని బంధించగానే భూమ్యాకాశములు హాహా కారములు చేసినవి.

వామనమూర్తి బలిచక్రవర్తితో "బలీ! నాకు మూడడుగులనేల దానమిచ్చినావు. ఒక అడుగున ఆకాశము, మరొక అడుగున భూమి ఆక్రమించినాను. మూడవ అడుగునకు స్థలములేదు. కాన నీ ప్రతిజ్ఞ పూర్తికాలేదు.

> ఇచ్చెదనని ఆశపెట్టి ఇవ్వనివాని కోర్కెలన్నియు కూలును. అతనికి స్వర్గము
> లేదు సరికదా నరకము కలుగును.

కాబట్టి నీకు నరకము తప్పదు. మహాధనవంతుడనని గర్వించి ఇచ్చెదనని ప్రతిజ్ఞ చేసినావు. చివరకు మోసముచేసినావు. అసత్యమాడిన ఫలము అనుభవించుము" అన్నాడు.

అందుకు బలి ఇట్లన్నాడు :—

"ప్రభూ ! నామాట అసత్యము చేయవలెననుకున్నావు. కాని నా మాట సత్యమని ప్రతిపాదింతును. నీకు నేనిచ్చునది మూడడుగుల నేల. రెండడుగులు ఇది వరకే ఇచ్చినాను. మూడవ అడుగు నాతలమీద పెట్టుము.

> నా ఐశ్వర్యముపోయినను నా కీర్తికి కళంకము రాకూడదు. రాజ్యము పోయినను, కష్టములు వచ్చినను, పేదరికము వచ్చినను, తుదకు నీతో విరోధము వచ్చినను జంకువాడనుకాను. కాని అపకీర్తికి జంకుదును.

నీవు నన్ను దండించుట నాభాగ్యముగానే భావింతును. పలయన తలిదండ్రిలు, స్నేహితులు సహితము నీవలె దండించలేరు. మమ్ము దండించి మా జ్ఞాననేత్రము తెరిపించువాడవు నీవు. నీచేత ఓడినందుకు సిగ్గిలను. విచారించను. అది నీ అనుగ్రహముగా భావింతును.

నా తాత ప్రహ్లాదుడు నీ పరమభక్తుడు. అతడు దశేంద్రియములను జయించినవాడు. నా ముత్తాత పెట్టిన కష్టములను లెక్కచేయక నిన్నే భజించినాడు. ఉత్తమ భక్తుడై నాడు. పరమ భాగవతుడు అయినాడు.

బలి తాతనుగురించి చెప్పుచుండగానే ప్రహ్లాదుడు అచట ప్రత్యక్షమైనాడు. వరుణపాశ బంధములందున్న బలి తాతను పూజింపలేక పోయినాడు. తలవంచి కన్నీరు పెట్టుకున్నాడు.

ప్రహ్లాదుడు వామనమూర్తికి సాగిలబడి నమస్కరించినాడు. చేతులు జోడించి "స్వామీ ! నీవు సర్వలోకాశ్రయుడవు. సర్వాంతర్యామివి. జగదీశ్వరుడవు. నీకు నమస్కారము. బలికి ఇంద్రపదవి ఇచ్చినవాడవు నీవే. తీసుకున్నవాడవు నీవే. నీవు చేసినపని సర్వోత్తమముగా ఉన్నది. పలసన ఐశ్వర్యమదము మనిషిని గ్రుడ్డివానిని చేయును. అట్టి సిరిసంపదల పంకమునుండి ఇతనిని ఉద్ధరించినావు. అట్లు చేయుటవలన బలిపై ఆగ్రహము కాక అనుగ్రహమునే చూపినావు" అన్నాడు.

బ్రహ్మదేవుడు వామనమూర్తితో "ప్రభూ ! బలిని వదిలిపెట్టుము. ఇతని సర్వస్వము హరించినావు. ఉన్నదంతయు అర్పించినవాడు దండనీయుడు కాదు. ఇతడు కల్లకపటములేక ఈ భూమి మాత్రమేకాక కర్మార్జితములైన స్వర్గము మున్నగువానిని దానము చేసినాడు. నిష్కల్మష హృదయమున నీకు తృణమో, పణమో అర్పించువాడు సహితము ఉత్తమగతులు పొందుచున్నప్పుడు నిస్సంశ

చముగా ముల్లోకములు దానముచేసిన బలి ముక్తికి పాత్రుడు కావలయునుగాని దండనకు పాత్రుడు కారాదు" అని ప్రార్థించినాడు.

> "ధనమువలన మానవుడు మదోన్మత్తుడగును. నిన్ను నన్ను ఎల్లరను తిరస్కరించును. అందువలన నేను అనుగ్రహించినవారి సిరిసంపదల నాశనము చేయుదును. జీవుడు తనకర్మవలన జననమరణముల పాలగుచుండును. చివరకు మనుష్య జన్మమెత్తును. ఆ జన్మమున కులీనత, కర్మ, అవస్థ, రూపము, విద్య, ఐశ్వర్యము, ధనము మున్నగు వానివలన గర్వించకున్న వాడే నాకృపకు పాత్రుడు అగును. గర్వము, అభిమానము మానవుని అధఃపతితుని చేయును. జడబుద్ధి కల్పించును. అశుభములకు దారితీయును. నన్ను ఆశ్రయించినవారికి ధనాదుల ఎడల మోహము జనించదు.

ఈ బలి దైత్యులలో అగ్రగణ్యుడు. జయించరాని మాయను జయించినాడు. ఎన్ని కష్టములు వచ్చినను నిశ్చలముగా ఉన్నాడు. ధనముపోయినది. స్థానచ్యుతి కలిగినది. శత్రువులు తిరస్కరించినారు. పాశములచే కట్టుబడినాడు. జ్ఞాతులు విడిచినారు. యాతన అనుభవించుచున్నాడు. అయినను కొంచమైనను చలించలేదు. కులగురువు శపించినను సత్యము వీడలేదు. నేను సహితము మోసగించినాను. అధర్మము ఉపదేశించినాను. అయినను ఇతడు అసత్యవాది కాలేదు. కావున ఇతనికి దేవతలకు సహితము దుర్లభమైన వరమును అనుగ్రహించుచున్నాను. సావర్ణి మన్వంతరమున ఇతడు ఇంద్రుడగును. నాకు పరమ భక్తుడగును. అంతవరకు విశ్వకర్మచే నిర్మించబడిన సుతల లోకమున ఉండును. ఆ లోకమున ఉన్నవారికి శారీరక మానసిక వ్యాధు లుండవు. వారికి ఏ విధములైన విఘ్నములు కలుగవు" అని వామనమూర్తి బ్రహ్మకుచెప్పి బలితో ఇట్లన్నాడు.

"బలిరాజా! నీవు సుతలలోకమునకు బంధుసమేతుడవై వెళ్ళుము. నీకు శుభము కలుగును. ఆ లోకమున నేను నీకు ద్వారరక్షకుడనై ఉందును. అచట నిన్ను ఎవరును జయించలేరు. ఆజ్ఞపాలించని దైత్యులను నా సుదర్శన చక్రము తునాతునకలు చేయును. నిన్ను, నీ అనుచరులను, నీ భోగవస్తువులను కంటికి రెప్పవలె కాపాడుదును.

సుతలలోకమున నేను ఎల్లపుడు నీ వద్దనే ఉండుటచే దానవుల సంపర్కమువలన నీకు కలుగు అసురభావము నా ప్రభావమువలన నశించును."

శ్రీహరి మాటలు విన్నాడు బలి. ఆనంద బాష్పములతోను, గద్గద కంఠమునను, చేతులు జోడించి, "దేవదేవా! నీకు పూర్తిగా నమస్కారమైనను చేయలేని స్థితి యందున్నాను. అసుర యోనిలో జన్మించిన నాకు దుర్లభమైన వరమిచ్చి అనుగ్రహించినావు. నీ శరణుజొచ్చిన భక్తులకు లభించు వరమును నాకు ప్రసాదించినావు. నిన్ను కీర్తించుటకు సహితము నావద్ద పదములులేవు" అనుచుండగనే వరుణపాశములు తెగిపోయినవి. వామన దేవునకు, బ్రహ్మకు, శివునకు నమస్కరించి అసురులతో కలిసి సుతలలోకమునకు వెళ్ళిపోయినాడు బలిచక్రవర్తి.

అట్లు బలివద్ద తీసుకున్న రాజ్యమును శ్రీహరి ఇంద్రునకు కట్టబెట్టినాడు.

య ఇదం దేవదేవస్య హరేరద్భుతకర్మణః
అవతారానుచరితం శృణ్వన్ యాతి పరాం గతిమ్.

అద్భుత కర్ముడు, దేవదేవుడు అయిన వామన దేవుని చరిత్ర ఎవరు వినునో వానికి పరమపదము లభించును.

మత్స్యావతారము.

వెనుకటి కల్పాంతమున బ్రహ్మ నిద్రించినాడు. నైమిత్తిక ప్రళయము కలిగినది. భూలోకము మున్నగు లోకములు జలమయములు అయినవి. అపుడు నిద్రించుచున్న బ్రహ్మముఖమునుండి వేదములు వెలువడినవి. హయగ్రీవుడను రాక్షసుడు వానిని దొంగిలించినాడు. తిరిగి వేదములను తెచ్చి ఇచ్చుటకుగాను శ్రీహరి ప్రథమావతారమైన మత్స్యావతారము నెత్తినాడు.

ఆ కాలమున సత్యవ్రతుడను రాజు ఉండెను. అతడు నారాయణ ప్రియుడు. జలము మాత్రము ఆహారముగాగొని తపస్సు చేయుచుండెను. అతడు ఒకనాడు "కృతమాల" నదీ తీరమున జలతర్పణము చేయుచుండెను. అతని దోసిలిలోనికి నీటితోకూడ ఒక చేప వచ్చెను. అతడు దానిని నదిలో విడువగా ఆచేప "తమ హీనిని తామే చంపుకొని తిను చేపలకు వెరచి నీదోసిలిలోనికి వచ్చిన నన్ను విడుచుట ధర్మమగునా!" అన్నది. దీనములైన చేప పలుకులు విన్నాడు రా
చేపను కమండలములో వేసుకొని తన ఆశ్రమమునకు వచ్చినాడు.

ఆ రాత్రి అది కమండలమంత పెరిగినది. "రాజా! నేనీకమండలమున ఉండలేను. విశాలమైన వేరొకస్థలమున విడువుము" అని రాజును కోరినది.

రాజు దానిని గంగాళములో వేసినాడు. క్షణములో అది మూడు మూరలు పెరిగినది. "రాజా! నేను గంగాళమున ఉండలేను. విశాలమైన వేరొక స్థలమున విడువుము" అని ఆ చేప రాజును కోరినది.

రాజు దానిని ఒకసరస్సులో విడిచినాడు. క్షణములో అది సరస్సంత పెరిగి "రాజా! నే నీ సరస్సున ఉండలేను. విశాలమైన వేరొకస్థలమున విడువుము" అని చేప రాజును కోరినది.

రాజునకు అంతకన్న విశాలమగు సరస్సు కానిపించనందున, దానిని సముద్రమున విడిచినాడు. అప్పు డా మత్స్యము, "రాజా! సముద్రమున మొసళ్ళు మున్నగునవి నన్నుభక్షించును. అట్టిచోట నన్ను విడుచుట నీకు న్యాయమా?" అని అడిగినది.

శ్రుతిమధురముగా అనుచున్న ఆ చేపమాటలువిని సత్యవ్రతుడు "అయ్యా! నీ వెవడవు? మత్స్యరూపమున నాకేల మోహము కలిగింతువు? కొన్నిదినములలో నీవు నూరు యోజనములు పెరిగినావు. ఇట్టి జలచరమును మేము ఇంతవరకు చూచిగాని వినిగాని ఎరుగము. నీవు భూతములను అనుగ్రహించుటకుగాను మత్స్యరూపమెత్తిన నారాయణుడవుకాని వేరుకాదు. పురుషోత్తమా! నీకు నమస్కారము" అని దేవదేవుని పలు తెరగుల స్తుతించినాడు.

మత్స్యరూపమున ఉన్న భగవంతుడు సత్యవంతునితో, "రాజా! నేటికి ఏడవ నాడు లోకములన్నియు నీట మునుగును. అప్పుడు నేను నీ వద్దకు ఒక గొప్ప నావను పంపుదును. నీవు సకల ఔషధములను నానావిధ బీజములను సంగ్రహించి ఆ నావపై వేయుము. సప్తఋషులతోకూడి ఆ నావను ఎక్కుము. వాసుకియను త్రాటితో ఆ నావను నా కొమ్మునకు కట్టుము. ఏకార్ణవమున సుఖముగా సంచరించుము." అని చెప్పి అంతర్థానుడయ్యెను.

సత్యవ్రతుడు తూర్పుకొనలుండునట్లు కుశాసనము వేసుకున్నాడు. ఈశాన్యము వైపు ముఖముచేసి ఆ దర్భలపై కూర్చొని హరిని ధ్యానించుచు ప్రళయమునకై ప్రతీక్షించ సాగినాడు.

ఏడు దినములు గడచినవి. సముద్రము పొంగినది. మహామేఘములు వర్షించినవి. భూమండలమంతయు నీట మునిగినది.



శ్రీ హరి మత్స్యావతారమెత్తి వేదముల నుద్ధరించుట.

పుట. 362

ఒక పెద్దనావ సత్యవ్రతునివద్దకు వచ్చినది. సత్యవ్రతుడు ఓషధులను బీజములను ఓడపై వేసినాడు. సప్తఋషులతో కలిసి ఓడ ఎక్కినాడు. సప్తఋషులు బోధించగా తీవ్రమగుగాలికి వెరచి మత్స్యభగవానుని స్తుతించినాడు. మత్స్యభగవానుడు సముద్రమధ్యమున ప్రత్యక్షమైనాడు. ఆ మత్స్యము నాలుగు లక్షలయోజనములున్నది. దానిశరీరము బంగారమువలె మెరయుచున్నది. దానికి ఒకపెద్ద కొమ్ము కలదు. పూర్వము భగవంతుడు ఆదేశించిన ప్రకారము సత్యవ్రతుడు వాసుకితో నావను ఆ చేప కొమ్మునకు కట్టినాడు. మత్స్యభగవానుని స్తుతించినాడు. ఆత్మతత్వము ఉపదేశించ వలసినదని ప్రార్థించినాడు.

సత్యవ్రతుని ప్రార్థనవిన్న భగవంతుడు మత్స్యరూపమున సముద్రమున విహరించుచునే సత్యవ్రతునకు ఆత్మతత్వము ఉపదేశించినాడు. జ్ఞాన, భక్తి, కర్మయోగములను వివరించినాడు.

సత్యవ్రతుడు ఆత్మతత్వమును గ్రహించినాడు.

ప్రళయము ముగిసినది. బ్రహ్మ నిద్రనుండి మేల్కాంచినాడు. శ్రీహరి హయగ్రీవ దానవుని చంపినాడు. అతడు దొంగిలించిన వేదములను తెచ్చి బ్రహ్మకు ఇచ్చినాడు. భగవంతుని అనుగ్రహము వలన సత్యవ్రతుడు జ్ఞాన విజ్ఞాన సమన్వితుడైనాడు. అతడే ఈ కల్పమున వైవస్వతమనువు అయినాడు.

> అవతారం హరేర్యోఽయం కీర్తయేదన్వహం నరః
> సంకల్పాస్తస్య సిధ్యంతి స యాతి పరమాం గతిమ్

ప్రతిదినము హరియొక్క ఈ యవతారమును కీర్తించిన నరుని సంకల్పములు సిద్ధించును. అతడు పరమ పదమును పొందును.

ఇది అష్టమస్కంధము

శ్రీమద్భాగవతము

నవమ స్కంధము

సుకన్య.

శర్యాతి మనుపుత్రులలో విద్వాంసుడు. అతనికి సుకన్య అను ఒక కూతురు ఉండెను. ఆమె చక్కని చుక్క.

ఒకనాడు ఆరాజు అడవికి వెళ్ళినాడు. అతనివెంట సైన్యము వెళ్ళినది. సుకన్య కూడ వెళ్ళినది. వారు చ్యవనుని ఆశ్రమమువద్దకు వచ్చినారు. ఆశ్రమము యొక్క అందము చూచుచు బయలుదేరినది సుకన్య. అచట ఆమెకు ఒక పుట్ట కనిపించినది. పుట్టలోనుండి మిణుగురులవంటి రెండు జ్యోతులు కనిపించినవి. బాల్య చాపల్యమువలన సుకన్య ముళ్ళతో ఆ జ్యోతులను పొడిచినది. అందు నుండి రక్తము చిమ్మినది.

అట్లు రక్తము చిమ్మగనే శర్యాతి సైనికుల మల మూత్రములు బంధించినవి. మహర్షికి ఏదో అపరాధము జరిగియుండునని ఊహించినాడు శర్యాతి. సుకన్య వలన జరిగినవృత్తాంతము తెలుసుకున్నాడు. సుకన్య పొడిచినది చ్యవనుని కన్నులేనని గ్రహించినాడు. పుట్టవద్దకు పరుగెత్తి చ్యవనుని ప్రార్థించి అతనిని శాంతపరచినాడు. సుకన్యను చ్యవనునకు సమర్పించి ఆ యాపదనుండి తప్పించుకున్నాడు.

చ్యవనుడు కోపిష్టి. అయినను తనపరిచర్యలవలన శాంతుని ప్రసన్నుని చేసినది సుకన్య. వారు అన్యోన్యముగా జీవించసాగినారు.

ఒకనాడు చ్యవనుని ఆశ్రమమునకు అశ్వినీ కుమారులు వచ్చినారు. వారినిచూచి తనకు యవ్వనము వచ్చునట్లు చేయవలసినదని కోరినాడు చ్యవనుడు. తన అందముచూచి అతివలు మురిసిపోవలెనని కోరినాడు. అందుకు బదులుగా అశ్విని కుమారులకు యజ్ఞమున సోమపానము చేయు అధికారము కల్పించుదునన్నాడు.

అశ్వినీ కుమారులు అందుకు అంగీకరించినారు. వారు చ్యవనుని సిద్ధులునిర్మించిన ఒక సరస్సునకు తీసుకొనివెళ్ళినారు. అశ్వినీకుమారులిద్దరు చ్యవనుడు ఒకడు

ముగ్గురు సరస్సున మునిగినారు. ముసలివాడు చ్యవనుడు యువకుడై నాడు. అతడు అశ్వినీకుమారులవలె కనిపించినాడు.

సుకన్య ఆ ముగ్గురినిచూచినది. తన భర్తను గుర్తించలేకపోయినది. తనభర్తను చూపవలసినదని అశ్వినీకుమారులను ప్రార్థించినది. వారు ఆమె పాతివ్రత్యమునకు సంతసించి చ్యవనుని ఆమెకు అప్పగించి స్వర్గమునకు వెళ్ళిపోయినారు. చ్యవనుడు, సుకన్య సుఖముగా కాలము గడుప సాగినారు.

ఒకనాడు శర్యాతి యజ్ఞము చేయించవలసినదని చ్యవనుని ప్రార్థించుటకు చ్యవనుని ఆశ్రమమునకు వచ్చినాడు. యువకుని వర్చస్సుతో ప్రకాశించుచున్న సుకన్యను చూచినాడు. తండ్రినిచూచి సుకన్య పాదాభివందనము చేసినది. అతడు ఆమెను ఆశీర్వదించలేదు. తన కూతురు పరాయివానితో కులుకుచున్నదను కున్నాడు. "ఉత్తమకులమున జన్మించిన నీకు ఈ దుర్బుద్ధి ఎట్లు పుట్టినది? ఇటు పుట్టినింటిని అటు మెట్టినింటిని నరకము పాలుచేసినావు" అని చీవాట్లు పెట్టినాడు.

సుకన్య చిరునగవు నవ్వినది. జరిగినదంతయు వివరించినది. చ్యవనుడే యువకుడై నాడని చెప్పినది. శర్యాతి ముందు ఆశ్చర్యపడినాడు. తరువాత సంతోషించినాడు. కూతురును దగ్గరకుతీసుకొని దీవించినాడు.

అశ్వినీకుమారులు వైద్యవృత్తి అవలంబించుటవలన దేవతలు వారికి సోమపానము లేకుండచేసినారు. వారికి సోమపానము కల్పించుటకుగాను చ్యవనుడు శర్యాతి చేత సోమయజ్ఞము చేయించినాడు. ఇంద్రుడు అదిచూచి సహించలేక పోయి నాడు. శర్యాతిని వధించుటకు వజ్రాయుధము ఎత్తినాడు. చ్యవనుడు తన శక్తిచే ఇంద్రుని చేయి ఎత్తినది ఎత్తినట్లే ఆపి వేసినాడు. ఇంద్రునకు గత్యంతరము లేకపోయినది. అశ్వినీకుమారులకు సోమపానమందు భాగము ఇచ్చుటకు అంగీకరించినాడు.

నాభాగుడు.

నభగునకు కనిష్ఠపుత్రుడు నాభాగుడు. అతడు చిరకాలము గురువుల ఇంటనే ఉండిపోయినందున అన్నలు తండ్రి ఆస్తినంతయు పంచుకున్నారు. నాభాగుడు విద్వాంసుడై తిరిగివచ్చి తండ్రి ఆస్తిలో తన భాగమునుగూర్చి అన్నలను అడిగి నాడు. నాభాగుని పాలునకు తండ్రిని ఇచ్చినా మన్నారు అన్నలు.

నాభాగుడు తండ్రివద్దకువెళ్ళి తండ్రిని అడిగినాడు. తండ్రి, "నాయనా! వారి మాటలు పట్టించుకొనకుము. అందువలన నీకు వచ్చులోపములేదు. అంగిరస బ్రాహ్మణులు గొప్ప సత్రయాగము చేయుచున్నారు. ఆరవనాటి కర్మలో వారు పొరపాటు చేయుదురు. వారికి వైశ్వదేవ సూక్తములు తెలియజేయుము. వారు యజ్ఞముపూర్తిచేసి స్వర్గమునకు వెళ్ళిపోవుదురు. అప్పుడు యజ్ఞమున మిగిలిన ధనము నీకు దక్కును" అనిచెప్పినాడు.

నాభాగుడు తండ్రిచెప్పిన ప్రకారమే చేసినాడు. అంగిరసులు స్వర్గమునకు వెళ్ళిపోయినారు. యజ్ఞమున మిగిలిన ధనమును నాభాగుడు తీసుకొనిపోగా ఉత్తరమునుండి ఒకనల్లని పురుషుడువచ్చి "యజ్ఞమున మిగిలిన దంతయు నాది" అన్నాడు. "ఋషులు నాకు ఇచ్చినారు కాన ఇదినాది" అన్నాడు నాభాగుడు. "నభగుడే ఈ తగువు తీర్చుగాక!" అన్నాడు ఆ వచ్చినవాడు.

నాభాగుడు తండ్రిని ఆ తగువు తీర్చుమని అడిగినాడు. "అవును యజ్ఞమున మిగిలినదంతయు శివునిదని పూర్వ నిర్ణయము కలదు. కాన అదంతయు శివునిదే" అని చెప్పినాడు నభగుడు. నాభాగుడు శివుని వద్దకేగి తండ్రి చెప్పినది చెప్పి తాను అపరాధము చేసినాననీ, తనను క్షమించ వలసినదనీ కోరినాడు.

అతడు సత్యము చెప్పినందులకు మెచ్చుకొని శివుడు మిగిలిన ధనమంతయు నాభాగునకు ఇచ్చినాడు.

అంబరీషుడు.

నాభాగుని కుమారుడు అంబరీషుడు. అతడు సప్తద్వీపాత్మకమైన భూమండల మంతయు పాలించినాడు. అతడు విష్ణుభక్తుడు. శ్రీహరికి దాసుడు. కోరికలులేని కర్మలు చేయువాడు. చేసినకర్మలను శ్రీహరికి అర్పించువాడు. అంబరీషుని రాణి అతని వలెనే శీలవతి.

ఒకసారి భార్యతోకలిసి ఒక సంవత్సరము పర్యంతము ద్వాదశీవ్రతము చేసినాడు అంబరీషుడు. వ్రతము పూర్తి అయినది. కార్తీకమాసమున మూడురాత్రులు ఉపవాసమున్నాడు. ద్వాదశినాడు యమునానదిలో స్నానముచేసి మధువనము నందు శ్రీహరిని అర్చించినాడు. బ్రాహ్మణులకు అనేక గోదానములు చేసి నాడు. షడ్రసోపేతమైన భోజనములుపెట్టి వారి అనుమతితో వ్రత పారణ చేయుటకు సిద్ధపడినాడు.

సరిగా ఆదే సమయమునకు ముక్కోపి దూర్వాసుడు అచటికి వచ్చినాడు. అంబరీషుడు అతనిని సత్కరించి భోజనమునకు ఆహ్వానించినాడు. దూర్వాసుడు ఆహ్వానమును అంగీకరించినాడు. కాని మాధ్యాహ్నికములు తీర్చుకొనుటకు యమునానదికి వెళ్ళినాడు. పరబ్రహ్మమును ధ్యానించుచు యమునానదిలో మునిగినాడు.

ద్వాదశి ఒకముహూర్తము మాత్రమున్నది. దూర్వాసుడు రాలేదు. ద్వాదశి దాటిపోయిన వ్రతముచెడును. అతిథిని విడి పారణచేయుట అధర్మమగును. అంబరీషుడు ధర్మసంకటమున పడినాడు. నీరు త్రాగిన భోజనము చేసినట్లును, చేయనట్లును అగునని శ్రుతులు చెప్పుచున్నందున తీర్థము సేవింతునని నిశ్చయించి అంబరీషుడు మంచినీరు త్రాగినాడు.

తదుపరి యముననుండి వచ్చిన దూర్వాసునకు అంబరీషుడు స్వాగతము పలికినాడు. అంబరీషుడు పారణపూర్తి చేసినది గ్రహించి మండిపోయినాడు దూర్వాసుడు. ధనమదమున కన్నుమిన్నుగానక నాకు అపరాధము చేయుదువా? చూడు నిన్నేమి చేతునో" అని పళ్ళు పటపటకొరికి తన జడలోనుండి ఒక జడ నూడ పెరికినాడు. దానినుండి కాలాగ్ని శిఖవంటి ఒక దయ్యమును సృష్టించినాడు. అది అంబరీషునిమీదకు ఉరికినది.

అంబరీషుని భక్తికిమెచ్చి శ్రీవిష్ణువు అతని రక్షణకుగాను సుదర్శనచక్రమును నియోగించినాడు. సుదర్శనచక్రము ఆ దయ్యమును బూడిద చేసినది. చక్రము అంతటితో విరమించక దూర్వాసుని వెంటపడినది.

దూర్వాసుడు పారిపోసాగినాడు. సుదర్శనము అతనిని వెన్నంటినది. అతల, వితల, సుతల, పాతాళలోకములకు పరుగెత్తినాడు దూర్వాసుడు. కాని సుదర్శనము అతనిని విడలేదు. స్వర్గము, ఆకాశము, సముద్రము, పర్వతములవెంట పరుగెత్తినాడు.

సుదర్శనము అతనిని విడలేదు. లోకపాలురను శరణు వేడినాడు. కాని వారు అతనిని రక్షించలేక పోయినారు. సుదర్శనము అతనిని విడలేదు. బ్రహ్మ దగ్గరకు పరుగెత్తి రక్షించవలసినదని ప్రార్థించినాడు. తనవల్ల కాదన్నాడు బ్రహ్మదేవుడు. దూర్వాసుడు శివునివద్దకు పరుగెత్తి రక్షింపవలసినదని ప్రార్థించినాడు. తనవల్ల కాదన్నాడు శివుడు.

దూర్వాసుడు విష్ణువద్దకు పరుగెత్తినాడు. లక్ష్మీదేవితో ఉన్న శ్రీహరి పాదములపై వ్రాలినాడు. శ్రీహరిని స్తుతించి రక్షించ వలసినదని వేడుకొన్నాడు.

శ్రీహరి గంభీరముగా ఇట్లు వచించినాడు.

> "దూర్వాసా! నేను భక్తపరాధీనుడను. నన్ను భక్తులు ప్రేమింతురు. వారికి నేను ఒక్కడనే ఆధారము. నా భక్తులు నన్ను ప్రేమింతురు. నేను నా భక్తులను ప్రేమింతును. నా మనసు భక్తుల అధీనమున ఉండును. నా భక్తులను కాదని నా అర్ధాంగి లక్ష్మిని, తుదకు నన్నుకూడ నేను ఒల్లను. నా భక్తులు భార్యాపుత్రులను, ఇండ్లు వాకిండ్లను, తలిదండ్రులను, ధనప్రాణములను, ఇహపరములను త్యజించి నన్ను ఆశ్రయింతురు. అట్టివారిని వదలుకొనుటకు కలలోనైనను భావించలేను. పతివ్రత ఉత్తమురాలైన భర్తను తన అధీనము నందుంచుకొనును. సమదర్శి అయిన భక్తుడు ప్రేమ బంధముచే నన్ను స్వాధీనములో నుంచుకొనును. అతడు నన్ను సేవించి కృతకృత్యుడనైతి ననుకొనును. సాలోక్యము, సారూప్యము లభించినా ఒల్లకపడు. అందువలన నా ప్రియభక్తులే నా హృదయము. నా భక్తుల హృదయమే నేను. నన్ను వినా ఏమియు ఎరుగరువారు. వారిని వినా ఏమియు ఎరుగను నేను.

కావున దూర్వాసా! నేనొక ఉపాయము చెప్పెదను వినుము. నీవు ఏ అంబరీషుని బాధించవలెనని ప్రయత్నించి ఈ యాపద నెత్తిన వేసుకున్నావో ఆ యంబరీషునే శరణు వేడుము. అతడే నిన్ను రక్షించును

> నిరపరాధులైన సాధువులను బాధపెట్టువారికి బాధలు తప్పవు.

"వెళ్ళుము. శుభముకలుగును. అంబరీషుని శరణు వేడుము. నీకు శాంతిలభించును."

శ్రీహరి మాటలు విన్నాడు దూర్వాసుడు. అంబరీషునివద్దకు పరుగెత్తినాడు. సుదర్శనచక్రము అతనివెంటనే వచ్చినది. దూర్వాసుడు అంబరీషుని కాళ్ళపై పడినాడు. దూర్వాసునంతటి మహర్షి తన కాళ్ళమీదపడగా సిగ్గుపడినాడు అంబరీషుడు. అతని హృదయము ద్రవించినది. సుదర్శనచక్రమును స్తుతించి శాంతించ వలసినదని ప్రార్థించినాడు.

సుదర్శనము శాంతించినది. దూర్వాసుడు మంటలనుండి విముక్తుడైనాడు.

దూర్వాసుడు అంబరీషుని ఆశీర్వదించి "రాజా! శ్రీహరి భక్తులమహిమను నేడు కన్నులార చూచినాను నీకు అపరాధముచేసినను నా క్షేమమే విచారించినావు. భక్తవత్సలుడైన శ్రీహరిని స్వాధీన పరచుకున్న వారికి సాధ్యపడనిది ఏమున్నది?

కరుణాహృదయుడవైన నీవు నా అపరాధమును లెక్కచేయక నా ప్రాణములు రక్షించినావు" అన్నాడు.

దూర్వాసుడు పారిపోయి తిరిగివచ్చువరకు ఒక సంవత్సరమైనది. అంతకాలము అంబరీషుడు భోజనము చేయలేదు. దూర్వాసుడు తిరిగివచ్చునని కనిపెట్టుకొని కూర్చున్నాడు. దూర్వాసుడు తిరిగివచ్చిన తరువాత అతనికి అతిథిపూజ చేసినాడు. షడ్రసోపేతమైన భోజనము పెట్టినాడు.

దూర్వాసుడు భోజనముచేసి వెళ్ళిపోయిన తరువాత మిగిలిన పవిత్రాన్నమును భుజించినాడు అంబరీషుడు.

వార్ధక్యము వచ్చినతరువాత పుత్రులకు రాజ్యము అప్పగించి అంబరీషుడు అడవులకు వెళ్ళినాడు. అచట ఆత్మస్వరూపుడైన శ్రీహరిని ధ్యానించుచు సంసారము నుండి తరించిపోయినాడు.

> ఇత్యేతత్పుణ్య మాఖ్యాన మంబరీషస్య భూపతేః
> సంకీర్తయన్న నుధ్యాయన్ భక్తో భాగవతో భవేత్

అంబరీష మహారాజుయొక్క పుణ్యకథను విన్నను కీర్తించినను భక్తుడు భాగవతోత్తముడగును.

వికుక్షి.

మనువు తుమ్మినప్పుడు అతని ముక్కునుండి పుట్టినాడు ఇక్ష్వాకు. అతనికి వందమంది పుత్రులు వారిలో వికుక్షి, నిమి, దండుడు పెద్దవారు.

ఒకనాడు ఇక్ష్వాకు అష్టకా శ్రాద్ధమునకుగాను తగిన మాంసమును తేవలసినదని వికుక్షిని పంపినాడు. అతడు అడవికివెళ్ళి శ్రాద్ధమునకు పనికివచ్చు ఎన్నో మృగములను వేటాడినాడు. వేటలో అలసిపోయి, ఆకలి అయినందున చంపిన మృగములలో ఒకదానిని వండించి తిన్నాడు. తక్కిన మాంసమును తెచ్చి తండ్రికి ఇచ్చినాడు. కులగురువైన వసిష్ఠుడు ఆ మాంసమును చూచినాడు. అపవిత్రమైన మాంసము శ్రాద్ధమునకు పనికిరాదు అన్నాడు. శ్రాద్ధమునకై వధించిన జంతువును స్వయముగా తినరాదనే నియమమును ఉల్లంఘించినాడు వికుక్షి. అందువలన తండ్రికి కోపమువచ్చి పుత్రుని రాజ్యమునుండి వెడలగొట్టినాడు.

పురంజయుడు.

వికుక్షి కుమారుడు పురంజయుడు. పూర్వము జరిగిన దేవాసుర యుద్ధమున దేవతలు ఓడిపోయినప్పుడు దేవతలు పురంజయుని సహాయము కోరినారు. ఇందుడు

తనకు వాహనమైనచో తాను పోరాడుదును అన్నాడు పురంజయుడు. అందుకు ఇంద్రుడు మొదట అంగీకరించలేదు కాని శ్రీహరిచెప్పగా అంగీకరించి, ఆబోతు రూపము ధరించినాడు. శ్రీహరి తనశక్తిని పురంజయునిలో ప్రవేశపెట్టినాడు. ఆబోతురూపమున ఉన్న ఇంద్రునిపై ఎక్కి కకుదము (మూపురము) వక్కన కూర్చుని దైత్యులపురముమీదకు దాడి వెడలినాడు పురంజయుడు.

దేవదానవులకు ఘోరమైన యుద్ధము జరిగినది. పురంజయుడు తన ఎదుటపడిన వారినందరను యమలోకమునకు పంపినాడు. దానవ సైన్యమును ఊచకోత కోసినాడు. అతని ప్రతాపము ముందు దానవులు నిలువలేక పారిపోయినారు. పురంజయుడు వారి ఐశ్వర్యము అంతయు ఇంద్రునకు అప్పగించినాడు.

దానవుల పురమును జయించినందున అతనికి 'పురంజయుడు' అని పేరు వచ్చినది. ఇంద్రుని వాహనముగా చేసుకొని కకుదము అనగా మూపురము వద్ద కూర్చున్నందున కకుత్స్థుడు అని కూడ పేరువచ్చినది. ఇంద్రుడు వాహనముగా కలవాడు కాన ఇంద్రవాహనుడు అయినాడు

యువనాశ్వుడు.

కకుత్స్థుని వంశములోని వాడే యువనాశ్వుడు. యువనాశ్వునకు వందమంది భార్యలు. అయినను అతనికి సంతానము కలుగలేదు. అతడు మునులను ఆశ్రయించినాడు. వారు అతనిచే యజ్ఞము చేయించినారు.

ఆ యజ్ఞము జరుగుచున్న సమయమున ఒకనాటి రాత్రి యువనాశ్వుడు దాహము గొని యజ్ఞశాలకు వచ్చినాడు. మునులు మంత్రించి ఉంచిన నీరు త్రాగినాడు. మంత్రజలము త్రాగుటవలన అతడు గర్భము ధరించినాడు. నవమాసములు నిండినవి. యువనాశ్వుని కుడిప్రక్కను చీల్చుకొని చక్రవర్తి లక్షణములుగల ఒక పుత్రుడు కలిగినాడు. బాలుడు పాలకై ఏడ్వసాగినాడు. 'ఈ బాలుడు ఏమి త్రాగును?' అని ప్రశ్నించినారు మునులు. ఇంద్రుడు ప్రత్యక్షమై "మాంధాతా" అనగా "నన్ను త్రాగును" అన్నాడు. ఇంద్రుడు తన చూపుడు వ్రేలు బాలునకు కుడిపినాడు. ఇంద్రుడు మాంధాతా అనుటవలన అతనిపేరు "మాంధాత" అయినది.

మాంధాత.

మాంధాత చక్రవర్తి, మహావీరుడు అయినాడు. అతని ప్రతాపమునకు రావణుని వంటివారు సహితము గడగడ లాడినారు. అతడు ఏడు దీవులుగల భూమండల

మంతయు ఏకచక్రాధిపత్యముగ ఏలినాడు. ఉదయాద్రినుండి అస్తాద్రి వరకుగల భూమండలమంతయు అతని ఏలుబడిలో ఉండినది. అతడు అనేక యజ్ఞములు చేసినాడు. అనేక దానధర్మములు చేసినాడు. అతడు శశిబిందుని కూతురు ఇందుమతిని పెండ్లాడినాడు. ఆమెకు పురుకుత్సుడు, అంబరీషుడు, ముచికుందుడు అను ముగ్గురు పుత్రులు, ఏబదిమంది పుత్రికలు కలిగినారు.

సౌభరిముని గొప్ప తపస్వి. ఒకనాడు అతడు చేపలరాజు తన భార్యలతో సుఖించుటను చూచినాడు. తాను సహితము వివాహమాడి సుఖించవలెనని అభిలాష కలిగినది. మాంధాతవద్దకు వెళ్ళి తనకు ఒక రాజకన్యను భార్యగా ఇవ్వవలసినదని కోరినాడు. "స్వయంవరమున నిన్ను నా కూతుళ్ళు వరించిన నా కభ్యంతరము లేదు" అన్నాడు మాంధాత. తాను వృద్ధుడనని రాజు అట్లన్నాడని గ్రహించినాడు. అతడు నవ మన్మథునివలె సిద్ధమై స్వయంవరమునకు వెళ్ళినాడు. ఏబది మంది రాజకన్యలు సౌభరిమునిని చూచి ముగ్ధులైనారు. నేనన్న, నేనని రాజకన్యలెల్లరు సౌభరినే వరించినారు. సౌభరిముని ఏబది మందిని వివాహమాడినాడు. తన తపశ్శక్తివలన చక్కని భవనములను నిర్మించి భార్యలతో ఇంద్రభోగములు అనుభవించ సాగినాడు.

అట్లు కొంతకాలము గడచినది. ఒకనాడు సౌభరి ఒంటరిగా కూర్చొని ఇట్లాలోచించినాడు. "పరమ తపస్విగా ఉండువాడను పతనావస్థకు వచ్చినాను. చేపలరాజు సహవాసమున నా తపస్సు నాశనము చేసుకొంటిని.

> మోక్షము కోరువాడు భోగలాలసుల సహవాసము క్షణకాలమైనను చేయరాదు. ఇంద్రియములకు ఏ మాత్రము లొంగక ఏకాంతముగా ఉండవలెను. శ్రీహరి మీదనే మనస్సు లగ్నము చేయవలెను. సాధు సాంగత్యమే కాని ఇతర సాంగత్యము చేయరాదు.

చేపలరాజు సహవాసము వలన ఒంటరిగా ఉండిన నాకు ఏబదిమంది భార్యలైనారు. వారందరకు ఒక్కొక్కరికి వందవంద చొప్పున అయిదు వేలమంది సంతానమైనారు. ఈ మాయలో తగులుకొని ఆత్మజ్ఞానమును మరచినాను" అనుకొని సర్వసంగ పరిత్యాగముచేసి అడవులకు వెళ్ళిపోయినాడు. భార్యలు సహితము అతనిని అనుసరించినారు.

సౌభరి ఘోరమగు తపమాచరించి పాంచభౌతికమైన దేహమువీడి, పరమాత్మయందు లీనమైనాడు. ఏబదిమంది పతివ్రతలు అగ్నిలోపడి చచ్చి భర్తపొందిన ఉత్తమ పదమును పొందినారు.

అసత్య హరిశ్చంద్రుడు.

మాంధాత వంశమువాడే త్రిశంకుడు. అతడు శరీరముతో స్వర్గమునకు వెళ్ళదలచినాడు. వసిష్ఠుడు అట్లు వెళ్ళుటకు వీలు కాదన్నాడు. విశ్వామిత్రుడు అతనిని స్వర్గమునకు పంపినాడు. కాని దేవతలు అతనిని క్రిందకు త్రోసినారు. విశ్వామిత్రుడు అతడు క్రిందపడకుండ అంతరిక్షముననే నిలిపినాడు. ఇప్పుడు సహితము త్రిశంకు అంతరిక్షమున ప్రకాశించుచున్నాడు.

త్రిశంకుని కుమారుడు హరిశ్చంద్రుడు. అతనికి సంతానము లేక వరుణదేవుని ఆశ్రయించినాడు. తనకు వీరుడైన కుమారుడు కలిగిన అతనిని యజ్ఞపశువును చేసి వరుణుని కొరకు యజ్ఞము చేయుదుననెను. వరుణుడు అందుకు అంగీకరించినాడు.

వరుణుని అనుగ్రహమున హరిశ్చంద్రునకు పుత్రుడు కలిగినాడు. అతని పేరు రోహితుడు.

వరుణుడు వచ్చి రోహితుని యజ్ఞపశువును చేసి యజ్ఞము చేయవలెనని కోరినాడు.

"పది రోజులు అయిన తరువాత యజ్ఞమునకు యోగ్యతగును. అపుడు బలి ఇత్తును" అని అన్నాడు హరిశ్చంద్రుడు. వరుణుడు వెళ్ళిపోయి పది రోజులు అయిన తరువాత వచ్చినాడు. "రాజా! పది దినములు గడచినవి. నా యజ్ఞము చేయుము" అన్నాడు.

"రోహితునకు పళ్ళురాలేదు. పళ్ళు వచ్చిన తరువాత చేయుదును" అని అన్నాడు హరిశ్చంద్రుడు. వరుణుడు వెళ్ళిపోయి పళ్ళువచ్చిన తరువాత తిరిగి వచ్చి "రాజా! రోహితునకు పళ్ళువచ్చినవి. నా యజ్ఞము చేయుము" అన్నాడు. "పాల పండ్లు పడిపోయిన తరువాత యజ్ఞము చేయుదును" అని అన్నాడు హరిశ్చంద్రుడు. వరుణుడు వెళ్ళిపోయి పాలపండ్లు పడిపోయిన తరువాత తిరిగి వచ్చి "రాజా! పాలపండ్లు పడిపోయినవి. యజ్ఞము చేయుము" అన్నాడు. అందుకు హరిశ్చంద్రుడు "మరల పండ్లు రానిమ్ము యజ్ఞము చేయుదును" అన్నాడు. వరుణుడు వెళ్ళిపోయి మరల పండ్లు వచ్చిన తరువాత వచ్చి "రాజా! తిరిగి పండ్లు వచ్చినవి. యజ్ఞము చేయుము" అన్నాడు. "కవచము వేసుకొను వయస్సు రానిమ్ము. యజ్ఞము చేయుదును" అన్నాడు. వరుణుడు వెళ్ళి పోయినాడు.

రోహితుడు యువకుడైనాడు. ప్రయోజకుడు అయినాడు తండ్రి తనను యజ్ఞ పశువుగా బలి ఇచ్చునని భయపడి ధనుర్ధారియై అడవికి వెళ్ళిపోయినాడు.

ఇన్నిసార్లు ఆడి తప్పినాడు హరిశ్చంద్రుడు. వరుణునకు కోపము వచ్చినది. హరిశ్చంద్రునకు మహోదరము కల్పించినాడు. తండ్రికి రోగము వచ్చినదని విన్నాడు రోహితుడు. ఇంటికి బయలుదేరుచుండగా ఇంద్రుడు అతనిని ఆపి తీర్థములు సేవించుచు భూపర్యటన చేయవలసినదని ఉపదేశించినాడు. ఇంద్రుని ఉపదేశము ప్రకారము ఒక సంవత్సరము భూప్రదక్షిణ చేసి ఇంటివైపు మళ్ళినాడు రోహితుడు. ఇంద్రుడు వృద్ధ బ్రాహ్మణుని వేషమున వచ్చి అతనిని ఆపి భూప్రదక్షిణ చేయవలసినదన్నాడు. రోహితుడు అట్లే చేసినాడు. ఏడాది గడచిన తరువాత తిరిగి ఇంటికి వచ్చుచుండగా బ్రాహ్మణుడు ఆపినాడు. అట్లు ఆరు సంవత్సరములు ఇంటికి రాలేదు రోహితుడు.

ఏడవ సంవత్సరమున అజీగర్తుడను బ్రాహ్మణుని వద్ద అతని మధ్యమ పుత్రుడగు శునఃశేపుని వెంటతీసుకొని రాజ్యమునకు వచ్చినాడు. నా బదులు ఈ బ్రాహ్మణ కుమారుని యజ్ఞపశువును చేసి వరుణ యజ్ఞము చేయవలసినదని రోహితుడు తండ్రిని కోరినాడు.

హరిశ్చంద్రుడు పురుషమేధము చేసి వరుణ దేవుని పూజించినాడు. అతని మహోదర వ్యాధి నిర్మూలించినది.

ఆ యజ్ఞమున విశ్వామిత్రుడు హోత, జమదగ్ని అధ్వర్యుడు, వసిష్ఠుడు బ్రహ్మ అయినాడు.

హరిశ్చంద్రునిపై ప్రసన్నుడైన ఇంద్రుడు అతనికి బంగారు రథము బహూకరించినాడు. విశ్వామిత్రుడు హరిశ్చంద్రునకు అక్షయమైన జ్ఞానము ఉపదేశించినాడు ఆ జ్ఞానమును అనుసరించి అతడు ప్రాణాయామమును చేసి దేహము విడిచి ఆత్మ స్వరూపమున కలసిపోయినాడు.

స గ రు డు.

హరిశ్చంద్రుని వంశమునందే బాహుకుడు. బాహుకుని రాజ్యమును శత్రువులు అపహరించిరి అతడు భార్యలతో కూడ అడవికి వెళ్ళి అచట వృద్ధుడై మరణించినాడు. పట్టపురాణి సహగమనము చేయుటకు సిద్ధపడినది. ఆమె గర్భవతిగా ఉన్నదని ఎరిగి ఔర్వముని ఆమెను వారించినాడు. ఆమె గర్భవతిగా

ఉండుటకు సవతులు ఓర్వలేక ఆమెకు విషము పెట్టినారు. విషము తిన్న తరువాత ఆమెకు పుత్రుడు కలిగినాడు. అతడే సగరుడు.

సగరుడు చక్రవర్తి అయినాడు. అతనికి ఇద్దరు భార్యలు-సుమతి, కేశిని. సుమతికి అరవై వేల మంది పుత్రులు కలిగినారు. కేశినికి అసమంజసుడని ఒకే ఒక కుమారుడు కలిగినాడు. అసమంజసుడు పూర్వజన్మమున యోగభ్రష్టుడైనాడు. అందువలన పూర్వజన్మ అతనికి జ్ఞాపకము ఉండెడిది. ఈ జన్మమున సాంగత్య దోషము కలుగకుండు నందులకు గాను పిచ్చి పిచ్చి పనులు చేయువాడు. అడుకొను బాలురను సరయూనదిలో ముంచువాడు. ప్రజలను బాధపెట్టువాడు. తుదకు సగరుడు అసమంజసుని రాజ్యమునుండి వెడలగొట్టగా తన యోగబలమున తాను చంపిన బాలురనందరను బ్రతికించి తండ్రికి చూపెను అసమంజసుడు. అయోధ్య ప్రజల ఆనందము చెప్పనలవికాదు.

అసమంజసుని కుమారుడు అంశుమంతుడు. అతడు సగరునకు అ ప్రియమైన వాడు. తాతను ప్రాణముగా భావించువాడు అంశుమంతుడు. తాత ఏపని చెప్పినను చేసెడివాడు.

ఔర్వుని ఉపదేశమును అనుసరించి సగరుడు అశ్వమేధము చేయుట ప్రారంభించెను. అతని యజ్ఞమున విడిచిన యజ్ఞపశువును ఇంద్రుడు ఎత్తుకొని పోయెను. సుమతి పుత్రులను అరవై వేలమందిని ఆ యజ్ఞాశ్వమును వెదకుటకు పంపెను సగరుడు. వారు భూమండల మంతయు గాలించిరి. కాని యజ్ఞగుఱ్ఱము కనిపించలేదు. సగర పుత్రులు భూమిని త్రవ్వి పాతాళమునకు వెళ్ళిరి. అచట వారికి కపిలముని కనిపించెను. యజ్ఞాశ్వము సహితము అచటనే కనిపించినది. కపిలముని గుఱ్ఱమును దొంగిలించినాడను కున్నారు సగర పుత్రులు. అందరు అతని మీదకు ఉరికినారు. కపిలముని కనులు తెరచి చూచెను. సగర పుత్రులు అందరు కాలి బూడిదయై పోయిరి.

ఎంత కాలమునకు గుఱ్ఱమును తెచ్చుటకు వెళ్ళినవారు తిరిగిరాలేదు. సగరుడు గుఱ్ఱమును వెదకుటకు అంశుమంతుని పంపెను.

అంశుమంతుడు బయలుదేరి పిన తండ్రులు త్రవ్విన గోతులు చూచి వాటిలో నుండి పాతాళమునకు పోయెను. అచట బూడిద రాసులను, కపిల మహామునిని, గుఱ్ఱమును కూడా చూచెను.

అంశుమంతుడు కపిల దేవునకు పాదాభివందనము చేసి చేతులు జోడించి స్తుతించగా కపిల దేవుడు ప్రసన్నుడై "వత్సా! ఇదిగో నీ తాతగారి యజ్ఞ పశువును తీసుకొనుము. నీ పిన తండ్రులు భస్మమైనారు. గంగాజలము వలననే వీరికి ముక్తి కలుగును. మరొక మార్గములేదు" అన్నాడు.

అంశుమంతుడు సవినయముగా కపిల దేవునకు నమస్కరించి యజ్ఞపశువును తెచ్చి తాత గారికి అప్పగించెను. సగర చక్రవర్తి అశ్వమేధమును పూర్తిచేసెను. అంశుమంతునకు రాజ్యము అప్పగించి ఉత్తమగతి పొందెను.

భ గీ ర థు డు.

తన పినతండ్రులకు ముక్తి కలిగింపదలచినాడు అంశుమంతుడు. గంగాభవాని కొరకై తపస్సుచేసినాడు. కాని అతని ప్రయత్నము ఫలించకముందే పంచత్వమందినాడు. అంశుమంతుని కుమారుడు దిలీపుడు. అతడు కూడా ఎంతో తపస్సు చేసినాడు. కాని ప్రయత్నము ఫలించకముందే శరీరము చాలించినాడు.

దిలీపుని కుమారుడు భగీరథుడు. అతడు ఘోరమైన తపస్సుచేయగా గంగాభవాని ప్రత్యక్షమై అతని తపమునకు మెచ్చి అతనిని వరము కోరు కొమ్మనగ, భగీరథుడు సాగిలపడి, "అమ్మా! నీవు భూలోకమునకు విచ్చేయుము" అన్నాడు.

అందుకు గంగ "నాయనా! నీ భక్తికి మెచ్చినాను. భూలోకమునకు వచ్చుటకు అంగీకరించినాను, కాని అందుకు రెండు చిక్కులు ఉన్నవి. మొదటిది నేను స్వర్గమునుండి రావలసి ఉన్నది. అట్లు వచ్చునపుడు నావడిని పట్టుకొనువారు కావలెను. లేకున్న నేను రసాతలమునకు వెళ్ళిపోదును. రెండవది నేను భూమిపై ప్రవహించిన లోకులు తమతమ పాపములను నాలో విడుతురు కావున వాని నన్నింటిని నే నెచట విడువవలెను? దీనికి ఒక పరిష్కారము కనుగొన్నచో నేను భూలోకమునకు రాగలను" అన్నది.

అందుకు భగీరథుడు "తల్లీ! నీ వేగమును భరించువాడు శివుడు ఒక్కడే. అతడే నీ వేగమును భరించుగాక. ఇక నీలో పాపులు తమపాపములను విడుతురు. మహాత్ముల స్పర్శవలన నీపాపములు నాశనమగును. మహాత్ముల హృదయము అందు శ్రీహరి నిత్య నివాసము చేయుచుండునుగదా! అట్టివారు నీలో స్నానము చేసినపుడు నీపాపములు నశించును" అనిచెప్పి, గంగను భరించ వలసిన దని శివునిగూర్చి భగీరథుడు ఘోరమైన తపస్సు ప్రారంభించెను. శివుడు ప్రసన్నుడై, ప్రత్యక్షమై గంగను భరింతునని భగీరథున కభయమిచ్చినాడు.

గంగాభవాని స్వర్గమునుండి దిగినది. శివుని తలపై వాలినది. గాలివలె తేలిపోవు రథమునెక్కి బయలుదేరినాడు భగీరథుడు. రథమువెంట బయలు దేరినది గంగానది. దేశములన్నియు పావనముచేయుచు పాతాళమునకు చేరి సగరపుత్రుల భస్మరాసులను ముంచివేసినది గంగ. గంగానది స్పర్శవలన సకల పాపములు నశించి సగరపుత్రులు స్వర్గలోకము చేరుకున్నారు.

భస్మరాసులను తాకినంతమాత్రమున స్వర్గమునకు వెళ్ళినారు సగరపుత్రులు. ఇక గంగాభవానిని భక్తితో సేవించిన వారిసంగతి చెప్పవలసినదేమి? శ్రీహరి పాదపద్మములనుండి పుట్టినగంగానది ఎల్లరను పవిత్రులను చేయుటలో ఆశ్చర్యమేమి!

కల్మాషపాదుడు.

భగీరథుని వంశపువాడు ఋతుపర్ణుడు. ఋతుపర్ణుని కుమారుడు సౌదాసుడు. సౌదాసుని భార్య మదయంతి.

ఒకనాడు సౌదాసుడు వేటకు వెళ్ళగ అడవిలో అతనికి ఇద్దరు రాక్షసులు కనిపించినారు. వారిద్దరు అన్నదమ్ములు. సౌదాసుడు అన్నను చంపి తమ్ముని వదలివేసినాడు. ఆ పగ తీర్చుకొన దలచినాడు తమ్ముడు. వంటవానివేషము ధరించి సౌదాసునివద్ద కొలువునకు కుదిరినాడు.

ఒకనాడు వసిష్ఠుడు సౌదాసుని ఇంటికి భోజనమునకు వచ్చినాడు. వంటవాని వేషమున ఉన్నరాక్షసుడు నరమాంసమువండి వసిష్ఠునకు వడ్డించినాడు. నరమాంసముచూచి మండిపోయినాడు బ్రహ్మర్షి. "నాకు నరమాంసము పెట్టినందున నీవు రాక్షసుడవుకమ్ము" అని శపించినాడు. నిర్దోషినైన తనను వసిష్ఠుడు అకారణముగ శపించినాడని కోపించినాడు సౌదాసుడు. ప్రతిశాప మిచ్చుటకు చేతిలో నీరు తీసుకున్నాడు. అపుడు భార్య మదయంతి అతనిని వారించినది. "అందుకు దిక్కులు, భూమి, ఆకాశము అన్నియు జీవ మయముగా నున్నవి. క్రోధాగ్నివంటి నా చేతులలోని నీరు నెచట విడుతును" అని ఆలోచించి సౌదాసుడు తుదకు ఆ జలమును తన పాదములమీదనే వదిలెను. ఆ నీరు పడిన కారణముగ అతని పాదములు నల్లగా కమిలి పోయినవి. అతని పేరు కల్మాష పాదుడు అయినది.

వసిష్ఠుడు వాస్తవము గ్రహించి, సౌదాసునివలన దోషము లేదని ఎరిగి, పన్నెండు సంవత్సరములు మాత్రము సౌదాసుడు రాక్షసుడుగా ఉండునట్లు శాపమును తగ్గించినాడు.

వసిష్ఠుని శాపమున సౌదాసుడు రాక్షసుడు అయిపోయి, ఒకరోజు ఆకలితో అడవిలో తిరుగుచుండగా అతనికి భార్యతో సంభోగించుచున్న ఒక బ్రాహ్మణుడు కనిపించినాడు. ఆ బ్రాహ్మణుని పట్టి ఎత్తినాడు. బ్రాహ్మణి వాంఛ అప్పటికి తీరలేదు. ఆమె సౌదాసుని బ్రతిమిలాడుచు, "మహారాజా! నీవు నిజముగా రాక్షసుడవుకావు. మదయంతి భర్తవైన మహారాజువు. సంతాన వాంఛతో సంగమించుచున్న మాకు అడ్డము వచ్చినావు. నా భర్తను విడిచిపెట్టుము.

> సకల పురుషార్థములను సాధించుటకు మానవశరీరము వచ్చినది. ఆ శరీరమును పాడుచేసిన సకల పురుషార్థములను పాడుచేసినట్లగును. అంతేకాక ఈ బ్రాహ్మణుడు పండితుడు, తపశ్శాలి, శీలవంతుడు, హరిభక్తుడు. ఇతనిని విడువుము. మనసా. వాచా. కర్మణా ప్రాణులందరిని స్నేహముతో చూచు వాడే బుద్ధిమంతుడు.

కాబట్టి నాభర్తను విడువుము. అట్లుగాక నాభర్తను చంపుకొని తినుటకే నిశ్చయించినచో ముందునన్ను చంపుకొని తినుము. భర్తలేని నేను శవముతో సమానురాల నగుదును." అని కాళ్ళు, వేళ్ళుపడి బ్రతిమిలాడినది. కాని సౌదాసుడు ఆమె మొర వినిపించుకొనలేదు. పెద్దపులి పశువును విరుచుకొని తినునట్లు ఆ బ్రాహ్మణుని విరుచుకొని భుజించెను.

తన ఎదుట తనభర్తను విరుచుకొని తినుటనుచూచి సహించలేకపోయినది బ్రాహ్మణి. క్రోధమున అగ్నిహోత్రమైనది. పాపాత్ముడా! కామముతో బాధపడుచున్న నాభర్తను చంపుకొని తిన్నావు కాన నీవు స్త్రీ సంయోగమునకు పూనుకొనగానే తలపగిలి చత్తువు" అని శపించినది.

ఆ బ్రాహ్మణి భర్తయస్థికలు ప్రోవుచేసి చితి సిద్ధముచేసినది. నిప్పుముట్టించినది. తాను సహితము చితిలోపడి సహగమనము చేసినది. పోయిన ఉత్తమగతికి చేరుకున్నది.

పన్నెండు సంవత్సరములు గడచినవి. సౌదాసుడు శాపవిముక్తుడు అయినాడు. సంగమవాంఛతో మదయంతి వద్దకు వెళ్ళినాడు. బ్రాహ్మణి శాపము తెలిసిన మదయంతి వారించినది. నాటినుండి స్త్రీ సాంగత్యము మానుకున్నాడు సౌదాసుడు. అట్లు కర్మదోషమువలన నిస్సంతువైనందున వసిష్ఠుని ప్రార్థించినాడు. వసిష్ఠముని మదయంతికి గర్భాధానముచేసినాడు.

మదయంతి గర్భవతి అయినది. కాని, ఏడు సంవత్సరముల వరకు ప్రసవించలేదు. అప్పుడు వసిష్ఠుడు అశ్మముతో అనగా రాతితో మదయంతి గర్భముమీద కొట్టగా ఆమె ప్రసవించినది. ఆమెకు కలిగిన కుమారుడే అశ్మకుడు.

ఖట్వాంగుడు.

అశ్మకుని వంశపువాడు విశ్వసహుడు. విశ్వసహుని కుమారుడు ఖట్వాంగుడు. అతడు అజేయుడు. దేవతలు కోరగా దైత్యులను సంహరించినాడు. దేవతలు సంతసించి వరము కోరుమన్నారు. అందుకు ఖట్వాంగుడు తన ఆయుర్దాయ మెంతకాలముకలదో చెప్పవలసినది అని అడిగినాడు. ఒక ముహూర్త కాలము మాత్రము కలదని దేవతలు చెప్పినారు. అది తెలుసుకొని అజ్ఞానభావము వదలి ఖట్వాంగుడు శ్రీహరిని శరణువేడినాడు. ఆత్మస్వరూపమున మనసునిలిపి పర బ్రహ్మమైన భగవంతునిలో లీనమైనాడు.

శ్రీరామచరిత్రము.

ఖట్వాంగుని కుమారుడు దీర్ఘబాహువు. అతని కుమారుడు రఘువు. రఘువు కుమారుడు అజుడు. అతని కుమారుడు దశరథుడు.

దశరథునకు ముగ్గురుభార్యలు. వారు కౌసల్య, సుమిత్ర, కైకేయి. వారివలన దశరథునకు సంతానము కలుగలేదు. దశరథుడు సంతానార్థమై వసిష్ఠుని ఆశ్రయించినాడు. వసిష్ఠుడు దశరథునితో పుత్రకామేష్టి యజ్ఞమును చేయించినాడు. యజ్ఞకుండమునుండి ఒక దివ్యపురుషుడు ఆవిర్భవించి, రాజునకు పాయసపాత్రను తెచ్చి ఇచ్చినాడు. రాజు ఆ పాయసమును రాణులకు పంచినాడు. రాణులు ఆ పాయసముతిని గర్భవతులైనారు. శ్రీమన్నారాయణుడే వారికి పుత్రరూపమున జన్మించినాడు. కౌసల్యకు రాముడు, సుమిత్రకు లక్ష్మణుడు, శత్రుఘ్నుడు, కైకకు భరతుడు అను నలుగురు పుత్రులు జన్మించినారు.

రామ, లక్ష్మణ, భరత, శత్రుఘ్నులు శుక్లపక్ష చంద్రునివలె వృద్ధిపొందిరి. రామునకు పదహారు సంవత్సరములు వచ్చినవి అప్పుడు దశరథుని వద్దకు విశ్వామిత్రుడువచ్చి తన యాగమునకు రాక్షసులు విఘ్నములు కల్పించు చున్నారనియు, ఆ యాగరక్షణకుగాను రాముని పంపవలసినదనియు కోరెను. దశరథుడు రాముని పంపుటకు వెనుకాడెను. కాని వసిష్ఠుడు చెప్పగా రామలక్ష్మణులను విశ్వామిత్రునకు అప్పగించెను. విశ్వామిత్రుడు రామునకు అనేక అస్త్రశస్త్రములను ఉపదేశించెను.



శ్రీ హరి రామావతారమెత్తుట

పుట. 377

రాముడు విశ్వామిత్రునితో తపోవనమున ప్రవేశించెను. సుందుడనువాని భార్య శాపమున రాక్షసియై, తాటకియనుపేరుతో విశ్వామిత్రుని యజ్ఞమును విఘ్న మొనర్చుటకు రాగా, రాముడు ఆ తాటకిని సంహరించెను. యజ్ఞమును విఘ్నము చేయుటకు వచ్చిన మారీచ సుబాహులందు, సుబాహుని వధించి, బాణా ఘాతమున మారీచుని సముద్రపు ఒడ్డునకు విసరెను. విశ్వామిత్రుని యజ్ఞము నిర్విఘ్నముగా కొనసాగినది.

అదే సమయమున మిథిలానగరమున జనక చక్రవర్తి ఒక యజ్ఞము చేయు చుండెను. ఆ యజ్ఞమునకు వెడలుచున్న విశ్వామిత్రుడు రామలక్ష్మణులను తన వెంటతీసుకొని వెళ్ళెను. మార్గమధ్యమున వారు గౌతమాశ్రమము చూచిరి. గౌతముని శాపమువలన శిలావశిష్టమై బూడిదలో పడియున్న అహల్య రామ పాద స్పర్శవలన శాపవిముక్తు రాలయ్యెను. తిరిగి గౌతముడు. ఆమెను పరి గ్రహించెను.

రామలక్ష్మణ సమేతుడై విశ్వామిత్రుడు మిథిలా నగరమునకు చేరెను. జనకుడు రామలక్ష్మణులను చూచి మిక్కిలి సంతసించెను. జనకునివద్ద బహుభారమగు శివధనుస్సు కలదు. ఆధనుస్సు నెక్కు పెట్టిన వీరునకు, తనకు నాగటిచాలునదొరకిన లావణ్య రాశియగు సీతాదేవినిచ్చి వివాహ మొనర్తునని ప్రకటించెను. మూడువందల మంది మహాబలవంతులు ఆ ధనుస్సును సభామంటపమునకుతెచ్చి సీతా స్వయం వరమునకు విచ్చేసిన రాజ పుత్రుల ముందుంచిరి. కాని ఒకరును దానిని ఎత్త జాలరైరి. రాముడు అవలీలగా శివధనుస్సు నెత్తి బలముకొలది సంధింపగా ఆ ధనుస్సు విరిగి రెండుముక్కలైనది. జనకుడు సంతోషముతో సీతాదేవిని శ్రీరామ చంద్రునకిచ్చి వివాహమొనర్చెను. వివాహమునకు దశరథుడు పరివారసమేతముగ వచ్చెను.

వివాహానంతరము నవదంపతులు అయోధ్యకు వెళ్ళుచుండగ మార్గమధ్యమున క్షత్రియులకు శత్రువైన పరశురాముడు శ్రీరామునితో యుద్ధమొనర్చి అప జయమొంది శ్రీరాముని సాక్షాత్తు విష్ణువుగా గ్రహించి. యుద్ధకార్యములు మాని తపమొనర్చుటకు హిమాలయమునకు వెళ్లెను.

భరతుని మేనమామ భరతశత్రుఘ్నులను తన యింటికి తీసుకొని వెళ్ళిన సమయ మున దశరథుడు రామునకు పట్టము కట్టదలచెను. రాముని పట్టాభిషేక వార్తవిని జనమంతయు సంతసించినరి. కాని కైకేయికి తల్లిగారి ఇంటినుండి అరణముగా నీయబడిన ముఖ్యదాసి మంథరకు మాత్రము రాముడు రాజుకావటము నచ్చ

లేదు. మంధర కైకేయికి రాముడు రాజైనచో భరతునకు కైకేయికి కలుగు ఇబ్బందులను గురించి వివరించినది. దశరథుడు కైకేయికి పూర్వమిచ్చిన రెండు వరముల విషయము జ్ఞప్తికి తెచ్చి, అందు ఒకదానితో రాముని పదునాలుగు సంవత్సరములు అరణ్యవాసము, రెండవ దానితో భరతునకు పట్టాభిషేకమును కోరుమని కైకేయికి సలహా ఇచ్చినది. మంధర సలహా కైకేయికి నచ్చినది. అదే విధముగ ఆమె దశరథుని రెండు వరములు కోరినది. ఆ వరము లియ్యవలసినదే నని నిర్బంధించినదికూడ. దశరథునకు వేరేమార్గము కానరాక రాముని అరణ్యమునకు, భరతుని పట్టాభిషేకమునకు అంగీకరించినాడు.

పితృ ఆజ్ఞ పరిపాలించుటకై రాముడు జటా వల్కల ధారియై అరణ్యమునకు బయలుదేరెను. సీత, లక్ష్మణుడు అతని ననుసరించి అరణ్యమునకు వెడలిరి. వారు గుహుని సహాయమున పడవపై గంగానదిదాటి అరణ్యమున ప్రవేశించి, ఆశ్రమము నిర్మించుకొని నివసించ సాగిరి.

రాముని ఎడబాటు సహించని దశరథుడు అసువులు వీడెను. మేనమామ ఇంటికి పోయిన భరత శత్రుఘ్నులు అయోధ్యకు తిరిగివచ్చిరి. దశరథుని మరణవార్త, రాముని అరణ్యవాస వార్తవిని భరతుడు దుఃఖించెను. తల్లి అవివేకమున కామెను దూలనాడెను. తండ్రికి ఉత్తరక్రియలు నెరవేర్చి, తాను రాముని తోడ్తెచ్చుటకై అరణ్యమునకు వెడలెను. మంత్రి సామంత పురోహితులు, అశేషప్రజానీక మాతని ననుసరించిరి. భరతుడు దుఃఖముచే భారమైన హృదయముతో చిత్రకూటమున రాముని దర్శించి, అయోధ్యకు రావలసినదని బ్రతిమిలాడెను. కాని రాముడు అందుకు సమ్మతించలేదు. పితృవాక్య పరిపాలనకే నిశ్చయించెను. భరతుడు రామునికి బదులు తానే అరణ్యవాస మొనరించెదననియు, ఇక్ష్వాకు వంశమున జ్యేష్ఠుడే రాజగు ఆచారము కలదనియు, అందువలన రాముడే రాజు కావలెనని వాదించెను. అందుకు రాముడు భరతునకు నచ్చచెప్పి, తనకు బదులుగా తనపాదుకలనుంచి, భరతుడు ప్రతినిధియై రాముడు తిరిగి వచ్చునంతవరకు రాజ్యము పాలించు నట్లేర్పాటు గావించెను. భరతుడు రామపాదుకలు శిరమున ధరించి, బంధుమిత్ర పరివారసమేతుడై అయోధ్యకు వెడలి రాముని పేరట రాజ్యము చేయుచు, తాను నిస్సంగుడై నారబట్టలుకట్టి కఠోర వ్రతమవలంబించెను.

రావణుని చెల్లెలు శూర్పణఖ రాముని మోహించి, అతని వద్దకు వచ్చి, తనను పెండ్లాడవలసినదని కోరినది. లక్ష్మణుడు దాని ముక్కు చెవులుకోసి పంపెను. ఆ

రాక్షసి తనవారైన ఖరదూషణాదులతో మొరపెట్టుకున్నది. వారు పదునాల్గువేల మంది రాక్షససైన్యముతో రామునిపై దండెత్తిరి. ధర్మాత్ముడైన రాముడు ఒక్కడే వారి నందరిని హతమార్చెను.

శూర్పణఖ వగచీరలేదు. సోదరుడైన రావణునితో మొరపెట్టుకున్నది. సీతను దొంగిలించవలసినదని బోధించినది. రావణుడు మారీచునితో బయలుదేరెను. మారీచుడు బంగారులేడియై రాముని ఆశ్రమము ముందు సంచరించగ, సీత తన కాలేడి కావలెనని రాముని కోరినది. లక్ష్మణుని పర్ణశాలవద్ద ఉంచి రాముడు దానిని పట్టుటకై వెడలి. దానిని ప్రాణముతో పట్టలేక బాణము వదిలెను.

రామబాణమునకు మారీచుడు కూలెను. హా లక్ష్మణా ! యని యరచుచు చచ్చెను. ఆ కేకవిన్నది సీత. లక్ష్మణుని రామునివద్దకు పొమ్మన్నది. రామునకు ఎట్టి అపాయము కలుగదనియు, ఇదంతయు రాక్షసమాయ యనియు లక్ష్మణుడు సీతకు అనేక విధముల నూరట కలుగజేసెను. కాని సీత వినలేదు. అతనిని తిట్టిపోసినది. లక్ష్మణుడు చేయునదిలేక రాముని వెదకుటకు బయలుదేరిపోయెను.

సమయమునకై వేచియున్న రావణుడు, సన్యాసివేషధారియై సీతవద్దకు వచ్చి, ఆమెను బలవంతముగ రథముపై కూర్చుండబెట్టుకొని లంకకు తరలగ, రాముని మిత్రుడు జటాయువు అదిచూచి, రావణునితో పోరాడి, కొన ఊపిరితో నేల కూలెను.

రావణుడు సీతను ఎత్తుకొని పోవుచుండగ ఆమె విలపించుచు క్రిందకు చూచినది. క్రింద కోతులు కనిపించగ ఆమె తన ఆభరణములు మూటకట్టి వారిమధ్య వదిలినది. రావణుడు సీతను లంకకు తీసుకొనివెళ్ళి అశోకవనమున ఉంచి, తన్ను వివాహ మాడుమని బలవంత మొనరింపసాగెను.

రామలక్ష్మణులు పర్ణశాలకువచ్చి చూడగ సీత కనిపించలేదు. రాముడు సీతకై విలపించి, ఆమెను వెదుకుటకు బయలుదేరి కొనఊపిరితోఉన్న జటాయువును చూచి, అతనివలన రావణుడు సీతను అపహరించెనని తెలుసుకొని, ప్రాణములు విడిచిన జటాయువునకు అగ్ని సంస్కారముచేసి ముందునకు సాగెను.

మార్గమధ్యమున కబంధుడను రాక్షసుని వధించి, యతనివలన సుగ్రీవుని వృత్తాంతమువిని ఋష్యమూకమునకు బయలుదేరెను. త్రోవలో శబరి ఇచ్చిన ఆతిథ్యములను స్వీకరించి, ఋష్యమూకమును చేరి, సుగ్రీవునితో చెలిమిచేసి, వారివద్దనున్న సీత సొమ్ములుచూచి దుఃఖించెను.

రాముడు వాలిని వధించి, సుగ్రీవునకు పట్టముకట్టి, సీతజాడ తెలుసుకొనుటకు హనుమంతుని పంపెను. హనుమంతుడు శతయోజన విస్తీర్ణమగు సముద్రమును లంఘించి లంకకుచేరి, సీతను చూచి, రామాంగుళీయ మామెకొసంగి ఆమె యిచ్చిన శిరోమణిని తీసుకొని, లంకను దహించి, తిరిగివచ్చి జరిగినదంతయు రామునకు విన్నవించెను.

రాముడు వానరసేన సహితముగా లంకపైదాడి వెడలి సముద్రతీరమునకు చేరి, సముద్రునిగూర్చి ప్రాయోపవేశముచేసి, సముద్రుడు ప్రత్యక్షము కాకున్న ఉగ్రుడై బాణము సంధించగ సముద్రుడు ప్రత్యక్షమై తనపై వారధి కట్టవలసినదనియు, తాను అందుకు సాయము చేతుననియు చెప్పగ, వానరులు చెట్లు, గుట్టలు తెచ్చి వారధి కట్టిరి.

రావణునికి హితవుచెప్పి, అతనిచే అవమానింపబడిన రావణ సోదరుడు విభీషణుడు రాముని శరణు జొచ్చినాడు. రాముడు కరుణించి, సముద్ర తీరముననే విభీషణుని లంకా రాజ్యమున అభిషేకించెను.

వారధి సిద్ధమైనది. వానరసేన సముద్రము దాటినది. రామరావణ సైన్యమునకు ఘోరమగు పోరు సాగినది. యుద్ధమున రావణుడు తక్క తక్కిన రాక్షస వీరులందరు మడసినారు. రావణుడు తేజోవంతుడై రథమునెక్కి రణరంగమునకు ఉరికినాడు. ఇంద్రుడు పంపిన రథమునెక్కి రాముడు వానితో పోరాడి బ్రహ్మాస్త్రము ప్రయోగించి రావణుని కూల్చినాడు.

లోకకంటకుడగు రావణుడు కూలినాడు. రాముని విజయలక్ష్మి వరించినది. రాముని ఆజ్ఞప్రకారము రావణునకు దహన సంస్కారము చేసినాడు విభీషణుడు. రాముడు విభీషణునకు పట్టము కట్టినాడు.

సీత రాముని ఎదుటకు వచ్చినది. రాముడు ఆమెను శంకించి వెళ్ళిపొమ్మన్నాడు. ఆమె అగ్ని ప్రవేశము చేసినది. అగ్నిదేవుడు సీత పవిత్రురాలని చెప్పి ఆమెను రామునకు సమర్పించెను. రాముడు ఆమెను పరిగ్రహించెను.

రాముడు అయోధ్యకు పుష్పకముపై బయలుదేరుచు తన రాకను గూర్చి హనుమంతునితో ముందే భరతునకు వార్తనంపెను. భరతాదులు నందిగ్రామమున రామునకు స్వాగతము ఇచ్చిరి. నందిగ్రామ మంతయు రామునితో అయోధ్యకు కదిలినది.

వసిష్ఠాదులు రామునకు పట్టము కట్టిరి. అయోధ్య ఆనందమున తేలియాడినది.

రాముడు ప్రజలను కన్నబిడ్డలవలె పాలించినాడు. త్రేతాయుగమున కృత యుగము ప్రవేశించినట్లు తోచినది. సకాలమున వర్షములు కురిసినవి. పంటలు సమృద్ధముగా పండినవి. వ్యాధులవలన, దొంగలవలన భయము లేకుండినది.

రాముడు అనేక యజ్ఞములుచేసి యజ్ఞదక్షిణగా హోతకు రాజ్యపు తూర్పు దిక్కును, బ్రహ్మకు దక్షిణదిక్కును, అధ్వర్యునకు పశ్చిమదిక్కును, ఉద్గాతకు ఉత్తరదిక్కును, ఆచార్యునకు మధ్యభూమిని దానమిచ్చినాడు. బ్రాహ్మణులు తిరిగి తమ భూములను రామునకు ఇచ్చి, తిరిగి అతనినే ఏలవలసినదని చెప్పిరి. రాముడు వల్లెయని రాజ్యము పాలించ సాగినాడు.

రాజధానిలో రాత్రులందు రాముడు మారువేషముల సంచరించువాడు. అట్లు సంచరించుచుండగా ఒకనాడు ప్రజలు సీతాదేవిని గూర్చి ఆడుచున్న దుర్భాషలు ఆలకించినాడు. లోకాపవాదమునకు వెరచి గర్భవతియైన సీతను అడవులకు పంపెను. అరణ్యమున వాల్మీకి ఆమెను కాపాడి తన ఆశ్రమమునకు చేర్చెను. ఆమె వాల్మీకి ఆశ్రమమునకు వెళ్ళి అచట కుశ లవులను ఇరువురు పుత్రులను కనెను.

భరతునకు దక్షుడు, పుష్కలుడు, లక్ష్మణునకు అంగద, చంద్రకేతువులు, శత్రుఘ్ననకు సుబాహు, శ్రుతసేనులను పుత్రులు కలిగినారు.

సీతాదేవి తన పుత్రులను వాల్మీకికి అప్పగించి భూమిలో ప్రవేశించినది. సీత విరహ దుఃఖమునకు ఓర్వలేక శ్రీరామచంద్రుడు అవతారమును చాలించెను.

నిమి చక్రవర్తి.

ఇక్ష్వాకు కుమారుడు నిమి ఒక యజ్ఞము తలపెట్టెను. వసిష్ఠుని ఋత్విజునిగా వరించెను. అంతకు ముందు ఇంద్రుడు వసిష్ఠుని యజ్ఞము చేయించుటకు వరించి నందున ఆ యజ్ఞము పూర్తిచేసి నిమి యజ్ఞము చేయింతునన్నాడు. వసిష్ఠుడు ఇంద్రుని యజ్ఞము చేయించుటకు వెళ్ళిపోయినాడు. జీవితము నీటి బుడగవంటిదనీ, సత్కార్యము చేయుటకు ఆలస్యము చేయరాదనీ భావించి నిమి వేరొక ఋత్విజుని ఏర్పాటు చేసుకొని యజ్ఞము సాగించెను.

ఇంద్రుని యజ్ఞము పూర్తిచేసి వసిష్ఠుడు తిరిగి వచ్చువరకు నిమి యజ్ఞము సాగుచున్నది. మరొక ఋత్విజునితో యజ్ఞము చేయించుకొనుటను చూచి కోపగించి

వసిష్ఠుడు 'నీ శరీరము పడిపోవును గాక' అని నిమిని శపించెను 'అన్యాయముగా శపించినావు కాన నీ శరీరము కూడ పడిపోవుగాక' అని నిమి ప్రతిశాపము పెట్టి శరీరము విడిచినాడు. వసిష్ఠుడు సహితము శరీరము విడిచెను.

మునులు నిమి శరీరమును భద్రపరచి దేవతలను ప్రార్థించి వారిని రప్పించి నిమిని బ్రతికించ వలసినదని వేడుకున్నారు. కాని అంతరిక్షమునుండి నిమి, 'ప్రాణికి నిరంతరము మరణ భయము ఉండును. కాన నాకు తిరిగి దేహము అక్కరలేదు' అన్నాడు.

నిమి మాటలు విన్న దేవతలు, "నిమికి శరీరము లేకున్నను ప్రాణుల కన్నులలో నివసించును. అతడు సూక్ష్మ శరీరముననే భగవంతుని ధ్యానించును. కను రెప్పలు మూయుట, తెరచుట వలన అతని అస్తిత్వము అవగతమగును" అన్నారు.

రాజు లేని రాజ్యము అరాజకమగునని మునులు ఆలోచించి నిమి దేహమును మథించిరి. అందునుండి ఒక పుత్రుడు పుట్టెను. అతడే జనకుడు. విదేహుని వలన పుట్టినందున వైదేహుడై, మథించుటవలన పుట్టినందున మిథిలుడు అయ్యెను. అతడు స్థాపించినది మిథిలా పట్టణము.

మిథిలను పలిన రాజులందరు మైథిలు లైనారు.

పురూరవుడు.

చంద్రుడు బృహస్పతి భార్య తారను దొంగిలించినాడు. బృహస్పతి తన భార్యను తనకు ఇమ్మన్నాడు. కాని చంద్రుడు ఇవ్వలేదు. అప్పుడు వా రిద్దరికి గొప్ప యుద్ధము జరిగినది. శుక్రాచార్యుడు దేవతల మీది విరోధము చేత చంద్రుని పక్షము వహించినాడు. అంగిరుడు శివుని గురువు. అంగిరుని పుత్రుడు బృహస్పతి. గురుపుత్రుని మీద స్నేహము వలన శివుడు ఇంద్రుడు కూడా బృహస్పతి పక్షము చేరినారు. అట్లు దేవతలు రాక్షసులు తార కొరకుగాను పోరాడిరి. ఘోరమైన యుద్ధము జరిగినది. దేవతలు అసురులు కుప్పలుకుప్పలుగా కూలిరి.

అంగిరుడు బ్రహ్మవద్దకు వెళ్ళి యుద్ధము ఆపు చేయించవలసిన దని కోరెను. బ్రహ్మ చంద్రునకు నచ్చచెప్పి తారను బృహస్పతికి ఇప్పించెను. బృహస్పతి వద్దకు వచ్చువరకు ఆమె గర్భవతియై ఉన్నది. అది తెలుసుకొని బృహస్పతి ఉగ్రుడై "మరొకని వీర్యము ధరించితివి గాన వెంటనే త్యజించ వలసినది. అట్లు కాకున్న భస్మము చేతును" అని తారపై ఉరిమినాడు బృహస్పతి. తార భంగా

రమువంటి పుత్రుని కన్నది. ఆ బాలునిచూచి బృహస్పతికి ఆశ పుట్టినది. ఆ బాలుని తన పుత్రునిగా చేసుకొనవలె ననుకున్నాడు. అందుకు చంద్రుడు ఆ బాలుడు నా పుత్రుడు అన్నాడు. ఇద్దరికి వాగ్యుద్ధము కొనసాగినది. మునులు, దేవతలు వారి తగువు తీర్చుటకు వచ్చిరి. 'ఈ పుత్రుడు ఎవరికి పుట్టినాడో తెలియ పర్చవలసినది' అని తారను అడిగిరి. తాను సిగ్గుతో తల వంచుకున్నది.

తల్లి సిగ్గుచూచి కోపగించినాడు కొడుకు. "ఉన్నమాట చెప్పుటకు సిగ్గెందుకు?" అని తల్లిని అడిగెను. తార వంచిన తల ఎత్తలేదు. పెదవి కదిలించలేదు. బ్రహ్మ తారను ఏకాంతముగా పిలిచి అడిగెను. కొడుకు చంద్రునకు పుట్టినాడని తార చెప్పినది.

ఆ కుమారుని చంద్రుడు తీసుకున్నాడు. తార కుమారుడు బుద్ధిమంతుడు గాన అతడు బుధుడు అయినాడు. శాప వశమున ఇళుడను రాజు ఇళ యను స్త్రీ కాగా ఆమె వలన బుధుడు ఒక పుత్రుని కన్నాడు. అతడే పురూరవుడు. అతడు చక్రవర్తియై రాజ్యమును పాలించినాడు.

మిత్రా వరుణుల శాపము వలన ఊర్వశి భూలోకమున ఉండవలసి వచ్చినది. ఆమె భూలోకమునకు వచ్చి పురూరవుని అందమును గూర్చియు, అతని ప్రతాపమును గూర్చియు విన్నది. పురూరవుని వద్దకు వెళ్ళి తొలిచూపులోనే అతనిని ప్రేమించినది. పురూరవుడు ఆమెను చూచి ముగ్ధుడై, ప్రేమించి తనను పెండ్లి చేసుకొనవలసినదని ఆమె నర్థించెను. అందుకు ఆమె కొన్ని షరతులు పెట్టినది. ఆమె వద్ద ఉన్న రెండు గొఱ్ఱెపిల్లలను పురూరవునికి ఇచ్చి వాటిని జాగ్రత్తగా కాపాడవలెనని చెప్పినది. తాను నెయ్యి మాత్రము త్రాగుదుననియు, సంభోగ సమయమున తప్ప భర్తను నగ్నముగా చూడననియు తన నియమములు తెలియ పరచినది.

ఆమె నియమములన్నింటికి అంగీకరించినాడు పురూరవుడు. ఊర్వశి అతనితో ఉండిపోయినది.

పురూరవుడు ఊర్వశితో స్వర్గ సౌఖ్యములు అనుభవించినాడు. చైత్ర రథము నెక్కి రమ్యమైన ప్రదేశము లన్నింట స్వేచ్ఛగా సంచరించినాడు. పద్మ పరాగ ముపలె పరిమళించు ఊర్వశితో రమించి ఆమెయే లోకముగా కాలము గడుప సాగినాడు. అట్లు ఎంతో కాలము గడచిపోయినది.

ఊర్వశి లేని ఇంద్రసభ చిన్న పోయినది. ఆమెను వెదకి తెచ్చుటకు ఇంద్రుడు గంధర్వులను పంపెను. గంధర్వులు భూలోకమునకు వచ్చి ఊర్వశి పురూరవునకు

ఇచ్చిన గొఱ్ఱెపిల్లలను అర్ధరాత్రి అపహరించినారు. గంధర్వులు ఎత్తుకొని పోవు నపుడు గొఱ్ఱెపిల్లలు అరచినవి. ఊర్వశి వాటి అరుపు విని మొత్తుకున్నది. పురూరవుని అనరాని మాటలన్నది. పురూరవునకు రోషము వచ్చినది. పడకనుంచి లేచి దిసమొలతో పరుగెత్తెను. గంధర్వులు పురూరవుని చూచి గొఱ్ఱెపిల్లలను వదలి మాయమైనారు. పురూరవుడు గొఱ్ఱెపిల్లలను తీసుకొని ఊర్వశి వద్దకు వచ్చెను. నగ్నముగా ఉన్న పురూరవుని చూచినది ఊర్వశి. ఆమె నియమము భంగమైనది. మరు క్షణమున అంతర్ధానమైనది.

ఊర్వశిని బాసిన పురూరవుడు నీటిని బాసిన చేపవలె విలవిల లాడినాడు. ఆమె కొరకు భూలోకమంతయు వెదకుచు తిరిగెను. ఒకనాడు కురుక్షేత్రమున అతనికి ఊర్వశి కనిపించినది. ఆమెను చూచి అతనిలో ప్రాణములు లేచివచ్చినవి. పరు గెత్తినాడు. పురూరవుడు.

"ప్రియురాలా! ఊర్వశీ! నా ప్రాణమా! నను విడిచిపోయినావా! ఇదిగో ఒక్కమాట, ఆగు, దయచూడు, కరుణించు, చూడు, నేనెక్కడితినో! నిను పాసి పోయి పరితపించుచున్నాను. ఎందు కట్లు నన్ను విడిపోయితివి. ఆగవూ! వెళ్ళు దువా? ఇదిగో ఎందు కీ శరీరము? ఇచటనే వదలి వేయుదును. దీనిని రాబందులు నక్కలు పీక్కొని తినునుగాక" అని ప్రతిమిలాడినాడు.

ఊర్వశి మనస్సు కరిగినది. ఆమె లేచి, "రాజా! నీవు వీరుడవు, మహా పురుషు డవు. బాలునివలె విలపింతువేల? చచ్చుట పిరికి పనికాదా? ధైర్యము తెచ్చు కొనుము. జీవించుము శత శరత్తులు.

మహారాజా! స్త్రీ హృదయము క్రూరమైనది. కర్కశమైనది. ఆమె జీవితాం తము ఒక్క పురుషుని వంతనే ఉండదు. ఉంత కోరదు. స్త్రీలు పెటసువారు. పిసరంత మాటకే విరిగి పోవుదురు. తమ సౌఖ్యమునకు గాను ఎంత సాహస మునకైనను వెనుకాడరు. స్వార్థమునకు గాను తోబుట్టువులను కట్టుకున్న భర్తను సహితము చంపుదురు. ఆడదాని స్నేహము, ఆకాశకుసుమము రెండు ఒకటే. కొమ్ములు తిరిగిన వానిని సహితము వలలో వేసుకొందురు.

కావున రాజా ధైర్యము తెచ్చుకొనుము. ప్రతి సంవత్సరము ఒక రాత్రి నీతో కలసి ఉందును. నావలన నీకు సంతానము కూడా కలుగును" అని చెప్పి వెళ్ళి పోయినది ఊర్వశి.

ఊర్వశి నిండు చూలాలుగా ఉన్నదని గ్రహించి పురూరవుడు నగరమునకు వచ్చెను. సంవత్సరము గడువగా కురుక్షేత్రమునకు పగ ఊర్వశి బిడ్డతల్లియై వచ్చి

నది. పురూరవుడు ఆమెతో బ్రహ్మానందము ననుభవించి తెల్లవారి నందులకు వగచినాడు.

అట్లు ఊర్వశి వలన ఆరుగురు పుత్రులను బడసినాడు పురూరవుడు. వారు ఆయువు, శ్రుతాయువు, సత్యాయువు, రయుడు, విజయుడు, జయుడు అనువారు.

ఒకనాటి రేయి ఊర్వశి వచ్చినది. పురూరవుడు స్వర్గసుఖములు అనుభవించినాడు. తెల్లవారినది. అతడు తెల్లబోయినాడు. ఊర్వశిని విడువలేక ఆమె కొంగుపట్టుకొని వలవల ఏడ్చినాడు.

కన్నీరు తుడిచి ముంగురులు సవరించి, "రాజా! గంధర్వులను వేడుకొనుము. వారు నన్ను నీ కిత్తురు" అని చెప్పి పురూరవుడు చూచుచుండగనే ఆకాశమునకు ఎగిరి పోయినది. చేతులు చాచి ఏడ్చుచున్న పురూరవుని చేతులలో రెండు వేడి కన్నీటి చుక్కలు రాలినవి.

పురూరవుడు పిచ్చివాడైనాడు. గంధర్వులను ప్రార్థించగ వారు అతనికి ఒక కుంపటి ఇచ్చిరి. పిచ్చివాడు పురూరవుడు అదే ఊర్వశి అనుకొని గుండెలకు హత్తుకొని అడవుల వెంట తిరుగసాగెను. చివరకు తన పొరపాటును గంధర్వులు తనకిచ్చినది కుంపటియని తెలుసుకొని దానిని అడవిలో విడచి నగరమునకు వచ్చి కన్నులలో ఊర్వశిని చూచుకొనుచు జీవించసాగెను.

కృతయుగము గడచి త్రేతాయుగము ఉదయించినది. పురూరవుని హృదయమున మూడు వేదములు సాక్షాత్కరించినవి. పూర్వము తాను కుంపటి పారవేసిన చోటికి పోయి అక్కడ జమ్మి చెట్టులో రావిచెట్టు పుట్టి పచ్చని ఆకులతో కళకళలాడుచున్నది. వాటితో రెండు అరణులు సిద్ధముచేసి ఊర్వశి ఉండు లోకము కొరకుగాను అగ్నిమంత్రములతో దానిని మథించినాడు. అట్లు మథించగా జాత వేదమను అగ్ని పుట్టినది. త్రయీవిద్యతో దానిని మూడు అగ్నులుగా భావించినాడతడు. మూడు అగ్నులను కుమారులుగా పరిగ్రహించినాడు.

ఊర్వశి లోకమునకు గాను శ్రీహరిని ఆరాధించి చివరకు పురూరవుడు గంధర్వ లోకమును పొందినాడు.

సత్యయుగమున ప్రణవ మను ఒకే వేదము ఉండెడిది. ఒకే వర్ణము ఒకే అగ్ని ఉండెడిది. త్రేతాయుగారంభమున పురూరవుని వలననే మూడు వేదములు, మూడు అగ్నులు వృద్ధిపొందినవి.

పురూరవుడే చంద్ర వంశమందలి తొలిరాజు.

పరశురాముడు.

చంద్రవంశపువాడే కుశుడు. అతని నలుగురు పుత్రులలో కుశాంబుడు ఒకడు. ఇతని పుత్రుడు గాధి. ఇతని కూతురు సత్యవతి. ఋచీకుడు సత్యవతిని తనకు ఇవ్వవలసినదని గాధిని కోరగ ఋచీకుడు సత్యవతికి తగిన వరుడు కాడని భావించి గాధి, ఒక చెవి నల్లగా ఉండి, శరీరమంతయు తెల్లగా ఉన్న వేయి గుఱ్ఱములను కన్యాశుల్కముగా ఇచ్చిన సత్యవతిని ఇత్తునని అన్నాడు.

గుఱ్ఱముల కొరకు ఋచీకుడు వరుణుని ప్రార్థించగ వరుణుడు అట్టి గుఱ్ఱములను వేయింటిని ఋచీకున కిచ్చినాడు. వాటిని గాధికి ఇచ్చి సత్యవతిని పెండ్లాడినాడు ఋచీకుడు.

భార్య సంతానము కావలెనని ఋచీకుని కోరినది. అట్లే ఆమె తల్లికూడ తనకు సంతానము కావలెనని అల్లుని కోరినది. ఋచీకుడు బ్రాహ్మమంత్రమున తనభార్య కొరకును, క్షాత్ర మంత్రమున ఆమె తల్లి కొరకును హవిస్సులు సిద్ధము చేసి పెట్టి స్నానమునకు వెళ్ళగ అత్త అది కనిపెట్టి అల్లుడు తన భార్యకొరకు మంచి హవిస్సు సిద్ధముచేసి ఉండవచ్చుననుకొని, కూతురు వద్దకు వెళ్ళి 'నీ హవిస్సు నాకు ఇవ్వవలసినది' అని కోరినది. సత్యవతి తల్లిమాట కాదనలేక పోయినది. కూతురు హవిస్సు తల్లి పుచ్చుకొనగా, తల్లి హవిస్సు కూతురు పుచ్చుకున్నది.

ఋచీకుడు ఆశ్రమమునకు తిరిగివచ్చి జరిగినది తెలుసుకొని భార్యతో "నీవు అన్యాయము చేసినావు. నీ కొడుకు ఉద్దండుడైన క్షత్రియు డగును. నీ తమ్ముడు ధార్మికుడైన బ్రాహ్మణుడు అగును" అన్నాడు.

సత్యవతి అట్లు కాకుండ చేయ వలసినదిగా అనుగ్రహించుమని భర్తను ప్రాధేయ పడినది. ఋచీకుడు అనుగ్రహించి 'నీ కుమారునకు కాక నీ మనుమనికి క్షాత్ర గుణము అబ్బును' అన్నాడు.

సత్యవతి గర్భమున జమదగ్ని జన్మించినాడు. సత్యవతి నదియై ప్రవహించినది. అదే కౌశికీ నదియైనది.

జమదగ్ని రేణుని కూతురు రేణుకను వివాహమాడి ఆమె గర్భమున వసుమదులు మున్నగు కుమారులను బడసెను. జమదగ్ని చివరి పుత్రుడే పరశురాముడు. అతడు శ్రీమన్నారాయణుని అవతారము.

హైహయ క్షత్రియులందు కార్తవీర్యార్జునుడు గొప్పవాడు. అతడు దత్తాత్రేయుని అనుగ్రహము సంపాదించుటవలన వేయిచేతులు గలవాడై అసమాన పరాక్ర

మము గలవాడగుటయేకాక అణిమాది అష్టసిద్ధులను సాధించినాడు. వాయువువలె అతడు అడ్డులేక సంచరించువాడు.

ఒకనాడు అతడు భార్యతో కలసి రేవానదిలో జలకమాడుచు తన వేయిచేతులతో నదీ ప్రవాహమును అడ్డగించినాడు. దిగ్విజయమునకు బయలుదేరిన రావణుని దండు రేవాతీరమున విడిసినది. కార్తవీర్యుడు అడ్డగించుటతో రేవా పొంగినది. రావణుని శిబిరమును ముంచినది. రావణుడు అది సహించక కార్తవీర్యుని వద్దకు వెళ్ళి పరుష వచనములాడుచు యుద్ధమునకు సిద్ధపడగ జలక్రీడలాడుచున్న కార్తవీర్యుడు ఒకచేతితో రావణుని పట్టివేసి జలక్రీడలు ముగిసినపిదప రావణునికట్టి రాజధానికి తెచ్చి కీళ్లూడునట్లు హింసించి ఇకపై ప్రపంచమున వీరుడనని చెప్పుకొనకుమని అవమానించి పులస్త్యుడు కోరగ రావణుని విడిచినాడు.

ఒకనాడు కార్తవీర్యుడు వేటకువెళ్ళి వేటాడుచు జమదగ్ని ఆశ్రమమున ప్రవేశించినాడు. తపోధనుడైన జమదగ్నివద్ద కామధేనువు ఉండెను. దాని ప్రభావమున ఆ ముని కార్తవీర్యునకు ఘనముగా అతిథిసత్కారము చేసినాడు. తన ఐశ్వర్యమును మించిన ఐశ్వర్యము నీయగల కామధేనువును చూచి రాజునకు కన్నుకుట్టినది. కనీసము జమదగ్నిని అడుగలేదు. భటులతో కామధేనువును తోలించుకొని తన రాజధానియైన మాహిష్మతీ నగరమునకు చేరినాడు.

రాజు వచ్చినపుడు పరశురాముడు ఇంటలేడు. అతడు ఇంటికివచ్చి కార్తవీర్యుని దౌర్జన్యమునుగూర్చి తెలుసుకున్నాడు. దెబ్బతిన్న బెబ్బులివలె గర్జించి భయంకరమగు గండ్రగొడ్డలి భుజముపై వేసుకొని అమ్ములపొది కట్టుకొని ధనుస్సు, కత్తి, డాలు పట్టుకొని ఏనుగు వెంటబడిన సింహమువలె కార్తవీర్యుని వెంటాడినాడు.

కార్తవీర్యుడు మాహిష్మతిలో అడుగుపెట్టినాడోలేదో కార్చిచ్చువలె పరశురాముడు వచ్చి ప్రళయకాల రుద్రునివలె కనిపించినాడు. అతని తలమీది జడలు సూర్యకిరణములవలె మెరయుచున్నవి. నల్లలేడి చర్మము వల్లెవాటుగా వేసుకున్నాడు. భుజమున భయంకరమగు గండ్రగొడ్డలి ఉన్నది. చేతిలో ధనుర్బాణములున్నవి.

పరశురాముని చూడగనే పదిహేడు అక్షౌహిణుల సేనను అతని మీదకు ఉరికించినాడు కార్తవీర్యుడు. కార్చిచ్చు అడవిని కాల్చినట్లు పరశురాము డొక్కడే అంతసైన్యమును హతమార్చినాడు. కార్తవీర్యుడు మండిపోయి నడుముబిగించి

రణరంగమున దూకి అయిదువందల చేతులతో అయిదువందల ధనుస్సులను పట్టి మరొక అయిదువందల చేతులతో అయిదువందల అమ్ములను తొడిగి పరశురాము నిపై ప్రయోగించినాడు. అస్త్రవిద్యలలో అగ్రగణ్యుడైన పరశురాముడు ఒక వింటితోనే వానినన్నింటిని కొట్టివేసినాడు. కార్తవీర్యుడు తన వేయిచేతులతో అనేక కొండలను, చెట్లను పరశురాముని మీదకు విసరినాడు. పరశురాముడు వజ్రాయుధమువంటి తన గండ్రగొడ్డలితో కార్తవీర్యుని వేయిచేతులను నరికి, పర్వతశిఖరమువంటి అతని తలనుకూడ తన గండ్రగొడ్డలితో నరికివేసినాడు. కార్తవీర్యుడు కూలగానే లెక్కలేనంతమంది అతని కుమారులు పారిపోయినారు.

పరశురాముడు కార్తవీర్యుని హతమార్చి, కామధేనువును తెచ్చి జమదగ్నికి సమర్పించి అతడు శతృవుల పాలిటి ధూమకేతువని నిరూపించినాడు.

> జమదగ్ని పుత్రుడు చేసినపనిని మెచ్చలేదు. "నాయనా! రాజును చంపి పాపము చేసినావు. బ్రాహ్మణులకు క్షమాగుణమే కదా భూషణము. క్షమాగుణము వలనే లోకులు మనలను పూజింతురు. క్షమాగుణము వలననే బ్రహ్మదేవుడు లోకగురువు అయినాడు. క్షమాగుణము వలననే అతడు పరమేష్ఠి పదము పొందినాడు. భగవంతుడు క్షమాగుణ మున్నవే సంతసించును. అభిషిక్తుడైన రాజును చంపుట పాపము. రాజహత్య బ్రాహ్మణ హత్యకన్న ఘోరమైనది. భగవంతునిపై మనస్సు లగ్నము చేసి పుణ్యతీర్థములు సేవించి పాపమును వదలించు కొనుము."

అని ఉపదేశించినాడు.

తండ్రి ఉపదేశము ననుసరించి ఒక సంవత్సరము తీర్థయాత్రలు సేవించి తిరిగి వచ్చినాడు పరశురాముడు.

ఒకనాడు పరశురాముని తల్లి రేణుక స్నానమునకు గంగానదికి వెళ్ళినది. అప్పటికే చిత్రరథుడను గంధర్వరాజు అప్సరసలతో కలిసి గంగానదిలో జలక్రీడలాడుచున్నాడు. రేణుక మనస్సు చిత్రరథుని అందము చూచి చలించినది. కామ వాంఛ కలిగినది. అతనినే చూచుచు నిలిచినది. హోమమునకు సమయము మించిపోవుచున్న దను విషయము కూడ కానలేక పోయినది.

హోమ సమయము దాటిన తరువాత గాని ఆమెకు కాలము తెలియలేదు. భర్త శపించునను భయముతో ఆమె ఆశ్రమమునకు చేరి చేతులు జోడించి జమదగ్ని ముందు నిలిచినది.



శ్రీ హరి పరశురామావతారమెత్తి కార్తవీర్యుని సంహరించుట.

పుట. 390

తపోధనుడగు జమదగ్ని ఆమె మనోవికారమును గమనించి ఉగ్రుడై, "ఈ పాపిష్ఠురాలిని చంపుడు" అని కుమారులను ఆదేశించెను. తల్లిని చంపుటకు ఎవరికి ధైర్యము రాలేదు. వారు తండ్రి ఆజ్ఞను పాలించలేదు. తండ్రి ప్రభావము, శక్తి సామర్థ్యమును ఎరిగినవాడు పరశురాముడు. తండ్రి ఆజ్ఞ ప్రకారము వెంటనే తల్లిని వధించినాడు. తండ్రి ఆజ్ఞ ననుసరించి అన్నలను కూడా చంపినాడు.

తన ఆజ్ఞ పాలించిన పరశురాముని చూచి ప్రీతుడైనాడు. జమదగ్ని వరము కోరుకొన వలసిన దనగ పరశురాముడు చనిపోయిన తల్లినీ, సోదరులను బ్రతికించ వలసినదనియు, తాను వారిని చంపిన విషయము వారికి జ్ఞాపకము ఉండకుండు నట్లు వరము కోరినాడు.

జమదగ్ని అనుగ్రహించి చనిపోయిన వారందరిని జీవింపజేసెను.

కార్తవీర్యార్జుని కుమారులు పరశురాముని ప్రతాపము ముందు నిలువలేక పారిపోయినారనే కాని ప్రతీకార జ్వాలలు వారి హృదయములందు రగులుతునే ఉన్నవి. ఒకనాడు పరశురాముడు సోదరులతో అడవికి పోయిన సమయము కని పెట్టి వారు జమదగ్ని ఆశ్రమమున దూరినారు. అప్పుడు జమదగ్ని విష్ణుభగ వానుని మీద మనస్సు లగ్నముచేసి ధ్యానమందున్నాడు. అతడు బాహ్య జ్ఞానము లేని స్థితిలో ఉండుటవలన వారిని చూడలేదు. కార్తవీర్యుని కుమారులను చూచి సతి రేణుక. మొత్తుకున్నది. తన భర్తను చంపవద్దని కాళ్ళుపట్టుకొని బ్రతిమి లాడినది. కాని క్రూరులైన కార్తవీర్య పుత్రులు ఆమె మొర పట్టించుకొనలేదు. ధ్యానమందున్న జమదగ్ని తల నరికివేసి పారిపోయినారు.

రేణుక గుండెలు బాదుకొని గొంతెత్తి ఏడ్చినది. అడవిలో ఉన్న పరశురాముడు ఆ ఏడుపు విని, వాయువేగమున వచ్చి ఆశ్రమమున ప్రవేశించినాడు. తల తెగి పడి ఉన్న తండ్రిని చూచి, దుఃఖమున ఒడలు మరచి క్రోధము పొంగిపోయి, అగ్నివలె మండిపడినాడు. తండ్రి మృత కళేబరమును అన్నల ముందుంచి, గండ్ర గొడ్డలి పుచ్చుకొని, "ఈ భూమండలమున క్షత్రియుడన్న వాడు లేకుండ చేయు దును" అని ప్రతిజ్ఞ బూని ధూమకేతువు వలె పరుగెత్తినాడు. మాహిష్మతి నగ రమున ప్రవేశించి కార్తవీర్యుని కుమారులను వరుసపెట్టి నరికినాడు. వారి తలలు కొండలవలె కుప్పలు పడినవి. వారి రక్తము నదులై ప్రవహించెను.

ఆ యావేశమున భూమండల మంతయు ఇరువది యొక్కసారి తిరిగి కనిపించిన క్షత్రియుల నెల్ల వధించి కురుక్షేత్రమున శమంత పంచకమున తొమ్మిది రక్తపు

ముడుగులు సిద్ధము చేసినాడు. తండ్రి శిరస్సును మొండెముతో అతవరచి కుశలపై పరుండబెట్టి అనేక యజ్ఞములుచేసి ఆత్మస్వరూపుడైన భగవంతుని అర్చించినాడు. ఆ యజ్ఞములు చేయించిన బ్రాహ్మణులకు సమస్త భూమండలము ధారపోసి సరస్వతీ నదియందు అవభృథ స్నానముచేసి పాపములు వదిలించుకొని మబ్బులు వీడిన సూర్యునివలె ప్రకాశించెను.

జమదగ్ని సప్తర్షి మండలమున పదవ ఋషిగా వెలిగెను. రాబోవు మన్వంతరమున పరశురాముడు సప్త ఋషులలో ఒకడై వేద ప్రవర్తకుడగును.

ఈనాటికీ పరశురాముడు మహేంద్ర పర్వతమున ప్రశాంత చిత్తముతో ఉన్నాడు. సిద్ధులు, గంధర్వులు, చారణులు అతని చరిత్రమును గానము చేయుచుందురు.

> అధికారము అతిదుష్టమైనది. అది కన్నులకు పొరను కప్పి గుడ్డివానిని చేయును. అధికారము గలవాడు తాను చేయుచున్నదే సక్రమము అనుకొనును. కాదని చెప్పినవాని మాట వినడు. కాబట్టి అధికారము గలవానిని అదుపులో పెట్టువారు ఎల్లప్పుడు ఉండవలెను. అట్లు లేకున్న అధికార మదాంధుడు తనను తాను నాశనము చేసుకొనుటయే కాక ఎల్లరను నాశనము చేయును. ప్రభువు మితిమీరిపోయినప్పుడు అతనిని వధించుటకు సాహసము వెనుకాడరాదు. ఏలయన ఒకనిని వధించిన సకల ప్రాణులకు శ్రేయస్సు కలుగును. బహుజన శ్రేయస్సు కలుగును. బహుజన శ్రేయస్సు సర్వమతములకు ప్రధానము.
>
> కార్తవీర్యుని కన్నులకు కావర మెక్కినది. సాధుస్వరూపమైన గోవును అపహరించి పుణ్యాత్ముడైన జమదగ్నిని బాధపెట్టినాడు. నీతులు అతని ముందు పనిచేయవని తెలుసుకున్నాడు. అతనిని అంతమొందించి సాధువులను రక్షించినాడు.
>
> జమదగ్ని క్షమనుగూర్చి చక్కగా ఉపన్యసించినాడు పరశురామునకు ఉపదేశమిచ్చినప్పుడు. తనవరకు వచ్చువరకు అన్నియు మరచినాడు. స్త్రీహత్య చేయించినాడు. ఉపదేశించుట ఎంత తేలికయో, ఆచరించుట అంత కష్టము.
>
> తండ్రికి కీడు చేసినవారు కార్తవీర్యుని కుమారులు మాత్రమేకాగా క్షత్రియులందరను నాశనము చేసినవాడు పరశురాముడు. అది జాతిద్వేషము. మనము ఒక కుక్క కరచిన కుక్కలన్నింటిని ద్వేషింతుము. ఏ కుక్క కరచినదో లెక్కింపము అది మానవ సహజము. కాని మహాత్ములు సహితము మానవ సహజమునకు లొంగవలెనా!

విశ్వామిత్రుడు.

గాధిమహారాజు కుమారుడు విశ్వామిత్రుడు. అతడు ప్రచండుడు. అగ్నిహోత్రము వంటి తేజోవంతుడు తన తపోబలమున క్షాత్రము వీడి బ్రహ్మర్షియైనాడు.

విశ్వామిత్రునకు నూరుమంది పుత్రులు. వారిలో మధ్యముడు మధుచ్ఛందుడు. అతడు సుప్రసిద్ధుడు. అందువలన అతని పేరనే విశ్వామిత్రుని నూరుగురు పుత్రులు మధుచ్ఛందసులని పేరుపడ్డారు.

భృగువంశమునందు అజీగర్తుడను బ్రాహ్మణుడు ఉండువాడు అతని కుమారుడు శునశ్శేపుడు. హరిశ్చంద్రుని కుమారుడు రోహితుడు యజ్ఞపశువుగా కొని తెచ్చిన వాడితడే. విశ్వామిత్రుడు తన కుమారులను పిలచి 'శునశ్శేపుని మీ అన్నగా అంగీకరించవలసిన' దని ఆజ్ఞాపించినాడు. విశ్వామిత్రుని నూరుమంది పుత్రులలోను మొదటి నలుబదితొమ్మిది మంది శునశ్శేపుని అన్నగా స్వీకరించుటకు అంగీకరించలేదు. వారిని 'మ్లేచ్ఛులై పోవలసిన' దని శపించినాడు విశ్వామిత్రుడు.

ఏబదవవాడు మిగిలిన ఏబదిమందితో కలిసి తండ్రి ఆజ్ఞను పాలించుటకు సిద్ధపడి శునశ్శేపుని అన్నగా స్వీకరించినాడు. అట్లు శునశ్శేపుని అన్నగా స్వీకరించినందులకు విశ్వామిత్రుడు వారిని ఆశీర్వదించినాడు.

శునశ్శేపుడు హరిశ్చంద్రుని యజ్ఞమున బలిపశువు అయినాడు. విశ్వామిత్రుడు వరుణుడు మున్నగు దేవతలను ప్రార్థించి అతనిని పాశబంధములనుండి విడిపించినాడు. దేవతలచే రక్షింపబడినవాడు కాన నాటినుండి శునశ్శేపుడు దేవరాతుడు అయినాడు.

దేవరాతుడు విశ్వామిత్రుని జ్యేష్ఠపుత్రుడు అయినందున కౌశిక గోత్రమున ఎన్నో భేదములు ఏర్పడినవి. అతని ప్రజలలో కూడ మార్పు వచ్చినది.

య యా తి.

దైత్యులరాజు వృషపర్వుడు. అతని కూతురు శర్మిష్ఠ. వృషపర్వుని పురోహితుడు శుక్రాచార్యులు. అతనికూతురు దేవయాని.

ఒకసారి శర్మిష్ఠ దేవయానితో కలిసి ఉద్యాన వనమునకు వెళ్ళినది. స్నానము చేయుటకు బట్టలువిడచి ఒడ్డున పెట్టి సరోవరములోనికి దిగినది. శర్మిష్ఠ చెలికత్తెలు-కూడ సరస్సులోనికి దిగినారు. చాలసేపువారు జలక్రీడ లాడినారు. ఇంతలో శివుడు పార్వతి అచటికివచ్చినారు. వారినిచూచి కన్యలు సిగ్గుపడి గబగబ బయటికి వచ్చి చీరలు కట్టుకొనసాగినారు. తడబాటువలన తన చీరయే అనుకొని శర్మిష్ఠ దేవయాని చీరను కట్టుకున్నది. అదిచూచి మండిపోయినది దేవయాని. తాను బ్రాహ్మణకన్య నని గర్వమామెకు. శర్మిష్ఠకంటె తక్కువజాతి దని ఆమె ఎక్కువ జాతిదైన తనబట్ట కట్టుకున్నదని కోపము ఆమెకు.

"లోకమున బ్రాహ్మణులు ఉత్తములు. వారిలో భృగువంశము ఉత్తమమైనది. ఆ వంశమున నాతండ్రి శుక్రాచార్యుడు ఉత్తముడు. నీ తండ్రి అసురుడు, నా తండ్రికి శిష్యుడు. ఈస్థితిలో శూద్రుడు వేదము చదివినట్లు నా చీరను నీవు కట్టుకుందువా?" అని దేవయాని శర్మిష్ఠను నానా తిట్లు తిట్టినది.

దేవయాని తిట్లు విన్నది శర్మిష్ఠ. ఆమె రాచకూతురు. తనవలననే లోకము యొక్క జీవిక నడుచుచున్నదని గర్వము ఆమెకు.

"ముష్టిదానా! మా దయాభిక్షకై చేతులు చాచుకొని బ్రతికే నీకా ఇంత కావరము" అని అంతటితో ఆగక దేవయానిని ఈడ్చుకొని పోయిబావిలోత్రోసి చెలికత్తెల సహితముగా వెళ్ళిపోయినది.

అప్పుడు నహుషుని కుమారుడు యయాతి రాజ్యము చేయుచుండెను. అతడు వేటకై అడవికి వెళ్ళి, అరణ్యమున దాహముకాగా నీటికై దేవయాని పడిఉన్న బావివద్దకు వచ్చినాడు. బావిలో దేవయానిని చూచి చేయి అందించి ఆమెను వెలికి తీసినాడు. అతడు చేయి పట్టుకున్నపుడు ఆమె మేను పులకరించినది. ఆమె అతనిని ప్రేమించినది. అతడు దేవయానిని చూచినాడు. యయాతికి ఆమెపై ప్రేమ అంకురించినది.

యయాతి రాజధానికి వెళ్ళిపోయినాడు.

దేవయాని తండ్రివద్దకు వెళ్ళి, పెద్దగా ఏడ్చినది. తనకు జరిగిన అవమానమును గూర్చి చిలవలు పలువలుచేసి తండ్రికి చెప్పినది. శుక్రాచార్యునకు దేవయాని ఒక్కతే కూతురు. ఆవిడ అతనికి ప్రాణము. కూతురు ఏడ్పుచూచి చాల బాధపడి. తనను తనవృత్తిని నిందించు కున్నాడు. దేవయానిని వెంటబెట్టుకొని వృషపర్వుని పట్టణము వీడిపోవుటకు బయలుదేరినాడు.

ఆ విషయము వృషపర్వునకు తెలిసినది. శుక్రాచార్యులు దేవతల పక్షముచేరి తమను హతమార్చునని భయపడి శుక్రాచార్యుని దారికి అడ్డముగా పరుగెత్తి ఆచార్యుల పాదములపై వ్రాలినాడు. శుక్రుడు క్షణకోపి. శిష్యుని ప్రార్థనవిని శాంతించి, తన కూతురుకోరిక నెరవేర్ప వలసినదని వృషపర్వుని కోరినాడు. అందుకు వృషపర్వుడు దేవయానిని ఆమె కోర్కె తెలియపరచ వలసినదని అడిగినాడు.

"నేను ఎవరిని పెండ్లాడినను తన చెలికత్తెల సహితముగా శర్మిష్ఠ నావెంట అత్త వారింటికి రావలెను" అని కోరినది దేవయాని.

వృషపర్వుడు గత్యంతరములేక అంగీకరించినాడు. శర్మిష్ఠ చెలికత్తెల సహితముగా దేవయానికి దాసి అయినది.

శుక్రుడు దేవయానిని యయాతి కిచ్చి పెండ్లిచేసినాడు. శర్మిష్ఠతో ఎటువంటి సంబంధము పెట్టుకొనరాదని శుక్రుడు అల్లునికి చెప్పినాడు.

దేవయానికి సంతానము కలిగినది. శర్మిష్ఠకు స్త్రీసహజమైన సంతాన వాంఛ కలిగినది. ఋతుమతిగా ఉన్నపుడు యయాతి వద్దకువెళ్ళి తనకు సంతానము ప్రసాదించవలసినదని ప్రార్థించినది. కాదనలేక పోయినాడు యయాతి.

యయాతికి దేవయానివలన యదు, తుర్వసులను ఇద్దరు పుత్రులు కలిగినారు శర్మిష్ఠవలన ద్రుహ్యుడు, అనుడు, పూరుడు అను ముగ్గురు పుత్రులు కలిగినారు.

శర్మిష్ఠకు తనభర్తవలన పుత్రులు కలిగినారని తెలిసి దేవయాని నిప్పులు క్రక్కినది. యయాతి బ్రతిమిలాడినను వినక తల్లిగారింటికి వెళ్ళిపోయినది.

కూతురు గోడువిని ఉగ్రుడైనాడు శుక్రుడు. ''యయాతి ముసలివాడగుగాక!'' అని శపించినాడు. యయాతి శుక్రాచార్యునితో సవినయముగా, ''దేవయానితో విషయ సుఖములు ఇంకను అనుభవించవలెనని ఉన్నది అంతియే కాక నీశాపము వలన దేవయానికి కూడ కీడు కలిగినది. కావున అనుగ్రహించుము'' అని ప్రార్థించినాడు.

శుక్రాచార్యుడు ఆలోచించి, ''సంతోషముగా ఎవడైనను నీకు తనయవ్వనమిచ్చినచో నీవు యువకుడవు అగుదువు. నీకు యవ్వనము ఇచ్చినవాడు వృద్ధుడగును'' అని తన శాపమును తగ్గించినాడు.

యయాతి రాజధానికి వచ్చి తన పుత్రులను ఒక్కరొక్కరినే పిలిచి తన యవ్వనము ఇవ్వవలసినదని కోరెను. దేవయాని పుత్రులు ఇద్దరు అందుకు అంగీకరించలేదు. శర్మిష్ఠ పుత్రులలో ఇద్దరు కూడ అంగీకరించలేదు. కాని అందరికన్న చిన్నవాడగు పూరుడు అందుకంగీకరించి సంతోష పూర్వకముగా తన యవ్వనము తండ్రికి ఇచ్చి తండ్రి ముసలి తనము తాను తీసుకున్నాడు.

> ''తండ్రి అనుగ్రహించినచో పుత్రుడు పరమ పదము చేరుకొనగలడు.
> కుమారుని శరీరము తండ్రి ప్రసాదించినదే. తండ్రి మనసులోని మాట
> గ్రహించినడుచుకున్నవాడు ఉత్తముడు. తండ్రి చెప్పిన తరువాత ఎదురాడక

> ఆదరించువాడు మధ్యముడు. తండ్రి చెప్పిన తరువాత అశ్రద్ధగా చేసినవాడు అధముడు. ఇక తండ్రి చెప్పినను చేయనివాడు అధమాధముడు. అట్టివాడు పుత్రుడే కాడు."

యయాతి బహు కాలము విషయ భోగములు అనుభవించి చివరకు వైరాగ్యము పొడసూపిన అతడు విషయ వాంఛలను పూర్తిగా త్రెంచుకొని పూరుని యవ్వనము వానికి తిరిగిఇచ్చి వార్ధక్యమును స్వీకరించినాడు. రాజ్యపు ఆగ్నేయ దిక్కును ద్రుహ్యునకు, దక్షిణదిక్కును యదునకు, పశ్చిమదిక్కును తుర్వసునకు, ఉత్తరదిక్కును అనునకు ఇచ్చి, తన ప్రియ పుత్రుడైన పూరుని వారిపై మహారాజుగా అభిషేకించి, వానప్రస్థము స్వీకరించి అడవులకు వెళ్ళిపోయినాడు. అచట ఆసక్తి అన్నింటిని వదలి ఆత్మసాక్షాత్కారము పొంది పాంచభౌతికమైన అతని దేహము నశించినది. అతడు భగవంతునిలో లీనమైనాడు.

దేవయాని సహితము, లోకము మాయ యని గుర్తించి శ్రీహరిపై మనస్సు లగ్నముచేసి, దేహమును విడిచి, భగవంతునిలో లీనమైనది.

భరతుడు.

దుష్యంతుడు చంద్రవంశపు రాజు. అతడు ఒకసారి వేటకు వెళ్ళి, వేటాడుతూ, వేటాడుతూ కణ్వాశ్రమమున ప్రవేశించినాడు. అచట లక్ష్మీదేవి వంటి ఒక కన్యను చూచినాడు. ఆమె పేరు శకుంతల. ఆమెను చూడగానే దుష్యంతుడు మైమరచినాడు. వేటఅలసట తీర్చుకొని ఆమెను చూచి, "దేవీ! సౌందర్యము రాశిపోసినట్లున్న నీ వెవరు? నిర్జనమైన ఈ అరణ్యమున ఎందుకున్నావు. రంభవా? ఊర్వశివా? తిలోత్తమవా? లేక లక్ష్మీదేవివే ఇట్లు అవతరించితివా? నీవు రాజ కన్యవలె నున్నావు. నా మనసును ఆకర్షించుచున్నావు" అని అడిగినాడు.

అందుకు శకుంతల, "వీరుడా! నీ వన్నది నిజము. నేను విశ్వామిత్రుని కూతురను. నా తల్లి మేనక నన్నుకని అడవిలో వదిలి పోయినది. నన్ను పెంచి పెద్ద చేసినవాడు కణ్వుడు. రాజా! నే నేమి సేవచేయగలను? ఈ వేదిక మీద కూర్చొని నా ఆతిథ్యము స్వీకరించుము. ఆశ్రమమున నీవారాన్నమున్నది ఆరగించుము. ఇష్టమైనచో ఇచటనే ఉండుము" అన్నది. ఆమె దుష్యంతుని చూచి ద్రవించినది.

"కుశిక వంశమున పుట్టినావు. మేనక నీ తల్లి. అందుకే అప్సరసల కన్న అందముగా ఉన్నావు. నీ వంశమునకు తగినట్లుగానే అతిథి సత్కారము చేయుచున్నావు" అన్నాడు దుష్యంతుడు.

శకుంతల సహితము తన విషయమున ప్రేమను వ్యక్తపరచిన దని గ్రహించినాడతడు. గాంధర్వవిధిని ఆమెను వివాహమాడినాడు దుష్యంతుడు. ఆ రాత్రి కణ్వాశ్రమమున శకుంతలతో గడిపి తెల్లవారి తన రాజధానికి వెళ్ళిపోయినాడు. శకుంతల గర్భవతి అయినది. నెలలు నిండగా ఆమెకు ఒక పుత్రుడు కలిగెను. అతడే భరతుడు. కణ్వుడు తన ఆశ్రమమునందే ఆ శిశువునకు జాతకర్మలు మున్నగునవి నిర్వహించినాడు. భరతుడు మహా బలవంతుడు. బాల్యముననే పెద్దపెద్ద సింహములను తెచ్చి కట్టివేయువాడు. వాటితో ఆటలాడు వాడు.

భరతుని తీసుకొని శకుంతల దుష్యంతుని వద్దకు వెళ్ళినది. మొదట అతడు భార్యను, పుత్రుని పరిగ్రహించలేదు. ఆకాశవాణి శకుంతల దుష్యంతుని భార్య అనియు, ఆమెను పరిగ్రహించ వలసినదనియు పలికినది.

దుష్యంతుడు ఆమెను పరిగ్రహించినాడు.

దుష్యంతుడు మరణించిన తరువాత భరతుడు చక్రవర్తి అయినాడు. అతడు గంగఒడ్డున గంగా సాగర సంగమమునుండి గంగోత్రివరకు ఏబది అయిదు అశ్వమేధయాగములు చేసినాడు. యమునాతీరమున ప్రయాగనుండి యమునోత్రివరకు డెబ్బదిఎనిమిది అశ్వమేధములు చేసినాడు. పదమూడువేల ఎనుబది నాలుగు పాడి ఆవుల మందను ద్వంద్వము అందురు. అట్టి ద్వంద్వములు వేయిమంది బ్రాహ్మణులకు దానము చేసి, ఆయజ్ఞములవలన ఇహపరములందు కీర్తి సంపాదించుటే కాక మాయను జయించి అంత్యకాలమున భగవంతుని సాన్నిధ్యము పొందినాడు.

> భరతస్య మహత్కర్మ న పూర్వే నాపరే నృపాః।
> నైవాపుర్నైవ ప్రాప్స్యంతి బాహుభ్యాం త్రిదివం యథా॥

భరతుడు చేసిన మహత్కర్మను ఇంతవరకు ఎవరును చేయలేదు. ఇకముందు చేయబోరు. చేతితో ఆకాశమును ఎవరైనను అందుకొనగలరా!

భరతుడు దిగ్విజయముచేసి కిరాతులు, యవనులు, హూణులు, ఆంధ్రులు, కంకులు, శంకులు, ఖగులు, శకులు మున్నగు బ్రాహ్మణద్రోహులైన రాజులను హతమార్చినాడు.

రాక్షసులు ఎంతోమంది దేవతాస్త్రీలను దొంగిలించి రసాతలమున దాచినారు. భరతుడు అట్టి రాక్షసులపై దండెత్తి దేవతాస్త్రీలను విడిపించినాడు.

అతని పాలనలో ప్రజలు సుఖించినారు. సకాలమున వర్షములు కురిసినవి. పాడిపంటలు పొంగిపొరలినవి.

భరతునకు వదిరభ రాజకన్యలు ముగ్గురు భార్యలు. వారు పుత్రులను కన్నారు. కాని వారు పోలికలలో భరతునివలె లేకుండుటచూచి, మహారాజు తమను త్యజించునను భయమున, వారు ఆపిల్లలను చంపినారు. భరతుని వంశము అంతటితో ఆగిపోవు ప్రమాదము సంభవించినందున భరతుడు మరుత్స్తోమము చేసినాడు మరుత్తులు ప్రసన్నులై భరద్వాజుని కుమారునిగా సమర్పించినారు.

భరద్వాజుడు.

ఒకసారి బృహస్పతి కన్ను తన వదినయైన మమత మీద పడినది. ఆమెతో మైథునమునకు పూనుకున్నాడు. అప్పటికే ఆమె నిండు చూలాలు. అపుడు బృహస్పతివలన ఆమెకు ఒక పుత్రుడు కలిగినాడు భర్త తనను త్యజించునను భయమున బృహస్పతికి పుట్టిన బిడ్డను పరిత్యజించవలెనని అనుకున్నది అందు విషయమున బృహస్పతికి ఆమెకు సంవాదము జరిగినది.

మూఢే! భరద్వాజమిమం భరద్వాజం బృహస్పతే
యాతౌ యదుక్త్వా పితరౌ భరద్వాజ స్తతస్త్వయమ్

"ఓ మూఢురాలా! వీనిని నీవు (భర) భరించుము (ద్వాజ) వీడు నీకును నాకును ఇద్దరకును పుట్టినవాడు" అన్నాడు బృహస్పతి.

"ఓ బృహస్పతీ! వీనిని నీవు (భర) భరించుము (ద్వాజ) వీడు నీకును నాకును పుట్టినవాడు'' అన్నది మమత. అందువలన అతడు భరద్వాజుడు అయినాడు.

అట్లు ఒకరితో ఒకరు జగడమాడుకొని మమత బృహస్పతులు ఇరువురును భరద్వాజుని వదిలివేసినారు. అప్పుడు మరుత్తులు అతనిని పెంచి భరతుడు మరుత్స్తోమము చేసినపుడు వారు భరద్వాజుని భరతునకు సమర్పించినారు.

రంతిదేవుడు.

భరద్వాజుని వంశపువాడు రంతిదేవుడు. దానము ఇచ్చుటలో అతనికి అతడే సాటి. అతడు ఎంతో ధనము గడించువాడు. తాను అనుభవించక ఇతరులకు దానము

చేయువాడు తనకు తన పరివారమునకు తిండిలేకున్నను ఇతరులకు ఇచ్చువాడు. అట్లైనను నిరుత్సాహపడువాడు కాడు.

ఒకసారి అతడు పరివార సహితముగా నలుబది ఎనిమిది దినములు తిండిలేక గడిపినాడు. అంతకాలము అతనికి మంచినీళ్ళైనను లభించలేదు. నలుబది తొమ్మిదవ నాడు ఉదయము కొంత నేయి, పాయసము, జలము దొరికినవి. కటిక ఉపవాసములు చేయుచున్న పరివారముతో సహా అది తినుటకు సిద్ధమైనాడు. అదే సమయమునకు ఆకలిగొన్న ఒక బ్రాహ్మణుడు అతిథిగా వచ్చినాడు. సకలప్రాణులందును భగవంతుని దర్శించు రంతిదేవుడు అతనికి ఆతిథ్యమిచ్చి ఆదరించినాడు. దొరికిన ఆహారమునుండి అతనికి భోజనము పెట్టినాడు. బ్రాహ్మణుడు తృప్తిగా భోజనము చేసి వెళ్ళిపోయినాడు.

మిగిలినదానిని పంచుకొని తినుటకు పరివారము కూర్చొనగా ఒక శూద్రుడు వచ్చి అన్నమడిగినాడు. రంతిదేవుడు భగవంతుని తలచుకొని ఉన్నదానిలో శూద్రునికి భోజనముపెట్టి తృప్తిపరచి పంపినాడు.

మిగిలినది భుజించుటకు కూడినది పరివారము. కొన్ని కుక్కలను తీసుకొని మరొక అతిథి వచ్చి, "రాజా! నేను నాకుక్కలును ఆకలితో అలమటించుచున్నాము. మాకు అన్నము పెట్టుము" అన్నాడు భగవంతుడే కుక్కల రూపమునను వాటి యజమాని రూపమునను వచ్చినాడనుకొని రంతిదేవుడు వారికి నమస్కరించి సంతోషముగా మిగిలిన ఆహారము వారికి ఇచ్చివేసినాడు.

లభించిన ఆహారమంతయు అయిపోయినది. నీరు మాత్రము మిగిలిపోయినది. అవి కూడ ఒక మనిషికి సరిపోవునన్ని లేవు. వానినే పరివారముతో పంచుకొని త్రాగుటకు సిద్ధపడినాడు. ఇంతలో ఒక చండాలుడు వచ్చి, "రాజా! నేను నీచజాతివాడను. దాహమున ప్రాణములు పోవుచున్నవి. నీరుపోసి నాప్రాణము రక్షించుము" అని జాలిగా వేడుకొనెను. చండాలుని జాలిగొంతుక విని రంతిదేవుడు కనికరించి, "భగవంతుడా! నాకు సకలైశ్వర్యములు అక్కరలేదు. మోక్షముకూడ అర్థించను. నేను కోరునది ఒక్కటే కోర్కె జీవులందరి హృదయములందును నేను నిండిపోవలె. వారి దుఃఖమంతయు నేను భరించవలెను. వారికి ఏమాత్రము దుఃఖము లేకుండవలెను. దీనులైన జీవులు నీరు త్రాగగోరైన జీవించవలెనని తపించుచున్నారు. కొన్ని నీళ్ళతో వీరు బ్రతికి పోవుదురు. నేను వారికి ఇంతమాత్రము నీరు ఇవ్వగలిగినచో నా ఆకలి దప్పులు, శ్రమ అన్నియు

వదలిపోవును. నేను సుఖముగా ఉందును" అనుచు మిగిలిన ఆ కొద్దిపాటినీరు ఆ చండాలునకు ఇచ్చివాడు.

రంతిదేవుడు కరుణామూర్తి. అన్నాళ్ళుగా పరివార సహితముగా తిండి నీరు లేక మలమల మాడుచున్నను, దాహమని వచ్చిన చండాలునకే ఉన్న నీరు ఇచ్చివాడు.

అట్లు రంతిదేవుని వద్దకు వచ్చిన వారందరు దేవతలే. వారు రంతిదేవుని పరీక్షించుటకు వచ్చినారు. ఆ పరీక్ష ముగియగానే బ్రహ్మ, విష్ణు, శివుడు రంతిదేవుని ముందు ప్రత్యక్షమైనారు. రంతిదేవుడు వారికి సాగిలపడి మ్రొక్కినాడు. ఆసక్తు లన్నింటినుండి విముక్తుడైన రంతిదేవుడు త్రిమూర్తులు దర్శనమిచ్చినను ఏమియు కోరలేదు. అతని చిత్తము పరమాత్మని మీదనే ఉన్నది. అతడు నిష్కామి. మాయ అతనిని జయించలేక పోయినది. స్పర్శవేది వలన ఇనుము బంగారమైనట్లు అతని పరివారములోని వారెల్లరు హరిపరాయణులు అయిపోయినారు.

జీవితమునకు పరమావధి ఆనందము. ఆనందము అనుభవించుటకు మిగత వన్నియు కారణములు. అట్టి కారణములే దుఃఖమునకు కారణమైనచో వానిని విడుచుట శ్రేయస్కరము.

ఔషధము రోగమును కుదుర్చవలెను. అట్టి ఔషధము రోగమును వృద్ధిచేసినచో వెంటనే విడువవలెను. రోగము కుదిరి ఆరోగ్యము కలిగి, తద్వారా ఆనందము లభించుటకు వేరొక మార్గమును అన్వేషింపవలెను.

ధనము మానవుని ఆనందమునకుగాను అతనిచే కనుగొనబడినది. దానిని ఆనందము కలిగించినంతవరకు ఉంచుకొనుటవలన దోషములేదు. కాని అది దుఃఖమును కలిగించి, జీవితమును నరకప్రాయము చేయునపుడు దానిని త్యజించుట ఉత్తమము. దానిని త్యజించి ఆనందమునిచ్చు వేరుమార్గమునకై అన్వేషించవలయును.

పరులకు ఇచ్చుటలో ఒక ఆనందమున్నది. తీసుకున్నవారు లజ్జతో క్రుంగి పోవుదు. కాని ఇచ్చువారు ఆనందింతురు. మనము కుటుంబమును పోషింతుము. మనము తిన్నప్పటికంటె మన బిడ్డలు తిన్నప్పుడు, వారు సంతృప్తి చెందినపుడు మనము ఎంతో ఆనందింతుము. నీవు మంచి బట్టకట్టు కొనుటవలన ఆనందింరవు. కాని నీ బిడ్డలు మంచి బట్టలు కట్టుకున్నపుడు చూచి ఆనందింతువు.

పరిమితమైన ఏకకుటుంబ విషయములోనే ఇంత ఆనందమున్న ప్రపంచమంతయు తన కుటుంబమే అనుకొన్నవాని ఆనందమునకంతుండునా ! అతడు ప్రతి

ప్రాణియందును భగవానుని దర్శించవలెను. అట్లా ప్రతిప్రాణిని భగవంతుని యంశగా పవిత్రునిగా భావించును. దుఃఖము నొందుచున్నవారి దుఃఖములెల్ల పంచుకొనును. ఎల్లరి దుఃఖములను ఉపశమింపజేయుటకు ప్రయత్నించి తద్వారా అపరిమితమైన ఆనందమును పొందును.

అర్థివానికి మోక్షమెందులకు?

రంతిదేవునకు వరము లెందుకు? అతడు భగవంతుని యందు లీనమయ్యెను.

గర్గునకు శిని, శినికి గార్గ్యుడు జనించిరి. గార్గ్యునుండి బ్రాహ్మణకులమైనది. మహావీర్యునికి ఉరుక్షయుడు అతనికి త్రయ్యారుణి, కవి, పుష్కరారుణియను ముగ్గురు జన్మించిరి. వీరుకూడ బ్రాహ్మణులైరి. బృహత్క్షత్త్రునకు సుహోత్రుడు అతనికి హస్తి అనువాడు జన్మించి తనపేర హస్తినాపురమును నిర్మించెను. హస్తికి అజమీఢుడు, ద్విమీఢుడు, పురుమీఢుడను ముగ్గురు గల్గి అందు అజమీఢుని వంశమున ప్రియమేధాదులు కొందరు జనించి బ్రాహ్మణులైరి. అతనికే బృహదిషుడు జనింప అతని పుత్రుడు బృహద్ధనువు అతనికి బృహత్కాయుడు అతనికి జయద్రథుడు అతనికి విశ్వజిత్తు, అతనికి సేనజిత్తు, సేనజిత్తునకు రుచిరాశ్వుడు, దృఢహస్తుడు, కాశ్యుడు, వత్సుడు అను నల్గురు జనింప, అందు రుచిరాశ్వునకు ప్రాజ్ఞుడు అతనికి పృథుసేనుడు అతనికి పారుడు వానికి నీపుడు. అతనికి నూర్గురు కొడుకులు జనించిరి. నీపునకు బ్రహ్మదత్తుడు అతనికి విష్వక్సేనుడు అతనికి ఉదక్సేనుడు, అతనికి భల్లాటుడు జనించిరి. వీరు బార్హద్రిషవులను రాజులైరి. ద్విమీఢునకు యవీనరుడు అతనికి కృతిమంతుడు, అతనికి సత్యధృతి సత్యధృతికి దృఢనేమి, అతనికి సుపార్శ్వకృత్తు అతనికి సుపార్శ్వుడు, అతనికి సుమతి, సుమతికి సన్నతిమంతుడు అతనికి కృతియనువాడు జనించెను. అతనికి ఉగ్రాయుధుడు అతనికి క్షేమ్యుడు అతనికి సువీరుడు వానికి పురంజయుడు వానికి బహురథుడు జనించెను. పురుమీఢునికి సంతతి కల్గలేదు. అజమీఢునికి నళినియను భార్యవలన నీలుడు కల్గె. అతనికి శాంతియు అతనికి సుశాంతియు వానికి పురుజుడు వానికి అర్కుడు వానికి భర్మ్యాశ్వుడు అతనికి ముద్గల, యవీనర, బృహదిషు, కాంపిల్య, సృంజయులను ఐదుగురు పుత్రులు గల్గిరి. ముద్గలునుండి బ్రాహ్మణకులమై వారు ముద్గల గోత్రులైరి. ముద్గలునికి దివోదాసుడు అహల్యయను పుత్రికయు కల్గిరి. అహల్య గౌతమునికి భార్యయై శతానందుని కన్నది. శతానందునకు ధనుర్వేద విశారదుడైన సత్యధృతి కల్గె. ఆ సత్యధృతి యొకనాడు వనాంతరమున ఊర్వశినిజూచి చలించి స్ఖలింప వీర్య

యాడశిశువు మగశిశువుకాగా వారిరువురిని శంతనుడను రాజు తెచ్చి కృపి, కృపుడని నామకరణ మొనర్చె. అందు కృపి ద్రోణునకు భార్యయయ్యెను. దివోదాసునకు మిత్రాయువు అతనికి చ్యవనుడు అతనికి సుదాసుడు వానికి సహదేవుడు వానికి సోమకుడు అతనికి సుజన్మకృత్ అతనికి నూర్గురు పుత్రులు గలుగ అందు మొదటివాడు జంతువు కడపటివాడు పృషతుడు. ఆ పృషతునకు ద్రుపదుడు అతనికి ధృష్టద్యుమ్నాదులు, ద్రౌపదియను కూతురు గల్గి, ధృష్టద్యుమ్నునకు ధృష్టకేతువు జనించెను. వీరు పాంచాల రాజులైరి. ఆ యజమీఢునకు ఋక్షుడు వానికి సంవరణుడు జనించెను. సంవరణుడు తపతియను సూర్యకన్య వలన కురువును గనెను. అ కురువు పేరనే కురుక్షేత్ర మేర్పడెను. కురువునకు పరీక్షిత్తు, సుధనవు, జహ్నువు, నిషధుడు అను నల్గురు పుత్రులు జనించిరి. అందు పరీక్షిత్తునకు సంతతిలేదు. సుధనువునకు సుహోత్రుడు వానికి చ్యవనుడు వానికి కృతి అతనికి వసువు వానికి బృహద్రథుడు కుసుంభమత్స్య ప్రత్యగ్రి చేదిపాదులు కల్గిరి. అందు బృహద్రథునకు కుశాగ్రుడు వానికి ఋషభుడు అతనికి సత్యహితుడు వానికి పుష్పవంతుడు వానికి జహ్నువారు జనించిరి. ఆ బృహద్రథునకు అన్య భార్యవలన నిలువుగా రెండు భాగములైన శరీరము జనింప తల్లి వానిని పారవేయగ జరయను రాక్షసి ఆ రెండు ఖండములను ఒకచోట సంధించగ వాడు జరాసంధుడై, అతడు గిరివ్రజపురమునకు రాజయ్యెను. అతని కుమారుడు సహదేవుడు. వానికి సోమాపియు యతనికి శ్రుతశ్రివు డనువాడు జనించె. జహ్నుపుత్రుడు సురథుడు. అతనికి విదూరథుడు, వానికి జయత్సేనుడు, సుతుడయ్యె. జయత్సేనునకు రథికుడు వానికి నశాయువు అతనికి క్రోధనుడు వానికి దేవాతిథియుగల్గిరి. దేవాతిథికి ఋక్షుడు అతనికి భీమసేనుడు వానికి ప్రతీపుడు గల్గిరి.

శంతనుడు.

ప్రతీపుడు చంద్రవంశమున రాజయ్యెను. అతనికి దేవాపి, శంతనుడు, బాహ్లీకుడు అను ముగ్గురు పుత్రులు.

దేవాపి తండ్రి రాజ్యము వదిలి అడవులకు వెళ్ళినందున శంతనుడు రాజైనాడు. ఒకసారి శంతనుని రాజ్యమున పన్నెండేండ్లవరకు వానలు కురువలేదు. అన్న ఉండగా తమ్ముడు రాజ్యము నేలుచున్నాడు. కాన వానలు కురియుటలేదు అన్నారు బ్రాహ్మణులు. శంతనుడు అన్నను వెదుకుచు అడవులకు వెళ్ళినాడు.

అప్పటికే దేవాపి వేద విరుద్ధమైన పాషండ మతము నవలంబించుట వలన ఆతనికి రాజగు అర్హతపోయినది. శంతనుడు పాపములేని వాడని గ్రహించినారు దేవతలు. వానలు కురిపించినారు. దేశము సుభిక్షమైనది.

శంతనునకు గంగాదేవి గర్భమున భీష్ముడు జన్మించినాడు. భీష్ముడు నైష్ఠిక బ్రహ్మచారి. మహావీరుడు. యుద్ధమున తన గురువైన పరశు రాముని ఓడించిన వాడు.

శంతనుడు దాశరాజు కూతురు సత్యవతిని పెండ్లాడినాడు. ఆమెకు చిత్రాంగదుడు, విచిత్రవీర్యుడు అను ఇద్దరు పుత్రులు కలిగినారు. అందు చిత్రాంగదుని గంధర్వుడొకడు చంపెను.

భీష్ముడు విచిత్రవీర్యునకు గాను కాశీరాజు పుత్రికలైన అంబ అంబాలిక అను వారిని తెచ్చినాడు. విచిత్రవీర్యుడు వారిని పెండ్లాడినాడు. అతడు భార్యలు తప్ప వేరేలోకము లేదన్నట్లు కాలము గడిపినాడు. రాజయక్ష్మ రోగము పుట్టి మరణించినాడు.

సత్యవతి శంతనుని వివాహమాడక ముందు పరాశరముని సాంగత్యము వలన గర్భము ధరించి వ్యాసుని గనెను. వ్యాసుడు ఋషియై, వేదవ్యాసు డని ప్రసిద్ధిగాంచి వేదములకు వ్యాఖ్యానము రచించి పురాణములు రచించి, భారత, భాగవతముల రచించెను.

వ్యాసుడు తల్లికి తలుచుకున్నప్పుడెల్ల ప్రత్యక్షమై ఆమె సంకటముల బాపువటుల వరమిచ్చి యుండెను. చిత్రవీర్యుడు విచిత్రవీర్యుడు గూడ మరణించుటతో చంద్రవంశ మంటితో సంతమొందవలసిన ప్రమాదమేర్పడినది. అందువలన సత్యవతి తన మొదటి పుత్రుడగు వేదవ్యాసుని తలచెను. వ్యాసుడు ప్రత్యక్షమై తల్లి మనోగత మెరిగి విచిత్రవీర్యుని భార్యలకు గర్భాదాన మొనర్చెను.

వ్యాసుని వలన విచిత్రవీర్యుని భార్యలకు ధృతరాష్ట్రుడు, పాండు రాజు అను పుత్రులుకలిగినారు. వ్యాసుని వలన ఒక శూద్రస్త్రీకి విదురుడు జన్మించినాడు.

ధృతరాష్ట్రుని భార్య గాంధారి. ఆమెకు నూరుగురు పుత్రులు. వారిలో పెద్ద వాడు దుర్యోధనుడు. ఒక కూతురుకూడ కల్గెను పేరు దుశ్శల.

పాండురాజు భార్య కుంతి. అతడు సంతానము కలుగకముందే గతించినాడు. కుంతి ధర్మదేవతవలన ధర్మరాజును, వాయుదేవునివలన భీముని, ఇంద్రునివలన

అర్జునుని కన్నది. పాండురాజు మరొకభార్య మాద్రి అశ్వినీ కుమారులవలన నకులసహదేవు లను కవల పిల్లలను కన్నది. వీరు అయిదుగురు పాండవులు. వీ రైదుగురు ద్రుపదుని పుత్రికయగు ద్రౌపదిని వివాహమాడిరి.

ద్రౌపదికి పాండవులైదుగురివలన క్రమముగ ప్రతివింధ్యుడు, శ్రుతసేనుడు, శ్రుతకీర్తి, శతానీకుడు, శ్రుతకర్ముడు, అను ఏదుగురు పుత్రులు జనించిరి. యుధిష్ఠిరునకు పౌరవతియను మరొక భార్యయందు దేవకుడను వాడును, భీమునకు హిడింబియను భార్యయందు ఘటోత్కచుడును, కాళిందియను భార్య యందు సర్వగతుడును, సహదేవునకు విజయయను భార్యయందు సుహోత్రుడును నకులునకు రేణుమతియను భార్యయందు నిరుమిత్రుడను, అర్జునునకు ఉలూపి యను భార్యవలన ఇలావంతుడను చిత్రాంగదయను భార్యయందు బభ్రు వాహనుడును. సుభద్రయను భార్యయందు మహా పరాక్రమశాలియగు అభిమన్యుడు జనించిరి. బభ్రువాహనుడు మాతామహుని గోత్రమునకు వంశ కర్తయయ్యెను. అజయకీర్తి, రాజన్య వరేణ్యుడగు నీ తండ్రి అభిమన్యుడు కురువంశకర్త యయ్యెనని శ్రీ శుకుడు పరీక్షిత్తునకు తెల్పుచు మరియు నిట్లనియె.

అభిమన్యునకు నీవు అశ్వత్థామ బ్రహ్మాస్త్ర వేడిమి వలన ఉత్తర గర్భమున మరణించియు, శ్రీహరి దయవలన బ్రతికితివి.

పరీక్షిత్తు కుమారులు జనమేజయుడు, శ్రుతసేన, భీమసేన, ఉగ్రసేనులను వారు నల్వురు. వీరిలో జనమేజయుడనువాడు తన తండ్రిని తక్షకుడు కరిచి చంపినాడను పగవలన సర్పయాగ మొనరించుటయేగాక మహావీరుడై ధరణి మండలమెల్ల జయించి, అనేకాశ్వమేధాది యాగముల జేసి ప్రసిద్ధి నొందగలడు. అతనికి శతానీకుడను పుత్రుడుగలిగి, యాజ్ఞవల్క్యుని వద్ద వేదము నేర్చి కృపా చార్యుని వలన విలువిద్య నేర్చి శౌనకుని వలన ఆత్మజ్ఞానము పడయగలడు. శతానీకునకు సహస్రానీకుడు అతనికి అశ్వమేధజుడు వానికి అసీమ కృష్ణుడు వానికి నిచకుడు అతడు కౌశాంబి యందుండును. అతనికి ఉప్తుడు అతనికి చిత్రరథుడు వానికి శుచిరథుడు వానికి వృష్టిమంతుడు అతనికి సుషేణుడు. వానికి సునీతుడు వానికి నృచక్షువు అతనికి సుఖానిలుడు అతనికి పరిప్లవుడు వానికి మేధావి, వానికి సునయుడు, అతనికి నృపంజయుడు వానికి దూర్వుడు, దూర్వునకు నిమి, అతనికి బృహద్రథుడు అతనికి దుర్దమనుడు. దుర్దమునునకు

విహీనరుడు వానికి దండపాణి అతనికి నిమితుడు నిమితునకు క్షేమకుడు వానికి బ్రహ్మక్షత్రుడు కల్గును. బ్రహ్మక్షత్రుడు కలియుగమున నిర్వంశుడగును.

జరాసంధ సుతుడగు సహదేవునకు మార్జాలి యాతనికి శ్రుతశ్రవుడు వానికి నయుతాయు నతనికి నిరమిత్రు డాతనికి సునక్షత్రు డాతనికి బృహత్సేనుడు, వానికి కర్మజిత్తు, వానికి ఋతంజయు, వానికి విప్రుడు, అతనికి శుచి, శుచికి క్షేముడు, క్షేమునకు సువ్రతుడు జనించిరి. తరువాత వారు వరుసగ ధర్మనేత్రుడు, శ్రుతుడు, దృఢసేనుడు, సుమతి, సుబలుడు, సునీతుడు సత్యజిత్తు, విశ్వజిత్తు, పురంజయుడు జన్మించెదరు. ఈ జరాసంధాది మగధేశ్వరులెల్లరు కలియుగమున వేయేండ్ల లోపలపుట్టి చావగలరు.

యయాతి కొడుకు అనువునకు సభానరుడు, చక్షువు, పరోక్షుడు అను ముగ్వురు పుత్రులు గల్గి అందు సభానరునకు కాలనాధుడు, వాని తరువాత సృంజయుడు, పురంజయుడు జనమేజయుడు, మహాశాలుడు, మహామనసుడు, ఉశీనరుడు, తితిక్షు, శిబి, వన, క్రిమి, దర్పుడు, వృషదర్భ, సువీర మద్రి, కేకయులు, రుశద్రిథ, హేమ, సుతప బలి యను వారును, బలి వలన అంగ, వంగ, కళింగ, సింహ, పుండ్రి ఆంధ్రులను ఆర్గురు కుమారులు పుట్టిరి. వారు తూర్పుదేశమునకు రాజులై, వారివారి పేర్లతో రాజ్యములు స్థాపించి యేలిరి. సువీరునకు సత్యరథుడు తరువాత దివిరథుడు ధర్మరథుడు, చిత్రరథుడు అనువారు కల్గిరి. ఆ చిత్రరథుడే రోమపాదు డయ్యెను.

రోమపాదునకు సంతతిలేని కతమున దశరథుడు తన పుత్రిక శాంతను అతని కిచ్చెను. రోమపాదుని రాజ్యమున కొంతకాలము వర్షము కురువనందున, విభాండక మహాముని పుత్రుడు ఋష్యశృంగుని తోడ్తెచ్చిన వర్షములు కలుగునని పెద్దలవలన తెలిసికొని, తన యాస్థానమునందు అతిసుందరులు, నేర్పరులు నగు వారకాంతలను బంపెను.

ఋ ష్య శృం గు డు.

విభాండ పుత్రుడు ఋష్యశృంగుడు. అతడు తండ్రితో యరణ్యముననే పెరిగి పెద్దవాడయ్యెను. కాని ఆ మహాత్ముడు అరణ్యము నందలి జంతుజాలము, ముని పుత్రులుతప్ప స్త్రీలను చూచియెరుగడు. ఆ నిష్కల్మష బ్రహ్మచారిని వలలో వైచుకొనుటకు రోమపాదు డంపిన వేశ్యలు ఆడుచు, ఇంపుగ పాడుచు,

క్రీగంటిచూపు లను బాణములను వదలుచు, విభాండక మహాముని ఆశ్రమమున లేని కాలమున ఋష్యశృంగ మహాముని దరికి చేరిరి.

ఋష్యశృంగుడు వారినిజూచి వారి తలపైనున్న నీలకుంతల ధమ్మిల్లములను జూచి మునికుమారులకుండు జటా విశేషములుగ దలచెను. వారు ధరించిన శ్వేత చీనాంబర విశేషములను జూచి, జింకచర్మమునందలి విశేషములుగా దలచెను. వారు ధరించిన రత్నాభరణంబులజూచి రుద్రాక్ష మాలికలని భావించెను. వారు ధరించిన కస్తూరి, మృగనాభి శ్రీగంధాది లేపనంబులను, మునిపుత్రులు ధరించు విభూతి విశేషములుగ దలచెను. వారు పాడుచున్న మధురగానము శ్రుతియుక్తమైన మంత్ర విశేషములుగను, వారి చేతులందుండు వీణాది వాద్యంబులు మునిపుత్రులు ధరించు దండముగా దలచి, వారు మునిపుత్రులని భావించి, అతడు వారికి సాష్టాంగ దండప్రణామ మొనరించెను.

అట్లు ప్రణామ మొనరించిన ఋష్యశృంగుని జూచి ధూర్తలగు నా వారకాంతలు, చిరునవ్వు మోమునదోప అతనిని లేవనెత్తి, క్షేమ సమాచారము లడుగుచు, అతని కౌగలించుకొని, చాలకాలము తపమొనర్చి మిక్కిలి అలసి పోతివయ్యా యని ముఖము, కంఠము, నాభి మొదలగు ప్రదేశముల మృదువుగా పుణికి, క్రొత్త దీవెనలని అతని కపోలముల చుంబించి చెవుల చెంత నాలుకలతో చప్పట్లు చేసి, మా తపోవనమునందలి మంచిఫలము లారగించు మనుచు నానావిధ భక్ష్యములనిచ్చి, అతని కౌపీనము అజినము, తీసి మృదువైన పట్టుబట్టల కట్టబెట్టి, మా పర్ణశాలకు పోదమురమ్మని అనుచు అతనిని తమవెంట గొనిపోయిరి.

ఋష్యశృంగు డట్లు కాంతాకటాక్ష పాశములచే బంధింపబడి వారివెంట రోమపాదుని యాస్థానమునకు రాగా రోమపాదుడు అతనిని ఆదరించి, తన పెంపుడు కూతురగు శాంత నతనికిచ్చి వివాహ మొనర్చి తన పట్టణమునందుంచు కొనెను. ఋష్యశృంగుని పాదస్పర్శచే ఆ దేశమునకు పట్టిన దోషముతొలగి వర్షములు కురిసెను. దేశము సుభిక్ష మయ్యెను.

రోమపాదుడు సంతాన హీనుడని యెరిగి ఋష్యశృంగుడు అతనిచే ఇంద్రుని గూర్చి యజ్ఞము చేయించెను. దానివలన అతనికి సంతతి గలిగెను. తర్వాత కాలమున ఋష్యశృంగుడే దశరథునిచే పుత్రకామేష్టి చేయించి అతనికి సంతానము గలిగించెను.

రోమపాదునకు చతురంగుడను పుత్రుడు కలిగెను. అతని తరువాత అతని వంశమువారు, పృథులాక్షుడు, బృహద్రథుడు, బృహన్మనసుడు, జయద్రథుడు, విజయుడు, ధృతి, ధృతవ్రతుడు, సత్యకర్ముడు, అతిరథుడు, అనువారు ఉదయించిరి. అతిరథునకు కుంతీదేవికి వివాహమునకు ముందు సూర్యునివలన కలిగిన సంతానము గంగానదియందు లభింప ఆ శిశువునకు కర్ణుడని నామకరణ మొనర్చి, తన పుత్రునిగా స్వీకరించెను. ఆ కర్ణునకు వృషసేనుడు పుట్టెను.

యయాతి కుమారుడు ద్రుహ్యునకు బభ్రుసేతువు తరువాత అతని వంశమున ఆరబ్ధుడు, గాంధారుడు, ధర్ముడు, ధృతుడు, దుర్మదుడు, ప్రచేతసుడు గల్గిరి. ఆ ప్రచేతసునకు నూర్గురు పుత్రులు జనించి, మ్లేచ్ఛరాజులై ఉత్తరదిశ నాశ్రయించిరి. తుర్వసునకు వహ్ని, అతనికి భర్గుడు, వానికి భానుమంతుడు, అతనికి త్రిసానువు అతనికి కరంధముడు వానికి మరుత్తుడు కల్గిరి. అంతతో యయాతి శాపమున ఆ వంశమున సంతతి లేదయ్యెను.

య దు వ ం శ ము.

యయాతి పెద్ద కొడుకు యదు. అతని వంశముననే శ్రీహరి నరరూపమున కృష్ణుడుగా జనించెను. అందువలన ఆ వంశ చరిత్రమును చదివినను విన్నను పాతకహారము ఆ యదువంశ మిట్లుండెను.

యదువునకు సహస్రజిత్తు, క్రోష్టువు, నలుడు, రిపుడు, అను నల్గురు పుత్రులు జనించిరి. అందు సహస్రజిత్తునకు శతజిత్తు అను పుత్రుడు కలిగెను. తరువాత ఆ తెగకు మహాహయ, వేణుహయ, హైహయుడు అను ముగ్గురు జన్మించిరి హైహయునకు ధర్ముడు అతనికి నేత్రుడు అతనికి కుంతి కుంతికి మాహిష్మంతుడు, అతనికి భద్రసేనుడు, వానికి దుర్మదుడు, వానికి ధనకుడు, తరువాతవారు కృతవీర్యుడు, కృతాగ్ని, కృతకర్ముడు, కృతౌజుడు అను ముగ్గురు జనించిరి. అందు కృతవీర్యునకు అర్జునుడు జనించెను. ఇతడే కార్తవీర్యార్జును డని ప్రసిద్ధి గాంచి, దత్తాత్రేయుని వలన అష్టసిద్ధులు వడసి, ఎనుబదియైదువేల సంవత్సరములు భూమినేలి తుదకు పరశురామునిచేత జంపబడియెను. అతనికిగల వేయిమంది పుత్రులలో పరశురాముని చేత పడకుండ తప్పించుకున్న వారు జయధ్వజుడు, శూరసేనుడు, వృషభుడు, మధువు ఊర్జితుడు, అని యైదుగురు.

అందు జయధ్వజుని తెగయందు తాళజంఘుడు. అతనికి ఔర్వముని తేజమున నూర్గురు పుత్రులుకల్గిరి. అందు ప్రథముడు వీతిహోత్రుడు.

మధువు తెగకు వృష్ణుడు అతనికి నూర్గురుపుత్రులు కల్గిరి. ప్రథముడు వృష్ణి. మధు వంశమువారు మాధవులని పిలువబడిరి. యదుపుత్రుడగు క్రోష్టువు తెగయందు, వృజినవంతుడు శ్వాహితుడు, రుశేకుడు, చిత్రరథుడు, శశిబిందుడు అనువారు కల్గిరి ఆ శశిబిందుడు అనేక మంది భార్యల వలన పదివేలలక్షలమంది పుత్రులబడిసి సప్తద్వీపములకు రాజై ప్రసిద్ధి నొందెను. అతని పుత్రులలో పృథుశ్రవు సంతతివారు ధర్ముడు, ఉశనుడు, రచకుడు, పురజిత్తు, రుక్ముడు, రుక్మేషువు, పృథువు, జ్యామఘుడు, విదర్భుడు, కుశుడు, క్రథుడు, రోమపాదుడు, బభ్రువు, విభువు, కృతి, ఉశికి, చేది, చేదికి చైద్యాలు పుట్టిరి క్రథుని తరువాతవారు కుంతి. ధృష్టి, నిర్వృతి, దశార్హుడు, వ్యోముడు, జీమూతుడు, వికృతి, భీమరథుడు, నవరథుడు, దశరథుడు, శకుని, కుంతి, దేవరాతుడు, దేవక్షత్రుడు, మధువు, కురువశుడు, అను, పురుహోత్రుడు అంశు, సాత్వతుడు, భజమానుడు, భజి, దివ్యుడు, వృష్ణి. దేవావృధుడు నందకుడు, మహాభోజుడు నిమ్రోచికంకణవృష్ణులు, శతజిత్తు, సహస్రజిత్తు నయుతజిత్తులు గల్గిరి.

మహాభోజుడు ధర్మాత్ముడు. అతని వంశమువారు భోజులని పిలువబడిరి. వృష్ణికి తరువాతవారు సుమిత్రుడు, యుధాజిత్తు, శినియు, అనమిత్రుడు, నిమ్నుడు, సత్రాజిత్తు. ప్రసేనుడు, సత్యకుడు, యుయుధానుడు, సాత్యకి, జయుడు, గుణి. యుగంధరుడు గల్గిరి. పృశ్నియనువాని తరువాతవారు శ్వఫల్క చిత్రకులు, అక్రూరుడు, అసంగుడు, సారమేయుడు, మృదుకుడు, మృదువిద్విదుడు, వర్మదృక్కు, దృష్టవర్ముడు, క్షత్రోపేతుడు, అరిమర్దనుడు, శత్రుఘ్నుడు, గంధమాదనుడు, ప్రతిబాహువు, దేవలుడు, అనుపదేవుడు, పృథుడు, విదూరథుడు మొదలగు పెక్కుమంది వృష్ణివంశజులైరి అంధకుని తరువాత భజమానుడు, కుకురుడు, శుచి, కంబళబర్హిషుడు, వృష్ణివిలోమతనయుడు, కపోతరోముడు, అనువు, దుందుభి, దవిద్యోతి. పునర్వసువు, ఆహుకుడు, దేవకుడు, ఉగ్రసేనుడు, దేవలుడు, అనుపదేవుడు, సుదేవుడు, దేవవర్ధనుడు, అను పురుషులు, ధృతదేవి, శాంతిదేవి. ఉపదేవి, శ్రీదేవి, దేవరక్షిత, సహదేవ, దేవకి అను స్త్రీలు కల్గిరి. అందు దేవకుని కూతురు దేవకిని వసుదేవుడు వివాహమాడెను. (వీరి చరిత్ర దశమ స్కంధమునచూడ నగును).

ఉగ్రసేనునకు, కంసుడు మొదలగువారు తొమ్మండుగురు పుత్రులు, నలుగురు పుత్రికలు కల్గ పుత్రికలను వసుదేవుని తమ్ములు వివాహమాడిరి. భజమానునకు విదూరథుడు వానికి శిని యతనికి భోజుడు వానికి హృదికుడు కల్గిరి. అందు హృదికునికి దేవమూఢుడు, శతధనువు, కృతవర్మ ననువారు కలుగ, శూరునికి మారిషయను భార్యయందు వసుదేవుడు మొదలగు పదిమంది కుమారులు ఐదుగురు కుమార్తెలు కలిగిరి. వారందరు తగువారిని వివాహమాడి యదు వంశమును వృద్ధి పరచిరి.

ఇది నవమ స్కంధము.

శ్రీమద్భాగవతము

దశమ స్కంధము

శ్రీకంఠ చాపఖండన
పాకారి ప్రముఖవినుత భండన విలస
త్కాకుత్స్థవంశమండన
రాకేందు యశోవిశాల రామనృపాలా.

మహనీయ గుణగరిష్ఠులగు శౌనకాది మునిశ్రేష్ఠులకు నిఖిల పురాణవ్యాఖ్యాన వైఖరీ సమేతుడైన సూతుడిట్లు చెప్పెను. పరీక్షిన్నరేంద్రుడు శుకయోగీంద్రుని జూచి యిట్లనియె.

శ్రీకృష్ణ కథా ప్రారంభము.

"యోగీంద్రా! నీవలన నేను సూర్య, చంద్రవంశరాజుల చరిత్రను వింటిని వారి చరిత్రము నాకాశ్చర్యము కలిగించినది. మహాత్ముడు జగత్ప్రియుడగు విష్ణువు విశుద్ధమగు యదువంశమున నెందుకవతరించెను? ఆ విష్ణు వేవిధముగ మెలగెను? ఏ సమయముల ఏయే కార్యములను గావించెను నాకు వివరముగ తెలుపుడు.

> "విష్ణు కీర్తనము జన్మవ్యాధులకు దివ్యౌషధము. హృదయమునకును, వీనులకును ఆనందము. మోక్షము కోరువారికి ముఖ్యముగ కావలసినది. గొడ్డు మాంసము తినువాడు తప్ప మరెవ్వరును విష్ణుకీర్తనమింక చాలును అనరు."

మా పెద్దలు, దేవతలకుకూడ గెలుచుటకు సాధ్యముకాని భీష్మాది కురుసైన్యమనెడి మహాసముద్రమును ఏ ఆధారముతో దాటగలిగిరి? తల్లి కడుపులో అశ్వత్థామ ప్రయోగించిన బాణముతో పీడింపబడిన నన్ను, కురుకులము నుద్ధరించుటకై ఆ చక్రియే సంరక్షించెను. లోకములను సృష్టించుచు, పాలించుచు నశింపజేయుచు యించువాడు సర్వాంతర్యామియు, మోక్షము నిచ్చువాడగు ఆ చక్రి చరిత్రము సంపూర్ణముగ తెలియజేయుడు. బలరాముడు రోహిణి కుమారుడని మీరు చెప్పితిరి. శ్రీకృష్ణుడు దేవకి గర్భమున నెట్లుండెను. పుట్టిన వెంటనే తల్లిదండ్రులను విడిచి వ్రేపల్లె కెట్లు చేరెను. ఆ వ్రేపల్లెలో నెవరియింట నుండెను. ఏమేమి

చేయుచుండెను. తన మేనమామయగు కంసుని వధించుటకు కారణమేమి? ఆ మూర్తి యెన్ని సంవత్సరములు భూమిపై జీవించెను. ఆయనకు భార్య లెందరు. ఆయన వారితో నెట్లు మెలగుచుండెను. ఈ విషయములన్నియు దయచేసి చెప్పుడు. స్వామీ! మీ ముఖ పద్మమునుండి జాలువారు హరికథామృతమును త్రావగా త్రావగా నాకు చీకుచింతలన్నియు తొలగినవి. ఆకలిదప్పులు మాయమైనవి. నా మనస్సు విష్ణు కథపైనే మళ్ళుచున్నది." అని పలుకగా ఆ రాజు మాటలు విని శుకయోగీంద్రు డిట్లనెను.

> "విష్ణుకథాసక్తి గలవానిని, విష్ణుకథ చెప్పువానిని, విష్ణుకథ వినువానిని విష్ణు కథ పవిత్ర గంగానదీ జలమువలె మిక్కిలి పవిత్రుల నొనరించును."

"ఓ రాజేంద్రా! వినుము. పూర్వము రాక్షసులు వేలసంఖ్యలో రాజులై పుట్టి భూమి నాక్రమించగా భూదేవి వారి భారమును మోయలేక గోరూపమును ధరించి, బ్రహ్మవద్దకేగి కన్నీరు మున్నీరుగా నేడ్చి తన గోడు విన్పించెను. అంత బ్రహ్మ గోరూపమునందున్న భూమి నోదార్చి, ఆ భూమితోడను దేవతల తోడను కలిసి విష్ణువును దర్శించుటకు వెళ్ళి పురుషసూక్తములతో విష్ణువును సంస్తుతించి, సమాధినిష్ఠుడై యుండి, యొక మాట విని, భూదేవికి, దేవతలకు కూడ నిట్లు చెప్పెను. 'ఓ దేవతలారా! మీరు మీమీ యంశములతో భూలోకమున యదువంశమునందు పుట్టుడు. శ్రీనాథుడు వసుదేవునకు పుత్రుడై జన్మించి ఓ భూదేవీ! నీ భారమంతయు తొలగించును. దేవకన్యలు హరిప్రియలై సుందరాంగులై భూమిపై జన్మింతురు. శేషుడు హరికళతో హరికన్నయై పుట్టి హరికి ప్రీతిని కలిగించును.

ఈ ప్రపంచమంతయు ఏ మాయచే మోహితమైయుండునో ఆ మాయ విష్ణుని యాజ్ఞచే తన యంశచే కార్యార్థమై భూమియందు పుట్టును' అని చెప్పి బ్రహ్మ దేవతల నంగీకరింప చేసి భూదేవిని శాంతింపచేసి తనస్థానమున కేగెను. అంత యదురాజైన శూరసేను డనెడివాడు మధురాపురము రాజధానిగా మాథుర, శూరసేన దేశంబుల పాలించెను. పూర్వకాలమున ఏ మధురయందు శ్రీమన్నారాయణుడు ప్రియముతో నొప్పుచుండెనో ఆ మధురయే యాదవ రాజులకు మూలస్థానమై యొప్పెను. శూరసేనుని పుత్రుడగు వసుదేవుడు మధురాపురమున నొకనాడు దేవకిని పెండ్లాడి దేవకితోపాటు తాను రథమెక్కి కదలిపోవునపుడు ఉగ్రసేనుని కుమారుడగు కంసు డుల్లాసముతో రథము నడుపుచుండెను. రథము

నకు ముందు భేరీమృదంగనాదములు, శంఖపటహములు మ్రోగుచుండెను. ఉగ్రసేనుడు తన కూతురైన దేవకీదేవికి వెయ్యి యెనిమిదివందల రథములను, స్వర్ణహారములతో నొప్పుచు మిక్కిలి యెత్తైన నాలుగువందల యేనుగులను, పదివేల గుఱ్ఱములను విలాసవతులైన రెండువందలమంది దాసీజనంబులను అరణముగా నిచ్చెను. దేవకీ వసుదేవులు మార్గమున రథారూఢులై పోవుచుండగా, కంసుడు పగ్గముల సడలించి మిక్కిలి వేగముగ రథము నడపుచుండగా అశరీరవాణి యిట్లు పలికెను. "నీ చెల్లెలు సంతసించి నిన్ను మెచ్చుకొనవలెనని రథము నడపుచున్నావు. నీ చెల్లెలి యష్టమగర్భము నిన్ను హరించునని నీకు తెలియదు సుమా!" అని యిట్లాకాశవాణి వినిపింపగా భోజకులపాంసనుడైన కంసుడు భుజము అదరగా భయంకరమైన ఖడ్గము వొఱనుండి వెలికి తన చెల్లెలి కొప్పుబట్టి వంచి బిగబట్టి తోబుట్టువనియైన తలంపక తెంపుతో నామె తలను తెగవ్రేయుట కుద్యమించు సమయమున వసుదేవు డాతని సమీపించి— పాపచిత్తుడు, మత్తుడు కోపాగ్ని సంతప్తుడగు కంసుని తన సల్లాపమనె డమృతధారచే కొంత శాంతింప చేయదలచి కంసునితో నిట్లనెను. "ఓ భోజాధీశ్వరా! అన్నవైన నీవు నీచెల్లెలికి మాడలుచీర లిచ్చుటయో, మన్నించుటయో, తియ్యని పల్కులతో ఆదరించుటయో చేయవలెను కాని ఆకాశవాణిని నిజమని భావించి చెల్లెలిని చంపుట తగునా? ఆ ప్రయత్నములు మానుము. కోపమును మానుము. ఆమెను వధింపకుము నిన్ను నేను వేడుకొందును. ఈమె నీకు చెల్లెలు, కన్య, ముద్దరాలు సతతము నీ క్షేమమునే కోరు నిర్మల హృదయ. బయటి మాటలు (ఆకాశపు మాటలు) నమ్మి, మర్యాద నతిక్రమించి, పాపహేతువైన కోపముతో అందునను చెల్లెలిని చంపుట న్యాయమా? నీవు సత్కులమున బుట్టినవాడవు, పుణ్యమూర్తివి నీ కిట్టి పని తగునా! నీవే ఆలోచింపుము.

"ప్రాణులను పుట్టుకతోనే మృత్యువు వెన్నంటుచుండును. నేడో మాపో లేక నూరేండ్లకైన మృత్యువు తప్పదు. దేహము క్షీణింపగా కర్మబద్ధుడైన శరీరి మఱియొక దేహమును పొందును. దేహము మారినను అతని పూర్వకర్మ లాతనిని దేహాంతరమునకూడ విడువవు. ప్రాణిగావించిన పూర్వజన్మ కర్మల ననుసరించియే మరుజన్మ లభించును. బహువికారమైన మనస్సు ఇంద్రియ మార్గములలో వడిగా పరుగిడుచుండును. శరీరము ఎన్ని యెత్తినను కర్మము చెడదు. జలకుంభములందు కనబడు చంద్ర సూర్యాదులు గాలికి కదలునట్లు ప్రాణి తన తొంటికర్మలచే కల్పింపబడిన అంగములతో రాగకలితుడై

> కలుగుచుండును. తన పూర్వకర్మచే తన కీడునకైనను, మేలునకైనను కారణము అగుచుండగా పరులు కారణులని తలంచుట నీతికాదు. కావున పరులను హింసింపరాదు. తన మేలునకై పరుల హింసించినచో ఆ కర్మఫలము ననుభవింపక తప్పునా ?''

ఓ కరుణామయా ! మనుజవల్లభా కంసా ! ఈమె నీకు చెల్లెలైనను బిడ్డవంటిది. ఉత్తమురాలు, పతివ్రత, భీరువు, బాల, క్రొత్తగా పెండ్లియైనది. దీనురాలు కంపితచిత్త యీమెను కాపాడుము నీకు మ్రొక్కెదను" అని సామోక్తులు పలికినను కంసుడు కన్నులనుండి నిప్పులురాల, నిర్దయుడై, పెంపుతో తన చెల్లెలిని చంపుటకే తలంచుచున్నాడని దానిని మాన్పింపదలచి తనలో వసుదేవుడిట్లు తలంచెను.

కాలమే నిజమని, మృత్యువు తప్పదని భావించినను ఆత్మబలముచే బుద్ధిబలమున పీడక వానినుండి తప్పించుకొను నుపాయము నాలోచింపవలెను. ఆపన్నురాలైన దేవకిని రక్షించి, ఆమెకు పుట్టబోవు సుతులను నీకిచ్చెదనని కంసునితో చెప్పుట మంచిది. నేటి కీమెను రక్షించిన రేపటి సంగతి యెట్లుండునో ఎవనికి తెలియును. ఈమె రక్షింపబడినచో నీమెకు సుతులు కల్గినచో, వారికి మృత్యువు తప్పని సరియైనను, విధిచే వీనికి కీడు కలుగకుండునా ?—

> "అగ్ని ఒకచో చెంతనున్న చెట్లను కాల్చక యెగసి దూరమునున్న చెట్లను దహించునట్లు కర్మఫలమున మృత్యువు దగ్గరనున్న వానిని వదిలి దూరస్థుని పొందవచ్చును."

ఈమెకు పుట్టబోవు కొడుకులను నీకిచ్చెదనని ప్రకృతము దేవకిని రక్షించుట నీతి. కొడుకులు పుట్టిన పిమ్మట కార్యము ముందు వెనుకలు కావచ్చును. వారిని తప్పించుట కానాటికి దైవమొకటి యుండకపోవునా ? ఈమె ఎనిమిదవ చూలు వీనిని సంహరించునని కదా మిన్ను పలికెను అదెట్లు తప్పును. ఇప్పుడే యీమెను రక్షించుట నా కర్తవ్యము. అని తియ్యని పలుకులతో కంసుని పొగడి ప్రసన్నవదనుడై వానితో వసుదేవుడు ఈ అబలకు పుట్టిన కుమారునివలన నీకు కీడు కలుగునని కదా ఆకాశవాణి పల్కినది. అందుచేతనే కదా నీ కీమెపై కోపము. నాకొక్క విన్నపమాలింపుము. ఈమెకు కలిగిన కుమారుల నెల్ల పుట్టిన వానిని పుట్టినట్లు చంపుటకు నీ కిత్తును. వసుదేవుడు పలికిన పలుకులు విని కంసు డాలోచించి సంతసించి, యిదిమంచిదే కదా అని తలచి భయముచే వ్యాకులపడుచున్న

దేవకిని చంపక విడిచిపెట్టిపోయెను. వసుదేవుడు, బ్రతుకుమందు కనుగొంటిని కదాయని దేవకితోపాటు భవనము కేగి సంతోషముతో నుండెను.

ఇట్లు కొంతకాలము గడవగా కంసునివలన కష్టపడుచుండు దేవకి సమస్త దేవతాంశములు తన కేర్పడగా పదారు కొక్కనివంతున యెనిమిదిమంది పుత్రులను, ఒక పుత్రికను గనెను. దేవకికి మొదట పుట్టిన కీర్తిమంతుని వసుదేవుడు ధైర్యముతో, సత్యనిష్ఠతో, వ్యామోహరహితుడై కంసునకు తెచ్చియిచ్చెను. తానిచ్చిన మాట తప్పక, తప్పించుకొనక, మోసపుచ్చక, కలతజెందక పుత్రులను శత్రువగు కంసున కిచ్చిన వసుదేవునివంటి ధీరుడు మఱియొకడు కలడా ?

శుకయోగీంద్రుడు పరీక్షిత్తుతో నిట్లనుచున్నాడు.

> "రాజేంద్రా! సత్యమునందు నిష్ఠగలవానికి దుష్కరమేమియునులేదు. జ్ఞానవంతున కిష్టమైనది లేదు. పరమేశ్వర భక్తునకు ఇవ్వరాని దేదియు నుండదు. అజ్ఞానికి కీడుగా తోచునదేదియో అదియే జ్ఞానికి సత్యవ్రతునికి మేలుగనే తోచును."

ఇట్లు నిజమును తప్పక నిలుకడతో కొడుకు నిచ్చిన వసుదేవుని ధైర్యమునకు మెచ్చి కంసు డతనితో "వసుదేవా! ఈ నీకొడుకును నీవు తీసికొని పొమ్ము. నాకు వీనివలన భయములేదు వీనిపై నాకు కోపములేదు. నీ ఎనిమిదవ కుమారుడు నాకు మృత్యువట, వానినే వధింతును" అని చెప్పగా కుమారుని తీసికొని పోయెను. కాని దుష్టస్వభావుండైన వానిబుద్ధి యెప్పుడెట్లు మారునో యని లోన భయపడుచునే యుండెను.

ఒకనాడు నారదుడు కంసునింటికి వచ్చి సత్కృతుడై ఏకాంతమున వానితో "వ్రేపల్లెలోని నందాదులు వారి భార్యలు, పుత్రులు, బంధువులును, దేవకి మున్నగు స్త్రీలు, వసుదేవుడు మొదలగు సర్వయాదవులును దేవతలేకాని నిజమైన నరులు గారని, నీవు రాక్షసుడవనియు, దేవమయుడగు చక్రపాణి దేవకీదేవి పుత్రుడై భువిని పుట్టి, భూలోకమును బాధించుటకై పుట్టిన దుష్టరాక్షసుల నెల్ల వధించు"నని చెప్పి, స్వర్గమున కేగెను. నారదుని మాటలు విని కంసుడు యాదవులందఱు దేవతలని, తాను నారాయణుని ఖడ్గముతో చీల్చబడిన కాలనేమినని కలతజెంది, మిక్కిలి కోపోద్రేకముతో దేవకీ వసుదేవులను వెంటనే బంధించి కారాగృహముననుంచి, హరిని తలంచి దేవకీ వసుదేవుల కుమారుల నెల్ల చంపి యదుభోజాంధక రాజైన నుగ్రసేనుని బంధించి తానే రాజై శూరసేనదేశముల పాలించుచుండెను.

రాజులు రాజ్యకాంక్షచే ప్రియులగు తల్లిదండ్రులనైనను, అన్నదమ్ములనైనను, స్నేహితులనైనను, బంధువులనైనను చంపుదురు.

కంసుడంతట బాణభౌమ, మాగధ మహాశన, కేశి, ధేనుక, బక, ప్రలంబ, తృణావర్త, చాణూర ముష్టిక, అరిష్ట, ద్వివిద, పూతనాది సహాయసమేతుడై యాదవులతో యుద్ధము చేయగా కొందరు తమ పదవులను, గృహములను వదలి నిషధ, కురు, కోసల, విదేహ, మత్స్య, కేకయ, పాంచాల, సాల్వదేశములకు పారిపోయిరి. మఱికొందరు కంసుని కొలుచుచుండిరి. కంసుడు దేవకి కొడుకుల నార్వురను చంపగా, శేషుడను పేర వెలయు దివ్యతేజము దేవకీగర్భమున నేడవదియై వెలసెను.

ఆ సమయమున హరి తన్ను నమ్ముకొనిన యాదవులకు కంసునివలన భయము కలుగునని తలంచి యోగమాయాదేవితో "నీవు గోపాలకులు గోపికాజనము నున్న వ్రేపల్లెకు పొమ్ము. వసుదేవుని భార్యలు కంసుని కోపమునకు గుఱియైరి. కాన నీవందు ప్రవేశింపక, దేవకీదేవి గర్భమందున్న నాయంశయగు శేషాఖ్యమైన తేజమును తొలగించి నందగోకులమందు గుణవంతురాలై యొప్పుచున్న రోహిణీదేవి గర్భమున ప్రవేశపెట్టుము. నేను దేవకికి పుత్రుడనై జన్మింతును. నీవు యశోదకు పుత్రికగా పుట్టెదవు. ఓ కల్యాణమయీ! నానావిధ సంపదలకు మూలమై, సర్వకామములను పూరించు నిన్ను మనుజులు, కానుకలు బలులను నీకొసంగి భక్తితో పూజింతురు. మఱియు మానవులు ఆయాస్థానములలో దుర్గ, భద్రకాళి, విజయ, వైష్ణవి, కుముద, చండిక, కృష్ణమాధవి, కన్యక, మాయ, నారాయణి, ఈశాన, శారద, అంబిక అను పదునాల్గు నామంబులతో నిన్ను సంస్తుతింతురు. హరిచెప్పిన చొప్పున యోగమాయ భూమికేతెంచి దేవకీదేవిగర్భమున వెలుగు తేజమును మెల్లగ తప్పించి రోహిణి కడుపున ప్రవేశపెట్టెను. దేవకికి కడుపుపోయినదని పౌరులు తలంచిరి. అంత రోహిణికి పుత్రుడుదయించెను. మిక్కిలి బలశాలియగుటచే బలభద్రుడనియును, లోకములను రమింప చేయుటచే రాముడనియును, గర్భసంకర్షణము పొందినవాడగుటచే సంకర్షణుడని రోహిణీ పుత్రుడు వ్యవహరింపబడుచుండెను. పిమ్మట హరి తన యంశచే వసుదేవుని మనస్సున ప్రవేశింపగా వసుదేవుడు సూర్యునివలె కాంతిచే శోభిల్లుచు ప్రజలచూపుల కెంతయో దర్శనీయుడయ్యెను.

దేవకీదేవి, వసుదేవుడు తనయందుంచిన అఖిలాత్మకము, ఆత్మభూతము, పవిత్ర తేజము, లోకశుభంకరమునై వెలుగొందు విష్ణుతేజమును దాల్చి చెందిన

గర్భమున దాల్చిన పూర్వదిశాసతివలె శోభిల్లెను. తనగర్భమున బ్రహ్మాండ భాండములు నిల్పుకొను హరి దేవకీగర్భమునందు ధారణమునై బాలసూర్యునివలె వృద్ధి పొందెను. దేవకీగర్భమున హరి వృద్ధినొందునప్పుడు దేవకి సుఖములు శత్రువుల దుఃఖములతో వెలవెలబోయెను. వైరుల కీర్తి మాసి నల్లబడినట్లు దేవకి చనుమొనలు నల్లబడెను. దుష్టుల గృహములందు ధూమరేఖలు పుట్టగా దేవకి యూరువున రోమరేఖ పుట్టెను. శత్రువుల మనస్సులలో ఆహారవాంఛ మానుటతోపాటు దేవకికాహారముపై వాంఛమానెను. శత్రువులు శ్రమను చెందిరి. జడత్వమును పూనిరి. దేవకికి శ్రమ కలిగెను. ఆమె జడత వహించెను.

ఆమె గర్భమునందున్న శిశువును చూచుటకై జలము ప్రవేశించినట్లామె మేనిపై చెమట పొడమెను. తేజము దేవకీ గర్భస్థుడైన వానిని సేవించుట కేగెనని నట్లు దేవకి ముఖము శోభిల్లెను. వాయువు ఆ గర్భస్థుని సేవించుటకు వెళ్ళినట్లు దేవకికి మూర్ఛలు కలిగెను. భూమి, దేవకీ గర్భస్థుడైన శిశువును సేవించుటకు వచ్చినట్లు దేవకికి మట్టిపై మనసుపుట్టెను ఆకసము ఆమె కుమారుని సేవించు సేవలకు రూపొందినట్లు దేవకి నడుము విశాలమయ్యెను. ఆమె మొలనూలు బిగువుకాగా శత్రుస్త్రీల మంగళసూత్రములు సడలినవి. ఆమె శరీరకాంతి హెచ్చుకొలది దుష్టస్త్రీల మేనికాంతులు మాయమొచ్చినవి. ఆమెకు భూషణములు బిగువగుకొలది శత్రుస్త్రీల భూషణములు శిథిలములు కావొచ్చినవి. ఆమె గర్భము మెండగు కొలది శత్రుస్త్రీలగర్భములు పగులజొచ్చినవి. ఆమె గర్భమున దనుజారియుండుటచే ఆమెకు నీళ్ళాడు పొద్దులు హెచ్చుకొలది శత్రుస్త్రీల సౌభాగ్యదినములు తగ్గజొచ్చినవి. కంసుడు దేవకి ముఖకాంతిని, దేహకాంతిని ఆమె వర్తనను చూచి తనలో నిట్లు తలంచెను. ఈమె గర్భము కన్నులకు బరువుగా గన్పించుచున్నది. ఇంతకు ముందెన్నడును ఈమె యందింతటి కాంతిని గానము. ఈమె గర్భమున హరి ప్రవేశించియుండవచ్చును. నేనేమని తలంతును. ఏమని చేయుదును. ఈమె గర్భము నానాటికి వృద్ధిపొందుచున్నది. ఈమె గర్భవతి, చెల్లెలు, స్త్రీ. ఈమె నెట్లు చంపగలను. ఒకవేళ నేనీమెను చంపినను నాకు దక్కునది యేమి. సంపద, కీర్తి, ఆయువు, ధర్మము ఇవన్నియు చెడిపోవును. ఈ విషయ మెఱుగని క్రూరుడు జీవన్మృతుడై లోకనిందకు గురియగును. కడకు నరకమే వానికి గతి. దుర్భావముతో బ్రతుకొక బ్రతుకా? అని తలంచి క్రౌర్యమును మాని, ధైర్యము వహించి, గాంభీర్యమును పూని, శౌర్యమును పరివర్జించుచు, వెంటనే పుట్టినని చంపుదునని తలంచి, వెసవెంటనే ఈ యోగో

తన మాని మౌనముతోనుండి తొలగింప వీలుకాని వగపుచెందెను. ఈమెకు చక్రి యెప్పుడు పుట్టునో పుట్టిన వెంటనే పురిటింటనే వాని తెగవేయుదునని యెదురు చూచుచుండెను.

కంసుడిట్లు వైరభావమును పూని తక్కినదేదియు తలంపక, తిరుగునప్పుడు, భుజించునపుడు, త్రాగునపుడు, నడచునపుడు, లేచినపుడు, కూర్చుండినపుడు హరినే తలచుచుండెను. జగమును హరిమయముగా చూచుచుండెను. ఏ శబ్దము వినినను హరిశబ్దమేయని, ఏది కనబడినను హరిమూర్తియేయని, తననేది సోకినను అది హరికరమేయని, తానేది వాసన జూచినను అది హరితులసీమాల గంధమేయని ఎవరేది పలికినను హరినామమేయని భ్రమించును. తన ఆలోచన లన్నియు హరినిగూర్చిన తలంపులేయని భావించి కుపితుడగును.

ఆ సమయమున అనుచరసమేతులైన దేవతలు, నారదాది మునులు వెంటరాగా చతుర్ముఖుడును మహేశ్వరుడు నక్కడికివచ్చి దేవకీదేవి గర్భమున బాలుడై యుండిన పురుషోత్తము నిట్లు ప్రస్తుతించిరి:

బ్రహ్మాదిదేవతలు దేవకీ గర్భస్థుడైన శ్రీకృష్ణుని స్తుతించుట.

సత్యవ్రతుని నిత్యసత్యసాధనుని కాలత్రయమునందును కలుగువానిని, పంచభూతముల కుత్పత్తిస్థానమైనవానిని పంచభూతములయందు వసించువానిని, పంచభూతములు లయించిన తరువాతకూడ యుండువానిని సత్యభాషణము సమదర్శనము ప్రవర్తింపజేయువానిని నిన్నాశ్రయింతుము. నీస్వాధీనమైన మాయచే మోహితులైనవారు నిన్ను పెక్కురీతుల పేర్కొందురు. జ్ఞానులగువారు నిన్నేక చిత్తముతో సమస్తమూర్తులు నీవేయందురు.

> ''ప్రకృతియే పాదుగ సుఖదుఃఖములు ఫలములుగా పంచభూతములు కొమ్మలుగా నవరంధ్రములు కోటరములుగా ప్రాణములు పత్రములుగా జీవాత్మ పరమాత్మలు పక్షియుగముగా గలుగు సంసారవృక్షమును మొలపించుటకు, పెంచుటకు, కూల్చుటకు దేవా! నీవొకడవే అధికారివి.''

నీపైననే చిత్తముంచి నిన్నే ధ్యానించువారు నీపాదమే నావగా సంసారసాగరమును తరింతురు. మంచివారికెల్ల మంగళప్రదములై కపటులకు కీడు కలిగించు తనువుల దాల్చి, "దేవా! నీవెల్లప్పుడు లోకములకు శుభముల చేకూర్తువు కొందరు తాము జ్ఞానులమని భ్రమించి దంభజ్ఞానముచే నీపేరును తెలిసియు

తలంపరు. అట్టివా రథోగతి పాలగుదురు. దేవా! నిన్ను బ్రహ్మచర్యాది నాల్గాశ్రమములవారు సేవింపగా సత్త్వము శుద్ధము శ్రేయమనెడి శరీరమును నీవు తాల్తువు. నలినాక్ష నీ శరీరము సత్త్వగుణము సత్త్వరూపమును సేవింపగా నీవు సాక్షాత్కరింతువు. అవాఙ్మానసగోచరమగు మార్గము కలుగు గుణజన్మకర్మ రహితమగు నీ నామమును రూపమును విమలాంతఃకరణులైన వారెరుంగుదురు. దేవా! నిన్ను తలంచుచు, నిన్నుగూర్చి వినుచు, నిన్ను ప్రశంసించువాడు సంసారదూరుడై నీపాదభక్తుడగును. ఓ పురుషోత్తమా! నీపుట్టుకచే భూభారము తొలగినది. అథవా! పుట్టుకలేని నీకు పుట్టుట యనునది యొక క్రీడయేగాని నిజమునకది జన్మకాదు. అవిద్యయనునది జీవులయందు జన్మాద్యవస్థలను కల్గించుచుండును. నీవు మాయచే చుట్టబడిన వానివలె నుందువుకాని వాస్తవమునకు నీవు మాయాతీతుడవు.

మ. గురుపాఠీనమవై జలగ్రహమవై కోలంబవై శ్రీనృకే
సరివై, భిక్షుడవై, హయాననుడవై, క్ష్మాదేవతాభర్తవై,
ధరణీనాథుడవై, దయాగుణగణోదారుండవై, లోకముల్
పరిరక్షించిన నీకు మ్రొక్కెద మిలాభారంబు వారింపవే.

స్వామీ! నీవు మత్స్యాద్యవతారముల నెత్తి లోకముల రక్షించితివి. దేవా! నీకు నమస్కారము. భూభారమును తొలగింపుము. కంసాది దుర్జనులు విజృంభించగా లోకమంతయు భయకంపితమైయున్నది. ఈ లోకమును రక్షించుటకై ముకుందా! తల్లిగర్భమునుండి త్వరగా వెలువడుము." అని దేవకింగాంచి, "తల్లీ! నీ గర్భమున పురుషోత్తముడు కలడు. అతడు రేపే జన్మించును. కంసాదులవలన యావంతయైన భయములేదు. సర్వులకు శ్రేయము కలుగును. యాదవులెల్లరు సంతోషపడునట్లు నీకడుపు చల్లగా నుండుము.

శ్రీకృష్ణావతారము.

ఖలులమానసములెల్ల సంకటపడగా దుష్టులకు సంకటములు దాపురించగా, సత్పురుషులకు సంకటములు తొలగగా దేవకీదేవి శ్రీకృష్ణుని ప్రసవించెను. ఆ దేవదేవుడు దేవకీదేవి గర్భమునుండి యుదయించినంతనే సప్తసముద్రములు స్వచ్ఛములై పొంగినవి. మేఘములు కలధ్వనులతో నుఱిమినవి. ఆకాశము గ్రహములతో నక్షత్రములతో రాణిల్లెను. దిక్కులు ప్రసన్నములయ్యెను.

శమ్మని చల్లని గాలి వీచెను. హోమాగ్నులు ప్రదక్షిణముగ జ్వాలలతో వెలిగెను. సరోవరములు కమలములతో, తుమ్మెదలతో శోభిల్లెను. నదులు ప్రసన్నతోయములై ప్రవహించెను. భూమియందలి గ్రామములు పురములు శుభవినదములతో నొప్పెను. వనము పక్షుల కలకలధ్వనులతోడను పుష్పముల తోడను విరాజిల్లెను. దేవతలు పుష్పవృష్టి గురిపించిరి. (దేవతలు) సంతోషముతో గంధర్వులు పాడిరి. రంభాదికాంతలు నృత్యము గావించిరి. సిద్ధులానందముతో కూడిరి. చారణులు జయమును వీడిరి. దేవదుందుభులు మ్రోగినవి. ఆ సమయమున గ్రహనక్షత్రములు శుభస్థానములనుండగా అర్ధరాత్రియందు దేవకీ దేవి, దితిసుతనిరాకరిష్ణుని శ్రీ వదనాలంకరిష్ణుని, జిష్ణుడగు కృష్ణుని గనెను.

ఓపరీక్షిన్నరేంద్రా! అతిప్రసన్నుడగు కృష్ణునిగని విద్యుల్లతాంగియగు దేవకీదేవి చంద్రునిగన్న తూర్పుదెసవలె మిక్కిలి ప్రకాశించెను. అంతవసుదేవుడు నీలమేఘ శ్యాముని, ఆజాను బాహుని, చతుర్భుజుని కమలాక్షుని, విశాలవక్షుని చారు గదా, శంఖ, చక్రపద్మవిలాసుని కౌస్తుభమణిచే శోభిల్లువానిని మనోహరములగు మొలత్రాడు, కంకణ కేయూరములు గలుగువానిని, శ్రీవత్సలాంఛనుని, కుండలాలంకృత కర్ణయుగళుని, వైడూర్యమణి ఖచితకిరీటముగల వానిని, పూర్ణచంద్రునివంటి కాంతిగలవానిని, భక్తలోకమును పాలించువానిని, సుగుణాలవాలుని, కృపావిశాలుని, బాలునిజూచి, కన్నారగాంచి, పులకించి ఆశ్చర్యమంది, ఉపాంగిస్నానముచేయుటకు వీలుకాకుండుటచే ఆనందరససాగరమున మునింగి మనస్సున విప్రులకు పదివేల ధేనువులను దానముచేయుటకు నిశ్చయించుకొనెను. ఈ పురిటింటికి ప్రకాశవంతమగు దీపమువలె యీపాపడు ప్రకాశించుచున్నాడు. ఆ నాలుగు మోములుగల పాపనిగనిన మేటిపాపయితడు గావచ్చునని భక్తితో సాష్టాంగ ప్రణామము గావించి నొసటిపై కేలుదమ్ముగీలించి పాపడని తలంపక అతని పూర్వవర్తనను పొగడదొడగెను. స్వామీ! అఖిలదర్శనుడు, జ్ఞానానంద స్వరూపుడు, నిత్యుడు అపరాధీనుడు మాయాదూరుడగు నిన్ను పుత్రునిగా బడసితిని ఇంతకంటె ఆశ్చర్యమేమియుండును. నీమాయచే జగమును త్రిగుణాత్మకముగ జేసి, ఆ జగములో ప్రవేశించునట్లుందువు కాని ప్రవేశింపవు. అదిజగమున ప్రవేశించుటయు కాదు ప్రవేశింపకుండుటయును కాదు. పరమాత్ముడవైన నీవు మహదాదులవంటివై వేఱువేఱుగానున్నవై అన్నివిధములగు సూక్ష్మభూతములొప్పగా షోడశవికారములతో కూడిన విరాట్టనెడి విశాలదేహమును సంపాదించి యందులోబడియు లోబడకయుందువు. నీవు

సృష్టికిముందేయున్నవాడవగుటచే ఆ జగములోనివాడవెట్లగుదువు. నీవింద్రియ దూరుడవై ఇంద్రియములకవశుడవై జగములలో కలిసియుండియును కలయవు. సర్వము నీయధీనము. నీవు సర్వాత్ముడవు సర్వమయుడవు. ఆత్మవలన కలిగి యొప్పు దేహాదులను ఆత్మకంటె భిన్నములని తలచువాడు పరమమూర్ఖుడు. నీవలనకలుగు లోకములు నీకంటె భిన్నములని తలచుట మూర్ఖత్వము కావున ఓదేవా ! ఈ విశ్వమంతయు నీవే. నీవు నిర్గుణుడవు నిర్వికారుడవు. నిష్కాముడవు. నీవలననే యీ జగత్సృష్టి స్థితిలయములు జరుగుచున్నవి. నీవు ఈశుడవు. బ్రహ్మవు గుణములు నిన్ను సేవించును. సేవకుల కార్యాదులు సేవ్యునివిగా భావింపబడునట్టుల నీగుణముల యుత్కృష్టత నీదిగనే భావింపబడుచున్నది. నీమాయతోగూడి నీవు రక్తవర్ణుడవై జగమును సృష్టింతువు. ధవళవర్ణుడవై లోకముల పాలింతువు. నీలవర్ణుడవై లోకముల లయింపజేసెదవు. నేడు దైత్యుల ఖండించుటకు భూమిని పాలించుట కవతరించితివి. నీవు నాయింట పుట్టుదువని ఆకాశవాణి పల్కినప్పటినుంచి లోలోనమండుచు కంసుడు నీయన్నల నందరిని హింసించెను. కంటికి కూర్కు లేకయున్నాడు. నీవు పుట్టినట్లు కారాజనులు చెప్పి నంతనే నీపైకి సన్నద్ధుడై వచ్చును. అనుచుండ

దేవకీదేవి శ్రీకృష్ణుని స్తుతించుట.

దేవకీదేవి మహాపురుష లక్షణములు కలవాడును విచక్షణుడును సుకుమారుడైన కుమారుని గాంచి వెఱపుతో చిఱునగవు నవ్వియిట్లనెను. వేదములు ఏరూపమును అనిర్వచనీయమని ప్రథమమని, వ్యాపకమని నిర్గుణమని ఏకరూపమని వికారమని నిర్విశేషమని నిష్క్రియమని చెప్పునో అరూపమై అధ్యాత్మదీపమై బ్రహ్మ ప్రళయకాలమున జగంబులు నశింపగ మహాభూతములన్నియు సూక్ష్మభూతము లందును ఆ సూక్ష్మభూతము ప్రకృతియందును, ఆ ప్రకృతి వ్యక్తమందును అవ్యక్తము నీయందునణంగును. అప్పుడు శేషుడవు నీవే. ఓ విశ్వేశ్వరా నీవే మాయకు బంధువువై విశ్వమునంతయును త్రిప్పుదువు. నీవే నిత్యుడవు ఈ జగత్తంతయుమిథ్య. గుణరాశివగు నిన్నెవ్వడు కోరిభజించునోవాడే శాశ్వత సంపన్నుడు మృత్యుంజయము పొందువాడు, సౌఖ్యవంతుడు భయరహితుడు. పురాణయోగులు ఏకాంతమున యోగమార్గానువర్తులై నిన్నుగాంచితి మందురు, కాని నిజముగా నీయిట్టి యాకృతిని గాంచుటకల్ల. పవిత్రమైన నీరూపమును గంటిని యీ రూపమును చర్మచక్షులతో చూడరాదు. ఓ కమలాక్షా

నీ యీతొలిరూపమును తొలగించుము నీవు ప్రముఖ్యుడవు. ప్రళయకాలమునందీ విశ్వమునంతటిని నీకడుపున దాచుకొను మహానటుడవు నీవు. అట్టినీవు నాగర్భమున పుట్టితివనుట హాస్యాస్పదమగుకదా. ఓ కమలాక్షా నీవునాకు పుట్టుదువని దురాత్ముడగు కంసుడు మమ్ముకారాగారమున బంధించెను. ఈ దుర్మలిన చిత్తుని దండించి భీతులమగు మమ్ముకాపాడుము. ఓ పరమపురుషా! నా తొలిజన్మముల నోచిన నోములపంటవు నీవే అనియిట్లు దేవకీదేవి విన్నవింపగా విష్ణు విట్లనెను.

దేవకీ వసుదేవుల పూర్వజన్మ వృత్తాంతము.

అమ్మా నీవు పూర్వము స్వాయంభువమన్వంతరమున పృశ్నియను పరమ పతివ్రతవు. వసుదేవుడు సుతపుడను ప్రజాపతి. మీరిద్దరు సృష్టికాలమున బ్రహ్మయానతి నింద్రియముల జయించి తెంపుతో వానకు గాలికి యెండకు మంచునకు నోర్చి, నిశ్చింతగా ఏకదీక్షతో పండ్రెండువేల దివ్యవర్షములు తపములు చేయగా కలిగిన దివ్యరూపములతో మీరు అపధ్యాన పూజలతోనన్ను ధ్యానించి పూజించితిరి. నేను మీకు నాస్వస్వరూపముతో ప్రత్యక్షమై శాశ్వతములైన వరముల వేడుడనగా మీరు నామాయ తొలగక మోహముతో అనపత్యశాపరోధముచే దుర్దమమైన మోక్షమును గోరక నాయీడు కొడుకును కోరుకొంటిరి. నేనందుకు మెచ్చి యట్లేయని వరంబిచ్చి పృశ్నిగర్భుడను కుమారుడు గపుట్టితిని రెండవ జన్మమున మీరు అదితి కశ్యపులను ప్రఖ్యాత దంపతులైతిరి. అప్పుడు నేను మీకు వామను డనుపేర ఇంద్రునకు తమ్ముడనై జన్మించితిని. మీకిది మూడవజన్మ. నేను మీకిప్పుడు కుమారుడనై జన్మించితిని ఇటుమీదట, మీకు నేను పుట్టుటయనునది లేదు. మీరు నందనుడని పరమానందమగు బ్రహ్మయని నన్నుతలంచుచు నా యందలి ప్రేమచే నాధామమును చెందుదురు. మీకిటుపై జన్మలేదు. అనిచెప్పి దేవకీ వసుదేవులు తన్ను రెప్పలార్పక చూచుచుండగనే మాయతో నాముకుందుడు అప్పుడే పుట్టిన పాపనివలె కొన్నివేడుకల గావించెను. అంతట వసుదేవుడు హరి చెప్పిన దొవ్వున కర్తవ్యమును గావింపదలచి ఆ పురిటింటినుండి పాపని తీసికొని వేగముగా పోదునని వసుదేవుడు తలంచుచుండ వ్రేపల్లెలో నందుని భార్యయగు యశోదకు యోగమాయ పసిపాపగా జన్మించెను. వసుదేవుడు బిడ్డని, తన చేతులతో రొమ్మున కడ్డముగపట్టి మెల్లమెల్లగ నడుగులిడుచు కావలివారలుండు చోటుదాటి పురిటిసాలనుండి వెడలి చడి చప్పుడు లేకుండ తప్పుటడుగులు వేసి



కంసుని బారినుండి శ్రీకృష్ణుని సంరక్షించుటకు వసుదేవుడు
చిన్నికృష్ణు నెత్తుకొని యమునను దాటుట. పుట. 422

కొనుచురాగా, తాళంబులు కీలూడి వీడిపడగా మొగసాలలదాటి శేషుడు వాకిండ్లను మరలమూయుచు తగిన విధమున పడగలను విప్పుచు, కప్పుచు వేచి కాచికొని వెంటనంటిరాగా తూగుచువచ్చు వసుదేవునకు ఉత్తుంగ తరంగములతో భూమిని దిక్కులను ఆకాశమును గప్పుచున్నయమున, రామునకు సముద్రుడు దారియిచ్చినట్లు దారియిచ్చెను. నందసతియగు యశోదకు హరియోగమాయ పుట్టిన తరుణమున ఆ మాయచే వ్రేపల్లెలోనివారు కావలివారు నొడలెఱుంగక యుండిరి. ఆ సమయమున వసుదేవుడు వ్రేపల్లెకేగి యశోదశయ్యపై చిన్ని నల్లనయ్యనుంచి, ఆమె బిడ్డ నెత్తుకొనివచ్చి మరల పురిటింటిలోని దేవకిశయ్యపై పరుండబెట్టి, తన కాళ్ళకు సంకెళ్ళు దగిలించుకొని మనసున భయపడుచు మందుని వలె మెలగుచు, బెదరుతో వణకుచున్న నటుల కన్పింపదేహమును కదిలించుచు నొదిగియుండెను. అక్కడ యశోద తనవద్దకు వసుదేవుడు కృష్ణుని తెచ్చుటయు తనబిడ్డను తీసికొని పోవుటయు తెలియక, నిద్రలో మునిగియుండెను. దేవకి ప్రక్కను పరుండబెట్ట బడినపాప యాపురని యేడ్చిన చిన్నచప్పుడు విని పురిటింటి కావలివారు మేల్కొని తలుపుల తాళములు వేసినవి వేసినట్లుండ గాంచి, వచ్చి దేవకి నీళ్ళాడెనని కంసునకు విన్నవించిరి. అంతట కంసుడు తత్తరముతో పాన్పునుండి లేచి, వెండ్రుకలు వీడగా, పైవంచె జారగా, ఒప్పు సడలగా, రోషాగ్ని రేగగా, వైరముతో వడిగా నేతెంచి దేవకి ప్రక్కలోనున్న పాపను చంపబోగా దేవకి యతనికడ్డపడి తనయన్నయగు కంసునితో నిట్లనెను. అన్నా కోపమును మానుము నీకు మేనకోడలు పుట్టినది. ఈ పాప మేనల్లుడు కాదు మన్నించుము. దీనిని చంపుట నీతికాదు స్త్రీని చంపుట రాజులకు తగదు. కీర్తివంతుడవై మెలగుము. మహాత్ములు నడిచిన త్రోవను నడువుము. నేను నీచెల్లెలిని నిన్ను శరణువేడుచున్నాను. అకటా నాయార్వురి కుమారులనుబట్టి చంపితివిగదా. ఇది ఆడుపడుచు నీకు కోడలు దీనిని చంపెదవా ఎంతకఠినుడ వైతివి. అన్నా కరుణింపుము. మగశిశువు నీకు శత్రువుగాన వానిని చంపవచ్చును.. నేను పుత్రులకు నోచుకోనైతిని. అన్నా! నాకు కరుణించి పుత్రీదానము చేయుము. పుణ్యమును బడయుము. అనిపైట సవరించుకొనుచు భ్రాంతితో బిడ్డను వక్షమునకు హత్తుకొని పాప చెక్కున తన చెక్కుచేర్చి పైట చెంగుతో దానిని గప్పిమెల్లగా మొఱపెట్టుకొనుచుండ కంసుడు తన చెల్లెలినిదిట్టి చిట్టిపాప యాపురని వాపోవుచుండగా పొగరుతో పసిపాప కాళ్ళుపట్టుకొని నేలపై పడ వేయగా, ఆబాల నేలపై బడక చివాలున సవలీలగా పైకెగసి నవ్యదివ్యమాలికా

పరిమళ బంధురములైన మణిహారాద్యలంకారములతో నొప్పుచు గదా శంఖచక్ర పద్మశరచాప ఖడ్గశూలములను అష్టవిధకరములచే ధరించి, తన్ను సిద్ధచారణ కిన్నరగరుడ గంధర్వాది వైమానిక సమూహము కానికలొసంగి ప్రశంసించు చుండగా, అచ్చరల యాటపాటలను మెచ్చుచు ఆకసమునుండి కోపించి కంసునితో నిట్లనెను.

ఓ దుర్మార్గుడా దేవకి పుత్రులనందరిని తెంపుతో శిలపై బాది చంపితివి అంతటితో తృప్తిచెందక పోతివి పసిపాపల చంపుటకూడ పౌరుషమా? నీ నాతో పాటుపుట్టి నిన్ను చంపెడి వీరు వొకచోట సత్కరింపబడుచున్నాడు. అనియిట్లు పలికి ఆదేవి మహనీయ గుణోపేతయై భూలోకమున పలుచోట్ల పలుపేర్లచే పలువిధముల పిలువబడుచు వెలసెను. అంత ఆదేవి పలికిన పలుకులు తన చెవులకు ములుకులైసోకి బాధింపగా కంసుడు మనస్సున మిక్కిలి భయపడి, వేదనతో బాధపడు దేవకీ వసుదేవుల పిలిపించి, వారి నాదరముతో గౌరవించి వారితో నిట్లనెను. పాపిని బాల ఘాతకుడను, బంధుప్రీతిలేనివాడను, దుష్టచిత్తుడను, కోపిని, తిరుగాడు పనుగను క్రూరుడను మిన్నువలుకులనమ్మి మీపాపలను జంపితిని. ఓసాధులార దయతో నాపాపములను క్షమింపుడు ప్రాణులందరు తమ తమ కర్మలు తమ్మాదింపగా ఒక్కొక్క శరీరముతోపుట్టి యొక్కొక త్రోవలో రాకపోకలు సల్పుచు, చిక్కులలో చిక్కుపడు చుందురు. సంసారముపై ప్రీతిని వీడరు. నేను హంతనైన దెక్కడ? మీ శిశువుల హన్యులైన దెక్కడ నేను శత్రువుల చంపితిననియు శత్రువులచే చెడిపోతిననియు అజ్ఞుడు తలంచును. ఆత్మకు రాగద్వేషములులేవు ఈ రాగద్వేషములకు కీలకము కర్మ బంధమే. అని కన్నీరు గార్చుచు చింతించుచు దేవకీ వసుదేవుల కాళ్ళుపట్టుకొని సంకెళ్ళను విప్పించి, సమయోచితములగు పల్కులతో సైర్యమును నెలపగా వారు పశ్చాత్తప్తుడైన కంసుని జూచి, రోషమును మానిరి అంతవసుదేవుడు కంసునితో నిట్లనెను. బావా నీమాటలు నిజము. ప్రాణుల జ్ఞానముతో నీవు నేనను భేదబుద్ధితో లోభమోహ మదద్వేషా వేశములతో నొకరి నొకరు పొడుచుకొందురు. సర్వప్రాణులయందును పరరూపుడై వెలుగు నీశ్వరుని గుర్తింపజాలకున్నారు. కంసుడిట్లు ప్రసన్నులైన దేవకీ వసుదేవుల యనుజ్ఞతో తనయింటికేగి రాత్రి గడిపి మరునాడు ప్రొద్దున తన సేవకులైన మంత్రుల పిలిపించి తాను యోగమాయవలన విన్న వృత్తాంతమంతయు వారికి వినిపించెను. కంసుని మాటలాలకించిన యతని మంత్రులు కంసునితో ఓరాజా! ఇక ఆలస్యము

చేయుటెందులకు ? పల్లెలలో, పట్టణములలో గొల్లపల్లెలలో పుట్టెడి పిల్లలను పెరిగెడి పిల్లలనునట్టి చంపుదుము మమ్ములనువెంటనే పంపుము. మీయుజ్జ్వల చాపములందలిధనుస్సు నుండి విడువబడిన బాణములతో నోడింపబడిన దేవతలు ఎట్లువెళ్ళిరో యేయేదేశములందు దాగిరో బ్రహ్మను పొందిరో శివునే శరణు జొచ్చిరో విష్ణువునే సేవించిరో లేక వనములలో మౌనివృత్తితోనుండిరో మనము వెదుకవలెను. శత్రువులు భంగపడిరని ప్రభువు స్వేచ్ఛగ సంచరింపరాదు. లొంగిన శత్రువులే వివిధాకారములతో దొంగతనమున మనలో ప్రవేశింతురు, కావవారు చచ్చునంతవరకు ఏమఱియుండరాదు. రోగములను శత్రువులను ఇంద్రియములను విజృంభింపనీయరాదు మూలమట్టుగవానిని పెకలించివేయు వఱకు మెత్తదనము చూపరాదు. ఉపేక్షించినచో వానిని నిర్మూలించుట యసాధ్యము.

"దేవతలలో విష్ణువు ముఖ్యుడు. ఆతడు ధర్మమునందుండును. గోవులు, బ్రాహ్మణులు, సహనము, వేదములు దయ, సత్యము యాగము, తపము దమము శ్రద్ధశాంతి అనునవి విష్ణుదేహములు. ఈ దేహముల సంహరించినచో ఆతడంతరించినట్లే"

కావున ప్రభూ ! దేవతలను సంహరింపుమందురా ! తాపసుల యముని పాలికి పంపుమందురా దూడలతోపాటు గోవులహత్య గావింపుమందురా, బ్రాహ్మణుల పారద్రోలుమందురా వేదముల రూపుమాపుమందురా భూమిని హరింపుమందురా ఆజ్ఞాపింపుడు. ఇట్లు పలికిన మంత్రుల పలుకులు విని బ్రాహ్మణ నిరోధము నిషిద్ధమని తలంపక కాలపాశబద్ధుడగుటచే కంసుడు విప్రాది సాధుపురుషుల సంహరించుటకు రాక్షసులబంపి తనయంతః పురమున కేగెను. కంసుని యను చరులు తమ బలపరాక్రములచే క్రూరభావముచే సాధువులుండుచోట్లకువెళ్ళి వారిని తర్జన గర్జన భర్జనాదులచే నిర్జించి పాపముల నార్జించిరి. దానవ వీరులు శోధించి శోధించి సాధువులనణచుటచే దానవ బలము అడుగారి పోయినది.

"అర్యులైనవారిని హింసించినచో ఆయువు తరుగును. కీర్తిమాయును. సంపద నశించును క్షేమము క్షీణించును కదా".

నందుడు తనకు నందనుడు పుట్టెనని మహానందముతో వేదవేత్తలను పిలిపించి, స్నానముచేసి శుచియై స్వస్తిపుణ్యాహవాచనముల చేయించి, జాతకర్మలు చేయించి, పితరుల పూజించి, దూడలతోపాటు రెండులక్షల పాడియావులను



కృష్ణావతారము. పుట. 426

బంగరు కలశములతో మణులతో వస్త్రములతోపాటు కొండలవంటి పదుతిల రాసులను దానముగా నొసగెను. బ్రాహ్మణులు గోపబాలుడు శ్రీయుతుడునై శత్రువిజేతయు దీర్ఘాయుష్మంతుడగుగాక యని పసిబాలుని దీవించిరి. దుందుభులు మ్రోగినవి. గాయకులు పాడిరి. సూతవందిమాగధులు కీర్తించిరి. కాహళులనూదిరి. గోకులమునందలి ప్రతిగృహము తోరణములతో ధూపవాసనలతో శోభిల్లెను. అలమందల నలంకరించిరి. లేగలు క్రేళ్ళుఱికినవి. మదవృషభములు అంకెవేసినవి. పాడియావులు పొదుగులనుండి పాలను వర్షించి గోకులమును పరమపవిత్ర మొనరించినవి. నందుడు విద్యావంతులను, గాయకులను, యాచకులను గోధనములతో సత్కరించెను. గొల్లలు పొట్టిఅంగీలను, తలపాగాలను, సరిగంచుబట్టలను, బంగరు సొమ్ములను, మంచి మంచి పదార్థముల దీసికొని నందనందనుని గాంచుట కానందమున అనుదెంచిరి. ఆ గోపబాలుని గాంచి, పాలతో పెరుగుతో నీళ్ళుగలిపినవెన్నతో వసంతములాడిరి. పిమ్మట గోపికలు ఎన్నినోముల ఫలమొ ఈ నాటికొక మంచి సంగతి వింటిమి మనయశోద చిన్ని, మగవాని కనినదట ముదితలార చూచి వత్తమమ్మయనుచు నొకరి నొకరు చెప్పుకొనుచు సింగారించుకొని, మెల్లనినడకలతో బలిసిన పిఱుదులతో, పిడికిటిలో నిమిడు నడుములతో, బిగువైన చనుగవతో, విశాలనేత్రములతో లక్ష్మీతాండవమాడు మొగములతో, తుమ్మెదవంటి ముంగురులతో ముడులు వీడగా, వక్షములపై నున్నహారములల్లాడగా, చెక్కిళ్ళపై పత్రిరేఖలు శోభిల్లగా, పైట చెరగులు రెపరెపలాడగా యశోదయింటికివచ్చి జిష్ణువు విష్ణువగు చిన్ని కృష్ణుని గాంచి సంతోషముతో కానికలనిచ్చిరి. పాపనికి నూనెతో తలంటి పసుపుబూసి స్నానముచేయించి హారతియనుచు కొన్నినీళ్ళుచుట్టుచల్లి తొట్ల పరుండబెట్టి.

క॥ జోజోకమలదళేక్షణ । జోజోమృగరాజమధ్య జోజోకృష్ణా
జోజోపల్లవకరపద । జోజోపూర్ణేందువదన జోజోయనుచున్

దీవించి పాటలు పాడిరి. లోకములన్నిటిని నిదురబోవ జోగొట్టుచు తాను నిదురలోని పాపని గోపికలు జోకొట్టగా నతడు నిదురబోవుపటుల కనులమూసి కొనియుండెను. ఏపుట్టుక లేనివాడు ఘులకావతి యింటపుట్టెను. ఏకర్మలతో నిమిత్తములేనివానికి జాతకర్మములు కలిగినవి. ఏతల్లిచనుబాలను రుచిచూచి యెఱుగనివానికి యశోదపాలరుచి తెలిసెను. ఏహానివృద్ధులులేనివానికి బ్రహ్మము

యశోద హస్తములలో వృద్ధిచెందెను. పరతపస్సులకు కలుగని ఫలము వ్రేపల్లెలో పండెను. పదరువులైనను ఇతడిట్టివాడని చెప్పజాలని అర్థము అవయవములతో రూపొందెను. ఆ బాలుడు పనులుచేయునపుడు బ్రహ్మవలెను, సంతోషముతో నున్నప్పుడు విష్ణువువలెను కోపించినపుడు రుద్రునివలె ఆనందమున తన్మయుడై నపుడు బ్రహ్మమువలెను రాణించెను.

నందుడు రోహిణిని పిలిపించి వేడుకతో నామెకు చిత్రవస్త్రభూషణలను, సొమ్ముల నిచ్చి మన్నించెను. అదిమొదలు గోకులమునందలి గోబృందము లన్నియు మంచి పొదుపులు కలిగియుండెను. నందుడు గోకుల రక్షణకై వసులను నియమించి మధురకేగి కంసునకు రానేసేట చెల్లించు కప్పము చెల్లించి, వసుదేవుని దర్శించెను. వసుదేవుడు నందుని చూడగనే ప్రాణము పొందిన బొందివలె లేచి కన్నులనుండి ఆనందబాష్పములు గ్రమ్మగా చేతులు సాచి యతని కౌగిలించు కొనెను. పిమ్మట నతని సుఖాసనుని గావించి తనకొడుకులపై గల మోహము తోపగా నందునితో నిట్లనెను. సంతతిలేదని యెంతో చింతలో మునిగి ముసలి తనమున కృశించిన నీకు సంతతి భాగ్యము కలిగినది. సంతతిలేనివానికి సౌఖ్య మెక్కడిది. నిన్నుచూడగనే బ్రతికినట్లైనది. ఆపదల గడచితిని అరమరికలులేని చెలికాని గాంచుట మరల జన్మించినట్లేకదా ? జీవికకై పలుపాట్లుబడు వారి కొక్కచోట నేయుండుట జరుగదు. ఏరులలోబడి కొట్టుకొనిపోవు చెట్లన్నియు నొకే చోటికిపోక పలుపాయలలోబడి పోవునుకదా. నందా పసులు పలురోగముల పొందకున్నవికదా ధేనువులు పాలిచ్చుచున్నవికదా ? కాల్వలు సరస్సులు నీటి చేనిండియున్నవికదా ? పశుశాలలలో పులులు దుప్పులు వచ్చుటలేదుకదా గొల్ల పల్లెలు సుఖము గనుచున్నవికదా ? వనములలో వచ్చవచ్చని చెట్లతో నొప్పు చున్నవికదా ?

> ''తన పుత్రమిత్రాదులను చూడక వారిని తృప్తిపరుపక వారు పీడింపగా,
> జీవించుచు గృహస్థాశ్రమమున నున్నవానికి సంతోషముండదుకదా''.

నందా ? నీభార్యవద్ద, నీవును నీభార్య గౌరవింపగా నిన్ను తండ్రిగ జూచు కొనుచు నీముందలో నాకొడు కానందముతో నున్నాడా ? అనవిని నందు డతనితో నీకును దేవకికిని కలిగిన పుత్రులను కంసుడు వెంటవెంటనే వధించెను. కడకు మీకొకబిడ్డపుట్టగా నామెను బాధింపబోగా నామె తప్పించుకొని ఆకాశ మున కేగెను. అదిదైవలీల తెలిసినవాడు ఆపదలో శోకింపడు. చూడుము


నాకొడుకే నీకొడుకని యూరడిల్లుము. అనినవిని వసుదేవుడు నందునితో "నీవు రాజునకు కప్పము గట్టితివి. మమ్ముజూచితివి, మేమునిన్నుజూచితిమి. మంచిది గోకులమున నుత్పాతములు తోచుచున్నవి. ముందు పొమ్ము".

పూ త న.

అని నందాదులైన గోపకుల వీడు కొలుపగా వారువెంటనే వడిగల యాబోతులు కట్టిన బండ్ల నెక్కి తమ తమ దారులు పట్టిపోయిరి. ఆ నందుడు ఉత్పాతముల గాంచి తనతో వసుదేవుడు చెప్పినమాటలు తప్పవనుచు వ్రేపల్లె కేగెను.

పూతనయను బాలఘాతిని కంసుని యాదేశముచే పల్లెలు పట్టణములు మందలు తిరుగుచు శిశువుల జంపుచు ఎవనిపేరు విన్నంతనే సర్వభయములు తొలగునో అట్టివాని యవతరించియున్న వ్రేపల్లెకు ఆకాశమార్గమునవచ్చి మాయతో కామరూపిణియై యెవరికిని గనుపింపక యిల్లిల్లు దిరిగి చూచుచు నందునింట బాలుని శద్దమువిని సంతోషముతో సుందరీ వేషమును ధరించి కాంతులీను కన్నులు; గుబ్బచనులు మచ్చలేని చందురునివంటి మోము, కలదులేదని పించునడుము విశాలమైన పిఱుదులు, పల్లవములవలె నరుణములైన కాలుసేతులు పెద్దకొప్పు నొప్పగా బంగరు కుండలముల కాంతులు చెక్కిళ్ళపై ప్రసరింప, కొప్పునదురిమిన మల్లెలవాసనకు తుమ్మెదలు వెంటరాగా చేతికంకణముల, కంఠహారముల కాంతులు వ్రిసరింపగా ఆ సుందరాంగి ఆ కుమారుడున్న యింటికిరాగా గోపికలామెను గాంచి లక్ష్మియే మమ్ము కరుణించుకొఱకై శృంగార వేషముతో వచ్చెనేమో యని మోహించి యామెను చూచుచుండగా పడకనదును నివురు గప్పిన నిప్పువలె నున్నవాడు దుర్జనవధకు పక్రమించు డింభకుని జూచెను.

ఆ బాలగోపాలుడు పూతన, పాలిండ్లపై విసము బూసికొని వచ్చినదని తలంచి లోలోననవ్వుచు కాలుసేతుల నెఱుగనట్లు గురకపెట్టుచు కనులు మూసికొని యుండ ఆ పాపిష్ఠిది యాతని పాన్పుచేరి చేతులతోలేపి శిరము ముద్దాడి ఓ చిన్ని కుమారా! నాచను బాలొక గ్రుక్కెడు త్రాగుము అప్పుడు నీయందము తెలిసి వచ్చును నాజన్మ సఫలమగును. అని బాలుని గూర్చి ముద్దాడునట్లు మాటలాడు సుందరిని జూచి యశోదా రోహిణులు అమ్మా మావాని ముట్టకుమమ్మ పాలివ్వ వద్దమ్మ మాపాపకు నీపాలు రుచించ వమ్మాయని వారించుచున్నను వారిని లక్ష్యపెట్టక ఒరలోని కత్తివలె మాటలతో మెత్తదనము లోనవాడి కలుగగా కఠిన పలుకులు పలుకుచు నిద్రించు పామును త్రాడని భావించి సమీపించు మూర్ఖురాలి



కంసునివలన నియోగింపబడిన పూతన శ్రీకృష్ణునకు విషపూరితమగు తన చనుబాల ద్రావింప, నల్లనయ్య దాని ప్రాణవాయువులబీల్చి వధించుట.

పుట. 432

వలె, పెలుపు నడుమునే మరక కోమను మిగులు చిలుత కుమారుని దింపి తొడల నడుమ నుంచుకొని యాతని దేహము నిమురుచు, మమకారము చూపుచు ఆకలి గొన్న నా చిన్నియన్న చన్ను గుడువుమని చన్నిచ్చు సమయమున మేల్కొని నట్లు మెల్లగ కన్నులు విచ్చి క్రేగంట చూచుచు నీలియావులించుచు నాదరముతో చేతులజాచి, యొయ్యన యాకన్నవానివలె చన్నుగవను కేల పీడించి, నోటికందు కొని గ్రుక్క గ్రుక్కకు గుటుకు గుటుకు మనుచు రెండు గ్రుక్కలలో నామె ప్రాణములతోపాటు బలమునంతటిని పీల్చిత్రాగెను. అంత నా సుందరి గుండెలు తల్లడిల్లగా మిక్కిలి తిరుగుచు తలతిరుగగ నాతనితో నీవు మామూలు బాలుడవు గావు చాలు చాలు నా చన్ను విడువుమని దప్పిమంటలు రేగ ధైర్యముసడల కాలు సేతులు కన్నులు వికారములుకాగా మిక్కిలి కేకలెట్టుచు కూలిపోయెను. ఆపెను రక్కసి యిడిన పొలికేకకు, కొండలతోపాటు భూమి కంపించెను: ఆకస మునైయున్న గ్రహనక్షత్రములు చెదరినవి. దిక్కులు పిక్కటిల్లినవి. లోకములు వణకజొచ్చినవి. వజ్రిభిన్నమైన పర్వతమువలె, తన తొంటి శరీరముతో పూతన కూలిపోయెను. ఆ పెనుబ్రమోతకు గొల్లలెల్ల చైతన్యములేక భయముతో నేల కూలిరి. ఆ రక్కసి దేహము నేలబడగా యోజనమున్నర మేరనున్నచెట్లు నుగ్గు లయ్యెను. నాగేటి కొయ్యవంటి దంతములు, పర్వత గుహవంటి ముక్కు, పెను కొండలవంటి కుచములు విరిసియాలెడి కెంద్రుకలు చీకటి నూతులవంటి కన్నులు పెనుదిబ్బవంటి పిఱుదులు తాగుకట్టలవంటి కాలుసేతులు ఇంకిన మడుగువంటి కడుపుకల్గి అటుకోమలరూరమై చూచుటకు భయంకరమైన పూతన కళేబరమును చూచి గోప గోపికలు గుంపులై బెదరుతో చూచుచుండిరి. ఈ విధముగ పద్మ ప్రఫుల్ల కమలలోచనుడగు హరిముని సముదయమునకు యాతన గల్పించి నదియు మృత్యుద్యోతనయగు పూతనను యాతన తీలలగుడువ బంపెను. విషధర శత్రువగు గరుడుడు వాహనముగ గలవాడును, విషగళుడగు నీలకంఠునకు మిత్రుడును స్వచ్ఛమైన పాలమున్నీట శయనించువాడును, పద్మజుడైన బ్రహ్మకు తండ్రియైనవాడగు హరికిచను విషమొక విషమా !

క॥ విషధరరిపుగమనునికిని
విషగళసఖునికిని, విమలవిషశయనునికిన్
విషభవభవజనకునికిని,
విషకుచ, చనువిషము, గొనుటవిషమే తలపన్.

అంతట గోప గోపీజనంబులు రోహిణీ యశోదలతోపాటు భయపడక సమీపించి, నేలగూలిన యాపూతన విశాలమైన వక్షమున క్రీడించు బాలుని గాంచి బాలకృష్ణుని వీపుపై నెక్కించుకొని యాతని మొదలంతయు తాకి నిట్టూర్పుచు వాతనిచుట్టు ఆవుతోకను త్రిప్పియతనిపై గోరజమును గోమూత్రమునుచల్లి యతని యవ యవములందు అజాది ద్వాదశ నామములతో గోమయమును పూసిరి. మరియు గోపికలాచమించి, ఆత్మరక్ష గావించుకొని గోపబాలునితో చిన్నియన్న నియడుగుల నజుడు జానులవాయువు నీతొడల యజ్ఞుడును చెక్కిలి నచ్యుతుడు కడుపును హయాననుడును, హృదయమును కేశవుడు. వక్షము నీశుండును కంఠమును సూర్యుడును భుజములను చతుర్భుజుడు ముఖమును త్రివిక్రముడును. శిరము నీశ్వరుండును రక్షింతురు. ముందు చక్రియు వెనుక గదాధరుడైన హరియు పార్శ్వముల ధనుర్ధారియైన మధువైరియు, ఖడ్గధారియైన అజుండును కోణంబులను శంఖచక్ర గదాధరుండైన ఉరుగాయుడును మీదు నుపేంద్రుడు క్రింద తార్క్ష్యుండును అంతటను హలధరుండైన పురుషుండును రక్షింతురు. నీ యింద్రియములను హృషీకేశుండును ప్రాణంబుల నారాయణుండును చిత్తంబును శ్వేతద్వీపపతియు, మనంబును యోగీశ్వరుండైన కపిలుండును బుద్ధిని పృశ్నిగర్భుండును అహంకారంబును భగవంతుడైన పరుండును రక్షింతురు. నీవు క్రీడించునపుడు గోవిందుడును శయనించునపుడు మాధవుండును నడచువేళ వైకుంఠుండును కూర్చున్నవేళ శ్రీపతియు, భుజించునపుడు సర్వరక్షకుండైన యజ్ఞభుజుండును జాగరూకులై యుందురు. నీ పేరుచ్చరించినంతనే భూత, ప్రేత, యక్ష రాక్షస, పిశాచ వినాయకులును కోటరా రేవతులును, జ్యేష్ఠా పూతనలును, మాతృకాది గణంబులు నశియింతురు. నీయందు ప్రాణేంద్రియ శరీర నిరోధంబులయిన యున్మాదంబులును, అపస్మారంబులను మహోత్పాతంబులును పొందకుండును గావుతమని రక్షచేసి దీవించిరి. ఇట్లా లీలామానుష బాలునకు యశోద చన్నుగుడిపి పాన్పుపై పరుండబెట్టి పైనకప్పి నిదుర బొమ్మని యశోద జోలపాట పాడెను.

అంత నందుడు మొదలగు గోపకులు మధురనుండివచ్చి రక్కసి మేనుంగాంచి వెలుగువడి వసుదేవుడీ యుత్పాతములు కలుగునని చెప్పినది నిజమే అతడు మహాయోగియని తలచి కఠినమైన పూతన మొదలిని గొడ్డళ్ళతో నరికి తమ కుటీరములకు దూరముగ గంధపు చెక్కలతో దహించివేసిరి. ఆమె శరీరమునందలి పాపములన్నియు. వారిచే బ్రిగలడి నందున పూతన మొదలినుండి వెడలు

పొగలు అగురువాసనగల విగనుండెను. ఆమెపై హరి కర చరణములుంచి చన్ను గుడిచినందుచే హరిజననివలెనే ఆ రక్కసియు పాపరహితయై పరగతి కరిగెను. హరిని గాంచి యాతనికి పాలిచ్చు పడతులు పొందునది పరమపదమే. హరి యారగించుటకు పాలనిచ్చిన గోవులు ముక్తిశిఖరముల పొందును.

ఓ పరీక్షిన్నరేంద్రా! ఆ పూతన ఒడలినుండి వెడలు పరిమళమును మూర్కొని యిట్టి దుర్మార్గురాలి దేహమునకిట్టి మంచివాసనవచ్చునాయనుకొనుచు గోపకులు తమ గ్రామములకేగిరి. పిమ్మట నందుడా నందమున నింటికివచ్చి గోపికలచే రక్కసి చేతలన్నియువిని వెలుగంది పాపనిలేపి వానిశిరంబు మూర్కొని ముద్దాడి సంతోషమున నుండెను. అని చెప్పగా పరీక్షిన్నరేంద్రుడు శుకునితో.

క॥ ఉరుసంసార పయోనిధి । తరణంబులు పాపపుంజతరణంబులు శ్రీ
కరణంబులు ముక్తిసమా । చరణంబులు బాలకృష్ణు సంస్మరణంబుల్.

అని బాలకృష్ణుడటు మీద నేమేమిచేసెనాయందు దయయుంచి చెప్పవేయని యడిగిన శుకయోగీంద్రుండు పరీక్షిన్నరేంద్రునితో నిట్లనియె.

శకటాసురుడు.

బాలకృష్ణుడు ఒదిగిల బడనేర్చెనని యశోద యతని జన్మనక్షత్రమునందు గొల్లతల రావించి మంగళవాద్యములు మ్రోయగా, వేదమంత్రముల విప్రులు చదువుచుండ సతనికి (అభిషేకము) అభ్యంజనాదుల గావించి, వారితో బాలునకు దీవనలిప్పించి వారినన్న వస్త్రాదులచేతను గోదానముచేతను సత్కరించెను. పిమ్మట బాలుని మెత్తని పాన్పుపై పరుండబెట్టి నిద్రపుచ్చి గోపాలకులను గోపికలను సత్కరించుచు కుమారునే మరచియుండెను. ఆ సమయమున నిద్రించు శిశువు ఆకలితో పాలకోసము మూలుగుచు చిగురుటాకులవలె మెత్తనై చక్రదాప రేఖలుకల తనకాలితో నొకబండిని గట్టిగా తన్నెను. ఆకాలి దెబ్బకు బండి యాకసమున కెగిసి యురుసు విరువుచే బండికండ్లు నేలబడుట గాంచి గోప-గోపికలాశ్చర్యపడిరి. అప్పుడచట బండిపై పెట్టిన పదార్థములన్నియు వ్యర్థములై నేలగూలగా జూచి యశోదా నందులు తక్కిన గొల్లవారు తమ తమ పనుల మాని, వినోదముల విడిచి, యుత్సాహముతోంగ ఆశ్చర్యపడి ఈ బండి యాకాశమింటి కెగయదు. పాన్పుపైనున్న బాలుడా బండిని తన్నగలవాడు కాడు. ఈ బండి ఆకసమున కెట్లెగసెనోయని తర్కించుచుండగా ఆ బాలునొద్ద నాడు

కొనుచుండిన బాలురు వారితో బాలుడాకలితో నేడ్చుచు తన్నగా ఆ బండిపై కెగిరినదే కాని మరేమియు కాదని చెప్పిరి. ఆ పలుకులు వినివారు ఈ బాలుడెక్కడ బండి యెక్కడ ఇతడా బండిని మిన్నుతాకునట్లు తన్నుటెక్కడ. ఈ బాలురెందుకు కల్లలాడు చున్నారు. ఇట్టి అసందర్భము మరెక్కడనైన కలదా ఇదియెట్లో కదాయనుచు వారెల్లరు మిక్కిలి యాశ్చర్యపడిరి. అప్పుడా బాలుని యేడ్పువిని యశోద పరుగెత్తివచ్చి అన్నా అలసితివ కదా నాయన్నా యాకలి గొంటివా, మా అన్నమంచివాడుకదా పడవకుమన్నా పాలుత్రాగుమన్నా సంతోషపడు మన్నాయని బాలునకు పాలిచ్చెను. ఆ బాలునకు బాలగ్రహంబు సోకునని శంకించి గోపకులనేక విధముల బలుల నొసంగిరి. బ్రాహ్మణులు పెరుగుతో దర్భలతో అక్షతలతో హోమము లాచరించిరి. ఋగ్యజుస్సామ మంత్రములతో నభిషేకము సేయించిరి. అతని యభ్యుదయమునకై నందుడు అలంకరించిన పాడియావులను విద్వాంసులకు దానమొనరించి వారల యాశీర్వాదంబుల గైకొని సంతోషమున నుండెను. అంతనొకనాడు యశోద బాలుని తన తొడపై నుంచుకొని మూర్ధాది యతని శరీరమును నిమురుచుండగా నాబాలుడు పెద్దకొండ శిఖరమువలె తల్లికి మిక్కిలి బరువయ్యెను. బరువైన యాకుమారుని మోయలేక యశోదనేలపై నతని కూర్చుండబెట్టి యితడు భూమిని రక్షింప వచ్చిన మహాపురుషుడై యుండవచ్చునని మనమున తలంచెను.

తృణావర్తుడు.

దుర్మార్గుడగు తృణావర్తుడు తనతోడగు కంసు నానతిని వ్రేపల్లెకువచ్చి బాలుని కనుగొని సుడిగాలిగా మారి తల్లిచే నేలపై పరుండబెట్టబడిన బాలుని శీఘ్రమై యాబాలుని గైకొని పోయెను. ఆ సుడిగాలి విసరుధూళి తమ కండ్లలో బడగా గోపకులు కన్నులుమూసి గగ్గోలుపడు చుండిరి. ఆ తృణావర్తుడు ప్రళయకాల మారుతమువలె రేగి నలువైపుల విసరుధూళులచే సూర్యమండలము కప్పబడెను. దట్టముగ చీకట్లు గ్రమ్మెను. ఆగాలిధాటికి కన్నులుమూసికొని పోవదాని భయంకర శబ్దమునకు చెవులు చిల్లులుబడ వారి హృదయములందు భయమావేశించెను. యశోదగాలిలో బాలుడు కనిపించక పోవుటచే సంతాపముచెంది, దిగులుపడి బిగ్గరగ ఓ నాతండ్రీ బాలశిరోమణీ! నేడు గాలికెగిరి పోతివా నా తండ్రీయనుచు దైవమును దూఱుచు సుడిగాలివచ్చి నిన్నుపైకి గొంపోయి సుడిపెట్టగా మడిపడుచు నాతండ్రీ యెంతఘోరము జరిగెరాయనుచు నేను



సుడిగాలిరూపమున శ్రీకృష్ణు నాకాశమున కెత్తుకపోయిన తృణావర్తుడను
రాక్షసుని చిన్నికృష్ణుడు వధించుట. పుట. 437

బాలునిక్కడనే విడిచిపెట్టితిని వాడాడు కొనుచుండెను. ఈ పాడుగాలి యెక్కడ నుండి దాపురించెనో నాపాపమే మార్గము పట్టెనో, నేనెక్కడికి పోదునని దూడను గోల్పోయిన ఆవువలె ఖేదముతో యశోద నేలపై గూలెను. ఆ యశోద యారాటమును గాంచి యార్తితో గోపికలు కన్నీరు గార్చుచుండిరి. అలోపల తృణావర్తుడహంకారముతో నతని మింటికి గొనిపోయి యాతని బరువు మోయజాలక బలము క్షీణింపగా వేగము తగ్గించి కదలలేక ఇంతకుముందిట్టి బాలుని చూడలేదు. ముందు ఎట్లనుచు చింతించుచుండెను. ఆ సమయమున ఆ బాలుడు పిల్లయేనుగు తొండములవంటి తనకరములతో నతని మెడ బిగబట్టుకొని కొండవలె బరువగు నతనినుండి విడివడలేక వాదురిలోబడి భయపడు మృగమువలె భయపడి బాలుని యరచేత పీడింపబడి హతుడై బాలపై వజ్రాయుధపు దెబ్బచేకూలు గోపురమువలె నేలగూలెను. అతని యొడలు పొడిపొడి యయ్యెను. అంత గోపికలది గాంచి సంతసించి రక్కసుని యురమున కేళిల్లుచు బరువులేక వ్రేలాడు బాలునెత్తుకొనివచ్చి, శోకించుచున్న యశోద కిచ్చిరి. అప్పుడు గోప గోపికలందరు తమలో నిట్లనుకొనిరి.

> "సాధువు సర్వులయందును సమభావము కలవాడగుటచే ఆపదల తటస్థించు నప్పుడు తన కాధారము లేకపోయినను సురక్షితుడగును. పాపవర్తుడగుటచే దుర్మార్గుడు తనకు రక్షకులు పెక్కురున్నను శిక్షింపబడును".

మనము పూర్వజన్మలయందేమి నోములు నోచితిమో ఏయే యాగములుచేసితిమో యెవ్వరికేయే దానములుచేసితిమో, యేసత్కథలతో కాలక్షేపముచేసితిమో ఏయే సత్యముల బల్కితిమో యేపుణ్యక్షేత్రముల సంచరించితిమో వానిఫలముగ నేడు నిర్భయుడు సర్వరక్షకుడగు శ్రీకృష్ణుని గాంచితిమి. నందుడు తనకంతకు ముందు వసుదేవుడు చెప్పినమాటల తలంచి యాశ్చర్యపడుచుండెను.

ఒకనాడు యశోద చిన్నికృష్ణుని పిలిచి యతని నెత్తుకొని చనుపాలిచ్చి యతని మేనునిమిరి, బాలుడావులించుచు చిఱునగవున నోరు తెరవగా నాతని నోటి యందు సముద్రములు దిశలు భూమియు వనములు పర్వతములు నేలలు గాలి సూర్యుడు చంద్రుడు అగ్ని ఆకాశము, గ్రహములు నక్షత్రములు సమస్తలోకములు చరాచరములైన భూతగణములన్నియు నందుండుట గాంచి యాశ్చర్యపడి కన్నులుమూసికొనెను. అంతనొకనాడు వసుదేవుడు పంపగా యాదవ పురోహితుడైన గర్గుడు వ్రేపల్లెకు వచ్చెను. నందుడాతని గాంచి సారగుడా బార

మార్గుడు, సత్సంసర్గుడు ఆరాధితభర్గుడు జితారిషడ్వర్గుడు కుజనదుర్గుడగు నాగర్గుని యథావిధి పూజించి మహాశాస్త్ర అర్థముల యెడ్లకు మహాత్ములారక రారు నీవువచ్చుట సకల శుభములకు మూలము. నీవు జ్యోతిశ్శాస్త్రజ్ఞులలో మేటివి. దిగంత విశ్రాంతకీర్తివి. బ్రహ్మవేత్తవు. పురోహితుడే మానవులకు విప్రోత్తముడు కావున నీవు ఈ కుమారులకు సంస్కారంబు గావింపుము. అని నందుడు చెప్పెను గర్గుడుకు పూర్వము యోగమాయ చెప్పిన విధమంతయు తెలిపి కృష్ణుని దేవకీదేవి కుమారునిగ నందుడు తలంచును గాన రహస్యముగ సంస్కారము చేయుట తగునని నందుని యనుమతిపై రోహిణీ కుమారునకు రాముడనియు సంకర్షణుడనియు బలుడని నామకరణ సంస్కారము గావించెను. కృష్ణు నుద్దేశించి యీ శిశువు పూర్వము ధవళ పీతారుణ వర్ణుడై యిప్పుడు నల్లనివాడై నందున కృష్ణుడనియు, వసుదేవునకు జన్మించిన కారణమున వాసు దేవుడనియు నీతనికి వ్యవహార నామములు. ఇతనికి గుణకర్మలనేకములు గనుండుటచే నితని కనేక నామంబులు గలవు. ఈ బాలునివలన మీరు కష్టముల నుండి గట్టెక్కుదురు. ఇతడు దుష్టశిక్షణము శిష్టరక్షణము గావింపగలడు. నీకుమారుడు నారాయణుడని చెప్పి గర్గమునీశ్వరుండు వెడలిపోయెను నందుడు గర్గమునీంద్రుని పలుకుల విని మహానందమున నుండెను.

శ్రీకృష్ణ బలరాముల బాలక్రీడ.

రామకృష్ణులు మోకాళ్ళపై దోగాడుచు నిటునటుపోదురు. తల్లుల పయ్యెదల పట్టివడిగా పరతెంతురు. ఆవుదూడల తోకలపట్టి విడువక వానివెంటపోదురు. నీటిబురదలలో దుంకుదురు. ఎత్తిచన్నిచ్చు నపుడిరువైపుల పాలిండ్లు పుణుకుచు చేపుకలుగగా జారలాడుదురు. గ్రుక్క గుక్కకు కేరింతలు గొట్టియాడుదురు. అవ్యక్తములైన వచ్చిరాని పలుకుల పలుకుదురు. కాళ్ళుచేతులచాపి కలుపుచు రామకృష్ణులు బాల్యక్రీడలాడిరి.

రామకృష్ణులా నందమున నాటలలోమునిగి తేలగా వారిని చూచి రంభాదు లాడిరి. శతృవులు భయముతో నల్లాడిరి. మునులు వేడుకతో మంతనము లాడిరి. రామకృష్ణులు తలెత్తి యాడునపుడు శేషునివలెను శరీరమున గంటిన బురద లతో మైపూతలతో ఏనుగు గున్నలవలెను సాటిలేని వేగాధిక్యముతో సింగపు పిల్లలవలెను అంతకంత కతిశయించు ముఖకాంతులతో సూర్యచంద్రులవలెను. తల్లుల చనుబాలు ద్రావి యానందముల మునిగి తేలుచు యోగామృత పానము

గావించి పరవశులైన యోగులవలె రామకృష్ణులకు జనుల కానందము గొలుపుచుండిరి. లీలామానుషుండైన గోపాలుడు జనుల గుర్తించి చూడ నేర్చెను, తన నగవుతో మాయను నగుబాటు చేయగల బాలుడు నవ్వుచున్న సతుల జూచి నగవునేర్చెను. తల్లుల నెఱుగక ముగురమ్మల కతీతుడై వెలుగు పరమపురుషుడు బాలుడై తల్లులకు సంతసము గల్గునటుల అవ్వా అవ్వాయని పిలువనేర్చెను. సహస్రపాదుడైన రెండడుగులచే భూమిని ఆకాశమును వ్యాపించు పరమాత్మ అడుగిడనేర్చి శత్రువుల యడుగులు తడబడునట్లు చేసెను. తన దేహమున కంటిన నేలపైని దుమ్ము వీబూతి పూతగా నెత్తిపై వెలుగొందు ముత్తెము చంద్రరేఖగా నొసటిపై నున్న యెఱ్ఱబొట్టు కాముని గెల్చిన కన్నుగా కంఠహారము నందలి నాయక నీలమణి మెడకప్పుగా హారములు సర్పహారములుగా బాల్యమునందలి హర శివునకు తనకు భేదములేదని తెలుపుట కనునట్లు శివుడుగ ప్రకాశించుచుండెను. ఆ రామకృష్ణుల విహారములపై మక్కువ గలిగి గోపబాలికలు తమ పనుల మఱచి వారి విహారములనే తిలకించుచుండిరి. ఆ సమయమున రోహిణి యశోదలు గోళ్ళువాడి కొమ్ములుగల జంతువులవలన వారికి హానికలుగకుండ జాగరూకలై నీరు నిప్పు, ముండ్లు వీనివలన మోసపోక బాలుర సంరక్షణము చేయుచు తమ హృదయములలో మిక్కిలి సంబరపడుచుండిరి. తనయీడు బాలురు తన్ను సేవింపగా బలరామునితో గూడి కృష్ణుడు నీలకాంతితో గొల్లపడతులు మెచ్చునట్లు ప్రకాశించుచుండెను. కృష్ణుడు నానాటికి సంచారమునను సంభాషణము నందును సమర్థుడై చప్పుడు సేయకుమని తల్లికోపింపగా నల్లదూరముగ బోవును. అప్పుడా తల్లి చేతులు సాచిమా వాడు, వచ్చెనని నవ్వుమొగముతో పిలువగా మొల గంటలు మ్రోయ తల్లికడకువచ్చి యింపుగ చన్నుగుడుచును. గొల్లల యిండ్లకేగి వెన్నముద్దల మ్రింగివచ్చి యేమియు నెఱుగనట్లు తప్పటడుగులతో తల్లికడకువచ్చి పాలిమ్మని తల్లిని యడుగును. మఱియు కృష్ణుడు గోపబాలురతో గూడి నేనాబోతును మీరు గోవులని అంబావేయుచు వంగియాడును. నేను రాజును మీరు సేవకులని వారికి పెత్తనముతో పనుల చెప్పును. నేను దొంగను మీయింటి వారని మీరు నిద్రింపుడని సొమ్ముల దీసికొనిపోయి దాగికొనును. నేను సూత్రధారిని మీరు పాత్రలనివారి నాడించును. మూలలకు పరుగెత్తును. దాగిలి మూతలాడును ఉయ్యాలలూగును చెంగులు విసరును ఇట్లు కృష్ణుడు బాలురతో నాడుచు బాలచోరుల బాటల చూపించును. మఱియు నాబాలకృష్ణుడు కపట

బాల్యగుణ దొంగలాడల క్రీడింపగా గోపిక లోపికలులేక యశోదకడకువచ్చి యామెతో నిట్లనిరి.

గోపికలు కృష్ణుని చేష్టల యశోదకు చెప్పుట.

సర్వాణీ! బాలురకు పాలులేవని బాలెంతలు మొఱపెట్టుకొనుచుండగా నీబాలుడాలముచేసి దూడలను విడిచి, యావులకడకు ద్రోలెను. పడతీ! నీబిడ్డడు బాగా కాచికడవలలో పోసిపెట్టిన పాలను ఆ పిల్లలకుబోసి మిగిలిన కడవల పగలగొట్టినాడు ఇతనికడు పొజ్జలున్నవాలేవా? మీవాడు మాయిండ్లకువచ్చి పాలు త్రాగుటకు ఇండ్లంతకలయ వెదికి అవి కనబడక పోవుటచే మాపిల్లల గిల్లుకొనుచు వచ్చెనమ్మా. ఓ తల్లీ! నిన్నమొన్నబుట్టిన మీపాపడు అప్పుడే దొంగతనము మరిగి మాయింట దొంగిలింప వచ్చియుట్టి పైయంత నందున లోళ్ళు పీటలు పేర్చివానిపై నెక్కి అప్పటికి చేతికందక పోవుటచే ఆయుట్టిలో నున్న కుండ క్రింద పెద్దతూటుచేసి కారుచున్న మీగడ పాలను చేతులనొడ్డి త్రాగెను. ఓ లతాంగీ! నీకొడుకు వీరింటి కాడుకొనుటకు పోయిపెరుగంతయు త్రాగి కొంత పెరుగు కోడలి మూతికి పూయగా కోడలే పెరుగు త్రాగినదని అదే పెరుగు దొంగయని అత్త కోడలినికొట్టినది. ఓ సతీమణీ! వారింటికి నీ కొడుకుపోయి కడవలలోని నెయ్యిత్రాగి వట్టికుండలు తెచ్చి వీరింట పెట్టగా వారికి వీరికి కొట్లాట జరిగెను. మావాడు మాయింటికివచ్చి దేవతల గోడవైపు జూచి మీరు దేవతలా నాకంటె దేవతలెవ్వరున్నారని పకపక నవ్వి ఆ గోడకెంగిలిరాచెను. ఓ చంద్రిముఖీ! నీ కొడుకు మాయింటిలో వెన్నతింటుండగా చూచి మాచిన్నదద్దు వచ్చి వెనుకకు వంచగా ఆమె చన్నులపట్టి గాయపరచెను. ఇతడు చిన్నవాడా? అమ్మా! యీమె వాకిటిలో తిరుగుచున్న మీ వానిని పిలిచి నీపేరు చెప్పుమని యడుగగా నీమొగపేరని గలచి పారిపోయెను. నీముద్దుల బిడ్డడు తక్కువవాడా? ఓ బాలికా! యింటివెనుక మాబిడ్డ నీళ్ళుపోసికొను చుండగా తనచేతిలందివచ్చి పడినదని మీవాడచ్చటికివచ్చి దానివలువ తీసికొని వచ్చినాడు ఇది న్యాయమా? ఓ సుదతీ! యీకాంతను జూచి ముచ్చటపడి నిన్నుతీసికొని పోయెదను నాతో వత్తువాయనెను. ఇది వింతగాలేదా? తల్లీ! ఒకామె కొడుకులులేరని బాధపడుచుండగా మీవాడా మెకడకేగి తన్నుమగనిగ చేసికొనినచో కొడుకులు పుట్టుదురని యామెపైన బడినాడు ఇవి చిన్నపిల్లల చేష్టలేనా? ఓ మృగాక్షీ! నేను దూరముగ నున్నాను తాకకుమని యీమె చెప్పగా ఆ తలగిన చోటేటో చెప్ప

మని మీవాడు తలయూపెను. ఇది తగునా? ఓ చంద్రవదనా మీవాడు మీద పడబోగా నేను చూలాలిని తప్పుకొనుమని యీామె చెప్పగా చూలగుటకు మూలమేదో చెప్పుమని యడిగెను. ఏ ఆడదియైనను చెప్పునా ఓ మగువా? మా మగవారటు పోవుటచూచి రహస్యము మాట్లాడవలె ననిపిలిచి నాపొత్తుకు రమ్మనమనెను. ఇట్టి పిల్లవానిని గూర్చి యెప్పుడైన వింటిమా! ఓ వెలదీ మావాడు నిద్రపోతుండగా మీవాడు వానిజుట్టుకు ఆవుతూడ తోకకు ముడివేసి దానిని వీధిలోనికి తరిమెను మీవాడెంత రాచబిడ్డడైనా యింతటి అఘాయిత్యము తగునా? మావాడు నిదురబోవుచుండగా వానినోట్లో జానెడు వెన్నదురిమినాడు వానికివ్వ చూపిరాడలేదు నామాట అబద్ధమేమో నీవేవచ్చి చూడుము. ఓ సాధ్వీ ఒకామె నిద్రపోవుచుండగా మీవాడామె చీరవిప్పి తేలునుదెచ్చి కుట్టింపగా నామె అబోరిబోమని పారిబోవగా జూచి కికకిక నవ్వినాడు ఇది మంచి పని యేనా? ఓ గుణవంతురాలా నాకొడుకు కోడలునే కాంతమున నుండగా మీవాడక్కడ పామునుదెచ్చి పడవేసినారు వివస్త్రలై పారిపోతుండగా కేకలు వేసెను. ఇది మంచిపనియేనా? ఒకకాంత పెరుగు చిలుకుచు వెన్నదీయుచుండగా మీవాడామె వెనుకగవచ్చి మగచేతలు చేయసాగినాడు ఇట్టివానిని బాగుపరచ వలదా? ఓ కలకంఠి మావాడలోని పడతులందఱము మీవాడు వచ్చునను భయముతో పాలుపెరుగుల నిండ్లలో పెట్టి మేమతని జాడకనిపెట్టు కొనియుండ ఎప్పుడెట్లు లోపల ప్రవేశించెనో వేసిన తాళములు వేసినట్లున్నవి. ఒకయింటిలో నాడును. ఒకయింట పాడును ఒకయింట నవ్వును ఒకయింట తిట్టును ఒకయింట వెక్కిరించును ఒకయింటిలో మృగములవలె పక్షులవలె శబ్దములు చేయును ఇట్లు చేసి యెక్కడకు పోవునో తెలియదు కనబడడు. కాని మావాడలోని యిండ్లలో గల పాలుపెరుగు వెన్న నేతి కడవలన్నియు వట్టిగా నుండును.

ఓ చంద్రముఖీ! ఎక్కువ సిరిసంపదలున్నచో బాగాతిని మంచిబట్టల కట్టు కొన్నరుదుగాని నవ్వుచూ కొడుకులను పేదలిండ్లపైబడి దోచుకొమ్మనను రాణు లుందురా? ఓ యమ్మ నీకుమారుడు మాయిండ్లలో పాలుపెరుగు దక్కనియ్యడు ఎక్కడికైన పోయిహాయిగా బ్రతుకుదుము. మా అన్నలతోడు గోవులతోడు అని బాలకృష్ణుడు పలువిధములసేయు వినోదములు తమపట్ల చూపించు ననుగ్రహ ములని తెలియక బాలుని నిందించు గోపికలకు యశోద యిట్లుచెప్పెను. అమ్మ లారా! గుణవంతులారా! మావాడు నన్నువిడిచి యెక్కడికిపోడు. బాగు

గిండ్లకు త్రోవవానికి తెలియదు. కండ్లు తెఱవని మాచిన్నికుమారుని యింత అవ్వపెట్టుట తగునా ఇతని కితరమేమియు తెలియదు. ఎప్పుడు ఇంటనే ఆడుకొనుచుండును. వీడు మంచివాడు ఇతనిపై నిందలు మోపుట మీకు తగునా అని యశోద గొల్లపడతుల నొదలించి పంపి తనకొడుకుపై కోపింపజాలకుండె.

కృష్ణుడు మట్టి తినుట.

ఇట్లు గొల్లభామలు తన వికారములను గూర్చి తనతల్లితో చెప్పుటవిని, భయపడి పరిశాంతునివలెను పరమసాధువువలెను అమాయకునివలె, భ్రమపడిన వానివలెను జడునివలెను చిన్నికృష్ణుడు తనకేమియు తెలియనట్లు తల్లి యొమ్మున తలమోపి యాడుచుండెను. అంతట నొకనాడు బలరాముడు మొదలగు గోపబాలురు కృష్ణుడు మన్నుతినెనని యశోదకు చెప్పగా నామె బాలుని చెయ్యిపట్టుకొని మన్నెందుకు తిందువు. నే చెప్పినట్లేల నడచుకొనవు మీ అన్నయు స్నేహితులు చెప్పిరికదా నాయనా తినుటకు మన్నెందుకు ? ఇతర పదార్థములులేవా అని పలుకగా ఘటికుడైన కొడుకు అమాయకురాలగు తనతల్లితో నిట్లనెను. అమ్మా ! నేను మన్నుతినుటకేమైన పసివాడనా ? లేక ఆకలిగొంటినా వెఱ్ఱివాడనా ? వీరిమాటలు నమ్మకుము నన్నుకొట్టించుటకై వీరిమాట నీతోకల్పించి చెప్పిరి. నామాటపై నీకు నమ్మకములేనిచో నానోటివాసన చూచి నేమన్ను తిన్నది నిజమని తోచినచో దండింపుము. అనిపలికి లీలాగోపాల బాలుడైన కృష్ణుడు తల్లిని యొదలించి నోరుతెఱచి ముఖము చూపగా ఆ యశోద చిన్ని బాలుని నోటిలో సముద్రములు, పర్వతములు, వనములు, భూగోళము, అగ్ని, సూర్యుడు, చంద్రుడు, దిక్పాలురతో నిండిన బ్రహ్మాండమును కనుగొని ఇది కలయా ? లేక వైష్ణవ మాయయా ? మఱే సంకల్పము కొఱకైనదా ? సత్యమా ? నేనూహింప లేకున్నానా ? నేను యశోద నేనా కాదా ! ఇది వ్రేపల్లెయా లేక మఱొక ప్రదేశమా ? ఇంతచిన్నివానినోట అంతటి బ్రహ్మాండమ్ము శోభిల్లుటకేమి కారణమో ! ఆలోచింపగా విచిత్రమయమెంతో వింతగనున్నది విలాసియగు నీబాలుని ముఖమందు విశ్వమంతయునెట్లు విలసిల్లును ఇతడు బాలునివలె ప్రవర్తించునే కాని నిజమున కితడు సర్వాత్ముడైన ఆదివిష్ణువే అని నిశ్చయించి ఎవనివలన నాకీ విశ్వరూపము కానబడెనో అట్టి మహాత్ముడు సకల లోకాధారుడైన విష్ణువునే సర్వాపదలు తొలగుట కాశ్రయింతును. నేను, నామగడు, ఆవులు గొల్లపల్లె గోపజనులు నితనివోట కవబడుచుండుటచే ఇతడు

మాకుప్రభువు ఇన్నిదినములనుండియు నీతని గుర్తింపలేకపోయితిమి. అని తన్ను గూర్చి పరమేశ్వరుడని తలచు యశోదలో వైష్ణవ మాయను కృష్ణుడు ప్రవేశపెట్టెను. అనిచెప్పిన శుకయోగీంద్రు మాటలువిని పరీక్షిన్నరేంద్రుడతనితో ఓ మహాత్మా! జగదీశ్వరునకు చన్నిచ్చు తల్లిగా పుట్టుటకు యశోదయు పుత్రుని వలె పోషించుటకు నందుడు నాపూర్వజన్మములందే నోమునోచిరి. అనినవిని శుకయోగి యిట్లనెను.

యశోదానందుల పూర్వజన్మవృత్తాంతము.

ఓ రాజేంద్రా వసువులలో ముఖ్యుడగు ద్రోణుడను వాడుండెను అతని భార్య ధర. బ్రహ్మవారిరువురిని భూమిపై జన్మింపుమని పంపగావారు బ్రహ్మతో మాకు విశ్వేశ్వరుడైన విష్ణుసేవచేసెడి భాగ్యము మాకిచ్చితివేని భూమిపై జన్మింతుమనిరి. అందులకు బ్రహ్మ అట్లేయగు గాకయని వారికి చెప్పెను. ఆ ద్రోణుడే నందుడుగా పుట్టెను. ధరయే యశోదగా పుట్టెను. విష్ణువు బ్రహ్మవాక్కుల మన్నించి నందయశోదల తలిదండ్రులుగా మన్నించెను. అంతనొకనాడు తన యింటిచుట్టు పరిక్కల బాలురందరు ఆయావనములకై పోగా యశోద కుదురుపై నొక పెరుగుకుండబెట్టి మీగడపెరుగుపోసి కవ్వపుత్రాటిని కవ్వమునకుచేర్చి కమలములవంటి యరచేతికాంతులతో కవ్వపుత్రాడు పగడపుతీగవలె మెఱయుచుండ త్రాడు లాగుచుండ పాలిండ్లు విడువడి యొకదాని నొకటి యొఱయుచుండగా పైటకొంగు జారగా కేశములు చిక్కువడుచుండగా చెమటతో ముఖము మంచుకప్పిన తామరవలె నుండగా, నడుము కదలింపగా, చేతిగాజులు మ్రోగగా, కొప్పువీడగా, ముద్దులకాంతులంతట ప్రసరింపగా బాలకృష్ణు నుద్దేశించి చెట్లు చిగురించునట్లు పాటపాడుచు పెరుగు చిలుకుచుండెను. ఆ సమయమున కృష్ణుడు చుట్టుతిరుచు పైబ్రాకుచు తప్పటడుగులు వేయుచు శబ్దించుచు అమ్మా రమ్ము పాలిమ్ము అనుచు గంతులు వేయుచువచ్చి కవ్వమును పట్టుకొనెను. కుమారుడు కవ్వము పట్టుకొనగా నవ్వుచు యశోదకృష్ణుని తన యొడిలో నరుండబెట్టుకొని తలనిమురుచు బాలునకు పాలిచ్చుచుండ పాలు పొంగుచుండుటను చూచి ఆమె వెంటనే వానిని పీటపై నరుండబెట్టి పాలు దించుటకేగగా బాలుడు కోపముతో కన్నీరుగార్చుచు వాడిరాతితో పెరుగు కుండను పగులగొట్టి కెంపుతో కడవలోని వెన్నదినెను. అంతలో యశోద పాలుదించివచ్చి పగిలినకుండ పెంకెలను చూచి తనకుంటరికొడుకు వెన్నదినెనని

తెలిసికొని నవ్వుచు యతనికి కనబడకుండపోయి యవతలి యింటిలోనున్న ఱోలును దిరుగవేసి దానిపై నెక్కి యుట్టి మీది వెన్నవొక కోతికిపెట్టుచుండు బాలుని చూచినది. వెంటనే పెలగోల తీసికొని కానీ కానీరా నేనెవరికి చిక్కను, నన్ను దండింపరు నన్నెవ్వరడ్డగింపరని నీవిచ్చ వచ్చినట్లు తిరుగుచున్నావు కదూ! నీకు నేనంటె లెక్కలేదు. అని యదలించుచు యశోద తనలో ఇతడు బాలుడను కొందునా పెద్దవారికి కూడయిట్టి ఆలోచనలురావు. వీనిభయపెట్టుదునా ఒక్కగా నొక్కకొడుకు పోనీ మంచిమాటలతో చెప్పుదునా, తన ఆలోచన, తనదేకాని మఱెవరిమాట వినడు. పోనీ యెప్పుడు నింటిలోనే ఉందునా అట్లుగాక వీడు చూడని చోటులేదు. వీడు, పిలిచినచో పరుగెత్తును భయపెట్టినను భయపడడు ఊరకుండినచో ఎగతాళి చేయును వీనిని శిక్షించుటెట్లు.

"బాలురను లాలించినచో బహుదోషములు కలుగును. వారిని దండించినచో
పెక్కుగుణములు లభించును. కావున బాలురను దండించుటయే మంచిది''.

అని నిశ్చయించి చేతికఱ్ఱతో బెదరించి నిలునిలుమని యదలించుచు తన్ను తల్లి సమీపింపగా భయపడినట్లు ఱోలుదిగి గజ్జెలు గల్లని మ్రోయగా గోపికలు చూచి నవ్వుచుండగా తల్లి తనవెంటపడగా చిక్కకుండ పారిపోయెను. అప్పుడు యశోద స్తనభారముచే నలసి, కృశించి వణకుచున్న నడుముతో చెమట పట్టిన దేహముతో వీడినకొప్పుతో జారుచున్న పైటతో వానిని కలుసుకొనునట్లు పరుగెత్తి స్తంభములు చాటైన దాగిపట్టుకొనుట కవకాశ మివ్వలేదు. అమ్మా ఈ సారి నా తప్పు మన్నింపుము నేనింక దొంగతనము చేయనని ముందుకు ముందే ఏడ్చుచున్నాడు. కనుల కాటుక చెదరగా కన్నులు నులుముకొనుచు కన్నీటితో వెక్కివెక్కి యేడ్చుచున్నాడు. అమ్మ ఏవైపునుండి వచ్చునో అని క్రీగంట చూచుచున్నాడు అట్టివానిని తన చిన్నిపట్టిని యశోద పట్టుకొని భయపెట్టుచు చిన్నివెన్నదొంగ చిక్కెనని కొట్టుటకు చేతులురాక బాలుని కట్టివేయదలచి ఓ కృష్ణులు గారా పాపం వీరికి వెన్నపేరే తెలియదట దొంగతనము తెలియనే తెలియదట, పట్టుకొనినను పట్టుబడవని నిన్నందురు నేను పట్టులట్టి పట్టుకొందును నాకు చిక్కకుండ పారిపోదువూ ఎక్కడెక్కడనో తిరిగెదవు. ఒకచోట బుద్ధిగా నిలుకడగా నుండవు. నీకొక అడ్డమా అజ్ఞాపట్టించుకొనక పోయినచో అన్ని దారులు నీవే నీళ్ళంచే నీకు భయములేదు. గట్టులను పెకలింతువు నిప్పుతో చెలగాటమాడెదవు. పెద్ద స్తంభములుపట్టి యూపుదువు. ఇతరులను చిన్నచిన్న

వానికై దేవురింతువు ఎక్కడికి పోయినను అవ్వదెచ్చి పెట్టుదువు. నీళ్ళకడ్డు కట్టకట్టెదవు, ముసలిపై పారెదవు ఒంటిపై గుడ్డలేకుండగనే యూరంత తిరిగెదవు నిన్నొంచుట నాకు తెలియదనో, తెలిసినను నిన్నులొంగదీయ లేననియో క్రిందు మీదు తెలియక యిట్టియల్లరి పనులు చేసెదవు. ఇట్టిదుడుకు పనులెందుకు చేసెదవురా నాయనా అని యశోద వానిగుట్టు పనులనన్నిటి బయటపెట్టి నవనీత చోరుడు ప్రియవాత్సల్యుడు నగు గోపాలుని రోలికి గట్టివేసెను. భక్తపరతంత్రుడైన ఆ బాలుడు కట్టుకొయ్యకు కట్టుబడిన గున్నేనుగువలె రోలను కట్టుబడెను. ఆది మధ్యాంత రహితుడైన ఇంటా బయటను కట్టుబడని యాబాలుడు భక్తురాలగు యశోదకు పట్టుబడెను. తన చిన్నిపట్టి సామాన్య బాలుడని తలచి యశోద కట్టివేసినది. బ్రహ్మాండములను తనపొట్టలో నిమిడించుకొను వాడితడని తెలిసినచో తల్లి యతనినేల కట్టును? యశోద బాలుని కట్టుట కొకత్రాడు చుట్టగానది రెండంగుళములు తక్కువయ్యెను. ఇంకొక త్రాడు తెచ్చిచుట్టగా అదియు రెండంగుళములు తక్కువైనది. సర్వులను బంధవిముక్తులను చేయువాడు బంధనములకు లొంగునా? అంత కృష్ణుడు తన్ను బంధించుటకు తల్లిపడు, పలుపాట్లను తెలిసికొని తల్లి కట్టిన కట్లకు కట్టుబడెను.

"శ్రీనాథుడు భక్తులకు బద్ధుడైనట్లు జ్ఞానుల జ్ఞానమునకు గాని యోగుల యోగమునకు గాని దాసుల దాస్యమునకు గాని బద్ధుడుకాడు.

పిమ్మట, యశోద ఇంటి పనులలో దిరుగుచుండ కృష్ణుడు నారదుని శాపముచే రెండు మద్దిచెట్లుగనున్న నలకూబర మణిగ్రీవులను యక్షుల నిద్ధరిని చూచి రోలు నీడ్చుకొనుచు పోయెను. అనగావిని పరీక్షిత్తు శుకయోగితో ఓ యోగీంద్రా! నారదుడు వారినెందుకు శపించెను? ఆ యక్షులు మద్దిచెట్లగుట కేమి కారణము తెలియ చెప్పుమని యడిగెను.

కుబేరుని కుమారులగు నలకూబర మణిగ్రీవులనువారు శంకర భక్తులమనెడి యహంకారముతో కైలాస పర్వతమునందలి పూలతోటలోని గంధర్వ కాంతలతో కలిసి గంగా తరంగములందు క్రీడించుచుండగా నారదుడటు వచ్చెను. ఆ స్త్రీలు నారదుని జూచి వెంటనే తమ వస్త్రములను కట్టుకొనిరి. మదిరను సేవించి పరవశులైన కుబేర పుత్రులిద్దఱు దిసమొలతో నుండిరి. వారిని జూచి నారదుడు వారిని శపింపదలచి యీ గీతము పాడెను.

శా॥ సంపన్నుం డొరుఁ గానలేఁడు తనువున్ సంసారమున్ నమ్మి హిం
సింపం జూచు దరిద్రుఁ డెత్తువడి శుష్కీభూతుఁడై చిక్కి హిం
సింపం డన్యుల నాత్మకున్ సములుగాఁ జింతించు నట్లౌటఁ ద
త్సంపన్నాంధుల కంజనంబు విమలీదారిద్ర్య మూహింపగన్.

అనిపాడి తనమనస్సున వీరు మేము సంపన్నుల కొడుకులమని తరుణులతోఁగూడి వీరు తమ్ములనుకూడ చూడ జాలకున్నారు. వీరి గర్వమడగించి జ్ఞానులలో కలుపుట మంచిది. అని యాలోచించి విజ్ఞాన విశారదుడైన నారదుడు నలకూబర మణిగ్రీవులను జూచి మీరు శ్రీమదాంధులు కావున భూలోకమున మద్దిచెట్లవలె నూరు దివ్యవర్షములుండుడు. ఆ పిమ్మట నారాయణుని చరణారవింద సంస్పర్శచే ముక్తులై నారాయణ భక్తులై పరమసాధువులై దేవలోకమున కేగెదరు. అని నారదుడు నారాయణాశ్రమమునకు పోయెను. ఇప్పుడు నూరు దివ్యవర్ష వర్షములు ముగిసినవి. నారదుని పలుకుల విని యశోద ముద్దులపట్టి, జంటమద్దుల గూల్పదలచి యామళిమద్దులున్నచోటి పడిపడిగ రోలు నీడ్చుకొనుచు పోయెను. తన నడిమి కాంచితో రోలు నీడ్చుకొనుచు రాగా అది అడ్డము తిరుగగా తాను మద్దిచెట్ల నడుమనుంచివచ్చి ముందుకు ముందు నీడ్చుచు సాగెను. అంత ఆ మద్దిచెట్లు రెండు కొమ్మలు విరిగి వేళ్ళతోపాటు ఫెళఫెళ మనికూలెను. ఇట్లు పడిపోయిన చెట్లనుండి అగ్నిజ్వాలలు వెల్వడినట్లు దివ్య తేజముతో దిక్కులు మెఱయునట్లు ఆ యక్షులు వెడలివచ్చి భక్తపాలకుడైన బాలునకు మ్రొక్కి లేచి చేతులు జోడించి శ్రీకృష్ణునిట్లు ప్రార్థించిరి. కృష్ణా నీవు బాలుడవా కావు పరమాత్ముడవు యోగివి. ఆది పురుషుడవు యీ విశ్వమంతయు నీ లీలారూపమే నీవే సర్వభూతముల ప్రాణేంద్రియముల కధిపతివి ప్రకృతి, మహత్తును నీవే గుణవికారములులేని పూర్వసిద్ధుడవు నీవు. ఓ అఖిలేశ్వరా నీవు సకల భువనములను సృష్టించుటకు పోషించుటకు అవతరించితివి. మేము నారదశాపవశమున నిమ్ము చూడగంటిమి మమ్ము దయతో ననుగ్రహింపుము.

శా॥ నీపద్యావళులాలకించు చెవులున్ నిన్నాడు వాక్యంబులున్
నీపేరంబనిసేయు హస్తయుగముల్ నీమూర్తిపైఁ జూపులున్
నీపాదంబులపొంత మ్రొక్కుశిరముల్ నీసేవపైఁ జిత్తముల్
నీపైఁ బుద్ధులు మాకునిమ్ముకరుణన్ నీరేజపత్రేక్షణా!

అని ప్రస్తుతించిన ఆ యక్షసోదరుల నుద్దేశించి హరియిట్లనెను.

> "తమ తమ ధర్మముల పాలించుచు సమభావముతో నన్ను సన్నుతించు సద్భక్తులకు సూర్యుడు దయించగనే చీకటి యడగునట్లు నన్నుచూడగనే వారికి బంధవిముక్తి కలుగును.

నారదుని వచనములవలన మీకు నన్ను దర్శించినంతనే మీరు జ్ఞానులైతిరి. మీకు నాపై భక్తిసిద్ధించినది మీమీ నెలవులకు పొండు. అని యానతివ్వగా వారు మహో ప్రసాదమని ప్రదక్షిణముచేసి నమస్కరించి యుత్తర దిశకేగిరి. పిమ్మట నందాదులు పెద్ద చప్పుడుతో వ్రేళ్ళతో పడిపోయిన చెట్లచప్పుడు విని పిడుగు చప్పుడని సందేహించి వచ్చిచూచి యీ మద్దిచెట్లు గూలగా రోటికి గట్టుబడిన కృష్ణుడు ఏ విధముగ బ్రతికెనో చూచితిరా? ఇతడేమియు నెఱుగడు ఇతడెంతటి వెఱ్ఱివాడో గాలిలేదు గాన పిడుగుపడదు. చెట్ల నెవ్వరు నరకలేదు. ఇతడు చెట్లను పడవేయలేదు. ఈ భూమిపై చెట్లేవిధముగ పడెను వసుదేవుడు చెప్పిన యుత్పాతము లిట్టివేనేమో అని నందుడు తలచుచుండ అక్కడ నున్న బాలకులు నందపుత్రుడీ చెట్లసందునదూరి, అడ్డముగా పడియుండిన రోలును ముందు కీడ్వగా మద్దులు కూలినవి. యిద్దరు పురుషులు మాకు కన్పించిరి. కాని వారి మాటలను కొందరు నమ్మలేదు. కొందరు సందేహించిరి. అంత నందుడు సంతోషముతో కృష్ణుని బంధనముల తొలగించెను. ఆ పిమ్మట బాలకృష్ణుడు తానేమియు నెఱుగనట్లు గోపికలు చప్పట్లు చరచుచుండ పాడెను. చేతుల త్రిప్పుచు యంత్రమువలె ఆడెను. చూచుటెఱుగనివాలె బాలురను చూచి నవ్వును. బాలురతో కూడెను. పెద్దలు చెప్పిన పనులు చేయబోయెను మట్టితో నాడెను. కృష్ణుడు తన తల్లియగు యశోదతో అమ్మా పాలుత్రాగితే జుట్టు పెరుగునని చెప్పితివి. పాలుత్రాగుచున్నను నాజుట్టు పెరుగలేదు, చూడుమని జుట్టుచూపెను. తనచేత నెలగోలపట్టుకొని నీటికడవలో తన నీడజూచి అమ్మా ఈ నెలగోల బాలుడు నన్నుకొట్టుటకై వచ్చెను చూడుమని తల్లికిచూపెను. తల్లి కృష్ణునితో బిచ్చగాళ్ళు పిల్లలను పట్టుకొని పోదురని చెప్పియుండుటచే బిచ్చగాళ్ళు వచ్చినపుడు వారిని జూచి తల్లిని జూచి భయపడును.

నందాదులు బృందావనమునకు పోవుట.

ఒకనాడు నందుడు మొదలగువారు గోకులమున సంభవించిన ఉత్పాతములను కృష్ణుడు వానినుండి గట్టెక్కుటయు చూచి విచారించుచుండగా ఉపనందుడను

గోపవృద్ధుడు వారితో నిట్లనెను. ఇక్కడ మనుషులుండరాదు. కృష్ణునకు కీడు కల్గించుటకు రక్కసివచ్చి పాలిచ్చెను. సుడిగాలి ఆకాశ్శపై బడవేసెను. చెట్లుకూలెను. కేశవుని కృపచే ఆపదలు తప్పినవి. ఓ గోపకులారా! మనము మరొక చోటికి పోవలెను. మనము బృందావనమునకు పోయియచ్చట నుందము. అచట పచ్చిక కలదు గోవులకు మేత నిండుగా దొరుకును. కొండలు, నదులు, చెట్లు, తీగలు అచట నున్నందున మన కాపురమున కాప్రదేశము తగినది. అతని పలుకుల కచ్చటి పెద్దలు సంతసించిరి. ఆలమందలు ముందునడవ బాలవృద్ధుల తేరులా మీదట నడువ విల్లంబుల బూని కవచధారులైన గొల్లలా వెనుక నడచిరి. మంగళవాద్యములు మ్రోయగా, పురోహితులతోపాటు గొల్లలు పావనమైన బృందావనమున కేగిరి. గొల్లభామలు స్నానముచేసి శుభ్రవస్త్రముల ధరించి చంపకమాలల కొప్పులందు తురిమి హరిలీలలను పాడుచు తేరుల నెక్కి పోయిరి. రోహిణీ యశోదలు రామకృష్ణులతోపాటు ఒకే రథముపై కూర్చుండి వారి వినోదముల కానందించుచు బృందావనమున కేగి యచ్చట నివసించిరి. రామకృష్ణులు పరమపావనము, కాళిందీ జలభరితము మునీంద్ర బృందమును కాపాడెడి బృందావనమును చూచి సంతసించిరి. అంత రామకృష్ణులు తమ యీడు గోపబాలురతో కలిసి వివిధరూపము ల పిల్లన గ్రోవుల నూదుచు గంతులు వేసిరి. గొంగళ్ళు గప్పుకొని యాలోతు లాటలాడుచు కుమ్ములాడిరి. గజ్జెలు మ్రోగుచుండగా కాళ్ళతో తీగలతెంచిరి. వంకెము వేసికొని వండ్లుగోసివానితో నొకరి నొకరు కొట్టుకొనిరి. అడవి జంతువులను అట్టియరవులతో వంచించి పట్టిరి. పొదలలో దూరిరి కొలకులలో దిగి జలకములాడిరి. బండలపై నుండి దూకిరి. అన్ని ఆటలలో మేటులనిపించుకొనిరి.

ఒకనాడొక రక్కసుడు యమునాతీరమున రామకృష్ణులు గోపబాలురతో కలిసి యాలమేపు సమయమున దూడరూపున వారిని హింసింపదలచి.

వ త్స క బ కా సు రు లు.

దూడల యత్తిరుల నాకుచు దూడలలో నెల్లనిదియే మంచిదూడయని కనిపించు నటుల వత్సకాసురుడు సంచరించుట చూచి కృష్ణుడా రహస్యమును రామునకు చెప్పి ఇది మంచిదూడ ఎంతో బాగున్నది. అనిదాని కాళ్ళతోకపట్టుకొని గిరగిర త్రిప్పి మర్దిచెట్టు కేసిబాది చంపగా గోపబాలురెల్లరు కోయని గోలపెట్టిరి. గోపబాలురు సంతోషము పట్టలేక తమ గొంగళ్ళు నెగురవేసి, చంగున నెగిరి

చప్పటుల చరచుచు కృష్ణుని పొగడిరి. దేవతలు దివినుండి పూలవాన గురిపించిరి. లోకమును తనబిడ్డలవలె కాపాడబూనుచు వాత్సల్యముతోనుండి దూడల మేపుచున్న భక్తవత్సలుడు వత్సకాసురుని వధించెను. ఒకనాడు గోపబాలురు దూడల దోలుకొని యడవికేగి వానినిమేపి, యెండవేడిమిచే కల్గిన దప్పిని తీర్చుకొనుటకై యొక కొలనికేగి దూడలకు నీరుత్రావించి, తాము నీరుద్రాగి వచ్చునపుడు వజ్రపు దెబ్బచే కూలిన కైలాసశిఖర మనవొప్పుచు భీతిగొల్పు కన్నులుగల్గి వారిని హింసింప వచ్చిన ఒక పెద్దకొంగను జూచిరి. దాని పొడగని కలవరపడిరి. ఆ బకాసురు డితరచింతలమాని, తదేక ధ్యానముతో కృష్ణునిపై దృష్టినిల్పి యోగివలె నుండెను. ఆ బకము కృష్ణుని చూడగనే ముక్కుగరటి రెక్కలల్లార్చి కాళ్ళెత్తి కుప్పించి మింటికెగిసి భయంకరముగ నార్చుచు విజృంభించి రెక్కల గాలిచే చెట్లుకూలి పడిపోగా కృష్ణునిపట్టి యొక్క పట్టున మ్రింగెను. అది చూచి బలరాముడు మొదలగు గోపబాలురు స్తంభించి పోయిరి. కృష్ణుడు మ్రింగుడు పడిలోనికిబోక కంఠసమీపమునందలి దౌడలయందలి యెముకల కదలించుచు కాలాగ్నివలె మ్రింగుటకు వీలుగాక నోటికిముడక వెక్కసమైన బాలకృష్ణుని జూచి యితనిని మ్రింగ వీలుకాదు వీడెక్కడి బాలుడని యతని చెప్పుచు నతని వెడల గ్రక్కెను. కృష్ణుడు బయటికి వచ్చుటతో లోకమంతయు సంతసించెను. బకుడుకృష్ణుని వెడలగ్రక్కి ముక్కుతో తన్నుపొడుచుటకు రాగాకృష్ణుడు దాని చంచుపుటములబట్టి రెండుగా చీల్చివైచెను అంత దేవతలు నందనందనునిపై పుష్పముల వర్షించిరి. దేవదుందుభులు మ్రోగినవి. బలరామాదులకు ప్రాణములు లేచివచ్చినట్లైనది. వారు కృష్ణుని రమ్మని కౌగిలించుకొని తమ తమ దూడలతో మందకు తిరిగివచ్చిరి. పిమ్మట గోప బాలురు తమ వారికి యమునాతీరమున జరిగిన వృత్తాంతము చెప్పగా వారు తమలో తామిట్లనుకొనిరి. ఈ బాలునిపై ఒకదాని వెనుకయొక ఆపదవచ్చిపడు చున్నది కాని యతనిపైబడిన దుర్మార్గులు అగ్నిపై దూకిన మిడుతలవలె మాడి మసియై పోయిరి.

ఆ రామకృష్ణులు దూడల మేపుసమయమున మనము కోతులమై వారధికట్టుద మని కాల్వల కడ్డగోడల కట్టిరి. మునులమై తపము చేయుదమని మౌనమును పాటించిరి మనము గంధర్వులమై పాడుదమని పాటలపాడిరి. అప్సరలమై యాడుద మని యాటలాడిరి. దేవదానవులమై సముద్రమును మథింతమని బావులదండ ములతో పలోవరముల సంక్షోభింపజేసిరి.



తనను జంప యత్నించిన బకాసురుని శ్రీకృష్ణుడు చీల్చి చంపుట. పుట. 449

కృష్ణుడు, గోపబాలురు.

ఒకనాడు రామకృష్ణులు, గోపబాలురు వనమున చలుదు లారగించుటకై ప్రొద్దుపనేలేచి, లేగదూడలలేపి, కొమ్ములు నూది చలిది కావళ్ళను వీపున మోయుచు, సిద్ధపరచిన కజ్జికాయల కట్టికొని, కవచముల ధరించి బెత్తముల పట్టుకొని, మణిభూషణములున్నను పూలను చిగురుటాకులను సొమ్ములుగా ధరించి కొమ్ములను, వేణువుల నూదుచు, తుమ్మెదలతో కూడిపాడుచు నెమళ్ళతో కలిసియాడుచు, కోయిలలతో కలిసి కూయుచు చిలుకలతో కలిసి రొదసేయుచు, పొదరులలో దూరుచు వాగులదాటుచు హంసలతో కూడి నడచుచు కొంగలతో కూడి నిలుచుచు తామరపూలకోసి సింగారించుకొనుచు నదీజలములలో నీదుచు తీగల యుయ్యాల లూగుచు పల్లములలో దాగుచు దూర ప్రాంతముల కేగుచు, కోతులతోపాటు చెట్లనెక్కుచు ఫలముల మెక్కుచు పలరసము త్రాగుచు మింటికి నిక్కుచు నీడలు చూచి నవ్వుచు కయ్యములకు కాలు సాచుచు వ్రాలుచు సోలుచు పలువిధముల శరీరవికారముల సేయుచుండిరి.

ఒకని చల్దికావడిని మఱియొకడు దాచి యుంచగా మఱియొకడు దానిని తెచ్చి యిచ్చుచుండెను. ఒకడు ఏమరపాటున పోవుచుండ మఱియొకడు బొబ్బ పెట్టివానిని భయపెట్టెను. ఒకడు తటాలున సాటివాని పైబడి వాని కన్నుల మూయును. ఒకని చేతిలోని కజ్జము నొకడు తీసికొని పారిపోయి దూడలలో దూరి తినును. కృష్ణుడు ముందు పోవుచుండగా అతనిని కూడ ముట్టుదునని పరుగిడిపోయి ముట్టుకొనినవాడు తక్కిన వారిని గేలిచేయును. యోగులుకూడ యెవని పాదధూళిని చూడలేరో అట్టి కృష్ణునితో కలిసి, కూడి, మాటలాడి పరిహాసములాడి యతని తన్నుచు గుద్దుచు నతనితో కలిసి నవ్వుచు నతనిపైన బడుచు నతని మన్నించు గోపబాలుర భాగ్యము నేమని వర్ణింపగలము! భక్తులకు దైవమై యోగులకు బ్రహ్మానంద స్వరూపుడై ప్రేపల్లెలో బాలుడై యొప్పు హరి పొందు బడసిన గొల్లబాలు రెంతటి పుణ్యము చేసిరో! వారా వనముల విహరించుచుండగా అఘుడను దుష్టరాక్షసుడు కంసుని పంపున బృందావనమునకు వచ్చి, తన తమ్ముడైన బకాసురుని చంపినందులకు కృష్ణునిపై పగబూని కృష్ణుని చంపినచో గోపబాలురెల్ల చనిపోదురని తలచి ఒకకొండ చిలువ రూపుధరించి కొండంత పొడవుతో పర్వత శిఖరములవంటి కోరలతో నల్లని మేఘములవంటి పెదవులు బిలములవంటి యిగుళ్ళ సందులు, కటిక చీకటి క్రిమ్మిన ముఖాంత

భాగము దావాగ్ని జ్వాలలవలె భయంకరమైన చూపులు సెగల వెదజల్లు ఉచ్ఛ్వాస నిశ్వాసములు మెఱయగా నేలపై నాలుకలు పఱచుకొని భయంకరాకారముతో ఆకొండ చిలువ రామకృష్ణులతోపాటు గోపబాలుర మ్రింగదలచి దారిలో పడియుండెను. అప్పుడు గోపబాలురు భయంకరమైన కొండ చిలువ మనలహింసింప సాగి పడియున్నదని యొకరికొకరు చూపుచు మనకేమి భయమురా? బకుని చంపిన కృష్ణుడు మనకండగా నున్నాడు. అది కృష్ణుని మ్రింగెనా దానికిని బకుని గతి తప్పదు. అనుచు నుత్సాహముతో దాని ముందు కేగగా అది వారిని మ్రింగెను. లేగల మ్రింగెను. హరి తన మనస్సులో "ఈ బాలకులు, పాము రాక్షసుడని తెలిసికొనక నేను, తమ కండగా నుండగలనని నిర్భయముగ దాని నెదుర్కొనిరి. దూడలతోపాటు దానినోట ప్రవేశించిరి. తాను బృందావనమునకు తిరిగి పోయినపుడు "మాదూడ లేమైనవి? మాపిల్ల లేమైరి" అని గొల్ల లడిగినచో నేనేమి చెప్పుదును. విధిఘటన యిట్లున్నది. కానిమ్ము వీరిని రక్షించుట పామును శిక్షించుట తన కర్తవ్యమని తలచి, తాను పాము గొంతులో దూరి తన శరీరమును పెంచెను. కృష్ణుడు పామునోట ప్రవేశించుట చూచి దేవతలు భయపడిరి. కృష్ణుడు తన శరీరము పెంచుటతో పామునకు ఊపిరాడ లేదు. తల్లక్రిందులు కొట్టుకొన్నది దాని ప్రాణములు గిలగిలకొట్టుకొని పైపైన నెగిరిపోయినవి. కృష్ణుడు వారిని, దూడలను దయామృత దృష్టితో చూచి గోపబాలురతో లేగలతోపాటు తాను మేఘముల చాటునుండి తారలతో పాటు బయటపడిన చంద్రునివలె దాని నోటినుండి వచ్చెను. ఆ పాము దేహము నుండి ఒక దివ్యతేజము వచ్చి కృష్ణుని దేహమున ప్రవేశించెను. దేవతలు పూల వానకురిపించిరి. గంధర్వులు పాడిరి. అచ్చరలాడిరి. హరి తనరూపము నొక్కసారి మనస్సున తలంచినను ఎంతటి పాపాత్మునినైనను తనలో ప్రవేశింప చేసికొనును. అట్టిహరి తన్ను మ్రింగిన అజగరరూపుడైన అఘాసురుని తనలో ప్రవేశింపచేసి కొనుటలో ఆశ్చర్యమేమున్నది. దేవదుందుభుల మ్రోతను దేవతలు గావించిన జయజయ నినాదముల విని బ్రహ్మసంతసముతో భూమికివచ్చి యీ గోపాల బాలుడు పాము మ్రింగిన గోపబాలురను, లేగలను ఎట్లు బ్రతికించెనా? యని ఆశ్చర్యపడెను. ఆ అఘాసురుని (కొండ చిలువ) దేహము చాల కాలము గోపబాలురకు క్రీడా బిలముగ నుండెను. శ్రీకృష్ణుడు తన ఐదవయేట సలిపిన అఘాసుర వధ గోపబాలుర కాఱవయేట తెలిసినదని శుక యోగీంద్రుడు చెప్పగా

పరీక్షిత్తు అయ్యా! ఇది మిక్కిలి వింతగ నున్నది. నిరుడు జరిగిన పని యీనాటి దని యెట్లు తలంచిరి? దయచేసి వివరింపు మనగా, శుకయోగి :-

ప్రియురాలి వలన వార్తలు
ప్రియజనులకు నెల్లప్రొద్దు ప్రియమగు కరణిన్
ప్రియుడగు హరిచరితంబులు
ప్రియశక్తుల కెల్ల నెపుడుఁ బ్రియములు కావే.

అని రాజేంద్రా! ఇది పరమ రహస్యము చెప్పెద వినుము. కృష్ణు డఘాసురుని చంపి లేగదూడలను గోపబాలురను రక్షించిన పిమ్మట కృష్ణుడొక సరోవరమును జూచెను. అందలి నీరు స్వచ్ఛముగ నుండెను. అది మిక్కిలి లోతైనది. పద్మములు కలువలు మున్నగు పువ్వులలోని తేనెల త్రాగి తుమ్మెదలు ఝుంకారము చేయుచుండెను. ఎత్తుగలేచు అలలపై పక్షులుయ్యాలలూగుచు కోలాహలము చేయుచుండెను. గాలికి నీటి తుంపురు లెగురుచుండెను. ఆ సరోవరమును చూచి కృష్ణుడు గోపబాలురతో బాలకులారా! పాపము మీరు ఎండ కెండితిరి. ఆకలితో బాధపడు చుంటిరి. ఇది చాల మంచి ప్రదేశము. ఇచ్చట చల్దుల తిందము. లేగలు నీరు త్రాగి పచ్చిక మేయుచు తిరుగుచుండును మనమానందముగ భుజింతము రమ్మని పిలిచెను. కృష్ణుని చుట్టు గోపబాలురు కూర్చుండి యుండిరి. వారందరు తామరపూ రేకులవలెను వారిమధ్య నున్నకృష్ణుడు గద్దెవలె నుండెను. గోపబాలురు రాలు, తీగలు చిక్కములు ఆకులు పువ్వులు మొదలగు వానిని కంచములుగా చేసికొని చల్దులు తినుచుండిరి.

మాటిమాటికి వ్రేలు మడిచి యూరించుచు
  నూరుగాయల దినుచుండు నొక్క
డొకని కంచములోని దొడిసి చయ్యన మ్రింగి
  చూడలేదని నోరు మూయు నొక్కఁ
డేగురార్గురు చల్దులెలమి నన్నిదమాడి
  కూర్కొని కూర్కొని కుడుచు నొక్కఁ
డిన్నియుండగ బంతియిడుట నెచ్చెలి తన
  మనుచు బంతెన గుండులాడు నొకఁడు
ఆ కృష్ణుఁజూడు మనుచు గికురించి పరుప్రెమోల
మేలి రక్ష్యరాశి మెసగు నొకఁడు
నవ్వునొకఁడు సఖుల నవ్వించు నొక్కఁడు
ముచ్చటాడు నొకఁడు మురియు నొకఁడు.

అప్పుడు కృష్ణుడు నడుమునకు గట్టిగా బిగించుకొనిన వస్త్రములో పిల్లనగ్రోవి దూర్చి, బూరను, ములుగఱ్ఱను ఎడమ చంకకు తగిలించుకొని కుడిచేతిలో మీగడ గారు పెరుగు ముద్దనుంచుకొని వ్రేళ్ళసందున ఊరుగాయలు వెలయు చుండగా చెలులతో నడుమ చక్కగా కూర్చుండి తియ్యని పలుకుల పలుకుచు నవ్వుచు యాగభోక్తయైన తాను దేవతలు చూచి యాశ్చర్యము పొందుచుండ గొల్ల బాలురతో కలిసి చల్దులారగించుచుండెను. అంతలో బ్రహ్మవచ్చి యీ కృష్ణుడు అఘాసురుడు మ్రింగిన గోపకులను లేగలనెట్లు రక్షించెను? ఈ మాయా బాలుని బలమెట్టిదో వైభవమెట్టిదో పరీక్షింతునని మైదానమున పచ్చికలు మేయుచున్న లేగలనన్నిటిని తన మాయచే నొకచోట దాచియుంచెను. గోప బాలకులు తమకు కన్పించకుండ దూరముగ బోయిన లేగలకై దిగులుపడు చుండగా కృష్ణుడు వారితో బాలులారా! మన లేగల డవిలో పచ్చిక మేయు నుత్సాహముతో చాల దూరమున కేగినవి అవి యెక్కడికి పోయెనో యేమైనవో యేమెకముల పాలబడెనో చూచి వానిని మరలించుకొని యిప్పుడే వత్తును. మీరు చద్దితిను చుండుడని వారికి ధైర్యము చెప్పితాను చెవులవరకు వ్రేలాడు జంపాలతో మెడలో వెలుగు కంబె దండలతో బంగరువలె మెఱయు వేత్ర దండముతో నెమిలి పింఛముతో చేతిలోనున్న పెరుగు ముద్దతో ఉత్సాహముగ అడవిలో దూర దూర ప్రాంతములకేగి పొదలలో కొండలలో కోనలలో నదులలో సరోవరములలో దూడలకై గాలించెను. కాని లేగలజాడ తెలియలేదు. కృష్ణుడు తన చెలులు చద్దిగుడుచుచున్న సరోవరము వద్దకు వచ్చి చూడగా అచట చద్దు లారగించు గోపబాలురు కూడ కనపడలేదు. వెంటనే విశ్వవిదుడైన గోవిందుడు ఇది యంతయు బ్రహ్మచేసిన దావరికమని తలచి తానే లేగల రూపములను గోప బాలుర రూపములను దాల్చెను.

మ॥ కరముల్ పాదములున్ శిరంబు లవలగ్నంబుల్ ముఖంబుల్ భుజాం
తరముల్ ముక్కులు కన్నులున్ శ్రవణముల్ దంతాదులున్ దండకాం
బరస్రగ్వేణు విషాణ భూషణ వయోభాషాగుణాఖ్యానత
త్పరతన్ వీడ్వడకుండఁ దాల్చె విభుఁడా వత్సార్భకాకారముల్.

ఇట్లు శ్రీకృష్ణుడు, బ్రహ్మ తనమాయచే లేగల - గోపకులను దాచగా లేగల గోపాలకుల రూపురేకలు వస్త్రభూషణాదులే మాత్రము పొల్లుపోనివ్వక ఆయా రూపముల తానే దాల్చి బృందావనికేతెంచెను. ఆ గోప - బాలురు వేణువుల

సూర్యగా వారి వారి తల్లులు ప్రేమతో వచ్చి తమ - తమ కుమారుల గాంచి యెప్పటికంటె నెక్కువ సంతసించిరి. ఆ వేణునాదమునకు చనులు చేపగా పరమానందముతో తమ పిల్లలకు పాలిచ్చిరి. లేగలఁజూచి గోవులానందముతో నెదురేగి వానికి పాలిచ్చినవి. బృందావనము నందలి గోపికలకు గోవులకును తమ సంతతిపై మక్కువ నెక్కువయ్యెను. గోపికలు తమ కుమారులకు నిత్యము నలుగుపెట్టి స్నానముల చేయించి, గంధముల బూసి, మంచి గుడ్డలు కట్టించి నొసటిపై రక్షాతిలకముపెట్టి, పిండివంటలతో భోజనము పెట్టుచుండిరి. గొల్లభామలకు తమ శిశువులను చూడగా కృష్ణుని చూచినంత సంతోషము కల్గుచుండెను. లేగలపై గోవులకు కూడ నానాటికి వాత్సల్యమధికమగుచుండెను. కృష్ణుడీ విధమున ప్రతి నిత్యము లేగలను, గోపబాలురను వనములకు తోడ్కొని పోవుచు సాయంత్రమునకు తిరిగివచ్చుచు నెప్పటివలె నియమము తప్పక రాకపోకల సాగించుచుండెను. ఇట్లు కృష్ణుడు బాల - వత్సరూపముల ధరించి తన్నుతాను రక్షించుకొనుచు మహామహిమతో ఒక సంవత్సరము క్రీడించెను.

సంవత్సరము ముగియుటకు ఐదారు రోజులు తక్కువగా నుండెను. ఒకనాడు బలరామకృష్ణులు బృందావన సమీపమున దూడల మేపుచుండగా, గొల్లవారు దూరముననున్న గోవర్ధన శిఖరమున పచ్చిక మేయుగోవులక్కడ నుంచి లేగల చూచి, వడివడిగా పరుగెత్తి వచ్చి తమ దూడలకు పాలిచ్చెను. గొల్లలా గోవులను పట్టజాలక దగ్గరి త్రోవగుండా వచ్చి అచ్చట లేగల మేపుచున్న తమ కుమారులను సమీపించి తనువులు పులకరింప వారిని కౌగిలించుకొని శిరముల ముద్దాడి వారినెంతో సంతోషమున జూచుకొని యావుల మళ్ళించుకొని పోయిరి. ఇదంతయు చూచుచున్న బలరాముడు తనలో నిట్లను కొనెను. చన్నుద్రాగుట మానివేసిన దూడలపై గోవులకు అట్టిబాలురపై తల్లులకింతటి వాత్సల్యమెట్లు కలిగినది. కృష్ణునిపై నాపుచున్న ప్రేమను వీరు తమ బాలకులపై చూపుచున్నారు. గోవులకు కూడ దూడలపై అపూర్వమైన యీ ప్రేమ యెట్లు కలిగినది. నాకు గూడ గోపబాలురు లేగలు కృష్ణునివలెనే కన్పించుచున్నారు ఏమిటీ వింతయని తలచి దివ్యదృష్టితో చూచి గోపబాలురు, లేగలు కృష్ణుడే యని తెలిసికొనినను సందేహమతనిని పీడించుచునే యుండెను. అంతకృష్ణుని చూచి బలరాముడు మహాత్మా! దూడలెల్ల మునులని గొల్లలెల్ల దేవతలని తోచుచుండెను. ఇప్పుడీ లేగలు గోపబాలురను చూడగా నీవేయని నిస్సందేహముగ

తెలియుచున్నది దీనికి కారణమేమి అని అడుగగా కృష్ణుడు బ్రహ్మమాయతో వారిని దాచుటయు, తాను వారి రూపముల నెత్తుటయు అన్నకు తెల్పెను.

ఇట్లు కృష్ణుడు బాలవత్సములు తానేయై సంచరించిన సంవత్సరము బ్రహ్మలోక త్రుటికాలము. బ్రహ్మ భూమికి దిగివచ్చి వత్స - బాలాకారుడైన కృష్ణుని జూచి యబ్బురపడి బృందావనము నందలి దూడలు గోపబాలురు నేనుకల్పించిన గుహలో నిదురించుచున్నారు. వారింకను లేవలేదు. ఈ దూడలు ఈ గోపబాలు రెవ్వరు ? వీరి నెవ్వరు సృష్టించిరి. సృష్టించుట అనునది నాకుగాక మరెవ్వరికి సాధ్యమగును ? బ్రహ్మయననే నొక్కడనే కదా. మరి వీరెట్లు పుట్టిరి. అని చింతించి దివ్యదృష్టితో కృష్ణుడు తనకుతానే యిట్లు సృష్టించుకొనెనని తెలిసి కొని ఔరా నేనెంతటి వెఱ్ఱిని. నేను మోహాతీతుడైన విష్ణుని మోహింపజేయ దలచికడకు నేనే యితనిచే మోసపోతిని. దీనితో సృష్టికర్తననెడు గర్వము బ్రహ్మకు తొలగినది. కృష్ణుని కృపాకటాక్షమున నతనికి జ్ఞానోదయమైనది.

"పగటిపూట మిణుగురుల కాంతి నశించును. రాత్రి చీకటిలో మంచు మాసి
పోవును అట్లే విష్ణునిపై మాయలు ప్రయోగించువారి మాయలు సాగవు.

అంతట బ్రహ్మ దిక్కుతోచక దిక్కుల నన్నిటిని కలయ జూడగా సమీపమున బృందావనము కనిపించినది. ఆ బృందావనమున హరి సంచరించుటచే పశుపక్షులు స్త్రీపురుషులు జాతివైరములులేక శాంతితో హాయిగ నుండిరి. వారిలో కామ క్రోధాదులు మచ్చునకైన కన్పింపవు. అది సకల సౌభాగ్యములకు నిలయము. అంత బ్రహ్మకు చేతిలో పెరుగన్నపు ముద్దనుంచుకొని లేగలకై గోపబాలురకై గాలించుచున్న కృష్ణుని జూచి, తన హంస వాహనమునుండి దిగ్గి మణి ఖచితకిరీటము బాలుని పాదములు మోవ మ్రొక్కి భక్తితో నతని యడుగులపై బడిలేచి కృష్ణుని ప్రస్తుతించి యిట్లనెను.

మ॥ నను మన్నించి భవజ్జనంబులకు నానందంబు నిండించు నీ
తనురూపంబిదె నామనంబునకు చింత్యంబయ్యె నీయుల్లస
ద్ఘన విశ్వాకృతి నెవ్వడోపు నెఱుగం గైవల్యమై యొప్పు నా
త్మని వేద్యంబగు నీదు వైభవము చందం బెట్టిదో యీశ్వరా !

క. శ్రేయములు కురియు భక్తిని చేయక కేవలము బోధసిద్ధికిఁ దపముం
జేయుట విఫలము పొల్లున నాయము చేకుఱునె తేఁప వధికంబైనన్.

శా॥ ఏలా బ్రహ్మపదంబు వేదములకున్ వీక్షింపగా రానిది
న్నీలోకంబున నీవనాంతరము నందీ మందలోఁ గృష్ణయం
బాలాపాది సమస్తపావనులు నీయందే సమర్పించుచున్
వేళిందొక్కని పాదరేణువులపై వేష్టించినం జాలదే.

దేవా! నీవు సర్వము నెఱుగుదువు. నీవు సమస్తమును గాంతువు. సకల లోకాధిపతివి. ఓ సర్వేశ్వరా! సర్వాపరాధియగు నన్ను నీవు దయతో ననుగ్రహింపుము. నేను పోయెదను. దేవా! నీకు కల్పపర్యంతము నమస్కరించెదనని ముమ్మారు ప్రదక్షిణము చేసి పాదములపై బడి సెలవుదీసికొని తన లోకమున కేగెను. అంత బ్రహ్మచే మాయా నిర్ముక్తులైన గోపబాలకులు ముందు తాము చల్దులారగించుచుండిన సరోవరము చెంత అట్లేకూర్చుండి కృష్ణుని గాంచి నెచ్చెలీ వచ్చితివా దూడలు సేమముతో నిటచేరుకున్నవి నీవరణ్యమునుండి తిరిగి వచ్చునంత వరకు మేమెవ్వరు భుజించుటలేదు. చూడుము రారమ్మనిన, కృష్ణుడు వారిని గాంచి నవ్వగా వారు సంతోషముతో చల్దులారగించిరి.

అంత శ్రీకృష్ణుడు నెమలి పింఛము తలపై రాణింపగా వేణునాదముచే లోకుల సమ్మోహపరచుచు తన శౌర్యమును గోపబాలురు ప్రశంసించుచుండగా గోపికలు తమ్ము ఉత్సాహముతో చూచుచుండగా బృందావనమునకు నరిగెను. అప్పుడు గోపబాలురు కొండ చిలువ తమ్ము మ్రింగగా నంద నందనుడు దానిని మర్దించి మమ్ము కాపాడెనని గోకులమున చాటిరి. అఘాసురుని జంపి కృష్ణుడు గోపబాలురు తాను చల్దిగుడిచి బ్రహ్మకు తన మాయజూపిన కథను చదివినను వినినను కోరికలు సిద్ధించును.

అంతరామకృష్ణులు తమ యౌవనమేట నడుగిడిరి. ఆరేళ్ళు గడచిన గోపబాలురకు గోవులను మేపెడి యోగ్యతకలుగును. అంతరామకృష్ణులు గోపబాలురతో కలిసి ఆవులమేపుచు గోవర్ధన పర్వతప్రాంతముల కేగుచుండిరి. ఒకనాడు కృష్ణుడు ఉదయముననే లేచి వేణువు పూరించి బలరాముడు గోపకుమారులును తన వెంటరాగా ఆలమందలతో గూడి చిగురుటాకులు ఆకులు, పూలు పండ్లు గలదియు మకరందపానముచే మత్తెక్కిన తుమ్మెదలు ఝుంకారముచేయు నదియు, పరస్పరవైరము మానిన పశుపక్ష్యాదులచే నిండినదైన వనమునకేగి అందు క్రీడింపదలచిరి. అప్పుడు కృష్ణుడు బలరామునితో నిట్లనెను. అన్నా! ఇచటి చెట్లు

పుష్పఫల భారముచే వంగి నీకు నమస్కరించుచున్నవి. పుష్పఫలములు నీకు సమర్పించుచున్నవి. నీ తుమ్మెదలు నీకీర్తిని పాడుచు నీవెంట వచ్చుచున్నవి. మునులు నిన్ను గొలుచుటకు వచ్చిరి. నీవు నీలాంబరము తో నుండ నిన్ను జూచి మేఘమని తలంచి నెమళ్ళు నాట్యము సేయుచున్నవి. నిన్ను లేడిపిల్లలు ప్రియముతో చూచుచున్నవి.ఇచటి కోయిలలు నిన్న తిథిగ భావించి చక్కగా కూయుచున్నవి. నీవు వచ్చుటచే ఇచటి గిరిజనులు ధన్యులమై శివుని తలంచుచున్నారు. ఇట్లు కృష్ణుడన్నను పొగడుచు పసుల మేపుచు నదులలో గిరులలో సంతసముతో సంచరించెను. కృష్ణుడు తుమ్మెదలతో పాటు ఝుమ్మనుచు కలహంసలతో పాటు క్రేంకారములు చేయుచు, నెమళ్ళతో పాటు నాట్యమాడుచు అడవి యేనుగులతో పాటు మెల్లగ నడచుచు, పశుల ధ్వనుల ననుకరించుచు ఓ పూర్ణచంద్రికా ! గౌతమీ ! గంగా ! భాగీరథీ! మేఘబాలికా ! చింతామణీ ! కామధేనూ ! మనోహారిణీ ! సర్వమంగళా ! భారతీ ! ధరిత్రి ! మహాలక్ష్మి ! మందమారుతీ ! శుభాంగీ ! అను పేరులతో దూరమున మేయు గోవులను రారమ్మని పిలుచును. ఇట్లు రామకృష్ణులు పాడుచు నాట్యమాడుచు వనమున క్రీడించిరి. వనసంచారమున అలసిన బలరాముని సమీపించి కృష్ణుడన్నకు కాలుచేతుల పిసికి సేవచేసెను. కృష్ణుడలసినచో గోపబాలురతనిని తమ వీపునెక్కించుకొనిరి. అతడు నిద్రించుచో తమ తొడలపై నిద్రింప చేసిరి అతనికి చెమట పోయగా చిగురుటాకులతో నతనికి విసరిరి. నడచి బడలినచో ప్రేమతో నతని పాదముల నొత్తిరి.

అప్పుడు సుదాముడను గోపాలకుడు వచ్చి రామకృష్ణులతో ఇచటికి కొంత దూరమున ఫలసమృద్ధమైన గొప్ప తాటితోపు గలదనియు అందు ధేనుకాసురుడను వాడు కలడనియు అతడు మిక్కిలి శౌర్యశాలి ఖరాకారుడనియు అందుచే నెవ్వరును ఆ తాటితోపులో ప్రవేశింపరనియు ఒకవేళ యెవరైన అందు ప్రవేశించినచో ధేనుకుడు వారిని చంపి తినునని చెప్పి మఱియు నచ్చట పలువిధములైన ఫలములు కలవు మీరు బలశాలురు కావున ధేనుకుని చంపి ఫలములతో విందు సేయుడని చెప్పెను సుదాముని పలుకుల విని వారు గోపబాలురతోపాటు తాలవనమున కేగిరి. బలరాముడు తన భుజబలముచే తాటిచెట్ల కదలించుచు తాటి పండ్ల నేలపై రాల్చెను. పండ్లు రాలిన చప్పుడు విని ధేనుకుడు కోపించి మండిపడి బలరాముని ఱొమ్మును తన వెనుక కాళ్ళతో తన్ని కలవరపరచి వ్యావరి చాలక యతని చెవుల ఊచుచు అక్కడక్కడ కాళ్ళతో దన్నెను. అంత బలభద్రుడు రౌద్రాకారము దాల్చి గర్దభాసురుని నాలుగు కాళ్ళ నొక్క చేత

పట్టుకొని గిరగిర త్రిప్పి వాని ప్రాణములు దీసి యొక తాటిచెట్టుపై బడవేయగా ఆ చెట్టు విరిగి మఱియొక చెట్టుపైబడి దానిని గూల్చెను. ఇట్లా వనమువందలి చెట్లొక దాని తాకిడికి మఱియొకటి పెనుగాలికి గూలు చెట్లవలె కూలెను. ధేనుకుడు మరణింపగా వాని బంధువులు గార్దభములై రామకృష్ణుల పైబడ వారు వానివెనుక కాళ్ళు. పట్టుకొని గిరగిర త్రిప్పి తాటిచెట్లపై కెగురవేసి చంపిరి. విరిగిన తాటిచెట్లతో, ముక్కలు ముక్కలైన రాక్షసుల దేహఖండ ములతో భూమి మేఘమాలలతో నిండిన ఆకాశమువలె శోభిల్లెను. ధేనుకవనము నందలి తాటి పండ్లను మొదటి వారిగ మానవులా నాడే భక్షించిరి. అచటి గడ్డిని గోవులు మేసినవి. ధేనుకాసురుడు బంధు సహితుడై మరణించిన సందర్భమున దేవతలు పుష్పవృష్టి గురిపించిరి. గోపబాలురు తమ విజయమునకు జేకొట్టు చుండ రామకృష్ణులు మందలో ప్రవేశించిరి. అప్పుడు గోపకాంతలు గోపాద రేణువు కప్పిన తలపై నెమిలి పింఛము దాల్చి చిరునగవుతో శుభదృష్టితో నొప్పు ముఖముతో నవీన పుష్పమాలికచే నిండిన కంఠముతో వేణువు నూదుచు వచ్చు కృష్ణుని కనుల పండువుగా చూచిరి. కమలాక్షుని ముఖకమల మకరంద మ్మును తమ నయన షట్పదములచే త్రాగి గోపకాంతలు పగటి కృష్ణ వియోగమువలన కలిగిన తాపమును చల్లార్చుకొనిరి.

కా ళీ య మ ర్ద న ము.

ఒకనాడు గోపబాలురతో కలిసి కృష్ణుడు గోవులమేపుట కడవికి వెళ్ళెను. ఎండలో తిరుగుటచే దప్పి కలుగగా గోవులు గోపబాలురు యమునలో విష కలుషితములైన జలములను త్రాగి, మరణించి పడిరి. అంతయోగీశ్వరుడైన కృష్ణుడు తన కటాక్షామృతముచే గోవులను గోపబాలురను బ్రతికించెను. గోప బాలురు గోవులు తాము కృష్ణుని వలన బ్రతికితిమని సంతసించి మంద చేరిరి. కాళీయ నాగునిచే దూషితయగు యమునను పవిత్రము చేయదలచి కృష్ణుడు కాళీయుని వెళ్ళగొట్టెను. అనగా విని పరీక్షిత్తు ఆ యమునయందు కాళీయుడు చిరకాలమేల యుండెనో తెలుపు మన శుకయోగి యిట్లు చెప్పెను. ఓ రాజేంద్రా యమునలో ఒక పెద్దమడుగు కలదు. అందు కాళీయుడను సర్పము తన విషాగ్నులచే దాని నుడికించు చుండును. ఆ మడుగు మీదుగ మిన్నున తిరుగు పక్షులు దానిలోబడి మాడిపోవును. దాని అలలనుండి యెగురు తుంపురుల గాలి సోకిన యేవస్తువులైనను తక్షణమే మరణించును. అట్టి కాళింది మడుగులో నీరు

పొంగుచు నుడుకు చుండును. అదిచూచి దుష్టశిక్షకుడై యవతరించిన కృష్ణుడు కాళీయుని విషముచే కలుషితమైన యమునను నిర్మల జలము గల దానినిగ చేయ నిశ్చయించి కాళింది మడుగునకు సమీపమున నుండి విశాల శాఖలచే నొప్పు కడిమి చెట్టునెక్కె.

మ॥ కటిచేలంబు బిగించి పింఛమున జక్కం గొప్పు బంధించి దో
స్తట సంస్ఫాల సమాచరించి చరణ ద్వంద్వంబు గీలించి త
త్కుట శాఖాగ్రము మీదనుండి యుఱికెన్ గోపాల సింహంబు ది
క్తటముల్ మ్రోయ హ్రదంబు భుగభుగ ధ్వానంబునా నంబుగన్.

నడుమునకు వస్త్రము బిగించి, కొప్పును చక్కగ ముడివేసికొని చేతులతో భుజముల నప్పళించి పాదముల నొకచోట చక్కగ చేర్చి ఆకొమ్మ కొననుండి గోపాల సింహము మడుగులో దూకెను. ఆశబ్దము దిక్కుల నిండినది. మడుగులో గుభ గుభ ధ్వనులు మ్రోగినవి.

మహాపవిత్రావ పరిపూర్ణుడు భయంకరుడైన గోపాలుడు సింహమువలె దుముకుటచే విషమిశ్రితములైన ఆ మడుగు నందలి తరంగములు కలగి పొంగినవి. నూఱు ధనువుల దూర మామడుగు విస్తరించి వేడివేడి నీటి బుడగలతో నిండియుండినది. కృష్ణుడు లోతైన యామడుగులో రోషముతో భయంకరముగా నీదెను. అంతట కాళీయుడు తనలో "ఈ బాలుడు నామడుగులో దుమికి నిర్భయముగ నీదువా? ఇందు నేనున్నానని వీనికి తెలియదు కాబోలు నాకోరలనుండి వెడలు భయంకర విషాగ్ని జ్వాలలతో నీతని భస్మముచేసి నాకోపమే పాటిదో లోకులకు తెలియజేతును "అని తలచి విషాగ్నిజ్వాలలు రేగగా కాళీయుడు వడిగా వచ్చి మేఘము వలె నొప్పుచు భయకంపములు లేనివాడును నీటిలో విచ్చల విడి విహరించు వాడగు పీతాంబరుని కాటువేసెను. అంతటితో పోక విషాగ్నులు వెడలుచుండ తన దేహముతో కృష్ణుని పెనవేసికొనెను. ఇట్లు కాళీయునిచే చుట్టబడి చేష్టలు మానిన వాని కనిపించు తమ ప్రియమిత్రుని చూచి "అయ్యో! మన కృష్ణుని పాము కఱచెను. ఇతని దేహమును చుట్టుకొని యున్నది. మనమేమి చేయుదము ఎక్కడికి పోదము దీనిని నెడ్డపెట్టుట కుపాయమేమి" అనుచు గోపబాలురు గగ్గోలుపడు చుండిరి. గోవులుకూడ మేతలుమాని కన్నీరు గార్చుచుండెను. భూమి వడకెను. తోకచుక్కలు రాలెను. గోపికులకు ఎడమ కన్నదరెను. ఆ యుత్పాతముల చూచి నందయశోదలు మొదలగు గోప-గోపికలు గోవులతో-



మదోన్మత్తుడైన కాళియనాగుని గర్వమడచి అతని పడగలపై అందియలు
గల్లుగల్లుమన నాట్య మొనరించుచున్న శ్రీకృష్ణుడు. పుట. 462

గోపాలబాలురతో వనమున కేగిన కృష్ణునకే యాపాద వచ్చెనో యని తల్లడిల్లుచు బృందావనమునుండి బయలుదేరిరి. వారు దారిలో కృష్ణుని పాద చిహ్నముల గాంచుచు ఆ దారివెంట వచ్చి కాళింది మడుగులో కాళీయుని పడగలచే చుట్టబడి నిశ్చేష్టునివలె నున్నకృష్ణుని, కృష్ణునకై దిగులుపడి, సంతాపము చెందుచున్న తమ బాలురను, గోవులను గాంచిరి. కృష్ణుని బాల్య క్రీడలను, దుష్టశిక్షణాదులను తలచి తలచి విలపించిరి. మాకు నీతోడిదే లోకము నీవులేని యీ లోకము మాకేల యని మడుగులో చొత్తము చత్తమని మడుగులో పడబోవు చుండగా బలరాముడు ధైర్యము విడువకుడని వేచిచూడుడని వారి నూరడించెను. కృష్ణుడు తనకై వాపోవుచున్న బృందావన వాసులను చూచి ఒక ముహూర్తము మానవుని వలెనుండి పిమ్మట తన శరీరమును పెంచగా కాళీయుడు చుట్లను తొలగించి పేదెక్కుచున్న పెడల్పయిన పడగ కలవాడై యతని కబళించుట చాలించి నిట్టూర్పుచు అలసి విసము ముక్కులకెగ తట్టగా టక్కులు చూచుచు పొగకట్టవలె నిలుచుండెను. అంతకృష్ణుడు ఒక చేతితో దానిని అణచి గరుడునివలె దాని దౌడలుబట్టి కన్నులనుండి విషాగ్ని గ్రక్కుచున్న దానినెత్తి గిరగిర త్రిప్పిదాని గర్వమును రూపుమాయునట్లు పడవేసెను. దానినట్లు పారవేసి అనుమడియైన వడితో దాని తలలపై నెక్కి నిక్కి యమునానది తరంగ ఘోషమ్మృదంగ ధ్వనికాగా తుమ్మెదల గానమే గాయకుల గానము కాగా హంస సారసముల అవ్యక్తధ్వనులు, తాళశబ్దములు కాగా గగనమున నుండి తనను తిలకించు దేవగంధర్వాదులు సభాసీనులు కాగా, పద్మరాగాది మణుల కాంతులతో ప్రకాశించు కాళీయుని పడగలే రంగస్థలము కాగా కృష్ణుడను నర్తకుడు నిపుణతతో నాట్యమాడెను. తన యుదరమున భువన భాండముల నిమిడించుకొన్న హరి, గోపాకారముతో కాళీయుని పడగలపై ఆడుచు పాడుచు నవ్వుచు కాళీయుని ప్రాణావశిష్టుని చేసెను. అతడు తనలో

> "నా విషాగ్నిజ్వాలలకు సోకినచో దేవతలు కూడ వేదన పొందుదురు. చత్తురు. నేడి దేమి వింతయో ఈ బాలుడు విషాగ్నిజ్వాలల కోర్చుచు నా నూరు పడగలు విరుగునట్లు త్రొక్కుచు ఆడుచున్నాడు ఇతడు సామాన్య బాలుడు కాడు. చరాచరముల కధిపతియగు శ్రీహరియై యుండవచ్చును. ఇతనిని శరణు జొత్తు"నని శరణు జొచ్చెను.

కృష్ణుని పాదఘాతములచే పడగలు చీలినొచ్చి చచ్చినట్లు పడియుండిన తమ పతినిజూచి కాళీయుని భార్యలు దడదడలాడు గుండెలతో చేతుల జోడించి

క్రూరాత్ముల దండించుటకై భూమిపై నవతరించిన నీకు ఈ క్రూరాత్ముని దండించుట మంచిదే. శత్రుపుత్రులపై గూడ పగజూపక వారిని సమదృష్టితో చూచు నీకు పగయుండునా లోకరక్షణకొరకే నీవు క్రూరుల దండింతువు. ఈ నాగేంద్రుడు పూర్వమెంత పుణ్యము చేసికొనెనో ఎంతటి సత్యనిష్ఠను పాటించెనో కానిచో ఎంతటి మహానుభావులకు సన్నిధి నొసంగని నీవు ఇతని తలపైన నాట్యమాడెదవా ?

ఉ॥ ఒల్లరు నిర్జరేంద్ర పదమొల్లరు బ్రహ్మపదంబు నొందఁగా
నొల్లరు చక్రవర్తి పదమొల్లరు సర్వరసాధిపత్యము
న్నొల్లరు యోగసిద్ధి మఱియొండు భవంబుల నొందనీని నీ
పల్లవితాంఘ్రి రేణువుల సంగతి నొందిన ధన్యులెప్పుడున్.
ద. స్కంపూ 678

ఈశ్వరా, దుష్టులు శాంతములు గాని నీరూపములు సజ్జనులు నీశాంత శరీరములు; ధర్మహితమునకై నీవు సజ్జనులలో ప్రకాశింతువు. ఇతడు బాలుడని, మంచివాడని మేము చెప్పము. ఇతడు క్రూరుడు దుశ్శీలుడు అయినను సౌభాగ్యమును గోల్పోయి వైధవ్యమును భరింపజాలము. ఇతనికి పదతాడనము తగిన శిక్ష, పతిభిక్ష పెట్టి మమ్ము రక్షింపుము. ఇతని తలలన్నియు వ్రస్సినవి, ఇతని ప్రాణములు రాకపోకలలో నున్నవి. ఇక నితనిపై కరుణాకటాక్షమును నిల్పుము.

ఆ. మమ్ము పెండ్లి సేయు మాప్రాణవల్లభు ప్రాణమిచ్చికావు భక్తవరద
నీవుసేయు పెండ్లి నిత్యంబు భద్రంబుఁ బిన్ననాటి పెండ్లి పెండ్లికాదు.

ఇకమీదట నితడెవ్వరిని బాధింపడు. నీయాజ్ఞలో నుండును. మాపతి ప్రాణముల మాకు నిమ్మని ప్రార్థింపగా శరణాగత రక్షకుడైన పుండరీకాక్షుడు కాళీయుని, తన పాదములతో త్రొక్కుటమానెను. అంతకాళీయుడు, దేవా! మాప్రచారములు వంకరటింకరలు మా ముఖములు విషాగ్నిచే ఘోరములు. మేము దుర్మార్గులము, కోపజాతులము గర్వులము మేము మంచివారముకాము. ఓ కమలాక్షా ? ప్రాణులకు సహజ గుణములు మానవు కదా మా వికారములు వింతలా ? ఐనను నీవు నాకు మేలుచేసితివి. నీవు జగముల సృష్టించి, పెంచి లయింపజేయు వాడవు అఖిలేశ్వరుడవు సర్వజ్ఞుడవు. నీపాదధూళిని గంటిని. సనకాదులకు లభింపని నీ చరణధూళి పుణ్యముచే నాకు లభించినది. నాకింతే చాలును. నీవు చంపినను రక్షించినను నాకు దిగులులేదు. కాళీయుని ప్రార్థన మన్నించిన కృష్ణుడు కాళీయునితో నిట్లనెను.

గోవులు మానవులును ఈ మడుగులోని నీరు త్రాగుదురు కావున నీవిచ్చట నుండరాదు. నీభార్యలు కుమారులు బంధువులతో కలిసి నేడే సముద్రమున కేగుము. నిన్ను నేను శాసించిన కథను రేపుమాపు తలంచువారికి సర్పభయము కలుగదు. వారు విషవిజయమును గాంతురు. ఇకమీదట ఈ మడుగులో స్నానముచేసి నన్నుస్మరించుచు ఉపవాసముండి సేవించి, దేవతాదులకు జలతర్పణ మాచరించిన వారు తక్షణమే పాపవిముక్తు లగుదురు. నీవు గరుడునకు భయపడి రమణక ద్వీపమునుండక ఇచటికి వచ్చితివి. నాపాద చిహ్నములు నీతలలపై నుండుటచే నీకింక గరుడుని వలన భయములేదు. అని గోపాలకృష్ణుడానతిచ్చిన కాళీయుడు పుత్రకళత్ర బంధు పరివార సమేతుడై రత్నాకర ద్వీపమున కేగెను. ఓ నరేంద్రా! విష్ణువు పరుల కపార్థ్యమైన, కాళీయ నిష్క్రమణము చేయించెను. యమున అమృతజలములతో ఒప్పుచు సర్వులకు సంతోషమును కలిగించు చున్నది. పరీక్షిత్తు శుకయోగితో సర్పనివాసమైన రమణక ద్వీపమును విడిచి కాళీయుడీ మడుగున కెట్లు జొచ్చెనని యడుగగ శుకయోగి యిట్లు చెప్పెను.

కాళీయుని పూర్వకథ.

మనుష్యులు సర్పములకు భయపడి ప్రతినెల పర్వములైన భక్ష్యములను సర్పముల కొఱకై చెట్లపెట్టుచు సర్పానుగ్రహము పొందియుండిరి. ఆ సర్పములుకూడ తమ తమ భక్ష్యభాగములలో కొంత తమ్ము చంపకుండుటకై గరుడునకు ప్రతి నెల యిచ్చుచుండినవి. కాని కాళీయుడు మాత్రము గర్వించి తాను గరుడున కివ్వవలసిన భక్ష్యభాగముల నతని కివ్వకుండ తానే భక్షించెను. అంత గరుత్మంతుడు కాళీయునిపై కోపించి యతని తలలచీల్చి చెండాడి ప్రాణముల దీతునని పంతము పట్టెను. ఒకనాడు గరుత్మంతుడతనిపై రాగా కాళీయుడు విషాగ్ని రెగయుచుండ తనవాడియగు కోరలతో గరుడుని కఱచెను. గరుడు కాళీయుని దంతముల విఱుగగదన్ని ముఖములనుండి విషము వెడలునట్లు తలల బ్రద్దలుచేసి తరిమెను. కాళీయుడు గరుడునకు భయపడి పారివచ్చి యీ మడుగు జొచ్చెను. ఇచటనున్న కాళీయునకు గరుడుని వలన భయములేక పోవుటకొక కారణము గలదు. అదియు చెప్పెద వినుము. పూర్వము సౌభరియను ముని యీ మడుగున తపస్సు చేసికొనుచుండెను. ఆ మడుగు నందలి జలచరములు హాయిగా నుండెను. ఒకనాడు గరుడు ఈ మడుగు నందలి పెద్దజలచరమునొక దానిని, యాకటి పెల్లున తన్నుకొని పోయెను. అంత నచ్చటి జలచరములు దీనములై యుండ

జూచి సౌభరి అవి అట్లుండుటకు కారణమేమని ప్రశ్నింపగా అవి తమకు గరుడుని వలన జరిగిన అపకారమును గూర్చి చెప్పినవి సౌభరుడు జలచరములతో ఈనాటినుండి గరుడు ఈ మడుగున ప్రవేశించినచో మరణించును గాక అని శపించెను. జలచరములన్నియు చాల సంతసించినవి. గరుడుడా సంగతి తెలిసి యిట రాడని కాళీయుడు తెలిసికొని యిచటకి సపరివారుడై వచ్చి యిచటనే నివాస మేర్పరచుకొనెను. నేడు కృష్ణునిచే వెడలగొట్టబడెను కృష్ణుడు కాళీయుని కరుణించి యచటినుండి కాళీయుని రత్నాకరమునకు పంపి, మడుగునుండి పైకిరాగా బృందావన వాసులకు ప్రాణములులేచి వచ్చినట్లైనది. వారందరు మిక్కిలి సంతోషించిరి. గోవులు ఆనందించినవి. ఇట్లు కృష్ణుడు కాళీయుని మర్దించెను. ఇట్లు పరమ సంతోషమును పొందిన బృందావన జనులు యమున యొడ్డున ఆకలి దప్పులతో డస్సికృశించియుండ ఆ యరణ్యమున కార్చిచ్చు పుట్టి, చుట్టు ముట్టుకొని, అర్ధరాత్రి మందవైపు ప్రసరింపగా వారందరు కృష్ణుని శరణుశొచ్చి" దావాగ్ని పెనుమంటలతో వచ్చి, మందను కమ్ముకొనుచున్నది. నీపాదపద్మములు తప్పమాకు శరణములేదు ఓ పద్మాక్షా, కృష్ణా! మహా పరాక్రమ రామా! యీ దావాగ్నిని వారింపుడనియు నీపాదపద్మముల నమ్మిన వారికి ఆపద లెక్కడిది యీ మంటలు మాపై పడకుండ రక్షింపుడని ప్రార్థించిరి. ఆఘోషయందలి జనులఘోష విని కరుణించి కృష్ణుడనంత శక్తితో వనమున వ్యాపించిన దావాగ్నిని మ్రింగెను. అంతకృష్ణుని విజయ గానము దశదిశల వ్యాపించినది. పిదపకృష్ణుడు గోవులతో ఘోషజనులతో కలిసి మందకు వచ్చెను.

ప్రలంబాసుర వధ.

రామకృష్ణులు, నదీతీరములందును కొలకుల సమీపము నందును సెలయేటుల వద్దను, మడుగుల వద్దను పశువుల మేపుచుండ ప్రలంబుడను రాక్షసుడు గోప బాలుని రూపము ధరించి వారిని హింసింపదలచుచుండ కృష్ణుడు తెలిసియు తెలియనట్లు వాని రారమ్మని వానితో స్నేహముచేసి గోపాలకులతో నిట్లనెను. మనము శిలలను గుటిచేసి చెండ్లాడుదము. మనము రెండు జట్లుగా నేర్పడవలెను. ఏ జట్టు గెలుచునో ఏ జట్టు ఓడునో తెలిసికొనవలెను. కృష్ణుని మాటలు విని వారందఱల్లేయని యామోదించిరి. వారు గడ్డిని దామువులను, జాలను లక్ష్యములుగా పెట్టుకొని ఆగుబ్బలను తాకునట్లు చెండ్లను, శిలలను విసరివేయుట కును నిశ్చయించిరి. రామకృష్ణులు పెన్నద్దులు. తక్కిన బాలురను చిఱుద్దులుగ

రెండు తెగలుగ విభజించుకొనిరి. ఓడినవారు గెల్చినవారిని ఎంతదూరము మోసికొని పోవలెనో నిర్ణయించుకొనిరి. ఆ సమయమున కృష్ణుడు బలరామునితో ప్రలంబుని గూర్చి రహస్యముగ చెప్పెను. ఆటలో శ్రీదాముడు కృష్ణుని, భద్రసేనుడు వృషభుని ప్రలంబుడు బలరాముని ఎక్కించుకొనిరి. ప్రలంబుడు తనలో కృష్ణుడు బలశాలి తృణావర్తుడు కృష్ణుని గగనమునకు మోయజాలక చిక్కుపడెను. కాబట్టి నేను బలభద్రుని మోసికొని పోదునని తలచి యతని నెక్కించుకొని గిరిదాటి మోసికొని పోవుచు పెద్దకొండవలె బరువుగల బలరాముని మోయజాలక, వేగము చాలించి, మానవరూపమును విడిచి భయంకరమైన తన రాక్షసాకారముతో నతని మోయుచు పోవుచుండగా బలరాముడు వానిని ఆపి భయపడక తన నాకాశముపైకి తీసికొని పోవనున్న సమయమున పిడుగువంటి తన పిడికిలితో ప్రలంబుని శిరము పగులగొట్టెను. వాడు తలపగిలి శరీరమునుండి రక్తముకారు చుండగా మొఱపెట్టుచు వజ్రపుదెబ్బచే కూలు పర్వతమువలె నేలగూలెను. ప్రలంబుడు పెట్టిన చావుకేకతో గోపాల బాలకు లందఱక్కడికి వచ్చి బలరాముననేక విధముల పొగడిరి.

దా వా గ్ని.

గోపాలబాలు రాటలలో మునిగియున్న సమయమున పచ్చిక మేయుచున్న గోవులు మేతయందలి ప్రీతితో దూర ప్రాంతములకేగి అచట దావాగ్ని సెగలు తగులగా ఘోషపెట్టెను. గోపాలకు లందఱా గోవులఘోష విని వడివడిగా పరుగెత్తి గోవులను కార్చిచ్చు పాలుగాకుండ మరలించి తెచ్చిరి. కృష్ణుడు గంగాది నామములచే బిగ్గరగా బిల్వగా నవియన్నియు సంతోషమున గంతులిడుచు వేవేగ వచ్చినవి. ఆ కార్చిచ్చు, గాలివాటముచే గట్టు చెట్టనక కాల్చుచు చుట్టుముట్టుకొనుచుండ గోపాలులందఱు కృష్ణునితో తమ్ము దావాగ్నినుండి రక్షింపుమని.

శా॥ నీచుట్టాలకు నాపదల్ గలుగునే మేమెల్ల నీవారము
న్యాచారంబు లెఱుంగ మీఁకుఁడవు మా కాఱ్చీ లదావాగ్ని నే
డే చందంబున నింక దాఁటెదము మమ్మీక్షించి రక్షింప వ
న్నా చంద్రాభ విపన్నులన్ శిఖిశిఖానచ్ఛన్నులన్ ఖిన్నులన్.

విన్నవించిరి. అంతట కృష్ణుడు వారితో మీరు కండ్లుమూసికొనుడు అగ్నిని యీ సంధిలో నడచెదనని యోగీశ్వరుండు గాన దావాగ్నినిపట్టి త్రాగెను. ఇట్లు

కృష్ణుడు దావాగ్నిని ద్రావి శాంతికరమను మఱ్ఱిచెట్టువద్దకు చేర్చెను. వారు కృష్ణుని గూర్చి ఇతడు బ్రహ్మయో విష్ణువో, శివుడో యై యుండునని తలంచిరి. సాయంకాలము మందకు వచ్చిన తరువాత వారు రామకృష్ణుల చిత్ర చరిత్రములను వృద్ధులకు వినిపింప, వారు కార్యార్థమై వచ్చిన దేవతలని రామ కృష్ణుల గూర్చి తలంచిరి. వర్షాకాలమున శ్రీకృష్ణుడు బలరామునితో గోపాలురతోకూడి వనాంతముల గోవులమేపుచు కందమూల ఫలముల భక్షించుచు సరోవర తీరములలో కొండశిఖరములపై చల్దిగుడిచెను. బృందావనమనెడు ఆకాశవీధిలో విశ్వమోహనమగు వేణునాదము గంభీరగర్జనగాగా నిర్మలమైన తెల్లని చిఱునగవు కాంతిమెఱపు తీగగాగా, తన తలపైనున్న నెమలిపించ మింద్రచాపముగాగా, కరుణాకటాక్ష వీక్షణామృతధార సలిలధారకాగా, తన దర్శనమునకై వచ్చు మునీంద్రులనెడు చాతకముల సంతాపమును దీర్చుచు కృష్ణమేఘము కీర్తితో నొప్పెను. కృష్ణుడు గోవులను లేగదూడలను పూజించి వర్షలక్ష్మిని పూజించెను. వర్షాకాలము గడిచిన పిదప శరదృతువు ప్రవేశించినది. అంతట వనములు గుబురులతో శోభించినవి. బురద యెండి పోయినది. నెమళ్ళకే కారవము లడగినవి. మేఘములు ఉఱుముల మానినవి. మెఱపు తీగలుడిగినవి. ప్రజలు గుఱ్ఱములకు నీరాజన మొసంగిరి. బాలలు చైత్రయాత్ర సాగించిరి. లక్ష్మీపూజలు దేవోత్సవములు వైభవముగ జరిగినవి. మన్మథుడు చెఱకువింట నల్లకలువను బాణముగ సంధించి విరహుల వేటాడ మొదలు పెట్టెను. ఇట్లు ప్రకాశించు శరత్కాలమునందు గోవిందుడు గోబృందముతో కూడి బృందావనమున పసుల మేపుచు చతురనట మూర్తియగు గోపాల చక్రవర్తి వేణువు నూదుచుండగా మన్మథోద్రేకమును కలిగించు ఆవేణు నాదమును విని గోపికలు ఒక్కట వేడుకతో తమ తమ చెలికత్తెలతో నిట్లు ముచ్చటించుకొనిరి. కృష్ణుడు చెవిలో కొండ గోగుపూవు ధరించిపట్టు చేలము ధరించి, నెమలిపించము శిరముపై నొప్పగా పద్మమాల కంఠసీమయందు ప్రకాశింపగా తన మధురాధర సుధా రసముచే వేణువును పూరించుచు గోవులవెంట వనమందున్నాడు చూచితివా ? ఓ సుందరీ రావే ఓ పడతీ వినవే కమలాక్షుడు బృందావన వీధిలో వేణువు నూదుచు తొడపై పుగ తలవంచి కనుబొమలు చలింప వ్రేళ్ళుకదలించుచు షడ్జమ స్వరము నాలపించు చున్నాడు. ఆవేణు నాదము నాచెవుల పడినంతనే నామనస్సు ఊగి పోవుచున్నది. రమణీ రమ్మా నేను తోడ్కొని పోయినిన్ను కృష్ణునితో మాటాడించెను. ఇట్లువారు ముచ్చటించుకొని బృందావనమునకువెళ్ళి గోవిందున

కెదురుగానుండి తమ మనస్సులలో గోవిందుని గాఢాలింగనము చేసికొనినట్లు భావించిరి. కామినులారా ఈ బృందావన రంగమున పరమానందముతో పూత పల్లవములు, నల్లకలువలు నెమలి పింఛము పద్మమాలలతో నలంకరించుకొని పట్టు గుడ్డల ధరించి యీ రామకృష్ణులు నటులవలె తాండవకేళి సలుపుచున్నారు చూచితిరా. ముదితలారా వేయిమాటలు చెప్పనెందులకు? వీరిని చూచుటతో మన కన్నులు సఫలములైనవి. యిట్లు గోపకాంతలు మాటాడుకొనుచుండిరి. వారిలో కొందఱు కృష్ణుని గూర్చి.

మ. ఒనరన్ వేఁతలకించుకేని నటలేకుండంగ గోపాలకృ
ష్ణుని కెమ్మోవి సుధారసంబు గొనుచుం జోద్యంబుగా మ్రోయుచుం
దనపర్వంబులు నేత్రపర్వములుగా దర్శించెఁ బూర్వంబునన్
వనితా యెట్టి తపంబు సేసెనొకొ యీ వంశంబు వంశంబులోన్

గొల్లపడుచుల కింతయైన లేకుండ యితని యధర సుధారసమునంతానే గ్రోలుచు వింతగ మ్రోయుచున్న యీ వేణువు పూర్వజన్మమున నెంతపుణ్యము చేసి కొన్నదో కదా? ఇతని వేణునాదము విని చెట్లు పూదేనెను కురియుచున్నవి. ముదితా యీ యమునాతీరమున నితని యధర సుధామృతమును గ్రోలు వేణువుగా పుట్టుటకేమి నోమునోచవలెనో! ఈ బృందావనము కృష్ణుని పద చిహ్నములచే నొప్పుచు స్వర్గమునకంటె మించి శోభిల్లుచున్నది. రమణీ! వనములలో నుండి గాన మన నెటువంటిదో తెలియని యీ హరిణీ హరిణములు కృష్ణుని వేణుగానమును విని మేతనుగూడ మఱచి, పరవశముతో నీగానము నెంత బహుమానము చేయుచున్నవో చూడుము. ఈ దూడలు పాలుత్రాగుచు వేణుగానము చెవులపడినంతనే పాలపై రక్తిలేక తమచూపులను నందనందనుని యందే నిల్పియెట్లు చూచుచున్నవో చూడుము. గోవులు వేణునాదమును విన్నంతనే నెమరు వేయుటనుమాని, యానంద బాష్పములు గార్చుచు మేతపై వాంఛమాని యతనినే చూచుచున్నవి కనుగొనుము. వేయిమాటలేల ఇచటి పశుపక్షులు, నదులు, గిరులు, తరులు, సమస్తము వేణుగానామృతమున నోలలాడుచు మైమఱచియున్నవి. ఇట్లు గోవిందుని వలని మన్మథ బాణభగ్న హృదయలై గోపకాంతలు అతనిపైననే తమ దృష్టుల నిల్పియుండిరి హేమంతమున మొదటి నెల మొదటి దినమున గోపకన్యలుదయముననే యమునా నదీ జలముల స్నానముచేసి యిసుకతో కాత్యాయనినిచేసి దేవికి పసుపు కుంకుమలతో,

పూలతో పూజచేసి శ్రీకృష్ణుడు తమకు భర్తయగునట్లను గ్రహింపుమని ప్రార్థించిరి. ఇట్లు వారు మాసము వ్రతమాచరించిరి.

గోపికా వస్త్రాపహరణము.

ఒకనాడు దయమున బృందావనము నందలి సుందరీ మణులు మేల్కాంచి తమ చెలికత్తెలతోపాటు కృష్ణుని కీర్తించుచు మత్తగజములవలె నడచుచు ఒకరి చేతు లొకరు పట్టుకొని స్నానమునకై యమునాతీరమునకు పోయి యేకాంతమున తమ కట్టుబట్టల నొకచోట బెట్టి నదిలో స్నానముచేయుచు కృష్ణునిపై పాటల పాడుచు వినోదముగ కాలము గడుపు చుండిరి. వారట్లు యమునలో జలకము లాడు చున్నారని గోపబాలురతోపాటు ఆనక్కడికి పోయి వారలను కదల కుండుడని సైగచేసి యడుగులో నడుగు వేసికొనుచు మౌనముతో పొదల మాటున పొంచియుండి యదను జూచి వారు తిన్నెపై పెట్టియుండిన వలువలను దొంగిలించెను. అట్లు దొంగిలించి నదియొడ్డున గల పొన్నచెట్టు నెక్కెను. అంత గోపికలు కృష్ణుని జూచి కృష్ణా! మామా! మా వలువల ముట్టకుము. వానిని తీసికొని పోకుము. మన్నింపుము మా మానము తీయకుము. మా మానము నపహరింపకుము. నీవు కులము నుద్ధరించుటో, భూమిని కాపాడుటయో ప్రజల గాచుటో బలవంతుల నోడించుటయో రాజుల జయించుటయో గురునాజ్ఞ పాటించుటో బలపరాక్రమముల జూపుటయో బుద్ధిబలముచూపుటో చేయవలెను కాని యిట్టి కొంటె పనిచేయుట తగునా? మా వలువలు మాకిమ్ము. నీవు మా హృదయముల కొల్లగొంటివి. మాసిగ్గుల దొంగిలించితివి. మా వలువల గైకొంటివి. నీవు కొంటెవాడవు ముందు ముందింకేమి చేసెదవో? ఓ పద్మనయనా నీవు సత్త్వసంపద కలవాడవు. రాజసముతో రాజిల్లువాడవు. గొప్పశక్తి గలవాడవు. మాయావివి. ఎప్పుడు నేదో యొకటి చేయుచుందువు. మా వలువలు మాకిమ్ము. నీవు బలముతో రాజు నెరుగవు మేమా స్త్రీలము. నీవు మాచీరల దొంగిలించి తివి. మేము రాజునకు తెలిపెదము. నీవి రాజునను కొనుచున్నావా? అని పలుకగా వారి మాటల విని గోపాలుడు నవ్వుచు రమణులు రాజుతో మీవలె వ్యవహరింతురా? మోమోటమిలేక మాట్లాడు చున్నారు. మీరు చేసిన మోసము మీకు తెలియదా? నీటి నుండి పైకివచ్చి మీమీ చీరలు మీరు తీసికొనుడు మీకిప్పుడే ఇచ్చుచున్నాను. అనగా విని వారు సిగ్గుతో మాటాడలేక గొంతులోతు నీళ్ళలో నిలుచుండి కృష్ణునితో ఆగడముతో మా వలువలేల తీసికొంటివి.

నీవేమి చిన్నవాడవా? నీకు తెలియని దేమున్నది? నీకు ధర్మము తెలియదా? ఇంతులు జలకమాడు నప్పుడు మగవారు వత్తురా? వచ్చినను దయలేక ఇట్లు దగన చేయుదురా? ఎక్కడనైన నిట్లుచేసిన వారున్నారా? నీకు దాస్యము చేసెదము దయతో మా వలువలు మాకిమ్ము అనగా విని కృష్ణుడు వారితో నవ్వుచు నిట్లనెను. "ఏ యువకుని భర్తగా పొందుటకు మీరీ తపస్సుచేయు చున్నారు? నిజము చెప్పుడు మీరెవని జూచి మోహించితిరి? మీ మానధనము నపహరించిన వాడెవ్వడు? ఎవనిపై మీకు కూర్మి కలిగెను. చెప్పుడు" అన, విని వారు నిరుత్తరలై యుండగా కృష్ణుడు వారితో నా యింటికి దాసులరై మీరు నా యానతి నొప్పుచ నడిచెదరేని నీటి నుండి పైకిరండు మీ వలువలు మీకిచ్చెదనెను. అంత గోపికలలో కొందఱు నీళ్ళనుండి బయటికి పోరమనగా కొందఱు మానము పోవుననగా మఱికొందఱు సందేహములో బడిరి. కడకడకు వారు మర్మమును చేతులతో నాచ్ఛాదించి తోయములు వెడలి వచ్చిరి. అంత కృష్ణుడు వారితో నిట్లనెను. "శృంగారవతులారా! మీరు సిగ్గుపడనేల చిన్ననాటి నుండి మీలో పెరిగిన వాడనుకదా నోముచేయుచున్న వారు, నియమము తప్పి వివస్త్రలై స్నానము చేతురా? ఈ విధముగ కాత్యాయని దేవి నోము నోతురా? మీ వ్రతఫలము మీకు దక్కవలెనన్నచో చేతులెత్తి మ్రొక్కి వచ్చి మీమీ వలువలు గైకొనుడు" అని చెప్పగా వ్రతభంగ భయముచే వారట్లే గావించిరి. వలువలు గట్టికొనిన గోపాంగనల జూచి కృష్ణుడు ఓ లలనామణులారా మీరు సిగ్గుతో చెప్ప లేరుగాని మీ రహస్యములు నాకు తెలియవా? నన్ను గోల్చుటకై చింతించితిరి. మీ నోము సఫలమగును. ముందు ముందు మీ కోరిక నెరవేరునని చెప్పివారిని పంపెను.

మునుల భార్యలు.

ఒకనాడు కృష్ణుడు బృందావనమునకు దూరమున గోవుల మేపుచుండ చండ భానుని తాపమును సహింపలేక గోపాలకులతోపాటు తానునుచెట్ల నీడలలో విశ్రాంతి గైకొని, యమునకేగి గోవులకు నీరుద్రాగించి గోవుల మేపుచుండెను. అంతగోపాలురు కృష్ణునితో కృష్ణా మా కాకలివేయుచున్నదని విన్నవించగా కృష్ణుడు వారితో నిట్లనెను. గోపకులారా! ఈ వనమున మునులు స్వర్గము గోరి యాగము సలుపుచున్నారు. మీ రక్కడికి పోయి మా పేరుచెప్పి ప్రియముగ నడిగినచో వారు మీ కన్నము పెట్టుదురు "అనగా విని వారు, యజ్ఞవాటికడకే

విప్రులకు నమస్కరించి "అయ్యలారా! రామకృష్ణులు పశువుల మేపి యలసి పోయిరి. అన్నమడుగుడని మమ్ము పంపిరి. మీరన్నము పెట్టు"డని యడుగగా వారు యజ్ఞము, మంత్ర తంత్రములు, ధనము, దేశకాలములు, ధర్మము, సత్యము అనునవి యెవ్వని రూపములో అట్టి సర్వేశ్వరుడే కృష్ణుడని తలపక, అతడు సామాన్య గోపాలుడని భావించి, గౌరవము జూపక అన్నములేదు పో పొమ్మనిరి. గోపాలురు తిరిగివచ్చి జరిగినదంతయు చెప్పగా కృష్ణుడు వారితో మీరు మరల వెళ్ళి మునికార్యల నడుగుడు. వారు తప్పక పెట్టెదరని పంపెను. అంత గోపాలురు బ్రాహ్మణసతుల కడకేగి "అమ్మలారా! గోవులమేపుచు కృష్ణు డాకలిగొనియున్నాడు. మిమ్మన్నమడిగి రమ్మన్నాడు. మీరన్నము తీసి కొని రండ"ని విన్నవించిరి. వారి మాటలువిని విప్రసతులు గోవిందుని దర్శనము కలుగునని సంతసించి భక్ష్య, భోజ్య, లేహ్య, చోష్య, పానీయములు గలిగిన సంసారపూతములైన అన్నములను కుంభములలో పెట్టుకొని తమ భర్తలు మొదలగువారు వలదు వలదని వారించినను వినక జగదీశ్వరునకన్నము తెచ్చి, అశోకవృక్షముక్రింద పవిత్రస్థలమున కూర్చుండి, ఒక స్నేహితునిపై చేయి వైచి మఱియొకచేత కమలమును విలాసముగ త్రిప్పుచున్నవాడును, చెక్కులపై కుంతలములు నాట్యము చేయుచున్నవాడును, పీతాంబరమును ధరించినవాడును, తలచుట్టు నెమలిపింఛము కలవాడును, కలువపూలను చెవిలో నుంచుకొనిన వాడును, పుష్పమాలల ధరించినవాడును, భువనమోహనముగ నాట్యమాడు వాడును అగు శ్రీకృష్ణుని కనులారగాంచి ధన్యలైరి. వారిని జూచి కృష్ణుడు- "కాంతారత్నములారా! మీగృహములలో క్షేమమా! మీరు మమ్ము చూచుట కెంతో వేడుకతో వచ్చితిరి. బుద్ధిమంతులు మీవలె నన్నుచేరి నాసేవలచేసి సమస్త శుభములను పొందుదురు. మీ భర్తలు మీతోకూడి యజ్ఞమును నిర్విఘ్నముగ చేతురు. యాగశాలకు పొండ"నగా వారు "మాధవా! నీవిట్లు పలుకుట ధర్మమా మాతలిదండ్రులు, మగలు, సోదరులు, బిడ్డలు మమ్ము వారించుచున్నను వినక నీ పాదములు చేరుకొంటిమి. మమ్ము నీ దాసీజనముగ భావించి రక్షింపు"మని వేడిరి.

"నా సమీపముననుండినారని మీవారు మిమ్ము కోపింపరు. మిమ్ము దేవతలైన మెచ్చుకొందురు. నా దేహసంగము నరులకు సౌఖ్యానురాగము కల్పింపదు. ముక్తిని కల్గించును. నన్ను కీర్తించినను, దర్శించినను, నా స్తుతులాలకించినను, నన్ను ధ్యానించినను కర్మబంధములనుండి విముక్తులగుదురు. మీరు మీ మనస్సు

లను నాయందుంచి తుదకు నన్ను చేరెదరు. నా మాటను విశ్వసింపు"మని చెప్పి, వారు తెచ్చిన భోజన పదార్థములను తన ఆప్తులతో గలిసి యారగించెను.

"పరమేశ్వరార్పణ బుద్ధిచే పరునకు భోజనముపెట్టిన వారికి పరమపదము లభించును. సాక్షాత్ పరమేశ్వరుడనే భిక్షగై కొనినచో ఆ ఫలితమెట్టిదో."

సర్వేశ్వరుడైన హరికి భిక్షచేసి యతనివలన కృతార్థులైన తమ భార్యలను చూచి వారిట్లు చింతించిరి—

చ॥ కటకట మోసపోయితిమి, కాంతలపాటియు బుద్ధిలేదు నే
డిట హరిఁ గానఁ బోనెఱుఁగమేము దురాత్ములమేము కల్మషో
ద్భటులము విష్ణుదూరగుల బ్రాహ్మణతేల? తపంబులేల? వ
ర్యటనములేల? శీలములు యాగములున్ మఱియేల కాల్పనే.

జపములు, హోమములు, అధ్యయనములు, తపములు, వ్రతములు లేని తరుణులు భక్తితో హరికృపకు పాత్రులైరి. జపహోమాదులన్నియు మకున్నను భక్తి లేకపోవుటచే చాపల్యముతో హరికృపాపాత్రులము కాలేకపోతిమి. సురగురులను యోగీంద్రులనుకూడ మోహింపజేయు హరిమాయ నరగురులైన మూఢవిప్రులమైన మమ్ము మోహింపజేయదా?

"యాగములు, ధర్మము, మంత్రి తంత్రములు, ధనము, కాలము, దేశము, దైవము, అగ్ని, గృహస్థులు సమస్తమూ సర్వేశ్వరుడే అతడే. ఆయన రక్షించుటకై యవతరించినాడని తెలిసికొనలేకపోతిమి. ఆ శ్రీకాంతునకు జగత్కర్తకు, జగదుద్ధారకునకు, రాక్షస సంహర్తకు మేము నమస్కరింతుము".

ఇట్లా విప్రులు పశ్చాత్తాపముపొంది క్షమింపుమని హరిని తలంచినను కంసునకు భయపడి వారు బలరామకృష్ణులను దర్శించుటకు బృందావనమునకు పోలేదు.

నందాదులు ఇంద్రయాగము చేయదలచి కృష్ణునివద్దకు రాగా కృష్ణుడు- "మీరు యాగము చేయదలచి వచ్చితిరి. యాగమువలన ఫలమేమి కలుగును? దాని కధిపతి యెవ్వడు? ఎంత సాధనము కావలెను. ఇది శాస్త్రవిహితమా? లేక జనుల యాచారమా? నాకు తెలుపు"మనగా నందుడు కృష్ణునకిట్లు చెప్పెను— "పర్జన్యుడు భగవంతుడు. అతడు దేవతలకు రాజు. మేఘము లతనికి ప్రియమైన మూర్తులు. ఆ మేఘబృందముచే ఇంద్రునియాజ్ఞచే నీటిని వర్షించును. ఆ జలముచే పంటలు పండును. వానిచే ధర్మార్థకామములతో ప్రజలు బ్రతుకుదురు.

కావున మేఘసమానుడగు ఇంద్రుని మెప్పించుటకు రాజులెల్లరు ఇంద్రయాగము చేయుదురు. కామలోభములచేగాని, భయ ద్వేషములచేగాని యీ యాగము చేయకున్నచో అశుభములు కలుగును. యాగము చేసినచో ఇంద్రుడు సంతోష పడును. అతడు సంతసించినచో వాన కురియును. వాన కురిసినచో భూమిపై గడ్డి మొలుచును. ఆ గడ్డిని తిని గోగణము బ్రతుకును. కుమారా! ధేనువులు బ్రతికిన మనకు పాడి వృద్ధియగును. పాడి పెంపొందినచో దేవతలు, మానవులును సంతోషమున నుందురు." అని నందుడు చెప్పగావిని కృష్ణుడు దేవేంద్రుడు కోపించునట్లుగ తండ్రితో నిట్లు పలికెను—

"ప్రాణి కర్మతో పుట్టును. కర్మచేతనే పెరుగును. కర్మచేతనే నశించును.
కర్మయే జనులకు దేవత. అదియే సుఖదుఃఖములకు కారణము.

వైదికకర్మచే మెలగు రాజు ప్రజాపాలనము చేయును. వైశ్యుడు వాణిజ్య కృషికుసీద గోరక్షణల చేయును. శూద్రుడగ్రజన్ముల సేవించి బ్రతుకును. సత్వరజస్తమోగుణములే ఉత్పత్తి స్థితిలయములకు కారణములు. రజోగుణము చేతనే జగము పుట్టుచున్నది. రజోగుణ ప్రేరణచే మేఘములు వర్షించును. వర్షముచే ప్రజావృద్ధి యగుచున్నది. ఇంద్రుడేమి చేయును. మీరింద్రునకు భయపడకుడు. అతడు కోపించినను, మనకు పోయెడిదేమియున్నది. మనకుగల పట్టణములు, దేశములు, గృహములు, వ్యాపారములు పోవునా? మన మరణ్యవాసులమై గోవుల గాచుకొనువారము మనమతనికి భయపడనేల? మీరు పసువులను, పర్వతమునకు, బ్రాహ్మణోత్తములకు యజ్ఞము చేయుడు. పాయసాపూపములు, పిండివంటలు, శాకములు, ఫలములు తెప్పింపుడు. బ్రాహ్మణులకు భోజనములు పెట్టుడు. పర్వతములను పూజింపుడు. సకలప్రాణుల కాహారము పెట్టి వారిని సంతోషపెట్టుడు. పశువులకు సమృద్ధిగ మేతపెట్టుడు. ఇది మీకు సమ్మతమైనచో చేయు"డని యింద్రుని గర్వమును హరించు తలంపుతో కృష్ణుడు చెప్పిన మాటలు విని నందాదులు సంతసించిరి.

కృష్ణుడు శైలరూపమున గొల్లలు గావించిన పూజలందుకొని, గొల్ల లొసంగిన అన్నము నాహారించెను. మఱియు "ఈ శైలము కామరూపి, దుష్టుల నణచును. మనమిచ్చిన భక్ష్యభోజ్యముల భక్షించెను. మనల మన్నించెను." అని కృష్ణుడు గోపాలురతో కలిసి గిరికి నమస్కరించెను. వారందఱు గిరికి ప్రదక్షిణముచేసి నమస్కరించిరి.

గొల్లలెల్లరు గిరికి ప్రదక్షిణముచేసి కృష్ణునితో కలిసి బృందావనమునకు పోయిరి. దేవేంద్రుడు కోపించి ప్రళయమును కల్గించెడి సంవర్తక మేఘముల పిలిచి, "ఈ గొల్లలు కృష్ణుని మాటలను నమ్మి నన్ను తిరస్కరించి పర్వతమును పూజించిరి. ఈ కృష్ణునకు గురువులపై, దేవతలపై భక్తిలేదు. గుణశీలములులేవు. ఇతని మాటను నమ్మి గొల్లలు నా యాగమును మానిరి. కావున మీరు గొల్లలను గర్జనలతో భీతిగొల్పి, యిచటి గోవులు, గోపాలురు సర్వులు నశించునట్లు జాలను వర్షింపుడు. నేను నా ఐరావతగజమునెక్కి, దేవగణములతోపాటు బృందావనమును బాధించుటకు మీవెంట వచ్చెదను." అని పలికి తాను వజ్రాయుధమును ఝళిపించి ఇంకుగొంకులు వీడి మేఘముల సంకెళ్ళను విప్పగా పెనుగాలులచే ప్రేరేపింపబడి మేఘములు ఆకాశమంతయు వ్యాపించి, సూర్యమండలము నాచ్ఛాదించి ప్రళయకాల గర్జనలతో ఏనుగుతొండములంత ధారతో నిరంతరము ప్రచండముగ నీటిని వర్షించినవి. జాలను గురిపించినవి. ఘోరశిలావర్షముతో బాధపడిన గోవులు అంభారవములు సేసినవి. గోపకులు నిశ్చేష్టులైరి. గోపకులను పట్టుకొని వడవడవణకుచు గోవిందుని పేర్కొనుచు గోపికలుండిరి. శిశువులు తల్లుల రొమ్ములను హత్తుకొనిపోయిరి. మందలోని వారందరు దుష్టశిక్షకుడైన గోవిందుని శరణుజొచ్చిరి. "కృష్ణా! వానతో గొల్లపల్లె తప్పతడిసిపోయినది. నిన్నే మేము నమ్ముకున్నాము. మా భయమును పోగొట్టుము. ఈ యురుములు, మెఱుపులు, పిడుగుల శబ్దములు, నీటిధారలు, రాళ్ళవాన యెన్నడైన చూచితిమా. మమ్ము వర్షభయమునుండి కాపాడు"మని మొఱపెట్టుకొనిరి. "ఇంద్రయాగము చేయలేదని దేవరాజు కోపించి గర్వముతో నీ యాగడము చేయుచున్నాడు. దేవతలందరు నన్ను సేవింతురు. వారు నిగర్వులు. గర్వితుడైన యింద్రునకు గర్వభంగము కావింపవలెను. స్త్రీముదితలారా! భయపడకుడు. గోపకులారా! కంపింపకుడు. బాలురారా! భీతిల్లకుడు. జాలవానచే నలిగిపోకుడు. గోవుల నక్కడక్కడ నిల్వనీయకుడు. మీకు భగవంతుడు మేలు చేయును." అని ఏనుగు తామర మొగ్గనెత్తునట్లు త్రిలోకములకు అభయంకరుడైన, హరి తనచేతితో లీలగా గోవర్ధనపర్వతము నెత్తెను. అట్లు గిరినెత్తి కృష్ణుడు పూగుత్తిని దాల్చినట్లు పట్టుకొని, కుడిచేత దానిని గొడుగును పట్టుకొన్నట్లు పట్టి, వారందరితో "తల్లులారా! తండ్రులారా! గోపకులారా! మీరందరు గోవులతోపాటు వచ్చి యీ పర్వతముక్రింద నిలుచుండుడు.

శా॥ బాలుండీతఁడు కొండదొడ్డది మహాభారంబు సైరింపగా
జాలండోయని దీనిక్రింద నిలువన్ శంకింపగాఁ బోలదీ
శైలాంభోనిధి జంతుసంయుత ధరాచక్రంబుపై బడ్డ నా
కేలల్లాడదు బంధులార నిలుఁడీక్రిందం బ్రమోదంబునన్.

ఈ బాలుడింత పెద్దకొండను మోయగలడా అను సందేహము చెందక కొండ క్రిందికి మీరందరు చేరుడు. పర్వతములతో సముద్రములతో నిండిన భూమండలము సమస్తము పైబడినను నాచేయి కదలదు. మీరందరు నిర్భయముగ హాయిగా వచ్చి నిలువుడు."

వారు కృష్ణుని మాట ప్రకారము గోవులతోపాటు పర్వతముక్రింద నిల్చిరి. ఆ కృష్ణుని కరుణాకటాక్షమునుండి వెల్వడు అమృతవర్షముచే, వారి ఆకలి దప్పులు తెలియక వారు కృష్ణునిగూర్చిన కథలచే వినోదించుచుండిరి. ఆ కృష్ణుని చేతనున్న గోవర్ధన పర్వతము, పద్మమువలెను పైనున్న మేఘబృందములు తుమ్మెదలవలె శోభిల్లుచుండెను. ఇంద్రుడు మేఘములద్వారా ఏడుదినము లిట్లు ఎడతెగని వర్షము కురిపించినను బృందావనవాసులా కొండక్రింద. తడియక హాయిగా నుండిరి. కృష్ణుడీవిధముగ ఏడహోరాత్రములు పర్వతమును ధరింపగా ఇంద్రుడు విసిగివేసారి కృష్ణుని యద్భుతకృత్యముల కాశ్చర్యపడి, తనకోరిక విఫలము కాగా మేఘములను మరలించుకొనిపోయెను. అప్పుడు కృష్ణుడు గోపాలకులతో- "వానయు, గాలియు ఉడిగిపోయినవి నదుల జలవేగము తగ్గినది. వఱదలు తగ్గినవి. మీరందరు కొండక్రిందినుండి బయటికి గోవులతోపాటు బయటికి రండు." వారు బయటికి వచ్చిన తరువాత కృష్ణుడు, గోవర్ధనమును నిజస్థానమున నిలిపెను. గోపాలురు కృష్ణుని కౌగిలించుకొని తగినవిధముగ గౌరవించిరి. గోపికలు కృష్ణునిపై సేసల జల్లిరి. ఆతనికి పెరుగన్నపుముద్దల నిచ్చి ఆశీర్వదించిరి. రోహిణీ యశోదలు కృష్ణునకు శుభాశంసల నందించిరి. సిద్ధ సాధ్య గంధర్వులు కృష్ణునిపై పూలను వర్షించిరి. దేవదుందుభులు మ్రోగినవి. గంధర్వులు పాడిరి.

పిమ్మట గోపకులు నందునితో కృష్ణుడు గావించిన పూతనా సంహారము, శకటాసుర భంజనము, తృణావర్త వధ, మద్దిచెట్లు గూల్చుట, వత్సకాసుర వధ, బల రామునిచే చేయించిన ఖరాసుర సంహారము, ప్రలంబవధ మున్నగు వానివి మిక్కిలి యద్భుతములైన, కృష్ణకృత్యములు, దావాగ్నిని మ్రింగుట, కాళీ

యుని మడుగునుండి వెడలగొట్టుటలను పేర్కొని, నీ కుమారుడు గావించిన పనులు మానవులకు సాధ్యములుకావు. నీ కుమారుడు మానవమాత్రుడు కాడు అని చెప్పగా, నందుడు గర్గముని చెప్పినది నిజమనియు, కృష్ణుడు లోకరక్షకుడైన పుండరీకాక్షుడని తాను తలంచుచుందునని వారితో ననెను. అంతట వారు కృష్ణుని పూజించిరి. దేవేంద్రుడు కృష్ణుని వద్దకువచ్చి అతని పాదపద్మముల పూజించి, "నీవు లోకముల సృష్టించి పోషించువాడవు. లోకములకు గురువువు. మేమే సర్వాధికారులమని గర్వించు వారి గర్వము అణచుటకై, దుష్టశిక్షణకై, శిష్టజనుల సంరక్షణకై అవతరించు సర్వలోకేశ్వరుడవు. నావంటి వెఱ్ఱివారికి నీవు శాస్తి చేసినచో గర్వముమాని, పెద్దల మార్గము ననుసరించి నడతురు. బుద్ధికలిగి యుందురు. ఒకలోకమును పాలించుటచేత మేమే సర్వలోకాధిపతుల మని గర్వించు నావంటి వెఱ్ఱులకు నిజముగా నీమహిమ తెలియదు. వాసుదేవా! కృష్ణా! వరదా! స్వతంత్రా! విజ్ఞానమయా! మహాత్మా! పుణ్యపురుషా! నిఖిలబీజ భూతాత్మకా! నీకివే నా నమస్కారములు. నీ సామర్థ్యము తెలిసికొనక యీ గొల్లపల్లెను భయంకర వర్షముతో ముంచెత్తించుట, యీ గొల్లలు నాకై యజ్ఞము చేయలేరను కోపము నాచే నిట్లు చేయించినది. నీ మహత్త్వముచే నాకృషి విఫలమైనది. నేను నీ దాసుడను, అపరాధిని, నన్ను దయతో ఆదుము. నీ ప్రభావమును బ్రహ్మాదులే తెలియజాలరు. త్రిలోకాధిపతినను గర్వముచే నిట్లు చేసితిని. నీ ప్రభావమును దుష్టుడు గర్వితుడైన నేనెట్లు తెలిసికొనగలను." పిమ్మట కృష్ణు డింద్రునితో నిట్లనెను- ఇంద్రా! నీవు స్వారాజ్యలక్ష్మితో గర్వాంధుడవౌట తెలిసి నీగర్వమును ముక్కలుచేయుటకే నేనీయాగమును తప్పించితిని. ఐశ్వర్యమత్తులై నన్నెఱుగని వారిని దండించి, నిర్ధనుల గావించి రక్షింతును. ఇప్పటినుండి నీవు నా యాజ్ఞచొప్పున నడచుకొనుము. నీ అధికారమున నుండుము. ఇంకెప్పుడును గర్వింపకుము. నీకు సకల శ్రేయములు కలుగును. పొమ్మ"ని యానతీయగా ఇంద్రునివెంట వచ్చియుండిన కామధేనువు కృష్ణునితో- "దేవా! భూసుర, గోసుర, సాధుసౌఖ్యముల కొఱకు నిన్నింద్రునిచేసి పట్టము గట్టుమని బ్రహ్మ మాకానతిచ్చి పంపెను. భూభారము హరింప నవతరించిన హరియే నీవు."

ఇంద్రుడు కామధేను క్షీరములతో, ఐరావతము తన తొండమున తెచ్చిన గంగాజలముతో అదితి, దేవ, మునిసంఘముల సమక్షమున గోవిందుడని శ్రీకృష్ణుని బ్రాహ్మణులకు, దేవతలకు, గోవులకు, సాధుజనులకు సౌఖ్యముల కొఱకు

ఇంద్రునిగాచేసి పట్టాభిషిక్తుని చేసెను. తుంబురు నారదాదులు సిద్ధచారణులు హరిని కీర్తించుచు గానము చేసిరి. అచ్చరలాడిరి. దేవతలు పుష్పవృష్టి గురిపించిరి. ముల్లోకములు సంతసించినవి. గోవుల పొదుగులనుండి పాలు కురిసినవి. నదులు నిర్మలోదకములతో ప్రవహించినవి. వృక్షములు మకరందముల కురిపించినవి. తీగలు ఫలపుష్పములతో నొప్పినవి. పర్వతములు మణిగణములతో ప్రకాశించినవి. బ్రాహ్మణులు పరస్పర కలహముల మానిరి. ఇట్లింద్రుడు బ్రహ్మ యానతిని శ్రీకృష్ణుని గోవ గోగణపతిగ గోవిందుని పట్టాభిషిక్తుని చేసి స్వర్గమున కేగెను.

వరుణనగరము - నందుని విముక్తి.

ఒక ఏకాదశినాడు నందుడుపవాసముచేసి శ్రీహరిని పూజించి, మరునాడు దుర్ముహూర్తమున చీకటిలో స్నానముచేయుటకై యమునకు వెళ్ళి, స్నానము చేయుచుండగా వరుణుని దూత, నందుని వరుణనగరమునకు గొంపోవగా, మందలోని వారెల్ల నందుడు కనిపించక పోవుటచే కొందలమంది రామకృష్ణులతో మొఱపెట్టగా కృష్ణుడు వరుణనగరమున తనతండ్రి యుండుట తెలిసికొని వేగముగ వరుణనగరమున కేగెను. తన నగరమునకు వచ్చిన కృష్ణుని వరుణుడు శ్రద్ధాభక్తులతో పూజించి, "మాధవా! ఏ దేవుని పాదపద్మముల సేవించిన వారికి మహోత్తమగతులు కలుగునో అట్టి నీవు నా నగరమునకు వచ్చుట నా మనోరథము సిద్ధించినది. నీ సేవచే నా శరీరము ధన్యమైనది. సర్వులను ఆవరించు మాయ ఎవ్వని నావరించలేక యతనికి స్వాధీనమైయుండునో అట్టి మహాత్ముడవు నీవు. సుధీజనరక్షణవర్తీ! ఉదారతపోధన చక్రవర్తీ! నీకు నమస్కరించెదను. నా సేవకుడేమియు తెలియక నీ తండ్రి నిచ్చటికి తెచ్చెను. వీని యపరాధమును సైరింపుము. నన్ను, వీనిని కరుణతో చూడుము." అని వరుణుడు ప్రార్థింపగా కృష్ణుడు వరుణుని కరుణించి, తనతండ్రిని పిలుచుకొని వచ్చెను. నందుడు మందకు వచ్చి, కృష్ణుడు తన్ను వరుణనగరమునుండి విడిపించుకొని వచ్చిన వృత్తాంతము వినిపింపగా, వారు కృష్ణు డీశ్వరుడని తలంచిరి. కృష్ణుడు వారి కోరికను తెలిసికొని సఫలము చేయదలచి వారిని బ్రహ్మకుండమున ముంచి, మొత్తి మాయాదూరము, జ్యోతిరూపము, సత్యము, ఆనందము, బ్రహ్మమైన తనలోకమును, బ్రహ్మలోకమును చూపెను. అంత నందాదులైన గోపకులు పరమానందమును పొంది హంసరూపులైన కృష్ణుని ప్రశంసించి పూజించిరి.

అంత శరదృతువు వచ్చెను. శరత్కాల చంద్రుడు భువనమోహనుడై గగన మండలమున నొప్పెను. శరత్కాల పూర్ణిమయందు అఖండమైన చంద్రమండలమును గాంచి పుండరీక నయనుడు, యమునాతీరమున జగన్మోహనముగ నొక గీతముపాడెను. ఆపాట తమ చెవులబడినంతనే గోపికలు. పనులమాని పరాయత్త చిత్తలై గోవులకు దూడలను విడువలేదు. విడిచి పిదుకక, పిదుకక విడిచి యుండిరి పాలుపితుకలేదు. పితికినపాలు కాచలేదు. కాచినపాలు దించలేదు. దించినపాలు పిల్లలకు పోయలేదు ఒకవేళ పోసినను పశులకు పరిచర్య చేయలేదు. పతిసేవచేసినను భుజింపలేదు భుజించినను కొప్పులలో పూలు ముడువలేదు. ముడిచినను సొమ్ముల దాల్పలేదు తాల్చినను తమ యుండ్లవట్ల నిల్వలేదు. నెత్తి దువ్వుకొనలేదు. మేనికి గంధము పూయలేదు జారినపైటల సవరించుకొనలేదు. చెలికత్తెలతో చెప్పలేదు. సోదరులు మగలు అత్తమామలు వారించినను నిలువలేదు. ఇట్లువారు మన్మథ బాణములచే పీడింపబడి మందగమనలైనను తత్తఱపాటుచే వడివడిగా పరుగిడి గోవింద సందర్శనమునకేతెంచిరి. కొందఱు గోపికలు తమ యిండ్లనుండి రాలేక విరహాగ్నిచే పరితపించుచు కృష్ణుని మనస్సులందే కౌగిలించుకొనినట్లు భావించుచు, జారుడని తలంచియును, పరవశతచే ముక్తిని పొందిరి. ఓ రాజేంద్రా! కృష్ణునకు శత్రువైనను శిశుపాలుడు కైవల్యమును పొందెను, ద్వేషించినవారే ముక్తులైనప్పుడు ప్రేమించినవారు ముక్తులగుటలో ఆశ్చర్యమేమి? అనఘుడు అవ్యయుడు అప్రమేయుడగు గోవిందుని ముక్తి నొసగును సుమీ.

ఆ॥ బాంధవమున నైనఁ బగనైన వగనైనఁ
ప్రీతినైనఁ బ్రాణభీతినయిన
భక్తినైన హరికిఁ బరతంత్రులైయుండు
జనులు మోక్షమునకుఁ జనుదు రధిప.

కాబట్టి అజుడు, పరమ పురుషుడు, యోగీశ్వరుడైన హరిని సోకిన స్థావరంబయినను ముక్తమగును. తన మధుర గానమును వినుటకు వచ్చిన గోపికలను జూచి నేర్పరియైన హరి వాక్చాతుర్య మెలయగా వారితో లతాంగులారా! మీకు భయములేదా! మందకు సింహశార్దూలాది క్రూరములు తిరుగుచుండును కదా! రాత్రి యొంటరిగా ఇంతదూరము రావచ్చునా? చాలు చాలు, మీయిండ్లకేగుడు. మీరిక్కడకు వచ్చినది తెలియక మీ తల్లిదండ్రులు అత్తమామలు మీ భర్తలు మఱదులు మీ కుమారులు, బంధువులు మీజాడ తెలియక హద్దు పద్దులేక

ఎటుపోయిరో వీరింతకు తెగించిరని మీ కొఱకెంతగా గాలించుచుందురో ఇట్టి సాహసపు పనులు మీకు తగునా? మీరు భర్తలను, అత్తమామలను సోదరాదులను వదలి వారి రోతగల్గించుచు జారవాంఛలతో మీరిటకు వచ్చుట తగునా ఇట్లు మీరు వచ్చుట నెవ్వరైన మెత్తురా? మీ భర్తలు ప్రాణత్యాగమునకు సిద్ధపడుదురు. రాజు దండించును. తల్లిదండ్రులు తలయెత్తుకొని తిరుగలేరు. ఇతరులు మీ సంగతి తెలిసినచో దెప్పిపొడుతురు ఆత్మీయులాదరింపరు. బంధువులు వెలివేతురు. ఇతరులకు తెలిసినచో చులకనగా జూతురు. దీనిచే నిహపరముల సుఖమునుగాని కీర్తిగాని ఆనందములేదు. భర్త జడుడు వాడైనను కొఱగాని వాడైనను కురూపియైనను పామరుడైనను జడుడైనను రోగియైనను భర్తను విడుట నీతికాదు. ఏడ్చుచున్న బిడ్డలకు పాలుపోయుడు, లేగలను గోవుల వద్దకు విడువుడు మీ భర్తలను సేవింపుడు. మీరు నన్నుగోరి యిచటికి వచ్చితిరి. మేలు చేకూరును. నాకు సమస్తప్రాణులు ప్రియములైనవి. మీరు నాకొఱకై యిచ్చట నిలువగూడదు, ఆడువారికి భర్తృసేవయే సనాతనమైన ధర్మము. ననుధ్యానించినను నన్నుగూర్చి వినినను, నన్నుదర్శించినను నన్నుగూర్చి గానమొనరించినను నన్నుస్మరించినను చాలును. దానిచే మీరు కృతార్థులగుదురు. మీ యిండ్లకు మీరు పొండు. అనవిని గోపికలు కృష్ణునితో మేము నిన్నునమ్మి మా యిండ్లలో నిబంధనముల తెంచుకొని నీ పాదపద్మములను సేవింప వచ్చితిమి. మోక్షాసక్తులను రక్షించినట్లు మమ్ము రక్షింపుము. పతులను బంధువులను సుతులను మన్నించుటే సతీధర్మమని నీవు చెప్పితివి. పతి, పుత్రులు మున్నగు నామములచే రూపములచే నొప్పువాడవు నీవు. నీ యందుప్రీతిగలిగి నిన్ను సేవింప వచ్చిన మా సంతాపమును తీర్పుము. నీ పాదపద్మములను చేరుటయే మా నోచిననోముల ఫలము. మేము తిరిగిపోము మా పతుల మాటల నంగీకరింపము మాకు నీ దాస్యమునను గ్రహింపుము. నీ దాస్యమును మా కివ్వనిచో మేము బ్రతుకజాలము. నీవు దయతో నీ అభయ హస్తమును మా సర్వాంగము లందుంచుము. అని ప్రార్థించిరి.

అప్పుడు గోపికల దీనాలాపంబుల విని నవ్వి యోగేశ్వరేశ్వరుండైన కృష్ణుడు ఆత్మారాముడై రమించెను.

మ. కరుణాలోకములం బటాంచల కచాకర్షంబులన్ మేఖలా
కరబాహుస్తన మర్శనంబుల నఖాంకవ్యాప్తులన్ నర్మవా
క్పరిరంభంబుల మంజులాధర సుధాపానంబులం గాంతలం
గరగించెన్ రతికేళి కృష్ణుడు గృహం గందర్పుఁ బాలార్చుచున్.

గోపికలు తన్నుగూర్చి పాడుచుండగా తానుప్రీతితో నాడుచు వైజయంతీమాలా భూషితుడైన కృష్ణుడు కలాధికలైన గోపికలను తన్ను సేవింపగా వనభూపతుడై యొప్పెను. అంతకృష్ణుడం తర్హితుడు కాగా గోపికలు కృష్ణుని హాసలీలా విలాస వీక్షణ విహార వచన రచనాను రాగములతో కృష్ణునియందే మనస్సు నిల్పి నేనే కృష్ణుడనన నేనే కృష్ణుడనని కృష్ణుని గుణావేశములతో చరించిరి. వారు కృష్ణుడు మాయ మయ్యెనని తెలిసికొని యమునాతీరమునందలి వనములలో కృష్ణుని వెదుకుచు పాడుచు పోయిరి.

ఓ పున్నాగమా! పున్నాగ వర్ణుని గాంచితివా? తిలకమా నొసల తిలకముగల వానిని తిలకించితివా? ఘనసారమా ఘనసారముచే కోళిల్లువానిని చూచితివా? బంధూకమా బంధుమిత్రుని గాంచితివా? మన్మథ మన్మథాకారుని దర్శించితివా? వంశవృక్షమా వంశీధరుని కంటివా? చందనమా చందన శీతలుని వీక్షించితివా? కుందవృక్షమా కుందరదనుని పొడగాంచితివా? ఇంద్రభూజమా ఇంద్రనీలుని గాంచితివా? కువలవృక్షమా! కువలయేశుని గాంచితివా! ప్రియకమా ప్రియుని విహారి పొడగంటివా అనుచు గోపికలు కృష్ణుని వెదుకుచు పోవుచు మల్లె పొదల గాంచి.

ఉ॥ నల్లనివాఁడు పద్మనయనంబులవాఁడు కృపారసంబుపైఁ
జల్లెడివాఁడు మౌళిపరిసర్పిత పింఛమువాఁడు నవ్వురా
జిల్లెడి మోమువాఁ డొకఁడు చెల్వలమానధనంబుఁ దెచ్చెనో
మల్లియలార మీ పొదల మాటున లేఁడు గదమ్మ చెప్పరే!

ఓ లవంగలుంగ నారంగములారా! మన్మథునికంటె సుందరుడై చూచువారి మనస్సుల కరగించెడివాడును లక్ష్మిచే కోళిల్లు వక్షస్థలమువాడును మధుర మోహనమైన వేణునాదము కలవాడును అగుకృష్ణుడు మమ్ము మన్మథుని తూపులకు గురిచేసి మీ వద్దకు రాలేదు కదా! వచ్చియున్నచో దయచేసి చెప్పుడు. వత్సకములారా! వత్సకాసుర సంహర్తను గాంచితిరా? అర్జునములారా అర్జునవృక్షముల గూల్చిన సుందరాంగుని దర్శించితిరా! కాంచనములార కాంచన కిరీటుని పొడగాంచితిరా? అశోకములారా శ్యామసుందరుని చూచితిరా! పాటలములారా అదిగో నంద నందనుడు దాగెను పట్టుకొనుడు. పలకితరులార హేలావతుల నెందుకు విడిచితివని యడుగుడు. చూత మంజరులారా వనమాలుడిట వచ్చి దాగెనేమో చూడుడమ్మ. మాధవీ తరులారా!

మాధవునకు మా రాక తెల్పి మము రక్షింపుడమ్మా కదళీతరులారా! శిఖిపింఛమౌళిని తెచ్చి చూపుడమ్మా ఓ తులసీ! హరిచరణ ప్రియవు హరికి ప్రేమాస్పదవు హరి నీవైపు వచ్చినచో మాకు తెల్పి పుణ్యము కట్టుకొనుమమ్మా. పొగడలారా! పొగడదగువానిని పొడగంటిరా? మొల్లలారా! మొల్లమైన కీర్తితో రాజిల్లువాడెటు పోయెనమ్మా? కింశుకములారా శుకములవలె పలుకువానిజాడ చెప్పరమ్మా. హరిణీ! నీకు హరిజాడ తెలిసినచో మాకు తెలుపుము. ఓ భూదేవీ కృష్ణుడు వరాహావతారమున నిన్ను కౌగిట చేర్చెను. వామనుడై ఎల్లల్లి నిన్ను కొల్చెను ఇపుడు కృష్ణుడై నీపైన తన పాదచిహ్నము లిఖెను. నీవు పూర్వజన్మలో నేమి నోము నోచితివమ్మా అని గోపికలు తాము గాంచిన తరులను, విరులను కృష్ణుని జాడ తెల్పుమని ప్రార్థించి మదనోన్మాదముచే కృష్ణలీలల ననుకరింప దొడగిరి. ఒక గోపిక పూతనగ నటింప వేఱొక గోపిక కృష్ణరూపమున చన్నుగుడిచెను. ఒకభామ పాలకై యేడ్వగా మఱొకతె నేను శకటాసురుడనెను అంతకృష్ణుని వలె పాలకై యేడ్చు పడతి శకటమునను పల్కుపడతిని తన్నెను. నేను సుడిగాలి ననిచెప్పి యొక రమణి తీసికొనిపోగా నేను కృష్ణుడనని మఱియొకతె అతనివలె మెలగెను. ఒక గొల్లభామ నేను బకాసురుడననగా మఱియొకతె తాను కృష్ణుడనని యామెను పరాభవము చేసెను. ఇద్దరు గొల్లభామలు రామకృష్ణులు కాగా తక్కిన వారు గోపబాలురగుదురు. కొందఱు మేము గోవుల మనగా నొకతె తాను రాక్షసుడననును. ఇంతలో నొకతె తాను కృష్ణుడనని, నా కడుపులో లోకము లిమిడియున్నవి, నీవు తల్లివి, నా నోరుచూడుమని చెప్పెను.

ఒకతె తాను వెన్నదొంగనని చెప్పగా మఱియొకతె యశోదయై యతనిని పూల దండతో కట్టివేసెను. ఒకతె మఱియొకతెను చూపి ఇది కాళీయ సర్పము: మీరు కాళీయుని భార్యలు నేను కృష్ణుడనని యాడెను. కొందఱు గోపికలు గోపకులుగా ఇది యింద్రుడు వానకురిసెనని చెప్పగా మఱియొకతె పైటనెత్తి యిదిగో నేను గోవర్ధనము నెత్తితిననెను. ఒకతె తక్కిన గోపికలతో మీరు గోపకులు అదిగో దావాగ్ని వచ్చుచున్నది మీరటువైపు చూడకుడని తాను దావాగ్నిని మ్రింగినట్లు చేసెను. ఇట్లు గోపికలు కృష్ణుని లీలలను కరించిరి. పిమ్మట పద్మవజ్రాంకుశాది శుభలక్షణ లక్షితములైన హరిచరణముల గాంచి గోపికలు తమలో నిట్లు చెప్పుకొనిరి. ఇచట కృష్ణుడు కొమ్మకు పూలు గోసినాడు. ఇక్కడ పాదాగ్రము మోపినాడు ఇచట నొక సతినెత్తికొని పోయినాడు. ఈ పచ్చికలో పాదచిహ్నములు కనబడుటలేదు. ఇచట ప్రియురాలి కొప్పులో పువ్వులు ముడిచినాడు.

ఇచట కూర్చుండెను. ఇచట నొక స్త్రీకి అధరము నిచ్చినాడు ఇచట నామె నిక్కినట్లున్నది ఇచట స్త్రీతో నీటిలో ప్రవేశించెను. ఇచట రమణితో క్రీడించి నాడు. ఇచ్చట నొకముదితతో కలసి వేణువు నూదినాడు నాలుగు పదములు కన్పించుచున్నవి. మగజాడలో మగువజాడ కన్పడు చున్నది కాన నెచట నొకరెతో నాడిగినాడు ఇచట నొకతె క్రముక్కగా నామెతల నిమిరినాడు. ఇచట తన నొకతె వెంటాడగా వెడలిపోయినాడు అడుగుమీద పడలియడుగు కన్పించుచున్నది. ఇచట నొకతె యెదురుగా కూర్చుండినట్లు కనపడు చున్నది. ఇచట ఆలుపాదచిహ్నములు కనపడుచున్నందున ఇరువురి నడుమ తాను నడచినాడు.

సీ॥ ఏ చరణంబులే యిందుని భావన సనకాది మునియోగ సరణి నొప్పె
నీ పాదతలములే యెలనాగకు శ్రీవధూ సీమంత వీధుల జెన్నుమిగులు
నీ పదాబ్జంబులే యుపకులోత్తమయాన పాలేటి రామాలి పట్టుగొమ్మ
లీసుందరాంఘ్రులే యిందిరరేఖణ ముక్తికాంతామనో మోహనంబు

ఆ॥ లీయడుగుల రజమెయింతి బ్రహ్మాదిదివిజ వరులు పరోక్ష దిశల బాల్తు
రనుచ గొందఱు బంబల్లాముడేగిన క్రీమమ్ము గనియు సతని గానరైరి.

అప్పుడొక గోపిక, ఇట్లు తలంచెను "కృష్ణుడు తనతో విహరింపగా తాను చెలి కత్తెలనెల్ల విడిచి కృష్ణుడు నాకే చిక్కెను కదాయని గర్వించి కృష్ణా! నేను నడువజాలను నన్నెత్తికొను మనగా అతడు మాయ మయ్యెను. "అంత తాను సంతాపముతో ఓ ప్రాణేశ నిలునిలు యెందు బోయెదవని వగచెను. తక్కిన గోపిక లామెను గాంచి విభుడు మన్నింపగా నిటిగర్వించి నేడు మన యెదుట బయటపడినదని వెలుగుపడిరి. ఒక గోపిక యీ పొదరింటిలో తనతో మన్మథ నటన సల్పెననగా మఱియొకతె ఇచట నన్నుకృష్ణుడు కౌగిలించెననెను. ఇంకొకతె యీ చెట్టునీడ కృష్ణుడు తనతో క్రీడించెననెను. మఱియొక పడతి కృష్ణుడు తన యధర పానమిచట చేసెననెను.

ఒకతె యీ పూలపేరిపై కృష్ణుడు తన కొప్పున పూలు తురిమెననెను. ఇట్లా యాయువతులు కృష్ణుని పూర్వలీలల దలచి పొగడిరి. ఇట్లా గోపికలు బృందా వనమున కృష్ణుని వెదకి వెదకి యతడు కన్పింపక పోవుటచే నతనిని వర్ణించుచు నతనిపై పాటలపాడుచు నతనిపై తమ మనోవాక్కాయముల నిల్పి గృహముల పై నిచ్చగూని యమునానదీ సైకతముల జేరిరి.

గోపికా గీతలు.

గోపికలు హరి నుద్దేశించి యిట్లనిరి. ఓ ప్రియతమా! నీవు జన్మించుటచేత బృందావనమున సంపద వర్ధిల్లెను. నీ వెంటనే వారి ప్రాణములు నిన్నను సరించినవి నీ రూపము జూపుము. ఓ సుందరవదనా! నిన్ను కోరిన నీ దాసులను బాధించుట నీకు తగునా? మమ్ము నీవు విషజలములనుండి, కొండ చిలువ రూపున నుండిన రాక్షసునినుండి, గాలివాననుండి, అగ్నినుండి రక్షించి యిప్పుడు మన్మథుని నుండి రక్షింపకుండుట తగునా? కృష్ణా నీవు యశోద కుమారుడవా కావు సమస్త ప్రాణులలో ఆత్మరూపమున వెలుగు వాడవు. బ్రహ్మనిన్ను సమీపించి లోకముల రక్షించుటకు భూమియందవ తరింపుమని నిన్ను వేడగా భూమిని రక్షించుటకై సత్కులమున మనోహరాకారమున బుట్టితివి. చరణ సేవకులకు సంసార భయమును బోగొట్టి శ్రీకరమై కామితముల నొసగు నీ కరకమలమును మా మస్తకములపై నుంచుము. మాధవా! నీవు గోవుల వెంటబోవుచు సేవించు వారల పాపముల బోగొట్టుచు శోభతో నొప్పుచు కాళీయుని పడగలపై గౌరవ స్థానము నలంకరించిన నీ పాదపద్మమును మా కుచములపై మోపి మన్మథ బాధను తొలగింపుము. నీవాక్కు బుధులను రంజింపజేయును సూక్తము. మధురము నీ యధరామృతము నొసంగి మన్మథ తాపమును శమింపజేయుము. ఓ కమలదళనేత్రా! మగువలపై క్రౌర్యము చూపించుట న్యాయమా? నీవు భక్తులభయమును తొలగించువాడవు నీ దాసులకు మన్మథ భయము పోగొట్టకుండుట తగదు. నీ నగుమొగము చూపి మమ్ము కాపాడుము. నీపాద భక్తిలేని వారికి నీ చరణదాస్యము చేయని వారికి, మిగుల సంపన్నమై, వినినచో శుభము కల్గించునదియై, కామాది వికారముల నశింపజేయునదియై సనకాదులచే స్తుతింపబడినదై, నిరంతరము తపస్సులచే సంతప్తులగు వారికి జీవనమై యొప్పెడు నీ కథామృతము గ్రాగుటకు లభింపదు. కృష్ణా నీ నవ్వులు, నీ చూపులు నీ వివిధ విహారములు నీ ధ్యానములు, నీ ప్రియభాషణములు మా మనస్సులలో గాఢముగ నాటుకొని తొలగుటలేదు. ఓ కమలనయనా! నీవు మందనుండి వెడలి అడవులలో గోవుల వెంట తిరుగగా కమలములవంటి నీ పాదములు గడ్డిని శిలలందాకి యెంత నొచ్చునోయని మా హృదయములు క్షోభించును. నీ పాదయుగము భక్తులకోరికల దీర్చును. బ్రహ్మచే సేవింపబడినది. మాధవా సాయంకాలమున నీవు వనమునుండి వచ్చి గోపాద ధూళిచే నిండిన కుంతలములు గలదియు,

పద్మమువలె శోభించునదియునగు నీ ముఖమును మాకు జూపి మా హృదయములలో క్రమముగ మదనుని పుట్టింతువు. ఓ ముకుందా! సురత వర్ధనము శోకాపహరణము వేణుసంగతము, అన్యరాగ జయశీలమగు నీ యధరామృతముచే మా తాపమును చల్లార్పుము.

ఉ॥ నీవడ వింబగల్ దిరుగ నీకుటిలాలక లాలితాస్యమి
చ్ఛావిధిఁ జూడకున్న నిమిషంబులు మాకు యుగంబులై చనం
గావున శాత్రులైన నినుఁ గన్నుల నెప్పుడుఁ జూడకుండల
క్ష్మీవర ఱెప్పలడ్డముగఁ జేసె నిదేల విధాత క్రూరుఁడై.

నాథా! నీ మధురగీత రవమును విని, బంధువులు మగలు అన్నదమ్ములు పుత్రులు మున్నగు వారిని వదిలి మోహముచే నిన్ను చేరవచ్చితిమి. ఇట్లనన్య భక్తలైన మమ్ము వీడి నీ వెక్కడ పోయితివో మాకు తెలియదు. నీవంటి నిర్దయుడుండునా? నీ మంతనములు సరసపు చూపుల జూచు నీ నగుమొగము లక్ష్మీనివాసమగు నీ వక్షస్థలము మా మనస్సులలో నిలిచిమమ్ము కట్టివేసినవి.

మ॥ అరవిందంబులకంటె కోమలములై యందంబులై యున్న నీ
చరణంబుల్ కఠినంబులై మొనయు మాచన్నుంగవల్ మోవఁగా
నెరియంటోలు వటంచుఁ ద్రొక్కుదుము నీ యీకర్క శారణ్యభూ
పరిసంచారము కృష్ణ నీ ప్రియలకుం బ్రాణవ్యథం జేయదే.

కృష్ణా కఠినములైన మన్మథుని బాణములు మాలో నాటుకొనగా నీ పాదములను పట్టుకొన వచ్చితిమి నీవు మమ్ము నట్టడవిలో దించిపోవుట న్యాయమా? మేము మందభాగ్యులము. విధి మా హృదయములను మెత్తగా నీ హృదయమును కఠినముగా చేయనేల? ఓ కృపానిధీ! రాక్షసులు దేవతల నాక్రమించి వారిపై బాణములను వర్షింపగా నీ వడ్డమువచ్చి దేవతలను రక్షింతు వందురు. అనాథలై నిన్నే నమ్ముకొని వచ్చిన ముద్దరాండ్రను రెండు మూడమ్ములవాడగు మన్మథుడు బాధించు చుండగా అడ్డము రమ్ము. హరీ! గోవిందా! మా మనస్సులను, చెఱకు విలుకాడు బాణములచే వ్రయ్యలు చేసెను. వాకు యాలించి మమ్ము కాపాడుము. ఇట్లు గోపికలు కృష్ణు నుద్దేశించి మాధవా, దయానిధీ! భక్తవత్సలా! మన్మథ మన్మథా మంగళాంగా! వనమాలీ! కమలాక్షా! లక్ష్మీవల్లభా ముకుందా! మోహనాంగా! శుభాకారా రావే కరుణింపవే మనవవే మమ్ము ధరింపవేయని మొఱపెట్టగా భక్తరక్షకుడు,

త్రైలోక్య మోహనుడు మనోహరాకారుడు పీతాంబర ధారియైన హరి వారి యెదుట నిల్చెను. ఇట్లు వచ్చిన జగన్నాథుని జూచి తమ వల్లభుడు వచ్చెనని వికసిత వదనారవిందలై, ప్రాణములు వచ్చినట్లు సంతసించి యుప్పొంగి పోయిరి. అంతవారు కమలాక్షు నకిట్లు సపర్యల గావించిరి.

ఒక పడతి భక్తితో నంజలి ఘటించి ప్రాణేశ్వరుని కేలుబట్టికొనెను. ఒకయింతి జీవితేశ్వరుని బాహువును తన వీపుపై నుంచుకొని మురిసిపోయెను. ఒక వనిత ప్రియుని తాంబూల చర్వితమును తన చేతదాల్చెను. ఒక కాంతకృష్ణుని పాదమును తన వక్షముపై హత్తుకొనెను. ఒక రమణి కనుబొమల ముడివేసి ప్రణయ భంగము కలుగగవచ్చు రోషమును ప్రకటించు దండించుచున్నట్లు కృష్ణుని వాడి చూపులతో జూచెను. మఱియొకతె హరి ముఖకమలమును రెప్పలార్పక చూచెను. ఒక సుందరాంగి కమల నయనుని సుందరమూర్తిని తన చూపులనెడి తీగలతో బంధించి తన హృదయమునచేర్చి బయటికి పోకుండ కన్నులు మూసి రాని శరీరము పులకరింపగా మనస్సునందే కౌగిలించుకొని యోగివలె మానసికానందమును పొందుచుండెను. ఒకకాంత ప్రాణేశ్వరా! మమ్ము వంచించి నీ వెక్కడికి పోయితివని కోపముతో తూలనాడినది. ఒకభామిని కమలాక్షా! నన్ను విడిచి పోవుటకు నీకు కాళ్ళెట్లు వచ్చినవని దీనముగ పలికెను. ఒక రమణి నాథా నీవు పోగా నా ప్రాణము మిగిలినది నాది నిజమైన కూర్మియేనా యని కుమిలి పోయినది. ఒక పడతి యింతవరకు పాడుదైవము మనల దూరముచేసెను కదా యనెను. ఒక ముదిత నీవు నన్ను విడిచిపెట్టి పోయితివి కదా నేనేమి తప్పుచేసితినని ప్రశ్నించెను. మఱియొకతె హృదయేశా! ఏ పుణ్యఫలముచేతనో మరల నిన్ను చూడగంటినని పలికెను. ఒక కలకంఠి మాటదప్పిన యీ రమణుడు తనకు తానై నన్ను పలుకరించిననే నేనితనితో మాటలాడుదునని బింకముగ పలికినది. శ్రీకృష్ణుని సౌందర్యమును గాంచి కాంతలు విరహ తాపజ్వరము పోగొట్టుకొనిన వారై పరమేశ్వరుని గాంచి ముక్తులైన వారివలె మిక్కిలి సంతసించిరి. అంత కృష్ణుడా కాంతలతో కూడి శరత్కాల చంద్రకిరణ సందోహముచే నంధకారమును చీల్చివైచిన ఆ పున్నమరేయి, యమునానది యందలి స్వచ్ఛమైన యిసుక తిన్నెను ప్రవేశించిరి. శ్రుతులు జ్ఞానకాండమున ఈశ్వరుని దర్శించి కామానుబంధముల విడిచినట్లు గోపికలు విరహ వేదననుమాని పరిపూర్ణ మనోరథలై తమ హృదయ పీఠములందు హరిని నిల్పుకొనిరి. వారు శ్రీకృష్ణుని కాలుసేతుల పిసుకుచు మేలమాడుచు కూర్మితో కౌగిలించుకొనిరి.

పాటు రాసక్రీడను గాంచుచు మెల్ల మెల్లగ పయనించుచుండెను. అంతలో చల్లనిగాలి వారిపై వీచెను. ఆ గాలిలో యమునా జలకణములు, వనపుష్పముల సౌరభము కలదు. ఆ గాలి గోపికల చెమటను వారించెను. వారి శ్రమను తొలగించెను. వారి మనస్సులకు హాయి నొసంగెను. కృష్ణుడు చాల సంతసించెను. కృష్ణుడు పాడుచుండగా నొక పడతి భాస్వరస్వర ప్రస్తారమేర్పడ వీణవాయించెను. ఒక రమణి తానాడుచు పాడుచు, కృష్ణుని కరమును తనవక్షముపై చేర్చెను. చందనచర్చితమై, కమల సౌరభ సంభరితమైన తన భుజము నొకసుందరి వీపునముంచగా, ఆమె పులకరించి పరవశించెను.

ఇట్లు కృష్ణుడు హాసములతో, కరతల విన్యాసములతో, దర్శనములతో మధురాలాపములతో, రాసక్రీడలనలసైన భామలను కరుణతో మన్నించెను. ఆ సుందరాంగులు నందనందనుడు తమతోగూడి యాడి, నందులకు తమ పూర్వపుణ్యముల పొగడుకొనిరి.

జ ల క్రీ డ.

వారి రాసక్రీడ చాలించి వడగళ్ళతోకూడిన మెఱుపుతీగలవలె చెమట బిందువులచే నిండిన శరీరములుగల గోపికలజూచి వారితోపాటు జలక్రీడ చేయదలచి యమునా జలముల ప్రవేశించె సుందరీమణులు మోకాళ్ళలోతు, నడుములోతు, గొంతులోతనుచు ప్రవేశింపగా వారి కుచములు చక్రవాకములుగా, నేత్రములు మీనములుగా, నాభివివరములు ఆవర్తములుగా కురులు శైవాలములుగానుండ వారినిగాంచి యమున వారిని యీడుగల నదులగా భావించి, తరంగహస్తముల చాచి, కౌగిలించుకొన వారు భయపడుచు పద్మములకై చేతులుసాచి, హంసల వెడలగొట్టుచు, కాంతాకుచకుంభములకు సాటిరావలెనని నీటిలో తపమాచరించు చున్నట్లున్న చక్రవాకముల దోలుచు, చంద్రుడు తమ వదనబింబములకోడి సిగ్గుపడి, మింటినుంటి నీళ్ళలోబడి కంపించుచున్నటుల చలత్తరంగములందోచు చంద్రునిగాంచి సంతసించుచు, తామర పువ్వులు, కలువలు మున్నగువాని పుప్పొడుల కైకొనుచు, తమముఖములజూచి పద్మములనెడి భ్రాంతితో తమమోములపై ముసిరికొనవచ్చు తుమ్మెదలకు భయపడుచు చేతులతో నీళ్ళుచల్లుచు, కృష్ణుడు తమపై చల్లునీళ్ళతో తడియుచు, మన్మథ బాణములవలె తమ శరీరములు ప్రకాశింప నీళ్ళలోదిగి సరసాలాపములాడుచు కృష్ణునిపై జలకముల చల్లుచు, అత డుక్కిరిబిక్కిరి యగునట్లు ఏనుగుతొండములవంటి తమ హస్తము

[illegible]

[illegible]


[illegible]

> [illegible]

[illegible]

[illegible]

[illegible]



శాపవశమున అజగర రూపియైన సుదర్శనుడు నందుని బట్టుకొనుట. పుట. 489

గోపకులందఱు మేల్కొని, కొఱువులను పట్టుకొని వచ్చి పెద్ద పెద్ద గుదెలతో దానిని కొట్టినను అది నందుని పట్టుకొనియుండగా, కృష్ణుడు దానిని కాలితో తన్ని త్రొక్కగా, ఆ సర్పము సర్పరూపము విడిచి విద్యాధరరూపమును దాల్చి హరికి మ్రొక్కెను. అంత కృష్ణు డాతనిని జూచి దివ్యమూర్తితో, శతవహోర ముతో శుభలక్షణుడవై యొప్పు నీకు ఈ క్రూర సర్పరూపము వచ్చుటకేమి కారణమో తెలుపుమనగా, నతడు- "దేవా! నేను విద్యాధరుడను. నా పేరు సుదర్శనుడు. నేను ఒకనాడు విమానము నెక్కి రూపసంపద్గర్వముతో విహరించి కన్నులు పెత్తికెక్కి కురూపులైన అంగిరస ఋషులను జూచి నవ్వితిని. వారు కోపించి, 'నీవు రూపగర్వముచే మమ్ము పరిహసించితివి కావున మహాసర్పమవై పుట్టు'మని నన్ను శపించిరి. నేను నా యపరాధమును మన్నింపుడని యాంగీరసుల వేడుకొనగా వారు కరుణించి, హరి భక్తుల కభయమిచ్చుటకు యదుకులమున పుట్టి, యా యడవి కొకనాడు వచ్చును. నీవు ఆ హరి పాదతాడనముచే సర్పరూపమును విడిచి నీ పూర్వరూపమును పొందగలవని శాపవిమోచనముగూర్చి చెప్పిరి.

పరమాత్మా! నిన్ను ధ్యానించినను, నిన్నుగూర్చి వినినను, నీ పేరుచ్చరించినను పాపజాలమంతయు కృశించి నశించునట. నీ పాదము నామీదపెట్టగా బ్రాహ్మణ శాపముచే నేర్పడిన యీ యురగరూపము పోయినది. నీవలన నేను శాపవిముక్తుడనై కృతార్థుడనైతిని." అని విన్నవించి ప్రదక్షిణముచేసి మ్రొక్కి సుదర్శనుడు దివమున కేగెను. నందుడు సర్పముక్తుడయ్యెను. ఆ విషయము నెఱింగి గోపకులు దేవతా మహోత్సవమును పూర్తిచేసి కృష్ణుని కీర్తించుచు బృందావనము చేరిరి.

శంఖచూడ సంహారము.

ఒకనాటి రాత్రి రామకృష్ణులు పట్టుపుట్టములగట్టి పుష్పమాలల ధరించి, చందన చర్చ గావించుకొని, అలంకారముల నలంకరించుకొని, పుష్పమకరంద పానము చేసి మత్తిల్లి ఝుంకారముచేయు తుమ్మెదలపాటల వినుచు, వనమున వెన్నెలలో గోపికల సన్నిధిలో చక్కగ పాటపాడిరి. అంత గోపికలు రామకృష్ణుల పాట చెవిసోకగనే తమదేహముల మఱచిరి. రామకృష్ణు లిట్లు సకలభూత సమ్మోహనంబైన గానముచేయుచు స్వేచ్ఛగ సంచరింప, కుబేరభటుడైన శంఖచూఢుడనువాడు రామకృష్ణులచే రక్షింపబడుచున్న గోపికలను తన యోగబలముచే

ఉత్తరదిక్కునకు గొనిపోవుచుండగా, వారు పులిబారిబడిన గోవులవలె "రామా! కృష్ణా!" యనుచు మొఱపెట్టగా విని అన్నదమ్ము లిద్దఱు మద్దిచెట్ల పెకలించు కొని కాలమృత్యువులవలె భయంకరులై "ఓ ముద్దియలారా! భయపడకు"డనుచు యక్షుని ముట్టడింపగా, వాడు తత్తరముతో గోపికల నచ్చట వదలి పరుగెత్తెను.

అంత కృష్ణుడు గోపికల రక్షించుచుండుమని బలభద్రునకు చెప్పి, "ఓరీ యక్షా! నిలునిలు పారిపోకు"మని, వాడే విధముగ ఎక్కడ దాగెనో ఎటుపోయెనో చూచుచు వానిని వెన్నంటుచు, వాని బలమైన పిడికిటితో వాని తల తెగునట్లు చేసి పట్టుకొని, వాని శిరస్సునందు దివ్యమణిని గోపికల సమక్షములో గ్రహించెను. ఇట్లు కృష్ణుడు శంఖచూడుని చంపి వాని శిరోరత్నమును దెచ్చి బలభద్రున కిచ్చెను.

ఒకనాడు కృష్ణుడు గోవుల మేపుట కడవి కేగెను. అంత గోపికలు విరహవేదనను భరింపజాలక తమలో నిట్లు చింతించిరి—

"వల్లభుడు తన కెమ్మోవిపై వేణువును చేర్చి సుస్వరముగా వేణువును ప్రయోగించుచుండగా భర్తలతో కలిసియున్నను ఆకసమున సంచరించు దేవాంగనలు పరవశత్వముచే కోకముడుల వీడుచున్నను గమనింపరు."

"ఓ రమణీ! నవమాధుర్యముగల కృష్ణుని మురళీనాదామృతము చెవులలో ప్రవేశించినంతనే గోవులు మేతల చాలించి, శంఠముపై కెత్తి దేహేంద్రియ వ్యాపారము లుడుగుచును సుమా! ఓ కమలాక్షీ! కృష్ణు డుజ్జ్వలరూపుడై గాన విద్యా కౌతూహలముచే మనోహర మురళీగానము చేయగా విని, మెఱపుతీగతో కూడిన మేఘమంగా భావించి, నెమళ్ళు సంతసించి కేకారావముల గావించును. అబలా! యెందుకు తెల్లవారినది. సూర్యుడేల యుదయించెను. ఎప్పుడును రాత్రిగనే చేసిన ఎంత బాగుండెడిది. మన్మథుడు నిర్దయుడు ఎప్పుడు పొద్దుగ్రుంకునో, కృష్ణునితో సంభోగ మెప్పుడు కలుగునో. ఓ మదవతీ! ఎప్పుడు పొద్దుగ్రుంకును? కృష్ణుడు గోవులమేపి యెప్పుడు వచ్చును. అతని ముఖపద్మము నెప్పుడుజూతును! అతడు వచ్చి నన్నెప్పుడు గౌరవించును? చెలీ! కృష్ణుడు నన్ను వీడి వనమునకు పోయినప్పుడు నాకొక్క ఘడియలు రోజులుగా పక్షములుగా, నెలలుగా సంవత్సరములుగా మహాయుగములుగా కల్పములుగా తోచును."

గోపికలు కృష్ణ విరహదుఃఖముచే బహువిధముల పశ్చాత్తాపమును పొందుచు, అతికష్టముపై పగలు గడిపి సాయంకాలమునందు అదిగో సూర్యుడస్తమించెను

సాయంకాలమయ్యెను. అదిగో గోధూళి రేగుచు కన్పించుచున్నది. బృందావనమునుండి అదిగో ఎద్దులసద్దు వినబడుచున్నది. మనవల్లభుడు వచ్చెను. రండు రండని సంబరముతో గోపికలు కృష్ణున కెదురు వత్తురు. కృష్ణుడు తన కెదురు వచ్చిన గోపకాంతలను గౌరవించెను.

వృషభాసుర సంహారము.

ఒకనాడు అరిష్టుడను రాక్షసుడు వృషభాకారమును వహించి కృష్ణునకు కీడు కలుగచేయదలచి బృందావనమునకు వచ్చెను. ఆ వృషభముయొక్క మూపురము కొండకొమ్మువలె నెత్తుగనుండెను. దాని అంకె వినినచో గర్భవతుల గర్భము జారిపోవును. దానికాళ్ళతో ఎగురుగొట్టబడిన ధూళి పైకిపోయి సూర్యునావరించును. అది కొమ్ములతో చిమ్మినచో భూమియంతయు పెల్లగిల్లును. అట్లు వృషభరూపమును ధరించిన అరిష్టుడు పొగరుతో తలనెత్తి అంకెవేసి కాలితో నేలను రాచుచు, వాడికొమ్ములుచాచి వేగముగా మందపైకి దుమికెను. దానిని చూచి భయముతో లేగలు తల్లులను చేరెను. గోవులు ఎద్దులవద్దకు పారిపోయెను. తల్లడిల్లిన దూడలు, గోవులు, ఎద్దులు కలిసి గోపకులవద్దకు చేరెను. గోపకులు, ఎద్దులు, గోవులు, దూడలు పారిపోవుచుండెను. అంత భయముచే దిక్కుతెలియక పారిపోవుచు, తననాశ్రయించి రక్షింపుమని వేడుచున్న గోప-గోపికలను చూచి కృష్ణు డరిష్టునితో నిట్లనెను—

"వృషభాసురా! బాలురను స్త్రీలను పశువులను పారద్రోలుట కార్యమేనా. నీ ఆగడము చాలింపుము. నీ పౌరుషము వీరిపై చూపుట తగదు. నీకు శక్తిగలదేని నాపైకి రమ్ము. ఈ కృష్ణ శార్దూలము నీ మెడకొరికి చంపక పోనివ్వదు. అనుచు ధిక్కరించి బాహువు లప్పళించి పట్టుదలతో తన చేయిచాపి దాని యెదుట నిలిచెను. అంతట వృషభాసురుడు గిట్టలతో నేలను త్రవ్వుచు తోకనాడించుచు, కొమ్ములొడ్డుచు, కన్నులనుండి నిప్పులరాల్చుచు, వడివడిగా వచ్చి, శత్రుగర్వము నణచు కమలాక్షుని తాకెను. అంతట యాదవసింహుడైన కృష్ణుడు వృషభాసురుని వాడికొమ్ముల రెంటిని గట్టిగా పట్టుకొని, ఏనుగు నేనుగును త్రోయునట్లు దానిని పదునెనిమిది యడుగుల దూరము త్రోయగా ఆ రాక్షసుడు దిమ్మదిరిగి, దేహముపై చెమటపుట్టగా దురహంకారముతో జనార్దనుని ఢీకొనెను. అంతట కృష్ణుడు వృషభాసురుని కొమ్ములు పట్టుకొని నేలపై వానిని కూలవేసి తొక్కి, వాని కొమ్ము పెరికెను. అంతట వాడు శక్తి క్షీణింపగా

ముక్కునుండి నోటినుండి నెత్తురు కారగా, మూత్రము విడిచి పేడపెట్టుచు చచ్చిపడిపోయెను. కృష్ణుడీ విధముగ వృషభాసురుని చంపగా దేవతలు హర్షముతో పుష్పవృష్టి గురిపించిరి. గోపకులు సంతసించిరి. రామకృష్ణులు ఆనందించి తమ గృహములకు విచ్చేసిరి.

ఒకనాడు నారదుడు మధురకు వచ్చి కంసునితో నిట్లనెను. యశోదకు యోగ మాయ పుట్టినది. కృష్ణుడు దేవకీ పుత్రుడు. బలరాముడు రోహిణికి పుట్టెను. బలరామకృష్ణు లిద్దఱు బృందావనమున పెరుగుచున్నారు. నారదుని మాటల విని యిది మహోద్భుతముగ నున్నదని కోపించి యీ వసుదేవుడు తన కొడుకును తీసికొనిపోయి, మందలో నుంచి, యశోదకు పుట్టిన శిశువును తెచ్చి అష్టమ గర్భము ఆడకూతురని నన్నింత మోసపుచ్చెను. ఈ వసుదేవునిపట్టి చంపుదునని చివాలున కత్తిదూసి యతనిని చంపుటకు రాగా నారదుడతనిని వారించి, ఈ ప్రయత్నము చాలింపుము. వసుదేవుని చంపకుమని తెల్పిపోయెను. కంసుడు తీవ్రకోపముతో దేవకీ వసుదేవులను ఇనుప సంకెళ్ళతో బంధింప చేసెను. పిమ్మట కేశియను వానిని పిల్చి రామకృష్ణులను చంపుమని వాని కాజ్ఞనిచ్చి మంత్రులను భటులను, మావటివారిని, చాణూరుని, ముష్టికుని సాల్వకోసల ప్రముఖులను రప్పించి వారితో నిట్లనెను. నన్ను ఇంద్రుడు మొదలగు దేవతలు కూడ ఎదిరింపలేరు. ఇప్పుడు బృందావనమున గోపబాలురై బలరామకృష్ణులు పెరుగు చున్నారట. వారు కన్ను మిన్నెఱుగక, యుద్ధములో కంసుని చంపుదుమని దంభములకు పొక్కుచున్నారట ఇంతటి వింతల నెప్పుడైన వింటిరా? మన పట్టణములో మల్ల యుద్ధము జరుగునని చాటింపుడు. మల్లయుద్ధమునకు తగిన రంగస్థలమును సిద్ధము చేయుడు ఆ వినోదమును మన పట్టణ వాసులందఱు చూడవలెను. ఓ చాణూర ముష్టికులారా! మీరు మహాబలశాలురు. మహాప్రతాపవంతులు పెక్కు విధముల మల్లయుద్ధము చేయుటలో నేర్పరులు. మీ బలప్రతాపములు, శక్తిసామర్థ్యములు త్రిలోక ప్రసిద్ధములుమీరు ప్రజల సమక్షమున ఆ రామకృష్ణులను మల్లయుద్ధమున నైపుణ్యముతో మర్దించి నాకు సంతోషమును కల్పించుటకు సిద్ధముగ నుండుడు. తన, మదజలపు సువాసనకు తుమ్మెదలు మూగుచుండ ప్రసిద్ధమైన కువలయాపీడమను. నామదపుటేనుగు నాభవన ప్రాంగణమునమున్న స్తంభము నుండును. రామకృష్ణులు సమీపింపగనే దానిని మీరు రెచ్చగొట్టి అదలించి మీరు వారిపై కుసిగొల్పుడు మీరు పశుపతికి ప్రీతి గల్గించుటకు జంతు బలుల నిండు ఈశ్వరుడు

సంహరించిన మనకు జయము కలుగును. రాబోవు చతుర్దశినాడు ధనుర్యాగము ఏర్పాటుచేయుటకై సిద్ధముచేయుడు అని వారిని పంపించెను. పిమ్మట కంసుడు యదుశ్రేష్ఠుడైన అక్రూరుని పిలిపించి యతని చేయిపట్టుకొని యిట్లు చెప్పెను. క్రూరస్వభావము లేనివాడవగుటచే నీకు అక్రూరుడను పేరు సార్థకమైనది. నీతో నెవరైనను స్నేహము చేయగలరు. బృందావనమున మందలో గొల్లపిల్లలుగా నున్న బలరామకృష్ణులు నన్ను చంపుటకు వ్విళ్ళూరు చున్నారట. నీవు వారిని పిలుచుకొని వచ్చి నా కప్పగింపుము. నాకు భయపడి దేవతలు నారాయణునకు మొఱపెట్టుకొనగా ఆ నారాయణుడే నన్ను చంపుటకై వసుదేవునకు కృష్ణుడై పుట్టినాడని వింటిని. కావున నీవు గొల్లలనుండి పన్నుపుచ్చుకొని వారిని ధను ర్యాగమునకు రమ్మని చెప్పి రామ. 'కృష్ణులను పిలుచుకొని రమ్ము' నీవు వారిని పిలుచుకొని రాగా నాయింటిలోని మదపుటేనుగు వారిని మర్దించును. అది కొమ్ములతో కొండలనైన కూల్చును. బ్రహ్మాండమును పెకలించి వేయును. దానికి రామకృష్ణులను గూల్చుట ఒక లెక్కయా? అక్రూరా! చాణూర ముష్టికులనెడి, జెగజెట్లు నావద్ద కలరు. బలసంపదలో వారు వాయుదేవుని మించెదరు. అట్టివారు మల్లయుద్ధమున రామకృష్ణులను తేలికగా చంపి వేయ గలరు. ఆ రామకృష్ణులు మరణించినచో నేను వసుదేవాదులను చంపి దుర్మార్గుడు రాజ్యదాహము గలవాడు, ముదుసలి, మా తండ్రియైన ఉగ్ర సేనుని హతమార్చి, పినతండ్రియైన దేవకుని బరిమార్చి శత్రువులనెల్ల సంహరించి, జరాసంధ నరక బాణ శంబరాదులైన మిత్రులతో కలిసి భూమండలము నంతటిని హాయిగా పరిపాలింతును. నీవు మంద కేగుము. వెంటనే నీవెంట వారిని పిలుచు కొని రమ్ము. ధనుర్యాగము పేరుచెప్పి వారిని పిలుచుకొని రమ్ము. వారిని చంపించుటకై నేనీ పన్నాగము పన్నితిని. ఈ రహస్యము బయట పెట్టకుము. శత్రువులవృద్ధి నుపేక్షింపరాదు. అని కంసుడు చెప్పెను.

అనగా విని అక్రూరుడు కంసునితో ఓ రాజా! నీవు పంపుటయు నేను పోకుండుటయా! మానవులు తమ్ము తాము అలిసికొనరు. దైవయోగముల నెఱుగరు తమకు తోచినట్లు నిరాటంకముగ సంచరింతురు. అది కాదనరాదు. ఎవరికిని ఈశ్వరేచ్ఛ తప్పింప వీలుకాదు. నీకు శత్రువులైన కుమారులను పిలుచు కొని వచ్చెద. పోయివచ్చెదనని చెప్పి అక్రూరుడు వెడలిపోయెను.

కేశివ్యోమాసుర సంహారము.

అంతలో కంసునిచేత ప్రేరేపింపబడి, కేశియను రాక్షసుడు అశ్వరూపమును ధరించి మందకు వచ్చెను. తన గిట్టల యొత్తిడికి భూమి కంపించు చుండగా తన సకిలింపు

నకు దేవతలు గజగజ వణకు చుండగా తనజూలు విసరగా వచ్చుగాలిచే మేఘములు విమానములపై బడగా, నోటిలోని దంతములు ప్రళయాగ్నిజ్వాలలవలె మెఱయగా యమపాశమువలె తోక వెలయు చుండగా కేశి బృందావనమున ప్రవేశించి భీకరముగ సకిలించుచు హరి యెక్కడ యేడి యని యడుగుచుండగా కృష్ణుడు వచ్చి ఓయీ రాక్షసాధమా! పేదలైన గొల్లల బెదరించుట వీర ధర్మముకాదు. ఇదిగో నేను వచ్చితిని ఇక నీ వెక్కడికి పోయెదవు రమ్మని సింహము వలె కృష్ణుడతని నెదిరించెను. అంతట కేశి సింహగర్జవంటి తన సకిలింపుతో మ్రింగు వానివలె నోరు తెరిచి కృష్ణుని కఱచుటకు రాగా కృష్ణుడు తప్పించుకొనగా కేశి కృష్ణుని తన్నెను. కృష్ణుడాతని తన్నుకు పడిపోక కోపించి కన్నులనుండి నిప్పుల గురిపించుచు వడిగా ఆ రాక్షసుని కాళ్ళుపట్టుకొని నూఱు ధనువుల దూరమున గరుడుడు పాముపిల్లను విసరివైచునట్లు విసిరివేసెను. అట్లు పడి కేశి వెంటనే లేచి హుంకరించుచు కృష్ణునిపై బడగా కృష్ణుడు, పాము నోటిలో కొండను పెట్టినట్లు కేశినోట తన చేతినుంచి వాని నోటినుండి పండ్లురాలగా తన చేతిని వాని పొట్టలోనికి పోనిచ్చి దానిని విస్తరింపజేయుచు కేశికి ఊపిరాడకుండ చేసెను. అంత ఊపిరాడక అశ్వాసురుడు దేహమునుండి చెమట పుట్టగా, గ్రుడ్లు మిటకరించి గిలగిల తన్నుకొనుచు నేలపైకూలెను. అశ్వాసురుని నోటిలో కృష్ణునిచేయి అంతకంతకు విశాలమై పెరుగగా వానిదేహము దోసపండువలె రెండుగా చీలెను. దేవతలు కృష్ణునిపై పుష్పములవర్షించి కొనియాడిరి. అంత నారదుడు మందకువచ్చి గోవిందుని దర్శించి రహస్యముగ నిట్లుచెప్పెను. ఓ జగదీశా! నీవు సర్వాంతర్యామివి. సర్వేశ్వరుడవు, సర్వాధారుడవు, నీ మాయచే గుణములను కల్పింతువు. ఆ గుణములచే సృష్టి స్థితిలయముల గావింతువు. నీవు, రాజులై భూమిని పుట్టిన రాక్షసులను సంహరించి భూమిని రక్షించుట కవతరించితివి. ఓ దేవా! నీచేత చాణూర, ముష్టిక, గజ, కంస, శంఖ, యవన, ముర, నరక, పౌండ్రక, శిశుపాల దంతవక్త్ర సాల్వాదులైన దానవులు మరణింతురు. నీవు పారిజాతమును భువికి తెత్తువు. నృగునకు శాప విముక్తి కలుగును. శ్యమంతకమణి సంగ్రహింపబడును. మృతుడైన బ్రాహ్మణ బాలుని తెచ్చి యిచ్చుట జరుగును. నీ వర్జునునకు సారథివై అనేకాక్షౌహిణుల బలమును వధించెదవు. ఓ కృష్ణా! నీవు గావించు ఘనకార్యములను బ్రహ్మాదులైనను లెక్కింపలేరు. నీవు విష్ణుడవు జయశీలుడవు. సహనశీలివి. ప్రభుడవు విశ్వేశ్వరుడవు. నీ కివే నా నమస్కారములని చెప్పి నారదుడు వెడలిపోయెను.

ఒకనాడు గోపకులు కృష్ణునితో కలిసి పసుల మేపుచు ఒక కొండవద్ద బాగుడు మూతలాడు చుండిరి. వారిలో కొందఱు గొఱ్ఱెలుగా కొందఱు గొల్లలుగా కొందఱు దొంగలుగా మెలగిరి. ఆ దొంగలలో మయాసురుని పెద్దకొడుకగు వ్యోమాసురుడు ఆ గోపకులలో నొకడై, గొఱ్ఱెలుగా నటించు గోపబాలుర నందఱిని దొంగతనముగ ఆ కొండ గుహలోనికి తీసికొనిపోయెను. వారిలో నలుగు రైదుగురు మాత్రమే మిగిలియుండిరి. వ్యోమాసురుడు వారిని కొండ గుహలో నుంచి యొక పెద్దఱాతిని ఆ కొండ గుహాకడ్డముగా పెట్టి మామూలుగ రాగా వానిని ఆపి కృష్ణుడు సమస్తము నెఱింగినవాడయి ఓరీ రాక్షసా! నీ నిజమైన దొంగతనము పట్టుబడినది. నీవు గజదొంగవు. గోపాలుర కొండ గుహలో పెట్టి తక్కిన వారిని తీసికొని పోవుటకు వచ్చితివా! రారమ్మని సింహము తోడేలిని పట్టినట్లు పట్టుకొనెను. వ్యోమాసురుడు కొండవలె పెరిగియు కృష్ణుని పట్టును విడిపించుకొనలేక తన్నుకొనగా కృష్ణుడాతనిని కూల్చివేయగా నతడు కుయ్యో మొఱ్ఱోయనుచు నేలపై కూలి చచ్చెను. ఇట్లు కృష్ణుడు వ్యోమాసురుని నేల గూల్చి గుహాకడ్డముగ పెట్టియుంచిన గండశిలను పగులదన్ని గుహలోని గోపాలురను వెంటబెట్టుకొని బలశాలియగు కృష్ణుడు గొల్లపల్లెకు వెళ్ళెను. అంతట అక్రూరుడు ఆ రాత్రిమధురలో గడిపి యుదయముననే లేచి కాలకృత్యముల నెరవేర్చి రథమునెక్కి. నందుని వ్రేపల్లెకు పోవుచు తనలో నిట్లు తలంచెను——

నేను పూర్వజన్మమున నెట్టి తపస్సు చేసితినో ఎట్టిదానము చేసితినో దాని ఫలితముగ మునీంద్రులు కూడ యోగదృష్టితో చూడజాలని జ్యోతిర్మయుడైన శ్రీకృష్ణ దర్శనము నాకు లభింపనున్నది. జ్ఞానులు ఏ పరమాత్ముని కాలిగోళ్ళ కాంతిచే సంసారాంధ కారమున పడకుండ దాటిపోవుదురో అట్టిదేవుని దర్శింప బోవుచున్నాను. ఈ కంసుడు వైరముతో, కృష్ణుని పిలుచుకొని వచ్చుటకై నన్నుపంపి నాకు మేలుచేసెను. నాకు కంసుడు నిజమైన స్నేహితుడు. నన్ను గాంచి కృష్ణుడు ఇతడు కంసుడు పంపగా నన్ను హింసించుటకు వచ్చిన దుర్మార్గుడని నన్ను భావించునేమో లేక తాను సర్వాంతర్యామి కాబట్టి నన్ను సజ్జనునిగా భావించునేమో నన్నెట్లుచూచునో నాతో నెట్లుమాట్లాడునో నాభాగ్యమెట్లున్నదో ముంగురులచే ప్రకాశించుచు, చంద్రునివలె శోభిల్లుచు చిఱునగవుచే నొప్పుచు పద్మములవంటి నేత్రములతో కర్ణకుండలములచే శోభిల్లు గండస్థలములతో రాణించు కమలాక్షుడైన కృష్ణుని ముఖమును చూచు భాగ్యము నేడు నాకు లభించును.

ఉ॥ మాపటివేళ నేను జనిమాధవు పాదసమీపమందు దం
డాపతితుండనైన నతఁడా భుగకాల భుజంగవేగ సం
తాపిత భక్తలోకభయ దారణమైన కరాబ్జమోదలన్
మోపివహించి నాకభయమున్ గృపతోడుత నీయకుండునే.

అని అనేక విధముల గోవింద సందర్శనము కోరుచు రథారూఢుడై వేగముగ పోయి చందన వృక్షములతో, కుంద, కుటజ, తాల, సాల, కురవక, వట, మాకంద వృక్షములతో నొప్పుచు పోయిగమేసి బలిసిన గోవులు గలదియు, వికసించిన ఎఱ్ఱతామరలుగల బృందను చూచెను. అందు పద్మము అంకుశము మొదలగువాని రేఖలుగల కృష్ణుని పదచిహ్నములను చూచి ఒడలు పులకరింపగా రథముదిగి, ఆనందబాష్పముల రాల్చుచు పద్మపత్రములవంటి నేత్రములు గలవారును, ప్రకాశించు దేహము గలవారును, గోష్ఠములలో నున్నవారును సుందర గాత్రులును పీతాంబర, నీలాంబరముల ధరించినవారును పుష్పమాలల ధరించిన వారును ధీరులును వనితాకాములును లోకములకు వందనీయులునగు కృష్ణ బలరాములను జూచెను. అక్రూరుడు రామకృష్ణులను గాంచి వినయముతో, పులకిత గాత్రుడై ఆనందబాష్పముల రాల్చుచు వారికి నమస్కరించెను. పిమ్మట శ్రీకృష్ణుడు చక్రరేఖతో కూడిన తన హస్తమును చాపి అక్రూరుని కౌగిలించెను. తనకు నమస్కరించిన అక్రూరుని బలరాముడు కౌగిలించెను. బలరామ కృష్ణులతోపాటు అక్రూరుడు నంద భవనమున కేగెను. అంత బలరాముడు అక్రూరునకు ఆసన అర్ఘ్యపాద్యముల నొసంగి గోవునిచ్చి యాదరముతో నతని శిష్టమృష్టాన్నములబెట్టి సంతుష్టుని గావించెను. తాంబూల గంధ మాల్యముల నొసంగెను. ఆ సమయమున నందుడు అక్రూరుని సత్కరించి యిట్లనెను. చెల్లెలు మొఱపెట్టుకొనుచుండగా అల్లుండ్లను పొట్టబెట్టుకొనిన కంసుడు బ్రతికి యుండు వరకు దాశార్హులకు క్షేమమెక్కడిది. మీ క్షేమమును గూర్చి యింకేమి యడుగవలెను. అని, అక్రూరుడు సుఖముగ కూర్చుండగా కృష్ణుడతనితో నిట్లనెను. నీకు కుశలమే కదా ? సఖులకు సంతోషమే కదా ? బంధువులకు క్షేమమే కదా ? ప్రజలకు భయములేదు కదా ? మన వంశస్థుల కానందమే కదా ! మామకు భయములేదు కదా ? నాపుట్టుకనే నెపముగాబెట్టి కంసుడు కారాగారమున బంధింపగా బంధితులైయున్న దేవకీ వసుదేవులు బ్రతికియున్నారు కదా ! నీవిక్కడికి వచ్చుచుండగా నాతల్లిదండ్రులు చింతతో నాకేమైన చెప్పమనిరా ? లేక చెప్పవలసినదే మున్నదిలేయని తలంచిరా ? దీనులైయున్నారా ?

నా తల్లిదండ్రు లెట్లున్నారో అక్రూరా నాకు వినిపింపుము. నీవు వచ్చుటకు కారణమేమిటియో తెలుపుమనగా అక్రూరుడు వెన్నునితో నారదుడు కంసునకు చెప్పిన ప్రతీకార విషయమును, కంసుడు దేవకీ వసుదేవుల చంపుటకు రాగా నారదుడతని వారించిన విధమును, ధనుర్యాగము పేరుచెప్పి తనను పంపించిన ప్రకారమును తెల్పెను. ఆ విషయమును విని రామకృష్ణులు నవ్విరి. తమ చుట్టునున్న నందాది గోపకులను జూచి కృష్ణుడు వారితో కంసరాజు యాగమును చూడరండని చెప్పి పంపినాడు. ఆ రాజును దర్శించుటకు పోవలెను. పాలు, పెరుగు, నెయ్యి కట్నములు కానుకలు కూడ పెట్టుడు. మీమీ వాహనములను తీసికొని మధురాయాత్రకు పొండు. అని చెప్పెను. అంతట గోపికలు, అక్రూరుడు కృష్ణుని మధురకు పిలుచుకొని పోవుటకై వచ్చెనని తలంచి మిక్కిలి సంతప్తలైరి. వారి నవ్వులు మాటలు, సరసాలాపములు లీలలు వేడుకలు, మన్నించుటలు, ఆహ్వానములు తలచి తలచి గోపికలు వారి నిచ్చటనే నిల్పుటకుపాయము నాలోచించుచు తమలో నిట్లు తలంచిరి.

> "బ్రహ్మదేవుడ గృహస్థుని సమ్మెయుంటిమి మాపాండుడై :. కమలాక్షుని యిచ్చట
> నుండనివ్వక మజియొక చోటికి పోవునట్లు విధించి పేరాకోశమాయెను. ఇది
> ఏమి పిల్లాటయో. సంవ్యతికైన, బ్రహ్మ విధ్యయమును గూర్చి చెప్పుదు."

అని విధిని తూలనాడి మదనతాప సంతప్తలై కృష్ణుడు తనను రమ్మని రాజు చెప్పి పంపినంతనే పోవుటకు సిద్ధపడెనే కాని అయ్యో ఈ గోపికలు నన్ను నమ్ముకొనినారు, వీరిని మన్మథ తాపమునకు గురిచేసి పోవచ్చునా ! యనినైన తలంపలేదు. ముసలమ్మలు గొల్ల పెద్దలై ప్రయాణమువద్దని కృష్ణునితో చెప్పలేక పోయిరి.

శా॥ అక్రూరుండని పేరుపెట్టుకొని నేఁడస్మన్మనోవల్లభుం
జక్రిన్ మాకడఁ బాపికొంచు నరుగం జర్చించియే తెంచినాఁ
డక్రూరుండట క్రూరుఁడీతఁడు నిజం బక్రూరుఁడౌ నేని ని
ర్వక్రత్వంబునఁ గృష్ణుఁ బెట్టి చనఁ ద్రోవంలో విచారింపఁడే.

ఇతని పేరు అక్రూరుడట అక్రూరుడు మన మనోవల్లభుని మన నుండి విడిపించుకొని పోవుటకై వచ్చిన యీ పెద్దమనిషి క్రూరుడే కాని అక్రూరుడెట్లగును ? కృష్ణునిక్కడ విడిచిపెట్టి పోయినచో అప్పుడు ఇతడ క్రూరుడే. రేపు మధురా నగరములో పౌరాంగనలు వికసించిన కమలములవంటి నేత్రాలతో పున్నమ

చందురునివంటి ముఖములతో మేడల మీది నుండి కృష్ణునిపై బంగరు పేలాల చల్లగా వారిని జూచి మనసుపడుదురే కాని యీ కృష్ణుడు మన సంగతి మఱచి పోవును. నరవరులు క్రొత్తవారినే వలతురు కదా? ఆ క్రూరదైవము మన నొసట విరహాగ్నిలో మాడమని వ్రాసెను మా వల్లభుని పిలుచుకొని పోవలదని అక్రూరుని ప్రార్థించుదము. హరి నిక్కడనే నిల్పుడని దేవతలతో మొఱ పెట్టుదము. కృష్ణుడు పోకుండా దారి కడ్డముగ పడుదము. ఓ గోవిందా! దామోదరా! మాధవాయనుచు గోపికలు విలపించిరి. మఱునా డుదయమున తనతోపాటు మధురకు రాదలచిన గోపికలకు తానుత్వరలో వత్తునని చెప్పి పంపి, బండిపై కానికలు అవుపాలు నెయ్యి మున్నగు వానిని పెట్టుకొని నందాదులైన గొల్లలు వెంటరాగా అక్రూరుడు నడుపు రథమున కూర్చుండి మధురాభి ముఖుడై పోయెను. కృష్ణుడు పోవుచుండగా గోపికలు అదిగో కృష్ణుడు పోవుచున్నాడు అదిగో తేరు. అదే పతాక అల్లదిగో గుఱ్ఱములు రేపిన దుమ్ము అదియే మార్గము అనుచు కృష్ణునిరథము కనిపించు నంతవరకు అటువైపునసే చూచుచుండిరి. బలభద్రునితోపాటు అక్రూరు నిరథముపై పోవుచు కృష్ణుడు యమునానదిని జూచి, దిగి యమునలో నీరుత్రాగి బలరామునితోపాటు రథమున ప్రవేశించెను. అక్రూరుడు రామకృష్ణులకు మ్రొక్కి వారియనుమతిని పొంది కాళింది మడుగులోనికి దిగి వేదమంత్రముల పఠించుచు.

అక్రూరుడు యమునలో రామకృష్ణుల చూచుట.

అక్రూరుడు యమునానదిలోని చల్లని నీటస్నానముచేసి నదీజలములలో రామ కృష్ణులను చూచి, వీరు రథము దిగి నీటిలో యెప్పుడు ప్రవేశించిరి? అనుచు నదియొడ్డున నున్న రథమున నుండిన రామకృష్ణులను చూచి ఆశ్చర్యపడి నేను మొదట రథమున రామకృష్ణుల జూచితిని. పిమ్మట నదిలో వారిని గాంచితిని మరల రథమున నుండ జూచితిని. ఈ కౌతుక చరిత్రు లెక్కడ చూచిన అక్కడే గన్పించు చున్నారు. అటు జూచినను ఇటు చూచినను రెండు వైపులను కన్పించు చున్నారు. నా మనస్సేమైన భ్రమించు చున్నదా? అని నీటిలో మునిగి, అందు వేయితలలు గలవాడును చక్కగ మాట్లాడు వాడును, దయ కలవాడును విరోధి సైన్యముల హతమార్చువాడును, నిత్యసంతోషము కల వాడును, పవిత్రుడును, పాపముల సంహరించువాడును, అనేక విశేషములు గల వాడునగు ఆదిశేషుని దర్శించెను. అతడు నీలవస్త్రముసు ధరించియుండెను.

సిద్ధులు నాగులు నతని సేవించు చుండిరి. ఆశేషుని పడగలపై పట్టువస్త్రముతో కొప్పుచున్నవాడును, మేఘము మీదనున్న మెఱుపు తీగవలె లక్ష్మీదేవి వక్ష స్థలమున గలవాడును, కోర్ధులాయుధములతో ప్రసిద్ధులైన బహుహస్తములవాడును, మధుర స్వరములు గల శాలియందెలు గలవాడును, బ్రహ్మ రుద్ర సనక సనందాదులచే ప్రశంసింపబడు వాడును, సౌందర్యనిధియైన నొక దివ్యపురుషుని గాంచెను. ఆ పురుషుడు కల్యాణాద్భుత గాత్రుడై శ్రీవత్స, కౌస్తుభ, వనమాలలచే అలంక రింపబడిన వక్షస్థలము కలవాడై పద్మములవంటి నేత్రములు కలవాడై శంఖ, చక్ర గదా పద్మములను ధరించిన హస్తములు కలవాడై మొలత్రాటి చేతను, యజ్ఞోపవీతముచేతను హార! కేయూర, కుండల కిరీటాదులచేతను అలంకరింప బడినవాడై, నీలమేఘ శ్యాముడై కరుణామూర్తియైన శ్రీ, పుష్టి, తుష్టి కీర్తి, కాంతి, ఇలా ఊర్జా, విద్యా, అవిద్యాశక్తి, మాయాదులచే సేవింపబడు చున్న వాడై యొప్పు చుండెను. అట్టి పరమేశ్వరునకు ప్రొక్కి భక్తిభావముచే గద్గద కంఠుడై చేతులు జోడించి యిట్లు స్తుతించెను.

దండకము. శ్రీమానినీ మానచోరా! శుభాకార! వీరా! జగద్ధేతు హేతు ప్రకారా! సమస్తంబు నస్తంగతంబై మహాలోల కల్లోలమాలా! కులాటోప పాథో నిధింగూలఁగా, కాలకేళీ గతిందేలి నారాయణాఖ్యం బటుధ్యాతి కోఫిల్లు నీ బాహుకంజంబులో లోకపుంజంబు లందున్న విజ్ఞాననిద్రైయ మున్న యామున్న యుత్పన్నుఁడయ్యెం గదా? పాదనాళాశ్రవాఖావనీవార్య హంకారమూ యామహో మానసాదుల్ హృషీకాదులున్ లోకముల్ లోకబీజంబులున్ నిత్యమంచోచమై నీ మహోదేహ మందుల్లసింపున్ వసింపున్ నశింపున్ జడత్వంబు లేకాత్మయై యొప్పు నీ యొప్పిదంబెల్లనో చెల్లచెల్లన్ విచారింప వారెంత వారెంత వారైన మాయాదులా మాయతో గూడి క్రీడింతు లోకాను బంధాళి యాధార నిర్దేశమే నీ కళారాశికిం గొందరం యోగివర్యాదుల ధ్యానములందున్న శేషాది భూతంబు లందున్న వేదాధిదైవంబులందున్ సదా సాక్షివై యుందు వందుం దదంతర్గత జ్యోతి నీకుండవందుం ద్రయీ పద్ధతిం గొందఱింద్రాది దేవాళి ధ్యానంబుల నిష్ఠ చొక్కుండువందుం మఱిం గొందఱా యాధకర్మంబు లందుత్రించి సంసార ముం ద్రెంచి సన్న్యస్తులై మించి విజ్ఞాన రతుండవందుం మఱిం పాంచరాత్రాను సారంబుగా ద్వన్మయత్వంబుతో గొందఱీ వాత్మవందురు మఱిం గొందఱా వాసుదేవాది భేదంబులిం దల్చునై తెల్వుగా బాటింతువందుమ్ మఱిన్ నీవు నానా యనాఖ్యుండ వందురు శివాఖ్యుండ వందురు మఱిన్ పెక్కుమార్గంబులన్ నిన్ను

నగ్గింతురెగ్గేమి యేఱుల్ పయోరాశిఁ జేరానులై కూడుక్రీడన్ విశేషంబులెల్లన్ని శేషంబులై యుండి నీయందనూనంబు లీనంబులౌ, నేకరాకేందుబింబంబు కుంభాంతరాళంబులన్ బింబితంబైన పోలున్నదే, యెన్నఁబోలా ఘటాంతర్గతాకాశముల్ దద్ఘటాంతంబులందేక మౌరేఖలోకావధిన్ వీఁకనే వోకలంబోక యేకాకివై యుండు దీశా! కృశానుండు నెమ్మోము వాయుండు భానుండు గన్నుల్ దిశల్ గర్ణముల్ భూమిపాదంబు లంభోనిధుల్ గుక్షితుల్యంబు లద్రుల్ లతాసాలముల్ రోమముల్ గాలిప్రాణంబు బాహుల్ సురేంద్రుల్ ఘనంబుల్ గచంబుల్ నభోవీథి నాభిప్రదేశంబు రేలుంబగళ్ళున్ నిమేషంబు లంభోజగర్భుండు గుహ్యంబు వర్షంబు వీర్యంబు నాకంబు మూర్ధంబుగా నేకమైయున్న నీమేని దండంబ రోమాంత గర్భాండముల్ మండితోదుంబరానేక వానేక శాఖాఫలాపూరితానంత జంతుప్రకాండంబు లీలం బ్రసిద్ధోదరాశిస్థ జంతుప్రకారంబుగానిండి యుండున్ మహారూప! నీరూపముల్ వెగ్గలంబుగ్గడింపన్ బయోంభోధిలో మీనవేషనన్ విరోధిన్ నిరోధించి సాధించి మున్ వేధకున్ వేదరాశిం బ్రసాదింపవే తుప్రింపవే కైటభ శ్రీమధుంజక్రివై మొత్తవే యెత్తవే మందరాగంబు రాగంబుతో గూర్మలీలా పరిస్పందివై వందివై మేదినిన్ మీదికిం ద్రోచి దోషాచరుం గొమ్ములన్ నెమ్ములం జిమ్ముచున్ గ్రుమ్మవే త్రవ్వవే ఘోరవైరిన్ నృసింహాండవై దండివై దండివై రోచనిం జూచి యాచింపవే పెంపవే మేను బ్రహ్మాండమున్నిండ బాలుండవై రాజకోటిన్ విపాటింపవే రాజవై రాజబింబాస్యకై దుర్మదారిన్ విచారింపవే నొంపవే క్రూరులన్ వాసుదేవాది రూపంబులన్ బుద్ధబుద్ధుండవై వైరిదారాంతరంగంబులన్నంతరంగంబులుంగా గరంగింపవే పెంపుదీపింపవే కల్కిమూర్తిం బ్రవర్తించి నిన్నెన్న నేనెవ్వడన్ నన్ను మాయావివన్నున్ విషణ్ణుం బ్రపన్నుం బ్రసన్నుండవై ఖిన్నతం బాపి మన్నింపవే పన్నగాధీశతల్పా కృపాకల్ప మందారకల్పా నమస్తే నమస్తే నమస్తే నమః.

మ. కలలం బోలెడి పుత్రమిత్ర వనితాగారాది సంయోగముల్
జలవాంఛారతి నెండమావులకు నాసల్ సేయు చందంబునం
దలతున్ సత్యములంచు మూఢుడవృథా తత్త్వజ్ఞుడన్ నాకు నీ
విలసత్పాదయుగంబుజూపి కరుణన్ వీక్షింపు లక్ష్మీపతీ!

అని విన్నవింపగా అక్రూరునకు యమునాజలంబులలో తన మొదటిరూపు చాలించి నటునివలె అదృశ్యుడయ్యెను. అంతట అక్రూరుడు నీటినుండి వెడలి యాశ్చర్య

నడి వచ్చి రథము నెక్కెను. అంత కృష్ణుడు అక్రూరుని జూచి- "నీరు సమీపముననే యున్నది. నీవు పోయి చాలసేపైనది. భూమిలో, నీళ్ళలో, ఆకాశమున నీకేమైన వింతలు కనబడినవా?" అని యడిగిన అక్రూరుడు కృష్ణునితో "ఈశ్వరా నీలోలేని విశేషములు ఏ లోకములందుండును." అని చెప్పి సాయంకాలమగు నప్పటికి మధురానగరము చేరునట్లు అక్రూరుడు రథము నడపెను. నందాదు లంతకుముందే పోయి మధురా నగరోద్యానవనముల విశ్రమించుచుండిరి. వారితో కలిసి కృష్ణుడు అక్రూరుని జూచి నీవు రథమును తీసికొని నగరమునకు పొమ్ము. మేము వెనుక వచ్చెదమనగా అక్రూరుడు- "ఓ లక్ష్మీవల్లభా! నా యింటికి రమ్ము. నీపాదరేణు స్పర్శచే నా యిల్లు పవిత్రమగును. ఈ విధముగ నీ భటుని పెద్దచేయు"మని ప్రార్థించెను.

కృష్ణుడు అక్రూరునితో- "ఓ విమలాత్మా! యదుకుల ద్వేషియైన కంసుని సంహరించి నీ యింటికి వత్తును. నీవీ రథమును తోలుకొనుచు మధుర కేగుము." అని చెప్పగా అక్రూరుడు మధురకువెళ్ళి, రామకృష్ణులు వచ్చిరను వార్తను కంసునకు తెలిపి తన గృహమున కేగెను. అపరాహ్ణసమయమున బలరామునితో, గోపులతో కలిసి అగడ్తలతో, కోటతో, కొమ్మలతో, ప్రాకారములతో, వీధులతో, రథగజతురగ పదాతులతో, మేడలతో, వాద్యములతో, కాంతాజనములతో, ధనధాన్యములతో, పెద్ద ఉద్యానవనములతో, సరోవరములతో నొప్పు మధురానగరమును గాంచెను. పిమ్మట ఆ నగరమున ప్రవేశించి వచ్చు సందర్భమున మధురాపుర కాంతలు ఒకరితోనొకరు- "సుందరీ! నందుని తపఃఫలము, సుగుణశాలి గోపికల నోములపంట, లక్ష్మీపతి, దయాసముద్రుడు, యోగీంద్ర బృందములు మనస్సులలో నిల్పుకొన్న పెన్నిధి, మనల చేరవచ్చెను. చూతము రమ్ము" అనుచు నొకరినొకరు పిలుచుకొనుచు, తినుచు తినుచు భోజనపాత్రల విడిచియు, పరుండిన వారై లేచియు, నూనెతో తలంటికొని స్నానము చేయకయు, పెద్దలు వలదన్న వినకయు, ఇంటిపనులు చేయుచున్నవారై పనుల మానియు, ప్రియులవద్దనుండియు క్రీడింపకయు, పిల్లలనెత్తికొనియు దించియు, అలంకరించుచున్నవారై సొమ్ములను తారుమారుగ దాల్చియు వచ్చి, తమ బంగారు మేడలపై నెక్కి శ్రీకృష్ణునిగాంచి యిట్లు చెప్పుకొనిరి......

సీ॥ వీఁడటే రక్కసి విగతజీవగఁ జన్నుఁ
బాలుఁ ద్రావిన మేటి బాలకుండు
వీఁడటే నందుని వెలఁదికి జగమెల్ల
ముఖమందు జూపిన ముద్దులాఁడు
వీఁడటే మందలో వెన్నలు దొంగిలి
దర్పించి మెక్కిన దావరీఁడు
వీఁడటే యలయించి వ్రేతలమానంబు
సూరలాడిన మేటి సుందరుండు

తే॥ వీఁడు లేకున్న పురమట వీస్థలంబు
వీనిఁ బొందని జన్మంబు విగతఫలము
వీనిఁ బలుకని వచనంబు విహగరుతము
వీనిఁ జూడని చూడ్కులు వృథలు వృథలు.

"ఓ సఖీ! గోపికలు ఈ కుమారరత్నమును స్మరించుచు, చూచుచు, కీర్తించుచు, ఇతనితో మాటాడుచు, ఇతని స్పృశించుచు, నితనితో కలిసి నవ్వుచు, నితని ఆశ్లేషించుచు, నితని నరచేలి యుపరికగాఁజేసికొని క్రీడించుచు, సమ్మానమును పొందుటకు పూర్వజన్మమున వారెంతటి నోము నోచిరో కదా!" ఇట్లు పౌరకాంతలు హరిసౌందర్యమును పొగడుచు, చూచుచు తమ హృదయములందు నిల్పుకొనిరి.

బ్రాహ్మణులు రామకృష్ణులకు గంధములను, ఫలపుష్పములను, పచ్చని శుభాక్షతలను, లాజలను కానుకలుగనిచ్చి వారిని పూజించిరి. ఆ సమయమున నగర ద్వారమునుండి వచ్చు ఒక రజకుని జూచి కృష్ణు డిట్లనెను- "మేము ఈ రాజధాని కతిథులమై వచ్చితిమి. మామందలో కట్టుకొనుటకు మంచిబట్టలు దొరకవు. నీ మూటలోనున్న చక్కఁగా నుదికినబట్టలను రాజాన కల్లుంద్రమైన మాకు కట్టుకొనుట కిమ్ము. నీకు మేలు చేకూరును" అనిరి.

అనగా విని రజకుడు రోషముతో కృష్ణున కిట్లనెను- "బాలకా! ఏమంటివి నీవు రాజులు గట్టుకునే వస్త్రములు కావలెనా! మీరు కట్టుకొనగలరా? బాగా పాలుపెరుగు త్రాగి, నెయ్యి తిని, వళ్ళు బలిసి పొగరుబట్టి, నీవిట్టి పలుకులు పలుకుచుంటివా? గొల్లలకు రాజవస్త్రములు కావలెనా! అడుగుటకైన నీకు నోరెట్లాడినది. ఇంతగా తుళ్ళిపడకుము, బలవంతుడైన కంసునితో నీ ప్రాణ

ములు పోవును సుమా! మారాజు సొమ్ము పుచ్చుకొనుటకు ఏ రాజులైనను భయపడుదురు. నీకింత చులకనగా నున్నదా? రాజరాజు యింటిలో నీరాజనము చూడవచ్చితివా. గొల్లడా! తొలగిపొమ్ము" అను రజకుని పలుకులు విని, రోషముతో ధీరుడగు కృష్ణుడు తన చేతితో రజకుని శిరము పగులగొట్టెను. పౌరులు భయపడిరి. రజకుడు పడిపోయినవెంటనే వానికి చెందిన మనుష్యులు గుడ్డల మూటల నక్కడ పారవేసి పారిపోయిరి. పిమ్మట కృష్ణుడు తనకు కావలసిన వస్త్రములను తాను ధరించి, కొన్ని గోపకుల కిచ్చి కొలుకసందులో పోవుచుండగా ఒక సాలెవాడు రామకృష్ణులను చూచి రంగురంగుల మెత్తని వస్త్రములను వారికి బహూకరించెను. రామకృష్ణులు సాలెవాడిచ్చిన వస్త్రములను ధరించి సొమ్ములను దాల్చి అలంకరింపబడిన యేనుగు గున్నలవలె ప్రకాశించిరి. కృష్ణుడు సాలెచేసిన శుశ్రూషకు మిక్కిలి సంతోషించి వానికి సంపద నిచ్చి. తన సారూప్యమును సంపద నొసంగెను. పిమ్మట రామకృష్ణులు గోపకులతో కలిసి సుదాముడను పూదండలు కట్టువాని యింటికి పోయిరి.

వారిని చూచినంతనే సుదాముడు లేచి వారికి మ్రొక్కి అర్ఘ్యపాద్యాదులనిచ్చి వారితోపాటు వచ్చిన గోపకులకు తాంబూలములను పూలను గంధమునిచ్చి రామకృష్ణులతో- "నాకులము పావనమైనది. నాతపస్సు ఫలించినది. నాయింటికి సౌభాగ్యము చేకూరినది. నా కోరికలు పండినవి. భూమండలమును రక్షించుట కవతరించిన మీరు మాయింటికి వచ్చుటచే నాకిట్టి యదృష్టము లభించినది. నేను మీకు సేవకుడను. ఏమి చేయవలెనో మీరు నన్నాజ్ఞాపింపుడు." అనుచు రామకృష్ణులకు మంచి సువాసనగల పూలదండల నర్పించెను. రామకృష్ణులు సుదాముని సేవకుమెచ్చి "నీకేమి కావలెనో కోరుకొనుము. నీకిచ్చెద"మని పలికిరి. అంత సుదాముడు వారితో నిట్లు వేడుకొనెను.

క॥ నీపాద కమలసేవయు
నీపాదార్చకులతోడి నెయ్యమును నితాం
తాపార భూతదయయును
తాపసమందార నాకు దయసేయఁగదే.

కృష్ణు డాతనికి కోరిన వరముతోపాటు బలమును, ఆయుస్సును, కీర్తిని, కాంతిని, సంపద నొసంగెను. అంత వారు రాజవీధిలో వేగుచుండగా కృష్ణుడు అనుపమ లేపన పాత్రలఁగైకొని వచ్చుచున్న సుందరియగు కుబ్జను చూచి- "నీ వెవ్వతెవు.

లేపము లెవరికి తీసికొని పోవుచున్నావు. నీ పేరేమి. చక్కనిదానవు. యీ లేపములను మాకిమ్మ"నగా, కుబ్జ కృష్ణునితో- "నీవు చాల చక్కనివాడవు. అందఱికి నీయంత అందమెక్కడినుండి వచ్చును. నాపేరు త్రివక్ర నేను కంసుని దాసిని. లేపనవిద్యలో నిపుణురాలిని. రాజు నన్నెంతో మెచ్చుకొనుచుండును. మీరీవిలేపనములు పుచ్చుకొను"డని, వారి నవ్వులు, చూపులు, మాటలు తన హృదయమును కరిగింపగా, ప్రియముతో వారికి లేపనముల నిచ్చెను. కుబ్జ యిచ్చిన లేపనములన్నిటని తన దేహమున కద్దుకొని, సంతోషించి కుబ్జదేహము నందలి ముప్పంకల చక్కదిద్దదలచి కృష్ణుడు ఆమెపాదములను తన కాళ్ళతో తొక్కిపట్టి, చేతిరెండు వ్రేళ్ళను ఆమె గౌదక్రిందనుంచి మీదికి నెత్తగా కుబ్జకు గల వంకరలు పోయినవి. ఆమె మన్మథ బాణమువలె సుందరాంగియై సంతసించి కృష్ణునితో- "ఓ మన్మథాకారా! నీవు నాయింటికి విచ్చేయు"మని ప్రార్థించెను. కృష్ణుడు బలరామునివైపు జూచుచు కుబ్జతో- "మావచ్చిన పని నేడు ముగించుకొని తరువాత నీయింటికి వత్తును. కోపగింపకు"మని చెప్పి యామెన్ను పంపెను.

పిమ్మట కృష్ణుడు అంగడి వీధికేగి పౌరులిచ్చిన తాంబూలములను, పూలమాలలను, బహువిధములైన కానుకలను గైకొని, ధనుశ్శాలకేగి అందు ఇంద్రధనువువలె పెద్దదియు, వీరులచే రక్షింపబడునదియు, పొందవీలుగానిదియునగు పెను విల్లును చూచి, అచ్చటి వారు వలదు వలదనుచుండగా బిగ్గరగ నవ్వి, వామ హస్తముతో విల్లునెత్తి, వింటికి నారినెక్కించి, దానిని సారించుచు ధైర్యముతో దాని విఱిచివేసెను. ఆ ధనుర్భంగమును జూచి బంధువులు సంతసించిరి. జనులాశ్చర్యపడిరి. ఫెళ్ళుమని విల్లు విరిగిన శబ్దము భూమ్యాకాశము లందంతట భయంకరమై వ్యాపించెను. కంసుని నిబ్బరము సడలిపోయెను. అంతట నచ్చటి కావలివారు "ఈ బాలుడు జంకులేక విల్లు విరుచునా. దీనిని సహింపరాదు. పట్టుకొనుడు, కట్టివేయుడనుచు గభగబ వారిని చుట్టుముట్టగా, రామకృష్ణులు విఱిగిన వింటిముక్కలతో కావలివారిని గొట్టిచంపిరి. ఇట్లు రామకృష్ణులు మధురానగరమున స్వేచ్ఛగా విహరించి తమ విడిదలకుపోయిరి. అంత సూర్యుడస్తమించెను. కమలములు ముకుళించెను. చుక్కలు తోచెను. చీకట్లు వ్యాపించెను. తుమ్మెదలు కమలములలో చిక్కుపడెను. చంద్రుడుదయించెను. ఆ చంద్రుడు తూర్పుదెస నొసటదిద్దిన తిలకమువలెను, మదనుడు విరహుల ధైర్యములనెడి తీగెలతెంచుట కెత్తిన కొడవలివలెను. కాలుడనెడు కిరాతకుడు చీకటి మృగ

మును ఖండించుటకు ఝళిపించు కత్తివలెను. రాత్రియనెడు చీకటిచెట్టు తూర్పు కొమ్మకు మొలచిన చిగురాకువలె నుండెను. కలువలు వికసించెను. దొంగలకు భయముపుట్టెను. సంద్రము పొంగెను. చకోరము లానందించెను. జారులకు దిగులుపుట్టెను. చారుచంద్ర కిరణములచే బ్రహ్మాండమంతయు కప్పులిడి కప్పురపు కోవివలె గన్పట్టెను.

ఆ రాత్రి రామకృష్ణులు గోపాలురతోకూడి పాయసాన్నము తినిరి. కంసుని యత్నములను తెలిసి మెలకువ గలిగి వర్తించిరి. తన పట్టణమునకు రామకృష్ణులువచ్చి, తన భటులనుచంపి పెనువిల్లు విఱిచిరని తెలిసిన కంసునకు నాటి రేయి నిదురపట్టలేదు. కంసునకు మృత్యువు సమీపించినదనుటకు తగిన లక్షణములు కనబడెను. చేతులతో చెవులు మూసికొనగా లోపలి శబ్దము వినబడలేదు. నీళ్ళలో తొంగిచూడగా తన తల కనబడలేదు. చేతిని ముక్కుపై నుంచుకొని చూడగా చుక్కలు రెండుగా కనబడినవి. వెలుగులో నిల్చిచూడగా నేలపై పడిన తన నీడ చిల్లులతో కనబడెను. అడుగుజాడ కనపడలేదు. చెట్లు పసుపు పచ్చగ కనబడుచుండెను.

పై లక్షణములను చూచి కంసుడు తనకు చావుమూడనున్నదని తోచెను. ఒక సమయమున నిద్రపట్టగా కంసుడు కలగాంచెను. ఆ కలలో నతడు, తాను విషము మ్రింగినట్లు, పినుగును కౌగిలించుకొనినట్లు, దెయ్యములతో తిరిగినట్లు, నెత్తిన నూనె రాచుకొన్నట్లు, గాడిదపై నెక్కినట్లు కలగాంచెను. ఆ కల గాంచి కలవరపడి కంసుడు రాత్రి గడపుచుండ తెల్లవారెను. అంత సూర్యు డుదయించెను. ఆ సూర్యబింబము చక్రవాకముల తాపము నుపశమింపచేయు గుళికవలెను, పద్మినీకాంత నోచిన నోములపంటవలెను, త్రిమూర్తులసారపు ముద్దవలెను పొడుపుకొండపై కనిపించెను. చల్లని గాలులు వీచెను. కమలములు వికసించెను. చీకటి విరిసి కొండగుహాలలో దూరెను. తుమ్మెదలు తమ్ములలోని తేనెనుత్రావి సంతసించెను.

ఆ పిమ్మట మల్లరంగమున నెత్తైన మంచమున కంసుడు కూర్చుండెను. ఆ మల్లరంగమున గులకఱాలుగాని, పుట్టలుగాని, బురదగాని లేదు. అందు కస్తూరి జలముల చల్లి చందనపుకళ్లెల కట్టిరి. మంచెలకు చుట్టు పూలమాలలతో పతాకములతో, తోరణములతో నలంకరించిరి. బ్రాహ్మణ క్షత్రియాది పౌరులెల్లరందు నాసీనులైయుండిరి. మంగళవాద్యములు మ్రోగుచుండెను. కంసునిచుట్టు

మంత్రులు సామంతులుపవిష్టులైయుండిరి. సమస్త భూమండలభారమును వహించుటపూని వచ్చుచున్న కులపర్వతములవలె చాణూర ముష్టికులగుంపులు మంగళవాద్యములు మ్రోగుచుండగా, గురువుల సేవించుచు రంగస్థలమున ప్రవేశించిరి. నందాదులైన గోపకులు కంసునకు కానికలు సమర్పించి, రాజును దర్శించి యతని సనుమతిపై పెద్దమంచములపై వరుసగ కూర్చుండిరి. అంత రామకృష్ణులు మల్ల దుందుభిధ్వనుల సముత్సాహముతో రంగద్వారము దారివెంట నేగి కంసుని మదపుటేనుగుయగు కువలయాపీడమును గాంచిరి. కువలయాపీడమును చూచి కృష్ణుడు దాని మావటివాడైన అంబష్ఠునితో గంభీరముగ నిట్లు పలికెను—

కృష్ణుడు కువలయాపీడమును కూల్చుట.

"ఓరీ మావటీ! నీవు మాపై నీ మదపుటేనుగును పురికొల్ప బనిలేదు. వేగమే దీనిని వెనుకకు మరలించుము. నీవు నామాట వినక దానిని మాపైకి పంపెదవేని, పిడుగులవంటి పిడికిడులతో దానిని కూల్చి చంపుదుము." అని పలికి కృష్ణుడు కొప్పును సవరించుకొని పచ్చని బట్టను కొసెగా చుట్టుకొని నొసటిపై వ్రేలాడు ముంగురుల నెగకి దువ్వుచు యుద్ధమునకు సంసిద్ధుడై, చూపరులాశ్చర్యపడుచుండగా కువలయాపీడమును సమీపించెను.

అంత నంబష్ఠుడు బాలకుడని సందేహింపక అంకశ, కృష్ణునిపైకి కువలయాపీడము తోలెను. అంతట కువలయాపీడము తన పాలకులచే ప్రేరేపింపబడి మహావాతముచే ప్రేరేపింపబడిన ప్రళయకాలాగ్నివలెను, మృత్యుదేవతవలెను, తుమ్మెదల ఝుంకారము తనకహాంకారమును పెంపొందింప, కులపర్వతము శిఖరములను కూల్చునట్లు ఘీంకారము చేయుచు, శేషుని దేహమువలె భయంకరమైన తన తొండముచే నిర్లక్ష్యముగ కృష్ణుని పట్టుకొనగా, దానినట్టట్టు నెంటి, రాహుముఖమునుండి తప్పించుకొన్న సూర్యునివలె కృష్ణుడు కుప్పించి దాని కాళ్ళసందున చిక్కికొనకుండ దాటి కనబడకపోయెను. దానితో నేనుగు కోపించి సముద్రమును క్షోభింపచేయు మంధరపర్వతమువలె తిరుతిరు తిరిగి చూచి కృష్ణుని చూడక తొండమువంచి యతనిని మోసగించి చుట్టిపట్టి, పడవేయదలచెను. కృష్ణుడు తెంపుతో దానివెనుకకు పరుగెత్తి గరుడునివలె పైకెగిరి, పనుగుతోకను చేతితో గట్టిగాపట్టుకొని దానినితిప్పి యిరువదియైదువిండ్ల దూరమునకు విసిరివేయగా, ఆ యేనుగు యుద్ధమునకు పూను

కొనక కుడియెడమలకు తిరిగి కృష్ణుని పట్టదలచెను. కృష్ణుడు తప్పించుకొని అది కుప్పించి యెదుర్కొనబోగా, వెంటనే కాటుక కొండ, కొమ్ముల్వంటి దాని కుంభస్థలము వ్రక్కలై చెక్కలెగిరిపోవునట్లు పిడుగువంటి పిడికిలి సారించి, యూచియూచి పొడచెను. అంతట దాని కుంభస్థలములనుండి రక్తముతోపాటు ముత్తెములు జలజల రాలెను. ఆ ఏనుగు అంతటితోనాగక సముద్రపు టలలపోటునకు ఓటుపడని కులపర్వతమువలె లేచిచూచి క్రోయుచు, కృష్ణుని కోరలతో జిమ్మెను. కృష్ణుడు, యేనుగును హస్తములు పట్టుకొని పోరాడిరి. కృష్ణుని పోటులకు శివుని బల్లెపుపోటునకు తెగిపడిన పట్టణమువలెను, పెనుగాలిచే సుడిబడు నావవలెను, ఆ యేనుగు బలముతగ్గి చిక్కువడి స్రుక్కి, మదధారలుడుగగా కృష్ణుడు దానిని కాళ్ళతో త్రొక్కి నవ్వుచు, సింహమువలె దాని దంతము లూడబెరికి దానిని మొత్తి దానిని చంపివేసెను. ఆ ఏనుగు దంతములతో ఏనుగు కావలివాండ్లను మోది అచటినుండి వెడలిపోయిరి.

ఆ రామకృష్ణులు భుజములపై ఏనుగుదంతములు మెఱయగా, మోములందు చిఱుచెమట లొప్పగా, తమ కిటునటు గోపకులు నడువగా వచ్చి, రణరంగ పటిష్ఠులై మహోడంబరముగల మల్లరంగమును చూచిరి. ఆ మల్లరంగ మధ్యమందు నిలిచిన కృష్ణుడు. రౌద్రముచే మల్లురకు వజ్రాయుధమువలెను, ఆశ్చర్యముచే జనులకు ప్రభువువలెను. శృంగారముచే స్త్రీలకు మన్మథుని వలెను, భయముచే కంసునకు మృత్యువువలెను, మూఢులు బీభత్సమును పొందగా భయంకరుడై, తండ్రికి దయపుట్టునట్లుగా కుమారుడై, దుష్టులకు నీరసము గల్గించుచు శిక్షకుడై, గోపాలురకు సౌఖ్యమును కల్గించుచు తమ కులమువాడై, బంధువులకు ప్రేమను కల్గించుచు దేవతయై యోగులకు శాంతిని గూర్చుచు పరతత్త్వమై రామునితోపాటు శోభిల్లెను.

అప్పుడు కంసుడు వారిని చూచి, చచ్చిన యేనుగును తలంచుచు మిక్కిలి సంతాపముతో నివ్వెఱపడెను. రంగస్థలమునందలి జనులు, ధీరులు వస్త్ర, మాల్యామణి భూషణధారులు, మహోకారులు, సర్వలోక శుభకారులు, మానవమానినీ మనోహరులు, రంగస్థలవిహారులు, మహావీరులునగు గోపకుమారులను జూచి యెంత జూచినను తృప్తిని పొందలేదు. ఆ రామకృష్ణుల ముఖములనెడు చంద్రబింబములనుండి వెడలు అమృతరసమును కన్నులతో త్రాగి వారి విలాసముల పొగడి, వారిని కౌగిలించుకొనవలెనను కోరికతో వారి కెదురేగదలచి వారియందే చూపు

అను నిల్చి యొకరితో నొకరిట్లు గుసగుసలాడిరి— "వీరు భూమిని రక్షించుటకై వసుదేవునింట వైష్ణవ తేజముతో పుట్టినారట. వీరు నసిబాలురుకారు పర దేవతలు.

ఈ కృష్ణుడు రక్కసిని చంపెను. శకటాసురుని కూల్చెను. మద్దులను పడ గూల్చెను. బకుని చీల్చెను. అఘాసురుని సంహారించెను. వత్సకాసురుని బోరి గొనెను. గోవర్ధనము నెత్తెను. దేవేంద్రుని భంగపరచెను. కాళీయుని మర్దించెను. దావానలమును త్రాగెను. కేశిని తుదముట్టించెను. మయపుత్రుని జరిమార్చెను. రాక్షసభటుల నంత మొందించెను. గోపకులను సంరక్షించెను. గోపికల కోరికల తీర్చెను. ఇతడు శుభాంగుడు. ఇతడు మహానుభావుడు. నిజమునకు మాధవుడే కాని మానవబాలుడు కాడు."

రామకృష్ణులు చాణూరు ముష్టికుల వధించుట.

అనుచు రంగస్థలమున కేతెంచిన పురజనులు వారిని చూచుచుండిరి. అంతలో చాణూరుడు రామకృష్ణులతో నిట్లనెను- "మీ రడవులలో గోపకులతో కలిసి దూడల మేపుచు, పోరాటములో దిట్టలని జనులు చెప్పుకొనగా, మా రాజు మిమ్ము మల్లయుద్ధమునకు పిలిపించెను. ఈ మల్లరంగస్థలమునందలి సభ్యులకు వినోదము కల్గించుటకై మనము పోరాడుదము. మీకు జవసత్త్వములు కలవా? బాగా సాముచేసినారా? మీ యొంటికి కవచము కలదా? మారాజును ధిక్క రించు మిమ్మడుగవలెనా? కాని గోపాలా! నా ముష్టి వజ్రము, యముని దండము లేక శివుని నేత్రాగ్ని అంతేకాని నీవు తినమరిగిన వెన్నముద్ద కాదు సుమా!" అని పల్కిన చాణూరునకు కృష్ణు డిట్లనెను—

"మాకు సాములెక్కడిది. మేము బాలురము. బలశాలురముకాము. మీరు మల్ల యుద్ధము నంచారితేరిన వారు వజ్రమువలె దృఢశరీరులు. మీతో మేము పోరాడుటెట్లు? రాజులకు వేడుకను గల్గించలేము. వినోదములు సల్పుదుము. చాణూరా! నేను నీతో పోరాడుదును. మాబలరాముడు ముష్టికునితో మల్ల యుద్ధమును చేయును. రాజును సభలో మెప్పింతును." అనగా విని చాణూ రుడు కృష్ణునితో- "నీవు నాతో పోరాడగలవాడవా? ఛీ! నీవు నాకు సాటి వాడవా? నేను సత్కులమున పుట్టినవాడను. సద్గుణములు గలవాడను. సత్త్వ భావము కలవాడను, ప్రసిద్ధుడను. నీకు నావంటి గుణశీలములు కలవా! యా

పట్టణములో మల్లయుద్ధము చేయుటయనగా గొల్లభామలముందు కుప్పిగంతులువేయుట యనుకొంటివేమో ఆలోచింపుము. ఈ చాణూరుడు స్థాణువును మెచ్చడు. బ్రహ్మను లెక్కపెట్టడు. విశ్వక్సేనుని పరిహసించును. గాలిని యుద్ధమున కాహ్వానించును. ఇట్టి బలశాలి యుద్ధమునకు ఎవరైన రమ్మనినచో రేపు, మాపని కాలక్షేపము చేయడు. మల్లయుద్ధమున చాతుర్యముతో వినోదించువాడు, అట్టివాడొక గొల్లబాలునితో పోరాడజాలడా? గొల్లలలో మల్లుడనిపించుకొనినవాడా? యీ భూమండలమునందు నాచల్లడముక్రింద దూఅని మల్లులులేరు. నాతో ఢీకొంటివో చేపవై నీవు సముద్రములో దూరలేవు. తాబేలువై కొండదండకు చేరలేవు. వరాహమవై నేలక్రిందికి పోలేవు. నరసింహమునని బెబ్బులీగలేవు. వామనుడవై చేయిసాచి పడవేతుననుకొందువేమో నా వద్దకు వచ్చినంతనే నిన్ను పడవేతును. ఇక నావుఃందట పెరుగుటకు వీలుకాదు. పరశురాముడవై రాజుల హింసింపలేవు. రాముడవై అడవులలో దూరలేవు. బలుడనని వెలుగలేవు. బుద్ధుడనని తలపకుము. కల్కిపురుషుడవై కల్కితనముచూపి గర్వింపవలదు. నన్ను ఢీకొనుట కృష్ణా! నీతరముకాదు. పోపొమ్ము. తప్పుకొనుము. నీవు శ్రీహరి నంటివా? మహిమతో నుండుటకిది వైకుంఠము కాదు మధుర. గర్వముఃతోనుండుట కిది ముక్తుల సభకాదు. ఇది కంససభ. ఇది నారదుని వీణానాదముకాదు. నా బాహునాదము. ఇది గొల్లభామలతో ప్రణయ కలహము కాదు. మల్లరతోటి పోరాటము తిరుగుటకిది వేదాంతము కాదు. మునుల మనస్సులుకాదు. నడచుటకు భక్తులమార్గముకాదు. నా సమక్షము సుమా!"

అని పలికి చాణూరుడు చెత్తినపిలుక రోషాగ్ని ధూమరేఖవలె నుండ దిగ్గజ దంతలవలె తన బాహువులు భయంకరములై వెలయ ప్రళయకాలమున యముని కోరలవలె కోఱమీసములు మెఱయ, కదలుచున్న నల్లకొండవలె నీలదేహ మొప్ప, అడుగుల దెబ్బలకు భూమి కంపింప, ఆకాశము నిండునట్లు మల్లచరచి, పుర జనులు బెదరగా కృష్ణునివైపు నడచెను.

ఇట్లు తనవైపునకు వచ్చిన చాణూరుని చూచి, కృష్ణు డుత్సాహముతో బాహునాదముతో భూమ్యాకాశ మధ్యభాగమును పూరించి వానితో పెనగెను. వారిద్దఱు ఏనుగు ఏనుగును, సింహము సింహమును, కొండ కొండను తాకినట్లు తల పడి రెండు కార్చిచ్చులు కలిసినట్లు రెండు ప్రళయకాల సముద్రము లుత్తుంగ

తరంగములతో తలపడినట్లు ముష్టియుద్ధములతో నొకరి నొకరు నొప్పించుచు చెదరక పోరాడుచుండ కృష్ణుడు చాణూరుని సందుచూచుకొని విజృంభించి యార్చిపట్టి పడవేసి కాళ్ళతో తన్ని యుల్లాసముతో మెఱసెను. దానితో నొచ్చియు చపలుడైన చాణూరుడు లేచిమోరసాచి కృష్ణుని పొర్లించెను. అంతకృష్ణుడు పొంగివెంటనే శరీరమును పెంచి మోకాళ్ళతో వాని నొత్తుచు పరిపిడి కలిగించెను. అంత చాణూరుడు మేలుమేలని బాలుని పొగడుచు కాలి కడకు రానిచ్చి కృష్ణుని కాలితో తన్ని త్రోసెను. అంతకృష్ణుడు పాటవముతో రాటమువలె గిరగిర దిరుగుచు వాని వీపు నెక్కెను. చాణూరుడు మదపుటేనుగు వలె యతని చేతిని తన చేతపట్టుకొని దిట్టతనముతో ఇట్టట్టు దట్టించెను. కృష్ణుడు క్రీడించి విజృంభించి చాణూరుని సమతలమున పడవైచి కడుపువాగించి కాలిని కాలితో పెనవేసి డొక్కపట్టుకొనగా వాడు తప్పించుకొని కాలడ్డముపెట్టి తన్నుతాను రక్షించుకొనెను. అంతకృష్ణుడు వాని దట్టిని పట్టుకొని యెత్తియెత్తి సందుపెట్టి నవ్వెను. అంత చాణూరుడు కృష్ణుని కాలిలో తన కాలుపెట్టి బాధించెను. అంతకృష్ణుడు పట్టసము పట్టుకొని దట్టించగా చాణూరుడు కృష్ణుని చేయిపట్టుకొని, హుంకరించి కృష్ణుని ముఖముపై కాలుపెట్టి నిక్కెను. అంత కృష్ణుడు తన కాలితో వాని కాలిని తప్పించి, మించి మిక్కిలి బలముతో వాని నూపి లేచి వాని కాలుపట్టుకొని వాని వక్షమును పిడుగువంటి పిడికిలితో పొడిచెను. చాణూరుడు కృష్ణుని ముష్టిఘాతముచే గిరగిర తిరిగి తన్నగా, కృష్ణుడు కుప్పించి లేచి వాని మీదికి రాగా వాడును వడిగా పైకిలేచెను. ఇట్లు పోరాడుచుండ చాణూరునకు ధైర్యము సడలెను. హరికి లోబడెను. వాడు కృష్ణునకు లొంగియు భయపడక కృష్ణుని ఱొమ్మును తన బలమైన పిడికిటితో పొడిచెను. అంతకృష్ణుడు సందుచూచుకొని చాణూరుని రెండు పాదములనుపట్టి వానిని గిరగిర త్రిప్పి నేలపై బడవేసెను. అంత చాణూరుడు నోటినుండి రక్తము కారగా, నేలపై బడి గిలగిల తన్నుకొనుచు కంసుని గుండె దడదడలాడగా చచ్చెను.

బలరాముడు ముష్టికాసురుడును తమ తమ బలముల నిరూపించుచు చేతులుచేతులు పట్టుకొని వివిధ భంగిమలతో పోరాడిరి. గోపకులు తక్కిన మల్లురతో తలపడుచుండిరి. కృష్ణుడు చాణూరుని పడగొట్టినంతనే బలరాముడు ముష్టికునితో పోరాడుచు తన్ను బలభద్రుడని లోకులు పొగడుచుండ బలవంతుడగు ముష్టికుని పట్టుకొని గిరగిర త్రిప్పుచువానిని, నేలపై బడవేసెను. అంత ముష్టికుడు

తన నోటినుండి రక్తము పారగా బలహీనుడై పెనుగాలికి కూలుచెట్టువలె కూలి పోయెను. అంత బలరాముడు కూటాసురుని పిడికిటి పోటులతో పొడిచి, పొడిచి చంపెను. కృష్ణుడు చాణూర, ముష్టిక కూటాసురుల యనుచరులైన తోసల, శలలను వారిని కాలితన్నులతో యమునింటికి పంపెను. తక్కిన మల్లులు వీరు గొల్లబాలురని, తలచి మన మల్లశ్రేష్ఠులు వారితో పోరాడి చచ్చిరి. వీరు మహా బలవంతులు వీరితో పోరాడ జనదు తొలగుడు - తొలగుడని చెల్లాచెదరై పారి పోయిరి. ఇట్లు మల్లురనెల్ల సంహరించి గోపబృందములో సింహమువలె శోభిల్లుచు కాలియందెలు ఘల్లుఘల్లు మన నడచివచ్చు రామకృష్ణులను గాంచి రంగస్థలము నందలి బ్రాహ్మణులు వారిని మెచ్చుకొనుచుండిరి.

సభలోని కలకలంబు వారించి కంసుడు తన మంత్రులను జూచి యిట్లనెను. ఈ గొల్లపిల్లలను నగరివాకిటికి వెడలగొట్టుడు. ఈ గొల్లలను తరుముడు. క్రూరుడైన నందుని బంధింపుడు. వసుదేవుని చంపుడు. ఈ ఉగ్రసేనుడు నాకు తండ్రి కాడు వీడెప్పుడు నా శత్రువుల వృద్ధిని కోరుచుండును వీనిని రక్షింపకుడు. అని పలుకుచుండగా కృష్ణుడు వేగముతో పర్వతముపై సంచరించు మృగముల పట్టుకొనుటకు ఆ పర్వతముపైకి సింహము లంఘించునట్లు పౌరులు, ప్రేక్షకులు తల్లడిల్లగా కంసుని ప్రాణముల హింసింపదలచి, యత్యుత్సాహ మతిశయింపగా కంసుడుపవిష్టుడైన మంచముపై కురికెను. అంత కంసుడు కృష్ణుని గాంచి తాను ఖడ్గమును పూనియతని నెదిరించెను.

శా॥ పక్షీంద్రుండురగంబుఁ బట్టు విధమొప్పం గేశ బంధంబులో
కక్షోభంబుగఁ బట్టి మౌళిమణులా కల్పాంత వేళావత
న్నక్షత్రంబుల భంగి రాల రణసన్నాహంబుడిందించిరం
గక్షోణింబడ ద్రొబ్బెఁ గృష్ణుడు వెసంగం సున్నృపోత్తమునిన్

కృష్ణుడు వడిగా గరుడుడు పామును పట్టుకొనినట్లు కంసుని జుట్టుపట్టుకొని లోకులు భయపడగా, వాని కిరీటమునుండి, మణులు ప్రళయకాలమున చుక్కలు రాలినట్లు రాలగా వాని యుత్సాహంబును పోగొట్టి మంచెమునుండి కంసుని నేలపై పడద్రోసెను. కంసుడు మంచెమునుండి నేలపైబడి, జనులచ్చెరువు పడిచూచుచుండ కదలక మెదలక చచ్చిపడియుండెను. అంతకృష్ణుడు సింహము ఏనుగు నీడ్చినట్లు కంసుని పట్టియీడ్చి వైచెను. అంత కంసుడు సంతతము కృష్ణుని ద్వేషించువాడైనను కృష్ణుని చెందెను. అంతట న్యగ్రోధుడు గవాళ్యుడు మొదలగు కంసుని

సోదరులు ఈ గోపాలుడొకడు భూపాలుని చంపునా వీనిని పోనివ్వకుడు పట్టుడు చంపుడని కోపముతో మీదికి రాగా బలరాముడు పరిఘాయుధము ధరించి కంససోదరుల చంపివైచెను. అంతట నారదుడు జుట్టుముడి వీడగా చేతితో తాళము లొత్తుచు మిక్కిలి సంతోషముతో నాడుచు కృష్ణాయని కృష్ణుని కీర్తించుచు పాడెను. బ్రహ్మారుద్రాదులు కృష్ణుని కీర్తించుచు పుష్పవృష్టి గురిపించిరి. దేవదుందుభులు మ్రోగినవి. అప్సరసలాడిరి. అంత కంసాదుల భార్యలు తమ భర్తలు మరణించుటచే మిక్కిలి దుఃఖించుచు చేతులతో తలల బాదుకొనుచు కన్నీరు గార్చుచు తమ భవనముల వెలువడి వీరశయ్యా నిద్రితులైన భర్తలం గౌగిలించుకొని యిట్లు విలపించిరి. గోపాల సింహము కోపించి నిన్ను మదపుటేనుగువలె కూల్చెను. యాదవుడను పెనుగాలి చెట్టునువలె నిన్ను పెకలించి వైచెను. వాసుదేవ సముద్రము పొంగినిన్ను దీవివలె ముంచివేసెను. దేవసుతుడను దేవేంద్రుడు నిన్ను కొండను కూల్చివేసెను. ఓ నాథ మనోనాథ హా మహారాజ! నీవు మరణించినను మేము బ్రతికి యుంటిమి మాబోటి కఠిన హృదయ లెందరైనను నుందురా? భూతములకు కీడు కల్గించిన నీకు భూతములెగ్గు పుట్టించెను. వ్యర్థమైన మా జీవితమేల? భూతద్రోహికి శుభము కలుగదు. గోపాలకృష్ణుని చేతిలోబడి హతులైన వారిని గూర్చి నీకు పెద్దలు చెప్పలేదా? నీవు కోపమును అలసత్వమును వదలి యతనిని సేవింపవలదా? అని విలపించుచున్న రాజకాంతల నూరడించి కృష్ణుడు కంసాదులకు పరలోక సంస్కారములు చేయుమని యాజ్ఞాపించి, దేవకీ వసుదేవుల బంధనములను విడిపించి, బలభద్రునితో పాటు వారికడకేగి వారికి నమస్కరించెను. అంత దేవకీ వసుదేవులు వారిని చూచి వీరు లోకేశ్వరులు, కాని మా కొడుకులుకారు అను సందేహముతో దేవకీ వసుదేవులు విచారించు చుండగా వారికి కృష్ణుడు తన మాయచే పుత్రమోహమును గల్పించి అన్నతోపాటు వారికి వినయముతో నిట్లు విన్నవించెను.

దేవకీ వసుదేవుల బంధవిముక్తి ఉగ్రసేన పట్టాభిషేకము.

మీరు మమ్ము కంటిరే గాని మా బాల్యమును, కౌమార యవ్వనములందు మమ్మెత్తుకొని, దించి, మన్నించు భాగ్యమును పొందరైతిరి. కోరికయుండియు అట్లు తమ బాలుర లాలించి యాడించి యానందమును పొందు భాగ్యము దైవయోగముచే మీకు కలుగలేదు. మేము కూడ తలిదండ్రుల వద్దయుండియే సమయమున నెట్లు లాలింపబడుచు పెరుగవలెనో అట్టిభాగ్యము మాకు నిన్నాళ్ళ

కలుగలేదు. చతుర్విధములైన పురుషార్థములకు మూలమైన యీ దేహమునకు కారకులు మీరే కదా? మీ ఋణమును నూఱేండ్లకైన మేము తీర్చుకొనగలమా?

> "ఎవడు తనకు చేతనైనను కూడ తల్లికి తండ్రికి, తన శరీరముతో సేవచేసి ధనముతో వారిని పోషింపడో అట్టి పీనుగు తన మాంసమును తానే తినును. తల్లిదండ్రులను వృద్ధులను, కుమారులను, గురువును సాధువులను, భార్యను బిడ్డలను పోషింపనివాడు ఎంత గొప్పవాడైనను వాడు బ్రతికియు చచ్చినవాడే".

మా కారణముగ మిమ్ము కంసుడు చెఱసాలలో బంధించి కష్టపెట్టెను. ఆ కష్టములను తొలగింప శక్తియుండియు మేము కఠినులమై, క్రూరులమై కుటిల స్వభావులమై యుంటిమి. ఓ సహనశీలులారా! జననీ జనకులారా! మా లోపముల మన్నించి మముదయతో రక్షింపుడు. అని కృష్ణుడు పలుకగా దేవకీ వసుదేవులు మోహితులై వారిని తమ తొడలపై కూర్చుండబెట్టుకొని కౌగిలించుకొని వారి ముఖములను తమ కన్నీట తడుపుచు ప్రేమపాశబద్ధులై యూరకుండిరి. అంత కృష్ణుడు తన తాత గారైన ఉగ్రసేనుని జూచి ఓ రాజోత్తమా! యయాతి శాపమువలన యాదవులకు సింహాసనార్హత లేదు. నీవు రాజువు కమ్ము. నేను నిన్ను కొలువగా దేవతలు నీకు కప్పము పెట్టుదురనినచో నితర రాజులమాట చెప్పనేల? కమ్ము నీవు వేడుకతో రాజువు కమ్ము అని పలికి వెన్నుడు.

క. మన్నించి రాజుఁ జేసెను వెన్నుఁడు సత్యావధాను విశ్రుతదానున్
సన్నుతమానున్ గదన చ్ఛిన్నాహితసేను నుగ్రసేనున్ దీనున్.

ఇట్లు కృష్ణుడు ఉగ్రసేనుని పట్టాభిషిక్తుని చేయగా కంసునకు భయపడి విదేశంబులలో నుండి కృశించిన యదువృష్ణి భోజమరు దశార్హ కురాంధక ప్రముఖులైన సకల జ్ఞాతిసంబంధులను పిలిపించి, వారు సంతసించునట్లు విత్తములనిచ్చి వారి వారి నివాసంబులందుండ నియోగించెను. ఈ విధముగ శ్రీకృష్ణుని కరుణారస దృష్టిచే మనస్సులందలి భయములు తొలగగా మధురానగరమునందలి ప్రజలు సంతోషముతో నుండిరి. ఒకనాడు కృష్ణుడు బలరామ సహితుడై నందునివద్ద కేగెను. నందుని జూచి కృష్ణుడు మా తండ్రీ! మేము తల్లిదండ్రులను జూడలేదు. యశోదాదేవియు నీవును మా తల్లిదండ్రులేయని యుంటిమి. ఏ తల్లిదండ్రులుకూడ తమ బిడ్డలను మీరు మమ్ము పెంచినట్లు పెంచలేదు. మీ సౌజన్యభావములతో మేము బాల్యయౌవనాదులలో నింతటి వారమైతిమి. ఇక్కడ నున్న

బంధువులకు సౌఖ్యములను గలిగించి మేమక్కడికి వచ్చెదము. ఈ విషయము మన వారి కందరికి తెల్పుము; మేమెక్కడ నుండినను మీ వ్రేపల్లెలో ప్రీతితో మీరు మాకు చేసిన యుపకారములను మఱవలేము. అని చెప్పి వస్త్రములు, సొమ్ములనిచ్చి యాదరముతో కౌగిలించుకొని గోవిందుడు పంపగా నందుడు సంతోషముతో గోపకులతోపాటు తాను బృందావనమున కేగెను—

అంత వసుదేవుడు తన కుమారులైన రామకృష్ణులకు గర్గాది భూసురోత్తములచే విధి విధానముగ ఉపనయనము చేయించెను. చంద్రవంశ్యులైన రామకృష్ణులు బ్రాహ్మణోపదేశము ననుసరించి, బ్రాహ్మణు లాశీర్వదింపగా ద్విజులైరి. రామకృష్ణుల ఉపనయనము జరిగిన తరువాత వసుదేవుడు బ్రాహ్మణులకు దక్షిణలతో పాటు గోహిరణ్యాది దానములనిచ్చి రామకృష్ణుల జన్మసమయమున తాను మనస్సులో దానముగ నివ్వదలచినన్ని గోవుల దానముచేసి, యాచకులకు కోరినంత ధనము పంచిపెట్టెను. రామకృష్ణులు సర్వజ్ఞులైన జగద్గురువులైనను, ఎవరైనను గురూపదేశ మూలముననే విద్యలను నేర్వవలయునని తెలుపుటకోయన్నట్లు మహావైభవ రాశియైన కాశికివెళ్ళి. అవంతీ పురవాసియు సకలవిద్యావిలాసియునైన సాందీపుని యనుపండిత వర్యుని శుశ్రూష చేయుచు వేదములు, వేదాంగములు ధనుర్వేదము, తంత్రశాస్త్రము, మన్వాది ధర్మశాస్త్రములు, తర్కము, రాజనీతి, ప్రాయశ్చిత్తకాండ మున్నగువానిని నేర్చుకొనిరి. రామకృష్ణులు ఒక్కొక్క నాడొక కళ చొప్పున అరువది నాల్గు దివసములలో అరువది నాలుగు కళల నభ్యసించిరి. ఇట్లు గురువులకెల్ల గురువులై గురువుల యందు ఏ మాత్రము అగౌరవము చూపక త్రిలోక హితమునకై రామకృష్ణులు గురు. శిష్యన్యాయమును పాటించిరి.

ఇట్లు రామకృష్ణులు వేదవేదాంగములలో, ఉపవేదములలో, అరువది నాల్గు కళలలో నారితేరుటను జూచి వారి మాహాత్మ్యమును గుర్తించి సాందీపని ఆశ్చర్యము పొంది వారితో నిట్లనెను. పూర్వము నా కుమారుడు సముద్రము నందలి ప్రభాసతీర్థమున స్నానముచేయుచు మునిగి పోయెను. మీరు కృపాసముద్రులు పరాక్రమవంతులు నాకు పుత్రుని ప్రసాదించుటయే మీరు నాకివ్వవలసిన గురు దక్షిణ కావున కర్తవ్యము నూహింపుడు శిష్యులు బలవంతులైనచో గురువు విఖ్యాతి విశేషముచే జీవించును. బలముతో సద్గుణములతో నొప్పు శిష్యులు గురువు కోరికను నెఱవేర్తురు కదా ! అనగా విని రామకృష్ణులు

గురుపు కోరికను నెఱవేర్చుటకై రథమునెక్కి మహావేగముతో రౌద్రమూర్తులై సముద్రమును చేరిరి. వారు సముద్రునితో నిట్లనిరి. ఓయి సముద్రుడా! సద్బుద్ధితో నీవు మాగురు పుత్రుని, మాకు సమర్పింపుము లేదా నిన్ను మా బాణాగ్నిచే శుష్కింపచేయుదుము. అనగా సముద్రుడు వారితో, ఓ యదుశ్రేష్ఠులారా! ప్రభాసతీర్థమున మీ గురు పుత్రుడు స్నానముచేయు చుండగా నొక తరంగ మాతనిని ప్రచండ వేగముతో కొనిపోగా పంచజనుడు వానిని మ్రింగెను. నేను చెప్పు దానిలో మోసము లేదు. అని ఆ పంచజనుడున్న చోటును వారికి తెల్పెను. అంత శ్రీకృష్ణుడు శంఖారావము గావించుచు సముద్రములో మునిగి పంచజనుడు దీనుడై యుండ బాణముచే వానిని గూల్చి, వాని కడుపు చీల్చెను. గురు పుత్రుడు వాని కడుపున కనిపించక పోగా కృష్ణుడు పంచజనుని దేహము నుండి, పుట్టిన చక్కని శంఖమును తీసికొనెను. పిమ్మట కృష్ణుడు యముని రాజధానియగు సంయమని యను నగరమునకేగి పురద్వారమున ప్రళయకాల మేఘమువలె గంభీర శబ్దముగల తన శంఖమును పూరించెను. ఆధ్వని విని యముడుగ్రరూపుడై నా పురద్వారముచేరి, నా బలమును గుర్తింపక శంఖమును పూరించు వాడెవ్వడు? వాడు నా కోపాగ్నిచే భస్మమై పోవును. అని తలచి వచ్చి రామకృష్ణులను చూచి వీరు లీలామానవులైన విష్ణుమూర్తులని తెలిసికొని, వారికి భక్తితో పూజచేసి, సర్వభూతమయుడగు శ్రీకృష్ణునకు నమస్కరించి నేనేమి చేయవలెనో ఆనతి నిమ్మని వేడెను. అప్పుడు కృష్ణుడు యమునితో ఉత్తమ శీలుడా! నీవు మా గురు పుత్రుని యపరాధిగ భావించి శిక్షించుటకై నీ సన్నిధికి తెప్పించితివి. నీ వతనిని మా కప్పగించుమని తెల్పగా, యముడు వానిని ఆపి యితడే మీ గురు పుత్రుడు పిలుచుకొని పొండని భక్తితో వాని నప్పగించగా కృష్ణుడతని గైకొని, యముని వీడ్కొని పోయి, తన గురువగు సాందీపనికి పుత్రుని సమర్పించి యింకరేమి చేయవలెనో ఆజ్ఞాపింపుడనెను. అంత సాందీపని వారితో ఘనులారా! ఇంతకు ముందెవ్వడైన గురువు కోరినట్టి యిట్టి దక్షిణ నిచ్చెనా? మీరు కీర్తిశాలులై నా కోరికను దీర్చితిరి. యమపురికివెళ్ళి మృతశిశువును బ్రతికించి తెచ్చుట యితరులకు సాధ్యమగునా? మీ దయతో నాకు శుభము చేకూరినది. మీకీర్తి లోకము లందంతట వ్యాపించుగాక అని దీవించి పంపెను.

అంత రామకృష్ణులు గురుని యాజ్ఞచే రథమునెక్కి మధురానగరికి వచ్చి పాంచజన్యమును పూరింపగా మధురలోని జనులు పోయిన ధనము తిరిగి వచ్చినంత సంతోషమును పొందిరి.

శ్రీకృష్ణుడు గోపికల కడకు ఉద్ధవుని పంపుట.

ఒకనాడు కృష్ణుడు ఏకాంతమున తనలో నిట్లు తలచెను. "వ్రేపల్లెలోని గోపికలు నాపైననే తమ చిత్తముల నిల్పుచు, నారాక కెదురు చూచుచు, నాపేరు తలచుకొనుచు, నేను రాలేదను చింతతో ఎన్నివిధముల వాపోవు చున్నారో ఎంతజాలిపడు చున్నరో నాపై నెంత కోపించిరో నన్నెంతగ తిట్టు కొను చున్నారో తమ గృహములలో నుండియు శాంతిలేక, ఉత్సాహములేక ఎంతబాధపడు చున్నారో కదా" అని చింతించి సిద్ధసంకల్పుడు ఏదైనను లోతుగ ఆలోచింపగలవాడు చక్కగ మాటలాడ గలవాడు, బుద్ధియందు బృహస్పతి వంటివాడును వృష్ణివంశ దీపకుడునైన ఉద్ధవుని పిలిపించి యతనితో నిట్లనెను. ఉద్ధవా! రమ్ము వ్రేపల్లెలో గోపకాంతలు నారాక కెదురు చూచుచు నాపై మోహముతో పనులన్నియు మఱచి యేవిధముగ బాధపడు చున్నారో తను నమ్మిన వారిని విడిచిపెట్టుట ధర్మము కాదని పెద్దలు చెప్పుదురు. వారు నా వియోగము వలన కల్గిన తాపముతో ప్రాణములెట్లు నిల్పుకొనిరో నీవు వెంటనే వ్రేపల్లెకు పొమ్ము. ఎవరు లౌకికములైన బంధనముల విడిచి, నన్ను శరణు జొత్తురో వారిని నేను దయాదృష్టితో బ్రోతును. ఆశ్రిత రక్షణ మనునది నాకు సహజ సిద్ధమైనది. నీ వచ్చటికిపోయి సంకేతములందు వారికి నామాటగా నిట్లు చెప్పుము. "ఓ పద్మముఖులారా నేను మిమ్ము విడిచిపెట్టను. బృందావనమునకు తప్పకవత్తును ఇందులో సందేహములేదు." అని కృష్ణుడు ముఖము వికసింపగా ఉద్ధవునితో కరచాలనముచేసి సరసవచనముల పల్కి ఉద్ధవుని గోపల్లెకు పంపెను. కృష్ణుని యానతి చొప్పున ఉద్ధవుడు వెంటనే రథారూఢుడై మధురనుండి బయలుదేరి పొద్దుగ్రుంకు సరికి నందుని వ్రేపల్లెచేరి గోధూళిచే తన రథము కప్ప బడగా నందుని యింటికి చేరెను. ఉద్ధవుని చూడగనే నందు డెదురేగి యా పుణ్యాత్ముని కౌగిలించుకొని యానందించి యితడు మా పాలిటి కృష్ణుడనుచు నతని గౌరవించి, సత్కరించి చక్కని భోజనముపెట్టి యతని మార్గాయాసము తీర్చి, యుత్సాహముతో నందుడు ఉద్ధవునితో నిట్లనెను. కంసుడు గతించిన తరువాత పుత్రులైన రామకృష్ణులు నియమముతో సేవింపుచుండ నామిత్రుడైన వసుదేవుడు సేమముగా నున్నాడా? అన్నా! ఉద్ధవా! మాకృష్ణునకు సేమమే కదా! ఎప్పుడైన తల్లిదండ్రులైన మమ్ము సంతోషముతో తలచుచుండునా? తనను విడిచిపెట్టిన గోపులను గోపికలను, స్నేహితులను గోపులను ప్రతిదినము తలచుచుండునా? ఇచ్చటి ఈ వనములను, నదీనదనములను గూర్చి యెప్పుడైన

ముచ్చటించునా? యీ వ్రేపల్లెకు మా కృష్ణుడెప్పుడు వచ్చును? కళంకములేని చంద్రబింబమువంటిదియు కాంతిచే సుందరమైనదియునైన ఆ కమలాక్షుని ముఖము చూచుభాగ్యము మాకింక యీ జన్మలో నుండునా? అని నందుడు గోవిందుడు వ్రేపల్లెలో చేసిన పనుల నన్నిటిని చెప్పిచెప్పి కన్నీరు గార్చుచు, గొంతు బొంగురు పోగా మాటలాడలేక విరమించెను. తన భర్తయైన నందుడు తన బిడ్డయైన కృష్ణుని గుణగణములను పొగడు చుండగా విని యశోద చన్ను చేపగా, కన్నీరొలుకగా అదే చింతలో నుండెను. కృష్ణు డెప్పుడు చూతమా యని యువ్విళ్ళూరుచున్న యశోదా నందులకు ఉద్ధవుడిట్లు చెప్పెను. మీరిట్లు దిగులు పడకుడు. ధైర్యముతో నుండుడు. తల్లిదండ్రులైన మిమ్ము చూచుటకు కమలాక్షుడు త్వరలోనే వ్రేపల్లెకు వచ్చును మీకు శుభములను చేకూర్చును. బలరామకృష్ణులు మానవులా? భూభారమును మాన్పుటకై హరియే వారి రూపములతో అవతరించెను. ఆ పరమేశ్వరుని ప్రాణావసాన సమయమున స్మరించువాడు బ్రహ్మమయుడగును. సూర్యునివంటి తేజశ్శాలియగును. మిక్కిలి శ్రేయమును పొందును. అఖిలభూతములయందు ఆత్మరూపముగ నుండువాడగు నారాయణుడు కారణజన్ముడై భూమిపై నవతరించగా మీ రతనిపై మనస్సును చేర్చి సేవించి మీరు ధన్యాతి ధన్యులైతిరి. కట్టెలలో నగ్నివలె నతడు సర్వభూతములందును వెలుగొందును. అతనికి తల్లిదండ్రులు భార్యలు పుత్రులు బంధువులు శత్రువులు ఇష్టులు అనువారులేరు. అతనికి జన్మములులేవు జన్మకర్మలునులేవు అతడు గుణరహితుడైనను శిష్టులను రక్షించుటకు సగుణుడై సజ్జనుల రక్షించును. దుష్టులను శిక్షించును. అని పెక్కువిధముల, హరి ప్రభావములను తెలుపుచు ఆ రాత్రి నంతటిని గడిపి, మఱునాడు తెల్లవారగనే పెరుగు చిలికెడు సవ్వడుల విని లేచి యనుష్ఠానముల చేసికొని యుద్ధవుడొక రహస్య ప్రదేశమున నుండెను. గోపికల తనిని జూచి కమలములవంటి కన్నులు సుందరమైన ముఖము విశాలవక్షము. ఆజానుబాహువులు, పద్మమాలాలంకరణము మెఱయు కుండలము గల యొక వీరుడిచ్చట, కృష్ణునివలె విలసిల్లు చున్నాడని సిగ్గుతో కూడిన నగవులతో చూపులతో నతని కిట్లనిరి.

భ్రమరగీతము.

యశోదా నందులకు తన క్షేమము తెల్పి రమ్మని గోవిందుడు పంపగా ఇచటికి వచ్చిన కృష్ణుని చెలికాడవని మాకు తెలియును. హరినైనా మఱచి పోలేదుకే

అదైన కొంచెము మేలు. వారు తప్ప మన్నింపదగిన వారు మఱెవ్వరున్నారులే ఆయనకు. ఎంతటి వైరాగ్యముగల మునులైనను తమ బంధువులను, స్నేహమును విడువలేరు. సహ్యాజసఖ్యమును విడువకుందురా? తుమ్మెదలు తమ యాకలి తీరినంతనే పూలను విడిచిపెట్టునుకదా! అని గోపికలు మాట్లాడుచుండగా వారిలో నొక గోపిక తియ్యగ పాటపాడుచున్న నొక గండు తుమ్మెదను చూచి అది కృష్ణుడు పంపగా తనను వేడుకొనుటకై వచ్చిన దూతయని తలచి ఉద్ధవునకు పరోక్షముగ తెలియుటకై ఆ తుమ్మెదతో ఆ కాంత యిట్లు పలికినది—

"దుర్జనమిత్రా! భ్రమరా! మా పాదపద్మములను తాకకుము. మా ప్రాణేశ్వరుడు మమ్ము నుడికించుచు, మధురానగరములో దివ్యభవనములో విహరించుచు, నాగరస్త్రీల చనుగుబ్బలపై యలదిన కుంకుమ గుర్తులుగల శ్రీకృష్ణుని మెడలోని పూదండలోని తేనె గ్రోలుచు ఎఱ్ఱనబడిన ముఖముగల నిన్ను చూచి కృష్ణుడు నిన్నెంతగనో మన్నించవచ్చును. కాదనము అయినను నీకు మా పాదకమలమును ముట్టకుము. ఓ తుమ్మెద దిమ్మరిడా! నీవు ఒక పూవుపై వ్రాలి దాని తేనెత్రాగి మఱియొక పూవుపై వ్రాలుదువు. అట్లే మావిభుడు మా యౌవనము కొల్లగొట్టి, మన్మధరామృతమున దేల్చి యిప్పుడు మఱియొకరిపై ప్రేమ జూపుచున్నాడు. ఇంతటి చపలుడని తెలియక లక్ష్మి యితనిని నమ్మి యితనికి దక్కుట యెట్లో తెలియదు. భృంగా! నీవు కృష్ణుడు మంచివాడని పొగడుచు సంగీతము పాడుచున్నావు. మేము పరవశులము కాములే. అతని సంగతులు మాకు పూర్తిగా తెలియును. నీవు క్రొత్తగా చెప్పవలసినది లేదు. ఆ మధురానగరములో ఎత్తైన మేడలో నీ సంగీతము పాడినచో వారు నీ కోర్కెల దీర్తురు. ఈ పాట చాలింపుము. ఎందుకువచ్చిన కంఠశోష యిది. ఓ భ్రమరరాజా! త్రిలోక నారీరత్నమగు శ్రీకాంత తన పాదపద్మములు గొలుచుండగా శౌరి తన నవ్వులతో కటాక్షములతో ఎందఱిని రమించడు. ఆ శౌరి మే మెవ్వరమని మాపై దయ జూపునులే. ఓ మధుపరాజా! నీకు రాయబారము నడుపుట బాగా చేతనగును. నీ నేర్పులింక చాలించుము. నా పాదముల, ముట్టుకొకు మగలను బిడ్డలను విడిచి, తననే నమ్మిన మమ్ము ఆ విభుడెందులకు విడిచిపోయెను. ఇట్టి పద్ధతులను పెద్దలు మెచ్చుకుందురా? ఆ మాధవునకి తరులను వంచించుటలో ఆసక్తి హెచ్చు. వాలిని మోసగించి వేటగానివలె చంపెను. శూర్పణఖను మోసముతో కురూపిగా చేసెను. ఆ బలిని మోసపుచ్చి

త్రిలోకముల నాక్రమించెను. అతడు ధార్మికుడేనా ? అట్టివానిని ప్రశంసింప నిన్నెమనవలెను. ఆకాశమున సంచరించు పక్షులు తన నామము నొకమారు పేర్కొన్నను వానికి భార్యాపుత్రులతోటి సంబంధమును వదలించి నిత్య సంతోషము నిచ్చువాడు. ఎల్లప్పుడు తననే కోరుకొనుచున్న మా బ్రతుకును సహింపగలడా ? బంధువులను, మగలను, సోదరులను, తల్లిదండ్రులను, అత్త మామలను కామాంధులమై వదలిపెట్టి తనను శరణుపొందగా మమ్ము వియోగ సముద్రములో ముంచిపోవుట న్యాయము కాదని మీ ప్రభువునకు గట్టిగా నొక్కి చెప్పుము. మాధవునకు మా కుటీరములు రత్నముల పొదిగిన బంగారు మేడలా ? మా పల్లె రాజులచే సేవింపబడు రాజధానియా ? వారికి మా యడవి పువ్వులతో, తీగలతో, చెట్లతో కోళిల్లు ఉద్యానమా ? మా గోవులు లక్షణ లక్షితములైన ఏనుగులా, గుఱ్ఱాలా ! మేము శ్రీవల్లభునకు సుందరీమణు లమా ? కావున ఆ వారి మా విషయము నెందుకు తలచును ? మమ్మెందుకు తలచును ? ప్రభువు లెప్పుడును క్రొత్తవారినే ప్రియముగ చూచుకొందురు కదా ?" ఇట్లనేక విధముల కృష్ణునిచూడ తహతహలాడుచు పలుకు గోపికల మాటలు విని మధురాలాపములతో వారి నోదార్చుచు ఉద్ధవుడిట్లు చెప్పెను—

"జపములతో, దానములతో, వ్రతములతో, హోమములతో, ఇంద్రియ నిగ్రహములతో, తపస్సులతో వేదాధ్యయనము మున్నగు వానితో ఎంతటి నిపుణులైనను ఎవనిని తమ మనస్సులలో నిల్పుకొనజాలరో ఆ విశ్వేశ్వరుడు, విష్ణువు, మహామహిముడైన కృష్ణునిపై మీకింతటి దృఢములైన భక్తిశ్రద్ధలు నిలిచిన వంటే నిజముగా మీ చరిత్ర అతివిచిత్రము. నన్ను మీవద్దకు పంపునపుడు కృష్ణుడు నాతో మీకు చెప్పుమనిన మాటలు మీరు శ్రద్ధగా వినుడు"—

"సర్వకార్యములకు నేను ప్రధాన కారణము కనుక మీకు నావలన వియోగము కలుగదు. స్థావరజంగములలో పంచమహాభూతములున్నట్లు నేను సమస్త ప్రాణులలో, వస్తువులలో నుందును. మనోబుద్ధులకు, గుణములకు, ప్రాణములకు, ఇంద్రియములకు ఆశ్రయము నేనే. నేను నాచే నావలన లోకముల పుట్టింతును. పెంతును. హరింతును. ఆత్మకు గుణగణాకారము ఆత్మకు కలుగును. నిత్య శుద్ధము విజ్ఞానమయమునైన ఆత్మ ప్రకృతికార్య మనోవృత్తులను పొందు చుండును. విజ్ఞానియైనవాడు తాను కలలో చూచిన దంతయు కల్లయని తలంచి నట్లు మనస్సుచే నింద్రియవిషయములను నియమించి, ప్రపంచము మిథ్యయని

తలంచుము. మనస్సును నిగ్రహించుకొనిన వారికిని ఆత్మవస్తువునకు భేదములేదు. సద్గురుప్రియునకంటె వేరుగా నదులున్నట్లు సాంఖ్యయోగాదుల కతీతముగా మనోనిగ్రహమునునది యున్నది. ప్రియురాండ్రు దూరముననున్న తమ ప్రియులపై మనస్సుల నెల్లప్పుడు నిల్పుదురు. మీరెప్పుడును నన్నుగూర్చి తలంచవలెననియె మీకు దూరముగ నుంటిని. అట్లని భయపడకుడు. నిత్యధ్యానముతో నన్ను కూడెదరు."

అట్లు ఉద్ధవుడు కృష్ణసందేశమును వినిపింపగా గోపికలు సంతసించి యుద్ధవునితో "హరి హాయిగానున్నాడా? ఇక్కడి కెప్పుడు వచ్చును. వచ్చి మాచింతను ఎప్పుడు తొలగించును. ఒకవేళ మాధవుడిటకు రాదలచినను ఆ మధురాంగన లాతని కడ్డము రాకపోరు. ఇంతకు కఠినమైన బ్రహ్మ మమ్ము మదనబాధకు లోనుగావించెను. హరి యమునా నదీతటమున, పూపొదరిండ్లలో మమ్ము కరగించిన విషయము మఱచునా? నీతో నెప్పుడైనను తాను మమ్ము రంజింపచేసిన విషయములనుగూర్చి చెప్పెనా? మాతో రాసక్రీడ సల్పినది తెలిపెనా? ఇక నే కొంచెమాలసించినను మా శరీరములు నిలువవని చెప్పుము. అంతకంటె ముందే మాధైర్యములు, మామనస్సులు, మా ప్రాణములు పోవునని చెప్పుము. తనపై మరులుగొన్న మగువలను విడుచుట తగవుకాదని నీ మిత్రునకు చెప్పుము." అని గోపికలు దుఃఖసముద్రమున మునిగిన గోకులము నుద్ధరింపుము. ఓ రమానాథా! యని చింతించిరి. ఉద్ధవుని పూజించిరి.

అట్లు ఉద్ధవుడు కృష్ణలీల వర్ణనల నేయుచు వ్రేపల్లెలో కొన్ని నెలలుండి నందాదుల సెలవుగైకొని మధురకేగి, కృష్ణుని దర్శించి నందాదు లిచ్చిన కానికలను రామకృష్ణులకు, ఉగ్రసేనునకు వేఱువేఱ యిచ్చెను.

కృష్ణుడు కుబ్జ యింటి కేగుట.

ఒకనాడు కృష్ణుడు తనతో సుఖింపకోరిన కుబ్జతో సుఖింపగోరి, రత్న స్వర్ణ మాల్యాదులను ధరించి లేపనములనలది జిగజిగ మెఱయు వస్త్రముల ధరించి కుబ్జ యింటి కేగెను. ఆ యింట మన్మథ బాణమువలెను, చంద్రకళవలెను, నాట్యము నేర్చిన మెఱుపుతీగవలెను, నిఖలభువన మోహినీదేవతవలెనున్న కుబ్జను చూచెను. కృష్ణుని గాంచినంతనే కుబ్జ తన పరిచారికలచే కృష్ణునకు పరిచర్యల చేయించి, కృష్ణుని బంగరుతల్పమున నుపవిష్టుచేసి యుద్ధవుని పూజించి, యుచితాసనమున

గూర్చుండుమని, తన పరిచారికలు తెచ్చిన పుష్పహారములను కస్తూరిని మణి భూషణములను దాల్చి వస్త్రముల ధరించి, కృష్ణుని కలిసికొనఁగోరెను. అంత కృష్ణుడు కుబ్జపై సరసవిలోకనముల ప్రసరింపుచు, సరసాలాపముల గావించుచు, సువర్ణ కంకణములతో నొప్పు ఆమె చేతిని తనచేతబట్టి తల్పమున కాకర్షించి మన్మథ సుఖముల దేల్చెను. తనకు లేపనముల నొసంగిన పుణ్యముచే కుబ్జకు మాధవునితో రమించు భాగ్యమబ్బెను. కృష్ణుడు నీకేమి వరము కావలెనో కోరు కొమ్మనగా కుబ్జ మఱికొన్ని దినములు తనను మన్మథలీలలను దేల్చుమని కోరగా నామె కోరిక నట్లే తీర్చెను.

ఒకనాడు కృష్ణుడు ఉద్ధవ బలరామ సహితుడై అక్రూరుని యింటి కేగెను. వారిని జూచినంతనే అక్రూరుడు లేచి రామకృష్ణులకు నమస్కరించి, యుద్ధవుని కౌగిలించుకొని వారి నందఱిని యథోచితముగ సత్కరించి కృష్ణుని పాదములను తన తొడలపై నుంచుకొని యిట్లనెను——

"ఓ ఘనులారా! మీచేత సానుచరుడై కంసుడు యమపురి కేగెను. మీ బలముచే యాదవుల వంశము పెంపొందెను. త్రిలోకపావనియగు గంగాజలముచే ప్రకాశించుచు వేద, దేవ, బ్రాహ్మణ రూపుడవైన నీవు దయతో మాయింటికి వచ్చుటచే మాగృహములు పావనములైనవి. నిన్ను సేవించిన వారికి దయతో నీవు ముక్తి నొసంగుదువు. ఓ భక్తచింతామణీ! ఏ పుణ్యప్రభావముచేతనో ఇక్కడ నీ పాదముల దర్శించితిని. నిన్ను కనుగొంటిని. నాపై దయయుంచి ధనములపై భవనములపై కాంతాపుత్రాదులపై మమకారమును మాన్పి భవబంధముల తొలగింపుము." అనిన విని కృష్ణుడు అక్రూరునకు సంసారముపై మోహము కలిగింపుచు నిట్లనెను——

అక్రూరుని హస్తినాపురికి పంపుట.

"మహాత్మా! నీవు నాకు బంధుడవు. వరుసకు జనకుడవు. దయాసముద్రుడవు. మానవులు శిలామయములైన దేవసంఘముల గొల్తురు. జలమయ తీర్థముల సేవింతురు. వారట్లు సేవించుటను కాదనరాదు కాని, భగవత్పరభక్తులు తీర్చునట్లుగా ఆ దేవతలు తీర్థములు భక్తుల కోరికలను తీర్పలేవు. మహాత్మా! భాగవతోత్తముడవైన నీవు మా కోరికల తీర్చుటకు సమర్థుడవు. పాండవులు కుంతీ సహితులై ధృతరాష్ట్రుని శాసనమున హస్తినాపురిలో నున్నారు. ఆ అంధనృపతి

పాండవులపై సమభావమును చూపడు. వారు బంధువులు కాబట్టి వారికి దుర్బుద్ధి మాన్పి, వారికి మేలు చేకూర్చి వారిని సంతోషపెట్టవలయును. కావున నీవు హస్తినాపురికి పోయిర"మ్మని అక్రూరునకు చెప్పి ఉద్ధవ బలరాములతో పాటు తన గృహమునకు పోయెను.

అక్రూరుడు కృష్ణుని పంపున హస్తినాపురమునకు పోయి, యందు ధృతరాష్ట్ర భీష్మ విదుర బాహ్లీక భరద్వాజ, గౌతమ, దుర్యోధన, కర్ణాశ్వత్థామాదులను, కుంతీ సహితులైన పాండవులను తక్కిన బంధువులను జూచి యథోచిత సత్కారములబొంది, వారివారి ప్రవర్తనలను తెలిసికొనుచు కొన్నిదినముల తరువాత నొకనాడు విదురుడు వినుచుండగా కుంతి అక్రూరునితో నిట్లనెను—

"అన్నా! తల్లులు, తండ్రులు, చెల్లెండ్రు, అల్లుండ్రు, సోదరులు నిన్నిచ్చటికి పొమ్మని చెప్పినప్పుడు నీతో ఏమేమి పలికిరి. మా చింతలనుగూర్చి తలచుచున్నారా? అందరు సుఖముగనున్నారా? తోడేళ్ళమధ్య లేడిపిల్లవలె నేను కౌరవుల నడుమ చిక్కియున్నాను. మహాక్రూరుడైన దుర్యోధనుడు నా కొడుకులను పాములచే కఱపించెను. తీగలతో కట్టించి గంగానదిలో పడవేయించెను. విషము కలిపిన యన్నము వారికి పెట్టెను. నిద్రలో నేమఱియుండగా వారి నాయుధములచే పొడిపించెను. వారి యెదుట నిలువలేకపోయినను మనులలో మిక్కిలి క్రూరుడు. బలరామకృష్ణు లెప్పుడైనా మేనత్త కొడుకులైన వీరికి మేలు చేయ దలచిరా? భక్తవత్సలుడు కమలాక్షుడునైన కృష్ణుడు నా కుమారులకు రాజ్యము లోనగు భాగమిప్పించునా?" అని పలికి కృష్ణుని మనస్సున ధ్యానించుచు, "సర్వపాలకా! పుండరీకాక్షా! శరణాగతనైన నన్ను రక్షింపు"మని ప్రార్థించిన కుంతికి అక్రూరుడు దుఃఖోపశమనము కలుగునట్లు పలికి యొకనాడు బంధుమిత్రుల నడుమ సుఖోపవిష్టుడైన ధృతరాష్ట్రున కిట్లనియె—

"నీ తమ్ముడైన పాండురాజు గతించగా నీవు ధర్మబుద్ధితో భూమి నేలుచు ద్విజులను గౌరవముతో కాపాడుచు, ప్రజలను సమభావముతో చూచినచో నీకు కీర్తియు శ్రేయము కలుగును. అట్లు కానిచో దుర్గతి ప్రాప్తించును. పాండు పుత్రులను, నీ పుత్రులతో సమానముగ చూచుట మంచిది. దారా పుత్రాదులతోటి యోగము నిత్యముకాదు. జన్మమరణములు, పుణ్యపాపములు భూమిపై జరుగుచునేయుండును. మూఢాత్ముని ధనమును, అహితులైన వాని కొడుకులు అపహరింతురు. అంతియేకాని తండ్రి బ్రతికినను చచ్చినను వానిని

పట్టించుకొనరు. కావున నీవార్జించిన ధనము నీ కుమారులు మాత్రమే పుచ్చుకొనినను నీ విహపరములలో నిందకు పాలగుదువు. ఈ శరీరము నిత్యముకాదు. కావున నీవు నిందపాలు గాకుము. పుట్టుగ్రుడ్డివి. మూఢుడవుకాక సద్బుద్ధితో పాండవులకు భూ భాగమును పంచి యిమ్ము."

అనిన విని ధృతరాష్ట్రుడు అక్రూరునితో "నీవు చెప్పిన మాటమంచిదే. నాలో ఏ నిశ్చయము దృఢముగా నిలువదు. నా నిశ్చయము మెఱుపుతీగవలె చంచలమైనది. అమృతమును పొందియు ఆనందింపలేని నరునివలె నాకు సంతోషము కలుగుటలేదు. ఈశ్వరాజ్ఞ యెట్లున్నదో ? ఎంతటి విజ్ఞానియైనను విధిని దాట లేడుకదా ? ఎవడు భూ భారమును తొలగించుటకై దేవకి గర్భమునం దుదయించెనో అట్టి కృష్ణునకు నమస్కరించెదను. అతనికి నచ్చిన విధమున బ్రతుకగల వారము" అని చెప్పెను.

అంత అక్రూరుడు ధృతరాష్ట్రుని భావమును తెలిసికొని, నీ భావము తెలిసినది నీ కిష్టము వచ్చినట్లు మెలగుమని చెప్పి మథురకు వచ్చి, హస్తినాపుర వృత్తాంతమంతయు రామకృష్ణులకు తెల్పెను. పిమ్మట కంసుని భార్యలైన అస్తి, ప్రాప్తి అనువారు విధవలై దుఃఖించుచు తమతండ్రియైన జరాసంధుని వద్దకు పోయి, "తండ్రీ! యాదవులు గర్వించి, వాండ్రు వీండ్రురాజులేనా ?" అని యడ్డము లేని బలముతో మథురకువచ్చి నిష్కారణముగ భార్యలు బిడ్డలు వగచుచుండ కంసాది రాజులనెల్ల చంపిరి. కృష్ణునిచేత మాకీవైధవ్యము ప్రాప్తించినది. అనగా విని ప్రళయకాలాగ్నివలె మండుచు జరాసంధుడు రోషభీషణముగ పలుకుచు నిట్లనెను——

"ఏమీ కృష్ణుడు యుద్ధములో కంసుని వధించెనా ? నా సామర్థ్యమును గుర్తించలేరో ? నాతీవ్ర కోపానల జ్వాలలు యాదవాటవులను కాల్చివైచును. వారు భూమిలో దాగినను నింగికి ప్రాకినను, సముద్రమున దూరినను, యాదవులను చంపక మానను. ఈ భూమినెల్ల యాదవరహితగా చేసెదను. అంతేకాదు వారిని రక్షించుటకు హరిహరాదులును ఇంద్రాదు లడ్డపడినను యాదవ సంహారము జరిపి తీరెదను.

జరాసంధుడు మథురపైకి దండెత్తుట.

జరాసంధుడు యుద్ధభేరి వేయించి యిరువది మూడు అక్షౌహిణుల సైన్యము తన వెంట నడువగా క్షోభిల్లుచు మథురపైకి దండెత్తిపోయెను.

జరాసంధుని చతురంగబల పాదఘట్టనచే రేగిన ధూళి యాకసమును కప్పెను. సూర్యుని గుఱ్ఱము లాదుమ్ము కండ్లలో బడగా మెలమెల్ల నడచుచుండెను. ఇట్లు గోపకాన్తా మనోవల్లభుని బాహుదండ పరిరక్షితంబై పరులకు అలక్షితంబై యుండిన మధురానగరమును చేరి, చెలియలికట్టను దాటి పొంగిన మహాసముద్రమువలె పట్టణము చుట్టు విడిసిన జరాసంధుని యుత్సాహము చూచి కృష్ణుడు తన మనస్సున—

ఈ జరాసంధు డిరువదిమూడ క్షౌహిణులతో మధురను ముట్టడించెను. ఈ జరాసంధునియెడ సామదాన భేదోపాయములు సాగవు. దండోపాయమే ప్రయోగింప దగినది. వీనిని దండించి భూభారమును తొలగింపవలెను. నేను పుట్టినది నేలవాల్గు చెరగులగల దుష్టులను శిక్షించుటకే కదా! ఇది మొదలు భూభారమును తగ్గింప బూనుకొందును. యుద్ధమునందు జరాసంధుని చంపరాదు. వీనిని చంపకుండ వదిలినచో వీడు మాటిమాటికి బలముల గూర్చుకొని మాపైకి వచ్చుచుండును. అట్లు వచ్చినప్పుడు వాని వివిధ సైన్యముల సంహరించుటద్వారా భూభారమును మాన్పవచ్చును.

అని హరి యాలోచించుచున్న సమయమున ఆకాశమునుండి మహాకాంతి కలిగినవియు, అస్త్రశస్త్రములతో నిండినవియు, సూతులు గలవియు, అనేక బాణములు, విల్లులు, చక్రము మొదలగువానితో కూడినవియునగు రెండు రథములు హరి మనోరథంబులు సిద్ధింప దైవయోగంబున నతని చేరవచ్చినవి. ఆ రథములను జూచి హరి బలరామునితో—

"రామా! రథములను చూచితివికదా! ఇందస్త్రశస్త్రములు కలవు. వీనిని గ్రహించి దేవతలు మెచ్చునట్లు రణము చేయవలెను. శత్రువుల నుపేక్షింపక చంపవలెను. నీవు వీరిని చంపి భూభారమును తగ్గింపవలెను. అప్పుడే నీవు భూమి యందవతరించుట సఫలమగును" అని చెప్పెను. అంత రామకృష్ణులు దృఢములైన కవచములను ధరించి ధనువులబట్టి చతురంగ బలసమేతులై శత్రుభయంకరులై యుద్ధమునకు బయలుదేరిరి. అంత దనుజాంతకుడైన శ్రీహరి భక్తులకు సంతోషమును కల్గించునదియు, శత్రువులకు భయమును కలిగించునదియునైన పాంచజన్యమును పూరించెను.

ఆ పాంచజన్యనాదమును విన్నంతనే జరాసంధుని సైన్యములకు చెవులు చిల్లులు బడినవి. అవి యంధములై కలవరము చెందినవి. అప్పుడు జరాసంధుడు శ్రీహరిని

బాలురి యిట్లు చెప్పెను : "గోపాలా ! ఇవి యాలమందలు కావు. మదపుటేనుగుల గుంపులు. ఇవి యంభారవములు తురగేంద్రముల హేషారవములు. ఇవి పాల బండ్లుకావు శాకిలే పడిపోవుటకు. మహోన్నత పర్వతములకు సాటియైన రథములు సుమా ! ప్రియముగ మాటలాడుటకు గొల్లగుంపుకాదు. యమునకు సాటియైన శత్రువర్గము సుమా ! ఇది దావాగ్నికాదు బాణాగ్ని. యిది బృందావనమా ? కాదు సైన్యము. నటించుటకిది యమున యమునకొలనా ? కాదు భయంకరమైన యుద్ధభూమి. ఆడదానిని చంపుటో, కొంగను కూల్చుటయో, చెట్లను పడగొట్టుటయో, గాడిదను పడగొట్టుటయో, పామును పారద్రోలుటయో, గాలిని బంధించుటయో, కొండను చేతబట్టుకొనుటయో కాదు సుమా! ప్రళయకాలాగ్నివలె వారింప శక్యముకాని బాణాగ్నిని ప్రాణముతో నుండి యెల్లెదుర్కొనెదవో గొల్లడా ! ఇవి గొల్లపడుచుల వీణలుకావు. అస్త్రశస్త్రాదుల ధ్వనులు. గొల్లపడుచులు పైన చల్లెడు జలధారలు కావు సుమా ! యివి బాణధారలు ఇవి గోపకాంతల కటాక్షములను కొంటివేమో ! కావు. వాడికత్తి వ్రేట్లు. వ్రేతలకరకమలములు కావు. భీషణములైన ముష్టిఘాతములు. ఇది వ్రేపల్లె కాదుసుమా ! సంపూర్ణమైన మగధరాజ సైన్య సముద్రము. ఈ సేనా సముద్రము దీవిని ముంచెత్తునట్లు నిన్ను ముంచెత్తును సుమా !" అనగా విని శ్రీహరి జరాసంధునితో నిట్లనెను :

నీకు పంతములేల పూర్వము రాజులను పోరిలో గెల్చితివి. డంబములు పల్కుట పౌరుష లక్షణము కాదుకదా ! ఇంతటితో ముగిసెనా ఎందుకీ ప్రలాపములు. ప్రళయకాల మహోగ్రుడగు అగ్నిహోత్రునైన వారింతును. సంపదను వహింతును. జరాసంధా ! నీవు నన్ను గోపాలుడవంటివి. భూపాల - గోపాలురవ్యాపారములలోని భేదము నీ కిప్పుడే తెలియునులే !" అనగా విని జరాసంధుడు మండిపడి- "కృష్ణా ! నీవు బాలుడవు నాతో పోరాడజాలవు. నాతో యుద్ధము చేయుటకు బలభద్రుని పంపుము. జలపాల శిఖామణియైన యీ మాగధుడొక గోపాలబాలునితో యుద్ధము చేసెనని ప్రజలు చెప్పుకొనినచో నాకు సిగ్గుగ నుండును. కాబట్టి నీవు తొలగిపొమ్ము. దివ్యశరజాలముగల మమ్ము నీవు జయింపగలవా ?" అనగా విని నగధరు డిట్లనెను——

"మాగధా ! శూరులు ఆత్మప్రశంస చేసికొనరు. పౌరుషము చూపుదురు. మగతనమున్నచో పోరికై రమ్ము." కృష్ణుని మాటలువిని జరాసంధుడు రోషముతో

వాయువు మేఘజాలముతో సూర్యాగ్నులను కప్పివైచినట్లు తన వివిధ సైన్యములఁ బ్రవేశింపించి రామకృష్ణుల చుట్టుముట్టెను. అంత గుఱ్ఱముల సకిలింతలు, ఏనుగుల ఘీంకారములు రథముల శబ్దములు జ్యావల్లీ నినాదములు, వివిధాస్త్రముల శబ్దములు, జయశబ్ద ఘోషములు, జయభేరీ నినాదములు. శంఖ పటహాదుల భీషణారావములు బ్రహ్మాండము పగులునట్లొక్కమాఱు చెలరేగినవి. అంత మాగధ-మాధవ సైన్యములు ప్రళయకాల సముద్రములవలె నింగికిపొంగి చెలంగి తలపడి పోరాడునప్పుడు అరణ్యమునుండి వెడలిన రెండుమదపుటేనుగులు మార్కొనునట్లును, రెండు సింహములు తలపడినట్లును, రెండు శరభమృగములు పోరాడినట్లు, ప్రచండములైన గండభేరుండములు ఒకదానినొకటి యెదుర్కొనినట్లుండెను. వీరరసములు వివిధరూపములైనట్లు, ఐదుగురు, నూర్వురు, వేవురు గుంపులై సింహనాదములు సేయుచు అట్టహాసముల గావించుచు ఒకరిపైనొకరు గదల వేయుచు బాణముల ప్రయోగించుచు, ముద్గరములచే మొత్తుచు, రోకళ్ళచే పొడుచుచు, గుంటములచే గ్రుచ్చి యెత్తుచు, ఖడ్గములచే త్రెంచుచు, చక్రములతో ఖండించుచు, శస్త్రములచే తఱుగుచు చిత్రముగ తిరుగుచు, పరిఘముల ద్రిప్పికొట్టుచు ప్రాసంబుల పెట్టుచు, శూలంబులచే చిమ్ముచు, సురియలఁ గ్రుమ్ముచు బహువిధముల పరాక్రమించుచుండిరి. పదాతులు నలుగునట్లు రథములను నడిపి రథికులు వివిధాయుధముల ప్రయోగించుచుండిరి. రథికులు వేయు బాణములకు చలింపక మేఘధారలకు చలింపని పర్వతములవలె ఏనుగులు రథములను గ్రుమ్ముకొని తొండములసాచి నొగలొడిసి తీసి కుదించి విఱిచి కూబరముల ముక్కలుచేసి భటులను బంతులవలె నెగురవేయుచు గుఱ్ఱముల త్రొక్కి విచ్చలవిడిగ విహరించుచుండినవి. రెక్కలుగల కొండలవలె జివ్వున నెగురుచు భయంకరముగ సకిలించుచు గుఱ్ఱముల నడుపుచు అవి రేపు ధూళిచే చీకట్లు గ్రమ్మగా ఆ చీకట్లను తమ కఠోరఖడ్గ కాంతులచే వారించుచు, శత్రు సైన్యముల చీల్చిచెండాడు అశ్వికులు గలిగి రణము భయంకరముగా నుండెను. రథములు చెడిపోయినవి. గుఱ్ఱములు పడిపోయినవి. ఏనుగులు కూలిపోయినవి. భటులు చనిపోయిరి. రక్తము ప్రవహించినది. అందు తెగిపోయిన తలలు, ఒఱిగిపోయిన శరీరములు, పొడిపొడియైపోయిన సొమ్ములు కృష్ణసైన్యమున కనబడెను.

యదుబలము విఱిగిపోయినది. సౌధాగ్రములనుండి యుద్ధమును చూచుచుండిన పౌరాంగనలు తమలోతాము నిట్లనుకొనిరి. "ఈ బలరాముడు యోధాగ్రేసరుడు. కృష్ణుడు లోకోత్కృష్ట బాహుబల ధౌరేయుడు ఇట్టి వారినికూడ

మాగధుడు నిరోధించెననుట చాలా చిత్రముగనున్నది. అనుచు వారు సంభాషము చెందుచుండిరి. ఇట్లు తన సైన్యము విఱిగిపాఱి పోవుటనుచూచి కృష్ణుడు యుద్ధోత్సాహముతో భూమండలమును మోయగల తన బాహుదండములను పెంచి విజృంభించి, బ్రహ్మాండము బ్రద్దలగునట్లు పాంచజన్య శంఖమును పూరించెను. ఆ శంఖారావము వజ్రఘోషగా తన నెమలి పింఛము ఇంద్ర ధనుస్సుగా నిశిత్తమైన హస్తలాఘవముచే బాణములాగుట, ధనుస్సున సంధించుట దాని విడుచుట అనునవి పర్వరచుటకు వీలుగానట్లు శార్ఙ్గకోదండంబులు మెఱుగులుగా వింటినారి మ్రోత మేఘగర్జనముగా రథములచే గుఱ్ఱములచే ఎగురుగొట్టబడిన దుమ్మంతయుకలిసి ఆకాశము నాక్రమించగా అది చీకటిగా, గోవిందుడు దుష్టసంహారము మొదలుపెట్టెనని నారదుడుత్సాహముతోచేయు తాండవము, మేఘదర్శనముచేపొంగి, నెమళ్ళుచేయు నాట్యముగా నుండెను. నానా యోధుల రక్తము త్రాగవలెనని యుబలాటపడు భూతసంఘములు మేఘజలమును త్రాగుటకై సంబరపడుచాతకములవలె నుండెను. బలరాముడు వర్షమునకు కారణమైన మందమారుతమువలె నుండెను. కృష్ణుని నల్లని శరీరము క్రొక్కారు మొయిలుగ నుండెను. అంతట హరి శత్రువు చతురంగబలములపై ఎడతెరపిలేక కుప్పకుప్పలుగా అనేక దివ్యబాణముల వర్షించుచుండెను. ఆ బాణవర్షమునకు శత్రురాజుల కిరీటములనుండి ముక్కలు ముక్కలై పద్మరాగ మణులు రాలుచుండెను. మదపుటేనుగుల పగిలిన కుంభస్థలములనుండి రాలు ముత్యములు వడగళ్ళుగ నుండెను. వాడియైన అర్ధచంద్రాస్త్రముచే శత్రు సైనికులకాళ్ళు నరకబడుచుండెను. పడిపోవు వీరులనోళ్ళనుండి రాలు దంతములు మాలతీ పుష్పములవలె నుండెను. బాణములచే దేహములు ముక్కలు ముక్కలైపోగా రక్తము మేనులనుండి ప్రవహింపగా ఆ యేనుగులు సెలయేఱులతోకూడిన కొండలవలెనుండెను. బాణములచే పడిపోవు కంఠములనుండి చేతులనుండి రాలు ఆభరణములు పడగలపైనున్న మొగలిపూలవలె నుండెను. తెరిరపములు కప్పల రెకరెకలవలె నుండెను. దారుణబాణములచే చీల్చబడిన ఏనుగులయు, గుఱ్ఱములయు, మనుష్యులయు కొవ్వు బురదగా నుండెను.

రక్తము నదులై ప్రవహించుచుండెను. ఆ రక్తమున తేలియాడు భుజములు సర్పములవలెను, పుఱ్ఱెలు తాబేళ్ళవలెను, వెంట్రుకలు నాచుతీగలవలెను, చేతులు చేపలవలెను, గుఱ్ఱములు మొసళ్ళవలెను, ఏనుగులు దీవులవలెను, తెల్లగొడుగులు

మరుప్రూలవలెను, వింజామరలు కలహంసలవలెను, భూషణరత్న రేణురాసులు ఇసుక తిన్నెలవలెను శోభిల్లుచుండను. బలరాముడు తన ఘనమగు రోకలితో బాది బాది లావ మోది శత్రువుల చంపుచుండెను. బలరాముడు ప్రళయకాల యమునివలె కన్నులనుండి నిప్పుల రాల్చుచు, బంగారు కడియములచే విలసిల్లు తన నాగలిని వడిగా చాచి శత్రువుల తలలను వక్షస్థలములను కఠినముగా ముక్కలు ముక్కలు చేసెను. అంతట జరాసంధుని సైన్యములు రామకృష్ణుల ధాటికాగ లేక తల్లడిల్లెను. బలరాముడు గ్రిరూపుడై తన నాగలిని సైనికుల మెడలకు తగిలించి లాగి రోకటితో మొత్తుచు రక్తపు టేరుల ప్రవహింపచేసెను. ఆ యుద్ధ క్షేత్రమున ఏనుగుల తలలనుండి రాలిపడిన ముత్తెములు బలరాముడను కర్షకుడు నాగేటిచాలున చల్లిన విత్తనములుగ నుండెను. రాముడు నాగలిని విసరుచు తమను వెన్నంటగా శత్రుసైనికులలో కొందఱు వెఱగుపడి యొదిగిరి. కొందఱడగిరి. కొందఱు, చాటునకు దాగిరి. కొందఱు చెడిరి. కొందఱు చచ్చిరి. కొందఱు పడిపొర్లిరి. కొందఱు ఎదిరింపవచ్చి దొర్లిరి. హరితనవాడి బాణములతో దశదిశల కప్పివేసెను. ఇట్లు వారు భీషణముగ పోరాడుచుండగా— జరాసంధుని సైన్యములో బాణములు గ్రుచ్చుకొనగా సైనికులు కూలిరి. తలలు తెగినను శత్రువులను నొప్పించి వ్రాలిపోయిరి. కాళ్ళు తెగి పడినను చేతులతో పోరుచు ఆ చేతులుకూడా తెగిపోగా మ్రొగ్గిపోయిరి. గాయములం నుండి నెత్తురుకారగా సెలయేరుతో కూడిన కొండలవలె నుండిరి. తమ సోదరులు పుత్రమిత్రులు పడిపోగా వారికడ్డమువచ్చి విషయముల నడిగిరి. తమ వాహనములు తెగిపడగా యితరుల వాహనములనెక్కి కూలిపోయిరి. ఇట్లు హరి శత్రునాశనము గావించెను. ఆ సమయమున బలరాముడు శత్రువులు తల్లడిల్లగా భయంకరమైన అకారముదాల్చి నాగలితో రథములను, గుఱ్ఱములను చావములనుగూల్చి చంపవలెనని తెంపుతో మదాంధుడైన జరాసంధుని సింహము మఱియొక సింహమును పట్టినట్లుపట్టెను. జరాసంధుని పట్టుకొని వాని సైనికులు చెదరిపోవగా వానిని దెప్పుచు భయంకరమైన పిడికిలిచే పొడిచి చంపబోగా కృష్ణుడు బలరాముని వారించి, జరాసంధునితో నిట్లనెను. నీవు దుఃఖింపకుము ఇంకను సైన్యముల గూర్చుకొనికమ్ము. వచ్చి శత్రువులను దండింపుము.. లేనిచో దేవతలు మెచ్చగా నీ శౌర్యము చూపి పోరాడి నీ మాంస ఖండములు భూతములు భక్షించునట్లు శరీరత్యాగము చేయుము; అని జరాసంధుని విడిపించెను. అంత జరాసంధుడు మిక్కిలి సిగ్గులో మునిగి తన ముఖము చూపింపలేక తపస్సు

దేవశ్రేష్ఠమైన వీరిని జయింతుననే తలంచి పారిపోయిన రాజులను కలిసికొని వెనుకకు తిరిగిపోయెను. దేవతలు పూలవాన గురిపించిరి. రామకృష్ణులు పౌరులు వంది మాగధులు కీర్తించుచుండ విజయదుందుభుల మ్రోతల వినుచు కీర్తి పతాకలతో సువర్ణ జయ స్తంభములతో స్తంభములకు కట్టిన తోరణములతో ప్రకాశించు మధురానగరమున ప్రవేశించిరి. పిమ్మట. వారు ఉగ్రసేనునకు యుద్ధ ప్రకారముల వివరించి యుచ్చాటనక్రమముల వర్ణించుచుండిరి. జరాసంధుడంతటితో తన ప్రయత్నము మానుకొనక భూమండలమునగల దుష్టరాజులనెల్ల గూడికొని పదునేడు మారులు పదునేడక్షౌహిణుల బలములతో మధురపై దండెత్తి యాదవులతో యుద్ధముచేసి పరాజితుడై పోయి పదునెనిమిదవ యుద్ధమునకువచ్చు సందర్భమున నారదుడు కాలయవనునివద్దకేగి యిట్లు చెప్పెను. యవనా నీవు బాహుబలగర్వితుడవైన రాజుల నందరిని పెనుగాలి మేఘములను పారించినట్లు ఓడించితివి. కాని యాదవులను గెల్వవైతివి. దానికి కారణము యాదవుల మఱచుటయా లేక దర్పములేక పోవుటయా! వివేకము లేకపోవుటయా లేక వారికి భయపడుటయా? యాదవులలో వొకడు పరాక్రమముతో నెగడి జరాసంధాదులను యుద్ధమున పాఱదోలెను. అంతటి బలవంతుడివ్వ డింకొకడులేడు. అతని ఘనకార్యములను వినుము. అనగా కాలయవనుడు నారదునితో నారదా! ఏమీ యాదవులలో నంతటివాడున్నాడా? అతని రూపమెట్లుండును ఎంతటివాడు. అతడెక్కడ విహరించును? అతనికి స్నేహితుడెవడు. అతడెక్కడ నుండును. ఎటువంటి బలముతో యుద్ధము చేయును? అతడు యుద్ధమున నా బాహుశౌర్యమును భరించి నిలువగలడా! అతడు గర్విష్ఠియా? అని యడిగిన నారదుడు కాలయవనునితో నిట్లనెను. అతడు నీలమేఘమువలె నల్లని శరీరము, కమలములవంటి నేత్రములు, పూర్ణచంద్రునివంటి ముఖము, ఎత్తైన పొడవైన బాహువులు, వక్షమున పచ్చని పట్టువస్త్రము, ప్రకాశించు మణికుండలములు కలవాడు. ఇంతవాడంతవాడని చెప్పుటకు వీలుకానంతటివాడు. దిక్కులంతట కీర్తితో నిండినవాడు, ఏవేళయందైనను తిరుగువాడు. పట్టినేర్చినచే లొందు వాడు అని శ్రీకృష్ణుని గుణగణములు, కార్యములు చెప్పగా కాలయవనుడు వరకుచేయక తాపసోత్తమా! యాదవుడెంత ప్రళయకాలయముడైనను నా ముందు నిలువలేడు. అతనిని యుద్ధమునందు వ్యాయామ కర్కశములైన నాబాహువులందలి ధనుస్సునుండి విడువబడు నానా విధములైన, బంగారు పన్నెగల బాణములనుండి వెడలు అగ్నిజ్వాలలలో భస్మము చేసెదను. అని మూడు

కోట్ల మ్లేచ్ఛవీరుల గూడుకొని మథుర పైకి దాడివచ్చి విడిసెను. అది చూచి కృష్ణుడు తనలో నిట్లు వితర్కించెను—

యవనుడు మథురాపురము నావరించెను. నేడో రేపో జరాసంధుడువచ్చి సైన్యములు నిల్పును. వీరిద్దరు మిక్కిలి బలశాలురు. పట్టణమునకు రెండుపైపుల బోరాడుదురు. ఒకనితో పోరాడునప్పుడు మఱియొకడవకాశము చూచుకొని బంధువులబట్టి చంపును. లేదా వారిని మఱియొకచోటికి గొనిపోయి చెఱలో బెట్టును. ఈ విషయమున మాగధుడుదిట్ట. కావున శత్రువులు దండెత్తివచ్చి, యిచట విడిది చేయుటకు వీలుగాని దుర్గమస్థలమునందు మథురాజనుల నుంచుట మంచిది. అని తలచి సముద్రుని యడిగి సముద్ర మధ్యమున పండ్రెండు యోజనముల పొడవు పండ్రెండు యోజనముల వెడల్పుగలదియు, శత్రువులు చొచ్చుకొని వచ్చుటకు వీలుగానిదియునగు ఒక దుర్గ ప్రదేశము సంపాదించి యా మధ్యమున సర్వాశ్చర్యకరమనునొక నగరమును నిర్మింపుమని విశ్వకర్మను నియమించెను. అంతట విశ్వకర్మ కృష్ణుని యానతిచే ఇంద్ర, వరుణ, యమ కుబేరుల పట్టణముల కంటెను బ్రహ్మపురమునకంటె మించిన యత్యద్భుతమగు నొక నగరమును నిర్మించెను. ఆ పట్టణ ప్రాకారమాకసమునంటుచున్నది. పరిఖ పాతాళమువరకు వ్యాపించినది. ఇట్లు విశ్వకర్మ ద్వారకానగరమును నిర్మింపగా హరి తన యోగప్రభావముచే మథురాపురజనులందఱను ద్వారకకుచేర్చి, బలభద్రునకు తెలిపి, యతని యనుమతిచే నందనవనమునుండివచ్చు ఐరావతమువలెను, పర్వత గుహనుండి వెడలు సింహమువలెను, పూర్వదిశనుండి యుదయించు సూర్యునివలె హరి మథురానగరము వెలువడి నిరాయుధుడై వచ్చెను. అతనిని జూచి కాలయవనుడు తన యనుచరులతో నిట్లనెను. గజబలములులేవు. గుఱ్ఱపు దళములురావు. రథములు కదలవు. శూరులురారు. విల్లు నమ్ములను, ఖడ్గము మున్నగు ఆయుధములను పట్టువారు కన్పింపరు. ఇంద్రధనుస్సుతో కూడిన మేఘమువలెను పట్టువారు కన్పింపరు. ఇంద్రధనుస్సుతో కూడిన మేఘమువలె మాలను ధరించిన ఒకే ఒక వ్యక్తి నగరద్వారమునుండి వెలువడెను చూచితిరా! మన మెన్ని దినములక్రిందటనో వచ్చితిమి. కాని మనతో పోరాడుట కొకడైన రాడు. వెలుపలికి వచ్చిన యీ వ్యక్తియైన మనతో పోరాడుటకు వచ్చెనను కొందుమా యితడు నిరాయుధుడై వచ్చి యేమిచేయును. ఇతడు నాతో పోరాడుటకు వచ్చెనో లేక మంచిమాటలు చెప్పుటకే వచ్చెనో నా నుండి ధః

మును యాచించుటకే వచ్చెనో దేనికివచ్చెనో చూడుడు. ఇట్లు కాలయవనుడు మెల్లగ నడచుచు కృష్ణుని కెదురుగ వచ్చెను. అట్లు వచ్చిన యాదవేంద్రుని జూచి బాగా పరిశీలించి, యితడు నారదుడు చెప్పిన లక్షణములు కలవాడుగా నున్నాడు. ఇతడిక నాకు తప్పక చిక్కునని కాలయవనుడుత్సాహమునుపొంది, జడలూలగా అగ్నిజ్వాలవంటి గడ్డము ప్రేలగా, మేఘములతో నిండిన మేరు పర్వతమువలె బంగారుకవచముతో కూడిన తన నల్లని దేహమొప్పగా, పుట్టలో నిద్రించు పామువలె నొరలో కత్తి రాణింపగా బిగ్గలుగా నటిచి అతిశయించి, గుఱ్ఱమును కదిలించి, కృష్ణుని పట్టదలచెను. కృష్ణుడు మిక్కిలి వేగముతో పరుగెత్తు చుండగా కాలయవనుడు కృష్ణుని, వెన్నంటిపోవుచు కృష్ణునితో నిట్లనెను. ఓ యదువంశోత్తమా ఆగు మాగుము. నాకు యుద్ధభిక్షపెట్టుము. కంసాదులను నీవు యుద్ధభూమిలో జయించితివని నేను నీతో యుద్ధము చేయవచ్చితిని. పెద్దలు నవ్వునట్లు శత్రువులకు వెన్నిచ్చి పారిపోవుట రాజులకు తగునా? నీవు రాజవేనా రాజవైనచో నీ కిది కళంకముకాదా? మాధవా నేను నిన్ను లోకమునకు తెలిసివచ్చునట్లు పట్టుకొందును. నీవు నీళ్ళలో దూరినను, పాతాళమున తొచ్చినను, కొండపైకి నెక్కినను నీ వెన్ని వేషములు వేసినను నిన్ను విడువను. నా బాణములు నీపై పడకముందే నావింటినారి సద్దువినకముందే నీవు పరుగెత్తుచున్నావు. ఇట్టి పిరికిపందవు ఆ సర్పముతో, కేశిరాక్షసునితో ఏనుగుతో, మల్లురతో, జరాసంధునితో, కంసునితో నెట్లు పోరాడితివో అనుచున్న కాలయవనునకు హరి నీవు తొందరపడకుము రమ్ము రమ్మనుచు. ఇదిగో పట్టుబడెను. అదిగో చిక్కెనని, యవనుడు తన్ను పట్టుకొనుటకు రాగా ఎగిరి గంతువేయును. ఇతనిని పట్టుకొనుట అసాధ్యమని వాడనుకొనినపుడు హరి వాని సమీపముననే నిల్చెను. యవనుడడ్డము వచ్చినచో యిటు నటువానిని తికమకలుపెట్టును. పుట్టలు చెట్లు, కొలనులు అడ్డమైనచో కుడివైపునకు పోవునట్లు నటించి యెడమవైపునకును యెడమవైపు పోవుననిపించి కుడివైపునకు పోయెను. తగ్గుచోటుల దాగుకొనును, ఎత్తైనచోట్ల కంటబడును. నన్ను బట్టుకొనినచో నీవు మానవుడవేసుమా, యని వానిని రెచ్చగొట్టునట్లు చేయును. ఇట్లు కృష్ణుడు వనములను, పర్వతములను దాటెను. అప్పుడప్పుడు వానివైపు నిక్కిచూచెను. అప్పుడప్పుడు తా నలసి పోయినట్లు వానికి గన్పించును. వానికి భయపడినట్లు కనబడెను. పట్టవచ్చినచో తుఱ్ఱుమని తప్పించుకొని పోయెను. ఇదిగో లోబడెను. అదిగో పట్టుబడెను. అనుచు కాలయవనుడు ఆశించుచు హరి యడుగుజాడ

చొప్పున వాడు పర్వత గుహలో ప్రవేశించెను. అచ్చట చీకటి గుహలో నిద్ర పోవుచు గుఱువెట్టుచున్న నొక మహాపురుషుని చూచి శ్రీహరియే యని భావించి ఓరీ పురుషాధమా! నీవు నాతో యుద్ధము చేయలేక ముండ్లు, చెట్లు గండ శిలలు, కొండలు భయంకర మృగములు గల యీ యరణ్య ప్రదేశమునకువచ్చి యీ గుహలో దూరి నిద్రపోవుచున్నట్లు నటించినచో నిన్ను వదిలిపెట్టుదునా? ఎక్కడను, ఎవరికిని చిక్కనివాడవు కావని నిన్ను గూర్చి నారదుడు నాకు చెప్పెను. ఈ గుహలోనే నీవు దీర్ఘనిద్ర పోవునట్లు చేసెదను అనుచు యవనుడు కోపగించినవాడై కాలెత్తి యతనిని తన్నెను. ఆ ధ్వని గుహయందు ప్రతి ధ్వనించెను. అంతట ఆ నిద్రించుచున్న వ్యక్తి కమలములవంటి కన్నులవిప్పి లోలోపల కోపించి కంటినుండి వెడలు అగ్ని జ్వాలలచే కాలయవనుని భస్మము గావించెను. అని చెప్పగా పరీక్షిత్తు శుకయోగితో నిట్లనెను—

ముచుకుందుని కథ

యోగీంద్రా! ఆ నిద్రపోవుచుండిన వ్యక్తి యెవడు అతని తండ్రి యెవడు. అతడు ఘోరమైన పర్వతగుహలో నిద్రించుట కెందుకు వచ్చెను. అతడు యవను నెట్లు కాల్చగల్గెను. ఈ విషయములు చెప్పుము అని యడుగగా శ్రీశుకయోగీంద్రుడిట్లు చెప్పెను. అతడి ఇక్ష్వాకు కులమున బుట్టినవాడు. అతని తండ్రి మాంధాత. అతనిపేరు ముచికుందుడు. రాజైన ముచికుందుడు రాక్షసులవలన భయపడిన దేవతలను చిరకాలము రక్షించుచు స్వర్గముననే యుండెను. అంత దేవతలు, దేవలోక సంరక్షకుడైన ముచికుందుని జూచి యిట్లనిరి. నీవు భూమండలమున, నిష్కంటకమైన రాజ్యమునువిడిచి చిరకాలము మమ్ము రక్షించితివి. ఈ లోపున నీ భార్యలు, మిత్రులు, బంధువులు, పుత్రులు భూలోకమున కాలగతులైరి. కాలము దాటరానిదికదా?

> "కాలము బలవంతులకంటె బలముగలది. ఈశ్వరుడు కాలాత్ముడు. ఈశ్వరుడు జనులను కాలమునకు వశులనుగా జేయును. ఎంత ఘనులైనను కాలము నతిక్రమింపజాలరు."

ఓ రాజా! మోక్షముతప్ప నీ కేది కావలెననినను నీ కిత్తుము. శ్రీహరియే మోక్షప్రదాత. కావున మోక్షముతప్ప నీ కేది కావలెనో కోరుకొమ్మనగా ముచికుందుడు నిద్రను కోరి తన నిద్రాభంగమొనర్చువాడు తాను వీక్షించినంతనే భస్మమగునట్లు వరమిమ్మని యడిగెను. దేవతలు 'తథాస్తు' అనిరి. ఇట్లు



ముచుకుందుని కంటిమంటలకు కాలయవనుడు దగ్ధమగుట. పుట.534

దేవకర్త నిద్రాపరుడై పర్వత గుహలో ముచికుందుడు నిద్రించుచుండెను. హరిమాయచే అతనికి నిద్రాభంగమొనర్చి కాలయవనుడు కాలగతిని పొందెను. అని శుకయోగి మఱియు నిట్లు నుడివెను.

ఇట్లు యవనుడు బూడిదయైనపిమ్మట హరి ముచుకుందుని యెదుట నిలచెను. కమలనయనుడు, తులసీమాలా విభూషితుడును, పూర్ణచంద్ర బింబమువంటి సుందర ముఖము కలవాడును, మకరకుండలముల కాంతితో ఉజ్జ్వల గండ స్థలములు కలవాడును, కౌస్తుభమణిచే విరాజిల్లునట్టి విపులమైన వక్షస్థలము కలవాడును, గొప్ప శరీరము కలవాడును, శ్రీవత్సమనెడు పుట్టుమచ్చకలవాడును, సింహమధ్యముడును, నాలుగు చేతులు కలవాడును, చిఱునగవునవ్వువాడును, బంగారువలె మెఱయుచున్న పట్టు పీతాంబరము ధరించినవాడును, సౌందర్య గాంభీర్యములతో శోభిల్లువాడును, ప్రసన్నుడునైన యా హరిని చూచి ముచుకుందుడు మహాశ్చర్యమునుపొంది, ఆ దివ్యమంగళ విగ్రహముని దివ్యకాంతి తనకనులకు మిఱుమిట్లు గొల్పగా ప్రీతితో హరి కిట్లనియె. మహాత్మా ! నీ వింద్రుడవా ! చంద్రుడవా ! అగ్నిదేవుడవా ! లేక చంద్రశేఖరుడవా ! బ్రహ్మవా లేక విష్ణుడవా ! నీ తేజస్సుతో దిక్కులన్నియు శోభిల్లుచున్నవి. దేవా ! నీ విచ్చటికేల వచ్చితివి. నీవే కాలిగా నిచట నేలయుంటివి. ఈ యడవి ముండ్లచే విషమస్థలములచే నిండియున్నది. ఘోరమృగములకుకూడ ప్రవేశింపవీలుకానిది నీ విచ్చటి కెందుకు వచ్చితివి. నీ పాదములు కమలదళములవలె సుకుమారములు. యరణ్యమున నడచుటచే నీ మెత్తని పాదముల కెంత నొప్పి పుట్టెనో ఓ మహాత్మా ! నేను నిన్ను సేవింపదలచితిని నీ వంశ గోత్రముల తెలుపుము. నేను ఇక్ష్వాకు వంశమున పుట్టితిని, మాంధాతృ చక్రవర్తి కుమారుడను. నన్ను ముచుకుందుడందురు. దేవతలకు మేలు చేయుటకై చిరకాలము నిద్రలేక బడలియున్నాను. నిద్రపోవుచు సర్వము మరచి యుండగా నొక మనుష్యుడు వచ్చి చెడుపని గావించి తన పాపముచేతనే బూడిదయై పోయెను. పిమ్మట శ్రీనాధునివలెనున్న నిన్ను జూచితిని. నీ తేజమును చూడ లేక దీనుడనైతిని. నన్ను కరుణాదృష్టితో చూడుము. అని ముచుకుందుడు విన్నవింపగా శ్రీహరి ముచుకుందునితో గంభీరభాషణముల నిట్లనెను. ఓ రాజా నా గుణముల, కర్మలను, నామములను లెక్కింప నెవరికి తరముకాదు. బ్రహ్మ నన్ను ప్రార్థింపగా భూభారమును తగ్గించుటకై భూమియందు వసుదేవునింట పుట్టితిని.

నన్ను వాసుదేవు డందురు. కంసుని పేరుతో నుండిన కాలనేమిని, తక్కిన దుష్టులను సంహరించితిని. ఇంకను సంహరించుచున్నాడను. నీ చూపుతో భస్మమైన వాడు కాలయవనుడు. నీవు పూర్వము నన్ను సేవించితివి. అందుచే నిన్నను గ్రహించుటకై నేను నీవుండు పర్వత గుహకు వచ్చితిని. నీ కిష్టములైన వరముల నడుగుము. నీ కిచ్చెదను. నా భక్తులైన వారికి శోకము లుండవు. అనగా విని ముచుకుందుడు శ్రీహరికి నమస్కరించి యతడు నారాయణుడని తెలిసికొని తన కంతకు ముందు గర్గుడు చెప్పినమాట గుర్తుకు తెచ్చుకొని శ్రీకృష్ణుని యిట్లు సంస్తుతించెను. సర్వేశ్వరా లోకులు నీ మాయచే మోహితులై ధన ధాన్యములందును, దారాపుత్రాదులయందును వ్యామోహము కలిగినవారై మన్మథునిచే మోసగింపబడి నిన్ను సేవింపరు.

ఉ॥ పూనియనేక జన్మములఁ బొంది తుదిం దనపుణ్యకర్మ సం
తానము పేర్మిఁ గర్మవసుధాస్థలిఁ బుట్టి ప్రపూర్ణదేహుఁడై
మానవుఁడై గృహేచ్ఛఁబడు మందుఁ డజంబు తృణాభిలాషియై
కానక పోయి నూతఁబడు కైవడి నీ పదభక్తిహీనుఁడై.

ఎన్నిజన్మము లెత్తిన పిమ్మటనో పుణ్యకర్మలచేసి కర్మభూమియందు మానవుడై పుట్టియు, తన యిండ్లు వాకిండ్లు భార్య, పుత్రులు మున్నగు వారిపై వ్యామోహము చెందుచు, మూర్ఖుడై నరకమున పడిపోవును. మేక గడ్డిపై ఆశ పెంచుకొని నూతిలో పడిపోవును కదా! ఓ మహాత్మా! భార్యాపుత్రులపైనను, ధనములపైనను ఆశపెట్టుకొని, రాజ్యమదముచే నాజీవిత కాలమంతయు, వ్యర్థముచేసి కొంటిని. మూఢుడైన వాడు మనస్సును స్వాధీనము చేసికొని, భోగములపై వైరాగ్యము పూని, ఇంద్రియోన్మాదమును గెల్చి, తపము చేసియు, ఇంద్రపదవి కావలె ననియే కోరును కాని, అమృత పదవి యగు మోక్షమును కోరడు. సంసారియైన వానికి నీ దయ లభించినంతనే బంధము లన్నియు తెగిపోవును. బంధవిముక్తి కలిగినచో సజ్జన సాంగత్యము కలుగును. సజ్జన సాంగత్యముచే, నీపై భక్తికలుగును. నీయందు భక్తికలిగినంతనే మోక్షము సిద్ధించును. నాకు నీదయచే సత్సాంగత్యము లభించుటకు ముందే రాజ్యబంధము తొలగినది. కృష్ణా! నీ సేవతప్ప నాకింకేమియు వలదు. ముక్తినొసగెడి నిన్ను సేవించినవాడు మోక్షమును కోరక మరల ఆత్మబంధములను కోరునా? కావున ఈశ్వరుడు విజ్ఞానఘనుడు నిర్గుణుడు నిరంజనుడునైన పరమ పురుషుడవైన

నిన్నాశ్రయించెదను. విపన్నుడనైన నా కభయమిచ్చి నన్ను రక్షింపుము. అనగా విని శ్రీహరి ముచుకుందునితో నిట్లనెను. రాజేంద్రా! నీబుద్ధి మంచిది. నీవు కోరికలకు లోఁగలేదు. నన్ను సేవించు వారికివలె నీకు నాపై నిశ్చలభక్తిని ప్రసాదింతును. రాజ్యపాలనము మానకుము నీవు ఈ జన్మమున క్షత్రియుడవై వేటాడి యాడి జంతువుల సంహరించి తపస్సుచేసి యాకర్మమునుండి విముక్తుడ వైతివి. రాబోవు జన్మలో బ్రాహ్మణుడవై సర్వప్రాణులయందును. సఖ్యముతో మెలగి నన్ను చేరుదువు. అని చెప్పి హరి గుహనుండి వెడలిపోయెను. ముచుకుందుడు ఉత్తరపు దిక్కునకు నడిచి, సంశయములను, విడిచి విష్ణుని యందు చిత్తముచేర్చి నరనారాయణ నివాసంబైన బదరికా శ్రమముచేరి శాంతుడై శ్రీహరి నారాధించుచుండెను. శ్రీకృష్ణుడు మధురకు వచ్చి చక్రాకారముతో మధురను చుట్టుముట్టియుండిన మ్లేచ్ఛ సైన్యములనెల్ల శౌర్యముతో చీల్చి చెండాడి తుద ముట్టించెను.

జరాసంధుడు ప్రస్రవణ గిరిని దహించుట.

శ్రీకృష్ణుడు కాలయవనుని మ్లేచ్ఛ సైనికులను సంహరించి, మధురానగరమున గల ధనమును, ద్వారకకు పంపుచుండగా, ఆ ధనమును మనుష్యులు తీసికొని పోవుచుండగా ఇరువది మూడ క్షౌహిణుల బలముతో దండెత్తి వచ్చిన జరాసంధుని చూచి, రామకృష్ణులా ధనమును జరాసంధుని ముందు పెట్టించి తాము యుద్ధాసన్నాహము మాని యతనితో పోరుటకు భయపడిన వారివలె నడవులకు పాఱిపోవుచుండిరి. జరాసంధుడు వారి ప్రభావము నెఱుగక వారిని జూచి పరిహసించుచు ఓ యదువీరులారా పాఱిపోకుడు. మీరు పాఱిపోయి నంత మాత్రమున, నేను మిమ్ము విడువను మీరు సముద్రములో దాచినను, పాతాళమున కేగినను, పైకెగిరినను మిమ్ము వెంబడించి మిమ్ము సంహరింతునని తన సైన్యముతోపాటు తాను వారిని వెంబడించెను. రామకృష్ణులు పఱుగెత్తుచు బహుయోజనముల దూరముపోయి యలసిపోయి, తాము దాగుకొనుటకను కూలమైనదని తలచి ప్రవర్షణ పర్వతము నెక్కిరి. ఇంద్రుడచ్చట నెక్కువగ వర్షించుటచేత దానికి ప్రవర్షణమను పేరుకలిగినది. ఆ పర్వతము పదునొకండు యోజనముల పొడవు పదునొకండు యోజనముల వెడల్పుగలదియై యుండెను. జరాసంధుడు రామకృష్ణులు ప్రస్రవణ గిరిపై నెక్కుటను జూచి, వారిని నశింప జేయదలచి యాపర్వత గుహలలోను సానువులయందును శిఖములందును కట్టెలను

రాసులు రాసులుగా పెట్టించి నిప్పంటించుమని సైనికులకా జ్ఞాపించెను. వారు తమ రేలిక యనుమతిని కట్టెలను పెట్టి యాపర్వతమునకు నిప్పంటించగా అగ్నిజ్వాలలు పదునొకండు యోజనముల పర్యంతము ప్రజ్వరిల్లెను. రామకృష్ణులు సైనికులకు కనబడకుండ పర్వతమును దాటిపోయి సుఖముగా ద్వారకా నగరమును చేరుకొనిరి. జరాసంధుడు రామకృష్ణులా మంటలలో దగ్ధులైరని సంతసించి తన సైన్యముతో తాను మధురకు తిరిగి పోయెను.

రుక్మిణీ కల్యాణము.

రైవతుడను రాజు బ్రహ్మయానతిచే రైవతియనెడి తన కన్యను బలరామున కిచ్చి వివాహము చేసెను. పిమ్మట కృష్ణుడు గరుడుడింద్రుని గెల్చి యమృతమును గైకొని పోయినట్లు శిశుపాలుని పక్షమున వచ్చిన సాళ్వాదులనెల్ల జయించి భీష్మకుని పుత్రికయు లక్ష్మీదేవి యంశమున బుట్టినదియు, బాలామణి యగు రుక్మిణిని వివాహమాడెను. అని శుకయోగి తెల్పగా పరీక్షిత్తు స్వయంవరమునకు వచ్చిన హరి రాక్షస వివాహమున రుక్మిణిని గైకొని పోయెనంటివి. కృష్ణుడొక్కడే సాళ్వాదులైన రాజులనెట్లు జయించెను. ఆ రుక్మిణినెట్లు గొని పోయెను నాకు వివరింపుము. ఏలనందువా.

శా॥ కల్యాణాత్మకమైన విష్ణుకథ లాకర్ణించుచున్ ముక్తులై
కల్యంబెవ్వఁడు తృప్తుఁడౌనవి వినంగా శ్రోత్రలోలుండు సా
కల్యంబేర్పడ భూమరోత్తమ యోయుంగఁ జక్క నే రుక్మిణీ
కల్యాణంబు వినంగ నాకు మదిలోఁ గౌతూహలం బయ్యెడిన్.

క. భూషణములు చెవులకు బుధ తోషణము లనేకజన్మ దురితౌఘవిని
ర్మోషణములు మంగళతర ఘోషణములు గరుడగమను గుణభాషణముల్

అనగా విని శ్రీశుకుడిట్లు చెప్పెను. రాజా! వినుము. పూర్వము విదర్భదేశమున భీష్మకుడను రాజు కుండిన నగరమును రాజధానిగ చేసికొని పాలించుచుండెను, ఆతడు మంచివాడు. ఆ భీష్మకునకు ఐదుగురు కుమారులుండిరి. వారిలో రుక్మి శ్రేష్ఠుడు. ఆ రుక్మికి కడగొట్టు చెల్లెలు రుక్మిణి, చంద్రరేఖతో తూర్పుదెస వెలిగినట్లు, ఎదుగుచున్న రుక్మిణిచే నా రాజభవనము మిక్కిలి ప్రకాశించెను. ఆ బాలిక దినదిన ప్రవర్ధమానయై తనయీడు బాలికలతో నామె బొమ్మల పెండ్లి సేయుచు

బాలికలతో వియ్యమందును. గుజ్జెన గూళ్ళు వండించి చెలులకు పెట్టించును. ఉద్యానవనమున, పూవుతీగలను పోషించును. మణిభవనము మేడలలో బంగరు టుయ్యాలలపై నూగును. బాలికలతో బంతులాడును. చిలుకలకు గోరువంకలకు చదువు చెప్పును. నెమళ్ళకు సంతసమును గల్గించును. హంసలకు నడకల నేర్పించును కృష్ణుడు యువకుడగు కొలది రుక్మిణి యువతిగా తోచెను. రుక్మి, రుక్మరథ రుక్మబాహు రుక్మకేశ రుక్మనేత్రులనెడి వారికి చెల్లెలై రుక్మిణి, తన తండ్రియింటికివచ్చు అతిథి జనులవలన కృష్ణుని రూపగుణాదులను విని కృష్ణుడు తనకు తగిన వరుడని తలచెను. కృష్ణుడును ఆ రుక్మిణి సౌందర్యము గుణశీలములను విని ఆమెను తనభార్యగా చేసికొందునని తలంచెను. భీష్మకుని బంధువులెల్లరు రుక్మిణిని శ్రీకృష్ణున కివ్వవలెనని తలచుచుండిరి. కాని రుక్మిణి పెద్దన్నయగు రుక్మి, కృష్ణుని ద్వేషించుచు తన చెల్లెలిని శిశుపాలున కిత్తునని భావించుచుండెను. తన యన్నయగు రుక్మి యభిప్రాయమును తెలిసికొని, రుక్మిణి తనలో చాల చింతించి, యొక బ్రాహ్మణుని పిలిచి గర్విష్ఠుడైన రుక్మినేడు నన్ను శిశుపాలున కిచ్చెదనను చున్నాడు. ఓ బ్రాహ్మణోత్తమా నీవు కృష్ణున కీ విషయమును తెల్పుము. మా తండ్రియు, తనకొడుకు పట్టినపట్టును మాన్పింపలేడు. మా యన్నపట్టు నెగ్గకుండుటకై నీవీ విషయమును కృష్ణునకు తెల్పుము అనికొన్ని రహస్యములు చెప్పగా విని బ్రాహ్మణుడు ద్వారకకువెళ్ళి, ప్రతీహారులవలన తన రాకను తెల్పి, కృష్ణుడు వసించునగరు ప్రవేశించి, యందు స్వర్ణాసనముపై నుపవిష్టుడైయుండిన పురుషోత్తముని జూచి పెండ్లికొడుకవు కమ్మని దీవించెను. అంతకృష్ణుడు ముసిముసి నవ్వులు నవ్వుచు తన కనకాసనము దిగి బ్రాహ్మణుని తన స్వర్ణాసనముపై కూర్చుండజేసి యతనిని పూజించి, షడ్రసోపేతమైన భోజనము పెట్టించి యినుమడియైన ప్రేమతో, వినయముతో నతని యడుగులను పట్టుకొని మెల్లగా నిట్లనెను. ఓ భూసురోత్తమా ! సంతోష చిత్తుడవైన నీ ధర్మము మిక్కిలి సులభము. పెద్దలకు సమ్మతము. లభించిన దానితో తృప్తిపడి ధర్మము నాచరించుట బ్రాహ్మణునకు తగును. ప్రాప్తించిన దానితో సంతుష్టుడైన వానికి కోరికలు ఫలించును. సంతోషికానిచో నింద్రుడైనను నశించును.

> ''సర్వభూతములందును మైత్రిని పాటించువారును లభించిన దానితో సంతృప్తి చెందు మనస్సుకలవారును శాంతులును, సుజనులును గర్వములేనివారగు బ్రాహ్మణులకు నేను నమస్కరింతును''.

అయ్యా! నీవెవ్వని దేశమున నుందువు. మీకు కుశలము గల్గించు రాజెవ్వరు? ఎవని రాజ్యమందు ప్రజలెల్లరు సుఖింతురు. అట్టి మీ రాజు నాకు ప్రియుడు. సముద్రమధ్యముననుండు మాపురికెట్లు వచ్చితివి. నీ కోరికయేమో తెల్పుము నెరవేర్తును అని కృష్ణుడడుగగా ఆ బ్రాహ్మణుడు వినయముతో హరికిట్లు చెప్పెను. దేవా! విదర్భదేశమునకు భీష్మకుడను రాజుకలడు. ఆ రాజునకు రుక్మిణియను కన్యారత్నము కలదు. ఆ చంద్రవదన నీ సేవచేయందలచి, వివాహ మంగళ ప్రశస్తంబైన తన సందేశమును వినిపించుమని నన్నిచ్చటికి పంపెను.

సీ॥ ఏ నీగుణములు కర్ణేంద్రియంబులు సోక దేహతాపంబులు దీఱిపోవు
నే నీశుభాకార మీక్షింప గన్నుల కఖిలార్థలాభంబు కలుగుచుండు
నే నీచరణ సేవలే ప్రొద్దుఁ జేసిన భువనోన్నతత్వంబుఁ బొందఁ గలుగు
నే నీలసన్నామమే ప్రొద్దుభక్తితోఁ దడవిన బంధసంతతులు వాయు
తే॥ నట్టి నీయందు నాచిత్త మనవరతము నచ్చియున్నది నీనాన నానలేదు
కరుణఁ జూడుము కంసారిఖలవిదారి శ్రీయుతాకార! మానినీ చిత్తచోర!

ఓ రాజసింహా! గుణము, విద్య, యౌవనము సౌజన్యము, సంపద బలము, దానము, శౌర్యము దయ మున్నగు గుణములచే లోకుల మనస్సును రంజింప చేయుచు ధన్యుడవైన నిన్నుకోరని కన్యలుందురా? అనంత కల్యాణ గుణ రత్నరత్నాకరుడవగుటచేతనే కదా లక్ష్మీదేవి నిన్నువరించినది. మోహాముఖ నాకొక్క దానికే యుండదు. ఓ లక్ష్మీవల్లభా! పురుషసింహా! సింహమునకు చెందవలసిన దానిని నక్క తాను కోరుకొనునట్లు, మత్తుడైన శిశుపాలుడు, నీ పాదపద్మములనే తలంచు చున్ననన్ను శీఘ్రముగా నపహరించవలెనని తలంచు చున్నాడు. అధమాధముడైన చైద్యునకు నీ ప్రభావమేమి తెలియును. గడచిన జన్మలలో నేను జగత్కల్యాణుడైన హరిని కోరి వ్రతములు, చేసియున్నచో దేవతను గురువులను, బ్రాహ్మణులను సేవించియుంటినేని, దాన ధర్మాదులను గావించియున్నచో వసుదేవ పుత్రుడు నాభర్తయగు గాక యుద్ధములో శిశుపాలుడు మున్నగు నీచులు పరాజితులగుదురు గాక. ఓ పురుషోత్తమా నేనర్ధు చెప్పుటలేదు. నీవు చతురంగములతో వచ్చి శిశుపాల జరాసంధాదులను రేపు జయించి నీశౌర్యమే శుల్కముగచేసి రాక్షస వివాహాము ననన్నుగొంపొమ్ము. నేను నీతోవచ్చెదను. అంతఃపురమునయున్న నన్నుగొంపోవలెననినచో కావలి వారిని, బంధువులను చంపవలసి వచ్చును కదా! అంతదారుణ కృత్యముచేయ తగునా!

యని నీవు తలంచినచో నీకొక యపాయములేని యుపాయము చెప్పెదను. పెండ్లికి ముందు పెండ్లి కూతురును నగరము వెలుపలనున్న గౌరీదేవిని పూజించుటకు పంపుదురు. నీవు ఆ సమయమున వచ్చి నన్నుగొనిపొమ్ము. ప్రాణేశ్వరా! ఘనులైనవారు శివునివలె తామసవృత్తిని తొలగించుకొనుటకై ఎవని పాద ధ్యానమందు మునుగుదురో అట్టి నీవు నాపై దయచూపవేని యిక నూఱు జన్మములందైనను నిన్నే ధ్యానించుచు నా ప్రాణముల విడుదును. ఇది నిజము. ఓ దేవా! నీ మధురవచనముల విననివీనులు, నీభోగశూన్యమైన శరీరము, భువన మోహనుడవైన నిన్నుచూడని కన్నులు నీయధరామృతమును త్రాగని జిహ్వ నీకంఠమాల నాఘ్రాణింపని నాసిక నీదాస్యము చేయని జన్మయు వ్యర్థములు. అని కృష్ణునకు రుక్మిణీ సందేశమును వినిపించి, యామె సౌందర్యాది విశేషముల ప్రస్తుతించి మఱియు నిట్లనెను. శౌరీ! ఆ కన్య నీకు తగినది. నీవామెకు తగిన వరుడవు మీ యిరువురకు తప్పక పెండ్లియగును. నీవు నీవారితో వచ్చి రుక్మిణిని తెమ్ము శత్రువుల ఖండింపుము. నీకు శుభమగును. అనగా విని కృష్ణుడు ఆ బ్రాహ్మణునితో నిట్లనెను.

క॥ వచ్చెద విదర్భ భూమికి జొచ్చెద భీష్మకుని పురము సురుచిర లీలం
దెచ్చెద బాలన్ వ్రేల్మిడి వ్రచ్చెద నడ్డంబు రిపులు వచ్చిన నోరన్.

అని వివాహ నక్షత్రము దెలిసికొని, దారుకుడు సారథియై శైబ్య, సుగ్రీవ, మేఘపుష్ప వలాహకములను గుఱ్ఱములను కట్టి రథము సిద్ధముచేసెను. కృష్ణుడు బ్రాహ్మణుడును రథము నెక్కిరి. ఒకరాత్రి ప్రయాణముచేసి విదర్భచేరిరి. భీష్మకుడు రుక్మిమాట కాదనలేక శిశుపాలునకు కన్యనీ దలచి రాజధాని నంతటిని అలంకరింపజేసెను. పితృదేవతలను అర్చించెను, బ్రాహ్మణులకు వివిధ దానముల నిచ్చెను. రుక్మిణీదేవికి మంగళ స్నానము చేయించి, మేలిపట్టు వస్త్రముల కట్టించి, రత్నభూషణముల పెట్టించెను. ఆమెకు భూసురాశీర్వాదంబుల నిప్పించెను. పురోహితుడు గ్రహశాంతి కొఱకు హోమము చేసెను. అంతట శిశుపాలుడు చతురంగబలముతో బంధుమిత్రులతో కలిసి మహాసంరంభముతో రుక్మిణిని చేపట్టుదునను గర్వముతో కుండినకేతెంచెను. రామకృష్ణులు తమ బంధుమిత్రులతో వచ్చినచో వారిని పారద్రోలి శిశుపాలునకు రుక్మిణి నిప్పించెదనని తలంచి చతురంగబలములతో జరాసంధుడు దంతవక్త్ర, సాళ్వ, విదూరథ పౌండ్రకాదులను వెంటబెట్టుకొని భీష్మక రాజధాని చేరుకొనెను. వివిధ దేశముల

రాజులు వివాహము చూడవచ్చిరి. భీష్మకుడు శిశుపాలున కెదురేగి యతనిని గౌరవించి, యొక భవనమున విడిది చేయించెను. ద్వారకలో బలభద్రుడు ఇట్లు తలంచెను. కృష్ణుడొక్కడే విదర్భకేగెను. శిశుపాలునకు సహాయకులుగ జరా సాళ్వ పౌండ్రకాదులువత్తురు. అచట యుద్ధము జరుగును. అని పెద్ద సైన్యమును తీసికొని కృష్ణుని వెంట తాను భీష్మకరాజధానికి వచ్చెను. రుక్మిణి శిశుపాలాదులు వచ్చుటయు, కృష్ణుడు రాకుండుటయు తెలిసి యేకాంతమున నిట్లు చింతించెను, రేపే వివాహము. గోవిందు డేలనో రాలేదు. నేను పంపిన అగ్నిద్యోతను డేందుల కాలసించెనో! నాయత్నము ఫలించునో నా యత్నము ఫలించదో విధి యెట్లున్నదో! ఆ బ్రాహ్మణుడచ్చటికి పోయెనో లేక దారిలోనే అలసి విశ్రాంతి గైకొనెనో నా సందేశమును విని కృష్ణుడు నన్ను తప్పుపట్టెనో లేక వచ్చెనో ఏమో పార్వతీ పరమేశ్వరులు నన్నుదయతో చూచెదరో లేదో నాభాగ్య మెట్లున్నదో బహుశా బ్రాహ్మణుడు పోయి యుండడు కృష్ణుడురాడు. హరిని పిలుచుకొని రాగల యాప్తుడు నాకెవ్వడున్నాడు. రుక్మికి దయలేదు. ఉమామహేశ్వరులకు నాపై కరుణలేదు. ఇట్లు చింతించుచు రుక్మిణి యలంకరించుకొనుట యందాసక్తి చూపక, వ్యాకుల పడుచు, హరి కెదురు చూచుచుండెను. అంత నగ్నిద్యోతనుడు కనబడగా నతని ముఖలక్షణములు చూచి పోయినపని నెరవేరిన దనుచు నతని కెదురుగ నిలబడెను. ఆ బ్రాహ్మణుడామెతో.

ఉ॥ మెచ్చెభవద్గుణోన్నతి కమేయ ధనావళులిచ్చె నాకు దా
వచ్చె సుదర్శ నాయుధుఁడు వాఁడె సురాసురులెల్ల నడ్డమై
వచ్చిననైన రాక్షస వివాహమునం గొనిపోవు నిన్ను నీ
సచ్చరితంబు భాగ్యమును సర్వము నేఁడు ఫలించెఁ గన్యకా

అనిన రుక్మిణి బ్రాహ్మణునితో భూసురవంశమణీ బంధుచింతామణీ! నాసందేశము వినిపించి కమలాక్షుని తోడ్కొని వచ్చితివి. నేను బ్రతికితిని. నీవంటి పుణ్యాత్ములుందురా? నేను నీకు చేయగల ప్రత్యుపకారము ఈ నమస్కారమే. అని నమస్కరించెను. రామకృష్ణులు తన కూతురి వివాహమునకు వచ్చిరని తెలిసి, భీష్మకుడు మంగళవాద్యములతో వారికెదురేగి, విధి విహితముగ వారిని పూజించి, వారికికానికలిచ్చి వారికి తగిన భవనములందు విడిది కల్పించెను. ఇట్లు భీష్మకుడు రాజులనెల్ల సత్కరించెను. అంత విదర్భపురములోని ప్రజలు, కృష్ణుని రాక విని

వచ్చి యతనిని జూచి యీతడు మన రుక్మిణి కన్నివిధముల తగిన వరుడు. రుక్మిణి యీతనికి తగిన భార్య. మన పుణ్యములచే నితడు రుక్మిణికి మగడౌను గాక అని పలికిరి. అంత రుక్మిణీదేవి శస్త్రాస్త్రధారులై వీరభటులు కొలువగా ఉపహారములు కానికలు తీసికొని వారవనితలు వెంటరాగా వస్త్రపుష్ప భూష ణాదులగైకొని పాటలు పాడుచు బ్రాహ్మణ స్త్రీలు రాగా వివిధ మంగళ వాద్యములు మ్రోగుచుండగా, చెలులు బంధువు భార్యలుతోడు రాగా రుక్మిణి పార్వతీదేవి మందిరమునకు వచ్చి యాదేవిని పరమేశ్వర సమేతముగా భక్తితో పూజించి మ్రొక్కి యిట్లు ప్రార్థించినది.

ఉ॥ నమ్మితి నామనంబున సనాతనులైన యుమామహేశులన్
మిమ్ముఁ బురాణ దంపతుల మేలు భజింతు గదమ్మ మేటి పె
ద్దమ్మ దయాంబురాశివి గదమ్మ హరిం బతిఁ జేయుమమ్మ నిన్
నమ్మిన వారికెన్నడును నాశములేదు గదమ్మ యీశ్వరీ! అని ప్రార్థించి

మ్రొక్కి బ్రాహ్మణ దంపతులకు లవణాపూపములను తాంబూలములను కంఠ సూత్రములను. చెఱకు గడలనిచ్చి వారిం బూజించెను. వారు రుక్మిణిని దీవించి యామె శిరస్సున సేసలిడిరి. అంత రుక్మిణి పార్వతికి మ్రొక్కి గౌరీనిలయము నుండి వెలువడి, హంసవలె మెల్లన నడుగులిడుచు ఒక చెలిచేతి నూతగా గొని, మెఱుగు పెట్టిన మన్మథ బాణములవంటి మెఱుగు చూపులతో రాజవీరుల హృదయంబుల భేదించుచు కాలియందెల చప్పుడు చెవుల పండువుసేయ హరి రాక కెదురు చూచుచు వీరమోహినియై చనుదెంచెను. తుమ్మెదలవంటి ముంగురులు కలదియు, పూర్ణచంద్రునివంటి ముఖము కలదియు, లేడికన్నుల వంటి కన్నులు కలదియు, పగడమువంటి పెదవులు కలదియు, అవ్యక్తమధుర మైన కోయిలవంటి స్వరము గలదియు, చిగురుటాకులవంటి పాదద్వంద్వము కలదియు, మదపుటేనుగు కుంభస్థలమువంటి చనులు కలదియు, ఇసుక తిన్నెల వంటి పిఱుదులు కలదియు, ఏనుగువలె నడచునదియు, పద్మములవంటి చేతులు కలదియు, కలువల వాసనవంటి వాసన గలదియు, సింహమునడుమువంటి నడుము కలదియునైన రుక్మిణిని చూచి రాజులెల్ల నాశ్చర్యపడిరి. ఆ రుక్మిణి చిఱు నగవు, సిగ్గుగల చూపులను చూచి పరవశులై ధైర్యము గోల్పోయి, గాంభీర్యములు విడిచి తమ తమ గజతురగాది వాహనముల నెక్కుటమాని నేలకొరిగిరి. ఆ రుక్మిణి తన యెడమచేతి గోళ్ళచే ముంగురుల తొలగి

క్రోయుచు, పైటచెరగు సవరించుకొనుచు క్రీగంట క్రమముగ రాజుల చూచుచు.

మ. కనియెన్ రుక్మిణి చంద్రమండలముఖున్ గంఠీర వేంద్రావల
గ్నునవాంభోజదళాక్షుఁ జారుతర వక్షున్ మేఘ సంకాశదే
హు నగారాతి గజేంద్ర హస్తనిభ బాహుం జక్రిఁ బీతాంబరున్
ఘన భూషాన్వితుఁ గంబుకంఠు విజయోత్కంఠున్ జగన్మోహనున్.

చూచి యతని, రూపవయో లావణ్య, వైభవ గాంభీర్య చాతుర్య తేజో విశేషములకు సంతసించి, మన్మథార్తయై తన రథము నెక్కదలచుచున్న రుక్మిణిని చూచి, ప్రతిపక్ష రాజవర్గము చూచుచుండగా మదపుటేనుగువలె వచ్చి నక్కల నడుమనున్న వస్తువును సింహమువలె సమస్తరాజులను లెక్కింపక గడ్డిపోచగ భావించి, రాజకన్యయైన రుక్మిణిని దెచ్చి తన రథముపై కూర్చుండబెట్టుకొని భూమ్యాకాశ మధ్యభాగములు నిండునట్లు శంఖముచు పూరించుచు బలరాముడు వెంటరాగా యాదవ సైన్యముతో ద్వారక మార్గమున పోయెను. అంత జరాసంధుడు మున్నగు రాజులెల్ల శ్రీకృష్ణుని పరాక్రమము విని యోర్వక ఓ రాజులారా! గొప్ప సింహముల కీర్తిని నీచమృగములు గైకొన్నట్లు గోపకులు మన కీర్తులను మాపి బాలికను దోడ్కొని యున్మాదముతో పోవుచున్నారు. మన మా బాలికను గోపకులనుండి విడిపింపనిచో మన శౌర్యమెన్నటికి పనికి వచ్చును. మీ శస్త్రాస్త్రములు కాల్పవా? మనము బాలికను విడిపించనిచో ప్రజలు నవ్వరా? అని యొకరి నొకరు కూడ బలుకుకొని రోషములపూని కవచములధరించి, ధనుర్బాణాదుల చేపట్టి పంతముతో చతురంగబలములతో యాదవుల వెంటబడి నిలుడు నిలుడని ధిక్కరించి కొండలపై మేఘము జలముల వర్షించునట్లు యాదవులపై బాణములను వర్షింపగా యాదవసేనలోని సేనాపతులు విండ్లనెక్కుపెట్టి నారుల మొరయించిరి. శత్రుసైన్యములు యాదవ సైన్యములను చుట్టుముట్టుట చూచి రుక్మిణి భయముతో సిగ్గుతో హరి ముఖము చూచెను. అప్పుడు కృష్ణుడామెతో యాదవవీరులు శత్రుసైన్యములో ప్రవేశించి చీల్చి చెండాడెదరు. శత్రుసేనలు నుగ్గైపోవును. శత్రుసైనికులు దెబ్బలుతిని పారిపోయెదరు. నిలిచిరో చచ్చిపోదురు. అని యామె నూఱడించెను. పిమ్మట బలరాముడు మున్నగు యదువీరులు ప్రళయకాలమునందు మేఘములు పిడుగులను వర్షించు జరాసంధాది క్షత్రవీరుల సైన్యములపై వాడియైన

బాణములను, భల్లెములను ప్రయోగించిరి. యదువీరుల అస్త్రశస్త్రములచే శత్రుసైన్యములందలి ఏనుగులు చీల్చబడినవి. గుఱ్ఱములు తెగిపడినవి. రథములు విరిగినవి. సైనికుల కంఠము తెగిపడినవి. వారికాళ్ళు తెగినవి చేతులు విరిగినవి. మోకాళ్ళు చెక్కలైనవి. కిరీటములు హారములు నేలపై రాలినవి. గదలు కుంతములు తోమరములు పరశు పట్టిసములు, ప్రాసలు కరవాలములు శూలములు ముక్కలు ముక్కలై పడినవి. వారి పతాకములు పడిపోయినవి చామరములు నుగ్గైనవి. కవచములు బ్రద్దలైనవి. గాయపడి నేలకొరిగిన సైనికుల దేహములనుండి కారురక్తము ఏఱులై పారినది. వారి మాంసమును కాకులు గ్రద్దలు, డేగలు భూతబేతాళాదులు మ్రింగజొచ్చిరి. తెగినతలలు విరిగిన మెడలు, పేగులొలికి క్రొవ్వు లేగిన పీనుగుల వాసనతో రణరంగము పీనుగుపెంటగా మారినది. అప్పుడు జరాసంధాదులు పాఱిపోవుచు నొకచోట కూడికొని, వగచుచు భార్యను పోగొట్టుకొనిన వానివలె నిట్టూర్పుచు ఎండిన నాలుకతో శుష్కించిన ముఖముతోనున్న శిశుపాలుని చూచి శత్రువుల చేతిలో చిక్కకుండా ప్రాణాలతో బయటపడితివి కదా యని దేహమున ప్రాణములుండిన బ్రతుకవచ్చును. బ్రతికియున్నచో భార్యవచ్చును. నీవు బ్రతికితివి. అదియే చాలును భార్యను గోల్పోతినని చింతింపకుము. ఎవ్వడును స్వతంత్రుడుకాడు. ఈశ్వరునకు లోబడియుండును. నేను పదునేడు మాఱులు మధురపై దండెత్తి, బలరామునికి పట్టుబడి కృష్ణునిచే రక్షింపబడితిని. పదునెనిమిదవమాఱు శత్రువుల పాఱదోలి విజయము సాధించితిని జయము లభించినపుడుబ్బిపోలేదు. అపజయము తటస్థించినపుడు శోకింపలేదు. లోకములు దైవయుక్తమైన కాలమునుబట్టి తిరుగుచుండును. కాలము తమ కనుకూలమైనందున కృష్ణుని సహాయమున యాదవులు త్రిలోక విఖ్యాతులమైన మనలగెల్చిరి. మన కనుకూలమైన కాలము కలిసివచ్చినప్పుడు మనము శత్రువులను గెల్తుము. అని జరాసంధుడు మొదలగువారు శిశుపాలుని పరితాపమును పోగొట్టి తమ తమ దేశములకేగిరి. శిశుపాలుడును చరవర్గముతో తన పట్టణమునకేగెను. అంత రుక్మి తన చెల్లెలిని కృష్ణుడు రాక్షస వివాహమున గొనిపోవుటను సహింపలేక అనేకా క్షౌహిణులతో యాదవ సైన్యము వెంటబడి గోపాలక, వెన్నదొంగ నిలునిలుమని హరిపై మూడు బాణములవేసి నీవు మా సరివాడవా మ [illegible]ను గొంపోవుటకు, నీ వంశమేది ఎక్కడ పుట్టి పెరిగితివి నీ ప్రవర్తన యెట్టిది నీకు మానమర్యాదలులేవు. మాయలమారివి. మా అమ్మాయిని విడువుములేనిచో

వాడిబాణములతో, నీమానము దీతునని పలికెను. కృష్ణుడు నవ్వుచు నొక బాణముచే రుక్మి విల్లువిఱిచెను. ఆఱు బాణముల నతని శరీరమున గ్రుచ్చెను. ఎనిమిది బాణములతో నతని రథముల గూల్చెను. రెండు బాణములతో రుక్మి సారథిని చంపెను. మూడు వాడి బాణములతో టెక్కెమును విఱిచెను. అతడింకొక విల్లందుకొనగా దానిని కూడ హరి ఖండించెను. రుక్మి మఱియొక చాపమును ధరింపగా దానిని విఱిచి, వాని పరిఘ, పట్టిస, శూల, శక్తితోమర ముల నన్నిటిని తునియలు చేసెను.

రుక్మి ఏయే యాయుధముల ధరించిన హరి వాని నన్నిటిని ముక్కలు చేసెను. వాడంతటితో నొక రథము దిగి, ఖడ్గమును చేపట్టి, కార్చిచ్చుపై మిడుత దూకి నట్లు హరిపైకి వచ్చెను. హరి వాని ఖడ్గమును ముక్కలుచేసి కవచమును చీల్చి తన ఖడ్గముతో వానితల తెగవేయబోగా రుక్మిణి యడ్డము వచ్చి కృష్ణుని పాదపద్మముల పట్టుకొని దయానిధీ! నీవు దేవదేవుడవని తెలియక మాయన్న గొప్ప తప్పుచేసెను. సర్వలోక శరణ్యా! వీనిని మన్నించి కాపాడుము. వీనిని చంపినచో, మాకు గోవిందుడల్లు డయ్యెనని తమ భాగ్యమునకు పంతసించు మాతల్లిదండ్రులకు పుత్రశోకము కలుగును. అని రుక్మిణి గద్గదకంఠముతో కంపించు చున్నదియై కన్నీరు గార్చుచు మ్రొక్కగా కృష్ణుడు రుక్మిని చంపుట మానెను. పిమ్మట కృష్ణుడు బావా! రమ్మని చిఱునగవు నవ్వుచు రుక్మినిపట్టి, కట్టి వాని గడ్డము మీసము, తలగొఱిగి విరూపుని జేసెను. శత్రుసైన్యముల పాఱదోలి యదువీరులతో బలరాముడు కృష్ణుని సన్నిధికి వచ్చి బంధితుడై ప్రాణావశిష్టుడైన రుక్మిని జూచి దయతో వాని బంధముల విప్పి, కృష్ణునితో మహాత్మా! భీష్మపుత్రుని తలమూతి గొఱుగుట తగదు. తలనుమూతిని గొఱుగుట, తలనుఖండించుటకంటె కఠింపవాని వేదనను కల్గించును. నీవు సర్వుల యందును సమానముగ వర్తింతువు ఇతనికి కీడు కలిగించుటయేల? అనెను.

బలరాముడు రుక్మిణిని ఓదార్చుట.

బలరాముడు రుక్మిణి వైపుచూచి అమ్మా నీ సోదరునకు మానభంగము చేసెనని మాకృష్ణుని దూలనాడకుము, ప్రాణులకు తమ తమ పూర్వజన్మ కర్మల ననుసరించి సుఖదుఃఖములు ప్రాప్తించును. పూర్వకర్మయే శిక్షించును, లేక రక్షించును. చంపదగినంత తప్పుచేసినను బంధువులను చంపక విడిచి పెట్టవలెను. చంపినచో పాపము వచ్చును. ముందే చచ్చిన వానిని చంపుటెందులకు. రాజ్య

శాంతగల రాజు, క్రూరుడై తోడబుట్టువునైనను చంపుచుండును. ఇది రాజులకు బ్రహ్మ కల్పించిన ధర్మము.

> "మానధనులై సజాతి భూమికై ధనధాన్యములకై స్త్రీలకై గౌరవ ప్రతిష్ఠలకై సంపద్గర్వముచే వీరులను హింసింతురు."

దేవుడు కల్పించిన మాయచే దేహాభిమానము కలుగును. దేహాభిమానికి వీడు మిత్రుడు, వీడు శత్రువు, వీడు తటస్థుడను అజ్ఞానము సహజమైయుండును. జలాదులయందు సూర్యచంద్రులు పెక్కండ్రై కన్పించునట్లు, దేహధారికి ఆత్మ యొక్కడేయైనను పెక్కండ్రుగా తోచును. ఈ దేహము అవిద్యచే కల్పితమై దేహిని సంసారమున త్రిప్పుచుండును. ఆత్మ తటస్థుడుగానే యుండును. వృద్ధి క్షయములు చంద్రకళలకున్నవేగాని చంద్రునకు లేవు. అట్లే జన్మ మరణములు దేహమునకేగాని ఆత్మకు లేవు. అజ్ఞానమువలన కలుగు దుఃఖమును విజ్ఞాన దృష్టితో విడువుము. నీవు ప్రాజ్ఞురాలవు. అజ్ఞానులవలె నీవు శోకింపరాదు. అని బలభద్రుడు చెప్పగా రుక్మిణీదేవి దుఃఖము మానియుండెను.

బలరామునిచే విడిపింపబడిన రుక్మి తన విరూపభావమునకు దుఃఖించుచు హరిని గెలిచినగాని కుండినపురములో ప్రవేశింపనని ప్రతిజ్ఞచేసి కుండినపుర సమీపమున నుండెను. శ్రీహరి రాజసమూహములను గెల్చి, బంధువులు ప్రశంసించుచుండగా రుక్మిణీ కృష్ణుల వివాహము జరుపుటకై పాటలు పాడుచుండిరి. వాద్యముల వాయించుచుండిరి. నృత్యముల సల్పుచుండిరి. ఇంటింట స్త్రీ పురుషులు తమ్ము తమ గృహము సలంకరించుకొనిరి. వివాహమహోత్సవమునకు విచ్చేసిన, రాజుల గజబలము నందలి మదపుటేనుగుల మదజలముచేతనే రాజమార్గము తడుపబడినది. యింటింట ద్వారదేశమునందు పోకచెట్లకొమ్మలు, అరటి స్తంభములు కట్టబడెను. కర్పూరము చల్లబడెను. కుంకుమ పూయబడెను. అగరు ధూపములు రేగుచుండెను. పూర్ణకలశము లుంచబడెను. ఇండ్లు, వాకిండ్లు, వేదికలు, కడపలు స్తంభము లలంకరింపబడెను. వివిధవర్ణములుగల పువ్వులతో దండలు గూర్చబడి వ్రేలాడగట్టబడెను. తోరణములు కట్టబడెను. కేతనములు వెలుగొందుచుండెను. అట్టి శుభ ముహూర్తమున—

మ॥ ధ్రువకీర్తిన్ హరిపెండ్లియాడె నిజచేతో హారిణిన్ మారకై
తవ గాంభీర్యవిహారిణిన్ నిఖిల సంపత్కారిణిన్ సాధుకాం
ధవసత్కారిణిఁ బుణ్యచారిణి మహాదారిద్ర్య సంహారిణిన్
సువిభూషాంబరధారిణిన్ కులవధూ చూడామణిన్ రుక్మిణిన్.

పౌరులు దంపతులుగా వచ్చి వివాహవేదిక నలంకరించిన రుక్మిణీ కృష్ణులకు ప్రీతితో కానికలు తెచ్చియిచ్చిరి. హరి రుక్మిణిని పెండ్లియాడుటచే కురు, సృంజయయదు, విదర్భ కుంతిదేశపురాజులు పరమానంద భరితులైరి. హరి యీ విరముగ జరాసంధాదుల నోడించి, రుక్మిణిని గొనివచ్చి కల్యాణము చేసికొనె నను మాటవిని దేశమునగల రాజులు, రాణులుకూడ యిది చాలా ఘనకార్య మని యాశ్చర్యమును పొందిరి.

ఆదిలక్ష్మితో సమానురాలైన రుక్మిణితో క్రీడించుచున్న శ్రీకృష్ణుని చూచి, ద్వారకానగరమునందలి ప్రజలు సంతుష్టులై భయరహితులై యానందసాగర మున నోలలాడుచుండిరి.

సరసిజనిభహస్తా సర్వలోకప్రశస్తా!
నిరుపమ శుభమూర్తీ! నిర్మలారూఢ కీర్తీ!
పరహృదయవిదారీ! భక్తలోకోపకారీ!
గురుబుధజనతోషీ! ఘోరదైతేయశోషీ!

ఆంధ్రవచన మహాభాగవతమునందలి
దశమస్కంధము పూర్వభాగము
సమాప్తము.

దశమ స్కంధము - ఉత్తర భాగము

పరీక్షిత్తు, రుక్మిణీ పరిణయము జరిగిన తరువాత కథను వినిపింపుమని యడుగగా శుకయోగీంద్రు డిట్లు చెప్పెను :

ప్రద్యుమ్నుని చరిత్రము.

శ్రీహరి యంశముచే పుట్టిన మన్మథుడు శివుని కంటిమంటచే బూడిదయై, మఱు జన్మమున కృష్ణునకు రుక్మిణియందు పుత్రుడై పుట్టెను. అతడే ప్రద్యుమ్ను డనుపేర ప్రఖ్యాతి చెందెను.

ప్రద్యుమ్నుడు శిశువుగానుండి తల్లి పొత్తిగిటిలోనుండగా శంబరుడను రాక్షసుడితడు తనకు శత్రువు కాగలడని తెలిసి మాయాబలముచే నతనిని తీసికొనిపోయి సముద్రములో పడవేసెను. సముద్రమునందా బాలుని యొక పెద్దచేప మ్రింగెను. జాలరులు సముద్రములో జాలరులువేసి పెద్ద చిన్న చేపలనుపట్టి శంబరునకు కానికగా నిచ్చిరి. శంబరుడు చేపలను వండి, తెమ్మని వంటశాలకు పంపించెను. మన్మథుని భార్యయైన రతీదేవి మాయావతి యనుపేర శంబరునింట పతివ్రతయై మెలుగుచు తన భర్తయగు మన్మథుడు తిరిగి శరీరము దాల్చునని తెలిసి యందులకై వేచియుండెను. శంబరాసురుని వంటయింటిలోని వంటలవారు పెద్దచేప కడుపు చీల్చి యందు శిశువునుచూచి శంబరునకుచెప్పిరి. మాయావతి యాశిశువు మన్మథుడేయని తెలిసికొని, శంబరునివద్దకేగి యా బాలుని తాను పెంచుకొందునని యతని యనుమతితో నతని పెంచుచుండెను. ఆ శిశువు త్వరలోనే యువకుడయ్యెను.

ఆ యువకుని సౌందర్యము సుందరీజనుల మనస్సును చూరగొనుచుండెను. లోకమున సుందర పురుషులను మన్మథునితో పోల్చుచుందురు. ఆ మన్మథుడు పార్వతికి శివుని వామభాగమున స్థానము కల్పించెను. సృష్టికర్తయగు బ్రహ్మకు సరస్వతిపై మోహమును పుట్టించెను. ఇంద్రునకు అహల్యపై మోహము పుట్టించి, యతనిని వేయికన్నుల వేల్పుగాచేసెను. మునుల ధైర్యమును సడలింపచేయును. స్త్రీ పురుషుల నొక్కటిగా చేయును. పూవింటితో చిగురుటాకు బాణములతో లోకముల జయించును. అట్టి మన్మథుడు ప్రద్యుమ్నుడై పుట్టి శంబరునిచే నపహరింపబడి శంబరునింట మాయావతి పోషణలో పెరిగిపెద్దవాడై నంతనే అగణ్యమోహనాకారుడైన ప్రద్యుమ్నుని చూచి మాయావతి యతనితో రమింపదలచెను. అప్పుడు ప్రద్యుమ్నుడు రతినిజూచి "తల్లీ ! నీవు నా కుమారుడనినైయున తలంపక, సిగ్గువిడిచి అన్యాయముగా నీవిట్టి కోరికను తెల్పుట అధర్మము. పతివ్రతవైన నీ కిది ధర్మముకాదు."

అనగా విని రతి యతనితో- "నీవు నారాయణునకు పుత్రుడవైన మన్మథుడవు. నీకు పూర్వజన్మయందు భార్యనైన రతినే నేను. నీవు శిశువుగా నుండినప్పుడు రక్షసాత్ముడైన శంబరుడు నిన్ను దొంగిలించి తెచ్చి సముద్రములో పడవేసెను. అప్పుడు నిన్నొక పెద్దచేప మింగెను. ఆ చేపకడుపునుండి నీవు బయటపడితివి. ఈ శంబరుడు మాయలమారి. వీడు మాయాబలముచే యుద్ధమున దేవతలను

గెల్చును. కావున నీవు మాయలచేతనే చంపుము. తన పొదిగిటిలోనున్న నిన్ను వీడు తెచ్చినప్పుడు మీతల్లి యెంత బాధపడెనో, దైవమునెంత తిట్టుకొనెనో కదా" అని చెప్పి మాయావతి యతనికి శత్రువుల మాయలన్నిటిని నాశనము చేయు మహా మాయావిద్య నుపదేశించెను.

అంత ప్రద్యుమ్నుడు మాయయుద్ధముల రహస్యము తెలిసికొని, కవచమును తొడిగి విల్లుపట్టి బాణముల ధరించి శంబరునితో- "ఓరీ రాక్షసా! నీవు నన్ను సముద్రములో త్రోసితివి. ఇప్పుడు నిన్ను భయంకరమైన యుద్ధమనెడి సముద్రములో పడవేతును రమ్మ"ని శంబరుని హెచ్చరించగనే, కాలుదెబ్బ తిన్నపాము వలె కస్సుమని లేచి గదనుపట్టుకొని ప్రద్యుమ్నునిపై వేసెను. శంబరుడు వేసిన గదను ప్రద్యుమ్నుడు తనగదతో ముక్కలుచేసె. రాక్షసులు భయపడుచుండ పకపక నవ్వెను. పిమ్మట శంబరుడు రాక్షస మాయపన్ని, యాకాశమున కెగసి ప్రద్యుమ్నునిపై బాణవర్షము కురిపించెను. ప్రద్యుమ్నుడా బాణవర్షమునకు కదలక మెదలక ధీరుడై నిలుచుండి సాత్త్వికమాయచే వాని బాణవర్షమును నివారించెను. శంబరుడు యక్ష, పిశాచాది మాయలవన్ని ప్రద్యుమ్నుని బాధించగా నతడు వాడికత్తితో వాని తలను నరికెను. శంబరుడు నేలకూలగనే దేవతలు పూలవాన గురిపించిరి.

రతీదేవి ప్రద్యుమ్నునితో ద్వారకకు పోవుట.

శంబరాసురుని వధించిన పిమ్మట రతీదేవి ప్రద్యుమ్నునితోపాటు ఆకాశవీధిలో ద్వారకానగరముపైకి రాగా, మెఱుగుతీగతో కూడిన మేఘమువలె రతితో కలిసిన ప్రద్యుమ్నుని ద్వారకానగరమునందలి ప్రజలు చూచిరి.

వారిరువురు అంతఃపురమునకు రాగా, అందలి స్త్రీలు ప్రద్యుమ్నునిగాంచి హరియని తలంచిరి. అతనిని జూచి కొందఱు హరియే యనిరి. మఱికొందఱు యితనికిగల చిహ్నములు కొన్ని హరికి లేవనిరి. ఇంకకొందఱు మెల్లగా తెలిసికొందమనిరి.

అంతఃపురమునందలి స్త్రీలు ప్రద్యుమ్నుని చూడరాగా రుక్మిణీదేవి యతనిని చూచి, చనులు చేపగా తన చెలితో నిట్లనెను: "ఈ కుమారు డెక్కడనుంచి వచ్చెను. ఇట్టివానిని కనినతల్లి తన పూర్వజన్మలలో నెంతపుణ్యము చేసెనో ఈ సుందరాంగుని తల్లిదండ్రులెవరో? చెలీ! నా మొదటి బిడ్డ పుట్టినప్పుడు

వానికి పాలుత్రావి వానిని నాపొత్తులో పరుండబెట్టుకొనియుంటిని. నాపసివానిని నాకు దూరముచేసి ఏయే పాపాత్ములు తీసికొనిపోయిరో. వానిని ఏతల్లి కాపాడినదో. వానినెత్తుకొని పోయినప్పటినుండియు వాని సంగతి నాకేమియు తెలియదు. వాడెక్కడ ఉన్నాడో? ఎట్లా ఉన్నాడో? వాడు బ్రతికియున్నచో దేహ సౌందర్యములో, వయస్సులో యింతవాడై యుండును. చెలీ! నా బాలుని యాకారము, రంగు, నవ్వు, చూపు, కాంతి అంతయు వీనివలెనే యుండెను. వానిలో మావారి లక్షణములన్ని కలవు. నా మనస్సెందుకో సంతోషముతో నిండినది. నా యెడమభుజ మదురుచున్నది. కన్నులనుండి ఆనందబాష్పములు రాలుచున్నవి." అని వితర్కించుచు, అతడు తన కుమారుడేయని చెప్పదలచును. ఒకవేళ తన కొడుకుకానిచో సవతులు నవ్విపోదురని ముందువెనక లాలోచించుచుండెను. కావలివారివలన యీ వార్తవిని కృష్ణుడు దేవకీ వసుదేవులను పిలుచుకొనివచ్చి, తనకు జరిగినదంతయు తెలిసినను, ఏమియు తెలియ నట్లూరకుండెను. అంత నారదుడు వచ్చి, రుక్మిణీదేవి ప్రక్కనగల శిశువును శంబరుడు తీసుకొని పోయినది మొదలు జరిగినదంతయు చెప్పెను.

అంతఃపురము నందలి స్త్రీలందరు చనిపోయినవాడు తిరిగి బ్రతికి వచ్చినట్లు తలంచి, యితనిని యిన్నేండ్లకు చూచితిమి. మనమెంతో పుణ్యము చేసికొంటిమనిరి. అంత దేవకీ వసుదేవులు, రామకృష్ణులు, అంతఃపురకాంతలు ఆ దంపతులకు పట్టుగుడ్డలు, ఆభరణములిచ్చి సత్కరించిరి.

రుక్మిణీదేవి తన కుమారుని కౌగిలించుకొని- "నా తండ్రీ! నిన్ను రాక్షసుడు తీసికొనిపోయి సముద్రములో వేసెనా? నిన్ను విడిచి యెన్నో సంవత్సరములు గడిచినవి. నీ వెట్లు బ్రతికితివిరా నాయనా! నీవు రాక్షసుని యెట్లు చంపితివి. ఇదంతయు నాకాశ్చర్యముగ నున్నది. యింతకాలమునకు మరల నిన్ను చూడగల్గితిని. ధన్యురాలనైతిని." అని రుక్మిణి తన కుమారుని చూచి సంతసించి కోడలి గుణములను మెచ్చుకొని సంతోషించుచుండెను. ద్వారకలోని ప్రజలు ప్రద్యుమ్నుని వృత్తాంతము తెలిసికొని యానందించిరి. స్త్రీలు ప్రద్యుమ్నుని జూచి మోహముతోనుండిరి. అని చెప్పి శుకయోగి పరీక్షిత్తుతో ఇట్లనెను—

శ్రీకృష్ణుడు స్యమంతకమణి దెచ్చుట.

"రాజా! సత్రాజిత్తు కృష్ణునకు కీడుచేసి, వినయముతో ఆ హరికి తన కూతురును స్యమంతకమణిని తెచ్చియిచ్చె." అనిన విని రాజు శుకయోగి నిట్లడిగెను—

"సత్రాజిత్తు హరికి కీడేమి చేసెను? తన బిడ్డను స్యమంతకమణిని యేయెందుకు తెచ్చియిచ్చెనో తెలుపుము." అనిన విని శుకయోగి యిట్లు చెప్పెను:

సత్రాజిత్తనువాడు సూర్యభక్తుడై సూర్యుని సేవింపగా సూర్యుడు సంతసించి సత్రాజిత్తునకు స్యమంతకమను మణి నిచ్చెను. సత్రాజిత్తు ఆ మణిని తన కంఠమున ధరించి సూర్యునివలె వెలుగుచు ద్వారకకు వచ్చెను. దూరమునుండి అతని చూచిన ప్రజలు, మణికాంతిని చూడలేక సూర్యుడే వచ్చుచున్నాడని తలచి హరికిట్లు చెప్పిరి– 'గోవిందా! హరీ! నమస్కారము. నిన్ను చూచుటకై ఇంద్రాది దేవతలు వత్తురుకదా! నీవు యాదవ వంశమున పుట్టిన విష్ణుడవు. నిన్ను చూచుటకై ఆ సూర్యుడో లేక బ్రహ్మయో వచ్చుచున్నాడు. ఆ దేహ కాంతి దిశదిశల వ్యాపించుచున్నది చూడుము.' వారి మాటలు విని కృష్ణుడు నవ్వి, ఆ వచ్చుచున్నవాడు మణిని కంఠమున ధరించిన సత్రాజిత్తు. కాని సూర్యుడు కాడు అని చెప్పెను.

సత్రాజిత్తు సంపదను కల్గించు ఆ మణిని తన యింటికి తీసికొనిపోయెను. ఆ మణి ప్రతిదినము ఎనిమిది బారువుల బంగారమును కల్గించుచుండెను. స్యమంతకమణి పూజింపబడు దేశములో రోగములు, కీడులు, మారి, అనావృష్టి మొదలగు వానివలన భయము కలుగదు. హరి యాదవ రాజునకు స్యమంతకమణి నిమ్మని యడుగగా సత్రాజిత్తు లోభముచే దానినివ్వలేదు.

అంత నొకనాడు సత్రాజిత్తు తమ్ముడు ప్రసేనుడనువాడు స్యమంతకమణిని కంఠమున ధరించి, గుఱ్ఱము నెక్కి వేటాడుటకై వనమునకు పోయెను. ఘోరారణ్యమున ఒక సింహము ప్రసేనుని చంపి, ఆ మణిని తీసికొనిపోవుచుండగా ఆ సింహమును చంపి జాంబవంతుడా స్యమంతకమణిని తీసికొని, యచటికి సమీపము నందున్న గుహకు పోయి తనముద్దుల బిడ్డకు ఆ మణిని బంతిగా నిచ్చెను.

సత్రాజిత్తు వేటకుపోయిన తన తమ్ముడు తిరిగి రానందుకు చింతించుచు– "నా తమ్ముడు మణిని కంఠమున ధరించి వేటకై యడవికి పోగా కృష్ణుడతనిని చంపి మణిని తీసికొనిపోయెనని నలుగురితో చెప్పెను. ప్రసేనుని మణికై చంపెనను అపవాదము హరికి తెలిసి నాలో పలోపములేదు. నాపై యిట్టి నిందవచ్చిన పోగొట్టుకొనవలెనని తలచి, కృష్ణుడు తన వారివలన ప్రసేనుని జాడను తెల్పగా వనమున తిరుగుచు నేలపై కూలిన గుఱ్ఱమును, ప్రసేనుని చూచి తరువాత

ప్రసేనుని చంపి, జాంబవంతునిచే చంపబడిన సింహమును చూచెను. అక్కడినుండి ఎలుగుబంటు జాడనుపట్టి జాంబవంతుడుండు గుహను చూచెను.

కృష్ణుడు తనవెంట వచ్చిన వారందఱిని గుహబయట నుండుడని, తానా చీకటి గుహలో ప్రవేశించి, యక్కడ చూచుట కందముగానుండి చెండువలె వ్రేలాడు చుండిన మణినిజూచి దానిని తీసికొనదలచెను. కృష్ణుడు మెల్లమెల్లగా ఆ పాప వద్దకు రాగానే దాది గుండెలు ఝల్లుమన కేకవేసెను. ఆ కేకవిని బలవంతుడైన జాంబవంతుడు వచ్చి, తన స్వామియైన రామచంద్రుడే యితడని తెలియక సామాన్య మానవుడని తలచి కృష్ణునితో యుద్ధము చేసెను. మాంసమునకై పోరాడు డేగలవలె కృష్ణుడు, జాంబవంతుడును శస్త్రములతో, వృక్షములతో, చేతులతో ఇరువది మూడు దినములు యుద్ధము చేసిరి.

ఆయుధములు, చెట్లు విఱిగిపోగా వారు పిడుగులవంటి పిడికిటి పోటులతో పోరాడిరి. కృష్ణుని పిడికిటి గుద్దులకు జాంబవంతుడు తన శరీరము ముద్దకాగా, అలసి భయపడి కృష్ణునితో- "దేవా! నీవు విష్ణుడవు. సర్వేశ్వరుడవు. స్వామీ! బాణాగ్నిచే సముద్రము నింకింపజేసి సేతువు కట్టించినవాడు, ప్రతాపముచే రాక్షసుల గర్వము నణచినవాడు, రావణుని పది తలలను నఱికినవాడు, లంకకు విభీషణుని రాజుగావించినవాడును, కరుణాసముద్రుడును అగు రామచంద్రుడవు నీవే కావా! మాఱు వేషమున నీవు వచ్చుటచే నిన్ను తెలిసికొనక తప్పు చేసితిని క్షమింపు"మని వేడుకొనెను. అంతట కృష్ణుడు సంతసించి జాంబవంతుని శరీరమును తన చేతితో నిమిరెను. జాంబవంతున ఆయాసము తగ్గెను. బాధ తొలగెను. అంత కృష్ణుడు జాంబవతునితో- "దీనిని మేము అపహరించితిమను నింద మాపై మోపబడినది. ఆ నిందను తొలగించుటకుగాను నీగుహలో ప్రవేశించితి"మని చెప్పగా జాంబవంతుడు సంతసించి, స్యమంతకమణితోపాటు తన కన్యకారత్నమగు జాంబవతినికూడ హరికి కానుకగా సమర్పించెను. గుహవద్ద వేచియుండిన కృష్ణుని వెంటవచ్చిన వారు ద్వారకకు పోయి దేవకీ వసుదేవులకు రుక్మిణికిని యీ సంగతి చెప్పిరి.

అంత దేవకీ వసుదేవులు, రుక్మిణియు హరిగుహలో చిక్కెనని దుఃఖించిరి. వారును, పౌరులును, హరి బిలమునుండి సుఖముగా తిరిగిరావలెనని దుర్గాదేవిని సేవించిరి. అంత దుర్గాదేవి, మణితో భామామణితోపాటు కృష్ణుడు సుఖముగా తిరిగి రాగలడని పలికెను.

కృష్ణుడు స్యమంతకమణితో జాంబవతితో ద్వారకకువచ్చిన కృష్ణునిచూచి మిక్కిలి సంతసించిరి. అంతట హరి సత్రాజిత్తును రాజసభకు పిలిపించి, జరిగిన వృత్తాంతమంతయు తెలిపి సత్రాజిత్తుకు స్యమంతకము నిచ్చెను. సత్రాజిత్తు తన యింటికేగి యిట్లు తలంచెను." పాపాత్ముల పాపములను తొలగించు కృష్ణునిపై పాపముచేసెనను నిందమోపితిని. నా పాపమునకంతుకలదా ? నేను మితభాషిగా నుండక లేనిపోని నిందను హరిపై మోపనేల ? నేను పాపాత్ముడను, ధనలోభిని, దురాలోచనగలవాడను, గర్వించినవాడను, నా యీ దేహమెందులకు గాల్పనా? నా పాపమెట్లు తొలగును. ఏ విధముగ కృష్ణునకు నాపై దయగలుగును. ఈ స్యమంతకమును నా బిడ్డను హరికి సమర్పించి పాదములు పట్టుకొనినచో నేను బ్రతుకగలను దానితో హరి సంతోషపడును". అని ఆలోచించి సత్రాజిత్తు సంతోషముతో స్యమంతకమణిని. తన కూతురగు సత్యభామను సమర్పించెను. అంత

ఉ॥ భామను సాహసుఁడచ్యుతుఁ డుదార యశోనిధి పెండ్లియాడె వా
నాముని లేంద్రనందితగుణస్థితి లక్షణ సత్యభామను
ద్దాము పతి వ్రతాత్వనయ ధర్మవిచక్షణతా దయాయశః
శ్యామను సత్యభామను ముఖద్యుతి నిర్జిత సోమనద్యోతన్.

శ్రీకృష్ణుడు సత్యభామను పెండ్లాడి సత్రాజిత్తుతో నిట్లనెను. సూర్యుడు నీకి మణి నిచ్చెను. నాకు చాలా మణులు కలవు. నీ కన్యకామణిచాలును. అని మణిని సత్రాజిత్తున కిచ్చెను.

పిమ్మట కృష్ణుడు, కుంతితోపాటు పాండవులు లక్కయింటిలో దగ్ధులైరని విని, సమస్తము తెలిసినవాడైనను బలరామునితోపాటు హస్తినాపురికిపోయి కృప, విదుర, గాంధారీ భీష్మద్రోణులకు దుఃఖము పోగొట్టుచు ఊరడింపు మాటలు పలుకుచుండెను.

శతధన్వుడు మణిని నపహరించుట.

అక్రూర కృతవర్మలోకవాడు శతధన్వుని వద్దకుపోయి యతనితో సత్రాజిత్తు మనకిచ్చెదనని నమ్మించి తన కూతురును కృష్ణునకిచ్చి మాటతప్పెను. ఆ దుర్మార్గుడైన సత్రాజిత్తునుండి ఏదే విధముగనైన మణిని కాజేయుము. అని చెప్పగా శతధన్వుడు కటికవాడు పశువునుకట్టి చంపునట్లు, సత్రాజిత్తు నిద్రించుచుండగ అతనినిచంపి, సత్రాజిత్తు భార్యలు మొఱపెట్టుచున్నను వినక ఆశతో స్యమంత

కమును తీసికొనిపోయెను. సత్యభామ తన తండ్రి మృతదేహమును చూచి దుఃఖించి నూనెపీపాలో పెట్టించి, హస్తినాపురమునందున్న తన పెనిమిటికి వార్తను పంపించెను. అంత హరి, బలరాముడును సామాన్యమానవులవలె దుఃఖించిరి. రామకృష్ణులు ద్వారకకువచ్చిరి. హరి, తన్ను చంపదలచెనని విని శతధన్వుడు ప్రాణము పోవునను భయముతో కృతవర్మను సహాయపడుమనగా నతడు రామకృష్ణులు మహాత్ములు వారికి కీడుచేయగలవాడెవ్వడు! కృష్ణుడు కంసుని సంహరించెను. జరాసంధుని పారద్రోలెను. వారి బలశౌర్యములు ప్రసిద్ధములు. నేనేమిచేయుదును పొమ్మనగా శతధన్వుడు అక్రూరునితో తనకు సహాయపడుమని ప్రార్థించెను. అక్రూరుడు శతధన్వునితో శ్రీకృష్ణుడు నారాయణుడు, కూటస్థుడు. ఈశ్వరుడు. నేను హరికి ఎల్లప్పుడు దాసుడను. అయనతో ద్వేషముపెట్టుకొనుట నాకు చేతకాదు. నీ స్నేహమునకు, నీకు పదివేల నమస్కారములు పొమ్మని చెప్పెను. శతధన్వుడు స్యమంతకమణిని అక్రూరునివద్ద పెట్టి వడిగల, గుఱ్ఱమునెక్కి నూఱుయోజనముల దూరముపోయెను. రామకృష్ణులు గరుడకేతనముగల రథమునెక్కి వాని వెంటబడిరి. శతధన్వుడు మిథిలను సమీపించి, రథముదిగి, ఆరాటపడుచు కాలినడకన పోవుచుండెను. వానిని జూచి, హరి శతధన్వా! పోవలదు అని వానిని వారించి తన చేతి చక్రముచే శతధన్వుని శిరస్సును ఖండించెను. వాని తల మొండెమునుండి పడిన తరువాత హరి వాని దుస్తులను పరిశీలించి మణికై వెదికెను. కాని హరికి మణి గన్పించలేదు. అంత హరి బలరామునితో శతధన్వుడు ఊరక చంపబడెనని చెప్పెను. అంత బలరాముడు కృష్ణునితో స్యమంతకమును శతధన్వుడే అపహరించెననుట నిజము. అతడా మణిని దాచుమని యెవరికిచ్చెనో నీవుపోయి వెదకుము. నాకు మిథిలరాజగు జనకుని చూడవలెననుకోరికకలదు. అని చెప్పి హరిని పంపించి బలరాముడు మిథిలకుపోయి జనకుని సత్కారమునుపొంది కొన్ని యేండ్లుండెను. అంత దుర్యోధనుడు మిథిలానగరమునకువచ్చి జనకునిచే సత్కరింపబడుచు బలరామునివద్ద గదాయుద్ధములో నేర్పును సాధించెను. కృష్ణుడు ద్వారకకు పోయి శతధన్వుని మరణ వృత్తాంతమును అతనివద్ద స్యమంతకము కన్పించక పోవుటను సత్యభామకు తెల్పి, సత్రాజిత్తునకు పరలోకక్రియలను చేయించెను. శతధన్వుని మరణవార్తవిని అక్రూరకృతవర్మలు భయపడి, ద్వారకను విడిచిపెట్టి చాలదూరము పోయిరి. అక్రూరుడు లేకపోవుటచే ద్వారకలో పలువిధ ఉత్పాతములు పుట్టినవి. ద్వారకలోని ప్రజలకు శరీరబాధలు. మానసికబాధలు

పోచ్చెను. ద్వారకలోని పరిస్థితులకు భయపడిన కొందరు పెద్దలు కృష్ణునితో నిట్లు విన్నవించిరి. కృష్ణా! మా మనవి వినుము. పూర్వము కాశీరాజ్యములో వానలు కురియక పైరులు పండక ప్రజలల్లాడుచుండిరి. అప్పుడు కాశీరాజు శ్వఫల్కునిని పిలుచుకొనిపోయి యతనిని సత్కరించి యతనికి తన బిడ్డయగు గాందినిని యిచ్చి పెండ్లిచేసి సత్కరించెను. అంతట కాశీరాజ్యములో వానలు కురిసినవి. శ్వఫల్కుని కుమారుడగు అక్రూరుడుకూడ తండ్రివంటివాడు. గొప్ప తపస్వి. అతడు తిరిగి మన ద్వారకకువచ్చినచో వానలు కురియును. ఉపద్రవములు తొలగును. కావున అతని నెట్లయిన రప్పింపుము. అని పౌరవృద్ధులు విన్నవింపగా కృష్ణుడు తన దూతలనుపంపి అక్రూరుని పిలిపించి యతనితో తియ్యని పలుకుల పలుకుచు నిట్లనెను. శతధన్వుడు ద్వారకను విడిచిపోవుచు మణిని నీ వద్ద పెట్టి పోయిన విషయము నిజము. ఇదినాకు తెలియును. సత్రాజిత్తునకు కొడుకులు లేనందున అతనికి కర్మలు చేయించి, అతని బిడ్డలు ధనమును ఋణమును పంచుకొందురు. అతడు ఘోరమైన దుర్మరణము పొందెను. కనుక అతనికి సత్కర్మములు చేయవలెను. మణి నీ వద్దనే యుండనీ. కాని ఆ మణిని బంధువులకందరికి ఒకసారి చూపుము. అందరు అప్పుడు నా మాటను నమ్ముదురు. నీ యిల్లు బంగారము కాగలదు. అని మంచి మాటలతో చెప్పగా అక్రూరుడు తాను వస్త్రమున దాచియుంచిన మణిని వారికి తీసియిచ్చెను.

ఉ. సంతసమందె బంధుజన సన్నిధికిన్ హరితెచ్చి చూపిన
క్రాంత విభాసమాన ఘృణిజాల వలాయిత భూనభోంతర
ధ్వాంతము హేమభారచయ వర్షణ విస్మిత దేవమానవ
స్వాంతము కీర్తిపూరిత దిశావలయాంతము నాస్యమంతమున్.

శ్రీకృష్ణుడు తాను క్రూరుడను కానని బంధువులకు జనులకు తెలిపి యా స్యమంతకమును దయతో అక్రూరునకు మరల యిచ్చెను.

శ్రీకృష్ణుడు మణిని తెచ్చియిచ్చిన కథను వినినవారికి చదివినవారికి, తలచిన వారికిని అపకీర్తి తొలగును. పాపములు నశించును.

శ్రీకృష్ణుడు ఇంద్రప్రస్థమునకువచ్చుట.

ఒకనాడు శ్రీకృష్ణుడు పాండవులను చూడగోరి సాత్యకి మున్నగు యాదవ వీరులను వెంటబెట్టుకొని ఇంద్రప్రస్థపురమునకు పోయెను. పాండవులు కృష్ణుని

చూచినంతనే మిక్కిలి సంతసించి, ఎదురువచ్చి కృష్ణుని కౌగిలించుకొని యా హరిదేహ స్పర్శచే పావనమూర్తులై ప్రేమచేతను చిఱునగవుచేతను సుందరమైన ముకుందుని ముఖారవిందమునుచూచి యానందించిరి. కృష్ణుడు ధర్మరాజునకు భీమసేనునకు నమస్కరించి యర్జునుని కౌగిలించుకొని, తనకు మ్రొక్కిన నకుల సహదేవులను గాఢాలింగనము చేసికొని యున్నత పీఠముపై కూర్చుండెను. అప్పుడు క్రొత్తపెండ్లి కూతురైన ద్రౌపది సిగ్గుతో కృష్ణునకు నమస్కరించెను. పాండవులు సాత్యకి మున్నగు వారిని తగిన రీతిగా సత్కరించిరి. కృష్ణుడు కుంతీదేవి పాదమునకు నమస్కరించి యామెతో అత్తా! కొడుకులు కోడలు నీకు వచ్చినట్లుగ పనులుసేయుచు నీ యానతి చొప్పున నడచుకొనుచుండ నీ వానంద ముతో నున్నావు కదాయని యడిగెను. అంత కుంతీదేవి కన్నీరు గార్చుచు బొంగురుపోయిన గొంతుతో దుర్యోధనుడు తమకు చేసిన కీడులను తలచుకొని తాము పడిన కష్టముల నన్నిటిని చెప్పుకొని అన్నా నీవు చుట్టాలను చూచి కష్ట సుఖములను విచారించుచుందువు. బంధువులను మఱచిపోవు. నీ దయతో మే మిప్పుడు సుఖముగానున్నాము. నాయనా! నాకు నా పిల్లలకు నీవేదిక్కు. నీవు పరమాత్మవు. నీపై తప్ప నావారని నే నెవ్వరిపైన ఆశపెట్టుకొనలేదు. నా భాగ్యముచే నీవు మాకు వచ్చిన కష్టములను దయతో తొలగింతువు. ధర్మ రాజు కృష్ణునితో నిట్లనెను. సనక సనందాదులుకూడ ఎవనిని తమలో బంధింప లేరో అట్టి మహానుభావుడవు. మమ్ము నీ చుట్టాలమనితలచి, వచ్చి అల్పులమైన మమ్ముచూచి పోవుదువు. కృష్ణా! జగన్నాథా! మేము పూర్వజన్మలో ఎంత పుణ్యము చేసికొంటిమో. కృష్ణుడు పాండవులతోపాటు ఆ పట్టణమున కొన్ని నెలలుండెను. ఒక నాడు కృష్ణుడు అర్జునుడును కలిసి వేటకై యడవికి పోయిరి. అర్జునుడు ఉత్సాహముతో పులులు సింహములు మున్నగు క్రూరజంతువులను చీల్చి చెండాడెను. అర్జునుని సేవకులు వేటలో చనిపోయిన పవిత్ర జంతువులను తెచ్చి ధర్మరాజునకు కానుకగా నిచ్చిరి. కృష్ణుడు అర్జునుడును కలిసి దప్పి తీర్చుటకై యమునానదికిపోయి నీరు త్రాగి యునుకతిన్నెపై కూర్చుండిరి. కృష్ణుడు యమునానదిలోని యలలపై ఒక నవమోహనాంగినిచూచి అర్జునుని

పను. అర్జునుడామెనుచూచి, రమణీ! నీ వెవతెవు? నీ విచ్చటి కెందుకు వచ్చితివి? నీ పేరేమి? నీ కోరిక యేమి! పెండ్లి చేసికొనవలెనని వచ్చినట్లు కనిపించుచున్నది. నీ పుట్టుక మొదలైన విషయములను తెలుపుమని యడిగెను. అంత ఆ సుందరాంగి నేను సూర్యుని బిడ్డను. నా పేరు కాళింది. నేను మా

తండ్రి కల్పించిన యింటిలో యీ నదిలో విష్ణువును భర్తగాకోరి తపము చేయుచుందును. మా తండ్రి నాతో కృష్ణుడు వేటకై వచ్చి నిన్ను వరించునని చెప్పెను. అని చెప్పగా విని యామె మాటలను అర్జునుడు నారాయణునకు తెల్పెను. సర్వము తెలిసిన కృష్ణుడామెను రథముమీద కూర్చుండబెట్టుకొని ధర్మరాజు గృహమునకు పోయెను. అంత కృష్ణుడు విశ్వకర్మను పిలిపించి యింద్రప్రస్థపురమును చిత్రవిచిత్రముగ చేయించెను. కృష్ణార్జునుల సహాయముతో అగ్నిదేవుడు దేవేంద్రుని ఖాండవవనమునుకాల్చి సంతసించి అర్జునునకు ఎప్పుడు తరగని అంబులపొదిని, భేదించుటకు వీలుకాని కవచమును గాండీవమనెడు పెద్ద విల్లును దివ్యరథమును తెల్లని గుఱ్ఱములను కానుకగా నిచ్చెను. తనను అగ్నిజ్వాలలనుండి కాపాడినందున మయుడు ఒక విచిత్రమైన సభను నిర్మించియిచ్చెను. ఆ మయసభలోనే దుర్మతియైన దుర్యోధనుడు నీటినిచూచి నేలగా, నేలనుచూచి నీరుగా భ్రమించి తబ్బిబ్బుపడి విచారమును పొందెను.

కాళిందీ, మిత్రవింద, నాగ్నజితి, భద్ర లక్షణ కన్యల వివాహములు.

కృష్ణుడు ధర్మరాజువద్ద సెలవు గైకొని సాత్యకి మున్నగు వారితో ద్వారకకు వచ్చి బంధువులను సంతోషపెట్టుచు ఒక, శుభదినమున శుభలగ్నమున కాళిందిని పెండ్లాడెను.

శ్రీకృష్ణునకు మేనత్తయైన రాజాధిదేవి అవంతిరాజు భార్య. ఆమెకు మిత్రవింద యను కూతురు ఉండెను. మిత్రవిందకు విందుడు అనువిందుడను సోదరు లుండిరి. విందానువిందులు దుర్యోధనుడు చెప్పినట్లు వినుచుండిరి. విందానువిందులు తమ చెల్లెలి వివాహము చేయదలచి స్వయంవరమును చాటించిరి. శ్రీకృష్ణుడు స్వయంవరమునకు వచ్చిన రాజులనెల్ల ఓడించి మిత్రవిందను చేపట్టెను.

నాగ్నజితీ కల్యాణము.

పూర్వము కోసలదేశమును నగ్నజిత్తుడను రాజు పాలించుచుండెను. అతడు మంచి బుద్ధిమంతుడు. ధర్మమును పాటించువాడు. అతని బిడ్డపేరు నాగ్నజితి. ఆమె అందచందములు సద్గుణములు కలది. ఆ నగరమున వాడికొమ్ములుగలిగి, వీరుల గాలి సోకినంతనే కాలుద్రవ్వుచు బాగుగ మదించిన ఏడు ఆబోతులుండెను. ఆ ఏడు ఆబోతులను శౌర్యముతో కూల్చి వానిని తిరిగి ఎవ్వడు పట్టికట్టునో అతనికి నా బిడ్డ నిచ్చెదనని నగ్నజిత్తు చాటెను. భగవంతుడైన హరి సేవతో

కోసలపురమునకు వచ్చెను. నగ్నజిత్తు హరికి ఎదురేగి అర్ఘ్యపాద్యములతో వచ్చి పూజించి, యున్నతా సనమున కూర్చుండ బెట్టెను. అతనినిచూచి రాజ కన్యయగు నాగ్నజితి కమలాక్షుడును మోహనాకారుడును, త్రిలోకాధిపు డగు హరియే తనకు భర్త కావలెనని కోరుకొనెను.

విష్ణువు భర్త కావలెనని నేను పూర్వజన్మలలో చేసిన నోములు ఫలించినచో నన్ను శ్రీ కృష్ణుడు చేపట్టునని ఆమె తలచుచుండెను. కృష్ణుడు నగ్నజిత్తుతో 'రాజులు ఇతరులను యాచింపరు. నేను స్నేహధర్మముతో నీ కన్యను నా కిమ్మని వేడు కొను చున్నాను. కన్యాశుల్కము నివ్వను' అని చెప్పగా నగ్నజిత్తు కన్యకు తగిన వరుడు ముల్లోకములలో నీ కంటె వేరొకడులేడు. లక్ష్మి నిన్నే వరించి నీ యంగములందు నిత్యనివాసము చేయుచున్నది. మా పట్టణములో పొగరుపట్టిన యేడు ఆబోతులను లొంగదీసికొనిన వానికే నా కన్య నిత్తునని చాటించితిని. ఎందరో రాజులువచ్చి ఆబోతులచేత తన్నులుతిని తిరిగిపోయిరి. సూర్యుడు చీకటిని పోగొట్టునట్లు నీవు యుద్ధములో శత్రువుల పారదోలితివి. యీ మదపు టెద్లను లొంగదీసి నా బిడ్డను చేపట్టుము, అని

ఉ॥ కనికొనెనమూరి వత్స ఒక కంపవిదారి ఖలప్రహారి దా
ఘనతర కిల్బిషంబుల నగణ్య భయంకర కాయమంబులన్
సునిశిత శృంగ నిర్ధళిత శూరసమూహ ముఖాబిషంబులన్
హానన గుణోన్నిషంబుల మహోపరుషంబుల గోవృషంబులన్.

వానినిచూచి, కృష్ణుడుపై వంటె చక్కగా నడిమికిచుట్టుకొని ఏడు రూపములతో జాలుడు చెక్కతొక్కులను పట్టుకొనినట్లు పట్టుకొని వానిని గుద్దినేలపై, బడత్రోసి ఉద్ధృతంగా వానినన్నిటిని కట్టి యీడ్చెను. రాజులెల్లరు కృష్ణుని బల పౌరుష ములనుచూచి ఆశ్చర్యపడిరి. ఇట్లు కృష్ణుడు యేడు ఆబోతులను కట్టియీడ్చెను. అంత నగ్నజిత్తు హరికి నాగ్నజితి నిచ్చెను. హరి నాగ్నజితిని విధివిధానముగ పెండ్లాడెను. రాజులందరు ప్రశంసించిరి. బ్రాహ్మణులు వారిని ఆశీర్వదించిరి. మంగళ వాద్యములు మ్రోగినవి. నగ్నజిత్తు దంపతులను రథమెక్కించి పదివేల యావులను, వివిధములైన వస్త్రములతో భూషణములతో అలంకరింపబడిన మూడు వేలమంది యువతులను, తొమ్మిదివేల యేనుగులను ఏనుగులకు నూరు రెట్లు రథములను రథములకు నూరురెట్లు గుఱ్ఱములను గుఱ్ఱములకు నూరు రెట్లు భటులను అరణముగ నిచ్చి పంపెను. కృష్ణుడు నాగ్నజితిని పరిణయ

నూడి వచ్చుచుండగా, మొదట ఆబోతులతో పోరాడి యోడిపోయిన రాజులు కృష్ణుని అడ్డగించిరి. చుట్టుముట్టిరి. అంత అర్జునుడు గాండీవము నెక్కుపెట్టి వాడి బాణములతో ఆ రాజులనెల్ల పోరిలో సంహరించెను. ఇట్లు కృష్ణుడు నాగ్నజితిని పెండ్లాడివచ్చి సత్యభామతో క్రీడించుచుండెను. మఱియును శ్రీకృష్ణుడు

మ॥ జనవంద్యన్ శ్రితకీర్తి నంద్యుఁదరుణిన్ సందర్శనక్షోణిపా
ద్యనుజన్ మేనమ అందలిన్ విమలలోలాపాంగనై కేయిని
ద్ధనయోన్నిద్రప్రపూర్ణ సద్గుణ సముద్రన్ భద్రనక్షుద్రనా
వనజాతాక్షుఁడు పెండ్లియాడె సహిత వ్రాతంబు ప్రీతంబుగన్.

మఱియును.

చ॥ అమరుల జాలఁదోలి భుజగాంతకుఁడైన ఖగేశ్వరుండుము
న్నమృతముఁ దెచ్చునైవడి మదాంధుల రాజుల నుక్కడించియా
కమలదళాయతేక్షణుఁడు గైకొని తెచ్చెను మద్రకన్యకన్
సమద మృగేక్షణన్ నయవిచక్షణ లక్షణఁబుణ్యలక్షణన్.

ఇట్లు శ్రీకృష్ణునకు రుక్మిణి, జాంబవతి, సత్యభామ, కాళింది, మిత్రవింద, నాగ్నజితి, భద్ర లక్షణ యనువారు ఎనిమిదిమంది భార్యలైరి. మఱియును నరకాసురుని వధించి యతనిచే బంధింపబడిన పదునాఱువేల సంఖ్యగల రోహిణి మొదలైన వారిని పరిగ్రహించెను. అని చెప్పగా పరీక్షిత్తు శుకయోగితో యోగీంద్రా! భూదేవికి ప్రియపుత్రుడైన నరకుని హరి యేల చంపెను. ఆ నరకుడు పదునాఱువేలమంది కాంతలను యేల నపహరించెను? అని అడుగగా శుకయోగి యిట్లు చెప్పెను. నరకుడు అదితిదేవి కుండలములను హరించెను. వరుణుని ఛత్రమును గుంజుకొనెను. మేరుపర్వతమునందలి మణి పర్వతమనెడు స్థానమును ఆక్రమించెను. నరకుడు గావించిన పనులను దేవేంద్రుడు ద్వారకకు వచ్చి హరికి విన్నవించెను. హరి నరకాసురుని చంపుటకై గరుడునిపై నెక్కి పోవు సమయమున సత్యభామ హరికిట్లనియె.

న ర కా సు ర వ ధ.

దేవా! నీవు రాక్షస సమూహములను శౌర్యముతో సంహరించునపుడు నీ ప్రావీణ్యమును చూడవలెనని యెన్నటినుండియో కోరుచుందును. నా కోరికను

మన్నించి దయతో నీ వెంటనన్ను పిలుచుకొనిపొమ్ము. నే నచ్చట నీ శౌర్య ప్రతాపములను ఇచ్చటికివచ్చిన పిమ్మట అంతఃపురకాంతలకు వెల్లడింతును. అనగా విని కృష్ణుడు తన ప్రాణేశ్వరికిట్లు చెప్పెను. అచ్చట తుమ్మెద ఝంకారము లుండవు. ఏనుగుల గర్జనలే వినవచ్చును. గాలికెగిరివచ్చిన కమలముల పుప్పొడులుండవు. గుఱ్ఱముల గిట్టలచే యెగురగొట్టబడిన ధూళి కనిపించును. నీటియలల ధారలుండవు. శత్రువుల ధనుస్సులనుండి విడువబడు బాణము లుండును. హంసలతో జలపక్షులతో నిండిన కొలకు లుండవు. రాక్షస సైన్యము లుండును. కమలములు, కలువలుండవు. శత్రువులు ప్రయోగించు శూలము, ఖడ్గము మొదలగు ఆయుధము లుండును. నీ వెక్కడ, యుద్ధరంగమునకుపోవుట యెక్కడ ? నీవు యుద్ధమునకు రావలదు. నిలువుము. అనిన కృష్ణునకు సత్యభామ యిట్లనెను. రాక్షసులైననసరే రాక్షస సమూహములువచ్చిననుసరే నీ బాహు దుర్గముల చాటునమున్న నాకేమిభయము. నేను నీతో వచ్చెదనని చేతులు జోడించి సత్యభామ మొక్కగా కృష్ణుడామెను లేవనెత్తి యామెతోపాటు తాను గరుడునిపై నెక్కెను. కృష్ణుడు ఆకాశమార్గమునపోయి పర్వతములచే, శస్త్రములచే, నీటిచే, అగ్నిచే, గాలిచే ప్రవేశించుటకు వీలుకానిదియు, మురాసురుని పాశములచే చుట్టు బంధింపబడినదియునగు నరకుని రాజధానియగు ప్రాగ్జ్యోతిష పురమును సమీపించెను. గదచేత పర్వత దుర్గములను ముక్కలు ముక్కలు చేసెను. బాగుగ పదను పెట్టబడిన బాణములచే శస్త్రదుర్గముల నరికెను. చక్రముచే వాయు, జల, అగ్ని దుర్గముల సంపూర్ణముగ నుగ్గు చేసెను. ఖడ్గముచే మురాసురుడు చుట్టిన పాశములను ఛేదించెను. మఱియు ప్రాకారమును గద దెబ్బలచే ఛేదించి, యంత్రములతోపాటు రాక్షసుల గుండెలు పగులునట్లు పాంచజన్య శంఖమును పూరించెను. ఆ శంఖధ్వని ప్రళయకాల మేఘములు వర్షించు పిడుగుల మ్రోతవలెనుండి జనులలో చైతన్యము నశింపజేసెను. ఆ శంఖధ్వని, విని ఐదుతలలు గల మురాసురుడు నిద్రమాని యావులించి నిల్గి లేచి నీటినుండి ప్రళయకాలమునందలి అగ్నివలె మండుచు, భయంకరుడై తన ఐదు మొగములచే పంచభూతమయమైన ప్రపంచమును మ్రింగునట్లు బొబ్బచరచివచ్చి మంటలతో వెలుగు శూలమును గరుడునిపై వేసి వికటముగ అరుచుచు హరీ హరీ నిలువుము. అనుచు వికటముతో హరిని సమీపించెను. ఇంతటిలో, రాక్షసులలో నుండు గర్వము మాయునని హరి తలంచెను. అప్పుడు హరి మురాసురుడు గరుడునిపై వేసిన శూలమును మధ్యను, చేతితోపట్టి మూడుముక్కలుగాచేసి,

మురాసురుని ముఖముపై వాడిబాణముల నొప్పించెను. అంత మురాసురుడు కృష్ణునిపై గదను వేయగా, కృష్ణుడు ఆ గదను తన గదచేతనే ఖండించి వేయి ముక్కలుచేసెను. అంత మురాసురుడు కృష్ణునితో బాహుయుద్ధము చేయుటకై రాగా కృష్ణుడు వెంటనే చక్రముచే వాని యైదు తలలను నరికెను. ఇట్లు కృష్ణునిచే మురాసురునితలలు వజ్రముచే కూలిన పర్వతశిఖరములవలె నీళ్ళలో కూలగా మురాసురుని కొడుకులు పదుగురు తమ తండ్రిని చంపెనను కోపముతో జనార్దనుని మర్దింతుమని, పీఠుడను సేనాపతి నాయకత్వమున కృష్ణునిపై బాణములు, శక్తి గద, ఖడ్గము శూలము మున్నగు వానిని ప్రయోగించిరి. శ్రీకృష్ణుడు ఆ రాక్షస వీరులు ప్రయోగించు ఆయుధముల నన్నిటిని నేలపై పడవేసి ఎడతెగక బాణములను వారిపై ప్రయోగించి వారల భుజములను ముఖములను, కంఠములను, మోకాళ్ళను, పిక్కలను నువ్వుగింజలంత చిన్న చిన్న ముక్కలను చేసెను. తాను పంపిన వారందఱు కృష్ణుని బాణములచే చక్రముచే చంపబడి కూలిపోవుటను విని నరకుడు కుండలములు మొదలగు ఆభరణముల ధరించి, గజసైన్యముతో యుద్ధమునకు వచ్చెను. బలవంతుడైన నరకాసురుడు చంద్రబింబముపై మెఱుపుతీగతో కూడిన మేఘమువలె గరుడుని మూపుపై సత్యభామతో కూడి యుద్ధ విషయములను గూర్చి మాటలాడుచున్నవాడును మెరయుచున్న నల్లని దేహముగలవాడును, చక్కని అంబుల పొదికలవాడును, మాయరాక్షసులకు లొంగనివాడును, యుద్ధమున ఓటమిని పొందనివాడునగు శ్రీకృష్ణుని చూచెను. నరకాసురుడు కృష్ణునితో యుద్ధము చేయుటకు సిద్ధమగుచుండగా సత్యభామ కొప్పును చక్కగా దుఱిమి, పోకముడిని గట్టిగ బిగించి, సొమ్ముల సరిగ ధరించి, చంద్రబింబమువంటి ముఖమునుండి కాంతికిరణములు ప్రసరింపగా, పయ్యెదను చక్కగా దుఱిమి వీరావేశముగలదియై తన భర్తయెదుట నిలిచెను.

సత్యభామ నరకునితో యుద్ధముచేయుట.

అంత శ్రీకృష్ణుడు సత్యభామతో భామా ! మేము రాక్షసుల గర్వమునడపలేమా నీవు యుద్ధము చేయనేల ? మానుకొనుము. మానుకొనుట నీకిష్టము కానిచో మావిల్లు పుచ్చుకొనుము అని సత్యభామకు హరిదేవతలకు సంతోషమును కలిగించునదియు రక్కసిమూకలకు భయమును కలిగించునదియు, శత్రువుల గర్వమును నిర్మూలించునదియు నగు తన విల్లు నిచ్చెను. సత్యభామ కృష్ణుడిచ్చిన విల్లుపుచ్చుకొని, బలమును పుంజుకొని మిక్కిలి తేజస్సు ముఖమున

తాండవించగా, ఎరుపెక్కిన కన్నులకు మిఱుమిట్లు గొలుపుచు, వింటికి నారి నెక్కించెను. వింటికి నారినెక్కించుటతో పాటు రాక్షసవీరుల భార్యల మెడలనుండి మంగళసూత్రములు రాలిపడినట్లైనది. సత్యభామ వింటినారిని మ్రోగింపగా నరకాసురుని గుండె పై సైన్యమునకు మూర్ఛవచ్చెను. సత్యభామ వీర, శృంగార, భయానక, రౌద్ర అద్భుతరసములు కలిపి రాశియైనట్లుండ బాణమును తీయుట విల్లునదూర్చుట, వేయుట అనునవి యెవ్వరికిని తెలిసికొనుటకు సాధ్యము గానంత వడిగయుద్ధము చేసెను.

మ॥ పరుఁజూచున్ పరుఁజూచు నొంపసలరింపన్ రోషరాగోదయా
విరత భ్రూకుటి మందహాసములతో వీరంబు శృంగారమున్
జరగన్ గన్నులఁ గెంపు సొంపుఁ జరగన్ జండాస్త్ర సందోహమున్
నరపాలోక సమూహమున్ నెఱపుచున్ జంద్రాస్య హేలాగతిన్.

సత్యభామ హరికి సంతోషమును, నరకునకు విషాదమును కల్గించుచు విలుకాని భంగిమలో కూర్చుండి, నొసటవ్రాలిన వెంట్రుకలు చెమట చేతడువగా, చెవి యంచు వరకు వింటినారిని లాగి, లక్ష్యమును చూచుచు బాణముల విడుచుచు శత్రువుల చంపుచు చూడముచ్చటగ నుండెను. సుకుమారియై బొమ్మ పెండ్లిండ్లకు పోలేని సత్యభామ, రణరంగమున రాదలచుట వింత, మగవారు కనపడగనే మఱుగునకుబోవు సత్యభామ శత్రువులను గెల్వజూచుట వింత! బంగారు ఉయ్యాలలపై ఎక్కుటకు భయపడు పడతి గరుడుని వీపుపై కూర్చుండుట వింత, చెలుల పరిహాసధ్వనుల కోర్వలేని సత్యభామ, యుద్ధభేరుల శబ్దములనెట్లు వినగలిగెనో! నెమళ్ళకు నృత్యము నేర్పుచు అలసిపోవు అబల విలుకానివలె నింతసేపు యెట్లు కూర్చుండెనో అనిపించుచు సత్యభామ నేర్పుతో యుద్ధము వర్షకాలమువలె నుండెను. వింటినారి మేఘగర్జనముగా యుద్ధము చూచుటకై ఆకాశమున నిలిచిన దేవతలు కొంగలుగా తానుపట్టినవిల్లు ఇంద్రధనుస్సుగా, కృష్ణుడు మేఘముగా తానుమెఱుపుతీగగా, రాక్షసులు దావాగ్నిగా బాణ వర్షము జలవర్షముగా నుండెను. సత్యభామ ముఖబింబము హరికి చంద్ర బింబముగా నరకునకు సూర్యబింబముగాను, ఆమెపైటచెంగు కృష్ణునకు మన్మథ ధ్వజముగా నరకునకు శోకచక్రముగాను, ఆమె వంచిన ధనుస్సు కృష్ణునకు మన్మథ పరిధిగా, నరకునకు సూర్యుని చుట్టుచున్న మండలమువలె, సత్యభామ చూపు హరికి అమృత ప్రవాహమువలె అరికి ప్రళయాగ్నివలె

నుండెను. ఆమె బాణవర్షము కృష్ణునకు విలాసముగను, నరకునకు విషాదముగ నుండెను. సత్యభామ విడుచునట్టి ఘోరబాణ వర్షముచే, నరకుని సైన్యములు దీనములై భయపడి చెల్లా చెదరై నరకాసురుని వెనుక దాగెను. ఆ సమయ మున కృష్ణుడు తన ప్రేయసిని చూచి.

> కొమ్మా దానవనాథుని కొమ్మా సహాముసకుఁ దొలఁగె గురువిజయముగై
> కొమ్మా మెచ్చితి నిచ్చెద గొమ్మా భరణములు నీవు గోరినవెల్లన్.

అని పలికి బహుమాన పురస్సరముగ సల్లాపములుచేసి తన విల్లును తన చేతికి పుచ్చుకొనెను. అంత నరకుడు కృష్ణునితో హరీ మగువలు మగవారి ముందట మగతనములు చూపుచుండగా యుద్ధము మానుట నీకు మగతనముకాదుః మేము మగవారికి మగవారమగుటచే మగువలతో పోరాడలేదు. అనిన హరి యిట్లనియె. నరకా ! నా బాణములచే భయంకరాకారముగల నిన్ను ఖండించె దను. దేవకిన్నర కాంతలు నీ పతనము చూచి సంతోష పడెదరు. అని కృష్ణుడు నరకాసురుని సైనికులపై శతఘ్నియను దివ్యాస్త్రమును ప్రయోగింపగా వారందఱొక్కమారు మిక్కిలి బాధపడిరి. కృష్ణుడు బాణములచే నరకాసురుని సైన్యములందలి గుఱ్ఱముల చీల్చెను. గదలచే నరకుని గజముల మర్దించెను. చక్రముచే సైనికుల నడుములను, కాళ్ళను చేతులను మెడలను, తలలను నఱికెను. యిట్లు చేయుటచే నరకుని సైన్యములు హాహాకారములు చేయుచు పాఱిపోయెను. సేనాపతులు తనపై వేసిన శస్త్రాస్త్రములను హరి మూడేసి బాణములచే ముక్కలుగా చేసెను. సత్యభామను కృష్ణుని తన వీపుపై మోయుచు గజములను గరుడుడు తన కాలిగోళ్ళచేతను ముక్కుచేతను రెక్కలచేతను పగులచీల్చెను. మఱియును గరుడుని రెక్కల గాలికి నిలువలేక చావగా మిగిలిన సైన్యము యుద్ధరంగమునుండి పట్టణమున ప్రవేశింపగా, నర కాసురుడు వజ్రాయుధమును తిరస్కరించి మించిన శక్తిని తీసికొని గరుడునిపై వేయగా, పూలదండ పడినట్లు భావించి చలింపక మదపుటేనుగువలె ప్రకాశించెను. అంత నరకాసురుడు ఏనుగునెక్కి కృష్ణునిపై శూలము ప్రయోగింప నుండ వెంటనే, హరి జ్వాలామాలికలచే రాక్షసులను సంహరించిన తన చక్రముచే రత్నకుండలములచే శోభిల్లు నరకుని తలను ఖండించెను. తెగిన నరకుని తల, నేలపై శబ్దించుచు పడిపోయెను. ఆ చప్పుడు నరకుడు తన తల్లియగు భూదేవితో "తల్లీ ! నీవు శ్రీహరికి భార్యను అని చెప్పి కొందువే ! నిన్ను జూచియైన

నన్ను రక్షింపక నాశమెట్లు వరిగెనో చూడుము "అని యాక్షేపించినట్లున్నది. అంత దేవతలు, మునులు నరకాసురుడు చచ్చిపడిపోవుట నేడు చూచితిమి. ఇక సుఖముగా బ్రతుకగలమనుచు పూవుల వర్షించుచు శ్రీకృష్ణుని ప్రశంసించిరి. అంతభూదేవి శ్రీహరిని సమీపించి రత్నఖచితమైన బంగారు కుండలములను, వైజయంతియను హారమును, వరుణుని శ్వేతచ్ఛత్రమును ఒక మహా రత్నమును శ్రీహరికి సమర్పించి నమస్కరించి భక్తితో చేతులు జోడించి విశ్వేశ్వరుడును దేవదేవుడైన కృష్ణునితో నిట్లనెను. నీవు కమల నయనుడవు, కమల నాభుడవు, కమలమాలచే శోభించువాడవు. కమలములవంటి పాదములవాడవు. అంతులేని శక్తిగలవాడవు, ఆది పురుషుడవు, బ్రహ్మకు తండ్రివి. లోకముల సృజించుటకు రజోగుణమును, పెంచుటకు సత్త్వగుణమును, సంహరించుటకు తమోగుణమును కాల్తువు. సమస్త విశ్వము నీయందే యుండును. దీనరక్షకా! వీడు నరకుని కుమారుడు [illegible]. నీకు మిక్కిలి భయపడుచున్నాడు. వీనికి దిక్కెవ్వరులేరు. వీనిని కాపాడుము. అని భూదేవి వేడుకొని హరికి నమస్కరించి, వాక్కులను పుష్పములచే పూజించెను. భక్తవత్సలుడైన శ్రీహరి నరకాసురుని పుత్రుడైన భగదత్తున కభయమిచ్చి సర్వసంపద లిచ్చెను పిమ్మట శ్రీహరి నరకాసుర భవనమున ప్రవేశించి అందు నరకాసురుడు యుద్ధములచేసి రాజులను చంపి తన శౌర్యముతో తెచ్చి బంధించియున్న పదునారు వేలమంది రాజకన్యకలను చూచెను. వారును శుభాకారుడు మానినీ చిత్తచోరుడైన మాధవుని గాంచి మన్మథ వివశలై యిట్లు తలంచిరి. నరకాసురుడు మనల చెఱబెట్టిన పాపాత్ముడని యనుకొంటిమి. వాడు నిజముగ మేలుచేసెను. లేనిచో నేడు మనకు పురుషోత్తముని దర్శనము కలిగెడిదా? మనము పూర్వజన్మమున చేసికొనిన పుణ్యముచేతనే, బ్రహ్మ మనకు మాధవుని కూర్చినాడు మన ప్రాణవల్లభుడితడే ఎక్కడైన యీ సౌందర్యము ఈ శౌర్యగాంభీర్యములు చూచితిమా?

శా॥ భూనాథోత్తమ కన్యకల్ వరువనంభోజాతనేత్రుండు న
వ్వేనవ్వేంబరగఁ జూచె దగ్గఱియు వర్ణించెన్ వివేకించె న
మ్మానించెం గరుణించె చేరడిగె నవ్వార్గంబులోఁ బెండ్లి యా
వేవే చక్రధరుని వంచుఁ దమతో నిర్ణీతలై రంతయున్.

ఇట్లు కృష్ణుడు గావించిన మున్నవలె [illegible] పదునారువేల కన్యలను తెల్లని వస్త్రములచే ఆభరణములచే గంధపు పూలచే నలంకరింపబడిన వారిని నానావిధములైన ధనములను, రథములను గుఱ్ఱములను బాలుగు దంతములు గల ఏనుగులను ద్వారకకు పంపెను. అంత శ్రీకృష్ణుడు సత్యభామతో కలిసి యింద్రపురమునకు పోయి కిరణజాలముచే సూర్యమండలమును తిరస్కరించుచున్న కుండలములను అదితిదేవికి సమర్పించి, శచీదేవేంద్రులచే సత్కరింపబడి, సత్యభామతో కలిసి నందనవనమున కేగెను. అంతనందనో ద్యానమునందలి.

మ॥ హరి కేలం బెకలించి తెచ్చి భుజగేంద్రారాతిపైఁ బెట్టె సుం
దర గంధానుగత భ్రమద్భ్రమర నాదవ్రాతముం బల్లవాం
కుర శాఖాఫల పర్ణపుష్ప కలికా గుచ్ఛాది శోభితమున్
గిరిభిత్త్రాతముఁ బారిజాతముఁ ద్రిలోకీయాచ భాగ్యాతమున్.

ఇట్లు శ్రీహరి పారిజాతమును పెకలించి గరుడునిపై పెట్టి సత్యభామతో పాటు తాను గరుడునిపై నెక్కిపోవుచున్న సమయమున కృష్ణుడు నరకాసురుని చంపి, అదితిదేవి కుండలములను సమర్పించిన యుపకారమును మరచి, దేవేంద్రుడనను గర్వముచే దేవరాజు, దేవతలతో పాటు కృష్ణుని కడ్డమువచ్చి పారిజాతము విడువుము. అని మోహరించి నిలువబడగా కృష్ణుడింద్రాది దేవతలను జయించి తన పట్టణమునకు పోయి అతిశయ పారిజాతంబయిన దాని పారిజాత వృక్షమును, సత్యభామతో తాను క్రీడించు ఉద్యానవనమున నాటెను. పిమ్మట పదునారువేల రాజకన్యకలకు గృహావసరం గల్పించి.

చ॥ అమిత వినోదుఁడీశ్వరుఁడు సంబుఁడు బాహాటవాఁడుఁ బుంచిత
లగ్నమునఁ బదాఱువేల భవనంబులలో నిజదాఱువేల రూ
పములఁ బదాఱువేల నృపకాంతలఁ బ్రీతిఁ బదాఱువేల చం
దముల విభూతి నొందుచు యథావిధితో వరియించె భూవరా.

శ్రీకృష్ణుడు పదారువేల రాజకన్యకలను వివాహమాడి దానములందును, పిలుచుట యందును ఒకేవిధముగ పదునారువేల మందికి పదునారువేల రూపములతో కనిపించుచు నందరిని సమానముగ జూచుచు, ఉత్తమజ్ఞానముగల గృహస్థుడు ఆచరించునట్లు ధర్మము నాచరించుచు, తన కోరికలు సఫలములగు నట్లు వారితో క్రీడించు చుండెను. శ్రీకృష్ణుని భార్యలందరు ఆయన తన యింటికి రాగానే భర్తకెదురుగా పోయి తెచ్చిన వస్తువుల నందుకొనుచు,

బంగారు, మణులుగల ఆసనములపై శ్రీహరిని కూర్చుండబెట్టుచు భక్తితో పాదములు కడుగుచుండిరి. పిమ్మట పరిమళముగల జలమును స్నానమున కందించు చుండిరి. పిమ్మట మంచిగంధము, వస్త్రము భూషణములు నొసంగుచుండిరి. భక్ష్య శిష్టములైన పదార్థములతో భోజనము పెట్టి తాంబూలమునిచ్చి ఆయనకు వింజామర విసరుచుండిరి. కృష్ణునకు నెత్తిదువ్వి, శయ్యపై చేరిన తరువాత ఆయన పాదము లొత్తుచు తమకు వేలకొలది దాసీజనమున్నను తామే వారికి సేవచేయు చుండిరి. ఆ పదునారువేల మంది తమలో నిట్లనుకొనుచుండిరి. ప్రియుడు నన్నెప్పుడు విడువడు. రాత్రిళ్ళు, పగళ్ళు నా యొద్దనే యుండును. నన్నే మిక్కిలి మక్కువతో జూచును. నాయింటనే యుండును. అని పతివ్రతా ధర్మమును పాటించుచు భక్తితో శ్రీహరిని సేవించుచుండిరి. శ్రీకృష్ణుని భార్యలు పొర పొచ్చెములు లేకుండ అందరును సంతోషముతో నుండిరి.

రుక్మిణితో విరసములాడుట.

ఒకనాడు శ్రీహరి రుక్మిణీదేవి మందిరమున హంసతూలికా తల్పముపై సుఖాసీనుడై యుంట రుక్మిణీదేవి భక్తితో భర్తకు వింజామరతో వీచుచుండెను. అప్పుడు రుక్మిణితో కృష్ణుడిట్లనెను. నెలతా! బలమునను శౌర్యమునను, భోగమునను, సౌందర్యమునను, కులమునను, త్యాగమునను సద్గుణములందును, దిక్పాలుర కంటె శిశుపాలుడు గొప్పవాడు. నీతల్లిదండ్రులు, అన్నయు నిన్నతని కివ్వ దలచిరి. నీవు వానిని వరింపక, పిఱికి పందలము, సముద్రములో దాగిన వార మైన మమ్మెందుకు వరించితివి. మేము లోకులతో పాటి వారముకాము. రహస్య ముగా నుందుము. బలవంతులు మాపై పగబూనుదురు. మేము రాజులముకాము. మాకు సముద్రమే గతి. మేము పేదవారము మాకు నిధులులేవు మా బంధువులు కూడ పేదవారే. మేము ధనము కూడ బెట్టలేదు. గుణహీనులము. యాచకుల నాశ్రయింతుము. ఇటువంటివారిని స్త్రీలు ప్రేమింపరు. నీవు మమ్మెందుకు ప్రేమించితివి. కులము, రూపము, సంపద అనునవి సమానముగా నుండినచో స్నేహము సంబంధము సరిగా నుండును. సరిగా లేకున్నచో వివాహసంబంధములు తగవు. తగదని తెలిసియు నన్ను కట్టుకొంటివి. యిది మంచిదికాదు. నీకు తగిన రాజశ్రేష్ఠుని నెవ్వనినైన చూచుకొనుము. సాల్వుడు, జరాసంధుడు, శిశుపాలుడు మున్నగువారు నాపై కోపించియుండిరి. నీ అన్నయగు రుక్మి నామ బలవంతుడనని విఱ్ఱవీగుచుండెను. వాని గర్వమును పోగొట్టుటకై నిన్ను పట్టి

తెచ్చితివే కాని నీపై మోహముతో కాని నీయందు కొడుకుల బిడ్డలను కనవలెనని కాదు. అని కృష్ణుడు సూటి పోటుమాటలతో నేను పట్టపురాణినని గర్వించు రుక్మిణి గర్వమును పోగొట్టి యూరకుండెను. అంత మానవతియగు రుక్మిణి ఎన్నడు వినని ములుకులవంటి కృష్ణుని పలుకులను విని బెబ్బులి రొదవిని భయపడిన లేడిపిల్లవలె, నిశ్చేష్టురాలై నేలపై బడెను. అంతకృష్ణుడు వడిగా లేచి యామె శరీరమునకు గంధముపూసి, కన్నీటిని పన్నీటితోగడిగి, చెవులలో కప్పురపు పలుకులనూది, వక్షమున ముత్యాల దండవేసి, నొసట తిలకముదిద్ది, వదలిన పొమ్ముడిలను తొడిగి చామరాకులతో విసరి, పైటను కుచములపై సరిగా కప్పి, మొగము నిమిరి, యామె యలసటను తీర్చిగాఢముగ కౌగిలించుకొనెను. సెంద్రుకల చక్కదిద్దెను. పూలను కొప్పులో పెట్టెను. ఇట్లు రుక్మిణికి శీతలోపచారములచే తియ్యని పలుకులచే యామె నోదార్చెను. అంత రుక్మిణీదేవి శ్రీకృష్ణుని యిట్లు స్తుతించెను.

భక్తలోకవత్సలా! మురహరా! జ్ఞానము, సుఖము, బలము ఐశ్వర్యము శక్తి మొదలుగాగల గుణములుగల నీకు సర్వలోకేశ్వరేశ్వరుడవైన నీకు నేను నిజముగా తగను. దివ్యకళా కౌశలముతో వెలయు నీరూప మెక్కడ నేనెక్కడ నీవు దివ్యమంగళ సుందర శరీరుడవు. నీరూపము అజ్ఞానాంధకారమును పోగొట్టునది. నీ పాదపద్మములందలి మకరందమును నిరంతరము గ్రోలుయోగీంద్రులకు కూడ నీ మార్గము తెలియదు. మనుజపశువులమైన మాకెట్లు తెలియును. నీవు పేదవాడవైనచో బ్రహ్మేంద్రాదులు కూడ నీకు బలినొసంగుదురా నీవు సమస్త పురుషార్థ మయుడవు ఫలస్వరూపివి. నీయందలి ప్రేమాధిక్య మనెడి విజ్ఞాన దీపముచే, సమస్తదోషములనెడి అంధకారమును తొలగించుకొని, వివేకులైన వారు ఇహలోక సౌఖ్యములను విడిచి నీదాసులతో సఖ్యము గోరుదురు. అధికారాంధ కారముతో నున్నవారు నీతత్త్వము తెలియక మూఢులై సంసార చక్రములో తిరుగుచుందురు. నీవు కోపించి చూచినచో బ్రహ్మేంద్రాదులకు, శుభములు పోయి అశుభములు చేకూరును. నీవు మిక్కిలి శక్తిగలవాడవు. సింహము మృగముల పారద్రోలి తన భాగమును గ్రహించునట్లు నీవు సాళ్వాది దుర్మదాంధుల పారద్రోలి శౌర్యముతో నన్ను తెచ్చితివి. నీవు రాజకీటకములకు భయపడినవానివలె, సముద్ర మధ్యమున నుంటివి. ఇదంతయు నీమాయ రాజాధి రాజులైనవారు నీపాదములకు తమ కిరీటమణులచే నీరాజన మొసంగుదురు. జ్ఞానులైనవారు రాజ్యాదులను విడిచి, గాలి, నీరు, ఆకులు ఆహారముగ

నీయందే మనస్సును నిల్పెదరు. స్వామీ! నీ చరణారవిందమకరందాస్వాదన మును అడుసుమ్రొద్దవంటి కామిని జీవచ్ఛవంబైన నరాధముని కోరునా పద్మనాభా! సకల లోకములకు అంతరాత్మవైన నీ పాదపద్మములయందే నామనస్సు భక్తి కలిగియున్నది. నీకు తెలియని దున్నదా? అని రుక్మిణి విన్నవింప శ్రీహరి యాడెనో.

ఉ. నీవు పతివ్రతామణివి నిర్మల ధర్మవివేక శీలవు
ద్భావవు నీ మనోగతులఁ బాయక యెప్పుడు నన్మదీయ సం
సేవయె కాని యన్యము భజింపవు పుట్టిననాటినుండి నీ
భావ మెఱింగి యుండియును బల్కిన తప్పు సహింపుమానినీ!

నా వాక్యములచే నీబుద్ధి చంచలము కాకుండ నాయందు దృఢముగ నున్నది. నీ సౌభాగ్యముచే సంసారివలె నీయందు బద్ధానురాగుడనై మెలగుదును. నేను మోక్షప్రదుడను. అట్టినన్ను గామాతురలైన కాంతలు, దాంపత్య యోగమునకై వ్రతతపో మహిమలచే సేవింతురు. వారు మందభాగ్యలై నరకమును పొందుదురు. అదియంతయు నా మాయా విలాసమే. నీ సమానమైన కాంతయే కాంతలందైన కలదా? నీ సద్గుణంబులకు సంతసింతునని రుక్మిణిని సమ్మానించెను. శ్రీకృష్ణుడు రుక్మిణితో సుద్యానవనముల విహరించుచు మిక్కిలి సంతోషముతో నామె తోడి సౌఖ్యములందేలెను. శ్రీకృష్ణునకు రుక్మిణియందు ప్రద్యుమ్నుడు, చారుదేష్ణుడు, సుదేష్ణుడు, సుచారువు, చారుదేహుడు, చారుగుప్తుడు, భద్రి చారువు, చారుచంద్రుడు, విచారువు, చారువు అనుపదుగురు కొడుకులుదయించెను. అట్లే సత్యభామ జాంబవతి నాగ్నజితి, కాళింది, మాద్రి మిత్రవింద, భద్రలకు వేర్వేరుగ పదుగురేసి, సుందరులు కీర్తివంతులైన కుమారులు కలిగిరి. అట్లే పదాఱువేల రాజకన్యలకు వేర్వేరు పదిమంది చొప్పున కుమారులు కలిగిరి. ఇట్లు శ్రీకృష్ణుని రాచనగరు పిల్ల లెంకిసినట్లు కామరతంపరగా పుత్రపౌత్రాభివృద్ధితో విలసిల్లెను. ఇట్లు యాదవవృష్ణి భోజాంధకాది నామధేయములతో శ్రీహరి వంశము మాట కొకలై వర్ధిల్లెను. ఆ వంశము వందలి బాలురను చదివించుటకు మూడుకోట్ల ఎనుబదె నిమిదివేల మూఱుగురు గురువులుండిరనిన నా విద్యార్థుల సంఖ్య యెంత యుండినదో లెక్కించుటకు బ్రహ్మకైనను శివునకైనను సాధ్యముకాదు. రుక్మిణీ పుత్రుడైన ప్రద్యుమ్నునకు రుక్మి కూతురైన రుక్మవతియందు అనిరుద్ధుడు పుట్టెను. అనగా, విని పరీక్షిత్తు

శుకయోగితో- "యోగీంద్రా! కృష్ణునిచే నింతకుముందవమానింపబడిన రుక్మి కృష్ణుని గెలువ జూచుచుండెను కదా? ఆ రుక్మి తన కూతురిని అనిరుద్ధున కెట్లిచ్చెనో తెలుపు"మనెను. అంత శుకయోగి యిట్లనెను :

"రాజేంద్రా! నీవు చెప్పినట్లు రుక్మి కృష్ణునిచే పొందిన యవమానమునకు లోలోనమండుచుండినను చెల్లెలిమీది ప్రేమతో మేనల్లుడైన ప్రద్యుమ్నునకు తన కుమార్తె నిచ్చి వివాహము చేసెను. రుక్మి తన కూతురైన రుక్మవతీ స్వయంవరమును చాటించి, రాజులందరికి వర్తమానము పంపెను. యదుసింహ కిశోరుడగు ప్రద్యుమ్నుడు సైన్యముతో కలిసి దివ్యవస్త్ర మాల్యాభరణముల ధరించి రథమునెక్కి రుక్మి పట్టణమునకు వచ్చెను. వచ్చి నానాదేశ రాజకుమారులను తన బాణములచే పారద్రోలి రుక్మవతిని చేపట్టెను. ప్రద్యుమ్నునకు భీష్మకుడు తన మనుమరాలినిచ్చి పెండ్లిచేయు సందర్భమున విదర్భకు రుక్మిణీ కృష్ణులు, బలరాముడు, ప్రద్యుమ్నుడు, శత్రుగర్వమును నిర్మూలించు సాంబుడు మొదలగు రాజకుమార బృందము చతురంగబలముతో వచ్చి పెండ్లి వేడుకలు వైభవముతో గడిపిరి. అందొకనాడు యదుకుమారులు బలశౌర్యములతో శోభిల్లుటను చూచి కొందరు రాజులు ఓర్వలేకుండిరి. కళింగరాజు రుక్మితో నిట్లనెను : "రుక్మీ! యాదవులపై పగదీర్చుకొనుటకు నీకిదే తగిన సమయము. బలరామునకు జూదమనినచో ప్రీతి హెచ్చు కాని జూదములో నతనికి నేర్పులేదు. నీవతనిని గెల్చి నీ యవమానమును తీర్చుకొనుము" అని పురికొల్పెను. దైవవిధిని దాట శక్యము కాదుకదా!

కళింగరాజుచే ప్రేరేపింపబడిన రుక్మి బలరాముని వద్దకు వచ్చి- "రామా! నీవు జూదమాడుటలో నేర్పరివని వింటిని. పొద్దుపోవుటలేదు. కొంతసొమ్ము పందెముగ పెట్టుకొని జూదమాడుదము రమ్మ"ని పిలిచెను. బలరాముడు సరేయని రుక్మితో జూదమాడుచుండగా ఒక్కొక్క పందెమునకు పది, యిరువది, నూఱు, వేయి, పదివేలు ఒడ్డుచు జూదమాడెను. ఆడిన ప్రతియాటలో రుక్మి గెల్చుచుండెను. బలరాముడు ఓడిపోవుచుండెను. కాని పట్టుదలచే జూదమాడుటకు వెనుదీయలేదు. అంత కళింగరాజు తక్కిన రాజులు సంతసించునట్లు బలరాము డోడిపోయెనని, దంతములు కనబడునట్లు విరగబడి నవ్వెను. అంత బలరాముడు కోపించి, లక్ష పందెముగా పెట్టి జూదమాడి గెల్చెను. కాని నేనే గెల్చితినని రుక్మి అబద్ధము పలికెను. బలరాముడు తక్కిన రాజులను చూచి, "మీరు జయమెవరిదో నిజము

చెప్పు"డని అడిగెను. కాని, రుక్మియందు పక్షపాతము గల్గిన ఆ రాజులలో ఎవడును రుక్మి యోడింపబడెనని చెప్పలేక యూరకుండిరి. అంత బలరాముడు మునుపటివలెనే లక్షపందెము పెట్టి తిరిగి గెల్చెను. ఈ గెలుపు వాదియాలేక రుక్మిరా! మీరు చెప్పుడని యడుగగా, అశరీరవాణి బలరాముడు గెల్చెను. రుక్మి ఓడెను. అని చెప్పగా అచ్చటి జనులు ఆశ్చర్యపడిరి. రుక్మి మొండితనముతో నేనే గెల్చితిని, నేనే గెల్చితినని, వ్యర్థముగా ప్రేలుచున్నావు. అక్ష విద్యలో నైపుణ్యముగల రాజకుమారులకు పసులకాపరులు సమానులౌదురా? అని క్రొవ్వుతో కన్నుమిన్ను గానక పలికెను. అంత బలరాముడు తోకత్రొక్కిన త్రాచువలె, కట్లు దెబ్బతినిన బెబ్బులివలె హుమ్మని లేచిపోంచి, పరిఘ నందుకొని రుక్మిని, వాని పక్షమువారిని చావమోది, తనను పరిహాసించిన కళింగరాజు తలను వంచి, దంతము లూడివచ్చునట్లు ముఖమున తన్నెను. అంతటితో పోక, రుక్మి పండ్లె మూడబెరికి, వానిదేహమును బ్రద్దలు చేయగా రుక్మి యమపురికి పోయెను.

పిమ్మట యాదవు లుత్సాహముతో విదర్భనుండి బయలుదేరి కుశస్థలిని చేరి యా పట్టణ సమీపమున విశ్రమించి, పిమ్మట పురమున ప్రవేశించిరి. ఇట్లు ప్రద్యుమ్నుడు రుక్మకాంతిని పరిణయము చేసికొనిన పిమ్మట కృతవర్మని కుమారుడు సర్వాలంకార శోభితయు, పద్మముఖియు, సజ్జనమాన్యయగు రుక్మి పుత్రియు నగు చారుమతిని వరించెను."

బాణాసురుడు ఈశ్వర ప్రసాదమును పొందుట.

శుకయోగి పరీక్షిత్తున కిట్లనెను: "పుణ్యశీలా! బలిచక్రవర్తికి నూరుగురు కుమారులు గలరు. వారిలో పెద్దవాడు బాణుడు. అతడు శత్రుభయంకరుడు, కీర్తిశాలి, శివపూజాపరతుడు. శత్రువులనెడి చీకటికి సూర్యుడు. బాణాసురుడు దేవతలను జయించి, భక్తలోక రక్షకుడు, ప్రమథగణముతో కూడినవాడును, తాండవమును గావించు శివునిగాంచి, భక్తితో సాష్టాంగ ప్రణామము చేసి, సంతోషముతో తన వేయి చేతులచే వేయి విధముల మృదంగము వాయించి సంతోషమును కలిగించెను. అంత శివునకు నమస్కరించి యిట్లు నుతించెను:

ఉ. శంకర! భక్తమానసవ శంకర! దుష్టసురా సురేంద్రజా
శంకర! పాండుసీలరుచి శంకరవర్ణ విరాంగభోగిరా
ట్కంకణ! పార్వతీహృదయ కైరవకైరవమిత్ర! యోగిహృ
త్పంకజ పంకజాప్త నిజతాండవఖేలన! భక్తపాలనా!

దేవా! నీవు పార్వతితో నా పట్టణపు కోటవాకిట కావలియుండి, నన్ను దయతో కాపాడుచుండుము. భక్తఫలప్రదా! నీ పాదపద్మములనే నెల్లప్పుడును ఆశ్రయించెదను. అని ప్రార్థింపగా భక్తవత్సలుడైన త్రిపురాంతకుడు పార్వతీ సమేతుడై కారక, అంతక మొదలగు భూతగణములతో బాణునకు రాజధాని యగు శోణపుర ద్వారమున కావలా కాయుచుండెను. ఒకనాడు బాణుడు తన మణికిరీటము శంకరుని పాదము సోకునట్లు మ్రొక్కి యా పరమేశ్వరుని యిట్లు పలికెను :

సీ॥ దేవ! జగన్నాథ దేవేంద్ర వందిత
వితతచారిత్ర! సంతత పవిత్ర
హాలాహలాహార! యహిరాజ కేయూర
బాలేందుభూష! సద్భక్తపోష!
సర్వలోకాతీత సద్గుణసంఘాత
పార్వతీ హృదయేశ భవవినాశ
రజతాచలస్థాన గజచర్మపరిధాన
సురవైరి విధ్వస్త శూలహస్త
తే॥ లోకనాయక సద్భక్త లోకవరద
సురుచిరాకార మునిజనస్తుత విహార
భక్తజన మందిరాంగణ పారిజాత
నిన్ను నెవ్వఁడు మఱిసేయనేర్చు నభవ!

అని మహేశ్వరుని ప్రార్థించి, "స్వామీ! ఉమానాయకా! శూరా! ఈ భూలోకమునందు నన్నెదిరించి బాహుబలము విలసిల్లగా రణరంగమున పోరాడగల వీరుడొకడైనను నాకు కన్పించుటలేదు. నా వేయిచేతుల దురద తొలగించుటకుపాయములేదు. ఈ దురదను నేనెట్లు సహింపగలను. అరివీర భయంకరముగ యుద్ధము చేయని యీ నా కరములు నాకు మిక్కిలి దుఃఖకరములైనవి. కావున నా బాహుగర్వ పరాక్రమము చూపెడి ఆటకు నా యెదుట నిలువగల బలశాలి నీవు తప్ప మఱియెవ్వడును లేడు." అనగా విని, ఫాలాక్షుడు మనస్సున మండిపడి పైకి కోపమును ప్రకటింపక యిట్లనెను : "ఓ మూర్ఖుడా! నీ పతాకము కారణము లేకుండ నేలపై నెన్నడు కూలునో అపుడే నీ వేయి చేతులు తెగునట్లుగా, నా యంతటివానితో నీకు యుద్ధము జరుగును." అని పలుకగా

తన కోరిక నెరవేరును కదాయను సంతోషముతో బాణుడు తన భవనమునకు పోయి తన భార్యలతో క్రీడించుచు తన పతాకమెన్నడు పడిపోవునాయని యెదురు చూచుచుండెను.

వేయి చేతులుగల ఆ బాణాసురునకు ఉషయను బిడ్డ కలదు. ఆమె నిర్మలమైన చిత్తము కలది. సౌందర్య సౌకుమార్యములందు ప్రసిద్ధికెక్కినది. మన్మథుని యాఁవబాణమువలె వెలుగుచుండినది. ఆమె ముఖము చంద్రబింబమువలెను, కన్నులు కమలములవలెను, కొప్పు తుమ్మెదల బారువలెను నుండెను. ఒకనాడు ఉషాకన్య, తన మేడలో మెత్తని పాన్పుపై పరుండి, ఎన్నడును చెవులతో విన బడనివాడు, కన్నులతో చూడబడనివాడును, సాటిలేని రూపరేఖా విలాసములు గల అనిరుద్ధునితో సంగమించినటుల కలఁగనెను. ఉష మేలుకొని కల నిజమను కొని కన్నులనుండి ఆనందబాష్పములు రాలగా, సౌందర్యముచే వొప్పు అతని రూపమే తన కనులయెదుట కనిపించునట్లు తోచగా కలవరపడి యతని కౌగి లింపవలెనని తన చేతుల పట్టి బయల చాపుచు, అతనితో రతికేళిలో తేలినట్లు తలంచుచు సిగ్గు, మోహము, భయము మూడును కలుగగా పరవశయైయుండెను. ఆమె విరహవేదనతోనుండి తన చెలుల యెదుట తన వికారములు కనిపించకుండ ముఖమడ్డము త్రిప్పుకొనియుండెను. ఆ ఉషకు బాణాసురుని మంత్రి బిడ్డయగు చిత్రరేఖ ప్రాణసఖిగా నుండెను.

ఆమె తన ప్రియుని బయట వెదకుచున్నదానివలెను, తనప్రియుడు తన్నువిడిచి పోగా విరహవేదన ననుభవించుదానివలెను, చేతికి చిక్కిన వానిని పోగొట్టుకొని నటులనున్న ఉషాకన్యను చూచి, పరీక్షించి "నాకంటె నీకు ఆప్తురాలెవరమ్మా! నీవు చూడగా యెట్లో ఉన్నావు. నీ కోరిక యేదో నాతో చెప్పు"మని పలికెను. అంత ఉషాకన్య తనకు వచ్చిన కలనుగూర్చి తెల్పెను. విరహాగ్నిచే మాడుచు, కన్నీరు మున్నీరుగా నేడ్చుచు తలవంచియున్న ఉషాకన్యను చూచి చిత్రరేఖ యిట్లనెను :

"ఓ పద్మాక్షి! దీనికై నీవింత చింతింపవలెనా? నేను నా చాతుర్యమంతయు జూపి దేవ, మానవ, యక్ష, కిన్నర, నాగ, సిద్ధ, సాధ్యులలో ముఖ్యులైన వారిని చిత్రపటమున లిఖింతును, వారిలో నీ మనోహరుడు ఎవడో నీవు చూపి నతో వెంటనే యతనిని తెచ్చి నీ కప్పగించెదను." అని చెప్పి, తెల్లగా మెఱయు చున్న పటములో పంచవర్ణములతో కుంచికచే మూడు లోకములందు ప్రసిద్ధ

కంటినవారు సుందరాంగులైన ప్రధాన పురుషుల చిత్రముల చిత్రించి, కులము, గోత్రము, పేరు అన్నియు వ్రాసి, యా చిత్రపటమును తెచ్చి, ఉష యెదుట పెట్టి. తాను చిత్రించిన కిన్నర, కింపురుష, గంధర్వ, సిద్ధ, సాధ్య, రాక్షస, నాగాదులైన వారిని వేఱువేఱ చూపెను. ఉషాకన్య వారిలో తన ప్రాణవల్లభుడు లేడనెను.

అంత చిత్రరేఖ మాళవ, కొంకణ, ద్రవిడ, మత్స్య, పుళింద, కళింగ, భోజ, నేపాళ, విదేహ, పాండ్య, కురు, బర్బర, సింధు, యుగంధర, ఆంధ్ర, వంగ, కరూశ, చేంకణ, త్రిగర్త, సురేష్ణ, మరాట, లాట, పాంచాల, నిషాద, ఘూర్జర, సాళ్వ రాజులను చూపెను. పిమ్మట చిత్రరేఖ జరాసంధ, శాళింగ, భగదత్త పౌండ్రకులను, పంచపాండవులను, ధృతరాష్ట్ర నందనులను, శూరసేన, వసుదేవ ఉద్ధవాదులను, బలరామ శ్రీకృష్ణులను, ప్రద్యుమ్నుని జూపించి, వారివారి గుణ బల శౌర్యాదులను వర్ణించి చెప్పెను. ఉషాకన్య అనిరుద్ధుని చిత్రమును చూచి, "సఖీ! నా మానధనమంతయును హరించిన యీ దొంగను పంతముతో చిత్రీకరించిన నీ నేర్పు నాకు కొనియాడుటకు శక్యమా! ఈ మహావీరుని కుల పౌరుషాదులను గూర్చి చెప్పు"మనగా చిత్రరేఖ అనిరుద్ధుని చిత్రమును జూపుచు నిట్లనెను: "సఖీ! ఈ కుమారుడు యాదవ వంశజలధికి పూర్ణచంద్రుడు. శ్రీకృష్ణుని కొడుకుకొడుకు మిక్కిలి సుందరుడు, ఉదార చరితుడు, శత్రుసైన్య మనెడి చీకటికి సూర్యుని వంటివాడు. ఇతని పేరు అనిరుద్ధుడు." అని చెప్పి నే నితనిని వెంటనే యిటకు తెత్తును. సంశయము వల దని, యా క్షణముననే ఆకాశమార్గముగుండ ద్వారకకు పోయి, సువర్ణ కలశములచే నొప్పు మేడపై మణిదీపములు వెలుగుచుండ చంద్రకాంత శిలాభవనమున, చంద్రకిరణములను పరిహసించు హంసతూలికా తల్పమున, రతిశ్రమాలసుడై నిద్రించుచున్న అనిరుద్ధుని సమీపించి, తన యోగవిద్యా మహిమచే నతని నెత్తుకొని మనోవేగమున, బాణ రాజధానియగు శోణపురమునకు పోయి ఉషాసుందరి తల్పమున నుంచి యిట్లనియె:

"వనజాక్షీ! మేరుధీరుడు, శూరుడు, అభినవమారుడు, సముద్ర గంభీరుడు, ఉదారుడును దనుజారి వీరుడగు నీ విభుడవగు అనిరుద్ధకుమారుని జూడు" మనెను. అంత ఉషాకాంత చిత్రరేఖతో- "సఖీ! నీ స్నేహమను నావచే వియోగమను సముద్రమును దాటితిని. నీ చెలిమియనెడి యమృతవర్షముచే

మన్మథ తాపమును చల్లార్చుకొన గల్గితిని. నీవు నాకు కలలో తోచిన రూపము వ్రాసి, కొనినంతనే తెచ్చి యిచ్చువారు కలరా? నీవు నీళ్ళలో జాడ పుట్టించు నేర్పరివి. యిట్టి నేర్పు ముల్లోకములందు నీకు తప్ప మఱెవ్వరికిని లేదు." అని ప్రశంసించి చిత్రరేఖను భవనమునకు పంపెను. అంత నెవ్వరికిని ప్రవేశింపరాని యంతఃపుర సౌధమధ్యమున అనిరుద్ధుడు మేల్కొని, కౌగి లింతలచేతను, సరసభావములచేతను, సరసాలాపములచేతను, కళాచాతుర్యము చేతను ఉషాకాంతను పొందెను. ఈ విధముగ ఉషానిరుద్ధులు నిరంతరము క్రీడ లలో తేలియాడుచు, ఉదయాస్తమయములను తెలియక ప్రాణములొకటై భోగసౌఖ్యము ననుభవించుచుండిరి. అంత ఉషాకాంత గర్భవతి యయ్యెను. అంతః పుర కావలివారు బాణునకీ విషయము విన్నవింపగా బాణుడు మండిపడుచు, తీక్షమైన కరవాలము చేతబట్టి కన్యాంతఃపురమునకు పోయెను.

అనిరుద్ధుడు నాగపాశ బద్ధుడగుట.

దివ్యసుందర విగ్రహుడు, ఆజానుబాహుడు, మకరకుండలములచే రాణిల్లు కర్ణ ములు కలవాడును, మిక్కిలి కాంతిగలవాడును, పట్టుపుట్టము ధరించినవాడును, చంద్రునివంటి లావణ్యము కలవాడును, హారములతో రాణిల్లు వక్షస్థలము కల వాడును, కమలములవంటి కన్నులు కలవాడును, యదువంశ దీపకుడును, నల్లని కురులు కలవాడును, నవమన్మథునివంటి వాడును, ప్రతాపము కలవాడును, మహితగుణములు కలవాడును, మన్మథ మంత్రసిద్ధుడును, చతురుడును, ఉషా క్రీడారతుడైన అనిరుద్ధకుమారుని గాంచెను. అతనిని చూడగనే బాణుడు కోప ముతో ఈ నరాధముని బంధింపుడు, కొట్టుడని యాజ్ఞాపించెను. బాణాసురుని భటులు విచ్చుకత్తుల పట్టుకొని సమీపించగనే అనిరుద్ధుడు పరిఘము చేతబట్టి ప్రళయకాల భైరవునివలె విజృంభించి రాక్షస సమూహము నెదిరించి బలమును, ధైర్యమును జూపుచు వారి కాళ్ళు, చేతులు, తలలు, పక్కలు, చెక్కులు, మోకాళ్ళు, దంతములు, చెవులు, మెడలు, బొమ్ములు, వీపులు, తొడలు ముక్కలు ముక్కలై రాక్షసులు నేలకొరిగిరి. మిగిలిన కొందఱు పారిపోయిరి. ఇట్లు బాణాసురుని సైన్యము భయపడి పాఱి, వచ్చి, చచ్చి, కలతచెంది, నలిగి, విఱిగి, తన చాటునకు రాగా బాణుడు అనిరుద్ధుని సమీపించి యతనిపై బాణ ములవేసి, శూలముల విసరి, కుంతముల పొడిచి యతనిని నాగపాశములచే బంధి తుని గావించెను. ఉషాదేవి దుఃఖపడుచుండెను. నల్లనివస్త్రము గలిగినదియు

విశాలమైన బాణుని కేతనము గాలితాకిడిచే, భయంకర ధ్వనితో నేలపై పడెను. బాణుడు దానిని జూచి, శంకరుడు చెప్పినట్లు తనకు యుద్ధము చేయు అవకాశ మెప్పుడు కలుగునాయని దానికై సంతోషముతో నెదురు చూచుచుండెను.

అక్కడ ద్వారకాపురమునందు అనిరుద్ధుడు కనబడకపోవుటచే యాదవులు భయపడి, ఏ వార్తయు తెలియనందున తల్లడిల్లుచుండిరి.

శ్రీకృష్ణుడు బాణునిపై దండెత్తుట.

నారదుడు ద్వారకకు వచ్చెను. యదువృష్ణి, భోజాంధక వీరులు గొలుచుచుండ కొలువుకూటముననున్న శ్రీకృష్ణుడు నారదున కెదురుగా పోయి, అర్ఘ్యపాద్యాదులచే పూజించి, సువర్ణాసనమున నుపవిష్టుని చేసెను. అంత నారదుడు శ్రీకృష్ణుని ప్రశంసించి, యనిరుద్ధుని వృత్తాంతమంతయు తెలిపి శ్రీకృష్ణుని యనుమతిపై వెళ్ళిపోయెను. అంత శ్రీకృష్ణుడు శుభముహూర్తమున దండయాత్రకు బయలుదేరి ప్రయాణభేరి వేయించి, సైన్యములు బయలుదేరగా, తాను వివిధ భూషణములను ధరించి చేతులలో గదా, శంఖ చక్రములు వెలుగొంద ఉరమున కౌస్తుభమణి ప్రకాశింపగా పీతాంబరమును కాసె చుట్టుతో రింగులుగాగట్టి శైబ్య, సుగ్రీవ, మేఘపుష్ప వలాహకములనెడి గుఱ్ఱములను కట్టిన రథమును సిద్ధముచేసి దారుకుడు తేగా సంతోషముతో సూర్యుడుదయ పర్వతము నెక్కినట్లు తాను రథము నధిరోహించెను. అంత శ్రీకృష్ణుని బ్రాహ్మణులు ఆశీర్వదించిరి. పుణ్యస్త్రీలు శ్రీకృష్ణుని శిరముపై శుభాక్షతలను చల్లిరి. మాగధులు స్తుతించిరి. వందిజనులు కీర్తించిరి. పాఠకులు మధురముగ పఠించిరి. ఇట్లు కృష్ణుడు వికసితహృదయుడై వెడలుచుండెను.

బలరాముడు, సాత్యకి, ప్రద్యుమ్నుడు మొదలగు యదువృష్ణి భోజాంధక వీరులు మహాబలశాలురు చతురంగబలములతో భేరీఝాంకారములు మ్రోగుచుండ పండ్రెండ క్షౌహిణులతో శ్రీకృష్ణుని రథమువెంట బయలుదేరిరి. వారు శోణపురముచేరి నదులు, తోటలు, సరోవరములు, యజ్ఞస్థానములు మున్నగువానిని చూచి వలయముగూర్చి యంత్రముల పెట్టుబెట్టి, కోటలగూర్చి గోపురముల పడద్రోసి. మేడలగూల్చి ప్రాకారముల నేలపై పడగొట్టి తలుపుల విఱిచి యనేక విధముల చీకాకుపఱచి, పట్టణము నడ్డగించి సింహనాదముల గావింపగా చూచి బాణుడు భయంకరమూర్తియై యుద్ధసన్నాహముచే విజృంభించి యుద్ధకే

వేయింపగా భూమి కంపించెను. సముద్రములు కలగుండువడెను. చుక్కలు రాలెను. మేఘములు తూలెను. గిరులు గిరగిర తిరిగెను. దేవతల గుండెలవిసెను. సూర్యచంద్రుల గతులు తప్పెను. బాణాసురుడు వివిధభూషణములదాల్చి కవచ, శిరస్త్రాణముల ధరించి, శరశరాసన, శక్తి, ప్రాస, తోమర, గదా, కుంత, ముసల, ముద్గర, భిండిపాల, పట్టిస, శూల, ఛురికా, పరశు, పరిఘాదులను, ఖడ్గములను ధరించి, అస్త్రశస్త్రకాంతులు దేవతల కనులకు మిఱుమిట్లు గొలుపగా, మేరుపర్వత శిఖరమువంటి రథమునెక్కి పండ్రెండ క్షౌహిణులు తనకు రెండువైపుల నడువ ప్రతాపము దీపింపగా బయలుదేరెను.

బాణునకు సహాయముగ శివుడు వచ్చుట.

బాణాసురుని తన పుత్రులకంటెను వాత్సల్యముతో జూచు భక్తవత్సలుడైన హరుడు తాను యుద్ధము చేయవలెనని వేడుకతో ప్రమథగణములు, కుమారస్వామి, భూతకోటియు తన్ను సేవింపగా, దశదిశలు వ్యాకులతను పొంద, వృషభారూఢుడై బయలుదేరెను.

బ్రహ్మేంద్రాది దేవతలు యుద్ధమును చూడగా విమానారూఢులై ఆకాశమున నిలిచిరి. శివుడు-కృష్ణుడు, ప్రద్యుమ్నుడు-కుమారస్వామి, కూపకర్ణ, కుంభాండులు-బలరాముడు, బాణుని కుమారుడగు బలుడు-సాంబుడు, సాత్యకి-బాణుడు పరస్పరము పోరాడజొచ్చిరి. రథికులు రథికులతో, అశ్వికులాశ్వికులతో, గజారోహకులు-గజారోహకులతో, పదాతులు-పదాతులతో పోరాడుచుండిరి. సింహనాద, హుంకారములతో, ధనుష్టంకార, గజ ఘీంకారములతో, అశ్వముల హేషారవములతో పటహకాహళాదుల ఘోషములతో బ్రహ్మాండము బ్రద్దలగుచుండెను.

అంత శ్రీకృష్ణుడు సింహనాదము గావించి, తన శార్ఙ్గచాపమునుండి విడిచిన బాణములతో యుద్ధవీరులైన బాణ సైన్యమునందలి ప్రముఖులైన యక్ష, ప్రమథ, భూత, పిశాచ, డాకినీ యోధులను నొప్పింపగా వారు చిత్తరపోయి చెల్లాచెదరై పాఱిపోయిరి. అంత శ్రీకృష్ణుని బాహుబల విజృంభణకు సహింపక ఫాలాక్షుడు అగ్నికణముల గురియు వాడి బాణములను కృష్ణునిపై ప్రయోగింపగా కృష్ణుడు వానినన్నింటిని తన బాణములచే పొడిచేయగా హరుడు కోపించి హరిపై బ్రహ్మాస్త్రమును ప్రయోగించెను. హరి దానిని బ్రహ్మాస్త్రము చేతనే మరలించెను. అంత హరుడు వాయవ్యాస్త్రమును హరిపై ప్రయోగింప హరి దానిని పార్వతాస్త్రముచే హరింపజేసెను. హరుడు ఆగ్నే

యాస్త్రమును ప్రయోగింప హరి ఐంద్రాస్త్రముచే దానిని రూపుమాపెను. అంత హరుడు కోపించి పాశుపతాస్త్రమును హరిపై వేయగా, పద్మనాభుడు లోక భయంకరమైన నారాయణాస్త్రముతో దానిని మరలించెను. ఇట్లు శ్రీహరి త్రిపురారి శరముల నన్నిటిని రూపుమాపగా హరుడు నిరుత్సాహముతో నుండ నతనిపై సమ్మోహనాస్త్రమును హరి ప్రయోగించెను. ఆ యస్త్రము సోకి నంతనే శంభుడు మూర్ఛచెంది తన ఎద్దుమూపుపై సోలిపోయెను. అంత హరి శత్రుసైన్యముల బాణపరంపరల ఖండించియు, ఖడ్గంబుల ముక్కలు చేసియు, గదలను తుంపులు చేసియు, పీనుగులపెంటల గావించెను. అంత ప్రద్యుమ్నుడు కుమారస్వామిపై వాడియైన బాణముల నతని శరీరమున గుచ్చగా కుమారుడు గాయపడి నెత్తుట తడిసి ముద్దయై నెమలినెక్కి పారిపోయెను. సాంబుని ధాటి కాగలేక బాణాసురుని కుమారుడు యుద్ధరంగము వీడి పడిపడిగా పరుగెత్తెను. బలరాముని రోకటిపోటులతో కుంభాండక కూపకర్ణులు తలలు పగిలి, కొవ్వు వెలిరాగా చెవులనుండి నోటినుండి రక్తము గ్రక్కుకొనుచు చచ్చిరి. ఇట్లు బాణసైన్యము అనాథమయి చెడి విఱిగిపాఱిపోగా బాణుడు విజృంభించి చేయి వీచి తన సైన్యమును మరల యుద్ధమునకు పురికొల్పెను. అంత యుద్ధము మహా భయంకరమై సాగెను. అందు యోధులు ఒకరినొకరు కుఠారములతో పొడిచియు, సురియల గ్రుమ్మియు, శూలంబుల చిమ్మియు, శక్తులనొంచియు, ముసలంబుల మొత్తియు, ముద్గరంబుల కొట్టియు, కుంతంబుల గ్రుచ్చియు, కరవాలంబుల వ్రేసియు, కాళ్ళు, చేతులు, నడుములు, తలలు, పిక్కలు, పక్కలు, చెక్కులు ముక్కలు ముక్కలుగా చేసిరి. ఆ యుద్ధరంగము రక్తనదమువలె శోభిల్లెను. అప్పుడు బాణుడు మిగుల కోపించి బాహు సహస్ర దుర్వార గర్వాటోపుడై కృష్ణునివైపు తన రథమును నడిపించి, ఐదునూర్ల చేతులతో విల్లులనుబట్టి, తక్కిన ఐదునూర్ల చేతులలో నొక్కొక్క దానియందు రెండేసి బాణములను గూర్చులోపలనే శ్రీకృష్ణుడు నందక ఖడ్గముచే బాణుని విల్లుల నన్నిటిని ధ్వంసముచేసి, సారథిని గూలనేసి, రథమును శకలముగావించి ప్రళయ కాలమునందు మేఘములు గర్జించునట్లు తన పాంచజన్య శంఖమును పూరించెను. ఆ శ్రీహరి యత్యద్భుతాలోక పరాక్రమంబునకు భయపడి బాణుడు విషాదమును పొందెను. అంత బాణుని తల్లియగు కోటరి తన కుమారుని రక్షింపదలచి వెంట్రుకలు వ్రేలాడ, చీరె యూడిపోగా, కృష్ణుని యెదుట నిలువగా శ్రీహరి చూడజాలక మొగమావలకు త్రిప్పెను. అంతలో తల్లడిల్లుచు

బాణుడు తన పురమునకు పారిపోయెను. అదిచూచి యాదవులు నవ్విరి. భూతగణము లెక్కడికో పారిపోయెను. అంత భయంకరములైన మూడు తలలతో నుండుచు మహేశజ్వరము రాగా కృష్ణుడు దానిని చూచి నవ్వుచు వైష్ణవ జ్వరమును పంపగా ఆ శైవ వైష్ణవ జ్వరములు రెండును బలముతో, శక్తితో ఘోరముగ పోరాడినవి. ఉగ్రమైన వైష్ణవజ్వరమునకు శైవజ్వర మోడి పారి పోవుచుండగా వైష్ణవజ్వరము దానివెంటబడెను. అంత తన కెక్కడను దిక్కు లేకపోవుటచే శైవజ్వరము ప్రాణభీతితో నేడ్చుచు శ్రీకృష్ణుని పాదకమలముల పైబడి యిట్లు నుతించెను :

సీ॥ అవ్యయు ననఘు ననంతశక్తిని బరు
లైనట్టి బ్రహ్మరుద్రామరేశ
వరుల కీశ్వరులైన వాని సర్వాత్మకు
జ్ఞాన స్వరూపు సమాన రహితు
వరదుని జగదుద్భవస్థితి సంహార
హేతుభూతుని వ్యాప్తి కేతునభవు
బ్రహ్మాదిబ్రహ్మంబులై పరగు సుజ్ఞాన శ
క్త్యాదుల నొప్పు బ్రహ్మంబు నీవు
ఆ॥ నజుషడూర్మి రహితు నిజయోగ మాయావి
మోహితాఖిలాత్మ ముఖ్య చరితు
మహితతేజు నాదిమధ్యాంత హీనుని
చిన్మయాత్ము నిను భజింతు కృష్ణ.

నేను నిన్ను శరణంబు వేడెద. శాంతమై, సుతీక్ష్ణ మదుస్సహంబై ఉదారమైన వెలుగొందు నీ తేజముచే నేను మిక్కిలి సంతాపమును పొందితిని. ఇతర దేవతలనుపాసించుటమాని నీ పాదపద్మములను సేవింపవలెననెడి నిర్మలబుద్ధి యెంత దనుక కలుగదో అంతవరకే ప్రాణులు తాపమును పొందును. అన్యథాశరణము లేనివారిని రక్షించువాడవని నీకు బిరుదు గలదు. నన్ను రక్షించుట నీకొక లెక్కయా ? సంసార భయనివారా ! భక్తజనపోష పరితోషా ! పరమపురుషా ! నన్ను కాపాడుమని ప్రార్థించెను. అంత కృష్ణుడు నీకింక భీతాపము వలదు. ఈ ఉభయజ్వర వివాదమును నీవు నా ప్రవృత్తిని పొందుటను మనస్సులలో తలంచు పుణ్యాత్ములను శీతోష్ణ జ్వరాదిరోగంబులు కలుగవని యనుగ్రహించి పంపెను.

బాణాసురుడు తిరిగి యుద్ధము సేయవచ్చుట.

అంత బాణాసురుడు వేలకొలది చిఱుగజ్జెల ఘంటల ఘణఘణ ధ్వనిచేత ఆకాశము పగులగా, బంగారు ధ్వజముల పతాకములు వెలుగగా, చక్రపుటంచులచే భూమి కంపింపగా, పడిగెల గుఱ్ఱముల పూన్చిన ఎత్తైన రథమునెక్కి తన వేయి చేతులలో ఖడ్గములు, బాణములు, విల్లులను బూని యుత్సాహముతో యుద్ధము చేయుటకై పట్టణము వెడలెను. యుద్ధభూమియందు మధ్యందిన మార్తాండుని వలె వెలుగుచు, శత్రువనములనెడి కట్టెలకు కార్చిచ్చువంటి శ్రీకృష్ణుని బాణు డెదుర్కొనెను. బాణుడు తన వేయి చేతులతో భయంకరములైన ఆయుధములు శ్రీకృష్ణునిపై ప్రయోగింపగా హరి అర్ధచంద్ర బాణములచే బాణుని యాయుధముల మధ్యలోనే తుంచివేసి, శ్రీకృష్ణుడు కోపముతో బాణునిపైకి చక్రిమును పంపగా, ఆ చక్రము తోటమాలి అరటి స్తంభముల నరికినట్లు మదపు టేనుగుల తొండములవలెనున్న బాణుని బాహుసహస్రమును నాలుగుమాత్రము మిగిలించి ఖండించుచుండెను.

శివుడు బాణుని రక్షించుటకై కృష్ణుని స్తుతించుట.

శంకరుడు బాణునిపై దయగలవాడు కావున శ్రీకృష్ణుని సమీపించి, పురుష సూక్తమును పఠించి, చేతుల జోడించి శ్రీకృష్ణుని యిట్లు స్తుతించెను : "దేవా ! నీవు జ్యోతిర్మయుండవు, బ్రహ్మస్వరూపుడవు, సమస్త వేదవేదాంతములందు నిగూఢుడవు, సర్వవ్యాపకుడవు. నీ దివ్యావతారవైభవమును తెలిసికొని ప్రశంసింప మేమెంతవారము. నీవు సమస్త చరాచరముల కారార్యుడవు, అద్వితీయుడవు, పురాణపురుషుడవు. నీ వేకరూపుడవయ్యును బహురూపుడవు. నీవు గుణవంతులైన సజ్జనులకు దీపరూపంబున ప్రకాశించుచుందువు. అవ్యయుడవు, అనంతుడవు, అచ్యుతుడవు, ఆదిమధ్యాంత రహితుడవు. సమస్తము నీయందే యుండును." అని స్తుతింపగా శ్రీకృష్ణుడు సంతసించి, చిఱునగవు నవ్వి—

"శంకరా ! నీ కేది యిష్టమో కోరుకొనుము నీకిత్తును. ఈ బాణుడు నాకు వధింపదగినవాడు కాడు. కారణమేమనగా నాకు పరమ భక్తుడైన ప్రహ్లాదుని వంశమున జన్మించిన వారిని నేను చంపనని ప్రహ్లాదునకు మాట యిచ్చితిని. భూమికి భారముగానున్న రాక్షసుల గర్వము నణచవలెను గాన వీని నాలుగు చేతులు మాత్రముంచి తక్కినవి ఖండించితిని. ఇతడు నీ భక్తులలో మేటి కావున

నితడింకమీదట జరామరణ భయములు లేకుండ వెలయగలడు." అని యాన తిచ్చిన పరమేశ్వరుడు సంతుష్టుడై వెడలిపోయెను. బాణుడు పరిశుద్ధుడై బాహు గర్వమణగి, శ్రీకృష్ణు డిచ్చిన వరమునకు సంతసించి గోవిందుని చరణారవింద ములకు నమస్కరించెను.

ఉషానిరుద్ధులతో కృష్ణుడు ద్వారక కేగుట.

బాణాసురుడు పురమునకుపోయి, ఉషానిరుద్ధులకు వస్త్రభూషణాలంకారము లను, దాసదాసీజనమును శ్రేష్ఠములైన వస్తువుల నిచ్చి, వారిని తన రథముపై నాసీనులను గావించి, మిక్కిలి వైభవముతో కన్యకలతోపాటు అనిరుద్ధుని శ్రీకృష్ణునకు అప్పగించి సత్కరించెను. అంత శ్రీహరి శివుని నిలువుమని చెప్పి, బాణుని నిల్పి మహావైభవముతో భేరీభాంకారములు, మంగళవాద్యములు మ్రోగుచుండగా ద్వారకానగరమునకు వచ్చి, భూసురుల ఆశీర్వాదములను పుణ్యాంగనలు చల్లు శుభాక్షతలను గైకొనుచు, కామినీమణులు కర్పూర నీరా జనముల నొసంగగా తన భవనమున కేగి సుఖముగా నుండెను. శ్రీకృష్ణుని విజయమును తెల్పు ఈ కథను పఠించినవారు జయమును పొంది, యిహపర సౌఖ్యముల ననుభవింతురు.

నృగమహారాజు చరిత్రము.

ఒకనాడు శ్రీకృష్ణుని కుమారులు ప్రద్యుమ్న, సాంబ, గద, చారు, భానులు మొదలగు యాదవ కుమారులు ఉద్యానవనమునకు పోయి పోయిగా స్వేచ్ఛగా సంచరించి, విహరించి బాగా దప్పిగొనిరి. వారు నీళ్ళను వెదకుచు వచ్చి యొక చోట నీరులేని బావిలో కొండవలెనున్న యూసరవెల్లిని చూచి, యచ్చెరువుతో దానిని బయటికి తేవలెనని తలంచిరి. వారు పెద్ద పెద్ద త్రాళ్ళుతెచ్చి దానిని కట్టి అందఱు కలిసి కోయని యరచుచు నెంత ప్రయత్నించినను దానిని పైకి లాగలేక శ్రీహరికి సంగతి తెల్పిరి. అంత శ్రీహరి నీరులేని యా బావివద్దకు పోయి, తన యెడమకాలితో దాని నొకగడ్డి పోచవలె వెంటనే బయటికి వెడ లించెను. వెంటనే ఆ యూసరవెల్లి బంగారువన్నెగల పురుషుడుగా కనబడెను. శ్రీహరి కతని వృత్తాంతము తెలిసినను, అక్కడ గుమికూడిన జనులు, కుమా రులు తెలిసికొనుటకు అతని చేత ఆ సంగతిని తెలియచేయదలచి యిట్లనెను— "అయ్యా! రత్నభూషణములు కలవాడవై, కీర్తిశోభితుడవై ప్రకాశించుచు

భూమిపై వెలసిన నీకు ఊసరవెల్లి తనమెట్లు వచ్చెనో తెలుపుము." అనగా నతడు శ్రీకృష్ణుని పాదములకు మ్రొక్కి చేతులు జోడించి, "స్వామీ ! యీ ప్రపంచమున నీకు తెలియనిది యేమియున్నది. నేను ఇక్ష్వాకు కుమారుడను. నాపేరు నృగుడు. నేను దీనులను బ్రోచుచు, సామంతులచే కప్పము గొనుచు, భూభారమును వహించుచు కీర్తితో శోభిల్లుచుంటిని. అత్మస్తుతి పాతకమందురు. నేను బ్రాహ్మణులకు దానమిచ్చిన గోవులసంఖ్య యింతంతయని చెప్పజాలను. బంగారు కొమ్ములు గిట్టలు గలిగి తొలిచూలులై మంచి దూడలుగల పాడి యావులను వేదవిప్రులకు దక్షిణతోపాటు దానమిచ్చుచుంటిని మఱియు పెక్కు దానములచేసి పెంత మహాయజ్ఞముల గావించితిని. వాపీ, కూప, తటాక, వన నిర్మాణముల చేయించితిని. ఒక్కనాడు కళ్యపుడను బ్రాహ్మణునకు గోవును దానమిచ్చితిని. ఆ గోవు నాకు తెలియకనే మరల ఆలమందలో వచ్చి చేరినది. నేను దానిని గుర్తింపక కళ్యపునకు దానమిచ్చియుండిన గోవును మఱియొక బ్రాహ్మణునకు దానమివ్వగా దానిని నా బ్రాహ్మణుడు గొనిపోవుచుండగా కళ్యపుడు ఆ గోవును చూచి, 'ఓయీ ! నా గోవు, నీవు దొంగిలించి నడివీధిలో తీసికొనిపోవుట న్యాయమా' అనెను. వారిద్దఱు ఇది నా గోవు అనగా ఇది నాకు రాజు దానమిచ్చిన గోవని వివాదము పెట్టుకొని, న్యాయనిర్ణయమునకై నా వద్దకు వచ్చిరి. అంత కళ్యపుడు నాతో, 'రాజేంద్రా ! ప్రజలు అధర్మము చేసినచో వారింపవలసిన నీవు న్యాయము విడిచి, వ్యవహరించితివి. నీవు నాకు దానమిచ్చిన గోవు తప్పించుకొని నీ మందలో చేరగా, మరల నీవు దానిని యీ బ్రాహ్మణునకు దానమిచ్చితివి. దాతవు. అపహర్తవైన నిన్నేమందును' అని పలుకగా, అతని పలుకులు నా చెవులకు ములుకులై సోకగా నేను, 'బ్రాహ్మణోత్తమా ! అజ్ఞానముచే నేను చేసిన పాపమును క్షమించుము. దానికి బదులు నీ కొక లక్షగోవుల నిచ్చెదను తీసికొను'మని ప్రార్థించితిని. అంత కళ్యపుడు నీవు నాకు మొదట దానమిచ్చిన గోవే నాకు కావలెను. నీ విచ్చు లక్ష గోవులను నేను లక్ష్యపెట్టననెను. అంత నేను రెండవ బ్రాహ్మణునితో పైవిధముగ వేడుకొనగా అతడును పంతముపట్టి, నీవు దానముగ నిచ్చిన ఆవే నాకు కావలెనని పలికెను. నేను మరణించితిని. పిమ్మట యమకింకరులు నన్ను ధర్మరాజు నెదుట నిలువబెట్టిరి. అప్పుడు యముడు నన్ను చూచి, 'రాజోత్తమా ! నీ దానధర్మములు ముల్లోకములందు ప్రసిద్ధములు. ముందు పాపఫలము ననుభవించి పిమ్మట పుణ్యఫలముల ననుభవింపవలెనని బ్రహ్మ యాజ్ఞ' అని చెప్పి నన్ను త్రోయిం

వగా నేను భూమిపై బడితిని. భూమిపై బడినంతనే నాకిట్టి యూసరవెల్లి రూపము లభించినది. ఇంతవరకు నా పాపఫలము ననుభవించితిని. ప్రాణులకు పుణ్యపాపముల ఫలములు అనుభవింపక తప్పవు కదా! నేడు సమస్తపాపముల నుండి గట్టెక్కించు నీ పాదపద్మములను సందర్శించుటచే నేనీ ఘోరనరకము నుండి బయటపడి పవిత్రుడనైతిని." నృగుడు శ్రీకృష్ణునకు మాటిమాటికి నమస్కరించి యిట్లనెను :

ఆ॥ కృష్ణ వాసుదేవ! కేశవ పరమాత్మ
అప్రమేయ వరద హరి ముకుంద
నిన్నుఁజూడఁగంటి నీకృపఁగనుఁగొంటి
నఖిలసౌఖ్య పదము లందఁగంటి.

అని ప్రశంసించి గోవిందుని పాదారవిందములు తన కిరీటము సోకునట్లు నమస్కరించి, "దేవా! నీ పాదారవిందములు, నా హృదయారవిందమును వదలకుండునట్లుగా ప్రసాదింపు'మని కృష్ణుని యనుమతిపై దివ్య విమానారూఢుడై స్వర్గమునకు పోయెను. అప్పుడు కృష్ణుడు అచ్చటనున్న రాజులకిట్లు ధర్మోపదేశము చేసెను: "రాజుల కులమనెడి వనమును దహించుటకు బ్రాహ్మణ ద్రవ్యమే అగ్నిజ్వాల. రాజుల ఐశ్వర్య సముద్రమును బ్రాహ్మణక్షేత్రము ఇంకింపజేయును. బ్రాహ్మణ ధనము రాజుల సంపదలనెడి పర్వతములకు వజ్రమువంటిది. రాజుల కీర్తియనెడి వెన్నెలను పోగొట్టుటకు విప్రధనము సూర్యోదయమువంటిది. బ్రాహ్మణ ద్రవ్యముకంటె విషమె మేలు. విషమునకు విరుగుడుకలదు. బ్రాహ్మణ ద్రవ్యమనెడి విషమునకు విరుగుడు లేదు. కావున బ్రాహ్మణుల ధనమునైనను, క్షేత్రమునైనను, ద్రవ్యమునైనను గైకొనరాదు.

"అజ్ఞానముచేనైనను బ్రాహ్మణ ద్రవ్యము నపహరింపరాదు. పొరపాటున
అంటుకున్నను అగ్ని శరీరము నంతటిని కాల్చక మానదుకదా!"

తన ధనమును బ్రాహ్మణుడు పోగొట్టుకొని యేడ్వగా నతని కన్నీటిచే ఎన్ని ధూళిపరాగములు తడియునో! అతనిని ఉపేక్షించిన రాజు అన్నివేల సంవత్సరములు కుంభీపాక నరకమున వసించును. అతనితోపాటు పదితరముల ముందువారు, తరువాత పదితరములవారు నరకము ననుభవింతురు. ధనాశచే దుష్టుడై బ్రాహ్మణ క్షేత్రమునందలి ధాన్యాదికమును అపహరించినవాడు అరువదివేల సంవత్సరములు మలకూపమున క్రిమిరూపమున వసించును. బ్రాహ్మణుని

పూజించు పుణ్యాత్ములు నావారు. నేను ప్రతిదినము భూసురులను వినయముతో పూజింతును. కావున మీరును బ్రాహ్మణులపట్ల మిక్కిలి భక్తిగలిగి మెలగు"డని చెప్పి నిజనివాసమున కేగెను. ఈ కథను వినినను చదివినను పాపములు తొలగి యిహపరసౌఖ్యములు లభించును.

బలరాముడు వ్రేపల్లెకు పోవుట.

ఒకనాడు బలరాముడు చుట్టాలను చూడవలెనను వేడుకతో బంగారు రథమెక్కి వ్రేపల్లెకుపోయెను. బలరాముని చూడగనే, గోపకులు, గోపికలు అతని కెదురేగి సత్కారముల గావించిరి. బలరాముడు యథోచితముగ వారిని ఆలింగనము చేతను, సాదరభాషణముచేతను, ప్రీతితో చూచుటచేతను సత్కరించి, నందయశోదలకు నమస్కరించెను. వారెంతో సంతోషపడి యాతనిని కౌగిలించుకొని, దీవించి, తమయొడిలో చేర్చుకొని, శిరము మూర్కొని సుద్దాడిరి. అంతట వారు బలరామునితో- "అన్నా! నీవును నీ చిన్న తమ్ముడగు వెన్నుడును బాగున్నారు కదా! మమ్ము విచారించుకొనుచు, రక్షింపవలసిన వారు మీరే కాక మఱెవ్వరున్నా"రని చక్కని పలుకుల పలుకుచు పొద్దుపుచ్చుచుండిరి. గోపకులు తమ యింటి పనులను మాని బలరామునితో కలిసి యాడుచు, పాడుచు, వినోదములతో పొద్దుపుచ్చుచుండిరి. గోపికలు శౌర్య సముద్రుడు, పుణ్యాత్ముడు, అగణ్యుడు, దానవాంతకుడగు బలరాముని చూచి నమస్కరించి, "హలధరా! నీ తమ్ముడు బాగా ఉన్నాడా! పురస్త్రీలతో సౌఖ్యముల ననుభవించుచున్నాడా! మమ్మెప్పుడైన తలచునా? మమ్ము గూర్చి యేమైన మాట్లాడునా? తన్నే నమ్మియుండిన వారిని విడుచుట నీ తమ్మునికి తగునా? మమ్మింతగా మోసగించిన వానిని రాజకాంతలెట్లు నమ్మిరో?" అని కృష్ణుని ప్రియములైన పలుకులను, నవ్వులను సంబంధములను, తలచి తలచి వారు మిక్కిలి బాధ పడిరి. బలరాముడు సరసాలాపములతో వారిబాధను పోగొట్టుటకై శ్రీకృష్ణుని సందేశము విన్పించెను. బలరాముడు సుందరీజనముతో రమ్యములైన వనప్రదేశములలో విహరించుచుండ వరుని యాజ్ఞచే వారుణీదేవి మద్యభావమునుపొంది, వనమునందలి వృక్షములనుండి బయటికివచ్చి వనమునంతటిని పరిమళింపజేసెను. బలరాముడు ఆ వనవృక్షముల వాసనలను ఆఘ్రాణించి, గోపికలు చప్పట్లు చరచుచుండగా సంతోషముతో ఆడుచు, పాడుచు, సోలుచు, మద్యముత్రాగుచు బాగుగ అలసిపోయి అడవి నడుమ జలకేళి సలుపదలచి యిచటికి రమ్మని యము

నను పిల్చెను. ఆ యమున బలరాముడు మత్తులో నున్నాడని యతని కోరికను అఙ్గీకారము చేయలేదు. అంతట బలరాముడు కోపించి యమునతో- "నేను రమ్మని పిల్వగా నీవు నామాట లెక్కింపకపోతివి కదా! వీరందరు చూచుచుండగా నా నాగలితో నిన్ను నూరు త్రోవలుగా పోవునట్లు చీల్చివేయుదునని, తన నాగలిని చాచి ఆ యమునకు తగిలించి పెకలింపనుండగా యమున భయపడి, సుందరీ రూపమును ధరించి వడివడిగావచ్చి బలరాముని పాదములపై బడి నమస్కరించి యిట్లనెను:

మ॥ బలరామా! ఘనబాహా! నీయతుల శుంభద్విక్రమంబంగనల్
దెలియంజాలెడివారె యీ యఖిలధాత్రీ భారధౌరేయ ని
శ్చలసత్త్వుండగు కుండలీశ్వరుడునుం జర్చింప నీ సత్కళా
కవితాంశ ప్రభవుండు నీ గురుభుజాగర్వంబు సామాన్యమే?

అని ప్రార్థించి, "దేవా! నేను నీ పాదపద్మములను ఆశ్రయించితిని నన్ను కాపాడుము" అనగా విని బలరాముడు పూర్వమార్గమున పోవుమని చెప్పి ఆ నదియందు గోపకాజనులతో హాయిగా జలక్రీడలాడెను. అంతట యమునానది బలరామునకు నీలవస్త్రములను, స్వర్ణమాలికను తెచ్చి యిచ్చెను. బలరాముడు వస్త్రములను, ఆభరణములను ధరించి గోపికలతో సుఖమున వర్తించుచుండెను. ఆ బలరాముడు నాగేటితో లాగగా చేర్పడిన చీలిక యమునలో తెల్లగా కనపడుచు నేటికిని బలరాముని బాహుబలమును సూచించుచుండెను. ఇట్లు బలరాముడు వ్రేపల్లెలో తన యీడు గోపాలురతో వినోదించుచు, గోపికలతో క్రీడించుచు రెండు మాసములు నివసించెను. అంతట కరూశ దేశాధిపతియైన పౌండ్రకుడనువాడు తనదూతను పిలిచి యిట్లనియె:

శ్రీకృష్ణుడు పౌండ్రకుని చంపుట.

నీవు ద్వారకకుపోయి నా మాటగా శ్రీకృష్ణునితో నిట్లు చెప్పుము. "వాసుదేవుడను నా పేరు పెట్టుకొని నా చిహ్నములు ధరించి తిరుగుట నాతో పంతము పట్టుట. కావున నా పేరు చిహ్నములు విడిచిపెట్టి, నన్ను గుర్తించి నా సేవచేసి బ్రతుకుము. అట్లుకాక నాతో పంతమునకు రాదలచిన యుద్ధమునకు రమ్ము" పౌండ్రకుని దూత ద్వారకకుపోయి నిండుకొలువుననున్న శ్రీకృష్ణుని దర్శించి పౌండ్రకుని సందేశమును వినిపించెను. సభలోనివారు పౌండ్రకుని చెడ్డమాటలు విని యొకరి ముఖ మొకరు చూచుకొని యిది యెంత

ఏద్దూరముగ నున్నదో చూచుదు అని తలంచుచుండిరి. అంతట శ్రీకృష్ణుడు పౌండ్రకుని దూతతో నిట్లనెను. మీ రాజు చెప్పినట్లు నా చిహ్నములు నేను తీసివేయను. యుద్ధమునకువచ్చి పౌండ్రకునిచంపి, వాని మాంసమును కాకులు గద్దలు తినునట్లును కుక్కలకు విందగునట్లు చేసెదనని చెప్పుము. అని యుద్రేకముతో మాట్లాడగా ఆ దూత పౌండ్రకుని కంతయు వివరించెను.

శ్రీహరి దండయాత్రకు సిద్ధమై దారుకుడు వివిధాస్త్రములతో కూడిన, పతాకచే శోభిల్లు, వడిగానేగు గుఱ్ఱములబూన్చి తెచ్చిన రథమునెక్కి. కాశికా నగరమునకు పోయెను. పౌండ్రకుడు యుద్ధోత్సాహముతో రెండక్షౌహిణులతో పట్టణమునుండి వెడలెను. అతని మిత్రుడైన కాశీపతి మూడక్షౌహిణులతో పౌండ్రకునకు తోడుగా వచ్చెను. శ్రీకృష్ణుడు పౌండ్రక వాసుదేవుని వాడు తన వలెనే శంఖ, చక్ర, గదా శార్ఙ్గములను, కృత్రిమ కౌస్తుభమణిని ధరించి, వనమాలవేసికొని, గరుడధ్వజము పెట్టికొని, పచ్చని పట్టువస్త్రము ధరించి, మణికిరీటమును ధరించి కాంచనరథముపై నుండెను. రంగస్థలమున నున్న నటునివలెనుండిన పౌండ్రకుని చూచి శ్రీహరి నవ్వెను. పౌండ్రకుడు పరిఘ పట్టిస బాణ, ముద్గర, ముసల కుంతచక్ర గదా, తోమర, ప్రాస, పరశు శూలములను శ్రీహరిపై ప్రయోగించెను. అంత, శ్రీహరి ప్రళయకాలమునందలి అగ్నివలె విజృంభించి, పౌండ్రకుడు ప్రయోగించిన ఆయుధములనన్నిటిని శరములతో త్రుంచి శత్రుసైన్యము సంచలించునట్లు పాంచ జన్యమును పూరించెను. శ్రీహరి తీవ్రకోపముతో పౌండ్రకుని సైన్యముల, మారి మసగినట్లు ఖండింపగా పీనుగు పెంటలైనవి. రథములు ప్రాలినవి. గుఱ్ఱములు పడిపోయినవి ఏనుగులు కూలినవి. భటులు నేలపై పడిపోయిరి. రక్తము ప్రవహించినది. కొవ్వుమాంసములనెడి బురద పేరుకొనినది. ఆ సమయమున కయ్యమునకు కాలుద్రవ్వు ఆ పౌండ్రకుని చూచి శ్రీహరి వానితో ఓరీ రాజాధమా! పౌండ్రరాజపుత్రా! నీ మాన శౌర్యములను నేడు యుద్ధములో చూపు మాపెదను. ఎద్దు క్రొవ్వి అబోతుపై రంకెవేసినట్లు నీవు దూతచేత నన్ను ఆక్షేపించి, వలదనిన చిహ్నములను నీవు బాణజ్వాలలో మాడునప్పుడు వదలెదను. అప్పుడు నేను నీశిరము కోత్తును. నీకు బలపరాక్రమములున్నచో కదల కుండ నా యెదుట నిలువుమని వానిపై వాడియైన బాణములవేసి, వాని రథమును ముక్కలుచేసి, సారథితలను తుంచివేసి, గుఱ్ఱములను నఱికి, మిక్కిలి

ప్రతాపముతో ప్రళయకాల సూర్యునివలె వెలుగు చక్రముతో పౌండ్రకుని తల నరుకగా, వజ్రపు దెబ్బచే కొరగు పర్వతమువలె వాడు నేలపై కూలెను. పౌండ్రకుని తలను శ్రీహరి బాణములచే యెగురగొట్టుచు వాని పురములో పడునట్లు చేసెను. అంత దేవతలు గంధర్వులు, గరుడులు, ఉరగులు సిద్ధులు సాధ్యులు ప్రశంసింపగా శ్రీ కృష్ణుడు ద్వారకకువచ్చి అత్యంత వైభవముతో ద్వారక యందు సుఖముగా నుండెను.

శ్రీకృష్ణుని చిహ్నములు ధరించి శ్రీహరిపై మాత్సర్యముతో నుండి ఎల్లప్పుడు శ్రీహరిని తలచుచుండుటచే పౌండ్రకుడు ముక్తిని పొందెను. పౌండ్రకుని తల కాశిలో వాని భవనము ముందుపడగా, కుండలములుగల వాని తలను చూచి పౌరులు తమ రాజు తలయని చెప్పిరి. అతని భార్యలు హాహాకారములతో నేడ్చిరి. రాజపుత్రుడు సుదక్షిణుడు తండ్రికి, పరలోకవిధుల నిర్వర్తించి, రణ రంగమున తన తండ్రి తలను నరికిన, శ్రీహరిని మర్దించు నుపాయమును తెలిసికొనుటకు తన పురోహితుని పిలిచెను. వారిద్దరు విశ్వేశ్వరుని పాదపద్మములను భక్తితో పూజించిరి. అంతవిశ్వనాథుడు వారితో మీకేమి కావలెనో కోరుకొనుడనగా, సుదక్షిణుడు దేవా! నా తండ్రిని వాసుదేవుడు యుద్ధమున సంహరించెను. నేను వాసుదేవుని చంపుట కుపాయమును తెలుపుమని యడిగెను. అంత శివుడు రాజపుత్రునితో నీవును నీ ఋత్విక్కులు బ్రాహ్మణులు అభిచార హోమము చేసినచో అగ్నిదేవుడు నీ కోరికను నెరవేర్చునని చెప్పెను. అంత శివుడు చెప్పిన విధమున అభిచార హోమము సలుపగా ఎఱ్ఱని పెండ్రుకలు మీసములగ్గ్ పిడుగులవంటి కోరలు నిప్పులు కురియు కన్నులు, ముడిపడిన కనుబొమలు, కోపముతో నెఱ్ఱబడిన మొగము కలిగిన, కృత్య హోమకుండమును వెడలివచ్చెను. ఆకృత్య నాలుక ఎఱ్ఱనై మృత్యుదేవత కరవాలమువలె నుండెను. అది అగ్నిజ్వాలలు కల శూలమును ధరించి బిగ్గరగ భయంకరముగ, నఱచుచు నగ్నవేషమై ద్వారకకు పోయెను. ద్వారకలోని వారలు కార్చిచ్చును చూచి భయపడి పారు మృగములవలె పరుగెత్తుచు, సభలో జూదమాడుచున్న కృష్ణునిచూచి కృష్ణా! ప్రళయాగ్ని మంటలతో పురమును కాల్చుచున్నదని విన్నవింపగా కృష్ణుడంతయు తెలిసికొని, కాశీరాజ పుత్రుడు పంపిన కృత్యను అణచదలచి తన చక్రమును పంపగా ఆ చక్రము కహా కహా నినాదములతో బ్రహ్మాండమును నింపుచు, మిన్నంటి మంటల గ్రక్కుచు, చిట

కట శబ్దము గావించుచు, దేవతలు జయ జయ శబ్దములు చేయుచుండ, కృత్యను గెంటి దాని వెంటబడగా ఆ కృత్య రౌద్రమును విడిచి, కాశీపురమున ప్రవేశించి, సుదక్షిణుని, ఋత్విక్కులను దహించెను. సుదర్శనచక్రము ఆ పట్టణమును భస్మము గావించి శ్రీహరి వద్దకుపోయి, కొల్చియుండెను. శ్రీహరి విజయమును గూర్చిన యీ కథను వినినవారికి, చదివినవారికి పాపములు తొలగును. ఇహపర సౌఖ్యములమరును.

బలరాముడు ద్వివిదుడను వానరుని చంపుట.

సుగ్రీవునకు మంత్రియు మైందునకు సోదరుడైన ద్వివిదుడను వానరుడు నరకాసురునకు స్నేహితుడై గర్వితుడై యుండెను. ద్వివిదుడు, తన స్నేహితుడైన నరకుని శ్రీహరి చంపెనను కోపముతో పగదీర్చుకొనదలచి కృష్ణుని పరిపాలనలోగల పట్టణములకు గ్రామములకు మిక్కిలి యుపద్రవము గలిగించుచుండెను. స్త్రీలను పురుషులను ఏ కొండగుహలలోనో పెట్టుట వారు వెలుపలికి రాకుండ యే గుండునైన అడ్డపెట్టుట, పండ్లచెట్లను గూల్చుట, సాధువుల కష్టపెట్టుట, కోటలను బ్రద్దలుకొట్టుట, స్త్రీలను నీటిలో ముంచుట అనునవి ద్వివిదుడు గావించు కీడులలో కొన్ని. ఒక నాడు రైవతక పర్వతమున జూదమాడుచున్న బలరాముని చూచి, ద్వివిదుడు బలరాముని యెదుటనున్న చెట్టునెక్కి కొమ్మలనూచుచు పతని వెక్కిరించుచు పళ్లనిగిలించుచు, ఒక కొమ్మనుండి యొక కొమ్మపైకి దుంకుచు తోకను బలరాముని శరీరమునకు తాకించుచు, నాలుక వెడలబెట్టుచు, గోళ్ళచే గీరుచుండెను. బలరాముడు ద్వివిదునిపై కోపించి, దానిపై నొక గుండును విసిరివేయగా తప్పించుకొని, బలరాముని మద్యపాత్రను తీసికొనిపోయి మద్యమును నేలపై పోయగా రాముడు కోపించి, దానిపై నాగలినిబట్టి దాని నదలించగా వానరము సమీపమునందలి చెట్టును పెరికి బలరాముని తలపై మోదెను. అంత రాముడు దెబ్బతిన్న పామువలె రోషించి సునందమనెడి తన రోకలితో దాని మెడపై మోదగా నది మూర్ఛపోయి అంతలోనే మూర్ఛనుండి తేరుకొని యొక చెట్టును పెకలించి రామునిపై వేయగా రాముడు దానిని యింతింతలు చేసి నేలకూల్చెను. అంత వానరము చెట్లనువేసి, వాని నన్నిటిని రాముడు తుంటలు చేయగా, రామునిపై రాళ్ళను గురిపించెను. రాళ్ళను తప్పించుకొనగా రామునితో బాహుయుద్ధమునకు పూనుకొనెను. అంత బలరాముడు పిడుగులవంటి పిడిగుద్దులతో వానరము గుడ్లు

పిటకరించి నోటినుండి చెవులనుండి రక్తము కారగా నేలపై బడునట్లుచేసి దానిని సంహరించెను. వానరము పడినంతనే నేల కదిలెను. బలరామునిపై దేవతలు పూలవాన గురిపించిరి. తోటవారు తనను నుతించుచుండగా బలరాముడు ద్వారకకు పోయెను.

బలరాముడు హస్తినను నదిలో త్రోయబూనుట.

సుయోధనునకు సర్వలక్షణ సంపన్నయగు లక్షణయను కూతురు కలదు. ఆమె వివాహ సందర్భమున, శ్రీకృష్ణునకు జాంబవతి యందు కలిగిన సాంబుడను యాదవవీరుడు సాహసముతో లక్షణ నెత్తుకొని పోయెను. కౌరవులు సాంబుని వెంటబడి పట్టితెచ్చినను యాదవులు మనలనేమి చేయగలరను గర్వముతో కౌరవులు యుద్ధసన్నద్ధులై కర్ణశల్యాదులు తోడరాగా రథారూఢులై సాంబుని వెంటబడిరి. సాంబుడు కౌరవ వీరులనుచూచి చిఱునగవునవ్వి, సింహమువలె గర్జించి, మణులచే ప్రకాశించు విల్లుచేబట్టి నిలిచెను. కౌరవులందరు కర్ణాదులతో పాటు ఒక్కపెట్టు తమ తమ బాణములచే సాంబుని ముంచిరి. అంత సాంబుడు భుజశక్తిచే వాడి బాణముల వారిపై వేసి కౌరవుల బాణముల నన్నిటిని చూర్ణము చేసెను. కౌరవ వీరులందరకన్ని రూపులై వారి రథములను గుఱ్ఱములను పతాకలను నేలపై పడగొట్టి, ఒక్కొక్కనిపై పెక్కు బాణములతో, నొప్పించి వారి గర్వమును నిర్మూలించెను. వారందరు కలిసి నిట్టూర్చుచు, పట్టుపట్టి పౌరుషములకు తెగించి పంతముతో సాంబుని చుట్టుముట్టి అతని రథమును పడగొట్టి, విల్లువిఱిచి, గుఱ్ఱములచంపి, సూతుని తెగటార్చి అతి ప్రయాసచే నతని బంధించి, కన్యకతోపాటు హస్తినకు తెచ్చిరి. అచ్చట యాదవులు నారదుని వలన సాంబుడు బంధితుడైన వార్తవిని, ఉగ్రసేనుని యాజ్ఞచే సైన్యముల గూర్చుకొని కౌరవుల బరిమార్చుటకు హస్తినకు బయలుదేరిరి. అంత బలరాముడు యాదవులతో మనకు ధృతరాష్ట్రపుత్రులు సన్నిహిత బంధువులు వారిమీద కోపించి దండెత్తి పోవుట తగదు. మీరు పోవలదని, వారిని వారించి తా నొక్కడే సూర్యునివలె వెలుగొందు రథమునెక్కి ఆప్తులైన రాజులు, ఉద్ధవుడు మొదలగు యదుకుల వృద్ధులు తోడురాగా హస్తినాపురికి సమీపమున విశ్రమించుచు ఉద్ధవుని కౌరవులవద్దకు పంపెను. అంత ఉద్ధవుడు హస్తినాపురిలో ప్రవేశించి, ధృతరాష్ట్ర భీష్మ ద్రోణ, సుయోధనులకు నమస్కరించి వారితో బలరాముడు పుర సమీపమున, ఉద్యానవనమున విశ్రమించుచున్నాడని చెప్పగా

కౌరవు లుత్సాహముతో కానుకలు గైకొని బలరాముసివద్దకుపోయి, అర్ఘ్య పాద్యాదులనిచ్చి సత్కరింపగా బలరాముడు వారితో నిట్లనెను—

కౌరవులారా మీ రాజు నాజ్ఞను శిరసావహించుట మంచిది. మా యదుకుమారు నొక్కని నెదిరించి మీరందఱు అతనితో పోరాడుటతప్పు. మారాజు మీ తప్పును క్షమించెను. ఆ మాటల విని సుయోధనుడు మండిపడి యిట్లనెను. కాలికి తొడగ వలసిన చెప్పులు నెత్తికెక్కినట్లు యాదవులకింత పొగరు పట్టినదా? రాజ్య సింహాసనమున కర్హతలేని యాదవులు మనతో సమానులమని భావించి, వియ్య మందదలచిరా చాలు చాలు, పాములకు పాలుపోసినను విషము తగ్గనట్లు మేము మన్నించుటచే యాదవులు గర్వించిరి. మా రాజు ఆనతిని శిరసావహించమని చెప్పువరకువచ్చినది; భీష్మ ద్రోణ కర్ణాది వీరులకులోబడిన వానిని మహేంద్రు డైనను విడిపింపలేడు. మీరు వృథాప్రలాపముల కట్టిపెట్టుడని దుర్భాషలాడి తన భవనమునకు పోయెను. దుర్యోధనుని మాటలు బలరాముని చెవులలో ములుకులవలెనాటగా ప్రళయ కాలమునందలి సూర్యునివలె మండుచు యాదవ వృద్ధులతో నిట్లనెను. రాజ్యమదముచే కన్ను మిన్నెఱుగని వారల మాటలు మీరు వింటిరి కదా! రాజ్యలక్ష్మిచే నంధులైనవారు సామోపాయముచే చక్క బడరు దారికిరారు. కృష్ణుడు యదువీరులు యుద్ధమునకు వచ్చుచుండ నేను బంధు ప్రీతిచే వారిని వారించితిని. నేను కృష్ణుడును ఎవని యాజ్ఞను శిరసావ హింతుమో అట్టి యుగ్రసేనునకు తాము రాజ్యమిచ్చిరట యెంత కండకావ రము. తాము తలకాయలా మేము పాదుకలమా? సరే చూతము ఈ భూమి యందు కౌరవులను లేకుండా చేతునని శౌర్యముతో హస్తినాపురికి తలతట్టు భాగమునకు నాగలి తగిలించి హస్తినాపురి వెలసిన భూభాగమునంతటిని యము నలో పడవేయదలచి నాగలి లాగగా అంత హస్తినాపురముగల గడ్డపైకి లేవగనే పౌరులందఱు తల్లడిల్లిరి. హస్తిన పడిపోవు ప్రమాదము బలరాముని కోపముచే కల్గినదని భయపడి, దుర్యోధనాదులు బంధువులతో భార్యాపుత్రులతోవచ్చి బల రాముని శరణు వేడుటకై తమ బిడ్డయగు లక్షణ నలంకరించి సాంబునితో పాటు ఆమెను బలరామునకు సమర్పించిరి. అనేకములైన రత్న భూషణాదులను కానుకలుగ అర్పించి

క॥ రామ! నమంచినిముక్తా
దామ యశః కామ ఘనసుధా ధామరుచి
స్తోమ జయసీమ జగదభి
రామ గుణోద్దామ నిఖిలరాజ లలామా

రక్షింపుము రక్షింపుము
పేక్షింపక నమిత నిఖిల బృందారకవో
ర క్షణదాచర విష నిట
లాక్ష! భయాతురుల మమ్మునరయు మనంతా!

అని ప్రార్థింపగా బలరాముడు వారితో భయపడకుడు మీరు అవినయముగ ప్రవర్తించుటచే నేనిట్లు చేసితిని. యిక భయపడకుడని చెప్పెను. అంత దుర్యోధనుడు వినయముతో బిడ్డను, అల్లుని, వేయిమంది దాసదాసీజనముతో లక్ష గుఱ్ఱములతో, రెండు లక్షల ధేనువులతో, ఆఱువేల బంగరు తేరులతో బలరామున కప్పగించెను. అంత బలరాముడు సంతసించి కొడుకును కోడలిని తోడ్కొని, దుర్యోధను డిచ్చిన అరణముతో, ద్వారకలోని వారెల్లరు తనను ప్రశంసించు చుండగా యాదవులతో కలిసి ద్వారకలో ప్రవేశించెను. అంత బలరాముడు హస్తినాపురమున జరిగిన వృత్తాంత మంతయు తెలిపి సుఖముగా నుండెను. నేటికిని హస్తినాపుర దక్షిణ భాగమెత్తుగను ఉత్తరభాగము గంగలోనికి క్రుంగినటుల గన్పించుచు, బలరాముని భుజబలమును చాటుచున్నది.

శ్రీ కృష్ణుని మహిమను నారదుడు దర్శించుట.

ఒకనాడు నారదుడు, నరకునిచే బందీలై యుండిన పదాఱువేలమంది రాజకన్యకలను, నరకునిచంపి, అందఱకన్ని రూపులై వివాహమాడెనని విని ఆ వైభవమును చూచుటకు ద్వారకకు వచ్చెను. నారదుని చూడగనే కొలువున నుండిన శ్రీకృష్ణుడు నారదున కెదురుగపోయి యాతనితోడ్తెచ్చి కనకాసనమున నుపవిష్టునిచేసి అర్ఘ్యపాద్యముల నొసంగి సత్కరించెను. పిమ్మట నారదుడు శ్రీకృష్ణుని యోగమాయా ప్రభావమును తెలిసికొనగోరి పదాఱువేల కాంతలలో నొక కాంతయింటికిపోయి అచ్చట జూదమాడుచున్న శ్రీకృష్ణుని జూచి హరిచే సత్కరింపబడి, మఱియొక కాంత యింట కొడుకులతో వినోదించుచున్న కృష్ణుని గాంచెను. మఱియొక కాంత యింటి యుద్యానవనమున భార్యతో విహరించు శ్రీహరిని గాంచెను. యింకొకతె యింట ధ్యానమగ్నుడై యుండిన కృష్ణుని చూచెను. ఒక చోట సంధ్య వార్చుచుండెను. మఱియొకచోట పంచ యజ్ఞముల చేయుచుండెను. ఒక యింట అభ్యంజనము చేసికొనుచుండెను. మఱియొక చోట దివ్యభూషణముల ధరించుచుండెను. యింకొకయింట కొడు

కుల ముద్దులాడుచుండెను. ఒక చోట సంగీత విద్యావినోదియై యుండెను. ఒక భవనమున జలక్రీడ లాడుచుండెను. ఒక గేహమున ఉన్నతాసనమున సుఖ విష్టుడై. యుండెను. ఒక మందిరమున చెలితో ముచ్చటలు చెప్పుచుండెను. ఒక సౌధమున హారముల గ్రుచ్చుచుండెను. ఒక చోట తాంబూలము సేవించుచుండెను. ఒక తరుణి నివాసమున నవ్వుచుండెను. ఒక రమణి యావాసమున పాడుచుండెను. ఇట్లు నారదుడు యోగమాయా ప్రభావముచే అనేక మూర్తియై మహాసౌఖ్యముల ననుభవించు శ్రీహరిని దర్శించెను. శ్రీహరి యోగమాయా ప్రభావమునకు మనస్సున సంతసించి కృష్ణునితో స్వామీ బ్రహ్మేంద్రులైనను, మునీశ్వరులైనను నీ మాయను తెలియగలరా! నీ భక్తులకుతప్ప నీ మాయ నెవ్వరికైనను తెలియదని ప్రశంసించి పోయెను.

ఒకనాడు శ్రీహరి నిండుకొలువున్న సమయమున నొక బ్రాహ్మణుడు సభలోనికి వచ్చి శ్రీహరిని చూచి దండప్రణామముచేసి వినయముతో చేతులు జోడించి యిట్లు విన్నవించెను. రాజీవాక్షా! కృష్ణా! దానవభంజనా! చిత్తగింపుము జరాసంధుడు తనకు మ్రొక్కని రాజుల నందరిని వెదకి తెప్పించి తన రాజధాని యగు గిరివ్రజ పురమున బంధించి యున్నాడు. ఆ రాజుల సంఖ్య యిప్పటి వరకు నిరువదివేలున్నది. ఆ రాజులు నీ వద్దకు నన్ను పంపగా వారి సందేశమును విన్నవించుటకు వచ్చితిని. వారు నీతో నిట్లు విన్నవించిరి. ఓ దుష్టదానవ సంహారీ! భక్తజనవత్సలా! దివ్య మహాప్రభావా! మాధవా! ఆర్తులమైన మమ్ము రక్షింపుము. భక్తజనుల భయమును పోగొట్టువాడా! నిన్ను మా మనస్సులలో ధ్యానించి నీకు మ్రొక్కెదము. నీ పాదములే మాకు దిక్కు. ఓ అనంతా! బలవంతులైన దుష్టులను దండించుటకు, దుర్బలులైన వారిని రక్షించుటకు భువిపై నవతరించితివి. మురారీ! నీకు తెలియని దేమున్నది? త్రిలోకశరణ్యా! దీనులమైన మమ్ము రక్షింపుము. శరణాగతులమైన మమ్ము చేపట్టి మా నిర్బంధమును తొలగింపుము. నీవు ప్రభువులకు ప్రభువవు. భయముతోనున్న మమ్ము కాపాడుము. యుద్ధములందు పదునెనిమిదిమార్లు నిన్నెదిరింపలేక పాఱివచ్చినవాడు జరాసంధుడు. అయినను వీడు తాను బడిన పాటుల తలంపక సింహము మదపుటేనుగుల పరికట్టి గర్వించినట్లు జరాసంధుడు మమ్ము నిర్బంధించి గర్వాంధు డయ్యెను. యీ పాపాత్ముని సంహరించి మాకు బంధ విముక్తి గలిగించి, భార్యాపుత్రాదులను కలిసి కొనునటులచేసి దిక్కులేని మమ్ము

రక్షింపుము. అని బ్రాహ్మణుడు జరాసంధునిచే నిర్బంధింపబడిన రాజుల విన్నపము వినిపించెను.

నారదుడు రాజసూయమును నెరవేర్పుమని చెప్పుట.

నారద మహర్షి శ్రీకృష్ణుని దర్శింప వచ్చెను. ఆ మునిని చూడగనే కృష్ణుడు ఎదురేగి తోడితెచ్చి కనకాసనమున కూర్చుండబెట్టి సత్కరించి యిట్లడిగెను. నారద మునీంద్రా! నీ వెచ్చట నుండి వచ్చితివి? నీవు త్రిలోకసంచారి వగుటచే నీకు తెలియని దేమున్నది. పాండవు లిప్పుడెచ్చట నున్నారు. ఎట్లున్నారో తెలుపుము. "దేవా! ఈ ప్రపంచమున నీకు తెలియని దేదియును లేదు. అయినను విన్నవింతును. ధర్మరాజు రాజసూయ యాగము చేయబోవుచున్నాడు. నీవు యజ్ఞ పురుషుడవు యజ్ఞభోక్తవు. యజ్ఞరక్షకుడవు నిన్ను సేవించిన చాలును. కాని లోక వర్మము ప్రకారము ధర్మరాజు చేయనున్న రాజసూయమును రక్షింప నీ వచటికి విచ్చేయుము. ఆ యజ్ఞ సమయమున అఖండ భూమండలమున గల రాజు లెల్లరును, మునులును వచ్చెదరు. అచట నీ మహామహిమను చూచి వారందరు ధన్యులు కాగలరని నారదుడు తెల్పగా కృష్ణుడు చిరునగవు నవ్వి ఉద్ధవునితో నిట్లనెను.

ఉద్ధవా! నీవు వివేక సమృద్ధ వచో వైభవము కలవాడవు. వృద్ధుల మాట చొప్పున కార్యనిశ్చయము చేయవలెయును. నీవు మాకు నేత్రములవంటివాడవు. మనకు తప్పక చేయవలసినదని యేదో నీవు చెప్పుమని శ్రీహరి యడుగగా ఉద్ధవుడు శ్రీహరితో నిట్లనెను. సర్వజ్ఞుడవైన నీవు ఏమియు తెలియనట్లు నన్నడుగు చున్నావు. నీ పాదములను మనస్సున నిల్పుకొని యీ సభలోని పెద్దల యనుమతితో నాకు తెలిసిన విధమున విన్నవించుకొందును. దేవా! నారద మహర్షి చెప్పినట్లు నీ భక్తుడైన ధర్మరాజు గావించు రాజసూయమును రక్షించుట అవశ్యమైనది. రాజసూయయాగము చేయుటకు ముందు దిగ్విజయము చేయవలయును గదా! ఆ సందర్భమున జరాసంధుని మర్దించుటయు, రాజులందరిని బంధవిముక్తుల చేయుటయు కలిసివచ్చును. అదిగాక పదివేల యేనుగుల బలము కలవాడును, మూడక్షౌహిణుల సైన్యము కలవాడునైన జరాసంధుని వధించుటకు వాయునందనుడైన భీముడు తప్ప మఱియొకడు సమర్థుడుకాడు. జరాసంధుడు బ్రాహ్మణు లేది కోరిన, దానిని తప్పక యిచ్చును.

గనుక నీవు కపట బ్రాహ్మణ వేషమున బోయి, యుద్ధభిక్షను గోరి నీయెదుట భీమునిచే జరాసంధుని చంపించుటచే నెన్నియో ఫలితములు లభించును. ఉద్ధవుని పలుకులను విని, నారదుడును సభలోని వారలును మిక్కిలి సంతసించిరి. అంత శ్రీహరి దారుకుడు సర్వసన్నద్ధముగ తెచ్చిన రథమునెక్కి భేరీభాంకారములు మ్రోగుచుండగా, ఉగ్రసేనునకును, బలరామునకు చెప్పి, వారు తన్ను సాగనంపగా, అంతఃపుర స్త్రీలతోడను, దాసీజనముతోడను, యోధులతోడను కృష్ణుడు బయలుదేరి నారదునకు సెలవిచ్చి, బ్రాహ్మణునకు అభయమిచ్చి పంపి, ఆనర్తక సౌవీర, మరుదేశముల దాటి యిందుమతిని జూచి, దృషద్వతీ నదిని దాటి, సరస్వతీ నదిను త్తరించి, పాంచాల, మత్స్యదేశములద్వారా హస్తినాపురికి వచ్చి పురసమీపము నందలి యుద్యానమున విడిది చేసెను.

ధర్మరాజు శ్రీకృష్ణుని తోడ్కొని వచ్చుట.

శ్రీకృష్ణుని రాక, విని ధర్మరాజు నిండుమనస్సుతో తమ్ములు బంధువులు గురువులు మంత్రులు పురోహితులు నటులు వెంటరాగా భక్తితో మంగళ వాద్యములతో శ్రీకృష్ణున కెదురేగి, శ్రీకృష్ణుని కౌగిలించుకొని, యానంద బాష్పములు రాలుచుండ, శరీరమున పులకలు మొలకెత్తగా తన్ను తాను మఱచియుండెను. పిమ్మట భీమాదులు కృష్ణుని యాలింగనము చేసికొని సంతసించిరి. నకుల సహదేవులు గోవిందుని పాదారవిందములకు మ్రొక్కిరి. అంతట శ్రీకృష్ణుడు ధర్మరాజు గావించిన వివిధ సేవలగైకొని కేకయాది రాజులను మన్నించి, సూతమాగధుల కనేక పదార్థములనిచ్చి, చతురంగబలముతో, అనేక విధముల నలంకరింపబడిన పురంబు ప్రవేశించెను. ధర్మరాజు శ్రీకృష్ణుని భార్యలను, పరివారమును, యథోచితముగ సత్కరించెను. వారందఱికిని తగిన విడుదులనేర్పాటు చేయించెను. తగిన రీతిగ వారందఱిని సంతృప్తులను చేయుచుండెను. కృష్ణార్జునులు కలిసి మెలసి సరసాలాపములతో, వినోదములతో, కొన్ని నెలలు పొద్దుపుచ్చు చుండిరి.

ధర్మరాజు భీమాదులను దిగ్విజయమునకై పంపుట.

ఒకనాడు ధర్మరాజు తన సభాభవనమున హితులు మంత్రులు పురోహితులు, పుత్రులు, మిత్రులు బంధువులు క్షత్రియులు పరిచారకులు, సూతమాగధులు కొలుచుచుండ కొలువుండ, భువనరక్షకుడును, అద్భుత చరిత్రుడును, ఆప్తుడును,

సామాది చతుర్విధోపాయ చరితుడునగు శ్రీకృష్ణుని జూచి యిట్లనెను. ఓ పుణ్యశీలా ! రాజసూయ యాగము చేయవలయునని కోరిక నా మనస్సున కలిగినది. దాని నిర్వహించుటకు నీకంటె మించిన యాత్మబంధువులు నాకెవ్వరు కలరు ? కృష్ణా ! నీ పాదపద్మములను సేవించువారి కెట్టి యుపద్రవములుండవు అనగా విని శ్రీహరి ధర్మరాజుతో ఓ పాండు రాజనందనా ! నీతి విక్రమశాలీ ! నీవు రాజసూయము చేయబూనుట మంచిపని. ఇది మునులకును దేవతలకును పితరులకును ప్రీతికరము దుష్టశత్రువులకు క్షయమును కల్గించును బంధు ప్రీతిని పుణ్యసంపదను నిర్మలమైన కీర్తిని, జయమును కల్గించును. కావున నీవు వెంటనే రాజసూయమును నిర్వహింప బూనుకొనుము. నీ సోదరులు దివ్యాస్త్రముల నెఱింగినవారు. యుద్ధరంగమున మదించిన శత్రువులను మర్దించుటలో నేర్పరులు. శత్రురాజుల గెలువుము. దశదిశల కీర్తితో వెలయుము. సమస్త భూమండలమునందును నీ శాసనము నిలుపుము. రాజసూయమునకు కావలసిన సమస్త సంభారములను తెప్పింపుము. శత్రువులనెల్ల జయించుటకై నీ సోదరులను అన్ని దిక్కులకు పంపుము. అనిన శ్రీకృష్ణుని మాటలు విని ధర్మరాజు సంతోష ముతో పొంగిపోయి శ్రీకృష్ణుని ప్రశంసించి తన తమ్ములను చూచి యిట్లనెను. సహదేవా ! సృంజయ రాజులు, చతురంగబలములు నిన్నుగొలువగా దక్షిణ దిగ్విజయమునకు నీవు పొమ్ము. నకులా ! చతురంగబలములు కొలువగా నీవు పడమటి దిక్కును జయింప పొమ్ము.

విజయా నీవు ఉత్తర దిగ్విజయమున కేగుము. భీమా ! శౌర్యనిధులైన మత్స్య, కేకయ, మద్రరాజుల సేనలతో పాటు నీవు తూర్పు దిక్కును జయింప పొమ్ము. అని ధర్మరాజు దిగ్విజయమునకై తన తమ్ములను బంపెను. భీమాదులు ఆయా దిక్కులకేగి తమ బాహు పరాక్రమములతో నలుదిక్కులు గల రాజులను జయించి, బంగారు, రత్నములు, గుఱ్ఱములు మొదలగు అమూల్య వస్తువులను కానుకలుగా గ్రహించి, వారినుండి కప్పములను స్వీకరించి వచ్చి ధర్మరాజునకు నమస్కరించి, తామాయా దిక్కులకు పోయివచ్చిన విధమును ఆయారాజుల జయించిన పద్ధతులను చెప్పిరి. ఒక జరాసంధుడు మాత్రము అహంకారముతో కప్పము నవ్వలేదని అర్జునుడు విన్నవించెను. ఆమాట విని ధర్మరాజు వ్యాకుల చిత్తుడై యూరకుండెను. అంత శ్రీకృష్ణుడు ధర్మరాజుతో జరాసంధుని యుద్ధములో సంహరించు నుపాయమొకటి కలదని నాకు ఉద్ధవుడు చెప్పెను దానిని నీకు చెప్పెదను. జరాసంధుడు బ్రాహ్మణులయందు భక్తివినయములు కలవాడై

వారేది యడిగిన దానిని కాదనక యిచ్చును. కావున నేను భీమార్జునులును విప్ర వేషముతో పోయి, యుద్ధభిక్ష నిమ్మని వేడినచో నతడు మాకోరికల తీర్చును. అప్పుడు మల్లయుద్ధమున భీమునిచే జరాసంధుని సంహరింప వచ్చును. అంత ధర్మ రాజు శ్రీకృష్ణునితో నీ యుపాయము బాగున్నది. అట్లే కానిమ్ము అనెను

శ్రీకృష్ణ భీమార్జునులు జరాసంధుని వధింపబోవుట.

శ్రీకృష్ణ భీమార్జునులు బ్రాహ్మణ వేషములను ధరించి, త్రేతాగ్నులవలె తమ శరీరములందలి తేజములు వెలుగగ వేగముగా గిరివ్రజమునకు పోయి, అతిథి పూజలను శ్రద్ధాసక్తులతో గావించుచుండిన జరాసంధుని జూచి యిట్లనిరి. ఓరాజా ! నీవు అతిథి సేవాతత్పరుడవని దిక్కులన్నింట కీర్తిగాంచితివి. మేము నిన్ను యాచింపవచ్చితిమి. కాదనక మాకోరికలను దీర్పుము. ఎల్లప్పుడు అతిథి జనులను పూజించి, సత్కరించు వారికి శాశ్వత కీర్తిలభించును.

> "ఈ దేహము శాశ్వతముకాదు. కీర్తియే శాశ్వతమని నమ్మి కీర్తిని సంపా దించనివాడు బ్రతికియు చచ్చినవాడే".

దాతలకు ఇవ్వరాని పదార్థమొక్కటియునులేదు. దేవతలు కోరగా తన యెముకలను దానముగా దధీచి యిచ్చెను. ఇంద్రుడు అగ్నియు, పావురము డేగగా మారి తనను వేడగా శిబిచక్రవర్తి తన శరీరమును కోసియిచ్చెను. మఱియును రంతిదేవుడు, హరిశ్చంద్రుడు, బలిచక్రవర్తి, ఉంఛవృత్తిచే జీవించిన బ్రాహ్మణుడు మహాదాతలై నేటికిని కీర్తిశరీరములతో జీవించియున్నారు. అని చెప్పగా జరాసంధుడు వారి రూపములను, కంఠస్వరములను, వింటినారి దెబ్బల కణుపులను ప్రభావములను చూచి వీరు బ్రాహ్మణ వేషమును ధరించిన రాజులని తలంచి వీరు ప్రాణములను కోరినను ఇత్తునని అనిత్యమైన శరీరము విచారింపదగినదికాదు. కీర్తిని పొందుటయే మంచిదనియు తలంచి వారితో నిట్లనెను. ఓ గుణవంతులారా ! మీమదిలోని కోరికయేదో తెల్పుడు. నాతల నిమ్మనినను మీకు తప్పక యిత్తును. ఆ మాటవిని శ్రీహరి జరాసంధునితో ఓరాజోత్తమా ! నీవు సత్యనిష్ఠ కలవాడవని తెలియును. మాకు యుద్ధభిక్ష నిమ్ము. ఇతడు అర్జునుడు. నేను కృష్ణుడను ఈతడు వాయుపుత్రుడు. మాలో నొకనితో నీవు పోరాడవలెను. అనిన జరాసంధుడు శ్రీకృష్ణునితో వికటముగ నవ్వి ఇది చాల వింతగా నున్నది. నీవింతకు ముందు నాతోయుద్ధమున పోరాడ

లేక భయముతో పాఱిపోతివి. మథురానగరము వదలి సముద్రమధ్యమున దాగితివి. నీబలశౌర్యములు నాకు తెలియవా! ఇంకెందుకు నీవెన్నిమాయలు పన్నినను నిన్ను విడువను. నేను మగధరాజునని నీకు తెలియదా! కావున యుద్ధములో నాతోపోరాడుట నీకు కష్టము కావున నీవు తప్పుకొనుము. ఇంద్రపుత్రుడగు అర్జునుడు మహాపరాక్రమవంతుడే కాని నాకంటె చిన్నవాడు. కావున నితనితో పోరాడుట తగదు. ఈ భీముడు నాబలపౌరుషములకు సమానుడు కావున నితనితో పోరాడుదునని, భయంకరుడై భీమున కొకగద నిప్పించి తానొక గద పట్టుకొని పట్టణమునకు వెలుపల ఒక సమతల ప్రదేశమున తలపడిరి.

భీమ జరాసంధుల యుద్ధము.

భీమ జరాసంధులు రెండు పర్వతములు ఢీకొన్నట్లు, రెండు సముద్రములు కలిసినట్లు, రెండాబోతులు కుమ్ముకొనునట్లు, రెండేనుగులు పోరాడినట్లు రెండు మంటలు తలబడినట్లు, గదలతో పోరాడుచు, కుడిఎడమలకు తిరుగుచు, సింహములవలె కదలుచు, సమీపించుచు, దూరమగుచు, పైకెగురుచు, క్రిందికి వంగుచు, భూమి బ్రద్దలగునట్లు బొబ్బలు పెట్టుచు, ఛటఛటమని గదలొకదాని నొకటి గ్రుద్దుకొనుచుండ పోరాడుచుండిరి. జరాసంధుడు గదను చూచి హుంకరించి భీమునిపై వేయగా భీముడు రోషముతో ఆ దెబ్బను తప్పించుకొని తన గదతో వానితలపై దెబ్బతీయబోగా నతడు తప్పించుకొనెను. భీమ జరాసంధులు గదలతో నొండొరుల వీపులు, భుజములు, ముంజేతులు నడినెత్తులు, మోకాళ్ళు, పిక్కలు, పగులగొట్టిరి. వారు గదలతో నొకరి నొకరు మొత్తుకొని ఒత్తుకొని గదాదండములు ముక్కలుగచేసి బాహుయుద్ధమునకు దిగిరి. పిడికిటి పోటులతో ప్రక్కలు, చెక్కులు, మెడలు, అరచేతులు, పగలగొట్టుచు, ముక్కుల, చెవుల నలుపుచు డొక్కలు, పిక్కలు నొప్పిపుట్టునట్లు కాళ్ళతో తన్నుచు, పోరాడుచుండిరి. పిడుగులవంటి పిడికిళుల పోటులతో వారి శరీరములు గాయములతో నిండినవి. అందుండి రక్తముకారుచుండ వారు పూసిన మోదుగులవలె నుండిరి. అంత శ్రీకృష్ణుడు జరాసంధుని జన్మమరణ ప్రకారములను తెలిసికొని, భీమున కలసట లేకుండునట్లుగా అతని శరీరమున తన తేజమును నిలిపి, భీముడు చూచుచుండగా ఒక చెట్టుకొమ్మను చక్కగా రెండుగాచీల్చి చూపెను. ఆకిటుకును తెలిసికొని భీముడు జరాసంధుని పడద్రోసి

వాని కాలిని తనకాలితో త్రొక్కి రెండవ పాదమును కదలకుండపట్టి ఏనుగు తాటి చెట్టును చీల్చునట్లు వాని శరీరమును వేరువేరు భాగములుగా చీల్చి గర్జింపగా పురజనములు భయపడి హాహాకారములచేసిరి. అంతకృష్ణార్జునులు భీముని ఆలింగనముచేసికొని ఆతని అత్యద్భుత పరాక్రమమును ప్రశంసించిరి. శ్రీకృష్ణుడు జరాసంధుని కుమారుడగు సహదేవుని మగధరాజ్యమునకు పట్టముగట్టెను. జరాసంధుడు చెరబెట్టిన రాజుల నందఱను విడిపించెను. ఆ రాజులెల్లరు భక్తవత్సలుడైన శ్రీకృష్ణుని బహువిధముల స్తుతించిరి. అంత శ్రీకృష్ణుడు వారికిట్లు బోధించెను ఓ రాజులారా! రాజ్యమదముచే కన్నుమిన్నుగానక బ్రాహ్మణులను, ప్రజలను కష్టపెట్టి నందుననే వేనుడు నహుషుడు, రావణుడు, కార్తవీర్యార్జునుడును నాశనమైరి. ధర్మముగ పరిపాలించిన రాజులవంశము వృద్ధిచెందును. బలము సంపొందును, ఆయుస్సు పెరుగును, అభివృద్ధి కలుగును. కావున మీరు దేహము శాశ్వతముకాదని ధర్మములను ఆచరింపుడు. ప్రజలకు సౌఖ్యములను సంపదలను కలిగింపుడు. యజ్ఞములను చేయుడు. నా పాదపద్మముల సేవించుచు పుణ్యాత్ములై మెలగుడు. అట్లుచేసినచో మీకు బ్రహ్మసాయుజ్యము కలుగును. నా పాదములపై నిశ్చలమైన భక్తికుదురును. అని బోధించి వారికి మంగళస్నానముల చేయించి, వస్త్రమాల్య, ఆభరణములనిచ్చి భోజనతాంబూలములచే సంతుష్టులనుచేసి, ఆయా వాహనములపై నెక్కించి వారిని పంపెను. రాజులు శ్రీకృష్ణునిచే, బంధవిముక్తులై తమతమ పట్టణములకు సుఖముగా చేరుకొనిరి. శ్రీకృష్ణుడు భీమార్జునులతో పాటు మగధలో సహదేవుని సేవలను గైకొనుచు కొన్నిదినములుండి, పిమ్మట యింద్రప్రస్థపురమునకు పోయి, పురద్వారమున విజయశంఖములను పూరించిరి. ఆ విజయధ్వనులను విని పౌరులు జరాసంధుడు చచ్చెనని సంతసించిరి. శ్రీకృష్ణుడు భీమార్జునులతో కలిసి పురమున ప్రవేశించి ధర్మరాజునకు నమస్కరించి తాము పోయినప్పటినుండి జరిగిన వృత్తాంతమంతయు వినిపించెను. ధర్మరాజు శ్రీకృష్ణుని మాహాత్మ్యమునకు తమపై శ్రీహరికి గల స్నేహదయాది గుణములకు సంతసించి శ్రీ కృష్ణుని ప్రస్తుతించెను. అంత ధర్మరాజు శ్రీకృష్ణుని యనుమతిచే మహావిజ్ఞానవంతులైన వారిని ఋత్విక్కులనుగా వరించి వ్యాసుడు, కశ్యపుడు భరద్వాజుడు ఉపహూతి, విశ్వామిత్రుడు, వీతిహోత్రుడు, మైత్రేయుడు సుమంతుడు, మధుచ్ఛందుడు, గౌతముడు, సుమతిభార్గవుడు, వసిష్ఠుడు, వామదేవుడు, కణ్వుడు, జైమిని, ధౌమ్యుడు మొదలగు మునీశ్వరులను భీష్మద్రోణ ధృతరాష్ట్ర, విదుర కురు

కుమారాదులైన బంధువులను కులవృద్ధులను, బ్రాహ్మణ, క్షత్రియవైశ్య, శూద్రులను ఆహ్వానించి సంతోషముతో వారు రాగా ఆయాకార్యములను పరీక్షించుచుండుటకు తగినవారిని నియమించెను. ఋత్విజులు స్వర్ణమయములైన యాగోపకరణములతో ఏలోపము లేకుండ రాజసూయమును చేయించుచుండిరి. రాజులందరు కానుకలుగ తెచ్చిన స్వర్ణములను రత్నములను, గుఱ్ఱములను, శ్వేతవస్త్రములను స్వీకరించుపనిలో దుర్యోధనుని నియమించెను. యాచకులు కోరినవస్తువులనెల్ల పంచిపెట్టుటకు కర్ణుని సరసములైన అన్నపానాది పదార్థములను, పాకములు చేయించుపనిలో భీముని, శ్రీకృష్ణుని వద్ద సకలోపచారములు చేయుటకు అర్జునుని, యాగమునకు కావలసిన వస్తువులను తెప్పించుపనిలో నకులుని, దేవ, గురు, వృద్ధ బ్రాహ్మణాదులను పూజించుటకు సహదేవుని, అందఱిని యిష్టములైన అన్నములతో సంతృప్తి పరచుటకు ద్రౌపదిని నియమించెను. అష్టదిక్పాలురు బ్రహ్మమొదలగు దేవతలు రాజసూయమునకు వచ్చియింత యద్భుతముగ నిర్వహింపబడిన యాగమును మేమెన్నడును చూడలేదు. అన్నిటికంటె ముఖ్యముగా శ్రీవిష్ణు పదములను సేవించు భాగ్యము లభించుటకంటె మహాభాగ్యమింకేమి కలదని ప్రశంసించిరి. రాజసూయ యాగము సమాప్తిచేయు దినమున యాజకులను, సదస్యులను, గురువులను, బ్రాహ్మణులను పూజింపవలసిన సందర్భమున మొట్టమొదట ఎవరిని పూజింపవలెనని ధర్మరాజు ప్రశ్నింపగా ఎవరికి తోచినది వారు చెప్పుచుండిరి. అప్పుడు వివేకవంతుడు, చతురోక్తి దురంధరుడగు సహదేవుడు వారి మాటలను వారించి యిట్లు పలికెను. భగవంతుడు యదువంశ సంభవుడునైన శ్రీకృష్ణుని బూజి యీ మహాత్ముని సంతోష పెట్టినచో లోకములన్నియు సంతోషించును. అని చెప్పి ధర్మరాజును చూచి, దేశము, కాలము, యజ్ఞము, ధర్మము కర్మము, కర్తభోక్త, లోకములు, దైవము, గురువు, సాంఖ్యము మంత్రము, అగ్ని, ఆహుతులు, వేళలు, బ్రాహ్మణులు, సృష్టి, స్థితి, లయములకు కారణములు తానేయై వెలుగు తేజము, ఈశ్వరుడు ఈ శ్రీకృష్ణుడే శ్రీహరి కన్నులుమూసినచో ఈ లోకములన్నియు నశించును. శ్రీహరి కన్నులను తెరచినచో లోకములు వృద్ధిచెందును. వికసించును. ప్రభవిష్ణుడైన విష్ణువే యాగఫలము భోగించును కాన అగ్రపూజ కన్నివిధముల అర్హుడు శ్రీకృష్ణుడే కావున రాజా! నీవు శ్రీకృష్ణుని పూజింపుమనెను. సహదేవుని పలుకుల విని మునులు తమ మనస్సులలో చాల సంతసించిరి. అంత ధర్మరాజు

మునుల మనస్సులనెడి తుమ్మెదలకు పద్మములవంటి శ్రీహరి పాదములను కడిగి, ఆనీటిని తనపై చల్లుకొని ద్రౌపదిపై తన తల్లిపై, సోదరులపై చల్లెను. వారందఱు మిక్కిలి సంతోషించిరి. ధర్మరాజు శ్రీహరికి బంగారు బట్టలను, రత్నముల నొసగి పూజించెను.

శ్రీకృష్ణుని పూజించి తన కన్నులనుండి యానంద బాష్పములు కురియుచుండగా తన నయనార విందములతో సుందరాకారుడైన గోవిందుని చూడ లేకుండెను అంత దమఘోషుని పుత్రుడగు శిశుపాలుడు శ్రీకృష్ణునకు కలిగిన వైభవమును చూచి సహింపలేక కోపించి తన పీఠమునుండి లేచి చేయిఎత్తి నిర్భయముగా శ్రీకృష్ణుడు వినుచుండ సభలోని వారల జూచి యిట్లనియె. చాలుచాలు ఆహాహా! యీ కాలము అట్టిది ధర్మరాజు ఈ బాలుని మాటల విని నీతి నెందుకు తప్పెను. ఈ సభలో విజ్ఞానవంతులు, తపస్సంపన్నులు, నియమ శీలురు, తేజస్సంపన్నులు ఐశ్వర్యవంతులు, శక్తిసంపన్నులు. పరతత్త్వము తెలిసినవారు సకలలోక పూజితులు, పుణ్యాత్ములు, పరమ యోగీంద్రులు ఇందఱుండగా, పాత్రాపాత్ర వివేకము లేకుండా గోపాలుని పూజచేయుటకు వీరందఱెట్లు సహించిరి. పురోడాశము నక్కకు తగునా? ఇతడు కులగోత్రములు లేనివాడు యయాతి శాపముచే యదువంశమునకు రాజ్యార్హత లేదు. ఇతడు పూజింపతగినవాడా! అని శ్రీకృష్ణుని దూషించెను. కృష్ణుడు నిర్లక్ష్యముగ నుండెను. మునులు, రాజులు, శిశుపాలుడు కృష్ణుని నిందించి నందులకు బాధపడు చుండిరి. పాండవులు, కేకయ సృంజయ రాజులు ఆయుధముల ధరించి శిశుపాలుని యెదిరించి నిల్వగా శిశుపాలుడు వెనుకకు తగ్గక కత్తిడాలు పుచ్చుకొని, శ్రీకృష్ణుని, ఆయన పక్షమును వహించు రాజులను నిందించుచుండ కృష్ణుడాగ్రహించి, తన చక్రముచే శిశుపాలుని మస్తకచ్ఛేదము చేయగా శిశుపాలుని పక్షము వహించిన రాజులు, వాని సైన్యము పాఱిపోయిరి.

ఆ సమయమున మునీశ్వరులు రాజులు చూచుచుండ శిశుపాలుని శరీరము నందలి తేజము శ్రీకృష్ణుని దేహమున ప్రవేశింపగా వారందఱు ఆశ్చర్యపడిరి. శ్రీకృష్ణుని పై పగయాని సర్వకాలములందు తనని తలంచుచుండుటచే శిశుపాలుడు తన పాపములు తొలగగా, బ్రహ్మకుగాని యీశ్వరునకుగాని అందని పదమును పొందెను. అంత ధర్మరాజు ఋత్విక్కులకును, సదస్యులకును భూరి దక్షిణల నిచ్చి వారిని పూజించి, మహావైభవముతో ఆనందముతో రాజులు, పురజనులు,

అంతఃపుర స్త్రీలు, బంధువులు, తన్ననుసరింపగా గంగా ప్రవాహమునకు పోయి, ద్రౌపదితో పాటు శాస్త్రప్రకారము అవభృథస్నానము చేసెను. దేవదుందుభులు మ్రోగినవి. పూలవాన కురిసెను. మునులు, దేవతలు, పితరులు, రాజులు, ధర్మరాజును ప్రశంసించిరి ఇట్లు ధర్మరాజు అసాధ్యమైన తన కోరిక యను సముద్రమును శ్రీకృష్ణుడను నావచే దాటి మిక్కిలి శుభ సంపదలతో నొప్పి మనోవ్యథ లేకుండా ఆనందమున నోలలాడుచుండెను విష్ణువును సేవించు వారికి అసాధ్యములుండునా ? రాజసూయ యాగప్రభావమునకు ప్రజలెల్లరును సంతోషించిరి. దుర్యోధనుడు విషాదమును పొందెను. దానికి రాజసూయ సందర్భమున వివిధ రాజులొసంగిన రత్నరాశులచే పాండవుల లక్ష్మి మిక్కిలి పెంపొందుట. ఎక్కడను వినబడనిది యెప్పుడును ఎవరును చూడనిదియైన సభ ధర్మరాజునకు దక్కుట. ఆ మయసభలో తాను తికమక పడగా భీమాదులు నవ్వుట. భూభారమును తగ్గింపదలచిన శ్రీకృష్ణుడు దుర్యోధనుని పరిహసించుటను వారించలేదు. శ్రీకృష్ణుడు రాజులను బంధవిముక్తులను చేయుట, రాజసూయ మును రక్షించుట, శిశుపాలుని వధించుటలను పఠించిన వారికి కోరికలు సిద్ధించును. పుత్రవృద్ధి కలుగును. కీర్తివ్యాపించును, వివేకము ప్రాప్తించును. విష్ణు లోకము సిద్ధించును.

సాల్వుడు ద్వారకపై దండెత్తుట.

రుక్మిణీ స్వయంవర సందర్భమున, శిశుపాలునకు సహాయుడుగ వచ్చిన, శిశుపాలుని మిత్రుడు సాల్వుడు. ఇతడు తన సైన్యముతో పాటు యాదవ సైన్యముతో పోరాడి కృష్ణునిచే ఓడిపోయెను ఓటమి పొందినప్పటినుండి సాల్వుడు లోలోన మండుచు భూమిపై యాదవులను లేకుండ చేయుదునని ప్రతిజ్ఞనుపూని, ఒకచోట ప్రతిదినము పిడికెడు దుమ్ము ఆహారముగ గొని శివుని గూర్చి తపము చేయుచుండెను. నిశ్చలమైన భక్తితో శివుని ధ్యానించుచు నొక సంవత్సరము తపముచేయగా శివుడు సాల్వుని భక్తికి మెచ్చివానికి ప్రత్యక్షమై వరము కోరు కొనుమనెను. సాల్వుడు శివునకు నమస్కరించి చేతులను జోడించి మహాదేవా ! నీవు నన్ను రక్షించెదవేని గరుడ, గంధర్వ, యక్ష, రాక్షస, దేవ, మానవులకు సాధ్యపడక నేను తలచినచోటికి, ఆకాశమున పయనించగల వాహనము నాకు దయచేయుము. అని ప్రార్థించెను. అంతట శివుడు సంతసించి వానికోరికకు తగినట్లు ఒక పట్టణమును నిర్మింపుమని, మయునకాజ్ఞ నిచ్చెను. అంత మయుడు

మిక్కిలి విశాలమైనదియు, ఎక్కడకు కావలెననిన అక్కడకు పోవునదియు, లోహముచే నిర్మింపబడినదైన సౌభకమను పేరుగల విమానమును సాల్వున కిచ్చెను. సాల్వుడు తనకు విమానము లభించినందులకు మిక్కిలి సంతోషించెను. సాల్వుడు తన విమానమునెక్కి యాదవులపై గల వైరముతో వరము పొంది తినను గర్వముతో తన సేనతో ద్వారకను ముట్టడించి, సరోవరముల పూడ్పించి, బావులను కలంచి, తోపులను చెడగొట్టి, పరిఖలపూడ్చి, యంత్రముల ధ్వంసము చేసి, బంగారు వళాకములనటికి మేడలగూల్చి సంపద కొల్లగొట్టి, ప్రజలను చెలపట్టి చాలా బాధ కలిగించెను. విమానమునపైకి పోయి, చెట్లను, రాళ్ళను వర్షించుచు పౌరులను భయకంపితుల గావించెను. త్రిపురాసురులచే భూమి బాధింపబడినటుల, సాల్వుని సౌభకముచేతను, వాని సైన్యముచేతను ద్వారక మిక్కిలి కలవరపడు చుండెను, అంత ప్రద్యుమ్నుడు పౌరులకు భయపడకుడని చెప్పి సైన్యముతో యుద్ధమునకు వెడలెను. అతనితో పాటు గదుడు, శుకుడు. సాత్యకి, సారణుడు చారేదేష్ణుడు సాంబుడు అని రుద్ధుడు అక్రూరుడు మొదలగు యాదవవీరులు కృతవర్మతో పాటు చతురంగ బలముల సమీకరించు కొని యుద్ధమునకు వచ్చిరి. యాదవ సాల్వసైన్యములకు దేవదానవులకువలె, యుద్ధము భయంకరముగా సాగెను. సైనికులు బాణములవేయుచు ఖడ్గములతో చీల్చుచు గదలచే మోదుచు, పరిఘములచే బాదుచు, కుంతములచే గూల్చుచు, ముసలములచే మర్దించుచు, పోరాడుచుండిరి. అంత ప్రద్యుమ్నుడు మాయా కోటిచే బాణముల వర్షించి, కోట్లకొలది బాణములచే సాల్వుని బలముల చీల్చి చెండాడెను. అంత సాల్వుడు సాంబునిపై బాణముల ప్రయోగించి, బాధించగా పదునైదు బాణములను సాల్వుని గుండెలో దూరునట్లుచేసి, యిరువది బాణములతో వాని విమానము కంపింపజేసెను, గదుడు వీరవిహారముసేయుచు సాల్వసైనికుల తలల నఱికివడవేయు చుండెను. సాత్యకి, మిక్కిలి కోపముచే సాల్వుని చతురంగ బలములనెడి చీకటిని సూర్యకిరణములవలె తీవ్రములైన బాణములచే నశింపజేయుచుండెను. భానువిందుడు, చారుదేష్ణుడు శుకుడు సారణుడు అక్రూరుడు కృతవర్మ మొదలగు యాదవవీరులు సాల్వుని బలముల రూపుమాపుచుండిరి. అప్పుడు సాల్వుడు మండిపడుచుండెను. అతని సౌభకమను విమానము ఒకసారి ఆకాశమున కనిపించి వొకసారి భూమిపైకి వచ్చి, ఒక మాటు పర్వతశిఖరముననుండి మఱియొకమాటు సముద్రమధ్యమున వ్రాలి ఒకసారి సాల్వుడందున్నట్లు కనపడి, యింకొకమాఱు అందెవ్వరులేనట్లు

తోపించి పెక్కు విధముల తిరుగుచుండెను. సాల్వుడు తన సైన్యమును పురి కొల్పుచుండెను. ప్రద్యుమ్నుడు సాల్వుని మంత్రియగు ద్యుముని శక్తిచే మూర్ఛపోయి, మరల మూర్ఛనుండి తేరుకొని ద్యుముని శరీరముపై ఎనిమిది బాణములను వేసి, గుఱ్ఱములను నాల్గు బాణములచేతను, సారథి నొకబాణము చేతను కూల్చి, రెండు బాణములచే వాని విల్లును విఱిచి, మొక బాణముచే వాని కంఠమును దెంచెను. అంత సాంబుడు మొదలగు యదువీరు లతనిని ప్రశంసించిరి. సాంబుడు మొదలగువారు సాల్వసైనికుల తలలను తాటిపండ్లను వలె నేలపై పడగొట్టుచుండిరి. ఇట్లు యాదవులకు సాల్వునకు ఇరువది యేడు దినములు ఘోరయుద్ధము జరిగినది. శ్రీకృష్ణుడు ఇంద్రప్రస్థమున నున్నప్పుడు ఉత్పాతములు కనబడగా వెంటనే రథారూఢుడై ద్వారకకువచ్చి, యాదవులకు సాల్వుని బలమునకు జరుగు యుద్ధమును చూచి, యాదవులకు సమీపింప సాధ్యముకాని సౌభక విమానమును చూచి, దారుకునితో కృష్ణుడు ఆ విమానము నెదురించునట్లు రథమును నడుపుమని చెప్పగా దారుకుడట్లే చేసెను. సాల్వుని విమానము నెదుర్కొనబోవు కృష్ణుని రథమునుగాంచి యాదవులు పరమానందభరితులైరి.

సాల్వసైన్యములు చచ్చినట్లుండెను. అంత సాల్వుడు భయంకరమైన శక్తిని దారుకునిపై ప్రయోగింపగా కృష్ణుడు దానిని వెంటనే పొడిచేసి నేలపై కూల్చెను. శ్రీహరి పదునాలు బాణములచే సాల్వుని విమానమును గిర్గిర తిరుగునట్లు చేసెను. సాల్వుడు వాడిబాణముల కృష్ణుని యెడమ చేతిని నాటుకొనునట్లు వేయగా, శ్రీహరి చాపమును విడిచిపెట్టెను. అదిచూచి దేవతలు భయపడిరి. సాల్వుడు సంతసించి కృష్ణునితో, "నీవు నా చెలికాడు శిశుపాలుడు వరించగోరిన కాంత నపహరించితివి. మఱియును ధర్మరాజు సభలో నేమరుపాటున నున్న నా మిత్రుని చంపితివి. నేడు నిన్ను చంపి నా మిత్రుని ఋణము తీర్చుకొందును, నా యెదుట నిలు"మనెను. శ్రీహరి నవ్వి, "ఓరీ! భోగాలము దాపురించినవాడవగుటచే నీ విట్లు ప్రేలుచున్నావు. మూర్ఖుడా! పోపొమ్ము" అని గదను చేతితో నవలీలగా త్రిప్పి సాల్వునిపై వేసెను. ఆ గద దెబ్బచే ముక్కునుండి, నోటినుండి రక్తము కారగా మూర్ఛపోయి కొంతసేపటికి సాల్వుడు అదృశ్యుడై పోయెను.

ఆ సమయమున ఒకడు దుఃఖించుచు వచ్చి శ్రీకృష్ణుని పాదములకు మ్రొక్కి, "సాల్వుడు వసుదేవుని పట్టితెచ్చెను. దేవకీదేవి మీకీ వార్త చెప్పుమనెను" అని

చెప్పగా కృష్ణుడు విషాదమున మునిగెను. ఆహా! దైవవిధిని తప్పింప నెవ్వరికిని సాధ్యము కాదుకదా యని విలపించెను. ఆ సమయమున సాల్వుడు మాయా కల్పితుడైన కపట వసుదేవుని బంధించి తెచ్చి, "కృష్ణా! ఇదిగో నీ తండ్రి. నీవు చూచుచుండగా నితని తల నరికెద"నని తలద్రుంచి దానిని తీసికొని తన విమానమున ప్రవేశించెను. అంత శ్రీకృష్ణుడు తన సైనికులు అది మయునిచే తెల్పబడిన సాల్వుని మాయ యని తెలుపగా విషాదమునుండి తేరుకొనెను. మాయావసుదేవుని కళేబరము అదృశ్యమయ్యెను.

మునులు వచ్చి శ్రీకృష్ణుని నుతించిరి. నీ కెక్కడ, మోహశోకము లెక్కడ అని బోధించిరి. అంత మునులనుతులచే ప్రబోధితుడై శ్రీకృష్ణుడు సాల్వుని వధింపగోరి పెక్కుబాణముల కురిపించి, వాని కిరీటమును, విల్లును కవచమును విరిచెను. మఱియు మిక్కిలి కోపముచే మిక్కిలి శక్తివంతమైన శక్తిని వడివడిగా త్రిప్పి, ఆకాశమున మెఱుగులు దట్టముగా వ్యాపించగా, గదచే సాల్వుని విమానమును నేలగూల్చెను. కృష్ణుడు గదదెబ్బచే విమానమును సముద్రమధ్యమున పడవేయగా, సాల్వుడు కోరలు పెరికిన పామువలె విహ్వలుడైనను బింకముగ నేలకు దిగి చేతిలో భయంకరమైన గదను కృష్ణునిపై వేయుటకురాగా శ్రీకృష్ణుడు గదతోపాటు వాని చేతిని నఱికెను. అంత చక్రముచే వజ్రాయుధముచే నింద్రుడు వృత్రాసురుని తలను నఱికినట్లు సాల్వుని శిరమును ఖండించెను.

శ్రీకృష్ణుడు దంతవక్రుని సంహరించుట.

దంతవక్రుడు శ్రీకృష్ణుని చేతిలో మాయావియైన సాల్వుడు అతని విమానము కూలుటను విని, తన మిత్రులైన సాల్వ, పౌండ్రక, శిశుపాలురకు పరలోకక్రియల గావించెను. పిమ్మట దంతవక్రుడు పటపట పండ్లు కొరుకుచు, కన్నుల నుండి నిప్పుల గురిపించుచు గదను చేతబట్టి కృష్ణుని చంపుటకు రాగా, కృష్ణుడు మనస్సున సంతసించి గదను చేతబట్టి వానికెదురుగా నిలబడగా, వాడు కృష్ణునితో, "నీవు నా యదృష్టముచే నా కంటబడితివి. మిత్రద్రోహివైన నిన్ను నా గదచే చంపి యమలోకమునకు పంపుదును'' అనుచు గదతో కృష్ణుని నెత్తిపై కొట్టగా, కృష్ణుడు కోపించిన మదపుటేనుగువలె వజ్రాయుధమువంటి తన గదను గిరగిర త్రిప్పి దంతవక్రుని వక్షస్థలము పగులునట్లుగా వేసెను. వాడు నెత్తురు గక్కుచు పర్వతమువంటి తన దేహముతో కూలి, పెండ్రికలు చిక్కుపడ తన్నుకొనుచు ప్రాణముల వదలెను. అప్పుడందఱి కాశ్చర్యము కలుగు

చుండ, దంతవక్త్రుని శరీరమునుండి వెడలిన సూక్ష్మతేజము శ్రీకృష్ణుని దేహమున ప్రవేశించెను. అంతట దంతవక్త్రుని తమ్ముడు విదూరథుడనువాడు ఖడ్గమును ధరించి కృష్ణునిపైకి దూకబోగా, శ్రీకృష్ణుడు తన చక్రముచే వాని తల దుంచెను. ఈ విధముగ శ్రీకృష్ణుడు సాల్వుని, శిశుపాలుని, దంతవక్త్రుని, వాని సోదరుని చంపెను.

అంత మునులు, యోగులు, దేవతలు, గరుడులు, ఉరగులు, సిద్ధులు, సాధ్యులు, గంధర్వులు, కిన్నరులు అమితానందముతో శ్రీకృష్ణుని మహిమను ప్రశంసించిరి. అప్సరసలు నృత్యములు సలిపిరి. దేవతలు పుష్పవృష్టి కురిపించిరి. దుందుభుల ప్రయోగించిరి. యదు, వృష్ణి, ప్రవరులు సేవింపగా పరమానందమును పొంది, విజయగీతములను వందిజనములు గానము చేయుచుండగా, అతి మనోహరము వైభవముచే విలసిల్లుచున్నదియు నూతనాలంకారముచే నొప్పు ద్వారకానగరమున శుభముహూర్తమున ప్రవేశింపగా పురస్త్రీలు మేడలపై కెక్కి పూలను, లాజలను చల్లిరి. శ్రీకృష్ణుండు ద్వారకయందు సుఖముగా నుండెను. కౌరవ పాండవులకు యుద్ధమారంభమగుట తెలిసి, తాను ఉభయులకు కావలసినవాడగుటచే బలరాముడు యుద్ధమును చూడరాదని తీర్థయాత్రకు బయలుదేరెను.

బలరాముని తీర్థయాత్ర.

మొదట ప్రభాసతీర్థమున స్నానముచేసి దేవతలకు, పితృదేవతలకు తర్పణముచేసి, తపోధనులైన బ్రాహ్మణులు తోడురాగా సరస్వతీనది, బిందు సరోవరము, వజ్ర తీర్థము, విశాలానది, సరయు, యమున, గంగ మున్నగు నదులలో స్నానము చేసి దేవతలకు, ఋషులకు తర్పణముచేసి, బ్రాహ్మణ సంతర్పణలచేసి బ్రాహ్మణ సమేతుడై నైమిశారణ్యమున దీర్ఘసత్రము నడుపుచున్న మునులను చూచెను. వారు బలరాముని చూచి యెదురువచ్చి వినయముతో అర్ఘ్యపాద్యాదులచే సత్కరింపగా సంతుష్టుడై పరివారముతోపాటు కూర్చున్న సమయమున, తనను చూచి యెదురురాక, నమస్కరింపక పీఠముమీద కూర్చుండియున్న సూతుని చూచి, సూతుని చుట్టు కూర్చుండిన బ్రాహ్మణులను చూచి బలరాముడు కోపించి, వీడు నన్ను చూచి లేవకుండుటకు కారణమేమి? వీడు మునులనడుమ తాను ముఖ్యునివలె దురభిమానముచే వ్యాసునివలన కొన్ని కథలు నేర్చుకొని విద్వాంసునివలె విఱ్ఱవీగుచున్నాడు. ఈ నీచుడు చదివిన విద్యలు వీనికి గర్వమును కలిగించినవి. ధర్మమును రక్షించుటకవతరించిన మాకు దుష్టశిక్షణ తప్పక చేయ

తగినదని తన చేతిలోనున్న దర్భకొనతో సూతుని వధించెను. మునులెల్లరు హాహాకారములు చేయుచు బలరామునితో నిట్లనిరి: పుణ్యాత్మా! మేము ఈ సూతునకు బ్రహ్మాసనము నిచ్చితిమి. కావున నీవు వచ్చిన నితడు లేవలేదు. తెలిసి తెలిసి బ్రహ్మహత్యగావించుటచే నీ మనసెట్లు పోయినది. కావున ఓ దుష్టసంహారణా! నీకీ పాపము తొలగుటకు ప్రాయశ్చిత్తము చేసికొనుము. నీవు ధర్మము తప్పినచో మాన్పించు వారెవ్వరు. ప్రాయశ్చిత్తము చేసికొనినచో ధర్మము నిలువను దీనికి ప్రతికూల మేమున్నదో చూడుము."

ఆ మాటల విని బలరాముడు మునులతో, "కామనముచే నిట్టి పాపము జరిగినది. ఇతనికి ఆయుష్షును బలము నిచ్చినచో మీకు సంతోషమా ?' అనిన మునులు "నీ అస్త్రమహిమకు, మృత్యువునకు, మాకు భంగము కాని రీతిగా చేయు" మనిరి. ఈ సూతపుత్రుడు బలము, ఆయుష్షు, ఆరోగ్యము, విద్యా సామర్థ్యము కలిగి భువిపై విలసిల్లునని సూతుని తిరిగి బ్రతికించెను. పిమ్మట బలరాముడు మునులను జూచి, "నేను తెలియక చేసిన యీ తిరస్కారము శాంతించుటకు నేనేమి చేయవలెనో తెల్పుడు" అనగా వారు ఇల్వలుడను రాక్షసుని కుమారుడు వల్వలుడనువాడు కలడు. వాడు పర్వకాలములందు వచ్చి మా యజ్ఞశాలలను మూత్రాదులచే అపవిత్రము చేయుచుండును కాన వానిని వధించుట మాకు చాలా యిష్టము. వల్వలుని వధించిన పిమ్మట నీవు పండ్రెండు మాసములు తీర్థస్నానముల చేయుము దానిచే సర్వపాపములు తొలగు"నని చెప్పిరి.

అంతట బలరాముడు వల్వలాసురుని జూచి తన యాయుధముల ను స్మరింపగా అవి వెంటనే చేరినవి. వానిని ధరించి బలరాముడు వాని కంఠము నాగలికి తగిలించి రోకలిచే వాని నెత్తిని గట్టిగా మొత్తి వానిని చంపెను. అంత మునులు వృత్రుని చంపిన ఇంద్రునివలె వల్వలుని చంపిన బలరాముని ప్రశంసించిరి. అంత బలరాముడు కౌశికలో స్నానముచేసి సరయూనదిలో మునిగి, ప్రయాగలో త్రివేణి స్నానముచేసి పులస్త్యాశ్రమమునకు పోయి, గోమతిని చూచి గండకిని దాటి, విపాశలో స్నానమాడి, గయలో నదీస్నానముచేసి, గంగాసాగర సంగమము చూచి ,మహేంద్రపర్వతమున పరశురాముని దర్శించి, సప్తగోదావరికి పోయి స్నానముచేసి, వేణీపంపా సరోవరములను చూచి, భీమనదికిపోయి కుమారస్వామిని జూచి, శ్రీశైలమునకు పోయి మల్లికార్జుని సేవించి, వెంకటాచలమునకు పోయి, కంచికేగి కామాక్షిని సేవించి, కాంచీపురికి పోయి, పిమ్మట

కావేరీతీరమున శ్రీరంగనాథుని సేవించి, వృషభాద్రి, హరిక్షేత్రము, మధుర, సేతుబంధము, రామేశ్వరముల దర్శించి తామ్రపర్ణికిపోయి, మలయపర్వతము వెళ్ళి అగస్త్యుని దర్శించి నమస్కరించి దక్షిణ సముద్రమును చూచి, కన్యా కుమారి చేరనున్న దుర్గాదేవిని కొల్చి పంచాప్సరము, గోకర్ణము, కామదేవి, తాపి, నిర్వింధ్య, పయోష్ణీతీర్థ క్షేత్రముల దర్శించి. ప్రభాసతీర్థమునకు వచ్చి బ్రాహ్మణులవలన భారతయుద్ధ వృత్తాంతమును విని, గదాయుద్ధమునకు సిద్ధ పడిన భీమ దుర్యోధనులఁగాంచి మీలో ఒకడు బాహుబలమునను రెండవవాడు అభ్యాస విశేషమునను అధికుడు. కావున ఏ ఒక్కనికి జయములేదు. మీరు పోరాడవలదు అని చెప్పినను పూర్వవైరములను తలంచి వారు పోరాడుటకే నిశ్చయించిరి. అంత బలరాముడు వీరి మంచి చెడ్డలు ఎట్లు కావలసియున్నవో అట్లే కావిమ్మని తన పట్టణమున ప్రవేశించి సుఖముగా నుండెను.

కు చే లో పా ఖ్యా న ము.

రాజేంద్రా! గోవిందుని స్నేహితుడగు కుచేలుడను ఒక బ్రాహ్మణుడు కలడు. అతడు అభిమానధనుడు, వైరాగ్యసంపన్నుడు, శాంతుడు, ధర్మాత్ముడు, జితేంద్రియుడు, బ్రహ్మవేత్త. అతడు దరిద్రుడైనను తనకు లభించు దానే పరి వేలనుకొని మనస్సున సంతృప్తిపడుచు భార్యాపుత్రుల నొకవిధముగ పోషించు కొనుచుండెను. కుచేలుని భార్య ఉత్తమ యిల్లాలు. పిల్లలు ఆకలిమంటచే వకవక లాడుచు కన్నీరు కార్చుచు, "అమ్మా! మాకు పట్టెడన్నము పెట్టమ్మా" అని విస్తళ్ళు తెచ్చి ముందుపెట్టుకొని అడుగగా ఆమె కడుపు తరుగుకొనిపోయినది. అదిచూచి ఆమె భరింపలేక తన భర్తతో- "మనలను పేదతనము పీడించుచున్నను దీనిని తొలగించుకొను ఉపాయమును ఆలోచింపవైతివి. ఓ మహాత్మా! నీకు బాల్యస్నేహితుడైన పద్మనేత్రుని దర్శించి యీ దుఃఖమనెడి చీకటిలోనున్న, మమ్ము ఉద్ధరింపుమని మఱియును ఆ కృష్ణుడు వరముల నిచ్చువాడు సాధువు లపై ప్రీతికలవాడు. ఆర్తులకు దిక్కైనవాడు. కృపాసముద్రుడు. నీవు ద్వారకా పురమున ఆయనను చూచుటకు పోయినతో నీకు వెంటనే సంపదల నిచ్చును.

"కలలోనైనను తనను అంతకు ముందు చూడని ఎంత కఠినాత్ముడైనను ఆపత్సమయమునందు తనను స్మరించినతో వాని పీడను తొలగించి రక్ష నైనను యిచ్చును."

ఆర్తితో నిశ్చలమైన భక్తితో తనను సేవించువారికి విశేషసంపదల నివ్వడా!" అని భార్య చెప్పిన మాటలు విని కుచేలుడు కృష్ణుని దర్శించుట యిహపర సాధకమని తలచి భార్యతో నీవు చెప్పినట్లు శ్రీకృష్ణుని పాదపద్మముల దర్శించుట మిక్కిలి సుకములను కల్గించును. ఆ కృష్ణునకు కానుకగా తీసికొనుపోవుట కేమైనా కలదా? అని భార్యనడుగగా ఆమె కొన్ని అటుకులను కుచేలుని కొంగునకట్టి పంపగా అతడు గోవింద దర్శనము నందుత్సాహము కలవాడై ద్వారకకు పోవుచు దారిలో నిట్లనుకొనెను. ద్వారక కెట్లు పోదునో, పోయి అంతఃపురమున నున్న శ్రీకృష్ణునెట్లు చూతునో? ద్వారపాలురు నన్ను చూచి యితడెక్కడి బ్రాహ్మణుడు ఇచటి కెందుకు వచ్చెనా? అని నన్నడ్డగింతురేమో! వారికే దైన యిచ్చి లోపలికి పోవలెననిన, నాదగ్గర ధనములేదు. ఆతని దయ నా భాగ్యము. అతడు నన్ను తప్పక ఆదరించును అని ద్వారకలో ప్రవేశించి పదు నారు వేల స్త్రీలవిలాసముల సంగతిచేతను, బంగారు గోపురములుగల మేడలను చూచి చాల ఆనందించి సంతోషబాష్పముల రాల్చి యొక భార్యా రత్నమందిర మున స్త్రీలు చామరములు వీచుచుండగా మెత్తని హంస తూలికాతల్పమున తన భార్యతో వినోదించుచు మన్మథునకు మన్మథునివలెనున్న పద్మాక్షుని—

సీ॥ ఇందీవర శ్యాము వందిత సుత్రాము
కరుణాలవాలు భానుకళ పోలు
కౌస్తుభాలంకారుఁ గామితమందారు
సురుచిర లావణ్యు సురశరణ్యు
హర్యక్ష నిభమధ్యు నఖిల లోకారాధ్యు
ఘనచక్రహస్తు జగత్ప్రశస్తు
ఖగకులాధిపయానుఁ గౌశేయపరిధానుఁ
బన్నగశయను నబ్జాతనయను

తే॥ మకరకుండల సద్యూభు మంజుభాషు
నిరుపమాకారు దుగ్ధసాగర విహారు
భూరిగుణసాంద్రు యదుకులాంభోధిచంద్రు
విష్ణు రోచిష్ణు జిష్ణు సహిష్ణు కృష్ణు.

చూచి చేరబోగా బక్కచిక్కినవాడును, చినిగిన దోవతికలవాడు. దరిద్రుడునగు కుచేలుని చూచి వెంటనే పాన్పు దిగి ఎదురుగా వచ్చి కౌగిలించుకొని స్నేహా

ముతో పిలుచుకొని వచ్చి ఆదరముతో కుచేలుని తన తల్పమున కూర్చుండబెట్టి కనకకలశజలములచే కాళ్ళుకడిగి, జలమును భక్తితో తన తలపై చల్లుకొని పచ్చ కప్పురము కస్తూరి కలిపిన గంధమును పూసి, శ్రమపోవునట్లు చామరముతో విసరి, ధూపములనొసగి దీపములతో నీరాజనమిచ్చి, పూమాలల జుట్టున దురిమి, కర్పూర తాంబూలము నిచ్చి, గోవునిచ్చి స్వాగత మడిగెను. కుచేలు డమితా నందమును పొంది, మేను పులకరింప నానందబాష్పముల రాల్చెను. అప్పుడు రుక్మిణీదేవి కుచేలునకు చామరము వీచుచుండగా కుచేలుని చెమట యారిపోవు చుండెను. అంతఃపురకాంతలు కృష్ణుడు కుచేలుని గౌరవించుట చూచి యీత డెంత పుణ్యము చేసికొనెను. స్వయముగ యదువల్లభు డెదురేగి, తోడ్తెచ్చి కౌగిలించుకొని యింతగ సేవించుచున్నాడు. నిజముగ ఈ బ్రాహ్మణుడెంతటి భాగ్యశాలియో అని తలచుచుండిరి.

అంత శ్రీకృష్ణుడు కుచేలుని చేతిని తన చేతిలోనికి తీసికొని తాము గురుకుల వాసము చేసినప్పటి విషయములను కొన్ని తెల్పి కుచేలునితో "నీవు విద్యాభ్యా సము పూర్తియైన పిదప వివాహము చేసికొంటివా? ఆమె గుణశీలములలో నీకు తగినదే కదా? నీకు భార్యాపుత్రాదులపై వ్యామోహమున్నట్లు తోచదు. నేను లోకమున కాదర్శముగ నుండవలెనని, కర్మల ఆచరించునట్లు కొందఱు మనస్సులలో కామమోహములు లేక, విధి విహితమైన కర్మలను ఆచరించి, ప్రకృతి సంబంధముల తొలగించుకొని నిష్ఠతోనుందురు. మనము గురువుగారివద్ద నున్నప్పుడు తెలిసికొనవలసిన వానిని తెలిసికొని జ్ఞానము సంపాదించుట నీకు తెలియును కదా?" అని గురువును ప్రశంసించుచు, "మన గురువు అజ్ఞానమను చీకటిని పోగొట్టు దీపమై అవ్యయమైన బ్రహ్మను అనుభవించు శక్తిశాలి సత్క ర్మల గావించుచు విద్వాంసులచే పొగడబడు బ్రాహ్మణశ్రేష్ఠుడు మనగురువు. నేను సర్వులకు జ్ఞానోపదేశము చేయగలవాడనైనను గురువుగారే జ్ఞానమును ప్రసాదించుననని, యమిత భక్తితో సేవించుచుంటిని.

మన మొకనాడు గురుపత్ని యాజ్ఞచే కట్టెల తెచ్చుటకై యడవికిపోయి పెద్ద గాలివానరాగా ఆ రాత్రి నడవిలో గడిపి తెల్లవారి తిరిగి వచ్చుచుండగా మన గురువు సాందీపని మన కెదురుగ వచ్చి, 'నాయనలారా! మా కొఱకై మీరు చలికి వణకి బాధపడితిరి. మీరు గురుదక్షిణ నిచ్చి నట్లైనది. మీకు బంధువులు, భార్యాపుత్రులు, ధనము, ఐశ్వర్యము, ఆయుషు, ఆయుస్సు సమృద్ధిగానుండు

గాక' అని ఆశీర్వదించెను. గుర్తున్నదా?" అనగా విని కుచేలుడు మనము గురుకులములో చేయని పనులున్నవా! దానికేమిగాని శ్రీహరీ ముల్లోకములకు గురుడవైన నీకు గురువెవ్వడు ఇదంతయు నీవు లోకము ననుకరించుటే కదా? అని పలుక శ్రీకృష్ణుడు నవ్వి, "నీవు నాయందు భక్తిచే నాకు కానుకగా ఏమి తెచ్చితివి? అదియే నాకు పదివేలు.

పత్రమైనను, పుష్పమైనను, ఫలమైనను, జలమైనను ఏ యొకటియైనను నా యందు నిశ్చలభక్తితో నాకు సమర్పించినచో దానిని ప్రేమతో నేను పరమాన్నముగ భావించి స్వీకరింతును" అని అడుగగా కుచేలుడు తాను తెచ్చిన యటుకుల నివ్వలేక తలవంచి పలుకకుండెను. అంత శ్రీకృష్ణుడు కుచేలుడు వచ్చిన పని తెలిసికొని, యితడైశ్వర్యమును కోరి నన్ను భజింపలేదు. భార్యను సంతోషపెట్టుటకై నావద్దకు వచ్చెను. కాన నితనికి ఇంద్రాదులకు దుర్లభములైన వివిధ సంపదలను ఈ క్షణముననే యివ్వవలెనని తలచి, తనకుతానే కుచేలుని కొంగు ముడి విప్పి కొన్ని యటుకులు పుచ్చుకొని పిడికెడటుకులు తిని సంతోషముతో నింకొక పిడికెడటుకులను తినబోవుచుండ రుక్మిణీదేవి తనచేతితో శ్రీహరి చేతిని వారించి యిట్లనెను: ముల్లోకములకు సంపదను కల్గించువాడా! హరీ యీ బ్రాహ్మణునకు వివిధములైన సంపదలను కలిగించుటకు ఈ పిడికెడటుకులే చాలును. ఇక భక్షింప వలదు." కుచేలుడా రాత్రి ముకుందుని భవనమున తృప్తిగా భుజించి, మెత్తని తల్పముపై నిద్రించి, తనకు స్వర్గసుఖమునకంటె మించిన సుఖము లభించినదని సంతసించి, మఱునాడుదయముననే బయలుదేరి కృష్ణుడు కొంతదూరమువచ్చి తనను సాగనంపగా నింటికిపోవుచు, నేను పురుషోత్తముని చూడగల్గితిని నా భాగ్యమేభాగ్యము. నన్నెంతో గౌరవించి స్వయముగ పరిచర్యలు చేసెను.

ఉ॥ శ్రీనిధి యిట్లు నన్నుఁ బచరించి ఘనంబుగ విత్తమేమియు
నీని తెఱంగు గానఁబడ దెన్న దరిద్రుఁడు సంపదంధుఁడై
కానక తన్నుఁ జేరఁడని కాకశ్రీలాత్తవిహారుండు భక్తకృపాం
భోనిధి సర్వవస్తు పరిపూర్ణునిఁగా నను జేయకుండునే.

అని మనస్సులో ఆలోచించుకొనుచు తన పట్టణమునకు పోయి చంద్రకాంత శిలల మేడలు, చక్కని ఉద్యానవనములు, సరోవరములు, రత్నాలంకారభూషితులైన దాసదాసీజనములు, కలిగి విరాజిల్లు దివ్యసుందర భవనమును చూచి

యైశ్వర్యముఁబొంది యీ భవన మే పుణ్యాత్మునిదో లక్ష్మీనివాసమై యొప్పుచున్నది అని అనుకొనుచుండగా దేవకాంతలవంటి కాంతలతనిని సగౌరవముగ సంగీత నృత్య, వాద్య పురస్సరముగా భవనములోనికి పిలుచుకొని పోయిరి. అంత తన భార్య లక్ష్మీదేవివలె స్వర్ణ రత్నాభరణములతో కళకళలాడుచు నెదురు వచ్చి నమస్కరించెను. ఆ దివ్యమై భవ సంపన్నమైన భవనమున తాను తన భార్యా పుత్రులతో సుఖముగానుండి యీ సంపదయంతయు శ్రీహరి దయచే కలిగెనని నిరంతరము హరినే తలంచుచు, బంధనముల చిక్కుకొనక కపట మోహమును పొందెను.

శ్రీహరి కుచేలుని కృతార్థుని చేసినట్టి చరితమును వినెడి సజ్జనులకు ఇహపర సుఖములు, హరిభక్తియు, కీర్తియు కలుగును.

గ్రహణ స్నానము.

శ్రీకృష్ణుడు ద్వారకానగరమున సుఖముగా నుండునప్పుడు ఒక సూర్య గ్రహణము రాగా శ్రీకృష్ణుడు, బలరాముడు, దేవకీ వసుదేవులు, అంతఃపురస్త్రీలును శ్యమంత పంచకమునకు గ్రహణస్నానమునకై పోయిరి. వారితోపాటు సకల యాదవులును శ్యమంతపంచకము చేరిరి. వారచ్చట గ్రహణస్నానము చేసి, బ్రాహ్మణులకు వస్త్ర, భూషణ, ధేను, రత్న, ధరిత్రీ దానముల నొసగి మరల స్నానములచేసి హాయిగా పొన్నచెట్ల నీడల విశ్రమించుచుండిరి. అంత నచ్చటికి మత్స్య, ఉశీనర, కోసల, విదర్భ, కురు, సృంజయ, కాంభోజ, కేకయ, మద్ర, కుంతి, ఆరట్ట, కేరళాది రాజులు వచ్చిరి. మఱియు నందుడు, యశోద, గోపాలురు, గోపికలును వచ్చిరి. ధర్మరాజువెంట భీష్మ, ద్రోణ, ధృతరాష్ట్ర, గాంధారి, కుంతి, పాండవులు, వారి భార్యలు, సంజయ, విదుర, కృప, కుంతిభోజ, విరాట, భీష్మక, నగ్నజిత్, ద్రుపద, శైబ్య, ధృష్టకేతు, కాశి, రాజ దమఘోష, విశాలాక్ష, మైథిల, యుధామన్యు, సుశర్మలు, పుత్రులతో బాహ్లికుడును అచ్చటికి వచ్చిరి. వారందఱు ఉగ్రసేనాదులైన యాదవులను పూజించి సంతుష్టుల చేసిరి. వారును శ్రీకృష్ణ బలరాములు గావించు సత్కారములకు సంతుష్టులై, శ్రీకృష్ణుని సాన్నిధ్యము కలిగి సంపదైశ్వర్యవిభవముతో నొప్పుచున్న ఉగ్రసేనుడు మొదలగు యదువృష్ణి కులశ్రేష్ఠులను చూచి శ్రీకృష్ణుడు వినుచుండగా నిట్లనిరి :

"ఈ మహామహుని పాదపద్మమునుండి వెడలు పవిత్ర గంగాజలముచే మన శాస్త్రములు, వాక్కులు, మనస్సులు, మంగళకరములు పవిత్రములగుచున్నవి. ఈ మహామహుని పాదములు సోకిన స్థలము లన్నియు ముక్తికి కారణములగుచున్నవి. ఈ కృష్ణుడే మోక్షదాత. సనక సనందనాది మునులు తమయోగ దృష్టిచే ఆత్మలను వెదకి యెవని పట్టుకొనలేకపోయిరో ఆ మహామహుడు మా చర్మచక్షువులకు కనిపించుచున్నాడు. ఈ మహామహునితో నిత్యము సన్నిహిత సంబంధముగల యీ యాదవులు ఎంతటి పుణ్యవంతులో."

మ॥ నిరయ స్వర్గము లాత్మఁ గైకొనకతా నిర్వాణమూర్తైన యీ
హరిఁ జూడన్ హరితోడఁ బల్కఁ హరి మేనంటన్ హరిం బాడగా
హరితో నేగ, సహాసనాస్తరణ శయ్యావాసులై యుండగా
హరిబంధుత్వ సఖిత్వముల్ గలుగు భాగ్యం బెట్లు సిద్ధించెనో.

అనుచు యదు, వృష్ణి, భోజాంధకులు హరిదయచే సకలార్థసిద్ధులను పొందియుండుటకు తక్కిన వారెంతో సంతసించిరి. అంత కుంతీదేవి వసుదేవునితో, "నా కొడుకులు కౌరవులవలన బాధలుపడి, అరణ్యములో కష్టములకు లోనైనప్పుడు మీరు మమ్ము చూడవలదా?" అనగా వసుదేవుడు, "అమ్మా! నీవెందుకు బాధపడెదవు. విధి ప్రతికూలముగ నున్నప్పుడు మనమేమి చేయగలము. ఈశ్వరమాయచే యీ జగత్తంతయు నిండినది. ఈ మాయ తెరకవతల ఈశ్వరుడు సూత్రధారునివలె ఆడించగా అతని చేతిలో కీలుబొమ్మలవలె మనుష్యులాడుచుండురు. పాపాత్ముడు కోపిష్ఠియగు కంసునివలన మేమెంతో అల్లాడితిమి. ఈ హరికృపచే మరల నిట్లు బ్రతుకగలిగితిమి." యశోదనందుడు వారికడకు రాగానే రామకృష్ణులు వారి కెదురేగి పాదములకు నమస్కరింపగా వీరు పుత్రవాత్సల్యముతో వారి చెక్కిల నిమిరి, శిరముల మూర్కొని గడ్డము పట్టుకొని పరమానందమగ్నులై యుండిరి. అంత దేవకీదేవి రోహిణీదేవియు యశోదతో, "మీరు బంధుప్రీతితో చేసిన మంచిపనులను మేము మఱచిపోగలమా! పుట్టినది మొదలు వారిని పెంచి పెద్దచేసినందున మీరే తల్లిదండ్రులని తలచుచున్నారు. మేము తల్లులమనుట పేరుకు మాత్రమే. మీ యింటిలో రామకృష్ణులను కంటికి రెప్పలవలె కాపాడినది మీరే కదా!" అనిరి. అంత గోపికలు శ్రీకృష్ణుని జూచి, మనస్సులలో అతని కౌగిలించుకొని పరవశలైరి. శ్రీకృష్ణుడు వారిని ఏకాంత ప్రదేశమునకు పిలుచుకొని పోయి యిట్లనెను: "ఓ కాంతలారా! నేను

బలవంతులైన శత్రువులను జయించుటకై మిమ్ము వదలి రావలసివచ్చినది. దైవ మొక్కొక్కమాటు కొందఱిని కూర్చును. ఒకమాటు విడదీయును. నాపై భక్తిగలవారికే మోక్షానందము లభించును. జపము, హోమము, వ్రతము, దానము, సత్కర్మలు వీనివలన మోక్షము లభింపదు. మోక్షమునకు ముఖ్యసాధ నము భక్తియే. అట్టి భక్తి అనన్యమైన నిశ్చలమైన భక్తి మీ బుద్ధులలో నిల్చినది. మీ భాగ్యమెటువంటిదో కదా ? మీకిటమీద జన్మకర్మలుండవు" అనగా గోపికలు కృష్ణునితో—

"దేవా ! ఘోరమైన సంసారసముద్రమును దాటించునది, జ్ఞానులైన వారి హృదయములలో ధ్యానింపబడినది. అనపాదద్వయముపై ఎడతెగని భక్తి మా మనస్సుల యందెప్పటికి నిలుచునట్లు చేయు"మనగా కృష్ణుడట్లేయగునని యను గ్రహించెను. ధర్మరాజు శ్రీకృష్ణునితో, "దేవా ! నీ పాదపద్మములపై భక్తిగలిగి నీ పాదపద్మముల నాశ్రయించువారికి మిక్కిలి సౌఖ్యములు కలుగును. శ్రీకృష్ణుని భార్యలు ద్రౌపదియు కలిసిమెలసి యొకచోట కూర్చుండి సరసాలాపములచే వినోదించుచుండ ద్రౌపది లక్షణతో నీ వివాహమెట్లు జరిగినదో చెప్పు"మనగా మద్రరాజ కన్యకయగు లక్షణ యిట్లు చెప్పెను : "నేను బాల్యమునుండి నార దునివలన గోవిందుని గుణగణములను విని యనురక్తి గలిగియుంటిని. అంత మాతండ్రి ఆకాశమున కనపడక నీటిలో కనిపించు నొక మత్స్యయంత్రమును కల్పించి, యెవరును మోయలేని ధనస్సును ప్రచండ బాణములను పూజించి యుంచి, ఈ విల్లు నెక్కుపెట్టి యీ బాణములతో మత్స్యయంత్రమును పడ గొట్టిన వానిని నా బిడ్డ వరించునని చాటించెను. దేశదేశములనుండి వచ్చిన రాజ కుమారులలో కొందఱు ఆ ధనస్సును పూనలేక కొందఱు పట్టుకొనియు నెత్త లేక, మఱికొందఱు కొంత యెత్తియు మోపెట్టలేక యింక కొందఱు కొంత మాత్రము నారి నెక్కించి సిగ్గుపడి తొలగిపోయిరి. కర్ణుడు, భీముడు ఎక్కు పెట్టిరే కాని మత్స్యయంత్రమును తెలిసికొనలేకపోయిరి.

ఇంద్రతనయుడగు అర్జునుడు మత్స్యమును వేయు నుపాయము తెలిసియు మత్స్యమును చీల్పలేకపోయెను. అంత పద్మాక్షుడు విలాసముగ విల్లు నెక్కు పెట్టి బాణమును తొడిగి మీనమును ద్రుంచెను. దేవతలు పుష్పవృష్టి కురిపించిరి. నేను విజయమాలను మాధవుని కంఠమున వేసితిని. మంగళవాద్యములు మ్రోయు చుండగా శ్రీహరి నన్ను రథముపై తీసికొనిపోవుచుండగా ఆయన చిన్నతిని

చూడలేనిరాజులు మాగధము నడ్డగించి వివిధాస్త్రములతో హరిని నొంపయత్నించిరి. అంత మురారి వారిని తన తీక్ష్ణబాణములచే విఫలురను గావించెను. మేము ద్వారకకు సుఖముగా చేరుకొంటిమి. మాతండ్రి బృహత్సేనుడు నన్నును సమస్తవస్తువులను కృష్ణునకు సమర్పించి సకల యాదవులను పూజించి తన పురమునకు పోయెను.

వసుదేవుని యజ్ఞము.

ఒకనాడు దేవలాదులైన మునులు రామకృష్ణులను దర్శించుటకై ద్వారకకు వచ్చిరి. కృష్ణుడు వారి కెదురుగా పోయి నమస్కరించి వారిని తోడితెచ్చి వివిధ రీతుల సత్కరించి వారితో నిట్లనెను. మునీశ్వరులారా ! పరమ యోగీంద్రులైన మీదర్శన భాగ్యము మాకు కలిగినది. మీదర్శన, స్పర్శన, చింతన పాదార్చనలు దుర్లభములైననైనను మాకిప్పుడు సులభములైనవి.

> "జలమయములైన తీర్థములు మట్టిరాయి వీనితో నేర్పడిన దేవగణములు చిరకాలము సేవించినచో పవిత్రులను చేయును కాని సత్పురుషుల దర్శనము చేతనే జనుల పవిత్రులను చేయుదురు".

అని వారిని ప్రశంసింపగా వారు దేవా నీవు సర్వేశ్వరుడవు బ్రహ్మస్వరూపమైన వేదమునందు వ్యక్తరూపమునను అవ్యక్తరూపమున నుందువు. కావున బ్రాహ్మణకులముల నన్నిటిని బ్రహ్మకులాగ్రేసరుడవై రక్షించిన మహానుభావుడవు నీ దర్శనముచే మాజన్మయు మావిద్యయు మాతపస్సు మామహిమ సఫలములైనవి నీకు నమస్కరించెదమని వారు పోబోవుచుండగా వసుదేవుడు సత్కర్మలచే సంచిత కర్మను తొలగించుకొను ఉపాయము చెప్పుడని వారిని ప్రార్థింపగా నిఖలయజ్ఞములకు ఈశ్వరుడైన నారాయణుని గూర్చి యాగముచేసినచో ఎంతటి సంచితకర్మలైనను తొలగునని చెప్పగా వసుదేవుడు మునులతో మీరు చెప్పినట్లు దేవఋణము తీర్చుకొనుటకు యజ్ఞము చేసెదను. మీరు నాతో చేయింపుడని వారిని యాజకులనుగా వరించి యింద్రవైభవమును మించిన వైభవముతో పదునెనిమిదిమంది భార్యలతోపాటు దీక్షితుడై యాగమును వేదోక్తవిధిగా పూర్తిచేసి దక్షిణలచే ఋత్విజులను సంతుష్టులనుగాచేసి అవభృథస్నానము చేసి సమస్తబ్రాహ్మణులను, బంధువులను, రాజులను వస్త్రములచే అలంకారములచే పుష్పమాలలచే సత్కరించెను. వారందరు వసుదేవుని యజ్ఞమును వేనోళ్ళ పొగడిరి. అంతవసుదేవుడు తన నివాసమునకేగి సుఖముగా నుండెను.

శ్రీకృష్ణుడు మృతులైన సోదరులను తెచ్చియిచ్చుట.

ఒకనాడు దేవకీదేవి రామకృష్ణులు పూర్వము మృతిచెందిన సాందీపని కుమారుని తెచ్చిరని విని కంసునిచే చంపబడి యమలోకమున నున్న తన కుమారులను చూడగోరి రామకృష్ణుల వద్దకేగి కన్నీరు గార్చుచు నాయనలారా! మీరు దుష్టులను సంహరించి భూభారమును తగ్గింప భూమిపై అవతరించిన పరమ పురుషులు, సృష్టిస్థితిలయములు మీ విలాసములు. మహానుభావులరు చనిపోయిన గురుపుత్రుని తెచ్చియిచ్చి కీర్తిదెచ్చు కున్నవారు. కంసునిచే చంపబడిన నా కుమారుల నందఱిని మరలదెచ్చి నాకిచ్చి నామనస్సులోనుండు దుఃఖమును పోగొట్టుడని ప్రార్థించెను. రామకృష్ణులు తమ యోగ మాయా ప్రభావముచే సుతలమునకు పోయిరి. అంతసుతలాధిపతి సపరివారముగ ఎదురుగావచ్చి వారికి నమస్కరించి, సత్కరించి, వారిని పరికింపించి కృష్ణునితో దేవా! నేను నీదాసుడను. మీరిచ్చటికి విజయం చేసినపని యేమియో నాకాజ్ఞయిండు అని విన్నవించగా కృష్ణుడు అతనితో మొదటి యుగమున మరీచికి పర్ణ యను భార్యకు ఆఱుగురు కుమారులు పుట్టిరి. వారు సరస్వతితో బ్రహ్మరతి క్రీడలాడుచుండగా చూచి నవ్విరి. బ్రహ్మకోపించి మీరు రాక్షస యోనియందు పుట్టుడని శపించెను. వారు హిరణ్యాకశిపునకు పుత్రులై పుట్టిరి. వారు దేవతలకు లభింపగా యోగ మాయవారిని దేవకీ గర్భమున ప్రవేశపెట్టినది. వారుదేవకికి పుట్టినవారిని పుట్టి నట్లుగానే కంసుడు సంహరించెను. పుత్రశోకముచే మాతల్లి తల్లడిల్లుచు వారిని చూడ గోరుచున్నది మాయమ్మ కోరికను తీర్చుటకై నీవద్దకు వచ్చితిమి. అనగా విని బలిచక్రవర్తి ఆర్గురు కుమారులను తెచ్చియివ్వగా శ్రీహరి వారిని తన తల్లి వద్దకుతెచ్చి చూపించెను. దేవకీదేవి గొప్పదైన పుత్రవాత్సల్యముతో చనులుచేపగా సంతోషబాష్పముల రాల్చుచు వారిని కౌగిలించుకొని నన్ను గన్న అన్నలువచ్చిరని వారికి పాలుత్రాపగా వైష్ణవమాయచే మోహితులై వారు చనుబాలను త్రాగి శ్రీకృష్ణునిస్పర్శచే శాపముక్తులై స్వరూపంబులధరించి కృష్ణునకు తల్లిదండ్రులకు నమస్కరించి ఆకాశమార్గమున నిజస్థానమునకు పోయిరి. అంతదేవకీదేవి చచ్చినవారిని బ్రతికించి తెచ్చుట చాలా చిత్రమనియు ఇది అద్భుతమైన హరి మాయయే యని తలచెను.

సు భ ద్రా క ల్యా ణ ము.

అర్జునుడు తీర్థయాత్ర చేయవలెనను ఉత్సాహముతో యాత్రసాగించుచు ప్రభాస తీర్థమునకు పోయెను. అచ్చట సుభద్రకు తనపై గల ప్రేమను తెలిసికొన

దలచియు, బలరాముడు సుభద్రను దుర్యోధనున కివ్వదలచినవాడని వినియు అర్జునుడు సుభద్రను దర్శించవలెనను కోరికతో త్రిదండి వేషమును ధరించి ద్వారకకు పోయెను. ఆ పురజనులు తనను భక్తిశ్రద్ధలతో పూజించుచుండ తన కోరిక నెరవేరు వరకు ఆ పట్టణమున నేయుండదలచు చుండెను. బలరాముడు ఆ సన్యాసి కపటసన్యాసియని తెలియక అతనిని తన భవనమునకు ఆహ్వానించెను. ఆయతికి భిక్షచేయునప్పుడు మన్మథాస్త్రమువలె విహరించుచున్న సుభద్రను చూచి ఆమె సౌందర్యమును, విలాసములను గాంచి ఆమెయందే మనస్సును నిల్పెను. ఆ సుభద్రయు అర్జునుని గాంచి మన్మథబాణములకు గురియై సిగ్గు ప్రేమ, భయముగల చూపులతో చూచుచుండెను. అట్లు వారి మనస్సులు కామ వివశములై ధైర్యములను వీడి సిగ్గుతో ముందు వెనుకలాడుచుండెను. అంత సుభద్ర యొకనాడు దేవతా మహోత్సవమును నిమిత్తముతో పురము వెలుపలికి రాగా అర్జునుడు దేవకీకృష్ణుల యంగీకారమును పొంది యామె వెంటపోయి సుభద్రను సమీపించి రథముపై కూర్చుండ బెట్టుకొని పోవుచుండగా యాదవ సైన్యములు వెంటబడెను. అర్జునుడు గాండీవమునుండి శరపరంపరలను కురిపించి తన బాహుబలమును చూపించి యాదవ సైన్యముల నోడించి యింద్రప్రస్థము చేరుకొనెను. ఆవార్త విని బలరాముడు మండిపడి యతనిపైకిపోవనుండ కృష్ణుడు బంధువులు అతని పాదములపై బడి, తియ్యనిమాటలచే నతని కోపమును చల్లార్చి అతని నంగీకరింపచేసిరి. అంత బలరాముడు ఏనుగులను, గుఱ్ఱములను రథములను, మణిభూషణములను స్వర్ణవస్త్రములను దాస దాసీజనమును చెల్లెలికి అరణముగా నిచ్చిపంపెను. పిమ్మట శ్రీకృష్ణుడు మిథిలానగరమున తనకు భక్తుడైన శ్రుతిదేవుడను బ్రాహ్మణునకును, ఆ పురము నేలుచున్న బహుళాశ్వుడను రాజునకు తన దర్శనమునిచ్చి వారికోరికల నెరవేర్చవలెనని మునులు రాగా ఆవర్తాదిదేశముల దాటి మిథిలకు పోయెను. శ్రీకృష్ణుని రాక విని బహుళాశ్వుడు మిక్కిలి సంతసించి వివిధ పదార్థములను కానుకలుగా తెచ్చితానును శ్రుతిదేవుడును హరికెదురుపోయి, నమస్కరించి, మునులకు వందనము గావించి వారందరికి యథోచిత సత్కారముల గావించెను. వారిని పట్టణములోనికి సగౌరవముగ పిలుచుకొనివచ్చి అర్ఘ్యపాద్యాదులచే భోజనతాంబూలాదులచే సంతుష్టులను చేసెను. ఆ బహుళాశ్వుని కోరికపై మునులతో పాటు మిథిలా నగరమున కొన్నిదినంబులుండెను. శ్రుతిదేవుడు కూడా మునులతోపాటు శ్రీకృష్ణుని తన యింటికి పిలుచుకొనిపోయి వారిని దర్భాసనములపై కూర్చుండ

చేసి శ్రీకృష్ణునిపాదములను కడిగి పాదతీర్థమును శిరస్సున చల్లుకొని ఇల్లంతయును ఆ తీర్థముతోనే చిలికించి పత్రపుష్పఫలములను భక్తితోనిచ్చి వారిని సంతృప్తులను చేసెను. అంత శ్రీకృష్ణుడు బహులాశ్వునకును శ్రుతదేవునకును బ్రాహ్మణులపై తనకు భక్తికలదు కాన వారిని సేవించువారు తనకు మిక్కిలి ప్రీతిపాత్రులగుదురని కావుననే తాను మునులతోపాటు వచ్చితినని చెప్పివారి ననుగ్రహించి, మునులను నిజస్థానములకు పంపి తాను ద్వారకకు వచ్చి సుఖముగా నుండెను.

విష్ణుసేవా ప్రశస్తి.

పరీక్షిత్తు శుకయోగితో నిట్లడిగెను. యోగీంద్రా! దేవతలలో, మానవులలో శివుని ఆరాధించువారు సంపదలతో తులతూగుటయు, శ్రీహరి నారాధించు వారు పేదవారుగా నుండుటకు కారణమేమి? యని అడుగగా శుకయోగి శంకరుడు గొప్పశక్తిశాలి, సత్వరజస్తమో గుణములచే కూడినవాడు కావున రాగాదులతో కూడి విరాజిల్లు సంపదలను శివభక్తులు పొందుచుందురు. అనంతుడు రాగాది రహితుడు గుణాతీతుడు అచ్యుతుడు పురుషోత్తముడునగు శ్రీహరిని భక్తితో సేవించువారు నిష్కాములై ప్రకాశింతురు. రాజసూయము ముగిసిన పిమ్మట నొకనాడు ధర్మరాజు నీవు నన్నడిగినట్లుగనే శ్రీకృష్ణుని ప్రశ్నింపగా శ్రీకృష్ణుడిట్లు చెప్పెను. ధర్మరాజా! నాకు ఎవనిపై దయకలుగునో నేనతని ధనమును క్రమముగా అపహరింతును. అతడు పేదవాడైనచో బంధువులతని సంబంధమును వదలిపెట్టుదురు. అప్పుడతడు ఒంటరివాడై చేయునదిలేక నా భక్తులతో స్నేహము చేయుచు విజ్ఞానియై అవ్యయానంద పదమగు విష్ణు లోకమును పొందును. కావున నాసేవ చేయుట కష్టమని భావించి దానిని వదలి అన్యదేవతలను సేవింతురు. అట్లు సేవింపగా వారికి కలిగిన శుభములను నిత్యములు సత్యములని నమ్మి అవితమకిచ్చిన వారినే మఱచివారికే, కీడును కల్గింప బూనుదురు. దీనికి ఉదాహరణముగ ఒక కథను చెప్పెద వినుము.

వృకాసురుని కథ.

శకుడను రాక్షసునకు వృకుడను కుమారుడుకలడు వాడు దుర్బుద్ధిచే సజ్జనులను బాధించుచుండెను. ఒకనాడు వాడు నారదుని చూచి చేతులుజోడించి బ్రహ్మ

విష్ణుమహేశ్వరులలో శీఘ్రకాలమున వరములిచ్చువారెవరో తెలుపుమని యడిగెను. అంత నారదుడు ఎచ్చట దుర్గుణము కనిపించునో వానిపై కోపమును, ఎవనిలో సుగుణము కనిపించునో వానిపై దయను వెంటనే చూపించువాడు శివుడు అందుచేతనే బాణాసురుడు రావణుడు సంపూర్ణ శక్తిచే సేవించి అసమాన సామ్రాజ్యవైభవములను పొంది ప్రసిద్ధులైరి. కావున నీవు కూడ ఆ మహాత్ముడైన శివుని సేవించినచో త్వరలోనే నీకోరికలు సిద్ధించునని చెప్పెను. అంత వృకాసురుడు తన శరీరమును ఖండించుచు ఆముక్కలను అగ్నిలో ఆహుతి చేయుచు వారములోపల శివుడు ప్రత్యక్షము కాకపోవుటచే గండ్రగొడ్డలిచే తన తలను తెంచుకొనుచుండగా అగ్నికుండమునుండి రుద్రుడు వెలువడి సాహసము వలదువలదని వారించి, నీకేమి కావలెనో కోరుకొనుము వెంటనే యిత్తుననెను. అంతవృకాసురుడు మహాదేవా! నాచేతిని ఎవని నెత్తిమీద నుంచెదనో వాడు వెంటనే తలనూరు వక్కలై మరణించునట్లు వరమిమ్మనెను. శివుడు అట్లే యిచ్చితిననగా వృకుడు శివుడు తన కిచ్చిన వరమును పరీక్షింపగోరి వరగర్వముచే శివుని తలపై తనచేతిని పెట్టుటకు హరుని సమీపించగా హరుడు భయపడి పరుగెత్తెను. వృకుడు హరునివెంట బడెను. హరుడు పరుగెత్తి పరుగెత్తి కడకు వైకుంఠపురము ప్రవేశించి విష్ణువును సమీపించెను. అంత విష్ణువు లక్ష్మితో వినోదించుచుండినవాడు వెంటనే వినోదము చాలించి తన దివ్యదృష్టిచే శివునకు వృకాసురుని వలన కలిగిన సంకటమును తెలిసికొని వెంటనే ఒక వటువేషము వేసికొనివచ్చి వృకాసురుని చూచి నమస్కరించి తియ్యనిమాటలతో మార్గాయాసముతో అలసి నీవింత దూరమెందుకు వచ్చితివి. సుఖపెట్టవలసిన శరీరమును కష్టపెట్టుట వ్యర్థము. నీవిచ్చట కొంతసేపు విశ్రాంతి తీసికొనుము. కారణమేమి? ఏమి జరిగినదో తెలుపు మన వృకుడు హరితో జరిగిన విషయమంతయు తెలుపగా శ్రీహరి నవ్వి ఓ రాక్షసరాజా! దక్షుని శాపమున పిశాచపతియై సత్యమును మాని అబద్ధమాడుచుండు హరునిమాట నిజమని నీవు నమ్ముట నాకు వింతగా నున్నది. తాను నిజమే చెప్పినచో నీచేతిని తలపై పెట్టనిచ్చెడివాడే కదా అతని మాటను నమ్ముటమానుము. నీవు అపరిశుద్ధుడవై అతనిని తాకరాదు. పోయిగా కాళ్ళుచేతులు కడిగికొని నీరు పుక్కిలించి తరువాత అతనిని తాకవచ్చును. నీవు సందేహపడకుము అని చెప్పగా వృకుడు మాయా మోహితుడై వివేకము మఱచి, తామసముచే తన నెత్తిపై చేయిపెట్టుకొని వజ్రపుదెబ్బచే పడిన పర్వతమువలె నేలగూలెను. వానితల నూరు ముక్కలయ్యెను. అంతదేవతలు

విష్ణువుపై పూలను కురిపించిరి, గంధర్వులు పాడిరి మునులకు భయము తొలగినది. విష్ణువు చిఱునగవుతో హరుని చూచి మహేశ్వరా! ఈ రాక్షసుడు నీ కపకారము చేయబూని తానే నశించెను. ఇది నిజమే ఈ లోకమున పెద్దవాని కపకారము చేసినవానికి శుభము కలుగునా! జగదీశ్వరుడవైన నీ కవమానము చేయదలచిన వీడు గతించుట వింతకాదు. ఇట్టి దుష్టచిత్తులకు ఇటువంటి వరము లిచ్చుట చేయతగినదికాదు. అని శివుని పోయిరమ్మనగా శివుడు గోవిందుని పెక్కు విధముల నభినందించి తన నివాసమునకు పోయెను. ఈ యాఖ్యానమును చదివిన వారికి వినినవారికిని నిత్యానంద సౌఖ్యములు కలుగును. అపైముక్తి లభించును. అని చెప్పి శుకయోగీంద్రుడు పరీక్షిత్తునకు మఱియొక పురావృత్తమునిట్లు చెప్పదొడగెను. ఒకానొక సమయమున తపోమహిమగల మునులు సరస్వతీ నది తీరమున క్రతువుల చేయుచుండిరి. ఆ మునులకు బ్రహ్మవిష్ణు మహేశ్వరులలో అధికుడెవ్వడు? అను విషయమై చర్చ జరిగినది. అంతవారందరు కలసి భృగు మహర్షితో నీవు త్రిమూర్తుల గొప్పతనము తెలిసికొని రమ్మని చెప్పిరి.

భృగుమహర్షి త్రిమూర్తుల మహత్త్వము శోధింపబోవుట.

మహర్షుల కోరికపై భృగుమహర్షి బ్రహ్మదేవుడు సత్యలోకమున కొలువుండు సమయమున సభలోనికిపోయి నమస్కరింపక, ప్రశంసింపక యూరకుండెను. అంతబ్రహ్మ భృగుమహర్షి అవినయమునకు మనస్సున మండిపడినను ఆ మహర్షి తన కుమారుడగుటచే కోపము నణచుకొనెను. భృగువు సత్యలోకమునుండి హిమాలయమున కైలాస పర్వతమునకేగి పార్వతితోపాటు విశ్రమించుచున్న చంద్రశేఖరుని చూచెను. పరమేశ్వరుడు భృగువును చూచి సంతోషపడి యతడు తనను కౌగిలించుకొనునని సంబరపడి యతని కెదురుగా పోయెను. భృగు మహర్షి యీశ్వరునిలోని సత్త్వగుణమును పరీక్షింపదలచి శివుని యుపేక్ష గావించెను. అంతశివుడు ప్రళయకాలమునందలి అగ్నివలె భయంకరుడై కన్నుల నుండి నిప్పుల రాల్చుచు శూలముతో నతని ఱొమ్మును పొడవదలచుచుండ పార్వతీదేవి శివుని పాదములపై వ్రాలి నమస్కరించి తియ్యని పలుకులతో ఫాలాక్షుని కోపమును శాంతింపచేసెను. అంత భృగువు కైలాసమును వదలి వైకుంఠమునకు పోయెను. అచట లక్ష్మీదేవితో సుఖముగా నుండిన శ్రీహరి వక్షస్థలమును తన పాదముతో తన్నెను. ఆ దెబ్బతిని శ్రీహరి పాన్పుదిగివచ్చి భృగుమహర్షి పాదములకు నమస్కరించి యిటులనెను. ఓ తపోధనా! నీవు వచ్చుట

తెలియక పోయిన నాతప్పును క్షమింపుము. నాపై దయయుంచి యీ కనక సింహాసనమున కూర్చుండుమని, నీ పాదజలముచే నన్నును నా యుదరమునందున్న లోకములను, లోకపాలకులను, పుణ్యాత్ములను గావింపుము. ఓ మునీంద్రా! నీవు పాదముచే తన్నుట నావక్షస్థలమునకొక అలంకారము. నీరాకమావంటి వారికి శుభములను చేకూర్చును. నేను ధన్యుడనైతిని. అని తియ్యనిమాటలచే భృగుమహర్షి కోపమును మాన్పించెను. అంత భృగుమహర్షి శ్రీహరి మధుర వాక్కులకు మిక్కిలి సంతసించి అనంతకల్యాణ గుణనిధియగు విష్ణువును మెచ్చుకొని, ఆనందబాష్పముల రాల్చుచు అతని యందలి భక్తిచే పరవశుడై ఏమియు పలుకకుండెను. పిమ్మట శ్రీహరితో పోయివత్తునని చెప్పి అనుమతిని పొంది సరస్వతీ నదీతీరమునందున్న మునులను చూచి వారితో నిట్లనెను. బ్రహ్మ, విష్ణుమహేశ్వరుల వద్దకుపోయి బ్రహ్మ, మహేశ్వరుల సహనశక్తిని పరీక్షించుటకై వారిని నుతింపక, వారికి నమస్కరింపక వారి నుపేక్షించితిని. పుత్రవాత్సల్యముతో బ్రహ్మకోపమును దిగమ్రింగెను. మహేశ్వరుడు త్రిశూలమును ధరించి నన్ను పొడువబోయి పార్వతీదేవిచే ప్రార్థితుడై ఆ ప్రయత్నమును మానెను. వైకుంఠమునకేగి విష్ణువక్షమున పాదముతో తన్నినను నన్నతడెంతో గౌరవించెను. మహర్షులు భృగుమహర్షి వాక్కుల విని తామిట్లు తలంచిరి. చిన్మయాకారుడు అవ్యయుడు, అఖిలకల్యాణ గుణాకరుడు ఆదిమధ్యాంత రహితుడైన పుండరీకాక్షుడే త్రిమూర్తులలో అధికుడు అని శ్రీకృష్ణుని పాదపద్మములయందే చిత్తములనిల్పి సేవించి వైకుంఠమును పొందిరి.

శ్రీకృష్ణుడు మృతులైన బ్రాహ్మణ కుమారులను తెచ్చుట.

ఒకనాడు ద్వారకానగరమున శ్రీకృష్ణుడు సుఖముగానుండు సమయమున ఒక బ్రాహ్మణునకు కొడుకుపుట్టి వెంటనే చనిపోయెను. ఆ బ్రాహ్మణుడు మిక్కిలి దుఃఖించుచు పరితపించుచు, మృతశిశువును మోసికొనివచ్చి రాజద్వారమున పెట్టి కన్నీరు గార్చుచు విధినాకు దుఃఖము తెచ్చిపెట్టెను. అనుచు విధిని తనను తిట్టుకొనుచు, వినువారి గుండెలు పగులునట్లు ఏడ్చుచు చుట్టునున్నవారిని జూచి యిట్లనెను. బ్రాహ్మణ ద్వేషియై, శాస్త్రప్రకారము నడువక, పాపాత్ముడైన క్షత్రియుని చేసిన పాపముచే కొడుకు పుట్టగనే మరణించెను. అయ్యో ఏరాజు సంతతము హింసాపరుడై అన్యాయము చేయుచుండునో ఆరాజు రాజ్యము నందలి ప్రజలు నిరాశతో దుఃఖములతో మిక్కిలి బాధపడుదురు. అని వారి

యిచ్చటనుండి పోయెను. ఈ విధముగ తన కొడుకులు పుట్టగనే చనిపోవు నప్పుడు ఆ బ్రాహ్మణుడు రాజద్వారమున మృతశిశువులను పెట్టి, తాను తన్ను తిట్టుకొనుచు, దైవమును తిట్టుచు యెప్పటివలెనేదో యొకటి చెప్పుచు పోవు చుండెను. ఇట్లు ఆ బ్రాహ్మణుని యెనిమిదిమంది కొడుకులు పుట్టగనే మరణించిరి. తొమ్మిదవ కొడుకు పుట్టినవెంటనే మరణింపగా ఆ బ్రాహ్మణుడు చనిపోయిన తనకొడుకును రాజద్వారమునపెట్టి మునుపటివలె దుఃఖించుచు తనను, దైవమును, రాజును దూషించుచుండగా అర్జునుడు ఆ బ్రాహ్మణుని వద్దకు వచ్చియిట్లనెను. అయ్యా! నీవిట్లు దుఃఖించుచుండగా చూచి నీ దుఃఖమును పోగొట్టగల విలుకాడొక్కడైన యీ పట్టణమున లేకపోవుట పాపము. ఎవని రాజ్యమునందు బ్రాహ్మణులు పుత్రశోకముతో బాధపడుచుందురో, ఆ రాజు పేరునకు మాత్రమే రాజుకాని నిజమైన రాజుకాదు. బ్రాహ్మణోత్తమా! నీ పుత్రుని నేను బ్రతికించెదను. అట్లు చేయలేనిచో అగ్నిలో దూకుదునని ప్రతిన బట్టెను. బ్రాహ్మణుడర్జునుని మాటలను విని పలనయ్యాడంబములు పల్కెదవు. మిక్కిలి పరాక్రమవంతులైన రామకృష్ణులు, ప్రద్యుమ్న కుమారుడు మొదలగు యాదవవీరులు చేయలేని పనిని నీవెట్లు చేయగలవు? నీదారిన నీవు పొమ్ము. అనగా విని అర్జునుడు దురహంకారము పెచ్చుపెరగగా బొమముడిపెట్టి అచ్చటి జనులు వినుచుండగా నిట్లనెను. నేను బలరాముడను కాను కృష్ణుడను కాను. ప్రద్యుమ్నుడను కాను. అనిరుద్ధుడను కాను భయంకరమైన గాండీవాస్త్రము నుండి వాడిబాణములచే శత్రువుల సంహరించి యుద్ధరంగమును పీనుగుపెంటల గావించు ప్రచండమూర్తియైన అర్జునుడను. ఫాలాక్షునితో మల్లయుద్ధమును చేసిన నన్నెఱుగవా? మృత్యుదేవత గర్వమును పోగొట్టి నీ పుత్రుని యిప్పుడే తెచ్చెదను చూడు మనగా బ్రాహ్మణుడు ఊరడిల్లెను. కొంతకాలము గడిచిన తరువాత తన భార్యకు ప్రసవవేదన కలుగు సమయమున అర్జునునకు వచ్చి తెల్పగా, అర్జునుడు ఆచమనముచేసి, శుచియై రుద్రునకు నమస్కరించి గాండీవము నెక్కుపెట్టి, అక్షయ తూణీరముల ధరించి బ్రాహ్మణుని పురిటింటికి చుట్టు, నేలపైనను, ఆకసమునను బాణములతో పంజరమునుగట్టి జాగరూకతతో కనిపెట్టుకొనియుండెను అంతలో బ్రాహ్మణునకు కొడుకు పుట్టెనని వెంటనే చనిపోయెనని అచటి వారు తెల్పగా, బ్రాహ్మణుడు శ్రీకృష్ణుని శరణు జొచ్చి, గోవిందా! నేను ఈ పౌరుషహీనుడైన ఈ అర్జునుని డంబముల విని నిజమని నమ్మి నాపుత్రుని పోగొట్టుకొంటిని. సృష్టిస్థితిలయములకు కారణుడవై

నా కొడుకులను రక్షించుటకు సమర్థుడనైనను రక్షింపలేక నీవు చూచుచుండగా ఒక మానవుడు రక్షింపగలడా? నా కోరికను తీర్పగలడా? ఎక్కడి అర్జునుడు ఎక్కడి సత్యము? గాండీవమట, దివ్యాస్త్రములట అంతా బూటకమే, అని నిందింపగా అర్జునుడు తన విద్యామహిమచే యమపురికిపోయి, అచట బ్రాహ్మణ కుమారులు లేరని తెలిసికొని క్రమముగా ఇంద్రాది దిక్పాలుర లోకముల గాలించి, అచటను తన ప్రయత్నము ఫలింపకపోగా యక్ష కింపురుషాది లోకముల వెదకి యుస్సురనుచు భూమి మీదికివచ్చి, తనమాట దక్కనందున అగ్నిలో దుముక తలచుచుండగా, కృష్ణుడు నీకు విప్రకుమారుల చూపింతునని అగ్నిలో ప్రవేశింపకుండ అర్జునుని వారించెను. పిమ్మట కృష్ణుడు అర్జునునితో కలిసి బంగారు తేరునెక్కి బ్రాహ్మణ కుమారులను వెదకుటకై భూమినిదాటి సప్త సముద్రములను, ద్వీపములను కులపర్వతములను దాటి, మేరు పర్వతమును ఆక్రమించుచు వాయువేగముతో రథము పెనుచీకటిలో ప్రవేశించి సాహసముతో పోవుచుండగా చీకటికి కన్నులు కనబడక గుఱ్ఱములు దారి తప్పి నిలిచి పోయెను. అంత శ్రీకృష్ణుడు కారుచీకట్లను పారద్రోలుటకై చక్రమును విడిచెను. ఆ చీకటిని చక్రముచే ఛేదించి యింకను ముందునకు పోగా పెద్ద కాంతి కనబడెను. ఆ కాంతిని చూడలేక అర్జునుడు కన్నులను మూసికొనెను. కృష్ణుని రథము ఆ దివ్యకాంతిని దాటి పెద్దపెద్ద అలలతో నిండి భయంకరమై లోతైన సరోవరమున ప్రవేశించి ఆ నీటి మధ్యభాగమున కోటిసూర్యుల కాంతులతో ప్రకాశించుచు యోగీంద్రులకు గమ్యమై పరమభాగవతులకు నివాసమైన దివ్యమందిరమునందు మిక్కిలి తెల్లని దేహములు, నల్లని కంఠములు, సూర్యబింబములవలె పద్మరాగములవలెనున్న పెద్ద తలలు, నోటినుండి వెడలు విషధూమరేఖలవంటి నాలుకలు కలిగి సాయంకాలమున ప్రజ్వరిల్లు అగ్నికుండలములవలెనుండు వేడిచూపులు కలిగి మేరుపర్వతమువలెనున్న ఆదిశేషుని పడగలనెడి పాన్పుపై సుఖముగ కూర్చుండియున్న,

సీ॥ సజల నీలాంబుద శ్యామాయమానాంగు నాశ్రితావనముది శాంతరంగు
సనకాదియోగి హృద్వనజముదాశీంద్రు ముఖపద్మ రుచిజిత పూర్ణచంద్రు
కమనీయ నిఖిల జగద్హిత చారిత్రు ప్రత్యూషసంఫుల్ల పద్మనేత్రు
నిందిరాహృదయారవిందా రుణోల్లాసు శ్రీకరపీత కౌశేయవాసు

తే॥ హారకుండల కటక కేయూరమకుట కంకణాంగద మణిముద్రికావినూత్న
రత్ననూపుర కాంచీ విరాజమాను భవమహార్ణవశోషు సద్భక్తపోషు.

సునందాది పరిజనములచే సేవింపబడుచున్నవాడును. శ్రీభూదేవులతో కూడిన వాడును, నారదాది యోగీంద్రులచే కీర్తింపబడుచున్నవాడును; కరుణామృత సముద్రుడైనవాడును, ఎనిమిది చేతులు కలవాడును, కౌస్తుభ శ్రీవత్సములుగల వక్షస్థలముకలవాడును, శంఖ, చక్ర, గదా, పద్మశార్ఙ్గాది దివ్యాయుధముల ధరించినవాడును, బ్రహ్మకు తండ్రియైనవాడును అగు శ్రీమన్నారాయణుని చూచి దండప్రణామములు చేసి చేతులుజోడించి భక్తిపూర్వకముగా నిలువబడగా ఆ ఆదిదేవుడు కృష్ణార్జునులను కరుణతో చూచి ఆదరముతో చిఱునవ్వు నవ్వి వారితో నిట్లు పలికెను: "భూమికి భారముగానుండు రాక్షసులను సంహరించి, ధర్మమును నిలుపుటకై నాయంశముతో మీరు నరనారాయణులుగా భూమి యందవతరించితిరి. సుప్రసిద్ధమైన తపోనిష్ఠతో సాటిలేని కీర్తిగాంచిన మిమ్ము, యిచ్చటి మునీంద్రులు చూడగోరిరి. మిమ్మిచ్చటికి రప్పించుటకై విప్రకుమారులను ఇచ్చటికి తేవలసివచ్చినది" అని ఆ విప్రకుమారులను మీరు పిలుచుకొనిపొండని యానతిచ్చెను. అంత కృష్ణార్జునులు శ్రీమన్నారాయణునకు వినయపూర్వకముగ నమస్కరించి, ఆ దేవదేవుని ప్రస్తుతించి యచటనుండి బయలుదేరి ఆ పిల్లలలో నెవరెవ్వరేయే యీడువారుగా నుండిరో ఆ విధముగ తెచ్చి ఆ బ్రాహ్మణునకు సమర్పించగా అతడ మందానంద కందళిత హృదయారవిందుడయ్యెను. అర్జునుడు కృష్ణునితో కలిసిపోయి తాను దర్శించిన శ్రీమన్నారాయణుని స్మరించి సన్నుతించెను.

ద్వారకలో శ్రీకృష్ణుడు పూజ్యమైన రాజ్యమును పాలించుచు, ఇంద్రవైభవమును మించిన వైభవముతో నృత్యగీతాది గోష్ఠులతో మహానందముతో కాలము గడుపుచుండెను. పదునాఱువేల మంది పడతులు శ్రీకృష్ణుని పాదపద్మములను ఆశ్రయించి, రతికేళిలో సొక్కుచు బాహ్యప్రపంచమును మఱచి యుండిరి. హరి వేణుగల గీతమును వినిన మూఢులైనను ఆనందము ననుభవింతురు. అట్టిచో ఆ విశ్వరూపుని చూచుచు, ఆలింగనము చేసికొనుచు, అతనిని స్పృశించుచు ఆ హరితో నవ్వుచు, మాటాడుచుండిన ఆ సుందరీమణులు ఆనంద సముద్రమున మునుగుటలో ఆశ్చర్యమేమి కలదు?

కృష్ణు డీవిధముగ గృహస్థధర్మమును పూని ధర్మార్థ కామములను ఆ గృహస్థ జీవితమునందు చూపుచు సజ్జనులకు తానే గతియై లోకసంగ్రహమునకై సంసారివలె మెలగెను. శ్రీకృష్ణుడు తన కాంతల కందఱికి నన్నిరూపముల

స్త్రీలని యొక్కొక్క పడతియందును పదేసిమంది కుమారులను బడసెను. శ్రీకృష్ణుని పుత్రులలో బలపరాక్రమములచేతను, విజయముచేతను, సంపద చేతను సుప్రసిద్ధులైనవారు పదునెనమండ్రు. వారు ప్రద్యుమ్న, అనిరుద్ధ, దీప్తిమత్, భాను, సాంబ, బృహద్భాను, మిత్రవింద, వృకారుణ, పుష్కర, దేవబాహు, శ్రుతదేవ, సునందన, చిత్రబాహు, వరూధ, కవిన్యగ్రోధ నామములచే నొప్పుచుండిరి.

శ్రీహరి వంశమునందు రుక్మిణికి ప్రద్యుమ్నుడు, అతనికి అనిరుద్ధుడు అతనికి వజ్రుడు, వజ్రునకు ప్రతిబాహుడు, ప్రతిబాహునకు సుబాహుడు, అతనికి ఉగ్రసేనుడు, ఉగ్రసేనునకు భద్రసేనుడును పుట్టిరి. ఈ విధముగ యదు, వృష్ణి, భోజాంధక వంశములు పరమ పవిత్రులై పుండరీకాక్షుని చూచుచు, అతనితో కూర్చుండి, కలిసి పరుండి, ఆయన వెంట నడచి, ఆయనతో మాటాడి, కృష్ణునితో కలిసి భుజించి, క్రీడించుచు సర్వదేవతలో అగ్రులై సమస్త యజ్ఞములచేయుచు పరమానందమున నోలలాడుచుండిరి. శ్రీకృష్ణుడు పరమానందముతో మురళిని మ్రోగించగా సంతసించి గోపికలు, అడవికేగి యా మహానుభావుని దాస్యమును కోరి చేయుచుండిరి. విద్యాంసులు పరమానంద సంధాయకుడైన యా శ్రీకృష్ణుని సేవింతురనుటలో ఆశ్చర్యమేమున్నది ?

మ॥ మతి పెంపొంది యమంగళఘ్నమగు నామంబొప్పఁ జింతించి స
న్నుతి గావించిన, విన్న మానవులు ధన్యుల్ భూరి సంసార దు
ష్కృతులందొత్తురు కాలచక్రమహాశాస్త్రించట్టి యా కృష్ణుఁడీ
క్షితిభారం బుడుగంగ జేయుటిది యేమి చిత్రంబు భూవల్లభా !

ఈ విధముగ గోపికాజన మన్మథుడైన కృష్ణుడు లీలామానుషరూపుడై తన రాజధానియైన ద్వారకానగరమున లోకాతీతములైన దివ్యసౌఖ్యములతో వర్ధిల్లుచుండెను అని చెప్పి శుక యోగి పరీక్షిత్తునితో నిట్లనెను :

మ॥ మనుజేంద్రోత్తమ ! యేను నీకుఁ ద్రిజగన్మాంగల్యమై యొప్పఁ జె
ప్పిన యీ కృష్ణకథా సుధారసము సంప్రీతాత్ములై భక్తిఁ గ్రో
లిన పుణ్యాత్ములు గాంతురిందు సుఖముల్ నిర్ధూత సర్వాఘులై
యనయంబుం దుదిఁ గాంతు రచ్యుత పదంబై నట్టి కైవల్యమున్.

ఇట్లు శుకయోగీంద్రుడు పరీక్షిన్నరేంద్రునకు చెప్పిన విధముగా సూతుడు శౌనకాదులకు శ్రీకృష్ణచరితమును వినిపించెను. ఆ మహర్షులు, సూతమహర్షిని అనేక విధముల తృప్తిపరచి తమ మనస్సులలో ఎడతెగని భక్తితో శ్రీకృష్ణ కథాసక్తులైరి.

శరధిమదవిరామా సర్వలోకాభిరామా!
సురరిపు విషభీమా! సుందరీలోకకామా!
ధరణీవరలలామా! తాపసస్తోత్రసీమా!
సురుచిర గుణధామా! సూర్యవంశాబ్ధి సోమా!

ఓం శాన్తిః శాన్తిః శాన్తిః

దశమ స్కంధము సమాప్తము.

శ్రీమద్భాగవతము

ఏకాదశ స్కంధము

కురుక్షేత్రమున కౌరవ పాండవులకు మహాసంగ్రామము జరిగినది. ఉభయ పక్షములందు రాజులు అనేకులు నిహతులైనారు. శ్రీకృష్ణుని ఆశ్రయించిన యాదవులు మాత్రము చెక్కు చెదరలేదు. వారు అజేయులై బలగర్వితులైనారు. అట్టి యాదవులు ఉన్నంతవరకు భూభారము తగ్గదని శ్రీకృష్ణుడు గ్రహించి యదుకులమున కలహము పుట్టించ దలచినాడు.

ఒకసారి విశ్వామిత్రుడు, అసితుడు, కణ్వుడు, దూర్వాసుడు, భృగువు, అంగిరసుడు, కశ్యపుడు, వామదేవుడు, అత్రి, వసిష్ఠుడు, నారదుడు మొదలగు మహర్షులు పిండారక క్షేత్రమునకు వచ్చినారు. అచట అవినీతులైన యాదవ కుమారులు ఆటలాడు కొనుచున్నారు. వారు వినీతుల వలె వచ్చి మహర్షులకు పాదాభివందనము చేసినారు. జాంబవతి పుత్రుడగు సాంబునకు ఆడవేషమువేసి మునుల ముందుకు తెచ్చి "మహామునులారా! ఈ యువతి కడుపుతో నున్నది. బాలుని కనవలెనని ఉత్సాహ పడుచున్నది. కాబట్టి ఏ బిడ్డ పుట్టునో చెప్పండి" అని పరిహాసముగా అడిగినారు.

"మందబుద్ధులారా! ఇది మీ కులమును నాశనము చేయు ముసలమును కనును" అన్నారు వారి పరిహాసమునకు మండిపడిన మహర్షులు. మునుల శాపము విని వడకి పోయినారు యాదవులు. కడుపు పెరుగునట్లు సాంబునకు కట్టిన గుడ్డలు విప్పి చూడగా అందు ముసలము కనిపించినది.

అట్లు యాదవ కులమున ముసలము పుట్టినది.

వారందరు ముసలమును తీసుకొని ఉగ్రసేన మహారాజు సభకు వెళ్ళి యాదవులందరి ఎదుట జరిగినదంతయు విన్నవించినారు. శ్రీకృష్ణు డదివిని, మహామునులతో ఎకసక్కెములాడు వారుందురా! వారు మిమ్ము శపించినది చూడగ యాదవ వంశక్షయమేనని తెలియుచున్నది. బ్రాహ్మణ శాపము బ్రహ్మాది దేవతలకు అనివార్యము. కావున మీరీ ముసలమును సముద్ర తీరమునకు కొనిపోయి

అచటనున్న మహాపర్వతముపైగల మహాపాషాణమున నీ ముసలమును చూర్ణ మొనరించి సముద్రమున గలుపుడని యాదేశించెను. యాదవ పుత్రులు యాదేశానుసారము ఆ రోకలిని చూర్ణ మొనరించి దానియందు ఇనుప ముక్కను సరకు గొనక సముద్రమున పారవైచిరి. దానిని చేప మ్రింగినది. ముసలపుగుండ కొట్టుకొని వచ్చి ఒడ్డున చేరి తుంగగా పెరిగినది.

జాలరులు వలవేసి చేపలు పట్టినారు. ముసలపు ఇనుప ముక్కను మ్రింగిన చేప వలలో చిక్కినది. దాని కడుపులో దొరికిన ఇనుప ముక్కను కిరాతుడొకడు తన బాణమునకు మొనగా చేసి పెట్టుకున్నాడు.

కొంత కాలమునకు ద్వారకలో ఉత్పాతములు గోచరించినవి. వానిని చూచి శ్రీకృష్ణుడు యాదవులతో, "యాదవులారా! ద్వారకలో పరమదారుణమైన ఉత్పాతములు కనిపించు చున్నవి. మన కులమునకు బ్రాహ్మణ శాపము ఉండనే ఉన్నది. కాన ఇక మనము ఇచట ఒక్క క్షణమైనను నిలువరాదు. స్త్రీలు, బాలులు, వృద్ధుల సహితముగా శంఖుద్వార క్షేత్రమునకు తరలవలెను. అచటి నుండి ప్రభాస క్షేత్రమునకు వెళ్ళవలెను. అచట సరస్వతీనది పశ్చిమ దిశకు ప్రవహించుచు సముద్రమున కలియును. ఆ నదిలో స్నానాదులుచేసి దేవతలను పూజించవలెను. బ్రాహ్మణులను పూజించి భూరి దానములు చేయవలెను. వాని వలన ఇట్టి అరిష్టములు నశించును" అని బోధించినాడు.

శ్రీకృష్ణుని మాటలు విన్న యాదవులు ఆబాల గోపాలము సముద్రముదాటి, అచటినుండి ప్రభాస తీర్థము చేరినారు. శ్రద్ధా భక్తులతో శ్రీకృష్ణుడు చెప్పిన కార్యక్రమములు నిర్వహించినారు. కాని దైవము వారి బుద్ధిని పెడదారిన పట్టించినది. మతి పోగొట్టునట్టి కల్లుత్రాగి తందనానలాడి, తమలో తాము పోట్లాడుకున్నారు. ఒకరిమీద ఒకరు కత్తులు దూసినారు. ధనుస్సులు, బాణములు, కత్తులు మున్నగు ఆయుధములతో ఒకరి నొకరు చంపుకున్నారు. అడవి ఏనుగులవలె పోరాడినారు.

ప్రద్యుమ్నుడు సాంబునితోను, అక్రూరుడు భోజునితోను, అనిరుద్ధుడు సాత్యకి తోను, సుభద్రుడు సంగ్రామజిత్తుతోను, గదుడు అనుగరునితోను పోట్లాడి నారు. అందరును అరివీర భయంకరులే. అందరును అప్రతిహత పరాక్రమము గలవారే. అందరును అజేయులే. అందరును బుద్ధిమంతులే. కాని కల్లు, దాని దైవము వారి బుద్ధిని నాశనము చేసినది. దారుణమైన ద్వంద్వయుద్ధముచేసి ఒకరి

నొకరు హతమార్చుకున్నారు. దాశార్హ, వృష్ణి, అంధక, భోజ, సాత్వత, మధు, అర్బుద, మాధుర, శూరసేన, విసర్జన, కుకుర, కుంతి మున్నగు వంశీయులు స్నేహాభిమానములు మరచి ఒకరిని ఒకరు చంపుకున్నారు.

కొడుకును తండ్రి చంపినాడు. తమ్ముడు అన్నను హతమార్చినాడు. అల్లుడు మామను కూల్చినాడు. మనుమడు తాతను వధించినాడు. స్నేహితుడు స్నేహితుని చీల్చినాడు. బంధువు బంధువును నరికినాడు.

పోరాటమున వారి బాణములు అయిపోయినవి. ధనుస్సులు విరిగిపోయినవి. గదలు పగిలి పోయినవి. ఆయుధములు అంతమైనవి. అప్పుడు ముసలపు పొడితో సముద్రపు ఒడ్డున పెరిగిన తుంగతో యాదవులు ఒకరిని ఒకరు బాదుకున్నారు. కొట్టుకున్నారు. చంపుకున్నారు.

శ్రీకృష్ణుడు తుంగతో కొట్టుకొనవలదని వారించినాడు. కాని యాదవులు కృష్ణుని మాట వినలేదు. బలరామ కృష్ణులను సహితము తమ శత్రువులుగనే యాదవులు భావించినారు. తుంగ పెరికి వారిపై యుద్ధమునకు బయలు దేరినారు. బలరామ కృష్ణులును తుంగను పెరికి వారిని చావ బాదినారు.

బ్రహ్మశాపోపసృష్టానాం కృష్ణమాయావృతాత్మనామ్.
స్పర్ధాక్రోధః క్షయం నిన్యే వైణవోఽగ్నిర్యథా వనమ్.

బ్రాహ్మణ శాపము తగిలినవారు, కృష్ణమాయచే అవృతులైనవారును అయిన యాదవులు స్పర్ధ మరియు క్రోధము వలన, వెదురువనము అగ్నిచే దగ్ధమైనట్లు నశించినారు.

యాదవ కులము సర్వము నశించగ భూ భారము తేలిక అయినదని శ్రీకృష్ణుడు భావించినాడు.

బలరాముడు సముద్రతీరమున కూర్చున్నాడు. పరమపురుషుని ధ్యానించుచు యోగము అవలంబించినాడు. ఆత్మను ఆత్మస్వరూపమున స్థిరపరచి మానవలోకమును విడిచినాడు.

కిరాతుని శరము.

అన్న పాంచ భౌతిక శరీరమును వీడుట శ్రీకృష్ణుడు చూచి రావిచెట్టు మొదట కూలబడినాడు. అతని శరీరకాంతి పొగలేని అగ్నివలె నీలమేఘ శ్యామలమైన

అతని దేహముయొక్క కాంతి నలుదిశల ప్రసరించినది. అతని వక్షస్థలమున శ్రీవత్స చిహ్నమున్నది. అతడు ధరించినది పీతాంబరము. అతడు దాల్చిన ఉత్తరీయము వనువు వచ్చనిది. సుందరమైన ముఖపద్మమున చిరునవ్వు చిందులాడినది. ముంగురులు ముఖముపై ముసురుచున్నవి. నేత్రములు పద్మములవలె ఉన్నవి. చెవులకు మకర కుండలములు తళతళ మెరయుచున్నవి. కటిసూత్రము, యజ్ఞోపవీతము, కిరీటము, కంకణములు, హారములు, నూపురములు, ఉంగరములు, కౌస్తుభము ప్రకాశించుచున్నవి. వనమాల గళసీమలో వ్రేలాడుచున్నది. శంఖ, చక్ర, గదాది ఆయుధములు రూపొంది అతనిని సేవించు చున్నవి.

అతడు నేలపై పవ్వళించి కుడి మోకాలుమీద ఎడమ పాదము ఉంచుకొన్నాడు.

ఇంతలో జరుడను కిరాతకుడు వేటకై అడవిలో తిరుగుచు శ్రీకృష్ణుని ఎర్రని ఎడమ పాదము చూచినాడు. ఆ పాదము అచ్చము లేడి నోటివలె కనిపించుట చేత అదిలేడి అని భ్రమించినాడు. ఇదవరకు సముద్రమునుండి వచ్చిన చేపకడుపులో రోకటి ఇనుపముక్క దొరికినది ఈ కిరాతునకే. ఆ ఇనుపముక్క ముక్కుగా తగిలించిన బాణము సంధించి గురిచూచి శ్రీకృష్ణుని పాదమునకు కొట్టినాడు.

బాణము వేసి బాణము వెంట పరుగెత్తి, చతుర్భుజుడైన శ్రీకృష్ణుని చూచి, నిర్విణ్ణుడై తాను చేసిన పొరపాటు తెలిసికొని, ఆపాదమస్తకము గడగడలాడి శ్రీకృష్ణుని పాదములపై తల వాల్చి పడినాడు.

"కృష్ణా! పరమాత్మా! ప్రభూ! నేను పాపాత్ముడను. తెలియక అపరాధము చేసినాను. నా అపరాధమును క్షమించుము ప్రభూ! నీ నామస్మరణ మాత్రమున పాపములు పటాపంచలగును. అజ్ఞానాంధకారము అంతమగును. అట్టి నిన్ను బాణముతో కొట్టి మహాపరాధము చేసినాను.

నీవు వైకుంఠ నాథుడవు. నేను అమాయకములైన మృగములను చంపు పాపాత్ముడను. ప్రభూ! నన్ను వధించుము. నన్ను చంపుము. నన్ను చీరుము" అని విలపించినాడు.

శ్రీకృష్ణుడు ఆ కిరాతుని ఆవేదన చూచి మెల్లగా అన్నాడు.

"మాభైః జర ఉత్తిష్ఠ కామఏవ కృతోహిమే
యాహి త్వం మదనుజ్ఞాతస్స్వర్గం సుకృతినాం పదమ్."

"కిరాతకా! భయపడకుము లెమ్ము. నేను కోరుకున్న పనినే నీవు చేసినావు. సుకృతము చేసినవారు నివసించు స్వర్గముననే నీవు నివసించుము ఇది నా ఆజ్ఞ."

శ్రీకృష్ణుడు అట్లు అనుటతోడనే కిరాతకుడు శ్రీకృష్ణునకు మూడుసార్లు ప్రదక్షిణముచేసి సాగిలపడి మ్రొక్కినాడు. అతని కొరకు స్వర్గమునుండి విమానము వచ్చినది. అది ఎక్కి వెళ్ళిపోయినాడు.

ఇంతలో కృష్ణుని వెదకుచు రథసారథియైన దారుకుడు అచటికి వచ్చినాడు. శ్రీకృష్ణుని చూడగానే అతనిగుండె పగిలి పోయినది. దుఃఖము పొంగి పొరలినది. పెద్దగా ఏడ్చుచు రథము మీదినుంచి దూకి శ్రీకృష్ణుని పాదములపై వ్రాలి వలవల ఏడ్చినాడు.

"ప్రభూ! నీవు కనిపించక పోయినందున నేను అంధుడను అయిపోయినాను. రాత్రివేళ చంద్రుడు కనిపించని బాటసారుల అవస్థవలె ఉన్నది నా అవస్థ. దిక్కులేని వాడనైనాను. నా హృదయమున రవంతయు శాంతిలేదు." అనియు మరేమేమో అనియు విలపించినాడు దారుకుడు.

దారుకుడు అట్లు విలపించుచుండగనే గరుడధ్వజము, గుర్రములుగల శ్రీకృష్ణుని రథము ఆకసమునకు ఎగిరిపోయినది. రథము వెనుక శ్రీకృష్ణుని దివ్యాయుధములు ఎగిరిపోయినవి.

దారుకుడు నివ్వెరపోయి చూచినాడు.

"దారుకా!" అని పిలిచి శ్రీకృష్ణుడు చెప్పినాడు. "నీవు ద్వారకకు వెళ్ళుము. యాదవుల నాశము, బలరాముని త్యాగము, నా అవసానము తెలియ పరచుము. నా అవసానము తరువాత ద్వారక సముద్రములో మునిగిపోవును. నా తలిదండ్రులు పరివారములతో ఇంద్రప్రస్థము చేరి అర్జునుని ప్రాపున ఉండవలెను. నీవు భాగవత ధర్మమును అవలంబించుము. ఏ వాంఛయు మనసులోన ఉంచుకొనకుము. సర్వము నా మాయ అని గ్రహించుము."

అది శ్రీకృష్ణ భగవానుని చివరి ఆజ్ఞ. దారుకుడు ఆ యాజ్ఞను శిరసావహించినాడు. ప్రదక్షిణ పూర్వకముగా పదేపదే నమస్కరించి భగవంతుని విడువలేక విడచి ద్వారకకు పయనమైనాడు.

దారుకుడు వెళ్ళిపోయినాడు. శ్రీకృష్ణ నిర్యాణమును తిలకించుటకుగాను బ్రహ్మరుద్రాదులైన దేవతలు, మునులు, పితరులు, ప్రజాపతులు, సిద్ధులు,

గంధర్వులు, విద్యాధరులు, నాగులు, చారణులు, యక్షులు, రాక్షసులు, కిన్నరులు, అప్సరసలు, గరుడులు వచ్చినారు. వారి విమానములతో ఆకాశము నిండిపోయినది.

వారు కృష్ణ కథలు గానము చేసి శ్రీకృష్ణునిపై పుష్పవృష్టి కురిపించినారు.

శ్రీకృష్ణుడు బ్రహ్మాదుల వందరను చూచి పద్మ పత్రములవంటి నేత్రములు మూసుకున్నాడు. తన దివ్యమంగళ విగ్రహమును ఆగ్నేయ యోగధారణచే దహించక స్వదేహముతోడనే స్వధామమును చేరుకొనెను.

దివిదుందుభయో నేదుః పేతుస్సుమనసశ్చఖాత్
సత్యం ధర్మోధృతిర్భూమేః కీర్తిశ్రీశ్చాపితం యయుః ॥

ఆకాశమున దేవదుందుభులు మ్రోగినవి. దివినుండి పూలవాన కురిసినది. సత్యము, ధర్మము, ధృతి, కీర్తి శ్రీ భూమినివీడి శ్రీకృష్ణుని వెంట వైకుంఠమునకు వెళ్ళినవి.

మేఘములమధ్యనుండి గమనించు మెరుపువలె శ్రీకృష్ణుని వైకుంఠ గమనము తమకు అగోచరముకాగా బ్రహ్మాదులు తమతమ స్థావరములకు వెళ్ళిపోయినారు.

నటుడు అనేక వేషములు వేయును. ఆ యా వేషములకు తగినట్లు నటించును. అట్లే శ్రీహరి యాదవ కులమున శ్రీకృష్ణుడై జన్మించి అనేక లీలలు చేసినాడు. అవన్నియు అతని మాయా విలాసములే.

శ్రీకృష్ణుడు గురువు సాందీపుని పుత్రుని యమలోకమునుండి తెచ్చినాడు. అశ్వత్థామ బ్రహ్మాస్త్రమున దగ్ధమైన పరీక్షిత్తును కడుపులో ప్రవేశించి బ్రతికించినాడు. శివుని యుద్ధమున ఓడించినాడు. తన పాదమునకు బాణము కొట్టిన మహాపాపిని శరీరముతో స్వర్గమునకు పంపినాడు. అంతటి పరమేశ్వరుడు తన శరీరము శాశ్వతముగా ఉంచుకొనవలె ననుకున్న ఉంచుకొనలేక పోయినాడా ?

సృష్టిస్థితి లయములకు పరమ కారణము శ్రీకృష్ణ పరమాత్ముడయినను, తన శరీరమును శాశ్వతముగా ఉంచుకొన దలచలేదు. మానవ దేహముతో అతనికి ఏమి ప్రయోజనము ? ఆత్మ నిష్ఠుడైనవాడు ఎవడును తనశరీరమును శాశ్వత పరచుకొనుటకు ప్రయత్నించ రాదను ఆదర్శమును చూపిపోయినాడు శ్రీకృష్ణుడు.

వేకువనే లేచి భక్తిశ్రద్ధలతోను ఏకాగ్ర చిత్తమునను శ్రీకృష్ణ నిర్యాణ కథను కీర్తించిన వారికి పరమ పదము ప్రాప్తించును.

శోక ద్వా ర క.

దారుకుడు ద్వారకకు చేరి వసుదేవుని పాదములమీదను ఉగ్రసేనుని పాదముల మీదను వాలి గోడుగోడున ఏడ్చుచు యాదవకుల నాశనమును గురించి వారికి వినిపించినాడు. ఈ వార్త అగ్నివలె క్షణములో పట్టణమంతయు వ్యాపించినది. ఏడ్చుచు, మొత్తుకొనుచు యావజ్జనులు యాదవుల మృతశరీరములు పడియున్న చోటునకు పరుగెత్తినారు.

రోహిణి, దేవకి, వసుదేవులు శ్రీకృష్ణబలరాముల మరణ వార్తవిని మొదలునర కిన చెట్లవలెకూలి దుఃఖము భరించలేక ప్రాణములు విడిచినారు.

ఎంతో మంది స్త్రీలు తమతమ భర్తల కళేబరముల పోల్చుకొని చితులుపేర్చి భర్తల మృత కళేబరములతో సహగమనను చేసినారు. శ్రీకృష్ణుని భార్యలు, వసుదేవుని భార్యలుకూడ సహగమనము చేసినారు.

భగవద్గీత ఉపదేశమును తలచుకొని అర్జునుడు తన దుఃఖమును భరించినాడు. మర ణించిన బంధుకోటికి ఉత్తరక్రియలు చేయించినాడు. ఉత్తరక్రియలు ముగిసిన తదుపరి హతశేషులైన వృద్ధులను, బాలురను, స్త్రీలను హస్తినాపురమునకు చేర్చినాడు.

శ్రీకృష్ణుడు విడిచివెళ్ళిన ద్వారకను సముద్రుడు ముంచినాడు. శ్రీకృష్ణుడు నివసించిన ప్రదేశము మాత్రము సముద్రమున మునుగలేదు. ఆ స్థానమును తలుచుకున్నచో సర్వపాపములు నశించును. సర్వమంగళములు కలుగును.

గు రు వు లు.

యదుమహారాజు ఒకసారి ఒక బ్రాహ్మణుని చూచినాడు. అతడు యువకుడు, పండితుడు, నిర్భయముగా తిరుగుచున్నాడు. అతనిని చూచి యదుమహారాజు ఇట్లు అడిగినాడు :—

బ్రాహ్మణోత్తమా! నీవు విద్వాంసుడవు. అయినను బాలునివలె ప్రవర్తిల్లు చున్నావు. మానవులు సహజముగా ధర్మార్థకామములు కోరి ఆత్మవిచారమున ప్రవర్తింతురు. నీవు సమర్థుడవు· పండితుడవు. దక్షుడవు. రూపవంతుడవు. అమృత

ఖామణుడవు. అయినను జడునివలెను, ఉన్మత్తునివలెను, పిశాచము వలెను తిరుగు చున్నావు. కోర్కెలేదు. కామ లోభములు అను దావాగ్నిలో దహించుకొని పోవుచున్న లోకమునుండి దూరముగా ఉన్నావు. గంగాజలమున ఉన్న ఏనుగువలె ఈ అగ్నివేడి సోకక జీవించుచున్నావు. విషయ భోగములులేక, ఆలు బిడ్డలులేక ఆత్మానందము అనుభవించు చున్నావు. కర్మచేయకుండ ఉండు ఈ కుశల బుద్ధి నీకు ఎట్లు పట్టువడినది ? దీనికి కారణమేమి ? దయచేసి చెప్పుము.

అందుకు ఆ అవధూత ఇట్లు చెప్పినాడు :—

“రాజా ! నాబుద్ధితో నేను ఎంతోమంది గురువులను స్వీకరించినాను. వారి వలన ముక్తి సంపాదించి, ముక్తుడనై తిరుగు చున్నాను. ఆ గురువులను గురించి నీకు చెప్పెదను, వారు ఇరువది నలుగురు.

1. భూమి :— సర్వభూతములు తనను ఆక్రమించినను భూమి చలించదు. దాని వలన క్షమ నేర్చుకొన్నాను. భూమిపైనుండు చెట్లు పర్వతములు స్వార్థములేక పరోపకారము చేయును. వానివలన పరోపకార బుద్ధి అలవరచు కున్నాను.

2. వాయువు :— వాయువు రెండు విధములు. వానిలో ఒకటి ప్రాణ వాయువు. అది ఆహారాదులందు ప్రవర్తించును. కాని ఇంద్రియ విషయముల నపేక్షించదు. దానినుండి జ్ఞానియైనవాడు మనోవైకల్యములేని దేహయాత్ర గడుపుచు జ్ఞానమును ఆర్జించవలెనని నేర్చుకున్నాను.

బాహ్యవాయువు శీతము, ఉష్ణము మున్నగు ధర్మములతో కూడియు వాటి సాంగత్యము పొందదు. దానివలన నిస్సంగత్వము నేర్చుకొన్నాను. వాయువు నకు గంధాది ధర్మములు పొందినట్లు తోచును. వాస్తవమున అవి వాయువును అంటవు. అట్లే ఆత్మజ్ఞాని పార్థివ దేహమున ఉన్నను నిర్లిప్తుడుగా ఉండవలెను.

3. ఆకాశము :— ఆకాశము సర్వత్ర వ్యాపించి ఉండును. అయినను ఘటాదులతో సంయోగ పరిచ్ఛేదములు పొందదు. అట్లే ఆత్మ దేహాదులందు అంతర్హితుడై ఉండును. అయినను చరాచర జీవసంబంధ పూర్వకమైన వ్యాప్తితో బ్రహ్మస్వరూప భావముతో అనసక్తుడు పరిచ్ఛిన్నుడు కాడు. వాయువు మేఘములను ప్రేరేపించును. కాని ఆకాశము వానిని అంటదు. అట్లే కాలము సృష్టించిన గుణకార్య రూపమైన పాంచ భౌతిక దేహ, ఇంద్రియాదులను జీవుడు అంటడు.

4. జలము :— నీటికి స్వచ్ఛత్వము, స్నిగ్ధత్వము, మధురత్వము, తీర్థభూతత్వము, గుణములు. మునియైనవాడు దర్శనము వలనను, స్పర్శనము వలనను, కీర్తివలనను పవిత్రుడు కావలెను.

5. అగ్ని :— అగ్ని ఒక దగ్గర గుప్తముగా ఉండును. ఒకచోట వ్యక్తమగును. మరొకచోట శ్రేయస్కాములకు ఉపాస్యుడగును. వేరొకచోట పాపములు దగ్ధము చేయును. కాని అది సర్వత్ర భోజనముచేయును. అట్లే మునియైనవాడు తేజస్సుగలిగియు, తపోదీప్తుడుగను, పరిగ్రహ రహితుడుగను, సర్వభక్షకుడుగను, ఉండవలెను. అగ్ని చిన్న పుడుకను అంటుకున్నప్పుడు చిన్నగను, పెద్ద కట్టెను అంటుకున్నపుడు పెద్దగను కనిపించును. అట్లే ఆత్మ ఈ శరీరము అందు చిన్నగను పెద్దగను కనిపించును.

6. చంద్రుడు :— చంద్రుని కళలు మాత్రము పెరుగుట, తరుగుట జరుగుచున్నది. కాని చంద్రునకు వికారము లేదు. అట్లే కాలము వలన కలుగు వికారము దేహమునకుగాని ఆత్మకు చెందదు.

7. సూర్యుడు :— సూర్యుడు తన కిరణములతో నీటిని పీల్చుకొనును. తిరిగి అవసరము పడినప్పుడు వర్షించును. అట్లే యోగి శబ్దాది విషయములను గ్రహించును. కాని ఆ విషయములందు ఆసక్తుడుకాడు. యథా కాలమున వాటిని తిరిగి ఇచ్చును. సూర్యుడు ఒక్కడే కాని నీరు మున్నగు వానిలో అనేకముగా కనిపించును. ఒకే ఆత్మ అనేక దేహములందు ప్రతిబింబించుచున్నంత మాత్రమున ఆత్మలు అనేకములు అనుకొనుట అజ్ఞానము.

8. పావురము :— ఒక పావురముల జంట ఉండెడిది. అది హాయిగా సంసార సుఖములు అనుభవించుచుండెను. లేక లేక వాటికిసంతానము కలిగినది. బిడ్డలపిన వాటికి ఎంతో అనురాగము, ఎంతో ప్రేమ, ఎంతో వాత్సల్యము ఉండెడిది.

ఒకనాడు పావురములు రెండు తమ పిల్లలకు ఆహారము తెచ్చుటకు గాను, అడవిలోనికి పోయినవి. ఎంతో సేపటివరకు ఆహారమునకై అడవిలో తిరిగినవి. అవి అడవిలో ఉండగా, ఆ పావురముల గూటివద్దకు ఒక బోయవాడు వచ్చి, పావురముల పిల్లలను చూచి, వలపన్ని వాటిని తీసుకొని పోయెను.

ఆ పావురములు తిరిగి తిరిగి మేత సంపాదించి, గూటి దగ్గరకు వచ్చినవి. పిల్లలు కిరాతకుని వలలోపడి ఉండుటను చూచి, వాటి కడుపు తరుగుకొని పోయినది.

తల్లి పావురము బాధ భరించలేక, తనంతటతాను వలలోపడిపోయినది. తన భార్య, పిల్లలు వలలో తగులుకొనుట చూచి భరించలేక, మొగపావురము తాను సహితము వలలో పడిపోయినది.

బోయవాడు మూడింటిని మూటకట్టుకొని ఇంటికి పోయినాడు.

అశాంతాత్ముడు, ద్వంద్వములతో రమించువాడు, కృపణుడు కుటుంబీకుడై, పరివారమును పోషించుచు జీవించును. తుదకు తన ఆలుబిడ్డలతో నశించును. మానవ శరీరము ముక్తికి ద్వారము వంటిది. మానవ శరీరము పొందియు సంసారమందు ఆసక్తి గలవాడు ముక్తిమార్గమునుండి పతితుడగును.

9. అజగరము :— అజగరము కదలక పడి ఉండును. అయినను దానికి సుఖదుఃఖములు కలుగును. దేహులు కోరకున్నను సుఖదుఃఖములు కలుగును. స్వర్గ నరకములందును సుఖదుఃఖములు విడువవు. కాన పండితుడైనవాడు ఇంద్రియ సుఖములు అభిలషించరాదు. అప్రయత్నముగా దొరికిన ఆహారము, రుచికరమైనదైనను, కాకపోయినను, సరిపోయినను సరిపోక పోయినను తిని తృప్తి చెందవలెను. ఒకవేళ ఆహారము లభించకున్న భగవానుడే ఇచ్చునని ఎంత కాలము వరకైనను ఉపవసించవలెను. కాని ఆహారమునకై ప్రయత్నించ రాదు. ఇంద్రియ శక్తి, మనోబలము, శారీరక సామర్థ్యము ఉండినను కర్మలు చేయక, శరీరము ధరించి, నిద్రలేక పడుకొని, దర్శనాది వ్యాపారములు మానుకొని ఈశ్వరచింత చేయవలెను.

10. సముద్రము :— సముద్రము అపారమైనది. అగాధమైనది. అయినను క్షోభలేక ఉండును. ప్రసన్న గంభీరముగా ఉండును. మునియైనవాడు సముద్రము వలె ప్రసన్నముగను, గంభీరముగను, దుర్విగ్రాహ్యముగను, అనుల్లంఘనీయముగను, అపారముగను, క్షోభలేకుండను ఉండవలెను. సముద్రమున ఎన్ని నదులు కలిసినను హెచ్చుతగ్గులుండవు. యోగియైనవాడు తన కోరిక సిద్ధించినను, సిద్ధించక పోయినను సంతోషముగాని, దుఃఖముగాని పొందరాదు.

11. శలభము :— శలభము అగ్నిలోపడి నశించును. అజితేంద్రియుడైన పురుషుడు స్త్రీ మోహమున పడి నరకము ననుభవించును.

12. తుమ్మెద :— తుమ్మెద పూవులకు ఏ మాత్రము కష్టము కలుగనీయక తేనె గ్రహించును. మునియైనవాడు గృహస్థులకు కష్టము కలుగ నీయక

శరీర పోషణకు తగినంత ఆహారము మాత్రము తీసుకొనవలెను. మధుపము చిన్న పూవు నుండియు, పెద్ద పూవు నుండియు మధువును గ్రహించును. బుద్ధిమంతుడైనవాడు చిన్న, పెద్ద అన్ని శాస్త్రముల నుండియు సారము గ్రహించవలెను. తేనెటీగలు తేనె దాచుకొనును. అందువలన అవి నాశనమగును. భిక్షుకుడు తాను సంపాదించిన ఆహారమును, "ఇది సాయంకాలమునకు, ఇది రేపటికి అని దాచుకొనరాదు." అట్లు దాచినచో తేనెటీగవలె అతడు నశించును. కాన భిక్షుకుని చేతులే పాత్రలు, కడుపే అన్నపాత్రకావలెను.

13. ఏనుగు :— ఆడు ఏనుగుకొరకు పోయి మొగ ఏనుగు గోతిలోపడి నశించును. మునియైనవాడు ఆడబొమ్మనైనను కాలితో సహితము తాకరాదు.

14. మధుహారి :— తేనెటీగలు కూడబెట్టిన తేనెను మధుహారి అనగా తేనె సంగ్రహించువాడు అనుభవించును. అట్లే దుఃఖపడి, కూడబెట్టి, దానము చేయక, తాను అనుభవించక దాచిన ధనము ఇతరులు అనుభవింతురు. గృహస్థులు దుఃఖపడి ఆర్జించిన ధనమును వారికంటె ముందు యతి అనుభవించును.

15. లేడి :— కిరాతుని పాటకు మోహించి, లేడి వలలో చిక్కుకొనును. అడవిలో తిరుగు యతి ఏనాడును జానపద గీతములు వినరాదు. జానపద నాట్యములు చూడరాదు. అవి విని చూచి ఋశ్యశృంగుడు స్త్రీల చేతి కీలుబొమ్మ అయినాడు.

16. చేప :— చేప ఎఱ్ఱలను ఆశించి నశించును. యతి జిహ్వకు లొంగి రసములకు వశుడై నశించును. నిరాహారులైన మునులు సర్వేంద్రియములను గెలువగలరు. కాని నాలుకను జయించలేరు. నిరాహారునకు జిహ్వాచాపల్యము మెండు. ఇతర ఇంద్రియములను గెలిచినను, రసనేంద్రియమును గెలుచునంతవరకు జితేంద్రియుడు కాడు.

17. పింగళ వేశ్య :— పూర్వము విదేహ నగరమున ఒక వేశ్య ఉండెను. ఆమె పేరు పింగళ. ఆమె ఒకనాడు అలంకరించుకొని కాముకులను ఆకర్షించుటకు గాను ద్వారమున కూర్చున్నది. ఆ దారినపోవు ప్రతివాడు వెలనిచ్చి రతి సుఖము అనుభవించునని భావించినది. అట్లామె అర్ధరాత్రి వరకు కూర్చున్నను ఆమె వద్దకు ఎవరును రాలేదు. ఆమె నిరాశ చెందినది. దీనహృదయమునను,

విచారమునను, ఆమె ముఖము అర్చుకొని పోయినది. అప్పుడు ఆమెకు పరమ వైరాగ్యము కలిగినది.

రాజా! వైరాగ్యము కత్తి వంటిది. ఆశాపాశములను ఖండించును. జ్ఞానము లేనివాడు మమత విడువలేడు. వైరాగ్యము లేనివాడు దేహబంధములు విడువలేడు. వైరాగ్యభావము పొంది పింగళ నాటి గీతము గానము చేసినది.

అహో మే మోహవితతిం పశ్యతాఽజితాత్మనః
యా కాంతా దసతః కామం కామయే యేనబాలిశా.

అయ్యో! నా మోహమును చూడుడు, నా మనస్సును అదుపులో ఉంచుకొనలేక పోయినాను. అజ్ఞానము వలన మూర్ఖురాలనైనాను, రసికుల తుచ్ఛమైన కామమును కోరుచున్నాను.

సంతం సమీపే రమణం రతిప్రదం
విత్తప్రదం నిత్యమిమం విహాయ
అకామదం దుఃఖభయాది శోక
మోహప్రదం తుచ్ఛమహం భజేఽజ్ఞా

అజ్ఞురాలను నేను. హృదయమున ఉన్నట్టి సుఖప్రదుని, విత్తప్రదుని నిత్యుని, రమణుని వదులుకొని కోరికలు తీర్చలేని అరసికుని, దుఃఖము, భయము, కష్టము, శోకము, మోహము కలిగించు తుచ్ఛుని భజించుచున్నాను.

అహో మయా ఆత్మపరితాపితో వృథా
సాంకేత్యవృత్త్యాఽతివిగర్హ్యవార్తయా
స్త్రైణాన్నరాద్యాఽర్థతృషోఽనుశోచ్యాత్
క్రీతేన విత్తం రతిమాత్మనేచ్ఛతీ.

అయ్యో! వ్యభిచారులు, ధనతృష్ణాపరులు. రోగాదులతో బాధపడుచున్నవారు అయిన మనుష్యులతో సుఖించుటకు శరీరమును అమ్ముకొన దలచినాను. పురుషుల రతితో జీవించు నేను అతినీచమైన జీవితము గడుపుచున్నాను. నా మనస్సును వృథా పరితాప పరచుచున్నాను.

సుహృత్ప్రేష్ఠతమో నాథ ఆత్మా చాఽయం శరీరిణామ్
తం విక్రీయాఽఽత్మనైవాఽహం రమేఽనేన యథా రమా

శ్రీహరి శరీరధారులకు సుహృదుడు, శ్రేష్ఠతముడు. నాథుడు. ఆత్మీయుడు. అతనికి నా శరీరమును సమర్పింతును. అతనినే వశపరచుకొందును. లక్ష్మీదేవి వలె అతనితో రమింతును.

> ఆత్మైవహ్యాత్మనో గోప్తా నిర్విద్యేత యదాఽఖిలాత్
> అప్రమత్త ఇదం పశ్యేద్గ్రస్తం కాలాహినా జగత్.

అప్రమత్తతతో ఈ జగత్తును కాలసర్పము మ్రింగుట చూచిన అఖిల ప్రపంచముపై విరక్తి కలిగినవాడు తన రక్షకుడు తానే అగును.

పింగళవేశ్య దురాశ మానుకున్నది. శాంతిమార్గ మవలంబించి ప్రక్క మీద వ్రాలినది. ఆమెను చూచి, ఆశయే పరమ దుఃఖమనియు, నిరాశయే పరమ సుఖమనియు గ్రహించినాను.

18. లకుముకి పిట్ట :— మాంసము ముక్క పట్టుకున్న లకుముకి పిట్టను మాంసము దొరకని బలవంతమైన పక్షులు బాధించినవి. అప్పుడు లకుముకి పిట్ట మాంసము ముక్కను పారవేసి సుఖించినది. ప్రియతమమైన వస్తువులు దుఃఖము కలిగించును. పండితుడు వానిని పరిగ్రహించరాదు.

19. బాలుడు :— బాలుని చూచి మానావమానములు లేక ఉండుటయు, ఇంటి మీదను, సంసారము మీదను చింత లేకుండుటయు నేర్చుకున్నాను. జడుడై ఉండిన బాలుడు - పరమ పురుషుని పొందినవాడు - వీరిద్దరే చింతలేక పరమానందమున మునిగి ముగ్ధులై ఉందురు.

20. కన్య :— ఒక దేశమున ఒక కన్య ఉండెను. ఆమె తలిదండ్రులు ఎచటికో వెళ్ళినప్పుడు, పెండ్లి చూపుల కొరకు బంధువులు వచ్చినారు. బంధువులను ఆ కన్యయే స్వయముగా సత్కరించినది. భోజనము సిద్ధము చేయుటకు గాను ఆమె రహస్యముగా వడ్లు దంచసాగినది. అప్పుడు ఆమె చేతి గాజులు గల్లు గల్లుమను శబ్దము చేసినవి. ఆ కన్య చాలా తెలివికలది. కాబోవు పెండ్లి కూతురు వడ్లు దంచు చున్నదని బంధువులకు తెలియగాదను కొని, ఒక్కొక్క గాజు తీసివేసి రెండు చేతులకు రెండేసి గాజులు మాత్రము ఉంచుకున్నది. అయినను చప్పుడైనది. అప్పుడామె ఆ చేతి గాజు ఒకటి, ఈ చేతి గాజు ఒకటి తీసివేసినది. రెండు చేతులకు ఒక్కొక్క గాజు మాత్రమే మిగిలినది. లోక తత్త్వము తెలుసుకొనుటకు సంచారము చేయుచున్న నేను ఆ కన్యను చూచి

హెచ్చుమంది కలసి ఉన్న కలహములు వచ్చుననియు, ఇద్దరు కలిసి ఉన్నను కలహము వచ్చుననియు, ఒంటరిగనే తిరుగుట మేలనియు నేర్చుకున్నాను.

21. శరకారుడు :— బాణము చేయువాడు బాణములు చేయుచుండగా అతని ముందు ఒక రాజు అడ్డు నిలిచినాడు. శరకారుడు రాజును గమనించక తన పని తాను చేయసాగినాడు. మనస్సును స్థిరపరచుకున్న అది కర్మ వాసనలను విసర్జించును. అందువలన సత్వగుణము అభివృద్ధి చెందును. రజోగుణ, తమోగుణములు అణగిపోవును రాగరహితమైన నిర్వాణ స్థితి లభించును.

22. పాము :— చీమలు పెట్టిన పుట్టలలో పాములు నివసించును. అస్థిరమైన దేహ ధారులకు ఇల్లు కట్టుట వ్యర్థమని మునియైనవాడు ఒంటరిగా తిరుగవలెను. గుహాలలో ఉండవలెను.

23. సాలెపురుగు :— సాలీడు తన కడుపులోని దారమును తన నోటి ద్వారా బయటికి తీసి గుండు వన్ని, అందు క్రీడించి, దానిని తానే నాశనము చేయును. అట్లే పరమేశ్వరుడు తనలో నుండియే ఈ విశ్వమును సృష్టించి, ఇందులో క్రీడించి, దీనిని తానే సంహారించును.

24. కీటకము :— కీటకమును తుమ్మెద తెచ్చును. గోడ కన్నమున బంధించి దానిని తుమ్మెదను చేయును. ప్రాణి నిశ్చయాత్మక బుద్ధితో ఏకాగ్ర చిత్తమున స్నేహముతో గాని, ద్వేషముతో గాని, భయమున గాని ఏ విషయమున నిమగ్నుడైన ఆ రూపము పొందును.

పై ఇరువది నలుగురు గురువులనుండి నేర్చుకున్న దాని వలన కర్మ చేయకుండు ఈ కుశల బుద్ధి అలవడినది.

భగవంతుడు ఆత్మ శక్తితో వివిధ జీవుల శరీరములు సృష్టించినాడు. జల చరములు, భూ చరములు, ఖే చరములు ఈ మూడింటిని సృష్టించినను, అతనికి సంతృప్తి కలుగలేదు. అప్పుడతడు పురుష శరీరము సృష్టించి సంతోషించినాడు.

మానవ జన్మ దుర్లభమైనది. ఎన్నో జన్మములు ఎత్తిన తరువాత లభించునది. ఏ క్షణమునైనను పతనమగును. అయినను అది పురుషార్థములు ప్రసాదించ గలదు. మానవ శరీరము పండి పడిపోవు లోపున మోక్షము కొరకు ప్రయత్నించ వలెను. అట్లు కాక విషయ భోగములకు లోనైన తిరిగి పురుగులు, పశువులు మొదలగు అనేక జన్మములు ఎత్తవలసి ఉండును.

ఇది ఏకాదశ స్కంధము

శ్రీమద్భాగవతము

ద్వాదశ స్కంధము

శ్రీ శుకుడు పరీక్షిత్తునకు మహా పురాణమైన శ్రీ భాగవతము వినిపించి, మరియు ఇట్లన్నాడు.

"మహారాజా! నేను చని పోవుదునని అనుకొనునది పశుబుద్ధి, దానిని విడువుము. ఈ శరీరము ఇంతకు ముందులేదు. మధ్యన పుట్టినది. ఇది నశించును. ముందు ముందు ఉండదు. అట్లే నీవు పూర్వము ఉండ బోలేదు. ఇప్పుడున్నావు. ఇక ముందు కూడా ఉండ బోవు. గింజ నుండి మొక్క పుట్టును. మొక్క నుండి గింజ వచ్చును. అట్లే శరీరము నుండి శరీరము పుట్టును. ఆ శరీరమున మరొక శరీరము పుట్టును. అంతే. నీవు మాత్రము ఎవరికిని పుట్టలేదు. ఇకముందు పుత్రునిగను, పౌత్రునిగను ఎవరికిని పుట్టవు. నిప్పు ఒక పుల్లనుండి మరొక పుల్లకు వ్యాపించినట్లు ఆత్మ ఒక శరీరము నుండి మరొక శరీరము కు వ్యాపించును. నిప్పువేరు. పుల్లవేరు అయినట్లు ఆత్మవేరు, దేహమువేరు. అని గ్రహించుము. ఆత్మకు జనన మరణములు లేవు. అవి శరీరములకు మాత్రమే చెందును. మరణము కలలో తల తెగిపడినట్లు కనిపించుట వంటిది. అట్లనిన ఆత్మ ఈ అసత్యమును చూచుచునే ఉండునని అర్థము. కుండలోని నీటిలో ఆకాశము కనిపించును. కడవ పగిలిపోగా ఆకాశము అదృశ్యమగును, అంత మాత్రమున ఆకాశమునకు వచ్చిన హాని ఏమియులేదు. అది అఖండముగనే ఉండును. అట్లే శరీరము నశించినంత మాత్రమున ఆత్మకు వచ్చిన హాని ఏమియులేదు. అది అఖండముగనే ఉండును. ఆత్మకు జరామృత్యువులు లేవు. ఆత్మకు దేహగుణ కర్మములు మనస్సుల వలన కలుగును. మనస్సులను కల్పించునది మాయ. ఆ మాయ వలననే జీవునకు జనన మరణములు కలుగును. నూనె ఉన్నంతవరకు దివ్వె వెలుగును. అట్లే సత్వరజస్తమో గుణములు మనస్సునకు తగిలి ఉన్నంత వరకు దేహమునకు సంసార భ్రమ ఉండును. ఆ భ్రమ ఆత్మకులేదు. దీపము ఆరిపోయినంత మాత్రమున అగ్ని లేదనుకొనరాదు. అట్లే సంసారము నాశనమైనంత మాత్రమున ఆత్మ నాశనమైనదను కొనరాదు. ఆత్మ స్వయం ప్రకాశమైనది. కార్యకారణములకు అతీతమైనది. వ్యక్తావ్యక్తములకు అందనిది. అది నిర్మలమైనది. నిశ్చలమైనది. అనంతమైనది.

ఆత్మకు సాటియైనది ఆత్మయే.

మనసులో వాసుదేవుని చింతించుము. ఆత్మ సాక్షాత్కారము పొందుము. నీవు మృత్యువునకు మృత్యువు. నీవు ఈశ్వరుడవు. నీవు ఆత్మవు. నిన్ను మృత్యువు తాకలేదు. బ్రాహ్మణ శాపముగాని, తక్షకుడుగాని నిన్ను తాకలేవు. మహా మృత్యువు సహితము నీ దరిదాపులకు చేరలేదు. "అహం బ్రహ్మా పరంధామ బ్రహ్మోహం పరమంపదం" (నేనే పరపర బ్రహ్మమును. పరబ్రహ్మమును నేనే) అనుచు అనుసంధాన పూర్వకముగా మననము చేయుము. అఖండ పరమాత్మ స్వరూపమున ఆత్మను ఐక్యము చేయుము. తక్షకుడు నిన్ను కాటువేసినను నీకు ఇసుమంత బాధయు కలుగదు. ఈ విశ్వమున ఏదియు నీకు వేరుగా కనిపించదు. అంతయు ఆత్మస్వరూపముగనే కనిపించును.

పరీక్షిత్తు నిర్యాణము.

శ్రీశుకుని ఉపన్యాసము విన్నాడు పరీక్షిత్తు. శిరసు వంచి అతని పాదములకు నమస్కరించినాడు. అంజలి ఘటించి, "మునీంద్రా! నీవు కరుణాత్ముడవు. శ్రీహరి కథలు వినిపించినావు. భగవానుని సత్యరూపమును ఉపదేశించినావు. నేను నీవు ఉపదేశించిన ఆ పరబ్రహ్మమున ప్రవిష్టుడ నైనాను. తక్షకుని వంటి పదివేల మృత్యువులు ఒక్కసారి వచ్చి ఆక్రమించినను భయపడను. ఇక నాకు అనుజ్ఞ దయచేయుము. ఇంద్రియములను జయించి వాసనలను విసర్జింతును మౌనము వహించి మనసు నిర్మలము చేసికొందును. శ్రీహరిమీద చిత్తము నిలిపి, ప్రాణములు వదలి నిర్యాణము పొందుదును. నీ ఉపదేశము వలన నా అవివేకము అజ్ఞానము నశించినది. విజ్ఞానము, వివేకము ఉదయించినవి." అని భక్తిపూర్వకముగా శ్రీశుకుని పూజించినాడు. అతని పూజలందుకొని శ్రీశుకుడు తనదారిన వెళ్ళిపోయినాడు.

పరీక్షిత్తు తన ఆత్మను పరమాత్మలో కలిపి ధ్యానమగ్నుడైనాడు. కుశాసనముపై ఉత్తరమువైపు ముఖముచేసి ఉచ్ఛ్వాసలు బంధించి పరమాత్మలో లీనమైనాడు.

శృంగి శాపము వలన పరీక్షిత్తును కాటు వేయుటకు బయలుదేరినాడు తక్షకుడు. అతనికి మార్గమధ్యమున కాశ్యపుడను ఒక బ్రాహ్మణుడు కనిపించినాడు. అతడు పాము కాటుకు విరుగుడు తెలిసిన మహామంత్రవేత్త. అతనికి పుష్కలమైన ధనము లంచముగా ఇచ్చి పంపివేసినాడు తక్షకుడు. తక్షకుడు బ్రాహ్మణ వేషమున పరీక్షిత్తు వద్దకు వెళ్ళినాడు. కాటువేసినాడు.

తక్షకుడు కాటు వేయకముందే బ్రహ్మీభూతుడైనాడు రాజర్షి పరీక్షిత్తు తక్షకుని విషాగ్నికి అతని భౌతిక కాయము కాలి బూడిదయై కూలినది. దశదిశలలో హాహాకారములు చెలరేగినవి.

సర్పయాగము.

పరీక్షిత్తు పుత్రుడు జనమేజయుడు. తన తండ్రి తక్షకుని కాటు వలన మరణించినాడని విని సర్పయాగము ప్రారంభించినాడు. ఋత్విజులు పాములను యజ్ఞకుండమున ఆహుతి చేయసాగినారు. పెద్దపెద్దపాములు యజ్ఞకుండమున పడి భస్మమగు చున్నవి.

తక్షకుడు అదిచూచి భయపడిపోయి ఇంద్రుని శరణు జొచ్చినాడు.

తక్షకుడు ఇంద్రుని శరణు జొచ్చినాడని విని జనమేజయుడు, ఇంద్రునితోసహా తక్షకుని యజ్ఞకుండమునకు ఆహ్వానించ వలసినదన్నాడు.

పరీక్షిత్తు ఆదేశము ప్రకారము ఋత్విజులు "తక్షకాశు పతస్వేహ సహేంద్ర మరుత్వతా" (తక్షకా! మరుద్గణముల సహచరుడైన ఇంద్రునితో కూడ ఈ అగ్నిగుండమున వచ్చి పడుము) అని పిలిచినారు.

మంత్రములు దేవేంద్రుని తక్షకుని కలిపి విమాన సహితముగా అగ్ని గుండము వైపు ఆకర్షించినవి. బృహస్పతి చూచినాడు, క్షణములో తక్షకునితోపాటు ఇంద్రుడు సహితము అగ్ని గుండమున పడునట్లున్నది. వెంటనే జనమేజయుని వద్దకు వెళ్ళినాడు.

"మహారాజా! అమృతము సేవించిన తక్షకుని చంపుట న్యాయము కాదు; ప్రాణులు తమతమ కర్మల ననుసరించి జనన మరణములు పొందుదురు. కష్ట సుఖములు కల్పించునది కర్మమే. లోకమున ఎంతోమంది అగ్నివలనను, పిడుగుల వలనను, ఆకలి దప్పులవలనను, విషజంతువుల వలనను మరణించు చున్నారు. అవన్నియు వారి కర్మవలననే జరుగుచున్నవి. ఏ అపరాధము ఎరుగని పాములను ఎన్నింటినో దగ్ధముచేయుట వలన ప్రాణహింస తప్ప మరేమి ఒరిగినది? ఇంతటితో దీనిని ఆపుము. ప్రాణ హింసమానుము" అన్నాడు బృహస్పతి.

బృహస్పతి ఆదేశము ననుసరించి జనమేజయుడు సర్పయాగము నాపినాడు. బృహస్పతిని యథావిధిగ పూజించినాడు.

మార్కండేయ చరిత్రము.

మార్కండేయుడు మృకండముని పుత్రుడు. కుమారునకు యథా సమయమున సంస్కారము జరిపించినాడు తండ్రి. మార్కండేయుడు వేదాధ్యయనముచేసి తపస్స్వాధ్యాయ పరుడైనాడు. అజన్మ బ్రహ్మచర్యవ్రతము అవలంబించినాడు కోటానుకోట్ల సంవత్సరములు భగవంతుని ఆరాధించి మృత్యువును జయించినాడు. అదిచూచి బ్రహ్మాది దేవతలు సహితము ఆశ్చర్యము పొందినారు.

ఏడవ మన్వంతరమున మార్కండేయముని తపస్సుచూచి భయపడి పోయినాడు ఇంద్రుడు. అతని తపస్సును భంగము చేయుటకుగాను మన్మథుడు, వసంతుడు, అప్సరసలు మున్నగు అతని పరివారమును పంపినాడు.

హిమాలయమునకు ఉత్తరమున పుష్పభద్రా నదీతీరమున ఉన్న మార్కండేయాశ్రమమున ఇంద్రుని అనుచర వర్గము ప్రవేశించినది.

అది సాయంకాలము తూర్పున చందమామ తొంగిచూచి ఆశ్రమముపై వెన్నెల వెదజల్లినాడు. సమయముచూచి వసంతుడు విస్తరించినాడు. ఆశ్రమము అందముల ప్రోవైనది.

మార్కండేయుడు అగ్నిహోత్ర మందిరమున ఉండి, నిశ్చలుడై, ధ్యానమగ్నుడై ఉండి, అపర అగ్నిహోత్రునివలె ప్రకాశించుచున్నాడు. ఇంద్ర కింకరులు అతనిని చూచినారు. ఇతనిని జయించుట అసాధ్యము అనుకున్నారు.

అయినను తమ ప్రయత్నమును మానలేదు. గంధర్వులు వీణలు, మృదంగములు మున్నగు వాద్యములు వాయించి, మధురముగా గానము చేసినారు. అప్సరసలు నాట్యముచేయసాగినారు.

దేవవేశ్య పుంజికస్థలి మునిఎదుట బంతులాడినది. పాలిండ్లబరువునకు ఆమె నడుము కదలాడసాగినది. సిగపూలు జారిపడినవి. వాడివాడి ఓర చూపులతో చూచినది. ఎగురుటలో ఆమె మొలనూలు తెగిపోయినది. గాలివీచి ఆమె శరీరముపై ఉన్న సన్నని చీరను ఎగురగొట్టినది. దిసమొలతో మునిఎదుట నిలచినది పుంజికస్థలి. అదను చూచినాడు మన్మథుడు. పూల బాణములతో మునిని కొట్టినాడు.

మార్కండేయుడు నిశ్చలమైన దీపశిఖవలె ఉన్నాడు. అనేకమంది మహర్షుల మహాతపస్సులను నాశనముచేసిన పూల విలుకాని విల్లు నిష్ఫలమైనది. అతని తేజస్సు ఎదుట నిలువలేక పోయినారు ఇంద్రుని కింకరులు. పారిపోయినారు.

మార్కండేయుని తపస్సునకు మెచ్చి నరనారాయణులు ప్రత్యక్షమైనారు. నీలమేఘశ్యాములైన వారిని మార్కండేయుడు చూచినాడు. సాగిలపడి వారికి పాదాభివందనము చేసి ఆనంద బాష్పములు ప్రవహించగా వారిని చూడలేకపోయి గద్గదస్వరమున "నమోనమః" అని మాత్రము అనగలిగినాడు.

నరనారాయణులు కరుణించి వరము కోరుకొనవలసినదన్నారు.

మార్కండేయుడు చేతులు జోడించి, "పరాత్పరా! అసాధ్యమైన నీ దర్శనమున నన్ను ధన్యుడను చేసినావు. నాకు ఇంకను కావలసినదేమున్నది. అయినను, "వరము కోరవలసినది" అన్నావు కాన అడుగుచున్నాను. ఏ మాయవలన లోకములు, లోకపాలురు, మోహితులు అగుచున్నారో ఆ మాయను చూడగోరుచున్నాను" అన్నాడు.

"తథాస్తు" అని నరనారాయణులు బదరికాశ్రమమునకు వెళ్ళిపోయిరి. మార్కండేయుడు భగవంతుని ధ్యానించుచు కాలము గడుపుచుండెను.

ఒకనాటి సాయంకాలము పుష్పభద్రా నదీతీరమున మార్కండేయుడు ఆశ్రమమున ఉపాసనలో తన్మయుడై ఉన్నాడు. అపుడు అకస్మాత్తుగా ఉప్పెన విరుచుకొని పడినది. భయంకరమైన శబ్దముతో భూతములవంటి మేఘములు ఆకాశమును అల్లకల్లోలములు చేసినవి. పిడుగులు కురిసినవి. మెరుపులు మెరిసినవి. నలువైపులనుండి సముద్రము భూమండలమును ముంచివేసినది. సముద్రము అల్లకల్లోలముగా ఉన్నది. తరంగములు ఆకసము నంటుచున్నవి. సముద్రము భయంకరముగా గర్జించుచున్నది. అంతయు జలమయము. ముల్లోకములు జలమయము లైనవి.

అది జలప్రళయము. మార్కండేయుడు చూచినాడు. సకలప్రపంచము మునిగిపోయినది. ఉద్భిజ్జములు, అండజములు, జరాయుజములు, స్వేదజములు అన్నియు మునిగిపోయినవి.

భయంకరమైన పెనుగాడ్పులతో కుండపోత వర్షము! మార్కండేయునకు వెర్రెత్తినట్లనిపించినది. జడలు విరబోసుకొని అటునుండి ఇటు, ఇటునుండి అటు పరుగెత్తినాడు. ఎటుచూచినను జలము. ఆకలి. ఆశ్రయము కనిపించలేదు. మొసళ్ళు తిమింగలములు, ప్రచండమైనగాలి, అంధకారము కన్ను పొడుచుకున్నను కనుపించుటలేదు. భూమిఏది? ఆకాశమేది? దిక్కులేవి? ప్రాణులేవి? అంతయు

శూన్యము, అంతయు జలము. అతడు సుడిగుండములందు పడిపోయినాడు. తరంగములు అతనిని బాదుచున్నవి. నీటిజంతువులు మ్రింగచూచు చున్నవి.

శోకము, మోహము, దుఃఖము వీనిలో ఏదిది? చావా? కాదు. శోకమా? కాదు. ఏమిటి? ఏమో! అది విష్ణుమాయ. అందు మరిపోయినది మార్కండేయునకు. అట్లు వందలు, వేలు, లక్షలు, కోట్ల సంవత్సరములు గడచినవి.

హఠాత్తుగా కనిపించినది ఇసుమంతనేల. దానిపై ఒక మఱ్ఱిచెట్టున్నది. పచ్చని ఆకులతోను, పగడములవంటి పండ్లతోను కళకళలాడుచున్నది. ఆ మఱ్ఱి ఈశాన్యపు కొమ్మమీది ఆకులో ఒక చిన్నబాలుడు శయనించి ఉన్నాడు. అతడు మరకతమణి ఛాయలో మెరసి పోవుచున్నాడు. చెవులను మకర కుండలములు మెరయుచున్నవి, కంఠము శంఖమువలె ఉన్నది. ముఖము పద్మమువలె కళకళలాడుచున్నది. వక్షస్థలము విశాలముగా ఉన్నది. కనుబొమలు తీర్చి దిద్దినట్లుగా ఉన్నవి. నుదుటిపై ముంగురులు దోబూచు లాడుచున్నవి. పెదవులు పగడమువలె నున్నవి. చిరునవ్వు అమృతము ఒలికించు చున్నది. అతని చూపులు హృదయమును ఆకర్షించు చున్నవి. ఆ బాలుడు తన రెండు చేతులతో తన కాలి బొటనవ్రేలు నోటిలో పెట్టుకొని చప్పరించు చున్నాడు.

ఆ వింత దృశ్యమును చూచినాడు మార్కండేయుడు. ఆ బాలుని దర్శించగానే అతని అలసట మాయమైనది. ఆనందముతో హృదయము వికసించినది. శరీరము పులకరించినది. అనేక సందేహములు ఒకేసారి మనస్సులో తలెత్తినవి

"ఎవ రీ వింత బాలుడు?"

తెలుసుకొనుటకొరకు ముందుకు అడుగు వేసినాడు. ఆ బాలుడు అతని నాకర్షించినాడు. మనిషినోట ప్రవేశించిన దోమవలె మార్కండేయుడు బాలుని నోటినుండి ఉదరమున ప్రవేశించినాడు. ప్రళయమునకు పూర్వమున్న సృష్టి యావత్తు మార్కండేయునకు అచట కనిపించినది. అచట ఆకాశము, అంతరిక్షము, జ్యోతిర్మండలము, పర్వతములు, సముద్రములు, ద్వీపములు, వర్షములు, దిశలు, దేవతలు, దైత్యులు, వనులు, అడవులు, దేశములు, నదులు, నగరములు, పల్లెలు, పాలకులు, గోవులు, గోపాలురు, ఆశ్రమములు ఉన్నవి.

అట్లు సర్వప్రపంచమును చూచినాడు మార్కండేయుడు. ఆ బాలుని నోటినుండి బయటపడి మహర్షి ఆ బాలునిచూచి ఆలింగనము చేసికొన దలచి అడుగు ముందుకు వేసినాడు.

వటపత్రశాయి మాయమైనాడు. మర్రిచెట్టు మాయమైనది. ప్రళయము కనిపించ లేదు.

అది సాయంకాలము పుష్పభద్రా నదీతీరము. మార్కండేయుని ఆశ్రమము. మార్కండేయుడు ఉపాసనలో తన్మయుడై ఉన్నాడు.

నారాయణుని యోగమాయను మార్కండేయుడు అనుభవించెను. ఆ భగవంతునే శరణు వేడగోరి ధ్యానమగ్నుడైనాడు.

ప్రమథగణములతో పార్వతీ పరమేశ్వరులు ఆకాశ విహారము చేయుచు మార్కండేయాశ్రమము వద్దకు వచ్చినారు. పార్వతి ధ్యానమగ్నుడైన మార్కండేయుని చూచినది. ఆమె హృదయము వాత్సల్యముతో నిండినది.

"స్వామీ! ఎంత శాంత గంభీరముగా ఉన్నాడీ బ్రాహ్మణుడు. సర్వసిద్ధి ప్రదాతవైన నీవు ఇతని తపస్సునకు ఫలము అనుగ్రహింపుము" అని ప్రార్థించినది.

"దేవీ! ఇతడు భగవంతుని పాదపద్మములు సాధించినాడు. ఇతనికి మన అవసరము లేదు. అయినను మాటాడుదును. సాధుపురుషుల సమాగమము సర్వుల కర్తవ్యము" అని పార్వతీ సమేతుడై మార్కండేయుని ముందునకు వచ్చినాడు.

మార్కండేయుడు ధ్యానమగ్నుడై ఉన్నాడు. తనముందు పార్వతీ పరమేశ్వరు లున్నది గమనించలేదు. అది గమనించిన శివుడు తన యోగ మాయవలన మార్కండేయుని హృదయమున ప్రవేశించినాడు. ఆ దివ్యరూపమును చూచి ఆశ్చర్యపడినాడు మార్కండేయుడు. కనులు తెరచి చూచినాడు. ఎదుట పార్వతీ, పరమేశ్వరులను, ప్రమథగణములను చూచి జగత్పితరులకు సాష్టాంగవందనము చేసి వారిని అర్చించి పరమేశ్వరుని స్తుతించి నమస్కరించినాడు.

శివుడు సంతోషించి వరము కోరుకొన వలసిన దన్నాడు.

"ప్రభూ! నీ మంగళ దర్శనముకంటె కావలసినదేమి? నీ దర్శనము వలన సకల కోరికలు తీరును. అట్టి నిన్ను ఏమి వరమడుగుదును? అయినను వరమిత్తు నన్నావు కాన అడుగుచున్నాను. నా హృదయము ఎల్లప్పుడు భగవంతుని మీదను భగవద్భక్తుల మీదను చలించకుండ ఉండవలెను. అట్టి వరమును ప్రసాదింపుము" అని మార్కండేయ మహర్షి ప్రార్థించినాడు.

"మహర్షీ! నీ కోర్కె నెరవేరును. భగవంతునిపై నీకు ఎల్లప్పుడును చలించని భక్తి కలుగును. నీకు జరామరణము లుండవు. నీ కీర్తి ఎన్నో కల్పములు లోక

మున విస్తరించును. నీ బ్రహ్మతేజస్సు శాశ్వతముగా ఉండును. నీకు భూత భ
ష్యద్వర్తమానముల జ్ఞానముండును. అని వరమును ప్రసాదించి శివుడు వెళ్
పోయినాడు.

భగవద్భక్తి సిద్ధించుటవలన చిరంజీవి అయిన మార్కండేయుడు ఈనాటికీ
జీవించి ఉన్నాడు.

ఈ పవిత్ర చరిత్ర విన్నను, కీర్తించినను కర్మబంధములనుండి విముక్తి లభించును

కలి.

కలికాలమున దినదినమునకు ధర్మము, సత్యము, శౌచము, క్షమ, దయ, ఆయుష్
స్మృతి లోపించుచుండును. ధనమున్నవాడే కులీనుడు; ఆచారవంతుడు గుణ
వంతుడగును బలవంతుడు, ధర్మపరుడు, న్యాయపరుడు, సర్వనియంత అగును
పెండ్లిళ్ళలో కులము. శీలము, యోగ్యత చూడరు. వరునకు కన్య, కన్
వరుడు నచ్చిన వివాహములగును. నిజాయతి లోపించును. మోసము చేయ
వాడు, అబద్ధము లాడగలవాడు వ్యవహార దక్షుడగును. స్త్రీ విలువ శీలము
కాక ఆమె రతికౌశల్యముపై ఆధారపడి ఉండును. బ్రాహ్మణుని బ్రాహ్మ
త్వము బ్రహ్మజ్ఞానము వలన కాక జందెమువలన వ్యక్తమగును. బ్రహ్మచారు
గాని, సన్న్యాసులుగాని ఆశ్రమ ధర్మములు పాలించరు. వేసిన వేషముతో
తృప్తిచెందరు. వాగినవాడు పండితుడగును అసాధుత్వమే సాధుత్వము, అసౌ
జన్యమే సౌజన్యము, స్వీకారమే వివాహము అగును. దూరముగా ఉన్న బుర
గుంట తీర్థము, వెండ్రుకలు పెంచు లావణ్యము, కడుపు నింపుకొనుటే పు
షార్థము, కుటుంబపోషణే ఘనకార్యము, యశస్సు కోరుటే ధర్మసేవన
అగును.

కలికాలమున ఇట్టి దుష్టజనులే లోకమంతటను నిండి యుందురు.

కలికాలమున కులము ఏదైనను బలము కలవాడే రాజగును. రాజులు, నీచుల
నిర్దయులు, పరమ లుబ్ధులగుదురు. వారి బాధలు భరించలేక ప్రజలు అడవు
పాలగుదురు. ప్రజలు ఆకులము, మాంసము తిని కల్లుత్రాగి పొట్ట నిం
కొందురు. అనావృష్టికి అంత ముండదు పన్నుల భారము అధికమగును. అ
వృష్టి, అనావృష్టి ఎరగలు ఇవి ప్రజలను యమయాతనలు పెట్టును. ప్రజ
నాశనమగుదురు. ఆకలి దప్పులతో అలమటింతురు. రోగములు ఎక్కువ అగున

మనుష్యుల సగటుఆయువు ఇరువది లేక ముప్పది సంవత్సరములై ఉండును. ాణుల శరీరములు రోగముల పుట్టలై క్షీణించిపోవును. వేదమార్గము రూపు ిపి, పాషండ ధర్మము పడగలెత్తును. బ్రాహ్మణులు, క్షత్రియులు, వైశ్యులు ూద్రులగుదురు. ఆవులు మేకలవలె చిన్నవగును. అవి మేకలవలెనే పాలి ును. పైరులు, చెట్లు పొట్టిగా ఉండును. మేఘాడంబరము అధికముగా ండును గాని వర్షము పరిమితముగా ఉండును. అతిథి సత్కారము లోపించును. ధ్వనులు వినిపించవు. ఇండ్లు పాడు కొంపలగును.

ికాలపు చివరన మానవుల స్వభావము గాడుదుల స్వభావముతో సమాన ుగును. గృహస్థులు విషయలాలసులు అగుదురు.

స్థితిలో ధర్మ సంరక్షణకుగాను భగవంతుడు అవతారమెత్తును. అతడు సత్వ ుణమును ఆశ్రయించును.

ంభల గ్రామమున విష్ణుయశుడను బ్రాహ్మణుని యింట శ్రీహరి కల్కి అయి వతరించును. అతడు దేవదత్తమను గుఱ్ఱము నెక్కి ఖడ్గము ధరించి బయలు ును. అతని రోమ కూపములనుండి అద్భుతమైన తేజస్సు వెలువడుచుండగా తడు ప్రపంచమంతటను తిరుగును. దోపిడిగాండ్రైన రాజులను వధించును. రాజులు నాశనమైన తరువాత ప్రజల హృదయములు ప్రసన్నములగును. ని దివ్యమంగళ విగ్రహము దర్శించి ప్రజలు పాపములు పోగొట్టుకొందురు. హరి వారి హృదయములందు నివసించును. తిరిగి ప్రజలు దృఢసంతానము ంగును.

వంతుడు కల్కిఅవతార మెత్తుటతో సత్యయుగము ప్రారంభమై ప్రజలలో త్త్విక గుణము వృద్ధిపొందును.

ంద్రుడు, సూర్యుడు, బృహస్పతి పుష్యమీ నక్షత్రపు ప్రథమ పాదమున ఒకే యమున ప్రవేశించినపుడు సత్యయుగము ప్రారంభమగును.

> నిమ్నగానాం యథాగంగా దేవానా మచ్యుతో యథా
> వైష్ణవానాం యథాశంభుః పురాణానామిదం తథా

లలో గంగవలె, దేవతలలో అచ్యుతునివలె, విష్ణు భక్తులలో శివునివలె పురా ములందు భాగవతము శ్రేష్ఠమైనది.



శ్రీ హరి కల్కి అవతారమెత్తి, దేవదత్తమను నశ్వమునెక్కి ఖడ్గధారియై,
రోమములనుండి దివ్యకాంతులు ప్రసరింప ధర్మసంస్థాపనార్థమై వెడలును.
పుట. 649

శ్రీమద్భాగవతం పురాణమమలం యద్వైష్ణవానాం ప్రియం
యస్మిన్ పారమహంస్య మేతదఖిలం జ్ఞానం పరం గీయతే
యత్రజ్ఞాన విరాగ భక్తిసహితై ర్నైష్కర్మ్య మావిష్కృతం
తచ్ఛృణ్వన్విపఠన్విచారణపరో భక్త్యా విముచ్యేన్నరః

...మద్భాగవత పురాణము నిర్మలమైనది. వైష్ణవులకు ప్రియమైనది. ఇందు ...హంస జ్ఞానము నిండియుండును. అద్వితీయమైన పరమజ్ఞానమును చాటును ...ష్కర్మ్య భక్తి ప్రతిపాదించును. అట్టి భాగవత పురాణమును విన్నను, చదివి..., మననము చేసినను భగవద్భక్తి అలవడును. మోక్షము లభించును.

శ్రీభాగవతము సర్వము సంపూర్ణము.

అందుబాటులో ఉన్న దాశరథి రంగాచార్య రచన

1. శ్రీమదాంధ్ర వచన ఋగ్వేద శాంఖాయన బ్రాహ్మణము
2. శ్రీమదాంధ్ర వచన ఋగ్వేద ఐతరేయ బ్రాహ్మణము
3. శ్రీమదాంధ్ర వచన అమృత ఉపనిషత్తులు
4. సీతా చరితం
5. వేదం – జీవననాదం ప్రవేశిక
6. వేదం – జీవననాదం ఋగ్వేద పరిచయము
7. మానస తిరుప్పావై
8. శ్రీమద్రామాయణము
9. శ్రీమహాభారతము మూడు సంపుటాలు
10. శ్రీమద్భాగవతము

దాశరథి రంగాచార్య రచనలు 13 సంపుటాలు

11. మొదటి సంపుటం – చిల్లర దేవుళ్ళు
12. రెండవ సంపుటం – 1. మోదుగుపూలు, 2. మానవత, 3. శరతల్పం, 4. దేహదాసు ఉత్తరాలు
13. మూడవ సంపుటం – జనపదం
14. నాలుగవ సంపుటం – 1. మాయజలతారు, 2. పావని, 3. రానున్నది ఏదినిజం, 4. నల్లనాగు
15. అయిదవ సంపుటం – జీవనయానం
16. ఆరవ సంపుటం – అనువాద నవలలు :
    1. దేవుని పేరిట (ఇంగ్లీషు నుంచి)
    2. కవయిత్రి కథ (ఉర్దూ నుంచి)
17. ఏడవ సంపుటం – అనువాద కథలు
    – జీలానీబానూ కథలు (ఉర్దూ నుంచి)
18. ఎనిమిదవ సంపుటం – అక్షర మందాకిని
    (వేదం నుంచి వాదం దాకా సాహిత్య సమాలోచనం)
19. తొమ్మిదవ సంపుటం – సమర సాహిత్య సంకలనాలు
    1) రణభేరి 2) రణరంగం
20. పదవ సంపుటం – కవితా కాదంబిని : 1) మానస కవిత
    2) జనరంగం 3) ఉర్దూమదిర
    4) భారత సూక్తము
21. పదకొండవ సంపుటం – శ్వాశ్వాస, వ్యాసాలు – వచనాలు.
22. పన్నెండవ సంపుటం – అమృతం గమయ (నవల)
23. పదమూడవ సంపుటం – యాత్రా జీవనం

24&25. శ్రీమదాంధ్ర వచన ఋగ్వేద సంహిత
26. శ్రీమదాంధ్ర కృష్ణ యజుర్వేద సంహిత
27. శ్రీమదాంధ్ర శుక్ల యజుర్వేద సంహిత
28. శ్రీమదాంధ్ర సామవేద సంహిత
29. శ్రీమదాంధ్ర అథర్వ వేద సంహిత

(24–29) 6 సంపుటాల్లో

ప్రతులకు : విశాలాంధ్ర బుక్ హౌస్‌లు & ప్రముఖ పుస్తక విక్రేతలు